
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్

Like us to follow

@mohanpublications

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథ నిలయం
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం - 533101.



- దేవరాజు సుధీ ప్రణీతం

మహాభారతము

శాంతి పర్వం

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ మహాభారతము

ఆంధ్రవచనము.

శాంతిపర్వము (1-389.)

దేవరాజసుధీప్రణీతము.

మద్రాసు

ఆనందముద్రణాలయమునందు

ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అన్డ్ కంపెనివారిచేఁ బ్రకటితము.

1915.

ALL RIGHTS RESERVED.

విషయసూచిక.

పటములపట్టిక.

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః.

శ్రీ మహాభారతము

శాంతి పర్వము.

శ్రీ వేదవ్యాసాయ నమః.

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

రాజధర్మపర్వము.

గంగాతీరమందు ధర్మరాజుకడకు ఋషులు వచ్చుట. నారదుని ధర్మపుత్రుఁడు కర్ణవృత్తాంతము నడుగుట.

వైశంపాయనుఁడు జనమేజయునితో 'సుహృదుల కందఱకును జలతర్పణములు చేసినపిదప, పాండవులును, విదురుఁడును, ధృతరాష్ట్రుఁడును, భరతవంశపు స్త్రీలందఱును, మహాత్ము లయిన యాతక్కిన కౌరవులును, శౌచము చేసికొనువారై, పట్టణమునకు వెలుపల, నా గంగాతీరమందు నొకమాసము వసించి యుండిరి. అట్లు తర్పణములు తీర్చియున్న ధర్మాత్ముఁ డగుయుధిష్ఠిరునికడకు మహాత్ములును తపస్సిద్ధులును బ్రహ్మర్షిసత్తములు నగు

---

*'యుద్ధముజరిగిన పదునెనిమిది దినములందును ఆయానాఁటి మరణములకు ఆయానాఁడే శుద్ధియగుచున్నది. (మనుస్మృతి. ౫-౭౯ శ్లో) పదునెనిమిదవ

వ్యాసుఁడు నారదుఁడు మహర్షియగు దేవలుఁడు, దేవస్థానుఁడు, కణ్వుఁడు, నుత్తము లయినవారిశిష్యులును వచ్చిరి. మఱియు వేదవిదులును జ్ఞానసంపన్నులును స్నాతకులును గృహస్థులు నయిన బ్రాహ్మణులును గురుసత్తముఁ డగుధర్మరాజును జూచిరి. ఆమహర్షులు మహాత్ముఁ డయినధర్మరాజును జేరి విధ్యుక్తముగఁ బూజితులై మిక్కిలి గొప్పవియగు నాసనములందుఁ గూర్చుండిరి. అంతన ట్లాబ్రాహ్మణులకాలమునకుఁ దగినపూజం గయికొని పవిత్రంబగుగంగాతీరమున శోకవ్యాకులచిత్తుఁ డయియున్న ధర్మరాజు నూఱడించుటకై వేలకొలఁదిని బరివేష్టించి తమతమ యంతరువుల నెఱిఁగొప్పున నలుప్రక్కలఁ గూర్చుండిరి. నారదుఁడు వ్యాసుఁడాదిగాఁగలుగుఋషులతో మాటలాడుచు ధర్మరాజును జూచి తగుసమయమున 'ఓధర్మరాజా! అర్జునుని భుజపరాక్రమముచేతను శ్రీకృష్ణుని యనుగ్రహముచేతను, ధర్మముచేతను, నీ భూమియంతయు జయింపఁబడినది. లోకమునకు భయంకర మయినయీయుద్ధమునుండి భాగ్యవశమున విడివడితివి. పాండవా! క్షత్రధర్మమునం దాసక్తుఁడవై యున్నావని సంతోషించుచున్నావే కద. రాజా! నీవు శత్రువులనెల్లఁ బొరిపుచ్చితివి. మిత్రులను సంతసింపఁ జేయుచున్నావే కదా? ఈసంపదను బొందినపిదప

దినము సౌప్తికపర్వమునందు మృతు లయినవారికొఱకు పండ్రెండుదినములు ఆశౌచము అనుష్ఠింపవలయును. యుద్ధదినములు పదునెనిమిది, ఆశౌచదినములు పండ్రెండు, రెండునుజేరి ముప్పదిదినము లనియొకపక్షముగలదు' అనియు 'కొన్నిసమయములందు కపటయుద్ధాదులు చేయుటవలని దోషము నివర్తించుటకై పుణ్యనదీతీరమందు ఒకమాసము వసించిరే కాని ఆశౌచనివృత్తికిఁ గాదు' అనియు పూర్వవ్యాఖ్య.

నిన్ను శోకము బాధింపదేకదా ? " అని యడిగెను. అందులకు యుధిష్ఠిరుఁడు 'మహాత్మా ! కృష్ణుని బాహుబలము నండఁగొనియు బ్రాహ్మణుల ప్రసాదముచేతను, భీమార్జునుల బలముచేతను నీ భూమియంతయు జయింపఁబడినది. అయినను, నామనసునం దీమహాదుఃఖము నిత్యమును వేఁచుచున్నది. చూచుటకు భయంకరమయిన యీ జ్ఞాతినాశమును మిక్కిలియుఁ జేసియు, గారాబుకొడుకులగు సుభద్రకుమారుని ద్రౌపదిపుత్త్రులను జంపించుకొనియుఁ బడసినయీజయ మపజయముగానే నాకుఁ దోఁచుచున్నది. ద్వారకయందున్న నామఱఁదలు సుభద్ర, కృష్ణు డిక్కడనుండిపోఁగానే యేమిచెప్పునో కదా ! ద్రౌపది యిది తనకన్నకొడుకులందఱును హతులై బంధువులును హతులై వెతలుగుడుచుచుండి యు మరల మాకుఁ బ్రియమును హితమునే జరుపుచుండుట నన్నుఁ బీడించుచున్నట్లే యున్నది. మహాత్మా ! మఱియు మీకు ని దొకటి చెప్పెదను. కుంతి రహస్యమును దాఁచినందున నాకు దుఃఖమును గూర్చినదయ్యె. లోకమునఁ బదివేలయేనుఁగుల బలిమిగలవాఁడై, యుద్ధంబున నెదురులేక, సింహమునంబోలి గరువంపు నడగలిగి, జయశీలుఁడై, వ్రతనియతివప్పక, ధృతరాష్ట్రునిపుత్త్రుల కెల్లఁ బ్రాపయి, మానియు, నుగ్రమయిన పరాక్రమముగలవాఁడునై, పగవారికి సయింపక, యెప్పుడును నురవడించుచు, ఒక్కొక్కయుద్ధమందును మమ్ము నెగఁజిమ్ముచు, నతివేగములయిన యస్త్రములుగలిగి, చిత్రభంగులయుద్ధముసేయుచు, సమర్థుఁడై, యద్భుతపరాక్రముఁడును గుంతికిఁ గూఢముగాఁ బుట్టిన పుత్త్రుఁడు నయినయాకర్ణుఁడు మాకన్నయఁట ! ఆసమయమున, తర్పణమువిడుమనపుడు కుంతి యతనిని సకలగుణసం

పన్నుఁడును తొల్లి జలమునందువిడువంబడినవాఁడు నగు కర్ణుఁడనియుఁ దనకుమారుఁడనియు నాకుఁ జెప్పెను. ఎవనిని మందసయందుంచి గంగాప్రవాహమందు మునుంగఁజేసెనో, ఎవనిని సూతపుత్త్రుఁడనియు రాధకొడుకనియు లోకము తలంచినదో, ఆకర్ణుఁడు కుంతియందు సూర్యునకుఁ బుట్టినవాఁడు; తల్లివంకను బట్టి మా కన్నదమ్ముఁడయినవాఁడు. రాజ్యమునందు పేరాసగలిగి యేమియుఁ దెలియక నే నతనిని యుద్ధమునఁ జంపించితిని. అదియే, అగ్ని దూదిప్రోవునుంబోలె, నామేను నెరియించుచున్నది. అర్జునుఁడును నతని నన్నయని యెఱుఁగఁడయ్యె; నేను నెఱుఁగను. భీముఁడు నెఱుఁగఁడు. నకులసహదేవులు నెఱుఁగరు. అతఁడో మమ్ముమాత్రము గఁరూపున నెఱింగికొనెను. కుంతి మాకు సంధినిగోరి యతనికడకు 'నీవును నాకొడుకవే' యని చెప్పుచుఁ బోయినదని మాకువినికి. పిదప నతఁడు మహాత్ముఁడుగాన కుంతి కోరికను గావింపఁడయ్యె. అతఁడు 'తల్లీ! మిక్కిలి తగనిమాటలు పలికితివి' అనియు 'దుర్యోధనుని యుద్ధసమయమున దిగవిడుచుటకు నేను శక్తుఁడనుగాను. దిగవిడిచితినా, అపూజ్యతయు, క్రూరత్వమును, నెనరులేమియు నాకు సంభవించును. నీమతము చొప్పున ధర్మరాజుతో సంధిగావింతునేని, నన్ను యుద్ధమునం దర్జునునకు వెఱచినాఁడని లోకము తలంచును. అట్లేని, కృష్ణసహితుం డయినయర్జునుని యుద్ధమునజయించినపిదప ధర్మరాజుతోడ కలసికొనెదను' అని చెప్పెను. కుంతి మరల విశాలవక్షుండగునతనితో 'నలువురకు నభయ మిమ్ము. ఇచ్చచొప్పున నర్జుననితోడఁ బోరాడుము' అని చెప్పినదఁట. అతఁడు బుద్ధిమంతుఁడుగాన వడఁకుచున్న తల్లినిజూచి చేయిమోడ్చి 'దేవీ! నీనలువురు

కొడుకులును నాబారినిబడఁగాఁ గ్రోసిపుచ్చక వారిని జంపవలసియుండినను వారినిజంపను. కర్ణుఁడు హతుఁడయ్యెనా యర్జునునిఁ గూడియో, అర్జునుఁడు హతుఁడయ్యెనా కర్ణునిఁగూడియో నీకుఁ బుత్రులేవురే తిరముగానుండఁగలరు" అనెను. అంతఁ దల్లి కొడుకులయందు మిక్కిలి మక్కువగలదిగాన మరల నతనితో 'నీవే తోఁబుట్టువులకు మేలుసేయఁగోరెదవొ వారలకు క్షేమముగా వింపుము' అనెను. ఇట్లు చెప్పి కుంతి యతనిని వీడుకొని యింటికిఁబోయెనఁట. తోడఁబుట్టిన యన్నయగు నావీరుఁడు తమ్ముఁడయినయర్జునునిచే హతుఁడయ్యెను. ఋషీశ్వరా! కుంతిరహస్యము బయలువడదయ్యె. అతనిరహస్యమును బయలుపడదయ్యె. కాఁబట్టి మేటివిలుకాఁ డయినయాశూరుఁ డర్జునునిచే యుద్ధమునఁగూల్పఁబడెను. బ్రాహ్మణోత్తమా! పిదపఁ గుంతి మాటవలనఁ గర్ణునిసహోదరుఁడనియు,ముందుగా బుట్టుటచేనన్నయనియు నేను దెలిసికొంటిని. కాఁబట్టి యన్ననుజంపికొన్న నాకు మనసు పురపురఁబొక్కుచున్నది. కర్ణునిని నర్జునునిఁ దోడుగాఁబడసితినేని, నేనింద్రునిసయితము గెలుతునే! దుష్టబుద్ధులయిన ధృతరాష్ట్రపుత్రులచే సభయందుఁబీడితుండనై సపుడుతోడనే నాకు వెలికురవడించినకోపము కర్ణునిమొగముచూడఁగానే యాఱిపోవును.సభయందు జూదమాడునపుడు కర్ణుఁడు దుర్యోధనుని హితముగోరి తొడంగినపుడే కటువులై మిక్కిలి బిరుసుగాఁ బలుకుమాటలు విన్నప్పుడు నాకుఁ గలిగినకోపము, అతనియడుగులను జూడఁగానే యుడిగిపోవును. కర్ణునిపాదములు కుంతిపాదములకు సాటియైనవని నాతలఁపు. కుంతికిని నతనికిని బోలికయుండుటకుఁ గారణము నెంత వెదకియు, ఎంత యాలోచించియు, ఏవిధమునను నాకుఁ దెలిసినది

కాదు. యుద్ధమునందు భూమి యతని తేరిచక్రమును మ్రింగుట యెట్లు? నాయన్న యేవిధమున శాపమునొందెను? ఇందలి కల రూపును జెప్ప నీవేయర్హుండవు. మహాత్మా! కలిగినది కలిగినట్టుగా నీవలననుండి యంతయును వినఁగోరుచున్నాను. నీవు సకలమును దెలిసిన విద్వాంసుఁడవు. లోకమునఁ జేసినదియుఁ జేయఁబోవునదియు నెఱుఁగుదువు' అనెను. ఇది ప్రథమాధ్యాయము.

రాజధర్మపర్వము.

కర్ణుఁడు బ్రహ్మాస్త్రమిమ్మని ద్రోణుని వేఁడి యతఁడొల్లక పోఁగా పరశురామునికి శిష్యుఁడగుట. కర్ణునికి బ్రాహ్మణ శాపము.

ధర్మరాజిట్లడుగఁగా మాటకారి యగునారదుం డపుడా కర్ణునికి శాపముగలిగిన విషయమంతయుఁ జెప్పఁదొడఁగి 'భారతా! నీవు చెప్పునది సరియే. కర్ణునికి నర్జునునికిని యుద్ధమున జయింపఁదరముగానిది యొకటియుఁ గలుగదు.అయినను రాజా! దేవరహస్యమయిన దీనిని నీకుఁ జెప్పెదను. తొల్లి యిదెట్లు జరిగెనో తెలియుము. క్షత్రియజాతి యాయుధములచేతఁ బరిశుద్ధమై యెట్లు స్వర్గము నొందునని యాలోచించి యందులకై కన్యయగు కుంతియందు వైరాగ్నిని బుట్టించుచునట్టిగర్భమును దేవతలు కలిగించిరి. ఆగర్భమునం గలిగిన బాలుఁడు తేజంబుతోఁ గూడినవాఁడై సూతపుత్త్రుఁడు నయ్యెను; అంగిరసకులులలో మేటియు నీకు గురువు నయిన ద్రోణునివలన ధనుర్వేదము నభ్యసించెను. రాజోత్తమా! వాఁడు భీమసేనుని బలమును, అర్జునుని యస్త్రసామర్థ్యమును, నీదుబుద్ధినిని, అట్లె నకులసహదేవుల

వినయమును, అర్జునునికి నెలప్రాయముననే కృష్ణునితోడఁ గలి
గిన స్నేహమును ప్రజల యనురాగమును, జింతించుచు మిక్కిలి
వెరియుచుండెను. వాఁడు స్వభావమువలనను దేవతలసంకల్ప
మువలనను మీతోడ నెప్పుడు వైరము పూనియున్నదుర్యోధ
నునితోడ బాల్యమందు స్నేహమునొందెను. పిదపఁ గర్ణుఁ డర్జు
నుని ధనుర్వేదమందు విద్యాధికుఁ డనియెఱింగి రహస్యమున
ద్రోణునికడకుఁబోయి యతనితో 'బ్రహ్మాస్త్రమును దాని ప్రయో
గోప సంహారక్రమములతోఁ దెలిసికొనఁ గోరుచున్నాను. యు
ద్ధమునం దర్జునునితోడ సమానుఁడుగా నుండవలయునని నాత
లంపు. మీకుఁ బుత్రులయందును శిష్యులయందును స్నేహము
సమముగానుండుట నిశ్చయము. మీయనుగ్రహమువలన నన్న
స్త్రాభ్యాసము లేనివాఁడని తెలిసినవారు చెప్పకుందురుగాక' య
నెను. అందులకు ద్రోణుఁ డర్జునునియందు మక్కువగలవాఁడు
గావునను గర్ణుని దుష్టబుద్ధి తెలిసియున్నఁడునను వానిని జూచి
'విధ్యుక్తముగా వ్రతముననుసరించిన బ్రాహ్మణుఁడు బ్రహ్మాస్త్ర
మును దెలిసికొనఁదగినవాఁడు. లేక మిక్కిలి తపముగల క్షత్రి
యుఁడును దెలిసికొనఁ దగినవాఁడు. తక్కినవాఁ డేవిధమునను
దెలిసికొన నర్హుఁడుగాఁడు' అనెను. అంతఁ గర్ణుఁ డాంగిరసవరుం
డయిన ద్రోణునిఁబూజించి వీడుకొని మహేంద్రమనుపర్వత
మునకుఁ దోడనే పోయెను. అకర్ణుఁడు పరశురామునిఁ జేరి తల
సోఁక మ్రొక్కి 'నేను భృగువంశమునం బుట్టిన బ్రాహ్మణుఁడను'
అని గౌరవముగాఁ జెప్పికొని యభివందనము చేసెను. పరశు
రాముఁడు గోత్రము మొదలగు వానినెల్ల నడిగి యతనిఁ గయి
కొని 'నీకు స్వాగతము, ఇచ్చట నుండువచ్చును' అనిచెప్పి మిక్కి

లియుఁ బ్రీతిగలిగియుండెను. స్వర్గమునకు సమానంబగు నమ్మహేంద్ర పర్వతమునఁ గర్ణుఁడు వసించియుండఁగా నతనికి గంధర్వులతోను రాక్షసులతోను, యక్షులతోను, దేవతలతోడను సమాగమము కలిగెను. వాఁడచ్చట యథావిధిని బరశురామునివలన బాణములను నస్త్రములను నభ్యసించెను; దేవతలకును, నసురులకును రాక్షసులకును మిక్కిలి ప్రియుఁడై యుండెను. ఆ కర్ణుఁడు తా నొకప్పుడు సముద్రమునకు సమీపమునం దున్న యాశ్రమము పొంత సంచరించుచు నొంటిమెయి విల్లును ఖడ్గమును గేలందాలిచి విహరించుచుండెను. అపు డగ్నిహోత్రము చేయుచుండిన యొక బ్రహ్మవాది యగు బ్రాహ్మణుని * హోమధేనువును (దూడను) దెలియక దైవికముగాఁ జంపెను. కర్ణుఁడు తాను దెలియక చేసిన దానిని దెలిసి బ్రాహ్మణునకుఁ దెలిపెను. వాఁ డతనికిఁ గోపము లేకుండునట్లు చేయఁ దలఁచి యతనితో 'మహాత్మా! నీ ధేనువగు దీనిని నేను, వలయునని తెలిసికాక తెలియక చంపితిని. ఆవిషయమై నాయం దనుగ్రహింపవలయును' అని మాటిమాటికి వేఁడెను. ఆబ్రాహ్మణుఁడు క్రుద్ధుఁడై కర్ణుని మాటలచే నదల్చువానివలె ' దురాచారా! నీవు వధకు నర్హుండవు. దుర్మతీ! ఇందులకుఁ దగిన ఫలము పొందంగలవు పో! పాపీ! నీ వెవ్వానితోడ నెప్పుడును మచ్చరించుచుందువో, ఎవ్వని కొఱకు నెపుడు జతనపడుచుందువో, యట్టి వానితోడ యుద్ధము సేయునపుడు నీదు రథచక్రమును భూమి మ్రింగఁగలదు. మను జాధమా! అంత చక్రము భూమియందుఁ గ్రుంగఁగాఁ, దోడనే

---

* కర్ణపర్వమందుఁ జెప్పఁబడి యున్నట్లు ధేను వనఁగా నిట వత్సము (దూడ) గాఁ దెలియునది.

నీవు తత్తఱపడుచుండునపుడు పగవాఁడు నీతలను పరాక్రమించి కూల్పఁగలఁడు. మూఢా! పద! నేను పరాకున నుండఁగా నాగోవును దీనిని నీవెట్లు చంపితివో యట్లె పరాకున నీవుండఁగా, నామాటచేతనే నీతలను వాఁడుగూల్పఁగలఁడు' అని శపించెను. కర్ణుఁడట్లు శప్తుఁడై యాబ్రాహ్మణుని గోవులను ధనములను రత్నములను నిచ్చి ప్రసన్నునిఁ గావించెను. అతఁడు వానినిజూచి మరల 'ఈ నా చెప్పినమాట బ్రహ్మలోకమందును జెప్పఁబడనిదిగాఁ (పొల్లుగాఁ) జేయఁదరముగాదు. నీవు పోయిననుబో; నిలిచిన నిలువు. లేక యేమిచేయవలయునో చేసికొనుము' అనెను. బ్రాహ్మణుఁడిట్లు చెప్పఁగాఁగర్ణుఁడు దుఃఖమునఁ దలవాంచి మనస్సున దానినే తలంచుకొనుచు భయమునొంది పరశురాముని కడకువచ్చెను. ఇది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(పరశురాముఁడు కర్ణుని తోడపయి నిదురించునపు డొకపురుగు వానితొడను దొలుచుట. పరశురాముఁడు కర్ణుని శపించుట.)

పరశురాముఁడు, కర్ణునిబాహువీర్యమునకు వినయమునకును దమమునకును గురుశుశ్రూషకును సంతసించెను. అంత మహాతేజుండును బరమతపస్వియు నయినయాగొప్పప్రాజ్ఞుఁడు కనికరమునను బాత్రుఁడయినయాకర్ణునకు బ్రహ్మాస్త్రమును, ఉపసంహారముతోఁగూడ నుపదేశించెను. కర్ణుఁ డట్లస్త్రమునెఱింగి యాభృగువునాశ్రమమందుఁ గ్రీడించుచు నద్భుతపరాక్రముఁడై ధనుర్వేదము నభ్యసించుచుండెను. పిదప నొకప్పుడు పరశు

రాముఁడు కర్ణునిం గూడి యాశ్రమమునసమీపమున సంచరించు-
చుండెను. ఆ గురుఁడు పరశురాముఁ డుపవాసముచే స్రుక్కి-
మనంబు వికాసంబులేక వాఁడువాఱ నమ్మికవలనినెయ్యంపుఁ
బెంపుచే నాకర్ణునొడియందుఁ దలయిడి నిదురపోయెను. అంత
శ్లేష్మమయ మయినయొకపురుగు కర్ణుని యొద్దకువచ్చెను. దానికి
మాంసమును రక్తమునే యాహారము. కాన యది చేయుపని
భయంకరమగుటయే కాక దాని పొడయునుజూడ బెట్టిదముగానే
యుండెను. అది వానితొడను దారసించి నెత్తురు ద్రావఁగోరి
దానిని దొలువఁజొచ్చెను. కర్ణుఁడు గురువులని భయమున
దానిని జిమ్మివైచుటకుశక్తుఁడు గాకుండెను. అట్లాపురుగుకఱచు
చుండియు నాకర్ణుఁడు గురువుమేలుకనుటకు వేచిదాని నుపేక్షించి
నవాఁడయ్యె. కర్ణుఁడు సహింపనలవిగాని యావేదనను దాలిమి
చే నడంచుకొని కదల్పకయు గాసి పెట్టకయుఁ బరశురామునిఁ
దాల్చియుండెను. ఆ గురుఁడు తన దేహమంతయు రక్తము
తాఁకు వడఁగా మేలుకొని చూచి సంరంభించి 'అక్కటా! అశుచి
నాకుఁ గలిగినది! ఏమిది నీవుచేసినది? భయమని దాఁపక జరిగినది
జరిగినట్లు నాకుఁ జెప్పుము' అని యడిగెను. కర్ణుఁడు తన్నాపురు
గట్టు కఱచిన దని చెప్పెను. పరశురాముఁడను పందివలె నాకా
రము గలయాపురువును గాంచెను. దానికి నెనిమిదికాళ్లును వాఁ
డులయిన కోఱపండ్లునుండెను; మేనంతయు సూదులవంటి వెండ్రు
కలచేఁ గప్పంబడియుండెను. దాని యవయవములు ముడుంగు
కొని యుండెను. రాముఁడు చూడఁగానే యాపురు వానెత్తు
టనే తోఁగుచు నుసుఱువిడిచెను. అది యొక యాశ్చర్యమువలె
నుండెను. అంత నాకాశమున సకలరూపములు నెత్తుకొనఁ జాలిన

వాఁడును క్రూరాకారుఁడును నగు నొకరాక్షసుఁడుకనుపట్టె
ను. వాని కుత్తుక యెఱ్ఱగాను దక్కిన దేహమంతయు నల్లగాను
నుండెను. వానికి మేఘమువాహనమై యుండెను. వాఁడు చేతు
లుమోడ్చి నిండుమనంబునఁ బరశురామునిఁ జూచి 'భృగుసింహ
మా ! మీకు స్వస్తియగుఁగాక. నేనువచ్చినదారినే పోయెదను.
మునిసత్తమా ! నరకమునుండి నీచేత విముక్తుఁడనయితిని. నీకు
భద్రంబును సిద్ధియుఁ గలుగుఁగాత.నాయిష్టము నీచేత సమకూ
డినది'అనెను. పరశురాముఁడు వానినిజూచి 'నీవెవ్వఁడవు? ఎందు
వలన నరకమొందితివి? దానిని జెప్పుము' అనియడిగెను. వాఁడు
'తండ్రీ ! తొల్లి కృతయుగమందు దంశుఁ డనుగొప్పయసురను;
భృగువునకుఁ జెలివలె నున్నవాఁడను. భృగువునకు మిక్కిలి
ప్రియురా లయినయిల్లాలిని నేనుబలవంతముగా నపహరించితిని.
ఆమహర్షి యందులకు శపింపఁగాఁ బురువయి భూమియందుఁ
బడితిని. నీకుఁ బూర్వపితామహుం డయిన యాభృగువు కుపి
తుండై నన్నుఁ జూచి 'పాపాత్మా! మూత్రమును శ్లేష్మమును గుడు
చుచు నరకమును బడయఁగలవు' అని శపించెను. అంత నే నత
నితో 'బ్రాహ్మణోత్తమా ! శాపమునకు నంతము దయసేయు
ము' అని వేడికొనఁగా నతఁడు 'భృగువంశమునఁ బుట్టు రాము
నివలన విముక్తిగలుగును' అని చెప్పెను, సాధూత్తమా !
నేను కుశలరహితుఁడు పొందునట్లు యీగతిని బొంది మిమ్ముఁ
జేరినపిదపఁ బాపయోనివలన విడివడితిని' అని చెప్పి రా
మునికి మ్రొక్కి వాఁడుపోయెను. రాముఁడు కోపంబునఁ గర్ణు
నిఁ జూచి 'మూఢా ! ఈమహాదుఃఖమును నొకప్పుడును బ్రా
హ్మణుఁడు సయింపఁడు. క్షత్రియునకుంబోలె నీకు ధైర్యము చూ

పట్టుచున్నది. కపటముమాని కలరూపుఁ జెప్పుము" అనెను. అంతఁ గర్ణుఁడు శాపముకలుగునని భయపడి యతనినిఁ బ్రసన్నునిఁ గావించుటకై 'ఓభార్గవా! బ్రాహ్మణునకును క్షత్రియునకు వేఱయినచోటఁబుట్టిన సూతజాతివానిఁగా నన్నుఁదెలియుము. భూమియందు నన్నురాధకొడుకయిన కర్ణుఁడని జనులాడుదురు. నేనస్త్రమందుఁ బేరాసగలిగి యిటుసేసినందులకు నాయందనుగ్రహింపుము. వేదవిద్యను నొసంగసమర్థుం డయినగురుఁడు పిత యనుటకు సందేహము లేదు. కాఁబట్టి మీకు భార్గవుఁడనని నేను గోత్రము చెప్పితిని" అనెను. ఇట్లు భూమిపయింబడి శోకంబున దురపిల్లుచు వడవడవడఁకుచు నంజలిగీలించి యున్నయా కర్ణునిఁ జూచి రాముఁడు కోపంబునఁ గాల్చువానింబోలెఁ జూచుచుం జూచి 'మూఢా! నీవస్త్రమునందుఁ బేరాసగొని యిచటనన్నుఁ బొల్లుగా నుపచరించితివి. కావున యీ బ్రహ్మాస్త్రము సమానుఁ డయినవానితో యుద్ధము సేయునపుడును నీదువధ కాలమందుఁ దప్పఁ దక్కినకాలముననను, దోఁపకుండుఁగాత. బ్రాహ్మణుఁడు కాని వానియం దొకప్పుడును బ్రహ్మాస్త్రము నెలకొనియుండదు పో. ఇప్పుడు దబ్బఱకాఁడవగు నినుబోఁటి కిటచోటు లేదు. యుద్ధమున నీకు సాటియైన క్షత్రియుఁడు భూమియందుఁగలుగఁడు" అనెను. అంతఁ గర్ణుఁడు న్యాయముచొప్పున నమస్కారములు గావించి దుర్యోధనునిఁ జేరి 'అస్త్రముల నాఱి తేఱితి' ననెను. ఇది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

దుర్యోధనుఁడు స్వయంవరమున కళింగరాజు కన్యనపహరించుట. కర్ణుఁడు దుర్యోధను వెంటఁ దలపడినరాజుల నోడించుట.

ఓ! భరతసత్తమా! పరశురామునివలన నిట్లు కర్ణుఁడస్త్రమును బడసి దుర్యోధనునింగూడి ముదంబునఁ బొదలుచుండెను. రాజా! పిదప నొకకాలమందుఁ గళింగదేశమునఁ జిత్రాంగదరాజు స్వయంవరమున రాజులువచ్చి చేరిరి. ఆదేశమందు సిరిపెంపారుచున్న రాజపురమను పట్టణమునకు నందలి కన్యకుఁగాను రాజులు వందలకొలఁదిని వచ్చిచేరిరి. అచ్చట రాజులందఱును వచ్చిచేరియున్నారని విని దుర్యోధనుఁడు కర్ణునిఁగూడి బంగారుకండ్లతోఁ గూడిన రథమునెక్కిపోయెను. రాజోత్తమా! అంతఁ బెక్కుదేశములనుండి మహారథు లయినరాజులు కన్యానిమిత్తమా స్వయంవరమునకు వచ్చిచేరిరి. దక్షిణదిక్కునందలి శిశుపాలుఁడు జరాసంధుఁడు, భీష్మకుఁడు, వక్రుఁడు, కపోతరోముఁడు, నీలుఁడు, రుక్మి, స్త్రీరాజ్యమున కధిపతియైన సీగాలుఁడు, విశోకుఁడు, శతధన్వుఁడు, భోజుఁడు, వీరుఁడును మఱియుఁ బెక్కండ్రు రాజులును, అట్లె తూర్పునను నుత్తరమునను గల మ్లేచ్ఛరాజులును ఆర్యరాజులును వచ్చిరి. వారందఱును బంగారు బాహుపురులు దొడిగి యచ్చపుఁగడానిబంగరు చాయగలిగి, జిగిదొలఁకాడుచున్న మేనులతో, బెబ్బులులవలెఁ జలంబున విఱ్ఱవీఁగుచునుండిరి. అంత నారాజులు కూర్చుండఁగానే యాకన్య,దాదితోడను హెగ్గడులతోడను నా స్వయంవరరంగమును బ్రవేశించెను. పిదప రాజులపేళ్లను వేఱువేఱఁ దెలుపునపు డావరవర్ణిని ధృతరాష్ట్రుని పు

త్రుఁడయినదుర్యోధనునిఁగడచిపోయెను. కురువంశతిలకుండయిన యాదుర్యోధనుఁడో యట్లు దన్నుఁగడచిపోవుట కెంతమాత్రము సయింపఁడయ్యె. అతఁడు తక్కినరాజులను నవమానించుచు నా కన్నియను వారింపను వారించెను. అతనికి భీష్ముఁడును ద్రోణుఁడును న త్తియుండుటంబట్టి వీర్యంపుఁ గ్రొవ్వనమదించి యాకన్ని యను రథమునందుఁబట్టి యెక్కించుకొని రాజులను యుద్ధము నకుఁబిలిచెను. ఆయుధధారులందు మిన్నయైన కర్ణుఁడు రథా రూఢుండై ఖడ్గమును గేలంబట్టి వ్రేలికి నుడుపతోలియత్తె మునుదొడిగి దుర్యోధనుని వెంబడించి పోయెను. పిదప రాజులు రథములుఁ బూన్చువారును కవచములు దొడుగుకొనువారును పోరాడనుంకించువారునై యురవడింపఁగా రారాపు మిక్కిలియుఁ గలిగెను. ఆరాజులు మిక్కిలియుఁ గుపితులై శరవర్షములను గురియుచు మేఘములు రెండుపర్వతముల పయినడరునట్లు కర్ణ దుర్యోధను లిరువురపయి నేయఁదలపడిరి. కర్ణుఁడట్లు తమపయివేగ మున నడచుచున్నయారాజులవిండ్లను బాణసమూహముల ను దా నొక్కొక్కబాణముచేఁ గాఁడనేసి భూమింగూల్చెను. ఆకర్ణుఁడు యుద్ధంబుసేయువారియందెల్ల మిన్న గావునఁ గొంద ఱ విల్లుదునిమియు కొందఱవిండ్లను నిలువుననే నిలిపి, కొందఱ బాణముల దిగనైపించి, కొందఱను రథములును శక్తులను గద లను దూలునట్లుచేసి పెక్కండ్రకు సారథులు లేకుండఁజేసి, మిక్కిలి వ్యాకులపెట్టి వారినందఱను జుల్కఁగా జయించెను. ఆరాజులు మనంబులుదూల తామే గుఱ్ఱములను దోలుకొనుచు 'పదపద' యని చెప్పుచు యుద్ధముమాని పలాయితులయిరి. అట్లు దుర్యోధనుఁడు కర్ణునిచే రక్షితుండై సంతోషమునొంది

కన్నియనెత్తికొని హస్తినాపురము జేరినవాఁడగ్యో. ఇది నాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కర్ణుని పరాక్రమమును వర్ణించుట.

"కర్ణుండట్లు యుద్ధమునఁ దనబలిమిని వెలిపుచ్చఁగా మగధరాజయిన జరాసంధుఁడు రథారూఢుండై వానిని యుద్ధమునకుఁ బిలిచెను. ఆయిరువురును దివ్యాస్త్రములఁ దెలిసినవారు కాన పెక్కులాయుధము లొండొరులపయి వర్షించుచు దెప్పరముగాఁ బోరాడిరి. అమ్మహాబలు లిరువురును బాణములన్నియుఁ దూలి, విండ్లన్నియు నశించి, కత్తులెల్లవిఱిగినపిదప నేలపయినిలిచి బాహుయుద్ధమునకుఁ దారసించిరి. జరయను దానిచేత సంధింపఁబడిన జరాసంధుని మేనిసంధిని గర్ణుఁడు బాహుకంటకమను మల్లయుద్ధబంధముచేత వ్రీల్చెను. ఆరాజు తనమేనిచీలిన వికారమును జూచి వైరమును దూరమునకుఁ ద్రోసి, 'ప్రీతుండ నయితి' నని కర్ణునిఁజూచి చెప్పెను. పిదప నతఁడు కర్ణునియందుఁ గలసంతోషముచేత మాలిని యనుపట్టణమును నతనికొసంగెను. పగవారినిగెలుచు దిట్టయగు నాకర్ణుఁడు, అంగదేశమునకు రాజుగా నుండెను. వాఁడాదుర్యోధనుని నుతము చొప్పున సకలవర్ణముల వారిని బరిపాలించుచు వచ్చెను. అది నీకును దెలియును. ఇట్లా కర్ణుఁ డాయుధముల వేండ్రముచేత భూమియందుఁ బ్రసిద్ధుఁడయ్యెను. దేవేంద్రుఁడు మీకుశలమును గోరి యాకర్ణుని కవచకుండలములను యాచింపఁగా దేవమాయచేత మోహితుండై దివ్యములును దనతోడంబుట్టినవియు

మిక్కిలి పూజితములు నయినకుండలములను సహజం బగుకవచ
మును నిచ్చివుచ్చెను. కర్ణుఁడు కుండలములును సహజకవచ
మును బాసి, బ్రాహ్మణశాపముచేతను, మహాత్ముఁ డయినపరశు
రాముని శాపముచేతను, కుంతికి వరమిచ్చుటచేతను, ఇంద్రుని
మాయచేతను, రథికులను గోలఁది యెడుకాలమున భీష్ముఁ డర్ధ
రథుఁడనిచెప్పి యవమానించుటచేతను, శల్యుఁడు తేజముగుం
దించుటచేతను, కృష్ణుని నీతిచేతను, కృష్ణుఁడు చూచుచుండఁ
గా నర్జునునిచే యుద్ధంబున హతుఁడయ్యెను. రుద్రుఁడు దేవేం
ద్రుఁడు, యముఁడు, వరుణుఁడు, కుబేరుఁడు, ద్రోణుఁడు, కృ
పుఁడుననువీరల దివ్యము లయినయస్త్రములనుబడసి గాండీవ
మను విల్లుదాలిచి యర్జునుఁడు సూర్యునివలె ధగధగ ప్రకా
శించుచుండు నాసూర్యపుత్రుని కర్ణుని యుద్ధమున వధించెను.
ఇట్లు పెక్కండ్రచే శపింపఁబడియు, వంచింపఁబడియు నీ యన్న
యగు కర్ణుఁడు యుద్ధమున హతినొందెను. అందులకు నీవు
దుఃఖింపవలదు " అనెను. ఇది యేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కుంతికర్ణునిఁగూర్చి దుఃఖించుచు ధర్మరాజు నూఱడించుట. ధర్మరాజు స్త్రీలకు రహస్యమును దాఁచుట లేకుండుఁగా తమని శపించి రాజ్యమునందు విరక్తుఁ డగుట.

దేవర్షి యగునారదుఁ డింతవఱకుఁ జెప్పి యూరకుండెను.
రాజర్షి యగుధర్మరాజు శోకంబునఁ దేలుచు, చింతయందు
మునిఁగియుండెను. కుంతి శోకంబు మేనంతయు నలమికొన,

దుఃఖమున మనసు పెంపుదూలిన దగుచు, మనసువిన్ననై తల వాంచి కుందుచు, సర్పమువలె నిట్టూర్పులుపుచ్చుచు, కన్నుల యందుఁ గన్నీరు దొరఁగుచుండ, నున్న ధర్మరాజును జూచి యప్పటికిఁ దగినట్టు లర్థవంతములగు నింపయిన మాటల 'మహాబాహూ! ఈకర్ణునిఁగూర్చి నీవు శోకించుట దగదు. మిక్కిలి ప్రాజ్ఞుండవు. నీకుఁ దెలియనిదిలేదు; దుఃఖమును డిగవిడువుము. నేను జెప్పుమాట వినుము. *ఆకర్ణుని మున్ను నేనును దండ్రియగు సూర్యుఁడును నీకుఁ దెలుపుటకొఱకు బతిమాలుకొంటిమి. వాఁడు ధర్మవిదులందు మిన్న. వానికి సూర్యుఁడు, మేలుగోరు వాఁడును సంపత్తినభిలషించువాఁడు నయిన యొకఁడుసుహృదు ల కేదిచెప్పవలయునో దానిని, దాను స్వప్నమునందును నాసమ క్షమందును జెప్పెను. వానిని, స్నేహకారణములచేత మునుపే నీతోడ నోరిమగలిగియుండఁ జేయుటకుఁగాని యుపశమింపఁజే యుటకుఁగాని సూర్యునకును శక్యముగాదయ్యె; నాకును దరము గాదయ్యె. అంత వానికి వైరమును వెలిపుచ్చుటయందే కన్ను గావునను, మృత్యువుచే గ్రస్తుఁ డగుటంబట్టియు, మీకు విరోధము చేయువాఁ డగుటవలనను, నేను వానిను పేక్షించితిని' అనెను.ధర్మరాజు, కన్నీటిచేఁగలగుండువడుచుఁ, దల్లి యిట్లు చెప్పఁ గానే, శోకంబున మిక్కుటముగాఁ గుందుచు 'రహస్యమునుగప్పి యుంచుటవలన నీచేత నపుడు మేము మిక్కిలియు వంచితుల మయితిమి' అని చెప్పి మిక్కిలి యాఱటపడుచు 'సమస్తలోక ములందు నిదిమొదలుగా స్త్రీలు రహస్యమును దాఁచి పెట్టు

* 'యాచితః సమయాపూర్వం భ్రాతృ్య' మని పా. నీవు నీతోఁబుట్టు వనమును నెఱపవలయునని వేఁడితినని యర్థము.

కొన కుందురుగాక' అని శాపము పెట్టెను. అతఁ డంతఁ బుత్త్రుల
ను, బౌత్త్రులను, సంబంధులను, చెలికాండ్రను దలంచుకొని మన
స్సు తల్లడిల్ల, బుద్ధికలంగినవాఁడయ్యె. ఇట్లతండు దుఃఖమొం
తయు నావరింపఁగా, పొగతోఁ గూడిన యగ్నివలెఁ బొగులుచుఁ,
దాపంబునఁ బురబురఁబొక్కుచు, రాజ్యమునందు విరక్తి నొందిన
వాఁ డయ్యె. ఇది యాజివయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు దుఃఖించుట.

ధర్మరాజు దుఃఖమున మనసు పల్లటిల్లఁగా మహారథుఁడయిన
కర్ణునిఁ దలంచికొని, పరితపించుచుండెను. అతఁడు దుఃఖశోక
ములు పయికొన మాటిమాటికి నిట్టూర్పులువిడుచుచు, మిక్కి
లియు స్రుక్కుచును నర్జునునిఁజూచి 'మనము వృష్ణులయు నంధ
కులయు దేశమున భిక్షాచరణము చేసికొనుచుందుమేని, జ్ఞాతు
లందు మనపించయు లేకుండఁజేసిన యీదుర్గతిని బొందియుండక
కుందుము. కురువంశమువారి పనిపోయినది. మనపగవారి పని
వెంపు సొంపారినది. మనము మనలఁజంపుకొంటిమేని యేధర్మ
మువలని పని పొందఁగలము? ఇస్సీ! క్షత్త్రియుల యాచారము
పాడయిపోవుఁగాక. ఇస్సీ! సేనయుఁ బౌరుషమును అర్థమును
నింత్యములు! అర్థమనెడి కారణమునుబట్టి మనమిట్టి యాపద
నొందితిమి. వనమందు సంచరించువారికి నోరుపు, అడఁకువ, శుచి,
పగలేకుండుట, మత్సరములేమి, అహింస, సత్యవచనము ననెడి
యివి యెప్పుడు నుండవలసిన ధర్మములు. ఇవి మిక్కిలియు మం
చివి. మనమో లోభమువలనను, అవివేకమువలనను, గర్వము

నహంకారమును బొంది, రాజ్యమందలి కష్టముల ననుభవింపఁ
గోరి, యీ యవస్థను బొందితిమి. భూమియందు భోగములను
గోరిన మనలను, వధింపఁబడిన బంధువులనుం, జూడఁగా ముల్లోక
ములను రాజ్యముచేసినను మనల నొకఁడును గొనియాడఁడు.
ఇట్టి మనము పుడమికొఱకుఁ జంపఁదగినవారిని జంపి బంధువులను
మాలియు, ధనములనుమాలియు భూమియందు బ్రదికియు
న్నారము. ఒకమాంసపు ముక్కకై పేరాసగల కుక్కలకుంబోలె
మనకుఁ (బంధువధరూపమయిన) యశుభకర్మము సంభవించి
నది. అయినను, అవి పోరి తుద కాయామిషము ననుభవించు
చున్నవి. మనకో యదికలిగియుఁ దుదకు నిష్టమేకాక మఱి
నష్టమేయయ్యె. హతులయిన యీజనులను, ఈభూమియంతటి
లాభమువచ్చినను దిగవిడువఁ దగదే; బంగరురాసులకుఁ గానును,
సకలగజతురగములకుఁ గానును, దిగవిడువఁ దగదు. పేరా
సయుఁ బెనుశోకమును గ్రమ్ముకొనఁగాఁ గోపమును మచ్చ
రమును గలిగియుండినవారై, వారు, మృత్యువను వాహనము
నెక్కి, యమునిపురమును బోయిచేరిరి. తండ్రులు తపంబువల
నను బ్రహ్మచర్యమువలనను బెద్దలకు వందనముచేయుటవలనను,
ఓరుపువలనను, బహుకల్యాణ యుక్తులగు బుత్రులను బడయఁ
బ్రయత్నింతురు. తల్లులో, యజ్ఞ యుపవాసములచేతను
దైవపూజనములచేతను వ్రతములచేతను నుత్సవములచేతను
మఱియుఁ దక్కిన శుభకర్మములచేతను, గర్భములను బడ
యుదురు. ఆగర్భములను బదినెలలు దాల్తురు. అట్లు వారా
బిడ్డలకై వెతలుగుడుచుచు ఫలము నెదురుచూచుచు 'వారు
క్షేమముగాఁ బుట్టుదురా? పుట్టి బ్రతికియుండురా! బ్రతికి

గౌరవమును బలమునుగలిగి మన కిహమందును బరమందును సుఖము గావింతురా !' యని యువిళ్లూరుచుందురు. ఆ తలి దండ్రులు పడ్డపాట్లంతయు మిక్కిలియు నిష్ప్రయోజనమాగా ముగిసినది. ఈ తల్లులు కాచిమోచి కన్నపుత్రులు, మెఱుఁగిడ్డ కుండలములను దాల్చి వయసుకాండ్రయి వెలుంగుచుండిన వార, లిట్లు చంపఁబడిరి; మఱి భూమియందలి భోగముల నను భవింపకయుఁ, బితరులయు దేవతలయు ఋణములను దీర్పకయు యమునివీటికి బోయిరి. అమ్మా ! *ఈరాజులు తాము మంచి బలిమియు సంపదయునొంది, తలిదండ్రులు తమకోర్కులు కొనసాగించుకొనఁజూచు సమయమునఁ జంపఁబడిన వారయిరి. వీరలాశయుఁ జూపోపమియు నెప్పుడును గలిగి కోపంబున నుట్టి పడుచు నుబ్బునఁజెలరేఁగుచు నుండిరి. కాఁబట్టి వీరెచ్చటఁగాని యెప్పుడేని జయమువలని ఫలము నించుకయిన ననుభవింపఁ గలుగుట యుండదు. పాంచాలురలోను గౌరవులలోను యుద్ధ మందెవరు హతులయిరో వారు (క్రోధాదులచే నిట్టి పాపకృత్య ములు చేసి స్వర్గదూరులయిరి గాన) నశించినవారే యగుదురు; కానిచో వారిని జంపినవాఁడును నిట్టికర్మములవలన సమస్తము లయిన పుణ్యలోకములను బడయవలయును గదా. ఈ లోక మునకుఁ గలిగిన నాశమునకు మనలనే కారణముగాఁ దలంచె దరు. కాని యందులకుఁ గారణమంతయు ధృతరాష్ట్రుని కొడు

---

* 'యదేషామమ్బపితరౌ జాతకామావుభావపి। సంజాతబలరూపేషు తదైవ నిహతాన్నృపాః' అని ఉత్తరదేశకోశపాఠము. 'పితరౌ జాతకర్మకరావిహ । సంజాతబాలరూపేషు' 'వీరల తలిదండ్రులు, పుట్టి బిడ్డలరూపుననుండు వీరికి జాతకర్మము చేసినపుడే వీరు చంపఁబడిన వారయిరి' అని దాక్షిణాత్యకోశము.

కులందే యున్నది. దుర్యోధనుని మనస్సు మనలను వంచించుట యందే నాసక్తమై యుండెను. వాఁడెప్పుడును మనలను ద్వేషించుచు మనయందు మాయలుపన్నుటయే బ్రతుకుగానుండెను. వానికి మనమొకప్పుడును నపకారము చేయకుండినను మనయెడలఁ గపటముగానే నడచుచుండినాఁడు. కోపములు మనకు నీడేరినవిగావు. వారికినిగావు. మనమును వారిని జయించినారము గాము. వారును మనలను జయించినారుగారు. ధార్తరాష్ట్రులీ భూమిని ననుభవింపలేరయిరి. పడఁతులను వాద్యములను ననుభవింప నేరరయిరి. వారు మంత్రులయు సుహృదులయు విద్వాంసులయు మాటలను బాటింపరయిరి. వారు తమ మేలయిన రత్నములను, బరిపూర్ణములయిన బొక్కసములను విరివియైన రాజ్యములను ననుభవింపఁజాలరయిరి. మనవలని పగచేత నెరియుచు వారు సుఖమును స్నేహమును జెందరయిరి. మనయందుఁ గలపెంపు సొంపునుజూచి వాఁడు వన్నెనూఱియు వెలుకఁబాటియుఁ గృశించియు నుండెను. దీనిని శకుని ధృతరాష్ట్రునకుఁ దెలిపెను. అతఁడు కన్నకడుపు గాన కొడుకు నందలి మక్కువచేతఁ, దన తండ్రియగు భీష్ముఁడును నట్లె విదురుఁడును జెప్పిన హితమువినక, దుష్టవర్తనుఁడగువానికి లోనయ్యెను. రాజయిన యీధృతరాష్ట్రుఁ డశక్తుఁడును, లోభియుఁ గామ పరతంత్రుఁడు నయినకొడుకు నడంపక సందేహములేక మన సెట్లో యట్లే పోయినవాఁడయ్యె. దుర్యోధనుఁడు మనయం దెప్పుడును బగకలిగి తపించుచుఁ బాపబుద్ధినూఁది ప్రకాశించుచున్న పొగడ్తను దిగవిడిచి తోడఁబుట్టినవారిని జంపించి ధృతరాష్ట్రగాంధారు లనెడియీ ముదుసండ్లను దుఃఖాగ్ని

యందుఁ ద్రోచి తానును బోయెను. వీఁడు హోరితము చేయవలయు ననియే యువ్విళ్లూరుచుండినందున, కృష్ణుని సన్నిధానమున మాటలాడినటువంటి మాటలను, మంచికులమునఁ బుట్టియు బంధువయ్యునుండు మనుష్యుఁ డెవ్వఁడు స్నేహితుని యెడ మాటాడును?- తేజంబుచే సకలదిక్కులను గాల్చు సూర్యులవలె మనము దుర్యోధను దోషమువలన మిక్కిలియుఁ గలకాలము నాశము నొందితిమి. దుర్మతియు మన వైరపురుషుఁడు నగువాఁడు మనకు దుష్టగ్రహముగా నుండెను. దుర్యోధను నిమిత్తముగా మనకుల మిది మిక్కిలియు నశించునట్లు గావింపఁబడినది. చంపఁదగిన వారిని జంపి లోకమునందు నిందింపఁదగిన స్థితిని బొందియున్నారము. దుష్టబుద్ధియు నీకులము నాశమునకుఁ గారణభూతుఁడును పాపాత్ముఁడు నయిన దుర్యోధనుని రాజయిన ధృతరాష్ట్రుఁడు రాజ్యమున కధిపతిగాఁ జేసి యిపుడు దుఃఖపడుచున్నాఁడు. శూరులు హతులయిరి. పాపము చేసినదైనది. ఈ దేశము నాశితమైనది. చంపిన పిదప మనకుఁ గోపముడిగినది. ఈ శోకము నన్ను వీఁకల్చుచున్నది. అర్జునా! చేసినపాపము మంచిచేయుటచే పోఁగొట్టఁబడుచున్నది; వెలిపుచ్చి చెప్పుటచేతఁగాని, తపము చేతఁగాని. విరక్తిచేతఁగాని, పుణ్యస్థలములకుఁ బోవుటచేతఁగాని, శ్రుతిస్మృతులను జపించుట చేతఁగాని తొలఁగింపఁబడుచున్నది. త్యాగము (నివృత్తి) గలవాఁడు మరలఁ బాపము సేయఁ జాలఁడనియు జననమరణములను బొందఁడనియు శ్రుతి చెప్పుటంబట్టి త్యాగమార్గము నొందినవాఁడు జ్ఞానముఁ బడసి యపుడె బ్రహ్మమగును. పరంతపా! 'అర్జునా! నేను మిమ్మందఱను వేఁడి సుఖదుఃఖాది ద్వంద్వములను మాలి జ్ఞానముతోఁ గూడినవాఁడనై మునినై యడవికిఁ

బోయెదను. త్యాగముమాని పరిగ్రహము (నివృత్తిలేక విషయ సంగము) గలవానికి-అనఁగా గృహస్థునకు, సమస్తధర్మములు పూర్ణముగాఁ బడయఁదరముగాదని వేదము చెప్పుచున్నది. ఇది నాకుఁ బ్రత్యక్షసిద్ధము. నేను జేసినది పాపమేసుమీ. పరిగ్రహమునుగోరు మనుష్యునకు జననమరణములకు నిమిత్తమయిన ధర్మమే పడయఁగూడునని వేదము చెప్పెడిని. కాఁబట్టి నేను బరిగ్రహమును రాజ్యమును,సమస్తమగు సుఖములను దిగవిడిచి, విముక్తుఁడును శోకరహితుఁడును, దేనియందును మమతలేనివాఁడునై పోయిచేరెదను. కురువంశ్యా ! రాజ్యముచేతఁగాని భోగముల చేతఁగాని, నాకుఁ బ్రయోజనములేదు. కాన యకంటకమై యున్న యీరాజ్యమును క్షేమముగా మీరు పరిపాలింపుఁడు' అని చెప్పి యంతట నూరకుండెను. అంతఁ జిన్నవాఁడగు నర్జునుఁడతనికిట్లనియె. ఇది యేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజును దేర్చుట.

అంతఁ బలుకుదిటయు దృఢపరాక్రమమునుగల యర్జునుఁడు గద్దింపఁబడిన యొకచూపోపనివానివలెఁ దన్నుఁదోఁపించుచుఁ దేజంబు రాజిల్లుచుండ, పెదవులు నాకికొనుచుఁ, జిఱునవ్వు నవ్వుచు, మిక్కిలి నీతియుక్తంబయిన మాటల ధర్మరాజుం జూచి 'అమానుషమయిన కార్యముచేసి తీర్చి యెనలేని సిరి కలుగఁగా దిగవిడిచెదవే ! అయ్యో ! ఏమిదుఃఖమిది ! ఓరీ ! ఏమిసంకటము ! ఇంతటి యీడంగితన మెందునుగలుగునా ;

ఘోరా ! పగవారిని జంపి స్వధర్మముచేతఁ బడలిన యీపుడ
మిని బొందియు నెట్లు దిగవిడిచెదవు ? ఇది బుద్ధిచుల్కనకదా?
పిఱికిగుండెకు రాజ్యమెక్కడిది ? సోమరికిఁ గాని యెక్కడిది ?
రాజ్యమొల్లవేని క్రోధమునఁ దెలివిమాలి రాజుల నెందులకుఁ జంపి
తివి ? ఏమనుష్యుఁడు సుఖములుమాలి పేదవడి సకలలోకము
లందును బ్రఖ్యాతినొందక, పుత్రులును బంధువులును లేక యుం
డునో వాఁడు బిచ్చమెత్తి బ్రతుకఁగోరును; కాని తన పౌరు
షముచే మఱియెవ్వనియేని యర్థములనుగాని పడయఁగోరఁడు.
నీవో సుఖములన్నియుఁ గలిగి సంపన్నుఁడవై సర్వలోకములఁ
బ్రఖ్యాతుఁడవై పుత్రాది సంపత్తియుఁ గలిగి పౌరుషముచేఁ
బరులయర్థములంబడసి బిచ్చమెత్తఁగోరుట తలక్రిందుగాను
న్నది ! సమృద్ధమయిన రాజ్యమును దిగవిడిచి మిక్కిలియుఁ
గుచ్ఛితమయిన బిచ్చపుఁ గప్పెర నెత్తువృత్తినిబొంది పొట్టఁ
బ్రోచికొనఁ జూచునిన్ను నీ లోకముచూచి యేమనును ?
ప్రభూ ! సమస్తము లయినధర్మాదిప్రయత్నములను ద్రోసి
పుచ్చి సుఖంబులను వీడి యేమియులేక పేదవడినమూఢుని
వలె నెందులకుఁ దిరిపమెత్తఁగోరెదవు ? రాజకులంబునం బుట్టి
భూమినంతయు గెలిచినపిదప ధర్మార్థము లన్నిటినిదిగనాడి
మూఢత్వముచేత నెందులకు వనమునకు బయలువెడలెదవు ?
నీవు లేకపోవుటచేత దుష్టులగువా రీహవిస్సులను జెఱుపుదు రేని
యీపాపము నిన్నే పొందును. 'ఆకించన్యము (ఏమియులేకుం
డుట) మునులకు ధర్మము' (కాని రాజులధర్మముగాదు.)
ధనములేనపు డందులకై క్రూరంబగు కార్యముచేసి (బ్రతు

కుదురని) నహుషుఁడు *'ఇన్ద్రా! ధనములేమి మిక్కిలి నింద్యము' అనెను. † ఆశ్వస్తన్యవృత్తి ఋషులకుమాత్రమే చెప్పఁబడి యున్నది. అది నీవెఱుఁగుదువు. ధర్మమని ప్రసిద్ధముగా దేనిని జెప్పుదురో యది ధనముచేతఁ గొనసాఁగుచున్నది. ఎవనిధనము నెవఁడపహరించుచున్నాఁడో వానిధర్మమును వాఁడపహరించుచున్నాఁడు. ధనము నపహరింపఁబడి పోవుచుండఁగా మన మెందులకు శక్తులమగుదుము ? లోకులు ప్రక్కనున్నదరిద్రుని దోషవంతునిఁగాఁ జూతురు. లోకమున ధనములేమి (దారిద్ర్యమే) పాతకము. దానిని గొనియాడుటకుఁ దగువాఁ డెవఁడు ? పతితుఁడు దుఃఖపెట్టఁబడుచున్నాఁడు. పేదవాఁడును దుఃఖపెట్టఁబడుచున్నాఁడు. కాఁబట్టి పతితునకును బీదకును భేదముదోఁప కున్నది. అందందునుండి సంపాదించి కూర్చి మిక్కుటముగా వృద్ధిఁబొందింపఁబడిన ధనములవలననే, పర్వతములనుండి నదులు ప్రవహించునట్లు, సమస్తకార్యములును బ్రవర్తించుచున్నవి. అర్థమువలననుండి ధర్మమును గామమును స్వర్గమును సిద్ధించుచున్నవి. లోకమందలి దేహయాత్రయు ధనములేక సిద్ధి నొందదు. అర్థమునుండి వీడిన యల్పమతి యగుమనుష్యునకు సమస్తకార్యములును వేసవికాలమునందలి చిన్నయేళ్లవలెఁ దూలిపోవును. ఎవనికి ధనముగలదో వానికి స్నేహితులు గలరు; ఎవనికి ధనముగలదో వానికిబంధువులు గలరు ; ఎవనికి ధనము గలదో వాఁడే లోకమునఁ బురుషుఁడు. ఎవనికి ధనముగలదో

---

* ధనములేనందువలననే క్రూరకార్యము చేయఁబడుచున్నది గాన ధనములేమిని నిందించినాఁడనుట.

† ఆశ్వస్తన్యమనఁగా మఱునాఁటికి ఏమియులేకుండుట.

వాఁడే విద్వాంసుఁడు. ధనకాముఁడయినవానికి ధనములేనిచో ధనము సంపాదింప శక్యముగాదు. ఏనుఁగులచేత పెద్దయేనుఁగులు కట్టువడునట్లు ధనములచే ధనములు కట్టువడుచున్నవి. రాజా! ధర్మము, కామము, స్వర్గము, సంతోషము, కోపము, శ్రుతము, దమము ననెడియివియన్నియును నర్థమునుండి కలుగుచున్నవి. ధనమువలనఁ గులము గౌరవమొందుచున్నది. ధనమువలన ధర్మము వర్ధిల్లుచున్నది. ధనములేనివానికి నిహమును లేదు; పరమును లేదు. ధనములేనివాఁడు ధర్మకార్యములు కలరూపునఁ జేయఁజాలఁడు. పర్వతమునుండి నదివలె ధనములనుండియే ధర్మము. స్రవించుచున్నది. ఎవనికి ధనమును, బశువులును, భృత్యులును, నతిథులును, గృశించియుండునో వాఁడే కృశుఁడనఁబడునుగాని శరీరము కృశించినవాఁడుగాఁడు. రాజా! న్యాయమును జూడు. దేవతలును, నసురులు నెట్లున్నారు చూడుము. దేవతలు, జ్ఞాతులవధము వలని ధనముదక్క మఱి దేనినిగోరుచున్నారు.? పరునిసొమ్ము నపహరింపరాదేని ధర్మమెట్లు చేయనగును? సూక్ష్మధర్ములయిన వారు వేదములనుండి వీనినే సిద్ధాంతీకరించియున్నారు. అవియేవనఁగా 'నిత్యమును వేదము నధ్యయనముచేయవలయును. పండితుఁడు తప్పక కావలయును. అన్నివిధముల ధనమార్జింపవలయును. పాటుపడి యజ్ఞములను యజింపవలయును' అనియె. దేవలోకమునందుఁగల పదవులన్నియు జ్ఞాతిద్రోహము వలననే దేవతలు పడసిరి. దేవతలు తమ యిష్టసిద్ధిని బొందినందులకుఁ గారణము జ్ఞాతిద్రోహము గాక మఱేమి? ఇట్లు దేవతలు నిశ్చయము చేసికొని యుండుటేకాక యిట్లు చేయఁదగునని వేదవాదములును

శాశ్వతముగా నున్నవి. అధ్యయనముచేసెదరు; చేయించెదరు; యజ్ఞములను యజించెదరు, యాజింపించెదరును. లోకమునంగల వస్తువులన్నియును బరులనుండి పొందినవే. అవియే మంచిగతికి మూలము. పరులకపకారము లేక కలిగిన ధనమెద్దిగాని యెక్కడ నేని మనకుఁ జూపట్టినదిగాదు. ఈ చందముననే రాజు లీ భూమిని పాలించుచున్నారు. వారలు గెలిచిన పిదప, పుత్రులు తండ్రిధనమును జెప్పునట్లు 'ఇది నాది' యని చెప్పుదురు. ఆ రాజర్షులును స్వర్గమున కర్హులేయగుదురు. ఏలన వీరల ధర్మము మేలయినదిగాఁ జెప్పంబడుచున్నది. పరిపూర్ణమయిన సముద్రమునుండి నీరు పదిదిక్కులను బ్రవహించునట్లె రాజకులమునుండి ధనమును భూమియందుఁ బర్వుచున్నది. ఈ పుడమి దిలీపునిదిగా నుండెను; నృగునిదిగా నుండెను; నహుషునిదిగా నుండెను; అంబరీషునిదిగా నుండెను; మాంధాతదిగా నుండెను. అదియే నీయందు నున్నది. రాజా! సమస్త విధములయిన దక్షిణలుగలదై మిక్కిలియు ద్రవ్యమువెచ్చించి చేయునట్టి యొకయాగము నీకుఁ బ్రాప్తించియున్నది. నీవు దానినియజింపకపోయితివా రాజ్యమువలని పాపము నీవు పొందుదువు. ఎవ్వారిరాజు దక్షిణలతో నశ్వమేధమనెడి యాగముచేయునో వారందఱు నతని యవభృథంబునందుఁ బరిశుద్ధులగుదురు. విశ్వరూపుఁడయిన యీశ్వరుఁడు నశ్వమేధ మనెడిమహాయాగమందు సమస్తప్రాణులను వ్రేల్చెను. అట్లే తన్నును దాను వ్రేల్చుకొనెను. ఇదియె శాశ్వతమయిన విభూతిమార్గము. దీనికంతము లేదని వినుచున్నారము. రాజా! మహాజనులు పోయినదారినే పొమ్ము. చెడుదారిని బోకుము' అనెను. ఇది యెనిమిదవయధ్యాయము.

ధర్మరాజపర్వము.

ధర్మరాజు రాజ్యమువలన వెగటునొందుట.

ధర్మరాజర్జునునిఁజూచి 'మనస్సును జెవినినంతరాత్మయందు లీనముచేసి మొదట గడియసేపు మనసు నొకచోట దిటగా నిలిపి యుండుము. పిదప వింటివేని నామాట నీకు రుచించును. గ్రామ్యసుఖములను దిగవిడిచి, పెద్దలసమూహము పోవం దగిన మార్గమును బొందనున్నాను. నీకొఱకు మరల నా రాజ్యమును నొకప్పుడును బూనను. క్షేమకరమయినదియు నొంటరిగఁ బోవఁదగినదియు నయినమార్గ మేమున్నదని నన్నడుగుము. అట్లడుగ నొల్లవేని నీవడుగకున్నను నే నయిచెప్పెదను వినుము. విషయ సుఖముల నాచరించుట విడిచి, పెనుతపము సలుపుచు నడవియందు, ఫలమూలములఁ దినుచుఁ, గాలముదప్పక యగ్ని వ్రేల్చుచు, రెండుప్రొద్దులును స్నానముచేయుచు, శరీరము కృశించి, కొలఁది యాహారముగలిగి, తోలును నారచీరలును జడలునుదాల్చి, చలిగాలి యెండలకోర్చి, యాఁకలిదప్పులను బడలికలను దాళికగలిగి, శాస్త్రోక్తమయిన తపమున శరీరమును శోషింపఁజేయుచు, మనస్సునకును జెవికి నింపయిన యడవిమృగములయుఁ బక్షులయుఁ బలువగల యుల్లాసంపు: బలుకుల నెప్పుడును వినుచును, పూచిన ప్రాఁకులయుఁ దీఁగలయుఁ గమ్మని తావులు మూరుకొనుచును, నానారూపములు గలిగి సొగసులు గులుకుచునున్న యడవులందలి జంతువులను జూచుచు, నరణ్యమందు మృగములతోడ సంచరించెదను. నదీ తీరములందు వసించు వానప్రస్థజనులను దర్శించుటయేకాక, వారలకేమియు

నప్రియమును జేయననఁగా నిఁక గ్రామమున వసించు వారివిషయమై యప్రియముచేయననుట చెప్పవలయునా? రహస్యమున యోగాభ్యాసముచేయుచు, ధ్యానము సలుపుచుఁ, బక్వమైనట్టియు కానట్టియు పదార్థములచే బ్రదుకుచుఁ, బితరులకును దేవతలకును నడవియందలి వస్తువులచేతను వాక్కులచేతను(వేద మంత్రములచేతను) జలములచేతను, దృప్తిగావించుచు, నింత క్రూరమును నింతకంటెను క్రూరమునయిన యరణ్యావాసుల శాస్త్రములవిధి ననుష్ఠించుచు, నీ మేనిముగియుక నెదురు చూతును. లేక నేను బ్రత్యేకముగా నొక్కొకవృక్షముక్రిందను నొక్కొక్కనాఁడు భిక్షమెత్తుచు ముండనముచేసికొన్న సన్న్యాసినై శరీరమును నశింపఁ జేసికొనెదను. దుమ్ములు మేనంతయు బ్రుంగియుండఁ,బాడుపడినయింట నిలుచుచుఁ,జెట్టుక్రిందేయునికి పట్టుగాఁగొని, ప్రియములయినవానిని నప్రియములయిన వాని నన్నిటిని విడిచి, శోకమును లేక సంతోషమును లేక, నిందించి నను నన్ను స్తుతించినను సమముగాఁ గొనుచు, ఆశయుడిగి, మమకారమునువదలి, ద్వంద్వమువీడి, పరిగ్రహమువాని, యాత్మస్వరూపమందు రమించుచు, మనస్సు కలంకవీడి,జడునివలెను గ్రుడ్డివానివలెను గుంటివానివలెను జూపట్టుచు, పరులతో నేన మయమందుఁగాని యెట్టి సల్లాపమును జేయకయు, జంగమములు స్థావరములు జరాయుజములు మొదలు నాలుగువగలుగా నున్న సమస్తప్రాణులకును హింసగావింపక, స్వధర్మములందుఁ దప్పక వర్తించుచు, నింద్రియముల శోషింపఁజేయుచు, నున్నప్ర జలయందు సమబుద్ధిగలిగి, దేనిని బరిహాసింపకయు, నేవిషయము ను గుఱించియు బొమలు ముడువకయు, ఎప్పుడును దెలివితోఁ

గూడిన మొగముగలిగి, సమస్తములయిన యింద్రియములను లెస్సగాఁ గట్టువఱిచియుండును. మఱియు నెవ్వనిమార్గమును నేమి యని యడుగక, యెవ్వనితోడను గలియక పలానిదని గుర్తించి యొక దేశమునకు నొక దిక్కునకును బోవఁగోరక, దిక్కును దేశమును నిదియదియని యుద్దేశించుకొని పోవక, పోవుటయందు నపేక్షలేక, మరలియుఁ జూడక, సత్యము పలుకుచు, ధ్యానముతోడఁ బోవుచు, స్త్రీరూపమును వర్జించుచు సంచరింతును. పూర్వకృత కర్మవాసనారూపమైన స్వభావము ముందఱ పోవుచున్నది. వలయు నాహారములు దొరకుచున్నవి. అయినను విరోధులయిన యీద్వంద్వముల నన్నింటిని జింతింపక, భుజింపఁదగినది కొంచెమైనను, జవిగలదైనను, ఒకవేళ మొదటిపట్టున దొరకక పోయినను, వేఱుచోటుల దొరకినవానిని దినుచు, దొరకక పోయినయెడ నేడుచోట్లయందు నిండించుకొనుచు, పొగలేనట్టియు, ఱోఁకటి దంపకములేనట్టియు, నిప్పారినట్టియు, జనములు దినినయట్టియు, పాత్రముల సంచారము కడచిపోయినట్టియు, బిచ్చగాఁడు లేనట్టియు, కాలమున రెండిండ్లయందో, లేక మూఁడిండ్లనో యవికానిచో నైదిండ్లనో యొకసారి భిక్షయెత్తుచు, స్నేహపాశమును విడఁదీసికొని, యీభూమియందుఁ ద్రిమ్మరుచును దొరకినను దొరకక పోయినను రెంటిని సమముగాఁజూచుచు గొప్పతపము సలుపుచు, బ్రతుకవలయుననికాని చావవలయునని కాని కోరునట్టి వానివలె నొకటియుఁ జేయకయు జీవనమును గాని మరణమునుగాని మెచ్చకయు రోయకయు, బాడిసతో నొకచేతిని జెక్కువానికిని జందనముతో నొకచేతిని బూయు వానికిని సెబ్బరగాని మంచిగాని తలంపకయు, బ్రతుకువాఁడు తన

యభివృద్ధికై చేయవలయు కార్యము లెవ్వియో వాని నన్నిటిని దిగవిడిచి, తప్పపాటు మొదలయిన త్రోసిపుచ్చరాని వానిని మాత్రము వర్తించుచు, వానియందును నెప్పుడును బట్టులేక, సకలములయిన యింద్రియవ్యాపారములన్నియు దిగవిడిచి, మనస్సునందలి సంకల్పమును బోయినదారిని విడువక 'బుద్ధికలుషములను జక్కఁగా శుద్ధముగావించి, సమస్తమయిన సంగములనుండి విడివడుదును. మఱియు వలలనన్నింటిని గడచి, యొకని వశమందును లేక, వాయువునకు సాటియైన ధర్మముగలిగి, రాగములనుడిగి, యిట్లు గ్రమ్మరుచు మనసునకు వలయుతుష్టిని బడయుదును. అజ్ఞానమువలనఁ గలిగెడి పేరాసచేత నేకదా మహాపాపముచేసినవాఁడనైతిని. కొందఱు మనునుష్యులు సేమము గలవియు సేమముగానివియుఁ బుణ్యాపాపములు గలసినవియు నయినకర్మములను గావించి కార్యకారణ సంబంధము గల జనులను (అనఁగా తమకార్యములకుఁ గారణభూతులుగాను, వారికార్యములకుఁ దాము గారణముగాను నుండుజనులను) బోషించెదరు. ఒకఁడాయువు తుదిని బ్రాణము క్షీణించిన యీ శరీరమును విడిచి యాపాపము ననుభవించుటకై చేకొనును. ఏలనఁగా నాకర్మఫలము కర్తకేకదా. ఇట్లు రథచక్రమువలెఁ జుట్టుచున్న సంసారచక్రము దీప్రాణిసమూహము కార్యము నిమిత్తమై ప్రాణిసమూహముతోఁ గలియుచున్నది. జన్మము మృత్యువు, ముసలితనము, వ్యాధి, వేదనయును వీనిచేతఁ బీడితమై దరిలేని సముద్రముంబోలి నిలుకడలేనున్న సంసారమును విడనాడువానికి సుఖముగలదు. స్వర్గమునుండి దేవతలు పడుటకును, మహర్షులు తమపదవిమాలి నశించుటకును వాస్తవ

మయిన కారణమును దెలిసికొన్న మనుష్యుఁడెవఁడు పుట్టుక (సంసారమున) కువ్విళులూరును ? రాజు, ఇహసుఖమందాస గలిగి యుండుటచే బహువిధ లక్షణములుగలిగి నానావిధ ము లయినకార్యములను జేసికదా యల్పులయిన రాజులచే కట్టువడుచున్నాఁడు. కాబట్టి తెలివియనెడి యీ యమృతము బహుదినములుగా నన్నుఁ బొందియున్నది. దానిని బడసి యవ్యయమును శాశ్వతమును నేకరూపంబునగు పదవినిగోరు చున్నాను. నే నిట్టిధైర్యముతోడ నెప్పుడును సంచరించుచు నిర్భ యమయిన మార్గమునొంది జన్మమరణ జరావ్యాధి వేదనము లచేఁ బీడితమయిన దేహమును దుదముట్టించెదను " అనెను. ఇది తొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజును భీముఁడు తేర్చుట.

భీముఁడు ధర్మరాజుతో 'రాజా ! క్షత్రియుఁడు మందుఁడై యర్థంపుఁ దెలివిలేనివాఁడగునేని గ్రుడ్డిపాఠముచే వానిబుద్ధికొ ట్టువడును. అట్లె నీబుద్ధియు విషయమును గలరూపునఁ గనుఁగొ నకున్నది. భరతసత్తమా ! సోమరితనమందు బుద్ధినిజెల్లించి నీవు దానిచే రాజధర్మములందు నసూయగలిగి యున్నవాఁడ వు. ఇట్టి నీకు ధృతరాష్ట్రునికొడుకుల నాశముసేయుటవలనఁ గలి గిన ఫలమేమి ? క్షత్రియులకుఁ దగుమార్గమునఁ బ్రవర్తించు వానికెవ్వనికిని, బంధువుగానుండినను, నీకుండునట్లు ఓరుపును, జాలియు, కరుణయు, మొగమోటమును నిట్లుండదు. నీదుబుద్ధి యిటువంటిదని మునుపే తెలిసికొనియుందుమేని మే మాయుధ

మును ముట్టియేయుండము; దేహమును విడుచుపర్యంతము భిక్షాటనమునే చేయుదుము. రాజులకు భయంకరమయిన యీయుద్ధమును జరిగియుండదు. సూక్ష్మదృష్టిగలవారు, ఈజగమంతయు బలిమిగలవానికి నన్నము (భోగ్యము) అని తెలియుదురు. స్థావరజంగమములన్నియు బలవంతుఁడగువానికి భోగ్యవస్తువులగును. క్షత్రధర్మము నెఱింగిన ప్రాజ్ఞులు, 'రాజ్యమును గయికొనువారికి విరోధులెవరో వారిని జంపవలయును' అని తెలిపెదరు. మన యన్నమునకు విరోధులును, గావుననే దోషవంతులు నయిన యాదుర్యోధనాదులు మనచేత హతులయిరి. వారిని నీవు ధర్మముననే చంపితివిగాన యీభూమి ననుభవింపవలయును.ఒక మనుష్యుఁడు బావిని ద్రవ్వి నీటిని బడయక పోవుటే కాక బురద చేతఁ బూయంబడినవాఁడునై మరలఁ బడినట్లు మన యీకార్యమగుచున్నది. పెద్దమ్రానిపయినెక్కి యక్కడనుండి తేనియ నుగొనివచ్చి దానిని గ్రోలక మృతినొందుటకు సాటిగా మన యీకార్యమున్నది.ఒకమనుష్యుఁ డాశచే దూరపుదారినిఁ బోయి వాఁడే యాశ యొడఁగూడక తిరుగుకొనుటకు సరిగా మన యీకార్యమున్నది. ఒకపురుషుఁడు బగవారిని బొరిపుచ్చి పిదపఁ దన్నును జంపికొనుటకు నెనఁగా మన యీకార్యమున్నది. పసిగొన్న వాఁ డన్నమును బడసియు నే కారణముచేతనేని దానిని భుజియింపక యుండుటకును, తాను గావించిన మించుఁ బోఁడిని బడసియు నిచ్చలు ననుభవింపకుండుటకును, బురుడుగా మనయీ కార్యమున్నది? నీవు మందమతివి. ఇట్టి నిన్ను 'ఇతఁడన్నగదా' యని వెంబడించు చున్నమమ్మే యీవిషయమున నిందింపఁదగి యున్నది. మేము చేతుల బలిమిగలవారము. విద్యలనెల్లఁ గఱ

చినవారము. మనస్సును మాకుఁగొప్ప. ఇట్టివారమయ్యు నశక్తులుఁబోలె మగతనములేని నీబోఁటి మాటకుఁ గట్టువడియున్నారమే! దిక్కులేని వారికిని దిక్కయి కాచునట్టి మేమే ధనము నష్టమయిన వారమయితిమేని, జనులు ధనము సమకూరుకొనుట నే విధమున నాలోచింపకుందురు? ఇది యెటువంటిదో కనుఁగొనుము. ముసలితనము గ్రమ్మినవాఁడును, పగవారిచే దుర్గతిపాలయిన వాఁడును, నాపత్కాలమందే కదా సన్న్యాసము చేయఁదగునని చెప్పఁబడుచున్నది. కాఁబట్టి మిక్కిలి ప్రాజ్ఞులయినవారు క్షత్రియులయందు సన్న్యాసమును గొనియాడుటలేదు. సూక్ష్మదర్శులగువారు సన్న్యాసమును ధర్మవ్యతిక్రమముగానే తలంచెదరు. క్షత్రియజాతియందుఁ బుట్టి, యందే నెలకొనియుండి దానినే యాశ్రయించి, యాజాతిధర్మమునే నిందించిపలుకుట యెట్లు? అధర్మమును గఱపినదానినే (దైవమునే) యేల నిందింపరాదు? సన్న్యాసము వేదము తెలియనివారిచేతను, ధనము లేనివారిచేతను, నాస్తికులచేతను ననుష్ఠింపఁబడునది. అది వేదము నర్థవాదముచేత వెలువడినది. అది సత్యమువలెఁ బయికిఁదోఁచునే కాని యనృతమే. సన్న్యాసమునుబూని తన్నుఁదానే భరించువాఁడు మిథ్యాధర్మమును నూఁదిమడియునేకాని బ్రతుకనేరఁడు. పుత్రపౌత్రులను, దేవతలను, ఋషులను, అతిథులను, పితరులను, తృప్తిపఱుపక యొంటిమెయి నడవులయందు హాయిగాజీవించుట కలవియగునేని, యట్లే మనుచున్న యడవి మృగములు స్వర్గమును జయింపవేల? పందులును జయింపవేల? పక్షులు గెలువవేమి? ఒంటిమెయి నున్నజనులు నయితము (పశుపక్ష్యాదులకులేని) మఱియొకప్రకారమునఁ దమకుఁ బుణ్యము

గలుగుటను జెప్పకొనలేదే? రాజుగానుండువాఁడు సన్న్యాసముచే సిద్ధినిబొందునేని పర్వతములును వృక్షములును శీఘ్రముగా సిద్ధిఁ బొందఁగూడును. ఇవియు స్త్రీసంగములేనివిగాను, దేహయాత్రకు వలయువస్తువొక్కటియు లేనివిగాను, ఉపద్రవము మాలినవిగాను నిత్యసన్న్యాసులుగాను గనఁబడుచున్నవే? కాఁబట్టి ప్రాణులు తమభాగ్యములవలన సిద్ధినిబొందవలయును. పరులకర్మములచే సిద్ధినిబొంద శక్యముగాదు. కావున, కర్మమే యాచరింపవలయును. కర్మము లేనివానికి సిద్ధిలేదు. కర్మము లేనివానికిని సిద్ధిగలుగునేని, జలమందున్న చేఁపలు మొదలయినవియు, స్థావరములయిన జంతువులును సిద్ధిని బొందవచ్చును. వానికి నాత్మయొక్కటియే రక్షింపవలయునది; కాని వేఱొక్కటి లేదేని లోకమెట్లున్నదో చూడుము. ప్రాణులు తమ తమ కర్మములవలననే నానావ్యాపారములు చేయింపఁబడుచున్నవి. కాఁబట్టి కర్మమే కర్తవ్యము. కర్మమును విడిచినవానికి సిద్ధిగలుగదు' అని చెప్పెను. ఇది పదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు గృహస్థధర్మము శ్రేష్ఠమని యుపపాదించుట.

అర్జునుఁడు ధర్మరాజునుజూచి 'భరతసింహమా! కర్మము మేలా? సన్న్యాసము మేలా? యనెడి విషయమునందే యింద్రునకును ఋషులకును సంవాదరూపముగా జరిగిన పురాతనమయిన యితిహాసము నుదాహరించెదను. మంచి కులమునఁబుట్టి సంపత్తి

పెంపుగలిగి, ధర్మమాచరింపఁదగువారయిన కొందఱు బ్రాహ్మణులు మతి తక్కువయగుటచే మీసలు మొలవనిప్రాయమందే సన్న్యాసము మంచి ధర్మమనియు, దానివలన నడవులందు సుఖముగా జీవింపఁగూడుననియుఁ దలంచి తోఁబుట్టువులను దలిదండ్రులను గృహములను దిగవిడిచి యడవికిఁబోయిరి. వారియెడ నింద్రునకుఁ గనికరము కలిగెను. అతఁడు బంగారుమయమయిన యొకపిట్టయై యాబ్రాహ్మణులనుజూచి 'హోమము చేయఁగా మిగిలిన విఘసమును భుజించు మనుష్యులు చేయునట్టి పుణ్యమును మఱియెవ్వరికిని జేయ శక్యముగాదు. వారల కర్మము పుణ్యమయినను జీవితమును బ్రశస్తమయినది. వారలు కోరినవి సిద్ధినొందువారు. కర్మమును ముఖ్యముగా నూఁదినవారే యుత్తమమయిన గతినిబొందుదురు ' అనెను. అందులకు (విఘసమనఁగా నెండిరాలిన తృణపర్ణఫలాదులు గాన దానిని భుజించు తామే విఘసాశనులని యర్థము గ్రహించికొని) 'ఆహా! సంతోషము! ఈ పక్షి విఘసమును భుజించువారిని బొగడుచున్నది. కాన యిది మనలనే తెలుపుచున్నది. సందేహము లేదు. మనము విఘసమును భుజించువారము ' అని మాటలాడుకొనిరి. అందులకాపక్షి 'నేను ఱొంపిపూఁతగలిగి దుమ్ములబ్రుంగుచు నెంగిలిని దినుమను బుద్ధిహీనులై యున్న మిమ్ముఁ బొగడలేదు. విఘసమును భుజించువారు వేఱు' అనెను. ఋషులు 'మేమిది మేలయిన దారియని తలంచియుంటిమి. పక్షీ! నిన్ను నమ్మెదము. మాకెద్ది మేలయినదో చెప్పుము ' అని యడిగిరి. పక్షి 'మీరు లోపల నొకటిగాను వెలుపల నొకటిగాను నున్నట్లు మిమ్ము రెండువిధములుగా వేఱుపఱుచుకొని నన్ను గుఱించి సందేహింపక యుందురేని

మీకు యథార్థమును హితముసయినమాట చెప్పెదను' అనెను. అందులకు ఋషులు 'ఓధర్మాత్మా! నీకు శ్రేయస్సుమార్గములు తెలిసియున్నవి. కాన నీమాటను వినెదము. నీకట్టడయందే నిలిచియుండఁ గోరుచున్నారము. మమ్ముఁ గఱపుము' అనిరి.

పక్షి వారలతో 'నలుకాలివానియందు గోవు హెచ్చు. లోహములందు బంగారుమేలు. శబ్దములందు మంత్రము (వేదము)మేలు. రెండుకాళ్లవానియందు బ్రాహ్మణుఁడు మిన్న. బ్రాహ్మణునకు జన్మము మొదలుకొని మరణమువఱకు, నయ్యై కాలములకనుగుణముగా, జాతకర్మము మొదలుకొని శ్మశానమునందుఁ గావింపఁబడు నంతకార్యము వఱకుఁగల యన్ని మంత్రోక్త సంస్కారములు విధింపఁబడియున్నవి. బ్రాహ్మణునకు వేదమునందు విధింపఁబడిన కర్మములు, స్వర్గమునకుఁ బడయుటకయిన మార్గము లన్నింటియందును మేలయినమార్గము. కర్మములన్నియు మంత్రసిద్ధములని వేదవాక్యములు దృఢముగాఁ జెప్పుచున్నవి. అట్లె యీ కర్మమార్గమందుఁ బక్ష(దైవత)ములు మాస(దైవత)ములు, ఋతుదైవతములు మొదలయినదేవతలను బురస్కరించుకొని చంద్రమండలమనెడు పితృలోకపదవి, సూర్యమండలమనెడు దేవలోకపదవి, సంసారము నుత్తరింపఁజేయు పరమాత్మపదవి యనెడు మూఁడువిధములయిన సిద్ధులు పడయంబడుచున్నవి. ప్రాణులు కర్మమునే యనుభవించుచున్నవి. కర్మపద్ధతినె కొనియాడువారికి నీకర్మము సమస్తసిద్ధులును బడయఁ గూడినపుణ్యక్షేత్ర మగును. ఈ కర్మపద్ధతియే పెద్దయాశ్రమము. ఈ పెనుకర్మపద్ధతిని నిందించి వేఱొకచెడుతెరువును బొందినట్టి మూఢులును నర్థహీనులు నయినయట్టిమనుష్యు

లకుఁ బాపమేకలుగును. పూర్వోక్త మయినకర్మపద్ధతిని వదలి శాశ్వతములయిన దేవపదవి పితృపదవి బ్రహ్మపదవి యనెడుస్థితులను దిగవిడిచి యుండువారు మూఢులగుదురు. వార లా కారణముంబట్టి కుక్క నక్క పులు మొదలయినవాని పుట్టుకకుఁదగిన యశుద్ధములగు మార్గములను బొందుదురు. 'ఇచ్ఛేదను' అని వేదవాక్యముచే విధింపఁబడిన యీకర్మగతి యుపాసనముతోఁ గూడి మీరుండవలయును. కాఁబట్టి యీకర్మపద్ధతియం దుండువారే తపస్వులని వేదమునందుఁ జెప్పఁబడుచున్నది. శాశ్వతములయిన దేవకార్య పితృకార్య బ్రహ్మకార్యములను గురుకార్యమును విభజించి చేయునట్టికర్మమే దుష్కరమయిన తపమని చెప్పఁబడుచున్నది. దుష్కరమయిన కర్మమును జేసియే దేవతలు మేలయిన విభవమును బొందిరి. కాఁబట్టి దుష్కరమయిన గృహస్థాశ్రమమును మీరు దాల్పవలయునని మీ కుపదేశించుచున్నాను. ప్రజలకు (సంతానములకు) నీకర్మమే మూలము. కాఁబట్టి యిదిగొప్పది. ఇందులకు సందేహము లేదు. కుటుంబవిధిచొప్పున నీకర్మమం దన్నియు నెలకొనియున్నవి. ద్వంద్వములను దిగవిడిచి మాత్సర్యము లేకయుండు బ్రాహ్మణులు, ఈ గృహస్థాశ్రమము దపస్సని తెలియుదురు. లోకములందు వనమధ్యమునందుఁ జేయునట్టి తపము దీనికిఁ బిమ్మటిదేయని చెప్పఁబడుచున్నది. విఘసాశులగువారు పరులకుఁబొంద నలవిగానిపదమును బొందెదరు. తమకుటుంబమందు రేపును మాపును రెండుపూఁటలును విధ్యుక్తముగా నన్నమును విభజించి, అతిథులు, దేవతలు, పితరులు, స్వజనులను వీరికినిడి మిగిలినదానిని భుజించువారు విఘసాశు లని చెప్పఁబడుదురు. కాఁబట్టి తమరు స్వధర్మ

మయిన కర్మమార్గమందుండి సువ్రతులును, సత్యవాదులును, లోకమునకు గురువులునయి సంశయమునూలియుందురు. దుష్కరమయినకర్మమార్గమును గావించుజనులు మూండవది యగు నింద్రలోకమునుబొంది స్వర్గలోకమందు మచ్చరముపీడి పెక్కుకాలము వాసముచేయుదురు' అనెను. ధర్మార్థసహితము ను హితమునయిన యామాటలనువిని వారు నాస్తికబుద్ధిని విడిచి గృహస్థధర్మమును గయికొనిరి. కాంబట్టి నీవు సర్వజ్ఞుండవు; పురు షతిలకుండవు. నీకుం దెలియని దేమున్నది. నీవు సయితము దృఢధైర్యము నవలంబించి శత్రువులందఱును హతులయి య కంటకముగానున్న యీ భూమినంతయుః బరిపాలింపుము' అనె ను. ఇది పదునొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజునకు నకులుండు చెప్పుట.

అర్జునుండు చెప్పినది విని యంత సమస్తధార్మికులయందును మిన్న యగుధర్మరాజును జూచి, మిక్కిలి ప్రాజ్ఞుడును విశాలవ క్షుండును మహాభుజుండును మితభాషియు నగునకులుండు దుః ఖమున మొగ మెఱ్ఱంబాఱ, నన్నయగు నర్జునుని చిత్తము చొప్పు ననుసరించి 'మహారాజా! విశాఖయూపమను క్షేత్రమందు సమస్తదేవతలును గట్టిన యాగాగ్నిస్థలము లిటికలతోంగట్టంబ డినవి యిప్పటికిని జూపట్టుచున్నవి. కాంబట్టి దేవతలు కర్మఫల మునందు నెలకొన్నవారని తెలియును. (దేవత్వమును గర్మఫల మేచుమీ.) ఆస్తికులుకాని ప్రాణులకును సయితము (వర్షమూల

మున) నన్నమునిచ్చు తండ్రులయిన దేవతలును గర్మమునే చేసి దరు. రాజా ! విధియెట్టిదో చూడుము. అర్జునుఁడుదాహరించిన వేదమును దిగవిడిచిన యాబ్రాహ్మణులను మిక్కిలియు నాస్తికులని యెఱుంగుము. బ్రాహ్మణుఁడు వేదమందుఁ జెప్పఁబడినది దిగవిడిచి తక్కిన సమస్తకర్మములచేతను దేవయానమను మార్గమున స్వర్గముమీఁదిమేరయగు బ్రహ్మలోకమును బొందఁజాలఁడు. వేదముల నిశ్చయము తెలిసినవారును శాస్త్రములను జక్కఁగాఁ గఱచినవారు నయినబ్రాహ్మణు లీ గృహస్థాశ్రమము సమస్తములయిన యాశ్రమములకంటె శ్రేష్ఠమయినదని చెప్పెదరు. వారివలన నీ విది తెలియుము. ధర్మముచేతఁ బొందఁబడు ధనముల నుత్తమములయిన యాగములందుఁ దానముచేయుమనుష్యుఁడే మనస్సును జయించినవాఁడు. ఆ మనుష్యుఁడే యన్నివిధములైనత్యాగము గలవాఁడు. మహారాజా ! గృహస్థధర్మమందు సుఖభోగమును బాటింపకయట్లే యడవియందు గొప్పనిష్ఠను బొందినవాఁడై శరీరమును విడుచువాఁడు * తామసత్యాగియగును. ఇల్లువూలి, బిచ్చమునకుఁ దిరుగాడుచు వృక్షమునీడయే పట్టుగాఁగొని మననముచేయువాఁడును, ఎప్పుడును యోగముగలవాఁడును, పరులను యాచింపనివాఁడును, నగువాఁడు, సన్న్యాసమునకుఁ దగిన (భిక్షుకున కగు) త్యాగముగలవాఁడు. కోపమును సంతోషమును విడిచి, విశేషించి పరులదూషించుటయుమాని, బ్రాహ్మణుఁడెవఁడు వేదము నధ్యయనముచేయునో, వాఁడు గురుపూజకుఁ డయినత్యాగియగును. రాజా !

* 'స త్యాగీ తాపసో మతః' అని పాఠాంతరము. 'తామసోమతః' అని యిట పాఠము కయికొనఁబడినది.

ఎఱుకగలవారు సమస్తము లయినయాశ్రమములనుం ద్రాసునం దుం దూంచి మూండాశ్రమము లొకప్రక్కను గృహస్థాశ్రమ మొకప్రక్కను దూంగునని చెప్పుదురు. కామము నుస్వర్గమును సమముగానుండుటనుజూచి, లోకవృత్తము నెఱింగిన మహర్షులకు నీగృహస్థాశ్రమమే మంచిమార్గమనియును మంచిగతియనియు నెవండుభావించునో వాండు త్యాగియగును. భరతసత్తమా! ఒకండు గృహములను దిగవిడిచి యడవికిం బోయి నపిదప మూఢునివలె నొకసమయమున భోగములను దలంచుకొనునేని, వాండు ధర్మవేషమును బూనినవాండగును. వీనిని మృత్యువు తనపాశముచే గంఠమునం గట్టి యీడ్చును. మహారాజా! ఆశను మున్నిడుకొని చేయు కర్మము ఫలములేనిదని చెప్పంబడును. ఆశను ద్యజించి చేయుకర్మమంతయు మహాఫలము గలదగును. శమము, దమము, ధైర్యము, సత్యము, శౌచము, ఆర్జవము, యజ్ఞము, ధృతి, (ఉత్సాహము) ధర్మము ననెడియివి ఋషులకు వలయు నిత్యవిధి యని చెప్పంబడుచున్నది. ఈ గృహస్థాశ్రమమందు పితరులు, దేవతలు, అతిథులు ననెడి వీరికొఱకనుతలంపునంజేయు ప్రయత్నము శ్లాఘింపంబడుచున్నది. మహారాజా! గృహస్థధర్మ మనెడి యీ మార్గమందే ధర్మార్థకామములు మూండింటిఫలమునుం దప్పక కలదు. అభిమానమును విడిచి బ్రాహ్మణులనుపూంచెడి యీ విధిచొప్పునం బ్రవర్తించువానికి నెయ్యెడను నాశముగలుగదు. ధర్మాత్ముండును గల్మషరహితుండును నగుబ్రహ్మ పలువిధములయిన దక్షిణలు గలయాగములచే మనల నారాధింతురని కదా ప్రాణులను సృజించెను. యాగముకొఱకే చెట్లను జేమలను నోషధులను నట్లే పరిశుద్ధములయిన పశువులను, హవిస్సులను

సృజించెను. యాగమనెడి యాకర్మము గృహస్థాశ్రమముగలవానికే చేయఁదగినది. కాఁబట్టి గృహస్థాశ్రమ మొక్కటియే పొందుటకును జేయుటకు సరిదియైనది. అటువంటి గృహస్థాశ్రమమునుబొంది పశువులను ధాన్యములను ధనములను బడసి యెవరు యాగముచేయరో వారలయందుఁ బాపము నెలకొనియుండును. కొందఱు ఋషులు వేదాధ్యయన మను యజ్ఞమే చేయుదురు. మఱికొందఱు జ్ఞాన మనుయజ్ఞముచేయుదురు. వేఱుకొందఱు మనస్సునందే యోగమనెడి పెనుయజ్ఞమును జేయుదురు. మహారాజా! విద్వాంసులు నాకు మఱియొకటిని జెప్పియున్నారు. అదియేదనఁగా—ఈజగము కలుగుటకుఁ బూర్వము, భూమి, అప్పు, తేజస్సు, వాయువు, సూర్యుఁడు చంద్రుఁడు, నక్షత్రములు దిక్కులు, కాలము, శబ్దము, స్పర్శము, రూపము, రసము గంధమనునివి యొక్కటియుఁ గలుగవు. వీనిని దెలుపునట్టి ప్రత్యక్షము అనుమానము, ఉపమానము, ఆగమము, అర్థాపత్తి, ఐతిహ్యము, అను ప్రమాణములును దృష్టాంతమును లేవు. ఎందును సందేహమును నిశ్చయమును లేవు. ధర్మమును నధర్మమును గలుగవు. దేవతలు, మనుష్యులు, స్థావరము, జంగమము, జాతి విభాగములును, ఆశ్రమ విభాగములును, చేయువాఁడును, కోరువాఁడును, ధనమును, సంపత్తియు, వానిఫలము నొక్కటియుఁగలుగదు. ఈలోకమంతయుఁ బ్రకాశముమాలి చీఁకటిగానేయుండెను. ఆత్మయుండియు మనస్సుతోడి కూడికను గోరినదిగాదు. మనస్సు జ్ఞానములేనిది. ఆత్మయొక్కటియే జ్ఞానముగలది. ఈప్రపంచమంతయు వ్యాపించియుండు నొక్కఁడగు నీశ్వరుండు ప్రాణులకును మంత్రములకును దగిన రూపమును గలి

గింపలేదు. మంత్రములను దేవతలయి వెలుంగు సృష్టికర్తలని పేరొందిన కొందఱు ఋషులక్కాలమం దీశ్వరునిచేఁ గల్పింపఁబడిరి. వా రీశ్వరునివలననుండి తగిన జ్ఞానమునుబడసి యీ బ్రహ్మాండమును గల్పించి విశ్వసృజమనెడి యాగమును గావించి పితామహుండను నొకనిని బుట్టించిరి. ఆ పితామహుఁ డీశ్వరుని యనుగ్రహమువలన నీలోకసృష్టికిఁ దొడంగెను. ఈలోకపు జ్ఞానమంతయు నీశ్వరుని జ్ఞానమే. ఈశ్వరుండయిన యాశంభుఁడు తనశక్తిచే నీజగమునంతయు వ్యాపించియున్నాఁడు. ఆ యీశ్వరునిచేఁ బ్రలయకాలమందు బ్రహ్మకు ధర్మార్థ కామ మోక్షములు పదేశింపఁబడి యున్నవి. జ్ఞానము మాలినవియు, శక్తిలేనివియు సుఖదుఃఖములకుఁ బట్టయినవియు నగుటచే జంతువు లీశ్వరునిచేఁ బ్రేరితములయి స్వర్గమును నరకమును బొందుచున్నవి. ప్రాణు లీశ్వరునిచేతను మనస్సుచేతను విషయములచేతను గర్మములచేతను బ్రేరితములై ప్రకృతిని బురుషునిని సుఖదుఃఖములను నొందుచున్నవి. దేవతలు, అసురులు, గంధర్వులను పిశాచోరగం కూడిన యీ లోకమును సృజించిన యీశ్వరుఁడే జాతిని, ఆశ్రమములను వీని యంతర్భేదములు నేర్పఱిచి యున్నాఁడు. మహారాజా! నీవును దక్కినవారును నేవిధమునఁ జూచినను గాని యీశ్వరుని వశమం దుండు వారలేకాని వేఱు గారు. ప్రాణులన్నియు నా యీశ్వరునివశమం దుండియే జీవమును మరణమును బొందుచున్నవి. దేవతలు ప్రాణులను నీలోకమును జంపి యాగముచేసెదరు. వారు పాపము నెంత మాత్రమును బొందరు. దేవతలకయినను, ఋషులకయినను, గృహస్థాశ్రమమును బొందినవా రెవరికిఁగాని కర్మములు హింస

గలవిగానే యున్నవి. ఆకర్మమును జేయు గృహస్థు లుత్తమ మయినగతిని బొందెదరు. తొల్లి రాజులు ప్రజలకును దమకును హితముగోరి పెక్కుచోట్ల శత్రువులను గూల్చియున్నారు. రాజా! అందుఁ బాపముగలదేని వారెట్లు స్వర్గమునుబొందిరి? అట్టి పాపములచేతఁ జుట్టంబడియే నరకమును బొందరయిరి? కాఁబట్టి గృహస్థాశ్రమములందుదోషమొకటియుఁ గలుగదు. అది గొప్పది! యని యిట్లు మనస్సునకు సమాధానము చేసికొని యీ కర్మమార్గమం దుండి బ్రహ్మను బొందువారగు బ్రాహ్మణులు మొద లయినవారినిఁ జూచి దేవతలు నట్టివారిస్థితికి నాశపడుదురు. అంతయు నీవెఱుంగుదువు. అందందు సంపాదించి తెచ్చిన విచిత్రములగు రత్నములను యజ్ఞములందు దానముసేయుటకుఁ బ్రయత్నింపక నాస్తికవాదములు పలుకుచున్నావే! రాజా! కుటుంబమును జెందినవానికి త్యాగము కలుగుట యరిది. కాబట్టి బ్రాహ్మణులు మిక్కిలి పూజించునట్టి రాజసూయము, అశ్వమేధము, సర్వమేధము మొదలుగాఁగల తక్కిన యజ్ఞములను దేవరాజగు నింద్రునివలె యజింపుము. ప్రాలుమాలిక యనెడు తనదోషముచేత, దొంగలు దోఁచుకొని బాధించుచున్న ప్రజలను రక్షింపకుండు రాజెవఁడో యతఁడె కలి యనఁబడును. మనమో దాయాదుల పట్లమనసున మచ్చరముగొని యింతలు సేసిన వారము. ఇందులకుఁగాను అలంకరింపఁబడిన గుఱ్ఱమును, ఏనుఁగును, గోవులను, దాసీలను, గ్రామములను, పల్లెలను, క్షేత్రములను, గృహములను, బ్రాహ్మణులకు దానముసేయక యుందుమేని రాజులని చెప్పఁబడు కలులు కాఁగలము. ఇట్లు మనమొకరికిని బెట్టక యెవరినిని గావక వట్టి

రాజపాపములకుఁ బాలయి యుందుము గాన దుఃఖమునే కుడువఁగలము! కాని సుఖమును బడయుట గలుగదు. ప్రభూ ! మహాయజ్ఞములును బితృశ్రాద్ధములును జేయక, బుణ్యతీర్థములందుఁ గ్రుంకులిడక, యూరువిడిచి సన్న్యాసివై పోవుదువేని, యిహమునకును బరమునకును రెంటికిని దొలఁగి పిశాచమవై గాలిచిమ్మఁగా చెల్లాచెదరయిన మేఘమువలె నాశమును బొందఁగలవు. లోపలఁగాని వెలుపలఁగాని మనసునకుఁ జింతగలిగించు వస్తువును దేనిని గాని మనస్సుచేతఁ దిగవిడిచినవాఁడు త్యాగి (సన్న్యాసి) యగును. ఇల్లువిడిచి వెలువడినవాఁడు సన్న్యాసి కాఁడు. మహారాజా ! బ్రాహ్మణులును నుపాసించునట్టి యీ కర్మమార్గమందు వర్తించువానికి నెచ్చటను జెఱుపుగలుగదు. యుద్ధమందిందుఁడసురసైన్యమును హతముగావించినట్లు పెంపుసొంపారు శత్రువులను బలిమిమెయిం దునుమాడి, పూర్వులచేఁ బ్రోక్తమయినదియు శిష్టులయిన రాజులచేత ననుష్ఠింపఁబడినదియు నయిన స్వధర్మమం దాసక్తుఁడయి యుండువాఁ డెవఁ డిట్టిశోకమును బొందును ? క్షత్రియధర్మముచొప్పునఁ బరాక్రమము మెఱసి యీ భూమిని గెలిచి, వేదవిదులకు దానములొసంగి యాసుకృతమువలన నాకపృష్ఠమును బొందఁగలవు ఇట్టి సమయమున నీవు శోకించుట యెంతమాత్రముతగదు !' అనెను. ఇది పంద్రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

సహదేవుఁడు ధర్మరాజునకుఁ జెప్పినది.

సహదేవుఁడు ధర్మరాజునుజూచి 'రాజా ! (దారపుత్రాదుల

యిన) బాహ్యవస్తువులను దిగవిడుచుటవలన సిద్ధిగలుగదు. శరీరమందుఁగల (కామక్రోధాదులగు) వస్తువులను విడుచుటచే సిద్ధి కలిగినను గలుగవచ్చును. బాహ్యవస్తువులనుండి విడివడినను, శరీరమందలి వస్తువులందు సక్తిగలవానికి నేధర్మమును సుఖమును గలుగునో యాధర్మమును సుఖమును, నట్లె మనవిరోధులకుఁ గలుగుఁగాత. శరీరమందలి వస్తువులను విడిచి భూమిని బాలించువానికిఁ గల ధర్మమును సుఖమును నట్లె మనసుహృదులకుఁ గలుగుఁగాత. * రెండక్షరములుగలది. మృత్యువు (మార్గము) అగును. మూఁడక్షరములుగలది శాశ్వతమయిన బ్రహ్మమార్గమగును. 'మమ' (నాది) అను రెండక్షరములు గలది మృత్యువు. 'న మమ' (నాదికాదు) అను మూఁడక్షరములుగలది శాశ్వతమయిన బ్రహ్మము. కాఁబట్టి రాజా ! బ్రహ్మము మృత్యువుననెడి యీరెండును గానంబడకయే మఱఁగి బుద్ధియందు నెలకొనియుండి ప్రాణులను దమవశము చేసికొనుచున్నవి. సందేహము లేదు. శరీరమునకు నాశముకలిగినను గాని శరీరమునందుఁగల (యాకర్తృత్వధర్మముగల) బుద్ధికి నాశములేదనుట నియతమేని శరీరమును విడుచుటవలనఁ బ్రాణులకు నేహింసయుఁ గలుగరాదు. ఈశరీరముతోఁ గూడనే బుద్ధికిని నుత్పత్తివినాశములు గలుగునేని యీశరీరము పోయినతోడనే బుద్ధియుఁ బోయినదగును. అట్లగునేని, యీకర్మపథము వ్యర్థమేయగును. కాఁబట్టి తెలివిగలవాఁడిందొక నిశ్చయమును గయికొనక పూ

* ఇందులకు మూలము 'ద్వ్యక్షరస్తు భవేన్మృత్యు స్త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్ । మమేతి ద్వ్యక్షరో మృత్యుర్న మమేతిచ శాశ్వతమ్' అని తెలియు. నది 'మమ' అని స్వీకారము, 'నమమ' అని పరిత్యాగము.

ర్వాలును వారికిఁ బూర్వులును నయిన సత్పురుషు లనుష్ఠించు మార్గమునే సేవింపవలయును, ఈకర్మమార్గ మథమముగా నుండినదేని స్వాయంభువమనువును నట్లె తక్కిన పెక్కండు చక్రవర్తులును నేల దీనిని ననుష్ఠించిరి?కృతయుగము త్రేతాయుగము మొదలయిన కాలము బహుతరముగా మంచిగుణములు గలవి. ఆకాలములందుఁ గలరాజులు విశేషముగా నీ భూమిని బాలించిరి. స్థావరజంగమములతోఁగూడ నీ భూమిని బడసియు దీనిని లెస్సగా ననుభవింపనిరాజు బ్రతికియుండి ఫలమేమి? లేక యడవికిఁబోయి యందలి వస్తువులచే బ్రతుకు మనుష్యునికి ద్రవ్యములందు మమతగలుగునేని వాఁడు మృత్యువు నోరఁ జిక్కినవాఁడగును. లోపలను వెలుపలను గలవస్తువుల స్వభావమును జూడుము. ఎవరు దాని కలరూపును గనుదురో వారు మహాభయమునుండి విడివడుదురు. నాకుఁ దండ్రియుఁ దల్లియుఁ దోఁబుట్టువును గురువు నన్నియు నీవే. దుఃఖముచేఁ బ్రేలిన నాపలుకులను నీవు సయింపవలయును. భరతసత్తమా! నే నాడిన దంతయు తథ్యముకానీ, యతథ్యముకానీ, యవి,భక్తిచేతఁ జెప్పఁబడినవని మాత్రము తెలియుము' అనెను. ఇది పదుమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ద్రౌపది ధర్మరాజునకుఁ జెప్పినది.

ధర్మరాజు తనతోఁబుట్టువులు నానావిధములయిన యాయా వేదసిద్ధాంతములను జెప్పుచుండఁగాఁ దానేమియుఁ బలుకకయుం

డెను. అదిచూచి గొప్పకులమునఁ బెంపారఁబుట్టిననారీరత్నము, వాలుంగన్నులు గలశ్రీమంతురాలు ద్రౌపది యతనితోఁ బలుకఁ దొడంగినదయ్యె. సింహములును బెబ్బులులుంబోని తమ్ములు తన్ను బలసి యుండఁగా నేనుంగులు బలసియున్న యూథపతివలె వెలుంగుచు నారాజవృషభుం డుదాసీనుండై యుండెను. ఆబిడకు విశేషించి యతనియం దభిమానము గలిగియుండును. ఆ రాజు నా చెలువను నెప్పుడును లాలించుచుండును. మఱియు నాపడఁతి ధర్మాధర్మముల నెఱింగినది. ఆసుశ్రోణి భర్తనుజూచి మిక్కిలి చెలువయిన తిన్ననిపలుకుల నతనితో 'రాజా! వీరుగో నీతమ్ములు కంది కుందుచున్నారు చూడు. చాతకములవలె మాటిమాటికి వాపిడుచుచు నిలుచున్నారు చూడుము. వీరిని బాటింపవు. మహారాజా! మదపుటేనుఁగులుం బోలె మత్తిల్లియున్నవీరు విడువక దుఃఖములపా లయి యుండినవారు గాన యుక్తియుక్తం బగుమాటచెప్పి వీరిని సంతోషింపఁజేయుము. రాజా! మునుపు ద్వైతవనమునందు నీతమ్ములు వీరు చలికిని గాలికిని నెండకును గంది కుంది యుండఁగా నందఱనుజూచి 'మనము దుర్యోధనుని యుద్ధమునఁ జంపి సమస్తములయిన కామములచే నిండారియున్న యీ భూమండలము ననుభవింతము. అరిందములారా! మనము యుద్ధమున జయమునొందఁదివిరి వీరపురుషులను, రథములను, మహాగజములను, హతములు గావించి భూమిని రథములచేతను రాతులచేతను గలయంగప్పి, యీ ప్రదక్షిణలచేఁ బెంపుసొంపారునానావిధయజ్ఞములును యజింతము. వనవాసమునం బడిన దుఃఖమంతయు మనసుఖమునకే యగును' అని యిట్లెల్ల చెప్పితివి. ?

వారి కిట్లుచెప్పియును నీవును ధార్మికులం దుత్తముఁడవై యుండియును మరల మామనంబులను నొప్పించెదవేల ? పందయగువాఁడు భూమిని బాలింపఁజాలఁడు; ధనములను ననుభవింపఁజాలఁడు. పందయుంటఁ బుత్రులు, శ్రోత్రియుందుఁ జేపలవలె బాగుగనుండఁజాలరు. దండనీతి యెఱుఁగని క్షత్రియుఁడు విలసిల్లఁడు. దండములేనివాఁడు భూమిని బడయఁజాలఁడు. దండములేనిరాజును నండగొన్న ప్రజలును సుఖమునొందఁజాలరు. దేవతలు, అసురులు, గంధర్వులు, అప్సరసలు, రాక్షసులు, గుహ్యకులు, నాగులు, మనుష్యులు ననెడి వీరిచేత భూషితమై ధర్మార్థకామములచే సంపూర్ణమై యున్నయీజగమంతయు దండముచేత నడంచి యనుభవింపఁదగినదిగా నున్నది. రాజా ! స్వయంభువువలన నుండివచ్చిన శాశ్వతం బగునీతిశాస్త్రమును వినుము. ఇది బ్రాహ్మణు లెల్లవారికిని మీకును దెలిసినవిషయమే. రాజు లేకయుండినచో, నీలోకము భయముగొని నలుగడలఁ బరుగిడిపోవునని దీనిని రక్షించుటకై యీశ్వరుఁడు తా నింద్రు, డగ్ని, యముఁడు, వాయువు, సూర్యుఁడు, వరుణుఁడు, చంద్రుఁడు, కుబేరుఁ డనువీరల శాశ్వతములయిన తేజస్సు నంశములనొకటిగాఁజేర్చి మహాకాయుండును, మహావీర్యుండును, జగత్తును బరిపాలించుటకుఁ శక్తుండును నగురాజును సృజించెను. దేవేంద్రుఁడు మొదలయిన వీరల యంశములవలన రాజు పుట్టుచున్నాఁడు గావున నతఁడు తనతేజముచే సమస్తప్రాణులను నడంచుచున్నాఁడు. రాజు సూర్యుఁడుంబోలెఁ గన్నులను మనంబులను దపింపఁజేయును. భూమియం దెవరుగాని యతనిని దేఱిచూడఁజాలరు. ఆరాజు లోకమున నగ్నియు, వాయువును, సూర్యుఁడు

ను, జంద్రుఁడును, యముఁడును, వరుణుఁడును, గుబేరుఁడును, దేవేంద్రుఁడునుంగాఁ బ్రకాశించుచున్నాఁడు. రాజునందు సమస్తఋషుల తేజస్సును స్థాపింపఁబడియున్నది. రాజు బాలుఁడుగానున్నను, మనుష్యునిఁగాఁ దలఁచి యవమానింపరాదు. రాజొక పెద్దదేవతయనియు, మనుష్యరూపముగొని నిలుచున్నదనియుఁ దలంపవలయును. నిప్పు, తప్పి దగ్గఱిన యొకమనుష్యునిఁ గాల్చును. రాజనెడు నగ్గియో, గోవులు ధనములు మొదలగు వస్తువులతోఁడఁ గులమునే గాల్చివైచుననుటకు సందేహము లేదు. మీ కోపాగ్నివలన ధృతరాష్ట్రుని కులమే దహింపఁబడినది. ఇది లోకమంతయుఁ దెలిసినది. ఇందు సందేహమేకలుగదు. మంచికులమునఁ బుట్టి, మంచినడవడిగలిగి, ధర్మబుద్ధితోఁ గూడి, బ్రజలను రక్షించుటయందు నిరతుఁడై యొప్పురాజు, దేవతలచేతను బూజితుఁడగును. కార్యమును, శక్తినిని, కోటును, గాలమును గలరూపునఁ గనుఁగొని, ధర్మార్థ మెవఁడు మాటిమాటికిఁ బెక్కురూపము లెత్తికొనునో, యతనియనుగ్రహమందు లక్ష్మియుఁ, బరాక్రమమందు జయమును, కోపమందు మృత్యువును వసించుచుండును. ఏలన నతఁడు సర్వతేజోమయుఁడుగదా. అతని నెవఁడు తెలియక ద్వేషించునో వాఁడు నాశమునొందును. అట్లు ద్వేషించువానిని, రాజుగూడ శీఘ్రముగాఁ జంపఁదలఁచును. కాఁబట్టి రాజు తనకిష్టు లయినవారియందు ననిష్టులయినవారియందును మంచియో సెబ్బరయో దేనిని నిశ్చయించునో దానినిమార్పరాదు. ఈశ్వరుఁడు సమస్తజగత్తులను రక్షించు బ్రహ్మతేజోరూపమై తనవలనఁ బుట్టినదియు నగుదండనీతి యనుధర్మమును రాజులకై నిర్మించెను. స్థావరజంగమ

ములగు సమస్తప్రాణులును, దండనీతివలని భయమున భోగ
ము నొసంగుచున్నవి; ధర్మమునుండి చలింపకయు నున్నవి.
రాజు న్యాయ్యమున వర్తించు మనుష్యులను, దేశకాలములను
శక్తినిఁ గార్యమును గలరూపునఁ గనుంగొని దగురీతి నడంపవల
యును. దండమే, లోకమునకు రాజు; దండమే,అడఁచువాఁడును,
జరుపువాఁడును, ఆజ్ఞసేయువాఁడును. అదియే వర్ణములకును
నాశ్రమములకును, నవ్యయంబగు ప్రభువు. దండమే ప్రజల
నెల్ల శాసించుచున్నది. దండమే ప్రజలనెల్ల రక్షించుచున్నది.
జగత్తులు నిదురించుచున్నను దండము మేలుకొని యుండును.
విద్వాంసులు దండమును ధర్మమని తెలియుదురు. చక్కఁగా
నాలోచించి ప్రయోగించినదండము ప్రజలనెల్ల రంజిల్లఁజేయు
ను. ఆలోచింపక చేయుదండము సమస్తమును నాశముసేయు
ను. రాజు ప్రాలుమాలిక లేక దండింపఁదగిన వారియందు దండ
మును జెల్లింపనియెడ, జలమందలి చేఁపలుంబోలె లోకమందు
బలవంతులు బలహీనులను భక్షించివైతురు. అప్పుడు కాకియుఁ
బురోడాశమును దినును. కుక్కయు హవిస్సును నాకును. స్వామి
త్వ మెందును గలుగదు. అంతయుఁ దలక్రిందగును. లోకము
నందుఁ బరిశుద్ధుం డగుమనుష్యుండు మిక్కిలి యరుదగును. లో
కమంతయు దండముచేత నడంపఁబడి దానివలని భయమునుబ
ట్టి ప్రయోజన (భోగ) కారియగుచున్నది. దేవతలును, అసురులు
ను, గంధర్వులును, రాక్షసులును, ఉరగులును, పతగులును దండ
ముచేతఁ బీడితులగుటంబట్టియే భోగమునకుఁ బాత్రులయ్యెద
రు. దండము పొరలెనా సకలవర్ణములు చెడును; సకలమైన కట్టు
పాట్లును భేదిల్లును. లోకమంతయుఁ బ్రకోపమునొందును. నల్లని

దేహమును, నెత్తునికన్నులును, గలిగి పాపమును బరిమార్చునట్టి దండపురుషుఁ డెచ్చటసంచరించునో యచ్చటిప్రజలు తమ్మునడపు వాఁడు చక్కఁగా నరయువాఁడేని తెలివిమాలరు. అట్టిదండము నకుఁ, జక్కఁగా విచారించి చేయువాఁడును, బ్రాజ్ఞుండును, ధర్మ కామార్థములఁ జక్కఁగాఁ దెలిసినవాఁడును, సత్యవాదియు నగు రాజు కారణమగును. అట్లు దండమును జెల్లించురాజు స్వర్గమును గూర్చి పోవును. కామమందు మనస్సునుంచు నీచుం డగురాజు దండముచేతనే కొట్టువడును. దండము మిక్కిలియు గొప్ప తేజ ముగలది. అది, మంచిబుద్ధిమంతులు గానివారికి నెంతమాత్రము వహింప నలవిగానిదిచుమీ. కావుననే యది ధర్మమునుండి చలించినరాజునే యతనిబంధువులతోఁగూడఁ జంపివైచును. అది రాజును జంపి దుర్గమును రాజ్యమును స్థావర జంగమాత్మ కమయిన జగత్తును, ఆకాశమునం గల మునులను దేవతలను హింసించును. లోభియు, బుద్ధిదేఁటనివాఁడును, విషయాసక్తుఁ డును, మూఢుఁడును, అసహాయుఁడు నయినవానికిఁ బాడిపో ప్పున దండము, నడపశక్యముగాదు. పరిశుద్ధుండును, సత్యసం ధుఁడును, నీతిశాస్త్రము ననుసరించువాఁడును, మంచి సహాయ సంపత్తి గలవాఁడును, బుద్ధిమంతుండు నగువానికే చెల్లింప శక్యమగును. రాజు తనరాజ్యమందు న్యాయముతో వర్తించు వాఁడును, శత్రువులందు వేండ్రమయిన దండము గలవాఁడును, నెయ్యురగు సుహృదులందు ఋజువయినవాఁడును, (చక్కటిగల వాఁడును), బ్రాహ్మణులందు క్షమగలవాఁడునై యుండవలయును. ఇట్లుండురాజు పరిగయేఱి బ్రతుకువాఁడయినను నీటియందు నూనెబిందువు వ్యాపించునట్లు లోకమునందు వానికీర్తి వ్యాపిం

చును. ఇందులకు విపరీతముగా వర్తించుబుద్ధిమాలిన రాజునకుఁ గీర్తి, నీటియందలి నేతిబొట్టువలె, లోకమున సంకుచితమగును. రాజా! ధర్మమునుండి చలించుటవలననే ధృతరాష్ట్రునిపుత్రులను దేవదేవుం డగురుద్రుఁడును, బ్రహ్మయు, విష్ణుదేవుఁడును, మహాత్ముం డయినయింద్రుఁడును, దిక్పాలురును, పంచభూతములును, మహాత్ము లయినపాండవులును వధించిరి. అధార్మికులును దురాచారులు నయినయాధృతరాష్ట్రపుత్రులు సేనలతోడఁగూల్పంబడిరి. రాజా! నెపముననో, మాయచేతనో, క్షత్రధర్మముచేతనో వారిని వధించుటవలన నీకు సుంతేనియు దోషము లేదు.

సర్వభూతములందలి మైత్రియు, దానమును, అధ్యయనమును, తపస్సును బ్రాహ్మణులకే ధర్మమగును; రాజులకుఁ గాదు. రాజులకు దుష్టులను వారించుటయు (దండించుటయు) సజ్జనులను బరిపాలించుటయును, యుద్ధమందు వెనుదీసి పాఱకుండుటయు నను నివియే పరమ మయినధర్మము. ఎవనియందు క్షమయుఁ గోపమును, ఇచ్చుటయుఁ బుచ్చుకొనుటయును, భయమును అభయమును, నిగ్రహమును అనుగ్రహమును రెండునుగలవో వాఁడే ధర్మవిదుఁడని చెప్పుదురు. ఈభూమి, చదవుచేతను, దానముచేతను, మంచి మాటలచేతను, యాగముచేతను, యాచనచేతను నీకు లబ్ధమయినదిగాదు. లోకంబునఁ బ్రసిద్ధమై, పెక్కండ్రు వీరులచే నుద్యతమై, రథ గజ తురగ సంపన్నంబై, ప్రభూత్సాహ మంత్రము లనెడిమూఁడంగములచే సత్యోత్తమమై, ద్రోణకర్ణాశ్వత్థామ కృపులచే రక్షితమై యుండిన శత్రుసైన్యములును నీచేతహతములయినవి. కాఁబట్టి, వీరా! భూమిని నీవు భుజింపుము. పురుషసింహమా! పెక్కు జనపదములతోఁ గూడిన

జంబూద్వీపమును నీవు దండముచేత నడంచితివి. ఈ ద్వీపమునకు సాటియై మేరువునకుఁ బడమటి ప్రక్కనున్న* క్రౌంచద్వీపమును నీవు దండముచేత నడంచితివి. నరపతీ ! మేరువునకుఁ దూర్పున నున్నదియుఁ గ్రౌంచద్వీపమునకు సదృశమయినదియు నగుశాక ద్వీపమును దండముచేత నీ వడంచితివి. మేరువునకు నుత్తరము నందున్నదియు శాకద్వీపమునకు సమానమయినదియు నయిన భద్రాశ్వద్వీపమును దండముచేత నడంచితివి. వీరా ! నానా జనపదముల కాశ్రయమయిన ద్వీపములును, వానికి నడుమఁగల చిన్నద్వీపములును సముద్రమునుజొచ్చి నీవు దండముచేత నడంచితివి. మహారాజా ! ఎనలేని యిట్టికార్యములను జేసితివి. ఇందులకు బ్రాహ్మణులచేతను బొగడొందుచున్నావు. ఇంతకు సంతోషింపకున్నావే ! భారతా! అంకెలువైచు వృషభములవలెను, మదించియున్న గజములవలెను నున్న యీ తమ్ములనుజూచి యుల్లసిలుమీ. వీరలు పగవారిని నవలీలనోర్చువారు; పరులను మగంటిమిచేఁ గ్రాఁచువారు. అందఱును దేవతలకుఁ బ్రతిమలయినవారు. వీరియం దొక్కొక్కరును నాకు సుఖముగూర్పఁ జాలుదురని నాతలంపు. శరీరమును జరుపుటయందు నింద్రియములన్నియుఁ జేరియుండునట్లు, మనుష్యులందు మిన్నలై బెబ్బులులుంబోని శూరులయిన పతులందఱును నా విషయమందుఁ జేరియుండఁగా నీకుఁ జెప్పనేల ? నాయత్తగారు కుంతి యన్నియుఁ దెలిసినది. ఆయమ యన్నియుఁజూచినది. ఆయమ నన్నుఁ జూచి 'పాంచాలీ ! యుధిష్ఠిరుఁడు తీవ్రమయిన పరాక్రమము

* క్రౌంచద్వీపాదులను వశీకరించుట రాజసూయమందు సిద్ధులమూలముగనని తెలియునది.

మెఱసి విరోధులగు వేలకొలఁది రాజులను వధించి నిన్ను మిక్కిలి యెక్కుడయిన సుఖమునందు నుంపఁగలఁడు' అని చెప్పినమాట పొల్లుగానేరదు. రాజా ! నీ తెలివిలేమిచేత నది పొల్లగునని తలంచుచున్నాను. అన్నవగు నీవు, ఉన్మత్తుడవయియుండుట వలన నిన్ననుసరించు తక్కిన పాండవులందఱును, నీపైత్యము వలనఁ బైత్యముగలవారై యున్నారు. నీదు తమ్ములు పైత్యము గలవారు గాకుండిరేని, నిన్ను నాస్తికులతోఁగూడఁ గట్టివైచి భూమి నేలుదురు. తనకయిన శ్రేయస్సును బొందకున్న మూఢుఁడే కదా యిట్లుచేయును. పొగలచేతను, గాటుకలచేతను, నస్యములచేతను నీపైత్యమును తొలంపవలయును. దారితప్పి నడచు మనుష్యునకు మందులచేతఁ జికిత్స గావింపవలయును. భరతసత్తమా ! లోకమునంగల స్త్రీలయందు నేను మిక్కిలియుఁ గీడ్పడినదానను. ధృతరాష్ట్రుని కొడుకులచేత నట్లవమానింపఁబడియు, నే నునుఱుతోనుండఁ గోరుచున్నానే ! రాజా! ధృతరాష్ట్రుని కొడుకు లెప్పుడును దుర్మార్గమున నడచువారు. అట్టివారిని వధించుటయందొకప్పుడు నేవిధమయిన దోషమును గానంబడదు. శుక్రుఁడు చెప్పిన యీశ్లోకములను వినుము. వాని యర్థమేమన-' తన్నుఁ జంపుకొనువాఁడు, తన ధనమును బాడు చేయువాఁడు, బంధువులను జంపువాఁడు, విషము పెట్టువాఁడు, కారణములేక చంపువాఁడు, ఇల్లాలిని బరామర్శించు వాఁడనెడి యీయార్వురును ఆతతాయులనఁబడుదురు. వీరలను జంపుట యందు దోషమేకలుగదు.' మహాత్ముండయిన యీశుక్రునికొఱకు బ్రహ్మదేవుఁడు దీనిని వచించెను. సన్మార్గమందు వర్తించు బ్రాహ్మణుఁడు,క్షత్రియుఁడు, వైశ్యుఁడు, శూద్రుడునను వీరలయిండ్లకుఁ

బోయి బలవంతముగాఁ గొట్టువానిని, విషము పెట్టువానిని, భుజింపరానిదియుఁ ద్రావరానిదియు నగువస్తువు నిడువానిని, అగ్ని పెట్టువానిని జంపవలయును. గోవులను బ్రాహ్మణులను వధించునపుడును, పడఁతులను దలవెండ్రుకలుపట్టి యీడ్చునపుడును, బితామహుఁ డగు బ్రహ్మగా నుండినను గొట్టవలయు ననఁగా నిఁకఁ దక్కిన పాపాత్ములవిషయమై చెప్పనేల? ఇది రాజులు నడవవలసిన మార్గము. గోవులకును బ్రాహ్మణులకును రాజులకును వ్యసనము కలుగు కాలమందును, రాజ్యమునకుఁ జెఱుపుగలుగు కాలమందును, తన దేహమును గాచుకొఱకును, పడఁతుల యేడ్పుధ్వనిని విన్నను, మహాప్రభావుఁడగు బ్రాహ్మణుఁడయినను యుద్ధము సేయవలయును. ధర్మమునుండి చలించిన యాతతాయియగు బ్రాహ్మణునిఁ జంపవచ్చును. తెలిసినవాఁడు బ్రాహ్మణవధమును వేఱెచ్చటఁగాని మనస్సుచేతను దలంపరాదు. గోవును, బ్రాహ్మణునిఁజంపఁ దెగించిన బ్రాహ్మణుని క్షత్రియుఁడు చంపవచ్చును. మంత్రమును గాచుకొఱకును, దన కుటుంబమును బొందుకొఱకును క్షత్రియుఁడు బ్రాహ్మణునిఁ జంపవచ్చును. ధర్మమునుండి చలించినవాఁడై, క్రూరుఁడై, చోరుఁడగు బ్రాహ్మణుని క్షత్రియ జాతియందుఁ బుట్టినవాఁడు యుద్ధమున మిక్కిలిబలిమి మెయి మార్కొనవచ్చును. వేదాంత పారంగతుఁడయినను దన్నుఁ జంపవలయునని కోరి పయినెత్తి వచ్చు నాతతాయిని వధింపవచ్చును. దానివలన వేదము సాంగముగా నధ్యయనముచేసిన బ్రాహ్మణునిఁ జంపుట యను భ్రూణహత్యను జేసిన దోషమునొందఁడు. బ్రాహ్మణుఁడును క్షత్రియుఁడును, వైశ్యుఁడును, శూద్రుఁడును, చండాలుఁడును

మఱియుఁ దక్కినవాఁడెవఁడును, నే సమయమందును శాంతుఁడగు బ్రాహ్మణుని నొక గడ్డిపోఁచచేతను గొట్టరాదు. బ్రాహ్మణునిఁ బెద్దకట్టెనుగొని కొట్ట నెత్తినపాపి మున్నూఱుసంవత్సరములు మంచి నిలుకడనొందఁడు. కొట్టినవాఁడు వేయిసంవత్సరములు నరకమందుఁ బడును. కాఁబట్టి బ్రాహ్మణునిఁ గొట్టుటకై చేయెత్తుటయు, నాయుధముచేతఁ గొట్టుటయుఁదగదు. బ్రాహ్మణుని మేననుండివచ్చు నెత్తు రెన్ని ధూళియణువులను గ్రహింపఁగూడునో యన్ని యేండ్లు కొట్టినపాపి నరకమందుఁ దిరుగుడువడుచుండును. బ్రాహ్మణునితోలు నెమ్ములను భేదించినవాఁడును, భేదింపఁజేసినవాఁడును నగు మనుష్యాధముఁడు బ్రహ్మహత్య చేసిన వాఁడయి ప్రాయశ్చిత్తముచేసికొనఁ దగుచున్నాఁడు. శ్రోత్రియుండగు బ్రాహ్మణునిని, ఆత్రేయగోత్రమందుఁ బుట్టినబ్రాహ్మణస్త్రీనిని జంపినచో, అది బ్రహ్మహత్యకు రెండింతలు దోషముగలదని ఋషులు చెప్పుటచే నిరువది నాలుగేండ్లు దానికిఁ బ్రాయశ్చిత్తము చేసికొనవలయును. అట్లు ప్రాయశ్చిత్తము చేసికొనని వానిని, మేనియందు గుఱుతుచేసి, దేశమునుండి వెడలఁగొట్టవలయును. బ్రాహ్మణునిఁ జంపినవాఁడును, దొంగతనము గలవాఁడును నయినయొకఁడు బ్రాహ్మణుఁడయినను, క్షత్రియుఁడయినను, వైశ్యుఁడయినను, శూద్రుఁడయినను వానిని రాజు దండింపవలయును. ఇట్టివానిని గాలుసేతులను, పెదవిని, ముక్కునుఛేదించి యిఁక నట్లుచేయకుండునట్లు కావింపవలయును. వీరు బ్రాహ్మణునిఁ జంపినవారేని వీరికన్నులను బెఱికివైవ వలయును. ఈ దండనము శూద్రునకును, వైశ్యునకును, క్షత్రియునకును జెల్లును. ఇట్టి పాపముచేసిన బ్రాహ్మణుఁడు ప్రాయశ్చిత్తము చేసి

కొనకుండెనేని యూరు వెడలఁ గొట్టవలయును. బ్రాహ్మణునిఁ జంపిన క్షత్రియునిని వైశ్యునిని శూద్రునిని రా జాయుధము చేతఁ జంపవలయును. బ్రాహ్మణునిఁ జంపిన బ్రాహ్మణులను రాజు మేనియందు గుఱుతుచేసి, యూరు వెడలఁ దఱుమవలయును. బ్రహ్మహత్యచేసినవారగు తక్కువ మూఁడు జాతుల వారిని నింద్రియ వికలులను (అనఁగాఁ గన్నుచెవి మొదలగు వానిని లేనివారిని) జేసి చండాలురతోఁ గూడి మనునట్లు చేయవలయును. వారలతోఁ గలసిభుజించువాఁడు నట్టిపాపము గలవాఁడగును. వారు మరణించినను వారి కెవ్వరును బిండము మొదలగువాని నిడరాదు. నల్లని చాయయును వికారరూపమును వ్రేలుచున్న తలవెండ్రుకలును గలిగి బ్రహ్మహత్య కనఁబడక యే వెంబడించి చేసినవానిని బీడించుచున్నవని పెద్దలు తెలియుదురు. బ్రహ్మహత్య చేసినవానితో భుజించుచుండినయెడల నట్టుండు బ్రాహ్మణులును వారువసించు నూరును దేశములును గఱవు చేతను దొంగలచేతను శీఘ్రముగానే పీడింపఁబడును. బ్రాహ్మణులను జంపువాఁడును బాపకర్ముండును నగువానిని క్షత్రియుఁ డయినను వైశ్యుఁ డయినను శూద్రుఁ డయినను గన్నులు పెఱికివైవవలయును. సాధువులు బలవంతులయినను, బలహీనులయినను, వారికి రాజు బలమగును. బలవంతులయినను దుర్బలులయినను బాపులకు మృత్యువగును. రాజా! ఒకఁడు బలవంతుఁడుగానీ బలహీనుఁడుగానీ వాఁడు దోషముగలవాఁడై యుండునేని వానిని రాజునకుఁ దెలుపక కొట్టువాఁడు దండనమునకుఁ బాత్రుఁడగును. రాజునాజ్ఞను రాజేర్పరించిన న్యాయాధికారిని మీఱినవాఁడును, సాక్షిని సాధువాక్యమును విడిచి తొలఁగిన

వాఁడును నపరాధులగుదురు. చెఱసాలనుండి వెలి కుఱికినవాఁడును, అపరాధి నొప్పగింపని పూఁటకాఁపును, మంచికులమున బుట్టినను ధనసంపన్నుఁడయినను నపరాధులగుదురు. రాజాజ్ఞచేతఁ బిలువఁబడియు, బలవంతుఁడగు నొకనిని బ్రాపుగా నండగొని యాయుధమెత్తికొని రాజసభకు రాకుండునట్టి వాఁ డపరాధియగును. అట్టి గొప్పయపరాధముగల మనుష్యుని వాని దేహమును, ధనమును బోఁగొట్టుకొనఁజేసి పరలోకము నకుఁ బుచ్చవలయును. అట్లు మృతుఁడయిన వానికెవ్వఁడును బిండాదు లిడరాదు. ఆజ్ఞనుమీఱి యిడువానికి * రెండవదోష మునకుఁ దగినదండుగును విధించుట దగును. కులస్త్రీలను బలవంతముగాఁ జెఱుపుటయు, రాజ్యమును జెఱుపుటయు, బ్రాహ్మణులను జంపుటయు, మ్రుచ్చిలించుటయు, రాజును ద్వేషించుటయు, యుద్ధములేని కాలమందుఁ జంపుటయు, కలుద్రావుటయు, గురుపత్నిని గూడుటయు, మిత్రద్రోహము చేయుటయు ననెడి యిట్టి మహాపాతకమును జేయువాఁడు మహాసాహసికుఁడు (మహాపరాధి) అగును. వానిని గొంచెమేని యుపేక్షింపక, ధనమంతయుఁ దీసికొని తోడనే వర్జింపవలయును. ఇట్టి దండనము శూద్రుఁడు మొదలయిన మూఁడువర్ణముల వారికనియు, ఇట్టిమహాసాహసముచేసిన బ్రాహ్మణుని మేనియందు గుఱుతుచేసి వెలిఁ దఱుమగొట్టవలయుననియు బ్రహ్మ తొల్లి

* యాజ్ఞవల్క్యస్మృతి వ్యవహారకాండము సాహస ప్రకరణమందు ప్రథమశ్లోకటీకను - అపరాధములు మూఁడువిధములు. మొదటిదానికి వేయి బంగారములను రెండవదానికి నేనూఱును, మూఁడవదానికి నూఱును దక్కువ దండుగుగా విధింపఁబడియున్నది.

విధించుయున్నాఁడు. బుద్ధిమంతుఁ డగుశుక్రుఁడు, నాలుగువర్ణ
మున వారికిని స్త్రీలకును బాలురకును వృద్ధులకును గొల్ల
వాండ్రకును వేయిబంగారములు దండుగు విధింపవచ్చునని
చెప్పెను. బృహస్పతి దుర్నీతులయిన యిట్టి పాపులకును ఆత
తాయుల కందఱకును మరణదండము విధించుచున్నాఁడు. కాఁ
బట్టి పాపబుద్ధులును బాపకర్మములే చేయుచుండువారును నగు
ధృతరాష్ట్రుని పుత్త్రుల కందఱకును మరణదండము గావించు
టయం దెంతమాత్రమును దోషములేదు. రాజా! ఏకవస్త్రయు
రజస్వలయు నగునన్ను, నీదోషమునుబట్టి, నీకన్నులయెదుట,
పెక్కండ్రుశూరులు చూచుచుండ, నట్లు సభయందు జుట్టంబు
నన్ను డీడ్చుకొని వచ్చునట్లుచేసిన దురాత్ములగు కర్ణ శకుని దుర్యో
ధనాదులను జంపినదాన దోషమేకలుగదు. కోపాగ్నిచేతఁ బసు
తోడ ధనసంచయములను గాల్చి ధృతరాష్ట్రునికులము నాశము
సేసినందులకు నీకు ధర్మలోపముకలుగదు. నీ నిమిత్తమున నిట్టి
దుఃఖమునుబొందినదాన నయితిని. ఆసమయమందు జగత్తునకుఁ
గాలహేతువగు దేవదేవుండు సూర్యుఁ డనుగ్రహించి నన్ను
వస్త్రహీననుగానీక రక్షించెను. ఆదిత్యుని ప్రసాదముచేత
బ్రాణములకు నేనుబాయకున్నాను. నామాట పొల్లుకాదు.
నీవ్రా యిట్లు పాటుపడుచున్న యీతమ్ములను బాటింపక, యీ
భూమినంతయు దిగవిడిచి, నీయంతట నీవే యాపద కలిగించు
కొనుచున్నావు. రాజసత్తమా! మాంధాతయు, అంబరీషుం
డునుంబోలె నీ వీ భూతలమున రాజుల యెన్నికకెక్కి వెలుంగు
చున్నావు. ధర్మముచొప్పునఁ బ్రజలను గాచుచు పర్వతవన
ద్వీపములతోఁ గూడినయీ భూదేవిని లెస్సగాఁ బరిపాలిం

వుము. మనసునం దీపిన్నతనమువలదు. పలువిధములయిన య
జ్ఞములను యజింపుము. పగవారిని మార్కొని యోర్వుము.
ధనములను వస్త్రములను మఱియుంగల భోగ్యవస్తువులను
బ్రాహ్మణులకు నొసంగుము' అనెను. ఇది పదునాలుగవయ
ధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు జెప్పినది.

అర్జునుఁడు ద్రౌపది చెప్పినదివిని రాజయిన తనయన్న ననుస
రించి యతనితో 'ప్రజలనందఱను శిక్షించునది దండమే; ర
క్షించునదియు దండమే. లోకులు నిదురించుచుండినను దండము
మేలుకొనియుండును. దండమును ధర్మముగాఁ బండితులు తెలి
యుదురు. ధర్మమును అర్థమును గామమును దండమే రక్షించు
చున్నది. కాన త్రివర్గమును దండమని చెప్పఁబడుచున్నది.
ధనమును ధాన్యమును దండముచేత రక్షింపఁబడుచున్నవి. దీనిని
చక్కఁగా నెఱుంగుచు లోకము స్వభావమును జూడుము. కొం
దఱు మనుష్యులు రాజు దండించునని భయపడి పాపము చేయ
కుందురు. కొందఱు యమదండమువలని భయముచేతను, కొం
దఱు పరలోక భయమువలనను, బాపముచేయకుందురు. ఇట్లు
లోకము దండార్హమయిన స్వభావము కలిగియుండుటను
జూడఁగానన్నియు దండమందు నెలకొన్నవగును. కొందఱు దండ
మునకు భయపడియే యొకరినొకరు పట్టి కబళింపకున్నారు.
దండము రక్షింపకపోయెనా యీలోకము జీఁకటిలో మునిఁగి

పోవును. అడఁగని వారిని (తాడనాదులచే) నడంచుట వలనను, అపరాధులను (విత్తాపహరణాదులచే) దండించుటవలనను నిట్లు దమనమువలనను దండనమువలనను బండితులు దండమని చెప్పుదురు. బ్రాహ్మణులకు మాట దండము. *క్షత్రియులకుఁ గూలి యిచ్చుట దండము. వైశ్యులకు ధనము దండము. శూద్రునకు (నూడిగము తప్పవేఱు) దండములేదని చెప్పుదురు. రాజా మనుష్యులకు నవివేచనము గలుగకుండుటకును, ధనములను రక్షించుటకును, లోకమందు దండమనెడి మర్యాద యేర్పఱుపఁబడినది. ఏదేశమందు రాజు చక్కఁగాఁ బాటించునేని † నల్లని కాయమును, నెఱ్ఱని కన్నులును గలదండపురుషుఁడు మిక్కిలి యుద్యతుఁడై సంచరించునో యందుఁగల ప్రజలు మోహము నొందరు. బ్రహ్మచారి, గృహస్థుఁడు, వానప్రస్థుఁడు, సన్న్యాసి యనెడి యీమనుష్యులు దండమునకు భయపడియే తమ తమ మార్గములందు నెలకొని యున్నారు. భయములేనివాఁడు యాగము చేయఁడు; దానము సేయఁగోరఁడు; భయములేని వాఁ డెవఁడు దననియమమునందు నిలువఁగలఁడు ?. ఎదిరిమర్మములను ఛేదింపకయు, దుష్కరమయిన కార్యము చేయకయు, చేపలఁ బట్టువానివలెఁ జంపకయు, గొప్ప సంపత్తిని బడయరాదు. చంపుటకుఁ దెగనివానికి నీలోకమందుఁ గీర్తియు, ధన

* క్షత్రియులకు స్వాతంత్ర్యములేక యొకరిప్రోపుచే బ్రదుకుటయే హీనత్వముగాన దండమగును.

† బిట్టుగాఁగొట్టినచో దండమువలన అంధత్వము గలుగునుగాన నల్లనిదనియు దండించువాని కన్నులు కోపాతిశయమున నెఱ్ఱగానుండునుగాన యెఱ్ఱని కన్నులుగలదనియుఁ జెప్పఁబడినది.

మును, బ్రజలును గలుగవు. ఇంద్రుఁడు వృత్రుఁ డనునసురను జంపియే మహేంద్రుఁ డను పేరిని నందులకుఁ దగినగృహమును బడసి, లోకములకు నీశ్వరుండునయ్యెను. కొట్టునట్టి దేవత లెవరో వారినే లోకము మిక్కిలియుఁ బూజించుచున్నది. రుద్రుఁడు, కుమారస్వామి, ఇంద్రుఁడు, అగ్ని, వరుణుఁడు, యముఁడు, కాలుఁడు, వాయువు, మృత్యువు, కుబేరుఁడు, సూర్యుఁడు, వసువులు, మరుత్తులు, సాధ్యులు, విశ్వేదేవతలును గొట్టునట్టి స్వభావముగలవారు. కాఁబట్టి వారల ప్రతాపమునకు లోఁగి జనులు వారలను బూజించుచున్నారు. బ్రహ్మను, ధాతను, పూషను, నొక్కరును బూజించుటలేదు. దాంతులును, శాంతిపరాయణులును, సర్వభూతములయందును (రాగముగాని ద్వేషముగాని లేక) మధ్యస్థులై యుండువారు నగు దేవతలను మనుష్యలోక కొందఱుమాత్రమే పూజించెదరు. లోకమునందు హింససేయక జీవించువాని నెవనిని గానను. బలముగల ప్రాణులు బలము లేని ప్రాణులవలన జీవించుచున్నవి. ముంగిస యెలుకలను దినుచున్నది. ముంగిసను పిల్లి దినుచున్నది. పిల్లిని కుక్క దినుచున్నది. కుక్కను జిఱుతపులి తినుచున్నది.అట్టి పులులనెల్ల మనుష్యుఁడు చంపుచున్నాఁడు. ధర్మమెట్లు పోవుచున్నదో చూడుము. స్థావర జంగములన్నియుఁ బ్రాణమున కన్నమని దైవము విధించియున్నది. తెలిసినవాఁ డీవిషయమై సందేహము నొందఁడు. రాజసత్తమా! ఎట్లు శౌర్యము, తేజము, ధైర్యము, సామర్థ్యము మొదలయిన క్షత్రియజాత్యుచిత గుణములతోడ బ్రహ్మచేత సృజింపఁబడియున్నావొ, యావిధమునసే కాఁదగుదువు. మూఢులయినక్షత్రియులు కోపమును సంతోషమును విడిచి యడవికిఁ

బోయి తపముచేయువారై యుండియు (కందమూలాదుల) వధ
ములేక ప్రాణమును గడుపుచున్నారుగారు. జలమునందును, భూ
మియందును, పండ్లయందును, పెక్కులు ప్రాణులున్నవి. లోక
మునందు వానిని జంపకుండువాఁ డెవఁడు? ప్రాణిహింసలేని
జీవనము మఱేదియున్నది? మిక్కిలి సూక్ష్మము లయినరూపు
లుగలవియు, అనుమానముచేతఁ దెలియఁదగినవియును, కన్ను
ఱెప్పలల్లార్చినంత నుసులు దొఱంగునవియు నగుప్రాణులు గొన్ని
కలవు. కోపమును నసూయను దిగవిడిచి గ్రామమునుండి
బయలువెడలియుఁ గొందఱుమునులు తెలివిమాలి వనమునం
దును గుటుంబధర్మము గలవారయి చూపట్టుచున్నారు. భూ
మిని భేదించి ఓషధులు వృక్షములు మొదలయినవానిని, బక్షు
లను బశువులను, ఛేదించి మనుష్యులు యాగముచేయుచు
న్నారు. వారును స్వర్గమును బొందుచున్నారు. దండనీతి లెస్సగాఁ
జెల్లింపఁబడునేని సమస్తప్రాణులకును సకలమయిన ప్రయత్న
ములును సిద్ధించుచున్నవి. అందు నాకు సందేహము లేదు.
లోకమున దండము లేనిచో నీప్రజలు నాశమునొందును. నీటి
యందలి చేఁపలవలె బలవంతులయినవారు దుర్బలులను గబళించి
వైతురు. 'చక్కఁగాఁ జెల్లింపఁబడినదండము ప్రజలను రక్షించు
చున్న'దని తొల్లి బ్రహ్మచెప్పినమాట నిజమే. అగ్నులు చెడు
కంపు గలయీ మాంసమునకు జంకియు (ఫూత్కారముచేత)
నదల్పఁగా వెలుఁగుటయు దండమువలని భయముననే.
మంచిసెబ్బరలను వేఱువేఱ నేర్పఱిచి చూపెడియీ దండ
ము లోకమునందు లేకపోయెనా యీ జగ మొక్కటే
యంధకారమగును. ఏదియుఁ దెలియదు. మర్యాదల నదల్చి

వేదములనిందించుచు నాస్తికులయి యుండువారును, దండము చేత మిక్కిలి పీడితులయిరేని తోడనే మర్యాదనుగావ నర్హులగుచున్నారు. లోకమంతయు దండముచేత జయింపఁబడినది. పరిశుద్ధుఁడగువాఁడు దుర్లభుఁడుచుమీ. దండమునందు భయ ముండుటవలననేచుమీ లోకము మరియాదతోడ ననుభవించుటకు నర్హమగుచున్నది. నాలుగువర్ణములవారి సంతోషమునకును, చక్కని నీతిగావించుటకును, ధర్మార్థములను రక్షించుటకును బ్రహ్మ యీదండమును విధించియున్నాఁడు. దండభయము లేనిచో, పక్షులును దుష్టమృగములును, పశువులను మనుష్యులను యజ్ఞమున కగుహవిస్సులను దినివైచును. బ్రహ్మచారి యధ్యయనముచేయఁడు. ఆవుసమయమునఁ బిదుకదు. కన్య పెండ్లియాడదు. ఈదండము పాలింపకుండునేని సకలమయిన మర్యాదలును లోపించును. సకలమయిన గరుసులును నుడివ్రావును. మమత్వమును జనులు కొలదిపాటిగాఁ దలంపరు. అనఁగా నన్నియుఁ దమదేయని జంకక సులువుగా నెంతురు. విధ్యుక్తముల యినదక్షిణలు గలిగి పెక్కు సంవత్సరములు చేయఁదగు సత్రమను యాగములను నిర్భయముగా ననుష్ఠింపఁజాలరు. ఆశ్రమమునొందినవారు తమతమ యాశ్రమములకు విహితమయిన ధర్మమును చెప్పఁబడినట్లు చేయరు. ఒకఁడును విద్యను గఱవఁడు. దండములేనిచో బండియందుఁ గట్టినలొట్టియలు, ఎద్దులు, గుఱ్ఱములు, గాడిదలు, కంచరగాడిదలును వాహములను లాగవు. పనివాండ్రు నొడయనిమాట వినరు. తండ్రిబోధించు ధర్మమందు పిన్నవాఁడెన్నఁడును నిలువఁడు. ప్రజలందఱును దండమున నెలకొనియున్నారు. పండితులు దండమున

భయమున్నదని చెప్పుచున్నారు. మనుష్యులకు నిహామును బరమును దండమందు నెలకొనియున్నవి. చక్కఁగా జరుపఁబడునదై విరోధులను నాశము సేయునట్టి దండ మేదేశమునందు వర్తించుచున్నదో యచటఁగపటమును, పాపమును, వంచనయుఁ గానంబడవు. దండ ముద్యతమై యుండదేని కుక్క హవిస్సును జూచి నాకును; కాకి పురోడాశమును గొంపోవును. ఈరాజ్యము ధర్మముగనో యధర్మముగనో రాజునకు విధింపఁబడియుండుటచే దీనినిగూర్చి శోకింపరాదు. భుజింపఁదగువానిని భుజింపుము. యాగములు యజింపుము. శ్రీమంతులగువారు నిర్మలము లయినవస్త్రములు గట్టుచు గాదిలి యిల్లాండ్రతోఁ గూడిమాడి మేలయిన యన్నములనుదినుచును సుఖముగా ధర్మమాచరించుచున్నారు. సకలప్రయత్నములను ధనమునకు లోనయియున్నవి. ఇందులకు సందియము లేదు. ఆధనమో దండమునకు లోపడియున్నది. దండంపు గౌరవమును జూడు. (పసులను జంపుటకుఁ గొట్టమును దూఱినపులిని) చంపకుండుట (యాపసులకయిన) తగని పెనుహింసగా పర్యవసించును. కాఁబట్టి ధర్మమును గయికొనుటయే మంచిది. ఇట్టి ధర్మప్రవచనము లోకయాత్ర జరుగుటకే యిందుఁ గావింపఁబడినది. తుదముట్ట గుణమేగలది గాని, తుదముట్ట గుణములేనిదిగాని యగువస్తువొకటియు లేదు. మంచిదియుఁ జెడ్డదియు నీరెండును నన్ని కార్యములందును గనఁబడుచున్నవి. పెక్కండ్రుజను లెద్దులవృషణముల నలిపి పిదప వానిముక్కులను దూటుపొడిచి పెక్కులు బరువులు దానిపయి మోయించి గట్టుచును గొట్టుచు నుండెదరు. మహారాజా ! ఇట్లు లోక మాయానెఱితెఱంగులచేతఁ దోడనే యాకులమై భయముగొని

యున్నది. అవిలేనిచో (బరువుమోయుట మొదలయిన కార్యములు లేక పసదూలును) కాన పురాతనమైనధర్మమునే యాచరింపుము.(క్రొత్తగానొకటి తలపెట్టవలదు).యాగముచేయుము. దానములుచేయుము. ప్రజలను రక్షింపుము. ధర్మమును జక్కఁ బరిపాలింపుము. శత్రులను జంపుము. మిత్రులను బెంపుము. రాజా ! పగవారిని జంపినందులకు శోకింపకుము. పగవారిని జంపురాజున కించుకయును బాపము లేదు. ఆయుధమెత్తికొని కొట్టవచ్చు వానిని ఆయుధముగొని యెవఁడుగొట్టునో వాఁడు భ్రూణహత్యచేసినవాఁడుగాఁడు. *కోపము కోపమును జేరుచున్నది.సమస్తప్రాణులయం దుండునాత్మ వధింప నలవిగానిది. సందేహము లేదు. వధింప నలవికానియాత్మను వధించుట కెవనికిఁగాని యెట్లుశక్యము ? ఒకఁడు ప్రాఁతగృహమును విడిచి క్రొత్తగాఁ గట్టినయింటఁ బ్రవేశించినట్లు, ఆత్మ ప్రాతదేహములను దిగవిడిచి క్రొత్తవియగు నాయాశరీరములను బొందుచున్నవి. ఇదియే మృత్యువని తత్త్వమునుగాంచిన జనులు చెప్పుదురు' అనెను. ఇది పదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీముఁడు ధర్మరాజునకుఁ జెప్పినది.

భీముఁడు అర్జునుఁడు చెప్పినది విని, యెంతమాత్రము ధర్మరాజు పూనికకు సయింపనేరక ధైర్యమునుగొని యతనితో

---

* 'మన్యుస్తం మన్యుమార్చ్ఛతి' అని మూలము. కోపము కోపమును జేరుచున్నదని యర్థము. ఇందులకు 'మన్యుఃకర్తానాహంకర్తా' అని శ్రుతి. దీనివలన కర్తకోపమే కాన భ్రూణహత్యాదిదోషము లేదనుట.

'రాజా! నీవు ధర్మముల నెఱింగినవాఁడవు. నీకుఁ దెలియనిది పుడమియం దొకటియు లేదు. నీనడవడి నెప్పుడును మేము నేర్చుకొనుచున్నారముగాని యట్లు నడువ మాకెంతయు శక్యముగాకున్నది. 'చెప్పను చెప్పను' అను తలంపుమాత్రము నామనస్సున నుండెను. అయినను దుఃఖము మితిమీఱుటచే నాఁగఁజాలక చెప్పెదను. చెవియొగ్గి తెలియుము. నీకుఁగల మిక్కుటమయిన తెలివిలేమిచేత నన్నిటిని సందేహింపవలసివచ్చినది. మాకుఁ దెంపులేమియు, నట్లె దుర్బలత్వమును, గలిగినవి. లోకమునకు రాజును సర్వశాస్త్రములందుఁ బండితుఁడునగుదువు. ఇట్టి నీకుఁ గేవలుఁ డయినవానివలె లోకమునకుం గలయగతియు (ఆపదను) గతియు(సంపదను) దెలిసియున్నవి. జరుగుచున్న కాలమందు నిఁక జరుగఁ గలకాలమందును నొకటియు నీకుఁ దెలియనిది లేదు. మహారాజా! జనాధిపా! ఇట్లుండఁగా రాజ్యముచేయవలయు నన్నవిషయమందు కొంతకారణమును మాత్రము చెప్పెదను; ఒక్కటే మనస్సుతో వినుము. లోకమందు శారీరము మానసము నని రెండువిధముల వ్యాధు లున్నవి. వానిలో నొకటినుండి మఱొకటి పుట్టుచున్నది. ఒకటినివిడిచి మఱొకటి కలుగుట కానరాదు. శారీరవ్యాధివలన మనోవ్యాధియు మనోవ్యాధివలన శారీరవ్యాధియుఁ గలుగుట నిశ్చయము. శారీరము మానసము ననెడియీవ్యాధులను గుఱించి ముందుగడచిపోయినవానికి నెవఁడుశోకించునో వాఁ డాశోకమువలన దుఃఖమును నా రెండువిధముల వ్యాధులను మరలఁ బడయుచున్నాఁడు. శీతము (కఫము) ఉష్ణము (పిత్తము) వాయువు (వాతము) ననెడి యీ మూడుగుణములును శరీరమునందుఁ గలిగినవి.

ఈమూఁడుగుణములును సమముగా నుండుటయే స్వస్థత (నొప్పి లేమి) లక్షణము. వానియందొకటి యధికమయ్యేనేని చికిత్స విధింపఁబడుచున్నది. అనఁగా ఉష్ణముచేత శీతమును శీతముచేత నుష్ణమును నీరెంటిచేత వాయువును గ్రమముగా బాధింపఁబడి తొలఁగిపోవునని చెప్పఁబడుచున్నది. సత్త్వము, రజస్సు, తమస్సు అని యీమూడు మానసము లయినగుణములు. ఈ మూఁడుగుణములును సమముగానుండుట స్వస్థత (మనోవ్యాధిలేమి) లక్షణమని చెప్పఁబడుచున్నది. మూఁడుగుణములందొకటి యధికమగునేని దాని పరిహారమునకు విధి చెప్పఁబడియున్నది. సంతోషముచేత దుఃఖమును దుఃఖముచేత సంతోషమును నీరెంటివలన మోహమును గ్రమముగా నివర్తించునని విధిచెప్పఁబడుచున్నది. సుఖమునందుండు కొందఱు మనుష్యులు, తెలివిలేమివలన, నాసుఖమును బుచ్చుటకు దుఃఖమును దలంచుకొనఁగోరుచున్నారు. దుఃఖమునందుండు కొందఱు మనుష్యులు దానినిబుచ్చుటకు సుఖమును దలంపఁగోరుచున్నారు. నీవు దుఃఖముగలవాఁడుగను లేదు. దుఃఖములేనివాఁడుగను లేదు; సుఖముగలవాఁడుగను లేదు;. సుఖములేనివాఁడుగను లేదు; దుఃఖమును దలంపఁదగినవాఁడుగను లేదు; సుఖమును దలంపఁ దగినవాఁడుగను లేదు. ఏమి చేయవచ్చును. దైవము బలీయముగానున్నది. లేక యీతీరున సంతోషపడుట నీదుస్వభావమో! పాండవుల కనులయెదుట రజస్వలయు నేకవస్త్రయునగు ద్రౌపదిని సభలో నీడ్చుటనుజూచియు దానిని దలంచుకొనకున్నావే! పట్టణమునుండి వెడల నడిచినదియు, తోళ్లు గట్టికొనుటయు, పెద్ద వనమునందు వసించుటయు నీవు

దలంపవేమి ? జటాసురునికడఁ బడినపాట్లును, చిత్రసేనుని తోడఁ జరిగినయుద్ధమును, సైంధవునివలనఁ గలిగినకష్టమును నెట్లు మఱచిపోయితివి ? మరల నజ్ఞాతవాసమందు రాజ కుమారి యగుద్రౌపదిని గీచకుఁడు కాలం దాచినకష్టము నెట్లుమఱచితివి ? పగవారినడంచు దిట్టవుగదే ! ద్రోణభీష్ముల తోడ మునుపు నీకుఁ గలిగినయుద్ధమువలెనే నిపుడు మన స్సనెడు శత్రువుతోడ యుద్ధముసేయవలసి వచ్చియున్నది. ఈ యుద్ధమందు బాణములతోఁ బనిలేదు. మిత్రులును బంధులు నక్కఱలేదు. నీవు నీ యొక్కనితోడనే పోరాడ వలయును. అట్టి యుద్ధము తటస్థించియున్నది. ఈ యుద్ధమందు మనస్సును జయింపక ప్రాణమును విడుతువేని వేఱొకదేహ మెత్తినపిదపఁగూడ నీ యుద్ధము చేయవలసివచ్చును. ప్రభువు గానివాఁడు (ధనాఢ్యుఁడు గానివాఁడు) పతితుఁడు. వాఁ డెంగి లికి పాటి; వాఁ డల్పుఁడు. బలముగలవానికి సైతము మిక్కిలి యపథ్యముచేసినయెడల వానిబలము వానిని గొంచెమైనను గాపాడదు. కాఁబట్టి భరతసత్తమా ! వ్యక్తముగాఁ దెలియు చున్న యీ స్థూలశరీరమును విడిచి యవ్యక్తరూపముగా నున్నట్టి మనస్సునకు నవ్వలనుండు దానిని (ముక్తిని) బొందు కొఱకు, (యమాది యోగానుష్ఠానరూపము లయిన) స్వక ర్మములచేత నిపుడే మనస్సుతోడ యుద్ధము సేయుము. యుద్ధ మందు దా మనస్సును జయింపకపోయితివా యేమిగతి నొందు దువు? మహారాజా ! మనస్సును జయించినచోఁ గృతార్థుఁడగు దువు. ఇట్టి తలంపును గట్టిగాఁ గయికొని ప్రాణులగతిని నీగతిని దెలిసి తాతముత్తాతల నడవడియందు నిలిచి పాడిచొప్పున

రాజ్యమును బాలింపుము. పాపాత్ముఁడు దుర్యోధనుఁడు తన యనుచరవర్గముతోఁగూడ దైవబలముచేతను ద్రౌపది పెన్నెఱివేణి యదృష్టముచేతను యుద్ధమున నిహతుఁ డయ్యెను. పార్థా! విధ్యుక్తముగా దక్షిణలతో నశ్వమేధమను యాగమును జేయుము. మేము నీకుఁ గింకరులము. వీర్యశాలి యగువాసుదేవుఁడును నీకు వలయునది చేయును' అనెను. ఇది పదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(ధర్మరాజు వైరాగ్యమే గొప్పదియని భీమునకుఁ జెప్పుట.)

ధర్మరాజు భీమునితో "సంతోషములేమి, పరాకు, మదము, రాగము, శాంతిలేమి, బలము, మోహము, అభిమానము, పదటము, ననెడి యిట్టిపాపము లావేశింపఁగా నీవు రాజ్యమునకుఁ బేరాస పడుచున్నావు. వీనినుండి చక్కఁగా విడివడి భోగ్యవస్తువులను మాని మిక్కిలి శాంతిగయికొని యెంతయు సుఖంబుండుము. ఈ భూమండలమునంతయుఁ దా నొక్కఁడే రాజయి యేలునట్టివానికిని గడు పొక్కటియే కదా. రాజ్యమును నీ వేమని యిట్లు కొనియాడెదవు? భరతసింహమా! ఒక్కదివమునఁగాని పెక్కుమాసముల చేతఁగాని పూరింపఁ దరముగాని యీపేరాసను నాయువంతటిచేతను బూరింప శక్యముగాదు. అగ్ని (కట్టియలచేత) దరికొలుపఁగా మిక్కిలి మంటలుగలదగును; దరికొలుపనిచో దానే యడఁగిపోవును. అట్లె రేఁగినయుదరాగ్నిని నాహారమును మట్టుపఱిచి నీ వడఁగింపుము. తెలివిలేని

వాఁడు తనపొట్ట ప్రోచుకొనుకొఱకుఁ బెక్కు హింసలు చేయును. ఉదరమును గెలువుము. దానివలన మేలొంది నీభూమి యంతయు నీవు జయించిన వాఁడవగుదువు. మనుష్యులకుఁ గల పెక్కు కామభోగములను నైశ్వర్యమును నీవు గొనియాడుచున్నావు. భోగమును దిగవిడిచినవారును దపముచేఁ గృశించినవారునగు పెక్కండ్రు మిక్కిలి యుత్తమ మయినపదవిని బొందుచున్నారు. *యోగక్షేమములును, ధర్మాధర్మములును నీయందు నిలిచియున్నవి. ఇట్టి పెనుభారమునుండి విడివడి త్యాగము (సన్న్యాసము)నే యాశ్రయింపుము. పులి తనకడుపునకుఁ గాను పెక్కుహింసలు చేయుచున్నది. ఆమృగమునుబోలి మతి మాలిన మనుష్యులు కొందఱును నామార్గమునే యనుగమించెదరు. రాజు లయియుండియు సంతోషము నొందకుండువారు పెక్కురు. కలిగిన విషయసుఖములను ద్రోసిపుచ్చి సన్న్యాసమందు మనస్సుపెట్టి సంతోషించు వాఁ డొక్కఁడే. బుద్ధుల వేఱు పాటెట్లున్నదో చూడుము. ఆకు లాహారముగాఁ గలవారును, దొరికినదానిని ఱాతిచే దంచి తినువారును, పళ్లె ఱోలుగాఁగలవారును,జలభక్షులును, వాయుభక్షులును నగు సన్న్యాసులచే నరకమిది జయింపఁబడినది. ఈ భూమండలమునంతయు నిండారఁ బరిపాలించునట్టి రాజును, రాతిని బంగారమును సమముగాఁగొను సన్న్యాసియు ననెడి యిరువురలో నాసన్న్యాసియే కృతార్థుఁడుకాని రాజుగాఁడు. ఏకార్యములయందును బూనిక లేకయు నాశలన్నియు వీడియు మమకారము మానియు నుండుము. ఇహ

---

* యోగమనఁగా నింతకు లభింపనిధనమును లభించుట ; క్షేమమనఁగా లభించినదానిని రక్షించుటయని తెలియునది.

మందును బరమందును నాశము లేనిదియు శోకరహితమయినది యునగు పదమును బొందుము. భోగమున కాసపడువాఁడు శోకమునొందును. భోగాసక్తి దిగవిడిచినవా రెంతమాత్రము శోకమొందరు. కాఁబట్టి యీభోగమునంతయు దిగవిడిచి రాజ్యముఁడును ద్యాగియేయనెడు కల్లవాదమునుండి విడివడుము. పితృయానము దేవయానమనెడు రెండు మార్గములును బ్రసిద్ధములు. వీనియందు యాగాదికర్మములను యజించువారు పితృయానముచేతను, ఆశలను దిగవిడిచిన సన్న్యాసులు దేవయానముచేతను బోవుదురు. మహర్షులు తపస్సుచేతను బ్రహ్మచర్యముచేతను వేదాధ్యయనముచేతను దేహయాత్రగడపి దేహములను విడిచి మృత్యువునకు గోచరముగాని పదమునకుఁ బోయెదరు. ఈ లోకమందు, బంధనమును (ఆశయును), అట్లె కర్మమును, ఆమిషములని (భోగయుక్తములగు పాపములని) చెప్పఁబడుచున్నవి. ఈ రెండుపాపములనుండియు విడివడినవాఁ డాపరమపదమును బొందుచున్నాఁడు. ద్వంద్వములు లేనివాఁడును సంగములనుండి విముక్తుఁడును, మోక్షదర్శియు నగు జనకుఁడు మున్నొకప్పుడు చెప్పినది. 'నా విత్త మనంతము; అట్టి నాకు నొక్కటియు లేదు; మిథిల దహింపఁబడినపుడు నాకు నొక్కటియుదహింపఁబడినదికాదు' అనియె. ప్రజ్ఞయను నుప్పరిగపయి నెక్కినవాఁడు శోకించుచున్న జనులనుజూచి తాను శోకింపఁడు; మందబుద్ధి యగువాఁడు భూమిపయినున్నను గొండపయినున్నను నిజముకనుఁగొనఁజాలఁడు. తెలిసికొనవలసినవియగు కర్తవ్యాకర్తవ్యములను దెలిసికొనువాఁడే కన్నుగలవాఁడును బుద్ధిగలవాఁడునగును. తెలియనివానిని తెలుపుటవలనను, సందేహములను

(చక్కఁగా తీర్చిచెప్పుటవలనను) బుద్ధియని చెప్పఁబడుచున్నది. బ్రహ్మనిష్ఠాపరులును జ్ఞానసంపన్నులును ఆత్మయాథాత్మ్యప్రాప్తులును నగుపెద్దలఁ గలకొలఁది నెవఁడు తెలియుచున్నాఁడో వాఁడు మిక్కిలి పేరిమినొందును. ఎప్పుడు నానావిధముల వేఱువేఱువస్తువు లయియున్న యీయాకాశాది భూతములన్నియు (ప్రళయమందు) నొక్క బ్రహ్మమను వస్తువయియుండుననియు నట్లె యాయొక్కటినుండి (నానాభూతరూపముల) ప్రపంచరూపమున విస్తారము నొందుననియుఁ దెలిసి యనుభవించునో యపుడు బ్రహ్మమును బొందుచున్నాఁడు. అట్టి బుద్ధి గలజను లాగతిని బొందుదురు; కాని తపస్సులేనివారును, బుద్ధిహీనులును, తెలివిలేనివారును, నల్పసత్త్వులును దానిని బడయనేరరు. అన్నియు బుద్ధియందు నెలకొని యున్నవి' అనెను. ఇది పదునేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు జనకునకును నతని భార్యకును జరిగినసంవాదమును జెప్పి కర్తవ్యము నుపదేశించుట.

ధర్మరా జిట్లుచెప్పి మిన్నకుండఁగా నర్జునుఁ డతనివాక్యములు శల్యములవలెఁ దన్నుఁబీడింపఁగా శోకమునను దుఃఖమునను దపించుచు నతనితో "రాజా! విదేహరా జగుజనకునకు నతని భార్యతోడఁ గలిగిన సంవాద మనెడియీ యితిహాసమును జనులుచెప్పుదరు. జనకుఁడు రాజ్యమును దిగవిడిచి బిచ్చమెత్తు

టకు మనస్సున నిశ్చయించియుండఁగాఁ జూచి యతనిభార్య దుఃఖితయగుచ్చెను. 'ధనములను బలువిధము లయినరత్నము లను బిడ్డలను జెలికాండ్రను విడిచి యిట్లు పవిత్రమయిన మార్గమును వదలి జనకుఁడు మూఢత్వము నొందెను. ఆశ యును మచ్చరమునుమాని యకించనుఁడై (ఏమియు లేని వాఁడై) భైక్షవృత్తిని గయికొని యొకపిడికెఁడు యవలనో లేక బియ్యమునో యెప్పుడు వచ్చునాయని యాజనకుఁ డెదురుచూ చుచుండుటను నతని ప్రియభార్యగాంచెను. ఆయమ మన స్విని గావున దేనివలనను భయమువిడిచియున్న తనభర్తను దగ్గఱి కుపితయై యేకాంతముగ సహేతుకము లయినమాట లతో 'ధనధాన్యసమన్వితుండ వగునీవు సొంతమగురాజ్యమును దిగనాడి పునుకబిచ్చమును గయికొని యొకపిడికెఁడు ధాన్య మెప్పుడు దొరకునాయని యెదురుచూచెదవేల? రాజా! నీ పట్టువేఱు; నీచేష్టవేఱు; గొప్పరాజ్యమును ద్రోసిపుచ్చి స్వల్ప మునకుఁ బేరాసపడెదవు. రాజా! ఈపిడికెఁడుబియ్యమును గొని యతిథుల నారాధింపవచ్చునా? లేక దేవతలను ఋషు లను బితరులను నారాధింపఁగూడునా? నీవుపడెడియీశ్రమము వ్యర్థమేచుమీ! రాజా! కర్మమునువిడిచితివి గాన దేవతలు నతిథులును బితరులును మొదలయిన వారందఱిచేత దిగవిడు వంబడి పోవుచున్నావు. మూఁడువేదములు దెలిసినవారును పెద్ద లు నయిన పెక్కువేలబ్రాహ్మణులను రక్షించువాఁడవై యుండి యిట్లు నీవిపుడు పరులవలననుండి పొట్టపోషించికొనుటకు ధన మును గోరెదవా! వెలుఁగుచున్నలక్ష్మిని దిగవిడిచి కుక్కవలె నిపుడు కనఁబడుచున్నావు. ఇపుడు మీతల్లి బిడ్డలేనిదగుచున్నది.

కౌసల్యయు నీవలనఁ బతిలేనిదగుచున్నది. ధర్మమునుదక్కఁగల ప్రయోజనములను గోరెడి పెక్కురాజులు దీనులయి నీప్రియ మునుగోరుచు నిన్నేయాశ్రయించి యుపాసించుచున్నారే! వారినిసైతము పసమాలినవారినిగాఁ జేసి నీవేలోకమును బడయఁ బోయెదవు? రాజా! పరాధీను లయినమనుష్యులకు మోక్షము సందేహపడఁదగినది. కాబట్టి యిటువంటి పాపము సేయునట్టి మీకు నూర్ధ్వలోకమును గలుగదు; అధోలోకమును గలుగదు. ధర్మముదప్పని యిల్లాండ్రను దిగవిడిచి జీవింపఁగోరు నీకు మంచిలోక మెక్కడిది ? విలువగల వస్త్రములను ఆభరణములను, మాలెలను, వాసనద్రవ్యములను విడిచిపుచ్చి పనిమాలి యెందులకయి పోయెదవు? నీటితొట్టివలెను పండ్లునిండిన పెద్దమ్రానివలెను బ్రాణు లన్నిటికిని గొప్ప పవిత్రపోషకుఁడవుగానుండిన నీవు పరులను యాచింప బయలువెడలెదవే! పనిని విడిచి సన్న్యసిగా నుండినచో నేనుఁగునుగూడ మాంసాహారములగు పెక్కుమృగములును పెక్కుపురువులును దినివైచును. ఒక్క ప్రయోజనమును లేని నిన్నుఁదినుట నడుగవలెనా? ఒకఁడు నీదయిన యీకుండికను బగిల్చినను, మూఁడుగాచేర్చిన యీదండమును నీదుకాషాయమును లాగికొన్నను, నీమనస్సు వానిమీఁదనెట్లుండును? అన్నియుదిగవిడిచిన నీకు నీపిడికెఁడు బియ్యమందేమి యాసకావలసియున్నది. ఈ బియ్యమునకుఁ జేయు పనియు రాజ్యమంతటికిని జేయుపనియు నొక్కటియో? అట్లుండఁగా దీనిని నెందులకుఁగా నిశ్చయించితివి. శరీరమును గాపాడఁ గోరి యీపిడికెఁడి బియ్యమునకుఁ బాటుపడితివేని, నీతలఁపు వ్యర్థమా ? ఇంతకు రాజ్యమువహించుట మంచిది. నీకు నే

నెవ్వరు? నాకు నీవెవ్వరు? నాయందు నీకేమి జాలి? దిగవిడువ వలసిన వివి. లేనిచో నీమనస్సు కోర్కెకిఁదగినట్టు లుప్పరిగయు శయనమును వాహనములును వస్త్రములు నాభరణములును గల రాజ్యము బాలింపుము. ధనమం దాశవిడిచినవారును ధనహీను లును మిత్రులను విడిచినవారును నేమియు లేనివారును నగు సన్న్యాసులుగానుండియు సుఖమునుగోరి కుండిక దండము మొ దలగువానిని సేకరించి యుంచుకొనియుండువారిని జూచి యాశ పడువాఁడు రాజ్యమును ద్యజించునా యేమి? ఎప్పుడును బుచ్చు కొనుచుండువానికిని, ఎప్పుడును నిచ్చుచుండువానికిని గలభేద మును దెలిసికొనుము, వీరిలో నెవఁడుమే లనఁబడును? ఎప్పు డును యాచించువారును నెప్పుడును దాంభికు లయియుండువా రును నగు జనులవిషయమై యొసంగిన దక్షిణ, కారుచిచ్చులో వేల్చిన యాహుతివలె నగును. రాజా! అగ్ని, కట్టెయలను దహింపనడఁగని యట్లు, ఎప్పుడును యాచించువృత్తిగల బ్రాహ్మ ణుఁడు శాంతిగలవాఁడు కానేరఁడు. సజ్జనులకు (సన్న్యాసులకు) నన్నము పెట్టు మనుజుని జీవనమే యిహామందు నిలుకడగలది. అన్నమునొసంగురాజు లేనియెడల మోక్షమునుగోరు సన్న్యాసు లెక్కడనుండఁగలరు? ఈలోకమందు గృహస్థు లన్నము నాశ్ర యించియే జీవింపవలయును. ఆయన్నమును గొనియే సన్న్యా సులును జీవింపవలయును. అన్నమువలనఁ బ్రాణము నెలకొనఁ జాలుచున్నది. అన్నము నిచ్చువాఁడు ప్రాణము నిచ్చువాఁ డగును. గృహస్థులనుండి విడివడి, సన్న్యాసిగా నుండువారును, ఆగృహస్థులనే యాశ్రయించి సత్తువయుఁ బ్రతిష్ఠయు దాంతి యుఁ బడసికొనుచునున్నారు. యాచనవలనను, త్యాగమువల

నను, మూర్ఖ్యము (మోహము) వలనను సన్న్యాసికానేరఁడు. ఎవఁడు చక్కద్రవ్యములను దిగవిడుచునో వాఁడు ముక్తుఁడనియు సన్న్యాసియనియు నెఱుంగుము. సంగముగలవానివలె నాచరించెడి యసక్తుఁడును బంధముక్తుఁడును శత్రువునందును మిత్రునందును సమబుద్ధి గలవాఁడు నగుపురుషుఁడే ముక్తుఁడగును. మఠము, భిక్షుపుస్తకము మొదలగు పలువిధములయిన పాశములచే బద్ధులయినవారును, వ్యర్థముగా పెక్కుభోగములను వెదకువారునై, ముండనము గావించుకొని కాషాయవస్త్రములుగట్టి తమకు దానముదొరకుటకై సన్న్యాసము నొందుచున్నారు. వేదమును దమపేరువాసిని పుత్రులను దిగనాడి బుద్ధి మాలినవారు ముమ్మడికోలయుఁ గావివస్త్రమును గయికొనుచున్నారు. మనస్సునందలి రాగాదిరూప మయినకషాయము (దోషము) పోకుండఁగా పైనిగట్టికొను కాషాయమేదో యొక విషయవాంఛనుబట్టి యనియె తెలియుము. ధర్మవేషధారులగు ముండులకది పొట్టప్రోచికొనుకొఱకని నామతము. మహారాజా! నీవు జితేంద్రియుఁడవై కాషాయము కడవసము నారచీరలను ధరించినవారును, నగ్నులును (అవధూతులును), జటలఁదాల్చినవారును ముండులు నగుసాధువులను భరించుచు లోకములను జయింపుము. అగ్న్యాధానకర్మమును, గురువుకొఱకు మంచి దక్షిణలతోఁ గూడినయజ్ఞములను నహరహము చేయువాని కంటెను ధర్మపరాయణుఁ డెవఁడు? ” అని చెప్పినదయ్యెను. రాజా! ఈ లోకమందు జనకుం డనురాజు తత్త్వజ్ఞుఁడని చెప్పుదురు. అతఁడునయిత మిట్టిమోహము నొందెను. కాఁబట్టి నీవు మోహమునకు లోనుగాకుము. మనమెప్పుడు నిట్టిధర్మము

నాచరించుచు దానతపఃపరులమై యానృశంస్యగుణముకలిగి కామక్రోధములు మాని, యుత్తమముగ దాంతిని గయికొని ప్రజలను బాలించుచు పెద్దలను గురువులను బూజించుచు యాగములుచేసి మంచిలోకములను బొందెదము; బ్రాహ్మణులకు ననుకూలురమై సత్యముపలుకుచు దేవతలకును నతిథులకును దక్షిణప్రాణులకును విధిచొప్పునఁ దృప్తి గావించుచు నిష్టంబగు పదమును బడయుదము' అనెను. ఇది పదునెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ ధర్మరాజు సన్న్యాసమే యుత్తమమని యర్జునునకుఁ జెప్పుట. }

ధర్మరాజర్జునునితో 'నాయనా! ధర్మశాస్త్రములను బ్రహ్మశాస్త్రములను, నే నెఱుంగుదును. 'కర్మమును జేయు' మనియు 'కర్మమును విడువు'మనియుఁ జెప్పు రెండువిధములగు వేదవచనమును నెఱుంగుదును. పెక్కులు హేతువులనుగొని విచారము చేసినను, శాస్త్రము లొండొంటికిఁ బొసంగక కలఁగూఁడగా నుండును. ఇట్టిశాస్త్రమం దేది సిద్ధాంతమో దానిని యథావిధి నేనెఱుంగుదును. నీవో శాస్త్రమును (పైపైని) మాత్రము చదివినవాఁడవు. * వీరవ్రతముతోఁ గూడినవాఁడవు. శాస్త్రములోని యర్థమును గలరూపునఁ దెలిసికొన నీ వేవిధమునను సమర్థుఁడవు గావు. ధర్మమును గనుఁగొన్నవాఁడవేని నీ విట్లు పలుకవు. శాస్త్రములోని యర్థము కలరూపును దెలిసినవాఁడును ధర్మనిశ్చయమును జక్కఁగా నెఱింగిన

---

* వీరవ్రతమనఁగా బీరంపుపట్టుదల.

వాఁడును నిట్లు చెప్పనేచెప్పఁడు. అయినను అర్జునా ! తోడఁ బుట్టిన నెయ్యమునుదియ్యము నూఁది నీకు న్యాయమని తోఁచిన తెఱఁగున యుక్తముగ నీ వాడినమాటలకు నేను సంతసించితిని. బ్రహ్మకును మహేశ్వరునకును వాసుదేవునకును సమమయిన ప్రాణియొక్కటియు నింతవఱకుఁ గలిగినదిగాదు ; ఇంకను గలుగనేరదు. అట్లే మేటియోధులందు నీవే మిన్న వనుట సర్వసమ్మతము. నీకు మించినయోధ నింతకును నిఁక మీఁదను గలుగఁడు. ఇంద్రునియందును వాయువునందును విష్ణుదేవునియందును నెట్టి బలముగలదో యట్టిబలము నీయందును భీమునియందును నున్నది. అర్జునా ! చిత్రయుద్ధముసేయుటయందును కడుదూరమునుండి కూల్చుటయందును దివ్యాస్త్ర బల సంపత్తియందును నీకు సముఁ డయినవాఁడు వేఱెవ్వఁడు గలఁడు ? యుద్ధధర్మము లన్నిటియందును, పెక్కు క్రియానైపుణములందును నీకు సాటియైనవాఁడు మూఁడులోకములందును గలుగఁడు ! ధర్మమును ధర్మమును సంబంధించినదియు నిశ్శేషముగా నాకుఁ దెలియును. ధర్మసూక్ష్మమును జెప్పు విషయమున నన్నుఁగడచుట నీ కలవిగాదు. అర్జునా ! నాబుద్ధికిఁ దోఁచువిషయమునందు నీవుసందేహపడవలదు. నీవు యుద్ధశాస్త్రమును దెలిసితివేకాని వృద్ధులను సేవించినాఁడవుగావు. ధర్మంపు సంగ్రహమును విస్తరమును దెలిసిన యీ పెద్దలనిశ్చయమును నీవుదెలిసినవాఁడవుగావు. నాయనా ! తపము, త్యాగము, అవిధి యనెడియీ మూఁడును బుద్ధిమంతులచేనిశ్చయింపఁబడినవి. వీనిలో నొకటికంటెను మఱొకటి యెక్కుడని మా మతము. ధనమునకు నెక్కుడయినది లేదని నీవు తలంచు

చున్నావు. ఈ ధనము ప్రధానముకానిదని నీకుఁ దెలిపెదను. లోకమందుఁదపస్సును వేదాధ్యయనమును సహజముగాఁ జేయు చుండుధార్మికులు పెక్కండ్రు చూపట్టుచున్నారు. అట్లు తప ముసేయుఋషులకు శాశ్వతము లయినలోకములు కలుగుచు న్నవి. అరుణులు, కేతవులు ననెడి కొందఱు ఋషులు మీసలు దలసూపు పసిప్రాయముననే ధీరులయి వనములకుఁబోయి వేదా ధ్యయనముచేసి దివ్యలోకమును బొందియున్నారు. (తపము పెం పిట్టున్నది) విషయముల నిగ్రహించి యజ్ఞానమువలనిచీఁకటిని దిగవిడిచి యార్యులుకొందఱు దేవయానమనెడియుత్తమమా ర్గమునఁ ద్యాగవంతులు (సన్న్యాసులు) పొందు లోకములను బొందియున్నారు. (త్యాగము పేర్మి యిట్టిది). పితృయానమనెడి దక్షిణపుమార్గమునఁ బోయి చంద్రలోకమును బొందువారు కర్మమునం దుండువారలే. వారు శ్మశానములకుఁ బోవువారు. మోక్షమునొందువారు దేనిని గాంతురో యిట్టిదట్టి దని నిర్దేశిం పరాని యాబ్రహ్మపదమే పూర్వోక్తమయిన 'అవిధి' యను మూఁడవదిగాఁ జెప్పఁబడుచున్నది. ఇట్లుత్తమపదమునకుఁ గార ణమగుటచేఁ ద్యాగము స్థానములందు ముఖ్యమయినదని నామ తము. అది నినుబోఁటివారలకుఁ దెలుపుట మిక్కిలియుఁ గష్ట మైనది. సారాసారములను దెలిసికొనఁగోరు కవులు 'ఇక్కడనుం డునా ?. ఇక్కడనుండునా ?' అని పెక్కుశాస్త్రములను విమ ర్శించి యిట్టినిశ్చయమును బొందియున్నారు. దీనికలరూపు దెలి యని జనులు వేదములను శాస్త్రములను నుపనిషత్తులను గడచి యరఁటిచెట్లను జీల్చి సారమును గాననియట్లు కనుంగొనరయిరి. అట్టివా రేకాంతముగా నుండుట యను త్యాగమార్గమును

ద్రోసిపుచ్చి పంచభూతాత్మక మయినయీ శరీరమందుఁ గల యాత్మను పెక్కులింగితములచేత నిచ్ఛాద్వేషములతోఁ గూడినదిగాఁ జెప్పెదరు. అది యిట్టిదిగాదు. అది కన్ను (మొదలయిన యింద్రియముల)కు నందరానిది; వాక్కుచే నిట్టిదనిపలుకనలవిగానిది. అట్టియాత్మ కర్మకారణ మయినయజ్ఞానమును బురస్కరించుకొని భూతశరీరములందుఁ బుట్టివచ్చుచున్నది. మనుష్యుఁడు తృష్ణను నిగ్రహించి కర్మపరంపరనువిడిచి యహంకారమునొందక శుభంబగు మోక్షమార్గంబునఁ జని సుఖమొందవలయును. అర్జునా! సత్పురుషులు సేవించునదియు సూక్ష్మంబునఁ దెలియఁ దగినదియునయిన యీమోక్షమార్గముండఁగాఁ, బెక్కులనర్థములు నిండియున్నవస్తువును నీ వెట్లు కొనియాడెదవు? కర్మవిదులయిన వారును, ఎప్పుడును దానము యాగము మొదలయిన కర్మములందు నిరతు లయినవారును, నగుజనులుగూడ నీధనమును నిట్లే యనర్థములు నిండినదనియు, మోక్షమార్గమే మేలయినదనియుఁ గాంచుచున్నారు. హేతువులను జక్కఁగా నెఱింగిన పండితులును దృఢమయిన పూర్వకర్మవాసనవలన మోక్షము లేదనియే వాదించుచు మూఢులైయున్నారు. వారిని మంచిదారికిఁ ద్రిప్పుట మిక్కిలియుఁ గష్టము. పెక్కుశాస్త్రములను జదివి పలువిధములుగా మాటాడఁజాలువారు కొందఱు జనసమూహములందు నసత్యములాడుచుఁ బరుల నవమానించుచును భూమియంతయు సంచరించుచున్నారు. పార్థా! ఏ విషయములను మనము చక్కఁగాఁ దెలిసికొనమో వానిని దక్కినవాఁడెట్లు దెలియ నర్హుఁడగును? శాస్త్రవిత్తములును ప్రాజ్ఞులునైనగొప్ప పండితులును నిట్లు చక్కఁగాఁ దెలియకున్నవారే

యగుదురు. ధర్మము దెలిసినవాఁడు తపస్సుచేత గొప్పవైరాగ్య మునొందుచున్నాఁడు. దానివలని బుద్ధి (జ్ఞానము)చేత బ్రహ్మము నొందుచున్నాఁడు త్యాగముచేత నెప్పుడును సుఖమునొందు చున్నాఁడు'' అనెను. ఇది పందొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

దేవస్థానుఁడు ధర్మరాజునకు యాగము చేయుమని చెప్పుట.

ఇట్లు మాటలాడికొనుచుండఁగా, మాటకారియు మహాతపస్వియు నగు దేవస్థానుఁడు మిక్కిలి యుక్తియుక్తమగు వాక్యమున ధర్మరాజుతో 'ధనమునకంటె నెక్కుడయినది లేదనియర్జునుఁడు చెప్పిన విషయమున నీకుఁ గొంచెము తెలిపెదను. మనస్సు నిలుకడగా నిలిపి వినుము. అజాతశత్రూ! నీ వీ భూమి నంతయు రాజధర్మముచొప్పున జయించితివి. అట్లు జయించిన దానిని వ్యర్థముగా దిగవిడుచుట నీకు న్యాయముగాదు. బ్రహ్మమును బొందుటకు బ్రహ్మచర్యము మొదలయిన నాలుగాశ్రమములును నాలుగు మెట్లుగల నిచ్చెనగా నేర్పడియున్నది. రాజా! ఆనాలుగు మెట్లను వరుసగా విధిచొప్పున జయింపవలయును. కాఁబట్టి, పెక్కు దక్షిణలతోఁగూడిన మహాయజ్ఞములను యజింపుము. వేదాధ్యయనమే యజ్ఞముగాఁ గలబ్రహ్మచారులును, బుద్ధ్యర్థము కర్మనిష్ఠులయిన గృహస్థులును, అడవికిఁ బోయి తపోనిష్ఠులగు వానప్రస్థులును, బ్రహ్మజ్ఞానమే యాగముగాఁ గల సన్న్యాసులునని నాలుగాశ్రమములవారిని దెలియుము.

కుంతీపుత్రా ! వైఖానసులు (వానప్రస్థులు) 'ఆశపడి ధనముసంపాదించి కర్మముచేయుటకంటెను నాశనువిడుచుటయే గొప్ప.' యనిచెప్పినట్లు వినికి. క్షత్రియుఁ డాకర్మమును జేయఁ గైకొన్నచో మిక్కిలియు దోషమునొందును. విద్వాంసులు కర్మశాస్త్రము విధిచొప్పున ద్రవ్యములనెల్ల నొక్కటిగా సమకట్టికొనుచున్నారు. మనసునందుఁ దృఢమగలిగి యర్థానర్థములను వివేచించి తెలియనివారు (తమదేహము ధనము మొదలయినవానిని)నర్థంబగుయాగాదికర్మములకు వినియోగింపక యనర్థంబగువానియందుపయోగించెదరు. వారు తమకుఁ గలిగెడియిట్టిపెనుదోషమును దెలియరు. వారలకు ధర్మము (చిత్తశుద్ధి) గలుగుటయు దుష్కరము. బ్రహ్మ, యాగములకొఱకు ధనములనుసృజించెను; వానిని రక్షించుమనుష్యునిని యాగము చేయఁగోరియే సృజించెను. కాఁబట్టి ధనములనెల్ల యాగమునందే యుపయోగింపవలయును. యాగము చేసినచోఁ దోడనే వలయుసిద్ధిని బడయవచ్చును. మహాతేజుం డయినయింద్రుఁడు రత్నములను దక్షిణగాఁగొని పెక్కులు యాగములుచేసి సమస్తదేవతలకు నెక్కుడయినయింద్రపదివిని బొంది వెలుంగుచున్నాఁడు. కాఁబట్టి యజ్ఞమందు ధనములనెల్ల నుపయోగింపవలయును. కృత్తివాసుండును మహాత్ముండును దేవదేవుండు నగుశివుఁడు సర్వమేధమనెడి యజ్ఞమందుఁ దన్నే హోమముచేసి యీ లోకములనంతయుఁ దనకీర్తిచే నించి తేజంబున విరాజిల్లుచున్నాఁడు. మరుత్తుఁ డను రాజు తనపుణ్యంపుఁబెంపువలన దేవరా జయినయింద్రుని సయితము జయించెను. వాఁడు చేసినయాగమందు పాత్రము లన్నియు బంగారుతోఁ జేయంబడినవై యుండెను. లక్ష్మీదేవి తానే

చక్కయాగమునకు వచ్చెను. హరిశ్చంద్రుఁడను రాజు, పెక్కు యాగములుచేసి పుణ్యమునొంది శోకముపీడి తాను మనుష్యుఁడై యుండియుఁ దన పెంపుచే దేవేంద్రునిఁగూడ జయించెనని వినలేదా ? కాఁబట్టి సమస్తధనములను యాగమునందు విని యోగింపవలయును ' అని చెప్పెను. ఇది యిరువదియవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ దేవస్థానుఁడు ధర్మరాజునకు స్వధర్మము ననుష్ఠించుటయే యుత్తమమని చెప్పుట. }

దేవస్థానుఁడు "క్షత్రియునకు యాగాదికర్మమేన్యాయమా ?" యను విషయము నొకసమయమున నింద్రుఁడడుగఁగా బృహస్పతి చెప్పిన యీపురాతన మయినయితిహాసమును జెప్పెదరు. సంతోషము స్వర్గమునకు సమము; సంతోషము పరమసుఖము. సంతుష్టికి మించిన దొకటియులేదు. తాఁబేలు తనయవయవములు ముడుఁచుకొనునట్లు కామముల నన్నిటినుండియు నొకఁడెప్పు డింద్రియములనుదీసి లోపలనడంచుచున్నాఁడో యపుడుజ్యోతిరూపమయినయాత్మ తనయందే తోడనే ప్రసన్నమగుచున్నది. అప్పుడు సంతోషము నెలకొనుచున్నది.ఎప్పు డొకఁడుతాను బరులవలనను బరులు తనవలనను భయపడుటలేదో, ఎప్పుడు కామద్వేషములను గెలుచుచున్నాఁడో, యప్పుడాత్మను దర్శించుచున్నాఁడు. ఎప్పుడు కర్మముచేతను, మనస్సుచేతను, వాక్కుచేతను, నేప్రాణినిగుఱించియు, నపకారమును నుపకారమును జేయఁబూ

కుఁడో యప్పుడు మనుష్యుఁడు బ్రహ్మము నొందుచున్నాఁడు. ఇట్లు ప్రాణు లాయావిధములఁ గావించు నాయాధర్మముల నప్పుడప్పుడు తామే యనుభవించుచున్నవి. కాఁబట్టి నీవును నీకుఁ దగినధర్మమును దెలియుము. కొందఱు సామవచనములను గొనియాడెదరు. కొందఱు యాగాదికర్మములను గొనియాడె దరు. మఱికొందఱు సన్న్యాసమును గొనియాడెదరు. వీని యం దొకటిని గొందఱును మఱొక్కటిని గొందఱును గొని యాడుట లేదు. కొంద ఱీరెంటిని గ్రమంబుగఁ గొనియాడెదరు. కొందఱు యజ్ఞమునుగొనియాడెదరు. కొందఱు సన్న్యాసమును గొండాడెదరు. కొందఱు దానమును గొందఱు ప్రతిగ్రహమును (పుచ్చుకొనుటను)గొనియాడెదరు. కొంద ఱన్నిటినివిడిచి మిన్నక ధ్యానము చేయుచుండెదరు. చంపియుఁ గోసియుఁ జీల్చియుఁ బ్రాణులను బరిపాలించురాజ్యమును గొందఱుపొగడెదరు. కొంద ఱేకాంతమున ధ్యానముచేయుచుండెదరు. వీనినంతయుఁ జక్కఁ గా విమర్శించి పండితులు నిశ్చయించినది. 'ప్రాణులకు ద్రోహ ము చేయకయ చేయుధర్మమే సజ్జనులకు సమ్మతమైనది' యనుట యే. ద్రోహములేమి, సత్యమాడుట, దానము, దయ, దమము, స్వభార్యయందుఁ బుత్రోత్పత్తిచేయుట, మృదుత్వము, లజ్జ, చప లములేమి, యనెడు నివి ముఖ్య మయినధర్మమని స్వాయంభువ మనువుచెప్పెను. కాబట్టి దీనిని బ్రయత్నమునఁ బ్రతిపాలింపు ము. రాజ్యమునందుండు రాజెవఁ డెప్పుడును వశియై, ప్రియా ప్రియముల సమముగాఁ దలఁచి యాగముచేసి మిగిలినదానిని భుజించుచు, శాస్త్రార్థము కలరూపునెఱింగి, సాధురక్షణమందును నసాధుశిక్షణమందు నాసక్తుఁడై, నీతిదప్పక ప్రజలను ధర్మమా

ర్గమందు నెలకొలిపి, యట్లు కడపట రాజ్యమును బుత్రునియం దుంచి వనమునకుఁబోయి వన్యములయినవానిచే జీవించుచు ధర్మము గట్టిగానూఁది ప్రాలుమాలిక లేక తనయాశ్రమమునకుఁ దగు కర్మములనుచేయువాఁడగునో యట్టిరాజునకే యిహమునుబరమును సార్థకములగును. మోక్షము పెక్కువిఘ్నముల కలదనియుఁ బడయుటకు మిక్కిలికష్టమయినదనియు నామతము. పూర్వోక్తమయినధర్మము నాచరించినరాజు లనేకులు, సత్యమును దానము తపస్సునుగలవారును, ఆనృశంస్యగుణముతోఁ గూడినవారును, కామక్రోధరహితులును, ప్రజాపరిపాలనయుక్తులును, గోవుల కొఱకును బ్రాహ్మణులకొఱకును యుద్ధము సేయువారునునై యుండి యత్యుత్తమయినగతిని బొందియున్నారు. ఇట్లు వసువులును, రుద్రులును, ఆదిత్యులును, సాధ్యులును పెక్కండ్రు రాజర్షులును నీధర్మము నాశ్రయించి పుణ్యములయిన తమకర్ములచేతఁ దప్పక స్వర్గలోకమును బొందియున్నారు' అనెను. ఇది యిరువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{అర్జునుఁడు క్షత్రియధర్మము మేలయినదని ధర్మరాజునకుఁ జెప్పుట.}

ఇట్టిసమయమునందే, యర్జునుఁడు మనంబున నేమియుఁ దోఁపక వగచుచున్న తనయన్నను ధర్మరాజునుజూచి మరల "పురుషసత్తమా! నీవు ధర్మజ్ఞుండవు. నీకుఁ దెలియనిదేమున్నది? క్షత్రియులధర్మముచేతఁ బగవారిని జయించి మిక్కిలి దుర్లభ

మఱియాన యీరాజ్యమును బడసినపిదప నీవేల మిక్కుటముగాఁ దపించెదవు ? మహారాజా ! రాజులకు యుద్ధమందు మృతినొందుట సమ్మతమయినది. క్షత్రధర్మమును బహుయజ్ఞములతోఁ గూడినదానిని దలంచిచూడుము. బ్రాహ్మణులకు త్యాగము (సన్న్యసము) చే మరణమొందుట ధర్మమని విధింపఁబడి యున్నది. క్షత్రియులకో యుద్ధమందు మరణము విధింపఁబడియున్నది. ఒకప్పుడు నాయుధము నెడఁబాయకుండుటక్షత్రియధర్మము మిక్కిలి భయంకర మయిన దందురు. భరతసత్తమా ! క్షత్రియధర్మమును జేకొన్నవాఁడు బ్రాహ్మణుఁడుగా నుండినను వాఁడాయుధముచేత యుద్ధమున వధింపఁబడుట న్యాయముగా నున్నది. క్షత్రియజాతియందుఁ బుట్టుట ప్రశస్తమయినది. క్షత్రియజాతి వేదమునుండి పుట్టినది. త్యాగము (సన్న్యసము) ను యాగమును తపస్సును పరులసొమ్ముచే బ్రతుకుటయు క్షత్రియునకు విహితములుగావు. అట్టిక్షత్రియజాతియందుఁ బుట్టి ధర్మములన్నియుఁ దెలిసి ధర్మబుద్ధిగలిగినట్టి రాజవు; సమర్థుండవు; లోకమునందు నెక్కువతక్కువలును ముందువెనుకలును గనుఁగొని యున్నవాఁడవు. నీ విట్టిసంతాపమువలని శోకమును ద్రోసిపుచ్చి స్వధర్మమందు బద్ధుఁడవగుము. క్షత్రియుని హృదయము విశేషించి వజ్రసమానమై యుండవలయును. క్షత్రధర్మము చొప్పున శత్రువులనుజయించి యేయడ్డిలేక రాజ్యమును బడసినపిదప నింద్రియముల జయించినవాఁడవై యజ్ఞదానతత్పరుండవై యుండుము. కశ్యపప్రజాపతి పుత్త్రుఁడైనయింద్రుఁడు క్షత్రియధర్మము గయికొని పాపవృత్తులయిన జ్ఞాతులను నెనమన్నూటపదుంద్రనుజంపెను. రాజా ! అతఁడు చేసినయాపని పూజ్యమును

ప్రశంసింపఁదగినదియు నయ్యెను. ఆకారణముచేతి నతఁడు దేవతలకు రాజు నయ్యె నని మాకు వినికి. మహారాజా! మనుష్యుల కింద్రుఁడ వయినసీవు నింద్రునివలెనే యేతుందుడుకును లేక చిరకాలము బహుదక్షిణలతోఁ బెక్కులు యాగములుచేయుచుండుము. క్షత్రియధర్మము చొప్పున శస్త్రముచేతఁ బరిశుద్ధులై పరలోకమందు మంచిగతిని బొందినజ్ఞాతులను గుఱించి యిట్లు కొంచెమయినను దుఃఖింపకుము. భరతసత్తమా! ఏది జరిగినదో యది యట్లే జరుగవలయును జుమీ. దైవమును గడవఁదరముగాదుగదే" యనెను. ఇది యిరువది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(వ్యాసుఁడు ధర్మరాజునకు శంఖలిఖితోపాఖ్యానమునుజెప్పి క్షాత్రధర్మమును గయికొనుమని బోధించుట.)

వైశంపాయనుఁడు జనమేజయునితో 'రాజా! అర్జునుఁడిట్లుచెప్పఁగా ధర్మరాజేమియుఁ బలుకఁడయ్యె. తోడనే వ్యాసుఁ డతనిని జూచి 'ధర్మపుత్రా! నీవు సౌమ్యుఁడవుగదే. అర్జునుఁడు చెప్పినది సత్యమే. శాస్త్రమందు గృహస్థాశ్రమ ముత్తమధర్మమని చూపట్టుచున్నది. నీవును ధర్మము తెలిసినవాఁడవు. శాస్త్రముచొప్పున, విధ్యుక్తరీతిని, నీ సొంతధర్మమును నీవు చేయుము. గృహస్థాశ్రమమునువిడిచి వనమునకుఁ బోవుట నీకు విహితముగాదు. దేవతలును బితృదేవతలును అతిథులును భృత్యులును నెప్పుడు గృహస్థు నండగొనియే జీవించెదరు.

రాజా ! వారిని భరింపుము. పక్షులును బశువులును మఱియుఁ దక్కిన ప్రాణులును గృహస్థులచేత నే రక్షింపఁబడుచున్నవి. కాఁబట్టి గృహస్థాశ్రమమునందలివాఁడే శ్రేష్ఠుఁడు. ఈ నాలుగాశ్రమములలో నాగృహస్థాశ్రమము నాచరించుట కష్టము. ఇంద్రియపటిమ లేనివారలకు ననుష్ఠింపఁ గష్టమయిన యీవిధిని నీవు చక్కఁ నడపుము. నీకు వేదములందు జ్ఞానము పూర్ణముగ నున్నది. పెనుతపమును జేసియున్నావు. కాఁబట్టి పిత్రుపైతామహమైన రాజ్యమును బరువును వహించినట్లు నీవుభరింపవలయును. మహారాజా! తపస్సు యజ్ఞము, అధ్యాత్మవిద్య, భిక్ష, యింద్రియ నిగ్రహము, ధ్యానముః, చదువునందలి ప్రీతి, సంపదయందుఁ దృప్తి, ఏకతముండుట, సంతోషము, తనశక్తికోలఁది దానము ననెడి యిట్టి ధర్మములన్నియు బ్రాహ్మణులకు సిద్ధికరములుగా విధింపఁబడినవి. క్షత్రియుల కయినధర్మములు నీకుఁ దెలిసియుండినను, మరలఁ జెప్పెదను. యాగమును విద్యయు ప్రీతియు ధనమందుఁ దృప్తిలేమియు దండమును దాల్చియుండుటయు వేంద్రపుఁదనమును ప్రజాపరిపాలనమును వేదమునంతయు దెలియుటయుఁ దపమును మంచినడవడియు, నవ్వారిగా ధనమార్జించుటయు సత్పాత్రమునకు దానము ననెడి యీ సత్కర్మములు రాజులకు నిహమును బరమును సాధించి యిచ్చునని మనకు వినికి. రాజా ! వీనియంచెల్ల దండమును దాల్చుటయే యెక్కుడయినదని చెప్పుదురు. క్షత్రియునియందు బలమును, బలమునందు దండమును, నెప్పుడు నెలకొనియున్నది. ఇట్టికార్యములే రాజులకు రాజ్యసిద్ధిని గలిగించునవి. బృహస్పతి 'యుద్ధము చేయని క్షత్రియునిని దేశసంచారము చేయని బ్రాహ్మణునిని

సర్ప మెలుకలను మ్రింగునట్లు భూమి మ్రింగుచున్నది'! యని యీగీతమును బాడెను. సుద్యుమ్నుఁడను రాజఋషియుఁ బ్రచేతసపుత్రుఁడయిన దక్షునివలె దండమును ధరించుటవలనఁ బరమంబయిన సిద్ధిని బొందెనని వినఁబడుచున్నది ' యనెను. అందులకు ధర్మరాజు వ్యాసునితో 'మహాత్మా! సుద్యుమ్నుండను రాజే కర్మమువలన నుత్తమసిద్ధిని బొందెనో వినఁగోరుచున్నాను ' అనెను. వ్యాసుఁడతనితో ' ఈవిషయమందుఁ బురాతనమయిన యితిహాసమును జెప్పెదను. వాఁడి నియమములుగల శంఖుఁడు లిఖితుఁడను నిద్దఱు సహోదరులుండిరి. వారికి బాహుదయనెడి నదితీరమున రెండాశ్రమములు వేఱువేఱ నుండెను. అవి నిత్యపుష్పఫలములుగల వృక్షములుగలిగి రమణీయములై యుండెను. అట్లుండఁగా నొకకాలమున లిఖితుఁడు శంఖుని యాశ్రమమునకు వచ్చెను. అప్పుడు శంఖుఁడు దైవికముగా నాశ్రమమువిడిచి బయటఁబోయి యుండెను. సహోదరుని యాశ్రమమునకుఁ బోయిన యాలిఖితుఁడును నపు డందు విహరించుచు నచటఁ జక్కఁగాఁ గమియఁబండి యున్నకొన్ని పండ్లనుగోసెను. ఆపండ్లనెత్తి యాబ్రాహ్మణుఁడు జంకుగొంకులేక భుజింపఁదొడంగెను. అతఁడు దినుచుండు సమయమందే శంఖుఁడు నాశ్రమమువచ్చి చేరెను. అట్లు తన తమ్ముఁడు లిఖితుఁడు పండ్లను దినుచుండుటను జూచి యతఁడు " ఈపండ్లు ఎక్కడదొరికినవి ? ఏలతినుచున్నావు ?' అని యడిగెను. తోడనే యాలిఖితుఁడు తనయన్నయగు శంఖుని దగ్గఱకుఁబోయి నమస్కరించి ' ఇక్కడనుండియే యీపండ్లను నేనెత్తికొంటిని' యని వేడుకగా నవ్వుచుఁ జెప్పెను. తోడనే శంఖుఁడు తీవ్రమయిన కోపమునొంది "నీయంతట నీవు పండ్ల

నె_త్తికొంటివి గావున నిది దొంగలించుట యగును. కాఁబట్టి రాజునొద్దకుఁబోయి 'రాజస_త్తమా! ఇయ్యనిదానిని నేనె_త్తికొంటిని. కాఁబట్టి దొంగనయితిని. నన్ను దొంగగాఁ దెలిసి దొంగకుఁ దగుదండమును విధించి నీస్వధర్మము (దండధారణము)ను గాచుకొనుము' అని తెలిసికొనుము'' అనెను. అతఁడు చెప్పినచొప్పున లిఖితుఁడు వాఁడి నియమముగలవాఁడు గావున రాజగు సుద్యుమ్నునికడకుఁ బోయెను. ఆరాజును ద్వారపాలకుల వలన లిఖితునిరాక విని మంత్రులంగూడి కాలినడకనే వచ్చెను. అట్లు వచ్చిచేరి యారాజు ధర్మవిదులందు మిన్నయైన యా లిఖితునితో 'మహాత్మా! ఎందులకురాక! వలసినదిచెప్పుము; అది చేసినట్లేచుమీ' అనెను. అందుల కాబ్రహ్మర్షి సుద్యుమ్నునితో 'నేను జెప్పినదివిని చేసెద'నని ప్రతిజ్ఞచేసితివి గావునఁ జేయవలయును. నాకువలయునది మఱేమిగాదు. మాయన్న యిచ్చ్యనిపండ్ల నేనై యె_త్తికొని భక్షించితిని. ఆ విషయమై నన్నుదండింపుము. జాగువలదు' అనెను. సుద్యుమ్నుఁడు 'బ్రాహ్మణో_త్తమా! దండమును విధించుటయందు రాజుప్రమాణ మనుట మీమతమేని దండమునువిధించుట రాజును సంబంధించినదనుట మీకుఁ బ్రమాణమేని అనుజ్ఞయిచ్చుటయందు నతఁడే ప్రమాణము కావలయును. కాఁబట్టి నే ననుజ్ఞయిచ్చితిని. దానిచేతనే దోషముపీడి శుద్ధుండవై తివి. ఇదిగాక మఱియు నేవేని కోరికలడుగుము. నీవడిగినట్లు చేసెదను' అనెను. మహాత్ముఁ డారాజు కోరినది యడుగు మనివేఁడుచుండఁగా నాబ్రాహ్మణుఁడు దండముతప్ప మఱేవరమును గోరఁడయ్యె. అంత రాజ మ్మహాత్మునిచేతులను రెంటిని ద్రుంచెను. అతఁడును దండముఁ

బొంది యన్నయగు శంఖునియొద్దకుఁ బోయి 'నా యపరాధమునకు దండనము పొందితిని; నాదుర్బుద్ధికి నీవు క్షమింపవలయును' అని యార్తితోడఁ జెప్పెను. శంఖుఁడు 'ధర్మజ్ఞా! నీయెడ నాకుఁ గోపము లేదు. నీవు నాకేమియుఁ జెఱుపుచేయవు. మనకులము మిక్కిలి నిర్మలమయినదని యీలోకమందుఁ బ్రసిద్ధికెక్కినది. అందుఁబట్టి నీవు ధర్మమును నతిక్రమించితివి గాన యాదోషమునకై నీకుఁ బ్రాయశ్చిత్తము చేయఁబడినది. నీవు శీఘ్రముగా బాహుదానదికిఁబోయి విధ్యుక్తముగా దేవతలకును ఋషులకును బితరులకును దర్పణములు చేయుము. ఇఁకనధర్మమందు మనస్సు చెల్లింపకుము. తెలిసినవారు బ్రహ్మహత్యను సురాపానమును దొంగతనమును గురుతల్పగమనమును, నివిచేయువారితోడి కూటమియు, ననువీనిని మహాపాతకములని చెప్పెదరు. వీనియందును దొంగతనమునకు సాటియైన మహాపాతకము లేదు. దొంగతన మీలోకమునందు బ్రహ్మహత్యకు సమానమగును. సకలపాతకులకును శరీరదండము ప్రాయికముగా చెప్పఁబడుచున్నది. దొంగకో విశేషించి శరీరదండమే కాని యదితప్ప వేఱుదండము విధింపఁబడకున్నది. బ్రాహ్మణుఁడును క్షత్రియుఁడును వైశ్యుఁడును శూద్రుఁడు నందఱును గోరిచేసినపాపమునకు దండింపఁదగినవారే యగుదురు. ఇందు విచారింపవలసినది లేదు. మనుష్యులు పాపములుచేసి రాజులచే దండమునుబొంది యాపాపమువీడి పుణ్యాత్ములగుసత్పురుషులవలె స్వర్గమును బొందుదురు. నీవు రాజుచేత దండమునుబొందితివిగావున మనకుల మున్నతికెక్కును' అనెను. అదివిని లిఖితుఁడు పుణ్యంబయిన యానదికిఁబోయి స్నానముచేసి తర్పణము

చేయఁ దొడంగెను. అంత నతనికిఁ దామరపువ్వులవలె రెండు చేతులును మొలిచెను. లిఖితుఁ డదిచూచి యాశ్చర్యపడి యా చేతుల నన్న యగుశంఖునకుఁ జూపెను. అంత శంఖుఁడు 'నేను నా తపోమహిమచేతఁ గావించితిని. ఇందు సందేహమువలదు. అదృష్టమిట్లున్నది' యనెను. అందులకు లిఖితుఁడు 'మహాతేజా! నీతపస్సునకు నిట్టిశక్తిగలదేని నన్ను మునుపే నీవేల పరిశుద్ధునిఁ జేయవైతివి'? అని యడిగెను. శంఖుఁడు 'ఇట్లుచేయుట శక్యమే; కాని నీకు దండము విధించుటకధికారమునాకు లేదు. ఆరాజును బరిశుద్ధుఁడయ్యెను; నీవును నీపూర్వులతోడఁ బరిశుద్ధుఁ డయితివి ' అనెను. పాండవశ్రేష్ఠా ! ఆరాజు సుద్యుమ్నుఁ డాదండ కర్మముచేతఁ బ్రచేతసకుమారుఁ డగుదక్షునివలె పరమంబయిన సిద్ధిని బొందెను. రాజులకుఁ బ్రజలను మార్గముతప్పిపోకుండు నట్లు పాలించుట ధర్మము. కాఁబట్టి యిట్లుచేసినందులకు మనస్సున శోకముంపకుము. నీవుధర్మజ్ఞులయందు త్తముఁడవు. కను క సహోదరుఁడాడిన హితవచనమును వినుము. రాజేంద్రా ! క్షత్రియులకు దండమేధర్మముగాని ముండనము (చేసికొనుట) గాదు " అనెను. ఇది యిరువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ వ్యాసుఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పి రాజ్యపాలనముచేయ నియోగించుట. }

వ్యాసుఁడు ధర్మరాజుతో నర్థవంతమగు వాక్యమున 'నాయనా! ధర్మపుత్రా ! నీతమ్ములు గొప్పమనస్సుగలిగి యడవియందు

వసించుచుండునపుడు వారికం దేమేమి మనోరథములు గలిగి యుండెనో వానినెల్ల నామహారథులు పడయుదురుగాక. నహుషపుత్త్రుఁ డయినయయాతివలె నీభూతలము నేలుము. పురుషసింహమా! నీతమ్ములు తపస్వులై యడవియందు మిక్కిలిదుఃఖముతోడి వాస మనుభవించిరి. ఆ దుఃఖముతీరిన యిప్పుడు, వారలు సుఖము లనుభవింపనిమ్ము. నీవు నీతమ్ములతోడ ధర్మము నర్థమును గామము ననుభవించి పిదప వనమునకు బయలుదేఱుదువు. దేవతలయుఁ బితరులయు నతిథులయు ఋణములు తీర్చిపుచ్చి పిదప స్వర్గమును బొందవచ్చును. సర్వమేధము నశ్వమేధము ననెడియాగములు యజింపుము. పిదపఁ బరమం బయినగతిఁ బొందెదవు. నీతమ్ములచే బహుదక్షిణలతోడ యజ్ఞమును జేయించి లోకమునందుఁ దులలేనికీర్తినిబొంది పిదప నిచ్చలు పోవచ్చును. కురుసత్తమా! నీవు చెప్పినదానిభావమును మేమెఱుఁగుదుము; అయినను ధర్మమునుండి జాఱకుండునట్లుగాఁ జెప్పెదను; వినుము. యుద్ధముచేసి గెలుపునొంది రాజ్యమును బొందినవానికి వలయు ధర్మమును, వారివారికిఁ దగినధర్మముల నెఱింగిననిపుణు లిట్లు స్థాపించుచున్నారు. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, ఆగమము, అర్థాపత్తి, ఐతిహ్యము, సందేహము, నిర్ణయము, ఆకారము, ఇంగితము, నడక, చేష్ట, ప్రతిజ్ఞ, హేతువు, దృష్టాంతము, ఉపనయము, ఉక్తి, నిగమనము ననెడివిషయములును, వీనివలని ప్రయోజనములును, పెక్కులు ప్రయోజనముల నొడఁగూర్చునట్టి సాధనములుగాఁ జెప్పుదురు. వీనియందుఁ బ్రత్యక్షమును అనుమానమును దక్కినవాని కన్నిటికిని గారణమని చెప్పఁబడుచున్నవి. ప్రమాణమును డెలిసినవాఁడే

దండమును జెల్లింప వలంతియగును. ప్రమాణమును దెలియక ప్రయోగించునట్టి దండము రాజును జంపును. శాస్త్రజన్యమగు బుద్ధితోడ (శాస్త్రమునందలి యభిప్రాయమును దెలిసి) రాజు, దేశకాలములను గనుఁగొని యపరాధకులను క్షమించునేని యతనికిఁ బాపముగలుగదు. ఏరాజు, ఆఱింటనొకపాలు పన్ను పుచ్చుకొని రాజ్యమును రక్షింపఁడో వాఁడా ప్రజలపాపము నందునాలుగింట నొకపాలును బొందును. రాజు, ధర్మమును దప్పక నడవవలసినవిధిని జెప్పెదను తెలిసికొనుము. ధర్మశాస్త్రముల ననుసరించి యాత్మనిగ్రహము గలిగియుండుటవలన భయము నువీడి కామక్రోధములను బాటింపక ప్రాణులయందుఁ దండ్రి వలె సమదృష్టి గలిగియుండవలయును. రాజు న్యాయ్యమయిన యొకకార్యమును దొడంగి దైవముచేత నది కొట్టువడుటచే సాధింపకపోయినను నతఁడా విషయమందు మీఱినడిచినవాఁడు (పొరఁబడినవాఁడు) గానేరఁడు. రాజు తనబలిమిచేతను, బుద్ధి నుపయోగించియుఁ, బగవారిని నడంచియే తీఱవలయును. పాపులతోడ సంధిసేయరాదు. రాజ్యమును ధర్మముగా నడపవలయును. శూరులను పెద్దలను విద్వాంసులను గౌరవింపవలయును. గోవులుగలవారును ధనవంతులునయిన ప్రభువులను విశేషించి రక్షింపవలయును. విశేషించి మిక్కిలి చదువరులయిన వారిని వ్యవహారములందును ధర్మకార్యములందును నధికారులుగా నియోగింపవలయును. న్యాయశాస్త్రమందును ధర్మశాస్త్రమందును మిక్కిలి యాఱితేఱినవారును ప్రమాణములను జక్కఁగా దెలిసినవారును నగువిద్వాంసులను తెలివిగలవాఁడు మంత్రాలోచన సభయందును వ్యవహారసభయందును నధికారులుగా నియ

మింపవలయును. తర్కశాస్త్రమందును ధర్మశాస్త్రమందును నాఱితేఱినబుద్ధితో దండనీతిని జక్కఁగాఁదెలిసి చెల్లించినచో నది యీమూఁడులోకములను జయించును. రాజా ! వేదతత్త్వ మెఱింగినవారిని యాగకార్యములందు నియోగింపవలయును. వేదములను శాస్త్రములను దెలిసినవారు మంచిబుద్ధిమంతులు. తర్కశాస్త్రమందును వేదములందును వార్తయందును దండ నీతియందును బారంగతులయిన పండితులను సకల కార్యములం దును నియోగింపవలయును. వారలు బుద్ధి (జ్ఞానము) తుదిని బొందినవారు. ఎంతటిగుణవంతుఁడయినను నొక్కనియందె నమ్మి యుండుట తెలివిగాదు. ప్రజలను రక్షింపక, పెద్దలను బూజిం పక, యడంకువయు లేక యహంకారమును నసూయయుఁగలరాజు పాపమునొందుటకాక దుర్దాంతుఁడనియు జెప్పఁబడును. ఎవరు రక్షణము నొందక కఱవు మొదలయినదైవకృత్యములవలనను దొంగలవలనను గుందుదురో వారికష్టమంతయు రాజును జేరిన పాపమగును. చక్కఁగా నాలోచించి లెస్సయగు ప్రయోగము తో మనుష్యప్రయత్నము నంతట నుపయోగించినచో రాజు నకు నధర్మముగలుగదు. ప్రయత్నములు దైవముచేత విచ్ఛిన్నము లగుటయుఁగలదు; సిద్ధించుటయుఁగలదు. తనచేయవలసిన ప్రయ త్నముచేసి వైచునేని రాజును బాప మంటదు. రాజసింహమా! ఈ విషయమై యొకకథను నీకుఁ దెలిపెదను. అది పూర్వము రాజర్షిగా నుండినహయగ్రీవుఁ డనువాని చరిత్రము. అతఁడు శూరుఁడు; అక్లిష్టకర్ముఁడు. అతఁ డసహాయుఁడై యుద్ధమందుఁ బగవారిని జంపి పిదపఁ దానును హతుఁడయ్యెను. ఆకథ యేమ నఁగా-హయగ్రీవుఁడు మనుష్యులను రక్షించుటయందును శత్రు

వులను నడంచుటయందుఁ దగినయత్నము చేసి యీలోకమందుఁ బ్రఖ్యాతిగాంచి యుద్ధంబువలన స్వర్గలోకమునొంది సుఖించుచున్నాఁడు. అహంకారమును దిగవిడిచి, బగవారిఁ దునిమియాటాడు మహాత్ముఁ డాహయగ్రీవుఁడు శస్త్రములచే ఛేదింపఁబడియుఁ దొంగలచేఁ గొట్టువడియుఁ దనధర్మము తప్పక యుద్ధమున ముందునిలిచి సిద్ధినొంది దేవలోకమున సంతోషించుచున్నాఁడు. రాజులకు యుద్ధమొక యజ్ఞము. అందు విల్లు యూపము ; నారి యందలిత్రాఁడు; బాణము *స్రుక్కు; కత్తిస్రువము; నెత్తురు నేయి; తేరు వేదిక; కోపము అగ్ని ; నాలుగుగుఱ్ఱములును నలువురు ఋత్విజులు గానుండును. రాజసింహుండును బలవంతుఁడు నగు హయగ్రీవుఁడు యుద్ధయజ్ఞమందు శత్రువులను వేల్చి పిదపఁ దుదియందుఁ దనప్రాణములను వేల్చి పాపవిముక్తుఁడై దేవలోకమున సంతోషించుచున్నాఁడు. మంచి తెలివిగలిగి నీతి తప్పక రాజ్యమును రక్షించి యాగములు చేసి లోకమంతయు వ్యాపించిన కీర్తి గాంచి యహంకారము లేకుండిన హయగ్రీవుఁడు దేవలోకమందు ముదంబునఁ దేలుచున్నాఁడు. మంచి యుత్సాహముగలిగియు నభిమానమును విడిచియు యాగాదులయిన దైవకార్యములను మనుష్యులు చేయఁదగినకార్యములను దండనీతినిని భూమినిని బాలించి తాను చెక్కుధర్మములుగావించి మహాత్ముండు హయగ్రీవరాజు దేవలోకమునందు సుఖించుచున్నాఁడు. విద్వాంసుఁడును దాతయు శ్రద్ధాళువును గృతజ్ఞుండునై, వేదములను జక్కఁగా నధ్యయనము చేసి శాస్త్రములను లెస్సగాఁగఱచి, కర్మముల నాచరించి, రాజ్యమును బాగుగఁ బరిపాలించి, నాలుగువర్ణము

* స్రుక్కను స్రువమను హోమము వేల్చుట కెత్తు నపకలు అని తెలియునది.

లను వారివారి ధర్మములందు నెలకొలిపి, మనుష్యలోకమును విడిచి హయగ్రీవుఁడు పూజ్యులయిన మేధావులగు విద్వాంసులు ప్రయాగాదులందు దేహము విడిచిపొందు లోకమును బొంది సంతోషించుచున్నాఁడు. ప్రజలను బరిపాలించి, యుద్ధముల జయమునొంది, సోమరసమును బానముచేసి, బ్రాహ్మణోత్తములను దృప్తినొందించి, నెఱిచొప్పునఁ బ్రజలకు దండము విధించి, యుద్ధము తీఱఁగానే హయగ్రీవుఁడు దేవలోకమునందు ముదమందుచున్నాఁడు. విద్వాంసులగు సత్పురుషులు శ్లాఘనీయంబును నద్భుతమంబు నయిన చరిత్రమును మిక్కిలి కొనియాడుచున్నాడు. పుణ్యకీర్తి యశనమ్మహాత్ముఁడు హయగ్రీవుఁడు వీరులకుఁ దగులోకములనుబడసి స్వర్గమును జయించి సిద్ధినిబొందినవాఁ డగ్యోను' అనెను. ఇది యిరువదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(వ్యాసుఁడు ధర్మరాజునకు సేనజిత్తు చెప్పినది చెప్పి రాజధర్మములు నుపదేశించుట.)

ధర్మరాజు వ్యాసుఁడు చెప్పినది విని, యర్జునుఁడు కుపితుఁడై యుండఁగా, నమ్మునితో 'ఈభూతలరాజ్యమును నిందుఁగల పలువిధము లగుభోగములును నిపుడు నామనసునకుఁ బ్రీతిగొలుపకున్నవి. పతులను బాసి పుత్రులనుమాలి పలవించుచున్నపడఁతుల యేడ్పుటెలుంగుల వినఁగా శోకము నన్నుఁ జీల్చుచున్నది. నామనస్సున కెంతమాత్ర మూఱటగలుగకున్నది' యని బదులుచెప్పెను. అందులకు యోగవిదులయందు మిన్నయు మహా

ప్రాజ్ఞుండును ధర్మజ్ఞుండును వేదపారంగతుండు నగువ్యాసుం డత నితో 'స్త్రీలు,గతించిన పురుషుని౯ గర్మముచేతఁగాని యోగము చేతఁగాని పడయఁజాలరు.పురుషునిచ్చుటకును నెవఁడును లేఁడు. ఇది కాలంపుఁ గ్రమముచొప్పున దైవముచేత విధింపఁబడినది. మనుష్యుఁడు కాలముచేత సర్వమును బడయుచున్నాఁడు. మనుష్యుఁడు తనబుద్ధి శక్తిచేతను జదువుచేతను నకాలమందు నొక విశేషమును బడయశక్తుఁడుగాఁడు; మూర్ఖుఁడును నొకప్పుడు పెక్కులర్థములను బొందుచున్నాఁడు. మనుష్యునకు సకలము నిచ్చునట్టిది కాలమే. భూమియు మందులును మంత్రములును దక్కిన శిల్పికర్మములును నకాలమందు ఫలమొసంగవు. అవియే కాలముచేఁ బొదలి మంచికాలమందు వృద్ధియు సిద్ధియుఁ బొందుచున్నవి. వాయువులు వేగముగా వీచుటయుఁ గాలముచేతనే. కొలంకులు మొదలయినవాని నీటియందుఁ దామరలు కలువలు మొదలయినవి మొలచుటయుఁ గాలముచేతనే. వనములందు వృక్షములు పూచుటయుఁ గాలముచేతనే. రాత్రులు క్రమముగా నల్లగను దెల్లగను నుండుట కాలముచేతనే. చంద్రుఁడు నిండారుబింబము గలిగియుండుటయుఁ గాలముచేతనే. అకాలమందు వృక్షమునఁ బువ్వులును బండ్లును గలుగవు.. అకాలమందు నదులు వేగముగా వెల్లిపొడువవు. అకాలమందుఁ గొండలయందును గ్రామములందును గలపక్షులును బాములును మృగములును నేనుఁగులు మదమునొందవు. అకాలమందు స్త్రీలకు గర్భముగలుగదు. అకాలమందు సీతు నెండయు వానయు రావు.అకాలమందుమనుష్యుఁడు పుట్టుటయుగిట్టుటయు లేదు. అకాలమందు బిడ్డఁడుమాటాడుట లేదు. అకాలమందు జవ్వనము

నొందుటలేదు. అకాలమందు విత్తిన విత్తులు మొలచుటలేదు అకాలమందు సూర్యుఁ డుదయించుటయు నస్తమించుటయు లేదు. అకాలమందుఁ జంద్రుఁడును, పెనుకరడులపరంపరలతోఁ గూడిన సముద్రమును బెరుఁగుటయుఁ దఱుఁగుటయు లేదు. ధర్మరాజా! ఈవిషయమున దుఃఖార్తుఁ డయినసేనజిత్తు పాడిన యీపురాతనపు టితిహాసమును జెప్పెదరు.—దుస్సహమైన యీ కాలగతి మనుష్యుల నెల్లవారిని బట్టుచున్నది. భూమియం దెల్ల వారును గాలముచేత ముదిరియే మృతినొందుచున్నారు. రాజా! లోకమందుఁ గొందఱు మఱికొందఱను గొట్టుచున్నారనుటయు, నట్టే వారిని వేఱుకొందఱు గొట్టుచున్నారనుటయు లోకమునందు వాడునట్టి వట్టిపేరే; కాని వాస్తవముగాదు. రాజా! కొట్టువాఁడును లేదు. (కొట్టుటయులేదు, కొట్టఁబడుటయులేదు.) ఒకఁడు కొట్టుచున్నాఁడని తలఁచుచున్నాఁడు. మఱియొకఁడు కొట్టలేదని తలఁచుచున్నాఁడు. ప్రాణుల పుట్టుకయును జావును స్వభావముచేత నియతమైయున్నవి. ధనము నష్టమైనను, పెండ్లామేని బిడ్డఁడుగాని తండ్రిగాని మృతినొందినను,అప్పు 'డక్కటా! అక్కటా! ఏమిదుఃఖము!' అని యాక్రోశించి దానినే చింతించుచుండుటచే దుఃఖమును బయింబయి పెంచుకొనుచున్నాఁడు. నీ వేల మూఢునివలె శోకించెదవు? శోకింపఁదగనివారినిగూర్చి శోకించెదవే. (అదిదగదు). దుఃఖములందుఁ దగులుటచే దుఃఖములును, భయమునొందుటచేత మఱిమఱిభయములును బెరుఁగుచున్నవి. ఇంతేకాని మఱేమిలేదు.'ఈదేహముగూడ నాదికాదు. ఈభూమియం దేదియు నాదిగాదు. ఇందలివస్తువులు నాకెట్లో యట్లె తక్కినవారికిని సొంతము' అని కనుఁగొనువాఁడు మోహము

నొందఁడు. శోకమునకు వేలకొలఁది కారణములుగలవు. సంతోష మునకును వేనవేలు కారణములున్నవి. ఇవి ప్రతిదినమును మూ ఢులనే పయికొనునుగాని పండితులనుగాదు. ఇవి యిట్లు కాలక్ర మమునఁ బ్రియములును ద్వేషింపఁదగినవియునై సుఖములుగను దుఃఖములుగను జూపట్టుచుఁ జక్రమువలె ప్రాణులయందుఁ జుట్టి వచ్చుచున్నవి. ఈలోకమందు దుఃఖమే కలదుగాని సుఖము లేదు; కాఁబట్టి దుఃఖమేయనుభవింపఁబడుచున్నది. దుఃఖము తృష్ణ యనుపీడవలనఁ బుట్టుచున్నది. సుఖము దుఃఖమనెడి పీడవలనఁ బుట్టుచున్నది. సుఖమునకు వెంట దుఃఖమును, దుఃఖమునకు వెం బడిని సుఖమును వచ్చుచున్నది. ఎప్పుడును దుఃఖమే కలుగదు. ఎప్పుడును సుఖమేకలుగదు. సుఖమెప్పుడును దుఃఖమునందు ము గియును; ఒకప్పుడు దుఃఖమువలననే పుట్టును. కాఁబట్టి శాశ్వత సుఖమునుగోరువాఁ డీరెంటిని దిగవిడువవలయును. సుఖము, ము గియుటనుండియే దుఃఖముపుట్టవలయును. దుఃఖముముగియుట నుండియే సుఖము పుట్టవలయును. కాఁబట్టి దేని నిమిత్తము శోకముగాని, దుఃఖముచేత నతిశయించిన తాపముగాని, యాయాసముగాని కలుగుచున్నదో దానిని దేహమునందలి యొక యంగమైనను (పాముకఱచిన యంగమునుం బోలె) దిగవిడువవలయును. సుఖముగాని దుఃఖముగాని, ప్రియము గాని యప్రియముగాని, యేది ప్రాప్తించుచున్నదో దానిని వెనుదీయని మనసుతో భరించియే తీఱవలయును. నాయనా! ఇంతేల! నీ భార్యలకును బుత్రులకును నప్రియము నించుకంత యేనియుఁ గావింపుము; అప్పు డెవ్వరెవ్వనివారో, యది యేహే తువుచేతనో, మఱి యేప్రకారముననో నీకుఁ దెలియఁగలదు.

ఎవరు మిక్కిలియు మూఢులో, ఎవరు బుద్ధితుదను బొందినవారో, వారే యీలోకమునందు సుఖము పెంపారుచున్నారు. ఈ యిరుతెగలకు నడిమివారు కష్టిమే పడుచున్నా' రని యిట్లు ప్రాజ్ఞుఁడా సేనజిత్తు చెప్పెను. అతఁడు లోకమందుఁ గలమంచిసెబ్బరలను జక్కఁగాఁ దెలిసినవాఁడు; ధర్మములను సుఖదుఃఖములను నెఱింగినవాఁడు పరుల దుఃఖమునకు దుఃఖించువాఁ డొకప్పుడు సుఖమునొందఁడు. ఏలన దుఃఖములకుఁ దుదిలేదు. ఒక దుఃఖమునుండి మఱొకదుఃఖము పుట్టుచున్నదే! (దానికిఁ దుది యెక్కడిది? కాన యది తీఱినదిచూచి సుఖమందుటయు నెక్కడిది?) సుఖమునుండియు దుఃఖముపుట్టుచున్నది. లోకమందు సుఖమును దుఃఖమును సంపత్తియు విపత్తియు లాభమును నష్టమును చావును బ్రతుకును కాలగతిచే మాఱిమాఱి యన్నియుఁ గలుగుచున్నవి. కాఁబట్టి వానింబట్టి దుఃఖముచేఁ గలంగరాదు. సంతోషముచే నుబ్బరాదు. రాజులకు యుద్ధమందు దీక్షఁబూనుటయు రాజ్యమును బాలించుటయు దండనీతి చక్కఁగాఁ జెల్లించుటయు యజ్ఞములందు దక్షిణలుగా ధనమొసంగుటయుఁ జక్కఁగా దానముసేయుటయు ధర్మమందురు. ఇవియన్నియు రాజునకుఁ బావనము లయినవని తెలియునది. మంచి తెలివిగలిగి నీతితోడ రాజ్యమును బాలించుచు నహంకారము విడిచి యజ్ఞములుచేయుచు, ప్రాణులనెల్లను ధర్మదృష్టితో సమముగాఁ జూచుచు నుండుమహాత్ముఁడగురాజు దేహమును విడిచినపిదప దేవలోకమునందు సుఖించుచున్నాఁడు. యుద్ధములగెలిచి, రాజ్యమునుబాలించి, సోమరసమును బానముచేసి ప్రజల నుబెంచి జనులకు నీతిదప్పక దండమునెఱపుచు నాయువుముగి

సినపిదప దేవలోకమందు సంతోషించుచున్నాఁడు. రాజు యాగములుచేసి రాజ్యమునుజయించి, యందలిప్రజలను వారిప్రియములను రక్షించి, వేదములను శాస్త్రములను చక్కఁగా నధిగమించి, నాలుగువర్ణములను వారివారి ధర్మములందు నెలకొలిపి, యిట్లు రాజ్యమును జక్కఁగ బాలించి పరిశుద్ధాత్ముఁడయి దేవలోకమందు మోద మొందుచున్నాఁడు. ఏరాజు స్వర్గమందుండిన నతని చరిత్రమును మంత్రులును బురజనులును దేశజనులును గొనియాడుచున్నారో యారాజే రాజులయం దుత్తముఁడు' అనెను. ఇది యిరువదియేనవయధ్యాయము.

*(అధికపాఠము)

రాజధర్మపర్వము.

{ధర్మరాజు ధనము యాగదానాదులకే కాని భోగములకుఁ దగదని యర్జునునకుఁ జెప్పుట.}

ఈ యవసరమునందే ధర్మరాజు గొప్ప మతిగలవాఁడుగాన యర్జునునిజూచి యుక్తియుక్తమగు వాక్యమున "అర్జునా! 'ధనమునకంటె నెక్కుడయినది యొక్కటియు లేదు. ధనములేనివానికి స్వర్గములేదు; సుఖములేదు; ప్రయోజనములేదు' అని తలఁచుచున్నావుకాని యది నిజముగాదు. వేదాధ్యయన మనెడు

* ఇది దాక్షిణాత్యకోశములం దొకానొకటమాత్ర మున్నదని యధికపాఠముగా నధ్యాయసంఖ్యలేక ముద్రితమై యున్నది. ప్రతాపచంద్రరాయగారి ప్రతియందు నధ్యాయములలోఁబడి గణితమై యున్నది. దాక్షిణాత్య ముద్రణాను పాఠముగా దీనిని దెనిఁగించుటంబట్టి యిట యధికపాఠముగా నంపఁబడిరెు.

యజ్ఞముచేత సిద్ధిని బొందినవారు పెక్కండ్రుజనులు చూపట్టుచు న్నారు. తపస్సునందు నిరతులయి శాశ్వతములగు లోకములను బొందిన మునులును గనుపట్టుచున్నారు. ధనంజయా! వైఖాన సులు 'బ్రహ్మచారులై సర్వధర్మములను దెలిసి ఋషులసమయ మును రక్షించుచువచ్చు జనులను దేవతలు బ్రాహ్మణులనుగాఁ దెలియుచున్నారు. వేదాధ్యయనమందు నిష్ఠు లయినఋషులను జ్ఞానమందు నిష్ఠగలవా రగునితరఋషులను ధర్మమందు నిష్ఠగల వారినిఁగా నీ వెప్పుడును దెలియుచుండవలయును. కార్యముల నెల్ల జ్ఞాననిష్ఠులగు వారియందే ప్రతిష్ఠింపవలయును. అనగా వారి యభిప్రాయముచొప్పున జరుపవలయును'. అని చెప్పినట్లు మనకుఁ దెలిసియున్నది. అజులు పృశ్నులు సికతులు అరు ణులు కేతవులు ననుఋషులు వేదాధ్యయనముచేత దేవలోక మునొందిరి. వారు వేదోక్తములగు దానము అధ్యయనము యజ్ఞము భరింపఁ గష్టమగునిగ్రహము ననెడి యీ కర్మ ముల నాచరించి సూర్యునికి దక్షిణంబగుమార్గమున దేవలోక మునొందిరి. ఈలోకములు కర్మనిష్ఠులయినవారి లోకములని నేను బూర్వమును జెప్పియున్నాను. ఉత్తరంబగు మార్గముననో యోగనిష్ఠు లగువారు పయనముచేయుదురని తెలియఁగలవు. అది కొనిపోవునట్టివియు శాశ్వతములయి ప్రకాశించుచుండు నట్టివియు యోగనిష్ఠులలోకములు. పురాణవిదు లయినవారీరెం టిలో నుత్తరమార్గమును బ్రశంసించెదరు. సంతుష్టియే మిక్కిలి యుస్వర్గము. (సంతుష్టివలననే స్వర్గముఁ బొందఁగూడును) సంతు ష్టియే పరమమైనసుఖము. (సంతుష్టివలననే పరమసుఖము కలు గఁగూడును.) సంతుష్టికంటె నెక్కుడయిన దొక్కటియులేదు.

అది క్రోధము నుబ్బును నడంచినవానియందుఁ జక్కఁగా నెలకొనుచున్నది; అది వానికి నుత్తమమయిన సిద్ధియగును. ఈ విషయమై తొల్లి యయాతి రాజు చెప్పినయీగాథ నుదాహరింతురు.- 'మనుష్యుఁడు తాఁబేలు తనయవయవములను ముడుఁచుకొనునట్లు వెలికి నిగుడు కామములనెల్ల నెప్పుడు లోపల నడంచుచున్నాఁడో, ఎప్పుడు తానొకటికిని భయపడఁడో, తన వలనను నొకటియు భయమందదో, ఎప్పుడు తానేదియుఁ గోరకయు ద్వేషింపకయు నుండునో యప్పుడు బ్రహ్మమునొందుచున్నాఁడు. ఎప్పుడు మనుష్యుఁడు సమస్తప్రాణులందును మనసు వాక్కు కర్మ మనెడియీమూఁటిచేతను బాపభావము నెఱపఁడో, యప్పుడు బ్రహ్మము నొందుచున్నాఁడు. అభిమానమును మోహము నడంచి పెక్కుసంగములను వీడి యాత్మస్వరూపము జ్యోతివలెఁ దెలియుచున్న సాధువు మోక్షమునకర్హుఁడగును. అర్జునా! నేను జెప్పు నీమాట, నింద్రియములు చిక్కఁబట్టి వినుము. కొందఱు ధర్మమును కొందఱు శీలమును మఱి కొందఱు ధనమును గోరుచున్నారు. (ధర్మమునకుఁ గారణమని) ఒకఁడు ధనము గోరవచ్చును; కానివానికి దానిని గోరకుండుటయే * మిక్కిలి గొప్పది. ధనమందును, ధనము మూలముగాఁ గలధర్మమందును బెక్కులుదోషములు గలవు. వానిని బ్రత్యక్షముగా నేను జూచుచున్నాను. నీవును దానిని జూడఁదగును. ధనమున కాశించువాఁడు తానవశ్యము వర్జింపవలసిన

* యజ్ఞాదులు చేయుటకుఁగాను సాధనముగా ధనమును గోరుటకంటె యజ్ఞాదులు చేయకయు నంపులకై ధనమునుగోరకయు నుండుట మంచిదని యాశయము.

కర్మములను వర్జించుట మిక్కిలియుఁ గష్టము. ధనమును గడిం చుచుండువారికి నందు మంచికార్యములు చూపట్టుట మిక్కిలి యరిది. పరులకు ద్రోహముచేసినచో ధనముఁ బొందఁగూడునని చెప్పెదరు. ఏకారణమునఁ గలిగినను ధనము నానాభయము లనే కలిగించును. మంచినడవడి తప్పి శోకమును భయమును దలంపక యల్పమగువిత్తముకొఱకు మిక్కిలి యాశించువాఁడు పరులకు ద్రోహములుచేయును ; దానివలన భ్రూణహత్యగలిగి ననుగాని తెలియఁడు. పడయరానిధనమునుబడసి దాని నను కూలురయిన భృత్యుల కిచ్చినను దొంగలు దోఁచుకొనిపోయి నట్లుంబోలె నిచ్చినపిదప మిక్కిలియుఁ బరితపించుచున్నాఁడు. కూలిపుచ్చుకొను భృత్యులును దోషముగలవారుగాఁ జూపట్టె దరు. ధనములేనివాని నెవఁ డేమన వచ్చును? వాఁడు సకలసంగ ములను వీడి తానుభిక్షించి * తెచ్చికొన్న యించుకంతదాని చేతను బొట్టఁబ్రోచికొనుచు సుఖముగానుండును. ధనముచేత నెవ్వఁడును సుఖమొందఁడు. ఈవిషయమై పురాణముల నెఱిం గినవారు యజ్ఞసమూహములను గుఱించి వేదములందుఁ బ్రతి పాదితములయినది యగు యజ్ఞగీత మనుగాథను జెప్పెదరు— అదేమనఁగా ' బ్రహ్మ ధనములను యజ్ఞముకొఱకుఁ బడసెను.

---

* ఇట ' అధనః కస్యకింవాచ్యో విముక్తః సర్వశస్సుఖీ। దేవస్వ ముప గృహ్యైవ ధనేన నసుఖీభవేత్ 'అని మూలము. దేవస్వమనఁగా 'యద్ధనం యజ్ఞ శీలానాం దేవస్వంతి ద్విదుర్బుధాః ' అన్నట్లు యజ్ఞాద్యర్థమైనధనము. ధన ము దేవతలసొమ్మగుటచేత నది పడసినవాఁడు సుఖమునొందఁడని యర్థాంతరము. భిక్షించితెచ్చుకొన్న యించుకంతయేనియు దేవస్వముగాఁ జెప్పుటయుఁ గలదు; కావ దానినిబట్టియు నర్థము చెప్పఁబడెను.

ఆధనమునురక్షించి యాగమునుసేయుటకు మనుష్యునిని సృజించెను. కాఁబట్టి ధనమునంతయు యాగమునందే యుపయోగింపఁదగును. ధనమును దనయిచ్చ వచ్చినట్లు వినియోగించుట హితమును బ్రశస్తమునుగాదు' అనుటయే. అర్జునా! నీవు ధనవంతులందు మేటివిగదే. బ్రహ్మ తనకార్యమగు యాగమునుద్దేశించి యాధనమును మనుష్యులకు నిచ్చుచున్నాఁడని తెలియుము. కావుననే యాధనమొక్కనికిని సొంతము గాదని ప్రాజ్ఞులు తెలియుదురు. కాబట్టి దొరకినధనము మనుష్యుఁడు శ్రద్ధతోడ దానమందును యాగమందును వినియోగింపవలయును. ఒకఁడు లభించినధనమును దానముచేయుట తగునేకాని భుజించుటయు నశింపఁజేయుటయుఁ దగవుకాదు. యాగము దానము నని చేయుటకు గొప్పకార్యము లుండఁగా ధనమును గూడఁబెట్టుటచేతఁ బనయేమి! ఎవరు బుద్ధిగోలుతవలనఁ దాము స్వధర్మమును దిగవిడిచినవారికి ధనమొసంగుదురో వారు దేహము విడిచినపిదప నూఱేండ్లు పురీషమును భుజింతురు. తగనివాని కిచ్చుటయుఁ దగినవానికి నీయకుండుటయు, అర్హుఁడు అనర్హుఁడని వివేచించి తెలిసికొనఁజాలమివలనఁ గలుగుచున్నది. కాఁబట్టి దానధర్మము సయితము దుష్కరము. లభించినట్టి ధనము నపాత్రమునకిచ్చుట, పాత్రమున కీయకుండుట యను రెండుదోషములును గలవని తెలియుము' అనెను.

రాజధర్మపర్వము.

ధర్మరాజు నిర్వేదించుటనుజూచి వ్యాసుఁడు రాజ్యపాలనము సేయ విధించుట.

ధర్మరాజు 'బిడ్డఁ డభిమన్యుఁడు హతుఁడయ్యెను ; ద్రౌపది కొడుకులును ధృష్టద్యుమ్నుఁడును విరాటుఁడును ద్రుపదుఁడును వృషసేనుఁడును ధృష్టకేతుఁడును మఱియు నానాదేశీయులగురాజవర్యులును యుద్ధమునందు హతులయిరి. ఇట్లిందఱును హతులై యుండఁగా నిట్లు జ్ఞాతులను వధించివచ్చినరాజ్యాతురుని నన్ను శోకమెంతమాత్రము విడువకున్నది. నాకు రాజ్యమందుఁ గామము పెద్ద; నేను మిక్కిలి యుగ్రుఁడను; నావంశమును ద్రుంచివైచుటకు మూలభూతుఁడను. కాకేమి? నేనెవ్వని యొడియందుఁ బొరలి యాటలాడుచుంటినో యాభీష్ముని, నట్టి నేనే రాజ్యమునందుఁ బేరాసపట్టి యుద్ధమునఁ జంపితిని. అతఁడు శిఖండిని జూచుచుండఁగా వజ్రములంబోని యర్జునుని బాణములచే నానిమిత్తముకొట్టువడి సుడివడుచుండఁగాఁ జూచినపుడు, ముదిసిన సింహముంబోలెఁ బురుషసింహుఁ డగునాపితామహుఁడు మెఱయుచున్న బాణములు మేనంబర్వుచుండఁగాఁ జూచినపుడు, నామనసు కందికుందినది! ఎదిరిరథికులను గలంచినలంచునట్టి నాతాతయా భీష్ముఁడు పర్వతమువలె సుడివడుచుఁ గీడ్పడి తూర్పుమొగముగా రథమునుండి తూలిపడఁగా జూచినపుడు నామనసు కలంగఁబాఱెను. ఎవఁడు కేల ధనుర్బాణములు ధరించి కురుక్షేత్రమునఁ బరశురామునితోడఁ బెక్కుదినములు పోరుగావించెనో, ఎవ్వండు కాశియందుఁ గన్యాస్వయంవరమునఁ గూడియున్న భూమియందలి రాజులనెల్ల నేకరథుఁడై యుద్ధము

నకుఁబిలిచెనో, ఎవఁడెవ్వరికిని మార్కొనరాని యుగ్రాయుధుండను చక్రవర్తిని తనశస్త్రంపు వేఁడిమిచేఁ గాల్చిపుచ్చెనో, ఆకౌరవ్యుని, ఆగంగాపుత్త్రుని, భీష్ముని నేను యుద్ధమునఁ బడఁ గూల్చితినే! అతఁడు తనకు శిఖండిమృత్యువని తెలిసియు వానిని బాణములఁగూల్చినాఁడుకాఁడే! అట్టి మహావీరుఁ డర్జునునిచేఁ గూలెనుగా! మునీంద్రా! అతండు పుడమిపయిఁ ద్రెళ్లి నెత్తుటం దోఁగుచుండఁగా నెప్పుడుచూచితినో యప్పుడే మిక్కిలి దెప్పరమయినజ్వరము నాలోనఁ జొచ్చినది! ఎవ్వఁడు మమ్ము బాల్యమునఁ బెంచెనో, యెవఁడుమమ్ముఁ జక్కఁగ రక్షించెనో, యట్టియతనిని బాపియుఁ గురుఘాతుకుండును నగు నేను రాజ్యమునకు-నల్పకాలముండునట్టి రాజ్యమునకుఁ - బేరాసపడి తెలివిమాలి గూల్చితినే! మఱిద్రోణుఁడో, ఆచార్యుఁడు; గొప్పవిలుకాఁడు; సకల రాజపూజితుఁడు; అట్టి యతనిని యుద్ధమునం దెదురుచని యతని కొడుకునుగుఱించి పాపినినేను వట్టిబొంకాడితిని. ఆయాచార్యుఁడు నన్ను 'రాజా! నాకుమారుఁడు జీవముతో నుండునేని నీవు నిజముచెప్పుము' అని యడిగినమాట నాయవయవములను దహించుచున్నదే! నేను నిజమేపలుకుదు నని నెఱనమ్మకముచేత నా బ్రాహ్మణుడు నన్నడిగెను; ఆగురునియెడ నేను, సత్య మనుకవచమునూడ్చి రాజ్యమందుఁ బేరాసగొన్న నేను, పెద్దలను జంపఁదెగినపాపుండ నగునేను, నేనుఁగు హతముకాఁగా నే యేనుఁగనుటను మఱుఁగుపఱిచి 'అశ్వత్థామహతుఁడయ్యెను' అని యబద్ధమాడితిని. మిక్కిలియుఁ జేయరాని యట్టికృత్యామును జేసిన నాకెట్టిలోకములు పొందఁగలుగునో కదా! యుద్ధంబుల కెంతమాత్రము వెనుదీయని యన్నయగు కర్ణునిఁజంపితిని.

నాకంటె బెట్టిదుఁడగుపాపి యీలోకమం దెవఁడు? పర్వతములందు సింహమువలె నుదయించినబిడ్డఁ డభిమన్యునిఁ బేరాసగొని ద్రోణపాలితం బగుసైన్యమునందుఁ జొరఁబడునట్లు చేసితిని. అదిమొదలు భ్రూణహత్యచేసినపాపివలె నర్జునుని గృష్ణునిని మొగమెత్తి చూడలేకున్నాను. దుఃఖమున కెంతమాత్రము దగని ద్రౌపది నైదుపర్వతములను బోఁగొట్టుకొన్న పుడమివలె నేవురుపుత్త్రులను దిగనాడుటదలంచి పొక్కుచున్నాను. ఇట్టిలోకమునకే నాశముపుట్టించిననేను మహాదోషిని; పాపిని. నే నిట్లే యుండి నాపాడుబొందిని శోషింపఁజేసెద. పెద్దలనుజంపిన నేను, నిఁక జన్మాంతరములం దయినను కులఘాతుకుఁడు గాకుండుటకై యిట్లు ప్రాయోపవేశముఁ బూనియున్నానని తెలియుఁడు. మహర్షులారా! ఇఁక భుజింపను; ఏవిధమునను జలముపయోగింపను, ఇట్లేయుండి నేను బ్రియములయిన ప్రాణములను బోకార్చుకొనెదను. మహర్షులారా! మీరు నిచ్చలుపోవచ్చును. మిమ్ము మ్రొక్కి వేఁడుకొనుచున్నాను. ఈకళేబరము నిట్లే దిగవిడిచెదను; అందఱు నాకనుమతి యియ్యవలయును" అనెను. బంధుశోకమునకు విరవిరఁబోవుచు ధర్మరా జిట్లుచెప్పఁగా ఋషిసత్తముఁ డగువ్యాసుఁడు 'అట్లుకాదు' అని యడఁచి మరల నతనితో 'మహారాజా! నీవు మితిమీఱి శోకపడుట యెంతమాత్రము తగదు. ప్రభూ! ఇది యదృష్టమని మునుపు చెప్పియున్నాను. మరల దానినే చెప్పెదను. లోకమునందుఁ బుట్టినప్రాణులకు నీళ్లయందలి బుగ్గలవలె సంయోగ వియోగములు వచ్చుటయుఁ బోవుటయుఁ దప్పదు. ఒండొండకూడికలెల్ల నశింపకమానవు. పొడవు పెరిఁగినవెల్లఁ బడకతీఱదు. కూటమి తుది యెడఁబాటె.

బ్రతుకుతుది మరణమే. సుఖము ముగింపు దుఃఖమే. సోమరి తన మప్పటికి సుఖముగానుండినను దుదను దుఃఖమే యగును. పాటు అప్పటికి దుఃఖముగా నుండినను దుదిని సుఖము నిచ్చును. అణిమాదివిభూతులును, సంపత్తియు, లజ్జయు, ధైర్యమును గీర్తియుఁ బాటుపాడువానియం దుండునే కాని సోమరి యందుండవు. సుహృదు లెందఱుండినను సుఖమునకుఁ జాలరు. శత్రువు లెందఱయినను దుఃఖమునకుఁ జాలరు. ప్రజ్ఞయెంతయినను ధనములొందుటకుఁ జాలదు. ధనములవలన సుఖము గలుగఁజాలదు. కౌంతేయా! దైవము నిన్నెట్టికర్మములు చేయుటకు సృజించినదో యట్లె వానిని జేయుము. అందువలననే నీకు సిద్ధి కలుగును. రాజా! నీయంతకు నీ వొడయుఁడవుగావు' అనెను. ఇది యిరువదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{వ్యాసుఁడు ధర్మరాజునకు నశ్మజనకసంవాదమును జెప్పి క్షాత్రధర్మమును విధించుట.}

ధర్మరాజు జ్ఞాతిశోకమునఁ బరితపించుచుఁ బ్రియములయిన ప్రాణములను విడువఁగోరుచుండఁగా వ్యాసుఁ డతని శోకమును బోకార్చి 'పురుషతిలకా! ఈ విషయమై పురాతనమయిన యితిహాసమొకటి నుదాహరించెదరు. దానిపేరు అశ్మగీత. దానిని జెప్పెదవినుము. విదేహారాజగుజనకుఁడు దుఃఖశోకములు తన్నుఁ బైకొనఁగాఁ బ్రాజ్ఞుం డయినయశ్ముఁ డను బ్రాహ్మణునిఁ జూచి సందేహము నడుగువాఁడై 'బంధువులును ధనమును

వచ్చునపుడును బాసిపోవునపుడును తన శుభమునుగోరిన మనుష్యుఁడెట్లుండవలయును?'' అనియడిగెను. అందుల కశ్యుఁడు 'ఈ దేహ ముత్పత్తినొందినతోడనె యాయాదుఃఖములును సుఖములును దీనిని వెంబడించుచున్నవి. ఆ రెంటిలో నేదేనియొకటి కలుగవచ్చునుగాన యట్లు కలిగినప్పుడు దానియందే మనస్సు చెల్లించుచుండినయెడల నది, గాలి మబ్బులనుంబోలె, వాని తెలివిని హరించివైచును. (ఒకఁడు సుఖమందున్నపుడు) 'నేను గొప్పకులమునఁ బుట్టినవాఁడను. సిద్ధిగలవాఁడను. (ఏదితలఁచినను చేయంగలవాఁడను) నేను సాధారణమనుష్యుఁడను గాను' అను నీ మూఁడు తెఱఁగుల కారణములచే వానిమనసు మిక్కిలి క్లిన్నమగును. మనస్సు భోగములందుఁ దగులువడఁగాఁ దండ్రికూడఁబెట్టిన ధనము నంతయు వెచ్చించి యన్నియు మిక్కిలి తఱిఁగి బీదవడఁగాఁ బరుల సొమ్ములను గ్రహించుట మంచి దని తలంచుచున్నాఁడు. రాజులట్లు మేరమీఱి యయుక్తముగా నితరులసొమ్ము నపహరించు వానిని, బోయవాఁ డమ్ములచేత జింకను గారించునట్లు, దండించుచున్నారు. అట్టి మనుష్యు లిరువదియేండ్లో ముప్పదియేండ్లో వయస్సుగలిగి యంతకే రాజదండనాదులచేఁ దీఱుదురుగాని నూఱేండ్లవఱకు నుండుటగలుగదు. రాజు సమస్తప్రాణుల నడవడుల నప్పడప్పుడు పరిశీలించుచు, నట్లు దొంగతనము మొదలగు వానిచే మిక్కిలియు దుఃఖితు లయినవారికిఁ దనబుద్ధిచేత వలయు మందు గావింపవలయును. మనస్సు తబ్బిబ్బో, అనిష్టములు వచ్చుటయో, యీ రెండుమాత్రమే మానసదుఃఖములకుఁ గారణములు; కాని, మూఁడవకారణము కలుగనేరదు. మఱియు నిటువంటివగు నాయాదుఃఖములును విషయస్పర్శమువలనఁ గలుగు

దుఃఖములును మనుష్యుని వెంబడించుచున్నవి. ఇట్లుండు నపుడే ముదిమియు మరణమును, రెండు తోఁడేళ్లవలె, ప్రాణులను బలముగలవానినో, దుర్బలములనో, పొట్టివానినో, పొడుగగువానినో, యన్నిటినిబట్టి మ్రింగుచున్నవి. ఏమనుష్యుఁడుగాని, సముద్రపర్యంత మయినయీ భూమండలమును జయించినవాఁడేని, యీజరామరణములను జయించువాఁడొకప్పుడును లేఁడు. ప్రాణులకు సంభవించునది సుఖమో దుఃఖమో యనుభవింపవలయును. ఇది యవశము. దీనిని దప్పించుకొనుటకు వీలులేదు. ఎలఁబ్రాయముననో, నడిమి వయస్సుననో, ముదిమియందో, దాను గోరినవిగాని గోరనట్టివిగాని యగువిషయములువచ్చినఁ ద్రోసిపుచ్చఁ దరముగాదు. అప్రియములతోడి కూడికయు, మిక్కిలి ప్రియములతోడి యెడఁబాటును, సంపదలును, ఆపదలును, సుఖమును, దుఃఖమును, నదృష్టము ననుసరించుచున్నవి. ప్రాణుల పుట్టుకయు గిట్టుటయు, లాభములను నష్టములనుబొందుటయు, నన్నియు విధిచేత నేర్పడియున్నట్టివగును. వాసనయు, రూపును, రసమును, స్పర్శమును, స్వభావముచేతనే కలుగునట్లు, సుఖములును దుఃఖములును విధి ననుసరించియే కలుగుచున్నవి. కూర్చుండుటయుఁ బరుండుటయు, పోవుటయు లేచుటయు, త్రాగుటయుఁ దినుటయుఁ బ్రాణులకన్నిటికిని గాలముచేతనే కలుగుననుట నిశ్చయము. వైద్యులుగూడ రోగులయ్యెదరు. బలవంతులును బలహీనులయ్యెదరు. * నపుంసకులును బడఁతులు గలవారయ్యెదరు. దీనిని జూ

* 'స్త్రీమన్తశ్చాపరే షణ్ఢాః' అని మూలము. 'శ్రీమన్త శ్చాపరే షణ్ఢాః' అని పాఠాంతరము. ధనవంతులును దరిద్రు లగుదురని యర్థము.

డఁగాఁ గాలగతి విచిత్రముగానున్నది. గొప్పకులమునఁ బుట్టు టయు, తెవులు లేకుండుటయు, చక్కఁదనమును, వీర్యమును, సంపత్తియు, ఉపభోగమును, విధిచేతనే దొరకొనును. దరిద్రు లు కోరకున్నను పుత్రులు మిక్కిలియుఁ బెక్కండ్రు కలుగు చున్నారు. ధనసమృద్ధిగలవారికి నొక్కబిడ్డఁడును గలుగఁడు. విధి చెయ్వి విచిత్రమయినది. వ్యాధి, జలము, ఆయుధము, అగ్ని, ఆఁకలి, విషము, జ్వరము, మరణము, పయినుండిపడుట మొదలుగాఁగల యేయాపదయం దేమనుష్యుఁడు పోవునట్లు విధియేర్పఱచినదో వాఁడా మేరనే పోవుచున్నాఁడు.*లోకమునఁ గొందఱు మేరతప్పి నడవకున్నను బెక్కుడుకులు పడుటయు, మఱికొందఱు మేరతప్పి నడచుచున్నను నిడుమకుఁబట్టువడకుండుటయుఁ జూపట్టుచున్నది. మిక్కిలి ధనముగలవాఁడేలప్రాయమందే నాశ మొందుటచూపట్టు చున్నది. మిక్కిలి కష్టపడుచున్న దరిద్రుఁడు ముదిమితోఁగూడ నూఱేండ్లు బ్రతుకుచున్నాఁడు.† చెడుకులమునఁబుట్టినమనుష్యులు చిరజీవులుగాఁ జూపట్టుచున్నారు. పెంపుసొంపుగల మంచికులము నఁబుట్టినవారు మిడుతవలె నశించెదరు. లోకమునందు బహుతర ముగా సంపదగలవారికి భుజించుటకు శక్తియుండదు. బీదలకు

---

* ఇందులకు 'దృశ్యతే నాప్యతిక్రామ న్ననిష్క్రాన్తో౽థవాపునః। దృశ్య తేచా ప్యతిక్రామన్ననిగ్రాహ్యో౽థవాపునః' అని మూలము. విధిని గడచిన వాఁడును, విధినుండి వెలువడినవాఁడును ఒక్కఁడునులేఁడు. విధియందుఁ బట్టువడనివాఁడును లేడని యర్థాంతర మొకటి చూపట్టుచున్నది.

† దీనికి 'అకులీనాశ్చపురుషాః' అనిమూలము. 'అకిఞ్చనాశ్చపురుషాః' అని దాక్షిణాత్యపాఠము. 'దరిద్రశ్చ పరిక్లిష్టః శతవర్షో జరాన్వితః' అని మున్నుందె చెప్పియుండుటంబట్టి మరల అకించనునిఁ జెప్పుట అసమంజసము.

మిక్కిలియు కట్టెలును తాలును జీర్ణమగును. ఒకఁడు కాలము చేతఁ బ్రేరితుఁడై తానొకటిచేసినను 'నేనే దీనిని చేయుచున్నా' నని తలంచుచున్నాఁడు. దురాత్ముఁడు తనకుఁగలవానితోఁ దనివి నొందక యేదేదియిష్టమో యట్టిపాపము నెల్లఁ జేయుచున్నాఁడు. వేఁట, జూదము, పడఁతి, పానము, వివాదములును, పండితులచే నిందితములయినవి; కాని మిక్కిలి చదువరు లయిన పురుషులును వీనియందుఁ దగిలియుండుట చూపట్టుచున్నది. ఇట్లు చూడఁగా సమస్తమయిన విషయములు నిష్టములయినవియు ననిష్టములయినవియును, కాలము చేతనే సమస్త ప్రాణులను బొందుచున్నవి. వేఱుకారణము కనుపట్టకున్నది. వాయువు, ఆకాశము, అగ్ని, చంద్రుఁడు, సూర్యుఁడు, పగలు, రాత్రి, నక్షత్రములు, నదులు, పర్వతములున నెడి వీని నెవఁడు చేయుచున్నాఁడు? ఎవఁడుభరించుచున్నాఁడు ? శీతమును, ఉష్ణమును, వర్షమును గాలముచేతనే చుట్టివచ్చుచున్నవి. ఇట్లే మనుష్యులకు సుఖములు నుదుఃఖములును గాలము చేతనే కలుగుచున్నవి. మందులును, ఆయుధములును, హోమములును, జపములును, మనుష్యుని ముదిమియు, మరణమును బోఁగొట్టి రక్షింపఁజాలవు. మహాసముద్రమందుఁ గట్టెయుఁగట్టెయు నెట్లుచేరునో, చేరినపిదప నెట్లుపాసిపోవునో, యట్లెప్రాణులకూడుటయుఁ బాయుటయునుండును. ఇంపయి నగీతములతోను వాద్యములతోను బూవుఁబోండ్ల సంగడిని నుపచరింపఁబడు ధనికులయందును, ఏదిక్కును లేక యొకరిపిండమున నెప్పుడును గడుపుఁబ్రోచికొనుచుండు బీదలయందును, గాలమొకటేవిధముగా నడచుకొనుచున్నది. ఈసంసారములందు నింతవఱకు వేనవేలు తల్లులును, దండ్రులును, వందలకొలఁది పుత్త్రులును,

బెండ్లములను ననుభవించితిమైనది. వాస్తవమునకు వారెవ్వరి వారు ? మన మెవ్వరివారము ? మనుష్యున కెవ్వరును సొంతము గారు. వాఁడు నెవ్వరికిని సొంతముగాఁడు. (మనుష్యున కెవ్వఁడును సతముగాఁడు. వాఁడు నెవ్వరికిని సతముగాఁడు) పెండ్లము బందుగులు చెలికాండ్రు నను వీరితోడి కూడిక, దారిలో (సత్రములు చలిపందిరి మొదలగువానియందుఁ) గూడు కూడికవంటిదే యగును. మనుష్యుఁడు 'ఎక్కడ నున్నాను ? ఎక్కడికిఁబోయెదను ? నే నెవ్వఁడు ? ఇక్కడి కేల వచ్చితిని ? దేనినిగూర్చి యెందులకుఁగాను శోకించెదను ' అని యాలోచించి మనసును గుదురుపఱచుకొనవలయును. సంసారము చక్రమువలెఁ దిరుగుచుండునది. అందుఁ బ్రియులయిన వారితోఁగూడి మాడియునికి సతముగాదు. కాఁబట్టితోఁబుట్టువు, తల్లి,తండ్రి చెలి,వీరందఱును దారిలోఁ గూడిన కూడికలే. కాన బంధులమరణమును గూర్చి దుఃఖింపరాదు. పరలోకమో కన్నులకెదుటఁ జూచునట్టిదిగాదు. అందు సుఖం బుండఁగోరు వారు శాస్త్రములను గడవక నమ్మికగలిగియుండవలయు నని తెలిసినవారు చెప్పెదరు. తెలిసినవాఁడు పితరులకును దేవతలకును వలయు కర్మములను జేయవలయును. మఱియుం గల ధర్మకార్యములను యాగములను ధర్మార్థకామములను విధ్యుక్తముగా నాచరింపవలయును. ఈ జగము ముదిమి జావుననెడు పెనుమొసళ్లుగలిగి మిక్కిలి లోఁతయిన కాలసముద్రమందు మునుఁగుచున్నదని కట్టా ! యెవ్వఁడును దెలియకున్నాఁడు. ఆయుర్వేదము నభ్యసించుచున్నవారయ్యును వైద్యులు పెక్కండ్రు తామేకాక తమకుటుంబమువారితోఁ గూడ

రోగములందుఁ గష్టపడుచుఁ జూపట్టుచున్నారు. వారు పలువిధ ములయిన కషాయములను నేతులను ద్రాగియు, సముద్రము చెలియలికట్టను గడవలేనట్లు, మృత్యువును గడవలేకున్నారు. తేవులును ముదిమిని బోఁగొట్టి యాయువును నిలుపునట్టి రసా యనమును దెలిసి దానిని మోతాదుచొప్పున నుపయోగించి నను, నేనుఁగులు తమకంటె మేటియేనుఁగులచేతఁ గొట్టువడు నట్లు, ముదిమిచేఁ గొట్టువడుచున్నారు. అట్లే వేదాధ్యయన మందునిరతులయ్యుఁ, దపస్సుచేసియు, దానములను యజ్ఞములు నుం గావించియు, జరామరణములను దాఁటినారుగారు. పగ ళ్లును మాసములును సంవత్సరములు నెప్పుడు విరమింపవు. పుట్టుకనొందిన ప్రాణులకన్నిటికిని మరలఁ గూడిక కలుగుననుట లేదు. (పుట్టిన ప్రాణులకన్నిటికిని పోయిన సంవత్సరములును నెలలును పగళ్లును మరలిరావు. కూడికలును మరలఁగలుగవు.) ఇట్లునికి నిలుకడ లేనిమనుష్యుఁడు విరివియై తప్పక కలుగు నట్టి (సంసార) మార్గమును వెల్లువచేత నీడ్వఁబడినవాఁడుం బోలె నవశుండై కాలముచేతఁ బొందుచున్నాఁడు. ఆ మార్గమును సకలమయిన ప్రాణులును బొందునట్టిది. దేహము జీవునినుండి కలిగినదో, లేక జీవుఁడు దేహమునుండి కలిగెనో యేది యెట్లయినను బెండ్లములతోను బంధువులతోను గూడిక దారియందలి కూడికవంటిదే యగును. ఒకటి మఱిదేనితోఁ గాని యెన్నఁటికిని పీడనికూటమి నెప్పుడును బడయఁజాలదు. తన శరీరముతోనయిన నట్టికూడికఁ బడయనేరదనఁగా మఱొ క్కడానితోఁ జెప్పనేల? రాజా! ఇపుడు నీ తండ్రియెక్కడ? నీ తాతలెక్కడ? నీ విపుడు వారిని జూడవు. వారును నిన్నుఁ

జూడరు. స్వర్గమును, నరకమును, గన్నారఁజూచినవాఁడు లేఁడు. ఈవిషయమై యాస్తికులకు వేదమేకన్ను;నీ వాకన్నుచూపిన ట్లాచరింపుము. ఒకఁడు పితరులయు దేవతలయు మనుష్యులయు ఋణములు దీర్చుకొనుటకు నసూయమాలి బ్రహ్మచర్యవ్రతము నాచరించి పుత్త్రులంగని యాగములను జేయవలయును. మొదట బ్రహ్మచారిగానుండి భిక్ష మొదలగు ధర్మములనడపి పిదప మనస్సునందలి కష్టములనుదొలఁగించి యాగములును జరిపి పుత్త్రులనుగని యిహమును బరలోకమును ననుభవించుటకై బరమాత్మను నారాధింపవలయును. తనకు విహితములయిన ద్రవ్యములను మాత్రముగయికొనుచు,స్వధర్మమును జక్కఁగా నాచరించి, రాజ్యమును వృద్ధినొందించు రాజుకీర్తి చరాచరములయిన సకలజగత్తులందును మీఁదు మిక్కిలి పెరుఁగును'అనెను. ఇట్లశ్మని హేతుసంపన్నము లయినవాక్యములను గడవఱకు విని విదేహరా జగుజనకుండు బుద్ధితెలివొంద శోక ముడిగి యశ్మని వీడుకొని తనగృహమునకుఁ బోయెను. ధర్మరాజా! నీ వింద్రునకు సాటియగువాఁడవు గదే! నీవు నిష్ఫ డాచొప్పు ననే శోకమును విడిచి లెమ్ము. సంతోషమునొందుము. క్షత్త్రియధర్మముచొప్పున నీవు జయించి యున్నయీభూమిని బరిపాలింపుము. దీని నవమానింపకుము" అనెను. ఇది యిరువది యేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

నారదుఁడు సృంజయునకుఁ జెప్పిన షోడశరాజ చరిత్రమును గృష్ణుఁడు ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజేమియుఁ బలుకకుండుటనుజూచి యర్జునుఁడు హృషీకేశుం డగుకృష్ణునిఁజూచి 'మాధవా! పరంతపుఁడగుధర్మపుత్త్రుఁడు,జ్ఞాతిశోకముచేఁ బరితపించుచు దుఃఖసముద్రమందు మునిఁగి యున్నాఁడు. ఇతని నూఱడింపుము. జనార్దనా! మరల మేమందఱమును విపత్తును సంశయింపవలసినస్థితికి వచ్చితిమి. నీవు మహాప్రాజ్ఞుండవు.ఇతనిశోకమును దుదముట్టఁ బోకార్పఁదగుదువు' అనెను.ఇట్లర్జునుఁడు చెప్పినది విని పుండరీకాక్షుఁడు కృష్ణుఁడు రాజువంకఁ దిరిగెను. ధర్మరాజునకుఁ గృష్ణు నతిక్రమించి నడువరాదు గదా! ఏలనఁగా-బాల్యమునుండి కృష్ణుఁడు ధర్మరాజునకు నర్జునునికంటె నెక్కుడుప్రియుఁడై యుండెను. కృష్ణుఁడు చందనపుఁబూఁతగలిగి జాతికంబమువలె డంబుగులుకు ధర్మరాజుచేతిని దననిడుదచేతఁ బట్టుకొని వినువారలకెల్ల వేడుక పుట్ట నిట్లనియె. అపుడు మురువయినపలువరుసయు సొగసయిన కన్నుఁగవయుఁ జెన్నారు నతనినెమ్మొగము సూర్యుఁ డుదయింపఁగా విరిసిన తామరపూవువలె మిక్కిలియుఁ దేటగాఁ బ్రకాశించెను. అతఁడు ధర్మరాజుతో 'పురుషసింహామా! శోకము వలదు; దీనివలన నీయవయవములు వాడుచున్నవి. ఈయుద్ధము మొనను హతు లయినవారు మరల నీకెంతమాత్రము దొరకుట యరిదిసుమీ! కలయందుఁ గన్నలాభములు మేలుకొనఁగాఁ బొల్లయినట్లె మహాయుద్ధమందు గతించినరాజులు మరలవచ్చుట

పట్టెదిసుమీ ! యుద్ధమందుఁ జెలువుగులుకు చుండినయాశూరు లందఱును నెదుర్కొని నిలిచి నిహతులయి రేకాని వారియం దొక్కఁడేనియు వెనుక ప్రక్కఁగానిపరుగెత్తిపోవుచుండఁగఁగాని కూల్పఁబడినవాఁడుగాఁడు. ఇట్లు వీరలందఱును మహాయుద్ధమందు వీరులవలెఁ బోరాడి ప్రాణములువిడిచి యాయుధముల దెబ్బలచేఁ బవిత్రులై దేవలోకమునొందిరి. అట్టివారినిగుఱించి నీవు శోకించుట న్యాయముగాదు.క్షత్రధర్మపరాయణులై వేదవేదాంగపారంగతులైనయాశూరులు వీరులు పొందుపుణ్యగతిని బొందిరి.మహానుభావులయినరాజు లిట్లు మృతులయినది విని నీవు శోకించుట యెంతమాత్రము దగదు. ఈ విషయమై పుత్రశోకమున నాఱటపడుచున్న సృంజయునకు నారదుఁడు చెప్పిన యీ పురాతనమయిన యితిహాసము నుదాహరించుచున్నారు.

నారదుఁడు'సృంజయా! నేనును నీవును మఱితక్కిన ప్రజలును సుఖదుఃఖములనుండి విడివడకయే మృతినొందఁగలరు. అందులకు వగవనేల. తొల్లి యుండినరాజులమహత్త్వమును జెప్పెదను. కొంచె మాలించి వినుము. రాజా ! మృతులయిన మహానుభావు లగురాజులను విన్నమాత్రమున నీదుఃఖము వీడిపోవును. తాపము నుడుపుము. నేను జెప్పునది విస్తరించి వినుము. పూర్వు లయినరాజులచరిత్ర ముదారమును మనోహరమునై గ్రహములక్రూరత నుడిపి యాయువును వర్ధిల్లఁజేయునది; ఉత్తమమయినది. సృంజయా! అవిక్షిత్తుకుమారుఁడయిన మరుత్తుఁడు మృతుఁడగుట వినుచున్నారము. మహాత్ముండయినయతని యాగమందు నింద్రుఁడు వరుణుఁడు బృహస్పతి మొదలయిన దేవతలును సృష్టికర్తలును బ్రత్యక్షముగా వచ్చిరి. అతఁడు

తాను జేసినయాగములచేత దేవరా జయినయింద్రుని నసూయపడునట్లు గావించెను. ఇంద్రుని ప్రియమునుగోరి విద్వాంసుఁడగు బృహస్పతి యతనియొద్దకుఁబోయి 'ఇఁక యాగముచేయవల' దని యాక్షేపించెను. అట్లయ్యును, నతనితమ్ముఁడయిన సంవర్తుఁ డనుఋషి యాదేవగురుని యిష్టమొనఁగూడకుండునట్టు లా రాజునకు యాగముచేయించెను. మరుత్తుఁడు రాజయి భూమిని బాలించుచున్న కాలమందు, నేల దున్నుట మొదలగు పనులులేకయే పంట లవ్వారిగా నెల్లయెడలఁబండి వెలుంగుచుండెను. ఆమహాత్ముఁడు చేసినసత్రయాగమందు విశ్వేదేవతలు సదస్యులుగాను,మరుత్తులు సోమపానముచేయుఋత్విజులుగాను, సాధ్యులును దక్కినదేవతలును బరిచారకులుగాను, నుండిరి. అతఁ డొసంగిన దక్షిణలు దేవతలకును మనుష్యులకును గంధర్వులకును మిక్కుటముగా నుండెను. సృంజయా! నీకంటెను నీపుత్రునికంటెను, ధర్మము, జ్ఞానము, ఐశ్వర్యము, వైరాగ్యము ననెడియీనాలుగింట మిక్కిలి యతిశయించిన యాపుణ్యాత్ముఁడు మరుత్తుఁడే మృతుఁడయ్యెనేని నీపుత్రుఁడట్లయినందులకుఁ బరితపింపకుము. వితిథుని పుత్రుఁడయిన సుహోత్రుఁడును గాలగతినొందెనని వినుచున్నారము. అతఁడు రాజుగానుండు కాలమున నింద్రుఁ డాతని ప్రియమునకుఁగాను నొక సంవత్సరము బంగారువాన గురియించెను. భూమి యతనికాలమున వసుమతి యనుపేరు సార్థకముగాఁ గలదియాయెను. నదులందు బంగారునీరు ప్రవహించెను. లోకపూజితుఁడయిన యింద్రుఁడు నదులందు చేఁప, ఎండ్రి, తాఁబేలు,మొసలి, తిమింగిలములను వీనిని బంగారుమయము లయినవానిని గావించెను. బంగారుమయము

లయి వేలకొలఁదిగా నున్నవానినిజూచి సుహోత్రుఁడు విస్మయ మొందెను. ఇట్లవ్వారిగా నిండినబంగారము నతఁడు కురుక్షేత్ర మున విస్తరించి గావించిన యాగమందు బ్రాహ్మణుల కొసం గెను. సృంజయా! నీకంటెను నీపుత్త్రునకంటెను ధర్మాదులు నాలుగింట మిక్కిలి యతిశయించిన మహాపుణ్యుండా సుహో త్రుఁడు మరణమొందెను. శ్వైతపుత్త్రా! ఏయొక యాగమును దక్షిణయులేని నీదుపుత్త్రుఁడు మృతుఁడగుటనందులకుఁ గుంద కుము. శోకమువలదు; సయింపుము. సృంజయా! అంగదేశపు రాజు బృహద్రథుండనెడివాఁడు మృతుఁడయినట్లు వినుచున్నా రము. అతఁడు తెల్లనివన్నెగల పదిలక్షలగుఱ్ఱములను, బంగారు భూషణములచే నలంకృత లయినపదిలక్షలకన్యలను దానము చేసెను. విస్తరించి దానముచేసిన యాగమందు పద్మమాలికలు దాల్చిన పదిలక్షలయేనుంగులను, బంగారుసొమ్ములుగలవై వేయియావుల ననుచరించు కోటియెద్దులను, నతఁడు దక్షి ణగానొసంగెను. విష్ణుపద మనుపర్వతమందు నతఁడుచేసిన యాగమున సోమపానముచేసి యింద్రుఁడు మత్తునొందెను. దక్షిణలచేత బ్రాహ్మణులు నలరిరి. వందలకొలఁది నతఁడు చేసిన యాగములందు దేవతలకును గంధర్వులకును మనుష్యుల కును దక్షిణలు మిక్కిలి యెక్కుడయ్యెను. * సోమసంస్థలను నేడుయాగములందు నా యంగరాజొసంగిన దక్షిణవలె దక్షిణ నిచ్చు మనుష్యుఁడు నింతకుముందును లేఁడు, ఇఁకమీఁదను గలుగఁడు. ధర్మాదులు నాలుగింట నిన్నును నీపుత్త్రుని మిక్కిలి

---

* అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము, వాజపేయము, అప్తోర్యామమని యాగములేడు.

యతిశయించిన పుణ్యాత్ముఁ డాయంగరాజే మృతినొందెను. నీ పుత్త్రుఁడు పోయినందులకు వగవవలదు. సృంజయా! ఉశీనరుని పుత్త్రుఁడయిన శిబియను రాజు మరణించుటను వినుచున్నారము. అతఁ డీభూమినంతయుఁ దోలువలెఁ జుట్టగాఁ జుట్టెను; గంభీర మయిన తన రథధ్వనిచేత భూమి ధ్వనించునట్లు చేసెను. జయ ప్రదం బగునొకరథమునం దారూఢుఁడై భూమిని దన యేక చ్ఛత్త్రమునకు లోనుగావించెను. ఆశిబి, యడవియందున్న గోవు లతోఁగూడఁ దనకుఁ గలగోవులు గుఱ్ఱములు నన్నిటిని యాగ మందు దానముచేసెను. 'సమస్త రాజులందును, నింద్రసమాన పరాక్రముం డయిన యాయుశీనరుపుత్త్రుఁడగు శిబియను రాజర్షి కంటె వేఱొకరాజు నతని భారము వహింపఁ గలిగినది లేదు; ఇఁకఁ గలుగఁబోవుటయు లేదు' అని బ్రహ్మదేవుఁడును బలం చెను. నీకంటెను నీదు పుత్త్రునకంటెను ధర్మాదులు నాలుగింట మిక్కిలియు నతిశయించిన యామహాపుణ్యుఁడు శిబిరాజే మర ణించెను. ఒకదక్షిణయు నొకయాగమును లేని నీదుపుత్త్రుఁడు మృతినొందినది తలఁచి నీవు శోకముపడవలదు; తపింపనువలదు. సృంజయా! దుష్యంతునకు శకుంతలయందుఁ బుట్టినవాఁడును మహాత్ముఁడును ధనసంచయముల మిక్కిలియుఁ గలవాఁడును నగుభరతుఁడును గాలమునొందెనని వినుచున్నారము. అధిక పరాక్రమశాలియైన యాభరతుఁడు మున్ను దేవతలను గుఱించి యమునా నదితీరమందు మున్నూఱును సరస్వతితీరమందు నిరు వదియు, గంగగట్టునందుఁ బదునాలుగును, దక్కిన చోట్లయందుఁ బెక్కులునుగా వేయి యశ్వమేధములును నూఱు రాజసూయ ములును గావించెను. మనుష్యలోకసమును జేతులచేతఁ బిడికిఁ

లింపఁజాలనట్లు, సకలరాజులు నాశ్చర్యంబగు భరతునికార్యమును ననుసరింప శక్తులుగారు. అతఁడు యాగవేదికలను విస్తరించి వైచి వేయింటికి నెక్కుడు గుఱ్ఱములను గట్టెను. ఆ యాగశాలయందు భరతుఁడు కణ్వునికిఁగాను వేయి పద్మముల (నూఱుకోట్లు) సంఖ్య గలగోవుల నొసంగెను. నీకంటెను నీ పుత్త్రునకంటెను ధర్మాదులు నాలుగింట నెంతయో యతిశయించిన యీమహాపుణ్యుఁడు భరతుఁడే మృతినొందెను. నీ పుత్త్రుఁడు మరణించినందులకుఁ దాపము నొందకుము. సృంజయా! దశరథకుమారుఁ డయినరాముఁడు మరణించెనని వినుచున్నారము. అతఁ డెప్పుడును బ్రాణులయం దౌరసపుత్త్రుఁడుఁబోలెఁ బ్రీతి నెఱపుచు వచ్చెను. అతని దేశమందు ధనములేనివాఁడును, గష్టపడువాఁడును గలుగఁడు. రాముఁ డందఱకును దండ్రివలెనుండి రాజ్యము నేలుచువచ్చెను. అతఁ డేలుచుండు నపుడు కాలముతో వానగురిసి పంటలువర్ధిల్లి యెప్పుడును సుభిక్షముగానే యుండెను. రాముఁడు రాజ్యపాలనము చేయుకాలమందు, ప్రాణులకు జలమందు మునిఁగిపోవుట, అగ్నిచేతఁ గాలుట, దుష్టమృగములవలన నుపద్రవము గలుగుట మొదలయిన కీళ్లుగలుగవు. స్త్రీలును, బురుషులు నేవ్యాధియులేక వలయుసిద్ధులం బడసి వేయేండ్లు సుఖం బుండిరి. ఒండొరులకు వివాదమనునది స్త్రీలయందును గలుగదనఁగా నికఁ బురుషులయందెక్కడిది? ప్రజ లేభయమునులేక యిచ్చవొప్పన సంచరించుచు వలయుసిద్ధుల నొంది సంతోషముఁబడసి యథార్థమయిన నియమముతో నెప్పుడును ధర్మము లాచరించుచు నుండిరి. అతని రాజ్యమందు వృక్షములన్నియు నాటంకములేక

యేకాలమందును బూవులును బండ్లునునిండి పొదలుచుండెను. గోవులన్నియుఁ దూమెఁడు పాలుపిదుకుచుండెను. మహాతపస్వియగు నారాముఁడు పదునాలుగేండ్లు వనవాసముచేసి పిదప నేయడ్డియు లేక నందఱును గొనియాడునట్టి యశ్వమేధములు పదిగావించెను. సుందరమయిన నెమ్మొగమును, నెఱ్ఱనిగన్నులును, సింగమువంటి వెడందఱొమ్మును, జానువులవఱకు వ్రేలుబలువయిన బాహువులును యూథపతియైన యేనుంగువలె నల్లనిరూపును, యౌవనప్రాయమును గలరాముఁడు పదునొకొండువేల సంవత్సరము లయోధ్యకు నధిపతిగానుండి రాజ్యమేలుచువచ్చెను. నిన్ను నీదుపుత్త్రుని ధర్మాదులు నాలుగింట మిక్కిలియు మించినట్టి యాబలుపుణ్యుఁడు రాముఁడే మృతిఁజెందెను. ఒక్కయాగమును దక్షిణయు లేని నీపుత్త్రుఁడు మృతుఁడయినందులకుఁ బరితపింపవలదు. సృంజయా! భగీరథుండను రాజు మృతుఁడయ్యెనని వినుచున్నారము. విస్తరించి యతఁడు చేసినయాగమందు దేవతలకు రాజయిన యింద్రుఁడు సోమరసమును బానముచేసి మదమెచ్చి తనబాహుబలముచే పెక్కువేల యసురులను జయించెను. ఆ భగీరథుఁడు బంగారుసొమ్ములు దాల్చిన పదివేలకన్యలను దనయాగమందు దక్షిణగానొసంగెను. దానముచేసిన యొక్కొక్క కన్నియకును నాలుగేసి గుఱ్ఱములు పూన్చిన యొక్కొక్క రథమును, ఒక్కొక్కరథమునకు బంగారు సొమ్ములుదాల్చి వెంటవచ్చు నూఱేసి యేనుంగులును, ఒక్కొక్క యేనుఁగునకుఁ బిఱుఁద వేయేసి గుఱ్ఱములును, ఒక్కొక్క గుఱ్ఱమునకుఁ బిఱుఁద వేయిగోవులును, ఒక్కొక్కగోవునకుఁ బిఱుఁద వేయిమేఁకలునుగా దానముచేసెను. వానియొడియందు మున్ను రహస్యముగావసించు భాగీరథియను

గంగ,బిడ్డవలెఁ,గూర్చుండియుండెను.అతనితొడమీఁదఁ గూర్చుండిన కారణమున గంగ యూర్వశియను పేరుగలదయ్యె. ముల్లోకములను పావనముచేయు గంగయు బహుదక్షిణలతో యాగములుచేయు భగీరథరాజునకుఁ గూఁతురయ్యెను. సృంజయా! నీకంటెను నీపుత్త్రునికంటెను ధర్మము మొదలయిన నాలుగింట మిక్కిలి యతిశయించిన మహాపుణ్యుఁడా భగీరథుండును మరణమునొందెను నీవు పుత్త్రునిగుఱించి పరితాప పడవలదు. సృంజయా! మహాత్ముండు దిలీపుండనురాజును మరణించెనని వినుచున్నారము. అతని కృత్యములను బ్రాహ్మణులు మిక్కిలి గొప్పవిగాఁ జెప్పెదరు. అతఁడు దానముచేసిన పెనుయాగమందు ధనముల నిండారియున్న యీపుడమిని సంతోషముతోడ బ్రాహ్మణులకు దానముచేసెను. అతఁడుచేసిన యాగములం దొక్కొక్క యుపాధ్యాయుఁడు బంగారముతోఁ జేయఁబడిన వేయియేనుఁగులను దక్షిణగాఁబడసెను. అతఁడుచేసిన యాగమందుఁ గల పెద్దయూప మపరంజిచేత రచింపఁబడినదై యెంతయు జ్వలించుచుండెను. ఇంద్రుఁడు మొద లయినదేవత లతనికి వలయు కార్యములుచేయుచు నతనినారాధించిరి. బంగారుతోఁ జేయఁబడిన యాయూపము మీఁదనున్న చషాలమను నపరంజి స్థాపియందు నాఱువేల దేవతలును, గంధర్వులును నటనము చేసిరి. దానినడుమ విశ్వావసువను గంధర్వుఁడు తానే సప్తస్వరములతోడ వీణాగానముచేసెను. సకలప్రాణులు నతఁడు చేయు వీణాగానము 'నాకు' అని తలంచినవి. దిలీప మహారాజుగావించిన యీకార్యమును నడపంజాలు రాజులెన్నఁడు నుండినదేలేదు. బంగారుకవచములుగల యతనిగజములు మద

ముగొని దారియందుఁ బండియుండెను.సత్యవాదియు గొప్పవిలు కాఁడును మహాత్ముండునయిన దిలీపమహారాజును దర్శనముచేసి నమనుష్యులును స్వర్గలోకమును జయించిరి. దిలీపుని నగరు నందు వేదశబ్దమును విలుశబ్దమును 'ఇమ్ము' అనుశబ్దమును తఱిఁగిన కాలము లేదు. సృంజయా! నిన్నును నీపుత్రునిని ధర్మాదులు నాలుగింట నెంతయునెచ్చియుండిన యాపుణ్యాత్ముఁడు దిలీపుఁడే మృతుఁడయ్యెను. నీపుత్రుని దలంచుకొని తాపపడకుము. సృంజయా! యువనాశ్వునిపుత్రుఁడయిన మాంధాతయు మరణమందెనని వినుచున్నారము. అతఁడు మహాత్ముఁడయిన యువనాశ్వుని యుదరమున పృషదాజ్యమునుండి యుదయించి వృద్ధినొందినవాఁడు; కాంతిమంతుఁడు;ముల్లోకములను జయింపఁదగువాఁడు నగురాజు. గర్భరూపముననుండిన యతనిని మరుత్తులను దేవతలు తండ్రిపార్శ్వమునుండి వెలువరించిరి. దేవరూపుండయిన యాబిడ్డఁడు తండ్రియగు యువనాశ్వుని యొడియందుఁ బరుండఁగాఁ జూచి దేవతలీనిసు వెవరియొద్దఁ బాలుగుడుచునని యొకరితోనొకరు మాటాడికొనుచుండఁగా నింద్రుఁడు 'నావలనఁగుడుచును' అను నర్థముగల 'మాంధాత' యనుమాట చెప్పుచువచ్చెను. అది కారణంబుగా నాబిడ్డనికి మాంధాతయనుపేరు కలిగెను. పిదప మహాత్ముండయినయాబాలకునిఁబోషింపఁగోరి యింద్రుఁడు వానినోరఁ దనచేయిడఁగా నదిపాలుచేఁపెను. అట్లింద్రుని చేతిని గుడుచుచుండఁగా నాబిడ్డనిమేను నాఁటికి నూఱుపలములచొప్పునఁ బెరిఁగి పండ్రెండుదినములకు పండ్రెంఁడేండ్లు వయసుగలవాఁడయ్యెను. ధర్మాత్ముం డగుమహాత్ముండును శూరుండును నింద్రసమానుం డయిననామాంధాతకు భూమియంతయు

నొక్కనాఁటిలో వశమయ్యెను. అతఁడు యుద్ధమున నంగారుని మరుత్తుని అసితుని గయుని నంగరాజగు బృహద్రథుని జయించెను. మాంధాత యంగారరాజుతో మార్కొని పోరాడునపు డతనివింటిధ్వనిచే దేవలోకము పెటిలినదని దేవతలు తలఁచిరి. సూర్యుని యుదయాస్తమయములకు లోనయిన భూతలమంతయు మాంధాతక్షేత్రముగా చెప్పంబడుచున్నది. రాజా! మాంధాత వందలకొలఁది నశ్వమేధములను రాజసూయములను జేసి వానియందు బ్రాహ్మణులకు నొకయోజనముపొడవును బదియోజనముల నిడివియుఁగాఁ బ్రోగయిన బంగారుమయములగు రోహితమత్స్యములను దానముచేసెను. * ఆయాగమందు బ్రాహ్మణుల కిచ్చి యధికముగానుండిన ధనములనుఁ దక్కిన జనులు తాము పంచుకొనిరి. సృంజయా! నీకంటెను నీపుత్రుని కంటెను ధర్మాదులు నాలుగింటను మిక్కిలి యతిశయించిన మహాపుణ్యుఁ డయినయామాంధాతయో మరణము నొందెను. నీపుత్రునికై పరితపింపవలదు. సృంజయా! నహుషునిపుత్రుఁ డయిన యయాతి మరణించెనని వినుచున్నారము. అతఁడు సముద్రముతోఁ గూడ నీపుడమినంతయు జయించి శమ్య (బలుపయినదుడ్డుకఱ్ఱ) విసరివైవఁగాఁ బోయి పడునంతదూరమున కొక్కొక్కటిగా వేదికల భూమి నలంకరించి పెక్కులు మేటిజన్నములు చేసి యీభూమినంతయు విడిచి సముద్రతీరమునుబొందెను. నూఱు వాజపేయములును దక్కిన యాగ

* "అతిరిక్తాః ద్విజాతిభ్యో వ్యభజం స్త్వితరే జనాః" అని మూలము. ఇందులకు 'ఎక్కువగా మిగిలిన ధనములను దక్కినజనులు బ్రాహ్మణులకు నిచ్చిరి.' అని యర్థాంతరము. ఇది సమంజసముగాదు.

ములు వేయింటిని గావించి యయాతి మూఁడుబంగారుకొండల చేత బ్రాహ్మణోత్తములకుఁ దృప్తిగావించెను. ఆయయాతి భూమి యందుఁ గలదైత్యులను దానవులను నసురయుద్ధమునుబన్ని వధించి భూమినంతయుఁ గయికొని కొడుకులకుఁ బంచువాఁడై యదువు ద్రుహ్యుఁడు మొదలయిన కుమారులను రాజ్యము చివరలం దునిచి పూరుని రాజ్యమున కభిషిక్తునిఁజేసి భార్యా సహితముగా వనమును బ్రవేశించెను. సృంజయా! నిన్నును నీపుత్త్రునిని ధర్మాదులు నాలుగింట నతిశయించినయా మహాపు ణ్యుఁడు యయాతియే మరణమునొందెను. నీ పుత్త్రునిగుఱించి పరితపింపవలదు. సృంజయా! నాభాగునిపుత్త్రుఁడయినయంబ రీషుఁడును మృతుఁడయ్యెనని వినుచున్నారము. జనులు పుణ్యా త్ముఁడయినయా రాజశ్రేష్ఠుని రక్షకునిఁగా వరించిరి. అతఁడు తాను విస్తరించి చేసినయాగమందు యాగముచేయించుబ్రాహ్మ ణులకు, వేయియాగముల నొక్కొక్కఁడును జేసినట్టి రాజులను బదిలక్షలమందిని బరిచర్యలుచేయ నియోగించెను. ప్రాజ్ఞులు 'ఇట్లుచేసినవా రింతకుమునుపును లేరు. ఇఁకమీఁదను లేరు' అని యంబరీషుని మిక్కిలి కొనియాడిరి. అతనియాగమందు బ్రాహ్మ ణులకూడిగముచేసిన రాజులందఱును నశ్వమేధయాగములుచేసిన వారుంబోలె (నంబరీషునిమహత్త్వముచేత) నుత్తరాయణమను దేవయానమార్గమునఁబోయి హిరణ్యగర్భలోకమును బొందిరి. సృంజయా! ధర్మాదులు నాలుగింట నీకంటెను నెక్కుడై నీపు త్త్రునికంటెఁ బుణ్యుఁడయినయా యంబరీషుఁడే కాలగతిఁజెం దెను. నీపుత్త్రునిగుఱించి శోకింపకుము. సృంజయా! చిత్రరథుని పుత్త్రుఁడయినశశిబిందుఁ డనురాజును మృతుఁడయ్యెనని

వినుచున్నారము. అమ్మహాత్మునకు లక్షమంది భార్యలుండిరి. వారలయందతనికిఁ బదిలక్షలుకుమారులు గలిగిరి. ఆపుత్రులలో నొక్కొక్కరును బంగారుకవచములు దాల్చినమేటి విలుకాండ్రు రయియుండిరి. ఒక్కొక్కపుత్రునకును వేయువేయ నూఱేసికన్నియలును నొక్కొక్కకన్నియకు నూఱేసియేనుఁగులును, నొక్కొక్కయేనుఁగునకు నూఱేసి తేరులును, నొక్కొక్కతేరికిని బంగారుసొమ్ములు దాల్చినమేటిగుఱ్ఱములు నూఱేసియు, నొక్కొక్కగుఱ్ఱమునకును నూఱేసిపశువులును నొక్కొక్కపశువునకును నూఱేసిమేఁకలును గొఱియలునుండెను. ఇట్లు తుదిలేక సొంపారుచున్నయీమహాధనము నతఁడశ్వమేధయాగమందు బ్రాహ్మణుల కొసంగెను. సృంజయా! నీకంటె ధర్మాదులు నాలుగింట నెక్కుడై నీపుత్రునికంటెఁ బుణ్యాత్ముఁడయిన యాశశిబిందుఁడే మృతినొందెను. నీపుత్రునిగుఱించి తాపపడకుము. సృంజయా! * అమూర్తరజసుని పుత్రుఁడయినగయుఁడును మరణమునొందెనని వినుచున్నారము. ఆరాజు హోమము చేసి మిగిలినదానిని నూఱుసంవత్సరములు భుజించుచుండెను. అగ్ని తానే యతనికి వరమొసంగఁగోరి వచ్చెను. రాజయ్యగ్నిని 'నే నెంతదానము చేసినను నాధనము తఱుఁగకుండవలయును. నాకు ధర్మమందు శ్రద్ధ వర్ధిల్లవలయును. అగ్నిదేవా! నీప్రసాదమువలన నామనసు సత్యమందే రమింపవలయును.' అని యీవరములనడిగెను. అగ్నిదేవుఁడు నతనియిచ్చవొప్పున నావరములనెల్ల నిచ్చెనని మాకు వినికిగలదు. అతఁడు దర్శము పూర్ణమాసము, చాతుర్మాస్యము, అశ్వమేధము ననెడియాగము

* 'గయం చామూర్తరయసమ్' అని యుత్తరాహపాఠము.

లు పెక్కువేల సంవత్సరములు చేయుచుండెను. లక్షగోవులను బదివేలగుఱ్ఱములను వేయేండ్లవఱకు మరలమరల నిచ్చుచుండెను. పురుషసత్తమా ! అతఁడు సోమయాగముచేత దేవతలను, ధనములచేత బ్రాహ్మణులను, శ్రాద్ధములచేతఁ బితరులను, గామములచేతఁ దన యిల్లాండ్రను దృప్తినొందించెను. అశ్వమేధమహాయజ్ఞమందు నేఁబదిమూరల వెడలుపును నూఱుమూరల నిడివియుఁ గలబంగారునేలను గావించి దక్షిణగా నొసంగెను. గయుఁడు గంగాతీరమందలి యిసుకలెన్నిగలవో యన్నిగోవులను దానముచేసెను. సృంజయా ! నీకంటె ధర్మాదులు నాలుగింటనెక్కుడై నీపుత్రునికంటెను బుణ్యుఁడయినయాగయుఁడే కాలగతినొందెను. నీపుత్రునికై పరితాపపడవలదు సృంజయా! సంకృతిపుత్రుఁడయినరంతిదేవుఁడును మరణించెనని వినుచున్నారము. అతఁడు గొప్పతపస్సుచేసి యింద్రు నారాధించి యతనివలన 'మాకు నన్నము మిక్కిలియునుండవలెను; మాకతిథులును దొరకవలయును. మాకు శ్రద్ధ తొలంగకుండవలయును. మేమెక్కరినినియాచింపకుండవలయు' నని వరములనుబడసెను. సంశితవ్రతుండును మహాత్ముండును యశస్వియు నగు రంతిదేవునికడకుఁ దమ్ము సద్వినియోగముచేయుఁగాకయని గ్రామములందును నడవులందును గలపశువులు తమంతటనే వచ్చెను. అతఁడు యాగమునం దుపయోగించిన పశువులతోలుప్రోవునుండి స్రవించుజలము చర్మణ్వతి యనుపేరు గలమహానదిగఁ బ్రసిద్ధినొందియున్నది. ఆరాజు గొప్పసభయందు బ్రాహ్మణులకవ్వారిగా బంగారమును దానముచేసెను. *ఆకాలమందు

* 'మీకు నూఱునిష్కములిచ్చెద' నని రాజుచెప్పఁగా బ్రాహ్మణులందు

బ్రాహ్మణులు 'నీకు నూఱునిష్కము లియ్యఁబోవుచున్నాఁడు.' నీకు నూఱియ్యఁబోవుచున్నాఁడు' అని చెప్పినప్పుడే యతఁడో 'మీకు వేయి నిష్కము'లని చెప్పియిచ్చి బ్రాహ్మణులను సంతోషముగా రాఁబట్టెను. ఆబుద్ధిమంతునిగృహమందు వంట కయిన పాత్రములు, తక్కినబండములకుఁ గలపాత్రములును, కుండలును, పాత్రలును, కొప్పెరలును, స్థాలులును, పిఠరములును నేవి యేనియు బంగారముగానివి కలుగవు. అతనియింట నొకరాత్రి వేయున్నాట యిరువదిగోవులు చంపఁబడుచుండెను. అందు మెఱుఁగిడ్డరతనాలకుండలములు గలపరిచారకులు భుజించువారిని 'ఇప్పుడు తొంటివలె మాంసము లేదు. వలయునట్లు ప్రప్పు మొదలగువానిని భుజింపుఁడు' అని బిగ్గఱ చెప్పిరి. సృంజయా! నీకంటెను ధర్మాదులనాలుగింట నెక్కుడై నీపుత్త్రునికంటెఁ బుణ్యుఁడయిన యారంతిదేవుఁడే మృతినొందినాఁడు. నీదుపుత్త్రుని గుఱించి పరితాపపడవలదు. సృంజయా! మహాత్ముం డయిన సగరుండును గతించినట్లు వినుచున్నారము. ఇక్ష్వాకుకాలమునఁ బుట్టి యమానుషపరాక్రమమువడసి పురుషులకుఁ బులియుం బోలి వెలుంగు నా సగరుఁడు బయలు వెడలునపుడతనియఱువది వేవురు పుత్త్రులు, శరత్కాలమందు మేఘము లేని యాకసమునఁ జంద్రుని నక్షత్రసమూహములు వెంబడించునట్లు వెంబడించిరి. తొల్లి యతనిప్రతాపమువలన భూమియంతయు నతనియేకచ్ఛత్రముక్రింద వెలయుచుండెను. అతఁడు దేవతలను వేయి యశ్వమేధయాగములచేతఁ దృప్తినొందించెను. తామరసపత్త్ర

లకొల్లక బిగ్గఱఁగా 'నీకు నూఱునిష్కములు మేమిచ్చెద'మని కూపెట్టుటయు రాజు వేయి నిష్కములిచ్చెనని యర్థాంతరము.

నేత్రలగు చెలువలచేతను శయనములచేతను నిండినవై బంగారు మయము లయిన స్తంభములుగలిగిన యుప్పరిగలును మఱియుఁ దక్కుఁగల భోగ్యవస్తువులును, పాత్రము లగుబ్రాహ్మణులకు దానముచేసెను. అతని యాజ్ఞచొప్పున బ్రాహ్మణు లావిత్తమును బంచుకొనిరి. సముద్రపరివృత మయినభూమి నతఁడు కోప మునఁ ద్రవ్వించుటచేత నతనిపేర సాగర మనుపేరు సము ద్రమునకుఁ గలిగినది. సృంజయా ! నీకంటె ధర్మాదులు నాలు గింట నెక్కుడై నీపుత్రునకంటెఁ బుణ్యుఁ డయినయా సగ రుఁడే మృత్యుఁడయ్యెను. నీ పుత్రునకై పరితాపపడవలదు. సృంజయా! వేనునిపుత్రుఁ డయినపృథుఁడనురాజు మృతుఁడయ్యె నని వినుచున్నారము. మహర్షులు మహారణ్య(దండకారణ్య)మం దొక్కటిగాఁ జేరి లోకములనితఁడు ప్రథనొందింపఁ గలఁడని తలఁ చి పృథువని పేరిడి వానికిఁ బట్టాభిషేకముచేసిరి. అతఁడు లోకము లను క్షతము (ఆపత్తి)నుండి కాచుటచే క్షత్రియుఁ డనియును, నతనిని జూచినప్రజలు రక్తులమయితిమని చెప్పుటచే రాజ నియు పేరొందినవాఁడయ్యెను. అతఁడు లోకము నేలుకాల మందు భూమి దున్నకయు పండెను. చెట్లయం దొక్కొక్కయా కునందును దేనె దొరకెను. ఆవులన్నియుఁ దూమెఁడుపాలు పిది కెను. మనుష్యులు తెవులులేకయు నేవిధమయిన భయమును లేకయు వలయుసిద్ధినిబడసి నింటను బయళ్లను విచ్చలవిడి వసిం చుచుండిరి. అతఁడు సముద్రమునఁ బోవుకాలమందు జలము గూడ ఱాయివలె స్తంభించియుండెను. అతనివింటిచేఁ గొండ లును జీల్పఁబడినవి. అతని ధ్వజమునకు భంగపాటు కలుగదయ్యె. అతఁ డొనర్చిన యశ్వమేధమహాయజ్ఞమందు మూఁడు మను

ష్యాల పొడవుగల బంగారు కొండల నిరువదియొకంటిని బ్రాహ్మ ణులకు దానముచేసెను. సృంజయా! నీకంటె ధర్మాదులు నాలు గింట నెక్కుడై నీపుత్రునికంటెఁ బుణ్యుఁడయినయా పృథుఁ డును మృతినొందెను. నీపుత్రునిగుఱించి తాపమొందకుము. సృంజయా! నీవు పలుకక యేమో యాలోచించుచున్నావు; నే నిపుడు చెప్పినమాట వినవు కాఁబోలు. దాని వినవయితివేని నేని పుడు మొఱయిడినయీమాటలు, చావనున్నవానికి నెంతచక్కఁ గాఁ బథ్యము ప్రయోగించినను వ్యర్థమగునట్లు, నీయందు విఫల ముగావలయును' అనెను. సృంజయుఁడు 'నారదా! నీవు చెప్పిన యీమాటల వినుచున్నాను. వీనియందలి యర్థము మిక్కిలి విచి త్రముగానున్నది; కాన కమ్మతావులు గుబులుకొను పూదండవలె నిది యింపుగులుకుచున్నది; మహాత్ములును బుణ్యకర్ములును మహాకీర్తిమంతులు నయినరాజర్షులనుగుఱించిన ముచ్చట గలది గావున శోకమునంతయుఁ దూలించుచున్నది. మహర్షీ! నీమా టలు వ్యర్థములుగావు. నీదర్శనముననే నాకు శోకము వీడిపోయి నది. అమృతమును నెంత త్రావినను దనివిగలుగనట్లు నీమాటల విన్నఁగోరిక కలుగుచున్నదే కాని తృప్తికలుగకున్నది. నీదృష్టి యమోఘమైనదిగదా. నేనుసంతాపమునఁ బొక్కుచున్నవాఁడ. విభూ! ఇట్టినీవు నాయందనుగ్రహము చూపితివేని యిపుడు నా పుత్రుఁడు తప్పక బ్రతుకును. పుత్రునితోడి సంగమును నాకుఁ బడయఁగలుగును' అని వేఁడెను. నారదుఁడు 'నీకుఁ బర్వతుఁ డొసంగిన స్వర్ణష్ఠీవి యనుపుత్రుఁడు మృతుఁడయి యిట్లుపరుండి యున్నవాఁడుగదా. వీనిని మరల నీకు నిచ్చుచున్నాను. వీఁడు

బంగారు కాంతిగలిగి వేయేండ్లు బ్రతుకఁగలఁడు' అనెను. ఇది యిరువదియొనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{కృష్ణుఁడు ధర్మరాజునకు నారదపర్వతోపాఖ్యానము చెప్పుట.}

ధర్మరాజు 'అసృంజయుని కొడుకు సువర్ణష్ఠీవి యెట్లయ్యెను? పర్వతుఁ డేల యాపుత్త్రు నొసంగెను? వాఁడేల మరణించెను? ఆ కాలమున మనుష్యునియాయువు వేయేండ్లయి యుండఁగా సృంజయునికొడుకు బాల్యము నిండనిప్రాయముననే చచ్చుట యెట్లు? ఆతనికి సువర్ణష్ఠీవి యనునది వట్టిపేరా? లేక యందులకుఁ గారణమున్నదా? ఇది తెలియఁగోరుచున్నాను' అని యడిగెను. అందులకుఁ గృష్ణుఁడు 'రాజా! ఇది జరిగినట్లు నీకుఁ జెప్పెదను. నారదుఁడు పర్వతుఁడు ననుఋషు లిరువురుగలరు. వారు లోకమున నమేయులు. నారదుఁడు మేనమామ; పర్వతుఁ డతని మేనల్లుఁడు. తొల్లి వారిరువురు నుల్లముపల్లవింప నిందలి వరిబియ్యపుటన్నమును నేతిని భుజించి విహరింపవలయునని కోరి దేవలోకమునుండి యీలోకమునకువచ్చిరి. తపస్వులయిన యామామయు నల్లుఁడు నిరువురును మనుష్యులు దినునన్నములను దినుచు భూమిపయి సంచరించుచుండిరి. వారిరువురు నొండొరులయెడఁ బ్రీతిగలవారుగాన నొకరికొకరు సంతోషమున 'మనలో నెవనికిఁగాని మనస్సునందు మంచిదో చెడ్డదో యేతలంపుగలిగినను నొకరి కొకరు తెలుపవలయును, లేదా,

అట్లు తెలుపనివానికి శాపముగలుగు'నని సమయముచేసికొనిరి. ఇట్లు లొడంబడిక చేసికొని యాలోకపూజితు లిరువురును శ్వేతుని కొడుకయిన సృంజయుఁ డనురాజుకడకుఁబోయి 'రాజా ! మే మిరువురును నీ మేలునకుఁగాను గొంతకాలము నీయొద్ద వసింపఁగోరుచున్నారము. మాకుఁగలరూపున ననుకూలుఁడవై యుండుము' అనిరి. రాజును 'వల్లె' యని వారిని సత్కరించి తానే యుపచరించెను. అంత నొకప్పుడు రాజు మహాత్ములయిన యా తపోధనులనుజూచి మిక్కిలియుఁ బ్రీతిగడలుకొన 'దేవతయుం బోలెఁ జూపట్టుచున్న యీచిన్నది నాకొక్కతే కూఁతురు. ఈబిడ తామరయకరువులవంటి పసిమిచాయఁ దళుకొత్తుచు నేకందును లేక చూడందగి యొప్పునవయవములపొందు గలది ; మంచి శీలమును వృత్తమునుగలది. ఈకుమారి పేరు సుకుమారి. ఇది మీ యిరువురకుఁ బరిచర్యచేయఁగలదు' అనెను. ఆఋషులు 'మిక్కిలి యుత్తమ' మనిరి. అంత నారాజు నాకన్నియను 'కూఁతురా ! ఈ బ్రాహ్మణులను దేవతలవలెను దండ్రులవలెను నుపచరించుచుండవలయును' అని కట్టడచేసెను. ఆకన్యయు ధర్మమాచరించునట్టిదిగాన 'వల్లె'యని తండ్రి యానతిచొప్పున నామునివరులకు మరియాదతోడ నుపచరించుచువచ్చెను. ఆబిడ యట్లుచేయుచున్న యుపచారముచేతను దాని యెనలేని చక్కఁదనముచేతను మన్మథుఁడుతోడనే నారదునాక్రమించినవాఁడయ్యె. అంతనమ్మహాత్ముని మనసునందలి మరుఁడు శుక్లపక్షారంభమందలి చంద్రుని వలె నాఁడునాఁటికిఁ బెరుఁగుచుండెను. ఆనారదుఁడు ధర్మవిదుండయ్యును దీవ్రమయిన యామరులును సిగ్గువలనఁ దన మేనల్లుఁడగు పర్వతునకుఁ దెలుపక పోయెను. పిదపఁ బర్వతుఁడో యింగితముల

చేతను దపశ్శక్తిచేతను నా నారదుఁడు కామార్తుఁడై యుండు టను దెలిసికొని తోడనే మిక్కిలియుఁ గుపితుఁడై యతనిని శపించువాఁడై "ఓబ్రాహ్మణా! మనస్సునందు మంచిదో చెడ్డదో యేతలంపుగలిగినను దానినంతయు మన మొకరికొకరు చెప్పి కొనవలయును" అని నాతోడ నీవు మనఃపూర్వకముగాఁ బ్రతి జ్ఞచేసి యిప్పుడు నీవే దానిని బొల్లుగావించితివి. సుకుమారియను కొమరాలియందు నీకుఁ గలమరులు నాకుఁ జెప్పవయితివి. నీవొ పెద్దవాఁడవు; బ్రహ్మచారివి; తపస్వివి; మఱిబ్రాహ్మణుఁడవు. ఇట్టివాఁడవై యుండియు మన మొండొరులు చేసికొన్నప్రతి జ్ఞనుండి జాఱినది నాకు సయింపరాకున్నది. అది కారణముగా మిక్కిలి కుపితుఁడనై నిన్నుశపించెదను. సుకుమారి నీకుఁ దప్పక భార్యకాఁగలదు; సందేహము లేదు. ఆపడఁతిని బెండిలియైనది మొదలుగా నీ సొంతరూపునుబాసి వానరరూపమును బొంది జనులందఱకును జూపట్టుదువు' అని శపించెను. నారదుఁడా శాపవాక్యమునువిని 'ఓరీ! తపము బ్రహ్మచర్యము సత్యము దమము నను నివియుండియు నిత్యధర్ముఁడవయ్యు నీకు స్వర్గము లేక పోవుఁగాక' యని మాఱుశపించెను. ఇట్లామును లిరువురును బరస్పర మసూయవలనఁ గ్రుద్ధులై యొకరినొకరు శపించుట మేటిగజము లొండొంటిని దలపడినట్లుండెను. మహామతియగు పర్వతుఁడు నిజ తేజంబుచేత న్యాయంబుచొప్పున నెల్లయెడలఁ బూజలందుచు, నీభూమియంతయు సంచరించుచుండెను. అంత నారదుఁడు సృంజయుని కూఁతురయిన సుకుమారిని, ఏకందును లేనిసుందరీమణిని, విధ్యుక్తముగాఁ బెండ్లాడెను. ఆకన్నియయుఁ బర్వతుని శాపముచొప్పున నారదుఁడు వివాహమంత్రములు

చెప్పితీఱఁగానే వానరమువంటి మొగము గలిగి యుండుటఁ గాంచెను. అయిన నాబిడ యతని నపు డింతమాత్ర మవమానింపక మిక్కిలియుఁ బ్రీతియే చూపుచువచ్చెను. ఆచెలువ పతియందు నెయ్యమునియ్యముగలదై యతని నుపచరించుచుండినదేకాని మఱియొక దేవతను గాని ఋషినిఁగాని యక్షునిఁగాని మనస్సునందునయితము పతిగాఁ దలంపకుండెను. అంత నొకనాఁడు పర్వతుఁడెవ్వరును లేని యొకయడవియందుఁ బోవుచుండఁగా నట నారదునిఁగాంచెను. తోడనే యతఁడు నారదునికడకుఁబోయి మ్రొక్కి, "ప్రభూ! నేను స్వర్గలోకమునకుఁబోవునట్లు నీ వనుగ్రహింపవలయును' అని వేఁడెను. నారదుఁడట్లు పర్వతుఁడు దీనుండై చేతులుమోడ్చి నిలుచుండుటనుజూచి తానును మఱింత దుఃఖితుఁడై 'నాయనా! నన్ను నీవు మొదట వానరుఁ డగునట్లు శపించితివి. దానివలన నేనును గోపముగొని 'ఇది మొదలు నీకు స్వర్గమందు వాసముగలుగ' దని శపించితిని, నీవు నాకుఁ బుత్రునివంటివాఁడవగుదువు. ఇట్టి నీకిప్పనితగునే' యనెను. అంత నామునులిరువురు నొండొరుల కొసంగిన శాపములను నివర్తింపఁజేసిరి. అప్పుడు నారదుఁడు తన యెప్పటిరూపున దేవతయుంబోలెఁ గాంతిపెంపు సొంపారుచుండఁగా సుకుమారిచూచి పరపురుషుఁడని శంకించి పరుగునఁ బోవఁదొడఁగెను. దానినిజూచి పర్వతుఁడు 'అమ్మా! ఇతఁడు నీ భర్తయగును. ఇందు సందేహమువలదు. పరమధర్మాత్ముం డయిన భగవంతుఁడు నారదమహర్షి నీయందు మనసెప్పుడును వీడనివాఁడు. ఇందు సంశయమువలదు.' అని పలువిధములను సమాధానపెట్టెను. అమ్మహాత్ముఁడు పర్వతుఁడు చెప్పినదివిని సుకుమారి

తనపతికి నడుమవచ్చిన వానరరూపము శాపదోషమునఁ గలిగిన దని తెలిసికొని యెప్పటివలెనుండెను. అంతఁ బర్వతుఁడు స్వర్గమునకుఁ బోయెను. నారదుఁడు తనగృహమునకు నరిగెను. రాజా! సమస్తమును దనంతనే కావించిన యమ్మహాత్ముఁడు నారదమహర్షి యిదిగో నున్నాఁడు. అడిగితివేని జరిగినది జరిగినట్లు చెప్పఁగలఁడు' అనెను. ఇది యిరువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

నారదుఁడు ధర్మరాజునకు సువర్ణష్ఠీవిచరిత్రము చెప్పుట.

అంత ధర్మరాజు నారదునిఁజూచి 'మహాత్మా! సువర్ణష్ఠీవి పుట్టిన తెఱంగు వినఁగోరెద' ననెను. అందులకు నారదుఁడతనితో 'మహాబాహూ! శ్రీకృష్ణుఁడు చెప్పిన యిక్కథయిట్లు జరిగినది. ఇందు మిగిలినకథను నీకుఁ జెప్పెదను. నేనును నామేనల్లుఁడు పర్వతుఁడును సృంజయునియొద్ద వసించుటకుఁ బోయితిమి. అతఁ డప్పుడు మమ్ము విధ్యుక్తముగాఁ బూజించి, వలయుకోర్కు లనెంతయు నొడఁగూర్చుచుండఁగా నిచ్చలు నతనియింట వసించుచుంటిమి. అప్పుడు వర్షాకాలముగడచుటవలన మాకు వెడలి పోవలసివచ్చెను. ఆసమయమందుఁ బర్వతుఁడు నాతో 'మన మీరాజునింట మిక్కిలియుఁ బూజితులమై వసించుచున్నారము. కాబట్టి బదులేమిచేయవలయునో యాలోచింపుము' అనెను. నేను 'అల్లుఁడా! ఇదంతయుఁ జేయుట నీకేతగును. సృంజయుని కోరినవరమతఁడే యడుగనిమ్ము. అతఁ డేదేదికోరునో యది పడయుఁగాక. లేక నీకిష్టముండెనా మనతపశ్శక్తిచేత నతఁడు కోరిన

సిద్ధినొందుఁగాక'యంటిని. అంతఁ బర్వతుఁడు సృంజయునిఁబిలిచి 'రాజా! నీవు చక్కటితోఁ జేసిన సత్కారములకుఁ బ్రీతులమయి తిమి. రాజా! మేమనుజ్ఞ యిచ్చితిమి. వలయువరము నాలోచించి చెప్పుము. అయిన నావరము దేవతలకుఁ గీడుగాని మనుష్యు లకు నాశముగాని చేయునట్టిది గారాదు. రాజా! అట్టివరమును గయికొనుము, ఏలన నీ వట్టిపూజకుఁ దగుదువని మామతము ' అనెను. సృంజయుఁడు 'మీకు నాయందుఁ సంతోషముగలదేని యంతే నాకనుజాలును. అదియే నాకుఁ బరమలాభము. నాకు మహాఫలమొడఁగూడినదే చుఁడీ ' యనెను. అందులకుఁ బర్వ తుఁడు 'రాజా! చిరకాలముగా నీ మనస్సునం దున్నతలంపును జెప్పెదవినుము. నీవు వీరుఁడును వీర్యవంతుఁడును దృఢవ్రతుం డును దీర్ఘాయుష్మంతుండును మహాభాగ్యవంతుఁడును దేవేం ద్రసమానకాంతియు నగు కొమరునిఁ బడయఁగోరుచున్నావు. నీకోరినట్లు కాఁగలదు. కాని పుట్టిన కొడుకాయుష్మంతుఁడు మా త్రము గానేరఁడు. ఏలన నింద్రునిఁ గ్రిందుపఱచుటకై కదా నీ కిట్టితలంపు మనస్సుననాటియున్నది. ఆబిడ్డఁడు సువర్ణమును గ్రక్కు టచే సువర్ణష్ఠీవియని చెప్పఁబడును. దేవరాజుంబోలెఁ గాంతి దళుకొత్తు నాకుమారుని దేవరాజువలన రక్షింపవలయును' అని మరలఁ జెప్పెను. సృంజయుఁడు పర్వతునితో ' మహర్షీ ! ఇది యివ్విధముగాకుండవలయు' నని యతనిని వేఁడికొనుచు 'మఱి యు మీ యిరువురతపశ్శక్తిచే నాబిడ్డఁ డాయుష్మంతుఁ డై యుండవలయును' అనెను. పర్వతుఁ డింద్రునివలని పక్షమున నాతనికేమియు బదులుచెప్పఁడయ్యె. అందులకు వగచుచున్న రాజును జూచి నేను 'మహారాజా! ఆసమయమున నన్నుఁ దలం

చుకొనుము. యమునిపాలుపడియున్నను నీ యల్లారుబిడ్డని నే కొంచెతయు లేకుండ నట్లారూపుననే మరల నీ కిచ్చెదను. నీవు దుఃఖపడకుము' అని మరలఁ జెప్పితిని. ఇట్లు చెప్పి మేమిరు వురును నిచ్చలు పోయితిమి. సృంజయుఁడు తన మందిరమునకుఁ బోయెను. అంత నొకప్పుడు సృంజయునకుఁ దేజంబు మిక్కిలి గాను రాజిలుచుండు నొకపుత్త్రుఁడు పుట్టెను. ఆబిడ్డఁడు పెద్ద కొలఁకునందుఁ దామరపూవు దద్దయుఁ బెరుఁగునట్లు, నానాఁటికిఁ దగునట్లు పెరుఁగుచుండెను. వాఁడు సువర్ణష్ఠీవి యనునామము సార్థకముగా సువర్ణమును విసర్జించుచుండెను. అది యీలోక మునందంతయు బెనువింతగానుండెను. ప్రాజ్ఞులయిన మూర్ఖులు సృంజయునకు నొసంగిన వరంబును దెలిసి దేవేంద్రుఁడు తనకుఁ దీర్పాటుకలుగునో యని భయపడి గురుఁడయిన బృహస్పతి మతముచొప్పున నిత్యము నాపుత్రకునకుఁ గీడుసేయ తెలుపి వెద కుచుండెను. అంత నొకప్పుడతఁడు తనయెదుట రూపొందియు న్న తనదివ్యాస్త్రమగు వజ్రమునుజూచి 'వజ్రమా! పర్వత ఋషి చెప్పినట్లు సృంజయుని పుత్త్రుఁడు పెరిఁగి తనవీర్యముచేత నన్నుఁ గీడ్పఱుపఁగలడు. కాన నీవిపుడే పులిరూపముగొని యారాజపు త్త్రునిఁ జంపుము' అని యాజ్ఞాపించెను. ఆవజ్రమో పగవారిపుర ముల గెలుచునట్టిదిగాన యింద్రుఁడు పురికొలుపఁగా నక్కుమా రునిఁ దుదముట్టించుటకు నెప్పుడు కందువ నరయుచునేయుం డెను. సృంజయుండు నింద్రునకుసాటియై వెలుంగు పుత్త్రునిఁ బడసి సంతుష్టినొంది యంతఃపురపువారితోఁగూడ నెప్పుడును వనమందే వసించియుండెను. పిదప నొకనాఁ డబ్బాలుఁడు గంగా తీరమునం దెవరును లేని యొకవనమందుఁ గ్రీడించుటకు దాది

తోఁగూడంబోయెను. ఆబిడ్డని కపుడించుమించుగా నయిదేండ్లు. వానికప్పటికి మేటియేనుంగువంటి పరాక్రమము గలిగియుండెను. అట్లాడుచుండఁగా నాబిడ్డఁడు తనపైఁ దటాలునఁ దూకివచ్చుచున్న యొకపులిని జూచెను. ఆ బాలుఁడు వడవడవడంకుచు బులిచే నలంపఁబడి యసుబెడలి పుడమిపయింబడెను. తోడనే దాదియుఁ గూపెట్టెను. ఇంద్రునిమాయచేవచ్చిన యాపులియు రాజకుమారునిఁ జంపినతోడనే యక్కడనే మఱుఁగయ్యెను. ఎంతోకష్టమునఁగూపెట్టుచున్న దాదియెలుఁగువిని సృంజయుఁడు తానే యక్కడికిఁ బరుగునవచ్చెను. అట్లువచ్చి యాబిడ్డనిఁగాంచెను. వాఁడునెత్తురుద్రానంబడి యసుఱువీడి యాకాశమునుండి యానందము కుందిపడియున్నచంద్రునివలెఁ బరుండియుండెను. అంత నారాజు ఱొమ్ముఁగొట్టుకొనుచు నెత్తుటఁ దోఁగియున్న యాబాలుని నోడియుం దెత్తిపెట్టుకొని యాతురుఁడై పలవించెను. అంత నాబిడ్డని తల్లులును శోకమున రోదనముసేయుచు సృంజయుఁడున్నయయ్యెడకుఁ బాలుఁ దెంచిరి. పిదప సృంజయుఁడు మనస్సు నాయందుఁ జెల్లించి నన్నే తలంచుకొనెను. అప్పుడతని చింతనెఱింగి నే నతనికెదుటఁ బొడకట్టితిని. ఆరాజు శోకరసంబు ననోలలాడుచుండఁగాఁ గృష్ణుఁడు నీకుఁ జెప్పినమాటలన్నియు నతనికి వినిపించితిని. పిదప బిడ్డని బ్రతికించినయెడ వాఁ డింద్రు ననుసరించి వర్తింపవలయునేకాని వేఱువిధమున వానిని బ్రతికింప శక్యముగాదనిచెప్పి వానిని బ్రదికించితిని. అటుపిమ్మట నా కుమారుఁడు సువర్ణష్ఠీవి మిక్కిలిపొగడ్తయుఁ బరాక్రమమును బడసి తల్లిదండ్రులకు సంతోషముగావించెను. భయంకరపరాక్రముఁడయిన యాసువర్ణష్ఠీవి తనతండ్రిస్వర్గమునకుఁ బోఁగానే

వేయినూఱేండ్లు రాజ్యపాలనము చేసెను. ఆకాలమందు బహు దక్షిణలతోఁ గూడిన గొప్పయాగములు పెక్కులుగావించి దేవతలకును బితృదేవతలకును దృప్తిగావించెను. అతఁడు తనవంశపరంపరకుఁ గారణముగాఁ బెక్కండ్రుపుత్త్రులనుగని బహుకాలమునకుఁబిదపఁ బరలోకమునొందెను. రాజోత్తమా! నీవును నీకుంగల యీశోకమును దిగవిడువుము. శ్రీకృష్ణుండును వ్యాసమహర్షియుఁ జెప్పినట్లు నీతండ్రితాతలనుండివచ్చిన రాజ్యమును గయికొని పరిపాలింపుము. పవిత్త్రములయిన మహాయజ్ఞములు చేసి యిష్టంబగులోకమును బొందఁగలవు' అనెను. ఇది ముప్పదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ దత్త్వోపదేశము నేయుట. ధర్మరాజు వ్యాసుని నాశ్రమములమేలిమినడుగఁగా నతఁడుచెప్పుట.

అంత ధర్మతత్త్వజ్ఞుం డగువ్యాసుండు దుఃఖించుచు నూరకున్నధర్మరాజును జూచి 'రాజా! రాజులకు (క్షత్త్రియులకు) ప్రజలను బాలించుట ధర్మము.* లోకమునకు ధర్మమే ప్రమాణము. నిత్యమును ధర్మమునే యనువర్తించువారికి ధర్మమే ప్రమాణము. కాఁబట్టి నీ తాతముత్తాతలమార్గము (పదము) ననుష్ఠింపుము. బ్రాహ్మణులకుఁ దపస్సె ధర్మము. అది వేదములం

---

* ఇట మూలము. — ధర్మః ప్రమాణం లోకస్య నిత్యం ధర్మానువర్తినః । అనుతిష్ఠస్వ తద్రాజన్ పిత్రుపైతామహంపదమ్ । బ్రాహ్మణేషు తపో ధర్మః స నిత్యోవేదనిశ్చితః। తత్ప్రమాణం బ్రాహ్మణానాం శాశ్వతం భరతర్ష

దు శాశ్వతముగా నిర్ణయింపఁబడి యున్నది. అది బ్రాహ్మణులకు శాశ్వత మయిన ప్రమాణము. అటువంటి ధర్మముల కన్నిటికిని క్షత్రియుఁడే రక్షకుఁడు. విషయలోలుఁ డై యెవ్వఁడీ క్షత్రియుని శాసనము నతిక్రమించి నడచునో వాఁడు లోకయాత్రకు విఘాతుకుఁడు గాన వానిని రెండుచేతులార నడంపవలయును. ఎవ్వఁడు మోహమునకుఁ బాలై ప్రమాణమైనదానిని నప్రమాణముఁ గావించునో వాఁడు భృత్యుఁడయినను బుత్త్రుఁడయినను తపస్వియైనను మఱి యెట్టివాఁడయినను, అట్టి పాపుల నన్నియుపాయములచే నడఁచిపుచ్చవలయును; లేదా పోరిపుచ్చవలయును. ఇందులకు వేఱువిధముగా రాజు వర్తించునేని పాపమునొందును. ధర్మము మిక్కిలియు నశించుచుండఁగా

భ! తస్యధర్మస్య కృత్స్నస్యక్షత్రియః పరిరక్షితా । యస్స్వయం ప్రతిహన్త్యస్యశాసనం విషయేరతః । సబాహుభ్యాం వినిగ్రాహ్యో లోకయాత్రా విఘాతుకః’—ఇందులకు దాక్షిణాత్యపాఠము: ధర్మః ప్రమాణంలోకస్య నిత్యంధర్మానువర్త్యతామ్ ॥ అను...పదమ్ । బ్రాహ్మణేషుతు యోధర్మః సనిత్యో వేదనిశ్చితః । తత్ప్రమాణం ప్రమాణానాం శాశ్వతం భరతర్షభ । తస్యధర్మస్య ...రక్షితా । తథాయః ప్రతిహన్త్యస్య శాసనం విషయేనరః । సబాహుభ్యాం వినిగ్రాహ్యో లోకయాత్రావిఘాతుకః’ ‘లోకమునకు ధర్మము ప్రమాణము. నిత్యమును ధర్మమునే యనువర్తింపుము. తండ్రితాతలనాఁటిరాజ్యపనిము ననుష్ఠింపుము. వేదములందు నిశ్చితమై బ్రాహ్మణులందు నిత్యము నెలకొనియుండు ధర్మమే ప్రమాణములందెల్ల శాశ్వతమయిన ప్రమాణము. ఆధర్మమున...రక్షకుఁడు. ఆరాజు శాసనమును మనుష్యుఁడెవ్వఁడు చెఱుపునో వాఁడు లోకయాత్రకు విఘాతుకుఁడుగాన వానిచేతులు రెంటిని దీసివైవవలయును’ అని యొక వ్యాఖ్యానము.

నెవఁడు దానిని రక్షింపఁడో వాఁడు ధర్మమును జంపువాఁడగును. నీవు ధర్మరక్షకుఁ డయినక్షత్రియుఁడవు గావున ధర్మమును ఘాతము గావించినవారిని (దుర్యోధనాదులను) వారి యనుచరులతోఁడ హతులంగావించితివి. ఇట్లు నీవు నీస్వధర్మమునందు వర్తించుచుండఁగా (ధర్మమును దప్పినట్లు) శోకించుచున్నా వేల? రాజును గొట్టనువలయును; పెట్టనువలయును; ధర్మంబునఁ బ్రజలను బాలింపనువలయును' అనెను. అందులకు ధర్మరాజు 'తపోధనా! నీవు చెప్పుమాటయందు నేను సందేహపడలేదు. నీవు సకలధర్మవిదులందును మిన్నవు. నీకు ధర్మము ప్రత్యక్షము కదా! అయినను జంపఁదగనివారిని బెక్కండ్రను రాజ్యము నిమిత్తము చంపివైచితిని. ఆకార్యములే నన్నుఁ గాల్చుచును వ్రేల్చుచును నున్నవి' అనెను. వ్యాసుఁడు 'ధర్మపుత్రా! కర్మమునకు (మంచిదానికిని జెడ్డదానికిని) కర్త యీశ్వరుఁడా? లేక మనుష్యుఁడా? ఫలము (సుఖముగాని దుఃఖముగాని) తనంతటనే లోకమునఁ గలుగుచున్నదా? లేక పూర్వకర్మముచేఁ గలుగుచున్నదా? మనుష్యుఁ డీశ్వరునిచేత నియుక్తుఁడై యే, కర్మమును మంచిదానిని జేయుచున్నాఁడేని (యాకర్మమునకయిన) ఫల మీశ్వరునే చెందవలయును. ఒకఁడు గొడ్డలితోనడవియం దొకమ్రానిని నఱకునేని యాపాపము కలుగునది పురుషునికేకాని యెంతమాత్రము గొడ్డలికిఁగాదు. లేక యాగొడ్డలి పట్టి యుపాదానకారణమే యగుటవలన (నఱకినయా) పాపము తెలివిగల నఱకిన పురుషునే చెందవలయునుగాని తెలివిలేనిగొడ్డలిని గాదన్నచో, అప్పు డాపాపము గొడ్డలినిజేసిన (తెలివిగల) పురుషునిని జెందవలయును. అయిన నిట్లు గలుగదు. ఒకఁడుచే

సినకర్మమునకు ఫలము మఱియొకఁడు పొందుననుట సమ్మతము కాదు; కాఁబట్టి కర్మఫలమునంతయు వీనియందు వానియందేల! యీశ్వరునియందే సమర్పింపుము. లేక కర్మమునకు మంచి దానికో చెడ్డదానికో పురుషుఁడే కర్తయనియు (వానినియమించునట్టి) యీశ్వరుఁడు లేఁడనియుఁ జెప్పితివేని (యపుడు పరలోకమును ఫలమునిచ్చువాఁడును లేనందున) నీవు చేసినదేదియు నీకు సెబ్బరగావింపఁజాలదు. రాజా! ఎవ్వఁడుగాని నెప్పుడేని కర్మవిధిచే నేర్పడియుండుదానిని దప్పించుకొనఁజాలఁడు. లేక నీవుపూర్వమందుఁ జేసినకర్మములకు విధియే(ఏర్పాటే)ఫలితమగు నేని (యపుడు పూర్వకర్మములనుబట్టియే యిప్పటి నీధర్మములు నేర్పడియుండుటవలన నీవు స్వతంత్రుఁడవు గానేరవుగాన) చెట్టు నఱికినపాపము గొడ్డలిచేసినవాని నంటునట్లు, తొంటిపాప మీ జన్మమం దెవ్వానిని జెందనేరదు. * లేక నీవు 'ఏర్పాటుగాదు హఠమే(యదృచ్ఛ)లోకమందు నెలకొని పనులు జరిపించుచున్న' దని తలంతువేని యప్పటికి (నేర్పాటు లేనందున)నిట్టియశుభ మీ యుద్ధమందలి నాశము జరిగియుండదు. ఇఁక మీఁదను జరుగదు.(యుద్ధమునందలి నాశము ముందేర్పాటువలననే కదా కలిగి

* దీనికి 'యది హ్యమన్యసేరాజన్ హఠమేకం ప్రతిష్ఠితమ్। ఏవ మప్యశుభం కర్మ నభూతం నభవిష్యతి' అని నీలకంఠపాఠము. హఠమేకమ్ అనుటకు 'హఠమేవ' అని పాఠాంతరము. అప్పుడు మనుష్యునకు 'బలవంతముగా వధముకలుగుట నిశ్చయమని తలంతువేని యుప్పటికిని నీవు చేసినది చెడ్డకార్యముగాదు. ఈయభిప్రాయమునందు ముందును వెనుకను నేకీడును మేలును గలుగుటకుఁ గారణములేఁ'దని యర్థము.

నది) లేక లోకమందుఁ బుణ్యము పాపమనెడి కారణములవలన సుఖమును దుఃఖమును గలుగునని చెప్పుట యుక్తమని తలంతు వేని యాపుణ్యపాపములను శాస్త్రమొక్కటిచేతనే తెలియఁద గును. అట్టిశాస్త్రమందు రాజులకు దండముదాల్చుట పుణ్యమని విధింపఁబడియున్నది. అది లోకమునందు నంగీకరింపఁ బడియు న్నదియే.* కర్మములు మంచివియుఁ జెడ్డవియుఁ జక్రమునందుం బోలె నిందుఁ జుట్టుచుండుననియు మనుష్యులు తమ మంచిచె డ్డల ఫలము లనుభవింతురనియు నామతము. ఒకపాపకర్మము నుండి మఱొకటి కలుగుచున్నది. కాఁబట్టి చెడ్డ కర్మములనెల్ల విడువుము.నీమనసు నిట్లు శోకమునం దుంపకుము. పరులకు నిందిం పఁదగినదైనను నీకు స్వధర్మమగుదానియందు వర్తించువాఁడవు ; ఇట్టి నీకు దేహమునుదగవిడుచుట బాగుకాదు. దేహముతోఁ బ్రతికిఁ యుండువాఁడు దుష్కర్మములకయిన ప్రాయశ్చిత్తములను విధ్యు క్తముగాఁ జేసికొనఁగూడును. శరీరమును విడిచినవాఁడట్లుచేయ నేరక కీడ్పాటొందవలయును. కాఁబట్టి, రాజా ! నీ వునుఱుతో నుంటివేని ప్రాయశ్చిత్తము చేసికొనఁగూడును. ప్రాయశ్చిత్తము చేసికొనక దేహమును దిగవిడిచి పిదపఁ బశ్చాత్తాపపడఁగలవు' అనెను. అదివిని ధర్మరాజు 'పితామహా ! నేను రాజ్యమందలి

* 'లోకమునందలి విధిచొప్పున రాజునకు దండముదాల్చుట న్యాయమయి నప్పటికిని, అట్లు చేయునపుడు మంచికార్యమువలెఁ జెడ్డకార్యము నతనికిఁ దెలి యకయే సంభవించునని నీకుఁ దోఁచునేని చెడ్డకార్యమునకుఁ గారణముగా నుం డుటను విడిచి స్థిరమగు శుభకర్మఫలమును దెలిసికొనుము' అని యర్థాం తరము.

పేరాసచేత నాయొక్కనినిమిత్తము, పుత్రులను బౌత్రులను నన్న
దమ్ములను దండ్రులను, మామలను, గురువులను, మేనమామల
ను, దాతలను, మేనల్లుండ్లను, సంబంధులను, స్నేహితులను,
సుహృదులను, జ్ఞాతులను, మహాత్ము లయినక్షత్రియులను బెక్కు
దేశములనుండిన యనేకరాజులను నందఱను జంపించితిని.
తపోధనా! ఆరాజులు నిత్యమును ధర్మమాచరించుచుండిన
వారు; మాటిమాటికి యజ్ఞములు చేయుచుండినవారు; వీరు
లు. అట్టిరాజులనుగూల్చిన నే నేగతి నొందఁగలనో? దీనినిమరల
మరలఁ జింతించుచు నాశోకముచేత నెల్లప్పుడును దగ్ధుఁడ నగుచు
న్నాను. శ్రీమంతులును రాజసింహులు నయినయావీరులను బా
సిన యీభూమినిని, ఘోరమయిన జ్ఞాతివధమును, పెక్కువిధము
లఁజంపఁబడిన తక్కినక్షత్రియులను, కోట్లకొలఁదిని రూపుమాసిన
తక్కిన మనుష్యులను జూచి తపించుచున్నాను. పితామహా! పెని
మిటులను బుత్రులనుఁ దోఁబుట్టువులను బాసినయాయుత్తమ
కాంతల దురవస్థ యిప్పు డెట్లుండునో? వారు 'పాపులాపాండ
వులు వృష్ణులతోఁ జేరి పాడుచేసిరి' అని పాండవులమగు మమ్ముఁ
దిట్టుచు మేనులుచిక్కి స్రుక్కుచు నేలపయింబడి పొరలా
డుచుందురు. బ్రాహ్మణోత్తమా! పతులను బుత్రులను దండ్రు
లను నన్నదమ్ములను గానలేక యా కాంతలందఱును బ్రియం
బునఁ దమప్రాణముల విడిచి యమునింటికిఁ బోవుదురు.
ఇందు సందేహములేదు. ధర్మమును జక్కఁగా విమర్శింపఁగా
మేము స్త్రీవధ పాపమును బొందఁగలము. అట్టి మేము సుహృ
దులను జంపి తీఱనిపాపమునొంది తలక్రిందుగా నరకమునఁ
గూలఁగలము. సత్తమా! కాఁబట్టి యుగ్రతపంబుచేసి యీదే

హామును విడిచిపుచ్చెదను. పితామహా! అయిన నాశ్రమ ములవిశేషమును నాకుఁ జెప్పుము" అనెను. ఇది ముప్పది యొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(వ్యాసుఁడు యుద్ధమృతులయిన రాజులసంతతులను వారివారిరాజ్యములఁ బట్టముఁగట్టి యశ్వమేధము చేయుమని ధర్మరాజునకుఁ జెప్పుట.)

ధర్మరాజుచెప్పినదివిని వ్యాసుఁడు బుద్ధియందు సూటిగా నాలోచించి మరల నతనితో 'క్షత్రియోత్తమా! క్షత్రియధర్మమును దలంచిచూచి నీ వీశోకమును బోకార్చుకొనవలయును. స్వధర్మమును మున్నిడికొనియే కదా యీక్షత్రియులు హతులయిరి. సంపూర్ణమయిన సంపత్తిని, నీభూమియందు విపులమయినకీర్తినిని, గోరి యితరులను జంపఁగోరిన యాక్షత్రియులు కాలముచేత మృతినొందిరి. నీవును భీముఁడు నర్జునుఁడును నకులసహదేవులును వారిని జంపినవారుగారు. కాలము తాను మార్పుచేయు ధర్మము ననుసరించి యామనుష్యుల ప్రాణములను గొంపోయెను. కాలమునకుఁ, దల్లియనియుఁ దండ్రియనియు మఱియేదియనియుఁ గాని యభిమానము చూపఁదగినదొకటియులేదు. భరతసత్తమా! ప్రాణుల పుణ్యపాపములకు నది సాక్షియైనది. అదియే మీయీయుద్ధమును నిమిత్తముగాఁ గొని వారిని సంహరించినది. అది ప్రాణులనుగొని ప్రాణులను జంపించుచున్నది. ఇది దాని యీశ్వరత్వము. * కాలము కర్మ

---

*ఇట 'కర్మసూత్రాత్మకం విద్ధి సాక్షిణం శుభపాపయోః' అని మూలము.

ములకు సూత్రమయినది - అనఁగా కర్మములను వానివాని ఫలములనొందునట్లు నడుపునది. ఏలనఁగా నది పుణ్యాపాపకర్ములకుసాక్షియైనదని తెలియుము. కాలమే సుఖదుఃఖము లనుఫలములనిచ్చునది. మహాబాహూ! హాతులయిన యాక్షత్రియులు గావించినకర్మములను దలంచుకొనుము. అవియే వారినాశమునకు హేతువులయినవారిని గాలముబారిం బడునట్లుచేసినది. విధి నిన్నుఁబయికొని యిటువంటి కర్మమును జేయించినది గాన నీవును విధికిలోనై నడచుకొనుటయె యాచారముగాఁగలవాఁడవని నిన్నుఁదెలిసికొనుము. వడ్రపువాఁడుచేసిన యంత్రము, దానిని త్రిప్పుమనుష్యునకు వశమైనడచునట్లు,ఈ జగమంతయుఁ గాలముతోఁగూడినకర్మము త్రిప్పినట్లుతిరుగుచున్నది.మనుష్యునకు నుత్పత్తి వినాశములు, కారణమేది తెలియకయు, నలవ్రొకగాను, గలుగుటనుజూడఁగా నీశోకమును సంతోషమును నిరర్థకములేయగును. రాజా! ఈ విషయమై నీమనసునకు నీవు కలిగించుకొనుబంధము పట్టిదేకాని వాస్తవముకాదు. అయినను దాని నివర్తించుకొనఁగోరితివేని యందులకువలయు ప్రాయశ్చిత్తములను జేసికొనుము. తొల్లి యొకప్పుడు దేవాసురులకు యుద్ధము జరిగినది వినుచున్నారము. వారిలో నసురు లన్నలు, దేవతలు తమ్ములు. వారలకు సయితము రాజ్యలక్ష్మి నిమిత్తమే పెను విరోధముకలిగి ముప్పదిరెండువేల సంవత్సరములు యుద్ధము ప్రవర్తించెను. అందుదేవతలీభూమినంతయు నొక్కటే నెత్తురు సముద్రముగాఁ గావించి యసురులను జంపి స్వర్గమును బడసిరి.

'కర్మమూర్త్యాత్మకం విద్ధి' అని దాక్షిణాత్యపాఠము. కాలమే కర్మముయొక్క ప్రత్యక్షరూపమని తెలియుము అని యర్థము తెలియునది.

ఆయుద్ధమందు ననురులకు సాయముచేయుటకై గర్వంబునఁ గన్నుఁగానక భూమినుండి యెనుబదియెనిమిదివేవురు బ్రాహ్మణులు వచ్చియుండిరి. వారిని శాలావృకులందురు. వారు ముల్లోకములందును బ్రసిద్ధులు. వేదములందుఁ బారంగతులు. దేవతలా బ్రాహ్మణులను సయితము నఱుమాడిరి. అధర్మమును వృద్ధిఁ జెందించి ధర్మమునకు విచ్ఛేదము కలిగింపఁ దివురుదురాత్ములను రాజులును దేవతలును క్రూరులయిన దైత్యులనుంబోలె వధింపవలయును. ఒకకులమునం దొకనిని జంపినయెడలఁ దక్కినవారికి క్షేమముగలుగునేనియు, అట్లె యొకకులమును జంపినయెడ దేశమునకుక్షేమముగలుగునేనియు,నావధములుధర్మనాశకములుగా నేరవు. నరపతీ ! ధర్మమొకానొకటి యధర్మమువలెను నధర్మమొకానొకటి ధర్మమువలెను నుండును. వివేచన గలప్రాజ్ఞుఁడు దానిని వివేచించి తెలిసికొనవలయును. పాండవా ! నీవును జదువరి వగుదువు. కాఁబట్టి నీమనస్సును దిటపఱుచుకొనుము. దేవతలు తొల్లి చన్నమార్గమువెంటఁ బోయినాఁడవే కాని మఱేమికాదు. ఇట్టివారు నరకమును బొందరు. నీ వీతమ్ములను సుహృదులను నూఱడింపుము. మనుష్యుఁ డెవ్వఁడు పాపకార్యమునకుఁ బొడంగినపుడు పాపబుద్ధి గలిగియుండి, దానిని జేయుచున్నపుడయిన నట్టిబుద్ధి మానక గలిగియె యుండి, చేసిన పిదప నందులకై మనస్సునఁగుందుటగాని లజ్జపడుటగాని లేకుండునో, వానియం దాపాపమంతయును బాపమని చెప్పఁబడును. అట్టిపాపమునకుఁ బ్రాయశ్చిత్తమును గలుగదు. ప్రాయశ్చితము వలన నాపాపమునకుఁ దగ్గుటయుఁగలుగదు. నీవో మంచికులమందుఁ బరిశుద్ధముగా జనించినవాఁడవు. పగవాఁడయినదుర్యో

ధనునిదోషమువలన నీకిష్టములేకయే యీకార్యము చేయవలసి వచ్చినది. చేసినపిదప నిట్లు పరితపించుచున్నావు. అశ్వమేధ మనెడి మహాయాగ ముత్తమ మయినప్రాయశ్చిత్తమని చెప్పఁబడుచున్నది. మహారాజా ! ఆయాగమును జేయుము. నీయిష్టముచొప్పునఁ బాపరహితుండవై యుందువు. మహాత్ముఁడగు దేవేంద్రుఁడు మరుత్తులనుగూడి శత్రువులను జంపి యొక్కొక్కయాగముగా నూఱశ్వమేధయాగములుచేసి పాపములు దూల్చి స్వర్గమును సుఖోదయములగు లోకములనుబడసి యామరుత్తులతోడ దిక్కులను వెలింగించుచున్నాఁడు. అట్లమరులకు రాజయి స్వర్గలోకమున నప్సరసలతోడ వెలుంగుశచీపతియగు నింద్రుని,ఋషులును దేవతలు నారాధించుచున్నారు. అనఘా ! నీవును బరాక్రమమున రాజులను జయించి యీభూమిని బొంది యున్నావు. నీవు జయించిన రాజులపట్టణములకును రాజ్యములకును స్నేహితులంగూడి చని,యందుఁ గలయారాజులపుత్రులను మనుమలను లేకి సహోదరులను నాయారాజ్యములకు రాజులుగాఁ బట్టముగట్టుము. గర్భమం దుండుబిడ్డల యందును కనికరమును బచరించి ప్రజలనందఱను రంజించుచు భూతలమును బరిపాలింపుము. ఏరాజులకుఁ గొడుకులు లేరో వారి కూఁతుండ్ర నారాజ్యమునకుఁ బట్టముగట్టి యేలునట్లుచేయుము. స్త్రీలు సహజముగా భోగమం దాసక్తిగలవారు. నీవిట్లు చేయుదువేని వారు తమశోకములను దిగవిడిచి సుఖంబుందురు. సమస్తరాజ్యములను నిట్లూఱటఁ గలిగించి తొల్లి జయంబుగొన్న యింద్రుఁడునుంబోలె నశ్వమేధయాగమును జేయుము. ఓ క్షత్రియసత్తమా ! యుద్ధమందుఁ గూలినయాక్షత్రియులను గుఱించి

శోకించుట యెంతమాత్రము దగదు. దైవము ప్రభావముచే మోహితులై వారు తమతమకర్మముల చేతనే నాశమునొందిరి. నీవు క్షత్రధర్మము ననుష్ఠించితివి; అకంటకమయిన రాజ్యమునుబడసితివి. కౌంతేయా ! నీస్వధర్మమును గాచుకొనుము. దానివలన నీవు పరలోకసుఖము నొందుదువు' అనెను. ఇది ముప్పదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బ్రాయశ్చిత్తములకుఁ దగుపాపములను వాని ప్రాయశ్చిత్తములనుజెప్పుట.}

ధర్మరాజు 'పితామహా ! మనుష్యుఁ డేం దేకార్యములుచేసి ప్రాయశ్చిత్తము చేసికొనవలయునో, దేనినిజేసి యాపాపము నుండి విడివడునో, నాకుఁజెప్పుము' అని యడుగఁగా వ్యాసుఁడతనితో విహితములయిన కర్మములను జేయకపోవుటచేతను నిషిద్ధములయినవానిని జేయుటవలనను మనుష్యుఁడు పాలునడవడి గలవాఁడై ప్రాయశ్చిత్తము చేసికొనవలసిన వాఁడగుచున్నాఁడు. సూర్యుఁ డుదయమగునపుడును నస్తమించునపుడును బరుండి నిదురించుబ్రహ్మచారి, పుచ్చిన గోళ్లుగలవాఁడు, నల్లని పండ్లుగల వాఁడు, *పరివిత్తియు, †పరివేత్తయు, బ్రాహ్మణుల పంపును దూషించువాఁడును, ‡అగ్రేదిధిషువును, §దిధిషూపతియును వ్రతము

---

* తమ్ముఁడు పెండ్లాడియుండ బ్రహ్మచారిగానున్న యన్న.

† అన్న బ్రహ్మచారిగానుండఁ బెండ్లాడిన తమ్ముఁడును.

‡ అక్క కన్నియగా నుండఁగా దానిచెల్లెలిని పెండ్లాడినవాఁడు.

§ చెల్లెలికిఁ బెండ్లియైనపిదప దాని యక్కను పెండ్లాడినవాఁడు.

చెడినవాఁడును,ద్విజాతులను మూఁడువర్ణములవారినిఁజంపినవాఁడును, అపాత్రమందు దానముచేసినవాఁడును, పాత్రమున కొసఁగనివాఁడును, సముదాయమునకు యాగముచేసినవాఁడును, మాంసమును విక్రయించినవాఁడును, ఔపాసనము మొదలయిన యగ్నికార్యములను విడిచినవాఁడును, *వేదమును విక్రయించినవాఁడును, శూద్రస్త్రీని జంపినవాఁడు, నను వీరిలోఁ బూర్వులయినవారు మిక్కిలి గర్హితులు. యాగమునకుఁగాక యూరక గోవధముచేసినవాఁడును, అడవిని గాల్చినవాఁడును, అబద్ధముచెప్పి గొలుచువాఁడును, మోసముచేసి బ్రతుకువాఁడును, గురుఫు నిషేధించువాఁడును, మాటచేతఁగాని మనస్సుచేతఁగాని దారపోసికొని దానముచేసినదాని నపహరించినవాఁడును, పరులిచ్చుదానిని వారించువాఁడును, ఒకబంతియందే వేఱుపాకనును భుజించువాఁడును, భుజించువారి నవమానించువాఁడును, సొంతజనులతోఁ గలహించువాఁడును, నాశ్రయించినవానిని రక్షింపనివాఁడును, నియమమును మీఱిన వాఁడును, నను వీరొక్కొక్కరును దమతమపాపములకుఁ దగునట్లు ప్రాయశ్చిత్తముచేసికొనవలయును. ఇఁక లోకమునకును వేదమునకును విరుద్ధములయిన యకార్యములను నీకుఁజెప్పెదను. ఆలించి వినుము. స్వధర్మమును విడుచుట, పరధర్మము ననుష్ఠించుట, అయోగ్యునిచే యాగముచేయించుట, అభక్ష్యమును భక్షించుట, శరణాగతుని దిగవిడుచుట, భృత్యులను బోషింపకుండుట, ఉప్పు చింతపండు మొదలయిన రసపదార్థములను విక్ర

---

* వేతనమునకు వేదములను జదివించినవాఁడు.

యించుట, పశుపక్ష్యాదులను తిర్యక్కులను జంపుట, శక్తి యుండియు * ఆధానమును మొదలయిన కర్మములను జేయు చుండుట, నిత్యము (పసులకు నాహారము మొదలుగా) నిచ్చువానికి నీకుండుట, దక్షిణ యొసఁగకుండుట, బ్రాహ్మణుల సొమ్మునపహరించుట మొదలుగా నివియన్నియు ధర్మము నతిక్రమించినవా రకార్యములని తెలిపెదరు. తండ్రితో జగడముసేయు కొడుకును, గురుభార్యను బొందువాఁడును, ధర్మపత్నిని బాడిమెయిఁ బొందనివాఁడును, ఇధార్మికు లగుదురు. వేనిని జేసినను వేనిని జేయకున్నను మనుష్యుఁడు ప్రాయశ్చిత్తము చేసికొనవల యునో యాకార్యములు వేదములందును విస్తరముగను సంగ్రహముగను జెప్పఁబడియున్నవి. ఇటువంటికార్యములు చేసియు మనుష్యునకుఁ బాపము పొందకుండుటకుఁ గొన్నికారణములు గలవు; వానిని జెప్పెదను. యుద్ధమందాయుధమునుగొని తన్నుఁ గొట్టవచ్చువాఁడు వేదాంతవేత్తయైనను వానిని జంపుట బ్రహ్మహత్యగాదు. ఈవిధి,వేదములందలి మంత్రములు చెప్పుచున్నవి. వేదప్రమాణములచే విధింపఁబడిన ధర్మమును నీకుఁ జెప్పెదనుఁ తన వృత్తమునుండి తొలఁగిన యాతతాయి యగుబ్రాహ్మణుని జంపుటవలనఁ బాపముగలుగదు. ఒకని కోపము మఱొకనికిఁ గోపము గలిగించినది. ప్రాణమున కపాయముకలుగునపుడు ధర్మవిదుల యనుమతినొంది తెలిసి సుర నుపయోగించువాఁడు పిదప శుద్ధినొందవలయును. అభక్ష్యమును భక్షించుటవలనఁ గలుగు పాపమంతయుఁ బ్రాయశ్చిత్తవిధిచొప్పున శుద్ధిఁబొందునని నీకుఁ జెప్పితిని. గురువునాజ్ఞను గొని గురుపత్నిని బొందినవాఁడు దోష

* ఔపాసనమనెడు స్మార్తాగ్నిని వైదికమయిన మూఁడగ్నులుగాఁ జేయుట.

మునొందఁడు. ఉద్దాలకుం డనుఋషి శిష్యునిఁగొని శ్వేతకేతుం డనుపుత్త్రునిఁ బుట్టించుకొనెను. గురువుకొఱకై యాపదయందు దొంగలించుటవలన దోషముగలుగదు. అయినను దాను విచ్చల విడి భోగించుటకై దొంగలించువాఁడు దోషియగును. బ్రాహ్మ ణులసొమ్ముదక్కఁ దక్కినవానిని (ఆపదయందుఁగాని గుర్వర్థము గాని) దొంగలించినచో దోషములేదు. అట్లు దొంగలించి తాను భుజింపనివాని నేపాప మంటదు. తనప్రాణమునుగాని యొరులప్రాణ మునుగాని రక్షించునపుడును, గురువుకొఱకును, స్త్రీలయెడను, వివాహములందును, నబద్ధము చెప్పవచ్చును. స్వప్నమందు శుక్లమువిడిచినయెడల నందులకు మరల నుపనయన మక్కఱలే దు. మండుచున్న యగ్నియందు నేయివేల్చుటయే యందులకుఁ బ్రాయశ్చిత్తము. అన్న పతితుఁడుగాఁగాని సన్న్యాసిగాఁ గాని పయినచోఁ దమ్మునికిఁ బారివిత్త్యదోషముగలుగదు. ఒకస్త్రీ వేఁడి కొనఁగా దానితోఁ బొందినయెడల నది ధర్మదూషకముగాదు. వ్యర్థముగాఁ బశువులను జంపుటయుఁ జంపించుటయుఁగూడదు. విధ్యుక్తముగాఁ బశువులను వధించుట వానియెడ ననుగ్రహ మేయగును జుమీ. తెలియమిచే ననర్హుఁ డయినబ్రాహ్మణునకు దానముచేయుటయు నర్హుఁడయినవానికి దానముచేయక పోవు టయు దోషముగాదు. అపరాధము గలభార్యను దొలఁగఁబు చ్చుట దోషముగాదు. దానినట్లు గావించుట దాని పరిశుద్ధికిఁ గారణమగును. అట్లు చేయుపురుషునికిఁ బాపముగలుగదు. సోమరసము తత్త్వమును దెలిసినవాఁడు దాని నమ్ముట వలనఁ బాపమునొందఁడు. సమర్థుఁడుకాని పనివానిని దిగవిడు చుటయు దోషముగాదు. గోవులకొఱకు నడవిని గాల్చుటయు

నిషిద్ధముగాదు. ఇట్లు చెప్పఁబడిన కార్యములు చేయుటవలన దోషము లేదు ; దోషములనుదూల్చి పరిశుద్ధి నొసంగుప్రాయశ్చిత్తవిధులను సవిస్తరముగా నీకుఁ జెప్పెదను' అనెను. ఇది ముప్పదిమూడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బాపములకుఁ బ్రాయశ్చిత్తములను జెప్పుట.

వ్యాసుఁడు 'మనుష్యుఁడు చాంద్రాయణము మొదలయిన తపమును యాగాదులయిన కర్మములను గోదానము మొదలయిన దానములను జేసి మరల నాపాపములకుఁ బోకుండునేని పాపమువీడి పరిశుద్ధుండగును. బ్రహ్మహత్యచేసినవాఁడసూయవిడిచి, యెప్పుడును బ్రహ్మచారియై, తనకు వలయునది తానే చేసికొనుచు, నెప్పుడును జాలుకుగలిగి, దనపాపమును లోకులకుఁ దెలుపుచును, నొకచేత ఖట్వాంగ మనుకఱ్ఱను నొకచేతఁ గపాలమును నెత్తికొని, బిచ్చమెత్తిన యన్నము నొకపూఁట గుడిచి, నేలపయిఁబరుండి, పండ్రెండుసంవత్సరము లుండునేని, యాపాపమునుండి విముక్తుఁడగును. వలయునని బ్రహ్మహత్యచేసినవాఁడేని, ఆయుధము గలవానికడకుఁ బోయిఁ దన్నుఁజంపించుకొనవలయును. లేక తెలిసినవారియిచ్చచొప్పుననో తనయిచ్చచేతనో యగ్నిని దరికొలిపి యందుఁ దనదేహమును విడువవలయును; తల క్రిందుగా వంచుకొని యేదేనియొక వేదమును జపించుచు మున్నూఱు యోజనములదూరము యాత్రచేయవల

యును. లేక తనధనమునంతయు వేదవిదులగు బ్రాహ్మణులకు నొసంగవలయును; లేక జీవనమునకుఁ జాలినంత ధనమును వలయు వస్తువులు నిండియున్న గృహమును దానముచేసి పశువులను బ్రాహ్మణులను బోషించుచు వచ్చినయెడల బ్రాహ్మణహత్య నివర్తించును. లేక *కృచ్ఛ్రమనుతపమును నాఱేండ్లెడతెగక చేయుచువచ్చినయెడల బ్రహ్మహత్యగలవాఁడు పరిశుద్ధుఁడగును; లేక యొకమాసమును నాలుగుగా భాగించి ముందుచెప్పిన యాకృచ్ఛ్రనియమముచొప్పున మూఁడేండ్లు భుజించుచువచ్చిన యెడల నాపాపమునుండి విడివడును; లేక యొక్కమాసమున కొక్కమాటుభుజించుచువచ్చునేనియొక్కసంవత్సరమునఁబరిశుద్ధుఁడగుననుటకు సందేహములేదు. అట్లు దృఢముగా నిరాహారవ్రతము పూనునేని మఱియుఁ దక్కువకాలముననే శుద్ధినొందవచ్చును. అశ్వమేధయాగము సయితమీపాపమును దొలఁగించి శుద్ధియొసంగు ననుటకు సందేహములేదు. అశ్వమేధమును జేసి యవభృథస్నానమును గావించిన మనుష్యులందఱును నిట్టి పాపములనుండి విడివడి పరిశుద్ధులగుదురనుట వేదముఖ్యవిషయము. మఱియు బ్రాహ్మణునినిమిత్తము యుద్ధమునఁ గొట్టువడినను, లేక లక్షగోవులనో, పాలుపితుకఁదగిన కపిలగోవుల నిరువదియైదువేలింటినో సత్పాత్రమునందు దానముచేసినను, బ్రహ్మహత్య మొద

---

* కృచ్ఛ్రమనఁగా మూఁడుదినములు వేకువను మాత్రమును, మఱి మూఁడు దినములు సాయంకాలమున మాత్రమును, అవ్వలి మూఁడుదినములు దైవికముగా దొరికినదానిని మాత్రమును భుజించుచు, మఱియవ్వలి మూఁడుదినము లుపవాస ముండు విధి. ఈ మూఁడేసి దినములకు మాఱుగా ఏడేసిదినము లనుష్ఠింపఁగా మూఁడుసంవత్సరములకుఁ బరిహారమని తెలియునది.

లయిన పాపము లన్నింటినుండి విముక్తుఁడగును. ప్రాణసందేహముగలిగినపుడు చక్కఁగాఁ బిదికెడి వేయిపశువులను దూడలతోఁగూడ సాధువులయిన దరిద్రులకు దానముచేసినచోఁ బాపమునుండి విడివడును, రాజా ! బ్రాహ్మణులకుఁ గాంభోజ దేశపు గుఱ్ఱములను నూటింటిని దానముచేయునేని పాపము నుండి విడివడును. మఱియు నెవఁ డొక్కనికయినను వాఁడు కోరిన దంతయు నిచ్చుటయేకాక యట్లిచ్చుటను జెప్పికొనకయునుండునో వాఁడును బాపమునుండి విముక్తుఁడగుచున్నాఁడు. ఒక్కమాఱు మద్యము త్రాగినవాఁ డామద్యమును నిప్పువలెఁ గాఁచి త్రాగునేని వాఁడిహమందును బరమందును బరిశుద్ధి నొందుచున్నాఁడు. నిర్జలమగు ప్రదేశమందుఁ గొండకొననుండి క్రిందఁబడియు, నగ్నియందుఁ జొచ్చియు,*మహాప్రస్థానము సనుష్ఠించియుఁగాని దేహము విడిచినవాఁడు సమస్తపాపములనుండి విడుదల నొందును. బ్రాహ్మణుఁడు మద్యముద్రాగినయెడ బృహస్పతి సవమనెడి యాగముచేసి పాపమువీడి †సభకుఁబోవ నర్హుఁడగునని వేదముచెప్పుచున్నది. లేక యొకఁడు మద్యముద్రావెనేని వాఁడు మత్సరమువిడిచి భూదానముచేసి మరల మద్యము ద్రావకుండునేని యాదోషమునుండి చక్కఁబడి పరిశుద్ధుఁడగుచున్నాఁడు.గురుభార్యనుబొందినవాఁ డెఱ్ఱగాఁ గాఁచిన యినుప

* మహాప్రస్థానమనఁగా కేదారక్షేత్రమునందు హిమవంతమునారోహించుట.అనఁగాప్రాణత్యాగమునకై యుత్తరముగాఁబోయి హిమవంతము నెక్కుట.

† ఇందులకు 'సమితిం బ్రాహ్మణో గచ్ఛే దితివై బ్రహ్మణః శ్రుతిః' అని మూలము. 'సమితిం బ్రహ్మణో గచ్ఛేత్' అని ఉత్తరకోశపాఠము. బ్రహ్మలోకము పొందునని బ్రహ్మయే చెప్పినాఁడని యర్థము.

ఱాతిపయిఁ బరుండవలయును. లేక తనపురుషచిహ్నమును (లింగమును) కోసివైచి యాకాశముచూచుచు నూరువెడలి యడవికిఁ బోవలయును. దేహమును విడుచుటచేత నొకఁడు దానుచేసిన పాపకర్మములనుండి వీడుచున్నాఁడు. అట్టి స్త్రీ లొక సంవత్సరమువఱకు నాహార విహారాదులు వదలి నియమముతో నుందురేని యట్టిపాపకర్మములనుండి విముక్తి నొందుదురు. ఎవఁడు మహావ్రతమును, (నొకమాసము నీరు సయితము త్రావకుండుటను), నాచరించునో, లేక తనధనమునంతయు దానముచేయునో, లేక గురువునిమిత్తము యుద్ధమునందు హతుఁడగునో, యతఁడు పాపకర్మమునుండి విడివడును. గురువునెడఁ బొల్లుగా వర్తించువాఁడును గురువు నడ్డగించినవాఁడును నతనికిఁ బ్రియమయినదానిని జేసి యాపాపమునుండి తొలఁగును. బ్రహ్మచర్యవ్రతమును విడిచినవాఁడు బ్రహ్మహత్యకునయిన ప్రాయశ్చిత్తమును జేసికొనవలయును. లేదా, యావృతోలునుగట్టుకొని యాఱు మాసములు కృచ్ఛ్రమను తపముచేసెనేని యా పాపమునుండి విడివడును. పరస్త్రీని బొందినవాఁడును బరధన మపహరించినవాఁడును సంవత్సరము వ్రత మాచరించి యా పాపమునుండి ముక్తుండగును. ఎవనిధనము దొంగలించునో వాని కంతమాత్రము ధనమును దనచేత నగునుపాయములు పెక్కింటిచేత నిచ్చివుచ్చవలయును. అప్పుడు వాఁ డాపాపమునుండి విడివడును. పరివిత్తియుఁ బరివేత్తయు నన్నకుఁ బెండ్లియైనపిదప మనోనియమముగలిగి పండ్రెండురాత్రులు కృచ్ఛ్రమను వ్రతముసలిపి పరిశుద్ధుఁడగును. వారిలోఁ బిన్నవాఁడు పితరుల నుత్తరింపఁజేయుటకు మరల వేఱుకన్యను బెండ్లి చేసికొనవలయును. ఆరెండవ

పెండ్లికి మొదటఁ బెండ్లాడిన స్త్రీకి దోషము ముట్టకపోవును. కావున దానిని జేకొనుటచేఁ బురుషునికి దోషముకలుగదు. ధర్మవిదులయినవారు స్త్రీలు మహాపాపములు చేసినపుడు నాలుగుమాసము లుపవాసవ్రతము చేసినచో శుద్ధినొందుదురని తెలియుదురు. * స్త్రీలు పాపముచేసినట్లు సందేహింపఁబడినచో దెలిసినవానికి వారినిబొందుట న్యాయముగాదు. పాత్రము బూడిదచేత శుద్ధమగునట్లు వారు రజస్సుచేత పరిశుద్ధినొందుదురు. కంచుపాత్రము, శూద్రుఁ డెంగిలిచేసినను, పశువులు మూరుకొన్నను, పుక్కిలింతచేత నెంగిలియైనను దానిని బాలు పెరుఁగు నేయి మూత్రము పేడ యను పంచగవ్యములును; మన్ను, నీరు, బూడిద, చింతపండు, నిప్పు అనెడి యైదును జేర్చి యీపదింటిచే శుద్ధిసేయవలయును. ఇట్టిశుద్ధివిధిరూపమగు ధర్మము బ్రాహ్మణునకుఁ బూర్ణముగాను, క్షత్రియునకుఁ బాతికపాలు తక్కువగాను నుండును. వైశ్యునకును శూద్రునకును మఱియు నొక్కొక్కపాతికపాలు తక్కువగ విధింపఁబడుచున్నది అనలువురు నీశుద్ధికై ప్రాయశ్చిత్తము చేసికొనవలసినపు డీ విధానమునుబట్టి వారిలో నశుద్ధి యెవరియం దెక్కుడగునో తేలికయగునో తెలిసికొనవచ్చును. ఆ గురులాఘవములను దెలిసిననే తగునట్లు ప్రాయశ్చిత్తము చేసికొనఁగూడును. పశుపక్ష్యులను జంపినను, బెరుఁగుచున్న వృక్షములను బెక్కింటిని నఱికినను, నాపాపమును వెల్ల

* స్త్రియ స్త్వాశఙ్కితాః పాపే నోపగమ్యా విజానతా' అని మూలము. "పాపా నోపగమ్యా' అని ఉత్తరకోశపాఠాంతరము. స్త్రీలు పాపమొకప్పుడుగాని మనస్సుచేతఁగాని చేసినట్లు సందేహము తోఁచెనేని ధర్మవిదు లంతమాత్రమునకు వారిని పాపాత్మ కలుగా గణింపరని యర్థాంతరము.

డించుకొనుచు మూఁడురాత్రులు వాయుభక్షుఁడై యుండవల యును. పొందఁదగని స్త్రీని బొందినచో నాపాపమునకుఁ బ్రాయ శ్చిత్తముచేయుటకు నాల్గునెలలు తడిపుట్టములతో విభూదిపఱచి పరుండవలయును. రాజా ! అకార్యముల కన్నింటికిని బ్రహ్మచె ప్పిన విధిచొప్పునను దృష్టాంతమును వేదములను ననుసరించియు, హేతువునుబట్టియు, ప్రాయశ్చిత్త విధియగును. బ్రాహ్మణుఁడు శు చిప్రదేశమున గాయత్రిని జపించుచు మితాహారుఁడయి హింస వదలి కొంచెపు మాటలుగలిగి వర్తించు నేని సమస్త పాపముల నుండి విముక్తుఁడగును. అట్టియెడ నతఁడు పయికప్పులేని వట్టి బయలునందు పగలెల్లనుండి రాత్రులు నందే పరుండియుండవ లయును. పగటి మూఁడుమార్లును రాత్రి మూఁడుమార్లును వస్త్రములతోనే జలములందుఁజొచ్చి స్నానముచేయవలయును. మఱియు వాఁడినియమము గలిగి స్త్రీలతోను శూద్రులతోను బతితులతోను మాటాడకుండవలయును. బ్రాహ్మణుఁ డిట్టివ్రత ము నాచరించునేని తాను దెలియకచేసిన పాపములనుండి విడి వడును. మనుష్యుఁడు చేయు మంచిచెబ్బర కర్మములకు భూత ములెల్ల సాక్షియగును. అట్టి కర్మములకు ఫలము వాఁడు దేహా మువిడిచినదే పొందును. ఆపుణ్య పాపకర్మములలో నేది దక్కిన దానిని గ్రిందుపఱిచి యెక్కుడగునో దానిఫలము నే కర్మకరుఁడు పొందుచున్నాఁడు. కాబట్టి మనుష్యుఁడు * జ్ఞానముచేతను దప స్సుచేతను సత్కర్మములచేతను పుణ్యఫలమును వృద్ధిఁబొందిం చుకొనును. అట్లె యతఁ డశుభకర్మములను జేసెనా పాపమును వృద్ధిఁబొందించుకొనును. కాఁబట్టి పుణ్యకర్మములనే చేయవల

* 'జ్ఞానేన' అని మూలము 'దానేన' అనిపాఠా.

యును. పాపకర్మమునుండి నివర్తింపవలయును. పాపకర్మములు నివర్తించు నిమిత్తమై ధనము నెప్పుడు దానముచేయవలయును. అట్లుచేసిన పాపమునుండి విడుదల కలుగును. ఆయా పాపమునకుఁ దగిన ప్రాయశ్చిత్తమును నుదాహరించితిని. మహాపాతకములకుఁ దప్పఁ దక్కిన పాపములకెల్లఁ బ్రాయశ్చిత్తము విధింపఁబడుచున్నది. భక్ష్యములు అభక్ష్యములు వాచ్యములు అవాచ్యములు ననెడిపాపములు తెలిసి చేయుట తెలియకచేయుట యనుదీనినిబట్టి రెండువిధములుగా నున్నది. † తెలిసిచేసిన పాపమంతయు మిక్కిలి దుర్భరమైన దగుచున్నది. తెలియక పొరపడిచేసినది స్వల్పదోషమే యగును. రెంటికిని ప్రాయశ్చిత్తము గలదు. పాపము నింతవఱకుఁ జెప్పఁబడిన ప్రాయశ్చిత్తవిధిచేతఁ బోకార్చుట శక్యమేకాని యశక్యముగాదు. అయిన నీ ప్రాయశ్చిత్తవిధి యాస్తికులకును శాస్త్రమందు విశ్వాసముగల వారికిని విధింపఁబడి యున్నది; కాని నాస్తికులకును, శాస్త్ర విశ్వాసము లేనివారికిని దంభమును ద్వేషమును ముఖ్యముగాఁ గలవారికిని విధింపఁబడినది కాదు. ఇహమందును బరమందు

---

* 'నివర్తేత్పాపకర్మణః' అనిమూలము 'నిమిత్తేపాపకర్మణామ్' అనిపాఠాంతరము. పాపకర్మము నిమిత్తమై అనఁగా దానిని దొలఁగించుకొనుటకు పుణ్యకర్మము చేయుమని యర్థము.

† 'జ్ఞానతౌతుకృతం పాపం గురుసర్వం భవత్యుత । అజ్ఞానాత్స్వల్పకో దోషః ప్రాయశ్చిత్తం విధీయతే' అని మూలము. 'అజ్ఞానాత్ స్ఖలితేదోషే ప్రాయశ్చిత్తం విధీయతే' అని పాఠా. ఇందులకు 'ప్రాయశ్చిత్తము' తెలియక పొరపడిచేసిన పాపమును దొలఁగించుటకై విధింపఁబడినది; కాని తెలిసి చేసిన పాపమునకుఁగాదు. అట్టిపాపము దుర్భరమైనది' అని యర్థము.

ను హితముఁ గోరువాఁడు శిష్టుల యాచారమును ధర్మమును * దైవమును నెప్పుడును గొలువవలయును. † రాజా ! వారిని వధించినపుడు నీ ప్రాణములను గాఁచుకొనుటకో లేక నీకుఁ గలరాజధర్మములనుబట్టియో యట్లు చేసితివి; కావున నావధపాపమునుండి నేను బూర్వము చెప్పిన హేతువుల చేత, తనంతట విడివడ్డవాఁడ వయితివి. కాన యందులకై నీ కేమియుఁ జేయనక్కఱలేదు. అయినను గాని జాలినిబట్టి నీకుఁ బాపమేదో కలదని తలంతువేని యందులకై ప్రాయశ్చిత్త మాచరింపుము. అది దగునేకాని, యపూజ్యులకే తగినట్టి దుఃఖము కారణముగా ప్రాణములు విడుతురా? ఇది నీ కెంతమాత్రము దగదు సుమా' అనెను. మహాత్ముఁ డామహర్షి యిట్లు చెప్పఁగా ధర్మరాజు గడియసేపాలోచించి యాతపోధనునిఁ జూచి యిట్లనియె. ఇది ముప్పదినాలవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ వ్యాసుఁడు ధర్మరాజునకు భక్ష్యాభక్ష్యములను పాత్రాపాత్రములను దెలుపుట. }

ధర్మరాజు 'పితామహా ! ఏది భక్షింపఁదగినది ? దేనిని భక్షింపరాదు. దేని నిచ్చుట పొగడ్తకెక్కినది ? పాత్రమేది ?

---

* 'శిష్టాచారశ్చ దిష్టశ్చధర్మః' అని. దా. మూలము. 'శిష్టశ్చధర్మః' అని జో. మూలము.

† 'స రాజన్మోక్ష్యసే పాపాత్తేన పూర్వేణ హేతునా। త్రాణార్థం వావధే తేషా మథవా నృపకర్మణా'' మూలము. 'స రాజన్మోక్ష్యతే పాపాత్తేన పూర్ణేన హేతువా' (దా.మూ) 'ప్రాణార్థం వాధనైసైషా మథవానృపకర్మణా' (జో. మూ).

అపాత్రమెద్ది? నాకుఁ జెప్పు'మని యడిగెను. వ్యాసుఁడు 'ఈవిషయమై ప్రజాపతియగు మనువునకును ఋషులకునుఁ దొల్లి సంవాదరూపమున జరిగినయితిహాసము నుదాహరించుచున్నారు. తొల్లి కృతయుగంబున వ్రతపరాయణులగు ఋషులు కొందఱు గూడి మనువు తీఱుపాటునఁ గూర్చుండియుండఁగా, నతనిని ధర్మమునుగూర్చి యడుగువారై "ప్రజాపతీ! ఏది భుజింపఁదగినది? దానమేది? పాత్రమెవరు. * అధ్యయనమెట్లు? తపమెట్లు? కార్యములెవ్వి? అకార్యములెవ్వి? ఇవన్నియు మాకుఁ జెప్పుము' అనిరి. అందులకా స్వాయంభువమనువు వారితో 'ఋషులారా! ధర్మమును గలరూపున విస్తరించియు సంగ్రహించియుఁ జెప్పెదను వినుఁడు; విశేషించి దోషము చెప్పఁబడనిచోట జపమును హోమము నుపవాసము నాత్మజ్ఞానమును, ఇట్టివిగల మహానీయులును, పుణ్యనదులు ననునివి మనుష్యునిఁ బరిశుద్ధునిఁగావించునవిగాఁ జెప్పఁబడినవి. కొన్నిపర్వతములుగూడఁ బవిత్రములయినవి. మఱియు బంగారమును దినుట, నేయిగుడుచుట, †రత్నస్నానము, దేవాలయమునకుఁ బోవుటయు ననునివి పురుషునిఁదప్పక త్వరితముగాఁ బరిశుద్ధునిఁ జేయుచున్నవి. మనుష్యుఁడెవఁడుగాని గర్వించెనేని యెప్పుడును బ్రాజ్ఞుఁడు గానేరఁడు. అట్లు గర్వించినవాఁడు దీర్ఘాయువునుగోరునేని ‡ తప్తకృచ్ఛ్రమను తపమును (ఆగర్వమునకుఁ

---

* దానమధ్యయనంతపః' (జౌ. మూ) 'గమ్యాగమ్యా' కథం స్త్రియః. అని (దా. మూ.) కానియిందులకు మీఁద నుత్తరములేదు. కానయిది పరిహృతము.

† రత్నములువైచిన జలములచే స్నానముచేయుట.

‡ 'త్రిరాత్రం చోష్ణపోభవేత్' అని మూలము. ఇదియే తప్తకృచ్ఛ్రము. మొదటిమూఁడుదినములు ఆఱుపలముల వేఁడినీళ్లను పిదప మూఁడుదినములు మూఁడు

బరిహారముగా) చేయవలయును. ఈయఁబడని వస్తువు నెత్తికొండు టయు, దానమును, అధ్యయనమును, తపమును, అహింసయు, సత్యమును, క్రోధములేమియు, * క్షమయు నను నివియే ధర్మమునకు లక్షణములు. అదే ధర్మము దేశకాలభేదమునుబట్టి యధర్మముగాఁ బర్యవసించును. ఆదానమును, అనృతమును, హింసయు †నొకానొక సందర్భమందు ధర్మముగాఁ జెప్పఁబడియున్నవి. తెలిసినవారికి నీరెండువిధముల ధర్మములును బ్రవృత్తియనియు నివృత్తియనియు రెండు విధములగును. ఈప్రవృత్తి నివృత్తులు రెండును వైదికము లౌకికమునని మఱియు రెండువిధములగును. అందు వైదికమగు నివృత్తికి (అనఁగా వేదోక్తకర్మములుమాని బ్రహ్మానుసంధానముఁదగిలియుండుటకు) ఫలము, అమర్త్యత్వము (చచ్చిపుట్టుటలేకుండుట). వైదికమయిన ప్రవృత్తికి (వేదాదికర్మములననుష్ఠించుటకు) ఫలము మర్త్యత్వము (చచ్చి మరలంబుట్టుట). లౌకికము లయినయీరెంటికిని, నది శుభమయినచో శుభఫలమును అశుభమయినచో నశుభఫలమును గలుగునని తెలియవలయును. ఈరెంటిని వానివాని శుభాశుభ ఫలములనుబట్టి వేఱువేఱ తెలిసికొనవలయును. చేయుపనులు నీచముగానుండినను నపి,

---

పలముల కాఁచినపాలును పిదప మూఁడుదినములు ఒకపలము వేఁడి నేతిని గుడిచి పిదప మూఁడుదినము లొకక్కటియుఁ గుడువక యుండుటయే యీవ్రతము.

* 'ఇజ్యా' అని పాఠాంతరము- యాగకర్మమని యర్థము.

† 'ధర్మోహ్యావస్థికస్స్మృతః' అని (ఔ. మూలము) 'ఆత్యన్తికస్స్మృతః' అని (దా.మూ). ఆదానము అనఁగా నొకరిసొమ్మును బుచ్చుకొనుట. రాజపరాధులపై దండుగలు విధించి దానిని రాజ్యోపయోగములకు నెత్తికొనుట దోషముగాదు. అసత్యము - భృత్యుఁడు తన యేలినవానిఁ గాచుటకై కల్లలాడిన దోష

దైవము, శాస్త్రోక్తకర్మము, తన బ్రతుకు,* తన మరణము,
నను వీనినిబట్టి చేయఁబడునేని శుభఫలమునే యిచ్చును. ఒక
పని, మీఁద నొకరికి గీడుగలిగించునని సందేహముతోఁ జేసినను
గాని, లేక తప్పక కీడుగలిగించునని యనుభవముచేఁ గనుఁగొని
యే (అనఁగా నిశ్చయముతో) చేసినను గాని, యందులకుఁ బ్రా
యశ్చిత్తము చేసికొనవలయును. కోపముచేతఁగాని మోహము
చేతఁగాని యొకపని చేసినయెడల నక్కార్యమునకుఁ దగినట్లు వేద
మునందుఁ జెప్పినవిధిననుసరించి శరీరమును వాఁడున ట్లుపవాస
ముచే శుష్కించుకొనవలయును. మఱియే దేని తన మనస్సునకుఁ
బ్రియముగావించుటకో పరుల మనస్సున కప్రియముగావించు
టకో క్రోధమోహములచేతఁ జేసినయెడల నప్పాపమును మంత్ర
జపములచేతను, బరిశుద్ధాన్నభోజనముచేతను దొలఁగించుకొన
వలయును. రాజొకవిషయమున దండము విధింపక తప్పెనేని
యొకదిన ముపవాసముండి తన్ను శుద్ధునిఁగావించుకొనవలయు
ను. ఆరాజున కట్టిదండము నుపదేశించుటకుఁ దప్పినపురోహి
తుఁడు మూఁడునా ళ్లుపవాసముండవలయును. తనకుఁ బుత్రాది
క్షయమువలన శోకమునొందుచు నాయుధములు మొదలయిన
వానిచేఁ దన మరణమునకుఁ బ్రయత్నించియుఁ జావకున్నవాఁడే
ని మూన్నాళ్లు పస్తుపడియుండవలయును, శాశ్వతమయినజాతి,

ముగాదు. హింస - రాజపరాధిని వధించుటయుఁ దన్నుఁగాచికొనుటకై శత్రు
వును వధించుటయు దోషముగాదు.

*'ప్రలయః' అని (దా.మూ.) 'ప్రాణదః' అని (జో.మూలము) ప్రాణమును
గాచుకొనునట్టి పని యని యర్థము. ఇట్టి యుభయప్రతులకు నయ్యెయెడల పాఠ
భేదములు మెండుగఁ జూపట్టుచున్నవి.

ఆశ్రమము, గ్రామము, కులము ననెడి వీనిసంబంధించిన ధర్మములనన్నిటిని దిగవిడిచిన మనుష్యులకు మఱియేధర్మమును గలుగదు. ధర్మసందేహము గలిగెనేని వేదశాస్త్రముల నెఱింగిన పది పండితులనయినను, ధర్మశాస్త్రమును జక్కఁగా నేర్చిన మువ్వురనయినను, విచారించి వారుచెప్పినది ధర్మమని నిర్ణయించుకొనవలయును. ఎద్దు, మన్ను, చిన్నచీమలు, *ముఱికియందుఁ బుట్టు పురుగులు, (వత్సనాభి మొదలయిన) విషమును బ్రాహ్మణులు తినరాదు. మఱియు వాఁగు పొలుసులేని చేఁపలను, తాఁబేలు తప్ప జలములందుఁ గలుగు తక్కిననలుగాలి ప్రాణులగు కప్ప మొదలగు వానిని భుజింపరాదు. మఱియు జలపక్షులగు భాసమును (గంప పులుఁగులు) అంచలను, గరుడపక్షులను, చక్రవాకములను, నీరుకోళ్లను, కొంగలను, కాకులను, నీరుకాకులను, గ్రద్దలను, డేఁగలను, గూబలను, మఱి వాఁడు లయినవిడుదకోఱలుగలిగి మాంసమును దినుజంతువులను, రెండువరుసల పండ్లుగలవానిని, నాలుగు కోఱపండ్లు గలవాని, నన్నింటిని బ్రాహ్మణుఁడు భుజింపరాదు. మఱియు గొఱియ, గాడిద, క్రొత్తగానీనిన యావు, లొట్టియ, †స్త్రీ యనువీరలపాలును బ్రాహ్మణుఁడు త్రాఁగరాదు. బ్రాహ్మణుడుమరణముగలిగిన యింటను బురిటియింటను నన్నమును బది దినములవఱకును గుడువరాదు. ఈని పదిదినములుకాని యావు పాలను గుడువరాదు. క్షత్రియునియన్నము, తినువాని తేజమును, శూద్రునియన్నము వాని బ్రహ్మవర్చసమును, కంసాలియన్నమును వెనిమిటియుఁ బుత్త్రుఁడులేని పడఁతియన్నమును వాని యాయు

† శ్లేష్మాతకః 'అని మూలము. విరిగికాయలని కొందఱు వ్యాఖ్యానము.

* 'సూకరాణాంగవామ్' (దా.మూ) 'సూతికావాంగవామ్' (ఔ.మూ)

వునునపహరించును. పాడిదప్పి వడ్డిగొని బ్రతుకువాని యన్నము మలమునకు సాటియగును. వేశ్యయన్నమును, తన పెండ్లామునుఅంకుమగనియన్నమును, ఆఁడుదానికి లోఁపడినవాని యన్నమును, శుక్లమునకు సాటియగును. యాగమునందు దీక్షితుఁడయినవాని యన్నమును (అతఁడు వపాయాగముచేయువఱకును) గుడువరాదు. యాగమునందు సోమమునమ్మినవాఁడు, లోభి, వడ్రవాఁడు, మాదిగవాఁడు,అంకుటాలు,చాఁకలి, వైద్యుఁడు, ఊరితలారులు, జనులగుంపు, గ్రామమంతటిచేత నపవాదముపడినవాఁడు,నటుఁడు, స్త్రీలపడుపున బ్రతుకువాఁడు, అన్నకుముందు పెండ్లాడినవాఁడు, పుంస్త్వములేనివాఁడు, బట్టువాఁడు, జూదరి యనువిరల యన్నమును భుజింపఁదగదు. ఎడమచేతఁ దేఁబడినదియు, ఎండినదియు, ప్రాఁతగిలినదియు, మద్యసంబంధముగలదియు, తినఁగా మిగిలినదియు,తనకని ప్రత్యేకముగానెత్తిపెట్టఁబడినదియు (శేషమైనదియు) నగునన్నమును భుజింపరాదు. పిండి, చెఱకు, కాయగూర, పాలు, పేలపిండి, బొరుగులు, పెరుఁగుతోఁగలిపిన పేలపిండియు నను వీనితోఁజేయబడినవి నాళ్లుచెల్లిన యెడల భుజింపఁదగవు. పాయసము, పులగము, మాంసము, అప్పమును, దేవతలకు నివేదింపఁబడనివిగా నుండినచో గృహస్థులయిన బ్రాహ్మణులు వీనిని భుజింపరాదు. గృహస్థుఁడగువాఁడు దేవతలను, ఋషులను, పితరులను, ఇలువేల్పులను మనుష్యుల నందఱను బూజించి యటమీఁదఁ దాను భుజింపవలయును. * ఇల్లు విడిచినపోయిన సన్యాసివలె స్వగృహమునందు గృహస్థుఁ డుండవలయును.

---

* ఇట్లు గృహస్థుఁడింట వసించుట చే ఇలువిడిచిపోయిన సన్న్యాసి వంటి వాఁడగునని యర్థాంతరము.

ఇట్లుండుగృహస్థుఁడు ప్రియభార్యలం గూడియుండి ధర్మమును బడయుచున్నాఁడు. కీర్తినిగోరి కాని, (ఇయ్యనియెడ నేమను కొందురోయను) భయముచేతఁగాని, దానముచేయరాదు. తన కుపకారముచేసినవాఁడని దానముచేయరాదు. గాయకులు,నర్తకులు, విదూషకులు, మదించినవాఁడు, పిచ్చిపట్టినవాఁడు, దొంగ, దూషించువాఁడు, మూఁగ, కురూపి, అంగహీనుఁడు, పొట్టివాఁడు, దుష్టుఁడు, దుష్కులమునఁ బుట్టినవాఁడు, వైదికసంస్కారములేనివాఁడు, నను వీరలకు దానముసేయరాదు. వేదాధ్యయనములేని బ్రాహ్మణునకు దానముచేయరాదు; శ్రోత్రియుఁడగువానికే చేయవలయును. సరియైనపద్ధతిని చేయఁబడని దానమునుసరియైనపద్ధతిని గోనని ప్రతిగ్రహమును రెండును దానమునిచ్చినవానికిని బుచ్చుకొన్నవానికిని ననర్థములకే యగును. చంద్రమాని కట్టింపనుగాని ఱాతినిగాని బట్టుకొని సముద్రమును దాఁటఁగోరు వాఁడెట్లు మునింగిపోవునో యట్లె నిచ్చినవాఁడును బుచ్చుకొన్నవాఁడును మునిఁగిపోదురు. తడికట్టియలలను బఱపినయగ్గి యెట్లువెలుఁగదో యట్లెతపమును వేదాధ్యయనమును నాచారమునులేని బ్రాహ్మణుఁడు దానముపుచ్చుకొనుటచేఁబ్రకాశింపఁడు; ఇచ్చినవానికి ఫలమునొసంగఁడు. మానిసిపునుకయందలి నీరును, కుక్కతోలుతిత్తియందలి పాలును, తామున్నస్థానముల దోషమువలన దుష్టములెట్లగునోయట్లె మంచినడవడిలేనివాని యందున్నశాస్త్రములును వ్యర్థములగును. శాస్త్రములు తెలియకుండినను, అసూయాదులు గలిగి యున్నను, వేదములులేక యున్నను బ్రాహ్మణునియందును వ్రతములేని తక్కువవారియందును గరుణచేతఁ జేయుదానను యుక్త

మగును. * ఒకఁడు బీదయనియు రోగియనియు దుఃఖితుండ నియు వానికి దానముచేయవచ్చును. కానివాఁడు తనకేదేని యాప్తమును జేయుననికాని ధర్మము కలుగుననికాని తలఁచి చేయరాదు. వేదము తెలియని బ్రాహ్మణునకిచ్చినదానము వ్యర్థ మందురు, ఏలనఁగా పాత్రదోషమువలన నది ఫలింపదు. ఇందు లకు విచారింపఁబని లేదు. మ్రానితోఁ జేయఁబడిన యేనుఁగయు, తోలుచేఁ జేయఁబడిన మృగమును, వేదమధ్యయనము చేయని బ్రాహ్మణుఁడును నను నిమ్మూఁడును వరుసగా నేనుఁగు మృగము బ్రాహ్మణుఁడను పేళ్లుదాల్చియుండుట తప్పఁ దక్కిన పసయేమి యునోఁదరు. పడఁతులయందు నపుంసకుఁడును, ఆవునం దావు ను, పసహూలియుండునట్లును, ఱెక్కలు లేనిపక్షి యట్లును, వేదము తెలియని బ్రాహ్మణుఁడు వ్యర్థుఁడే యగును. † మనుష్యులు లేని గ్రామమును, నీరు లేనినూయియు, అగ్ని లేని వేఁడిమియు, నెట్లో యట్లె మూర్ఖునియందుఁ జేసినదానమును నిష్ఫల మగును. మూ ర్ఖుఁ డెల్లవారికిని బగవాఁడు; దేవతలకును బితరులకును జేయు హవ్యకవ్యములను జెఱుపువాఁడు; కాన వాడు మంచిలోకముల ను బొందనేరఁడు. ధర్మరాజా! ఈ ధర్మమునంతయుఁ గలయంత వట్టు (మనువపుడు చెప్పినదంతయు) నీకు సంగ్రహముగాఁ జెప్పి

* ఇంపులకు 'నవై దేయ మనుక్రోశా ద్దీనార్తాతురకేష్వపి' (దా. మూల ము)'దీనా యాపగుణాయచ' అని(దా. మూలము). గుణములేనివాఁడు దరిద్రుఁడని యీవచ్చునుగాని తక్కిన యాప్తకారిత్వాది హేతువులఁబట్టి యీరాదనుట.

† 'గ్రామస్థానం యథాశూన్యం' అని (దా. మూ.) గ్రామధాన్యం యథాశూన్యం' అని (దా. మూ). గింజలేని పొల్లుధాన్యము వలెనని యర్థము.

తిని. ఇది మిక్కిలి విస్తరించి వినఁదగినది" అనెను. ఇది ముప్పది యేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడును గృష్ణుడును జెప్పినట్లు ధర్మరాజు మనసున శాంతినొంది హస్తినాపురమును బ్రవేశించుట.

ధర్మరాజు 'మునీంద్రా ! రాజధర్మములను జతుర్వర్ణధర్మములను నన్నింటిని వినఁగోరుచున్నాను. ఆపదలయందు నీతియెట్టుజరుపవలయునో ధర్మమార్గము నవలంబించి యెట్లు భూమిని జయింపవచ్చునో వినఁగోరుచున్నాను. నీ విపుడు ప్రాయశ్చిత్తమును భక్ష్యాభక్ష్యవివరణముతోఁ గూడ ముచ్చటించితివి. ఇది నాకుఁ గౌతూహలముఁగలిగించి నామనస్సును నుబ్బించుచున్నట్లున్నది. ధర్మచర్యయు రాజ్యమును నెప్పుడు నొకటికొకటి విరోధించియుండును. కాన ధర్మముతో విరోధింపక రాజ్యమెట్లు చేయవచ్చునని యీవిషయమునే నిత్యమును జింతించుచున్నను నామనస్సున కేమి తెలివిడిలేకున్నది. కాన రాజధర్మాదులను దెలుపుము' అని యడిగెను. అందులకు వ్యాసుఁడు నారదునిఁ జూచి ధర్మరాజుతో 'మహాబాహూ ! నీవు ధర్మము నంతయు వినఁగోరుదువేని కురుపితామహుండును వృద్ధుండునగు భీష్మునికడకుఁబొమ్ము. అతఁడు భాగీరథికన్నపుత్రుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వధర్మవిదుఁడు. కాన నీకు మనస్సున ధర్మరహస్యములందుఁగల సందేహములను ద్రుంచివైవఁగలఁడు. అతఁడు దేవనదియగు

గంగకన్నవాఁడు గాన యింద్రుఁడు మొదలయిన దేవతలనెల్లఁ గన్నారఁజూచినవాఁడు. ఆప్రభుఁడు బృహస్పతి మొదలయిన దేవర్షులను బలుమాఱు నుపచారములచే సంతోషపెట్టి వారివలన రాజనీతి నభ్యసించెను. ఆకురుసత్తముఁడు దేవాసురులకు గురుండగు శుక్రుం డెఱింగిన నీతిశాస్త్రము సవ్యాఖ్యముగాఁ దెలిసియున్నాఁడు. ఆమ్మహాబుద్ధి, భార్గవుండగు చ్యవనునివలనను వసిష్ఠునివలనను విధ్యుక్తముగా వేదముల నెల్ల వ్యాకరణాద్యంగములతోడఁ జదివెను. ఆపురుషతిలకుఁ డధ్యాత్మవిద్యాతత్త్వములఁ దెలిసినవాఁడయి తేజంబు జ్వలించుచుండు బ్రహ్మమొదటిపుత్రుఁడగు సనత్కుమారునివలన నాత్మవిద్యను, మార్కండేయునివలన సన్న్యాస ధర్మమునంతయును, పరశురామునివలనను నింద్రునివలనను నస్త్రవిద్యలను, జక్కఁగా నేర్చుకొనెను. మనుష్యజన్మముగలవాఁడయ్యు నతనిమరణ మతనియిచ్ఛకు లోనయినది. పుత్రుఁడులేకుండియు నతనికిఁ బుణ్యలోకము గలవనుట మిక్కిలి ప్రసిద్ధము. పుణ్యులయిన బ్రహ్మర్షు లతనికి నెప్పుడును సభ్యులయి యుండిరి. తెలిసికొనవలసిన విషయములం దతనికిఁ దెలియని దొక్కటియు లేదు. ధర్మముల సూక్ష్మమును దక్కుంగల తత్త్వములను నాభీష్ముం డెఱింగినవాఁడుగాన యతఁడు నను తెడలుటకు మునుపే యతనికడకుఁ బోయితివేని నీ కుపదేశము సేయును' అనెను. అందులకు ధర్మరాజు వ్యాసుంజూచి నేను 'భూమినంతయు నాశమగునట్లు మేనుగరుపాఱునట్టి యిట్టి గొప్పజ్ఞాతివధమును గావించి సమస్తలోకమునకు నెగ్గుచేసితిని. ఇంత మాత్రమా ! కపటములేక మారొక్కని యుద్ధముచేయుచుండఁగా నవ్వీరునే కపటముగాఁగొట్టి కూలఁద్రోయించితినే! అట్లుచేసి

యతనికడకుఁబోయి యడుగుటయెట్లు' ? అనెను. అదివిని యదుతిలకుండగు కృష్ణుఁడు చతుర్వర్ణములకును హితము సేయఁ గోరినవాఁడై యారాజవర్యునితో 'రాజోత్తమా ! నీవు శోకమును దలఁచి మిక్కుటమయిన నిర్బంధము పెట్టుకొనుట యిప్పుడెంతమాత్రము దగదు. వ్యాసుఁడు చెప్పినట్లు చేయుము. మహాతేజులయినతమ్ములును బ్రాహ్మణులును హతశేషులయిన రాజులును నందఱును వేసవికాలముతుదను బర్జన్యునింబోలె నిన్ను వేఁడుకొనువారై వచ్చి కొలిచియున్నారు. మహారాజా ! చతుర్వర్ణములతోఁ గూడిన కురుజాంగలరాజ్యమంతయును నిన్ను వేఁడ వచ్చియున్నది. మహాత్ములయిన యీ బ్రాహ్మణుల ప్రియమునకుఁగాను, అపారతేజుఁడయిన యీగురుని వ్యాసునిని యోగమునుబట్టియు, నేను మొదలు నాస్నేహితులకును ద్రౌపదికిని బ్రియమును లోకమునకు హితమును గావింపుమా' యనెను. అంత ధర్మరాజు కృష్ణుఁడు చెప్పినదివిని సర్వలోకహితముగోరి గొప్పమనస్సున లేచెను. అమ్మహాయశుఁడు, కృష్ణుఁడు, వ్యాసుఁడు, దేవస్థానుఁడు, అర్జునుఁడును దక్కుంగల పెక్కండ్రు ననునయింపఁగా, మనంబునఁగల దుఃఖమును దుందుడుకును దిగ్గవిడిచెను. ఆపాండవుండు, వేదమునందును వేదార్థమందును దక్కుంగల శాస్త్రములందును సమర్థుండుగాన తనమనంబుచే నిశ్చయించుకొని దుఃఖముపీడి నెమ్మదినొందెను. అతఁడు నక్షత్రములచేఁ బరివృతుఁడగుచంద్రుండునుంబోలె,వారలచేతఁ బరివేష్టితుండై ధృతరాష్ట్రుని మున్నిడుకొని తనపట్టణమునకుఁ బోవ బయలువెడలెను. అట్లు వెడలునపు డతఁడు ధర్మవిదుండుగాన పెక్కువేల దేవతలను బ్రాహ్మణులను బూజించెను. పిదప

శుభలక్షణములుగల పదునాలు గుఱ్ఱములు పూన్పంబడినదై కంబములును కడవసములును బలువంబడి మంత్రములచే నర్చితంబయిన క్రొత్తతెల్లనిరథంబునందు, వందిజనులు కైవారములు సేయుచుండ, నాధర్మరాజు, అమృతమయంబగు రథంబును సోమదేవుండునుం బోలె, నారోహించెను. భయంకరపరాక్రముండగు భీముఁడు గుఱ్ఱముల పగ్గములు పూనెను. అర్జునుండు కాంతులు దొలంకు శ్వేతచ్ఛత్రమును బట్టెను. రాజు శిరసుపయినిబట్టిన యా తెల్ల గొడుగు, తెల్లని మబ్బులుగల యాకాశమందు, నక్షత్రములచేతబలసియున్న చంద్రునింబోలె వెలింగెను. నకుల సహదేవులిరువురును జంద్రుని కిరణంబులవలెఁ బ్రకాశించుచున్నవియు నలంకృతములును సుందరములునగు రెండు చామరములను వీచిరి. ఆసహోదరులందఱు నలంకృతులై యేకరథమునఁ జేరుట, యేనుభూతములు నొక్కచోటఁ జేరినట్లు చూపట్టెను. రాజా! ధృతరాష్ట్రునిపుత్రుఁడుయుయుత్సుఁడుమనోవేగముగల నాలుగుగుఱ్ఱములుపూన్చిన మేలిరథమునెక్కి పాండవజ్యేష్ఠుండగు ధర్మపుత్రుని వెంటనంటిపోయెను. శ్రీకృష్ణుఁడును సాత్యకితోఁగూడి శైబ్య సుగ్రీవము లనుగుఱ్ఱములు పూన్చిన పచ్చబంగారుతేరిపయి నెక్కి పాండవులకుఁ బిఱుద బయలుదేఱెను. ధర్మపుత్రుని పెదతండ్రియగు ధృతరాష్ట్రుఁడు గాంధారింగూడి నరయానము (పల్లకి) నెక్కి ముందు బయలుదేఱెను. కుంతి ద్రౌపది సుభద్ర మొద లగుకౌరవస్త్రీలందఱును విదురుని మున్నిడికొని పలువిధములయిన వాహనములతో బయలుదేఱిరి. అంతఁ జక్కఁగా నలంకృతములయిన పెక్కురథములును గజములును దురగములును బదాతి సమూహములును



177. ధర్మరాజు శ్రీకృష్ణునితోడ హస్తినాపట్టణమును ప్రవేశించుట.

వెనువెంట బయలువెడలినవి. అంత వైతాళికులును సూతులు ను మాగధులును సుభాషితములఁ గైవారములు సేయుచుండ రాజు యుధిష్ఠిరుండు హస్తినాపురమునకుఁ బోయెను. ఆధర్మ రాజునంటిన క్రంత సంతోషపూరితు లయిననానాజనులు నెరసి యుండ లెక్కడరాని జనసమూహములు మిక్కిలి క్రిక్కిఱిసియు లోకంబున సాటిలేనిదై నీటుగులుకు చుండెను. పురజనులు ధర్మ రాజు నెదుర్కొని తోడ్కొని పోవఁగోరి పట్టణమును రాజ వీథులను వలయునట్లు నానావిధముల నలంకరించిరి. ధ్వజముల చేతను దెల్లనితోరణమాల్యములచేతను అగరు మొదలయిన వాసన ధూపములచేతను రాజవీథి మొదలయిన ప్రదేశము లన్నియుఁ జక్కఁగా నలంకృతములై యుండెను. ఆరీతినే రాజ భవనముచుట్టును విలువగల మేలిపువ్వులచేతను వాసనపుఁబొడుల చేతను బెక్కుపూదండలచేతను జక్కఁగా సింగారించిరి. పట్టణపు ద్వారములం దక్కడక్కడఁ గ్రొత్తవియు దృఢములయినవియు నగు తెల్లని పూర్ణకుంభములును దెల్లని పుష్పములును నెల కొల్పఁబడినవి. అంత ధర్మపుత్త్రుఁడు జనులు శుభవాక్యములఁ బొగడుచుండ సుహృదులం గూడి యట్లు చక్కఁగా నలంకృత మయినహస్తినాపురద్వారమును బ్రవేశించినవాఁ డయ్యెను. ఇది ముప్పదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(పురజనులు పాండవులను పొగడుట. ధర్మరాజు రాజసభా ప్రవేశము. ధర్మరాజును నిందించిన చార్వాకుఁ డనురాక్షసుఁడు బ్రాహ్మణ కోపముచేత నశించుట.)

పాండవుల ప్రవేశమును జూడ నువ్విళ్లూరుచుఁ బురజనులు వేలకొలఁదిని రాఁదొడఁగిరి. నలుగడల నలంకృతమై జనసమూహములు నిండియున్న యారాజవీథి, చంద్రుఁ డుదయించినపు డుప్పొంగు మహాసముద్రముంబోలె వెలింగెను. రాజమార్గము లందు రత్నమయము లయినగొప్పగొప్పగృహములు క్రిక్కిఱిసియున్న స్త్రీల బరువుచేత నల్లలాడుచున్నట్లు చూపట్టుచుండెను. ఆపడంతుకలు నునుసిగ్గు నూలుకొన నల్లల్ల ధర్మరాజును భీముని నర్జునుని నకుల సహదేవులను గొనియాడిరి. వారు ద్రౌపదిని జూచి 'పాంచాలీ! మహర్షిని గొలుచుగౌతమియుంబోలెఁ బురుషతిలకు లయినయిట్టిపతులను బడసి వెలుంగుచున్న నీవే ధన్యురాలవు! కల్యాణీ! నీచేసినకార్యము లమోఘములు! నీవ్రతచర్యయు నట్టిదే' యని కొనియాడిరి. వారి పొగడిక వాక్యములచేతను, ప్రేమచేత నొండొరులతోడ మాటాడు చప్పుళ్లచేతను, బురమంతయుఁ గలకలమని మ్రోయుచుండెను. అంత ధర్మరా జారాజమార్గమును దగురీతిని గడచి చని యలంకృతమై యొప్పు లొలుకుచున్న రాజభవనమును జేరెను. అంతఁ బ్రకృతులందఱును బురజనులును దేశజనులు నందంద ధర్మరాజును డగ్గఱి చెవి కింపయినమాటల 'రాజేంద్రా! శత్రునిషూదనా! భాగ్యముచేత శత్రువులను జయించితివి. ధర్మముతోడను బలము

తోడను మాభాగ్యమువలన మరల నీరాజ్యమును బడసితివి. మహారాజా ! ఇందుండి వందలకొలఁదియేండ్లు మాకు రాజవై యింద్రుఁడు స్వర్గమును బరిపాలించునట్లు ధర్మంబునఁ బ్రజలను బరిపాలింపుము' అని చెప్పిరి. ఇట్లు రాజభవనము ద్వారమందు నలుప్రక్కల బ్రాహ్మణు లాడుచున్న యాశీర్వాదములను గయి కొనుచు మంగళోపచారములచేతఁ బూజితుండై ధర్మరాజు దేవేంద్రునిరాజభవనమువలె నొప్పుచున్న రాజగృహమందుఁ బ్రవేశించి జయశబ్దములను విన్నపిదప రథమునుండి దిగెను. శ్రీమంతుఁ డమ్మహాయశుఁడు లోపలఁ బ్రవేశించి యందున్న దేవతల సన్నిధికిఁబోయి వానినెల్లఁ జందనము పుష్పములు రత్నములు మొదలయిన వస్తువులచేతఁ బూజించి యంత మరల వెలికివచ్చెను. అందు మంగళవస్తువులను గేలంగొని తమ్ముఁ జూడఁగోరివచ్చి నిలుచున్న బ్రాహ్మణులను గాంచెను. ఆశీర్వదింపఁగోరి యాబ్రాహ్మణోత్తములుచుట్టును బరివేష్టింపఁగా నాధర్మరాజు నక్షత్రగణములు బలసియున్న చంద్రునివలె నప్పుడు పరిశుద్ధుఁడై వెలింగెను. అతఁడు పువ్వులు మోదకములు రత్నములు నవ్వారి యైన బంగారములు గోవులు వస్త్రములు మున్నగువానిచేతను మఱి యుఁదక్కిన పెక్కువస్తువులచేతను నా బ్రాహ్మణులను విధ్యుక్తముగాఁ బూజించెను ; మఱియు భృత్యులు గానివారికి వల యునవియెల్ల నరయునట్లును గావించెను. పిదప గురుం డయిన ధౌమ్యునిని బెదతండ్రి యగుధృతరాష్ట్రునిని మున్నిడికొని, యింద్రుఁడు సుధర్మాసభను బ్రవేశించునట్లు, ధర్మరాజు రాజసభ యందుఁ బ్రవేశించెను. అంత సుహృదులకు సంతోషకరమును వినుటకు మిక్కిలి యింపయినదియుఁ బుణ్యంబును నగు పుణ్యా

హావాచనధ్వని దేవలోకమును వ్యాపించునదై చెలంగెను. వేదవిదులగు బ్రాహ్మణుల వాక్కులు హంసధ్వనులుగలవై యర్థనిబిడములైన పదములతోడఁగూడి వినఁబడెను. పిదప దుందుభివాద్యధ్వనియుఁ, జెలువయిన శంఖధ్వనియు, వందిమాగధుల జయాజయధ్వనులు, నుప్పతిల్లెను. బ్రాహ్మణు లాదిగాఁ గల యాజనుల ధ్వనులన్నియు నడిగినతోడనే దుర్యోధనునికిఁ జెలికాఁ డయినచార్వాకుఁ డనురాక్షసుఁడు సిగయు మూఁడుదండములును జపమాలయుఁ గలసన్న్యాసిబ్రాహ్మణవేష మూని యాశీర్వదింపఁ గోరుచున్నవారై యున్న మహాతపస్వులగు నందలివేలకొలఁదిబ్రాహ్మణులసమూహమునం దుండి ధైర్యంబున రాజగు యుధిష్ఠిరునింజూచి భయంబు మాలి పలుకం దొడంగెను. ఆదుష్టుఁ డందలి బ్రాహ్మణుల యొక్కరిమాటయు వినక మహాత్ము లయినపాండవులను బాపాత్ములని చెప్పఁదలఁచి 'ఓ! కుంతికొడుకా! ఇందుఁ గలబ్రాహ్మణులందఱును దమ యభిప్రాయములను నాముఖమున నీకుఁ జెప్పుచున్నారు. నీవు జ్ఞాతులను వధముచేసిన చెడురాచవాఁడవు.ఇస్సీ! నీబైసి. అదియట్లుండనీ. ఈరీతిని జ్ఞాతులనెల్ల నాశముచేసితివే. ఇట్టి కట్టిఁడికి నీకు రాజ్యమేమి? వట్టి జ్ఞాతులనుమాత్రమా! పెద్దలనుగూడఁ జంపి వుచ్చితివే! ఇట్టి నీకు బ్రదుకుటకంటె చచ్చుటే మేలు' అనెను. దుష్టుఁ డారాక్షసుఁ డాడినయీమాటలు విని యందుఁ గల బ్రాహ్మణులందఱు నామాటలకు భయపడి వ్యథనొందుచు బిగ్గఱ నాక్రోశించిరి. అంత నాబ్రాహ్మణులు నాధర్మరాజును మిక్కిలి లజ్జితులై యెంతయు వెతనొందుచుఁ గొంతసేపు మాటాడకుండిరి. పిదప ధర్మపుత్రుఁడు వారితో 'పెద్దలారా!

మీకు మ్రొక్కెద; బతిమాలుకొనెదను. నన్ననుగ్రహింపుఁడు. *నే నిదె ప్రాణములు విడుచుట దగ్గఱియున్నది. కాన నన్ను 'ఇస్సీ' యని నిరాకరించుట మీకుఁదగదు' అనెను. అందుల కా బ్రాహ్మణులందఱును 'రాజా! వీఁడు మాతోఁ జేరిన బ్రాహ్మణుఁడేకాఁడు. ఎవఁడో యన్యుఁడు' అని చెప్పి యంతటఁ దాము దపంబులచే నిర్మలులును వేదవిద్వాంసులు నయినమహాత్ములు గాన జ్ఞానదృష్టిచే వాఁడెవ్వఁడగుటయుఁ దెలిసికొని 'రాజా! వీఁడు దుర్యోధనునకు సఖుఁడుగా వాసికెక్కిన బ్రహ్మరాక్షసుఁడు. ఆ దుర్యోధనునకు హితము సేయఁదలఁచి వీఁడు సన్న్యాసివేషమున వచ్చినాఁడు; ఈమాటలు మేము చెప్పలేదు. ధర్మాత్మా! నీ విట్లు భయపడవలదు. నీకును నీతమ్ములకును మంగళంబగుఁగాక' యనిరి. అంతఁ బవిత్రులగు నాబ్రాహ్మణులు క్రోధంబు దీపింప నందఱు నా పాపరాక్షసుని హుమ్మని హుంకారములచే నదల్చుచుఁ దూలఁగొట్టిరి. వారల తేజంబువలన నారాక్షసుఁడు దగ్ధుఁడై పిడుగుపడి యొఱగిన చిగురించు మ్రాఁకుంబోలె నేలం గూలెను. అట్లాబ్రాహ్మణులు ధర్మపుత్రుని సంతోషపఱిచి యతనిచేఁ బూజితులై గృహములకుఁ బోయిరి. ధర్మపుత్రుఁడును సుహృదులంగూడి ముదంబునఁ బొదలుచుండెను. ఇది ముప్పదియేడవయధ్యాయము.

---

* ఇందులకు 'ప్రత్యాసన్నవ్యసనినమ్' అని మూలము. నీలకంఠులు దీనికి 'ప్రత్యాసన్నాః సమీపస్థాః వ్యసనినః చిరదుఃఖినో భ్రాత్రాదయోయస్య తమ్ - భ్రాత్రాదిదుఃఖ పరిహారార్థం మమేదం రాజ్యకరణమ్ నతు స్వసుఖార్థమిత్యర్థః' అని యర్థము చేసిరి; కాని యిదిచాలఁ గ్లిష్టము. సమీపించిన మరణవ్యసనముగల వానిని అనుటే సరసము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజునకుఁ జార్వాక రాక్షసుని పూర్వవృత్తాంతమును జెప్పుట.

అంత దేవకీపుత్త్రుఁడు శ్రీకృష్ణుఁడు తమ్ములతోడం గూడి యున్న ధర్మపుత్త్రుంజూచి సమస్తమును గనుఁగొన్నవాఁడుగాన 'అయ్యా ! ఈ లోకమందెప్పుడును నాకు బ్రాహ్మణులు పూజనీయులు. వాక్కునందు విషమును మిక్కిలి యనుగ్రహమును గలిగిభూమియందు సంచరించుచున్న దేవతలుచుమీ వీరు! తొల్లి కృతయుగంబునఁ జార్వాకుఁడను రాక్షసుఁడు బదరీక్షేత్రమందుఁ బెక్కు సంవత్సరములుతపము చేయుచుండెను.అంత బ్రహ్మదేవుఁడువచ్చి వలసినవర మడుగుమని మాటికి మాటికిని జెప్పగాఁ నారాక్షసుఁడు 'నా కేప్రాణివలనను భయము లేకుండవలయు'నని యడిగెను. ఆజగత్పతియు బ్రాహ్మణుల నవమానించుటం దప్పఁ దక్కినయెడల నే ప్రాణివలనను భయము గలుగకుండునట్లుత్తమమయిన వర మొసంగెను.ఆపాపాత్ముఁడట్లు వరముఁబడసి మిక్కుటమయిన బలిమియు వేంద్రమయినచేష్టలును మతిలేని పరాక్రమమును బొంది దేవతలను దపింపఁజేయఁ దొడంగెను. వాని బలిమికిఁ గీడ్పడి దేవత లొక్కటిగాఁగూడి బ్రహ్మకడకుఁబోయి యారాక్షసుని వధింపవలయు నని చెప్పిరి. ఆదేవుఁడును వారిం జూచి 'వీనికిని జిరకాలమున నే మృత్యువు గలుగునట్లుగా నే నేర్పాటు చేసియున్నాను. మనుష్యులలో దుర్యోధనుఁడను నొక రాజు వీనికిఁ జెలికాఁడగును. వీఁడు వానివలని స్నేహమునకు బద్ధుఁడై బ్రాహ్మణుల నవమానించును. బ్రాహ్మణులో వాగ్బలముగలవారు. వారు తమ్ము నవమానించిన కారణమున మిక్కిలి


కుపితులై యీ పాపాత్ముని దమకోపాగ్నిచేఁ గాల్చి కూల్తురు' అనెను. ఆచార్యాకుఁడే యిదిగో బ్రాహ్మణదండముచేతఁ గొట్టు వడి నేలంబంజి యున్నాఁడు; కావున శోకింపకుము. రాజా! క్షత్రియతిలకులును వీరులు నగునీజ్ఞాతులు క్షత్రధర్మము చొప్పున నీచేత హతులయిరి. కాన యామహాత్ములు స్వర్గలోక మందిరి. కాఁబట్టి యీవిషయమై వేఱుతలంపు వలదు. వలయు కార్యములను జేయఁ బూనుము. శత్రులను ఱుమాడుము. ప్రజలను రక్షింపుము. బ్రాహ్మణులను బూజింపుము' అనెను. ఇది ముప్పదియొనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు రాజ్యాభిషేకము.

అంత రాజయినధర్మపుత్రుఁడు శోకమును దాపమును విడిచి సంతసంబున గొప్పదియగు బంగారుపీఠమునఁ దూర్పు మొగముగాఁ గూర్చుండెను. సొగసయి ధగధగ వెలుఁగుచున్న బంగారుపీఠములం దతని కెదురుగా సాత్యకియుఁ గృష్ణుఁడును గూర్చుండిరి. ధర్మరాజును నడుమ నుంచుకొని యతని కిరుప్రక్కల భీమసేనుఁడును నర్జునుఁడు మణులుచెక్కిన మేలి పీఠములందుఁ గూర్చుండిరి. బంగారముచే సింగారింపఁబడిన తెల్లనియేనుఁగుదంతపు మంచముమీఁదఁ గుంతియు సహదేవుఁడును నకులుఁడును గూర్చుండిరి. దుర్యోధనునిపురోహితుఁ డయిన సుధర్ముఁడును విదురుఁడును ధౌమ్యుఁడును ధృతరాష్ట్రుఁడును నగ్నివలె జ్వలించుచున్న యాసనములందు వేఱువేఱ కూర్చుండిరి. ధృతరాష్ట్రుఁ డున్నయెడకు సమీపమున యుయుత్సుఁ

డును గాంధారియు సంజయుఁడును కూర్చుండిరి. ధర్మరాజందుఁ గూర్చుండి తెల్లని పువ్వులను, సర్వతోభద్రాదిచిహ్నములచే గుర్తింపఁబడిన స్వస్తికములను దేవతాపీఠములను, అక్షతలను భూమిని, బంగారమును, వెండిని, రత్నములను, స్పృశించెను. పిదపఁ బ్రజలందఱును బెక్కులు మంగళ ద్రవ్యముల నెత్తికొని పురోహితుని మున్నిడికొని ధర్మపుత్రునిఁ గాంచిరి. అంత, భూమి బంగారము పలువిధము లయిన రత్నములును వెండి రాగి, మన్ను ననెడివీనిచేతఁ జేయఁబడినపూర్ణకుంభములు, పుష్పములు పేలాలు దర్భలు పాలు పెరుఁగు నేయి తేనె, జమ్మి రావి మోదుగుసమిధలు, మేడిమ్రానితోఁ జేసిన స్రువము, బంగారపుఁబనిగల శంఖము, మొదలుగా నభిషేకము నకువలయు నుపకరణములను దక్కిన సంభారములను సమకట్టిరి. అంతఁ గృష్ణుని యాజ్ఞచొప్పునఁ బురోహితుండగు ధౌమ్యుఁడు ఉత్తరపుఁదూర్పు వైపున గొంతపల్లముగా నుండు చోట లక్షణముచొప్పున వేది నమర్చి దానిపయిని సర్వతోభద్రమను తెల్లని యాసనము నుంచిరి. దానికిఁ బాదములుగట్టిగా నెల కొనియుండెను. అది యగ్నివలె ధగధగ వెలుంగుచుండెను. దానిపయిని బులితోలు పఱవంబడి యుండెను. ధౌమ్యుఁడుసింహాసనమందు మహాత్ముం డయినధర్మరాజును ద్రౌపదిని గూర్చుండఁ జేసి విధ్యుక్తముగా మంత్రములు చెప్పుచునగ్నియందు హోమము గావించెను. అంతఁ గృష్ణుఁడులేచి పూర్ణమగు శంఖము నెత్తికొని యుధిష్ఠిరుని భూమికిఁ బతిగాఁ బట్టాభిషేకముచేసెను. అట్లే కృష్ణునియనుమతిని ధృతరాష్ట్రుఁడును బ్రజ లందఱును నభిషేకము గావించిరి. శ్రీకృష్ణుఁడు పాంచజన్య మను



184. శ్రీకృష్ణుఁడు ధర్మజుని పట్టాభిషిక్తునిగాఁ జేయుట.

శంఖమునెత్తి యభిషేకము సేయఁగానే, తమ్ములతోడఁ గూడి యున్న ధర్మరా* జమృతముఖుఁడై చూపట్టెను. పిదపఁ బణవములును, ఆనకములును దుందుభులు నను వాద్యములను వాయించిరి. ధర్మరాజు, నందుఁ జేయఁబడిన కార్యములన్నియు ధర్మంబునఁ బరిగ్రహించెను; మఱియు నవ్వారిగా దక్షిణల నొసంగి విధ్యుక్తముగా వారలను బూజింపనుగూడఁ బూజించెను. అంతఁ జక్కఁగా వేదాధ్యయనము చేసినవారును శ్రుతిమంతులును శీలసంపన్నులు నగు బ్రాహ్మణులను వేయినిష్కము లొసంగి సంతోషపెట్టి వారలచే నాశీర్వాదము చేయించుకొనెను. ఆ బ్రాహ్మణులు సుబ్బునొంది హంసములవలె నింపయిన యెలుంగుల స్వస్తియు జయమును జెప్పి ధర్మరాజుంజూచి 'మహాబాహూ! భాగ్యవశమున జయముగలవాఁడ వయితివి. మహాతేజా! నీ పరాక్రమముచేతనే స్వధర్మమును నీవు పడయుటయు భాగ్యము. పెక్కువీరుల క్షయముగావించి పగవారి నుఱుమాడి యొక కొఱంతయులేక కుశలముగానే యర్జునుఁడును భీముఁడును నకులుఁడును సహదేవుఁడును నీవు నామహాయుద్ధమునుండి విడివడి సుఖంబుండుటయు గొప్ప భాగ్యమే. భారతా! మీఁదఁ జేయవలయుకార్యములనెల్ల శీఘ్రముగానే చేయుము' అని పొగడుచుఁ దెలిపిరి. ఇట్లు సత్పురుషులెల్లఁ బ్రీతిగడలుకొనఁ బూజించుచుండఁగా ధర్మరాజు సుహృదులతోఁగూడ గొప్ప రాజ్యమును బడసినవాఁడయ్యెను. ఇది ముప్పదితొమ్మిదవయధ్యాయము.

---

* అనఁగా మిక్కిలియుఁ గనుఁబండువై.

రాజధర్మపర్వము.

ధర్మరాజు భీమాదులను వారివారికిఁ దగిన యౌవ
రాజ్యము మొదలయిన యధికారములందు
నియోగించుట.

ప్రజలు దేశకాలములకుఁ దగురీతిని జెప్పిన యప్పలుకులు విని ధర్మరాజు 'బ్రాహ్మణోత్తము లందఱును జేరి మాయందు గుణములను, గలవానినో లేనివానినో, చెప్పుచున్నారుగాన పాండవులు తప్పక ధన్యులే. మీ రసూయ మాని మమ్ము నిట్లు గుణసంపన్నులనుగాఁ జెప్పుచున్నారుగాన మేమెల్ల మీదయకుఁ బాత్రులయిన వారమగుట నిక్కమని నా యభిప్రాయము. మా పెదతండ్రి ధృతరాష్ట్రమహారాజు మాకుఁ బరమదైవము. నా ప్రియమును గోరినవా రందఱు నతనియాజ్ఞచొప్పునను నిష్టముచొప్పునను నుండవలయును. గొప్పజ్ఞాతి వధమును గావించియు నితనికొఱకే జీవించియున్నాను. నేనెప్పుడును బ్రాలుమాలక యితనికి శుశ్రూష సేయఁ గోరుచున్నాను. సుహృదు లగుమీకు నాయందు దను గ్రహముకలిమి నిజమేని ధృతరాష్ట్రునియందుఁ దొంటివలెనే మీరు ప్రవర్తింపవలయును. లోకములకును మీకును మాకును నితఁడే రాజు. భూమియుఁ బాండవులందఱును నితనియను గ్రహమందున్నవారు. నేను జెప్పిన యీమాట మీ రెప్పుడును మీ మనసులం దుంచుకొనవలయు' నని చెప్పి పట్టణము నుండియుఁ బల్లెపట్టులనుండియు వచ్చిన ప్రజలనెల్ల నిచ్చలు పోవచ్చునని యనుమతియిచ్చి యౌవరాజ్యమునకు భీమసేనుని నియమించెను. అతఁడు బుద్ధిసంపన్నుండగు విదురుని మంత్రాలోచనమందును గార్యనిశ్చయమందును సంధివిగ్రహాదిషడ్గుణ

ముల యాలోచనమునందును బ్రీతిమీఱ నియోగించెను. సర్వ గుణసంపన్నుండును వృద్ధుండు నగుసంజయుని, చేసినదానిని జేయనిదానిని దెలిసికొనుటయందును, ఆదాయవ్యయము లాలోచించుటయందును, నేర్పఱిచెను. సేనలకొలంది లెక్కించుకొనుటయందును వారు చేయుపనులను బరామర్శించుటయందును వారలతిండివేతనములఁ జూచుకొనుటయందును నకులు నాజ్ఞాపించెను. ఇతరరాజ్యములవలని రాయిడులనును గర్వించినవారిని నడంచుటకు నర్జునుని నియమించెను. బ్రాహ్మణులను దేవతలను నారాధించుటయందును దక్కిన వైదిక కార్యములందును నెప్పుడును నుండునట్లు పురోహితుఁడగు ధౌమ్యున కనుమతి యొసంగెను. సహదేవుని నెప్పుడును దనచెంత నుండున ట్లానతిచ్చెను. సహదేవుఁ డెట్టి సమయమందును రాజును గాపాడశక్తుండగును. మఱియు ధర్మరా జెవ్వరెవ్వ రేయేకార్యములను జేయశక్తులో వారి నాయానియోగములం దుండునట్లు సంతోషంబున నియమించెను. ఆ ధర్మాత్ముఁడు విదురునిని సంజయునిని మహామతియగు యుయుత్సునిని గుఱించి 'నాతండ్రియగు ధృతరాష్ట్రమహారాజుకార్యమును మీరు పాటించి పాటించి చేయవలయును. నా కార్యమునుంబోలె నతనికార్యమునంతయును బరాకునడక మీరు చేయవలయును. పురజనులకుఁ బల్లెటూరివారలకు నయినకార్యముల నన్నింటి నెప్పుడును నతని యనుజ్ఞగొని ధర్మంబునఁ జేయవలయును' అనెను. ఇది నలువది యవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు మృతులయిన జ్ఞాతులు మొదలగు వారికి శ్రాద్ధాదులుగావించి వారిబంధువులను రక్షించుట.

అంత ధర్మరా జుదారబుద్ధిగావున యుద్ధంబున మృతులయిన జ్ఞాతులందఱకును వేలువేల శ్రాద్ధములను జేయించెను. ధృతరాష్ట్రుఁడు తనపుత్రుల నుద్దేశించి మరణానంతర మిచ్చునట్టి పెక్కువస్తువులతోఁగూడిన దైవవు లొలుకుచున్న యన్నమును గోవులను ధనములను మిక్కిలి వెలపొడుగయిన నానావిధరత్నములను దానముచేసెను. ధర్మరాజు ద్రౌపదితోడ మహాత్ముఁడగు ద్రోణునిని, గర్ణునిని, ధృష్టద్యుమ్నునిని, అభిమన్యునిని, ఘటోత్కచునిని, ఉపకారులును సుహృదులునయిన విరాటుఁడు మొదలగువారినిని, ద్రుపదునిని, ఉపపాండవులను గూర్చి వేలువేల గోవులను ధనములను రత్నములను వస్త్రములను వేలకొలఁది బ్రాహ్మణులకొసంగి తృప్తిగావించెను. మఱియును యుద్ధమున హతులయినరాజులను, బంధువులుకాని వారి నుద్దేశించి యుద్దేశించి వారలకు వలయు పరలోక క్రియలు గావించెను. అతఁడు మృతులయిన సుహృదుల నందఱ నుద్దేశించి వారల పరలోకమునకు వలయు పెక్కు సభలను బెక్కు సరస్సులను బెక్కు చలిపందిరులను జేయించెను. ఇట్లారాజుల విషయమై తాను ఋణము లేనివాఁడును లోకులయాడికకు లోను గానివాఁడునై ధర్మంబునఁ బ్రజలను బాలించుచు నతఁడు కృతకృత్యుండయ్యెను. అతఁడు మునుపటివలెనే ధృతరాష్ట్రుఁడు గాంధారి విదురుఁడు మొదలుగాఁ బూజ్యు లయినకౌరవు

లనుఁ దక్కంగల భృత్యులను నందఱను బూజించెను. అతఁడు దయాపరుఁడుగాన యుద్ధంబునఁ బతులను బుత్రులను బాసిన స్త్రీల నందఱను గనికరంబునఁ బూజించి కాచుచు వచ్చెను. మఱియు నతండు మిక్కిలి కరుణయే ముఖ్యముగాఁ గలిగి బీద లు గ్రుడ్డివారు మొదలయిన కష్టజనులకు గృహములు భోజ నము వస్త్రములు మొదలగువాని నొసంగి రక్షించుచుండెను. ఆ ప్రభుండు భూమినంతయు జయించి శత్రువులయెడ ఋణవిము క్తుఁడై విరోధియొక్కఁడును లేక సుఖముగా విహరించుచుండెను. ఇది నలువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు కృష్ణుని శతనామముల స్తోత్రము చేయుట.

ధర్మరాజి ట్లభిషిక్తుఁడై రాజ్యమునుబొంది మహాప్రాజ్ఞుండు గాన పుండరీకాక్షునిఁ జూచి శుచియై చేతులు మోడ్చి 'కృష్ణా! యదుశార్దూలా! నీయనుగ్రహముచేతను, నీతిచేతను, బలము చేతను, బుద్ధిచేతను, నట్టి పరాక్రమముచేతను, బిత్రుపైతా మహమయిన యీరాజ్యమును మరలఁబొందితిని. పుండరీకాక్షా! అరిందమా! నీకు మాటిమాటికి నమస్కారము. పరిశుద్ధులయిన ద్విజులు నిన్నొక్కనినే పురుషుండనియు *సాత్వతులకు పతియని యుఁ జెప్పెదరు; బహువిధములగు నామములచేత స్తుతించెదరు. విశ్వకర్తా! విశ్వాత్మా! విశ్వసంభవా! విష్ణూ! జిష్ణూ! హరీ! కృష్ణా! వైకుంఠా! పురుషోత్తమా! నీకు నమస్కారము. పురా

* భక్తులకుఁ బాలకుఁడని యర్థము.

ణుండవగు నీవదితియందు * నేడుమార్లు గర్భత్వమందుంటివి. నీవొక్కఁడవే పృశ్నిగర్భుఁడవుగా నుండినవాఁడవు. నిన్నుఁ † త్రియుగుఁడనియుఁ జెప్పెదరు. నీవొక్కఁడవే శుచిశ్రవుఁడు, హృషీకేశుఁడు, ఘృతార్చిస్సు, హంసుఁడు, త్రిచక్షువు, శంభుఁడు, విభుఁడు, దామోదరుఁడునని చెప్పఁబడుచున్నావు. నీవే వరాహుఁడవు, అగ్నివి, బృహద్భానుఁడవు, వృషభుఁడవు, తార్క్ష్యలక్షణుఁడవు, అనీకసాహుఁడవు, పురుషుఁడవు, శిపివిష్టుఁడవు, ఉరుక్రముఁడవు, వరిష్ఠుఁడవు, ఉగ్రసేనానివి, సత్యుఁడవు, వాజసనివి, గుహుఁడవు, అచ్యుతుఁడవు, శత్రువులకు చ్యుతిగలిగించువాఁడవు, సంస్కృతుఁడవు, వికృతివి, వృషుఁడవు, కృష్ణధర్ముఁడవు. ఆదివి, వృషదర్భుఁడవు, వృషాకపివి, సింధువవు, విధూర్మివి, త్రికకప్పు, త్రిధాముఁడవు, త్రివృత్తు, అచ్యుతుఁడవు, సమ్రాట్టు, విరాట్టు, స్వరాట్టు, స్వారాట్టు, భూతమయుఁడవు, భవుఁడవు, విభుఁడవు, భువు (భూః), అతిభువు (అతిభూః) కృష్ణుఁడవు, కృష్ణవర్త్ముఁడవు. నీవే స్విష్టకృత్తు, భిషజావర్తుఁడవు, కపిలుఁడవు, వామనుఁడవును. నీవే యజ్ఞుఁడు, ధ్రువుఁడు, పతంగుఁడు, జయత్సేనుఁడనియును జెప్పఁబడుచున్నావు. నీవే శిఖండివి, నహుషుఁడవు, బభ్రువు, దివిస్పృక్కు, పునర్వ

---

* అదితియందు నేడుమార్లు గర్భమగుట యెట్లన- అదితియందు ఆదిత్యులలోఁ బండ్రెండవవాఁడగు విష్ణుఁడును వామనుండునని రెండుమార్లు అదితిరూపాంతరములగు పృశ్ని మొదలగు వారలందు పృశ్నిగర్భుఁడు పరశురాముఁడు దశరథరాముఁడు బలరాముఁడు కృష్ణుఁడనని యేనుమార్లు కానవెరసి యేడు మార్లని తెలియునది.

† త్రియుగుఁడు మూఁడు జంటలు అనగా జ్ఞానశక్తులు, బలైశ్వర్యములు, వీర్యతేజములు అను మూఁడు జతల గుణములు గలవాఁడని యర్థము.

సువు,సుబభ్రువు, రుక్మయజ్ఞుడు,సుషేణుడు, దుందుభియు, నీవు గభస్తినేమి, శ్రీపద్ముడు, పుష్కరుడు, శుష్మధారణుడు, ఋభువు, విభువు, సర్వసూక్ష్ముడు, ధరిత్రియనియుఁ జెప్పఁబడుచున్నావు. అంభోనిధియు నీవే. బ్రహ్మయు, పవిత్రంబగు ధామమును, ధర్మవిదుండును, హిరణ్యగర్భుండును, పురుషుండును, స్వధయు (స్వధా), స్వాహాయును, కేశవుండును నీవే. కృష్ణా! నీవే జగమునకు నుత్పత్తియుఁ బ్రలయమును. నీవే మొదట నీ విశ్వమును సృజించుచున్నావు. విశ్వయోనీ! ఈవిశ్వమును నీవశమందున్నది. శార్ఙ్గమును జక్రమును ఖడ్గమును పాణియందుఁ గలవాఁడా! నీకు నమస్కారము' అని స్తుతించెను. ఇట్లు ధర్మరాజు సభామధ్యమున స్తుతింపఁగాఁ బద్మాక్షుఁడగు యదుశ్రేష్ఠుఁడు కృష్ణుఁడు సంతోషముగడలుకొనఁ బాండవజ్యేష్ఠుఁడగు ధర్మపుత్రునిఁ బూర్ణంబగు శుభవచనంబుల నభినందించెను. ధర్మరాజు కీర్తించిన యీ విష్ణునామశతమును బఠించువాఁడును వినువాఁడును బాపములన్నింటినుండి విడివడును. ఇది నలువదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ధర్మరాజు భీమాదులకు దుర్యోధనాదుల గృహములు నొసంగుట.}

అంత రాజు ధర్మపుత్త్రుఁడచట వచ్చిన ప్రజలనందఱను వీడుకొలుపఁగా వారు తమతమగృహములకుం బోయిరి. పిదప ధర్మరాజు భయంకరపరాక్రముం డగుభీముని అర్జునుని నకులసహదేవులనును జూచి తిన్ననిమాటల బుజ్జగించుచు 'భరతసింహములారా! మహాయుద్ధమందు శత్రుల పెక్కులాయుధములచేఁ

దేహములు గొట్టువడియున్నవి. శోకమునను గోపమునను దాపమునను మీరు మిక్కిలి యలసిసొలసి యున్నారు. నన్నుఁ బట్టి మీరు మిక్కిలి తక్కువవారలుంబోలె నడవికిం జని దుఃఖం బగు మనికి ననుభవించితిరి గదా ? కాఁబట్టి యిఁక మీకు సుఖ మగునట్లును, మీయిచ్చవచ్చినట్లును, ఈజయమువలనిఫలమును ననుభవింపుఁడు. మీ తలపుఁ దీర్చుకొని పూమీకరణపటుత్వము లను మరలఁ బూర్ణముగా నొందుఁడు. రేపు వేకువను మిమ్ముఁ గలసెదను' అనెను. అంత నింద్రుఁడు తనమందిరమును బొంది నట్లు మహాబాహుం డగుభీముఁడు ధృతరాష్ట్రుని యనుజ్ఞగొని తనయన్న యొసంగినదుర్యోధనునిగృహమును బొందెను. అది యుప్పరిగలచేత నొప్పుగులుకుచు, పలువిధముల రత్నములచేఁ బర్వి దాకసిలును దాసులును నెరసి బెరసియుండ మొఱయు చుండెను. అర్జునుఁడు రాజు నాజ్ఞచేత దుశ్శాసను భవనమును బొందెను. అదియు నుప్పరిగల వరుసలతోఁగూడి బంగారుతోర ణములచే రంగారుచు దాసీదాసులచే నిండి, ధనధాన్యము లవ్వా రిగాఁ గలిగి దుర్యోధనునిగృహమువలెనే వెలుంగుచుండెను. మహారాజు ధర్మపుత్రుఁడు నకులునకు దుర్మర్షణుని భవనము నొసంగెను. అది దుశ్శాసనుని గృహమునకంటె మేలయినది. అది రత్నములచేతను బంగారముచేతను నలంకృతమై కుబేరుని భవనమువలెఁ జూపట్టుచుండెను. నకులుఁడు పేరడవియందు నలజడిచే స్రుక్కియున్న వాఁడుగాన యది యతనికే మిక్కిలి తగియుండుటంబట్టి రాజు ప్రీతిమీఱ నా భవనము నతనికొసం గెను. పిదపఁ దనకు నెప్పుడును బ్రియములాచరించుచుండు సహ దేవునకు దుర్ముఖుని మేటిభవనము నొసంగెను. అది కాంతిపెం

పుసాంపారుచు, బంగారముచే సింగారింపఁబడి, తామరఱేకుల వంటి వెడందఁగన్నుంగవలఁ జెన్నారుచిన్నారిపూవుఁబోండ్లను మేలిపూసెజ్జలును నెరయఁగలిగి యుండెను. నకులుఁడు దానిని, కుబేరుఁడు కైలాసముఁ బొందినట్లుంబోలెఁ,బడసి యెంతయు ముదమునొందెను. యుయుత్సుండును విదురుండును సంజయుండును సుధర్ముఁడును *ధౌమ్యుఁడును దమతమగృహములకుఁ బోయిరి. పురుషవ్యాఘ్రుం డగు కృష్ణుండు సాత్యకింగూడి వ్యాఘ్రము పర్వతగుహంబోలె, యర్జునునిభవనమును బ్రవేశించెను. అం దుఁ బలువిధములయిన భక్ష్యములచేతను నన్నములచేతను బానీయములచేతను వారందఱును ముదమొంది యారాత్రి మిక్కిలి సుఖంబుగా వసించియుండి వేకువను హాయిగా మేలు కొని రాజగుధర్మపుత్రునికడకు వచ్చినవారయిరి. ఇది నలువది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ ధర్మరాజు ప్రజలకును బంధువులకును ధనాదు లొసంగి కృష్ణునిఁ గుశలప్రశ్నము చేయుచు స్తుతించుట. }

జనమేజయుఁడు వైశంపాయనునితో 'మహర్షీ ! ధర్మరాజు రాజ్యమును బడసినపిదప మఱియు నేమిచేసెను ? ముల్లోకము లకును బరమగురుం డయినభగవంతుఁడు కృష్ణుం డేమిచేసెను?

---

* ఇట ధౌమ్యుఁ డెప్పటియట్లు హస్తినాపురమునఁ దనగృహమునకుఁ బోయెననుట యెట్లు ? అతనికి ముం దాపట్టణమున సుధర్మునకుంబోలె గృహ ముండుట విచార్యము.

వీనిని నాకు వివరించిచెప్పు'మనెను. వైశంపాయనుఁడు 'అనఘా! వాసుదేవుని మున్నిడికొని పాండవు లేమిచేసిరో కలరూపునఁ జెప్పెదను వినుము. ధర్మరాజు రాజ్యమును బడిసినపిదప సకల వర్ణములవారిని నడంకువతోఁ దమతమధర్మంబులందు వర్తించు నట్లు దిట్టపఱిచెను. అతఁడు మహాత్ము లయినస్నాతక బ్రాహ్మ ణులను వేగురి నొక్కొక్కరికి వేయినిష్కము లిచ్చి, దృప్తి గావించెను. అట్లె కొలిచి బ్రతుకుభృత్యులను నాశ్రితులగు నతిథులను బీదలను గుఱిచెప్పువారలను(తార్కికులను) నందఱను వారికోరికలనెల్ల నిచ్చి తృప్తులను గావించెను. అతఁడు పదు నాలుగువేలగోవులను, ధనమును, బంగారమును, వెండిని, నానా విధవస్త్రములను, బురోహితుం డగుధౌమ్యునకు దానముచేసె ను. మఱియుఁ గృపుఁడు విదురుఁడు మొదలయినవారిని దండ్రు లంబోలెఁ బూజించి సంతుష్టులను గావించెను. ఆధర్మపుత్రుఁడు దాతలందు మిన్నగావునఁ దన్నాశ్రయించిన వారినందఱను బలు విధములయిన భక్ష్యములచేతను నన్నములచేతను బానములచే తను, వస్త్రములు శయనములు ఆసనములు మొదలయినవాని చేతను, సంతోషింపఁజేసెను. అంత నారాజు * లభించిన ధనా దులకు దానియందలి కొంతభాగము పాత్రములకునొసంగుటచేత శాంతికము గావించి యుయుత్సునిని ధృతరాష్ట్రునిని దగినట్లు సత్కరించెను. అతఁడు ధృతరాష్ట్రునికిని గాంధారికిని విదురున కును రాజ్యమును నివేదించి దాను నెమ్మదినొంది సుఖంబుం డెను. అట్లు పట్టణమువారిని దక్కనవారినందఱను మనస్సుకలంక

---

* ఇందులకు 'లబ్ధప్రశమనం కృత్వా' అని మూలము. 'దీనికి రాజ్యమందు నిమ్మళపాటును లభించునట్లు చేసి' యని ప్రతాపచంద్రరాయల వ్యాఖ్య.

లేకుండునట్లుచేసి యంత ధర్మరాజు చేదోయి గీలించి మహాత్ముం డగుకృష్ణునికడకుఁబోయెను; అట మేరుపర్వతమున నున్ననల్ల నిమేఘమువలె రత్నములుదాపిన పెద్ద బంగారుమంచముపయి నాసీనుండై యున్న కృష్ణునిఁగాంచెను. అతఁడు దివ్యాభరణ భూషితుండై తనదివ్యదేహముచేతనే యెంతయు తలతల మెఱయు చుండెను. అతఁడు పచ్చనిపీతాంబరము గట్టి, బంగారముచేతఁ బొదిఁగిన నీలమణివలె వెలుంగుచుండెను. అతని వక్షఃస్థలము నందున్న కౌస్తుభమణి యుదయపర్వతమునం దుదయించు చున్న సూర్యునివలెఁ దేజరిల్లుచు నతని కెంతయు సొంపుగూర్చు చుండెను. అతనికి ముల్లోకములందును సాటియేదియుఁగలుగదు. ఆధర్మరాజు పురుషోత్తముండును మహాత్ముండు నగువిష్ణువును జేరి చిఱునవ్వుదొలఁకు తియ్యనిపలుకుల నతనితో 'బుద్ధిమంతులయం దు మేలుబంతీ! ఈరాత్రి నీకు హాయిగాఁ దెల్లవాఱెనే కదా? అచ్యుతా! నీజ్ఞానేంద్రియములన్నియుఁ దెలివినొందెనా? అట్లే నిన్నుఁబొంది ప్రకాశించుచున్నబుద్ధియుఁ దేటనొందెనా? *త్రిలోకములగతియైన వాఁడా! త్రివిక్రమా! నీ యనుగ్రహము చేత మేము రాజ్యమునొందితిమి. భూమి మావశమందున్నది. జయమును మేలయినకీర్తియుఁ గలిగినవి. ధర్మమునుండి చ్యుతులము కామయితిమి' అనెను. ధర్మరా జిట్లుచెప్పుచున్నను గృష్ణుఁ డేమియుఁబలుకక ధ్యాననిష్ఠయందే యుండెను. ఇది నలువది నాలుగవయధ్యాయము.

---

* 'త్రిలోకగతివిక్రమ' అనిమూలము. 'త్రిలోకగతవిక్రమ' అను పాఠమున మూఁడులోకములను బొందిన పరాక్రమముగలవాఁడా యని యర్థము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజును ధర్మములు వినుటకై భీష్ముని కడకుఁ బొమ్మని చెప్పి తాను నతనిప్రార్థనచే భీష్మునికడకుఁ బోఁ బూనుట.

ధర్మరాజు, 'మహాపరాక్రమశాలీ! నీవేమో ధ్యానించుచున్నావే! ఇది యెంతో యాశ్చర్యముగా నున్నది. లోకపరాయణా! ఈ మూఁడులోకములకును శుభమేకదా! నీయింద్రియములును మనస్సును బుద్ధియందుఁ జొప్పింపఁబడి (లయించి) యున్నవి. * జాగ్రత్తు స్వప్నము సుషుప్తి యనెడు మూఁడవస్థలకు నవ్వలిదైయైన నాలుగవధ్యానావస్థ నూఁది స్థూలసూక్ష్మకారణము లనుమూఁడుశరీరములకు నవ్వల నీజీవుఁడుండుటకు నామనసు మిక్కిలి యాశ్చర్యపడుచున్నది. శరీరమునందు నెలకొన్న యైదువిధములగు ప్రాణవాయువులును నడఁపఁబడియున్నవి. మీయింద్రియము లన్నియు మనస్సునందు నెలకొల్పంబడియున్నవి. వాక్కును మనస్సును మహత్తత్త్వమను సమష్టిబుద్ధియందుఁ జొనుపఁబడియున్నవి. శబ్దాదిగణములును దానిని దెలియు నింద్రియములు నాత్మయం దడఁగియున్నవి.

---

* 'అష్రకాన్తో యతో జీవస్తేన మే విస్మితంమనః' అని (దా. మూ) 'యతో దేవ తేన' అని (ఔ. మూ). జాగ్రత్తు స్వప్నము సుషుప్తి అనుమూఁడవస్థలును సామాన్యజనులకుఁగలుగును. నాలుగవదియగు తురీయావస్థ యోగులకుఁ గలుగును. ఆయవస్థయందుఁ బ్రపంచమంతయు నెంతమాత్రమును తోఁపక యాత్మయందంతర్గతమగు తనయందో బ్రహ్మమునందో నెలకొనునని అద్వైతసిద్ధాంతము. మనస్సు ఇంద్రియముల కధిష్ఠానమయిన యొక యింద్రియము. బుద్ధి విమర్శన సాధనమయి యంతఃకరణచతుష్టయములో నొక్కటియగును.

యోగస్థితియందున్న నీబుద్ధియు మనస్సును మేనియందలి రోమములును గదలక స్థిరములై యున్నవి. మాధవా! కట్టెయువలెను గొండవలెను జాతివలెను నే చేష్టయులేక యున్నావు. అచ్యుతా! దేవా! గాలిలేనిచోటఁ గలదీవము కంపములేక వెలుంగునట్లు సమాధియందు స్థిరుఁడై కదలక మెదలక వెలుంగుచున్నావు. ఇది యెందులకో వినుటకు నేను దగుదునేని, నీకును నిది వెలిపుచ్చఁ దగునేని, నిన్నుఁజెంది వేఁడుచున్న నాకు నీ సందేహమును ద్రుంపుము. పురుషోత్తమా! నీ వీ లోకమును సృజించువాఁడవును; ద్రుంచువాఁడవును. నీవే *క్షరమును నక్షరమును. నీ వాదియు నంతమును లేనివాఁడవు. అన్నిటికంటె నాద్యుఁడును నీ వొక్కఁడవే. ధర్మపాలకులందు మేటివి గదే! నిన్ను శరణొంది శిరస్సుచేఁ బ్రణతుండ నయిన నీభక్తునికి నాకు నీ యీధ్యానము కలరూపును జెప్పుము' అనెను. అంతఁ గృష్ణుడు మనోబుద్ధీంద్రియములను, వానివాని పట్టులయందుంచికొని చిఱునవ్వుతోడ ధర్మరాజుం జూచి 'ఆఱిపోవుచున్న యగ్నివలె శరతల్పగతుండై యున్నపురుషసింహుఁడు భీష్ముఁడు నన్ను ధ్యానించుచున్నాఁడు. కాన నామనస్సు నతనికడకుఁబోయినది. పిడుగుమ్రోఁతవలె నులియునెవ్వని యల్లెత్రాటిధ్వనిని నింద్రుఁడు నయితము సయింపఁజాలఁడో యాభీష్మునియందు నామనస్సు పోయినది. ఎవ్వఁడు తొల్లి రాజసమూహమునంతయు బలిమిచే జయించి ముగ్గురు కన్నియలను వరించి తెచ్చెనో వానికడకు నామనసుపోయినది. ఎవ్వఁ డిరువది మూఁడురాత్రులు పరశురామునకుఁ బోరాటమిచ్చెనో, అప్పు

* నిత్యవస్తువులును అనిత్యవస్తువులును.

టికి నారాముఁడెవనిని మీఱలేకపోయెనో, యట్టివానియెడకు నామనసుపోయినది. అయ్యా ! ఏభరతతిలకుని గంగ తన గర్భమందుఁ దాల్చికనెనో యావసిష్ఠశిష్యునియెడకు నామనసుపోయినది. ఏబుద్ధిమంతుఁడు మిక్కిలియుఁ దేజంబురాజిల్ల దివ్యాస్త్రములను మఱిసాంగములగు చతుర్వేదములను దాల్చెనో యాతనికడకు నామనస్సుపోయినది. అతఁ డింద్రియముల నొక్కటిగాఁజేసి మనస్సును బుద్ధితోఁ గూర్చి నన్ను శరణుఁజొచ్చినాఁడు. కాఁబట్టి యతనికడకు నామనసుపోయినది. అతఁడుజరిగినదియు జరుగనున్నదియు నెఱుఁగును. అతఁడు ధర్మవిదులందు తలయున్నచుమీ; కాన యతనికడకు నామనసుపోయినది. పురుషసింహుండును మహాత్ముండు నయినయాభీష్ముఁ డడఁగిపోయెనేని భూమి చంద్రుఁడు లేని రాత్రివలె నగునుజుమీ. కాఁబట్టి ధర్మరాజా! గంగాపుత్రుండయినయాభీమునికడకుఁ బోయి మ్రొక్కి పాదములు పట్టుకొని ధర్మార్థకామమోక్షములను, వైదికధర్మంబును, నాలుగాశ్రమములను క్షత్రియధర్మముల నన్నింటిని మఱియు నీమనసునందుఁ గలదానిని నడిగి తెలిసికొనుము. కౌరవులకెల్ల మునుపటివాఁడగు నాభీష్ముఁ డస్తమించెనా, లోకమందు జ్ఞానములు మిక్కిలికుఱుచలగును. కాఁబట్టి యతనికడకుఁబొమ్మని నినుఁబురికొల్పుచున్నాను' అనెను. కృష్ణుఁడు చెప్పినయా మేలిమాటలను యథార్థములయినవానిని విని ధర్మరాజు కన్నీటిచేనెలుంగు డగ్గుత్తికవడ నతనితో 'మాధవా ! భీష్ముని ప్రభావమునుగుఱించి నీవు చెప్పినదంతయు నిజమే. అందునాకు సందేహములేదు. మహాతేజా! భీష్ముని ప్రభావమును నతనిమహాభాగ్యమును మహాత్ము లయినబ్రాహ్మణుల మూలమున నాకు వినికిగలదు. శత్రునిషూదనా ! లోకములకుఁ

గర్తవగునీవును నిట్లె చెప్పుచున్నావు. యదునందనా! నీమాట నిజమాయని విచారింపను వలయునా? మాధవా! నన్ననుగ్రహింపవలయునని తలంపు నీకుఁ గలదేని నిన్ను మున్నిడికొనియే మేము భీష్మునియొద్దకుఁ బోవుదుము. సూర్యుఁడుత్తరాయణమునకుఁ దిరుగఁగానే యతఁడు లోకాంతరము నొందఁగలఁడు. కాఁబట్టి నీ దర్శనమతనికిఁ బడయఁదగును. లోకంబుల కాద్యుఁడును క్షరాక్షరరూపుఁడును నగు దేవుని నీదుదర్శన మతనికిఁ బెద్దలాభము. నీవు బ్రహ్మమయంబగు నిధివేకదా' యనెను. అదివిని కృష్ణుఁడు ప్రక్కనున్న సాత్యకునిఁజూచి 'నా తేరి నాయిత పఱుపు' మనెను. తోడనే సాత్యకి కృష్ణునిపొంతనుండి శీఘ్రముగా వెలికి వచ్చి దారుకునితో 'శ్రీకృష్ణులరథ మాయితపఱుపు' మనెను. అదివిని దారుకుఁడు కృష్ణుని రథమాయితపఱచెను. అందలి యంగములెల్ల బంగారుచే నలంకృతములై యుండెను. మరకతమణుల చేతను జంద్రకాంత సూర్యకాంతమణులచేతను నందందు రచితములై విభంగములు వెలుగుచుండెను. దానిచక్రములు బంగారు కట్లు గలిగియుండెను. అది సూర్యునికాంతివలె ధగధగ వెలుంగుచు నాశ్చర్యకరము లయిన పెక్కురత్నములచేత నలంకృతమగు మధ్యభాగముగలిగి క్రొత్తగా నుదయించిన సూర్యమండలమువలెఁ బ్రకాశించుచుండెను. దానికి సొగసయిన గరుడధ్వజమును బతాకలును గట్టంబడియుండెను. మిక్కిలియు వేగముగాఁ బఱచునట్టి యామేటిరథమునకు బంగారుసొమ్ములుదాల్చినవై మనోవేగములగు శైబ్య సుగ్రీవాదులగు నుత్తమాశ్వములను బూన్చి తేరాయితమయ్యెనని దారుకుఁడు కృష్ణునికడకువచ్చి చేతులు

మోడ్చి నిలిచి విన్నవించినవాఁడయ్యెను. ఇది నలువదియైదవయ ధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు కృష్ణునిఁ బలుమాఱు స్తుతించుట. కృష్ణ ధర్మపుత్రాదులు భీష్ముని కడకువచ్చుట. భీష్ముఁడు కృష్ణుని దర్శించి ముక్తినొందుట. }

జనమేజయుఁడు వైశంపాయనునితో 'పాండవుల పితామహుండు భీష్ముఁడు శరతల్పంబునం బరుండి యెట్టియోగసమాధి నొందెను? ఎట్లు దేహమునువిడిచెను? జెప్పుము' అని యడిగెను. వైశంపాయనుఁడు 'రాజా ! మహాత్ముండగు భీష్ముఁడు శరీరమును విడిచినవిషయమును శుచివై యాలించివినుము. సూర్యుఁడుత్తరాయణమునఁ బ్రవర్తింపఁగానే మాఘమాసమున శుక్లపక్షము సప్తమియందు మృగశీర్షానక్షత్రము నడిమిభాగమును సూర్యుఁడు పొందినపుడు భీష్ముఁడు సమాధినొంది మనంబు నాత్మయందే లయింపజేసెను. వందలకొలఁది బాణములు పర్వియున్న దేహముతో భీష్ముఁడు పెక్కులు కిరణములు పర్వుచున్న సూర్యమండలమువలె మిక్కిలి కాంతిగలిగి వెలుంగుచుండెను. వ్యాసుఁడు, దేవశ్రవుఁడు, నారదుఁడు, దేవస్థానుఁడు, వాత్స్యుఁడు, సుమంతువు, అశ్మకుఁడు, జైమిని, పైలుఁడు, శాండిల్యుఁడు, దేవలుఁడు, మైత్రేయుఁడు, అసితుఁడు, వసిష్ఠుఁడు, కౌశికుఁడు, (విశ్వామిత్రుఁడు) హారీతుఁడు, లోమశుఁడు, ఆత్రేయుఁడు, బృహస్పతి, శుక్రుఁడు, చ్యవనుఁడు, సనత్కుమారుఁడు, కపిలుఁడు, వాల్మీకి, తుంబురుఁడు, కురుఁడు, మౌద్గల్యుఁడు, పరశురాముఁడు, తృణ

బిందుఁడు, పిప్పలాదుఁడు, వాయువు, సంవర్తుఁడు, పులహుఁడు, కచుఁడు, కాశ్యపుఁడు, పులస్త్యుఁడు, క్రతువు, దక్షుఁడు, పరాశరుఁడు, మరీచి, అంగిరస్సు, కాశ్యుఁడు, గౌతముఁడు, గాలవుఁడు, ధౌమ్యుఁడు, విభాండుఁడు, మాండవ్యుఁడు, కృష్ణానుభౌతికుఁడు, ఉలూకుఁడు, మార్కండేయుఁడు, భాస్కరి, పూర్ణుఁడు, కృష్ణుఁడు, సుధర్ముఁడు మొదలయినవారును, శ్రద్ధ, శమము, దమము, మొదలగు సుగుణములు గలవారును, మహాత్ములునగు పెక్కు ఋషుల సమూహములచేఁ బరివృతుం డయినభీష్ముఁడు, గ్రహనక్షత్రములచేఁ బరివృతుం డగుచంద్రునింబోలెఁ బ్రకాశించెను. ఆపురుషసింహుండు శరతల్పంబున నుండి శుచియై చేతులు మోడ్చికొని మనోవాక్కాయంబులచేత శ్రీకృష్ణుని ధ్యానించి జగత్పతియు,మధుసూదనుండును,యోగేశ్వరుండును, పద్మనాభుండును, జిష్ణుండును, అనాదినిధనుండును, ఆత్మయోనియు, సనాతనుండును, నగు వాసుదేవునిఁ గృష్ణుని నుబ్బునఁ జెలంగు నెలుంగున నిట్లు స్తుతింపఁ దొడంగెను. మాటకారులందు మిన్నయగు నాపరమధర్మాత్ముండు భీష్ముఁడు వాసుదేవు నిట్లు స్తుతించెను. 'శ్రీకృష్ణు నారాధింపఁగోరి సంగ్రహముగను విస్తరముగను నేను జెప్పఁదలంచుమాటకు నా పురుషోత్తముఁడు సంతోషించుఁగాక. శుచియు, శుచియగుపదము (స్థానము) గలవాఁడును, హంసుండును (ఉత్తమపదమందుండువాఁడును), తత్పరుండును (సమస్తమునకు నధికుఁడయినవాఁడును) పరమేష్ఠియు, ప్రజాపతియు నగు నాపరమాత్ముని నాయాత్మయంతటితో నొక్కటిగా యోగసమాధిచేఁ జేర్చి శరణమొందుచున్నాను. దేవతలును ఋషులును, ఆద్యంతములులేని పరబ్ర

హ్మాము నెఱింగినవారుగారు; లోకమును సృజించిన భగవంతుఁ డగునారాయణుఁ డొక్కఁడే యెఱుఁగును. దుఃఖములకు నౌషధ మయిన యీపరబ్రహ్మమును దేవతలును, దేవర్షులును, సిద్ధులును, దక్కిన ఋషిసమూహములును, మహోరగులును, నారాయణునివలననుండి తెలిసికొనిరి. దేవతలును. అసురులును, గంధర్వులును, యక్షులును, రాక్షసులును, పన్నగులును, నందఱును 'ఇతఁడెవఁడు ? ఎక్కడనుండి కలిగెను ? భగవంతుఁడెట్లయ్యె ?' నని కలరూపును దెలిసినవారుగారు. * వలయందుఁ బిట్టలడంగి యుండునట్లు, ఈలోకములును బ్రజలును నతనియం దడంగి వెలుంగుచుండును. కాన యతఁడు జగమునకుఁ గోశమనఁబడుచున్నాఁడు. గుణ(శేష)భూతము లయినయీ లోకము లన్నియును దారమునఁ గ్రుచ్చిన మణిగణములవలె భూతేశుండగు నతనియందు నెలకొనుచున్నవి; లయించుచున్నవి. అధ్యాత్మతత్త్వముల విచారించునిపుణు లతనిని విశ్వమున కంతయుఁ గర్తగాను స్థావరజంగమములకుఁ బతిగాను జగంబున కధ్యక్షునిఁగాను జెప్పెదరు. విశ్వము నంగములుగా (దేహముగాఁ) గలిగి, విశ్వమును బనిగానుగలిగి, నిత్యుఁడై, యంతట వ్యాప్తుఁడై, యుండు నతనియందు గట్టిదారము పోఁగునందుఁ బూదండపూలవలె, విశ్వమందలి చేతనాచేతనములు గ్రువ్వంబడియున్నవి.

---

* 'యమాహుర్జగతః కోశం యస్మింశ్చనిహితాః ప్రజాః । యస్మిన్లోకాః స్ఫురన్త్యేతే జాలే శకునయోయథా' అనిమూలము. కౌ. మూలమున 'జలే శకునయోయథా' యనిపాఠము. 'నీవుజగమునకుఁ గోశము. నీయందుప్రాణు లుంపఁబడియున్నారు. జలమందు హంసాదిపక్షులవలె నీయందు లోకములు దేలుచున్నవి' అని యర్థము.

కిరీటములు గలవేయిశిరసులు గలవాఁడును, వేయికరములును జరణములును నేత్రములును గలవాఁడును, వేయిముఖముల వెలుంగువాఁడును, జగంబునకుఁ బరమగతియు నగు దేవుని నారాయణుండని పలుకుదురు. అతఁ డణువులలో మిక్కిలి యణువుగాను బెద్దవియగువానిలో మిక్కిలి పెద్దవాఁడుగాను, బరువయినవానిలో మిక్కిలి బరువైనవాఁడుగను, గొప్పవానిలో మిక్కిలి గొప్పవాఁడుగను నున్నాఁడు. వాకములందును (మంత్రములందును), అనువాకములందును (బ్రాహ్మణములందును), నిషత్తులందును (ఉపాసనావిధులందును), ఉపనిషత్తులందును, సత్యంబగు (అమోఘంబగు) కర్మములుగలవాఁడుగను సత్యప్రతిపాదకములగు సామములందు సత్యముగాను జెప్పఁబడుచున్నాఁడు. హృదయమందు నెలకొని, యుపాసకులగు భక్తులనుబాలించుచు (వాసుదేవసంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులను) నాలుగురూపములు గలిగిన యద్దేవుని,దివ్యములును రహస్యములు నగునాలు'గు పరమనామములచేతఁ బేర్కొనుచున్నారు. తపము లతనియందే యెప్పుడు నలుపఁబడియుండును. తపము లతనియంగములందు నెలకొనియుండును. అతండు సర్వాత్ముఁడు, సర్వవ్యాపి, సర్వమయుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వకర్త. భూమియందు బ్రహ్మావాచకములయిన వేదమును యాగములను గాచుకొఱకు దేవకి యతనిని, అరణి యగ్నినింబోలె, వసుదేవునివలనఁ గాంచినదయ్యె. అమృతత్వము (మోక్షము) నొందుకొఱకు నితరములను గొలువక నతనినే గొలుచువాఁడు మనస్సు నితరములనుండి మరల్చుకొని యాశలన్నియునువీడి కల్మషరహితుం డయినయాపరమాత్ముని, యోగముచే హృదయాకాశమందుఁ జూచుచున్నాఁడు.

ఇట్టట్టని తర్కింపను దెలిసికొనను నలవి గానివాఁడు; అంతటను వ్యాప్తుఁడయినవాఁడు; వాయువును నింద్రుని నతిశయించినకర్మములు గలవాఁడు; సూర్యాగ్నులను మించిన తేజము గలవాఁడు; బుద్ధికి నింద్రియములకును గోచరింపని స్వరూపముగలవాఁడు; ప్రజలకుఁ బాలకుఁడు నగునట్టి నారాయణుని శరణుఁజొచ్చెదను. పురాణములందుఁ బురుషుం (సర్వవ్యాపి) డనియు, యుగాదులందు బ్రహ్మంబనియు, ప్రలయమందు సంకర్షణుండనియు, చెప్పఁబడినవాఁడును నుపాస్యుఁడు నగునతనిని నుపాసించుచున్నాను. ఒక్కండయ్యును బెక్కురూపముల నవతరించువాఁడును, అధోక్షజుండును, ఇంద్రియనులచేఁ దెలియరానివాఁడును, సమస్తకామములనొసంగువాఁడును, నగునతని నితరములను గొలువని భక్తులు విహితములగు కర్మముల నాచరించుచు యజించుచున్నారు. సత్యుండును, ఏకాక్షరమగు నోంకారస్వరూపుఁడును, బ్రహ్మమును, సదసత్తులకుఁ బరుండును, ఆదిమధ్యాంతములు లేనివాఁడు నయినయాయీశ్వరుని దేవతలును ఋషులు నిక్కముగా నెఱుంగరు. దేవతలును, అసురులును, గంధర్వులును, సిద్ధులును, ఋషులును, ఉరగులును నందఱును ప్రయతులై సుఖమునకు భేషజమయిన యాపరముని నెప్పుడును నర్చించుచుందురు. ఆదియు నంతములేనివాఁడును, దేవుఁడును, సనాతనుఁడును, చూడను దెలియనివాఁడును, తనకుఁ దానే కారణమైనవాఁడును, ప్రభుండును, నారాయణుండు నగు హరి నందఱును బూజించుచున్నారు.

భీష్మస్తవరాజము.

దైత్యులను నాశముసేయఁగోరి యదితియందు బంగారు

వర్ణముగల లోకగర్భముగానుండి పండ్రెండువిధములుగా వెలికి వచ్చిన సూర్యుఁడుగా వెలుంగు నాభగవంతునికి నమస్కారము. శుక్లపక్షమందు దేవతలను గృష్ణపక్షమందుఁ బితరులను నమృతముచేఁ దృప్తులఁ జేయించినవాఁడును, ద్విజులకు రాజును, సోమరూపుండు నగునాభగవంతునకు నమస్కారము. అగ్ని మొదలయిన దేవతలచేత ధరింపఁబడు నీజగమునందు మొదటి హావిస్సును భుజించు హోతయను రూపముగల యాదేవునకు నమస్కారము. అజ్ఞానమనెడి పెనుచీఁకటికి నవ్వలయై యెందును నిండి యున్నయపార తేజమై వెలుంగు నేపురుషునిఁ దెలిసినవాఁడు మృత్యువును గడచునో యాదెలియఁదగిన వస్తువు (జ్ఞేయము) అగువానికి నమస్కారము. సామగులు బృహత్తను సామమందును, ఋగ్వేదు లుక్థమనుమంత్రమందును, యజుర్వేదుల గ్నిచయనమను మహాయజ్ఞమందును, నుపాసించు నట్టివాఁడును, మిక్కిలి యురువైనవాఁడును, వేదస్వరూపుండు నగునతనికి నమస్కారము. పదములను గాలు మొదలయిన యంగములుగాను, ఆపదములసంధులను వ్రేలికణుపులుగాను, అచ్చులను హల్లులను భూషణములు గాను, గలయక్షరస్వరూపుఁడుగను వాగ్రూపుఁడుగను బ్రాహ్మణులు చెప్పు నతనికి నమస్కారము. ముల్లోకముల హితముకొఱకు యజ్ఞాంగుఁడగు వరాహరూపుండై భూమి నుద్ధరించిన వీర్యస్వరూపుం డగునతనికి నమస్కారము. ఋగ్యజుస్సామములను మూఁడువేదముల నాధారముగాఁ గలదియు ధాన, కరంభము, పరివాపము, పురోడాశము, పా లనెడు పంచవిధహవిస్సులుగలదియు, గాయత్రి మొదలయిన యేడు ఛందస్సులుగలదియు నుగాఁ గావింపఁబడు యజ్ఞము స్వరూపముగాఁ గలవానికి నమ

స్కారము. (ఆశ్రావయ) అని నాలుగును, (అస్తుశ్రౌషట్) అని నాలుగును, (యజ) అని మూఁడును. (యేయజామహే) అని యైదును, (వషట్) అని రెండును నక్షరములుగల మంత్రములచేఁ గావింపఁబడు హోమము రూపముగాఁగల యాతనికి నమస్కారము. గాయత్రి మొదలయిన ఛందస్సు లంగములుగాను, యాగమును శిరసుగాను, *రథంతరము బృహత్తను సామములు ఱెక్కలుగాను, గల యజుర్వేద మనుపక్షిరూపమున వెలుంగుచు స్తోత్రరూపుఁ డగు నా భగవంతునకు నమస్కారము. విశ్వసృజు లను ప్రజాపతులు వేయేండ్లు చేసినసత్రయాగమందు బంగారు ఱెక్కలు గలగరుడపక్షిగా నావిర్భవించిన ఋషియగు నాభగవంతునకు నమస్కారము. ధర్మార్థను ముక్తి హేతువగు వేదము నందలి యుపాయము సాధువు లింద్రియములనడంచి పొందఁదగు యోగధర్మ మనుసేతువును గట్టినసత్యరూపుఁడగు నాభగవంతునికి నమస్కారము. వేఱువేఱు ప్రయోజనములనుగోరి వేఱువేఱయినయాచారములతోడ వేఱువేఱుకర్మములచే నారాధింపఁబడు ధర్మరూపుండగు నాభగవంతునకు నమస్కారము. ప్రాణులు సమస్తములును గలుగుటకుఁగారణమును, అవి తమయంగములందు మరులుగొని యున్మాదులగుటకుఁ గారణమును, నయిన యా కామరూపియగు భగవంతునకు నమస్కారము. ఇంద్రియములకు గోచరించు శరీరమందుండియు మహర్షులకును వెదుకఁదగినంత సూక్ష్మరూపియై యీ దేహమునకు సాక్షియై బుద్ధివలన వెలుంగు క్షేత్రరూపియైన యాతనికి నమస్కారము. 'ఐదుజ్ఞా

---

*రథంతరబృహాత్పక్షః అని(దా.మూ) 'రథంతరబృహత్సామ' అని(ఔ.మూ) రథంతర మనుగొప్పసామధ్వని గలదియని యర్థాంతరము.

నేంద్రియములు, ఐదుకర్మేంద్రియములు, మనసు, ఐదుభూతములు ననెడి యీ పదియాఱింటిచేతను నావరింపఁబడియుఁ దన స్వరూపముమాఱక పదియేడవదియగు జ్ఞానరూపమై వెలుంగుచున్నాఁడు' అని సాంఖ్యులు చెప్ప సాంఖ్యరూపుఁ డయినయా భగవంతునకు నమస్కారము. ఇంద్రియములనడంచి శ్వాసమును గెలిచి నిదురవీడి సంతోషమున యోగమును జేయువారలకు జ్యోతిగాఁజూపట్టు యోగరూపుఁ డయినయతనికి నమస్కారము. సమస్తమును దిగవిడిచి శాంతులయిన సన్న్యాసులు పుణ్యపాపములను రెంటిని విడిచి పునర్జన్మ మనుభయములేక దేనిని బొందెదరో యామోక్షము రూపముగాఁగలభగవంతునకు నమస్కారము. అగ్ని ముఖమును, స్వర్గలోకము శిరసును, ఆకాశము నాభియు, భూమి పాదమును, సూర్యుఁడు కన్నును, దిక్కులు చెవులును, ఈలోకములు శరీరమునుగాఁగల యాభగవంతునకు నమస్కారము. నెల, ఋతువు, అయనము, సంవత్సరముననను పెక్కు లంశములచే యుగములందుఁ జుట్టుచుండువాఁడును, సృష్టిప్రలయములు చేయువాఁడును నగు కాలము రూపముగాఁ గలయతనికి నమస్కారము. వేయియుగములతుదిని మిక్కుటముగా జ్వలించుచున్నజ్వాలలు గలయగ్నియై లోకములను గాల్చు కఠోరరూపుఁ డయినయాతనికి నమస్కారము. సమస్తభూతములను దహించి లోకమంతయు నేకార్ణవముగాఁ జేసి తా నొక బాలునిరూపమున నిదురపోవు మాయారూపుఁ డయినయాతనికి నమస్కారము. నాలుగు సముద్రముల నడుమ వేయితలలుగలిగి సాటిలేని మేను గలపురుషుండయి యోగనిద్ర సేయు నా భగవంతునికి నమస్కారము. లోకముల కునికిప ట్టయినతామరపూవు

ను నాభియందుఁ గలపద్మము రూపముగాఁగలవాఁడయి పుట్టుక లే కుండునా తమ్మికంటికి నమస్కారము. కేశములందు మేఘములును, అంగసంధులఁ దెల్లను నదులును, ఉదరమున నాలుగు సముద్రములునుగల జలరూపుఁడయిన యతనికి నమస్కారము. ఉత్పత్తి స్థితి ప్రలయము మొదలగు కార్యములను గలిగించు కారణరూపుం డయినయతనికి నమస్కారము. రాత్రి నిదుర పోవునపుడు నిదురింపనివాఁడును, పగట సంగములేని కర్తయు, ఇష్టానిష్టములు రెంటికిని సాక్షియునై యుండు నాత్మరూపియైన యాభగవంతునకు నమస్కారము. సొంత ప్రయోజనములేక ధర్మ కార్యము నిమిత్తమై సమస్త కార్యములందును నడ్డులేని యత్న ముగల యీశత్వముగలిగి కార్యరూపుఁ డగునాభగవంతునకు నమస్కారము. ముఖమందు బ్రాహ్మణజాతియు, భుజములందు క్షత్రియజాతియు, కడుపునందును దొడలందును వైశ్యజాతియు, పాదములందు శూద్రజాతియునుగల జాతిరూపుఁడయిన యాత నికి నమస్కారము. అన్నపానములను సాధనముగాఁగొని సార మయిన యింద్రియములను బెంచునదియు శరీరములను దాల్చు నదియునగు ప్రాణము రూపముగాఁ గలయతనికి నమస్కారము. ప్రాణములధారణమున కయినభక్ష్యభోజ్యలేహ్యచోష్యములను నాలుగువిధము లయినయన్నములును భుజించి పక్వము గా వించు జఠరాగ్నిపాకరూపుఁ డగునతనికి నమస్కారము. విష యములందు వర్తించు చున్నమనుష్యులకు వారికిఁ గలరాగ ద్వేషము లనుగుణములకుఁ దగినట్టు లావిషయములను గాచునట్టి రూపుగల యాభగవంతునకు నమస్కారము. ఇంతింతని కొలఁది యిడరాని శరీరముగలవాఁడును, అంతటను గలబుద్ధియు నింద్రి

యములును గలవాఁడును, దుదిలేని పరిమాణముగలవాఁడును, దివ్యరూపుఁడునయిన యాభగవంతునకునమస్కారము. కాలము, యజ్ఞము, కార్యము, కారణమునను వీనికి మీఁదయినవాఁడును, కారణములేనివాఁడును, లోకమున కాదియగువాఁడును నగు విశ్వరూపునకు నాతనికి నమస్కారము. విద్యుత్తునందుఁ గలదియు, జఠరమందుఁ గలదియు, జలమందుఁగలదియు (బాడబాగ్నియు), వెలుపలఁగలదియునగునన్నింటినిభక్షించునట్టియగ్నిరూపుండగు నతనికి నమస్కారము. అణిమాదులయిన యైశ్వర్యములుగలవాఁడయి, పాతాళమునందుండి యీభూమిని మోచు ననంతుఁడనెడి యాదిశేషరూపుం డగునతనికినమస్కారము.దివ్యరూపులగు నగ్నిసూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రము లనుజ్యోతులకును బ్రకాశము నొసంగు తేజోరూపుం డయినయాభగవంతునకు నమస్కారము.శబ్దము మొదలయిన యైదువిషయములతోడ వెలుంగు జ్ఞానమునందు నా విషయములను దొలంగించి శుద్ధజ్ఞానమయిన యేయాత్మను శాస్త్రజ్ఞానముచేతఁ దెలియుదురో జ్ఞానరూపుఁడయిన యాభగవంతునికి నమస్కారము.కర్మనిష్ఠయు జ్ఞాననిష్ఠయుఁగల యుత్తమఋషులును, దేవతలును సందేహము తీఱ విచారించి యెవని తత్త్వమును దెలియుచున్నారో యారహస్యరూపుండయిన భగవంతునకు నమస్కారము. జటలును దండమును దాల్చినవాఁడును, వ్రేలుకాడు బొజ్జ గలమేనుగలవాఁడును, కమండలువు నంపపొదిగాఁ గలవాఁడును, నగు నా బ్రహ్మరూపియగు భగవంతునకు నమస్కారము. కేల శూలము గలవాఁడును, మూఁడుకన్నులవాఁడును, విబూదిపూసిన మేటిలింగమురూపము గలవాఁడును, దేవతల కీశుఁడును, మహాత్ముం

డును, రుద్రరూపుండు నగునా భగవంతునకు నమస్కారము. చంద్రకళచే వెలుంగొందు శీర్షముగలవాఁడును, సర్పమును యజ్ఞోపవీతముగాఁగలవాఁడును, పినాకమను విల్లును శూలమును గేలందాల్చినవాఁడును, నుగ్రరూపుండును నగునా భగవంతునకు నమస్కారము. వసుదేవుఁడు దేవకియందు నవతరింపఁ జేసిన వాఁడును, గేల శంఖమును చక్రమును గదయుఁగలవాఁడును,నగు వాసుదేవరూపుం డగునతనికి నమస్కారము. తలపునుకల మాలికగలవాఁడును, పులితోలుగట్టినవాఁడును, బూదిపూసిన శరీరము గలవాఁడును నగురుద్రరూపి యగునాభగవంతునకు నమస్కారము. అన్నిటిని రక్షింపఁగోరి ప్రాణులందుఁ బెక్కు తెఱంగుల పాశబంధములచే మోహింపఁజేయు మోహరూపుం డగు నతనికి నమస్కారము. సమస్తప్రాణుల హృదయమందు నుండునదియు నన్నింటినివిడిచి నివర్తించినదియు నాశము లేనిదియు సూక్ష్మమునగు చైతన్యము రూపముగాఁ గలయతనికిఁ నమస్కారము. క్రోధము ద్రోహము మోహము మొదలయిన దోషములు లేనివాఁడై, ఐదుభూతములును నాత్మయునాభూతములయాదియు నంతముసై శాంతి రూపముగాఁగలయతనికి నమస్కారము. అన్నియు నెవనియందుఁ గలవో, అన్నియు నెవని వలననుండి కలుగుచున్నవో, ఎపుఁడన్నియెడలనుండి వెలుంగుచున్నాఁడో, అన్నియు నెవ్వనిరూపమో, ఎవఁడు అన్నింటి రూపమో, యా సర్వరూపుఁ డయినభగవంతునకు నమస్కారము. వేయిపడగలు గలయాదిశేషుఁ డనుదివ్యసర్పముచేత నలంకృత మయినపాలసముద్రమునెడి మంచమునందుఁ బరుండి యున్న నిద్రారూపుం డయినయాతనికి నమస్కారము. విశ్వే

దేవతలు, మరుత్తులు, రుద్రు,లాదిత్యులు, అశ్విదేవతలు, వసువులు, సిద్ధులు, సాధ్యులు ననెడిదేవతలు రూపుగాఁగల భగవంతునకు నమస్కారము. ప్రకృతి, మహత్తు, అహంకారము, మనస్సు, బుద్ధి, యింద్రియములు, పంచభూతసూక్ష్మములు, విశేషములు, ననెడియీతత్త్వములరూపము గలయాభగవంతునకు నమస్కారము. భూతము,భవిష్యత్తు, వర్తమానమనెడి మూఁడు కాలములందు నుండునదియు, భూతముల యాదియు నంతమునైనదియు, సమస్తప్రాణులకును మున్నుగలదియు నగు (సత్య) రూపుండయినయాతనికి నమస్కారము. సూక్ష్మజ్ఞులయిన జను లు సూక్ష్మమునకంటె సూక్ష్మమయిన యేపరబ్రహ్మరూపమును వెదకి యెఱుఁగుదురో యా సూక్ష్మరూపుండగు భగవంతునకు నమస్కారము. పాతాళమునకుఁబోయిన వేదములను మిక్కిలి వేగముగా నెత్తికొనివచ్చి బ్రహ్మదేవున కియ్యఁదగుమత్స్యావతారముఁబూనిన యా భగవంతునకు నమస్కారము. అమృతమును జిలుకు కాలమందు మంథరపర్వతమును వహింపఁదగినట్లు మిక్కిలి కఠినమైన శరీరముతోడ నమరినకూర్మరూపము గొన్న యతనికి నమస్కారము. వనపర్వతములతోడంగూడిన భూమిని యొక్కకేకోఱపంట నెత్తి వెలికి వచ్చినయద్భుతవరాహరూపుండగునా భగవంతునకు నమస్కారము. లోకమునంతయు వడఁకించునట్టి నరసింహరూపము గొని హిరణ్యకశిపుండనువానిని జంపిన యా సింహరూపుఁడగు భగవంతునకు నమస్కారము. బంగరువన్నెకన్నులును సటలుఁగలదియు గోఱపండ్లును నఖములును గలదియు, నసురరాజయిన హిరణ్యుని నాశమునకుఁ గారణమయినదియు నగుగర్వమురూపము గల

యా భగవంతునకు నమస్కారము. దేవతలును గంధర్వులును దానవులును దైత్యులును గలరూపు దెలియరాని సూక్ష్మరూపముగల యతనికి నమస్కారము. మాయచేత వామనరూపము దాల్చి బలిచక్రవర్తి నడంచి మూఁడులోకములను కాలియడుగులచేతఁ గడచిన శూరరూపుఁ డయినయాతనికి నమస్కారము. ఆయుధధారులందు మిన్నయైన జమదగ్నికుమారుఁడును భూమిని క్షత్రియరహితముగాఁ జేసినవాఁడును నయిన పరశురాముఁడుగా నవతరించిన యాభగవంతునికి నమస్కారము. ధర్మమును మిక్కిలియు దిగవిడిచిన తప్పునకై యుద్ధమందుఁ దా నొక్కండును నిరువదియొక్కమాఱు క్షత్రియులను వధించిన కోపరూపుండగు నా భగవంతునకు నమస్కారము. శరీరమునందుఁ దన్ను నయిదు విధములుగా విభజించుకొని ప్రాణులను చేష్టగలవానినిగాఁ జేయు ప్రాణవాయురూపుండయిన యా భగవంతునకు నమస్కారము. దశరథకుమారుం డయినరాముఁడుగా నవతరించి పులస్త్యకులమందుఁ బుట్టిన రావణుని యుద్ధమందుఁ జంపిన క్షత్రియరూపుం డయినయాభగవంతునకు నమస్కారము. నాఁగేటిని రోఁకటినిదాల్చి నల్లని వస్త్రముగట్టి రోహిణీపుత్త్రుఁ డయినబలరాముఁడుగా నవతరించి యా భోగరూపుండయిన భగవంతునికి నమస్కారము. శార్ఙమను వింటిని శంఖమును జక్రమును ధరించినవాఁడును, పీతాంబరము ధరించినవాఁడును, వనమాలఁ దాల్చినవాఁడును నగు కృష్ణరూపుండగు నతనికి నమస్కారము. కంసునిఁ జంపఁగోరి గోకులమందు వసుదేవుని కుమారుఁడుగా నవతరించి విహరించిన శ్రీమంతుడును లీలారూపుఁడు నయిన యతనికి నమస్కారము. యదువంశము

నం దుదయించి వసుదేవునిపుత్త్రత్వము నొంది భూమిభారము నడఁగించిన శ్రీకృష్ణరూపుండగు నతనికి నమస్కారము. యుద్ధమునం దర్జునునకు సారథియై మూఁడులోకములకును హితమునకై గీతామృతము నొసంగిన యాబ్రహ్మరూపుం డయినభగవంతునకు నమస్కారము. మరల లోకమును రక్షింపఁగోరి యసురులను వశముచేసికొని బుద్ధరూపమును దాల్చినయతనికి నమస్కారము. కలివచ్చినపిదప ధర్మమును నెలకొలుపుటకై గుఱ్ఱపువాహన మెక్కి మ్లేచ్ఛుల నున్మూలింపఁ గల్కిరూపమున నవతరింపఁబోవు నాభగవంతునకు నమస్కారము. తారవంశమందుఁబుట్టిన కాలనేమియను నసురవరుని వధించి యింద్రునకు రాజ్యము నొసంగినసాంఖ్యరూపుఁ డయినయతనికి నమస్కారము. క్షరములయిన (నాశమునొందునట్టి) వస్తువులకు సాక్షియై సర్వప్రాణుల శరీరములందునుండి యక్షరుఁడై (నాశములేనివాఁడై) వెలుంగు సాక్షిరూపుఁడయిన యాభగవంతునకు నమస్కారము. ఓమహాదేవా ! నీకు నమస్కారము. భక్తవత్సలా ! నీకుమ్రొక్కు. సుబ్రహ్మణ్యా ! (బ్రాహ్మణులకు హితముసేయువాఁడా!) నీకు నమస్కారము. పరమేశ్వరా! నన్ను నుగ్రహింపుము. ప్రభూ ! సర్వమును నీవు వ్యక్తావ్యక్త (స్థూలసూక్ష్మ)రూపముల వ్యాపించియున్నవాఁడవు. సహస్రనేత్రములు గలవాఁడును సర్వలోకమహేశ్వరుఁడును హిరణ్యనాభుండును(బంగారుపొక్కిలిగలవాఁడును),యజ్ఞాంగుఁడును, నాశరహితుఁడును నంతట ముఖములుగలవాఁడును నగు నారాయణునికినమస్కరించుచున్నాను. దేవేశుండును మంగళములకునికిపట్టును నయిన హరిని మనంబున భావించు మనుష్యులకు, నెప్పుడును నేకార్య

మందును నమంగళము గలుగదు. భగవంతుఁడు విష్ణువే మంగళము. మధుసూదనుఁడే మంగళము. పుండరీకాక్షుఁడే మంగళము. గరుడధ్వజుఁడే మంగళము. విశ్వకర్తా ! నీకు నమస్కారము. విశ్వాత్మా ! నీకు నమస్కారము. విశ్వసంభవా ! నీకు నమస్కారము. పంచభూతములకు నవ్వలనుండు నిత్యముక్తుండయిననీకు నమస్కారము. మూఁడులోకములందు నున్న నీకు నమస్కారము. ఈ మూఁటికి నవ్వలనుండునీకు నమస్కారము. సకల దిక్కులందును నుండు నీకు నమస్కారము. లోకములను సృజించువాఁడును నాశముసేయువాఁడును నగు విష్ణూ ! నీకు నమస్కారము. ఒకరిచేతను జయింపఁబడని నీవే లోకములకుఁ గర్తవు. నీవే హృషీకేశుఁడవు. నీవే సంహర్తవు. కాఁబట్టి మూఁడుకాలము లందును, దివ్యములయి విలసిల్లు నీ ప్రభావములను జూచుచున్నాను. సనాతనమయిన యారూపమునుగల రూపును జూచుచున్నాను. నీశిరసుచేత దేవలోకమును, పాదములచేత భూదేవియును, నీకాలియడుగుచేత మూఁడులోకములును వ్యాప్తములయినవి. నీవు సనాతనపురుషుఁడ వగుదువు. దిక్కులుచేతులుగాను సూర్యుఁడు కన్నుగాను శుక్రుఁడువీర్యముగాను నీయందు నెలకొనియున్నారు. అమితతేజుండయినవాయువురూపము గలనీచేత సప్తవిధములయిన వాయుమార్గములును వ్యాప్తములైనవి. ప్రభూ! వ్యక్తంబగు స్థావరజంగమరూపమును నవ్యక్తమగుబ్రహ్మరూపమును గలనీచేత జగమంతయు వ్యాప్తమైయున్నది.నల్లగిసె పూవంటి కాంతిగలిగినవాఁడును, పీతాంబరుండును, నచ్యుతుండును నగుశ్రీగోవిందునికి మ్రొక్కువారికి నెట్టి భయమునుగలుగదు. శ్రీకృష్ణునిఁ గూర్చి చేసిననమస్కార

మొక్కటియైనను బది యశ్వమేధయాగములుచేసి యవభృథ స్నానము గావించినందులకు సాటియగును. పది యశ్వమేధయాగములు చేసినవానికిఁ బునర్జన్మముకలదు. భగవంతునికి మ్రొక్కినవానికిఁ బునర్జన్మము గలుగదు. కృష్ణునిఁగూర్చి వ్రతము లాచరించువారును రేయుంబవలు కృష్ణమూర్తిని ధ్యానముచేయువారును నగ్నియందు మంత్రములచేత వేల్చిననేయుంబోలె కృష్ణస్వరూపులై కృష్ణునిఁబొందుదురు. నరకభయము నుండి రక్షించుటకుఁ గంకణము గట్టుకొన్నవాఁడును, సంసారమహానది యందలి సుడిగుండములకుఁ దెప్పకొయ్యవంటివాఁడును, నగు శ్రీవిష్ణువునకు నమస్కారము. వేదమును ధర్మమును రక్షించు దేవుండై గోవులకును బ్రాహ్మణులకును హితుండై లోకరక్షకుండును గోవిందుఁడునగు శ్రీకృష్ణునకు పెక్కు నమస్కారములు. 'హరి!' యను రెండక్షరములు ప్రాణయాత్రయనునడవినిబోవువానికి దారిబత్తెమును సంసారమును గుదుర్చు నౌషధమును నగును. కష్టశోకములయందు రక్షకమగును. నారాయణుఁడే పరబ్రహ్మము. నారాయణుఁడే పరమతపము. నారాయణుఁడే పరమసత్యము. నారాయణుఁడే పరములందుఁ బరముఁడు. సత్యమును ధర్మమును సమస్తలోకమును విష్ణురూపముగా నుండుట నిజమగునేని నాపాపము నశించుఁగాక. అపారతేజుం డయిన యజ్ఞవరాహుఁ డగు శ్రీవిష్ణుని మ్రొక్కు భక్తులకునమస్కారము. సురోత్తమా ! పుండరీకాక్షా ! నిన్ను శరణముఁజొచ్చి సద్గతి నొందఁగోరుచున్న భక్తునకు నాకు నేది శ్రేయమో దాని నీవే యాలోచింపవలయును. ఇట్లు విద్యకును దపమునకును గారణ

భూతుండై తనంతఁ గారణరహితుఁడై యుండు విష్ణుఁడు స్తుతింపఁబడెను. స్తుతిరూప మయినయజ్ఞముచేత నారాధితుండయిన శ్రీజనార్దనుండు నాయందుఁ బ్రీతిగలిగియుండుఁగాత" మనెను.

భీష్ముండు కృష్ణునియందు మనస్సు చెల్లించి యింతయుఁ జెప్పి యిప్పుడు 'కృష్ణునికి నమస్కారము' అని చెప్పి నమస్కరించెను. భీష్ముఁ డట్లు స్తుతించుట విరమింపఁగానే యందుఁగల వేదవిదు లగు బ్రాహ్మణోత్తము లుత్తమ తేజుం డయినయాభీష్మునిఁ గన్నుల నీరుగన్పట్టఁ గొనియాడిరి. బ్రాహ్మణులందఱును బురుషోత్తముం డయినశ్రీకృష్ణునిని భీష్మునిని, మఱలమఱలఁ గొనియాడిరి. శ్రీకృష్ణుఁడు యోగమహత్త్వముచేత భీష్మునిభక్తి నెఱింగినవాఁడుగాన ముల్లోకములకును దెలుపఁదగిన దివ్యజ్ఞానమును నతని కొసంగి తనయున్నచోటికిఁ బోయెను. భీష్మునకుం గలయాభక్తియోగమును గృష్ణుఁ డెఱింగి వేగలేచి సంతోషముగ నా వాహనమం దారోహించెను. కృష్ణుండును సాత్యకియు నొక రథము నెక్కి పోయిరి. ధర్మరాజును నర్జునుఁడును నొకరథంబును, భీముండును నకులుండును సహదేవుండును నొకరథంబును, గృపుడును యుయుత్సుండును సంజయుండును సూతుండును ముఱియొక రథము నెక్కిపోయిరి. ఒకపట్టణమువలె విస్తరించిన తేరులతోడ బయలువెడలిన యాపురుషశ్రేష్ఠులు, గంభీరములగు నేమిధ్వనులచేత భూమిని వడంకించిరి. ఆకృష్ణుఁడు దారిని బోవునపుడు బ్రాహ్మణు లాడు పురుషోత్తమస్తుతివచనముల నల్ల వినెను. వానిని విని కృష్ణుఁడు మనంబునసంతసించి యంత నచటఁ జేతులు

కట్టికొని వినయంబునసున్న భీష్మునిఁగాంచిహర్షించెను.*ఇట్లుభీష్ముం డుచెప్పిన శ్రీకృష్ణు స్తుతిని భక్తితోడఁ బఠించువాఁడును వినువాఁ డును శ్రీకృష్ణుని యనుగ్రహామువలనఁ బాపములన్నియువిడిచి తు దను శ్రీకృష్ణునిఁ బొందును.యోగులు ప్రాణము వెడలుకాలమం దు మిక్కిలి ప్రయత్నంబున మనంబున నేభగవంతునిఁ దిరముగా భావింతురో యాహరిని భీష్ముం డెదుర్కొని కృతార్థుండై తన ప్రాణములు విడిచెను. తొల్లి భీష్మునిచేఁ జెప్పంబడినదియు మహా పాపములను నాశము సేయునదియు నాశ్చర్యమయిన కృత్యము లుగలదియు శ్రీకృష్ణుం గూర్చినదియు నయినయీ స్తవరాజము సమాప్తమయినది. పరిశుద్ధుఁడై ముముక్షు వగువాఁడు నింద్య ము లగుపాపములను నపహరించునీ స్తవరాజమును జదివి తనంతటఁ గలిగినయనిత్యలోకములను గడచి మహాత్ముని నాశ రహిత మగుపదవిని బొందుచున్నాఁడు. ఇది నలువదియాఱవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{కృష్ణుఁడు పరశురాముని పరాక్రమము చెప్పఁగా భీష్ముడు దానిని వివరింపుమని కృష్ణుని వేఁడుట.}

అంత, ధర్మరాజును దక్కిన పాండవులు నలువురును కృ ష్ణుఁడు మొదలయిన వారందఱును నతివేగమునంబోవు గుఱ్ఱ ములు పూన్చినవియు ధ్వజములు మొదలయిన వానిచే నలం కృత మయినవియుఁ బట్టణములకు సాటియైనవియునగు రథ

---

* ఇదిమొదలు నీయధ్యాయముకడవఱకుఁ గలపాఠము ఔత్తరాహ మూలమందుఁ గానిపింపదు. కానిపింపమియే సంగతముగా నున్నది.

ములెక్కి వేగముగాఁ గురుక్షేత్రమునకుఁ బోయిరి. అందు కేశములు మజ్జయెమ్ములు మొదలగునవి నెరసిబెరసియుండెను. వారా కురుక్షేత్రమందుఁ బ్రవేశించిరి.అది మహారథులయినరాజులుశరీరములువిడిచినచోటు;అందు పర్వతములవంటి యేనుఁగులగుట్టము లయెమ్ములపోగులు గ్రిక్కిఱిసియు హంసలవంటి మనుష్యుల తలపునుక లెల్లెడల నావరించియు నుండెను; పెక్కులు కవచములును బెక్కు లాయుధములును పెక్కువేల చితలును నిండియుండెను; మఱి భూతరాక్షసగణము లందు సంచరించుచుండెను.ఇట్లు భుక్తశేష మయినయంతకునిపానశాలను బోలియున్నయా కురుక్షేత్రమును జూచుచు మహారథులువారు వేగముగాఁ బోయిరి. అట్లు పోవుచుండఁగా మహాబాహుండు కృష్ణుండు ధర్మరాజునకుఁ బరశురాముని పరాక్రమమంతయుఁ జెప్పఁదొడంగెను. 'ఓ ! భారతా ! కొంతదూరమున నిదిగోఁ గానఁబడు నేదుకొలనులును, బరశురామునిచేఁ గావింపఁబడినవి. క్షత్రియుల రక్తములచే నిండినయీమడుఁగులం దతఁడు పితరులకుఁ దర్పణము చేసెను. పరశురాముఁడుభూమి నిరువదియొక్కమాఱు క్షత్రియులులేనిది గావించి యిచ్చట నిప్పుడకార్యమునుండి విరతినొందెను" అనెను. ధర్మరాజు ' తొల్లి పరశురామునిచే నీభూమి యిరువదియొక్కమాఱు క్షత్రియులు లేనిదిగాఁ జేయఁబడినదని తాము చెప్పిన విషయమందు నాకుఁ బెనుసందేహము కలిగియున్నది. అపారపరాక్రమా ! రాముఁడు క్షత్రియజాతి బీజమును లేకుండునట్లు లోకమును దహించిన పిదప మఱల నెట్లు క్షత్రియజాతి యుప్పతిల్లినది. యదుసత్తమా! మహాత్ముండగు పరశురాముఁడు క్షత్రియజాతి నెట్లు నాశముచేసెను? అది

మఱల నెట్లు పెరిఁగినది? గొప్పరథ యుద్ధంబునఁ గోట్లకొలఁదిని క్షత్రియులు హతులయిరి. అట్లే మఱల భూమి క్షత్రియులచేత వ్యాప్తమయినది. యదుసింహమా! భృగువంశంబునఁ బుట్టిన వాఁడును మహాత్ముఁడును నయిన పరశురామునిచేత మున్ను క్షత్రియజాతి కురుక్షేత్రమున నెందులకై దహింపఁబడినది. వృష్ణికులతిలకా! గరుడధ్వజా! నాయీసందేహమును దీర్పుము. కృష్ణా! ఉపేంద్రా! వేదమును నీవచనమునకు మించినదిగాదు' అనెను. అంతఁ బ్రభుండగు కృష్ణుండు క్షత్రియులచే నాభూమి నిండినవిషయమునంతయుఁ గలరూపున ధర్మరాజునకు దారిని బోవుచునే చెప్పువాఁడయ్యె. ఇది నలువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజునకు పరశురాముని వృత్తాంతమును జెప్పుట.

శ్రీకృష్ణుఁడు 'ధర్మరాజా! పరశురాముఁడు పుట్టినకారణమును, నతనిప్రభావమును, నతనిచేఁ గోట్లకొలఁదిని క్షత్రియులు హతు లగుటయు, మఱల నీభారతయుద్ధమందుఁ గొట్టువడునట్లుగా క్షత్రియులు వర్ధిల్లుటయు, మహర్షులుచెప్పఁగా నేను విన్నతెఱంగున నీకుఁ జెప్పుచున్నాను విను' మని యిట్లుచెప్పెను. 'రాజా! బ్రహ్మపుత్రుఁడయిన యజునికి బలాకాశ్వుఁడను నొక పుత్త్రుఁడుండెను. అతనికిఁ గుశికుఁడని ప్రసిద్ధినొంది ధర్మవిదుండగు పుత్త్రుఁడొకఁడుండెను. లోకమునం దతఁ డింద్రునకు సాటియైనవాఁడు. అతఁడు మూఁడులోకములకు నీశ్వరుండును నెవ్వరిచేతను జయింపఁ దరముగానివాఁడు నగు నొకపుత్త్రునిఁ బడ

యుఁగోరి పెనుతపము గావింపఁదొడంగెను. భారతా ! పుత్రు నుత్పాదించుటకు వలంతియై కడింది తపంబూనిన యాకుశికునిఁ జూచి లోకపతులకును బతియైన సహస్రాక్షుం డింద్రుఁడు తానై వచ్చి యాకుశికునకుఁ గుమారుఁడై పుట్టెను. కుశికుఁడును గుమారుఁడయి పుట్టినయింద్రునకు గాధియను పేరుపెట్టెను. ఆగాధికి సత్యవతి యనుకూఁతురు పుట్టెను. గాధి యాకన్యను భృగుపుత్రుఁడయిన ఋచీకునకుఁ బెండ్లిచేసెను. పిదప సత్యవతి పుత్రునిఁగోరి ఋచీకుని ప్రార్థింపఁగా నతఁడు గాధికిని దనకును బుత్రుఁడుగలుగఁగోరి వేఱువేఱ రెండుచరువులను బక్వము గావించెను. అంత భృగుపుత్రుఁ డాఋచీకుఁడు భార్యను బిలిచి 'ఈచరువు నీవును, మఱియొక చరువు నీతల్లియు నుపయోగింపవలయును. మీతల్లికి నామె చరువువలన దీప్తిమంతుండును క్షత్రియతిలకుండునగు పుత్రుండు పుట్టఁగలఁడు. వాఁడు లోకమున క్షత్రియులకెల్ల జయింపరానివాఁడు; మఱిమేటి క్షత్రియుల నుక్కుమడంచు నట్టివాఁడు. నీకో ధృతిమంతుఁడును శమసంపన్నుండును తపఃకలితుండునగు బ్రాహ్మణశ్రేష్ఠునిఁ త్రునిఁగా నీచరువుపుట్టించును' అనెను. అతఁడు భార్యకుఁజరువులనిచ్చి యట్లుచెప్పి తపంబుగోరి యడవికిఁబోయెను. ఆసమయమునందె తీర్థయాత్రకై గాధిరాజు బయలువెడలి భార్యతోడ ఋచీకాశ్రమమునకు వచ్చెను. అప్పుడు సత్యవతి తనకుఁ బతి ప్రసన్నుఁడై యొసంగిన రెండుచరువులనెత్తికొని సంతసంబునఁ దల్లియొద్దకుఁబోయి దానిని దెలిపెను. ఆబిడతల్లియో తనకయిన చరువును గూఁతునకిచ్చి దానిచరువును దెలియక తానుపయోగించుకొనెను. అంత సత్యవతి క్షత్రియుల కంతకరమయిన గర్భ

మునుదాల్చెను. అది ప్రకాశించుచున్న దేహముతోఁ జూచు టకు భయంకరముగానుండెను. ఋచీకుఁడు తనచెలువ యప్సరస యుం బోలె వెలుంగుచుండుటనుజూచి ధ్యానయోగమున జరిగిన దానిని గనుఁగొని 'కల్యాణీ! చరువులనుమార్చినీతల్లి నిన్నువంచిం చినది. అది కారణముగా నీయందు మిక్కిలి మచ్చరముగలవాఁ డును గ్రూరకర్ముండునగు పుత్త్రుఁడు పుట్టఁగలఁడు.నీతల్లి తపోధనుఁ డయిన బ్రాహ్మణోత్తముని గాంచును. నీచరువునందు బ్రాహ్మ ణజాతి కగు వీర్యమునంతయుఁ బదిలపఱిచితిని. క్షత్త్రియవీర్యము నంతయు నీతల్లిచరువునం దుంపఁబడినది. అయినను జరువుల మాఱుపాటువలన నిది నేనుసంకల్పించినట్లు కానేరదు. నీతల్లికి బ్రాహ్మణుఁడుపుట్టును. నీకు క్షత్త్రియుఁడుగలుగును" అనెను. పతి యిట్లుచెప్పఁగా నాభాగ్యవతి సత్యవతి, వడవడవడంకుచుఁ దల వాంచి మ్రొక్కి "ప్రభూ!నీవు 'బ్రాహ్మణజాతికి నింద్యుఁడయిన కొడుకు నీకుఁ గలుగు' నని యిట్టిమాట నను బోఁటిదానికిఁ జెప్పఁదగునా ! తగదే !" యనెను. ఋచీకుఁడు 'పడఁతీ! నీయెడ నే నిట్టికోరిక సంకల్పించినవాఁడనుగాను. చరువులు వీడ్వడు టంబట్టి యుగ్రకర్ముం డయినకొడుకు నీకుఁగలుగు' ననెను. సత్య వతి 'మునీంద్రా ! నీవుకోరితివా లోకములనుగూడ సృజిం తువు! ఇఁకఁబుత్త్రునిఁగలిగించుటఁ జెప్పనేల ? ప్రభూ ! కాఁబట్టి నాకై శమసంపన్నుఁడును జక్కటిగలవాఁడునగు పుత్త్రు నియ్యం దగు' ననెను. ఋచీకుఁడు 'కల్యాణీ ! నేను నవ్వులాటలకు నింత వఱకు నబద్ధమయినమాట చెప్పినదిలేదు. ఇంక నగ్నిని మున్నిడి కొని మంత్రపూర్వకముగా సమర్పించిన చరువువిషయమై నా మాట పొల్లుకాదని చెప్పవలయునా ? నీతండ్రి కులమంతయు.

బ్రాహ్మణకులమగునని తపశ్శక్తిచే మునుపే నాకుఁ దెలిసియున్నది చుమీ' యనెను. సత్యవతి 'నీవు మంత్రశక్తిగలవారలయాందు మిన్నవుగదే ! నీయిచ్చుచొప్పున పౌత్త్రుఁ డిటువంటివాఁడగుఁ గాక. పుత్త్రుఁ డిట్టివాఁడువలదు. వలదు. శమసంపన్నుఁడును ఱక్కటిగలవాఁడునగు పుత్త్రుఁడు నాకుఁ గలుగనిమ్ము' అనెను. ఋచీకుఁడు 'వరవర్ణినీ ! పుత్త్రుఁడనియుఁ బౌత్త్రుఁడనియు నాకు భేదములేదు. నీవుచెప్పినట్లె యగుఁగాక.' యనెను. అంత సత్యవతి తపస్సక్తుండును శాంతుండును నియతవ్రతుండునగు జమదగ్ని యనుపుత్త్రునిఁగనెను. కుశికపుత్త్రుం డగుగాధికి బ్రహ్మతేజస్సంతయు నిండారి బ్రహ్మర్షికి సాటియగు విశ్వామిత్త్రుండను పుత్త్రుఁడుగలిగెను. జమదగ్ని మిక్కిలి భయంకరుఁ డయినపరశురాముని గాంచెను. అతఁడు సమస్తవిద్యలందును దుదముట్టి, ధనుర్వేదపారగుఁడయి యుండెను. అతఁడు మఱియు క్షత్త్రియాంతకుఁడయి యగ్నివలెఁ దేజరిలుచుండెను. అతండు గంధమాదనపర్వతమందు మహాదేవుండగు రుద్రుని సంతోషపఱిచి, యద్దేవునివలన మిక్కిలియుఁ దేజంబుదొలఁకు పరశువును నస్త్రములును వరముగాఁబడసెను. ఆగండ్రగొడ్డలి జ్వలించుచున్నయగ్నివలె వెలుంగుచు, మొక్కవోని వాఁడిమొనగలిగి యిట్టిదట్టిదని చెప్పరానిదై యుండెను. కాన యతండు దానిచే లోకములం దసమానుఁడై యుండెను. ఇట్లున్నకాలమున, హైహయదేశమునకు రాజర్జునుఁ డనువాఁడుండెను. అతఁడు కృతవీర్యునిపుత్త్రుఁడు, మిక్కిలి తేజస్వి,మంచిబలవంతుఁడు. అతఁడు దత్తాత్రేయుని ప్రసాదమువలన వేయిబాహువులఁబడసి మహాతేజుం డయినచక్రవర్తియై యశ్వమేధ మనుయాగము చేసెను.

అతఁడు పరమధర్మవిదుండుగాన, యాయాగమందుఁ దనభుజబల ముచేతను నస్త్రబలముచేతను యుద్ధంబునజయించి భూమినం తయుఁ బర్వతములతోను సప్తద్వీపములతోను బ్రాహ్మణులకు దానముచేసెను. ఆపరాక్రమశాలి తన్నగ్నిదేవుఁడు దప్పిగొని యాచింపఁగా, పెక్కులుగ్రామములను బట్టణములను రాష్ట్రము లను గొల్లపల్లెలను నతనికి భిక్షగానొసంగెను. కాన యావురు షతిలకుని ప్రభావముచేత నగ్నియన్నింటిని దహింపఁగోరి యత ని బాణములవలననుండి దరికొని జ్వలించుచు నాయర్జునుని పర్వ తములను భూమినంతయు దహించివైచెను. అట్లాయగ్ని వా యువుచేత మిక్కిలి యెసరేఁగి యర్జునుఁడును దోడుపడఁగా మహాత్ముఁ డగువసిష్ఠమహర్షి యాశ్రమ మున్నయరణ్యమును, అందెవరును లేకుండఁగాఁ గాల్చివైచెను. అట్లు; తనయాశ్రమము దగ్ధముకాఁగానే, వసిష్ఠుఁడు మహాప్రభావుడుగాన యర్జునునియె డఁగోపముగొని యతనిని శపించువాఁడై 'అర్జునా! నీవు నా యా శ్రమవనమును గొప్పదానిని విడిచిపెట్టక కాల్పనేకాల్చితివిగా! కాఁబట్టి రణమున రాముఁడు నీచేతులను ఛేదించును బోమ్మని శపించెను. అర్జునుఁడో మిక్కిలి తేజమును బలిమియుఁగలవాఁ డయ్యు నెప్పుడును శమముగలిగి బ్రాహ్మణులయందు భక్తియుఁ నార్తులకు శరణొసంగుటయుఁగలిగి మంచిదాతయు శూరుం డునై యుండును. అతఁ డామహాత్ముఁడొసఁగిన శాపమును బాటిం చినవాఁడు గాఁడయ్యె. అతనికి మిక్కిలిబలవంతు లగుపుత్రులు గలరు; వారాశాపముచేతఁ దండ్రివధకు నిమిత్తభూతులగుటకై యెప్పుడును గర్వమున విఱ్ఱవీఁగుచుఁ గ్రూరులై యుండిరి. వారొ కప్పుడు జమదగ్నిహోమధేనువుదూడనుబట్టి తీసికొనిపోయిరి.

బుద్ధిమంతుఁడగునర్జునుఁ డదియెఱుంగఁడు. అది కారణముగా జమదగ్ని కుమారుఁడును మహాత్ముఁడు నగుపరశురామునితోడ యుద్ధముకలుగఁగా నం దతఁడు రోషంబుమీఱ నర్జునుని చేతులను నఱికివైచెను. అంత నా రాముఁడు గ్రమ్మఱుచున్న యాదూడను వారి యంతఃపురమునుండి తనయాశ్రమమునకుఁ దీసికొనిపోయెను. అర్జునునికొడుకులు బుద్ధిహీనులు గాన యపుడందఱు నొక్కటిగాఁగూడి జమదగ్నియాశ్రమమునకుఁ బిలువంబడకయే పోయి భల్లపుమొనలచే నతనిశిరసును దేహమునుండి ద్రెస్సిపడఁ గూల్చిరి. అపుడు మహాయశుండు పరశురాముం డందు లేఁడు; సమిధలును దర్భలును దేరబయటఁ బోయియుండెను. అతండుతిరిగివచ్చి తనతల్లివలనను నాయాశ్రమవాసులవలనను జరిగినయాప్రవృత్తిని జక్కవిని క్రోధంబునొంది కాలాగ్ని సమానుఁడయ్యెను. అతండు ధనుర్వేదమం దద్వితీయుఁడు; దివ్యాస్త్రములచే నెంతయు భూషితుఁడు. అర్ధచంద్రబింబమువలెఁ బరశు వతని కేలఁ గ్రాలుచుండెను. అతఁడు పితృవధమున కెంతమాత్రము సయింపక మిక్కిలి యుఁగోపమునొంది భూమియందు క్షత్రియుఁడొక్కఁడేని లేకుండునట్లు చేయుదునని ప్రతిన చేసి యాయుధమును గయికొనెను. అంత నాభృగుసింహుఁడు పరాక్రమంబు మెఱసి మిక్కిలి వేగపోయి యర్జునుని పుత్రులను బౌత్రులను మిగత లేకుండఁ బడఁగూల్చి కోపంబుసందడింప హైహయదేశపువారగు క్షత్రియులను బెక్కువేలమందినిజంపి భూమిని సముద్రమువఱకు రక్తమునఁ దొప్పఁదోఁగునట్లు గావించెను. అతం డపార తేజంబు రాజిల్ల భూమిని క్షత్రియులు లేనిది గావించి యంత నెంతయు దయ పయిఁకొనఁగా వనమునకే పోయెను. అతఁడు స్వభావముచేతనే కోపముగల

వాఁడు. అంతఁ గొన్ని వేలసంవత్సరములు కడచనువఱకు నట్లూర
కుండి పిదప నెప్పటియట్లు కోపంబునొందినవాఁ డయ్యె. అది
యెట్లనఁగా, యయాతిపతన మనుక్షేత్రమున యాగమునందు
జనసమూహము గూడియుండెను. ఆగుంపునందు విశ్వామిత్రుని
మనుమఁడును రైభ్యునికొడుకు నగుపరావసుఁ డనుమహాతపస్వి
యొకండు రామునిఁ జేరి 'రామా! నీచేసినప్రతిజ్ఞ పొల్లు; ఈజనుల
కూటమునందు నిన్ను నీవే పొగడికొనుచున్నావు. ఈయాగము
నకు వచ్చియున్న ప్రతర్దనుఁడు మొదలయినవారు నీకు క్షత్రియులు
గారా! ఈ భూమి మరల వందలకొలఁది క్షత్రియులచేత
నంతట నెరసిబెరసియే యున్నదే! క్షత్రియవీరులను భయపడి
యొకకొండయం దొదిఁగియున్నావే' అని యెత్తిపొడిచెను. పరా
వసువు చెప్పినమాట వినఁగానే పరశురాముఁ డాయుధమును
గేలంబూనెను. అతఁడు మున్ను వందలకొలఁది క్షత్రియులను జం
పక విడిచియుండెను. వారంతకు మిక్కిలి వృద్ధినొంది యెంతయుఁ
బరాక్రమము మెఱయుచు భూమిని బాలించుచుండిరి.. అతఁడు
మరల వారినందఱను బాలురను సయితము వేగ దునుమాడి
వైచెను. అపుడు గర్భస్థులగు క్షత్రియులచే మఱల భూమినిండిన
దయ్యె. గర్భములు పుట్టుచుఁ బుట్టుచునుండఁగా, మరల నతఁడు
వానిని జంపుచునుండెను. అప్పుడు క్షత్రియస్త్రీలుకొందఱుబిడ్డలను
రక్షించిరి. ఇట్టులిరువదియొక్కమాఱు భూమిని నిఃక్షత్రియముగా
వించిరాముడంతఁ దాను జేసిన యశ్వమేధయాగము తుదను నీభూ
మిని గశ్యపునకు దక్షిణగా నొసంగెను. ఆకశ్యపుఁడును శేషించిన
క్షత్రియులను గావంగోరి స్రుక్కును బట్టినచేత దక్షిణను గయి
కొని పరశురామునిఁ జూచి 'మహాముని! నీవు దక్షిణసముద్రంపుఁ

తీరమునకు బోవలయును. నీవు నాదేశమం దెక్కడను వసింప రాదు. నీవు భూమిని నశ్వమేధయాగమందు నాకు దక్షిణగా నొసంగితివి. ఇచ్చినభూమిని మరలఁబుచ్చుకొనుటకు నీకధికారము లేదు' అనెను. అంత పరశురాముఁడు సముద్రునికడకు బోఁగా నతఁ డతనికి భయపడి పడమటిదిక్కున శూర్పాకర మను దేశమునొకటి నిర్మించియిచ్చెను. కశ్యపుఁ డాభూమిని దానమునఁ గయికొని దానిని బ్రాహ్మణులయం దర్పించి తాను వనంబునకుఁబోయెను. పిదప నీలోక మరాజకము కాఁగా శూద్రులును వైశ్యులును విచ్చలవిడి నడచుచు మేలుజాతివారగు ద్విజులభార్యలయందుఁ వర్తింపఁ దొడఁగిరి. బలవంతులు బలహీనుల నడువందొడంగిరి. అప్పు డెవ్వఁడును దనధనమునకే తా నేలిక గానేరఁడయ్యెను. మూర్ఖులయిన కొందఱుబ్రాహ్మణులు తాము పండితులమని విఱ్ఱవీఁగుచుఁ గలుద్రావఁదలపడిరి. బ్రాహ్మణులుక్షత్రియులు వైశ్యులుశూద్రులందఱును దుర్మార్గమునవర్తించుచు నొండొరుల నండగొని యొకరినొకరు చంపఁబూనిరి. బ్రాహ్మణులు తమధర్మమును విడిచి దుష్పథమును ద్రొక్కి పాషండులయిరి. అందఱును దొంగతనమును, కల్లలను మాయలనుబన్నిరి. కొందఱు దురాచారులు తమవర్ణధర్మములను నాశ్రమధర్మములను దప్పక నడపుచు సన్మార్గమున వర్తించుచున్న బ్రాహ్మణులను వైశ్యులను ధార్మికులగు శూద్రులను నెంతమాత్రమును భయములేక వధించిరి. మఱికొందఱు యాగములను నధ్యయనమును జేయువారిని, ఆశ్రమములందు నెలకొని తపము సలుపువారిని,గోవులను, బాలురను,స్త్రీలను, వృద్ధులను,నాశము చేసిరి.వేదములును ధర్మశాస్త్రములును రాజనీతియు నప్పుడడఁగె.

పోయినవి. ఆచారములు తలక్రిందుగాఁ దప్పి నడచుచుండుట చేతఁ బెక్కండ్రు ద్విజు లపుడు ప్రాయికముగా వ్రాత్యులును మ్లేచ్ఛులునయిరి. అపుడు భూమిధర్మరక్షకులయిన క్షత్రియులు దన్ను విధ్యుక్తముగాఁ గాచుటకు లేకుండినందునఁ గ్రమమం తయుఁ దలక్రిందుకాఁగా నాతెఱపిని దురాత్ములు తన్నుఁ బీడిం చుచుండఁగాఁ జేయునదిలేక వేగ రసాతలమును జొచ్చెను. అట్లు భూమిభయపడి పరువిడుచుఁ బాతాళమునకుం గ్రుంకుచుండుటం జూచి యంతఁ గశ్యపుఁడు గొప్పమనస్సుగలవాఁడుగాన తన తొడయందు దానినిదాల్చి యుద్ధరించెను. దానిచే నాభూమి 'ఉర్వి'యనుపేరు గలదయ్యెను. అప్పుడు భూదేవి కశ్యపుని సం తోషపెట్టి, తన్ను రక్షించు నుద్దేశముతో బాహుబలసంపన్ను లగు క్షత్రియులు కావలయునని యమ్మునిని యాచించునదై 'ము నీంద్రా ! హైహయవంశమువా రయినమేటిక్షత్రియులను స్త్రీల యందుఁ బదిలముగానుంచి రక్షించుచున్నాను.వారు నన్నురక్షిం తురుగాక. విదూరథునిపుత్రుఁ డయినయొకరాజు పూరువంశ మువాఁడు, ఋక్షవంత మనుపర్వతమున ఋక్షముల (ఎలుఁగు బంట్లు) చేతఁ బెంపఁబడుచున్నాఁడు. అట్లె సౌదాసుని పుత్రుని, నపారతేజుం డయినపరాశరుఁడు దయగూరి రక్షించుచున్నాఁడు. వాఁడు క్షత్రియుఁడై యుండియు సౌపరాశరునకు శూద్రునివలె సమస్తకార్యములును జేయుటచే సర్వకర్ముఁడని ప్రసిద్ధుఁడయ్యె ను. అతఁడు నన్నురక్షించుఁగాక. శిబిపుత్రుఁడు మహాతేజుండు. వాఁ డరణ్యమునందు గోవులచేఁ బెంపఁబడినవాఁడుగాన గోపతి యను పేరొందెను, వాఁడు నన్ను రక్షించుఁగాక. ప్రతర్దనుని పుత్రుఁడు మహాబలుఁడు, పసులకొట్టమునందు వత్సము(దూడ)

లచేఁ బెంపఁబడినవాఁడు గాన, వత్సుండను పేరుగలఁడు. ఆరాజు నన్ను రక్షించుఁగాక. దివీరథుని పౌత్త్రుఁడును దధివాహానుని పుత్రుండు నగునంగుఁడను రాజును గంగాతీరమున గౌతముఁడు రక్షించుచున్నాడు. గృధ్రకూటమను పర్వతమున మహాతేజుండయి గొప్పభాగ్యముచేఁ జెలువుగులుకుచుండు బృహద్రథుఁడనువానిని గొండముచ్చులు గాచుచున్నవి. మరుత్తుని వంశమునఁబుట్టినరాజులు పరాక్రమమున నింద్రునింబోనివారు క్షత్రియకుమారులు. సముద్రునిచేత రక్షితులై యున్నారు. అందందుఁ బ్రసిద్ధులై యున్నయాక్షత్రియకుమారులు శిల్పి కంసాలి మొదలగు జాతుల నిప్పుడు నాశ్రయించియున్నారు. వీరు నన్ను రక్షింతురేని నేను నిలుకడగా నెలకొందును. వీరలతండ్రులును, తాతలును, రాముని చేత నానిమిత్తము యుద్ధమున హతులయిరి. మునిసత్తమా! *వారలకు ఋణమీఁగుటకై పూజ నాకుఁ జేయవలసియున్నది. కడచిపోయినరాజులచేత నాకు రక్షణమును నేను గోరలేదు. ఇప్పుడున్నక్షత్రియులచేత నే నుండఁగోరెద. దీనిని వేగ యొడఁగూర్పవలయు' ననెను. అంతఁ గశ్యపుఁడు భూదేవి నిర్దేశించిన క్షత్రియులను రప్పించి వారిని రాజులుగా నభిషేకము గావించెను. వారలవంశములు పుత్రపౌత్రపారంపర్యము గలిగి భూతలంబునఁ బ్రతిష్ఠితములయ్యెను. ధర్మపుత్రా! నీవు నన్నడి

* ఇట 'తేషా మపచితిశ్చైవ మయాకార్యా మహామునే' అని మూలము. వారలకు నుత్తరక్రియల చేయింపవలసినది నాకుఁగర్తవ్యమని ప్రతాపచంద్రుల వ్యాఖ్య. 'నహ్యహం కామయే నిత్య మతిక్రాంతేనరక్షణమ్' అనుటకు ధర్మము నతిక్రమించినవారిచేత రక్షణను నేనెప్పుడును గోరనని నీలకంఠవ్యాఖ్య. నేనిప్పటిరాజులచేత రక్షణమును గోరలేదని ప్రతాపచంద్రవ్యాఖ్య.

గిన యీపురాతనకథ తొల్లి యిట్లు జరిగినదయ్యె ' ననెను. ఇట్లు మహాత్ముఁడు కృష్ణుఁడు ధర్మరాజునకుఁ జెప్పుచు ముల్లోకములను సూర్యుండునుఁబోలె నిజకాంతులచేఁ బర్వుచు నారథంబుననే వేగముగాఁ బోయినవాఁడయ్యె. ఇది నలువదియెనిమిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

(ధర్మరాజు మొదలగువారు భీష్ము నాశ్రయించుట. కృష్ణుఁడు భీష్మునకు నుపచారోక్తులు చెప్పి ధర్మరాజునకు ధర్మోపదేశము సేయ వేఁడుట.)

అంత ధర్మరాజు పరశురాముఁడు చేసినయద్భుతకర్మమును విని మిక్కిలి యాశ్చర్యమునొంది కృష్ణునితో 'వృష్ణికులతిలకా! రాముని క్రోధమువలన భూమి క్షత్త్రియుఁడే లేనిదిగాఁ జేయంబడెనుగా! ఔరా! ఆతనిపరాక్రమ మేమనవచ్చు! అది దేవేంద్రుని పరాక్రమమువలె నున్నదే! ఆరామునివలన భయమున నడుంకుచున్నక్షత్త్రియకులోద్ధారకులును గోవుచేతను, సముద్రునిచేతను, గొండముచ్చులచేతను, నెలుఁగుబంట్లచేతను, వానరములచేతను బదిలముగా రక్షితులయిరిగా! ఔరా! ఏమాశ్చర్యము! అచ్యుతా! బ్రాహ్మణోత్తములు ధర్మయుక్తమయిన యిట్టి కార్యమును గావించినపట్టయినయీమనుష్యలోకము ధన్యమైనది. భూమియందలి మనుష్యులును మిక్కిలి భాగ్యవంతులే' యనెను. ఇట్లు కథలు చెప్పికొనుచు నాధర్మరాజును గృష్ణుఁడును శరతల్పంబున భీష్ముండు పరుండియున్నయెడకుఁబోయిరి. అట్లుచని వారు మిక్కిలి పవిత్రమయిన యాప్రదే

శమున, ఓఘవతీనదితీరమున శరతల్పముపయిఁ బరుండియున్న భీష్మునిం గాంచిరి. అతఁడు నిజకిరణసమూహముచేఁ బరివృతుఁ డయిన సాయంకాలసూర్యునివలె వెలుంగుచు దేవతలు దేవేం ద్రుఁడుంబోలె మునులు దన్నుఁ గొలుచుచుండఁగా వెలయు చుండెను. కృష్ణుండును ధర్మరాజును దక్కిన నలువురు పాండ వులును కృపుఁడు మొదలయినవారును గొంతదవ్వున నే భీష్మునిఁ గాంచి వాహనములనుండి దిగిపోయిరి. అంతఁ గృష్ణుండును సాత్యకియు ధర్మరాజు మొదలయినరాజులును, మిక్కిలి చలించు చున్న మనమును గుదుటంబెట్టి యింద్రియముల నొక్కటి గావించుకొని యందుఁగల వ్యాసుఁడు మొదలయిన ఋషిసత్త ములకుసమీపమునకుఁబోయి వందనము లాచరించి పిదప భీష్ముని కడకుఁబోయిరి. అంతఁ గృష్ణుండు భీష్మునితో 'తపస్సువర్ధిల్లు చున్నదా'? అని యడిగి కూర్చుండెను. తక్కిన పురుషవీరులంద ఱు నతనింగలసి కూర్చుండిరి. పిదపఁ గృష్ణుఁ డాఱుచున్నప్పటి యగ్నియుంబోలె నున్న భీష్మునిఁగాంచి, కొంచెము మనంబున దుఃఖించుచు 'మాటకారులందుమేటీ! ఇంద్రియములెల్ల మును పటివలెఁ జేటలయి యున్నవేకదా? నీదుబుద్ధియుఁ గలఁతలే కున్నదిగదా? బాణములు కొట్టువడి దుఃఖముచేఁ బీడితమయిన నీదేహము నొవ్వులేకున్నదా? మనస్సునందలి దుఃఖముకన్న, మేని యందలి దుఃఖము మిక్కిలి పెద్దదిగదే! ప్రభూ! ధర్మనిత్యుం డయిన నీతండ్రి శంతనునివలననుండి వరమునుబొందుటం బట్టి మరణము నీయిచ్ఛకులోనయి యున్నదిగదా! అయిన నిది శరీర వేదనను దొలఁగింపఁ గారణముగాదే! శరీరమునందున్న శల్యము, మిక్కిలి సూక్ష్మమయినను నెంతయు బాధగలిగించును. శరస

మూహాములచే శరీరమంతయు నిండియున్న నీదువేదన యేమని చెప్పుదు ! భారతా ! దేవతలకును వలయుహితము లుపదేశింప వలంతివి. ఇట్టి నీకుఁ బ్రాణుల జననమరణములనుబట్టి పరులు చెప్పవలసినది లేదేకదా ! పురుషతిలకా ! జరిగినదియు, జరుగఁగలదియు, జరుగుచున్నదియు నగునన్నియు జ్ఞానవృద్ధుండయిన నీకు నఱచేతియందలి యుసిరికవలె నగును. ప్రాణుల యిహసంసారమును, దానివలన ధర్మముచేఁ గలుగుఫలమును నీకుఁ దెలిసియున్నవి. మహాప్రాజ్ఞుండవుగదే ! నీవు ధర్మమయమగు నిధివిగదా ! నీవు బలువైనరాజ్యమునం దుండి యేతెవులును లేక యవయవముల నింపుఁదనముతోఁ గూడినవాఁడవై వేయిమంది సుందరీమణులచేతఁ బరివృతుండ వయ్యుండియు నొక్కండ వూర్ధ్వరేతసుండ వని నేను గనుఁగొనుచున్నాను. అమోఘధర్ముండును మహావీర్యుండును శూరుండును ధర్మైకపరాయణుండును శరతల్పగతుండును శంతనుపుత్త్రుండునునగు భీష్ముం డొక్కఁడు తక్క మూఁడులోకములందును దపోబలంబున మృత్యువును జయింపఁగలరాజు కలిగినట్లు విన్నదిలేదు. అయ్యా ! సత్యమందును, దపమందును, దానమందును, వేదమందును, యాగమందును, ధనుర్వేదమందును, దర్కశాస్త్రమందును నీవలె ధర్మార్థకామములకుఁ గారణభూతుండగు మఱొక్కని నే నిదివఱకు విన్నదిలేదు. క్రూరత్వములేక, పరిశుద్ధుఁడును, దాంతుఁడును, సర్వభూతహితరతుండును, మహారథుండు నగు నినుబోఁటివానిని మఱొక్కనిని విన్నదిలేదు. దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు మొదలయినవారి నందఱను నేకరథుండవై నీవొక్కండవే జయింపశక్తుండ వనుటకు

సందేహము లేదు. మహాబాహూ! ఇంద్రసమానుఁడ వయిననీవు వసువులనెడి యెనమండ్రు దేవతల యంశములు నొక్కటిగాఁ జేరి తొమ్మిదవవసువుగాఁ బుట్టినవాఁడవనియు, గుణములందెల్ల వారికి నుత్తముఁడ వనియు బ్రాహ్మణు లెప్పుడును జెప్పెదరు. పురుషవర్యా! నేనును నాయంతట నిన్నెఱుంగుదును. పురుషసత్తముండ వగునీవు దేవతలందును శక్తివలనఁ బ్రసిద్ధి కెక్కినవాఁడవు. మనుజేంద్రా! భూమియందలి మనుజులగుణములందు నీకు సమానుఁ డయినపురుషుని నెందును నేను జూడలేదు; వినను లేదు. రాజా! నీవు సమస్తగుణములచేతను దేవతలకును మిన్నవు. నీవు నీతపోబలమువలన స్థావరజంగమములయిన లోకములను సృజింప శక్తుండవు. ఇఁక నుత్తమగుణములచే నీకు వలయు నుత్తమలోకములను బొందుటను జెప్ప నేల? ఈ పాండవజ్యేష్ఠుఁడు ధర్మరాజు జ్ఞాతివధమునకు మిక్కిలి పొక్కుచున్నవాఁడు. నీ వితనిశోకమును బోకార్పవలయును. నాలుగువర్ణములధర్మములును, నాలుగాశ్రమములధర్మములును, ధర్మార్థకామమోక్షము లనునాలుగువిద్యలందుఁగల ధర్మములును వైదికులకుఁగల విశేషధర్మములును, యోగసాంఖ్యములతోఁ జేరిన సనాతనధర్మములును నన్నియు నీకుఁ జక్కఁగాఁ దెలిసియున్నవి. గాంగేయా! చతుర్వర్ణములకు వలయునదియు విరుద్ధముగానిదియు ననుష్ఠింపఁబడుచున్నదియు నగు ధర్మశాస్త్రము సవ్యాఖ్యానముగా నీకుఁ దెలియును. ప్రతిలోమజాతులకును మ్లేచ్ఛులకును గలధర్మములు నాయాదేశజాతికులములకుఁ గలధర్మలక్షణములును, వేదములందును శిష్యులచేతను జెప్పంబడు ధర్మములును నీ కెప్పుడునుఁ జక్కఁగాఁ దెలియును. ప్రవృత్తి నివృత్తి

క్రమములును దెలియును. ఇతిహాసపురాణముల ధర్మములును ధర్మశాస్త్రమును గొఱంతలేక యన్నియు నీకు మనంబున నెలకొనియున్నవి. పురుషసత్తమా! ఈలోకమందు సంశయమును గలిగించు విషయములన్నియును నాసందేహము తీఱునట్లు విశదముగా నుపదేశించుటకు నీవుదప్ప లోకమున మఱెవ్వఁడును లేఁడు. రాజా! అట్టి బుద్ధిమంతుఁడ వగునీవు ధర్మరాజు మనసునందుఁగలిగిన శోకమును బుద్ధిచేతఁ బోకార్పుము. ఉత్తమంబుగ బుద్ధివిస్తరించియున్న నినుబోఁటి పెద్దలుగదా మోహము నొందుచున్న జనులకు శాంతిగలిగింపఁ జాలువారు' అనెను. ఇది నలువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు కృష్ణునిఁ బ్రశంసించుట. కృష్ణుఁడు ధర్మోపదేశము చేయుమని చెప్పుట.

కృష్ణుఁ డట్లుచెప్పినవచనము విని భీష్ముండు మొగము కొంచెము పయికెత్తి చేతులు జోడించికొని యతనితో 'కృష్ణా! లోకముల పుట్టుకకును నాశమునకును గారణమైనవాఁడా! హృషీకేశా! నీకు నమస్కారము. అపరాజితుండ వగునీవే లోకమునకుఁ గర్తవును సంహర్తవునుగా నున్నావు. పంచభూతములకును నవ్వల నున్ననీవు మోక్షపదమునం దున్నవాఁడవు. విశ్వమును నీకార్యము. విశ్వమునకు నీవాత్మవు. విశ్వమునకు నీవ పుట్టుచోటవు. ఇట్టి నీకు నమస్కారము. యోగీశ్వరా! నీకు నమస్కారము. సర్వమునకు ముఖ్యస్థానమైనవాఁడా! నమస్కారము. మూఁడులోకములందును మూఁడులోకముల కవ్వలను

నున్న నీకు నమస్కారము. పురుషసత్తమా ! నీవు నన్నుగుఱించి చెప్పిన మాటలచేత ముల్లోకములందును వెలుంగు నీదివ్య ప్రభావములును నేను గనుఁగొనుచున్నాను. సనాతనంబగు నీరూపము కూడ నాకుఁ దెలియుచున్నది. అమితమయిన తేజస్సు గలవాయువు సప్తమార్గములను నీచేత నిరుద్ధములై యున్నవి. నీశిరసుచేత దేవలోకమును బాదములచేత భూమియు వ్యాప్తములై యున్నవి. దిక్కులు నీచేతులుగను, సూర్యుఁడు కన్నుగను, శుక్రుఁడు వీర్యముగను నెలకొనియున్నారు. నల్లని పూవన్నెగలిగి పచ్చని బంగారువలువగలదై యువ్యయం బగునీది వ్యవిగ్రహమును జూచి మెఱపుతోఁగూడిన మబ్బును నూహించు చున్నారము. పుండరీకాక్షా ! సురోత్తమా ! భక్తితోడ నిన్ను శరణుఁజొచ్చి యిష్టం బగుగతిని బొందఁ గోరుచున్న నాకు నీవు శ్రేయము నాలోచింపవలయును' అనెను.

కృష్ణుఁడు 'పురుషసింహమా ! నాయందు నీకుత్తమమయిన భక్తియుండుటవలననే నాదివ్యరూపము నీకుఁ బ్రదర్శితమయ్యెను. రాజేంద్రా ! భక్తిలేనివానికిని, భక్తియుండియుఁ జక్కటిలేని వానికిని, భక్తియుఁ జక్కటియునుండియు దమములేనివానికిని, నేను దర్శన మొసంగుటలేదు. నీవే నాయందెప్పుడును భక్తిగల వాఁడవును, జక్కటిగలవాఁడవును. దమమునను,దపమునను, సత్య మునను, దానమునను నిరతుండవు; పరిశుద్ధుండవు. కావుననే నన్ను దర్శించుట కర్హుండవు. నీ తపముచేతఁ బునరావృత్తిలేని యుత్తమలోకములు నీరాక నెదురుచూచుచున్నవి. కురుప్రవరా ! నీజీవితకాలము నేఁడు మొదలుగా నిఁక *ముప్పదిదినములున్నవి.

*ఇట 'పఞ్చాశతం షట్చ కురు ప్రవీర, శేషం దినానాం తవజీవితస్య' అని

అవి నూఱుదినములకు సాటియైనవి. అటమీఁద నీదేహమును విడిచి నీవు నీ సత్కర్మములఫలము నొంది వెలుంగఁ గలవు. సూర్యుఁ డుత్తరాయణమునఁ బోవుకాలము నెదురుచూచుచున్న నిన్ను జ్వలించుచున్న యగ్నికి సాటియైన యీదేవతలు వసువు లనువా రిదిగో నందఱును విమానముల నారోహించి మఱేఁగి యుండి నిన్నెదురుచూచుచున్నారు. పురుషప్రవీరా! జగత్తు కాలమునకు లోనయి భగవంతుఁడు సూర్యుఁ డుత్తరాయణము నకుఁ దిరిగినంతమాత్రనే నీవువిద్వాంసులు దేనినిబొంది మరలి రారో యట్టి యుత్తమలోకములను బొందఁగలవు. భీష్మా! నీ విహ లోకమును విడిచిపోఁగానే లోకమునందు జ్ఞానములన్నియు

మూలము. 'ఇఁక నీజీవితకాలము ఏఁబదియాఱు దినములున్నవి' అని యర్థము. అయినను భీష్ముఁడు 'అష్టపఞ్చాశతం రాత్ర్యః శయాన స్యాస్య మే గతాః' అని తాను పరుండినది మొదలుకొని యేఁబదియెనిమిది దినములని చెప్పఁబోవు చున్నాఁడు. వానిలో నింతవఱకుఁ జెప్పిన దినములు ఇరువది యెనిమిది—ఎట్లన—భీష్ముండు శరతల్పమునఁ బడినపిదప యుద్ధము జరిగిన దినములు ఎనిమిది. పిదప దుర్యోధనుఁడు మృతినొందిన యాశౌచ దినములు పదునాఱు. ఇరువదియేనవనాఁడు శ్రాద్ధము. ఇఱువదియాఱవనాఁడు పట్టణప్రవేశము. ఇరువదియేడవనాఁడు పట్టాభిషేకము. ఇరువదియెనిమిదవనాఁడు ప్రజల నాశ్వాసించుట. ఇరువదితొమ్మిదవనాఁడు భీష్ముని కడకు వచ్చుట. అది మొదలుగా ముప్పదిదినములు శేషించియుండునవి. కాఁబట్టి 'పఞ్చాశతంషట్' అనుట 'పఞ్చ ఆశతం షట్' పఞ్చషట్ అయిదు ఆర్లు=ముప్పది దినములు. ఆ ముప్పది దినములను 'ఆశతమ్=శతావధి' నూఱు దినములచేతఁ జేయఁదగినంత ముప్పది దినములచేతను జేయుంగూడునని యర్థము గ్రహించునదని మఱియొక వ్యాఖ్యానము. ప్రతాపచంద్రు లేఁబదియాఱు దినములు మిగతయని యర్థముచేసియున్నారు.

మిక్కిలి కీడ్పడిపోవును. ఆకారణమునుబట్టియే యందఱును ధర్మ వివేచనమునకై నీసమీపమునకు వచ్చియున్నారు. కావున, సత్య సంధుఁ డగుయుధిష్ఠిరుఁడు జ్ఞాతిశోకమువలనఁ దెలివిచెడియున్న వాఁడుగాన, ధర్మార్థయోగములతోఁ గూడిన యథార్థవచనంబుల నతనిశోకము పోవునట్లుగా నుపదేశింపుము' అనెను. ఇది యే బదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

> భీష్ముఁడు తనకు శస్త్రబాధచే ధర్మోపదేశము నకుఁ బటుత్వము లేదనఁగా కృష్ణుం డతనికి శరీరదార్ఢ్యాదు లొసంగుట. అంతే సాయం కాలము కాఁగా వారువారు తమతమ నెలవుల కరుగుట.

అంతఁ గృష్ణుండు ధర్మార్థయుక్తముగాఁ జెప్పినయాహిత వచనమువిని భీష్ముఁడు చేమోడ్చి యతనితో 'లోకనాథా! మహా బాహూ! అచ్యుతా! నారాయణా! శివా! నీ వాక్యమును విని సంతసంబునఁ జెప్పలఁ దేలితిని. వాక్పతీ! నీసన్నిధియందు నేనేమి చెప్పఁబోయెదను. వాక్కుచేతఁ జెప్పఁదగినదంతయు నీదువాక్కయిన వేదమం దడఁగి యున్నది. ఇహలోకమందును, బుద్ధిమంతు లకుఁ బ్రియమయిన దేవలోకమందును జేయఁబడినదియుఁ జేయ వలయునదియు నన్నియు బుద్ధిమంతుఁ డగునీవలన వెలువడు చున్నవి. నీ క్షేత్రాల ధర్మార్థకామమోక్షముల స్వరూపములను జెప్పువాఁడు, దేవరా జయిన యింద్రునిమోక్షాల దేవలోకమును బట్టిచెప్పువానికి సాటియగును. మధుసూదనా! నామనసో బాణ

ముల దెబ్బలచే వ్యథ నొందియున్నది. నాయంగములు విరవిరఁ బోవుచున్నవి. నాబుద్ధియుఁ దెలివిడిగాకున్నది. ఏదేని కొంచెము మాటలాడుటకు నాకు మతియుఁ బయిపయిఁ దోఁపకున్నది. గోవిందా ! విషాగ్నులకు సమానము లయినబాణములచే పీడింపబడుచున్నవాఁడనుగాన నాకు సత్త్వ యుడిగిపోవుచున్నట్లున్నది. ప్రాణములును వేగిర పడుచున్నవి. నామర్మములు పురపుర నెరియుచున్నవి. నామనస్సు తిరుగుడు పడుచున్నది. దౌర్బల్యమువలన పలుకు నాలుకకు రాకతడఁబడుచున్నది. ఇట్టిస్థితియందున్న నే నెట్లు చెప్ప నుత్సహింతును ? కృష్ణా ! నాయెడ చక్కఁగననుగ్రహింపుము. మహాబాహూ ! నన్ను క్షమింపుము. నేనేమియుఁ జెప్పఁజాలను. నీసన్నిధియందు బృహస్పతి యైనఁ బలుకఁదొడగెనా విరవిరఁబోవును. నాకు దిక్కులనియు నాకాశమనియు భూమియనియుఁ దెలియకున్నది. మధుసూదనా! వట్టినీబలము వలననే నిలిచియున్నాను. కాఁబట్టి సకలవేదములకును వేదమవై వెలుంగు నీవే ధర్మపుత్రునకు వలయుహితమును జెప్పవేఁడెదను. లోకములకుఁ గర్తయు శాశ్వతుండునయిన నీవుఁగల ననుబోఁటి వాఁడొకఁడు గురువుముంగల శిష్యుండునుంబోలె నెట్లుమాటాడఁ గలఁడు' అనెను.

అందులకుఁ గృష్ణుఁడు 'ఈ చెప్పఁబడినమాట కురుకులధురంధరుఁడును మహావీర్యుండును మహాసత్త్వుండును స్థిరచిత్తుఁడును సర్వార్థదర్శియునగు నీకు నెంతయుఁదగును. గాంగేయా! బాణములదెబ్బలచే పీడ గలిగియున్నట్లు నాకుఁ జెప్పితివే! అందులకు నేనిదిగో ననుగ్రహించి నీకు వరమొసంగెదను. ప్రతిగ్రహింపుము. నీదేహమునం గలసొలయికయు మూర్ఛయుఁ

దాపమును బీడయుఁగలుగవు. ఆఁకలిదప్పులును బొందవు. అన ఘా! నీజ్ఞానేంద్రియములన్నియుఁ బరిపూర్ణములయి వెలుంగును. నీబుద్ధికి నించుకయినకీడ్పాటు తోఁపదు. నీమనస్సు మబ్బుల నుండి విడివడిన చంద్రునివలె రజస్తమస్సులవలన వీడి యెప్పుడు సత్త్వమునందే నెలకొనియుండును. ధర్మమును గుఱించినది గాని యర్థమును సంబంధించినదిగాని యేదేది నీవుతలంచుకొందువో యాద్దానియందు నీదుబుద్ధిమిక్కిలి యెక్కుడుగాస్ఫురించును. రాజ సింహమా! జ్ఞానమనెడి దివ్యచక్షువుచేత నీలోకమునంగల నాలు గువిధములయిన ప్రాణిసమూహములను, తేటనీటియందుఁ జేఁపలం బోలెఁ, గలరూపునఁ జూడఁగలవు!' అనెను. అట్లుచెప్పునపుడు వ్యాసుఁడు మొదలయిన మహర్షులెల్లవారును ఋగ్యజుస్సామవేద వాక్యములశ్రీకృష్ణునర్చించిరి. పాండవులును, భీష్ముఁడును, శ్రీకృష్ణుఁ డు నున్నప్రదేశమున సమస్తఋతువులందును బూచుదివ్యము లగుపువ్వులవాన యాకాశతలమునుండి కురిసెను. వాద్యములన్ని యు మ్రోఁగెను. అప్సరసలు గుంపులుగూడి పాడిరి. అంత దహితమౌ మఁయినదియు ననిష్టమైనదియు నేదియుఁ జూపట్టినదిగాదు. శుభ వాయువు సమస్తమయినవాసనలు గుబులుకొని నిర్మలమై హా యిగా వీచెను. దిక్కులు తెలివినొందెను. మృగములును బక్షు లును నిమ్మళముగా నిటునటు*పరుగిడుచును నఱచుచు నుండెను. అంత నొకముహూర్తమునకు సహస్రకిరణుం డగుసూర్యుఁడు పడమటిదిక్కునందు † మహారణ్యము నొకకొనయందు నగ్ని

* 'ప్రాద్రవన్' అని (జొ. మా.) 'ప్రావదన్' అని (దా. మూలము)

† దివాకరః దహన్నివమి పైకాన్తే ప్రతీచ్యాం ప్రత్యదృశ్యత' అని మూల ము. ఏకాంతప్రదేశమున నడవినిగాల్చువానివలెనని యర్థాంతరము. ఇదిపీఠసమే.

వలెఁ జూపట్టెను. అంత మహర్షులందఱును లేచి శ్రీకృష్ణుని భీష్మునిని ధర్మపుత్రునిని వీడుకొనవేఁడిరి. అంతఁ బాండవులును కృష్ణుండును సాత్యకియు సంజయుండును గృపుఁడును మహర్షులకు నమస్కరించిరి. ఇట్లు వారిచేతఁ జక్కఁగాఁ బూజితులై ధర్మనిరతులగు నా మహర్షులందఱును 'ఱే పిచ్చటికి వచ్చెద'మని చెప్పి నిచ్చలువేగముగాఁ బోయిరి. అట్లె శ్రీకృష్ణుండును బాండవులును భీష్ముని వీడుకొని ప్రదక్షిణముచేసి సుందరములయిన యరదము లారోహించిరి. అంత బంగారుమయములయి చెలువగు కూబరములతోఁ గూడిన రథములును, పర్వతములవంటి మత్త గజములును, గరుడునిలీల వేగమునం బోవుతురగములును, చేత విలు మొదలగునాయుధములఁ దాల్చినపదాతులును, గూడిన సైన్యము ఋక్షవంత మనుపర్వతమునకు ముందును వెనుకను నర్మదానది ప్రవహించునట్లు రథములకు ముందును వెనుకను మితిమీఱిన వేగమునఁబొంగి పొరలిపోయినవి.అపుడు చంద్రుఁడా సైన్యమున కుబ్బుగలిగించుచును, సూర్యుఁడు రసములను బీల్చి కొన్న యోషధులకు మరలఁ దనగుణముచే వాని నెప్పటియట్లు రసవంతములనుగావించుచును,నుదయించెను.అంతఁ గృష్ణుండును బాండవులందఱును నమరావతికి సమం బగుపట్టణమునకుఁ బోయి బడలి, సింహములు గుహాలందుంబోలెఁ దమదమ భవనంబులం బ్రవేశించినవా రయిరి. ఇవి యేఁబదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడును ధర్మరాజు మొదలగు వారును గాల్య కరణీయములం దీర్చుకొని భీష్ముని కడకుఁ బోవుట.

అంతఁ గృష్ణుఁడు గృహమునకుఁబోయి పరుండి నిదుర గూర్కి తెల్లవాఱుటకు నొకజాముండఁగా మేలుకాంచెను. ఆమాధవుఁడు ధ్యాననిష్ఠయందుండి తెలియందగినవాని నెల్లఁ దెలిసికొని పిదప సనాతనం బగు బ్రహ్మమును ధ్యానించెను. చక్కఁగా శిక్షితులై యింపయినకంఠములుగలిగి స్తుతులను బురాణములను దెలిసిన సూతులు ప్రజాపతియు విశ్వకర్తయు నగువాసుదేవుని స్తోత్రముచేసిరి. కొందఱుపాఠకులు చేతితాళములు వైచుచుఁ బాడిరి. కొందఱు శంఖము మృదంగము మొదలయిన వాద్యములు పెక్కువాయించిరి. వీణలు వేణువులు పణవములు మొదలగు వాద్యములధ్వని యతిమనోరమమై * యాకృష్ణునిగృహము నవ్వుచున్నదోయన్నట్లు వెల్లివిరిసి వినఁబడెను. అంత రాజు యుధిష్ఠిరుని నగరునందును మధురము లయినవాక్కులు మంగళశబ్దములతోఁ గూడినవై పాటలయు వాద్యములయు ధ్వనులచేతఁ బెచ్చుపెరిఁగి వినఁబడెను. పిదపఁ గృష్ణుఁడు లేచి స్నానముచేసి యంజలిగీలించి రహస్యముగా మంత్రముల జపించి యంత నగ్ని దరికొలిపి యాజ్యములవేల్చెను. అతఁడు చతుర్వేదవిదులగు బ్రాహ్మణులకు వేయిగోవులను దానముచేసి, యొక్కొక్కరివలనను మంగళాశీర్వచనము లొందెను. పిదప గోవు మొదలయిన మంగళ

* సహాసఇవ విస్తీర్ణః శుశ్రువే తస్యవేశ్మని' అని మూలము. కృష్ణునినవ్వినట్లున్న యాగృహమునందు వ్యాపించెనని యర్థాంతరము.

ద్రవ్యములను స్పృశించి విమల మయినయద్దమందుఁ దన్నుఁ జూచుకొని యంత సాత్యకినిజూచి 'శినిపుత్రా! పొమ్ము. రాజ భవనమునకుఁబోయి మహాతేజుం డయినధర్మరాజు భీష్మునిఁ జూచుటకు నాయితముగా నున్నాఁడాయని తెలిసికొనుము" అనెను. సాత్యకియు నమ్మాటవిని త్వరితముగాఁబోయి ధర్మరా జును దారసించి 'రాజా! కృష్ణునితే రాయితమై యున్నది. జనార్దనుఁడు భీష్మునియొద్దకుఁ బోవువాఁడై నిన్నెదురుచూచు చున్నాఁడు. మహాద్యుతీ! ఇటమీఁదఁ జేయవలసిన కార్యమును తాము జేయఁదగును' అనెను. అందులకు ధర్మరాజు 'అర్జునా! నా తే రాయితపఱుపుము. మనము సైనికులతోఁబోరాదు. మన ముమాత్రమే పోవుదము సుమీ. ధార్మికాగ్రేసరుం డగుభీష్ము నకు గుంపులచేఁ బీడకలిగింపరాదు. కాన ముంగలఁబోవు కావ లివారుసైతము రాక నిలువవలయును. నేఁడుమొదలు భీష్ముఁడు మనకుఁ బరమరహస్యములను జెప్పఁగలఁడు. కాఁబట్టి పెఱజ నులు మనతోఁగూడవచ్చుట నాకిష్టముగాదు' అనెను. అదివిని పురుషసింహుఁ డర్జునుఁడు వెంటనే మేలయినరథ మాయత్త ముగానున్నదని యతనికిఁదెలిపెను. అంత రాజు యుధిష్ఠిరుఁడును నకులసహదేవులును భీమార్జునులును నేవురును నైదుభూతము లవలె నొక్కటిగాఁజేరి కృష్ణునిమందిరమునకుఁ బోయిరి. అమ్మ హాత్ములు పాండవులువచ్చుటయు ధీమంతుఁడు కృష్ణుఁడు సాత్యకి తోడ రథమునెక్కెను. ఆపురుషసింహములు రథములందుండి యొండొరులకు వందనములుగావించి 'రాత్రి హాయిగాజరిగెనా' యని యడిగి మేఘములవలె శబ్దించు నారథరాజములం దరిగిరి. దారుకుఁడు కృష్ణునియశ్వములను, వలాహకము, మేఘపుష్పము,

శైబ్యము, సుగ్రీవము నను వానిని దోలెను. అట్లు దోలఁగా నాకృష్ణుని హయములు మిక్కిలి వేగమును మహాబలమును గలవి గాన, గొరిజల మొనలచే భూమిని దారించుచు నాకాశమును మ్రింగు నవియుంబోలె వేగమునం బోయెను. అంతవారు సమస్తధర్మ ములకును క్షేత్రంబయిన కురుక్షేత్రమునకు వచ్చి దిగి దేవతల తోడంగూడిన బ్రహ్మదేవుఁడునుం బోలె మహర్షులతోడం గూడి శరతల్పంబున వెలుంగుచున్న భీష్ముఁ డున్నయెడకుఁ బోయిరి. అచ్చటికిఁ బోయి కృష్ణుండును సాత్యకియు ధర్మరాజును భీమసే నుండు నర్జునుండును నకులసహదేవులును రథమునుండి దిగి తమ కుడిచేతుల నెత్తి యందుఁ గలఋషులను బూజించిరి. ఆధర్మ రాజు వారలచేతఁ బరివృతుండై నక్షత్రములచేఁ బరివృతుండగు చంద్రుఁడునుంబోలె వెలుంగుచు నింద్రుండు బ్రహ్మదేవునికడకు వచ్చునట్లు భీష్మునికడకు వచ్చెను. ఆకాశమునన్నుండి క్రిందఁబడిన సూర్యుండునుంబోలె శరతల్పంబునఁ బరుండి యున్నమహాబా హుని నాభీష్ముని ధర్మరాజు భయంబున నడుంకుచుఁ గాంచిన వాఁ డయ్యె. ఇది యేఁబదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు భీష్మునితో ధర్మములను జెప్పుమనుట.

జనమేజయుఁడు వైశంపాయనునితో 'మునీంద్రా! సమస్త సైన్యములను హతములయినపిదప ధర్మాత్ముం డగుమహావీర్యుం డును, సత్యసంధుండును, శీలాత్ముండును, మహాభాగుండును, శంతనుపుత్త్రుండు నగుపురుషసింహుఁడు భీష్ముఁడు వీరశయనం

బగు శరతల్పంబునఁ బరుండియుండ, నతనిఁ బాండవులు బలసి కొలుచుచుండఁగా నట్టివీరులు సమాగమమొందినపుడు కథ లే మేమి జరిగెను ? నాకుఁ జెప్పు'మని యడిగెను. వైశంపాయనుఁడు 'రాజా ! కురుపితామహుం డాభీష్ముఁడు శరతల్పగతుండై యుం డఁగా తపస్సిద్ధులగు నారదాదిఋషులును హతశేషులయినధర్మ రాజు మొదలగురాజులును, ధృతరాష్ట్రుఁడును గృష్ణుఁడును భీముం డును, అర్జునుఁడును నకులసహదేవులును మొదలగువా రతని యొద్దకువచ్చి కూడిరి. అమ్మహాత్ములందఱును భూమియందుఁబడిన సూర్యుండునుంబోలె వెలుంగుచున్నభీష్మునిఁ జూచి కొంతశోకిం చినవారయిరి. అంత దివ్యదృష్టిగలనారదుఁ డొకముహూర్తము సేపాలోచించి యంతఁ బాండవులను హతశేషులయిన రాజుల నందఱను జూచి 'రాజులారా ! కాలమునకుఁదగినది చెప్పెదను. ఈ భీష్ముని మీరు తెలియఁగోరునదెల్ల నడుగుదురుగాక. అందుల కిదియ తగినకాలము. ఏలన భీష్ముఁడు సూర్యునివలె నస్తమింపఁ బోవుచున్నాఁడు. ఇతఁడు తనప్రాణముల విడువఁ దలఁచుచు న్నాఁడు. కాన మీరందఱు నితని నడుగుఁడు. నాలుగువర్ణముల వారికిని గలనానాధర్మములనన్నింటిని బూర్ణముగా నితఁడెఱుం గును. ఈ వృద్ధుఁడు దేహమును వీడి పరమంబులగు లోకము లను బొందనున్నాఁడు గాన శీఘ్రముగా మనసునందుఁబొడ కొనియున్నసందేహముల నితనినడుగుఁడు" అనెను. నారదుఁడిట్లు చెప్పినదివిని రాజులందఱును భీష్మునిపొంతకుఁబోయిరి; కాని యతని నడుగనేరక యొకరినొకరు చూచుకొనిరి. అంత ధర్మరాజు కృష్ణునిఁజూచి "దేవకీనందనా ! పితామహునిఁ బ్రశ్నించుటకు నీకన్నదక్షుఁ డెవ్వఁడును శక్తుఁడుగాఁడు. మధుసూదనా ! యదు

తిలకా ! ఇందుఁగల మాయందఱిలోపల నీవేకదా యుత్తముం డవు; సర్వధర్మవిదుండవును. కాఁబట్టి నీవే మొదటఁ బితామహునితో మాటాడుము' అనెను. అందులకుఁ గృష్ణుఁ డప్పుడడ్డులేక భీష్ముని యెదుటఁబోయి 'రాజసత్తమా ! రాత్రి నీకుహాయిగాఁ గడచెనా ? నీకు బుద్ధి తేటఁదనముగలిగి తోఁచుచున్నదా ? జ్ఞానములన్నియుఁ జక్కఁగాఁ దెలియుచున్నవా? హృదయము గీడ్పడకున్నదిగదా? మనసునఁ గలంత లేదేకదా?' యనియడిగెను. అందులకు భీష్ముఁడు 'వృష్ణికులతిలకా ! నీ యనుగ్రహమువలన నా దేహమునందలి మంటయు, బడలికయు, తబ్బిబ్బును, సత్తువలేమియు, తెవులును, నొవ్వును నన్నియు నప్పుడే తొలఁగిపోయినవి. మహాద్యుతీ ! జరిగినదియు జరుగనున్నదియు జరుగుచున్నదియు నన్నియును నఱచేతి యుసిరికవలె నాకుఁ గానవచ్చుచున్నవి. వేదోక్తములయిన యగ్నిహోత్రాదిధర్మములును, వేదాంతములందలి శమదమాది ధర్మములును, నీ విచ్చినవరమువలన, అచ్యుతా! యన్నింటిని కనుఁగొనుచున్నాను. శిష్టులు చెప్పిన ధర్మమును నాహృదయమునఁ దోఁచుచున్నది. జనార్దనా ! ఆయాదేశములకు జాతులకుఁ గులములకును దగిన యాయాధర్మములను దెలిసినవాఁడనైతిని. నాలుగాశ్రమములధర్మములును రాజధర్మములును నన్నిటిని జక్కఁగా నెఱుఁగుచున్నాను. ఏదేది యెప్పుడెప్పుడు చెప్పవలయునో నేను జెప్పఁగలను. నీప్రసాదమువలన నామనస్సునందు మంచితెలివి దొలఁకాడుచున్నది. నీమూర్తిని ధ్యానించినందున నేను బాటవము హెచ్చి వయసుకానివలె నయితిని. జనార్దనా ! నీప్రసాదమువలన లోకమునకు మేలెద్దియో చెప్పుటకు సమర్థుఁడనగుచున్నాను. నీయంతట నీవే పాండవునకు

మే లెద్దియో యేల చెప్పరాదు? మాధవా! ఈవిషయమైనయుద్దేశ మేమో వేగ చెప్పుమా' అనెను.

అందులకుఁ గృష్ణుఁడు 'కురుసత్తమా! కీర్తికిని శ్రేయస్సునకును నేను మూలమని యెఱుంగుము. అన్నివస్తువులును మంచివిగాని చెడ్డవిగాని నావలననుండియే కలుగుచున్నవి. చంద్రుఁడు చల్లనికిరణములు గలవాఁడనఁగా నాశ్చర్యపడుమనుష్యుఁడు లోకమునం దెవఁడేని గలఁడా? అట్లె నాకు యశస్సునిండియున్న దనఁగా నెవఁడాశ్చర్యపడును? కాఁబట్టి మిక్కిలియుఁ ద్యుతిచే రాజిల్లుచున్న నీకు మఱియు నెక్కుడు యశస్సు గలిగింపవలయునని తలఁచి విపులమయినబుద్ధి నీకొడఁగూర్చితిని. ఈభూమి స్థిరముగా నెలకొని యుండునంతదాఁక నీదుకీర్తి కొఱవడక లోకములందుఁ బర్వి యెందును సంచరింపఁగలదు. పాండవుల ప్రశ్నములకు నీవు చెప్పునుత్తరమంతము వేదవచనముంబోలె భూతలమున నెలకొనియుండుఁగాక. నీవచనమును బ్రమాణముగాఁగొని తనమనసుచేతఁ దన్నెఱుంగుమనుష్యుఁడు, శరీరముపోయినపిదప సమస్తపుణ్యములఫలము ననుభవించును. భీష్మా! నీకీర్తి మఱియు నెట్లు పెచ్చు పెరుఁగునని యందులకై నీకు దివ్యమతి నొసంగితిని. భూతలమున మనుష్యుని* యశస్సు వెలయునంతదాఁక వానికీర్తి యక్షయమై యుండును. ఇదినిజము. యుద్ధమునందుఁ జావఁగా మిగిలినరాజులందఱును బెక్కుధర్మములు వినఁగోరి నిన్నుబలసి నలుప్రక్కలఁ గూర్చుండియున్నవారు. వారలకు నీ వుపదేశము సేయుము. నీవు వయసునందుఁ బెద్దవు, చదు

* యశస్సు పరచిత్తచమత్కారజనకమగు గుణసమూహము. కీర్తి పరులు సాధువుగాఁ జెప్పికొనుట యని రెంటికి భేదము తెలియునది.

వరివి, ఆచారవంతుఁడవు, రాజధర్మములందును దక్కంగల ధర్మములందును గుశలుండవు. నీవు పుట్టినదాదిగాఁ బాపమను నది కొంచెమయినను నీయందుఁ గలుగఁజూచినది లేదు. రాజులం దఱును నిన్ను సమస్తధర్మములను దెలిసినవాఁడని తెలియు దురు. రాజా ! తండ్రి కొడుకుల కుపదేశించునట్లు నీవు వారలకుఁ బరమం బయిననీతి నుపదేశింపుము. నీవు మహర్షులను దేవతలను నెల్లప్పుడు నుపాసించినవాఁడవు. కాన, వీరలకు నీధర్మములను నశేషముగాఁ దప్పక చెప్పవలయును. ధర్మమును వినవలయునని కోరి యడిగినవారికి నట్లడుగఁబడినవాఁడు తెలిసినవాఁడై యుండె నేని వారికిఁ దప్పక చెప్పవలయుటయే ధర్మమని బుద్ధిమంతులు చెప్పెదరు. ప్రభూ ! అట్లు బదులు చెప్పనియెడలఁ గడిఁదిదోషము కలుగునుజుమీ. కాఁబట్టి ! తెలిసినవాఁడవుగాన నీవలనఁ దెలిసికొనఁగోరి నీదుపుత్రులును బౌత్రులును నడుగుసనాతన ధర్మములను వారలకు నుపదేశింపుము " అనెను. ఇది యేఁబది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు భీష్మునితో ధర్మరాజుజంకుట చెప్పఁగా
భీష్ముఁడు ధర్మరాజునకు సమాధానముచెప్పి
ధర్మము నడుగ ననుమతియిచ్చుట.

అంత మహాతేజుఁడు భీష్ముఁడు 'గోవిందా ! నీవు సమస్త భూతములందు నుండునంతరాత్మవు. నీ ప్రసాదమువలన నాదు వాక్కును మనసును దృఢములుగా నున్నవి. ఇఁక ధర్మములను జెప్పెదను. ధర్మాత్ముఁడు యుధిష్ఠిరుఁడు నావలన ధర్మములు

వినునేని; మిక్కిలియు సంతోషంబున పానినెల్లఁ జెప్పెదను. ఏమహాత్ముఁడు, ఏధర్మాత్ముఁడు; రాజుగా నుండుటను దెలిసి మహ ర్షులందఱును మిక్కిలి వార్షించుచున్నారో, యాధర్మపుత్రుఁడు నన్నడుగుఁగాక. ధర్మను లాచరించి యశంబులు వెలుంగుచున్న కురువు లెల్లవారి లోపలను నెవనికి సమానుఁ డొక్కండును గెలుగఁడో యాయుధిష్ఠిరుఁడు నన్నుఁ బ్రశ్నించుఁగాక. ధైర్య మును, దమమును, బ్రహ్మచర్యమును, క్షమయును, ధర్మమును, ఓజమును, దేజమును;ననెడి యీగుణంబు లెప్పుడు నెవ్వానియందు నెలకొనియుండునో యాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక. సంబం ధులను, అతిథులను, ఆశ్రితులను, భృత్యులను, నెవ్వఁడు మిక్కి లియు సత్కరించి బహూకరించునో యాయుధిష్ఠిరుఁడు నన్న డుగుఁగాక. సత్యము, దానము, తపము, శౌర్యము, శాంతి, సామ ర్థ్యము, తొట్రుపడమి యను నివియెల్లను నెవనియందుఁగలవో యాపాండవుఁడు నన్నడుగుఁగాక. ఎవ్వఁడు కామమువలనఁగాని తొందరపడికాని, భయమువలనఁగాని, ధనమునుబట్టికాని, యధ ర్మమును జేయఁడో యట్టి ధర్మాత్ముఁడు యుధిష్ఠిరుఁడు నన్నడుగుఁ గాక. నిత్యము సత్యమును, నిత్యము క్షమయు, నిత్యము జ్ఞానము నుగలవాఁడును, అతిథులకుఁ బ్రియుఁడును, సజ్జనులకు నిత్యమును దానము సేయువాఁడును, నగునాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక. ఎప్పుడును యజ్ఞములును నధ్యయనమును జేయుచుండువాఁడును, సదా ధర్మనిరతుఁడును, క్షమావంతుఁడును, రహస్యము లెల్ల విన్న వాఁడును నగు నాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక' యనెను. అందులకుఁ గృష్ణుఁడు 'రాజా! ధర్మరాజు మిక్కుటమైయిన లజ్జచేతను శాపమగలుగునో యనుభయమువలనను జం

కుచు నీదగ్గఱకు రానేరకున్నాఁడు. తాను లోకనాథుం డయి యుండి లోకములను నాశము చేసినందునను, పూజ్యులగు పెద్దలనును, మాన్యులగు సంబంధులను, బంధువులను, రక్షింపఁదగిన భక్తులను, బూజ్యులయిన యాచార్యులను, బాణములచే భేదించినందునను, దనకు శాపము గలుగునోయని భయపడి నిన్నుఁ గదియరాకున్నాఁడు' అనెను. అందులకు భీష్ముఁడు 'కృష్ణా! దానమును, అధ్యయనమును, తపస్సును, బ్రాహ్మణులకు ధర్మమగునట్లు క్షత్రియులకు యుద్ధమందు దేహమువిడుచుట ధర్మమగును. తండ్రియుఁ, దాతయుఁ, దోఁబుట్టువులును, ఆచార్యుఁడును, సంబంధులును, బంధువులును బొల్లయిన ప్రవర్తనముతో యుద్ధముచేయ వత్తురేని వారలను జంపుట ధర్మమే. కేశవా! కాఁబట్టి నెఱితప్పి యుద్ధమునకువచ్చు లుబ్ధులగుపాపులు గురువులయినను వారలను జంపు క్షత్రియుఁడు ధర్మము తెలిసినవాఁడే కాని వేఱుగాఁడు. పేరాసగొని ప్రాచీనములగుధర్మముల మేరను బాటింపక వర్తించు మనుష్యుని యుద్ధంబునఁ జంపు రాజు ధర్మమును దెలిసినవాఁ డగును. యుద్ధములందు, రక్తము లనునీళ్లును, వెండ్రుక లనుతృణములును, గజము లనుకొండలును, ధ్వజము లనువృక్షములును గలదిగా భూమిని గావించు క్షత్రియుఁడే ధర్మము తెలిసినవాఁడు. యుద్ధమునకుఁ బిలువఁబడిన క్షత్రియుఁడు తప్పక యుద్ధము చేయవలయును. క్షత్రియున కిట్టియుద్ధము ధర్మమనియు నిహపరములు రెంటియందును మంచిగతికిఁ గారణమనియు మనువుచెప్పెను' అనెను.

భీష్ముఁ డిట్లు చెప్పఁగా యుధిష్ఠిరుఁడు మిక్కిలి వినయముతో నతని కన్నులకెదుటఁ జని యతని యడుగులను బట్టుకొని వంద

నముచేసెను. విలుకాండ్రందఱిలోపలను మేటి యగునాభీష్ముఁడు, సంతోషంబున ధర్మరాజు శిరసు మూర్కొని గారామునఁ గూర్చుండు మనిచెప్పి "కురుసత్తమా! నాయనా ! భయపడకుము. మిక్కిలి చనవున నన్ను వలసినదడుగుము" అనెను. ఇది యేఁబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పుట.

ధర్మపుత్త్రుఁడు కృష్ణునకును బితామహుం డగుభీష్మునకును బ్రణామముచేసి, యందుఁ గల పెద్దలయందఱ యనుమతివడసి, ప్రశ్నము సేయువాఁడై 'రాజా ! ధర్మవిదు లయినవారు రాజుల ధర్మమే పరమమైనదని చెప్పెదరు. ఇది పెద్దయు భారముగా నాకుఁ దోఁచుచున్నది. కాఁబట్టి పితామహా ! క్షత్త్రియధర్మములు సవిస్తరముగా నాకుపదేశింపుము. రాజధర్మము జగమునందుఁ గలప్రాణిసమూహమునకెల్ల ముఖ్యాధారమయినది. ధర్మము, అర్థము, కామము నను మూఁడుపురుషార్థములును రాజధర్మములందుఁ దగులుకొనియున్నవి. మోక్షధర్మమును మిక్కిలి స్పష్టముగా నిం దడంగియున్నది. వాగెలు గుఱ్ఱమును, అంకుశము గజమును నడంచునట్లు,రాజధర్మము లోకము నడంచునని చెప్పం బడుచున్నది. రాజర్షులు పరంపరఁగా జరుపుచు వచ్చుచున్న యీ రాజధర్మము తబ్బిబ్బు నొందునేని, లోకమంతయుఁ గుదురు తప్పిపోవును; సర్వమును వ్యాకులపడును. సూర్యుం డుదయించి

యాకుంభం బగుచీఁకటిని దొలఁగించునట్లు; రాజధర్మము లోక మున కశుభం బగుపోకడను బోకార్చును. కాఁబట్టి, భరత సత్తమా ! నీవు ధర్మపాలకులందు మేలుబంతివి గావున నాకొఱ కయి మొదట రాజధర్మములను జెప్పుము. పరంతపా ! మాకం దఱకును రహస్యశాస్త్రములు నీవలన నేర్పడుఁగాక. ఏలనఁ గృష్ణుఁడు నిన్నే బుద్ధియందు మిన్నగా నభిమానించు చున్నాఁ డుగదే' అనెను.

భీష్ముని యుపదేశము ప్రారంభము.

భీష్ముఁడు 'మహనీయం బైనధర్మమునకు నమస్కారము. వేధయగు కృష్ణునకు నమస్కారము. బ్రాహ్మణులకును నమస్క రించి శాశ్వతము లయినధర్మములను జెప్పెదను. యుధిష్ఠిరా ! రాజధర్మములను, మఱియు నీవు గోరునట్టి యితరధర్మములను, వివరించుచున్నాను; నియమంబున వినుము. కురుతిలకా ! ప్రజ లను రంజింపఁగోరు రాజు మొట్టమొదట విధిచొప్పున దేవతలను బ్రాహ్మణులను నారాధింపవలయును. దేవతలను బ్రాహ్మణులను నర్చింపఁగా రాజు ధర్మమును జేయకుండుటవలని దోషము నుండి విడివడుచున్నాఁడు; లోకముచేతను బూజింపఁబడు చున్నాఁడు. పుత్రా ! ధర్మరాజా ! ఎప్పుడును బౌరుషముగలిగి పాటుపడుచుండుము. రాజులకుఁ బౌరుషములేక దైవమే కార్య మును సాధింపనేరదు. పౌరుషమును దైవమును రెండును బండికిఁ గన్నులుంబోలె సమస్తకార్యములకు సాధారణమయిన సాధ నము లగును. ఈరెంటియందుఁ బౌరుషము మేలయినదని నేను దలఁచుచున్నాను. తనపౌరుషముచేఁ జేసిన కార్యము తుదను, అది ఫలించినను ఫలింపకపోయినను దైవమునే దృఢముగాఁ



251. ధర్మపుత్రాదులు శరతల్పగతుఁడైన భీష్మునిచెంతకువచ్చి ధర్మోపదేశమును బడయుట.

దలఁచి దుఃఖము నుండికాని సుఖమునుండికాని మనుష్యుఁడు * విడివడుచున్నాఁడు, నీవు చెల్లించు పౌరుషము నిష్ఫలమయి నను దానికై సంతాపపడవలదు. దానియందె యెప్పుడును బూనిక గలిగి యుండవలయును. ఇట్టి విడువని పూనికయె రాజులకుఁ బరమమయిన నీతి. సత్యమువలె రాజులకు సిద్ధిగలిగించునది మఱొకటిలేదు. సత్యమందు నిరతుఁ డయినరాజిహము నందును బరమునందును సుఖంబుండును. రాజేంద్రా! ఋషులకు నయితము సత్యమే పరమమయిన ధనము. అట్లె రాజుల యందు విశ్వాసము గలిగించునది వారి సత్యమునకంటె మఱొక్కటిగలుగదు. గుణవంతుఁడును, శీలవంతుఁడును, అడఁకువయు, నింద్రియనిగ్రహమును గలవాఁడును, † మెత్తఁదనము గల వాఁడును, ధర్మాత్ముఁడును, జూచుట కింపయినవాఁడును, మిక్కిలి దాతయు నగురాజెప్పుడును రాజ్యలక్ష్మిని విడిచి తొలఁగఁడు. కురునందనా! నీతిని జక్కఁగా విచారించి (స్వరంధ్రములనుగప్పికొనుట, పరరంధ్రములను దానరయుట, నిజ మంత్రాలోచమున ననెడియీ) మూఁటిని గప్పిపుచ్చికొని యివి తప్పఁదక్కినసర్వకార్యములందుఁ జక్కటి నూఁదియుండుము. చక్కటి గలిగియున్న

* 'పౌరుషంహి పరంమన్యే దైవం నిశ్చిత్య ముచ్యతే' అని మూలము. ఆ రెంటిలో పౌరుషమే యెక్కుడని తలఁచుచున్నాను. ఏలనఁగా దైవము పౌరుషముచేత నయిన ఫలములవలన నిశ్చయింపఁ బడుచున్నది. కాని తనంతట దెలియునది గాదు' అని యర్థాంతరము 'ముచ్యతే' అనుపాఠము గ్రహింపఁ బడెను.

† మృదుర్ధర్మ్యః అని (కొ. పా) 'మృదుదండః' అని (దా. పా) మృదువయిన దండము గలవాఁడని యర్థము.

ఋషులు పెక్కండ్రు దేవలోకమునందు మోదంబునఁ దేలుచున్నారు. రాజు మెత్తనై యుండునేని యందఱు నతని నుల్లంఘింతురు; మిక్కిలి వేండ్రమైయుండునేని లోకు లతనికిఁ గలఁగుచుందురు. కాఁబట్టి సమయముచొప్పున నతఁడు రెండువిధములనుండవలయును. పుత్రా! నీకు బ్రాహ్మణు లెప్పుడును దండింపఁదగినవారు గారు. ఏలనఁగా లోకమున బ్రాహ్మణులు ప్రాణులందు దుత్కృష్టులయినవారు. మహాత్ముండయినమను నీవిషయమై రెండుశ్లోకములను బాడియున్నాఁడు. నీ వా రెంటిని స్వధర్మము లనుష్ఠించునపుడు మనస్సునం దుంచుకొని యుండవలయును. అవియేవనఁగా-జలములనుండి యగ్నియు, బ్రాహ్మణునుండి క్షత్రియుఁడును, ఱాతినుండి యినుమును బొడమినవి. వాని తేజములు (శక్తులు) అన్నిటఁ జెల్లుచుండునుగానిఁ దమజన్మస్థానములందు నడఁగిపోవును. ఇనుము ఱాతినిగొట్టునపుడును, అగ్ని జలములను గాఁచునపుడును, క్షత్రియుఁడు బ్రాహ్మణుని ద్వేషించునపుడును, నామూఁడును గీడ్పడును - అనుటయే. మహారాజా! కాఁబట్టి యిట్లుండుట తెలిసి నీవు బ్రాహ్మణుల కెప్పుడును మ్రొక్కుచుండవలయును. ఏలన శమసంపన్నులగు నాబ్రాహ్మణోత్తములు, వేదములను యజ్ఞములను దాల్చుచుందురు. సామాన్యముగా విధి యిట్లున్నను, లోకయాత్రకు విఘాతుకు లగుబ్రాహ్మణులను, రాజు తన చేతులబలువుచేత నే యడంపవలయును. తొల్లి మహర్షి శుక్రుఁడు రెండుశ్లోకములను బాడెను. దానిని మనసునం దెచ్చరికగలిగి వినుము. అవి యేవనఁగా-యుద్ధమం దాయుధమెత్తికొని తన్నెదిరింప వచ్చుబ్రాహ్మణుఁడు వేదాంతవిదుఁ డయినను ధర్మము నపేక్షించు రాజు తనధర్మముచొప్పున నాయుధముచేత

నాతని నడంచి పుచ్చవలయును. ఏలనఁగా ధర్మవిదుం డగురాజు ధర్మము నశించుచుండఁగా దానిని రక్షింపఁబూనునేని దానిచే నతఁడు ధర్మమునకు హానిచేసినవాఁడుగాఁడు. ఏలనఁగా నెదిరించినవాని కోపమే యడంచువానికోపమును గలిగించినది. కాన, రాజుకోపము న్యాయ్యమగును - అనుటయే. రాజోత్తమా ! ఈవిధులచొప్పున బ్రాహ్మణులను రక్షించియే తీఱవలయును. వా రపరాధములు చేసిరేని వారిని నీదేశము నవ్వలికి వెడల నంపవలయును. వారు దండమునకుఁ దగియుండినను నీవు వారిని బీడింపరాదు. బ్రహ్మహత్య, భ్రూణహత్య, గురుతల్పగమనము, రాజును ద్వేషించుట యనెడియీదోషములు గలబ్రాహ్మణుని, దేశము వెలికి వెడలఁగొట్టవలయును. కాని, వారికి శరీరదండనము విధించుట యెప్పుడును నీతిగాదు. బ్రాహ్మణులందు భక్తిగలవారియెడను నీవు మక్కువగలిగి యుండుము. *రాజులకు నిట్టిపురుషులను జేర్చుకొనుటకంటె మించిన బొక్కసము మఱొక్కటి లేదు. మహారాజా ! శాస్త్రములందుఁ జెప్పఁబడిన భూమి, జలము, మరుభూమి, వనము, పర్వతము, మనుష్యులు, ననెడి యాఱుదుర్గములందును, ఇవి యేల, సమస్తదుర్గములందును, మనుష్యదుర్గమే పగవారికి నెంతమాత్రము భేదింప నలవిగానిది. కాఁబట్టి వివేకజ్ఞానము గలరాజు నాలుగువర్ణములవారియందును నెప్పుడును దయఁజూపవలయును. ధర్మాత్ముఁడును, సత్యసంధుండు నగు

* ‘న శోకో పరమోఽన్యోఽస్తి రాజ్ఞాం పురుషసంచయాత్’ అని మూలము. ‘నశోకః పరమా తుష్టీ రాజ్ఞాం భవతిసంచయాత్’ అని (దా.మూ) జనులను జేర్చుకొనుటవలన రాజులకు శోకములేక మిక్కిలి సంతోషము కలుగునని యర్థము.

రాజు ప్రజలను రంజించును. పురుషసత్తమా! అయినను నీ వెప్పుడును వారియెడ క్షమగలిగి యుండరాదు. ఏలన రాజు మెత్తనివాఁడై యుండునేని మెత్తంబడిన యేనుంగువలె* నధముఁడే యగును. ఈవిషయమై బృహస్పతిరచితమైన శాస్త్రమునం దీయొక్కశ్లోకము చెప్పఁబడియున్నది. అది చెప్పెదవినుము. "రాజెప్పుడును క్షమగలిగియుండునేని నీచుఁ డయినమనుజుఁడు సయితమతనిని, మావంతు డేనుఁగుతలపయినే యెక్కునట్లు, కీడ్పఱుచుచున్నాఁడు" అనుటయె. కాఁబట్టి శ్రీమంతుఁ డగురా జెప్పుడును మృదువుగాను నెప్పుడును వేండ్రముగాను నుండక మిక్కిలి చల్లఁగను మిక్కిలి వేఁడిగను లేకుండు వసంతకాలపు సూర్యునివలె నుండవలయును. మహారాజా! రాజు తన వారిని బరులను వారుచేయు కార్యములను బ్రత్యక్షముగాఁ జూచుటచేతను, ముఖవికారాదులయిన యనుమానములచేతను, దక్కినయెడల వారిచేతల నుపమానముగాఁ గొనుటచేతను, పురుషులలక్షణములను జెప్పు సాముద్రికాదిశాస్త్రములచేతను, నెప్పుడును బరీక్షింపవలయును. † సమస్తములయిన వ్యసనములను నీవు దిగవిడువవల

---

* 'అథ మోహి మృదూరాజా' అని మూలము. 'అధర్మోహి మృదూరాజా' అని(దా.మూ) రాజు మృదువుగా నుండునేని ధర్మవిరోధి యగునని యర్థము.

† వ్యసనములు పదునెనిమిది—వానియందు వేఁట, జూదము, పగలు నిదురించుట, పరులనిందించుట, స్త్రీలోలత్వము, మదము, వ్యర్థప్రయత్నము, ఆట, వాద్యము, అనెడి యీపదియును గామమువలనఁ గలుగునవి. తెలియనితప్పును వెలిపుచ్చుట, తప్పులేనివానిని దండించుట, కపటముగా బాధించుట, పరులయభ్యున్నతికి యీర్ష్యపడుట, పరులగుణములను దోషములుగాఁ జెప్పుట, పరులధనము నపహరించుట, పరుసంపుమాటలు, క్రూరమయిన దండనము అనెడి యీయెనిమిది,

యున్న, * వాని నీ వెంతమాత్ర ముపయోగింపరాదని కాదు; వానియందు మిక్కిలి తగులుమాత్రము గూడదు. † వ్యసనముగలవాఁడు లోకమునఁ గీడ్పాటునొందుచున్నాఁడు. మిక్కిలి ద్వేషించునట్టి రాజు ప్రజలమనస్సు గలంచుచుండును. రాజెప్పుడును ‡ గర్భిణీధర్మమునం దుండవలయును. ఇట్లు చెప్పుటకుఁ గారణమును వినుము. గర్భిణి తనమనసునకును నాలుకకును నింపయినవస్తువును భుజియింపక యాగర్భమునకు హిత మయినదానిని గయికొనునట్లు, ధర్మము ననువర్తించు రాజు తనకుమాత్ర మింపయినదానిని విడిచి ప్రజల కేది హితమో దానియందే యెప్పుడును దప్పక వర్తింపవలయును. పాండవా! నీ వెప్పుడుగాని ధైర్యమును విడువరాదు. ఏలనఁగా రాజు ధైర్య

మిది క్రోధముచేఁ గలుగునవి. మొదటితెగయందలి పాపము, జూదము, స్త్రీలోలత్వము, అను నాలుగును, రెండవతెగయందలి పరులసొమ్ము నపహరించుట, పరుసనిమాట, క్రూరదండనము అనెడి యీమూడును మిక్కిలి కష్టము లయినవి.

* ఇందులకు 'నచైవ న ప్రయుంజీత సంగంతు పరివర్జయ' అని మూలము. 'న చైతాని ప్రయుంజీథాః సంగంతు పరివర్జయ' అని (దా. మూ) దానిని ప్రయోగింపవలదు. వానియందు సంగము దిగవిడువుమని యర్థము. ఇది యంత సరసముగాదు.

† 'వ్యసనీ యస్తులోకేఽస్మిన్పరిభూతో భవత్యుత' అని మూలము. 'లోకస్య వ్యసనీ నిత్యం పరిభూతో భవత్యుత' అని (డా. మూ) వ్యసనముగలవానికి లోకులందఱవలనను నెపుడుఁ గీడ్పాడు నొందుచుండునని యర్థము.

‡ అనఁగా తల్లి కడుపునందలి బిడ్డయందుంబోలె, రాజు ప్రజలయందు వర్తింపవలయును.

ముగలిగి దండమును స్పష్టముగాఁ గావించుచుండునేని * యతని యాజ్ఞకు నడ్డులేక చెల్లుచుండును. పనివాండ్రతో మితిమీఱి పరిహాసమాడరాదు. అందుఁగలదోషమును జెప్పెదనువినుము. ఒడయుఁడు తన్నుఁగొలిచి బ్రతుకువారితో మిక్కిలికలయికగా నుండెనేని వారతని నంతగా † సరకుసేయరు; మఱి తమతమకు నియతములయిన పదములయందు నిలువరు. ఒడయనిమాటను మీఱి నడుతురు. ఒకపనికిఁ బుచ్చినయెడల వారుపోవఁ గొంకుట యేకాక; పోయినను నధిపతి రహస్యములను వెలిపుత్తురు. (అడుగరాని రహస్యమునైన నడుగుదురు.)యాచింపరాని దానినయిన యాచింతురు. ఒడయుఁడు భుజింపఁదగినవస్తువులను భుజింతురు. రాజు తమపయిఁ బ్రభుత్వమునెఱపెనేని కోపించి మండిపడుదురు. అతనికంటె మించి వెలుఁగఁజూతురు. లంచములు దీసియు, మోసపుచ్చియు నతనికార్యములు చెఱుపుదురు. రాజునుత్తరువులంబోని కల్ల పత్రికలను గల్పించి రాజ్యము నిస్సారమును జేయుదురు. అంతపురపునాఁడు కావలివారితో తగులు గలిగియుందురు. రాజువలెనే వేషములు వేసికొందురు. రాజు సన్నిధియందే లజ్జవిడిచి యోకిలించుట, యావులించుట, యుమియుటయుఁ జేయుదురు; అతనిని గుఱించిన మాటలను నితరులుతోడఁ గొంకులేక ముచ్చటింతురు. రాజు మెత్తనై యుండెనే

* 'ధీరస్య స్పష్టదండస్య నహ్యాజ్ఞా ప్రతిహన్యతే' అని (దా. మూ.) 'నభయం విద్యతేక్వచిత్' అని (ఔ. మూలము) ఎచ్చటను భయముగలుగదని యర్థము.

† 'అవమన్యంతి భర్తారం సంఘర్షా దుపజీవినః' అని మూలము 'సహర్షముపజీవినః' అని (దా. మూ) పరియాచకమాడు నొడయని పాటింపరని యర్థాంతరము.

నియు బరియాచక మాడువాఁడేనియు నతనిభృత్యు లతనినంత మాత్రము గణింపక యతఁడెక్కఁదగినగుఱ్ఱమునుగాని, యేనుఁగునుగాని, రథమునుగాని యుబ్బున నారోహింతురు. అతని నినుపాదులు కొలువునందే, 'రాజా! ఇది నీకుఁ జేయనలవిగాదుపో, ఇట్లుచేయుట చెడ్డపని' యని యిట్టిమాటలు పలుకుదురు. అందులకు రాజు కోపించునేని వారు నవ్వనే నవ్వుదురు. రాజు వారిని మరియాదలఁ బూజించినను వారు*సంతోషమునొందరు. ఒకరినొకరు ఖించఁగోరి యొండొరుల రారాపుచేయుచుందురు. మంత్రాలోచనమును భేదింతురు. రాజ్యమందలి చెడుగులను బయలుపుత్తురు. రాజు నుత్తరువులను నంతగా సరకుసేయక యవజ్ఞతో వేడుకగాఁ జేయుదురు; కాని వెలుపుచేతఁగాదు. †రాజునలంకారములు, భోజనవస్తువులును, స్నానద్రవ్యములును, చందనాద్యనులేపనములు రాజు వయినవనియెన్నక యతని నెగతాళిసేయుచునే జంకుమాలి తా మనుభవింతురు. మఱి తమ కిచ్చినయధికారము లేపాటివని నిందించుచు వానిని దిగవిడుతురు.

---

* 'సంఘర్షశీలాశ్చత దాథవన్త్యన్యోఽన్యకారణాత్' అని మూలము. 'సంహర్షశీలాశ్చ' అని (జొ. మూ) ఇతరకారణములనుబట్టి వారు సంతోషపడుదురు.

†'అలంకారాణిభోజ్యాని తథాస్నానానులేపనే। హేలయావా నరవ్యాఘ్ర స్వస్థాస్తస్యోపభుఞ్జతే' అని మూలము. దీనికి 'అలంకారేచ భోజ్యేచ తథాస్నానానులేపనే। హ్రియమాణే నరవ్యాఘ్ర స్వస్థాస్తస్యోపశృణ్వతః' అని (జొ. మూలము) రాజున కలంకారములు భోజనద్రవ్యములు మొదలయినవి తేఁబడకున్నను నతని యెదుటనే సెమ్మదిగ నూరకుందురుగాని తెచ్చియియ్యరు అని యర్థాంతరము.

న్యాయముగా తమ కయినవస్తువులతో నెంతమాత్రము తనివి నొందక రాజున కయినవస్తువులను బలిమిని గయికొందురు. మఱి పక్షిని ద్రాడుగట్టి యాడించునట్లు రాజుతో వేడుకలాడ నిచ్ఛ గింతురు. లోకులకు 'రాజు మేముచెప్పునట్లు నడచువాఁడు' అని చెప్పి కొనుచుందురు. యుధిష్ఠిరా ! రాజు మెత్తనివాఁడై పరి యాచకము లాడుచుండు నేని యీ చెప్పిన దోషములును నింకను వేఱయినవియు నుప్పతిల్లుచుండును ' అనెను. ఇది యేఁబదియైదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్మములను జెప్పుట.

భీష్ముఁడు 'ధర్మరాజా ! రా జెప్పుడును బూనికగలిగి యుండ వలయును. ఆఁడుదానివలెఁ బూనికలేకుండు రాజును బ్రజలు గొనియాడరు. ఈవిషయమై మహాత్ముఁడు శుక్రుఁ డొకశ్లోకము చెప్పియున్నాఁడు. దానిని నీకుఁ జెప్పెద నాలించి వినుము. అది యేమనఁగా—'యుద్ధమునకు నొల్లనిరాజును, అధ్యయనమునకై బయటఁబోని (లేక యాలుబిడ్డలయందే తగులుగలిగిన) బ్రాహ్మ ణుని, నీభూమి, సర్పమెలుకలనుంబోలె మ్రింగుచున్నది' యని యె. ఈవిషయము నెప్పుడు నీవు మనస్సునం దుంచుకొనవల యును. నరోత్తమా ! సంధిచేసికొనఁదగినవారితో సంధిచేయు ము. విరోధింపఁదగినవారితో విరోధము పెట్టుకొనుము. రాజ్య ముసప్తాంగములకు నెవఁ డొామ్మని పనిచేయునో వాఁడు నీకు గురు వయినను మిత్రుఁడయినను,వానిని దప్పక చంపివే తీఱవలయు ను.మరుత్తుఁ డనురాజు పాడిన యొకపురాతనశ్లోకముగలదు. అది

బృహస్పతిమతముచొప్పన రాజు నధికారమునుగుఱించి తొల్లి చెప్పఁబడినది. అది యేదనఁగా 'ఇది చేయఁదగును; ఇది చేయఁ దగదని తెలియక గర్వించి చెడుదారిని ద్రొక్కినవాఁడు గురువ యినను వానికి * దండము చేయవలసిన దెప్పుడును తప్పరాదు' అనియె. బాహుని పుత్త్రుండగుసగరమహారాజు బుద్ధిమంతుఁ డుగాన పురజనుల హితమునే కోరి తనపెద్దకొడు కయినయస మంజసుని దిగవిడిచెను. ఆ యసమంజసుఁడు పురజనుల బాలు రను బట్టికొనిపోయి సరయువునందు ముంచుచువచ్చెను. కావు ననే తండ్రి సగరుఁడు మాటికిఁ దెగడి యూరు వెడలఁగొట్టెను. ఉద్దాలకుండనుఋషియు బ్రాహ్మణులకుఁ గపటోపచారము చేసి నాఁడని, మహాతపస్విని శ్వేతకేతుఁ డనుతనగారాబుపుత్త్రుని దిగనాడెను. లోకమునందుఁ బ్రజలను రంజించుటయు, సత్య మును రక్షించుటయు, కపటములేక వ్యవహరించుటయు నను నివి రాజునకు సనాతనధర్మము. (కప్పమునకై ధాన్యములనెత్తి కొనుట మొదలయిన విధముల) రాజు పరులధనమునకు హాని కలిగింపరాదు. తానియ్యవలసిన కూలి మొదలగునవి కాలమున నిప్పింపవలయును. పరాక్రమమును, సత్యవాక్కును, క్షమయు ను, గలరాజు పదవినుండి తొలఁగఁడు. రాజు తనమంత్రము లను వెలిపుచ్చరాదు. క్రోధమును జయింపవలయును. తాను నీతిశాస్త్రముల యర్థము ననుసరించి నిశ్చయములు చేయ వలయును. ధర్మార్థకామమోక్షములు నాలుగింటియందును

---

* 'ఉత్పథం ప్రతిపన్నస్య దండో భవతి శాశ్వతః' అని మూలము. 'పరి త్యాగో విధీయతే' అని (దా. మూ.) దిగవిడువవలయునని యర్థము.

నాసక్తుఁడై యుండవలయును. * మూఁటియందుఁ దన మంత్రాలోచనము గప్పిపుచ్చుకొని యుండవలయును. రాజ్యమంత్రములను వెలువడనట్లు రక్షింపకుండుటకంటె, రాజులకుఁ జెడుగు వేఱెద్దియు లేదు. రాజు నాలుగువర్ణముల ధర్మములను బాలింపవలయును. ధర్మములు సంకరము గాకుండునట్లు రక్షించుట రాజులకు సనాతనధర్మము. తనవారినిదక్క పరులయం దొక్కనిని నమ్మరాదు. తనవారిని సయితము మితిమీఱి నమ్మరాదు. (సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, ఆశ్రయము) అనెడి యాఱుగుణములయందుఁ గల గుణములను దోషములను నిత్యమును బుద్ధిఁగొని కనుఁగొనుచుండవలయును. రాజు తన పగవారియందలి ఛిద్రములు గనుఁగొనుచు, రాజ్యము వృద్ధి హాని సమస్థితుల తత్త్వములను దెలియును. తగిన వేఁగులవారినిగొని పరులమర్మములు గనుఁగొనుచునుండునేని లోకు లట్టివాని నెప్పుడును గొనియాడుచుందురు. రాజు యమునివలె దండము నెఱపుచుఁ, గుబేరునివలె బొక్కసము నార్జించుచుండవలయును. మంత్రి, రాజ్యము, కోట, ధనశాల, గజ తురగాదిచతురంగ,మని తనరాజ్యమునంగల యీయైదింటికిని బరరాజ్యమునం గలయీయైదింటికిని స్థానవృద్ధి క్షయములను దెలియుచుండవలయును. అతఁడు పోషింపఁబడనివారిని బోషించుచుఁ, బోషింపఁబడిన వారిస్థితి నరయుచును, బ్రసన్నమయినముఖము గలిగి చిఱునవ్వుదొలఁకఁ బలుకుచుండవలయును. మఱియుఁ బెద్దల నుపాసించుచు, ప్రాలుమాలికను

* స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాజ్య దుర్గ బలము లేడును శాఖ్యాంగములు. మూఁటియందనఁగా న్యాయలాభభోగములు మూఁడు.

విడిచి యితరులవస్తువులకుఁ బేరాసపడక సజ్జనులనడవడియందే బుద్ధినిలిపి వారి యాచారములను నూటిగాఁ బాటించుచుండవలయును. సజ్జనులచేతనున్న ధనముల నెప్పుడుగాని దీసికొనరాదు. ఆ సత్పురుషలవలన ధనముదీసికొని సత్పురుషులకు నొసంగవలయును. రాజు తనంతటనే దండించువాఁడై దాతయై యాత్మనిగ్రహాము గలవాఁడును, దన పరివారమునడంచి యేలువాఁడును, గాలమెఱిఁగి యిచ్చువాఁడును, గాలమున భుజించువాఁడును, బవిత్రమయిన నడవడిగలవాఁడునై యుండవలయును. సత్కులమునఁ బుట్టినవారును, రోగములేనివారును, బగవారిచే వంచింపఁదరముగానివారును, మంచికుటుంబములతోడి సంబంధము గలవారును, దనయందు భక్తిగలవారును, శూరులును, మానులును, శిష్టుల నవమానింపనివారును, శిష్టులును, సాధువులును, విద్యావిదులును, లోకము నెఱింగినవారును, బరలోకమును బాలించువారై ధర్మములందుఁ దగిలి పర్వతములవలెఁ జలింపకుండువారునునగువారిని, సంపదచే నలంకృతుఁడు కాఁగోరురాజు తనకు నెప్పుడుసహాయులుగా నుంచుకొనవలయును. తనకును వారికిని భోగములందు భేద మెంతమాత్రము లేక సమానతగలిగియుండవలయును. శ్వేతచ్ఛత్రము, ఆజ్ఞయను నీరెంటియందే వారికంటె తనకతిశయ ముండవలయును.తక్కిన భోగములన్నియు వారికిని దనకును సమానములై యుండవలయును. తాను వారియెడ నడచుకొనురీతి యెదుటఁగాని మఱుఁగునఁగాని యొక్కతీరుననే యుండవలయును. ఇట్లుచేయు రాజు దుఃఖమెంతమాత్రమును బొందఁడు. ఏ రాజు లోభియుఁ గపటవర్తనుఁడునై యందఱయెడలను శంకించుచు నందఱసొమ్ములను హరించుచుండునో వానిని వాని

జనులే వేగ * వధించిపుత్తురు. పరిశుద్ధవర్తనము గలవాఁడై †లోకుల మనంబుల రంజించుటయందే యాసక్తి గలిగియుండు రాజు శత్రువులకుఁ జిక్కినను గాని క్రిందుపడఁడు. ఒకవేళఁ గ్రిందుపడినను తోడనే పెరిఁగినిలుచును. కోపము మిక్కిలియు లేక వ్యసనంబులకుఁ బాలుగాకయు క్రూరముగా దండింపకయు నింద్రియముల గెలిచియు వెలయునట్టిరాజు, సమస్తప్రాణులకును హిమవత్పర్వతముం బోలె, సకలప్రజలకును నమ్మి యుండఁగొనందగినవాఁడగును. అతఁడు ప్రాజ్ఞుండై న్యాయగుణముతోఁగూడి పరరాజుల రంధ్రములను గనుఁగొనుటయందే కనుగలిగి,చూచుటకు నింపయి యుండవలయును. మఱియు సమస్తవర్ణములవారికిఁ గల నీతిని అనీతిని జక్కఁగాఁ దెలిసి వలయుకార్యములు వేగముగాఁ జేయువాఁడై క్రోధమునడంచి యెంతయుఁ బ్రసన్నతగలిగి గొప్పమనస్సుతో నుండవలయును; ‡ రోగప్రకృతిగాకయుఁ బ్రయత్నపరుఁ డయ్యు, యజ్ఞాదికర్మములందుఁ దత్పరుఁడయ్యు నుండవలయును; తన్నుఁ దాను బొగడికొనరాదు; § అతఁ డారంభించిన కార్యము లన్నియు లెస్సగా ముగింపునొందియే చూపట్టుచుండవలయును. అట్టిరాజే రాజు

---

* 'వధ్యతే' అనిమూలము. 'బాధ్యతే' అని (దా. మూ.) బాధింపఁబడునని యర్థము.

† 'లోకచిత్తగ్రహేరతః' అని మూలము. 'లోకస్యానుగ్రహేరతః' అని (దా. మూ.)

‡ 'అరోషప్రకృతిః' (జౌ.మూ)

§ ఆరబ్ధాన్యేవకార్యాణి సుపర్యవసితాన్యపి । యస్యరాజ్ఞః ప్రదృశ్యన్తే అనిమూలము. 'న పర్యవసితాన్యపి' అని (దా. మూ)

లందుమిన్న; ఎవని దేశమందు మనుష్యులు, తండ్రియింటఁ బుత్రు
లుంబోలె నిర్భయముగాఁ జరించుచుందురో యారాజే రాజు
లందుమిన్న; ఎవని దేశమందు వసించుజనులు తమధనములను
దాఁచికొనక తెల్లముగా పెంపుసొంపు లనుభవించుచు నయాపన
యములను నెఱింగియుందురో యారాజే రాజులందు మిన్న;
ఎవ్వని దేశమందుఁ గాఁపున్న జనులు తమతమ ధర్మములందుఁ
దప్పక వర్తించుచు దేహమాత్ర సుఖములందు మిక్కిలి ప్రీతి
లేక యంతరింద్రియనిగ్రహమును గలిగియుందురో; విధ్యుక్త
ముగాఁ బరిపాలింపఁబడి రాజునకు వశ్యులై వినయసంపన్ను
లయి జగడ గొండితనములు లేక, దానమునందు రుచిగలిగియు
నుందురో యతఁడే రాజనఁదగును. ఎవనిరాజ్యమునందు, డంభ
మును గపటమును మాయలును మత్సరమును గలుగవో యా
రాజునకే సనాతనధర్మము సిద్ధించును; ఎవ్వఁడు జ్ఞానవంతుల జ్ఞాన
ములను గారవించుచుఁ, దెలియవలసిన *బరహితములగు శాస్త్ర
ములందాసక్తుఁడై, సజ్జనులమార్గము ననుసరించుచు, దానశీలుఁడై
యొప్పునో యారాజు రాజ్యమున కర్హుఁడగును; ఎవ్వనిచారులును
మంత్రాలోచనములును జేసినవియుఁ జేయకుండునవియును నతని
శత్రువులకుఁ దెలియరాకుండునో యారాజే రాజ్యమునకర్హుఁడు.
మున్ను మహాత్ముఁ డయినశుక్రుఁ డొకరాజునుగూర్చి రాజధర్మ
ములను జెప్పినప్పుడీ శ్లోకమును బాడియున్నాఁడు. అది యేద
నఁగా—'మొదట రాజునుబడయవలయును. పిదపభార్యను, బిదప
ధనమునుబడయవలయును. రాజు లేకుండినచో నీలోకమునందు

* 'క్షేమోపరహితేరతః' అని మూలము. 'శ్రేయఃపరహితేర్గతః' అని
(దా.మూ)

భార్యయెక్కడిది ? ధనమెక్కడిది ' అనియే. * కావున రాజ్యమునుగామించువారికి స్పష్టముగాఁ బ్రజలనురక్షించుటకంటెను సనాతనమయినధర్మము మఱొక్కటి రాజ్యమందుఁ గలుగదు. ప్రజారక్షణమే లోకమును ధరించునది. ప్రచేతసునిపుత్త్రుఁడగు మనువు రాజధర్మమునుగుఱించి యీరెండుశ్లోకములు నుదాహరించియున్నాఁడు. దాని నెచ్చరికతో వినుము. అవియేవనఁగా- 'సముద్రమునందుఁబగిలిన యోడను దిగవిడుచునట్టు యీఱుగురను మనుష్యుఁడు విడిచిపెట్టవలయును. వారెవ్వరన-చదివింపనియాచార్యునిని, అధ్యయనముచేయని ఋత్విజుని, రక్షింపని రాజును, ప్రియముగాఁ బలుకనిభార్యను, గ్రామమునందే గ్రుమ్మఱు పసులకాపరిని, అడవికిఁబోవ మంగలినిని, విడువవలయును' అనుటయే. ఇది యేఁబదియాఱవయధ్యాయము.

---

* ఇట ఔత్తరాహకోశములందు 'శ్లోకశ్చాయం పురాగీతో భార్గవేణ మహాత్మనా, ఆఖ్యానేరామచరితే నృపతింప్రతి భారత 'అని యొక్క శ్లోకముగాఁ జెప్పఁబడియున్నది. 'ఆఖ్యానే రామచరితే' అనుటకు రామచరిత్రమనెడి యాఖ్యానమందని యర్థము. దాక్షిణాత్యకోశములందు 'శ్లోకద్వయం పురాగీతం భార్గవేణమహాత్మనా, ఆఖ్యాతే రాజచరితే' అని రెండుశ్లోకములుగానున్నది. 'ఆఖ్యాతే రాజచరితే నృపతింప్రతి' అనుటకు ఒకరాజునకు రాజధర్మము చెప్పినపుడని యర్థమగుచున్నది. ఇందు భార్గవుఁడనుటకు శుక్రుఁడని కొందఱును పరశురాముఁడని కొందఱును నర్థముచేసియున్నారు. ఆశ్లోకములు 'రాజానం ప్రథమంవిన్దేత్తతో భార్యాంతతో ధనమ్ । రాజన్యసతి లోకేఽస్మిౝ కుతోభార్యాకుతో ధనమ్ ॥ 'తద్రాజ్యేరాజ్యకామానాం నాన్యోధర్మః సనాతనః, ఋతేరక్షాంతు విస్పష్టాం రక్షాలోకస్య ధారిణీ ॥ ' ఇందు మొదటిదిమాత్రమే, భార్గవుఁడుచెప్పెనని ఔ- కోశములును, రెండును జెప్పెనని దా-కోశములును, ప్రతిపాదించుచున్నవని తెలియునది.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు మొదటినాఁడు ధర్మరాజునకు రాజధర్మములు చెప్పుట. నాటిసాయంకాలము కృష్ణాదులు తమతమ నెలవులకుఁ బోవుట. }

భీష్ముఁడు 'యుధిష్ఠిరా! ప్రజలనురక్షించుట రాజధర్మములందుఁ జిలికియెత్తిన వెన్నచుమీ. భగవంతుఁడు బృహస్పతి దీనిని దప్ప మఱొక్కధర్మమును గొనియాడఁడు. మహాత్ముండగు విశాలాక్షుండును, శుక్రుండును, దేవేంద్రుఁడును, మనువును, భరద్వాజుండును, గౌరశిరుం డనుమునియు, ననెడియీబ్రహ్మవాదులును బ్రాహ్మణులును రాజధర్మములను రచించినవారు. వీరందఱును నీప్రజారక్షణ ధర్మమునే కొనియాడెదరు. రాజుల కీరక్షణము నోఁడఁగూర్చు సాధనమెద్దియో వినుము. 'బాహాటముగానుండుచారులను రహస్యముగనుండు చారులను నియోగించుట, వారికిఁ దగినకాలములందు వేతనాదుల నిచ్చుట, మచ్చరములేమి, మెలపుతోఁబన్ను పుచ్చుకొనుట, ఉపాయముమాలిపన్ను పుచ్చుకొనకుండుట, సజ్జనుల నేర్పఱచుకొనుట, శూరత్వము, నేర్పు, సత్యము, ప్రజలకు హితముసేయుట, శత్రుపక్షమును జక్కటిచేతఁగాని చక్కటిమాలిగాని వృద్ధినొంద నీకుండుట, ప్రాఁతగిలికూలుట కున్నగృహములను జక్కఁజూచుకొనుట, కాలమునకుఁదగిన శరీరదండనమో ధనదండనమో విధించుట, సాధువులనుగూడిన విడువకుండుట, సత్కులమునఁబుట్టినవారిని బోషించుట, సంతరించుకొనవలసినధాన్యాదులను సేకరించుకొనుట, బుద్ధిమంతులను గొలుచుట, సేనల నెప్పుడును సంతోషపెట్టుచుండుట, ప్రజలను బరామర్శించుచుండుట, కార్యములందు జాల

యక దిటగలిగియుండుట, బొక్కసమును వృద్ధిఁబొందించుట, *శత్రుపురజనులకలయికను భేదించుట, పట్టణమును బదిలముగాఁ గావలియుంచి కాచుట, †కావలివారియందుమిక్కిలి నమ్మిక యుంప కుండుట, శత్రువు మిత్రుఁడు మధ్యస్థుఁడను ముప్పురకలరూపులను బాటించుచుండుట, భృత్యులందు నమ్మిక యుంపక యుండుట, తన పట్టణము నప్పుడప్పుడు తానై చూచుకొనుచుండుట, శత్రువులను దానునమ్మక యే తానుమాత్రము వారలకు నమ్మికలుగలిగించు చుండుట, నీతిమార్గము ననుసరించుచునే యెప్పుడును బ్రయత్న పరుఁడై యుండుట, శత్రువుల నలక్ష్యముచేయకుండుట, యెప్పు డు నయోగ్యులను గూడకుండుట యనునివియే. వీనియందు రాజులకుఁ బ్రయత్నపరత యే రాజధర్మముల కెల్ల మూల' మని బృహస్పతి చెప్పెను. దీనినిగుఱించిన శ్లోకములను జెప్పెదను వినుము. 'ప్రయత్నముచే నమృతము (దేవతలకు) లభించినది. ప్రయత్నముచేత నసురులు హతులయిరి. ప్రయత్నముచేత మహేంద్రుఁ డిందును దేవలోకమందును శ్రేష్ఠత్వమొందెను. ప్రయత్నశూరుఁ డగువాఁడు మాటలందు శూరుఁడగువానికి నెక్కుడయి యుండును. ప్రయత్నశూరు లగువారిని వాక్శూరు లగువారు రంజించుచుఁ గొలుచుచుందురు. ప్రయత్నములేక యుండు వాఁడెంతబుద్ధిమంతుఁడయ్యును వాఁడెప్పుడును శత్రువు

---

* 'శత్రువులు తమవశము గావించుకొన్న పురజనులను వారినుండి వేఱు పఱుచుట. 'శత్రుపక్షా వివర్ధనమ్' (దా. మూ) 'శత్రుపక్షస్య భేదనమ్' (ఔ. మూలము) శత్రుపక్షమువారిని భేదించుటయని యర్థము.

† 'పురగోప్తురవిశ్వాసః' అని మూలము. 'పురగుప్తిరవిశ్వాసః' అని పాఠాంతరము.

లకు విషము లేనిసర్పమునుంబోలె చుల్కఁగా ధర్షింపఁగూడినవాఁడై యుండును. మిక్కిలి బలీయుఁడయినరాజుగూడ తనశత్రువు బలహీనుఁడయి యున్నను వాని నుపేక్షించియుండరాదు. అగ్ని యించుకయినను గాల్చుచున్నది. శత్రువు చతురంగములలో నేదేని యొకయంశమే గలవాఁడయియుండినను, జొరరాని కోట మొదలయినదుర్గము నాశ్రయించియుండునేని, యట్టివాఁడు సమస్తములయిన యంగములు సమృద్ధముగాఁ గలరాజు దేశమును సయిత మంతటిని (ఆదుర్గము బలిమిచే) తపింపఁజేయును. రాజు రహస్యముగాఁ దానాడినమాటయు, శత్రువులను జయించుటకై జనులసమకూర్చుకొనుటయు, అందులకై తాను మనస్సునందుఁగల కపటతంత్రములును, వేఱుకారణములను బట్టియుఁ గల యట్టికార్యమును బయికిఁ * జక్కటిచేతను మెత్తఁదనము చేతను ముసుఁగువైచి కప్పి యుంచుకొనవలయును. రాజు లోకమును † రంజించుటకై మిక్కిలి ధర్మ్యములయిన కార్యముల నాచరింపవలయును. రాజ్యమో మిక్కిలి గొప్పదియగు తంత్రము .దానిని మనస్సు పరిపక్వము గానివారల కెంత మాత్రమును వహింప శక్యముగాదు. రాజ్యమును సకల జనులును నామిషమునుంబోలెఁ గామింతురు. అది పెక్కు సంకటములకుఁ గందువపట్టు; మిక్కిలియు గొప్పదికాన దానిని

---

* 'ఆర్జవేనేహ నిర్జయేత్' (ఔ. మూ) 'మార్దవేనైవ ధారయేత్'(దా. మూ). రెంటికర్థములు నిట వ్రాయంబడియున్నవి.

† 'రంజనార్థ' మ్మని (దా. మూ.) దంభనార్థ' మ్మని (ఔ. మూ). జనులను లోకువ నుంచుకొనుటకై రాజు ధర్మయుక్తముగా నడచుకొనవలయునని యర్థాంతరము. దంభనార్థమనఁగా సంఘూతార్థమని యర్థము.

* మెత్తఁదనముచేతను భరింపఁ దరముగాదు. పరుసనయిన చక్కటిచేతను వహింప శక్యముగాదు. కాన మెత్తని కపటముచేతను బిరుసనిచక్కటిచేతను నెప్పుడును రాజు ప్రవర్తింపవలయును. అట్లు రాజు ప్రజలను రక్షించుచుండు నపుడు దానివలన నతని కేదేని విపత్తి కలిగినను నది యతనికి విపులమయిన ధర్మము దొరకొనుటే యగును. ఇట్టి నడవడిగల వారే రాజులు. కురుకులతిలకా! ఇప్పుడు రాజధర్మములం దించుక మాత్రమును నీకుఁ జెప్పితిని. నీకు సందేహము గలవిషయమును మరల నడుగుము' అనెను.

అంత, వ్యాసుండును, దేవస్థానుండును, అశ్ముఁడును, కృష్ణుండును, కృపుండును, సాత్యకియు సంజయుండును మొదలగు వారందఱును, †నెమ్మొగములు దద్దయుఁ బూవులవలె వికసించుచుండ, సంతోషము పిక్కటిల్ల, పురుషసింహుండును ధార్మికశ్రేష్ఠుండునగు భీష్ముని 'బాగుబాగు' అని పొగడిరి. అంత ధర్మరాజు విన్ననయిన మనంబునఁ గన్నుఁగవఁ గన్నీరు చిప్పిలుచుండ, భీష్ముని పాదములను మెల్ల నంటుచు, మ్రొక్కి 'పితామహా! నేను రేపటికి నాకుఁగల సందేహముల నడిగెదను. ఏలన నిపుడు సూర్యుఁడు భూమియందలి రసమును బీల్చుకొని యస్త

---

*'నశక్యం మృదునా వోఢుం మాఘాతస్థాన ముల్బణమ్। రాజ్యం సర్వామిషం నిత్యమార్జవేనేహ ధార్యతే॥' అని (దా. మూ). వోఢుం మాయాసంస్థాన ముత్తమమ్' ...నిత్యంనార్జవేనేహ ... అని (ఔ. మూ) ఉత్తమమయిన పదవిని కష్టలభ్యమయిన దానిని మృదువయినవాఁడు వహింప నేరఁడని యర్థము.

†'పుష్ప్యమాణమి వాననైః' అని (ఔ. మూ;) 'ఘుష్యమాణమి వాననైః' అని (దా. మూ) ఇది సరసముగాదు.

మించుచున్నాఁడు' అనెను. అంతఁ గృష్ణుఁడును గృపుఁడును ధర్మరాజు మొదలగువారును నందుఁ గలబ్రాహ్మణులకు మ్రొక్కి భీష్మునికిఁ బ్రదక్షిణము గావించి ముదంబున రథంబుల నారోహించిరి. ఆపీరులు, నియమముల నెంతమాత్రమును దప్పనివారు గాన దృషద్వతియను నదియందు జలకమాడి, జలాంజలులు విడిచి మంగళములగు మంత్రములను జపించి విధిచొప్పున సంధ్య వార్చి యంత హస్తినాపురమును బ్రవేశించినవారయిరి. ఇది యేఁబదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముండు ధర్మరాజునకు రాజులయుత్పత్తిని బ్రహ్మ గావించిన దండనీతి శాస్త్రివృత్తాంతమును పృథురాజు చరిత్రమును జెప్పుట. }

అంతఁ బాండవులును యాదవులును దెల్లవాఱఁగా లేచి ప్రాతఃకాలకరణీయములను గావించి పట్టణములవలెఁ జూపట్టుచున్న రథముల నెక్కిపోయిరి. వారు కురుక్షేత్రమును జేరి యనఘుండగుభీష్మునిదగ్గఱకుఁబోయి 'రాత్రి హాయిగాఁ గడచెనా' యని యారథికవర్యు నడిగిరి; మఱియు వ్యాసాదులగు ఋషులకు మ్రొక్కి, వారు తమ్ము నభినందింపఁగా, భీష్ముని నలుప్రక్కలను బరివేష్టించి కూర్చుండిరి. అంత ధర్మరాజు భీష్ముని యథావిధిగఁ బూజించి యంజలిగీలించి యతనితో "రాజు" అనెడి యీశబ్దమొకటి వాడుకయందున్నది. ఇది యెక్కడనుండి పుట్టినది? నాకుఁ జెప్పుము. తక్కిన మనుష్యులకుంబోలెనే రాజునకును జేతులును, బుజములును, గుత్తుకయు నున్నవి. బుద్ధియు

నింద్రియములు మనస్సునున్నవి. సుఖమును దుఃఖమును, వీపును, ముఖమును, గడుపును, శుక్లమును, నెమ్ములును, మజ్జయును, కండయు నెత్తురును, దక్కిన వారివలెనే యున్నవి. మఱియు నిశ్వాసములు నుచ్ఛ్వాసములును, ప్రాణములును దేహమును నతనికిఁ దక్కిన మనుష్యులకుఁబోలెనే యున్నవి. ఇతర మనుష్యులకువలెనే నతనికి జననమరణము లున్నవి. మనుష్యులకుఁ గలగుణము లన్నియు నతనికిని సమముగా నున్నవి. ఇట్లుండియు రాజొక్కఁడే విశేషించిన బుద్ధిగల వారలును శూరులును నగు పెక్కండ్రకు నెట్లధిపతిగా నున్నాఁడు. ఒక్కండే పెక్కండ్రు శూరులును వీరులును నార్యులు నెరసి బెరసియున్న మహీమండలమునంతయు నేలుటయెట్లు? మఱియు లోకులెల్ల నతనిప్రసాదమును గోరుచుండుట యెట్లు? ఒక్కఁడు తెలివినొందియుండెనా లోకమంతయుఁ దెలివి గలిగియుండుటయు, ఒకఁడు కలఁతనొందెనా యందఱును గలఁగుడువడుటయు నిశ్చయముగా నున్నదే! ఇది యెట్లు? నీవలన నిది వినఁ గోరుచున్నాను. నీవు మాటకారులందు మిన్నవు. దీని నంతయుఁ గలిగినది గలిగినట్టు నాకుఁ జెప్పుము. ఇందులకుఁ గారణము మిక్కిలి యల్పముగా నుండనేరదు. ఏలనఁగా నొకనికి దేవునివలె జగమంతయు మ్రొక్కుచున్నది చుమీ!' యనెను.

భీష్ముఁడు 'పురుషసింహమా! రాజ్యమె ట్లుప్పతిల్లెనో యది యంతయుఁ గడమవడకుండ నెచ్చరికగలిగి వినుము. మొదటఁ గృతయుగమం దది కలిగెను. అంతకు మున్ను మొట్టమొదట రాజ్యమును రాజును లేరు. దండమును దండించువాఁడును గలుగఁడు. ప్రజలందఱును ధర్మముచేతనే యొకరినొకరు రక్షిం

చుచు వచ్చిరి. అట్లు వారు ధర్మముచేత నొండొరుల రక్షించుచు కొనుచు రాఁగాఁ గొంతకాలమునకు వారికి దాని పటుత్వము మిక్కిలియుఁ దప్పి యెంతయు దీనత్వము గలిగెను, ఆదైన్యము వలన వారిని మోహము (అవివేకము) ఆవేశించెను. అట్లు మనుష్యులు మోహముబారింబడి యెఱుక రూపుమాసినవారయిరి. దానివలన వారికి ధర్మము నశించినదయ్యె. ఇట్లెఱుక నశించి మోహమునకు లోనై యుండుటచే నపుడు లోభము వారి నందఱఁ గయివసముచేసికొనెను. అంత మనుష్యులు తమకు దొరకొనని వస్తువులను గయికొనుటకుఁ బూనఁగా కామమను నది మఱియొకటి వారిని బొందెను. అట్లు కామమునకుఁ జిక్కిన యామనుష్యులను రాగము పయికొనెను. రాగమునకు లోనై జనులు 'ఇది చేయఁదగును ఇది చేయఁదగ'దని తెలియు వివేకము మానినవారయిరి. అంతఁ బొందరాని పడఁతులను బొందిరి; చెప్పరానిమాటలు చెప్పంబూనిరి. భక్ష్యమా! అభక్ష్యమా! దోషమా!నిర్దోషమా! యని విచారించుటను దిగవిడిచిరి. అన్నియును గయికొనిరి. మనుష్య లోకమిట్లు కలగుండు నొందఁగా నపుడు వేదములు నశించెను; వేదము నశింపఁగా, దానివలన వెడలిన ధర్మమును నాశము నొందెను. ఇట్లు వేదమును ధర్మమును నశింపఁగా దేవతలుకు దిగులు గలిగెను. వారట్లు దిగులుగొని బ్రహ్మదేవుని శరణుచొరంబోయి యాలోకపితామహునిఁ జేరి,యందఱును దుఃఖము నురవడిచేఁగొట్టువడి చేతులు మోడ్చి యద్దేవునితో 'మహాత్మా! మనుష్యలోకమందున్న సనాతనమగువేదము లోభ మోహాదిదోషములవలనఁ గబళితమయినది. కాన మాకు భయ మావేశించినది. వేదము నశిం

చుటచేత (యజ్ఞాది రూపమగు) ధర్మమును నశించెను; దాని చేత ముల్లోకముల నధిపతులుగా నుండుపదవి నొందిన దేవత లందఱును (స్వాహాదులు లేనందున) మనుష్యులకు సమానులగు గతి నొందిరి. మేము క్రిందుగా వర్షించువారము, మనుష్యులు (యజ్ఞాది)ద్రవ్యము లర్పించు రూపమునఁ) బైకి వర్షించువారలు. వారలు యజ్ఞాదికర్మము లుడుగుటవలన మాగతి సందేహముగా నున్నది. కాఁబట్టి మాకేది మేలో యాలోచింపుము. *నీవను గ్రహించి మాకుఁగలిగించిన యీ మహిమ మఱల మాకుఁ గలుగుఁగాక' యనిరి. అంత బ్రహ్మ వారిం జూచి 'దేవోత్తములారా! మీకు మేలెద్దియో యాలోచించెదను, భయపడవలదు' అనెను. అంత నద్దేవుఁడు, తన బుద్ధిచేత లక్షయధ్యాయములుగల శాస్త్ర మును రచించెను. అందు ధర్మమును, అర్థమును, గామమును వివరింపఁబడెను. ఆమూఁటికిని మొత్తమున బ్రహ్మ త్రివర్గ మని పేరి డెను. ఈమూఁడుగాక నాలుగవది మోక్షమును బ్రతిపాదించెను. దాని ప్రయోజనములు వేఱు, గుణములును వేఱు. మఱియునా శాస్త్రమందు మోక్షమును గుఱించిన మఱియొక త్రివర్గము, సత్త్వము, రజస్సు, తమము అనియు (నాలుగవది నిష్కామ ధర్మమును) జెప్పంబడినవి. అందు దండమును గుఱించిన త్రివ ర్గము మఱొకటి, † స్థానము వృద్ధి క్షయ మను నవియుఁ గలవు. మనస్సు, దేశము, కాలము, సాధనములు, కార్యప్రయోజన

---

* 'త్వత్ప్రభావ సముత్థోఽయం ప్రభావో నోభవ త్వయమ్' అని (దా. మూ) 'స్వభావోనో వినశ్యతి' అని (కుం. మూ).

† స్థానము=వర్తకుల సమత్వము, వృద్ధి=తపస్వుల వృద్ధి, క్షయము=చోరుల క్షీణతయని తెలియునది. ఇవియ మూఁడును.

ములు, (సుహృదాది) సహాయులు, (కారణములు) నని నీతిని సంబంధించి యీ షడ్వర్గమును జెప్పంబడినవి. (ధర్మకాండము జ్ఞానకాండములని రెండువిధముల) వేదమును(వ్యవసాయము వర్తకము మొదలయిన బ్రతుకు) వృత్తియు, విపులమయిన దండనీతియు మఱియుఁ దక్కిన విద్యలు నందు నిదర్శితము లయినవి. రాజా! మంత్రము, వాంఛితములను దెలియుట, అందులకయిన రహస్యపు వేఁగులవాండ్రును రాజపుత్త్రుల లక్షణములును, నానావిధములయిన యుపాయములుగల చారులను బన్నుటయు, స్నేహము, సామము దానము భేదము దండము ఉపేక్షయనెడి యైదుపాయములును,బూర్ణముగానం దుదాహరింపఁబడినవి. మంత్రాలోచనము లన్నియు, మంత్రములను భేదించుటయు, మంత్రముల తడఁబాటును, వానిసిద్ధివలనను నసిద్ధివలనను గలుగు ఫలములును, నందు సాంతముగా వర్ణింపఁబడియున్నవి. భయముచేతను, మరియాదచేతను, ధనమునుబట్టియు నేర్పడునవై, అధమము, మధ్యమము, ఉత్తమమునవెడి మూఁడువిధములయిన సంధియు దానియందు వివరముగా రూపింపఁబడినవి. యాత్రాకాలములు *నాలుగును, త్రివర్గము విస్తారమును, ధర్మజయమును, అర్థముచేతనయిన జయమును, ఆసుర(వంచనాదిప్రయుక్తమైన) జయమునని మూఁడుదెగలజయమును, నందు సాకల్యముగా నుపదేశింపఁబడియున్నవి. మంత్రము,రాజ్యము, దుర్గము, సైన్యము, కోశమనెడి యీపంచవర్గమునకుఁగలయుత్తమమధ్య మాధమమను

---

* తనరాజ్యమందు మిత్రవృద్ధి, కోశసంచయమును, బరరాజ్యమందు మిత్రనాశము,కోశహానియు, నని నాలుగుయాత్రాకాలములని యొకవ్యాఖ్య చూపట్టుచున్నది.

లనెడిభేదములును, లక్షణములును జెప్పంబడియున్నవి. ప్రకాశము అప్రకాశము నని దండము రెండువిధములు గలవు. అందు ప్రకాశమును రహస్యమునగుదండమువిధములు సవిస్తరముగాఁ జెప్పంబడియున్నవి. రథములు గజములు, గుఱ్ఱములు, పదాతులు, పనివాండ్రు, ఓడదండు, వేగులవాండ్రు, శత్రుదేశమునకు దారిచూపువారు అని ప్రకాశదండ మెనిమిదివిధములు. రహస్యదండమున, వస్త్రములందును ఆహారములందును సర్పాదిజంగమవిషములను, వత్సనాభాదిస్థానరవిషములను విషచూర్ణములను బ్రయోగించుటయు, అభిచారాదు లయినవివిధ దండములును జెప్పంబడియున్నవి. వేడుక కయిన యుద్ధము నందును జూదమునందును నమ్మికతోఁ గూడినదియుఁ దొమ్మిదవయుపాయమని పండితులు చెప్పునదియు నగు కైతవమును జెప్పంబడియున్నది. ధర్మార్థకామములను నాశము సేయునదియు, ఇష్టానిష్టములగు సమస్తకార్యము లందును గలుగునదియు నగు నుపేక్షయు,ఇంద్రజాలాదికమగు మాయయు, మంచిశకునములును, జెడుశకునములును, వేషమూని పగవారియెడఁ జరించుడంబమును,వంచనయు,చిత్తదోషముచేతఁ జెడుపుటయు,చేష్టలేకుండఁ జేయుటయు, నందుఁ జెప్పంబడుచున్నవి. శత్రువు, మిత్రుఁడు, ఉదాసీనుఁ డనుమూఁడువిధములమనుష్యులును, నవగ్రహములు నక్షత్రములు మొదలగువాని మార్గములగుణములు (విడిపట్టులు గావించుకొను) భూమిగుణములు, మంత్ర యంత్రాదులచేఁ దన్నుఁ రక్షించుకొనుటయు, సమాధానపఱచుటయు, రథములు మొదలయిన యుద్ధపరికరములు క్రొత్తగానిర్మించుటను బరామర్శించుటయు, రథగజ తురగపదాతులకు బలపుష్టికరము లగు

నానావిధములయిన కల్పసిద్ధులును, చక్రము, క్రౌంచము మొదలయిన నానావిధనామములు గలవ్యూహములును, విచిత్రయుద్ధము చేయు కౌశలమును, (గ్రహయుద్ధము ధూమకేతువులు మొదలయిన) యుత్పాతములను, (ఉల్కలుపడుట భూకంపము మొదలయిన) నిపాతములును, చక్కఁగా యుద్ధము సేయు రీతియు, చక్కఁగా పలాయన మొందు పద్ధతియు, ఆయుధముల జ్ఞానమును, వానిని బదును జేయు రీతులును, సేనల వ్యసనములును, వానిని జక్కంబఱచుటయు, వానిని సంతోషపెట్టుటయు, రోగపీడలును, ఆపత్కాలములును, భయకాలములును నందుఁగలవు. మఱియు భేరి మొదలయిన వాద్యముల ధ్వనిచేతఁ బ్రయాణాదులను జెప్పుటయు, పతాకలు మొదలయినవానిచేత వలయునవి తెలుపుటయు, వానిని జూపియు వినిపించియు శత్రువులను మోహింపఁజేయుటయు, క్రూరులయిన చోరులును, అడవిజనులును, నగ్గిని విషమును బెట్టువారును, ప్రతిరూపములను జేయువారును, నను వీరినిగొని శత్రురాజ్యమును బీడించుటయును జెప్పఁబడియున్నవి. శత్రుసైన్యమందలి సేనాపతులను భేదించుటయు, ధాన్యములు చెట్లుచేమలు మొదలగువానిని ద్రుంచివైచుటయు, ఏనుఁగులను మంత్రాదులచేఁ జెఱిపివైచుటయు, మఱియుం గల యాతంకములు పన్నుటయు, పరసైన్యమునందుఁ దనయెడభక్తి గలవానిని మిక్కిలి పూజించుటయు, * పరరాజునకు నమ్మికగలిగించుటయు, రాజ్యము సప్తాంగములు తఱుఁగుటను బెరుఁగు

---

* 'ప్రత్యయోపార్జ నేనచ' అని (ఔ. మూల). పత్యుశ్చోపగ్రహేణచ అని (దా.మూ). పతిని జేపట్టుటచేత ననియర్థము. ఈ పాఠ మసంగతము.

టను సమస్థితియం దుండుటను పాటించుటయు, *పూనినకార్యముల సాధించుటకయిన యుపాయములును, రాష్ట్రమును వృద్ధిఁ బొందించుటయు, శత్రువు మిత్త్రుఁడు మధ్యస్థు లనువారి వి స్తరించి చెప్పుటయు, శత్రుదేశమండలి జనుల వశీకరించుకొను నుపాయమును, బలవంతులగువారిని మర్దించుటయును, బాడవడంచుటయును, మిక్కిలి సూటిగా న్యాయమును వ్యవహరించుటయును, కంటకులను దొలఁచిపుచ్చుటయు, మల్లయుద్ధమును, ఆయుధప్రయోగముల సాధనయు, దానముచేయు పద్ధతులును, వలయుసంభారముల సేకరించు తెఱంగును, పోషణము లేనివారిని బోషించుటయుఁ, బోషితులగువారిని బరామర్శించికొనుటయు, దగినకాలముతుదిని ధనము లొసంగుటయు, వ్యసనములందుఁ దగులు లేకుండుటయు, రాజులకువలయు గుణములును, సేనాపతికి వలయుగుణములను, † ఆయాయుపకరణములయు వానినిగొని పనిచేయుకర్తలయు గుణదోషములనును, దుష్టములగు నానా విధములయిన యింగితములును, అనువర్తించువారికి వలయు నడవడియు, అందఱయెడలను శంకగలిగియుండుటయు, పరాకు మానుటయు, తనకు దొరఁకొననివానిని బడయఁగోరుటయు, దొరఁకొన్నవాని వృద్ధిఁబొందించుటయు, అట్లు వృద్ధినొందినదానిని పాత్రములకు విధ్యుక్తముగా నొసంగుటయు, ధర్మముకొ

* 'కృతసామర్థ్యయోగశ్చ' అని (ఔ. మూ) 'దూతసామర్థ్య యోగశ్చ' అని (దా. మూ).

† కారణస్యచ కర్తుశ్చ గుణదోషాః' అని (దా.మూ) కారణంచ త్రివర్గస్య గుణదోషాః' అని (దా. మూలము) త్రివర్గములకుఁ గారణములయిన వాని గుణదోషములనని యర్థాంతరము.

ఱకును నర్థమునకును గామమునకును, అపాయమును దొలఁగించుటకును ధనము నుపయోగించువిధమును నందు జెప్పఁబడియున్నవి. కామమువలనను గ్రోధమువలనను బుట్టు నుగ్రములగు వ్యసములుపదియు నందుఁ జెప్పఁబడియున్నవి. అందుఁ గామమువలనఁబుట్టినవి-*వేఁట, జూదము, పానము, స్త్రీలని యందు బ్రహ్మచెప్పినవి నాలుగుగా నాచార్యులు చెప్పెదరు. మాటపరుసదనము, ఉగ్రత్వము, దండముపరుసఁదనము, నీతిమాలినశరీరదండనము, ఆత్మహత్య, (లేక దేశము వెడలఁగొట్టుట), అర్థదూషణము (అనఁగా ఒకరిప్రయోజనములనుగాని ధనములనుగాని చెఱుపుట) అని యీయాఱు క్రోధమువలనఁ బుట్టు వ్యసనములును, పలువిధములయినయంత్రములు సేయుటయును, వానివ్యాపారములును జెప్పఁబడియున్నవి. పరరాష్ట్రమునుబీడించుట, పగవారిపైఁ దలపడుట, పొలిమేరల గుఱుతు లగుటెక్కెములు మొదలగు వాని నాశముసేయుట, (పగవారికి విడియు నీడ లేకుండుటకై) పెద్దమ్రాఁకులను గూల్చుట, (కోటలు మొదలగువాని) ముట్టడి, † కృషిమొదలగువాని ఫలములను బాడుసేయుట, ఆయుధాదు లయినయుపకరణములను బ్రోఁగుసేయుట, ¶సైనికులకుఁ గవచములు మొదలగు తొడుగువస్త్రములును,

* 'మృగయాక్షా స్తథాపానం స్త్రియశ్చభరతర్షభ। కామజాని...వాక్పారుష్యంతథోగ్రత్వం దండపారుష్యమేవచ।ఆత్మనో నిగ్రహస్త్యాగోహ్యర్థదూషణమేవచ' అనునివి క్రోధజములగు వ్యసనములు వెరసి పది తెలియునది.

† 'కర్మాంతనాశనమ్' కృషికర్మాదుల, అంత=ఫలమును, నాశముసేయుటయని (దా.మూ).'కర్మానుశాసనమ్' కృషిమొదలయినకర్మములనుఁ బరామర్శించుటయని యర్థాంతరము.

¶ 'అవస్కరోఽథ వమనంతథో పాయాశ్చ వర్ణితాః' (దా.మూ)'వమనం

దానిని జేయునట్టి మేలియుపాయములును వర్ణింపఁ బడియున్నవి. పణవము, శంఖము, ఆనకము, భేరు లనువాద్యములును, (మణులు, పశువులు, భూమి, వస్త్రము, బంగారము, దాసికలనెడి) యాఱువిధములగు ద్రవ్యములను (తనకై) సంతరించుకొనుట, (పరులను బాధించుటకై) వానిని నాశముసేయుట, క్రొత్తగా లభించిన రాజ్యములను నిష్కళముగావించుట, సజ్జనులను బూజించుట, విద్వజ్జనులతోడి కలయిక, జపహోమవిధులను దెలిసియుండుట, మంగళద్రవ్యములను (బంగారు మొదలగు వానిని) స్పృశించుట, శరీరము నలంకరించుకొనుట, భోజనవిధి, ఎప్పుడును ఆస్తిక్యము, * ఒక్కఁడే చేయుప్రయత్నము, సత్యసంధత్వము, తియ్యనిమాట, ఉత్సవములయందు జనులు సభగూడునపుడును గృహములయందును (టెక్కెములు గట్టుట) మొదలయిన కార్యములు, అన్నిరచ్చపట్టులను మనుష్యులు ప్రత్యక్షముగను మఱుఁగునను జేయుకార్యములు, మనుష్యుల నడవళ్లను నెప్పుడును బరికించుచుండుటయును, బ్రాహ్మణులను దండింపరామియు, యుక్తియుక్తముగా దండించుటయు, కొలిచి బ్రతుకువారిని తనతోడి చుట్టఱికమును బట్టియు వారిగుణముల నుబట్టియు గారవించుట, పురజనులను రక్షించుట, రాష్ట్రమును వృద్ధినొందించుట, † ఒక్కొక్కదిక్కునందును శత్రువు మిత్రుఁడు

కథోపాస్యాచ వర్ణితాః ' అని (దా.మూ) ఇది సంగతముగాదు.

* ఏకేన య థోత్థేయం' అనిమూలము. ఒక్కదారినే వృద్ధినొందువిధము ను' అని యర్థాంతరము. ఇది ప్రతాపచంద్రరాయుల యర్థము ననుసరించి వ్రాయంబడినది.

† యుద్ధమునకై వూనినరాజును 'విజిగీషు' వందురు. వాని నలుప్రక్కలనున్న

దాసీనుఁడని ముగ్గురేసిగా నలుదిక్కులందును గలపండ్రెండు రాజుల మండలమునడుమ నున్నరాజు పన్నిద్దఱు రాజులను గుఱించి చేయవలసిన యాలోచనము, దేహమునకైన శౌచము అభ్యంగనము మొదలయినవానినిగుఱించి వైద్యశాస్త్రమునందుఁ బ్రసిద్ధములై యున్న *డెబ్బదిరెండు సంస్కారక్రియలును, ఆయా దేశములయు జాతులయు కులములయు ధర్మములును, వర్ణింపఁ బడినవి. అందు ధర్మార్థకామమోక్షములును వర్ణింపఁబడినవి. ధనములను గోరుటయు, దానికయిన నానావిధములగు నుపాయములును కృష్యాదులను జేయువిధములును, పన్నువచ్చుబడికి మూలమయిన కార్యములను, మాయలను బన్ను తెఱఁగులును, ప్రవహింపక నిలుకడగా నున్న నీటిపట్టుల నీళ్లను జెఱుపువిధములును నందుఁగలవు. లోకులు పూజ్యమగు పెద్దల నడవడినుండి చలింపకుండుటకు వలయునుపాయము లన్నియు నానీతిశాస్త్రమందు వర్ణింపఁబడియున్నవి. ఆ భగవంతుఁడు బ్రహ్మ, శుభంబయినయీశాస్త్రమునురచించి యంత సంతసంబున నింద్రాదులగు దేవతలం జూచి 'లోకమున కుపకారముకొఱకును ధర్మార్థకామములను స్థాపించుకొఱకును జిలికియెత్తిన వెన్నవలె వాక్కునందలి సారమయిన యీ శాస్త్రమును రచించినాఁడను. ఇది

రాజులునలువురును శత్రులనఁబడుదురు. ఆనలువుర కవ్వలనున్న నలువురుమిత్రులనియు వారికవ్వలి నలువురు ఉదాసీనులనియు రాజశాస్త్రియునఁ జెప్పఁబడుదురు. కానవెరసి చుట్టును పన్నిద్దరు అగుదురు.

* 'ద్వాసప్తతివిధా చైవశరీరస్య ప్రతిక్రియా' అని మూలము. 'ద్విసప్తతిమశ్చైవ ప్రోక్తాయాచ స్వయం భువా'యని (దా. మూ.) ఇది యసంగతముగా నున్నది.

దండనీతితోఁగూడి లోకరక్షణమును గావించును. ఇది నిగ్రహములను అనుగ్రహములను జరుపుచు లోకులయందుఁ జరించుచుండును. దండముచేత నీలోకులు (తమతమ పురుషార్థములయందు) జరుపఁబడుటచేతను, లేక దండమె యెల్లవారిని నడపుచుండుటచేతను, ఈశాస్త్రము మూఁడులోకములందును దండనీతియని ప్రసిద్ధినొందును. షడ్గుణముల గుణములసారమయినయిది యీకమీఁద మహాత్ములయం దెంతయు నెలకొనియుండును. ఏలనఁగా ధర్మార్థకామమోక్షములన్నియు నిందుఁ జెప్పఁబడియున్నవి సుఁడీ' యనెను.

అంత సుమాపతియు బహురూపుఁడును విశాలాక్షుండును నగు శివుం డాశాస్త్రమును మొట్టమొదటఁ గయికొనెను.*(అతం డాద్యంతములులేనివాఁడు. జ్ఞానశక్తిమొదలయినశక్తులును, తారకము మొదలయిన విద్యలు నన్నియు నతనివశమందు వర్తించుచుండును.అతఁ డణిమాదిగుణసంపన్నుఁడు.అతనియైశ్వర్యముపరమార్థమైనది. అతండుజగంబులకుఁ బతి;బ్రహ్మాండమునునిర్మించిన ప్రభుండు. అయినను బ్రహ్మదేవుని సంతోషముకొఱకుఁ దనపుత్రుడయినయతనిని పితగాను, బితయగు తా నతనిపుత్త్రునిఁగాను,గొని యతనిలలాటమునుండి వెడలివచ్చి బాలునివలె బెట్టిదముగా రోదనముచేసెను. సమస్తలోకమునకుఁ గర్తయు లోకపితామహుండు నగు బ్రహ్మ యతనికి బంగారంచగాఁ బొడకట్టెను. లెక్కలేని వేలకొలఁదిరుద్రులకు నవ్యయంబగు స్థానమయినవాఁడును, సమస్తప్రాణులకును దేవుండును, నిత్యుఁడునగు నమ్మహాదేవుఁడు)

* ఈకుండలీకరణములోని పాఠము ఔత్తరాహప్రతులందులేదు.

శివుఁ *డొక్కొక్క యుగమందును బ్రజలకు నాయువు తగ్గుచుండుటనుజూచి, మహార్థమును బ్రహ్మరచితము నయిననీతిశాస్త్రమును బదివేలయధ్యాయములు గలదిగా సంగ్రహించెను. మహాతపస్వియు మిక్కిలియు బ్రహ్మణ్యుండు నయినదేవేంద్రుఁడు వైశాలాక్షమనిప్రసిద్ధమగు నాసంగ్రహమును మహేశ్వరుని వలనఁబడసెను. అట్లుపడసి యాయింద్రుఁడు ప్రజలహితముఁగోరి యాశాస్త్రమును బాహుదంతక మనుపేర నైదువేలయధ్యాయములుగలదిగా సంక్షేపించెను. అంత బృహస్పతి దానినే తనబుద్ధిచేత మూఁడువేల యధ్యాయములుగా సంగ్రహించెను. ఈసంగ్రహమే బార్హస్పత్యమనఁబడును. అమితప్రజ్ఞుండును యోగాచార్యుండును మహాయశుండునగు శుక్రుఁడాశాస్త్రమును వేయి యధ్యాయములుగలదిగా సంగ్రహించెను. ఇట్లు మహర్షులు లోకము ననుసరించియుఁ బ్రజలయాయువులు దగ్గుచుండుటఁ దెలిసియు నీశాస్త్రమును సంగ్రహించినవారయిరి. అంత దేవతలు, ప్రజాతియగు విష్ణువుకడకుంబోయి 'మనుష్యులనందఱ నొక్కండుమేటియై యడంచి యేలునంతటి యతిశయము గలవాని నొక్కనిని దెలుపు' మని యడిగిరి. ఆనారాయణుండు కొంచె మాలోచించి తనమనస్సునందుండి మిక్కిలి తేజస్సుగల విరజుండను పుత్రునిఁ బుట్టించెను. మహాభాగుఁడా విరజసుఁడు భూమియందుఁ బ్రభుత్వము నొల్లఁడయ్యె. అతనిబుద్ధి శాస్త్రపరిశ్రమము గలదిగాన సన్న్యాసమందే చెల్లెను. అతనికిఁ గీర్తిమంతుఁ డనుపుత్రుఁ

* యుగానామాయుషోహ్రాసమ్ ' అని మూలము. 'ప్రజానా మాయుషోహ్రాసమ్' అని డె. మూలము.

డు పుట్టెనుగాని, వాఁడును *పంచేంద్రియముల నతిక్రమించి మోక్షమందాసక్తుఁడయ్యెను. కీర్తిమంతునికిఁ గర్దముఁడు పుట్టెను. కర్దముఁడును గొప్పతపముగావించెను. ప్రజాపతియగు నా కర్దమునికి అనంగుఁడుపుట్టెను. అతఁడు ప్రజలనురక్షించుచు సాధువృత్తిగలిగి దండనీతియందుఁ బండితుఁడై యుండెను. అనంగునకు నతిబలుం డనుపుత్త్రుఁడుగలిగెను. వాఁడు తండ్రికిఁ బిదప గొప్పరాజ్యమునుబడసి నీతితోఁ గొంతకాలము రాజ్యముచేయుచువచ్చెను. ఒకప్పు డతఁడెంతయు నీతిమెఱయుచు నంత నింద్రియములకు లోనయ్యెను. అతఁ డొకప్పుడు చక్కఁదనముచే నిక్కుచూపుచున్నదియు గుణములందెంతయు మేలుబంతియుఁ బతివ్రతయునగు సునీథయను దానిని మృత్యువు మానసపుత్త్రిని భార్యఁగాఁ బడసి యింద్రియములకుఁజిక్కి కామమోహితుఁ డయ్యెను. ఆబిడ ముల్లోకములందు వాసికెక్కినది. అది వేనునిఁగాంచెను. ఆ వేనుఁడు రాగద్వేషములవెంటం బడి ప్రజలందు ధర్మము తప్పి వర్తించుచు నుండఁగా బ్రహ్మావాదులగుఋషులు వానిని మంత్రపూతములగు దర్భలచేఁ జంపిరి. మును లావేనునికుడితొడను జిలుకఁగా నందుండిఁ గురూపియు నశుచియుఁ బొట్టివాఁడును నెఱ్ఱని కన్నులును నల్లని వెండ్రుకలును గలవాఁడునై, కాలినమ్రోడువలె నున్న యొకఁడుగలిగెను. వానిని ఋషులు 'నిషీద' అనుపదముచేఁ గూర్చుండుమనిరి. అదికారణముగా వానివలననుండి పర్వతములును వనములును వసతిగాఁ గలకూరులగు నిషాదులును వింధ్యపర్వతమున వసించు మ్లేచ్ఛులును వందలవేలకొలఁదిని ఋ

* 'పంచాతిగోఽభవత్' (ఔ. మూ.) 'మర్త్యాధికోఽభవత్' అని (దా. మూ.) మర్త్యుల కధికుఁడు అనఁగా మోక్షాసక్తుఁడయ్యెననుట.

ట్టిరి. ఆమునులు మఱల నావేనుని కుడిచేతిని దఱచిరి. దాననుండి రూపమున మఱియొకయింద్రునింబోనివాఁడై కవచమును దాల్చి ఖడ్గమును మొలఁగట్టికొని కేలవిలు నమ్ములుదాల్చినయొక పురుషుఁడుపుట్టెను. వాఁడు వేదవేదాంగవిదుఁడు, ధనుర్వేదపారఁగుఁడు. ఆపురుషతిలకునిదండనీతి సమస్తమునాశ్రయించినది. అంత నతఁడుచేతులుమోడ్చి యాఋషులనుజూచి 'నాబుద్ధి మిక్కిలియు సూక్ష్మమై ధర్మార్థములను గనుఁగొనుచున్నది. ఇట్టిబుద్ధిని గొని నేనేమిచేయవలయునో కలరీతిని జెప్పుఁడు. మీరు నాకుఁ బ్రయోజనవంత మగునేపనినిజెప్పెదరో దానిని మీకుఁ దప్పకచేసెదను. ఈవిషయమై విచారమువలదు' అనెను. ఆమహర్షులును దేవతలు నతనితో 'నీవెందెందు ధర్మముగలదో దానినంతయు జంకులేక యాచరింపుము. సమస్తప్రాణులందు నిది ప్రియ మిది యప్రియ మను పక్షపాతమువిడిచి సమముగా వర్తింపుము. కామమును గోపమును లోభమును మానమును దూరమున విడువుము. నీ వెప్పుడును ధర్మమునందే కనుగలిగి లోకమునందెవఁడు ధర్మము నుండి చలించునో వానిని నీచేతులార నెవ్వఁ డయినను గాని దండింపవలయును. మఱియు భూమియందు వెలసిన వేదమతమును పాటికిఁ బాలించెదనని నీవు మనోవాక్కాయములు మూటిచే తను బ్రతినపట్టుము. మఱియును నీవు 'నేనెంతమాత్రమును జంకు లేక వేదమందుఁ బ్రతిపాదింపఁబడిన ధర్మమును దండనీతిని సహాయముగానూఁది యాచరించెదను. ఒకప్పుడు నింద్రియములకు లోఁకువగాను. బ్రాహ్మణులను నాకు దండింపఁగూడదు. లోకమును వర్ణసంకరమునుండి కాచెదను' అనియుఁ బ్రతిజ్ఞసేయు" మనిరి. ఆఋషులను దేవతలనుజూచి వేనుని పుత్త్రుఁడు 'దేవోత్తము

లారా!* బ్రాహ్మణులసాహాయ్యము నాకుండునేని యట్లె యగుఁగాక' యనఁగా నా బ్రహ్మవాదులందఱును 'అట్లె యగుఁగాక' యని యతని ననుగ్రహించిరి. వేదనిధి యగుశుక్రుఁ డతనికిఁ బురోహితుఁడయ్యెను. వాలఖిల్యులు మంత్రులయిరి. సారస్వత్యులు గణములయిరి. మహర్షి గర్గుఁ డతనికి జ్యోతిషికుఁడయ్యెను. విష్ణుని స్వశరీరమునుండి † యెనిమిదవవాఁడు పృథుఁడని లోకమునం దెంతయు వినికి. (శ్రుతులయందు నెంతయుఁ బ్రతిపాదితమై యున్నది.) అతనికిఁ గొంతముందుసూతులును మాగధులును బుట్టియుండిరి. వారిపుడితనికి వందిజనులయిరి. పృథురాజు వారియెడఁ బ్రీతుండయి వారలయందు సూతునకు సముద్రతీరమందలి చవుకుఁ బట్టును, మాగధునకు వానిపేర వెలయు మగధదేశమునొసంగెను. భూమిమున్ను మిక్కిలి మిట్టపల్లముగా నుండెనని మనకుఁ మిక్కిలి వినికిగలదు. అతఁడు దానిని జక్కఁగా సమముగావించెను. ఒక్కొక్కమన్వంతరమందును భూమివిషమమగుచున్నది. పృథుఁడు తనవింటికోపుచేఁ గొండలను బగిల్చి నలుప్రక్కలనుగల శిలలప్రోవుల నెత్తివైచి యీభూమిని సమముగాఁ గావించెను. దేవేంద్రుఁడును బ్రహ్మయు విష్ణుండును, దక్కిన దేవతలును ఋషులును బ్రజలను బాలించు నధికారమం దతనికి నభిషేకముగా

---

* 'బ్రాహ్మణా మే సహాయాశ్చేదేవమస్తు' (దా. మూ.) 'బ్రాహ్మణా మే మహాభాగా నమస్యాః పురుషర్షభాః' అని (ఔ. మూ.) 'నమస్యాః' ప్రొక్కఁ దగినవారు

† విష్ణువు, విరజసుఁడు, కీర్తిమంతుఁడు, కర్దముఁడు, అనంగుఁడు, అతిబలుఁడు, వేనుఁడు, పృథువు అని విష్ణువునుండి పృథుఁ డెనిమిదవవాఁ డగుట తెలియునది. ఇందులకు 'ఆత్మనాష్టమ ఇత్యేవ శ్రుతిరేషా పరానృప' అని మూలము. ఇట శ్రుతియనఁగా జనశ్రుతియనికాని వేదమనికాని యర్థము గ్రాహ్యము.

వించిరి. భూదేవి రత్నములనుగూని పృథుమహారాజును దానై వచ్చిచూచెను. నదీపతి యగుసముద్రుఁడు పర్వతరాజగు హిమవంతుండును రత్నములనుగూని యతనిని సేవించిరి. ఇంద్రుఁడు నక్షయ్యంబగుధన మతని కొసంగెను. బంగారుకొండ యగుమేరువును సువర్ణము నొసంగెను. యక్షరాక్షసపతి యగుకుబేరుఁ డతనికి ధర్మార్థకామముల సమర్థింపఁ జాలినధనము నొసంగెను. పృథురాజు సంకల్పముచొప్పునఁ గోటానకోట్లు గుఱ్ఱములును నేనుంగులును రథములును మనుష్యులును గలిగిరి. అతని కాలమందు దుర్భిక్షమును ముసలితనమును మనోవ్యథలును గలుగవయ్యె. దొంగలవలనను సర్పాదులవలనను మఱి తక్కినవానివలనను భయము నొకప్పుడుఁ గలుగదయ్యె. భూమియందుఁ బంటలు విఱ్ఱవీఁగుచుఁ బండెను. అతఁడు సముద్రమున కెదురుచనునపుఁడావలిజలములు స్తంభించియుండెను. పర్వతములును దొలఁగి యాతనికి దారియిచ్చెను. అతని ధ్వజ మెందును భంగమొందినది గాదు. అతఁడు, గొల్లవాఁ డావునుండి పాలుపిదుకునట్లు భూమినుండి పదునేడువిధము లయినపసులను బిండెను యక్షరాక్షసనాగులం దెవ్వరెవ్వరె కేదేదియిష్టమో వానివాని కాయాదానిని బిండి యిచ్చెను. ఆమ్మహాత్ముఁ డీమనుష్యలోకమందు ధర్మమును మిక్కిలి యుత్తమమైనదిగాఁ గావించెను. ప్రజలెల్ల నతనిచే రంజితులగుటచేత నతఁడు 'రాజు' అని పిలువఁబడెను. బ్రాహ్మణులకుఁ గలక్షతములను దొలఁగించి త్రాణముగావించుటచే 'క్షత్రియుం' డనియుఁ జెప్పఁబడెను. అతనిచేత భూమి ధర్మంబున వాసికెక్కినందున, సాధువు లతనిపేర దానికి 'పృథివి'యని పేరిడిరి. సనాతనుండగు విష్ణుఁడు తానే వీనిని నెలకొలిపి వీనితో 'రాజా!

నిన్నెవరు నతిక్రమింపఁజాలరు' అని చెప్పెను. అంత నాభగవంతుఁడు తనతపంబుచేత నంశమున నారాజునం దావేశించెను. అది కారణముగా నీజగము రాజులకు దేవతలకుంబోలె మ్రొక్కుచు వచ్చుచున్నది. రాజు చారులను బంపి వారిగతులవలన లోకవృత్తాంతములను గనుఁగొనుచు *దండనీతిచేత నెప్పుడును రాజ్యమును రక్షించుచుండును గాన యతని నెవ్వఁడుగాని ధర్షింపరాదు. శుభమయిన కార్యమును శుభమునే కలిగించునదిగావలయును. (మంచిసేయురాజునకు మంచియే చేయవలయును గాని చెఱుపు దగదు.) † రాజు దేహముచేతను నింద్రియములచేతను దక్కినవారివలె సమానుఁడుగా నుండఁగా నతనివశమందు లోకమంతయు నిలిచియుండుటకు నతని దేవత్వగుణము తప్ప వేఱు కారణ మేమున్నది? అపుడు విష్ణుదేవుని లలాటమునుండి బంగారుతామర పుట్టెను. పిదప నాతామరనుండి లక్ష్మీదేవి కలిగి ధర్మునకు దేవి (పత్ని) యయ్యెను. ధర్మున కా శ్రీవలననుండి యర్థము పుట్టెను. అంత ధర్మము నర్థమును శ్రీయును రాజ్యమందుఁ బ్రతి

* 'దండనీత్యాచ సతతం రక్షితారం నరేశ్వరమ్' అని దా. మూ. 'రక్షితవ్యం నరేశ్వర' అని ఔ. మూలము. ఇట సామాన్యముగా రాజమహత్త్వవర్ణనము గాన ప్రథమపాఠమే యంగీకార్యము.

† ఆత్మనాకరణైశ్చైవ సమస్త్వేహ మహీక్షితః । కోహేతుర్యద్వశేతిష్ఠేల్లోకో దైవా దృతేగుణః' అనిమూలము. 'సమస్యేహామహీక్షితః' అని యుభయపాఠము. తనబుద్ధిచేత నప్పడపుడు పొడకట్టు అవకాశములు మొదలయినసాధనములచేతను రాజు తన నడవడి జరుపుకొనవలయునని ప్రతాపచంద్రరాయల యర్థము. ఇది యంత సరసముగాకున్నది. పూర్వోక్తమైన యర్థమే యిట యుంచుచున్నము.

ష్ఠితులయిరి. మనుష్యుఁడు తాను జేసినపుణ్యము క్షీణింపఁగా స్వర్గలోకమునుండి భూమికివచ్చి దండనీతియందు విన్నాణియగు రాజుగా పుట్టుచున్నాఁడు. అట్టివానికి శ్రీవిష్ణువు మాహాత్మ్యము గలుగుచున్నది. వానికి మంచిబుద్ధియుఁ గూడుచున్నది. వాఁడు తక్కినవారికంటెను మహత్త్వమును బొందుచున్నాఁడు. వాఁడు దేవతలచేత స్థాపితుఁడుగాన వానినెవ్వరు నతిక్రమింపనేరరు. దీనినిబట్టియే యొక్కనివశమందు లోకమంతయు నిలిచియున్నది. దీనినిబట్టియే యాయొక్కని లోకమంతయు మీఱకున్నది. మంచియగుకార్యము మంచిదేయగును. దీనినిబట్టియే లోకులందొక్కొక్కఁడును, ఆయొక్కఁడు తమవలెనే దేహాదులుగలిగి యుండినను, ఆయొక్కని మాటచొప్పున నడచుకొనుచున్నాఁడు. ఆరాజు సొంపయినముఖమును జూచినవారెల్ల నతనికి వశులయిరి. కాఁబట్టి వారతనిని రూపవంతునిగను ధనవంతునిగను భాగ్యవంతునిఁగను నెన్నుచున్నారు. అతనిదండము మహత్త్వమువలన నీతి, భూమియందు స్పష్టముగా వెలసినదయ్యె. న్యాయప్రవర్తనమును విస్తరించినదయ్యె. ఈ కారణముచేతనే యీజగమంతయు నీతిచేత వ్యాప్తమయ్యెను.

యుధిష్ఠిరా! పురాణముల యాగతియు, మహర్షుల యుత్పత్తియు, తీర్థముల యుత్పత్తియు, *క్షత్రియుల పరంపరయు, చతుర్వర్ణములును, చతురాశ్రమములును, చతుర్వేదములును, వైదికధర్మములును, ఉపవేదములును, ఇతిహాసములును, న్యాయమును, దపమును, జ్ఞానమును, అహింసయు, సత్యమును, దాన

* 'వంశశ్చక్షత్రియాణాం' అని (దా.మూ) 'వంశశ్చ నక్షత్రాణామ్' క్షత్రియులుగానివారి యుత్పత్తియని యర్థము.

మును, మాత్సర్యము లేమియు, పెద్దలసేవయు, శుద్ధియు, ప్రయత్నశీలతయు, సర్వభూతములందును దయయు, భూమియందు వ్యవహరింపఁ బడునవి తక్కినవియన్నియును, సందేహముతీఱ నం దుపదేశింపఁ బడియున్నవి. కావున, యుధిష్ఠిరా ! లోకమునందు రాజులు దేవతలకు సమానులని యెప్పుడును బ్రాహ్మణులు చెప్పఁదొడంగిరి. రాజులమహత్త్వమునుగుఱించి యంతయు సంపూర్ణముగాఁ జెప్పితిని. ఈవిషయమై మఱియు నేమి చెప్పవలసియున్నది?' అనెను. ఇది యేఁబదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు చతుర్వర్ణముల ధర్మములను జెప్పుట.

అంత యుధిష్ఠిరుఁడు పితామహుండగు భీష్మునకు మఱల నభివాదనముచేసి యంజలిగీలించి 'పితామహా ! సకలవర్ణముల వారికిని సామాన్యములయిన ధర్మములేవి? చతుర్వర్ణములకు వేఱువేఱనున్న ధర్మములేవి? చతుర్వర్ణముల యాశ్రమము లెవ్వి? రాజధర్మము లనఁబడునవి యెవ్వి? రాష్ట్రము దేనిచే వృద్ధినొందును? రాజెట్లు వర్ధిల్లును ? పురజనులును భృత్యులును నెట్లు వృద్ధినొందుదురు? కోశము, దండము, దుర్గము, సహాయులు, మంత్రులు * ఋత్విజులు, పురోహితులు, ఆచార్యులు, నెట్టివారుగా నుండినయెడ రాజు వారిని దిగవిడువవలయును? రాజెవ్వ

---

* ఋత్విజుఁ డనఁగా ఆయానియత సమయములందు నియోగింపఁబడువాఁడు. పురోహితుఁ డెప్పుడును నియుక్తుఁడై యుండువాఁడు.

రెవ్వరిని నేయేయాపదయందు నమ్మవలయును? దేనినుండి తన్ను దృఢముగా రక్షించుకొనవలయును? (ద్వైధీభావమందు భృత్యుల కెటువంటి శపథ ముండవలయును? ఆశపథము నుల్లంఘించిన యధర్మమునకు ఫలమేమి? వీనినంతయును వీని వ్యవహారమును నాకు సంగ్రహముగను సవిస్తరముగను జెప్పవలయును' అనెను.

అందులకు భీష్ముఁడు 'మహనీయమగు ధర్మమునకును వేధయగు కృష్ణునకును నమస్కారము. (ఇట గూడియున్న) బ్రాహ్మణులకును నమస్కరించి శాశ్వతములగు ధర్మములను జెప్పెదను. కోపములేకుండుట, సత్యము పలుకుట, పంచికుడుచుట (లేక పాడియును) క్షమయు, తన భార్యయందుఁ బ్రజలనుగనుటయు, పరిశుద్ధియు, ద్రోహము లేకుండుటయు, చక్కటియు, భృత్యులను బోషించుటయు, ననునివి సమస్తవర్ణములకును సామాన్యములయిన ధర్మములు. బ్రాహ్మణులకు మాత్రముగల ధర్మములును నీకుఁ జెప్పెదను. మహారాజా! (అందు మొదటి యాశ్రమమందున్న బ్రహ్మచారికి) దమమే (ఇంద్రియనిగ్రహమె) పురాతనమయినధర్మము. మఱియు * వేదాధ్యయనమును, వేదమును జదివించుటయు ధర్మములే. వీనిచేతనే యతఁడనుష్ఠింపవలసిన కర్మములు †సమాప్తమగుచున్నవి. అట్లు స్వధర్మమునందు వర్తిం

* 'స్వాధ్యాయాధ్యాపనంచైవ' అని (ద్రా.మూ) 'స్వాధ్యాయాభ్యసనంచైవ' అని ఔ.మూలము. వేదమును జదువుట, తపములు మొదలగునవి యభ్యసించుటయునని యొక వ్యాఖ్య.

† అనఁగా నివిచేసిననే యతఁడు కృతార్థుఁడగుచున్నాఁడు గాన, తక్కిన కర్మము లంతగా నావశ్యములు గావనుట.

చుచు, విధర్మములను జేయక, శాంతుఁడయి, జ్ఞానముచేఁ దృప్తి నొందియుండు నా (వటుఁడగు) బ్రాహ్మణునికిఁ దనంతట ధనము లభించెనేని, యతఁడు విధ్యుక్తముగాఁ బెండ్లాడి సంతానమును బడయవలయును. మఱియు దానములును యాగములును జేయవలయును. ఆధనము నతిథులు బంధువులు మొదలగువారికిఁ బంచి కుడువవలయునని సాధువులు చెప్పెదరు. బ్రాహ్మణునకు వేదాధ్యయన మొకటిచేతనే యతనికి విహితములయిన కర్మానుష్ఠానములన్నియుఁ జేసి ముగించిన ట్లగుచున్నది. అతఁడు మఱి యితర మేమిచేసినను జేయకున్నను వేదాధ్యయన మొకటిచేఁ నతఁడు *మైత్రుఁడనఁ బడుచున్నాఁడు. క్షత్రియునకుఁ గల ధర్మములను జెప్పెదను. రాజున కిచ్చుట తగును గాని పుచ్చుకొనరాదు; యాగము చేయఁదగునే కాని ఋత్విజుఁడై యాగము చేయింపరాదు; వేదాధ్యయనము చేయవచ్చును గాని యొకరిని జదివింపరాదు. ప్రజలను బరిపాలింపవలయును. దొంగలను వధించుటయం దెప్పుడును బూనికకలిగి యుద్ధమునందుఁ బరాక్రమము మెఱయవలయును. యాగముల నాచరించుచు మిక్కిలియుఁ జదువరులై యుద్ధములందు గెలుపొందుచుండునట్టి రాజులే యుత్కృష్టలోకములను జయించినవారిలో నున్నలు. క్షత్రియుఁడు యుద్ధమునుండి దేహమున గాయపడక మరలివచ్చునేని యట్టి కార్యమును బురాణవిదులు కొనియాడరు; ఇది నీచులగు క్షత్రి

*'మైత్రుఁడనఁగా భూతములకెల్ల మిత్రుఁడని వ్యాఖ్యలు చూపట్టుచున్నవి. కాని, మీఁదక్షత్రియునకు 'ఐంద్రుఁ'డనుటచే నిట 'మైత్రుఁ'డనఁగా మిత్రుఁడు. సూర్యుఁడు అధిదేవతగాఁ గలవాఁడని యర్థము సేయుట మఱింత సంగతముగా నున్నది.

యుల ధర్మమే ముఖ్యముగా నగునని చెప్పుదురు. దొంగల నడంచుటకంటె నెక్కుడుకృత్యమయినది యతనికి వేఱొద్దియు లేదు. దానము, అధ్యయనము, యజ్ఞమును రాజులకు క్షేమమును గలిగించును. కాఁబట్టి ధర్మమును గోరినట్టి రాజు విశేషించి * యుద్ధము చేయవలయును. రాజు ప్రజలనందఱను వారి వారి ధర్మములందు నెలకొలపి, యొక్కొక్క కార్యమును ధర్మముచొప్పున శమము గుదురుగాఁగలిగి చేయునట్లు గావింపవలయును. రాజు, మఱేకార్యముచేసినను జేయకపోయినను, తన ప్రజలను బాలించుట యొక్కటిచేసెనేని, యతఁడు విహితకర్మముల నెల్లఁ జేసి తీర్చినవాఁ డగుటయే కాక యట్టిరాజు † 'ఐంద్రుఁడు' అని పిలువఁబడుచున్నాఁడు. వైశ్యులకు సనాతనములగు ధర్మములను నీకుఁ జెప్పెదను. దానము, అధ్యయనము, యజ్ఞము, మంచి మార్గములచేత ధనముగూర్చుట, తండ్రి బిడ్డలనుంబోలెఁ బశువుల నన్నింటిని గాపాడుటయు వైశ్యుని ధర్మములు; ఇవితప్ప వేఱే కర్మము నాచరించినను నది యతనికి విరుద్ధ ధర్మమగును. అతఁడాపశువులను గాపాడుటచేత గొప్పసుఖము నొందును. బ్రహ్మయే, పశువులను వైశ్యునికొఱకు సృజించియిచ్చెను; బ్రాహ్మణునకు రాజునకును ప్రజల నందఱను నొప్పించెను. వైశ్యునివృత్తిని వాని జీవనమును జెప్పెదను. వాఁ డితరుల పశువులను నాఱింటిని మేపునేని వానిలో నొక్కదానిపాలును దాను వేతనముగాఁ ద్రాగవచ్చును. ఇతరుల పశువులు నూఱింటిని మేపునేని వాని

* యుద్ధము లేనిచో రాష్ట్రము పెరుఁగదు గాన ధనము దానాదులకు వలయునంత దొరకదు గాన ధర్మమును సిద్ధింపదని యర్థము.

† 'ఐంద్రుఁడు' ఇంద్రుఁడు దేవతగాఁ గలవాఁడు అని యర్థము.

యం దొకయావు నెద్దులజతను సంబళముగాఁ దీసికొనవచ్చును. ఇతరుల సంచి మొదలుతో వర్తకము చేసినచో లాభమునం దేడింట నొకపాలు దాను బుచ్చుకొనవచ్చును. (గవయము మొదలగువాని) కొమ్ముల వర్తకమునం దందలిలాభములం దేడవపాలును గొనవచ్చును. (కొన్ని మృగముల వెలపొడుగయిన) గొరిజల వర్తకమునందుఁ బదునాఱవపాలే లాభమెత్తి కొనవలయును. ఇతరుల విత్తనములను గొని సేద్యముసేయునేని పంటలో నేడింట నొకపాలు పొందవలయును. ఇది వీనికి సంవత్సరమున కయిన వేతనము. వైశ్యున కెప్పుడును బశువులను మేపననెడి కోరిక యుండరాదు. వైశ్యుఁడు పశువులను మేపి కాపాడఁ గోరునేని మఱియొకరిచే వానిని నెంతమాత్రమును గాపింపరాదు. శూద్రుని ధర్మములను జెప్పెదవినుము. బ్రహ్మతక్కిన వర్ణములకు దాసునిఁగా శూద్రునిఁ గల్పించెను. కాఁబట్టి తక్కిన వర్ణములవారికిఁ బరిచర్య చేయుటయే శూద్రునకు ధర్మముగా విధింపఁబడియున్నది. కాన వారలకు శుశ్రూషచేయుటవలననే వాఁడు మిక్కిలి సుఖము నొందును. కనుక వాఁడీమూఁడువర్ణములవారికిని * వారి పరువులచొప్పునఁ బరిచర్య చేయవలయును. శూద్రుఁ డెప్పుడుగాని యేవిధముననను ధనములను గూర్పరాదు. ఏలన దానివలన వాఁడు పాపమొందును. వాఁడు ధనమును బొందెనేని తనకంటె నెక్కుడగు తక్కినవర్ణములవారిని దనకు లోకువఁ జేసికొనఁజూచును. అయినను వాఁడు ధర్మము చేయఁగోరి రాజు ననుజ్ఞఁ బొంది ధనమును జేర్చుకొనవచ్చును. వాని

---

*'పరిచరేత్త్రీన్ వర్ణానను పూర్వ్యశః' అని (ఔ. మూ) 'వర్ణాననసూయకః' అని (దా. మూ,) అసూయమాలి పరిచర్య చేయవలయునని యర్థము.

వృత్తియు జీవించు విధమును జెప్పెదవినుము. మూఁడువర్ణముల వారును శూద్రునవశ్యము భరింపవలయును. వారు తమకుఁ బరిచర్యచేయు శూద్రునకుఁ బాఁతగిలిగొన గొడుగు, పీవనలు, పావలు, తలగుడ్డలు, పడుకలు, ఆసనములు, చినిఁగిపోవుటచే తమకుఁ గట్టఁదగని వస్త్రములును నీయవలయును. ఏలన నవి ధర్మముచొప్పున వాని ధనములు. ఎవఁడేని శూద్రుఁడు ద్విజాతులం దొకనిని శుశ్రూషచేయుటకై యాశ్రయించెనేని యతఁడాశూద్రునకుఁ దగినవృత్తి నేర్పఱుప వలయునని ధర్మవిదులగు వారు చెప్పుదురు. శూద్రుఁడు సంతానములేక మృతుఁడయ్యెనేని వానికి నొడయఁడగు ద్విజుఁడే పిండమొసఁగ వలయును. శూద్రుఁడు వృద్ధుఁడయినను దుర్బలుఁ డయినను నాద్విజుఁడు వానిని బోషింపవలయును. శూద్రుఁడు తన్నుఁ బోషించునొడయునికి నెట్టియాపద వచ్చినపుడును దిగవిడువ రాదు. భర్తకు ధనము నశించెనేని శూద్రుఁడు * తన కుటుంబపోషణమునకుఁ బోఁగా నెక్కువగా మిగిలిన ధనము చేత నతనిని బోషింపవలయును. శూద్రునకు సొంతమయిన ధనములేదు. వానిధనమేదియు వానిఁ బోషించువానికే చెల్లును. యజ్ఞము మూఁడువర్ణముల వారికిని ధర్మముగాఁ జెప్పఁబడినది. †అది శూద్రునకునుగూడ విధింపఁబడి యున్నది.

---

* 'అతిరేకేణ' అని మూలము. మిక్కిలి యక్కఱతోనని దీనికర్థము.

† 'ఉక్తస్త్రియాణాం వర్ణానాం యజ్ఞస్తస్యచ భారత' అని (జో. మూ) 'త్రయ్యేవభారత' అని (దా. మూ) దీనిచే శూద్రునకు యజ్ఞము లేదని యర్థము. తక్కిన ప్రతులన్నిటను 'తస్యచ'అని యుండుటంబట్టియు, వెంబడినే 'పాకయజ్ఞైర్యజేత' యని మంత్రములు జపించుట 'స్వాహా' 'వషట్' అని

అయినను శూద్రునకు స్వాహాకారమును వషట్కారమును మంత్రమును లేదు. కాఁబట్టి శూద్రుఁడు, వేదములందుఁ జెప్పఁబడిన వ్రతములను విడిచి * పాకయజ్ఞములను యజింపవలయును. పాకయజ్ఞమునందు దక్షిణ పూర్ణపాత్రమేయగును; మఱొక్క దక్షిణ యీరాదు. తొల్లి పైజవనుఁడను శూద్రుఁడు †ఐంద్రాగ్నమను యాగవిధానము చొప్పున లక్ష పూర్ణపాత్రముల నిచ్చెనని మేము వినియున్నారము. ‡యజ్ఞము తక్కిన మూఁడువర్ణముల వారికెట్లో యట్లే శూద్రునకు విధింపఁబడియున్నది. సమస్తములయిన యజ్ఞములందును, శ్రద్ధాయజ్ఞము మొట్టమొదటిదిగా విధింపఁబడియున్నది. శ్రద్ధ పరమదైవతము. అది యజించు

చెప్పుటయు లేక యజ్ఞములు చేయవచ్చునని విధించి యుండుటం బట్టియు, యజ్ఞములు శూద్రునకును గలవని యర్థము సేయఁబడెను.

* పాకయజ్ఞమనఁగా స్వల్పయజ్ఞములు. దుష్టగ్రహశాంతియు క్షుద్రదేవతలగు విశ్వేదేవాదుల నారాధించుటయు నిందలి విధులు. పూర్ణపాత్ర మనఁగా 256 పిడికెళ్ల బియ్యము నింపిన పెద్దపాత్ర లేక గంప. శూద్రుఁడీ పూర్ణపాత్రమును దప్ప మఱేదక్షిణను గాని తన యజ్ఞమునం దీయరాదు.

† ఐంద్రాగ్న విధానమందు లక్షపశువులను గోవులు గుఱ్ఱములు మొదలగు వంటివానిని దక్షిణ యీవలయును. ఈ శూద్రుఁడును ఆవిధానమును అనుష్ఠించినాఁడు కాని యందు మంత్రములేదు. మఱి లక్షపశువులకు బదులుగా లక్ష పూర్ణపాత్రముల ఏర్పఱుపఁబడినవని తెలియువది.

‡ 'యతోహి సర్వవర్ణానాం యజ్ఞస్తస్యైవ భారత' అని మూలము. దీనికి 'బ్రాహ్మణులు మొదలయిన యేవర్ణములవారి యజ్ఞమును వారికి శుశ్రూష చేయు శూద్రునిని జేరినదగును. అనఁగా శూద్రుఁడు వారికి శుశ్రూష చేయుటచేతనే వారియజ్ఞమును దాను జేసిన యజ్ఞముగానే పొందుచున్నాఁడు. అనఁగా వాఁడు యజ్ఞమందుఁ దాను జేయకున్నను శుశ్రూషనుబట్టి చేసినవానివలె

వారిని బవిత్రము చేయునది. బ్రాహ్మణులును పరమదైవము
వా రాయాయోర్కులతోఁ గూడికొన్నవారై యొకరినొకరు
తమ తమకయిన యాగములను బెక్కులను గావింతురు. తక్కిన
మూఁడు వర్ణములవా [illegible] బ్రాహ్మణులు సంతానము
లను గాంచిరి. *మూ [illegible] సంతానములే. బ్రాహ్మ
ణులు దేవతలకును [illegible] ప్పనను నీకది పరమ
హితమగును. సకలవర్ణములును వారివలనఁ బుట్టుటచేతను,
వారుచేయు యజ్ఞములన్నింటిలోను నన్నివర్ణములవారికిని సం
బంధము కలిగియున్నది. అట్లు సంబంధము కలిగియుండుట తమ
యిచ్చవొప్పునఁగాదు. బ్రాహ్మణులవలనఁ బుట్టియుండు విధిని
బట్టి కలిగినది. ఋగ్యజుస్సామముల నెఱింగిన ద్విజుఁడు దేవత
వలె నెప్పుడును బూజ్యుఁడగును. శూద్రుఁడు ఋగ్యజుస్సామ
ములు లేనివాఁడు గాన †ప్రాజాపత్యుఁడగును. మానసికయజ్ఞము

భాగము నొందుచున్నాఁడని భావము. ఎట్లన శ్రద్ధాయజ్ఞము యజ్ఞములందు మొట్టమొదటిదగాన, శూద్రుఁడు బ్రాహ్మణాదులయందు శ్రద్ధగలిగి వర్తించుటచే తాను వారియజ్ఞములను జేయకపోయినను వారియందలి తనశ్రద్ధయొక్క మహిమచే ఆయజ్ఞము చేసినట్టి వాఁడగుచున్నాఁడని భావము.

* తక్కిన మూఁడువర్ణములవారును బ్రాహ్మణుల వలననుండియే పుట్టినవారనుటచే శూద్రుఁడు యజ్ఞమునం దధికారమునొందుచున్నాఁడని తెలియునది.

† ప్రజాపతి అధిదేవతగాఁ గలవాఁడు గాన ప్రాజాపత్యుఁడని యర్థము. బ్రాహ్మణుఁడు ఆగ్నేయుఁడును క్షత్రియుఁడు ఐంద్రుఁడునయినట్లు శూద్రుఁడు ప్రాజాపత్యుఁడగునని తెలియునది. ఋగ్యజుస్సామాదులు తెలిసిన బ్రాహ్మణుఁడు సాక్షాద్దైవము. శూద్రుఁడన్ననో ఋగ్యజుస్సామాదుల నధిగమించుటకును వేదమంత్రములను బఠించుటకు నర్హత లేకపోయినను ప్రజాపతిని అధిదేవతగాఁగలిగి ఆదేవతను వేదోక్తములుకాని యితరవిధానములచేత నారాధించుచున్నాఁడని తెలియునది.

సకలవర్ణములవారికిని విహితమైయున్నది. ఈ *మానసికయజ్ఞము చేయువానియెడ వాఁడు శూద్రుఁడయినను గాని దేవతలుగాని యితరులగు గొప్పవారుగాని(హవిర్భాగాదులు పుచ్చుకొనుటకు) కోరకుందురనుట యెంతమా[illegible]లేదు. కాఁబట్టియే శ్రద్ధా యజ్ఞము సకలవర్ణములవా[illegible]పఁబడుచున్నది. బ్రాహ్మణు లు మూఁడువర్ణములవా[illegible]కారణమగు దైవము. కాఁబట్టి యా తెగవారు తక్కిన మూఁడు తె[illegible]వారినిగూర్చి (యీ కామ మునుగోరి యీ వర్ణమువాఁడు నన్ను వరింపఁగా నీ యజ్ఞమును యజించుచున్నానని) యుద్దేశించి వారియజ్ఞములు చేయకుండిన వారుగారు; చేసియే యున్నారు. అయినను నట్టి యాగమునందు వైదికమయిన యగ్నికిఁ దక్కువయగు వితానమను (లౌకికాగ్నిని) ఆధారముగాఁ జేసిరి. అది కారణముగా బ్రాహ్మణుఁడు మూఁడు వర్ణములవారికిని యాగము చేయించినవాఁడగుచు

---

* యజ్ఞములు, శారీరకములు, వాచికములు, మానసికములు-అనఁగా శరీరముచేతను,వాక్కుచేతను మనస్సుచేతను జేయఁబడునవని మూఁడువిధములు. బ్రాహ్మణుఁడు. మూఁడువిధముల యజ్ఞములను జేయవచ్చును. క్షత్రియుఁడును వైశ్యుఁడును తమ శరీరముచేత యజ్ఞములు చేయరాదు. కాఁబట్టి తమయజ్ఞములందు బ్రాహ్మణులను నియోగించుకొనవలయును. అయినను ఈ యిరుతెగలవారును వాక్కుచేతను మనస్సుచేతను యజ్ఞములు చేయవచ్చును. అనఁగా వాచికములగు మంత్రములను జపించవచ్చును. మానసయజ్ఞములు చేయవచ్చును. శూద్రుఁడన్ననో తనయజ్ఞములందుఁ దన దేహము నుపయోగింపరాదు. వాక్కుచేత మంత్రములు జపింపరాదు. కాన వానికిఁ గలది మానసికయజ్ఞ మొక్కటియే. మానసిక యజ్ఞమనగా వేదవిధిలేకయే యొక దేవతకుఁగాని దేవతలకుఁగాని మనస్సుచేత నిచ్చునట్లు నిశ్చయించుట. నిశ్చయించిన వెంటనే నిజముగా సంకల్పించినది యిచ్చి తీరవలయునని తెలియునది.

న్నాఁడు. ఈ కారణమునుబట్టి చూడఁగా నాలుగువర్ణములును, యజ్ఞయోగమునుబట్టి సరిగానే (అనఁగా ధర్మమందు సమానులుగానే) యుండుటకాక, ఒక్క నొకరికొకరు జ్ఞాతులుగాను సంబంధపడి యున్నారు. [illegible] వారందఱును బ్రాహ్మణుని వికారమే యగుదురు. బ్రాహ్మణుఁడు క్షత్రియాది కన్యలయందుఁ బుట్టించిన పరంపరనుండి కలిగిన వారేయగుదురు. *సృష్టియందు మొదటఁగలిగినవాఁ డెవ్వఁడని నిజమును గనుఁగొనఁగా వర్ణములన్నింటియందును బ్రాహ్మణుఁడే మొదట (బ్రహ్మదేవరూపమున) సృజింపఁబడినాఁడని తెలియుచున్నది. సామము యజుస్సు ఋక్కులును మొదటనొక వేదముగానుండి పిదప పెక్కులయినట్లు బ్రాహ్మణుఁడొక్కఁడే మొదటఁ గలిగియుండి యతనినుండి తక్కిన వర్ణములు గలిగినవి. ఈవిషయమై పురాణజ్ఞులగువారు మున్ను వైఖానసమునులు యజ్ఞముసేయుచుండు

---

* ఇట 'అధరో వితానస్సంసృష్టః స్త్వథ తత్రసృష్టో బ్రాహ్మణ స్త్రిషు వర్ణేషు యజ్ఞసృష్టః' అని మూలము గ్రహింపఁబడెను. ఇందులకు దాక్షిణాత్య కోశములందు 'అధరో వితాన స్త్వథ తత్రసృష్టో, నబ్రాహ్మణ స్త్రిషువర్ణేషు రాజన్' అనియు ఔత్తరాహకోశములందు 'అధరో వితాన స్సంసృష్టోవైశ్యో బ్రాహ్మణ స్త్రిషువర్ణేషు యజ్ఞసృష్టః' అనియుఁ బాఠాంతరములు. రెండవ దానికి "వితానమనెడి యగ్ని వైశ్యులవలననుండి గ్రహింపఁబడినను మంత్రములతోఁ గూడియున్నను తక్కువేయగును. బ్రాహ్మణుఁడే మూఁడువర్ణములవారినిని యజ్ఞములు చేయించువాఁడగును' అని యర్థము. హోమాగ్నులన్నియు ప్రాయికముగా వైశ్యుల గృహములనుండియే ప్రణయింతురు. వితానమనఁగా శూద్రుని హోమాగ్నియనియు అగ్ని విస్తారమనియు నర్థము. ఇట పాఠములు తెలివిడిగాకున్నవి.

నపుడు *యజ్ఞములనుగుఱించి పాడినగాథలను జెప్పెదరు. అవి యేవనఁగా 'సూర్యుఁ డుదయించుటకు మునుపుగాని పిదపఁగాని జితేంద్రియుఁ డగుపురుషుఁడు శ్రద్ధగలవాఁడై ధర్మముచొప్పున నగ్నిహోత్రము వేల్చుచున్నాఁడు. ఇందులకు శ్రద్ధయే గొప్ప కారణము. అగ్నిహోత్రవిధులందు †స్కన్నమనునది మొదటిది; అస్కన్నమనునది కడపటిది; సర్వోత్కృష్టమైనదియు. యజ్ఞములుబహువిధములు. వాని కర్మములును ఫలములును నానావిధములు. ఏద్విజుఁడు శ్రద్ధగలవాఁడై వానినన్నింటని శాస్త్రజ్ఞానముచే నిశ్చయించి తెలిసికొనుచున్నాఁడో యాపురుషుఁడే యజ్ఞముసేయుట కర్హుఁడు. ఎవఁడు దొంగయైనను, పాపుఁడయినను, పాపాత్ములందు మిన్నయైనను, ‡యజ్ఞమును భజింపఁగోరునో వానిని సాధుపురుషుఁడనియే చెప్పుదురు. ఋషులు నట్టివానిని గొనియాడుదురు. ఇది సరియే. ఇందుల కెంతమాత్రము సందేహము లేదు. సర్వవర్ణములవారును, సర్వకాలములందును, సర్వవిధములచేతను యజ్ఞము సేయవలయుననుట నిర్ణయము. ఏలనఁగా మూఁడులోకములందును యజ్ఞమునకు సాటియైన దొక్క

---

* ఇట 'యజ్ఞగీతాః' అనియున్నది. ఇందులకు విష్ణుగీతలని యొకవ్యాఖ్య. యజ్ఞములను గుఱించిన గీతలనివ్యాఖ్యానము. మఱొకటి. అయినను పూర్వార్థమే ప్రకృతముగా నుండుటంబట్టి గయకొనఁబడెనని తెలియునది.

† బహ్వృచ బ్రాహ్మణమందు అగ్నిహోత్రములు. పదియాఱు చెప్పఁబడినవి. అందు 'మారుతం విష్యన్దమానమ్' అని స్కన్నముకూడ ఆద్యమగు అగ్నిహోత్రముగాను అస్కన్నమనఁగా యథావిధిగా వేల్పంబడి సర్వోత్కృష్టమైనదిగాను జెప్పంబడియున్నది.

‡ యజ్ఞ మనుటకు విష్ణువును యజించుట యని వ్యాఖ్య.

టియు లేదు. కాఁబట్టి పురుషుం డసూయమాలి, శ్రద్ధగలిగి, పరిశుద్ధితో తన శక్తికొలఁదిని దన యిష్టముచొప్పున యజ్ఞము చేయవలయునని పెద్దలు చెప్పుదురు. ఇది యేఁబదితొమ్మిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు నాలుగాశ్రమముల ధర్మములను జెప్పుట.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా' ఆశ్రమములు నాలుగింటి నామములును వాని కర్మములును వినుము. వానప్రస్థము, భైక్ష్యము, (సన్న్యాసము), గార్హస్థ్యము, బ్రహ్మచర్యమని * బ్రహ్మదేవుఁడు చెప్పిన యాశ్రమములు నాలుగుగలవు. †చౌలమనెడు సంస్కారమునొంది, యుపనయనవిధిచేత ద్విజత్వమునుబొంది వేదముల నధిగమించి, అగ్న్యాధానము మొదలయిన కర్మములనుగావించి, గృహస్థాశ్రమమును దీర్చికొని యింద్రియముల నడంచి యాత్మశుద్ధితో నడఁకువగలిగి భార్యనుగూడియో భార్యలేకయో వానప్రస్థాశ్రమమును బొందవలయును. ధర్మవిదుండగువాఁడు, ఆ యాశ్రమమందు ‡వానప్రస్థునకు వలయుశాసనముల ననుష్ఠించి

---

* 'బ్రహ్మణేరితమ్' (దా.మూ.) 'బ్రాహ్మణైర్వ్రతమ్' (ఔ.మూ.) బ్రాహ్మణులనుష్ఠించు నాశ్రమములనుట.

† 'చూడాకరణ సంస్కారమ్' (దా.మూ.) 'జటాధారణ సంస్కారమ్' అని (ఔ.మూ.) ఉపనయనమునకుఁ బూర్వము చూడాకరణమే (చౌలమే) యుపపన్నముగాన నదియే గ్రాహ్యము.

‡ 'శ్రౌతారణ్యకశాస్త్రాణి సమధీత్య' అని మూలము. అరణ్యకములను వైదికశాస్త్రములు నధిగమించియని ప్రతాపచంద్రుల యర్థము.

యూర్ధ్వరేతసుఁడై * సన్యాసమునొంది, బ్రహ్మసారూప్యము నొందుచున్నాఁడు. రాజా! ఊర్ధ్వరేతసులయిన (సన్యాసులయిన) మునులగుటకుఁ గారణములగు లక్షణము లివియే. ఎఱుకగల బ్రాహ్మణుఁడు మొదట వీనిని జేయవలయును. బ్రాహ్మణుఁడు బ్రహ్మచర్యాశ్రమమును జరపినపిదప మోక్షమును గోరి భైక్షచర్యము (సన్న్యాసము)ను బొందుట ప్రశస్తము. క్షేమంబగు నాలుగవ యాశ్రమమును బొందిన బ్రాహ్మణుఁడు గృహమును, నగ్నిని విడిచి, తనంతట దొరకినదానితో కడుపుఁ బ్రోచికొనుచు, ప్రొద్దు గ్రుంకినచోటనే పరుండుచు, మననశీలుఁడై, అంతరింద్రియములనడంచి, బహిరింద్రియములను గెలిచి, యాశలనుమాని, పెద్దఱికమునువదలి, భోగములను వికారములును లేక యుండునేని బ్రహ్మసారూప్యము నొందుచున్నాఁడు. మునులుగూడ ధర్మమున సేవించునట్టిదియు నాచరించుటకుఁ గష్టమైనదియు నగు గృహస్థధర్మమునం దుండువాఁడు వేదముల నధిగమించి వైదికకృత్యములనెల్ల నిర్వర్తించి సంతానములను గని యాయాశ్రమమందలి సుఖములననుభవించి మిక్కిలి యెచ్చరికతోడ దీని నాచరింపవలయును. అట్లు చేయునేని యతఁడును బ్రహ్మసారూప్యము నొందును. మఱియు నాగృహస్థుఁడు కపటములేక తనభార్యచేతనే తృప్తుఁడై ఋతుకాలములందే భార్యను బొందవలయును. మఱియు దుడుకును మోసమును లేక శాస్త్రవిధుల ననుష్ఠించుచుండవలయును. మఱియు మితముగాఁ గుడుచుచు, దేవతలందుఁ దత్పరుఁడై నెనరుగలిగి, సత్యము పలుకుచు, క్రూరుండుగాక మెత్తనిమనస్సుగలిగి,

* 'ప్రవ్రజిత్వా' అని (ఔ.మూ.) 'ప్రజాహిత్వా' (దా.మూ.)

క్షమతోఁగూడి యుండవలయును. అతడు దమముగలిగి, గురువు మొదలగువారి యాజ్ఞలకులోనై హవ్యకవ్యములయందుఁ బరాకు వడకుండవలయును. బ్రాహ్మణుల కెప్పుడును నన్నము పెట్టుచుండ వలయును. మత్సరములేక యన్ని యాశ్రమములవారికిని దానము లొసఁగుచుండవలయును. శ్రౌతకర్మముల నెప్పుడును విడువకుండవలయును. ఈ విషయమై మహానుభావులగు మహర్షులు నారాయణుఁడు పాడిన గీతము నొకటిని జెప్పుచున్నారు. అది మిక్కిలి యర్థవంతమై యెంతయుఁ దపఃప్రయుక్తమయినది. అది నేనుజెప్పెదను వినుము. 'సత్యము, ఆర్జవము, అతిథిపూజనము, ధర్మము, అర్థము, స్వభార్యలతోడి రతి యను వీనిచేత నొకఁడు సుఖము లిహమందును బరమందును ననుభవింపవలయును. ఇది నామతము' అనియే. మహర్షు లీ యాశ్రమమునందలి వారికి దారపుత్రాదులను భరించుటయు, వేదములను బరిపాలించుటయు మిక్కిలి శ్రేష్ఠములని చెప్పెదరు. ఈ విధము చొప్పున బ్రాహ్మణుఁ డెవ్వఁడు యజ్ఞములనాచరించుచు గృహస్థధర్మమును గలరీతిని జరుపుచున్నాఁడో యతఁడు గృహస్థాశ్రమమును జక్కఁగా నిర్వర్తించి స్వర్గమునందుఁ బవిత్రంబగు ఫలము నొందును. ఆ గృహస్థుఁడు దేహమును విడిచినపిదప వాఁడు కోరిన కామములన్నియు నేదేశమునను నేకాలమునను నాశము నొందక భృత్యుఁ డొడయునింబోలె *నతిమాత్రమయిన యెచ్చరికతోఁ గలకాలము నతనినెదురుచూచుచుండును. యుధిష్ఠిరా! బ్రహ్మచారి యొంటిమెయి నుండి యన్నివేదములను జపించుచు,

* 'సర్వతోక్షిశిరోముఖాః' అన్నిప్రక్కల కన్ను తల మొగము గలిగినవి అని యర్థము-అనఁగా అంత యొక్కుడు ఎచ్చరికతోననుట.

నొక్క యాచార్యునికే శుశ్రూషసేయుచు, దేహమును వస్త్రములును మన్నును మఱికియుఁ గలిగియుండ, నిత్యవ్రతమును నిత్యదీక్షయుఁ గలిగి యింద్రియముల జయించి గురువుతోడి నీడవలె ననుసరించుచు నతని కెంతయు నడఁగి మడఁగి యధ్యయనము చేయుచు వ్రతమునుండి యెంతమాత్రము చలింపక విహితకృత్యముల నెప్పుడు ననుష్ఠించుచు నుండవలయును. మఱియు గురువునకు మ్రొక్కి యెప్పుడును బరిచర్యసేయుచు యజనయాజనాధ్యయనాధ్యాపనాదు లనెడియీ యాఱుకర్మములందును బట్టుదల కలిగి, యన్ని కార్యములందును నాసక్తితోఁ బ్రవర్తింపక, యెవరియందును నిగ్రహానుగ్రహములు చూపక, విరోధులకయినను మంచి సేయవలయును. ఇవన్నియు, బ్రహ్మచర్యాశ్రమము నం దున్నవానికి ధర్మములగును ' అనెను. ఇది యఱువదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణ ధర్మములను జెప్పుట.

ధర్మరాజు 'ననుబోఁటివారికి మంగళకరములును మీఁద మిక్కిలియు సుఖప్రదములును హింసారహితములును లోకసమ్మతములును సులభము లయినయుపాయములు నగు ధర్మములను మరలఁ జెప్పుము' అనెను.

భీష్ముఁడు 'ప్రభూ! బ్రాహ్మణునకు నాలు గాశ్రమములును విధింపఁబడియున్నవి. వానిని దక్కిన మూఁడువర్ణములవా రనుసరింపరు. రాజా! స్వర్గప్రదములును రాజులకు ముఖ్యముగా నాధా

నములయినవియు నగుకర్మములు పెక్కులింతవఱకే చెప్పఁబడి యున్నవి. *అయిన నవియెల్ల నీవిపు డడిగినదానికి నుత్తరముగా నుదాహరింపఁ దగదు. ఏలన నవియెల్ల క్షాత్ర (క్షాత్ర్య) ధర్మమునం దాసక్తులయిన రాజులకు విహితములయినవి. క్షాత్రకర్మములును వైశ్యకర్మములును శూద్రకర్మములును మందబుద్ధియగు బ్రాహ్మణుఁ డెవఁడు సేవించునో వాఁ డీలోకమున నిందితుఁ డగుటయే కాక పరమునందును నరకము నొందును. లోకమందు పనివాఁడు, కుక్క, తోఁడేలు, పశువు నను వీనికే పేళ్లు పెట్టఁబడియున్నవో యాపేళ్లే తనకు విరుద్ధకర్మముల నాచరించు బ్రాహ్మణునికిఁ బెట్టుదురు. ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణాతర్కసమాధు లనెడి యోగకర్మములందుఁ బ్రవృత్తుఁడై నాలుగాశ్రమములందును వర్తించుచు సమస్తధర్మముల నాచరించుచు, †అవిశ్రాంతుఁడు గాక, యాత్మజయము గలిగి, పరిశుద్ధుఁడై, తపమునం దాసక్తుఁడై, యాశ దిగవిడచి, దాతృత్వము గలిగి యున్న బ్రాహ్మణునకు నాశరహితము లయిన లోకములు గలుగును. ‡ ఏమనుష్యుఁ డేప్రాయమున నేకాలమం దేప్రదేశమున నేకారణమునుబట్టి యెట్టికర్మము చేయునో యామను

---

* 'నేమాని దృష్టాంతవిధౌ స్మృతాని । క్షాత్రేహి సర్వం విహితం యథావత్' అని (కుం.మూ.) 'శాస్త్రస్య సర్వస్య విధౌ స్మృతాని క్షాత్రేహి సర్వం విహితం యథావత్' అని (దా.మూ.) ఈ పాఠ మెంతయు సంగతము గాకున్నది కాన త్యాజ్యము.

† 'సంవృత్తస్య' అని మూలము. 'తద్భూతస్య' అని దాక్షిణాత్యపాఠము. పూర్వపాఠమే యిట గ్రహింపఁబడినది.

‡ 'యో యస్మిన్ కురుతే కర్మ యాదృశం యేన యత్ర చ । తాదృశం తా

ష్యుఁ డాకారణమునుబట్టి యాకర్మమును (దానియందలి లోభ మువలనను నభ్యాసమువలనను) గుణవంతమయినదని తెలఁచునే కాని నింద్యమని దానినుండి విరమింపఁడు. (ఎవఁ డేప్రాయమున నెచ్చట నెప్పు డేఫలమునుబట్టి యెట్టికర్మమును జేయునో వాఁ డట్టిదానిచే నట్టివంటి గుణము నే పొందుచున్నాఁడు). రాజేంద్రా! వడ్డిగొనుటయు, వర్తకమును, సేద్యమును, వేఁటయు, వేదాధ్యయనమునకు సాటియైనవని తెలియుము. కాలము మనుష్యునిఁ బురికొలుపుచున్నది. పూర్వజన్మకాలపు వాసనలంబట్టి వానిని సంబంధించిన విషయము లేర్పడుచున్నవి. కనుక వాఁ డాకాలమునకు లోనై యుత్తమ మధ్యమాధమ కార్యములు చేయుచున్నాఁడు. పూర్వజన్మమునందుఁ జేసిన మంచికర్మములందు ముఖ్యములయినవి, మీఁద నెంతయు శ్రేయస్కరము లయినవి; అవి యంతయు నొందఁగలవియే కాని యెన్నఁడు నుండునవిగావు. మనుష్యులు దమతమ పూర్వవాసనలను బురికొలుపు పనులయందే యెప్పుడును దగిలియుందురు. ఆవాసనలును మనుష్యుని నన్నిదెసలను బురికొలుపు చుండును.' ఇది యఱువదియొకండవయధ్యాయము.

—·✧·—

వృత్తేనైవ సగుణం ప్రతిపద్యతే' అని మూలము. ఎవఁ డెచ్చట నెప్పు డెట్టి కర్మమును జేయునో యట్టివంటి గుణము నే పొందునని ప్రతాపచంద్రరాయుల యర్థము, 'సగుణమ్' అనుచో సః+గుణమ్ అని విచ్ఛేద మీయర్థమునఁ దెలియునది. ఇది బాగు.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణునికిఁ ద్యాజ్యములగు ధర్మములనుజెప్పి రాజధర్మమును బ్రశంసించుట.

భీష్ముఁడు 'అల్లెత్రాటి నీడ్చుటయు, శత్రువుల నుక్కడఁచుటయు,* సేద్యమును, వర్తకమును. పశువుల మేపుటయు, ధనముగోరి పరులకుఁ బనులుసేయుటయు ననునివి బ్రాహ్మణునకు మిక్కిలియుఁ జేయఁదగనివి.బుద్ధిమంతుఁడును గృహస్థుఁడునగు బ్రాహ్మణుఁడు వేదము నధిగమించి, యజనాదు లయినయాఱుకర్మములను గావింపవలయును. గృహస్థ కృత్యములన్నియుఁ జేసి వీడినపిదప బ్రాహ్మణుఁ డడవికిఁబోయి వసించుట యెంతయుఁ దగును.రాజున కూడిగముచేయుటయు, దున్నిధనము సంపాదించుటయు, వర్తకముచేసి బ్రదుకుటయు, కపటవృత్తియు, ఱంకుతనమును, కుసీదమును బ్రాహ్మణునకు మిక్కిలి నింద్యములు, తన ధర్మమునుండి తప్పి దుష్టం బగునడవడి నెవఁడుగైకొనునోయా చెడుబ్రాహ్మణుఁడు. శూద్రుఁడగును. శూద్రస్త్రీని నిల్లాలుగఁ జేసికొని కొండెములు జెప్పుటయు, నట్టువనమును, గలిగి గ్రామమువారి కూడిగము చేయుటమొదలగు విరుద్ధకర్మములు

* 'వృద్ధ్యాకృషి వణిక్త్వేన జీవసంజీవనేనచ, వేత్తు మర్హాపి రాజేంద్ర స్వాధ్యాయగణితం మహాత్' (జొ. మూ.) (స్వాధ్యాత్మగుణితేనచ' అని (దా. మూ.)

* 'అన్తవన్తి ప్రధానాని పురాశ్రేయస్కరాణిచ' అని (జొ. మూ.) 'అన్తవన్తి ప్రధానాని పరంశ్రేయస్కరాణిచ' అని (దా. మూ.) ప్రథమపాఠమే సాధువుగాన యంగీకృతమైనది.

చేయునేనియు శూద్రుఁడగును. బ్రాహ్మణుఁడు తొలఁగి మంద బుద్ధియై మంచినడక విడిచి యిట్టివాఁడగునేని యతఁడు వేదమును గఱచినను గఱవకున్నను, శూద్రునకు సాటిగాను దాసునకుసాటిగాను దొలఁగించిపెట్టిభోజన మిడవలయును. ఇట్టివారందఱును శూద్రునకు సాటియగుదురుగాన వైదికములయిన దేవకార్యములందు వర్జింపవలయును. మరియాదలేనివాఁడును, వంచన మాటలాడువాఁడును, క్రూరంపు నడవడిగలవాఁడును, హింసింపఁ దివురువాఁడును, మంచినడవడిని స్వధర్మమునుదిగవిడిచినవాఁడును, నగు బ్రాహ్మణునకు, హవ్యములు కవ్యములును మఱియుఁ దక్కినవి యియ్యఁదగినవి యెల్ల నియ్యరాని వగుచున్నవి. కాఁబట్టియే, బ్రాహ్మణునకు, దమము, శౌచము, ఆర్జవము ననుధర్మములును విధింపఁబడియున్నవి. అట్లె నాలుగాశ్రమములును బ్రహ్మ (వేదము)చే బ్రాహ్మణునకు మునుపే విధింపఁబడియున్నవి. దమమును బూజ్యమయిన శీలమును గలిగి, సోమపానము చేసిన వాఁడును, ఆశలేనివాఁడును, అన్నిటిని సైఁచువాఁడును, దయయు నోర్పును గలవాఁడును, బరులకుఁగీడుదలంపనివాఁడును, క్రూరుఁడు కానివాఁడును, కపటము లేనివాఁడును నగువాఁడే బ్రాహ్మణుఁ డగునుగాని పాపకర్ముఁ డగువాఁడు బ్రాహ్మణుఁడు గాఁడు. * ధర్మమునుగోరు జనులు శూద్రులయు వైశ్యులయు క్షత్త్రియులయు సాయము గోరుచున్నారు. కాఁబట్టి యీ

---

* 'మాద్రం వైశ్యం రాజపుత్రం చరాజన్, లోకాస్సర్వే సంశ్రితా ధర్మకామాః, తస్మాద్వర్ణాన్ శాంతి ధర్మేష్వసక్తాన్, మత్వా విష్ణుర్నేచ్ఛతి పాండుపుత్ర' అని (ఔ. మూ.) 'విప్రం వైశ్యం...వర్ణాన్ జాతి ధర్మేష్వసక్తాన్, శేతుం విష్ణుర్నేచ్ఛతి...' అని దా.మూలము. ధర్మమునుగోరు లోకములు బ్రాహ్మ

మూఁడువర్ణములవారును శాంతియుక్తములగు ధర్మములందుఁ దగులు లేకుండిరేని (తక్కినవారి ధర్మప్రాప్తికి సహకారులు లేక పోవునుగాన) విష్ణుఁడు వారియెడ ననుగ్రహము చూపఁగోరఁడు. విష్ణుఁ డనుగ్రహింపఁ గోరఁడేని, స్వర్గలోకమునంగల యెల్లవారల సుఖమును, చతుర్వర్ణ ధర్మఫలములును, వేదవాదములును, సమస్తములయిన యజ్ఞములును, లోకుల సమస్త క్రియలును సమస్తములయిన యాశ్రమ ధర్మములును దోఁడనే లేకపోవును. తన రాజ్యమందుఁ గలమూఁడువర్ణములవారును తమతమ యాశ్రమ ధర్మములను సరిగా నడపుచు రావలయు నని కోరురాజు తెలియవలయు ధర్మములను వినుము. ఎక్కుడు కులమువారికి పనిపాటులుచేసి, తన కృత్యమును దీర్చుకొని, సంతానములను గని, తక్కిన వైదికులకును దనకును నంతగా నాచారశుద్ధియందు భేదము లేనివాఁడును దేశాచారమును బొందినవాఁడు నగుశూద్రునకు, రాజు ననుమతినొంది యాశలే కుండుట యొకటి తక్కఁదక్కిన యాశ్రమములన్నియు విహితములై యున్నవి. ఆ ధర్మములను జెప్పు పెద్ద లిట్టిధర్మముల నాచరించు శూద్రునకును వైశ్యునకును క్షత్రియునకును నట మీఁద* భైక్షచర్యము (సన్న్యాసము) విధించియున్నారు. వైశ్యుఁడు తనయాశ్రమకృత్యముల నెల్లఁదీర్చి, రాజునకుఁ

ణుని, వైశ్యుని, క్షత్రియుని నాశ్రయించియున్నవి. కాఁబట్టి తమతమధర్మములందుఁ దప్పకయుండునట్టి వర్ణములను విష్ణువు విడనాడఁగోరఁడు' అని యర్థము.

* 'భైక్షచర్యాం తతః ప్రాహుః' అని (ఔ. మూ.) 'భైక్షచర్యాం నచైవాహుః' అని (దా. మూ.)

గొలువుగొలిచి వయసుచెల్లినపిదప రాజు ననుమతినొంది మఱి యొక యాశ్రమమును బొందవచ్చును. ధర్మము చెప్పిన వేదముల నధిగమించి, రాజశాస్త్రములను దెలిసి సంతానాదులను బడసి, సోమపానముచేసి, ధర్మమునఁ బ్రజలనెల్లఁ బాలించి, బ్రాహ్మణులకు దక్షిణలొసంగి రాజసూయము, అశ్వమేధము మొదలయిన యాగములను, మఱియుఁ దక్కినవానిని గావించి యుద్ధమందు కొంచెముగానో యెక్కువగానో జయము నొంది, రాజ్యమందుఁ బ్రజలను బాలించు దిట్టయగు పుత్రునినో పుత్రుఁడులేనిచో నితరగోత్రమువాఁడును బ్రశస్తుఁడునయినమఱియొక క్షత్రియునో నెలకొలిపి, పితరులను శ్రాద్ధములచేతను పితృయజ్ఞములచేతను యథావిధిగ నర్చించి యజ్ఞములచేత, దేవతలను, వేదాధ్యయనముచేత ఋషులను, బ్రయత్నంబునఁ బూజించి యంత్యకాలమున మఱియొక యాశ్రమమును బొందఁగోరు క్షత్రియుఁడు *క్రమముగా నాశ్రమములనుబొంది సిద్ధిపొందును. గృహస్థాశ్రమమును విడిచి తొలఁగిన క్షత్రియుఁడు, ఋషివృత్తి నుండునేని భైక్షము నాచరింపవచ్చును. కాని విషయసుఖము లనుభవించుటకై యట్లు, చేయరాదు. గృహస్థధర్మమునువిడిచి తన బ్రతుకుటకుమాత్రము వలయునంత భిక్షించుచు, భైక్షము నాచరింపవచ్చును. ఈ భైక్షచర్యము క్షత్రియులు వైశ్యులు శూద్రులనెడి యీ మూఁడువర్ణములవారికిని నిర్బంధముతోఁ గూడినవిగావు. వారి కిచ్ఛయుండినయెడల వరింపవచ్చునుగాన నాలుగువర్ణములవారికిని నిది చెల్లును.మను

---

* 'ఆనుపూర్వ్యాశ్రమాన్' అని (దా. మూ.) 'ఆనుపూర్వ్యాశ్రమాత్' శా. మూలము.

ష్యులయందు, మిక్కిలి శ్రేష్ఠమయిన ధర్మములు రాజు లాచరించునవియె యగును. లోకమంతయు వారి బాహుబలిమికి లోనయియున్నది. మూఁడువర్ణముల వారి ధర్మములు నుపధర్మములును జరుపఁబడుటకై క్షత్రియధర్మమునూఁది యున్నవని వేదములవలన వినుచున్నాను. ఏనుఁగు నడుగులోపలఁ దక్కిన జంతువుల యడుగులన్నియు నడఁగి యిముడునట్లు, తక్కిన వర్ణములవారి సమస్తధర్మములును సకల సందర్భములందును రాజధర్మములం దిమిడిపోయి యున్నవి. ధర్మవిదులగు మనుష్యులు, తక్కిన మూఁడువర్ణములవారి ధర్మములును, నల్పములయిన యాధారములును నల్పములయిన ఫలములు నొసంగుచున్నవని చెప్పెదరు. పెద్దలు, క్షత్రియులధర్మము గొప్ప యాధారమును గొప్పఫలములను నొసంగునుగాని తక్కినవట్లు లొసంగవని చెప్పెదరు. సమస్త ధర్మములకు రాజధర్మములు ప్రధానములయినవి. సమస్తవర్ణములవారును రాజులవలననే పాలింపఁబడుచున్నారు. సమస్తమయిన త్యాగములును రాజధర్మములందున్నవి. త్యాగమును శ్రేష్ఠమయిన పురాతన ధర్మముగాఁ జెప్పుదురు; దండనీతి హతమయినచో మూఁడు వేదములును మునిఁగిపోవును; మనుష్యధర్మశాస్త్రములు నన్నియు నశించును. పురాతనమగు క్షత్రియధర్మము నశించెనా సకలమయిన యాశ్రమములు *(ధర్మములునశించును. సమస్తభోగములును రాజధర్మములందుఁ జూపట్టుచున్నవి. సమస్తవిషయములును రాజధర్మములందుఁ జెప్పఁబడియున్నవి. సమస్తములయిన విద్యలును రాజధర్మములందే కూడియున్నవి.) సమస్తములయిన లోకములు

* ఈకుండలీకరణములలోనిది ఔత్తరాహప్రతులందులేదు.

రాజధర్మములం దడఁగియున్నవి. సర్వధర్మములును, సర్వభోగములును, సర్వయోగములును, రాజధర్మములందు నెలకొనియున్నవి. కాఁబట్టి రాజధర్మమునకంటె విశేషించిన ధర్మము మఱియొకటి లోకమునం గలుగదు. సకలములయిన యాకర్మములును సమస్తములయిన ప్రాణిసమూహములును రాజధర్మమునందుఁ బ్రతిష్ఠింపఁబడియున్నవి. ప్రాణులు నీచులచేత వధింపఁబడునేని, వారలధర్మములను వైదికకర్మములను నాశముసేయునట్లు, సమస్తధర్మములును రాజధర్మముల సహాయము వీడినచో నాశమొందుటయేకాక మనుష్యులును బెక్కులు విఘ్నములచేతఁ దమతమ ధర్మములను బాలింపనివారగుదురు. ఇది యఱువది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు రాజధర్మమును బ్రశంసించి యింద్రునకు మాంధాతకు నయిన సంవాదమును జెప్పుట.

భీష్ముఁడు 'పాండవా! నాలుగాశ్రమముల ధర్మములును (విశేషించిన) యతిధర్మములును లోకమునను వేదమునందును నుత్తమములని వాసికెక్కిన ధర్మములును రాజధర్మములం దడఁగియున్నవి. రాజధర్మము నెలకొనియున్నచో నీకర్మములన్నియు సార్థకములగుటయేకాక ప్రాణిసమూహములును కలఁకలేక సుఖంబుండును. రాజధర్మము నెలకొనక పోయెనా జీవలోకమంతయుఁ గీడుపొరయును.* ఆయాయాశ్రమము లాచరించు మను

---

* 'అప్రత్యక్షం బహుఫలం ధర్మమాశ్రమవాసినామ్। ప్రరూపయ న్తి

ష్యుల ధర్మములు ప్రత్యక్షములుగావు. మఱివానికి ఫలములును ద్వారములును బెక్కులు; వారట్టిధర్మముల శాశ్వతమయినస్వరూపమును నాగమములచేతనే యిట్టివని నిరూపించుచున్నారు; కాని, ప్రత్యక్షముగా నెట్టిదో తెలియలేరు. మఱికొందఱు లోకములు చేసిన సిద్ధాంతములే సరియని మంచిమాటలచే వాదించుచు ధర్మములకలరూపును శాస్త్రములందు నిశ్చయింపఁబడియున్న రీతిని నెఱుంగక తుదకు నేసిద్ధాంతమునందును బర్యవసింపనిపర ధర్మమందుఁ బడి కలగుండు నొందుచున్నారు. క్షత్రియుల ధర్మమో యట్లుగాదు. అది ప్రత్యక్షమైనది; మిక్కిలి ఫలముగలది; తనకుఁ దానే సాక్షియైనది; కపటములేనిది; సర్వలోకహిత మైనది. గృహస్థాశ్రమమం దున్న బ్రాహ్మణుల ధర్మమునందుఁ దక్కిన మూఁడువర్ణములవారి ధర్మములును నడంగియున్నట్లు రాజధర్మములందు లోకములన్నియును వానిపుణ్యకర్మములును నడంగియున్నవని మును పేర్కొని చెప్పియున్నాను. శూరులయిన రాజులు పెక్కండ్రు తొల్లి దండనీతి(నిగుఱించి సందేహములడుగు) కొఱకు సర్వభూతేశ్వరుండును మహాతేజుండును నారాయణుండునగు విష్ణుకడకుఁ బోయిరని ముందే నీ కుదాహరించి యున్నాను. ఆరాజులు తమదండనీతి కర్మము నొక్కొక్కటిని నాశ్ర

తద్భావ మాగమైః రేవశాశ్వతమ్' అని మూలము 'ప్రకోపయన్తి తద్భావమ్' అని ఔ. మూలము. వారధర్మముల స్వరూపమును విరుద్ధములయిన యాగములచేతఁ దెలుపుచున్నారు. ఆయాగములవలన వాని యొప్పటిస్వరూపమును దాఱుమాఱుగాఁ దెలియుచున్నారు; కాని, కలరూపునఁ దెలియఁజాలరనుట. ఇట యితరధర్మముల స్వరూపమంతగాఁ దెలియమిని జెప్పుప్రకరణము ? నీ పాఠమే గ్రాహ్యముగానున్నది.

మధర్మములతోఁదులదూఁచియేదియెక్కుడో యద్దేవుఁడు సిద్ధాంతముచేసి చెప్పఁగా వినుటకు నతని నుపాసించియుండిరి. అయ్యాదిదేవుండు తొల్లి సృజించిన సాధ్యులు, దేవతలు,వసువులు, అశ్వినులు, రుద్రులు, విశ్వేదేవతలు, మరుద్గణములు, సిద్ధులు నందఱును క్షత్రియధర్మమందుఁ బ్రవర్తించుచున్నారు. ఈవిషయమై నీకు నిజము నిరూపించుటకు నొకధర్మమును దెలిపెదను. తొల్లి యీలోకమున నసురులొకటే సముద్రమువలె నావరించి యుండుటవలన మరియాదదక్కియుండఁగా మాంధాత యని వీర్యవంతుఁడయిన యొకరాజుండెను. అక్కాలమునం దీభూమినేలుచుండినయారాజు, అనాదిమధ్య నిధనుండును సర్వేశ్వరుండునగు నారాయణుని జక్కఁగాఁ జూడఁగోరి యమ్మహాత్మునిపాదములను శిరసుసోఁక మ్రొక్కి యొకయాగమును జేయఁదొడంగెను. విష్ణుదేవుం డవ్వఁ డింద్రరూపంబున నతనికి దర్శనమొసంగెను. మాంధాతయు, రాజులు పరివేష్టించియుండ నాప్రభునిఁ బూజించెను. ఆరాజునకును మహాత్ముఁ డయినయాకల్లయింద్రునకునుమహాద్యుతియగు విష్ణుదేవునిఁగూర్చి యీగొప్పసంవాదముకలిగెను. ఇంద్రరూపుఁడగు భగవంతుఁడు 'ధార్మికోత్తమా! నీకోర్కియేమి ? నీ వానారాయణునిఁ జూడఁగోరుచున్నావు. అతఁడప్రమేయుఁడు. అతని మాయ యనంతము.అతనిమంత్రశక్తి యమితమైనది. అతం డాదిదేవుఁడు, పురాణుఁడు, విశ్వరూపుఁడు. అట్టిదేవునిని జూచుటకు నాకు సయితమలవికాదు. నాకేకాదు; సాక్షాద్బ్రహ్మకును నలవిగాదు. రాజా ! నీయుల్లంబునఁగల తక్కినకామములు వేనినయినను నీకొసంగెదను. ఏలన మనుష్యులందు రాజవు.నీవు సత్యమునందును శమమందును

నెలకొన్నవాఁడవు. ధర్మపరుఁడవు; జితేంద్రియుఁడవు; శూరుఁ డవు. కావున నీయందు దృఢమయిన ప్రీతికలదు. మఱియును భక్తిచేతను బుద్ధిచేతను, శ్రద్ధచేతను,నీవుత్తముఁడవై యున్నాఁ డవు. కావున నేను నీకు వలచినట్లు వరము లొసంగుచున్నాను' అనెను. అందులకు మాంధాత 'నీప్రసాదమునకై శిరసు సోఁక మ్రొక్కుచున్నాను.మహాత్మా! అయిన నయ్యాదిదేవునిఁదప్పక చూడఁగోరుచున్నాను. కామములన్నియు దిగవిడిచి ధర్మమును గోరి సాధువులు వర్తించు సత్పథమందు మెలఁగఁదలఁచి యడవికిఁ బోవఁదలఁచుచున్నాను. విపులమును నప్రమేయమునయిన క్షత్రి యధర్మమువలన మంచిలోకములు నాకుఁ బ్రాప్తములయినవి,నా యశస్సును స్థాపితమయినది. అయిన నాదిదేవుని వలననుండి * ప్రవర్తించినదియు లోకమందెల్ల శ్రేష్ఠమయినదియునగు ధర్మమును నేను జేయనెఱుంగను' అనెను.

అందుల కింద్రుఁడు 'రాజులుకానివా రెంత ధర్మపరులుగా నుండినను ధర్మమునకుఁ గలుగుపరమం బయినగతిని సులభ ముగాఁ బొందనుగాని పొందింపనుగాని శక్తులుగారు. ఆదిదేవుని వలననుండి మొదట వెలువడినది రాజధర్మమొకటియే. తక్కిన ధర్మములన్నియు దానికంగములుగాఁ బిదపవెలువడినవి. తక్కి న యనంతములయిన ధర్మములును వానప్రస్థధర్మములును బి దప సృజింపఁబడినవి. వానిఫలము లంతముగలవి. క్షాత్రధర్మ

* అరణ్యమిచ్ఛేగన్తుం సత్పథం సాధుజుష్టమ్' అని (దా.మూ.) వరేణ్య మిచ్ఛేగన్తుం సత్పథం లోకజుష్టమ్' అని ఔ. మూలము. లోకులంద ఱును గౌరవించునట్టిదియు సజ్జనులు మెలఁగునట్టిదియు శ్రేష్ఠమయిన మార్గమును బొందఁగోరుచున్నాను.

ములో వానికంటె విశిష్టములయినవి. ఈధర్మమునందు సమస్త
ములయిన ధర్మములు నడఁగియున్నవి. కాన క్షత్త్రియధర్మ
మునే మిక్కిలి శ్రేష్ఠమయిన ధర్మముగాఁ జెప్పెదరు. తొంటి
కాలమందు మహావిష్ణువు రాజధర్మముచేత శత్త్రువులనోర్చి
ఋషులను దేవతలను నందఱను రక్షించెను. ఈభగవంతుఁడు
లోకవిరోధులయిన యసురులనందఱను హతులం గావింపకపోయి
నచో బ్రాహ్మణులును లోకకర్తయగు బ్రహ్మదేవుఁడును నీధర్మ
మగు ననాదిధర్మమును లోకమునందుండి యుండవు. దేవశ్రే
ష్ఠుండును నాదిదేవుండునగు నారాయణుఁ డసురులతోఁగూడిన
యీభూమిని బరాక్రమంబున జయింపకపోయినచో బ్రాహ్మ
ణులు నశించిపోవుటచే నాలుగువర్ణములును నాలుగాశ్రమము
లును వానిధర్మములును నన్నియు లోకంబున లేకపోవును.
ఒక్కొక్కయుగమందును శాశ్వతములయినయాధర్మములుపలు
విధములుగా నాశ మొందుచు రాజధర్మముచే మరల నవి వర్ధిల్లు
చున్నవి. కాఁబట్టి రాజధర్మము లోకమందు శ్రేష్ఠమయినదని
చెప్పెదను. యుద్ధమునందు దేహమువిడుచుట,సమస్తభూతముల
యందును దయ,లోక విషయములందు జ్ఞానమును, ప్రజలను బా
లించుటయు, ఘోరినపాయమునుండి విడిపించుటయు, పీడితులయి
దుఃఖించుచుండు జనులకు విడుమర కలిగించుటయు, ననునివి
రాజులాచరించు క్షత్త్రధర్మములం దుండునవి. కామ క్రోధము
లందు వర్తించుచు మరియాదల నతిక్రమించి నడచునట్టి మను
ష్యులు రాజువలని భయముచేత పాపముఁ జేయకుందురు. సహ
జముగా శిష్టులయి సదాచార పరులగువా రాకారణముననే సమ
స్తధర్మములు నిర్వహింపఁగలుగుదురు. కావుననే రాజధర్మమును

మంచిదిగాఁ జెప్పుదురు. రాజులు, తండ్రిపుత్రులంబోలెఁ, బాలించుచుండఁగా లోకమునం గలసమస్తప్రాణులు తమతమ ధర్మములతోడఁ జరించుచుందురనుట కెంతమాత్రమునసందేహము లేదు. కాన క్షత్త్రియధర్మము సమస్తధర్మములకంటె నతిశయించినది; సనాతనమైనది; లోకమందు శ్రేష్ఠమయినది. అది సర్వప్రాణుల రక్షయందునువర్తించునది.తనంతట నాశరహితమైయది శాశ్వతముక్తియందుఁ బర్యవసించును." ఇది యఱువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు నింద్రరూపియగు విష్ణువు మాంధాతకుఁ జెప్పినరాజధర్మాదులను జెప్పుట.

ఇంద్రుఁడు 'ఇటువంటి ప్రభావముగలదై సర్వధర్మములును దనయం దడంగినదై సర్వధర్మములందును శ్రేష్ఠములై యొప్పు రాజధర్మమును నినుబోఁటి యుదారులగు లోకపాలురు పరిపాలించుచు రావలయును. ఈనెఱి తప్పినయెడల ప్రజలకు నాశముగల్గును. రాజు భూమిని బంటలచే సంపన్నముగావించుట, రాజసూయము మొదలయిన యాగములుచేయుట, * దీక్షనొందుట, ప్రజలను బాలించుట, సమస్తప్రాణులందును దయగలిగియుండుట, యుద్ధమునందు దేహమువిడుచుటయు, తనకు శ్రేష్ఠమయినధర్మమని తెలియవలయు. వీనియందు యుద్ధమున

* 'దీక్షాచర్యామ్' అని (దా.మూ) 'ఆత్మైక్షచర్యాం' అని (జో.మూ.)

దేహమువిడుచుట మిక్కిలి యుత్తమధర్మమని మునులు చెప్పు చున్నారు. అదికారణముగా *రాజధర్మమందు వర్తించు రాజు లందఱును మిక్కిలియుఁ జదువుచదివి గురువులకు శుశ్రూషయు సేసి తుదకు నొండొరులను యుద్ధమునఁ దార్కొని తమదేహ ములను విడుచుట నీవు కన్నారఁజూచి నదియే. ధర్మమునుగోరు క్షత్రియుఁడు, బ్రహ్మచర్యము జరపినపిదప నిత్యధర్మయుక్తమగు గృహస్థాశ్రమము నాచరింపవలయును. సామాన్యములగు జనుల వ్యవహారములందు రాజు 'వీఁడుప్రియుఁడు వీఁడప్రియుఁ'డను పక్ష పాతములేక వర్తింపవలయును. మఱియు నాలుగువర్ణములను న్యాయోపాయములచేతను గట్టుపాట్లచేతను † పౌరుషములచే తను మఱి సమస్తములయిన పూనికలచేతను వారివారి ధర్మ ములందు నిలిపి పరిపాలించుటవలనను, సమస్తధర్మములు నడఁగి యుండుటవలనను క్షత్రియధర్మము మిక్కిలిశ్రేష్ఠమని చెప్పెదరు. తమతమధర్మముల నేవర్ణములవా రాచరింపరో మఱియు న్యాయాధర్మములను విపరీతములుచేసి చెప్పుదురో వారు మర్యా దమాలి యెప్పుడును ధనమందే తగులు గలిగినవారుగాన యట్టి మనుష్యులను బశువులని చెప్పెదరు. ధనసంపత్తి పెంపుచేత నీతిని నెలకొలిపి లోకము శ్రేయమును బొందించునుగాన క్షత్రి యధర్మము తక్కిన యాశ్రమములకన్న నుత్తమమగును. మూఁ డువేదములును జదివిన బ్రాహ్మణుల కేర్పఱచిన నడవడియు, సామా న్యముగా బ్రాహ్మణులకేర్పఱచిన యాశ్రమములును బ్రాహ్మణు

* 'నిత్యంవ్యక్తం రాజధర్మేషుసర్వే' అని దా. మూ. 'నిత్యంయుక్తా రాజ ధర్మేషుసర్వే' అని ఔ. మూలము.

† 'ఔరసైః' అని మూలము. 'ఔషధైః' అని దా. మూల.

నకు నన్నింటికిని లో ముఖ్యమయినది. *దానినిగాక మఱియొకటిని జే
యుబ్రాహ్మణుని శూద్రునింబోలె నాయుధముచేత వధింపవల
యును. నాలుగాశ్రమముల ధర్మములును వేదోక్తవిధానము
లును బ్రాహ్మణుఁ డనువర్తింపవలయును. ఇది తప్ప నతనికి మఱె
ద్దియును నెప్పటికిని లేదని తెలియునది. బ్రాహ్మణునకు వేఱువిధ
మున రాజు మనుగడఁ గలిగింపరాదు. అతని కర్మములచేత
నతనిధర్మము పెరుఁగుచున్నది. బ్రాహ్మణుఁడు ధర్మమెట్లో యట్లె.
ధర్మమే యతఁడు. తనకు విహితములు కాని ధర్మములందు వర్తిం
చుబ్రాహ్మణుఁడు సమ్మానమున కెంతమాత్ర మర్హుఁడుగాఁడు.
అతఁడు తన స్వకర్మములను బ్రయోగింపనియెడల నతఁడెవ్వరి
నమ్మికకును బాత్రుఁడుగాఁడు. † తమధర్మములను మాలినయేవర్ణ
మువారినిగాని మేలయిన పదవికిఁ దేవలసినది క్షత్రియుని ధర్మము
గాన రాజధర్మమే తక్కినవానికంటె శ్రేష్ఠమయినది. ‡రాజధర్
మే ప్రభావమం దన్నిటికంటె నతిశయించినదని నామత’మనెను.
అందులకు మాంధాత ‘యవనులును, కిరాతులును, గాంధారు

---

* ‘ఏతత్కర్మ బ్రాహ్మణస్యాహురగ్ర్యమ్’ అని ఔ.మూ. ‘క్షత్రియస్యాహురగ్ర్యమ్’ ఔ.మూ. అదిగాక మఱియొకటిని జేయు క్షత్రియుని శూద్రునింబోలె నాయుధముచేత జంపవలయును నని యర్థము.

† ‘ఏతేవర్ణా స్సర్వధర్మైశ్చహీనాః, ఉత్కృష్టవ్యా క్షత్రియై రేవధర్మాః’ అని (దా.మూ) ఏతేధర్మా స్సర్వవర్ణేషులీనా। ఉత్కృష్టవ్యాక్షత్రియై రేవధర్మాః’ అని ఔ.మూ. ‘అయాధర్మములం దడంగియున్న ధర్మములివియే. క్షత్రియులే వానిని’ ముందుకుఁ దేవలయును. ఇది వారికి ధర్మమగును’ అనియర్థము.

‡ ‘వీరజ్యేష్ఠాః వీరధర్మా మతా మే’ ఔ. మూ. అదివీరులధర్మముగాన వీరులే ముందాచరించుచున్నవారు.

లును, చీనులును, శబరులును, బర్బరులును, శకులును, తుషా
రులును, కంకులును, పల్లవులును, ఆంధ్రులును, మద్రకులును,
ఉష్ట్రులును, పులిందులును, అరట్టులును, కాచులును, మ్లేచ్ఛు
లును, బ్రాహ్మణక్షత్రియులవలనఁ బుట్టిన జాతులును, వైశ్యులు
ను, శూద్రులును నిట్లు రాజులదేశమందు వసించువారందఱు
ను ధర్మముచేయుట యెట్లు పొసఁగును? వీర లాచరింపవలసిన
ధర్మము లెట్లు? దొంగతనము వృత్తిగాఁ గలయిట్టివారల నంద
ఱను ననుబోఁటివారికి ధర్మమునందు నిలుపవలసిన విధమెట్లు?
దేవేశ్వరా! క్షత్రియులమగు మాకు నీవు బంధుభూతుండవు కాన,
దీనిని వినఁ గుతుకపడెదు నాకుఁ దెలియఁజెప్పుము' అని యడిగెను.

ఇంద్రుఁడు 'దొంగవృత్తి గల తెగలవారందఱును తలి
దండ్రులకును, పెద్దలకును, ఆచార్యులకును, ఆశ్రమముల వసించు
వారికిని శుశ్రూష సేయవలయును. ఆ దొంగలందఱును రాజు
లకును శుశ్రూష సేయవలయును.* దేశమునకు సామాన్యముల
యిన ధర్మకార్యములును వారికి ధర్మముగా విధింపఁబడియున్నవి.
వారు పితృకర్మములు చేయవలయును. (లోకమున కుపయుక్త
మగు కొలఁకు) బావులు త్రవ్వవలయు. చలిపందిరులు పెట్టవల
యును. బ్రాహ్మణులకు శయనములును గాలమునకుఁ దగిన
దానములు నొసంగవలయును. అహింసయు, సత్యమును, అక్రో
ధము లేమియు బ్రాహ్మణులకును దాయలకును వలయునవి
యొసంగి రక్షించుటయు, దారపుత్త్రులను బోషించుటయు, పరి
శుద్ధియు ద్రోహము లేమియు, సమస్త యజ్ఞములందు బ్రాహ్మ

* 'దేశధర్మక్రియాశ్చైవ' అని (దా. మూ) 'వేదధర్మక్రియాశ్చైవ' అని (జౌ. మూలము.) వేదములందుఁ జెప్పఁబడిన ధర్మకార్యములు నని యర్థము.

ణులకు దక్షిణల నొసంగుటయు, నీతెగలలో ధర్మము గోరువాం డొక్కొక్కండు నాచరింపవలసినవి. అట్టివి వారందఱును జేసి మిక్కిలి ధనములను నొసంగవలయును. ఇవియు నిట్టి కర్మములును తొల్లి యీతెగలవారికి విధింపఁబడెను. ఇవియేకాక తక్కిన లోకులకెల్ల విహితములయిన కర్మములుగూడ నీతెగవారికిని గర్తవ్యములగును' అనెను. మాంధాత 'మనుష్యలోకమందు సమస్త వర్ణములయందును సమస్తములయిన యాశ్రమములందును నట్టి దొంగబ్రతుకుగలవారు మాఱుధర్మముల మఱఁగి చూపట్టుచున్నారు' అనెను. అందులకు నింద్రుఁడు, 'రాజుల దుర్బుద్ధివలన దండనీతి నశించియు రాజధర్మములేకయుఁ బోవఁగా ప్రాణులన్నియు మిక్కిలియుఁ దడఁబాటు నొందుచున్నవి. ఈకృతయుగము గడచిపోవఁగా నాశ్రమములు తాఱుమాఱగును. అప్పుడు లెక్కలేని సన్న్యాసులు, నానావిధములయిన తెగచిహ్నములను ధరించి చూపట్టుదురు. జనులు సనాతనములయిన ధర్మములకుఁ బెడచెవులంబెట్టి వందలకొలఁదిని కామక్రోధములచేఁ బ్రేరితులై తప్పుదారిని ద్రొక్కుదురు. మహాత్ములయినరాజులు దండనీతినిగొని పాపమును దొలఁగఁబుచ్చఁగా నపుడు శాశ్వతమయిన పురాతనధర్మము వర్ధిల్లి చలింపక కుదురుకొని యుండును. లోకుల కందఱకును బెద్దయగురాజు నెవఁ డవమానించునో వాని * దానములును కర్మములును జపమును నెందును గొంచెమేనియు ఫలింపదు. మను

---

*'నతస్యదత్తం నకృతం నశ్రుతం ఫలతిక్వచిత్' అని (దా.మూ.) 'నతస్య దత్తం నహుతం నశ్రాద్ధం ఫలతేక్వచిత్' అని (ఔ.మూ.) వాని దానములును హోమములును పితృకర్మములును ఫలింపవు.

ష్యులకధిపతియు దేవతలరకోనివాఁడును,మహాకాంతిఁ దళుక్కొ త్తువాఁడును,ధర్మకాముండు నగురాజును దేవతలునుమిక్కిలిగా గౌరవింతురు. భగవంతుఁడు బ్రహ్మ, లోకము నంతయు సృజించి ధర్మములు ప్రవృత్తి నివృత్తులఁ బాలించుకొఱకు క్షత్రియునిఁ గోరెను. ఎవఁడు తన బుద్ధిచేత జనులు జరపుచున్న ధర్మము గతిని బాలించుచుండునో యట్టిపురుషుఁడు నాకు మాన్యుఁడును బూజ్యుఁడునగును. అట్టివాఁడే క్షత్రియుఁడు. అట్లు చేయుటయే క్షత్రధర్మము' అనెను.

ఇట్లావిష్ణుదేవుండు చెప్పి యంత దేవతాగణములు పరివేష్టింప శాశ్వతంబును నవ్యయంబు నగుతన పదంబునకు వేంచేసెను. ఇట్లు ధర్మము చక్కఁగా నాచరింపఁబడినదై ప్రవర్తించుచుండఁగా తెలివియు మిక్కిలి చదువును గలవాఁడెవఁడు క్షత్రియుని నతిక్రమింపఁగలఁడు?.దారియందుఁ బోవు గ్రుడ్డివారివలె, నీతిమాలిన ప్రవృత్తియు నివృత్తియు నడుమనే నాశమునొందును. ఆదికాలమందు బ్రహ్మదేవునివలననుండి వెలువడి ప్రవర్తించుచున్నదియు, పూర్వులకెల్లఁ బెనుప్రాపయినదియు నగు ధర్మచక్రమందు నీవు వర్తింపుము. నీవందుల కెంతయుఁ దగుదువని యెఱుంగుదును' అనెను. ఇది యఱువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మములను చెప్పుట. }

ధర్మరాజు 'పితామహా! మనుష్యుల కందఱకును నాలుగాశ్రమములున్నవని మునుపు చెప్పఁగా వింటిని. దానిని విశ

దముగా మీఁదు మిక్కిలి తెలియఁగోరుచున్నాను. దానినిగుఱించి సవిస్తరముగా నుపన్యసింపుము' అని యడిగెను.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా! ఈలోకమునందు సజ్జను లాచరించు ధర్మములన్నియు నాకుఁ దెలిసియున్నట్లే నీకును దెలిసియున్నవి. ధార్మికోత్తమా! ఇతరములయిన లింగములను (ఆశ్రమములను) ఆచరించువారలవలనరాజునకుఁ గలుగుధర్మము నడుగుచున్నావు. అది చెప్పెదను వినుము. ఈ నాలుగాశ్రమములవారి ధర్మములివియన్నియును సదాచారపరులయిన రాజులను సంబంధించుచున్నవి. యుధిష్ఠిరా! కామద్వేషములు లేనివాఁడై సమస్తప్రాణులయందును సమదృష్టిగలిగి దండనీతిని జెల్లించురాజు భైక్ష్యాశ్రమఫలమును (అనఁగా బ్రహ్మచర్యఫలమును) బొందుచున్నాఁడు. దానమును విసర్గమును నిగ్రహానుగ్రహములును దెలిసి శాస్త్రోక్తములగు విధులచొప్పున నడచుకొను ధీరుండగురాజు, గృహస్థాశ్రమము ఫలమునొందును. అర్హులయిన వారిని వేఱువేఱ విభజించి తెలిసికొని పూజించుచు వారికి వలయునవి పంచియిచ్చుచు నుండురాజు భైక్ష్యాశ్రమము ఫలమునొందును. జ్ఞాతులను సంబంధులను మిత్రములను నాపదలనుండి తనశక్తికొలఁది నుద్ధరించుచుండు రాజు వానప్రస్థాశ్రమము ఫలము నొందును. మనుష్యులయందు ముఖ్యు లయినవారిని యతులందు మిన్నలయినవారిని మాటిమాటికి సత్కారము చేయుచుండురాజు వానప్రస్థాశ్రమ ఫలమునొందును. పితృయజ్ఞమును భూతయజ్ఞమును మనుష్యయజ్ఞమును దేవయజ్ఞమును ననెడి వీనిని విపులముగాఁ బ్రతిదినమును జేయుచు నతిథులను దక్కిన ప్రాణులను నంతరువులకొ

లఁదిని వేలువేలనెఱింగి యర్చించునట్టి రాజు వానప్రస్థాశ్రమఫల మును బొందుచున్నాఁడు. శిష్టులను గాచుకొఱకు పరరాజ్యము లను మర్దించురాజును దానినే పొందును. ప్రాణుల నన్నింటిని బరిపాలించుటవలనను,తనరాజ్యమును జక్కఁగా నేలుటవలనను, రాజు తానెందఱను బాలించెనో యన్ని యజ్ఞములు చేసిన ఫల మునే కాక సన్న్యాసాశ్రమఫలము నొందును. వేదాధ్యయన మం దెడతెగని ప్రీతికగలిగి, క్షమయు, నాచార్యునిఁ బూజిం చుటయు, ఉపాధ్యాయులకు శుశ్రూషసేయుటయు, బ్రహ్మచర్యా శ్రమఫలము నొసఁగును. ప్రతిదినమును వలయుమంత్రములను జపించుచు, నెప్పుడును దేవతలను బూజించుచు నుండురాజు యత్యాశ్రమఫలమును బొందును. ప్రాణమును బందెముగా నొడ్డు యుద్ధ మనెడిజూదమందు మరణమో లేక రక్షణమో యని నిశ్చయించు కొన్నరాజు సన్న్యాసాశ్రమఫలము నొందును. ఎప్పు డు నేప్రాణులయందును వంచనయు ధూర్తత్వమును నెఱ పనిమార్గమందు వర్తించునట్టి రాజు సన్న్యాసికి సముఁడగును. మూఁడువేదములను నధిగమించినవానప్రస్థు లగుబ్రాహ్మణుల యందు విస్తారములగు ధనములనొసంగు రాజు వానప్రస్థపదవి నొందును. * సమస్తభూతములందు దయఁజూపుచు క్రూరత్వ మెంతమాత్రమును లేకుండురాజు సమస్తాశ్రమములపదవినిబొం

---

* 'సర్వభూతేష్వనుక్రోశం కుర్వత స్తస్యభారత । ఆనృశంస్య ప్రవృత్తస్య సర్వావస్థంపదం భవేత్' అని దా. మూ. 'ఏవం కుర్వత స్తవ భారత । అనృశంస్యే ప్రవృత్తస్య నియతః పుణ్యసంచయః' అని (దా. మూ) ఇట్టి వాఁడ వగునీకు పుణ్యములు తప్పక ప్రోవుగొనుననియర్థము. అయిన నీపాఠ మ ప్రస్తుతము.

దును.*పిన్నలయందుఁగాని పెద్దలయందుఁగాని యేయవస్థయందును గనికరముచూపురాజు సర్వాశ్రమముల పదవిని బొందును. బలవంతముగాఁ బీడింపఁబడి,†తన్ను శరణుఁజొచ్చిన ప్రాణులను రక్షించురాజు గృహస్థాశ్రమపదవిని బొందును. స్థావరజంగమము లగు ప్రాణుల నెల్లవిధములను రక్షించుటయు యోగ్యతకుఁ దగురీతిని బూజించుటయు గృహస్థధర్మపదవి నొసంగును. అన్నలభార్యలను, దమ్ములను భార్యలను, అన్నదమ్ములను బుత్రులను, మనుమలను, శిక్షించుటయు రక్షించుటయు రాజునకు గృహస్థధర్మములగును. మఱియు నది యపారమయిన తపంబునగును. సాధువులును బూజనీయులు నగువారిని బూజించుటయు నాత్మజ్ఞానసంపన్ను లయినవారిని బాలించుటయు గావించురాజు గృహస్థాశ్రమపదవినిబొందును. ఒక్కొక్కయాశ్రమమందును గలమనుష్యులకుఁ దనయింట నవ్వారిగా భోజనము పెట్టించుట రాజునకు గృహస్థధర్మమగును. బ్రహ్మ సృజించిన ధర్మములందు యథార్థముగా వర్తించుచుండు నట్టిరాజు, సమస్తాశ్రమముల పుణ్యఫలమును బొందుచున్నాఁడు. సుగుణము లెప్పుడు నేరాజునందు నశింపకుండునో యతనిని సమస్తాశ్రమములపదవి గలవానినిగాఁ జెప్పుదురు. పూజ్యము లయినయధికారస్థానములు గలవారిని, పూజ్యములయిన కులములవారిని, వయసుచేతఁ బూజ్యులయిన

* 'బాలవృద్ధేషు కౌంతేయ సర్వావస్థంయుధిష్ఠిర । అనుక్రోశక్రియాపార్థ సర్వావస్థంపదంభవేత్' అని ఔ. మూలము. 'పార్థ ధర్మ ఏష సనాతనః' అని దా. మూలము. ఈపాఠము ప్రకృతముగాదు.

† 'శరణాగతేషు కౌరవ్య కుర్వన్ గార్హస్థ్యమావసేత్' అని ఔ. మూ. 'కుర్వన్ కారుణ్య మాచర' అని దా. మూలము. ఇది ప్రకరణానుగుణముగాదు.

వారిని, దగురీతిని గారవించు రాజు సర్వాశ్రమముల నాచరించి నట్టి వాఁడగును. దేశధర్మములను గులధర్మములను బాలించు చుండురాజు, సర్వాశ్రమ ఫలముల నొందును. తగినకాలములం దు సాధువులయినవారికి సంపదలను గానుకలను నొసంగురాజు సకలాశ్రమముల పదవులను బొందును. అపాయమును భయ మును బయికొన్నను సకలమనుష్యుల ధర్మములందుఁ గన్ను గలిగియుండు రాజు, సకలాశ్రమముల ఫలమునొందును. లోకమం దేరాజుపాలనమందుఁ గలజనులు ధర్మమందు సమర్థు లై ధర్మమును జేయుదురో యామనుష్యుల ధర్మములందుఁ బాతికపాలారాజునుజేరును. ధర్మమునందే మిక్కిలియాసక్తు లై ధర్మపరులగు మనుష్యులను రక్షింపనిరాజు వారల పాప మును బొందును. జగమును బరిపాలించుటయందు రాజునకు సహాయులై యుండువారందఱును లోకులు చేయుధర్మము నం దొకపాలును బొందుదురు. మనము సేవించుచున్న గృహ స్థాశ్రమమును, ఆశ్రమములందు మిక్కిలియు నెక్కుడయిన దని చెప్పెదరు. ఈనిర్ణయము మిక్కిలి స్పష్టముగానే యు న్నది; మఱి పావనమునగును. ప్రాణులను దన్నుంబోలె నెన్నికోపమును గెలిచి దండమును జెల్లించు రాజిందు నం దును సుఖమొందును. * సత్యమనెడు జలమును, శీలమనెడి

---

* 'ధర్మోచ్ఛ్రితా సత్యజలా శీలయష్టిర్దమధ్వజా । త్యాగవాతాధ్వగా శీఘ్రా నౌ స్తయా స న్తరిష్యతి' (దా. మూలము) 'ధర్మేస్థితా స త్త్వవీర్యా ధర్మ సేతువరాటకా । త్యాగవాతాధ్వగా శీఘ్రా నౌస్త్వాం సంతారయిష్యతి' అని ఔ. మూలము. ధర్మముల (నెడుజల మ)ందున్నదియు స త్త్వమే ఓడనడపు వాని బలముగాఁగలదియు, ధర్మసేతువులను (అనఁగా శాస్త్రములనెడు) కట్టు

త్రెడ్డును, దమమనెడి ధ్వజముగలిగి, త్యాగమనెడు వాయువుచే దారిని బోవునదియు వేగముగలదియు నగుధర్మమనెడు నావనెక్కి సంసారసముద్రమును రాజు దాఁటఁగలఁడు. సమస్త విషయములందు సంగమువీడి కామము మనస్సునందు లేక మంచి నడవడులతోఁగూడి సత్యసంధుం డగుమనుష్యుఁ డీబ్రహ్మమునొందును; మనంబునడంచి నిష్కళంకమయిన భావముతో నీవు ప్రజలను బాలించితివేని యుత్తమధర్మము నొందుదువు. అనఘా! సమస్తలోకులను, విశేషించి వేదాధ్యయనముచేయువారును సత్కర్మపరులు నగుబ్రాహ్మణులను రక్షించుటయందు బ్రయత్నము గలిగియుండుము. రాజు ప్రజలను బాలించుటవలన నడవులం దాశ్రమములనుండి సాధువు లాచరించు ధర్మమునకంటె నూఱుమడుంగు లెక్కుడు ధర్మమును బొందుచున్నాఁడు. ఇట్లు నీకు ధర్మమునకుం గలపలుదెఱుంగులను జెప్పితిని. శాశ్వతములును బూర్వమునుండి యాచరింపఁబడుచు వచ్చునవియునగు * రాజధర్మముల ననుష్ఠింపుము. నీవు ప్రజలను బాలించుటయం దాసక్తుఁడవగుదువేని నాలుగువర్ణములయు నాలుగాశ్రమములయు ధర్మముల నంతయుఁ బొందుదువు' అనెను.
ఇది యఱువదియేనవయధ్యాయము.

మోకులుగలదియు, త్యాగమనెడు గాలిచే దారినిపోవునదియునగు రాజధర్మమనెడి నావనెక్కఁగా, అది నిన్ను (అనఁగా రాజును) సంసారసముద్రమును దాఁటించును' అని యర్థము.

* 'అనుతిష్ఠత్వమేనం వై పూర్వదృష్టంసనాతనమ్' (ఔ. మూ) యుధిష్ఠిర త్వమేనం వై పూర్వం దృష్టం' అని(దా. మూ).

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు లోకమునకు రాజుండుట వలని గుణమును లేమి వలని దోషమును నిరూపించుట.

ధర్మరాజు 'పితామహా! నాలుగాశ్రమములును నట్లేనాలుగు జాతులును జెప్పితివి. రాష్ట్రమునందలి జనులకు ముఖ్యమయిన కార్యమేమియో చెప్పుము' అనెను. అందులకు భీష్ముఁడు 'రాజు నభిషేకముచేయుటయే రాష్ట్రమునకు మిక్కిలి ముఖ్యమయిన కృత్యము. రాజును, సైన్యమును లేనిరాజ్యమును,దొంగలు కీడ్పఱుతురు. అరాజకము లయినరాజ్యములందు ధర్మము నెలకొనియుండదు. మఱియు జనులు నొకరినొకరు భక్షింతురు. అరాజకమగు రాజ్య మేవిధమునను నిందింపఁదగినది. రాజును మ్రొక్కుట యింద్రుని మ్రొక్కుటయె యగునని శ్రుతులు చెప్పుచున్నవి. సంపదనుగోరిన మనుష్యుఁడు రాజు నింద్రునింబోలె నారాధింపవలయును. అరాజకమయిన రాజ్యములందు వసింపరాదని వేదము విధించుచున్నది. అరాజకమయిన రాజ్యమందగ్నియు హవిస్సును వహింపవు. రాజును వీరులును లేనియొక రాజ్యముండఁగా మిక్కిలి బలవంతుఁ డగువాఁడొకఁడు వాని నేలుటకై వచ్చెనేని యతని నెదుర్కొని పూజించుట మిక్కిలియు మంచిది. ఇదియేమంచి యాలోచనము. అరాజకముగా రాజ్యముండుటకంటె పాపము మఱొక్కటిలేదు. కాఁబట్టి యాశూరుఁడు దీనిని జక్కఁగాఁ బాలించినయెడ సమగ్రమయిన క్షేమముగలుగును. ఇట్లుగాక బలవంతుఁ డయినయాశూరునకుఁ గోపము కలిగించినయెడల రాజ్యమును నిశ్శేషముగా

నతఁడు నశింపఁజేయును. పాలుపిదుకుటకుఁ గష్టమైన యావు మిక్కిలియు కాఁకియ పడుచున్నది. సులువుగాఁ బిదికెడి యావు ను జనులు హింసింపరు. వేఁడిచూపకయే వంగునట్టి వస్తు వునకు జనులు వేఁడిమిచూపరు. తానే వంగెడు మ్రాఁకును వంచుటకై జనులు కష్టపెట్టరు. ఈ యుపమానమును దెలిసిన బుద్ధిమంతుఁడు బలవంతుని యెడఁ దానే నమ్రుఁడై యుండ వలయును. బలవంతునికిఁజూపు మ్రొక్కు నింద్రునికిఁ జూపిన మ్రొక్కయగును. కాఁబట్టి క్షేమమునుగోరు మనుష్యుఁ డెప్పు డును రాజు నేర్పఱుచుకొనవలయును. రాజులేని జనులు, ధన వాంఛయు, దారభోగమును బడయఁజాలరు. అరాజకమయిన రాజ్యమందు పాపుఁడగువాఁడు పరులసొమ్ము నపహరించి సంతో షించును. వీని ధనమును దక్కినపాపు లాక్రమించు కొందురు. ఇట్లుండఁగా రాజ్యమునకు రాజునుగోరక పాపాత్ములగు మనుజు లును క్షేమమును బడయుట యేసమయమందును సాధ్యము గాదు. ఒకని ధనము నిరువురును, నిరువురదానిని వేఱుపెక్కం డ్రును నపహరింతురు. దాసత్వమునకుఁ దగనివానిని దాసునిఁ గాను జేయుదురు. బలవంతముగా స్త్రీల నపహరింతురు. ఈ కారణమును బట్టియే దేవతలు రాజుల నేర్పఱిచిరి. దండమును జెల్లించు రా జీలోకమున లేనిచో నీటియందుఁ జేఁపలుం బోలె బలవంతులు బలహీనులను మ్రింగివైతురు. పూర్వకాల మునఁ బ్రజలు రాజులేని కారణముంబట్టి, నీఁటియందలి చేపలు కృశించిన చేఁపలంబోలె నొకరినొకరు భక్షించి నాశమునొంది రని వినియున్నారము. పిదప నాజను లొక్కటిగాఁజేరి 'కటు వుగాఁ మాటలాడు వానిని, కటువుగా దండించువానిని, పర

భార్య నపహరించువానిని, తోలఁగఁ బుచ్చవలయును. మనము చేసికొన్న యీ యొడంబడికను మీఱి నడచువానిని దోలఁగఁ బుచ్చవలయును' అని గట్టిగా నిర్ణయించుకొనిరి. ఇట్లు భేదము లేక యన్ని జాతులవారికిని నమ్మిక కలుగఁగోరి తాము చేసికొన్న సమయమునకుఁ దగునట్లుగా నా ప్రజలు నడచుకొనుచు వచ్చిరి. ఇట్లుండియు ప్రజలు, సుఖమునొందక యార్తులై యందఱు నొక్కటిగాఁగూడి బ్రహ్మకడకుఁబోయి 'మహాత్మా! రాజు లేని కారణమున నాశము నొందుచున్నారము. మమ్ముఁ బరిపాలించుటకుఁ దగిన రాజును బంపుదువేని మేమందఱు మతనిని బూజించుచు వచ్చెదము' అని ప్రార్థించిరి. బ్రహ్మయు, మనువును వారలకు రాజుగా నుండునట్లు లాజ్ఞాపించెను. మను వందులకు సంతోషము నొందక, 'రాజ్యము నేలుట మిక్కిలియు దుష్కరము; అందును నెప్పుడును దప్పునడకలుగల మనుష్యులయెడ విశేషించి యిది దుష్కరముగాన యీ పాపకార్యమునకు నేను భయపడుచున్నా'నని యా ప్రజలకుఁ జెప్పెను. ప్రజ లామనువునుజూచి 'మనూ! నీవు భయపడవలదు, మేము నీకు వలయు ధనము వృద్ధిఁ బొందించెదము. పసులందును బంగారమందును నేఁబదింట నొకపాలును, ధాన్యమందుఁ బదింట నొకపాలును, బొక్కసమును బెంపొందించుటకుఁగాను నిచ్చెదము. వివాహములు పొసఁగినపుడు శుల్కముమాట కలిగెనేని, మిక్కిలి చక్కని కన్నియను నీకు నిచ్చెదము. ఇంద్రుని దేవత లనుసరించునట్లు, మాయందు ముఖ్యులయినమనుష్యు లాయుధములను వాహనములనుగొని నీవెంట ననుసరించి రాఁగలవారలు. రాజా! ఇట్లు పరు లెదిరింపఁ దగనిబలమును బొంది, ప్రతా

పము మెఱసి వెలుంగునీవు, కుబేరుఁడు రాక్షసులనుంబోలె మమ్ము నెల్ల సుఖముండఁ జేయుము. నీచేత సురక్షితులమై మేము చేయు సకలధర్మములందును, నాలుగింట నొకపాలు మిమ్ముఁ జేరవల యును. రాజా! ఏశ్రమయులేక యిట్లుచేరు పెనుధర్మముచేత పేరిమినొందిరాజుగా వెలుఁగు నీవు, ఇంద్రుఁడు దేవతలంబోలె, మమ్ము సకల కార్యములందును బరిపాలింపుము. తపింపఁజేయు సూర్యునివలె శత్రువులజయింప వెలువడి వారలకావరము నడంచి యెప్పుడును మాకు ధర్మమును గలిగింపుము' అని చెప్పిరి. ఇట్లు వారు చెప్పఁగా మహాతేజుండును మహాకుల ప్రసూతుండును మహాపరాక్రముండునై తేజంబున జ్వలించు చున్నట్లున్న యామనువు, ఆమహాజన సమూహము బలసికొలువఁ బయనమయ్యెను. ఇంద్రుని మహత్త్వము గాంచిన దేవతలుం బోలె నామనువు మహిమను గాంచిననాలుగువర్ణములవారును నాశ్రమములవారును మ్లేచ్ఛులును, మ్రుచ్చులును మొదలుగాఁ గలవారు వడఁకుచుఁ దమ మనస్సును స్వధర్మమం దుంచినవా రయిరి. పిదపఁ బాపములనుబోఁగొట్టి ప్రాణులను స్వధర్మము లందుఁబూనికగలవారిం గావించి వర్షించుమేఘముంబోలె మను వు భూమిచుట్టు సంచరించెను. క్షేమమునుగోరిన భూమియందలి మనుష్యులు, జనులకు హితముగోరి యిట్లు మొదట రాజునే యేర్పఱుప వలయును. దేవత లింద్రునివలెను,శిష్యు లాచార్యుని వలెను,సమీపమందున్న ప్రజలు రాజు నెప్పుడు భక్తితోడఁగొని మ్రొక్కవలయును. ఈలోకమందు, తన జనముచేతఁ బూజి తుండగు మనుష్యునిఁ బరులును బహుమానింతురు. తనవారి చేత నవమానింపఁబడిన వానిని పరులును బరిభవింతురు. రాజు

నకుఁ బగవారిచేఁ గలుగుపరిభవ మెల్లవారికిని దుఃఖము గానే యుండును. కాఁబట్టి, ఛత్రములు, వాహనములు, వస్త్రములు, ఆభరణములు, భోజనము, పానములు,గృహములు, ఆసనములు, శయనములు, మఱియుఁ దక్కిన యుపకరణముల నన్నింటిని రాజున కొసంగవలయును. అట్లు సేయుటవలన రాజు, ప్రజలను మఱింతఁ గాపాడ శక్తుండగును; ఎదిరికిఁ జెనకరాని వాఁడునగును. అతఁడు చిఱునవ్వుదొలఁక మాటాడవలయును. తనతో మాటాడువారితో మధురముగా ప్రతి మాటాలాడ వలయును. మఱియు నెనరుగలిగి, పెద్దలయందు దృఢభక్తితోఁ గూడి, జితేంద్రియుఁడై వారివారికి నీఁదగినది పంచియిచ్చువాఁడై యుండవలయును. తన్నుఁ జూచువాని మృదువుగను నింపుగను జక్కఁగను జూడను వలయును' అనెను. ఇది యఱువదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు వసుమనస్సునకు బృహస్పతి చెప్పిన రాజగుణములను ధర్మరాజునకుఁ జెప్పుట.)

ధర్మరాజు 'పితామహా ! మనుష్యుల కధిపతియైన రాజును బ్రాహ్మణులు దైవమని చెప్పుటయేల?' అని యడుగఁగా, భీష్ముఁడు 'ఈ విషయమందు వసుమనస్సు బృహస్పతి యనువీరికి జరిగిన సంవాదమగు పురాతనమయిన యితిహాసము నుదాహరింతురు. వసుమనసుఁడను రాజొకఁ డుండెను. అతఁడు కోసల దేశాధిపతి; మిక్కిలి బుద్ధిమంతుఁడు. అతఁ డొకప్పుడు ప్రజ్ఞాసంపన్నుండగు బృహస్పతిని బ్రశ్నము సేయుటకుఁ బోయెను.

ఆరాజు వినయవిధి నెఱింగినవాఁడుగాన బృహస్పతి కడకుఁబోయి ప్రదక్షిణముచేసి యథావిధి నమస్కరించి యభివాదనాదులయిన మర్యాదల నెల్లఁ గావించి సర్వలోకహితపరుఁడై రాజ్యపరిపాలన విధి నడుగఁజొచ్చెను. ఆరాజు ప్రజలసుఖము నరసి యాధర్మశీలుం డగుబృహస్పతితో 'మహాప్రాజ్ఞా! ప్రాణులు దేనిచేతఁ బెరుఁగుచున్నవి? దేనిచేత నశించుచున్నవి? ఎవని నర్చించినయెడ నవి యవ్యయంబగు సుఖమునొందును? దేవర్షీ! ఈ విషయమును ధర్మార్థకామములను గుఱించిన సందేహములు తొలఁగునట్లు నాకుపదేశింపవలయును' అని యడిగెను. అందులకు నా మహాప్రాజ్ఞుఁడు బృహస్పతి రాజులయెడఁ జూపవలయు గౌరవమును రాజ్యమును వృద్ధిఁబొందించు విధమును దండనీతి చొప్పున నతనికిఁ జెప్పువాఁ డయ్యెను.

'రాజా! లోకుల ధర్మమున కెల్ల మూలము రాజుగాఁ జూపట్టుచున్నాఁడు. రాజువలని భయ మొకటిచేతనే ప్రజ లొకరినొకరు భక్షింపకున్నారు. మర్యాదమాలి పరుల ధనమునకై యువ్విళులూరుచు లోకమంతయు నుండును; రా జట్టు గానీక వానిని ధర్మముచే శుద్ధముగావించి తానును బరిశుద్ధుండయి వెలుంగుచున్నాఁడు. రాజా! చంద్రుఁడును సూర్యుఁడును నుదయింపనియెడల, ప్రాణు లొకరినొకరు గాననేరక పెనుఁజీఁకటియందు మునుంగునట్లును, నీరు సురింగినచోటఁ జేఁపలును, కలకలములేని (జంకులేని) చోటఁ బిట్టలును విచ్చలవిడిఁ గ్రీడించుటయేకాక, కొంతవడికి నొండొంటి నెదిరించికొట్టుకొని పలువిధముల హింస గావించుకొనుచు సందేహములేక నాశము నొందునట్లును, ఈ ప్రజలును రాజులేనిచో, మేపు గొల్లవాఁడు

లేని పసులుంబోలె, దిక్కుమాలి చీకటిని మునిఁగి నాశ
మొందును. రాజు రక్షింపనిచో బలహీనుల ద్రవ్యమును బల
వంతు లపహరించుటయే కాక, యెదిరించి వచ్చువారిని జంపి
వైతురు. రాజు పరిపాలింపనిచో, పుత్రులు, భార్యలు ధనమును
దక్కంగల వస్తువులును, నశించుటేకాక యీలోకమందు 'ఇది
నాది' అనుతలంపు నెలకొనఁజాలదు. ఎచ్చటను దొంగతనము
జరుగును. రాజు పరిపాలింపనిచో, వాహనములును, వస్త్రములు
నాభరణములును,పలువిధములయిన రత్నములును, పాపాత్ములు
బలవంతముగా నపహరింతురు. రాజు పరిపాలింపనిచో, ధర్మము
నాచరించువారిని పెక్కువిధములయిన యాయుధములచేతఁ
గొట్టుటయే కాక, యధర్మమునుగూడఁ జేయుదురు. రాజు పరి
పాలింపని యెడ, తల్లి, తండ్రి, పెద్దలు, ఆచార్యులు, అతిథి,
గురువు నను వీరిని గష్టపెట్టుదురు; చంపను జంపుదురు; కూపెట్టు
తక్కిన జనులను గొట్టుదురు. ఈలోకము దొంగలమంగు
మగును. రాజు పరిపాలింపనియెడల, ధనవంతులగు జను
లకు క్లేశమును బంధమును వధమును నేసమయమందైనను
గలుగును. ఎవరును 'నాది' యను స్వతంత్రత నెఱపఁ
జాలరు. రాజు పరిపాలింపనియెడ రాజ్యము పలువిధముల నశిం
చును ; ఈ లోకము దొంగలకు లోనగును. జను లకాలమున
నశింతురు. రాజు పరిపాలింపనియెడ, వర్తకమును గృషియు
నడవనేరదు ; స్త్రీల వ్యభిచారమును దోషముగాదు. మూఁడు
వేదములును ధర్మమును మునిఁగిపోవును. రాజు పరిపాలిం
పనిచో, సంపూర్ణదక్షిణలు గలయాగములు యథావిధిని
వర్తింపవు. వివాహములును సభయు జరుగవు. రాజు పరిపాలిం

పనియెడ నెద్దులును నావులయందు వర్తింపవు. పెరుఁగు కుండలును జిలుకఁబడవు. గొల్లపల్లెలును రూపుమాయును. రాజు పరిపాలింపనిచో, క్షణంబున లోకమంతయు భయమునొంది మనంబుల నడుంకుచు, బ్రజలను ఫూలి 'హా! హా!' యని నశించిపోవును. రాజు రక్షింపనియెడల, వత్సరముల కొలఁదిని జేయు సత్రయాగము లెట్టిభయమును లేక, విధ్యుక్తములగు దక్షిణలతో జరుగవు. రాజు పాలింపనియెడల, తపంబు చేయఁదగు బ్రాహ్మణులు, విద్యలందును వ్రతములందును దీక్షితులై నాలుగు వేదములను యథావిధిని నభ్యసింపరు. రాజు రక్షింపనియెడల జనులు మోహముచేత నెంతయుఁ గొట్టువడి ధర్మములను దిగవిడుతురు; మఱియు జంకుమాలి పరులధనముల నపహరింప నుంకింతురు. రాజు పాలింపనియెడల, మనుష్యులచేతనున్న ధనమును, వారిచేతనుండి దొంగలు మ్రుచ్చిలింతురు; ఎట్టి కట్టుపాటులును మాఱిపోవును; ఎవ్వరును భయముచేత బీడితులయి పరుగెత్తుదురు. రాజు రక్షింపనియెడల నీతిమాలి తోఁచినట్లెల్ల జనులు నడతురు. వర్ణసంకరము కలుగును. రాజ్యమున దుర్భిక్షము పట్టును. రాజుచేత సురక్షితులగు మనుజు లెందును నెట్టి భయమును లేక యింటివాఁకిటి తలుపులను దెఱచికొని యిష్టము చొప్పునఁ బరుండి నిదురింతురు. ధర్మము తప్పనిరాజు భూమిని జక్కఁగా బాలింపనియెడ నెవఁడును బరుని చెడుపలుకుల కే సైఁపఁడు. ఇఁకఁ జేతితోఁ దాఁకుటను నోర్చుటయెక్కడిది? రాజు రక్షించినచో, నబలలగు పడఁతులు భయముమాలి సర్వాభరణములఁ గయిసేసి పురుషునిసహాయము లేక యొంటిమెయిదారిని బోవుదురు. రాజు రక్షించు కాలమందు, జను లొకరినొకరు

బాధింపక యథాదరించుటయేకాక ధర్మమార్గంబునఁ బ్రవర్తిం
తురు. రాజు రక్షించుకాలమున బ్రాహ్మణులు మొదలయిన
మూఁడువర్ణములవారును నియమముగలిగి విద్యలను గఱచు
టయేకాక, నానావిధములయిన మహాయజ్ఞములను గావింతురు.
వేదమును జీవనము మూలముగాఁ గొని జీవించెడి యీలోక
మంతయు రాజు రక్షణమందు నెలకొనవలయును. రాజు తన
వెనుబలముచేత, గొప్పదియగు భూభారమునుదాల్చి ప్రజలను
రక్షించునేని, లోకము దోషములేక తెలివి దొలఁకుచుండును.
ప్రాణుల యునికికిని లేమికిని రాజు నునికియు లేమియునే వరుసగా
బలీయమయిన కారణములు. కాన యట్టిరాజును బూజింపని
వాఁడెవఁడు? లోకమునకంతయు సుఖము నొసంగునట్టి రాజు
భారమును దాల్చుటయేకాక యతని హితమందును బ్రియమం
దును నెలకొనియుండువాఁ డీరెండులోకములను జయించును.
రాజునకు మనస్సుచేతనయినను గీడుదలంచు మనుజుఁడు సందే
హములేక యిహమందు దుఃఖపడుటయే కాక మృతుం డయిన
పిదపను నరకమొందును. రాజుకూడ నొక మనుష్యుఁడేకదా
యనియతని నెప్పుడుగాని యవమానించుట దగదు. 'రాజు' అని
మనుష్యరూపముతో నొక పరమదైవమున్నదని తెలియవల
యును. కాలమునకుఁ దగినట్లు, ఐదురూపములను జేయురాజు
క్రమముగా అగ్ని, ఆదిత్యుఁడు, మృత్యువు, కుబేరుఁడు, యముఁ
డను నైదుదేవరూపములు గలవాఁడగును. దాపుననున్న దుర్మా
ర్గులగు పాపులును, కటువయిన తేజస్సుచేతఁ గాల్చునపుడు, అ
గ్నియగును; చారుల మూలమునఁ బ్రజల నెల్లవారిని గనుఁగొని
వారల క్షేమములను గావించుకొని వర్తించునపుడు ఆదిత్యుఁ

ఢగును. రాజు మిక్కిలి కోపముతోడ నపరిశుద్ధులగు (దుష్టవర్తు లగు)మనుష్యులను వారలపుత్త్రులతోడను,పౌత్త్రులతోడను,మంత్త్రులతోడనుబలువిధములుగా నాశము సేయునపుడు మృత్యువగుచున్నాఁడు. అధర్మమున వర్తించు మనుష్యుల నెల్లవారిని క్రూరమయిన దండనములచే శిక్షించి ధార్మికులను రక్షించుచు వచ్చునపుడు యముఁడగును. ఎప్పుడును రాజుపకారపరులయిన జనులకు ధనములను వర్ధించి తృప్తిగావించియు విరోధుల పలుదెఱంగుల రత్నములను నపహరించియు, ఒక్కనికి సంపదనొసంగియు, నొకనివలననుండి ధనము నపహరించుచువచ్చునో యప్పు డతఁడు లోకమునఁ గుబేరుఁడగును. క్రూరమయిన నడవడిలేక ధర్మమునుగోరుచు సమర్థుండగువాఁడు లోకమున రాజునందసూయలేకయు రాజుతోడ విరోధముచేయకయు నుండవలయును. పుత్త్రుఁడుగా నుండినను, చెలికాఁడుగా నుండినను, తోడఁబుట్టినవాఁడుగా నుండినను ప్రాణసముఁడుగా నుండినను రాజునకు విరోధముచేయుమనుజుఁడు సుఖము నొందఁజాలఁడు. గాలితోఁగూడినదై మండుచున్న యగ్నియందు నగపడినను మిగతపడవచ్చును. రాజుకోపము బారిఁబడినవాఁడు కొంచెమైనను మిగతపడఁడు. మనుష్యుఁడు రాజు పాలనమందుఁగల యెట్టి వస్తువులనయినను మిక్కిలిదూరమున దిగవిడువవలయును; (కాని పొంతఁబోవరాదు). మృత్యువునెడ భయపడునట్లు రాజుధనమును గయికొనుటకు భయపడవలయును. వంచనమెయిఁజంపు జంత్త్రమునఁజిక్కిన మృగములవలె రాజుధనము నెత్తికొనఁ దొడంగు మనుష్యుఁడు తోడనే చంపఁబడును. ఈలోకమందు బుద్ధిగలవాఁడు తన ధనమువలె రాజధనమును నెచ్చరికతో రక్షింపవలయును.

బుద్ధిమాలి రాజధనము నపహరించు మనుజులు, పలువిధమయి ఘోరమగు మహానరకమందుఁ జిరకాలము పడుదురు. రాజు, భోజుఁడు, విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుఁడు, భూపతి, నరపతి యనెడి యీపదములచేత స్తుతింపఁబడును. రాజును బూజింపఁదగనివాఁడెవఁడు? కాఁబట్టి క్షేమమునుగోరు మనుజుఁడు మనసును నింద్రియములును నడంచుకొని, మంచిబుద్ధియు ధైర్యమును సామర్థ్యమును గలవాఁడై యవశ్యము రాజు నాశ్రయింపవలయును. మంచిబుద్ధియుఁ గృతజ్ఞతయుఁ గలిగి, పదవియు నింద్రియజయమును బెద్దఱికమును దృఢభక్తియుఁ గలిగి, ధర్మమున నెలకొన్నవాఁడై తనస్థానమం దున్నట్టివాఁ డగుమంత్రిని రాజు పూజింపవలయును. దృఢభక్తిగలవాఁడును, ప్రజ్ఞాసంపన్నుఁడును, ధర్మజ్ఞుఁడును, జితేంద్రియుఁడును, గఱువతనము గలవాఁడును, శూరుండును బ్రసిద్ధుండు నయినమనుష్యుని రాజు పడయవలయును. *ప్రజ్ఞ మనుష్యుని గర్వితునిఁగాఁ జేయును. రాజు మనుష్యులను లోఁకువయినవారినిగాఁ జేయును. రాజు తన్నాశ్రయింప సుఖముఁ జేయును. రాజు నెదిరించినవాని కెందును సుఖముగలుగదు. ప్రజలు రాజును దమ మొదటిశరీరముగాను రాజు ప్రజలను తనయొనలేనిశరీరముగాను భావింపవలయును. రాజులేని దేశమును దేశములేని రాజును నెలకొనియుండనేరరు. రాజు ప్రజలకు మనసును మంచిగతియు ప్రతిష్ఠయు పరమసుఖము

---

* ప్రజ్ఞా ప్రగల్భం కురుతేమనుష్యం । రాజాకృశాన్వై కురుతే మనుష్యాన్' అని జా. మూలము. రాజా ప్రగల్భం పురుషంకరోతి । రాజాభృశం బృంహయతే మనుష్యాన్' అని దా. మూలము. రాజు మనుష్యులను ప్రగల్భులఁగాను గొప్పవారినిగాను జేయునని యర్థము.

నగుచున్నాఁడు. రాజును జక్కఁగా నాశ్రయించిన జను లీలోక మును బరలోకమును జయింతురు. తపము, సత్యము, సౌహార్దము నను వీనితోడ భూమిని బరిపాలించుచు వచ్చు రాజును గొప్ప యాగములుచేసి మిక్కిలి పొగడ్తఁబొంది స్వర్గమందు శాశ్వతమయిన పదమును బొందును' అనెను. బృహస్పతి యి ట్లుపదేశింపఁగా రాజసత్తముఁడా కోసలాధిపతి వసుమనుండు ప్రజాపాలనమనెడు నుత్తమధర్మమును మిక్కిలి జతనంబుతోడఁ జేయుచువచ్చెను' అనెను. ఇది యఱువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజనీతిని చెప్పుట.

ధర్మరాజు 'భారతా! రాజు విశేషించి చేయవలసిన కార్య మేమున్నది? జనపదము నెట్లు రక్షింపవలయును? శత్రువులను జంపవలసిన విధమెట్లు? వేగులవారి నెట్లు ప్రయోగింపవల యును? నాలుగు జాతులవారికిని భృత్యులకును భార్యలకును బుత్రులకును నమ్మిక గలిగింపవలసిన రీతియెట్లు?' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు 'మహారాజా! మొదట రాజునుగాని రాజకృత్యము వహించువాఁడుగాని, జేయవలసిన రాజకృత్యముల నన్నింటి నాలించి వినుము. రాజెప్పుడును మొదటఁ దన్నును పిదపఁ దనశత్రువులను జయింపవలయును. తన్ను జయింపనిరాజు శత్రువులను జయించుట యెక్కడిది? ఐదు విధములయిన యింద్రియములను నడంచుటయే తన్ను జయించుట యగును. ఇంద్రియములును జయించిన రాజే, శత్రువులను జయింప సమ

ర్థుఁడగును. కోటలయందును, ఎల్లలయందును, బట్టణపు నుపవనములందు, నుద్యానవనములందును, జనులుగూడు చోటులందును, రహస్యములయిన పెక్కుకందువ పట్టులయందును,నగరము నడుమను, అంతఃపురమునందును, గావఁదగు పదాతులను నుంపవలయును. జడులవలెను, అంధులవలెను, బధిరులవలెను బయికిఁ గనఁబడునట్టివారిని వేగులవారుగా నుపయోగింపవలయును. వారందఱును(వారి శక్తులంబట్టి) చక్కఁగాఁ బరీక్షింపఁబడిన వారుగను, బుద్ధిమంతులుగను, ఆఁకలిదప్పులను శ్రమములను నోర్చువారుగను, నుండవలయును. రా జెచ్చటికి గలిగి మంత్రులందఱయెడలను మూఁడువిధములగు మిత్రులయందును, బుత్రులయందును, బట్టణమందును, గ్రామమందును, సామంతరాజులయందును, ఒకరినొకరు తెలిసికొనని విధమునఁ జారులను నుంపవలయును.సమర్థుండగురాజు,అంగడులయందును, విహారస్థానములందును, జనులు గూడుపట్టులందును, వీథులందును, తోఁటలందును, చిన్నతోఁటలందును, పండితులసంఘములందును, భోగమువాటికలందును, చత్వరములందును, (రచ్చ చావడులందును) పసివాండ్లపట్టులందును, ధనవంతుల యిండ్లయందును, బరులచేఁ బంపఁబడిన చారులను, దన చారులనుగాని వెదకి తెలిసికొని కొట్టి పుచ్చవలయును. *చారుఁడు తెలియఁబడెనా రాజునకది మిక్కిలి హితమగును. రాజు తాను తక్కువవాఁడుగాఁ దనకుఁ దోఁచినపుడు, మంత్రులతోడ నాలో

---

* 'చారేతు విదితే పూర్వం హితం భవతిభారత' అని మూలము. చారేచ విహతే సర్వంహాతం భవతిభారత' అని (దా. మూ.) చారుఁడు కొట్టువడెనా అన్నియుఁ గొట్టువడునని యర్థము.

చించికొని తనకంటె నెక్కుడు బలముగల రాజుతోడ సంధిచేసి కొనవలయును. పెక్కులు శాస్త్రములుచదివినవారును విద్వాంసులును దండనీతిఁ జక్కఁగా నధిగమించినవారునునయిన బ్రాహ్మణులును క్షత్రియులును, వైశ్యులును రాజునకు మంత్రులుగా నుండవలయును. నీతియందు సందేహముగలరాజు, వీరలయందు మొదట నీతితత్త్వముల నెఱింగిన బ్రాహ్మణునిఁ, బిదప నీతినిపుణుం డయినక్షత్రియునిని, పిదప శాస్త్రజ్ఞులును దనకుహితకారులు నగు వైశ్యశూద్రులనును నడుగవలయును. తనకే తక్కువయు నున్నట్టు తెలియకుండినను, సమర్థుం డగురాజు పగరాజుతో సంధిని, దానివలనఁ దన కేదేని గొప్పప్రయోజనము కలుగఁగూడునేని, త్వరితముగాఁ జేసికొనవలయును. ధర్మమున రాజ్యమును రక్షించురాజు, సద్గుణము గలవారును మంచి యుత్సాహము గలవారును, ధర్మజ్ఞులును, సాధువులునగు రాజులతోడను సంధి చేసికొనవలయును. తన్ను నపాయము పొరయుటయుఁ దాను నాశమునొంద నుండుటయు రాజు గనుఁగొనునేని, లోకమునకు విరోధులును మున్ను దన కపకారము చేసినవారును నగువారిని నేవిధమునను జంపవలయును. ఉపకారమును గాని లేక యపకారమును గాని చేయుటకు శక్తిలేనివాఁడును, ద్రోసిపుచ్చరానివాఁడును నగు రాజునెడ నుదాసీనుఁడై యుండవలయును. సమర్థుండును, వీరుండును, విద్వాంసుండును, సేనలబలిమిచే సుఖంబుండువాఁడును నగు రాజు, దండయాత్రయందుఁ గోరికగలఁడేని మొదటఁ దన పట్టణమును రక్షింపవలసినయుపాయములను బన్ని బంధువులు సుహృదులును లేనివాఁడును, వీరులచే నెదిరింపఁబడినవాఁడును,

ప్రయత్నశూన్యుఁడును బలహీనుఁడునుగాఁ దెలిసినరాజును గూర్చి దండ్రయాత్రకు నాజ్ఞసేయవలయును. బలవీర్యములు తక్కువ యగురాజు, ఎక్కుఁడు వీర్యవంతుఁ డగురాజునకు లోపడక యెప్పుడును వానినిబట్టి లాగుటకు, వీలు చూచుచుండవలయును. వాని రాజ్యమును, శస్త్రములచేతను, అగ్నిచేతను, విషముచేతను, మూర్ఛనములచేతను బీడింపవలయును. ఆరాజులకును నతనికి నసుంగు లయినమంత్రులకును, వివాదములను గలిగింపవలయును. రాజ్యము గోరునేని బుద్ధిమంతుఁ డగురాజు, బలవంతునితోడ నేసమయమందుఁగాని యుద్ధము వర్జింపవలయును. ఎప్పుడును సామమును, దానమును, భేదము ననెడుమూఁడుపాయములచేఁ బడయందగినవస్తువును బండితుఁ డగురాజు పడసి సంతోషింపవలయు'ననియు బృహస్పతి చెప్పెను. అమితమయిన బుద్ధి గలరాజు ప్రజలనుగావంగోరునేని వారివలననుండి యాఱింట నొకపాలు పన్ను పుచ్చుకొనవలయును. దండింపఁదగిన వాని వలననుండియు, నున్మత్తుఁడు మొదలగువారల నుండియు కొంచెమో యెక్కువగనో దండుగను, ప్రజలను రక్షింపఁగోరియే బలిమిని దీసికొనవలయును. ప్రజలను సందేహములేక తనబిడ్డలవలెఁజూచుకొనవలయును. వ్యవహారమునుజూచునవు, డేమనుజునియందును, స్నేహబుద్ధిని బచరింపరాదు. రాజు సమస్తములయిన యర్థములను నెఱింగిన ప్రాజ్ఞులను వ్యవహారములను విచారించుటకు నేర్పఱుపవలయును. ఏలన రాజ్యము వ్యవహారములయం దెప్పుడును, నెలకొనియున్నది. బంగారును రత్నములును నెత్తు గనులందును, ఉప్పు అళములందును, సుంకపు చావడియందును, లేక ధాన్యములు మొదలయినవి యమ్ముచోట్లను,

ఎగుమతిచేయుచోట్లను, ఏనుఁగుల గుంపు లున్నచోట్లను; మంత్రులను, లేక యాప్తులును హితులు నయినమనుష్యులను, రాజు నియమింపవలయును. ఎప్పుడును లెస్సగా దండమును జెల్లించుచువచ్చు రాజు, ధర్మమును బడయును. దండము రాజున కెప్పుడును తమ ధర్మమని పొగడఁబడుచున్నది. రాజు వేద వేదాంగములఁ గఱచినవాఁడును, జ్ఞానసంపన్నుఁడును,మహాతపస్వియు, నెప్పుడు దానపరుఁడును యోగశీలుండును నయి యుండ వలయును. ఈ గుణములున్నియు రాజునం దెప్పుడును నెలకొని యుండవలయును. వ్యవహారమునకు హానికలుగునేని, రాజునకుఁ గీర్తియు, స్వర్గమును నెక్కడనుండి కలుగును? బుద్ధిమంతుఁడగు రాజు తనకంటె బలవంతుఁడయినరాజుచేతఁ బీడితుండగునపుడు, దుర్గమును బ్రాపునొందవలయును. విధిచొప్పున స్నేహితుల నాశ్రయించి పగవానిని గెలువనుంకించి సామము భేదము ననెడియుపాయములను దక్కంగల మార్గములను, వచ్చునట్లు చేయవలయును. రాజమార్గములందు, నడవివారి నుంపవలయును. వలసెనా గ్రామముల నున్న జనములనెల్ల వెలువరించి సమీపమందున్న పేటలయందు, వసింపఁ జేయవలయును. ధనవంతులగు ప్రజలనును సేనాపతులనును బలుమాఱు నమ్మికగలుగఁ బుజ్జగించి వెలిదేశముల నున్న ప్రజలను చక్కఁగా రక్షితములయిన కోటపట్టులందుఁ జొప్పింపవలయును. వెలుపలనున్న ధాన్యపురాసులను కోటలలోపలికి రాజు తానే తెప్పించుకొనవలయును. అది సాధ్యముకానియెడల వానినెంతయు నగ్నిచేతఁ గాల్చివేయవలయును. రాజు, (పగవారి ప్రజలయందు భేదము పుట్టించి) యతనిక్షేత్రములందుఁ గలపంటలను నాశముసేయుట

కై పగవారిజనులను వశపఱచుకొనవలయును. లేదా, తనసేనల చేతఁగాని యాపంటలనెల్ల నాశము సేయింపవలెను. నదీమార్గములందు (శత్రువులు రాఁగూడిన) వంతెనలను బడఁగూల్పవలయును. తనరాజ్యమున కొలంకులందలి జలములనెల్ల వెలుపలికిఁ బాఱించి వ్యయింపవలయును. అట్లు చేయందరముగాని బావి మొదలగువానిని విషాదులచేఁ జెఱుపవలయును. ఆసమయము, రాఁగల కాలమును బరామర్శించి * మిత్రులకుఁ జేయవలసినకార్యము పొసఁగియున్నను దానిని బాటింపక, తనపగవానికిఁ బగవాఁడును వానిని యుద్ధరంగమున మార్కొనఁజాలినవాఁడునగు ననంతరదేశపురాజుతోఁ జెలిమిచేసికొని యుండవలయును. కోటలకుఁ జుట్టునున్నవియు చైత్యవృక్షములుకాక తక్కినవియునగు చిన్నమ్రాఁకులనెల్ల వేఱుతోడ నఱికి వేయవలయును. ముదిరినమ్రాఁకుల కొమ్మలను గోయించి వైవవలయును. చైత్యవృక్షముల యాకులను నేవిధమునను గ్రిందఁబడకుండునట్లు వర్జింపవలయును. చైత్యవృక్షములు, దేవతలు, యక్షులు, రాక్షసులు, భోగులు, పిశాచములు, పన్నగులు, గంధర్వులు, అప్సరసలు, రుద్రపరివారము లయినభూతములు, ననెడి వీనికి నునికిపట్టులయిన మ్రాఁకులను నఱికి కూల్పక వర్జింపవలయును. వారణాసి యనుదేశమందు ప్రమథగణముల యధిపతియగు నికుంభునిచే సౌదాసుం డనురాజు సేన చంపఁబడినట్లు వినుచు

---

* 'మిత్రకార్యే వ్యుపస్థితే' అని మూలము. 'యుద్ధకాలే వ్యుపస్థితే' అని (దా. మూలము.)

న్నాము, *ప్రగండిక లనుపట్టులనును † ఆకాశజనను లనుపట్టులను జక్కఁగాఁ జేయింపవలయును. శూలములుగల స్థాణువుల చేతను, మొసఁడుల చేతను, తిమింగిలముల చేతను, అగడ్త నింపవలయును. ప్రాకారపుగోడలందు కోటనుండి వెలుపలికిఁ బాణు తెంచి పయిఁబడుటకై చిన్నచిన్న రంధ్రము లుంపవలయును. వానిని బెద్దద్వారములంబోలెఁ బదిలముగాఁ గాపాడుటకు వలయు జతనములు చేయింపవలయును. ఒక్కొక్క ద్వారమందును బెద్ద యంత్రములను శతఘ్నియనెడి యాయుధముల నెక్కించుటయేకాక వానిని గైవసముగా నుంచుకొనవలయును. కట్టియలను జేర్చిపెట్టుకొనవలయును. అల్లె బావులను ద్రవ్వింపవలయును. నీళ్లుగోరి పూర్వులు త్రవ్విన బావులను నల్లె శుద్ధము చేయవలయును. గడ్డిపులుతోఁ జేయబడిన యిండ్ల నెల్లను మన్నుఁ బూయింపవలయును. చైత్రమాసముగా నుండినచో నగ్నిభయము లేకుండుటకై యాపచ్చికను గడ్డిరాసులను ముందుగానే యెత్తి వేఱొక పదిలమయినచోటఁ జేర్పింపవలయును. రాజు అగ్నిహోత్రము నొకటినిదప్పఁ బగటిపూఁట వేఱగ్గిని దరికోల్పనీయక యన్నము మొదలగువానిని సయితము రాత్రియందే పాకము చేయింపవలయును. దేశమును బలాబలములను నెఱుంగి కూడినంతవఱకు ఱాలచేతను, నిటికలచేతను, మంటిచేతను,

---

* 'ప్రగండికలనఁగా బహుదూరమున వచ్చు జనులు చూడఁగూడునదియు వెలుపలి ప్రాకారపు గోడలయం దమర్పఁబడినదియునగు శూరస్థానము.

† ఆకాశ జనములనఁగా శూరులు తమ్మురక్షించుకొనఁ గూడినదియు వెలుపలనున్న శత్రువులను గూర్చి పెట్లను బ్రయోగింపఁ గూడిన ద్వారములు గలదియునగు, వెలుపలి ప్రాకారమందలి స్థానము.

నిండ్లనుగట్టుకొనునట్లు చేయవలయును. కమ్మరకొట్టములందును బురుటిండ్లయందును, నిండ్ల తక్కిన గదులందును నగ్ని సురక్షితముగా వెలుఁగవచ్చును.పగటిపూఁట నగ్నిని దరికొలిపెడివానికి మరణదండనము విధింపవలయును. మఱినగరమును రక్షించుటకై యట్టిదండనము నందఱకుఁ దెలియునట్లు చాటింపను వలయును. బిచ్చగాండ్రను బండివాండ్రను, నపుంసకులను పిచ్చివాండ్రను, పయిరువృత్తిగలవారిని (కుశీలవులను) పట్టణము వెలుపలికిఁ దఱిమివేయవలయును. ఏలన వారు శత్రులు గాన వారలు లోపలనుండుట కీడునకేయగును. చత్వరములందును, (మంత్రి మొదలయిన పదునెనిమిది) తీర్థములందును, సభలందును, పౌరులగృహములందును రాజు తగినచారుల నుంపవలయును. రాజు,రాజమార్గములను విరివిగావింపవలయును. చోటునకుఁ దగినట్లు దుకాణములను జలిపందిరులను, నేర్పఱచునట్లు నాజ్ఞాపింపవలయును.ఆయుధములును ధాన్యములును భాండములును గజములును నశ్వములును సేనలును నుండునట్టి పట్టులనును, నగడ్తలను, వీథులను,రహస్యమార్గములను, నెవ్వరు నొకప్పుడు నెఱుంగకుండునట్లు రహస్యముగా నుంచుకొనవలయును. పరసేనలచేతఁ బీడితుండగురాజు ధనములను బోగుచేసికొనవలయుటయేకాక నూనె, నేయి, తేనె, ధాన్యము, మందులు, అగ్గి, దర్భలు, ముంజిగడ్డి, ఆకులు, ఱెల్లు, లేకరులును, కరణములు, పచ్చిక, కట్టెలు, విషముపూసిన బాణములు, శక్తులు, యష్టులు,ప్రాసములు,పలుకలు, మఱి వీనినింబోని వెక్కువస్తువులనును, పోగుచేసి యుంచుకొనవలయును. సమస్తములయిన యౌషధములను, మూలములను ఫలములను (విషవైద్యులు

శల్యవైద్యులు, వ్యాధివైద్యులు, మంత్రవైద్యులనెడి) నాలుగు విధముల వైద్యులను, విశేషముగా వెదికియుంపవలయును. నట్టువులను, నర్తకులను, మల్లులను మాయావులను చేర్పవలయును. వీరలు పట్టణము నలంకరింతురు; సమస్తజనులను సంతోషపఱతురు. ఏమంత్రులవలననుండియు సేవకులవలననుండియు పట్టణజనులవలననుండియు, రాజువలననుండియు శంకగలుగుచున్నదో వారిని రాజు తనకు వశులను గావించుకొనవలయును. వారు తమ పనులు నెఱవేర్చినంతనె రాజువారలను మిక్కుటము యిన ధనములచేత, సంతోషపెట్టవలయును. ఒక మనుష్యునికి, తగినకారణము లేకగాని, కోపముగొనికాని, శిక్షవిధించికాని, ద్వేషము కలిగించియుండినయెడల దగినధనములచేతను బలుదెఱంగుల మంచిమాటలచేతను వానిని సంతుష్టునిఁ గావించి శాస్త్రోక్తవిధిని రాజు తన ఋణమునీఁగికొనవలయును. రాజు రక్షింపవలసిన యేడంగములను నీవు తెలిసికొనుము—అవి, తాను, మంత్రి, బొక్కసము, దండము, మిత్రులు, నగరము, జనపదము అనునవి. ఈ యేడింటిమయమైనరాజ్యమును రాజు విశేషప్రయత్నమున రక్షించుచు రావలయును. షాడ్గుణ్యమును, త్రివర్గమును, త్రివర్గమునకంటె నెక్కుడయినదానిని దెలిసిన రాజే భూమి ననుభవించును. పరునితోడ సంధిచేసికొనుట, పరునెదుర్కొనఁ బోవుట, పరునితోఁబోరాడుట, పరునకు భయమును గలిగించు యాత్రను బ్రకటించుట, పరునిచోటను దనచోటను సంధిచేసికొనుట,కోటనుగాని శత్రువునుగాని యాశ్రయించుట, యని యీయాఱును షాడ్గుణ్యమని చెప్పఁబడినవని తెలియుము. త్రివర్గమని చెప్పఁబడినదియు సావధానముగ విను

ము. రాజ్యమునకు క్షయము,(హీనత) స్థానము, (సమస్థితి) వృద్ధి (అధికత్వము) అను నీమూఁడును త్రివర్గమని చెప్పఁబడును. ధర్మము, అర్థము, కామము, అనునీమూఁడును, సనాతనమగు త్రివర్గమని చెప్పఁబడును. శాస్త్రప్రోక్తమయిన మంత్రశక్తి, ప్రభుశక్తి, ఉత్సాహశక్తి అను నీమూఁడు శక్తులును త్రివర్గమునకు నెక్కుడయిన సనాతనముగాఁ జెప్పంబడినవి. కార్యము, కారణము, కర్తయనెడి మూఁడును, త్రివర్గమునకంటె మిక్కిలిమేలయినవిగాఁ జెప్పఁబడునని తెలియుము. ఇవి యన్నియుఁగొఱంతపడినను సత్త్వము, రజస్సుతమములనెడి మూఁడు గుణములును, శాశ్వతమును మోక్షకారణమును నగుత్రివర్గమని చెప్పఁబడును. ఈత్రివర్గమునుండి మిక్కిలియు విడివడిన మనుష్యుఁడు ముక్తుఁడని చెప్పఁబడుచున్నాఁడు. సమస్తకార్యముల నాశమును మోక్షమని చెప్పఁబడుచున్నది. కాబట్టియే, మోక్షకాములైై దేవదేవుండగు పితామహుఁ డెప్పుడును లోకయాత్ర నెలకొనియుండునట్టిదియు సంతుష్టికి సాధనమయినదియు నగు త్రివర్గమునకై నరతకావిధిని జగమున కుపదేశించెను. ధర్మము, అర్థము, కామము ననెడి యీమూఁటిని గాలమునకుఁ దగునట్లు లనుష్ఠింపవలయును. కార్యముల కన్నిటికిని ధర్మము మూలము. రాజు ధర్మముచేతనే భూమిని జిరకాలము రక్షించుచున్నాఁడు. అర్థకామములు లేనివాఁడయినను దుఃఖము గలవాఁడయినను, ధర్మవర్తనుం డగురాజు చిరకాలము భూమిని బరిపాలించుచు వచ్చును. ఈవిషయమై అంగిరస్సు (బృహస్పతి) రెండు శ్లోకములను పాడియున్నాఁడు వానిని వినుము. — రాజు ధర్మముచొప్పునఁ గార్యములను జేసి భూమిని నగరమందలి జనులను జక్కఁగాఁ

బరిపాలించి పరలోకమున సుఖముగా వెలుంగును. ప్రజలను లెస్సగాఁ బరిపాలించు రాజు ధర్మములెల్లఁ జేసినట్టివాఁడగును. తపముచేతను యాగములచేతను వానికిఁ బసయేమి?' అనుటయే. [శుక్రుఁడుపాడిన గీతములను వినుము. ఇవి దండనీతికిని త్రివర్గమునకును మూలములయినవి. రాజు తనసిద్ధికిఁ గారణమయిన పదియాఱంగములుగల సేనను,విషమును,మాయను, దైవమును, పౌరుషమును, తూర్పు నుత్తరపు(ఈశాన్యపు)భాగమందుఁదగ్గయి నదియు మూఁడు విధములయిన త్రివర్గములచేత నిండినదియునగు కోటనుబడసి వెట్టుకొని యుండవలయును. (సంధి మొదలయిన) యాఱును,(శత్రువు,పదార్థము,స్త్రీ,వాక్కు, అపరాధములను వీని చేతనైనవైరములు)ఐదును,(లోభము,కోపము,ఆలస్యముఅసత్యము, అజాగ్రత్త,భయము, చాంచల్యము,మూఢత్వము, అన్యాయము, అవమానము అనెడు) పదియును, (కృషి, వ్యాపారము, కోట, అనకట్ట, ఏనుఁగులు పట్టుచోటు, రత్నము లున్నచోటు, పన్నుదీయుచోటు, నాథుఁడు లేనిచోటనెడి) యెనిమిదిని జయించి, పదివిధములయిన త్రివర్గములతోఁడఁ గూడిన రాజును దేవతలకును గెలువనలవిగాదు. రాజు, స్త్రీలును, వివేకశూన్యులును, దైవముచేఁ బుద్ధిగొట్టువడిన వారును, వేదాధ్యయనము చేయని వారును, నగువారల బుద్ధిని నెంతమాత్రము వినరాదు. వీరల బుద్ధి ఋజువుగాఁ జెల్లుటకుఁ దగినదిగాదు. చదివిన వారులు లేనివియు, స్త్రీలు ప్రధానురాండ్రుగాఁ గలవియు, మూర్ఖుఁడు మంత్రిగాఁగలవియు, అగ్నులచేత దహింపఁబడినవియు నగురా

[ ] దీనిలోని పాఠము ఔత్తరాహప్రతులందుఁ జూపట్టదు. మఱియును అధ్యాయ విచ్ఛేదమును లేదు.

జ్యములు (వేసవియందలి) జలబిందువులవలె పాడుపడిపోవును. ప్రసిద్ధులయిన విద్వాంసులును, ఆప్తులయిన సుహృదులును, కర్తవ్యములను జెప్పునవిగాఁ జూపట్టు సమస్తకార్యములందును వారి మాటలు రాజువినవలయును. దైవమును బౌరుషమును ద్రివర్గమును నాశ్రయించిన రాజు దేవతలకును బ్రాహ్మణులకును మ్రొక్కి జయసంపన్నుఁ డగును " అనెను.] ఇది యఱువదియెనిమిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు కృతము మొదలయిన నాలుగు యుగముల గుణములు నిరూపించుట. }

ధర్మరాజు 'పితామహా! దండనీతిగలదు. రాజుగలఁడు. ప్రజలునుగలరు. (లేక యీ రెంటిచేరిక యుఁగలదు)* ఈమాటియందు నేది కారణముగా నెవరికి నెట్టిసిద్ధికలుగునో నాకుపదేశింపుము' అని యడిగెను.

భీష్ముఁడు "దండనీతివలననుండి రాజునకును బ్రజలకును గలుగు మహత్త్వమును దానికిఁ గారణమును గలరూపునఁ జెప్పెదను వినుము. రాజుచేతఁ జక్కఁగాఁ జెల్లింపఁబడు దండనీతి, నాలుగువర్ణములవారిని స్వధర్మములందు నిలుపుటయేకాక యధర్మములందుఁ బ్రవర్తింపకుండునట్లును గావించును ప్రాణులకు దండనీతియే భయమును లేకుండునట్లు గావించు క్షేమము

---

* 'ఈమాటియందు నొకరివలన దక్కినవారికిఁ గలుగు ప్రయోజనమేమి చెప్పుము', అని ప్రతాపచంద్రరాయల వ్యాఖ్య.

తోడ నాలుగువర్ణములును దమదమ ధర్మములందుండునేని మరి యొాదలకు మాఱుపాటులేక మొదటి మూఁడుజాతులవారునుయథావిధిని సోమాదులయిన యాగములందుఁ బ్రయత్నపడుదురు] నాలుగు వర్ణములవారును దమతమ ధర్మములందు వర్తించుచుండఁగామరియొాదలు గజిబిజినొందక వర్తింపఁగా, దండనీతి వలన నెమ్మదియు, క్షేమమును గొనసాఁగుచుండఁగా, ప్రజలు చేనివలనను భయమునొందుటకు వీలులేకుండఁగా, మొదటి మూఁడువర్ణములవారును దమతమ విధిచొప్పున * స్వస్థతకై పాటుచుండఁగా, నట్టికాలములందు మనుష్యులు నిక్కముగా సుఖమునొందుదురని తెలియుము. కాలము రాజునకుఁ గారణమా! రాజు కాలమునకుఁ గారణమా! యని యీవిషయమై నీకు సంశయమువలదు. రాజేకాలమునకుఁ గారణమనుట నిజము. రాజు పరిపూర్ణముగా దండనీతి చెల్లించుచుఁ బరిపాలించునపుడు కాలములందు శ్రేష్ఠంబయిన కృతయుగము లోకమునందుఁ బ్రవర్తించును. కృతయుగమందు సకలవర్ణముల మనములును నధర్మమునందు వర్తింపవు; కావున నెచ్చటను నధర్మములేక ధర్మమే వెలుంగును. ప్రజలయోగక్షేమములు సందేహములేక సాగును; వైదికములయిన కర్మములన్నియు కొంచెమేనియుఁ గొఱవడక విలసిల్లును. సకలఋతువులు నేరోగమునులేక సుఖముగానుండును. మనుష్యులకు నెలుంగును, ఛాయయు, మనసును తెలివితేట దొలఁకుచుండును. మనుష్యు లేతెవులునులేక దీర్ఘా

* 'స్వామ్యేప్రయత్నం కుర్వన్తి త్రయోవర్ణా యథావిధి' (ఔ.మూ.) స్వామ్యమనగా స్వాస్థ్యము. కుదురుపాటు. 'సోమేప్రయత్నమ్' అని (దా.మూ.)సోమాదులయిన యాగములందని యర్థాంతరము.

యుష్మంతులై యుందురు. ఆకాలమందు విధవలు కలుగరు. కూఁతురులుపుట్టరు. భూమియు దున్నుటలేకయే పంటలుపండును. ఓషధులు నట్లెఫలించును; పట్టయు, ఆకులును, పండ్లును, వేళ్లును, వీర్యము (సత్తువ) గలవిగా నుండును. అక్కాలమందు, అధర్మమను మాటలేక ధర్మమొక్కటియే యెక్కడను నుండును. ఇవి కృతయుగము గుణములని తెలియుము. రాజు దండనీతియం దొక భాగమును దోఁసిపుచ్చి తక్కినమూఁడుభాగముల ననుసరించి నిలుచునప్పుడు త్రేతయనెడు యుగమునడచును. అక్కాలమందు ధర్మము మూఁడుభాగములతో నధర్మము నొక్కభాగము కలసియుండును. భూమియు నోషధులును దున్నిననే ఫలించును. రాజుదండనీతియందు సగభాగమును వర్జించి సగభాగము ననుసరించి నిలువఁగా నపుడు ద్వాపరమనెడుకాలము లోకమునవర్తించును. అక్కాలమందు పాపము రెండుభాగములును బుణ్యము రెండుభాగములును గలసియుండును. భూమిదున్నుట మొదలయిన పాట్లవలనను సగభాగము ఫలించును. రాజు పూర్ణముగా దండనీతిని విడిచి దుర్మార్గంబునఁ బ్రజలను బాధించునపుడు కలియుగమువర్తించును. కలియుగమందెచ్చటఁ జూచినను నధర్మము పెచ్చుపెరిఁగి నిండారుటేకాక ధర్మ మెచ్చటను గానరాదు. సమస్తవర్ణముల వారిమనసులును దమదమ ధర్మములనుండి భ్రంశమునొందును. శూద్రులు భిక్షావృత్తిచేతను బ్రాహ్మణులు సేవావృత్తిచేతను జీవింతురు. యోగక్షేమములు నశించును. జాతులు సంకరమునొందును. వైదికకర్మమును మిక్కిలి తగ్గిపోవును. ఋతువులన్నియును బ్రాణులకు సుఖముగాక వ్యాధులను గలిగించుచుండును. మనుష్యుల గర్వములును వర్ణములును మన

సులును మిక్కిలి తగ్గిపోవును. ఈకలియందుఁ బెక్కులువ్యాధులు
గలుగుటచే మనుష్యులు నూఱేండ్లునిండకమునుపే మరణింతురు.
స్త్రీలు విధవలగుదురు. క్రూరములయిన ప్రజలుపుట్టుదురు. మేఘ
ములు వర్షించుటయు, పయిరులు కలుగుటయుఁ గొన్నియెడల
మాత్రమేయుండును. రాజులెస్సగా దండనీతిని జెల్లించి ప్రజలను
గావఁ గోరకుండునపుడు రసములన్నియు నాశము నొందును.
కాఁబట్టి రాజే కృతము, త్రేత, ద్వాపరము, కలియను నాలుగుయు
గములకును గారణమగును. కృతయుగమును జేయుచుండురాజు
అవ్యయంబగు స్వర్గలోకమునొందును. త్రేతాయుగమును జేయు
రాజించుక తక్కువయగు స్వర్గమునొందును. ద్వాపరమును
సాగించురాజు తనకుఁదగినట్లుగా స్వర్గమందలి యొకభాగమును
బొందును. కలిని బ్రవర్తింపఁజేయు పాపకర్ముండగురాజు మిక్కి
లియుం బాపుఁడై యప్పాపమునకుఁ దగిననరకమందు నెలకొని
పెక్కేండ్లు వసించియుండును. మఱియుఁ బ్రజలపాపములందు
మునింగి యపకీర్తియును బాపమునుబడయును. కాఁబట్టి ప్రాజ్ఞుం
డగురాజు దండనీతిని మున్నిడికొని పడయనిదానినిబడయుటయుఁ
బడసినదానిని రక్షించుటయు వలయును. అపుడు ప్రజలయోగ
క్షేమములడ్డిలేక కొనసాగును. రాజుదండనీతిని జక్కఁగాఁ జెల్లిం
పఁగా నది తలిదండ్రులుంబోలె లోకములకు మేరలేర్పఱచుమర్యా
దలను రక్షించుటయేకాక లోకములను బావనములుగను గావిం
చును. ప్రాణులన్నియును దండనీతియందే నెలకొనియున్నవని తెలి
యుము. ఈ దండనీతియొక్కటె రాజునకుఁ బరమధర్మమగును.
కాఁబట్టి నీతిచొప్పున ధర్మంబునఁ బ్రజలను బరిపాలింపుము. ఇట్టి
వృత్తముతోడ ప్రజలను రక్షించుచుందువేని నీవుజయింపరాని

స్వర్గమును * జయింపఁ గలవు '' అనెను. ఇది యఱువదితొమ్మి దవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు రాజునకు వలయు ముప్పది యాఱు గుణములను జెప్పుట.}

ధర్మరాజు 'పితామహా ! నీవు నుంచినడవడులనెల్ల నెఱుంగు దువుగదే ! రాజిందును బరలోకమందును సుఖప్రదములయిన ప్రయోజనములను సుఖముగాఁ బడయుట యేనడవడిచేత?' నని యడిగెను.

భీష్ముఁడు † 'అది ముప్పదియాఱు గుణములతోఁ గూడినది. ఆముప్పదియాఱుగుణములును ననుష్ఠించు సుగుణములుగలరాజు శుభమునొందును. ఆగుణము లెవ్వియనఁగా:—రాజు రాగద్వేష ములులేక ధర్మములాచరించుట, ఆస్తికత్వముగలిగి స్నేహము చేయుట, క్రూరమార్గంబులేకయే ధనమునొందుట, ధర్మార్థము లకు హానిలేకుండునట్లు కామమునుబొందుట, పిన్నఁదనములేక యింపుగా మాటలాడుట, తన్నుఁదాను బొగడుకొనని శూరుఁడు గానుండుట, అపాత్రముల కొసఁగని దాతగానుండుట, దయతోఁ

* 'జేతాసి దుర్జయమ్' అని మూలము. జయింపరాని స్వర్గమును జయింతువని యర్థము.

† 'ఇయంగుణానాం షట్త్రింశీ షట్త్రింశద్గుణ సంయుతా' అనిమూలము. అది ముప్పదియాఱు గుణములు; ఇవి మఱివేఱు ముప్పదియాఱుగుణములతోఁ గూడియున్నవని (ప్రతాపచంద్రవ్యాఖ్య.

గూడిన సమర్థుఁడుగానుండుట, పెద్దవాఁడుకాఁడని తెలిసి పొత్తు చేయుట, శత్రువని చక్కఁగానిర్ణయించినపిదప యుద్ధముసేయుట, హితులుకానివారితో దూతలను జేరనీకుండుట, పరులకు బాధ కలుగనట్లు పనులుచేయుట, అసత్తులుకానివారితో ప్రయోజన మెఱింగించుట, తన గుణములనుగాక పరులగుణములను జెప్పు ట, సాధువులుగానివారివలనఁ బన్నుదీయుట, అసత్తుకాని మను జునాశ్రయించుట, చక్కఁగాఁ బరీక్షింపక దండము విధింపకుం డుట, మంత్రమును వెలిపుచ్చకుండుట, లోభులుకానివారి కొసం గుట, అపకారముచేసినవానిని నమ్మకుండుట, అసూయలేక భార్యనురక్షించుట, అఱమఱలేక పరిశుద్ధుఁడై యుండుట, అధి కముగా స్త్రీలను గూడకుండుట, అహితముకాని రుచిగలదానిని భుజించుట, పూజింపఁదగినవారిని గర్వములేక పూజించుట, కపటములేక పెద్దలకు శుశ్రూషసేయుట, డంబులేక దేవతలను బూజించుట, నిందకు వీలుగానియట్లు సంపదనుగోరుట, అడఁకు వతోఁ బనిచేయుట, కాలమెఱింగి సమర్థుఁడుగానుండుట, పస మాలినదికాని మంచిమాటలాడుట, అడ్డుచెప్పక యుపకరించుట, తప్పును దెలియక యెదిరింపకుండుట, పగవారిని జంపినపిదప దుఃఖింపకుండుట, కారణములేకయే కోపింపకుండుట, అపకార ముచేసినవారియెడ మృదువుగా నుండకుండుట, అనునివియె. నీవు రాజ్యమందుండి యీలోకమందు క్షేమమును గోరుదువేని యీవిధమున నుండవలయును. ఇట్టిగుణములకు వ్యతిరిక్తముగా నుండురాజు కొలఁదిలేని భయమునొందును. ఇట్లు చెప్పఁబడి యీగుణముల నన్నిటిని జెప్పినరీతి ననుష్ఠించుగా

క్షేమము లనుభవించి మృతుఁడయినపిదప స్వర్గలోకమందును మహిమనొందును'' అనెను.

భీష్మఁ డిట్లుచెప్పఁగావిని యుధిష్ఠిరుఁడు భీమాదులచేఁ బరివృతుండై పితామహుం డగునతని కప్పుడు వందనముచేసెను. బుద్ధిమంతుండగు ధర్మరాజు నతఁ డుపదేశించినయావిధులను నట్లు కావించెను. ఇది డెబ్బదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు చింతలేకుండుటకు ధర్మముతప్పుట లేకుండుటకును నుపాయము నుపదేశించుట.

ధర్మరాజు 'పితామహా! ప్రజలను రక్షించురాజు మనస్సునందుఁ జింత యనుబంధము లేకుండుట యెట్లు? ధర్మమునందుఁ దప్పకుండుట యెట్లు ? ఈ రెంటిని నాకుపదేశింపుము' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు 'రాజా ! శాశ్వతములయిన ధర్మములను నీకు సంగ్రహముగానే యుపదేశించెదను; ధర్మములను విస్తరించిచెప్పినచో నవి యెప్పుడును ముగియవు. ధర్మనిష్ఠులును శాస్త్రజ్ఞులును, నియమంబున దేవతల నుపాసించువారును, గుణవంతులును, బూజ్యులునయిన బ్రాహ్మణులను నీవు నీగృహమందు వసించునట్లు చేయవలయును. మొదట వారి నీవెదుర్కొని చని యడుగులనుబట్టుకొని మ్రొక్కినపిదపఁ బురోహితుని మున్నిడుకొని కార్యములన్నియును జేయవలయును. ధర్మకార్యములను శుభకర్మములను జరిపి బ్రాహ్మణులనుగొని కార్యసిద్ధిని జనకమును ననుగ్రహించునట్లు చేయవలయును. కప

టము లేనియు ధైర్యమును దెలివియును బొంది కామక్రోధము లనువర్జించి * ధర్మార్థములను రెంటిని బడయవలయును. కామక్రోధములను మున్నిడికొని ధనమును వెదకఁగోరునట్టి మూఢుండయినరాజు ధర్మమును బోఁగొట్టుకొనుటయే కాక ధనమును బడయనేరఁడు. ఇది ధర్మము తప్పకుండుట కుపాయమగును. లోభులనును మూర్ఖులనును నర్థకామముల విషయములందు నియోగింపకుము. లోభము లేనివారును బుద్ధి సంపన్నులు నగు వారినే సమస్తకార్యములందును నియమింపవలయును. మూర్ఖునకు కార్యములం దధికారము కలిగించినచో వాఁడు కార్యములందు సామర్థ్యము లేనందునను, కామక్రోధములతోఁ గూడియుండుటవలనను, దనయిచ్చకొలఁదిఁ దప్పుదారినిబడి ప్రజలను గుందించును. పంటయం దాఱింట నొకపాలు పన్నుచేతను, నపరాధులకు విధించు దండుగులచేతను, శాస్త్రమునందుఁ జెప్పఁబడిన రీతిని వర్తకులు మొదలగువారివలన రక్షణమునకుఁ బ్రతిగాఁ గయికొను వేతనములచేతను, సుంకములచేతను తేసవచ్చు బడిని గలిగించుకొని బొక్కసము నించుకొనవలయును. [పన్ను లిచ్చినమిగత ప్రజలకుఁ జాలకున్న కాలములందు న్యాయ
యథావిధిని దీసినదియు ధర్మయుక్తంబునగు ...
మరలనిప్పించి రాజు ప్రాలుమాలిక లే... —
నడపుచు రావలయును.] ...
లముగా సంతరించి...

* 'ధర...
గ్రహీ...

రాజు ప్రా లుమాలికలేక ప్రజలకు యోగక్షేమములఁ గల్పించు చుండవలయును. రక్షించువాఁడును, వలయునది యొసంగువాఁడును, ధర్మమునం దెప్పుడును వర్తించువాఁడును, సోమరితనము లేనివాఁడును, గామమును ద్వేషమును లేనివాఁడును నగు రాజు నందు మనుష్యులు రంజిలుచుందురు. కాఁబట్టి, యధర్మముచే తను, లోభముచేతను, నీవు * ధనమువచ్చుబడిని బొందరాదు. శాస్త్రయుక్తంబగు లాభముచేత ధనమురాకను గోరవలయును. శాస్త్రపరుఁడుగాని రాజునకు ధర్మార్థములు రెండును నిలుకడ గావు. కేవల మాధనము నార్జించు విషయమందే తగులుగల రాజు తుదకు ధర్మమును ధనమును రెంటిని బొందఁడు. అతఁడు గడించిన ధనమునంతయుఁ దగనిచోటఁబడి నశించును. మోహ మున (అవివేకమున) ప్రజలను శాస్త్రవిహితములుకాని పన్నుల చేతఁ బీడించునట్టి రాజు, ఆధనము మూలముననే తనకుఁ దానే గీడుకలిగించుకొనును. పాలునుగోరిన మనుష్యుఁ డావుపొదుఁ గును గో ... ... బాలును బడయనేరఁడుగదా. అట్లె నీతికి విరుద్ధముగా ... జ్యమును నలఁపినచో నది ఫలమును నొసంగఁ ... ు. పులుసై చి నీరు త్రాగించి మంచిమాటలచేత మెల్లనబు ... ిదుకునట్టి యావును గాచుచు వచ్చుమనుష్యుఁ ... ు రాజ్యమును బరిపాలించుచువచ్చు ... ు న్యాయంబున రక్షించి ... సములను సాటిలేని

---

౧ జో. మూల

...ము.

రీతిని వృద్ధినొందించును రాజు చక్కఁగాఁ బరిపాలించిన భూమి,
తృప్తినొందినతల్లి పాలు మిక్కిలి చేఁపునట్లు ధాన్యమును సువర్ణ
మును స్వజనులవలననుండియుఁ బరులవలననుండియు నెప్పుడును
బిదుకుచుండును. రాజా! చెట్టునఁ బువ్వులుగోయువానిని బోలి
యుండుము. బొగ్గులు చేయువాఁడవు గాకుమా! ఆరీతినుండి
పరిపాలించుచు వచ్చినచోఁ జిరకాలము రాజ్యము ననుభవింప
శక్తుండవగుదువు. శత్రువుల సేనలను మార్కొనఁ బో
నీకు ధనక్షయము గలుగునేని, యప్పుడు బ్రాహ్మణులు కా
వలన మంచిమాటలచేత ధనమును బడయఁగోరవలయు
క్కిలియు సంకటమునఁ జిక్కియున్నను గాని, ధనవంతు ల
హ్మణులనుజూచి నీమనస్సు పేరాశచేఁ జలింపకుండవలయున
ఇఁక నీవు సొంపు పెంపారునప్పు డిది చెప్పవలయునా? నీవు
క్తికిని బ్రాహ్మణుల యర్హతకును దగి... వారలకు ధనప
నొసంగవలయును. ఇట్లు మంచిమాటల బుజ్జగించుచు నీవు
పాలించుచు వత్తువేని గెలువనలవిగాని స్వర్గమును బొందుద
ఇట్లు ధర్మయుక్తంబగు నడ...తోఁ బ్రజలను బరిపాలి
దానివలన స్వర్గప్రదమును బుణ్యంబును శాశ్వ
యశంబునొందుదువు. నీవు ధర్మయుక...
నెచ్చరికగలిగి ప్రజలను బాలి...
గలిగి నిన్నుఁగటు...
నకుఁ బరమ...
యెడ వి...
కా...

తలంచుచున్నారు. రా జొకనాఁటికిఁ బ్రజలను భయమునుండి రక్షింపక పోయెనేని యతఁడు వేయేండ్లు నరక మనుభవించియే యాపాపము తీర్చుకొనును. ఒకనాఁటికి ధర్మంబునం బ్రజలను బాలించుట యనెడుపుణ్యమును గావించినరాజు దేవలోకమునకుం బోయి పదివేలసంవత్సరములు నాపుణ్యమువలని ఫలము నను భవించును. చక్కఁగా యజ్ఞములు చేయువాఁడును, చక్కఁగా
దానము చేయువాఁడును, జక్కఁగా తపము చేసినవాఁడును
కములను జయించునో యన్నింటిని ధర్మంబునఁ బ్రజల
ణము పాలించినరాజు పొందును. ఇట్టిధర్మమును బ్రయ
నఁ బరిపాలింపుము. ఇట్లు చేయుటవలన పుణ్యంపు ఫల
నుబడసి మనస్సునొవ్వనకుఁ గట్టువడక యుందువు ; స్వర్గలోక
ందు మిక్కిలియు గొప్పసిరిని బొందుదువు. ఇటువంటి యుత్త
ధర్మములు రాజు.. కానివారికి సంభవింపవు; కావున రాజొ
డుతప్పఁ దక్కినవా రిట్టిధర్మఫలము నొందఁదరముకాదు.
బట్టి యట్టిరాజవగు నీవు ధైర్యంబున రాజ్యంబును బొంది
బునఁ బరిపాలింపుము. సోహంబున నింద్రునికిఁ దృప్తిగా
కోరినవెల్లనిచ్చి సుహృదులగు జనులకుఁ దృప్తిగావిం
గది డెబ్బదిరెండవయధ్యాయము.

శ్రీరస్తు.

శ్రీ మహాభారతము

ఆంధ్రవచనము.

శాంతిపర్వము (391-749.)

శ్రీ దేవరాజసుధీమణిప్రణీతము.

మద్రాసు

ఆనందముద్రణాలయమునందు

ముద్రితము.

ఆ. వేంకటేశ్వర్ అన్డ్ కంపెనివారిచేఁ బ్రకటితము.

1916.

ALL RIGHTS RESERVED.

విషయసూచిక.

పటముల పట్టిక.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు బ్రాహ్మణాదుల కాపద్ధర్మము లివియని యుధిష్ఠిరునకుఁ జెప్పుట. }

యుధిష్ఠిరుఁడు:— 'బ్రాహ్మణుఁ డాపత్సమయములందు క్షత్రియధర్మములచేత బ్రతుకు చూచుకొనవచ్చునని చెప్పితిరి. అతఁ డెప్పుడేని వైశ్యధర్మముచేతను బ్రతుకు జరుపుకొనవచ్చునా ?' యని యడిగెను. అందులకు భీష్ముఁడు 'బ్రాహ్మణుఁడు తన బ్రతుకున కపాయముచేత వ్యసనమందుఁ జిక్కియున్నపుడు క్షత్రధర్మముచొప్పున నడచుకొన శక్తుఁడు గాఁడేని, వైశ్యధర్మము నవలంబించి, సేద్యము గోరక్షణమును నాచరించి బ్రతుకనచ్చును' అనెను. యుధిష్ఠిరుఁడు 'భరతర్షభా ! బ్రాహ్మణుఁడు వైశ్యధర్మము చొప్పున నడచునపుడు వాఁడు స్వర్గలోకము తనకుఁ దప్పకుండునట్లుగా నేయేయంగడిసరకు లమ్మవచ్చును ?' అని యడిగెను. భీష్ముఁడు 'యుధిష్ఠిరా! కల్లు, ఉప్పు, నువ్వులు, జూలుగల మృగములు, పశువులు, ఎద్దులు, తేనె, మాంసము, వండినయన్నము ననెడి వీనిని సకలమయిన యవస్థలందును బ్రాహ్మణుఁడు వర్జింపవలయును. బ్రాహ్మణుఁడు వీని నమ్మినయెడల నరకమందుఁ బడును. బ్రాహ్మణుఁడు మేఁక నమ్మినయెడల నగ్నిదేవు నమ్మిన పాపము నొందును; గొఱియ నమ్మునేని జలదేవుఁ డగు వరుణునమ్మిన పాపమును, గుఱ్ఱము నమ్మునేని సూర్యు నమ్మిన పాపమును, వండినయన్నము నమ్మినయెడల భూమి నమ్మిన పాపమును, గోవు నమ్మినయెడల యజ్ఞమును సోమరసమును నమ్మినపాపమును బొందుచున్నాఁడు. కనుక బ్రాహ్మ

ణుఁడు వీని నమ్మరాదు. సాధువులు, వండినయన్నము నిచ్చి వండనియన్నమును మార్చుకొనుట నెంతమాత్రము మెచ్చరు. వండనియన్నము నిచ్చి వండినదానిని గొనుట తప్పుగాదు.'మేము నీవండినయన్నమును భుజించెదము. (మేము బదులుగా నిచ్చెడి) యీ వండనివానిని (ఆమమును) వండుకొనవచ్చు.' నని యీయొడంబడిక చేసికొనుటయందుఁ బాపము లేదు. యుధిష్ఠిరా! వ్యవహారముచొప్పునఁ బ్రవర్తనముగలిగి యున్న పెద్దలాదినుండి జరుపుచున్న సనాతనధర్మమును నీకుఁ దెలుపుచున్నాను. దానిని దెలిసికొనుము. 'నేనిది నీకిచ్చుచున్నాను. నీ విది బదులుగా మాకిమ్ము' అని యిట్లొడంబడికమీఁద మార్చుకొనుట ధర్మము. బలవంతముగాఁ దీసికొనుట పాపమే. ఋషులును దక్కినవార లును బూర్వమునుండి నడచుకొనుచున్న వ్యవహారము లిట్లు వర్తించుచున్నవి. ఇది నిస్సందేహముగా న్యాయము' అనెను. యుధిష్ఠిరుఁడు 'తండ్రీ ! సకలవర్ణములవారును దమతమ ధర్మములను దిగవిడిచి రాజునకెదురై యాయుధము లెత్తికొని రేని యపుడు రాజుబలము తగ్గుచున్నది.అప్పుడు రాజేవిధమునఁ బ్రజలకు రక్షకుఁడై ధర్మమునకుఁ బెనుప్రాపై యుండఁగలఁడు? నాకుఁగల యీసందేహమును సవిస్తరముగాఁ జెప్పి తీర్పుము' అనెను. భీష్ముఁడు 'అట్టి సమయములందు బ్రాహ్మణులు మొదలగువర్ణములవారు దానముచేతను, దపస్సుచేతను, యజ్ఞముచేతను, ద్రోహము లేమిచేతను, దమముచేతను, దమతమ క్షేమములు గావించుకొనఁ దివురవలయును. వారియందు వేదబల సంపన్నులగువారు నలుగడల నుద్యమించి లేచి, మహేంద్రునకు దేవతలు బలముగూర్చునట్లు, రాజునకు బలమును వేదవిధులచేఁ

గూర్పవలయును. రాజుబలము క్షీణించుచుండునపుడు బ్రాహ్మణులె యతనికిఁ బెద్దప్రాపని చెప్పఁదురు. కనుకఁ దెలివిగలరాజు బ్రాహ్మణబలముచేతనే తనశక్తి వృద్ధినొందింపఁ జూడవలయును. రాజు విజయమునొంది రాష్ట్రమునందు క్షేమమును సమకూర్చినపుడు సకలవర్ణములవారును దమతమ ధర్మముల చొప్పునఁ గర్మములందుఁ బ్రవర్తింతురు. చోరులు కట్టుపాట్లను మీఱి యెల్లయెడల సంకరము గలిగించినపుడు, సకలవర్ణములాయుధము లెత్తికొని వారిని దలపడవచ్చును. అందువలన వారికి దోషము గలుగదు' అనెను. యుధిష్ఠిరుఁడు 'క్షత్రియు లెల్లవారును బ్రాహ్మణులతో విరోధించినయెడల నపుడు బ్రాహ్మణులనును వేదములనును గాచువారెవరు ? అప్పుడు బ్రాహ్మణు లనుష్ఠింపవలయు ధర్మమేది ? వారికిఁ బెనుప్రాపెవరు ?' అని యడిగెను. భీష్ముఁడు తపస్సుచేతను, బ్రహ్మచర్యముచేతను, శస్త్రముచేతను, దేహబలముచేతను, వీనిని వంచనచేతఁగాని వంచనమాలికాని యుపయోగించియు, క్షత్రియుల నప్పుడడఁచివుచ్చవలయును. క్షత్రియుఁడు మేరమీఱి, యందును విశేషించి బ్రాహ్మణులయందుఁ, బ్రవర్తించునేని వేదములే వానినడఁచి పుచ్చఁగలవు. ఏలన క్షత్రియులు బ్రాహ్మణులవలననుండి పుట్టినవారు. జలమునుండి యగ్నియు, బ్రాహ్మణులవలన నుండి క్షత్రియులును, ఱాతివలననుండి యినుమును బుట్టినవి. వీనికిఁ గలతేజమును నన్నియెడల నడ్డులేక నిగుడుచుండునుగాని తమతమ పుట్టుచోటులందుమాత్ర మడఁగిపోవుచున్నవి. ఇనుము ఱాతిని ఛేదించినపుడును, అగ్ని జలములతోఁ దలపడునపుడును, క్షత్రియులు బ్రాహ్మణులను ద్వేషించునపుడును, నామూఁటి బలములును

దూలిపోవుచున్నవి. యుధిష్ఠిరా ! కాఁబట్టి క్షత్రియుల తేజము లును బలములు నెంత గొప్పవియు గెలువఁదరము గానివియు నయినను, బ్రాహ్మణులపట్ల నడఁగిపోవుచున్నవి' యనెను.*యుధిష్ఠిరుఁడు 'బ్రాహ్మణులవీర్యము మెత్తనయి క్షత్రియులవీర్యమును దుర్బలమై, సకలవర్ణములవారును బ్రాహ్మణులయెడల దుష్టులై ప్రవర్తించిరేని, యపు డెవ్వరు తమప్రాణములను బాటింపక యుద్ధముసేసి బ్రాహ్మణుల నలుగడల రక్షించి వారిలోకములను బొందుదురు?' రని యడిగెను. అందులకు భీష్ముఁడు 'అప్పుడు గొప్ప మనస్సుగలిగి యిట్టిస్థితికి నెంతయుఁ గోపముఁ బూనినవారై యుద్ధముసేయఁగల వారెల్ల నాబ్రాహ్మణులనును ధర్మమునును దమ్మును రక్షించుకొనుచుఁ బుణ్యలోకములను బొందుచున్నారు. సమస్తజనులును బ్రాహ్మణులను రక్షించుకొఱకు నాయుధము లెత్తికొనుట యుక్తము. అట్లు బ్రాహ్మణులకై పోరాడుశూరులు మిక్కిలి శ్రద్ధతో వేదాధ్యయనము చేసినవారును, మిక్కిలి గొప్పతపములు చేసినవారును, ఉపవాసముండినపిదపఁ దమ దేహములను నగ్నిహోత్రములందు వేల్చినవారును, బొందునట్టి యుత్తమగతిని బొందుచున్నారు. బ్రాహ్మణుఁడు తక్కిన మూఁడువర్ణములవారికై యాయుధమెత్తికొనునేని దానివలన దోషమునొందఁడు. ఇట్టి సమయములందు ధర్మరక్షణార్థము బ్రాణములు విడుచుటకంటె నెక్కుడయిన ధర్మము జనులు లేరందురు. బ్రాహ్మణుల విరోధులను దండించుటకై తమప్రాణ

* ఇచట నడుమ యుధిష్ఠిరవాక్యము ఉత్తరదేశకోశములందు లేదు. అంతయు భీష్మునివాక్యముగానే యున్నది. అయినను దాక్షిణాత్యకోశాను సారముగా నిట తెలిఁగింపఁబడినది.

ములనర్పించునట్టి వారలకు నమస్కరించుచున్నాను. వారలకు భద్రమగుఁగాక. మనకు వారితోడి లోకము గలుగుఁగాత. అట్టి శూరులు బ్రహ్మలోకమును బొందుచున్నారని మనువు చెప్పెను. జను లశ్వమేధమందలి యవభృథమునందు స్నానముచేసి పవిత్రు లెట్లగుదురో యట్లె, దుర్జనులతో యుద్ధముసేయునపుడు వారి శస్త్రములు దగిలి హతు లయినసుజనులుగూడఁ బవిత్రులగుదురు. ఆయాకాలమును బట్టియు దేశమునుబట్టియు ధర్మమధర్మ మగుచున్నది. అధర్మము ధర్మమగుచున్నది. మనుష్యుల నడవడినిబుణ్యముగాఁగానిపాపముగాఁగానిచేయుటయందుఁగాలదేశములశక్తి యిట్టిదిగా నున్నది. జను లెల్లవారితోడి మైత్రి గలిగియుండువారు క్రూరకృత్యములు చేసినను నుత్తమమయిన స్వర్గమునొందిన వారయిరి. ధర్మాత్ము లగు క్షత్రియులు పాపములు చేయుచున్నను నుత్తమం బగుగతిని బొందుచున్నారు. బ్రాహ్మణుఁడు మూఁడుకాలములందును- అనఁగా తన్ను రక్షించుకొనుటకును, దక్కిన వర్ణములవారినిస్వధర్మములందుఁ బ్రవర్తింపజేయుటకును, దొంగలను దండించుటకును- నాయుధ మెత్తుకొనుటచే దోషమునొందఁడు' అనెను. యుధిష్ఠిరుఁడు 'దొంగలబలిమి చెలరేఁగి వర్ణసంకరము గలిగి క్షత్రియులు నశక్తులై యుండఁగా, క్షత్రియుఁడు గానివాఁడు ప్రజ

* 'బ్రాహ్మణస్త్రిషు కాలేషు శస్త్రం గృహ్ణన్న దుష్యతి। ఆత్మత్రాణే వర్ణదోషే దుర్దమ్యేఽయమేఽపిచ' అని మూలము. 'ఆత్మత్రాణే దస్యుదోషే సర్వస్వహరణే తథా' అని దా. పా. తన్నుఁగాచుకొనుటయందును దొంగల దోషము నడఁచుటయందును, గలధనమంతియు గోలుపోవునపుడును నాయుధ మెత్తికొనుట పాపముగాదని యీపాఠమున కర్థము.

లను రక్షించుటకై యాచారులను నడఁచిపుచ్చెనని తలంతము. ఆబలవంతుఁడు బ్రాహ్మణుఁడో, వైశ్యుఁడో, శూద్రుఁడో యగు నేని, దండమును ధర్మముగాఁ జెల్లించి ప్రజలను రక్షించిన వాఁడయ్యెనేని, వాఁడట్లుచేయుట ధర్మమా ? లేక యట్లు చేయకుండు విధమున వాని నివారింపవలయునా ?' యని యడిగెను. భీష్ముఁడు దాఁటు దిక్కులేని ప్రవాహమందు నెవఁడు దాఁటించు తెప్ప యగునో, లేక దరిలేనిదానియం దొకదరి యగునో, యట్టివాఁడు శూద్రుఁడుగాని మఱి యేవర్ణమువాఁడు గాని సర్వవిధములఁ బూజ్యత కర్హుఁడగుచున్నాఁడు. ప్రజలు చోరులచే మిక్కిలియుఁ బీడితులై తపించుచు దిక్కుమాలి యున్నపుడు తా మెవ్వని నాశ్రయించి యెప్పటివలె సుఖముగా నుండఁగలుగుదురో యట్టివానినే వారు తమ సొంతబంధువునుం బోలెఁ బ్రీతిగడలుకొనఁ బూజింతురు. ఇతరుల భయమును బోఁగొట్టి వారికెంతయు నభీష్టమొనఁగూర్చునట్టివాఁడు సన్మానమున కర్హుఁ డగుచున్నాఁడు. మోయలేని యెద్దులతోఁ గాని, పాడిలేని యావులతోఁగాని, గొడ్డురా లయిన యిల్లాలితోఁగాని, పనియేమి ? అట్లె ప్రజలను రక్షింపలేనిరాజువలనఁ బ్రయోజన మేమి ? మ్రానిచేతఁ జేయఁబడిన యేనుఁగువలెను, తోలిచే రచింపఁబడిన జింకవలెను, ధనములేని మనుజునివలెను, బేడివలెను, జవిటినేలవలెను, వేదాధ్యయనములేని బ్రాహ్మణుఁడును బ్రజల రక్షింపలేని రాజును నున్నారు. వా రందఱును వానకురియని మేఘమువలె నిరర్థకులే యగుదురు. ఎవ్వఁ డెల్లపుడును సజ్జనులను రక్షించుచును,దుర్జనుల నడఁచుచును నుండునో యట్టి

వాఁడే రాజు గాఁదగును. వాఁడే జగము నంతయుఁ బాలింప నేర్చును' అనెను. ఇది డెబ్బదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు యుధిష్ఠిరునకు ఋత్విక్లక్షణాదులను జెప్పుట.

యుధిష్ఠిరుఁడు.—'పితామహా ! ఋత్విజు లగు వా రెట్టికర్మములు నెట్టిశీలమును గలవారుగా నుండవలయును ? వా రెటువంటివారుగా నుండవలయును ? నీవు మాటకారులందు మేటివి గదే. ఇది చెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు.—ఋత్విక్కర్మమునకుఁ బాత్రు లగుద్విజులు సామాదులగు ఛందస్సులును శ్రుతులయందలి విధులును దెలిసి రాజునకు నభ్యుదయము గలిగించు కర్మము లెల్లను నడపఁజాలిన వారై యుండవలయునని విధింపఁబడియున్నది. వారు రాజునందే యాసక్తులై ధీరులై ప్రియవాదులై యుండవలయును. వా రొకరియెడ నొకరుసుహృదులై తక్కినవాని యన్నింటియెడల సమదృష్టిగలిగి యుండవలయును. అక్రూరత్వము, సత్యవాక్యము, అహింస,దమము. ఆర్జవము, అద్రోహము,,అభిమానము లేకుండుట, సిగ్గు, తితిక్ష, శమము ననెడి యివి యెవనియందుఁ గనుపట్టుచున్నవో వాఁడు పురోహితుఁడని చెప్పఁబడుచున్నాఁడు. మఱియు బుద్ధిమంతుఁడును, ఉడిపోని ధైర్యముగల వాఁడును, శాంతుఁడును. భూతములకు హింసగావింపనివాఁడును, గామద్వేషములు లేనివాఁడును, మూఁడు శుద్ధగుణములుగల వాఁడును, అసూయలేనివాఁడును, జ్ఞానముచేతఁ దృప్తినొందిన వాఁడును నగువాఁడు బ్రహ్మాసనమునకు నర్హుఁడగును. ఇట్టిగుణ

ములుగలవారు గొప్ప ఋత్విజు లగుదురుగాన యిట్టివారెందును దగురీతిని మిక్కిలియు మాన్యులగుదురు' అనెను. యుధిష్ఠిరుఁడు 'వేదములు దక్షిణ లీయవలయునని చెప్పుచున్నవి. కాని, యింత యీయవలయునని యెచ్చటఁగాని విధికలుగదు. దక్షిణ లీయవలయుననెడి యీవిధి ధనమును విభాగించుటనుగూర్చి కలిగినదిగాదు. కర్త యందులకు నశక్తుఁడయినచో నాశాస్త్రము మిక్కిలి భయంకరముగా నున్నది. ఆశాస్త్రము యజమానుని శక్తిని బరికింపదు. మనుజుఁడు శ్రద్ధతోఁడ యజ్ఞముసేయవలయునని వేదములందు వినఁబడుచున్నది. యజ్ఞము * పొల్లుతోఁ గూడియుండినయెడల శ్రద్ధ యేమిచేయఁగలదు?' అని యడిగెను.

భీష్ముఁడు 'వేదములను నిరాకరించుటవలనఁ గాని శఠత్వము చేతఁగాని మాయచేతఁగాని యెవ్వఁడును మేలునొందఁడు. నీవిది యిట్లుగాదని బుద్ధిని దలఁపవలదు. నాయనా! దక్షిణ యజ్ఞమున కొకయంగము. అది వేదములకుఁ బెంపు గావించుచున్నది. దక్షిణ లేని యాగము పురుషుని సంసారమును నేవిధమునను దరింపఁజేయఁజాలదు. ఒక్క † పూర్ణపాత్రమునకుఁ గలశక్తి యెంత

* పొల్లుతోఁ గూడియుండుటయనఁగా విహితము లయినదక్షిణలకు బదులుగా వేఱువాని నేర్పఱచుట. ఒకయావునకు మాఱుగా అన్నపిండములును, వస్త్రమునకు బదులుగా యనిలును, బంగారమునకుఁ బ్రతిగా రాగి నాణెము, నని తెలియునది.

† యజమానుఁడు వేదములందు విధింపఁబడిన దక్షిణనీయ శక్తుఁడుగాకున్నను వానికిఁ బ్రతియగువాని నిచ్చుటవలన వానికి ఫలము చెడకుండును. ఏలనఁగా ఒకపూర్ణపాత్రము అనఁగా ఇన్నూటయేఁబదియాఱు పిడికిళ్లబియ్యము శ్రద్ధతోనీయఁగా, అది మిక్కిలి విలువగల దక్షిణతోఁబాటిగా ఫలకారియగుచున్నది.

విలువ గలదక్షిణ కయినను సాటి యగునుగాని వెనుదీయదు. కనుక మూఁడువర్ణములవారును దమతమశక్తికొలఁదిని యజ్ఞము తప్పక చేయవలయును. సోముఁడు బ్రాహ్మణులకు రా జని వేదములందు వినఁబడుచున్నది. అయినను బ్రాహ్మణులు దానిని యజ్ఞములు చేయుటకై విక్రయించుచున్నారు. కాని దాని వలన బ్రతుకు జరుపుటకుఁగాదు. ధర్మములందుఁ బండితులగు ఋషు లాసోమమును విక్రయింపఁగా వచ్చినధనముచేత యాగమును జేయఁగా నాయాగము పయిపయిని యాగములను బెంచుచున్నదని ధర్మయుక్తముగాఁ జెప్పియున్నారు. * పురుషుఁడు, యజ్ఞము, సోమము ననెడియీమూఁడును న్యాయ౦ బగు నడవడి గలిగి యుండవలయును. అన్యాయం బగు నడవడి గల పురుషుఁ డిహమునకును బరమునకును బాత్రుఁడు గాఁడు. మిక్కిలియు దేహకష్టముచేత గడించిన ధనమునుగొని మహాత్ములగు బ్రాహ్మణులు గావించెడి యజ్ఞ మంతగా గొప్పధర్మము నొసంగదని వేదములందు వినఁబడుచున్నది. తపస్సు యజ్ఞమునకంటె శ్రేష్ఠమయినదని వేదములందు మిక్కిలి ప్రతిపాదింపఁబడుచున్నది. ఆ తపమును నీకుఁ జెప్పుచున్నాను. విద్వాంసుఁడవు గదే. దానిని సయితము నేను జెప్పఁగావినుము. అహింస, సత్యవచనము, అక్రూరత్వము, దమము, దయ యనునివియె ధీరులగువారు తప మని తెలియుదురుగాని శరీరమును స్రుక్కించుట గాదు. వేదములను నిరాకరించుట, శాస్త్రముల నుల్లంఘించుట, మర్యాదలనెల్లఁ బాటింపకుండుట యను నివియె తనకు నాశనమగును. యుధిష్ఠిరా ! 'తప స్సనెడియజ్ఞము చేయువారికి బ్రహ్మ

* ఇట పురుషుఁడనఁగా యజమానుఁడు. యజ్ఞము చేయువాఁడని తెలియునది.

ముతోఁ బడయఁగోరిన యోగము, స్రుక్కు, చిత్త మాజ్యము, ఉత్తమమగు జ్ఞానము, పవిత్రము, సమస్తమయిన కుటిలత్వ మును, మృత్యువు, ఆర్జవమెల్ల బ్రహ్మపదము. జ్ఞానవిషయ మింతియె. కుదృష్టివాదుల ప్రలాపములు దీనినేమిచేయఁగలదు' అని దినమునకుఁ బదిమూఁడు లగ్నిహోత్రమందు వేల్చుచుండు వారు (దశహోతలు) విధించి యున్న దానిని, యుధిష్ఠిరా! వినుము' అనెను. ఇది డెబ్బదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు మిత్రులయు నమిత్రులయు లక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! మిక్కిలి యల్పమయిన కార్యమును నయితము మనుష్యుఁడు సహాయములేక యొక్కఁడే చేయుట దుష్కరముగా నున్నది. ఇఁక రాజ్యమువంటి దానిని సహాయము లేక చేయుట యెట్టిదో చెప్పనేల? కాఁబట్టి రాజునకు సహాయుఁ డగు మంత్రి యెట్టిశీలమును నాచారమునుగలవాఁడుగ నుండవల యును? రా జెట్టివానియందు నమ్మికయుంపవచ్చును? ఎట్టివాని యం దుంపరాదు?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజా! రాజులకు నాలుగువిధములయిన మంత్రులు గలరు. వారలు సహార్థుఁడు (రాజుతోపాటి ప్రయోజనము గల వాఁడు) భజమానుఁడు (రాజును భక్తితోఁ గొలుచువాఁడు)

* సహార్థుఁడు, రాజుతోఁబాటిగా 'మనమిరువుర మీశత్రువును నిర్మూలుని చేసి యీరాజ్యము నిరువురు పంచుకొనవలయునని కలసినవాఁడు. భజమానుఁడు,

సహజుఁడు (రాజు తోఁబుట్టుకచే సంబంధించినవాఁడు) కృత్రి
మఁడు (దానాదులచే వశీకృతుఁడయినవాఁడు) అని నలుగురు. రెండుపక్షములను గొలువక యొకపక్షమునే యనువర్తించు నట్టి ధర్మాత్ముం డగు పురుషుఁడు రాజు మిత్రములలో నైదవ వాఁడు. అతఁ డేపక్షమందు ధర్మముగలదో యాపక్షమందే యుండును. లేక యేపక్షమును జేరక మధ్యస్థుఁడుగా నుండును. (ధార్మికుఁ డగు రా జట్టివానిని గయికొనవచ్చును కాని) వానికి రుచింపనివిషయమును రాజు వానికి వెల్లడింపరాదు. మిత్రుఁడని యొక ప్రకృతిలేదు. శత్రు వనియు నొక ప్రకృతిలేదు. ఉపకారము వలన మిత్రుఁడును నపకారమువలన శత్రుఁడును నగును. మనుష్యుఁడు తా నెవనిమరణమును గోరునో, కాలము కొంచెము కడవఁగానే వాని బ్రతుకునే కోరును. కాన మిత్రుత్వ శత్రుత్వములు స్వభావసిద్ధములుగావు. జయింపఁ గోరురాజులు ధర్మంబునను నధర్మంబునను జరింతురు. నాలుగు విధములయిన మిత్రులలో నడిమివారగు రెండవవాఁడును మూఁడవవాఁడును శ్రేష్ఠులు. మొదటివానిని నాలుగవవాని నెప్పుడును సందేహించుచుండవలయును. రాజు తానే చక్కఁజేయవలసిన కార్యము బూర్వోక్తులయిన యెవ్వరయందు సందేహింప వలయును. మిత్రులను రక్షించువిషయమందు రా జెంతమాత్రము పరాకు పడరాదు; అట్లు పరాకుపడినరాజును లోకులు మిక్కిలియుఁ గీడ్పఱతురు. అసాధువు సాధువు గాను సాధు వసాధువుగాను నగుచున్నాఁడు. శత్రువును మిత్రుఁడగును. మిత్రుఁ

తాతముత్తాతల వరుసనుండి కొలువుగలవాఁడు. సహజుఁడు, పినతల్లికొడుకు మొదలయినవాఁడు. కృత్రిముఁడు, ధనాదులచే వశీకృతుఁడయినవాఁడు.

డును మిక్కిలి దుష్టుఁడు కావచ్చును. మనుష్యుని చిత్త మెప్పుడును నొక్కతీరున నుండదు. కాబట్టి వాని నొకప్పుడును నెవఁడు నమ్మును? కాబట్టి ముఖ్య మయినకార్యమును రాజు చక్కఁగానే చేయవలయును. ఒక్కచో యెడతెగని విశ్వాసము, ధర్మార్థములను మూలముట్టుగ నాశముసేయును. అందఱయెడ విశ్వాసము లేకుండుటగూడ, మృత్యువుకంటె నెక్కుడయినది. విశ్వాసము కాలమృత్యువగును. అవిశ్వాసము విపత్తుగాఁ బర్యవసించును. ఒకఁడు మఱియొకనిఁ బూర్ణముగా విశ్వసించెనేని, యామఱియొకఁడు తనయెడ మంచికోరిక కలిగియుండు నంతవఱకుఁ దాను బ్రదుకును. ఈకారణమునుబట్టి కొందఱయెడ నమ్మికయు, శంకయు రెండును గలిగి యుండవలయును. ఇది రాజనీతిగతి. ఇది సనాతనమయిన సంపత్తి. ఒకఁడు 'నేను గతించినయెడల నాధనము వీనికిఁ జేరవచ్చు' నని యెవనినిగూర్చి తలంచునో యట్టి వానియెడ నెప్పుడును సందేహించుచుండవలయును. పండితు లట్టివాని నమిత్రునిఁగా నెన్నుదురు. ఎవనిపొలము దారిని, మఱియొకని పొలమునకు నీరుపాఱుచున్నదో యా మనుష్యుని యిష్టములేక యిక్కడనుండు కట్టలు తెగిపోనేరవు. అట్లే మిక్కిలి నీటికి భయపడి యామనుష్యుఁడు గనిమను ద్రెంపఁగోరును.* ఇటువంటి లక్షణముగలవాఁడై శత్రువులు చొచ్చుటకు దారియైన

* పెద్దచెఱువు నసకట్టదాపున పొలము గలవాఁడా కట్టను గాచుచుండెనేని దానిక్రింది పొలములు నిమ్మళముగా పంటలు పండుచుండును; వాఁడా కట్టను దెగఁగొట్టినా క్రింది పొలములకెల్లఁ జెఱుపు గలుగును. అట్లే గొప్ప శత్రువుండఁగా రాజ్యంపు పొలిమేరను గాచువాఁడు (సీమాంతపాలుఁడు) దానిని బదిలముగాఁ గాచుచుండినచో పరరాష్ట్రమునుండి మంచిసరకులు (ప

రాజ్యంపునెల్ల గాచుచుండునట్టి వాని నెప్పుడును శంకించుచుండ వలయును. బుధులు వానిని శత్రువుగా నెన్నుచున్నారు. రాజు వృద్ధినొందుట కెంతమాత్రము తపింపక యత్యంతము సంతోషించువాఁడును, రాజు క్షీణతనొందెనా మిక్కిలి దీనతనొందు వాఁడును నగుట యుత్తముఁ డయినమిత్రునిలక్షణముగాఁ జెప్పుదురు. ఎవనినిగూర్చి 'నేను బాడిమాలితినా వీఁడును బాడి మాలు'నని తలంతువో యట్టివానియందు, తండ్రి యందుం బోలె విశ్వాస ముంపవలయును. అట్టివానిని రాజు తనశక్తి కొలఁదిని సర్వవిధముల వృద్ధినొందింపవలయును. ఎవఁడు నీధర్మ కార్యములందు నీకుఁ గీడురాకుండ వారింపఁజూచునో యట్టి వాఁడు, తక్కిన కార్యములందుఁ గీడువాటిల్లకుండునట్లు చూచు చుండును. ఇట్లుండుటయె యుత్తమం బగు మిత్రలక్షణము. ఎవ్వరెవ్వని క్షీణతనుగోరుదురో వారువానికి శత్రువులని చెప్పం బడెదరు. నీకు వ్యసనము కలిగినప్పుడు మిక్కిలి భయపడు వాఁడును, నీకుఁ బెంపు సొంపారునపు డసూయలేక యుప్పొంగు వాఁడును, నగుమిత్రుఁడు నీకు సమానుఁడని చెప్పఁబడును. మంచి రూప మును, మేని చాయయుఁ, దియ్యని యెలుఁగును గలిగి యోర్పుగలవాఁడై యసూయలేక మంచికులమునఁ బుట్టి మంచి స్వభావము చెలఁగుచున్న పురుషుఁడు, రాజునకు వెను వెనుక ముఖ్యుఁడుగా (అనఁగాఁ బ్రధానమంత్రిగా) నుండవలయును.

న్యాములు)వచ్చుటచే స్వరాష్ట్రము సుఖమునొందును. ఆపొలిమేరను భేదించెనా స్వరాజ్యము శత్రువులు చొచ్చుటచే నశించును. ఇట్లు శత్రువు వానికధీనుఁడుగా నున్నాఁడుగాన యట్టి సీమాంతపాలుని వలనను శంకించుచుండవలయు ననిభావము.

ఋత్విజుఁడయినను, గురువయినను, మిత్రుఁడయినను, మేధావియు మంచి జ్ఞాపకశక్తి గలవాఁడును, సమర్థుఁడును, స్వభావమునఁ గ్రూరుఁడు గానివాఁడును, దన్ను గౌరవించినను గౌరవింపక పోయినను మనసునఁ గొంచెమైనను భేదము నొందనివాఁడును నగు పురుషుఁడు నీగృహమందు నిలిచి యమాత్యుఁడుగా నుండఁ గోరునేని నీవు పూజించుచుండవలయును. అతనికి నీపరమరహస్యములయిన మంత్రాలోచనములును నీధర్మార్థములకలస్థితియుఁ దెలుపవచ్చును. అతనియందుఁ దండ్రియందుంబోలె నీవు విశ్వసింపవలయును. ఒకకార్యమునకు నొక్కనినే నియమింపవలయును గాని యిద్దఱను ముగ్గురను గూడదు. ఏలన వారొకరి నొకరు సైఁపకపోవచ్చును. ఒక్కకార్యమునందుఁ బెక్కండ్రను నియమించినపుడు వారలకు భేదముగలుగుట యెప్పుడును జూపట్టుచున్నది. కీర్తి ప్రధానముగాఁ గలవాఁడై, సమయములన్నిటను

'సతే విద్యాత్పరం మంత్రంప్రకృతిం చార్థధర్మయోః' అని ఔ. మూలము. 'సంవిద్యాః పరమం మిత్రం ప్రకృతి ..' అని దా. మూలము. ధర్మార్థములరెంటికిని ప్రకృతిగానుండు మిత్రుని మిక్కిలి యుత్తమునిఁగాఁ దెలియవలయునని యర్థము. ప్రకృతి యనఁగా ముఖ్యకారణము. ఇది అర్థమునకును ధర్మమునకును ధర్మార్థములు రెంటికిని బ్రకృతిగా మూఁడువిధములగును:—ఇందుఁ 'గృషి, వర్తకము, కోట, మేర, ఏనుఁగులు పట్టుచోటు, బంగారు రత్నములు మొదలయినవి యెత్తుచోటు, కప్పముతీయుట, దిక్కులేంచోటు' అని యీ యెనిమిదియు అర్థసంబంధియగు ప్రకృతి. ధర్మాధికారియగు నొకఁడు ధర్మప్రకృతి యగును. కోటయధ్యక్షుఁడు, సేనాపతి, రాజు, పురోహితుఁడు, వైద్యుఁడు, జోస్యుఁడు ననెడి యీయార్వురును, ధర్మార్థములు రెంటికిని బ్రకృతియగుదురు - అని అఱవ వ్యాఖ్యానము.

దప్పక వర్తించుచు, సమర్థులగు వారిని ద్వేషింపక, యనర్థముల నాచరింపక, కామమువలనఁగాని భయమువలనఁగాని లోభ క్రోధములవలనఁగాని ధర్మమును దిగవిడువక, సమర్థుఁడయి వలయునంత మాటాడు దిట్టతనము గలిగియున్న పురుషుఁడు నీకు వెనువెనుకఁ బ్రధానుఁడగు మంత్రిగా నుండవలయును. మంచి కులమునఁ బుట్టినవారును, శీలసంపన్నులును, ఓరుపు గలవారులును, తన్నుఁదాను బొగడుకొననివారును, శూరులును, గొప్పతనముగలవారును, విద్వాంసులును, గర్తవ్య మిదియని నిశ్చయింప నేర్చినవారును నయిన యిట్టిపురుషులను, నీకార్యములన్నింటిని జూచుటకు మంత్రులుగా నేర్పఱుపవలయును. వీరు నీవలనఁ బూజితులై వలయువస్తువుల నొంది, నీమేలునందే నిష్ఠ కలిగి నీకెంతయు సహాయులై యుందురు. అర్థమును సంబంధించిన యాదాయ వ్యయములు మొదలయిన కార్యములందును మఱియు గొప్ప కార్యములందును నియుక్తులై వీరు మిక్కిలియు శ్రేయమును గలిగింతురు. మఱియు,వీరొండొరులకు మేలు చేయ తాము కాఁగోరుచు, వలయునపు డొకరినొకరు గలసి యాలోచించుచు, అర్థమును సంబంధించిన కార్యముల నెల్లఁ గావించుచుందురు. ఎప్పుడును జ్ఞాతులను జూచినచో మృత్యువుం బోలె నెన్ని భయపడవలయును. జ్ఞాతి సామంతునివలెనే యెప్పుడును రాజు పెంపును సయింపఁడు. కపటము లేక, మెత్తఁదనముగలిగి మిక్కిలి దాతయు, నకార్యములందు లజ్జగలవాఁడును, సత్యవచనుఁడును నగు రాజు నాశమునకు జ్ఞాతితప్పఁ దక్కిన వాఁడెవ్వఁడును సంతోషింపఁడు. ఒకప్పుడు జ్ఞాతులు గానివారును దుఃఖము కలిగింతురు; జ్ఞాతులును సుఖము గలిగింతురు. జ్ఞాతులు లేనివా

నిని దక్కినజనులును గీడ్పఱుతురు. పరులచే నవమానితుఁ డయిన మనుష్యునకుఁ దనజ్ఞాతియె ముఖ్యమయిన ప్రాపగును. తనజ్ఞాతికిఁ గలిగిన యవమానమును జ్ఞాతియొక్కఁడె సైఁపఁడు. తక్కినవాఁ డట్లుండఁడు. బంధువు తనజ్ఞాతికిఁ జేసిన యవమానమును దనకుఁ జేసినట్లే తలంచును. కాఁబట్టి, జ్ఞాతులయందు గుణమును దోషమును రెండును గానంబడుచున్నవి. జ్ఞాతిలేని మనుష్యుఁడు సంతోషమును బొందఁడు. వృద్ధియుఁ బొందఁడు. జ్ఞాతి వర్గమందు మంచి సెబ్బరలు రెండును గనుపట్టుచున్నవి. జ్ఞాతులను వాక్కుచేతను గార్యములచేతను నెప్పుడును గౌరవముతోఁ బూజింపవలయును. వారలకుఁ బ్రియమే చేయవలయును. అప్రియ మెంతమాత్రమును జేయరాదు. వారి యెడల మనస్సునందు నమ్మిక లేకుండినను, ఎప్పుడును నమ్మిక గలవానివలె నుండవలయును. వారియందు గుణమనికాని దోషమనికాని దృఢముగా నిరూపించుట శక్యముగాదు. ఇట్లు పరాకులేక ప్రవర్తించుచువచ్చు మనుష్యునియందుఁ బగవారును గలంకలేక మిత్త్రులగుదురు. ఇట్లు శత్రువు, మిత్త్రుఁడు, ఉదాసీనుఁడు, జ్ఞాతి, బంధువు లనువీరలయందు నెప్పుడును బ్రవర్తించుచు వచ్చు మనుష్యుఁడు చిరకాలము మంచికీర్తిని బొంది వెలయుచుండును.” అనెను. ఇది యెనుబదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు జ్ఞాతివిషయమై కృష్ణునకును నారదునకును జరిగినసంవాదమును జెప్పుట.}

ధర్మరాజు ‘ఇట్లు పరస్పర మసూయ గలజ్ఞాతులను బొంధ

వులను మిత్రులను శత్రువులను దనవశము చేసికొనుట యిట్లు కష్టముగా నున్నదిగాన వారల మనసులను వశము చేసికొనుటకు దారియెద్ది?' యని యడిగెను.

భీష్ముఁడు ఈవిషయమై, దేవర్షియగు నారదునకును వాసుదేవునకును నొకసంవాదము జరిగెను. పురాతనమయిన యా యితిహాసము నుదాహరించెదరు. వాసుదేవుఁడు 'నారదా! పండితుఁడుగాని మిత్రుఁడును, బండితుఁ డయ్యును మంచి తెలివి లేని యమిత్రుఁడును, బగమమయిన మంత్రమును (రహస్యమును) దెలిసికొనఁ దగినవారుగారు. కాఁబట్టి, నీకుఁ గలపరిపూర్ణజ్ఞానమును మంచిచెలిమిని దృఢముగా నేను గనుఁగొన్న వాఁడను గాన కొన్నివిషయముల నడుగుచున్నాను. నేను*రాజని పేరుగలిగి జ్ఞాతులకు నూడిగము చేయుచున్నాను. భుజింపఁదగిన వాని యందు, సగముమాత్రమే భుజించుచున్నాను. తక్కినసగమును జ్ఞాతుల కిచ్చుచున్నాను. వారల వాక్కులనుండి వెలువడు పరుసంపుమాటలను సహించుచున్నాను. అగ్గిని గోరినవాఁ డరణిని జిలుకునట్లు, ఆపరుసనిమాటలు నామనస్సును మథించుచున్నవి. దేవర్షీ! వారల వాక్కులనుండి వెడలు క్రూరంపుఁబలుకులు నన్నెప్పుడును దహించుచున్నవి. నారదా! బలదేవుఁడు బలమున మిన్న. గదుఁడు సౌకుమార్యమునను బ్రద్యుమ్నుఁడు చక్కఁదనమునను మదించి యున్నవారు. నాకు సహాయుఁ డొక్కఁడును లేఁడు. నారదా! తక్కినవా రయినయంధకులును వృష్ణు

*దాస్యమైశ్వర్యవాదేవ జ్ఞాతీనాం వైకరోమ్యహమ్' అని దా. మూలము. '...వ కరోమ్యహమ్' అని ఔ. మూలము. నాదాయాదుల యైశ్వర్యము నెత్తి పొగడుచు వారికి నూడిగమును నెప్పుడునుజేయుదు' అని ప్రతాపచంద్రరాయలు.

లును మిక్కిలియు భాగ్యవంతులై బలవంతులు నై పరులకుఁ జెనకరాకున్నారు. వా రెడ తెగనిపూనికయుఁగలరు. వా రెవ్వని పక్షమునఁ జేరరో వాఁడు నశించును. ఎవ్వని పక్షమునఁ జేరుదురో వాని కన్నియుఁ గలుగుచున్నవి. ఆహుకుఁడును అక్రూరుఁడు నిరువురును దమయందు నాకధిక మగునెయ్యము లేదని నన్ను విడిచియున్నారు. కాన వారియం దొకరిపక్షమును జేరలేకున్నాను. ఈ యిరువుర పక్షమున నుండుటయు దుఃఖముగా నున్నది. ఈ యిరువురను విడిచి పుచ్చుటయు నంతకంటె దుఃఖముగానున్నది. మహర్షి ! ఒక తల్లి తనయిరువురు కొడుకులును జూదరా, నపు డిరువురకును గెలుపును గోరినట్లు, నేనును వారియందొకరికి గెలుపును మఱొకరికి నోటమియుఁ గోరకున్నాను. నారదా! ఈ యిరువురనుబట్టి యిట్లు దుఃఖపడుచున్నాను గాన, నా నిమిత్తము నాకును జ్ఞాతులకును శ్రేయం బయినమార్గమును నీవు చెప్పవలయును' అని యడిగెను.

నారదుఁడు 'వృష్ణికులతిలకా ! మనుష్యునకు బాహ్యము ఆభ్యంతరము నని రెండు విధములయిన యాపదలుగలవు వీనియందుఁ దనచేతఁ గావింపబడినది యాభ్యంతర మనియుఁ,బరులచేతఁ గావింపఁబడినది బాహ్యమనియుఁ జెప్పఁబడును. ఇప్పుడు నీకుఁ గలిగియున్నయాపద యాభ్యంతరము. ఇది నీ కర్మముల వలననే కలిగినది. బలదేవుఁడు మొదలయిన భోజవంశమువా రక్రూరునితో సంబంధించి, ధనమునుబట్టియో, యిచ్చుచేతనో, మాటలచేతనో, ద్వేషము చేతనో,పురికొనియో యతని పక్షమునఁ జేరినవారయిరి. నీ వన్ననో, నీవు గడించినధనమును మఱొకని కిచ్చివైచితివి.నీకు స్నేహితులు గావలసినందఱుమనుష్యు లున్నను

నీవు చేసినపనివలననే,యీబెడద దెచ్చుకొంటివి.ఆధనమును గ్రక్కి-
నకూటినింబోలె మరలఁగయికొనుట శక్యముగాదు. బభ్రువునుం
డియు*నుగ్రసేనునివలన నుండియు రాజ్యమును మరలఁ బడయు
ట యలవిగాదు. నీవు నీ యంతటను, విశేషించి జ్ఞాతులలో
భేదము కలుగు ననుభయమువలనను, దానిని గయికొనుట దరము
గాదు. ఒకవేళ నా ప్రయత్నము సిద్ధించినను నది మిక్కిలి
ప్రయాసమున మహాదుష్కరమును జేసినపిదపనే కలుగును.
దాని వలన గొప్పక్షయమును గొప్పధననాశమును, లేక పూర్ణ
నాశమును సంభవించును. కాఁబట్టి యినుముచేతఁ జేయఁబడని
సాధనము నుపయోగింపుము. అది మృదువయ్యు హృదయ
ముల ఛేదించునదిగా నుండవలయును. దానిని దీటి దీటి
నీజ్ఞాతులందఱ నాలుకలను గోసివుచ్చుము' అనెను. వాసుదే
వుఁడు 'నన్ను దీటి దీటి నాజ్ఞాతుల నాలుకలను జక్కఁబఱుపుమని
చెప్పితివే. ఇనుము కాక మృదువయ్యు హృదయములను ఛేదిం
చునట్టి యాయాయుధమెద్ది?' యని యడిగెను.

నారదుఁడు 'నీశక్తికొలఁది నెప్పుడు నన్నము పెట్టుట,ఓరుపు,
నిష్కాపట్యము, మెత్తఁదనము, పూజ్యులగు వారిని బరువుకొలఁ
దిని బూజించుట యనునివియె యినుముకాని యాయుధము.

---

* ఆహుకుఁడును అక్రూరుఁడును పరస్పరము మిక్కిలి వైరముగలిగియుం
డిరి. ఈ యిరువురును గృష్ణుని తమతమ ప్రక్కఁజేరఁ బురికొలిపినను నతఁడ
ట్లు చేయక యిరువురయెడ సముఁడై యుండెను. కాన వారి కితనియందుఁ
బక్షములేకుండెనని తెలియునది.

ఇక్కడ నుగ్రసేనునకు రాజ్యమిచ్చి వేయుటయే కృష్ణునియందుఁ దప్పుగా
నారదుఁడు చెప్పుట తెలియునది.

కటువుగాను జులకగాను నీజ్ఞాతులు మాటలాడఁ గోరుచున్న పుడు నీవు వారలమనసును, వాక్కును, హృదయమును మంచి తిన్నని మాటలచేతనే యడంపుము. మహాపురుషుఁడు గానివాఁడును,మంచిబుద్ధి లేనివాఁడును,సహాయము లేనివాఁడు నగు నొక మనుష్యుఁడు తగినంత పెనుబరువును నెంతపాటుపడినను మూపున మోవంజాలఁడు. నీ విట్టిబరువును (వృష్ణులను బరిపాలించుటను) నీ మూఁపున భరింపుము. ఎద్దులన్నియును మిట్టపల్లములులేనిదారిని పెనుబరువును మోయును; పోవఁ గటు వయిన దారియందుఁ బ్రసిద్ధిగన్న మేలియెద్దు మాత్రమే పెనుబరువును మోయును. కేశవా! నీవు నీసంఘమందు ముఖ్యుఁడవుగా నున్నావు. ఈ సంఘము భేదిల్లెనా పెనునాశము గలుగును. కాఁబట్టి యీ సంఘము నిన్నుఁబొంది కీడ్పడకుండునట్లుగా నీవు గావింపవలయును. ప్రాజ్ఞుం డగు వానియందు బుద్ధియు క్షమయునింద్రియనిగ్రహమును ధనమునిచ్చుటయు నుండునే కాని తక్కిన గుణము లుండవు. కృష్ణా! ఎప్పుడును దనపక్షమువారిని రక్షించుట, ధనమును గీర్తిని నాయువును వృద్ధిఁబొందించును. కాఁబట్టి జ్ఞాతులకు నేకొదవయు లేకుండునట్లుగా నీవు చేయవలయును. ప్రభూ! సంధి విగ్రహము మొదలయిన యాఱు గుణములను బ్రయోగించుటయు దండయాత్రసలుపుటయు రాఁగలకాలమునను వర్తమానకాలమునను గలదియు నీకుఁ దెలియుని దొక్కటియు లేదు. మహాబాహూ! యాదవులు, కుకురులు, భోజులు, అంధకులు, వృష్ణులు, లోకములు, లోకపతులు నందఱును నిన్నాశ్రయించినవారై యున్నారు. మాధవా! ఋషులును నీయభివృద్ధిని గోరుచున్నారు. నీవు సమస్త ప్రాణులం

దును బెద్దవు. నీవు పరమం బయినగతి నెఱుఁగుదువు. యదువు లందు మిన్నవు. నిన్ను నండగొని యాదవులు సుఖముగా వర్ధిల్లుదురు' అనెను. ఇది యెనుబదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు, అమాత్యపరీక్షను గుఱించి కాలక వృక్షీయోపాఖ్యానమును జెప్పుట. }

భీష్ముఁడు 'అమాత్య పరీక్ష విషయమై నే నిపుడు చెప్పినది ప్రథమవిధి. రెండవవిధిని జెప్పెదను వినుము. రాజునర్థమును వృద్ధిఁ బొందించుమనుష్యుని రా జెప్పుడును రక్షింపవలయును. బొక్కసము నశించుచుండునపుడు, అమాత్యుఁడే దాని నపహరించుచున్నాఁడని తెలిసి వేతనము పుచ్చుకొనువాఁడో మఱి యితరుఁడో దానిని నీకుఁ జెప్పవచ్చునేని, వాఁడుచెప్పునది మంతనమున విన నవధరించి యాయమాత్యుని బారినుండి వానిని రక్షింపవలయును. అపహరింపఁ దొడఁగిన యమాత్యులు రాజునకు మిక్కిలి వలయునట్టివారిని రూపుమాపఁజూతురు. రాజుకోశమును నపహరింపఁ జూచు మనుష్యులందఱను నొక్కటిగాఁ గూడికొని దానిని గావం గోరువానిని బాధింప నుంకింతురు. కాన వానిని రాజు రక్షింపనిచో వాఁడు తప్పక నశించును. ఈ విషయమై కాలకవృక్షీయుఁ డనుముని కోసలరాజును జూచి చెప్పిన యీ పురాతన మగునితిహాసమును నుదాహరించుచున్నారు. క్షేమదర్శి యనువాఁడు కోసలదేశమునకు నధిపతి. వాని యొద్దకుఁ గాలకవృక్షీయుఁ డనుముని పోయెనని మాకు వినికి.

అతఁ డొకగూఁటియందు నొకకాకిని బంధించికొని క్షేమదర్శి క్రింది యధికారు లందఱు నడవళ్లను బరిశీలించుకొఱకు నారాజు దేశమునందు మాటిమాటికిఁ గ్రుమ్మఱినవాఁడయ్యె. అతఁడు 'నేను గాకిని సంబంధించినవిద్యను గఱచియున్నాను. జరిగిన దియు జరుగుచున్నదియు జరుగఁగలదియు నన్నియు నాకుఁ గాకులు దెలియఁబఱుచుచున్నవి' యని యారాజ్యమందుఁ బెక్కండ్రకుఁ జెప్పుకొనుచుఁ జుట్టును సంచరించుచుండెను. అతనిని బెక్కుజనులు బలసికొని యుండుటవలన నతఁడు రాజు నియోగుల యందఱు యపచారములను గనుఁగొన సాగెను. ఇట్లతఁ డా రాజ్యమందుఁ గలకార్యమునంతయు, అందందుఁగల యధికారుల దోషములను, అశేషముగాఁ దెలిసికొని యంత 'నాకు నీరాజ్యమునందలి వన్నియుఁ దెలియు' నని చెప్పికొనుచు రాజును జూడంగోరి కాకముతోఁ గూడఁ బోయెను. అతఁడు కోసలరాజుకడకుఁ బోయి యందు భూషణాలంకృతుఁడై యున్నయమాత్యునిఁ జూచి 'అమాత్యా! నీ వీయీచోట నీయీకార్యమును జేసితివి.దీనిని వీఁడును వీఁడును నెఱుఁగుదురు. రాజుబొక్కసము నపహరించితివి. ఈవిషయమును గాకి చెప్పుచున్నది. కాన దీనిని శీఘ్రముగ నాలోచింపుము' అనెను. అతఁ డప్పు డాతీరుగనే యందు బొక్కసము నపహరించి యున్నతక్కిన వారిని గూర్చియుఁ జెప్పెను. ఆముని చెప్పినమాట యించుకయినను బొల్లగుటలేదని యెందును బ్రసిద్ధిగాంచియుండెను. ఇట్లాఋషి యపరాధులం గావించిన యధికారు లందఱును నొక్కటిగాఁ గూడి రాత్రియం దతఁడు నిదురించుచుండఁగా నతనిని మీఱి యాకాకమును జంపివైచిరి. తెల్లవాఱఁగానే

యాముని గూఁటియందుఁగాక బాణముచేఁగొట్టువడియుండుట నుజూచి క్షేమదర్శియొద్దకుఁబోయి 'రాజా! నీవు ప్రాణములకును ధనమునకును బ్రభుఁడవు; ఈశ్వరుండవును. కాన నీవలన నభయము వేఁడెదను. నీయాజ్ఞనుగొని నీకు హితంబగు వచనముఁ జెప్పఁ గోరుచున్నాను. నీవు శూరుండవై యున్నను, నీ వలననుండియు ధనము లవ్వారిగా నపహరింపఁ బడుచున్నవి. ఈ విషయమై మిక్కిలియు దుఃఖితుఁడనయ్యు, మిత్రుల కార్యమునందు మిక్కిలి యక్కఱ కలిమింబట్టియు, నేను నీహితమునుగోరి, సారథి మంచి గుఱ్ఱమును మీఱునట్లు, నిన్ను మీఱితినైనను నీకుఁ దెలుపవలయు నను తలంపునఁ బ్రేమ దయివాఱ నిందు వచ్చితిని. మిత్రుఁడగువాఁ డొకఁడు తనకు హితము సేయఁగోరి యందులకై యతిమాత్రకోపమును భక్తియుఁ బెనఁగొన బలవంతముగాఁ దన్ను మీఱి తెలుపవచ్చెనేని, తన మేలును దెలిసి తనయైశ్వర్యము నభివృద్ధిని గోరునట్టిప్రాజ్ఞుం డగుపురుషుఁ డతనిని క్షమింపవలయును.' అనెను. రాజతనిం జూచి 'నీవేది కోరుదువో దానిని నాకుఁ జెప్పవచ్చును. నేను నాహితమును గోరినవాఁడను గాన నీ వేది చెప్పినను నాకోరుపు లేకుండుటకుఁ గారణమేమి? ఈ విషయమై నీ విష్టపడునది చెప్పుము. ఇట్లని నీకు గట్టిగాఁ బ్రతిజ్ఞ సేయుచున్నాను. బ్రాహ్మణోత్తమా ! నీవు చెప్పిన మాట చొప్పున నేను జేసెదను' అనెను.

ముని *'నేను నీక్రింది కొలువుడుగాం డ్ర గుణములను దోష

* విద్వాన్నయానపాయాంశ్చ భయాఖ్యాతౄన్ భయానిచ, భక్త్యా వృత్తిం సమాఖ్యాతుం భవతోఽన్తికమాగతః. ప్రాగేవోక్తంతు దోషోఽయమాచార్యైర్నృపసేవనమ్ । అగతేః కుగతిర్హ్యేషా యా రాజ్ఞా సహజీవితా'

ములను వానివలన నీకుఁగలుగు భయములను జక్కఁగా గుఱు తెఱిఁగి, నీయందలి భక్తిం జేసి వానినంతయుఁ జెప్పుటకై నీయొద్దకు వచ్చితిని.ధర్మోపదేశకు లయిన యాచార్యులు రాజునుగొలుచుట దోషమని మును లే చెప్పియున్నారు. రాజునుగొలిచి బ్రతుకుట, వేఱుగతిలేని మనుష్యునికిఁగూడ మిక్కిలి కుచ్ఛితమయిన బ్రతుకగును. రాజులను జేరియున్న మనుష్యునిఁ, ఘోరసర్పములతోఁ జేరినవానినిగానే పెద్దలు చెప్పెదరు. రాజులకు మిత్రులును బెక్కండ్రు; శత్రువులును బెక్కండ్రు; కావున వారలందఱివలననుండి రాజు నుపజీవించువారికి భయము కలుగునని జెప్పెదరు. అట్లే రాజువలన నుండియు నొక ముహూర్తకాలమున వీనికి భయము కలుగును. రాజునెడ నెప్పుడును నొక్కతీరునఁ బరాకు లేకయుండుట శక్యము గాదు చుమీ. సంపదను గోరు మనుష్యుఁడు రాజువలన నేవిధమునను బరాకు పడఁగూడదు. పరాకువలన మనుష్యునిబుద్ధి చెడుచున్నది. బుద్ధి చెడినవానికిఁ బ్రాణము నుండదు.మంచి చదువరి యగువాఁడు ప్రాణమునకును ధనమునకును బ్రభుండును నీశుండు నగు రాజును, మండుచున్న యగ్నిని గుపితమైన సర్పమును డగ్గఱునట్లు,దారసింపవలయును. తాను మెలఁగవలసిన విధమును జక్కఁగాఁ గఱచికొని యొకఁడు రాజుసమీపమున,మండుచున్న యగ్ని సమీపమునందుఁ బోలెఁ, గూర్చుండ వలయును. రాజు ప్రాణమునకును ధనమునకును బ్రభుఁడును నీశ్వరుఁడును నగును. కాన యతఁడు క్రూరవిషముగల

అని దా. మూ. 'జ్ఞాత్వాన ఘూనఘూంశ్చాపి భృత్యైత స్తే భయానిచ,భక్త్యా... మాగమమ్,ప్రాగేవోక్తస్తు దోషోయమాచార్యైర్నృపసేవినామ్,అగతీకోగతిర్హ్యేషా పాపా రాజోపసేవినామ్' అని జో. మూలము.



415. క్షేమదర్శితో కాలకవృక్షీయుఁ డనుఋషి తనకాకిని మంత్రులు చంపిరని చెప్పుట.

సర్వముఁ బోనివాఁడగుటంబట్టి యతనిని, బ్రతితృణమును,దన్ను లేదని తలఁచుకొనుచుఁ, దాను నశింపఁగ లట్లె యెన్నుకొనుచు, మిక్కిలి జాగ్రత్తతోఁబరిచరింపవలయును వాఁడురాజు మోఁలఁ జెడుమాట లాడుటకును, దాఱుమాఱుగఁ గూర్చుండుటకును, దగని చేష్టలు చేయుటకును, దగని రీతుల దగ్గఱుటకును, దగని పోకలు పోవుటకును, దగని యభినయములును నంగ వికృతులును నెఱపుటకును, నెపుడును జంకు గలిగియుండవలయును. రాజును బ్రసన్నునిఁ గావించినచో నతఁడు దేవతవలె సకలార్థములును గలిగించును. అతఁడు క్రుద్ధుఁడయ్యెనా యగ్గివలె సమూలముగా దహించి నైచు' నని యముఁడు చెప్పెడు. అట్లె లోకవ్యవహారము జరుగుచున్నది. (ఈవిధుల చొప్పున) నీకు నభివృద్ధి గలిగించు దానినే యిపుడు చేయుదును. మాబోఁటి యమాత్యులు నీబోఁటిమిత్రములకు నాపదయందు బుద్ధిని సహాయము చేయుదురు. ఈకాకి నాయది, నీకార్యమును జేసినందులకై చంపఁబడినది. ఇందులకై నిన్ను నిందించుట నాకుఁదగదు. కాని, యీపక్షిని చంపినవారికి నీయందుఁ బ్రేమ లేదు. నీకు హితులెవరో యెవరహితులో దెలిసికొనుము. ఇతరులకు నీబుద్ధిని లోపఱుపక యన్నిటిని నీయంతన నీవే చేయుము. నీయింట నున్నవారందఱును ముచ్చులు చుమీ. వారు నీప్రజలపెంపును గోరువారు గారు. కాన వారి విరోధమునకు నేను గుఱియైతిని.వారు నీ కంతరంగు లయినవారితోఁ గుట్రపన్ని నిన్ను నాశము సేయుటవలన నీపిదప రాజ్యమును దా మాశపడుచున్నారు. అయినను వారి పన్నుగడ లసందర్భములవలన సిద్ధించినవిగావు. వారివలన భయపడి నేను మఱియొక్క పట్టు

నకుఁ బోయెదను. నాకు విషయవాంఛ యేమియు లేకున్నను, నీమనుష్యులు దురాత్ములుగాన యీబాణమును నాకాకిని గూర్చి యేసి దానిని యమపురికిఁ బంపిరి. నేను దీనిని దపంబున మిక్కిలియుఁ బెంపారు దివ్యదృష్టిచేఁ గనుఁగొంటిని. నీ రాజ్య మిది వెక్కులు నక్రములు, చేఁపలు, మొసళ్లు, తిమింగలములును గుంపులుగాఁ గలిగి యున్నయొక మహానదిని బోలినది. దీనిని నే నీ కాకిచే నుత్తరించితిని. నీరాజ్యమును - గూలిన మ్రాఁకులును బండఱాలును ముండ్లును గలిగి, సింహవ్యాఘ్రములు నెరసి, చొచ్చుటకును నుండుటకును నశక్య మయినహిమవంతపు మహాగుహాయుంబోని నీరాజ్యమును - నీకాకి తోడ్పాటున నే కడచితిని. పండితులు చీఁకటి గ్రమ్మియుండుటచేఁ బోరాని ప్రదేశమునకు దీపముతోడునఁ జొరను, దాఁటరాని నదిని నోడలచేత దాఁటను వచ్చునుగాని, చొరరానిరాజు నీతిపథమునందుఁ జొచ్చుటకును గడచుటకును నేయుపాయమును దెలియరా దందురు. నీ రాజ్యము చీఁకటిగ్రమ్మిచొరరాకున్న యొకయరణ్యమువలె నున్నది. దీనికి నోడయుండ వగునీకు నిందు విశ్వసించుట యలవిగాకున్నది. ఇఁక నాకు విశ్వసించుటను జెప్పనేల? ఇందుమంచియు సెబ్బరయు సమముగా నే యున్నది. కాఁబట్టి యిందు వసించుట సేమముగాదు. మంచికార్యము చేయువాఁ డిందు వధము నే పొందుచున్నాఁడు. దుష్కార్యము చేయువాని కేజంకును లేదు. న్యాయముచొప్పున దుష్కార్యము చేయువాని కే వధము కలుగవలయునుగాని, సత్కార్యపరుని కెంతమాత్రముగాదు. కాఁబట్టి యిచ్చటఁ జిరకాల ముండుట యుక్తముగాదు. తెలిసినవాఁడు దీనిని శీఘ్రమున దిగవిడువ వలయును. రాజా! సీత యనెడి నదియొకటి

గలదు. దానియందుఁ బడవలు మునుఁగును. నీయీరాజ్యమా నదికి సాటియైనది. సర్వమును నాశము సేయునట్టి వలవంటిది. *నీవు తేనె గోరువా రుఱికిపడు చఱియవు; విషముగలసిన యన్నమవు. నీస్వభావ మిపు డసజ్జనుల భావముంబోలెఁ దోఁచుచున్నది; కాని సజ్జనులభావముంబోలెఁ గాదు. నీవు క్రూరవిషములగు సర్పములు చుట్టియున్నకూపమువలె నున్నావు. నీవు, చొరరాని రేవుగలదియు పెద్ద గట్టు గలదియు, వెదుళ్లయు ప్రేములయుఁ బొదరులు బలసినదియునై తియ్యనినీరు గలయేటివలె నున్నావు. కుక్కలును గ్రద్దలును నక్కలును జుట్టి యున్న రాజహంసమవు. ఒక పెద్ద మ్రాఁకును నూఁతగొని పెచ్చు పెరిఁగిన పెనుతీఁగలగుబు రా మ్రాఁకును గ్రమ్ముకొని దానికిఁ బొడవుగా వ్యాపించినదై పిదపఁ దన్నుముట్టిన పెద్దయెరగలి చిచ్చుచేత నా మ్రాఁకును సయితము దహించునట్లు,ని న్నాశ్రయించిన యమాత్యులు నున్నారు. రాజా! వారలను బరికించి చూడుము. చక్కఁబెట్టుము. నీవలన నధికారము నొందినవారలును నీవు పరిపాలించుచున్నవారలు నగు మనుష్యులే నిన్నవమానించి నీప్రియునిఁ జంపఁగోరుచున్నారు. నేను రాజ వయిననీదుశీలమును నిన్ననుసరించి బ్రతుకువారి స్వభావమును దెలియఁగోరుచు, వీరుని యిల్లాలి యింటియం దున్న విటకానివలెను, పామున్న యింటియందు వసించువానివలెను, మిక్కిలి జంకుగలిగి యెంతయు

---

* 'మధు ప్రపాతోహిభవాన్ భోజనం విషసంయుతమ్' అని మూలము. మధు ప్రపాతమనఁగా తేనె పెఱయున్న కొండచఱియను నుఱికిపడుట. తేనె యున్నను అందులకై యాచఱియను నుఱుకుట యపాయకరమైనట్లు నీవు నపాయకరుఁడ వనుట.

నెచ్చరికతోడ నన్ను రక్షించుకొనుచు నిందు వచ్చితిని. రాజేంద్రా! నేను 'రాజు జితేంద్రియుఁ డగునా ? అతని భృత్యు లడఁగి మడఁగి యున్నారా ? ప్రజలు రాజును బ్రేమింతురా ? రాజును బ్రజలను బ్రేమించునా?' యని తెలియఁగోరినవాఁడ నై యిం దులకు నీకడకు వచ్చితిని. ఆఁకలి గలవానికి నన్నమువలె నీవు నాకుఁ బ్రియుండ వయితివి. అయినను నేను నీయమాత్యు లను దప్పిలేనివాఁడు నీటినింబోలె నెంతయు నొల్లను. నీకు మంచి సేయఁగోరితిని గాన నాయందు వారు దోషము కట్టిరి. వారికి నా యందుఁగలవిరోధమున కింతకంటె వేఱుకారణము లేదనుటకు సందేహము లేదు. నాకు వారియం దెంతమాత్రము ద్వేషము లేదు. వారియందలి దోషములను దెలుపుట వారికి ద్రోహము చేసినట్లయినది. మూఁపునఁ గొట్టువడిన సర్పము వలనంబోలె మం చిమనస్సు లేనిపగవానివలన భయము గలిగియుండ వలెను' అనెను.

రాజు 'బ్రాహ్మణోత్తమా ! నీకుఁ గలిగినయీకాఱియకుఁ దగిన పరిహార మెంతయుఁ జేసెదను. మఱియు మిక్కిలి సత్క రించెదను. ఇట్లు పూజితుఁడవై మరల నాయింట వసించియుండు ము. నిన్నెవ్వ రొల్లరో వారు నాయింట నుండరు. నీవు చెప్పినమను ష్యులకు నిఁక నేమి చేయవలయునో నీవె తెలిసి చేయవలయును. నారాజ్యమందు దండము చక్కఁగా జరుపఁబడునట్లును, కార్య ములు చక్కఁగాఁ గావింపఁబడునట్లును, నీవు కనుఁగొనుచు నేను శ్రేయమును బొందునట్లు వినియోగించుచుండుము' అనెను.

ముని 'నీ వీకాకిని జంపిన దోషమును గనుఁగొనకుండి యు మాత్యులం దొక్కొక్కరిని (నధికారమందు) దుర్బలునిఁగాఁ

జేయుము. పిదప వారికిఁ దగినకారణముల నిరూపించి యొక్కొ-క్క-నిఁగా వారిని జంపుము. పెక్కం డ్రొకదోషమునే చేసిన యెడల వారందఱు నొక్క-టిగాఁగూడి * ముండ్లనుగూడ మెత్త గిలఁజేయుదురు. ఇఁక మనుబోఁటి మెత్తనివారలను జేయుట చెప్ప నేల? ధనమందు జగమంతయుఁ గట్టువడియున్నది. కాన, దానిని ధనముచేతనే బంధింపవలయును. ధనము నాశ్రయించుట వలననే మనుష్యులకు గౌవరముపుట్టుచున్నది. కాఁబట్టిధనమును వారలనుండి తీసివైవుము. ఒక్కొ-క్క- మనుష్యునియొక దోష మునకుఁగాను వానికి విరోధియైన మనుష్యుని వానికడకుఁ బంపుము. వాఁడామనుష్యునియందుఁ బెక్కు-లు దోషములు వెలువఱిచి వానిధనమును దీసికొని వైచును. కొందఱకుఁ దిన్నని మాటలాడియుఁ, గొందఱకుఁ బరస్పరము భేదము పుట్టించియు, వైరము కలిగింపుము. పిదప దండింపుము. రాజా ! బుద్ధిమంతుఁడగురాజు తనలోపలితలంపును గప్పిపుచ్చి, బిల్వకాయను గొనియె బిల్వకాయను గొట్టునట్లు, అశుద్ధుండగు మంత్రిని నశుద్ధుం డగుమనుష్యునిఁ గొనియే నాశముచేయఁదగు ను. కాఁబట్టి రాజా!మనమంత్రాలోచనములు(వారు సందేహించి) వెలిపుత్తు రేమోయని భయపడి యిట్లు జాగ్రత్తతో మెలఁగ వలయునని యింతయు నీకుఁ జెప్పుచున్నాను. మేమో బ్రాహ్మ ణులము; కాన దయాళురము; ఎవ్వరిని దండింప నొల్లనివార మనుట ప్రసిద్ధము. మేము మాకుంబోలెనే నీకునుఁ దక్కి-నవా

---

* 'కంటకానపి మృద్నీయుః' అని మూలము. ముండ్లవలె బాధకులయిన వారినిగూడఁ బడఁగూల్తురు. ఇఁక మనుబోఁటి సాధువులను గూర్చుట చెప్ప నేల యనిభావము.

రికిని శుభమును గోరుదుము. రాజా! నన్నుగుఱించి చెప్పుచున్నాను. నేను నీకుఁ జెలికాఁడను. నాపేరు కాలకవృక్షీయుఁ డందురు. మీతండ్రిపరిపాలనమునం దీరాజ్యమునకుఁ బెక్కు విపత్తులు కలుగఁగా నేను దక్కినకార్యము లన్నియు దిగవిడిచి యావిపత్తులను దొలఁగించుటకై యపుడు తపము సలిపితిని. నీవు మరలఁ దగినవారలను మిత్రులని నమ్మి భ్రమింప కుండుటకై, నీయందలి స్నేహమువలన నీకుఁ జెప్పుచున్నాను. రాజా! నీవు రాజ్యమును నలవ్రొకగాఁ బడసితివి. దానిని సంబంధించిన సుఖములను దుఃఖములను రెంటిని నాలోచింపుము. నీ రాజ్యములను మంత్రులయందుఁ బెట్టి నీవేల పరాకు పడవలయును?' అనెను. పిదప * రాజు క్షత్రియకులమం దొకనిని మంత్రిగా నేర్పఱచుకొని యాబ్రాహ్మణోత్తమునిఁ గాలకవృక్షీయునిఁ బురోహితునిఁగాఁ గయికొనెను. ఈ మార్పులయిన పిదపఁ గోసలరాజును భూమినంతయు నేకచ్ఛత్రముగాఁ బాలించి మిక్కిలి యశస్సును బొందునట్లుచేసి కాలకవృక్షీయముని యుత్తమములగు యాగములు పెక్కులు యజించెను. కోసలరాజు నతని హితవచనములను విని భూమిని జయించి యతఁడు నియమించునట్లు తాను నడచుకొనుచుండె' నని చెప్పెను' ఇది యెనుబదిరెండవయధ్యాయము.

---

* తతో రాజకులే మంత్రీ సంజజ్ఞే భూయసాపునః, పురోహిత కులేచైవ సంప్రాప్తే బ్రాహ్మణర్షభః॥ అని ఔ.మూలము. తతోరాజకులే నాన్దీ సంజజ్ఞే' అని (దా.మూలము) ఆబ్రాహ్మణోత్తమునిఁబురోహితునిఁ గావింపఁగా రాజకులమువారి యింటను మిక్కిలిస్తుతులు చెలంగెనని యర్థము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు మంత్రి మొదలయిన వారి లక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! వ్యవహారనిర్ణయసభ్యులును, యుద్ధాదులందును సహాయులును, హితులును, సేనాపతులు మొదలయిన బలంగమువారును, మంత్రులును నెట్టివారుగా నుండవలయును' అని యడిగెను.

భీష్ముఁడు 'నీవ్యవహారనిర్ణయసభ్యు లయినవారు లజ్జతోఁగూడిన బెట్టును, నింద్రియ నిగ్రహమును, సత్యమును, నిష్కాపట్యమును, యుక్తమయినది లెస్సగాఁ జెప్ప దిట్టతనమును, గలిగియుండవలయును, నీకుఁ గెడతోడు నీడలై మిక్కిలి శూరులును బ్రహ్మణ్యులును, మిక్కిలి చదువరులును, నీయెడ నెంతయు సంతుష్టులును, గార్యములందు మంచి యుత్సాహము గలవారును నగు మనుష్యులను సకలములయిన నీ యాపదలందును సహాయులుగాఁ బడయఁ గోరవలయును. మంచి కులమునఁబుట్టి పూజితుండగు మనుష్యుఁడెప్పుడును దనశక్తి నిదాఁపఁడు. వాఁడు నీ దుఃఖమునఁగాని, సుఖమునఁగాని, రోగమునఁగాని, మరణమునఁగాని, నిన్నెప్పుడును దిగవిడువఁడు. అట్టి వానిని సుహృదునిఁగావించుకొన వలయును. నీ బలంగమువారు మంచికులమున బుట్టిన వారుగను, నీదేశమందుఁ గలిగినవారుగను, ప్రాజ్ఞులుగను, రూపవంతులుగను, మిక్కిలి చదువరులుగను, సమర్థులుగను, ప్రేమ గలవారుగను నుండవలయును. నాయనా! చెడుకులమునఁ బుట్టినవారును, లుబ్ధులును, క్రూరులును, సిగ్గుమాలిన వారును నగు మనుష్యులును, దిన్నచేయి తడియాఱకుండునంతవఱకు ని

న్ననుసరింతురు. రాజు మంచికులమునఁబుట్టినవారును, మంచి స్వభావముగలవారును, ఇంగితము నెఱింగినవారును, అకౄరులును, దేశకాలములను వానికిఁ దగిన విధులను దెలిసినవారును, ఒడయని కార్యమందు హితమునే కోరుచుండువారును, నగు మనుష్యులను నెప్పుడును నన్ని విషయములందును మంత్రులుగా నియమింపవలయును. ధనములచేతను, సమ్మానములచేతను, వస్త్రాభరణాదుల నిచ్చుటచేతను, ఇంపయిన పలువగలభోగములచేతను, నీ వెవరిని నీకుఁ బ్రయోజనకరులుగాఁ దలంతువో వారలను బ్రీతులు గావించి నీతోఁబాటిసఖులనుగాఁ జేయవలయును. ప్రవర్తనము తప్పనివారును, మంచి నడవడిగలవారును, మిక్కిలి చదువరులును, వ్రతపరులును, గొప్పమనస్సు గలవారును, సత్యవాదులును నగు మనుష్యులు నీ యక్కఱలయందే కనుగలిగి యెప్పుడును నిన్ను విగనాడకుందురు. పూజ్యులు కాని వారును, నియమములను బాటింపనివారును, మందబుద్ధులును, గట్టుపాటులనుండి జాఱినవారును నగు మనుష్యులను మర్యాదలను నతిక్రమింపకుండునట్లు నీవు పదిలముగా నిర్బంధించి చూచుకొను చుండవలయును. రెండు పక్షములం దొకటిని నేరు కొనవలసి వచ్చినపుడు, పెక్కండ్రుగల పక్షమును విడిచి యొక్కఁడుగల పక్షమును వరింపరాదు. అయిన నాయొక్కఁడు పెక్కుగుణవిశేషములంబట్టి పెక్కండ్రకంటె నెక్కుడుగా నుండెనేని యాయొక్కనికై పెక్కండ్రను దిగవిడువ వచ్చును. ఎక్కుడయిన వానిలక్షణములు పరాక్రమము, కీర్తి, ప్రధానము లయిన కార్యములందలి యాసక్తి, కట్టుపాటులందుఁ దప్పక నిలుచుటయు నగును. సమర్థులను బూజించునట్టి వాఁడును, అర్హతలేని వారి

తోడ మచ్చరింపని వాఁడును, గామమువలనను భయము వల నను గ్రోధమువలనను లోభమువలనను ధర్మమును విడువనివాఁడును, అహంకారములేని వాఁడును, సత్యవాదియు, మన్నించు స్వభావము గలవాఁడును, జితాత్ముఁడును, మాన సంపన్నుఁడును, అన్ని సందర్భములందును జక్కఁగాఁ బరీక్షింపఁబడినవాఁడును నగు పురుషుని నీవు మంత్రసహాయునిఁగా నేర్పఱచుకొనవల యును. గొప్పకులమునఁ బుట్టుటయును, కులమునకుఁ దగిన గౌర వము గలిమియు, ఓరుపును, సమర్థతయును, ఆత్మశుద్ధియును, శూరతయు, నెనరును, సత్యమును, నుత్కృష్టుఁడగు వాని లక్షణ ములు. ఇట్లు తెలివిగలిగి నడచుకొనుచుండు పురుషునకు శత్రు వులును వైర కలంకమును విడిచి ప్రసన్నులయి మిత్రులగు చున్నారు. ఆత్మనిగ్రహమును మంచి ప్రజ్ఞయుఁగలిగి యైశ్వర్య ము నభిలషించు రాజిటమీఁదఁ దన దేశమందు మంచికులమునఁ బుట్టినవారును, ఆప్తులును దురాచారులచే వశీకరింపరానివారు ను, వ్యభిచారము లేనివారును నయి తన్ను సంబంధించియుండు మనుష్యులచేత మంత్రుల గుణాగుణములను బరీక్షింపవలయు ను. ఐశ్వర్యమును నభ్యుదయమును గోరుపురుషుఁడు, మంచికుల మునఁ బుట్టినవారును, మంచి చదువరులును, వంశ పరంపరఁ గాఁ గొలుచుచు వచ్చువారును, అహంకారము లేనివారును నగుపురుషులను మంత్రులుగాఁ జేసికొనవలయును. వీరలకు విన యముతోడి బుద్ధియు, ప్రసన్నస్వభావమును, తేజమును, ధైర్య మును, క్షమయు, శుచియు, ననురక్తియు, నిలుకడయుఁ, గార్య ములందు దిట్టతనమును నుండవలయును. రాజా! రాజు గార్య భరమును వహింపఁదగినవారును, ప్రౌఢవయస్కులును, మంచి

గుణములందుఁ బరీక్షింపఁబడినవారును, గపటము లేనివారును, ధనమును వృద్ధిఁబొందించువారును, మితిమీఱక మాటాడువారును, వీరులును, వివేకశీలురును, కులీనులును, ధైర్యశాలులును, నింగితజ్ఞులును, నక్రూరులును, దేశకాలవిధులను దెలిసినవారును,భర్తకార్యమునందు హితమునుగోరువారును,నగు మంత్రులనేవురను, నెప్పుడును నన్నికార్యములందును నేర్పఱుప వలయును. తేజోహీనుఁడును, మిత్రులచే దిగవిడువఁబడినవాఁడును, బట్టుదలతోఁ బనిచేయఁజాలఁడు. ఒకవేళ వానిని నియమించినచో నన్నికార్యములను గొనసాగింపక తప్పక సందేహమునే కలిగించుచుండును. ఒకమంత్రి శుభం బగుగొప్పవంశమునఁ బుట్టినవాఁడయ్యును, ధర్మార్థకామములను బాటించువాఁడయ్యును, జదు వల్పముగాఁగలవాఁడగునేని, కార్యపద్ధతి నాలోచించుటకుఁ జాలనివాఁడగును. ఇట్లే, తక్కువకులమునఁ బుట్టినవాఁడు, తా నెంతచదువు చదివియుండినను, కొనిపోవువాఁడు లేని గ్రుడ్డివానివలె, నేర్పును నూహయు వలసిన కార్యములందుఁ దెలియక పొరఁబడుచుండును.ఒక్కయుద్దేశమందును నిలుకడలేనివాఁ డెంతబుద్ధియుఁ జదువును గలిగియుండినను, ఉపాయములను దెలిసియుండినను, కార్యములఁ గొనసాగించుచుఁ జాలకాలముండఁజాలఁడు. దుర్మతియుఁ, జదువులేనివాఁడునగు మనుష్యుఁడు కార్యమునకు దిట్టతనముగాఁ బూనవచ్చునుగాని దానివలనఁ ఫలవిశేషము లేమిగలుగునో తెలిసికొనఁజాలఁడు. తనయం దనురక్తిలేని మంత్రియందు రా జెప్పుడును నమ్మికయుంచుట యొప్పదు. కాఁబట్టి యనురక్తుఁడు గాని మంత్రికిఁ దనయాలోచనములను వెలిపుచ్చరాదు. అట్టికపటుఁడు తక్కిన మంత్రులతోఁ

గుట్రగూడి తన యేలికను,అగ్ని గాలితోడ్పాటునఁ గలిగిన సం
దులమూలమునఁ జొచ్చి మ్రాఁకును దహించునట్లు, నాశము
సేసివైచును. రా జెప్పుడేని యొకనాఁడు క్రుద్ధుఁడై యొకభృ
త్యుని స్థానమునుండి తొలఁగించియు, నాగ్రహమునఁ బరుసు
లాడియు, మరలఁ బ్రసన్నుఁడయి వానిని స్థానమున నుంపఁ
గలుగును. అనురక్తిగల భృత్యుఁడే యాయావానికెల్ల నోర్వఁ
జాలునుగాని, మఱియొక్కఁ డెంతమాత్రము సైఁపఁడు. మంత్రు
లకుఁగూడఁ గొన్నిసమయములందు రాజులయెడఁ బిడుగునుఱు
మువలె బిట్టుగాఁ గోపము కలుగుటగలదు. ఎవఁడు తనయొడ
యునికిఁ బ్రియము చేయుతలంపున బిట్టికోపములను నడఁచుకొ
నునో, మఱియొడయుని సుఖదుఃఖములను దనకును సమానము
గాఁ గలిగియుండునో, యట్టిమనుష్యుని రాజు సమస్తకార్యము
లం దాలోచన మడుగవలయును. కపటము గలవాఁడు రాజు
నం దనురక్తి కలిగియుండినను దక్కినగుణములచే నిండియున్న
ను, రాజనీతియందు మిక్కిలి తెలివిగలవాఁడయి యున్నను,రాజు
మంత్రాలోచనము వినుట కర్హుఁడుగాఁడు. పగవారితోడఁ
గూడికొని రాజు ప్రజల సుఖదుఃఖములను మిక్కిలి పాటింపకుండు
నట్టివాఁడు పగవాఁడని తెలియవలయును. వాఁడును, రాజు మం
త్రము వినఁదగినవాఁడుగాఁడు. తెలివిలేనివాఁడును, అపరిశుద్ధుఁ
డును, గర్వము గలవాఁడును, శత్రువుల సేవించువాఁడును,తన్నుఁ
దాను బొగడికొనువాఁడును, గోపియు, లుబ్ధుఁడును, సుహృదుఁడు
గానివాఁడును నగుపురుషుఁడు గూడ రాజు మంత్రాలోచనము
వినఁదగఁడు. క్రొత్తగా వచ్చినవాఁడొకఁడు వాఁడెంతయనురక్తి
గలవాఁడయినను మిక్కిలి చదువరిగా నుండినను రాజు వానిని:

సత్కరింపవచ్చును; మఱి వలయునది యీవచ్చును; కాని, యాలోచనము వానికిఁ జెప్పఁదగదు. రాజొకని తండ్రిని దాను మును పన్యాయమున నూరు వెడలఁ దఱిమినను, పిదప నతనిని సత్కరించి యే ప్పటిపదవియందు నెలకొలిపినను, నతనికొడుకునకుఁ దానెంత మాత్ర మాలోచనము వినిపింపఁదగదు. రాజు తనకు సుహృదుఁడయినవాని స్వల్పంపుఁ దప్పునకు వానిధనమంతయుఁ దీసికొని రిత్తగావించెనేని వానికిఁ దక్కినగుణము లన్ని యుండినను, రాజు తనమంత్రాలోచనము వినిపింపఁదగదు. మంచి ప్రజ్ఞయు మేధయుఁ గలిగి పండితుఁడై, తన దేశమందుఁ బుట్టినవాఁడై, శుచియు, సమస్తకార్యములందుఁ జక్కటిగలవాఁడు నైనపురుషుఁడు రాజు మంత్రాలోచనము వినుటకుఁదగును. ఆత్మజ్ఞానమును లౌకికవిజ్ఞానమును మిక్కిలియుఁ గలిగి, తనప్రకృతియు, శత్రుప్రకృతియు, స్వామి మంత్రి మొదలయినవారల ప్రకృతులను నెఱింగినవాఁడై రాజునకు నాత్మసముఁ డయిన స్నేహితుఁ డగుపురుషుఁడు, రాజు మంత్రాలోచనము వినఁదగును. సత్యవాదియు, శీలసంపన్నుఁడును, రహస్యములను వెలిపుచ్చని లోఁతుగలవాఁడును, సిగ్గరియు, మెత్తనివాఁడును, తండ్రి తాతలతరములనుండి రాజుకొలువుగలవాఁడును నగు మనుష్యుఁడు మంత్రాలోచనమున కర్హుఁడగును. రాజువలన సంతుష్టిగలవాఁడును, సత్పురుషుల మనసు కెక్కినవాఁడును, సమర్థుఁడును, పాపములందు ద్వేషముగలవాఁడును, మంత్రాలోచనము తెలిసినవాఁడును, గాలము నెఱింగినవాఁడును, శూరుండును నగుపురుషుఁడు మంత్రాలోచనము విన నర్హుండగును. దండమునూఁది పరిపాలించునట్టిరాజు, ఈసమస్తలోకమును దిన్నని చల్లనిమాటలచే వశముచేసికొనుటకు శక్తుఁడగు

వానితో మంత్రాలోచనము చేయవలయును. పురజనులును, దేశజనులును ధర్మప్రవర్తనమునుబట్టి యెవ్వనియందు విశ్వాసము గలిగియుందురో, ఎవ్వఁడు యుద్ధముచేయఁగలఁడో, మఱి రాజనీతియందుఁ బండితుఁడో, యట్టివాఁడును మంత్రాలోచనము వినుట కర్హుఁడగును. కాఁబట్టి యిట్టిగుణములన్నియుఁ గలవారును, మిక్కిలియుఁ బూజితులును, రాజు మంత్రి మొదలయిన ప్రకృతుల నెఱింగినవారును, గొప్పకార్యములకు నువ్విళ్లూరువారును, నగుమంత్రులు ముప్పురకుఁ దక్కువలేకుండ వలయును. వారు తమప్రకృతులందును శత్రుప్రకృతులందును గల రంధ్రములను బాటించుచుండవలయును. మంత్రులయాలోచనము రాజు రాజ్యమునకు మూలము. దానివలననే యారాజ్యము వృద్ధినొందవలయును. మంత్రి రాజునందలి ఛిద్రములను దెలియనీకుండునట్లు చేయవలయును. పరునియందు ఛిద్రములు కనిపెట్టి వానిపై నెత్తవలయును. తాఁబేలు తనయంగములను లోనికి ముడిఁచి కాచుకొనునట్లు, మంత్రులును దమమంత్రములనుగాచుకొనవలయును. అట్లె తమఛిద్రములను గప్పిపుచ్చుకొనవలయును. రాజ్యమునందు మంత్రములను గప్పిపెట్టునట్టి మంత్రులే బుద్ధిమంతు లనఁబడుదురు. మంత్రమే రాజునకుఁ గవచము; మంత్రమే రాజ్యమందుఁ దక్కినజనుల కంగములు. రాజ్యమునకు మూలము వేగులవాండ్రు, దానికి సత్తువయంతయు మంత్రమందురు. ఏలికలును మంత్రులును, మదమును గ్రోధమును నడంచి, మానమును నసూయయును విడిచి, యొకరినొకరు సహాయముకొఱకు ననువర్తింతురేని, వారు భయులు సుఖమొందుదురు. రాజు తానైదువిధములగు (అనఁగా మనస్సుచేతను వా

క్కుచేతను శరీరముచేతను వీనియందలి రెంటిచేతను, మూఁటి చేతను జేయంబడు కపటము లనెడు) నుపధలు లేకుండునట్టి మంత్రులతోడ నెప్పుడును మంత్రాలోచనము చేయవలయును. రాజా! మువ్వురుమంత్రుల మూఁడువిధము లయినయభిప్రాయ ములను దెలిసికొని వానిని దన మనస్సునం దుంచి వారల యభి ప్రాయమును దన యభిప్రాయమును మీఁదఁ జక్కఁగా నాలో చించుకొనుటకుఁ దన గురువుకడకుఁ బోవలయును. ఆగురువు ధర్మా ర్థకామముల స్వరూపములను జక్కఁగా నెఱింగిన బ్రాహ్మణుఁ డుగా నుండవలయును. ఇట్లు మీఁదటియాలోచనమున కై యతనికడకుఁ బోయి మనస్సు సమాహితము చేసికొని యతని యభిప్రాయ మడుగవలయును. అతనితోఁగూడి యాలోచించిన పిదప నొకనిర్ణయము కలుగఁగా రాజు విలంబముచేయక తో డనే దానిని గావింపవలయును. మంత్రతత్త్వముల నిశ్చయము లను జక్కఁగా నెఱింగినట్టివారు, రా జెప్పుడు నీ చొప్పుననే మంత్రాలోచనము చేయవలయునని చెప్పెదరు. ఇట్లు మంత్ర ములను గుదురుపఱుచుకొని దాని ననుష్ఠానమునకు నెప్పుడును దేవలయును. అట్లు చేసిననే యవి ప్రజలను వశీకరించుటకు సమర్థము లగును. రాజు మంత్రమాలోచించుచోటఁ బొట్టివారు ను, గుజ్జులుగాని బక్కవారును, గుంటివారును, గ్రుడ్డివారును, జడులును, స్త్రీలును, నపుంసకులును నుండరాదు. అందు, ముందుగాని వెనుకఁగాని క్రిందుగఁగాని మీఁదుగఁగాని య డ్డముగఁగాని యేదియు మెలఁగరాదు. ఎవరును లేని యింటి మేడపయి నెక్కియో, దర్భయు జెల్లును లేక నలుప్రక్కలఁ దెల్ల గాఁ గనఁబడు బయలుగా నుండుప్రదేశమునందుండియో, మా

టయందుఁ దప్పిదములులేక యంగముల దోషములును జేష్ట లును గావింపక, కాలము మీఱిపోకుండునట్లు, కార్యమును జక్కఁగా నాలోచింపవలయును. ఇది యెనుబదిమూఁడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ప్రియవచనములాడుటనుగుఱించి యింద్ర బృహస్పతి సంవాదమును ధర్మరాజునకుఁ జెప్పుట. }

భీష్ముఁడు 'ధర్మరాజా! ఈ విషయమై బృహస్పతికిని నింద్రు నకుఁ జరిగిన సంవాదమనెడి యీ పురాతన మయినయితిహాస ము నుదాహరించెదరు. ఇంద్రుఁడు 'ఓ బ్రాహ్మణోత్తమా! పురు షుఁ డేయొక్కవిషయమును జక్కఁగా నాచరించునేని సమస్త ప్రాణులకును బ్రమాణమయి మిక్కిలి కీర్తిని బొందును' అని యడిగెను.

బృహస్పతి 'ఇంద్రా! ఇం పయినమెత్తనిపలుకుబడియే యీ యొక్కవిషయము. దాని నొక్కటి నాచరించినచో సమస్తప్రా ణులకును బ్రమాణమై (సమ్మతుఁడై) మిక్కిలి యశస్సును బొందును. ఇంద్రా! సమస్తలోకులకు సుఖము నొసంగునది యిది యొక్కటియే. దీనిని సర్వభూతములయందును నాచరించు వాఁ డెప్పుడును వానికెల్లఁ బ్రియుఁడై యుండును. ఈలోకమం దు నొక్కపలుకయినను మాటాడక బొమలు ముడివడ్డమొగ ముతో నుండునట్టివాఁడు సమస్తప్రాణులకును ద్వేషింపఁదగిన వాఁడగును. తిన్నని మెత్తనిపలుకుబడిలేమియే వానినట్లు చేసి

నది. ఎవఁడు తక్కినవారి నెవ్వరిని జూచినను తానేవారిని ముం దుగా మాటాడి, యట్లు మాటాడునప్పుడు చిఱునవ్వు మును ముట్టఁ దోలఁకుచుండునో, వానికిఁ బుచ్చుకొనువారందఱును బ్రస న్నులగుదురు. దానముసైతము చల్లని మెల్లని పలుకుబడితో నియ్యఁబడదేని తీసికొనువానినెవ్వనిని కూరలేని యన్నమువలె సంతోషపెట్టనేరదు. ఇంద్రా! ఎవరిధనమునేనియు నెత్తికొనుచు న్నను, దియ్యనిపలుకులాడునేని, యట్టిపలుకుబడి యాధనమును గోలుపోయినవారిని సయితము దనవశముచేసికొనును. దండ మును విధింపఁగోరుచున్నపుడును రాజు, తిన్నని చల్లని మాటలే ప్రయోగింపవలయును. సాంత్వము ఫలము గలిగింపక తప్పదు. మఱి యది యెవ్వరిహృదయమును నొప్పింపదు. సాంత్వము మృ దువుగను మధురముగను జక్కఁగను బచరించుచుండినచో దానికి సరియైనది యెుకప్పుడును గలుగదు' అనెను. ఇది విని యింద్రుఁడు తనపురోహితుఁడు చెప్పినట్లు సర్వమును జేయుచు వచ్చెను. ధర్మరాజా! నీవు నీసాంత్వమును జక్కఁగా నాచరిం పుము' అనెను. ఇది యెనుబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు నమాత్యలక్షణములు మొదలయినవి చెప్పుట.

ధర్మరాజు 'రాజేంద్రా! రాజు ప్రజల నేపద్ధతిని బరిపాలిం చుచు వచ్చినయెడల విశేషించి ధర్మమును శాశ్వతమయినకీర్తిని విశేషించి స్వర్గమును బడయును ?' అని యడిగెను.

భీష్ముఁడు 'పరిశుద్ధమయిన వ్యవహారముతోఁ బ్రజలను బరిపాలించుటయం దక్కఁగలిగి యుండెనేని, రాజు పరిశుద్ధుఁడై ధర్మమునుబడసి కీర్తిని స్వర్గలోకములను బడయును' అనెను. ధర్మరాజు 'రాజెవ్వరితోడ నెవ్విధమున వ్యవహరింపవలయును? ఇది యడుగుచున్నాను. నీవు మహాప్రాజ్ఞుఁడవుగాన దీనిని గలరూపున నాకుఁ జెప్పఁదగును. నీవు పూర్వము పురుషునకు వలయునని చెప్పినగుణములన్నియు నొక్కపురుషునియందు నుండనేరవని నాకుఁ దోఁచుచున్నదే ' యనెను.

భీష్ముఁడు 'నీవు మహాప్రాజ్ఞుండవు బుద్ధిమంతుఁడవును గదే ! నీవు చెప్పినట్లెయగును. ఈ శుభగుణములన్నియుఁ గూడియున్న పురుషుఁ డరిది. వేయుమాటలేల. ఇట్లన్నిగుణములు నొక్కటఁ నొనగూడియున్నశీల మెంతపాటుపడి వెదకినను దొరకుట దుర్లభము. అయినను మంత్రులనెట్టివారిని గావింపవలయునో చెప్పెదను. వేదముల నధిగమించినవారును, సమగ్రులును, బరిశుద్ధులు నయినట్టి స్నాతక (బ్రహ్మచర్యము సమాప్తిగావించిన) బ్రాహ్మణులు నలువురును, బలవంతులును నాయుధపాణులునయిన క్షత్రియులు పదునెనమండ్రును, ధనసంపన్నులయిన వైశ్యు లిరువదియొకండ్రును, వినయముగలవారును నింతకుమునుపుచేసిన కార్యములందుఁ బరిశుద్ధులై యున్నవారును నగు శూద్రులు మువ్వురును *(వినుకోరిక, వినుట, తెలియుట, ధరించుట, ఊహించుట, బుద్ధిచేత నివర్తించుట, విజ్ఞానము, తత్త్వజ్ఞానము ననెడి) యెనిమిది గుణములతోడఁగూడినవాఁడును, బురాణముల నధిగమిం

* అష్టగణములు—శుశ్రూష, శ్రవణము, గ్రహణము, ధారణము, ఊహనము, అపోహనము, విజ్ఞానము, తత్త్వజ్ఞానమని యెనిమిది.

చినవాఁడును నగు సూతుం డొక్కండును నీకు మంత్రులుగా నుండవలయును. వీరియం దొక్కొక్కనికి నేఁబదియేండ్ల వయసు నుండవలయును. వారు పెద్దతికమందుఁ గన్నుగలిగి, యసూయ లేక, శ్రుతి స్మృతుల నధిగమించి, వినయమును నిష్పక్షపాతమును గలిగి యుండవలయు. ఒక కార్యమునుగూర్చి వేయువేయువిధ ములు మంచివని వివాదములు చేయుచున్నవారిని, సమాధాన పెట్ట దిట్టలై యుండవలయును. లుబ్ధులుగాకయు మిక్కిలి ఘోరములయిన సప్తవ్యసనములందుఁ దగులకయు నుండవల యును. రా జాయెనమండ్రు మంత్రులనడుమ ముఖ్యుఁడై మంత్రమాలోచింపవలయును. అంత రాజు తనదేశపువారికిఁ దెలియుకొలకు దన మంత్రనిశ్చయములను బ్రకటింపవల యును. నీ వెప్పుడు నిట్లు వ్యవహరించుచు నీప్రజలను జూచు కొను చుండవలయును. నీయెడ నిల్లడగా దాఁచిన ధన మును గైవసము చేసికొనరాదు. ఇద్దఱును నేను నేను సొం తదారఁప నని తగవులాడునట్టి యొకవస్తువును నీది గావించు కొనరాదు. ఇట్టి నడవడి ధర్మపరిపాలనమును జెఱిపివైచును. ధర్మ పరిపాలనమునకు హానికలుగఁగా నధర్మమును నిన్నుఁ బీడిం చును. నీరాజ్యమును బీడించును. నీప్రజలకు, డేగనుజూడఁగా బక్షులకుంబోలె, భయము పుట్టించును. అంత, నీరాజ్యమును, సముద్రమున విఱిగినయోడవలెఁ బొడవడఁగును. రాజు తనప్రజల నధర్మముతో బరిపాలించునేని యతని మనస్సున భయ మావేశించును. స్వర్గమును నతనికి మూయఁబడును. రా జ్యమునకు ధర్మమే మూలము. అట్టి ధర్మాసనమునఁ గూర్చుండి యధర్మమునఁ బాలించు రాజు మంత్రిగాని, రాజపుత్త్రుఁడుగాని,

యవ్యాని యోగములం దధికృతులయ్యుఁ దమసొంత ప్రయోజనములను మున్నిడికొని యకార్యములు చక్కఁగా నాచరింపని యధికారులుగాని, రాజు వెంట నందఱు నధోగతి నొందుదురు. బలవంతులయిన వారిచేఁ బీడితులయిన దుర్బలులు దీనముగాఁ బెక్కులు పలవించునపు డట్టి దిక్కుమాలిన మనుజుల కెప్పుడును రాజే దిక్కు. రెండు పక్షములవారికి వివాదము కలిగినపుడు, సాక్షుల బలిమినిబట్టి తీర్పుచేయుట మంచిది. ఒక పక్షమువానికి సాక్షులులేక దిక్కుమాలి యున్నెడ, వాని విషయమునందు రాజు విశేషించి పరిశీలనము పుచ్చుకొనవలయును. రాజు పాపములు చేసినవారిని వారి యపరాధమునకుఁ దగురీతిని దండింపవలయును. ధనవంతులగు వారిని దండుగులు మొదలయినవానిచేత ధనమునకుఁ బాపవలయును. పేదవారిని జెఱఁబెట్టవలయును. మిక్కిలి చెడునడవడి గలవారిని దెబ్బలు కొట్టింపవలయును. శిష్టులగు వారిని మంచిమాటలచేతను దానముచేతను బరిపాలింప వలయును. రాజును వధింపఁదలఁచినట్టి మనుష్యునిఁ జిత్రవధము గావింపవలయును. ఇండ్లకు నిప్పుపెట్టినవానికిని దొంగకును వర్ణసంకరము చేయువానికిని నఱ్ఱు చేయవలయును. రాజు చక్కఁగా దండమును జరుపుచు సత్పథమునఁ బ్రయత్నపరుఁడై యుండునేని యతనికి శాశ్వతము లయినధర్మములు కలుగును; అధర్మమే కలుగదు. రా జెవ్వఁడు తెలివిమాలి విచ్చలవిడి దండమును గావించునో వాఁ డిహమునం దపకీర్తినొంది మృతుఁడయి నరకము నొందును. ఒకనియపరాధమునకుఁగాను మఱొక్కనికి దండము విధింపరాదు. దండశాస్త్రమును జక్కఁగా ననుసరించియె యొకనిని జెఱఁబెట్టుటగాని విడిచి పుచ్చుటఁగాని

వలయును. రాజు దూత నెట్టియాపదయం దయినను నొకప్పుడును జంపరాదు. దూతను జంపినరాజు మంత్రులతోఁగూడ నరకము నొందును. క్షత్రధర్మ పరుండయిన రాజు, తన్నుఁ జెప్పుమన్న విషయమును గలరూపున నొకదూత చెప్పినందులకు వానిని జంపినచో నతనిపితరులు భ్రూణహత్యచేసిన దోషము నొందుదురు. మంచికులమునఁ బుట్టుట, శీలము చక్కఁగాఁ గలిగియుండుట, మాటకారితనము, నేరుపు, ఇంపుగా మాటాడుట, తనకుఁ జెప్పినట్టు సరిగాఁజెప్పుట, జ్ఞాపకశక్తి యనెడియీయేడు గుణములు దూతకుండవలయును. ఈరాజు నంగరక్షకుఁడును, ద్వారపాలకుఁడును, బట్టణ ద్వారరక్షకుఁడును నిట్టి గుణములే కలిగియుండ వలయును. రాజుమంత్రి ధర్మ శాస్త్రార్థముల స్వరూపములను దెలిసినవాఁడును, సంధివిగ్రహములందు నిపుణుఁడును, మతిమంతుఁడును, ధృతిమంతుఁడును, సిగ్గరియు, మంత్రరహస్యములును గప్పి కాచువాఁడును, గులీనుఁడును, మనస్సిదిటగలవాఁడునయి, పరిశుద్ధమగు నడివడిగలిగి యుండవలయును. ఇట్టి గుణములుగలవాఁ డయినచో నతఁడు ప్రశంసనీయుఁ డగును. సేనాపతియు నిట్టిగుణములతోడనే కూడియుండ వలయును. మఱియు వివిధములయిన యుద్ధవ్యూహములయు యంత్రములయు నాయుధములయు స్వరూపములను దెలిసిన పరాక్రమశాలియై యుండవలయును. మఱియు నతఁడు వాన చలి యెండ గాలి తాఁకులకు నోర్చువాఁడై పరులయందలి రంధ్రములందుఁ గన్నుగలిగివానిని దెలిసియుండవలయును. రాజు తనశత్రువులను నేమి యపాయము లేదని నమ్మింప నేర్చియుండవలయును. తానుమాత్ర మెవ్వరిని నమ్మరాదు. అతనికిఁ దనకన్న కుమారుని యందుసయితము

నమ్మిక యుంచుట యొప్పుగాదు. అనఘా ! నీ కిపుడు శాస్త్రార్థములను గలరూపున వివరించితిని. రాజులకు నమ్మకుండుట రాజనీతి యందుఁ బరమ మయినరహస్యముగాఁ జెప్పంబడు చున్నది' అనెను. ఇది యెనుబదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బురలక్షణాదులను జెప్పుట.

ధర్మరాజు 'రాజు వసించునట్టిపట్టణ మెటువంటిదిగా నుండవలయును. ఇంతవఱకుఁ జేయఁబడి యున్నపట్టనమునే యతఁడేర్పఱచు కొనవచ్చునా ? లేక క్రొత్తదిగా నొకటి చేయించు కొని వసింపవలయునా?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజు తనపుత్రులతోడను జ్ఞాతులతోడను బంధువులతోడను నెందు వసింపవలయునో యాపట్టణ మున్నయునికిని దానిగుప్తిని విమర్శించి తెలిసికొనుట యెంతయు న్యాయము. కాఁబట్టి నే నీవిషయమున, నందును విశేషించి, దుర్గకర్మమును గుఱించి చెప్పెదను. వానిని విని యట్లే చేయుట యేకాక ప్రయత్నంబున నడపుచును రావలయును. ఆఱువిధములయిన దుర్గములను నేర్పఱచుకొన్నపిదపఁ బట్టనముల నేర్పఱుపవలయును. అందు సర్వవిధములయిన సంపదలును ముఖ్యములయిన వస్తువులును సవ్వారిగా నుండవలయును. ఆ యాఱువిధములయిన దుర్గములును, మరుదుర్గములు, భూదుర్గములు, పర్వతదుర్గములు, మనుష్యదుర్గములు, మట్టిదుర్గములు, వనదుర్గములు నగును. రాజు తనకు వశ్యులయిన

మంత్రులతోడను సైన్యములతోడను వసింపవలసినపట్టనము నకు దుర్గము బలమయినదిగా నుండవలయును. అందు వలయు ధాన్యములును నాయుధములు నుండవలయును. దానికి దృఢ మయినకోటయు నగడ్తయు నుండుటయే కాక, రథగజ తురగ ములందు నెరసిఁజరసి యుండవలయును. అందు విద్వాంసులును శిల్పులు నుండవలయును. వలయు సంభారములన్నియు లెస్సఁగా సమకట్టింపఁబడ యుండఁవలయును. అందలిజనులు ధార్మికులై, మంచిసమర్థులై యుత్తములై యుండవలయును. మిక్కిలి తేజ ముదొలఁకుచున్న మనుష్యులును మృగములునుగలిగి, చదుక ములచేతను సంగడీపీఠులచేతను విలసిల్లుచుఁ, బరిశుద్ధములయి జనవ్యవహారములు వెలయ, మిక్కిలి నిమ్మళముగలిగి, దేనివల నను భయము లేనిదై యుండవలయును. అది మిక్కిలి కాంతిం బ్రకాశించుచు సంగీతాదిధ్వనులు బోరుకొనుచు మిక్కిలి యొప్పిదములయిన యిండ్లుగలిగి వెలుఁగవలయును. మఱియు నది శూరులచేతను బ్రాజ్ఞులచేతను నిండి వేదఘోషములకుఁ బ్రతిశబ్దించుచుండవలయును. సభలుగూడుటయు జాతరులును గలిగి సదా దేవతాపూజల రాజిలుచుండవలయును. ఇట్టి పురమునందు రాజు వశ్యులయిన మంత్రి మొదలయినవారితోఁ దాను బ్రవేశించి యుండవలయును. అందుఁ దాను వసించి బొక్కసము నించుచును, సేనలను బెంచుచును, మిత్రులను బెక్కండ్రనుగూర్చుచును, న్యాయసభలను నేర్పఱచుచు నుండ వలయును. అతఁడు తనపట్టనములందును బల్లెపట్టులందును గల సకలదోషములను దొలంగింపవలయును. మఱియు భాండాగార ములను నాయుధాగారములను బ్రయత్నపడి వృద్ధిఁబొందింప

వలయును. సమస్తములయిన బియ్యము మొదలయిన ధాన్యముల రాసులను బెంచి యంత్రశాలలను గుదుర్పవలయును. మఱియుఁ గట్టియలు, లోహములు, ఉముకలు, బొగ్గులు, మాఁకులు, కొమ్ములు, ఎముకలు, వెదుళ్లు, మజ్జ, నూనె, క్రొవ్వు, తేనె, మందుదినుసులు, జనుము, సర్జరసము, ధాన్యము, ఆయుధములు, అమ్ములు, తోలు, నరములు, పేములు, ముంజగడ్డి, మొదవ, వాద్యములను జేర్పవలయును. మిక్కిలి జలములకునికిపట్టులయిన బావులను దానికి దాపుననున్న తోట్లనును, పాలుస్రవించు మాఁకులను రాజెప్పుడును రక్షింపవలయును. ఆచార్యులను, ఋత్విజులను, పురోహితులను, మేటి విలుకాండ్రను, శిల్పులను, జ్యోతిషులను, వైద్యులను, ప్రాజ్ఞులను, మేధావులను, నడఁకువ గలవారలను, సమర్థులను, శూరులను, బెక్కుశాస్త్రముల నధిగమించినవారిని, మంచికులమునఁ బుట్టినవారినిని, సత్త్వగుణసంపన్నులను, సకలకర్మములందుఁ బూనికగలయట్టివారలనును, రాజు ప్రయత్నంబునఁ సత్కరింపవలయును. రాజు ధార్మికులగువారిని బూజింపవలయు; అధార్మికుల నడంపవలయును. పాటుపడి సకలవర్ణములవారిని దమతమ కర్మములందు నియమింపవలయును. పట్టనములందును బల్లెపట్టులందును లోపలను వెలుపలను గలవిషయములను వేగులవలనఁ జక్కఁగాఁ దెలిసికొని పిదపఁ గార్యమును జరుపవలయును. రాజు వేగులవారిని, మంత్రాలోచనములను, బొక్కసమును, దండమును విశేషించి తానే పరిశీలించుచుండవలయును. సమస్తమును వీనియందే నెలకొనియున్నది. పట్టనమందును బల్లెపట్లయందును గల యుదాసీనులును, మిత్రు

లును, శత్రువులును, జేయఁదలఁచియున్న దానినంతయుఁ జారులనెడి కన్నులచేఁ దెలిసికొనవలయును. పిదపఁ బొఱలుమాలిక లేక వారికిఁ జేయవలసిన కార్యము నంతయుఁ జేసి తీర్పవలయును. ఎప్పుడును భక్తులను బూజింపవలయును : పగవారిని నిగ్రహింపవలయును. ఎప్పుడును యాగములు యజించుచుండవలయును; ఎవ్వరిని బీడింపక దానము చేయుచుండవలయును. ప్రజలను బరిపాలింపవలయును. ధర్మమునకు విరుద్ధమయిన కార్యమును జేయరాదు. బీదలకును, దిక్కుమాలినవారికిని, వృద్ధులకును, వితంతువులకును, యోగక్షేమములను జీవనమును నెప్పుడును గావించుచుండవలయును. రాజెప్పుడు నాశ్రమస్థు లగు మునులను నాదరించియుఁ, బూజించియు, బహుమానించియు, వస్త్రములను బాత్రములను భోజనములను దగుకాలములందుఁ బంపుచుండవయును రాజు (తనదేశమందలి) తాపసులకు జతనంబునఁ దనయున్న యునికియు దాను బూనుకార్యము లన్నియును, దనరాజ్యస్థితియు, నివేదించుచు వారి సన్నిధియందు మిక్కిలి యడఁకువతో వర్తింపవలయును. వారు వ్రతములందు వాసికెక్కిన వారుగాన, రా జెప్పుడేని యొక సమయమునందు వారి రక్షణము గోరవలసివచ్చునేని, వారు నిచ్చలు రక్ష గావింతురు. రాజు, మంచికులమునఁ బుట్టినవాఁడును, పెక్కుశాస్త్రము లధిగమించినవాఁడును, సమస్తములయిన ధనములను బరిత్యజించినవాఁడును నగు నట్టి తాపసునిఁజూచెనేని వారికి శయనాసన భోజనము లొసంగి పూజింపవలయును. రా జెట్టి యాపదయందును నాతపస్వులందే నమ్మిక యుంపవలయును. దొంగలు సయితము తపస్వులయందు నమ్మిక గలిగియుందురు. వారియొద్ద

నిధులను నుంపవచ్చును; * మరలఁ దీసికొనవచ్చును. † మాటి మాటికి వారికడకుఁబోవుటయు, నతిమాత్రము వారినిబూజించు టయుఁదగదు. రాజు తనరాజ్యమందు వసించువారిలో నొకతా పసిని జెలిమికై యేర్పఱచుకొనవలయును. పరరాష్ట్రమం దలివారిలో నొకరినిని సట్లే యేర్పఱచుకొనవలయును. అడవుల యందలి వారిలోను నొకనిని, సామంతరాజుల నగరములలోని వారి యందొకరినిని నట్లే చెలిమిచేసికొనవలయును. రాజు తన రాజ్యమం దుండుతాపసులకుంబోలెఁ బరరాష్ట్రములందును నర ణ్యములందును నుండు నాతాపసులకును నాదరమును బహు మానమును నడపుచు వలయువానినెల్ల నిప్పించుచుండవల యును. ఆతాపసులు సంశితవ్రతులుగాన, రాజున కేద్దియేని యాపదకలిగి రక్షణము గానలసివచ్చినపు డతఁడు గోరెనేని తప్పక యట్టి రక్షణొసంగుదురు. రాజు తాను వసింపవలసినట్టి నగరమునకు వలయులక్షణములను నీకు సంగ్రహముగా నిప్పుడు చెప్పితిని' అనెను. ఇది యెనుబదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు రాజ్యమును గుప్తిచేయు ప్రకారంబు మొదలయినవి చెప్పుట. }

ధర్మరాజు 'భరతసింహమా ! రాజ్యము నెట్లొడఁగూర్పవల

---

* 'ప్రజ్ఞాః పర్యాదదీత చ' అని మూలము. వారివలనఁ బ్రజ్ఞను గ్ర హింపవచ్చునని యర్థము.

† తాపసులకడకు మాటిమాటికిఁబోరాదనుట వారియొద్ద రాజు ధనము మొద లయినవి యున్నవని దొంగలు వారిని బాధింపకుండుటకని తెలియునది.

యునో దాని నెట్లు పదిలముగా రక్షింపవలయునో జక్కఁగాఁ దెలిసికొన నువ్విళులూరుచున్నాను. వానిని నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'రాష్ట్రముఁను రక్షించువిధమును దాని నేర్పఱచు కొనురీతిని నంతటిని జెప్పెదను; ఎచ్చరికతోడ వినుము. ఒక్కొక్క గ్రామమునకు నొక్కయధిపతి నేర్పరుపవలయును; అట్లే పదిగ్రామములకు (అనఁగాఁ బదిగ్రామాధిపతులకుఁ బయిని) నొక్కపతి యుండవలయును. అట్లే యిరువది గ్రామములకును (అనఁగా ఇరువదిగ్రామపతులకుఁ బయిని) నొక యీశునిని. ముప్పదిగ్రామములకు నొకనిని, (నతనిపయిని) నూఱుగ్రామములకు నొకరినిని, (నతనిపైని) వేయిగ్రామములకు నొకరినిని నీశునిఁగా నియమింపవలయును. గ్రామాధిపతి గ్రామమందలి వారి లక్షణములను నందలి దోషములను బాటించుచుండవలయును. అట్లు పాటించినవిషయములను దశగ్రామాధిపతికి దెలుపవలయును. * ఆదశగ్రామాధిపతి వింశతిగ్రామాధిపతికిని, వింశతిగ్రామాధిపతి యావిషయములనెల్ల ముప్పదిగ్రామములపతికిని, నతఁడు నూఱుగ్రామముల పతికిని దెలుపవలయును. (గ్రామాధిపతి గ్రామమందుఁ బయిరగు భోజ్యవస్తువులకును మఱి యితరములగు గ్రామసంబంధివస్తువులకును నోడ

---

* 'వింశతి త్రింశతీశంచ సహస్రస్య చకారయేత్' అని. దా మూ. ద్విగుణాయాశ్చశ సై్యవం సహస్రస్యచ కారయేత్' అని జొ. మూలము. దానికి (అనఁగాపదికి) రెండింతల (అనఁగా నిరువది) గ్రామములకు నొకపతియు, నూఱుగ్రామములకు నొకపతియు నట్లే వేయింటికి నొకపతియుఁ నియమింపవలయును.

యుఁడుగా నుండవలయును.) గ్రామాధిపతి తనగ్రాసమునకై యాగ్రామమందుఁ బుట్టెడు భోజ్యవస్తువులను దనకుఁ దగుకొలఁది ననుభవింపవలయును. ఒక్కొక్క గ్రామాధిపతియుఁ దనవంతుకొలఁదిని దనగ్రామవస్తువులను బది గ్రామముల యధిపతికి గ్రాసభరణముగా నొసంగవలయును. పదిగ్రామముల యధిపతియు నట్లె తనవంతుకొలఁది నొసంగి యిరువదిగ్రామముల పతికి భరణముగావింపవలయును. నూఱుగ్రామములకుఁ బతియైనవాఁడు రాజువలన నన్నిసత్కారములను బడసి తనభరణమునకై జనులునిండినదియు సంపదల సొంపువెంపారునదియు నగు నొకపెద్ద గ్రామము ననుభవింపఁదగును. నూఱుగ్రామముల పతి కట్లియ్యఁబడిన యాగ్రామము వేయిగ్రామములపతికి లోనై యుండవలయును. ఆవేయిగ్రామముల పతియు మేలయిన యొకశాఖానగరమును(చిన్నపేటను) దనభరణమునకు నుంచుకొనవలయును. అతఁడు రాజ్యాధికారితోఁ బాటిగా దానివలనఁ గలుగు ధాన్యమును బంగారమును దక్కినవస్తువులను ననుభవింపవచ్చును. అతఁడు దానిని సంబంధించిన యుద్ధకార్యములను, మఱియు గ్రామముల కార్యముల నన్నియును గావింపవలయును. ధర్మజ్ఞుఁ డయినయొకమంత్రి ప్రాలుమాలిక లేక యాయధికారుల కార్యములను నన్నిటిని నరయుచుండవలయును. ఒక్కొక్క నగరమందును నందలి సమస్తవిషయములను నరయుటకు నొక్కయధికారి యుండవలయును. అతఁడు నక్షత్రములందు ఘోరరూపమయిన యొక గ్రహమువలె నాయధికారులందఱకును నెక్కుడయిన స్థానమందుండి తనక్రిందనున్న యాయధికారులందఱను జుట్టి చూచుకొనుచు రావలయును. అట్టివాఁడు తన

క్రిందనున్నవారల నడవళ్లను దూతలమూలమున నరయుచుండ వలయును. రక్షణాధికారమునం దుండువారు వంచకులుగను, బరులసొమ్మును బలిమిని బుచ్చుకొనువారుగను, బాపమం దాశ గలవారుగను, జంప నిచ్ఛగించువారుగను నుందురు. ఆ గొప్ప యధికారి ప్రజల నిట్టివారలవలన నుండి రక్షింపవలయును. రాజు, విక్రయమును, గ్రయమును, బాటలస్థితియు, దిండిని, వ్యయమును, దక్కిన యోగక్షేమములను జక్కఁగాఁ గనుఁ గొని వర్తకులకుఁ బన్నులను విధింపవలయును. శిల్పు లుత్పత్తిచేయు వస్తువులను వానికయిన వచ్చుబడులను వ్యయములను శిల్పముల తెఱంగును బలుమాఱు పరిశీలించి యాశిల్పులకు వారిశిల్పములమీఁదఁ బన్నువిధింపవలయును. రాజు మిక్కిలిగొప్ప పన్నులు పుచ్చుకొనవచ్చును గాని, ప్రజలను గీడ్పఱుచునట్టి పన్నులను విధింపరాదు. ఎంత ఫలితమగునో, యందుల కెంత పాటు పడవలయునో, చక్కఁగాఁ దెలిసికొని యే యేపన్నును విధింప వలయును. ఒకఁడు తగిన (ఫల) కారణములేక యొక ఫలిత మునకుఁ గాని యందుల కయినపాటునకుఁ గాని పూనఁడు. ఒకఁ డొకసరకును బాటుపడిచేయఁగా, వాఁడును రాజును దాని ఫలమునకుఁ బాలుపడునట్లుగా రా జాలోచించి పన్ను వేయవల యును. రాజు పేరాసచేతఁ దనకు మూలమయిన దానిని (రా జ్యమును, బరులకు మూలమయిన దానిని (కర్తాదులను), నాశము చేయకుండవలయును. రాజు, లోభమువలని కార్యముల నెల్లఁ నడంచుకొని తన దర్శనమును మఱిఁగించుకొని యుండవలయును. రాజు మిక్కుటముగాఁ బన్ను దీయువాఁ డని పేరుగన్నచోఁ బ్రజ లట్టివానిని ద్వేషింతురు. జనులు ద్వేషించినట్టివానికి

క్షేమమేమి ? మాటుగలిగి యుండువానిని సంపద పొందును. రాజు బుద్ధికొలవడక దూడవలె రాజ్యమును బిదుకవలయును. దూడ చక్కఁగా పోషింపఁబడినదై నచో సత్తువగలిగి కాఁడి యను సైఁచును. మిక్కిలిగాఁ బిదుకఁబడిన యావుదూడ పనిచేయఁజాలదు. రాజ్యమును నెక్కువగాఁ బిండినయెడలఁ బెద్దకార్యమును గలిగింపఁజాలదు. ఏరాజు తానే పరిపాలించుకొనుచు రాజ్యము ననుగ్రహమునఁ జూచునో వాఁడం దుప్పతిల్లినదాని ననుభవించుచు మిక్కిలియు గొప్పఫలమును బొందును. తనరాజ్యమును బరిపాలించుచును, దనప్రజలకును పన్నులు మొదలగువానియందు ననుగ్రహము చూపుచును, సులభముగా నందుఁ గలుగువానివలననే తనభరణము చేసికొనుచును, నుండునట్టి రాజు మిక్కిలియు గొప్పఫలమును బొందనేర్చును. అట్టున్నయెడ రాజు తనయాపదలకు వలయునంత ధనరాసులను సంపాదింప నేర్చును జుమీ. అతని రాష్ట్రమంతయు నతనికి బొక్కసమగుచున్నది. అతని బొక్కసమతనిపడుక టిల్లగుచున్నది. పురజనులును పల్లెపట్ల జనులును బీదలుగానుండి రేని, వారు తన్నుఁ దమంతట నాశ్రయించినను, నొకరిమూలమున నాశ్రయించినను, దనశక్తికొలఁది వారియెడఁ గనికరము చూపవలయును. * రాజ్యము బాహ్యములందున్న

* 'బాహ్యం జనం భేదయిత్వా భోక్తవ్యో మధ్యమస్సుఖమ్' అనిమూలము. వెలుపలిపట్ల నడవులనుండు దొంగజనులను మీరు చెలరేఁగుడని భేదము కల్పించి నడుమనున్న గ్రామజనులవలన నవ్వారిగా ధనము ననుభవింపవలయునని యర్థాంతరము. ఇచట రాజులకు విపత్తులయందు ధనరాసులు కావలసివచ్చె నేని వెలిపట్లనున్న దొంగలను జెలరేఁగునట్లు పురికొలుపఁగా నడుమనున్న గ్రామజను

దొంగలనందఱను దండించి రాజు నడుమ నున్న గ్రామజనులను రక్షించి వారికి సుఖము కలిగింపవలయును. ఇట్లు చేయుట వలన జనులు, రాజుతోఁ బాటిగా సుఖమును దుఃఖమును గలవారగుదురుగాన యతనియెడ నెంతమాత్రమును గోపము నొందరు. రాజు ముందుగనే ధనము సేకరింపవలయు నని *తలపోసి యంతఁ దనరాజ్యమందు ముఖ్యము లయిన పట్టులకుఁ బోయి 'ఇదిగో! ఆపద కలిగియున్నది. పరులదండువలన మిక్కిలియు భయము పుట్టియున్నది. అయినను నీయపాయము తొలఁగిపోవలయునని యే చెప్పవచ్చును. ఏలనఁగా మనశత్రువు, పూచిన వెదురు వలెఁ ద్వరలో నాశము నొందును. నాశత్రువు లనేకులు చెలరేఁగి పెక్కండ్రు దొంగలతోఁ గూడికొని నారాజ్యమును బీడింప నుంకించుచున్నారు గాని, యట్లుసేయుట వారినాశమునకే యగును జూఁడీ. ఇట్లాపద ఘోరమైయుండఁగా భయము దారుణముగాఁ గలుగఁగా మిమ్ము నలుగడలఁ గాచుటకై మీవలన ధనములను బ్రార్థించుచున్నాను. ఈభయము తొలఁగినతోడనే మీధనములనంతయు మరల మీకు నిప్పించుచున్నాను. నేను గాక శత్రువులు బలవంతముగా నిచటనుండి ధనములను గొంపో

లకువారివలన భయముగలుగఁగలదు. రా 'జాదొంగలనుండి మిమ్ము రక్షించుటకు ధనము లిం'డని యవ్వారిగా ధనములను వారివలన గ్రహింపవలయును. వారును రాజు తమసుఖదుఃఖములను గుర్తించి యట్లు చేయుచున్నాఁడని తలంచుటచేఁ దమవలన నవ్వారిగా ధనములు గొన్నందులకు రాజువలన నెంతమాత్రమును గోపము నొందరని యాశయము.

* 'అనుభావ' అనిమూలము 'అనుభావ్య' అనుపాఠమున 'చెప్పి' యని యర్థము.

వుడు లేని మరల నెంతమాత్ర మీయరు. ధనమొక టేగాదు; వారి వలన స్త్రీలును దక్కినవన్నియు నాశమునొందవలసి వచ్చును' అని భయమును జూపవలయును. రాజు సమయమునెఱింగి తగిన యుపాయమును జేసినపిదపఁ బ్రజలతో 'శరీరము కొఱకును బుత్రులకొఱకును భార్యలకొఱకును ధనము గూర్పంబడుచున్నది. మీయభివృద్ధి కెంతయు నానందించుచున్నాను. నేను నాపుత్రుల యభ్యుదయమునకుఁ బోలె మీ పెంపుసొంపునకు నానందించు చున్నాను. రాజ్యమునకును మీకును గష్టములేకుండునట్లు శక్తికిఁ దగినట్లు పుచ్చుకొనెదను. *ఆపదలందేకదా మీరందఱు నొక్కటిగాఁగూడి యీపనిని భరింపవలయును. ఆపద లేవేని వచ్చినపుడు, మీరు ధనమందంతగాఁ బ్రియముంపరాదు' అని యింపుగను జల్లగను ఋజువముగను జెప్పి తన చేఁద్రాళ్లఁబోని యధికారులనుబంపి ప్రజలవలన ధనమును సంతరింపవలయును. రాజు వైశ్యులకు † దండయాత్రనును భృత్యులను భరించుట మొదలగువానివలని వ్యయములను, బరులు దండెత్తివత్తురను భయమును, వారికి యోగక్షేమములు కలిగింపవలసిన యావశ్యకతను, జూపి వారివలననుండి పన్నులు దీయింపవలయును. రాజు వైశ్యుల నుపేక్షించెనేని వారు తనరాజ్యమునువిడిచి యడవులకుఁ బోయి తనకు నశించినట్టివారే యగుదురు. కాఁబట్టి రాజు వారలయెడ విశేషించి మెత్తఁదనముతో నడచుకొనవలయును.

---

* 'ఆపత్స్వేవ నిబోఢవ్యం భవద్భి స్సంగతై రిహ' అని దా. మూ. 'ఆపత్స్వేవచ నోఢవ్యం భవద్భి ర్సంగతై రిప' అని ఔ. మూలము. వృషభములవలె భరింపవలయునని. యర్థము.

† 'ప్రచారమ్' అని దా. మూ. 'ప్రాకారమ్' అని ఔ. మూలము.

రాజు మాటిమాటికి వైశ్యులను మెత్తనిమాటల లాలించుచుచు, రక్షించుచును, వారికిఁ గుశలముగా నుండునట్లు తోఁచించు కార్యములు చేయుచును, వారికిఁ గలవానిని సుఖముగా ననుభవింపఁ జేయుచును, వారికిఁ బ్రియములయినవియె యెప్పుడు నాచరించుచునునుండవలయును. వైశ్యులు ఫలము పయింబయి నొడఁగూర్చ వలంతులగునట్లుగా రాజు వారియెడ మెలఁగవలయును. వైశ్యులు రాజ్యమును బలమును వృద్ధిఁబొందించుటయే కాక దానివర్తకమును సేద్యమును బెంతురు. కాఁబట్టి తెలివిగల రాజు వారికెంతయుం బ్రయత్నపడి సంతోషము గలిగించుచుండవలయును. రాజు దయగలిగి పరాకునడక మృదువుగాఁ బన్నులను దీయవలయును. వైశ్యులకు * క్షేమము గావించుట యెచ్చటను సులభమేకదా. వారియెడల నట్లు నడచుకొనుటకు సాటియైన ధనము రాజ్యమునకు మఱొకటి గలుగదు' అనెను. ఇది యెనుబదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకుఁ బ్రజలవలనఁ బన్నుదీయు విధము మొదలయినవి చెప్పుట. }

ధర్మరాజు 'మహామతీ ? రాజు తనకెంతధన ముండినను మఱియు బొక్కసము గావలసివచ్చినచో † నెట్లు నడచుకొనవలయునో నాకుఁజెప్పుము' అని యడిగెను.

---

* 'క్షేమచరణమ్' అనిమూలము.

† 'కథంప్రవర్తేతతథా' అని ఔ.మూలము 'కథంప్రవర్తేత కరః' అని దా. మూలము. పన్నునెట్లు వేయవలయునో యని యర్థము.

భీష్ముడు ' ధర్మార్థి యగురాజు ప్రజలహితమం దాసక్తుండై దేశమునకును గాలమునకును దగునట్లును దనబుద్ధికొలందిని దనచేత నయినంతవఱకును వారలకుం గట్టుపాట్లు చేసికొనవలయును. రాజు తనరాష్ట్రమందుం బ్రజలకును దనకును శ్రేయము గలుగునట్లుగా సమస్తములయిన ధర్మములను జరుపవలయును. రాజు,తుమ్మెదలు చెట్లనుండి తేనియను దీయునట్లు,రాజ్యమునుండి * పన్ను దీయవలయును. గొల్లవాండు దూడయందుంగన్ను వీడకయె పాలుపిండును. మఱి యావుపాలిండ్లను దూంటుపొడువండు. అట్లె రాజును నడచుకొనవలయును. జలగ నెత్తురును బీల్చునట్లు రాజు రాజ్యమును మిక్కిలిమృదువుగానే పీల్పవలయును. ఆండుపులి తనకూనలను వాండిపండ్లం గఱచినను నొవ్వగలిగింపకయే కొంపోవునట్లు, రాజును బీడింపకయే పుచ్చుకొనవలయును. ఎలుక మిక్కిలివాండియైన కోఱపండ్లు గలిగియుండినను నిదురించుచున్న వారికాలను వారికిం దెలియకుండునట్లు మెలపుగాం గొఱుకునట్లు రాజును మిక్కిలి మృదువయిన యుపాయమున రాజ్యమునుండి పుచ్చుకొనవలయును. వర్ధిలుచున్నయొకనినుండి కొంచెము కొంచెముగా పన్ను నెచ్చునట్లు నిప్పించుకొనవలయును. అటుమీంద, నెచ్చుగను నంతకుంబిదప మఱింత హెచ్చుగను,నిట్లు క్రమముగాం దగినంతకొలందికి బన్నును హెచ్చింపవలయును. ఒకండు చిన్నయెద్దునకు బరువును రాను రాను హెచ్చించుచు మోయంబనుపఱుచు

---

* 'మధుదోహం దుహే ద్రాష్ట్రం భ్రమరా ఇవపాదపమ్' అని ఔ. మూ. మధునోహందుహేద్రాష్ట్రిమ్ భ్రమరాన్న ప్రపాతయేత్' అని. దా. మూ. 'రాజు తేనెను దీయునట్లు రాజ్యమును బిదుకవలయును. తుమ్మెదలను బడంగూల్పరాదు' అని యర్థము.

నట్లు, తన ప్రజలభారములను క్రమంబున హెచ్చించుచు రావల యును. అతఁడు మిక్కిలి మెలపుతోను మెత్తఁబాటుతోను బ్రవర్తించుచుఁ గడపటఁ ద్రాళ్లను వారికిఁ దగిలింపవలయును. ఒకతూరి వారికిఁ*గట్టుఁద్రాళ్లువైచినచో మీఁద నడంపరానివారు గాకుందురు. వారల నడఁగిమడఁగి యుండునట్లు చేయుటకుఁ దగిన ప్రయత్నము లాచరించి వారి ననుభవింపవలయును. వట్టి ప్రార్థనలచే వారి నడఁగియుండునట్లు చేయుటచాలదు. అందఱ మనుష్యుల యెడల సమముగా నడచుకొనుట శక్యముగాదు. ప్రజలయందు ముఖ్యులయినవారిని బుజ్జవముచేఁ గయివసము చేసికొని తక్కినవారి నడంకువకుఁ దెచ్చుకొనవలయును. భార మును వహించు సామాన్య ప్రజలయందు (వారిముఖ్యులమూల మున) భేదముపుట్టించి రాజుతానే వారిని సమాధానపెట్టుటకు ముందఱికివచ్చి దానిచే వారివలనఁ దీయఁగలిగిన దానిని హాయి గా ననుభవింపవలయును. రాజు పన్నులను, దగని కాలములం దును, దాని భరింపఁదగనివారియందును వైవరాదు. క్రమక్ర మముగాను, బుజ్జవముతోను, దగినకాలమునను, దగిన విధము నను వానిని విధింపవలయును. నేనుజెప్పుచున్న యీయుపాయ ములు రాజనీతి కనురూపము లయినవి కాని, మాయలతోఁ గూడినరీతులు గావు. గుఱ్ఱములను నుపాయముమాలి యడంపఁ జూచువాఁడు దానిని గినియించును. కల్లంగళ్లు, బోగముస్త్రీలు, కుంటెనకత్తెలు, నట్టువులు, జూదములును, జూదపుగొట్టము

* పనుపడని యెద్దులకు బరువు కొంచెము కొంచెముగా నెక్కించుచు మెల పుతోడఁ బాటుపడి వానికిఁ గడపటఁ గట్టుఁ ద్రాళ్లు తగిలించునట్లు ప్రజలయెడ నడచుకొనవలయునని భావము.

లుంచుకొనియుండువారు, మఱియు నిట్టివారును రాజ్యమునకు హానికరులు గావున, వీరి నందఱ నడంచి పుచ్చవలయును. వీరు రాజ్యములోపల వసించుచుఁ బ్రజలయందు మేలయిన తెగలవారిని గొట్టి బాధింతురు. ఒకరి కొకరు యాపదయు లేనపుడు, మఱొకరి నేదియు యాచింపరాదు. మనువే తొల్లి సమస్తజనులకును నిట్టిదేర్పాటు చేసెను. మనుష్యులెల్లవారును యాచించుచును దిరిపమెత్తుచును బనిపాటులుచేయక బ్రతుకఁగోరిరేని యీ లోకములన్నియు రూపుమాయును. ఇందులకు సందేహము లేదు. రాజొక్కఁడే నియమించుటకును వారించుటకును శక్తుఁడు. ప్రజలను బాపమునుండి వారింపనిరాజు, రాజరక్షణము లేనందునఁ బ్రజలాచరించు పాపమునందు నాలవపాలును బొందుచున్నాఁడు. ఇట్లని శ్రుతులు ప్రతిపాదించెడిని. రాజు ప్రజలధర్మములందుఁబోలె వారిపాపములందును బాలుగలిగియుండును గాన పాపములాచరించు ప్రజలను నట్లుచేయనీక వారింపవలయును. అట్లు వారిని వారింప నుపేక్షించినచో రాజు తనంతటఁ బాపియగును. వారి పుణ్యములందుం బోలె వారి పాపములందును నాలవపాలునొందును. నేను జెప్పెడియీ దోషములను నడంచిపుచ్చవలయును. ఇవి సంపదను నాశము సేయునట్టివి. కామమునందు మిక్కిలి తగులు గలపురుషుఁ డకార్యమేది సేయకుండును ? కామమునకు లోపడినవాఁడు మద్య మాంసములను, బరులవస్తువులను, బరులదారములను ధనములను నపహరించును ; అట్లితరులకుఁ జెడుపద్ధతి నేర్పఱచుచు యాచించి బ్రతుకునట్టి వారెవరు గారో, వారాపత్సమయమందు యాచింపవచ్చును. వారలకుదయతోను ధర్మముతోను దానముచేయవలయునే కాని భయముతోఁ

గాదు. నీరాజ్యమందు యాచకులును దొంగలును నుండరాదు. వీరు ప్రాణులనుబట్టి పీడించువారేకాని వారికిఁ బెంపొందించు వారుగారు. ఎవరు భూతములందు దయసూపుదురో, ప్రజలను వృద్ధినొందింతురో, యట్టివారే నీరాజ్యమం దుండవలయును; కాని, భూతములను మిక్కిలి బాధించువారువలదు. ప్రజలవలనఁ గొలఁదికి మించి పన్నుదీయు నధికారులను దండింపవలయును. కొలఁదిచొప్పునఁ బన్నుదీయు నధికారులను వేఱ నియమింపవలయును. కృషి, గోరక్షణము, వర్తకము మఱియు నిటువంటి వయిన తక్కినపనులును బెక్కండ్రు పురుషులనుగొని వేఱువేఱ వారివారికిఁ గలకర్మములచొప్పున జరుపవలయును. కృషి, గోరక్ష, వర్తకమును జరుపుచుండు మనుష్యుఁడు (దొంగలు క్రూరులుమొదలగు వారివలన) క్షేమము లేకుండునేని దానివలన రాజు మిక్కిలియు నిందనొందును. రాజు ధనికులగువారిని, పానములు వస్త్రములు భోజనములు మొదలయినవానిచేఁ బూజించుటయేకాక వారితో 'మీరు నన్నుఁగూడి ప్రజలను బెంపొందింపుఁ' డని చెప్పవలయును. ధనవంతులు రాజ్యమునకు గొప్ప యంగము సుమీ. సకలమనుష్యులకు ధనవంతుఁడు కన్నాకు; ఇందులకు సందేహములేదు. ప్రాజ్ఞుండును, శూరుండును, ధనవంతుఁడును, ధార్మికుఁడును, దపస్వియు, సత్యవాదియు, బుద్ధిమంతుఁడును, స్వామిగనుండువాఁడును, రాజ్యరక్షణమునందు సహాయకారి యగును. కాఁబట్టి రాజా! సమస్తప్రాణులందును బ్రీతిగలిగియుండుము. సత్యమును, నిష్కాపట్యమును, గోపము లేమియుఁ, గ్రూరత్వము లేమియును బాటింపుము. ఇట్లు సత్యమును నార్జవమును గలిగి, మిత్రులతోను బొక్కసముతోను

సైన్యముతోనుగూడి దండమును జెల్లింపుము. బొక్కసమును బెంపుము. మిత్రులను బడయుము. రాజ్యమును నెలకొల్పుము' అనెను. ఇది యొనుబదియొనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజనీతిని జెప్పుట.

రాజా! నీరాజ్యమందు భుజింపఁదగిన పండ్లుగల వృక్షములను నఱుకరాదు. మూలములును ఫలములును బ్రాహ్మణుల సొమ్మగుట ధర్మమని జ్ఞానవంతులు చెప్పెదరు. బ్రాహ్మణులకుఁబోఁగా నెక్కువ గామిగిలినదానిని దక్కినజను లనుభవింపవలయును. బ్రాహ్మణుల కు నద్దుపడి మఱియొకఁ డేవస్తువు నేని నేవిధమునఁగాని హరింపఁ గూడదు. జీవనములేనికొఱఁతవలన నొక బ్రాహ్మణుఁడు వేఱొక చోట బ్రతుకు వెదకికొనుటకై రాజ్యమును దిగవిడువఁగోరు నేని, రాజతనికిని నతనిభార్యకును బ్రతుకు నేర్పఱుపవలయును. అప్పటికి నాబ్రాహ్మణుఁడు పోక మరలఁడేని బ్రాహ్మణసంఘము కడకుఁబోయి '* ఇపుడు లోకులు తమ్ము మర్యాదయందు మెలఁ పుటకెవనిని బ్రమాణముగాఁ గొందురు ? ఈ బ్రాహ్మణుఁడు రాజ్యమును విడిచిపోవుచున్నాఁడే' యని చెప్పవలయును. అప్ప టికి నాబ్రాహ్మణుఁడు విడిచిపోవుతలంపును విడువక మఱియే

---

* బ్రాహ్మణులు తక్కినవారిని లోకమర్యాదలందు మెలపుటకుఁ బ్రమాణ భూతులు. కాన యొకబ్రాహ్మణుఁడు రాజ్యమును విడుచునేని జనులు తామొక స్నేహితునిని గురువును నియామకునిఁబోఁగొట్టుకొన్నవారగుదురు. కావున నే రాజు బ్రాహ్మణునిఁగూర్చి యిట్లుచెప్పుట తెలియునది-ప్రతాపచంద్రరాయలు.

డేని చెప్పునేని, రాజతనితో '*కడచినదానిని మఱచిపోవలయు' నని చెప్పవలయును. కౌంతేయా ! ఇది శాశ్వత మయినరాజ నీతిధర్మము. రాజు మఱియు నతనితో 'బ్రాహ్మణోత్తమా ! బ్రాహ్మణునికి జీవనమునకు వలయునంతయె యీఁదగునని జనులు చెప్పెదరు. అయిననే నీమాటను బాటింపను. అతఁడు రాజు (తనకు బ్రతుకుగల్పింపకున్న) తగనినడవడికి నట్లాచరింపఁ (తనరాజ్యము విడిచిపోవఁ) గోరునేని (యతని కట్టిబ్రతుకుఁదెరువు కల్పించుట యేకాక యతఁడు కోరెనేని) వలయుభోగములనుగలిగించి నిలువఁ బ్రార్థింపవలయు' ననఁదగును. జనులకుఁ గృషియు గోరక్షణమును,వర్తకము నీలోకమున జీవనమగును. వేదవిద్య పరలోకమునకు సాధనమగును. అది జనులను బెంపునొందించునది. అది క్రిందపడునపు డెవరుదాని ప్రచారమున విరోధులగుదురో వారు

* రాజా బ్రాహ్మణుని నీవిధమునఁ బోనీక నిలుపవలయును. అందులకు నతఁడు సమాధానపడక రాజామునుపటియనాదరము నెత్తిచూపునేని రాజుదానిని మఱచుటకు క్షమాపణము వేఁడి,యతనికి జీవనమేర్పఱుపవలయునని ప్రతాపచంద్రరాయలు-- 'అసంశయం నివర్తేత నచేద్వక్ష్యత్యతః పరమ్ । పూర్వం పరోక్షంవక్తవ్యమ్' అని. ఔ. మూ. 'వక్షతి' అనుటకు 'త్యక్షతి' అని దాషారము. 'అప్పుడు సందేహములేక మఱలును. అట్లుగాక జీవనమునకంటె నెక్కుడుగా భోగమే వలయునని పట్టణమును విడువఁజూచునేని 'బ్రాహ్మణా ! మొదటిదయినయీభోగవాంఛను మఱవవలయునని చెప్పవలయును. కౌంతేయా! ఇదిశాశ్వతమయినధర్మమని జనులుచెప్పెదరు. అయినను నేనుదీనిని నమ్మటలేదు. బ్రాహ్మణుఁడు భోగములు వేఁడినను నవియు నొసంగి యతని నుపచరింప వలయును' అని మఱియొక యర్థము. 'ఆహు రేతజ్జనా బ్రహ్మన్నచైత చ్ఛ్రద్దధామ్యహమ్। నిమన్త్ర్యశ్చ భవే ద్భోగైరవృత్త్యాచ తదా చరేత్' అని మూలము. 'బ్రహ్మన్' అనుటకు 'రాజన్' అని పఠించి యీయర్థము కల్పించుట తెలియునది.

మ్రుచ్చు (అనఁగా జనసంఘమునకు శత్రువు) లగుదురు. అట్టివారిని వధించుటకొఱకే బ్రహ్మదేవుఁడు క్షత్రియుల నీలోకమందు సృజించెను. కాఁబట్టి రాజా! పగవారిని గెలువుము. ప్రజలను బాలింపుము. యాగములను యజింపుము. కురునందనా! శూరుండవై యుద్ధమునఁ బోరాడుము. రక్షింపవలసినవారిని రక్షించునట్టి రాజే, రాజులందుత్తముఁడగురాజు. ఎవ్వరు వారిని రక్షింపరో యట్టిరాజు లుండియుఁ బనలేదు. తనప్రజలకెల్ల మేలు గలుగుటకై రా జెప్పుడును * యుద్ధము చేయవలయును. దానినిబట్టియే మనుష్యుఁడు మనుష్యులనే యేలవలయును. సొంతవారివలననుండి పరులను, పరులనుండి సొంతవారలను, పరులవలననుండి పరులను, సొంతవారలనుండి సొంతవారలను, నిల్లవారిని నెప్పుడును గాచుచుఁ బరిపాలించుచుండుము. తొలుత రాజు తన్నెల్లవారివలన నుండియు రక్షించుకొనుచు భూమిని రక్షింపవలయును. విద్వాంసు లగు జను లన్నిటికిని మూలము తాను (అనఁగా రాజు) అని చెప్పుదురు. రాజు తనలో 'ఛిద్రము లేమియున్నవి? నాకేవ్యసనము లందుఁ దగులుగలదు? నాదుర్బలత్వమునకు మూలమేమి? దోషములకుఁ గారణమెద్ది?' యని యెప్పుడును జింతించుచుండవలయును. రాజు ముందటిదిన

---

* సదైవరాజ్ఞా యోద్ధవ్యం సర్వలోకా ద్యుధిష్ఠిర। తస్మాద్లోకో హి భుఞ్జీత మనుష్యానేవ మానవః। అని. దా. మూలము. 'యోద్ధవ్యమ్' అనుటకు 'బోద్ధవ్యమ్' అనియు 'భుఞ్జీత'కు 'యుఞ్జీత' యనియు. జొ. మూలము. అప్పుడు 'తనప్రజలకెల్ల మేలునకై రా జందఱచేష్టలును దలంపులును దెలిసికొనవలయును. అందులకై యతఁడు వేగులవారిని దక్కిన రహస్యభూతులగు మనుష్యులను నియోగింపవలయును' అని యర్థము. ఇదియె సరసముగానున్నది.

మున జరపినదానిని జనులు కొనియాడుచున్నారా లేదా యని తెలియుటకు నమ్మకము గలవేగులవారిని రహస్యముగాఁ దనభూమియందుఁ గ్రుమ్మరునట్లు నియమింపవలయును. మఱియు నతఁడు తననడవడిని సాధారణముగాఁ బ్రజలు కొనియాడుటయుఁ గొనియాడమియును, బల్లెపట్లవారి కది రుచించుటయు రుచింపకుండుటయు, రాజ్యమునందుఁ దనకు మంచికీర్తి కలుగుటయు లేకుంటయు నరయుచుండవలయును. యుధిష్ఠిరా! ధర్మజ్ఞులును ధైర్యవంతులు నయినవారిలోపల యుద్ధమందెవరు వెన్నిచ్చి పాఱరో, రాజ్యమందెవరు వసింపరో, యెవరు నిన్ను గొలిచి బ్రతుకుచున్నారో, నీకమాత్యులెవరో, మఱి తటస్థులుగ నుండువారెవరో, నిన్నెవరు సర్వవిధములఁ బ్రశంసింతురో, లేక నిందింతురో, వారి కందఱకును గౌరవములు నీవు గావింపవలయును. ఏమనుష్యుఁడుఁగాని యందఱకును నొక్క తీరున నిష్టుఁడు గానుండుట శక్యముగాదు. సమస్తజనులకును మిత్రులును శత్రులును మధ్యస్థులును గలరు' అనెను.

ధర్మరాజు 'సమాన భుజబలమును సమానములగు గుణములును గలజనులయం దొక్కఁ డెట్లధికుఁడగుచున్నాఁడు? ఎట్లు మనుష్యులను నేలుచున్నాఁడు?' అని యడిగెను. అందులకు భీష్ముఁడు 'జంగమములు స్థావరములను దినును (ఏలును). కోఱలుగలవి కోఱలులేనివానిని దినును (ఏలును). క్రూరవిషములగు సర్పములును గుపితములై యల్పసత్వములగు సర్పములను దినును. (ఈతీరుననే మనుష్యులయందును బలీయుఁ డగురాజు తక్కినవారి నడంచి మించును.' రాజు తనప్రజలవలనను బరాకు పడకుండవలయును. పరాకుపడెనా గ్రద్దలవలె వారు పయిఁబడు

దురు. రాజా ! నీరాజ్యమందు వర్తకులు సరకులు కొంచెముగాఁ దీయువారును విస్తారముగఁ దీయువారును బరువయిన పన్నులకు నలఁగి కలఁగి యడవులకుఁబోయి వసించియుండరు గదా ? నీరాజ్యమందు సేద్యగాండ్రును బీడితులై దానిని దిగవిడువకున్నారుగదా ? రాజుభారమును వహించువారే తక్కిన వారిని సయితముభరించువారు సుమీ. ఆలస్యము ధర్మమునం దొకపాతికభాగమును నపహరించును. మఱి యొకపాతిక భాగము పాపండునిఁ బొందియున్నది. మఱియొకపాతిక రాజును బొందియున్నది. ఇం కొకపాతిక కృషి నాశ్రయించియున్నది. రాజును బొంది యున్నయొకపాదమును దక్కిన మూఁడుపాదములుగూడి నాఁటినాటికిఁ దినుచున్నవి. కాఁబట్టి రాజా! ఇన్నిపాట్లునుబడి నీపాతికభాగమును రక్షించుకొనుము. దేవతలును, పితృగణములును, మనుష్యులును, ఉరగులును, రక్షస్సులును, పక్షులును,పశువులును, నిందు నీ వొసంగుదానివలననే జీవించుచున్నవి. ఇవియే రాజ్యమును బాలింపవలసిన సాధనములును రాజులను రక్షింపవలసిన విధములును. వీనినే మఱలఁ జెప్పెదను' అనెను. ఇది యెనుబదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు * ఉచథ్యమాంధాతృ సంవాదమును జెప్పుట. }

భీష్ముఁడు - ఆంగిరసవంశ్యుఁడును బ్రహ్మవిత్తముఁడును నయి

---

* దాక్షిణాత్యకోశములందు 'ఉచథ్యుఁ' డనియును, ఔత్తరాహకోశము

యుచథ్యుఁడు మున్ను యువనాశ్వునికొడు కయిన మాంధాత కుఁ బ్రీతిగడలుకొన క్షత్త్రధర్మముల నుపన్యసించెను. బ్రహ్మ విదులందు మిన్నయగునతఁ డారాజునకు నుపదేశించినవిధ మున నే దానినంతయు నీకుఁజెప్పెదను.

ఉచథ్యుఁడు, 'మాంధాతా! రాజు ధర్మమునకై యున్నాఁడు గాని తనయిచ్ఛలను జేయుటకై కాదు. లోకమును రక్షించు వాఁడు రాజని యెఱుంగుము. రాజు, ధర్మము నాచరించు నేని దేవత్వమునకు నర్హుఁడగును. అతఁ డధర్మము గావించు నేని నరకమునకే పోవును. సకలభూతములు నాధర్మమునందు నెల కొనియున్నవి. ఆధర్మము రాజునందు నెలకొని యున్నది. దానిని జక్కఁగాఁ బాలింపఁగోరురాజే సంపదను బొందును. *మాంధాతా! రాజుచేయు నపరాధమునుబట్టి 'సంపదగలవాఁడు పాపాత్ముఁ'డను మాటకలుగుచున్నది. దేవతలును నిందనుబొం దెదరు. ధర్మములేదనియుఁ జెప్పంబడును. అధర్మమందుఁ బ్రవ ర్తించువారికిని నర్థములు సిద్ధించుట చూపట్టును.లోకమంతయు నదియే మంగళమని దాని ననువర్తించుచున్నది. పాప మెప్పుడు వారింపఁబడదో యప్పుడు ధర్మవృత్తము వెకల్పఁబడుచున్నది. అధర్మమును బెచ్చు పెరుఁగుచున్నది. రేయుంబవలు భయ మను చుందురు. నాయనా! పాపమును వారింపనియెడ ధర్మము

లందు 'ఉతథ్యుఁ'డనియును బాఠములున్నవి. ఇట దాక్షిణాత్యకోశానుసార ముగా 'ఉచథ్యుఁ' డనియే గైకొనఁబడినది.

* 'రాజాపరాధాన్మాంధాతర్లక్ష్మీవాన్ పాప ఉచ్యతే' అని దా. మూ. 'రాజా పరమధర్మాత్మా లక్ష్మీవాన్ ధర్మ ఉచ్యతే' అని ఔ. మూలము. రాజు పరమధర్మాత్ముఁడును సంపన్నుఁడు నయినచో నతఁడే ధర్మ స్వరూపమనఁ బడునని యర్థము.

చెప్పిన 'ఇది నాది; ఇది నాది గాదు' అని సాధువుల యేర్పాటు కలుగదు. పాపము బలీయముగా నున్నపుడు మనుష్యులకు భార్యయుఁ బశువులును బొలమును గృహమును గలుగనేరవు. పాపమును వారింపనియెడ దేవతలు పూజల నెఱుంగలేరు; పితరులు శ్రాద్ధములఁ దెలియఁజాలరు. అతిథులు పూజల నందఁగలుగదు. పాపము వారింపనపుడు బ్రాహ్మణులు వ్రతము లూఁది వేదముల నధిగమింపరు; యాగములు గావింపరు. మహారాజా! పాపమును వారింపనపుడు మనుష్యుల మనసులు వధ్యులయిన ప్రాణులమనంబులుం బోలెఁ గలగుండుపడుచుండును. కాఁబట్టి మును లుభయలోకములను నుద్దేశించి 'వీఁడందఱ ప్రాణులయందును గొప్పవాఁడై ధర్మస్వరూపుఁడై యుండుఁగాక' యని రాజును గారవించిరి. ఎవనియందు ధర్మము వెలుంగునో వానిని రాజుగాఁ జెప్పుదురు. ఎవనియందు ధర్మము నశించుచున్నదో వానిని దేవతలు వృషలునిఁగాఁ జెప్పుదురు. మహనీయమగు ధర్మమునకు 'వృష' మనియుఁ బేరుగలదు. దానికి 'లయ'ము (నాశము) కావించువాఁడు వృషలుఁ డనఁబడును. కాఁబట్టి ధర్మమునకు లోపముగలిగింపరాదు. ధర్మము వర్ధిల్లఁగా సకలప్రాణులును నెప్పుడును వర్ధిలుచుండును. అది నశింపఁగా నన్నియు నశించుచున్నవి. కాఁబట్టి ధర్మము నెప్పుడును బెంచుచుండవలయును. ధనములను బెంచుటవలననో లేక (లోకములను) ధరించుటవలననో ధర్మమని చెప్పఁబడుట నిశ్చయము. రాజా! అధర్మము మనుష్యులకు * (నరకము) నెల్లను నంతము నొందించునదిగాఁ

* 'మానవానాం మనుష్యేన్ద్ర స సీమా న్తకరః స్మృతః' అనిమూలము. అది మనుష్యుల దుష్టకృత్యములనెల్ల సాఁగనీయనిది. (ప్రతాప).

జెప్పఁబడుచున్నది. (అనఁగా ధర్మముగల వఱకు స్వర్గము. లేని చో నరకమని చెప్పఁబడుచున్నది.) బ్రహ్మ ప్రాణులపెంపునకుఁ గాను ధర్మమును సృజించెను. కాన ప్రజల ననుగ్రహించు నిమిత్తమై ధర్మమును మిక్కిలియు వృద్ధినొందింపవలయును. రాజశార్దూలా! కాఁబట్టియే ధర్మము మిక్కిలి శ్రేష్ఠమయి నదిగాఁ జెప్పఁబడుచున్నది. ఎవఁడు మంచికార్యముల నాచరించుచుఁ బ్రజలను బరిపాలించునో వాఁడే రాజు. కామక్రోధముల నెంతమాత్రమును బాలింపక ధర్మమునే పరిపాలింపవలయును. రాజులకు ధర్మమే శ్రేయస్కరము లయినవానిలో నెల్ల మిన్నయైనది. ధర్మమునకుఁ బుట్టుచోటు బ్రాహ్మణుఁడు; కాఁబట్టి, వారల నెప్పుడును బూజించుచుండవలయును. మాంధాతా! బ్రాహ్మణులు కోరినకోర్కులను నసూయలేక చేయవలయును. వారలు కోరినది చేయకపోవుటవలన రాజులకు భయముప్పతిలుచున్నది; మఱియు మిత్రులును వృద్ధినొందక పోవుటయే కాక శత్రువులు నగుదురు. విరోచనుని పుత్రుఁ డయిన బలి బాల్యము మొదలుగా నెప్పుడును బ్రాహ్మణులయం దసూయగలిగియుండెను. పిదప నతనియందుఁ గల (ప్రతాప)లక్ష్మి యెంతయుఁ గుపితయై యతనినుండి తొలఁగిపోయినది. అట్లు తొలఁగి యది యింద్రునికడకుఁ బోయినది. అంత నా బలి యింద్రునియందున్నలక్ష్మిని జూచి మిక్కిలియు మనంబున ననుతాపపడెను. అసూయకును నభిమానమునకును ఫల మిదియే. కాఁబట్టి ప్రతాపసంపన్న యగులక్ష్మి నిన్ను దిగవిడువకుండునట్లు తెలియుము. అహంకారము లక్ష్మికి నధర్మమువలనఁ గలిగిన పుత్రుఁడని శ్రుతి ప్రతిపాదించుచున్నది. రాజా! ఆయహంకారము

వలనఁ బెక్కండ్రు దేవతలు నసురులును నాశము నొందింపఁ బడిరి. అట్లే పెక్కండ్రు రాజర్షులును నాశమునొందిరని యెఱుంగుము. అయ్యహంకారమును జయించినవాఁడు రాజగును. దానిచే జయింపఁబడినవాఁడు దాసుఁడగును. మాంధాతా! చిరకాలము తిరముగా నుండఁ గోరుదువేని యహంకారముతోఁ గూడిన యధర్మము ననుసరించి పోకుండునట్లు మెలఁగుము. మదముగలవాఁడును బరాకుగలవాఁడును దెలివిలేని పసివాఁడును బిచ్చివాఁడును విశేషించి నిందితుఁడైనవాఁడును దురాచారము గలవాఁడును శత్రులను సేవించువాఁడును, నిగ్రహింపఁబడినయమాత్యుఁడును, విశేషించి స్త్రీలును, బర్వతమును, విషమమయినదుర్గము, నేనుఁగును, గుఱ్ఱమును, సర్పమునను డీనితోడ నెప్పుడును జేరిక లేకుండవలయును. రాత్రులయందుఁ దిమ్మరఁగూడదు మిక్కిలిపేరాసయు నభిమానమును డంభమునుఁగ్రోధమును దిగవిడువవలయును. తెలియని స్త్రీలతోడను, పెడిపడఁతులతోడను, అంకుటాండ్రతోడను, బరులయిల్లాండ్రతోడను, బెండ్లాడని కన్యలతోడను సంభోగముగూడదు. రాజెప్పుడుపాపమును వారింపక పాలుమాలిక గలిగియుండునో యపుడు వర్ణముల సంకరము గలుగును. దాని వలనఁ బాపులగు రాక్షసులును, నపుంసకులును, నంగహీనులును, మూఁగలును, మూఢులును, మఱియుఁ దక్కినవారును బుట్టుదురు. కాఁబట్టి రాజు విశేషించి ప్రజలహితమందు వర్తింపవలయును. రాజు పరాకు గలిగి యుండెనా ప్రబలదోషము కలుగును. ప్రజలకు వర్ణసంకరము కలిగించునట్టి యధర్మములు మిక్కిలి పెరుఁగును. చలిలేని కాలమందుఁ జలి కలుగును. చలి వలసిన సమయమందుఁ జలికలుగదు. అనావృష్టియు, అతివృ

ష్టియు, నొప్పులును, బ్రజలను బీడించును. ఇట్టి కాలములందు (ధూమకేతువు మొదలయిన) నక్షత్రములును గూరగ్రహము లును దోచును. రాజు నాశమునకుఁ గారణములయిన యుత్పా తములు పెక్కులిందుఁ గనుపట్టును. ఏరాజు తన్నును రక్షించు కొనక ప్రజలను రక్షింపక పోవునో యతని ప్రజలు నాశమునొం దుదురు. పిదప నతఁడును నాశమునొందును. ఒకనిధనమును నిరువురును, నిరువురధనమును దక్కిన పెక్కండ్రును గొట్టి దోఁ చుకొందురు. కొమిరెపడఁతులను జెఱుపుదురు. అది రాజు దోషమువలనఁ గలిగినదని చెప్పుదురు. రాజు, ధర్మమును దిగ విడిచి పరాకునఁ బ్రవర్తించినపుడు మనుష్యులయందు 'ఇది నాది' యని వస్తువుల సొంత మడుగంటుచున్నది' ఇది తొంబది యవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ఉచథ్య మాంధాతృ సంవాదము.

'పర్జన్యుఁడు కాలమందువర్షించు నేనియు రాజు ధర్మము నాచ రించు నేనియు, మిక్కిలి సంపత్తి పెంపుగలిగి, ప్రజలను సుఖం బునందు నోలాడఁబోషించుచుండును. వస్త్రములందున్నముఱికిని, దాని చాయను బోఁగొట్టకయే తీయనేరని చాఁకలివాఁడు చాఁ కలివాఁడేకాఁడు. బ్రాహ్మణశ్రేష్ఠులయందును క్షత్రియులందును వైశ్యులందును నాలుగవవారగు శూద్రులందును నెవఁడొకఁడు తనతనధర్మములను దిగవిడిచి తాఱుమాఱుగ నానాకర్మము లందు వర్తించుచుండునో వాఁడు నాచాఁకలివంటి వాఁడేఁ

యగును. శూద్రునకు నూడిగమును వైశ్యునకుఁ గృషియు, క్షత్రియునకు దండనీతియు, బ్రాహ్మణులకు బ్రహ్మచర్యమును, తపమును మంత్రములును సత్యమును ధర్మమగును. ఏక్షత్రియుఁడు, పాత్రములకు శుద్ధిచేయునట్లు, వారల శీలమందుఁ గలదోషములను బోఁగొట్టనేర్చునో, యట్టిరాజు జనులకుఁ బతియుఁ దండ్రియు నగును. కృత, త్రేత, ద్వాపర, కలి యనెడి యివియన్నియు రాజు నడవడులే. రాజే యుగమని చెప్పఁబడుచున్నాఁడు. రాజు ప్రమాదము నొందునపుడు నాలుగువర్ణములును, నట్లే వేదములును, నాలుగాశ్రమములును నన్నియును విశేషించి మోహామునొందును. రాజు పరాకు పడియున్నయెడల మూఁడగ్నులును మూఁడువేదములును దక్షిణలతోడి యాగములును నన్నియుఁ దెలియఁబడకపోవును. రాజు ప్రాణులకుగర్త. రాజేప్రాణులకు నాశకుఁడు. ధర్మాత్ముఁడగువాఁడుకర్తయు, నధర్మాత్ముఁడు నాశకుఁడు నగుదురు. రాజు ప్రమాదముగలవాఁడగునేని రాజు భార్యలును బుత్రులును బంధువులును సుహృదులును నందఱును గూడిశోకము నొందుదురు. రాజధర్మవర్తనముగలిగియుండెనేని, యేనుఁగులును, గుఱ్ఱములును, బశువులును, లొట్టియలును గంచరగాడిదలును, గాడిదలును, దక్కిన సకలప్రాణులును దుఃఖమునొందును. మాంధాతా! బలము దుర్బలులను రక్షించుటకై బ్రహ్మదేవునిచే సృజింపఁబడినదని చెప్పఁబడుచున్నది. బలములేనిదే మిక్కిలియుఁ

---

* ఏవమేతద్ద్విజేంద్రాణాం క్షత్రియాణాం విశాంతథా, శూద్రశ్చతుర్థో వర్ణానాం నానాకర్మస్వవస్థితః' అని మూలము. ఆమూఁడువర్ణములందు నెవఁడు తన ధర్మములనువిడిచి నానాకర్మములు చేయునో వాఁడు శూద్రుఁడగును. (ప్రతాప)

పెద్ద. అందులకై యన్నియు నెలకొనియున్నవి. రాజా! రా, జః ధర్మమునందు వర్తించునేని, యాప్రాణిని బోషించువాఁడును నాపోషకుని కులమం దుదయించినవారును నందఱును శోకము నొందుదురు. బలము లేనివాఁడు, ముని, సర్పము, ననెడివీని కను దృష్టిని సహించుట మిగులఁగటువు. బలము లేనివానిపొంతకుఁ బోకుము. బలము లేనివారి నెప్పుడుగాని యవమానింపరాదని తలంపుము. దుర్బలులకన్నులు నిన్ను బంధుసహితముగా దహింపకుండుఁ గాత. దుర్బలులచే దగ్ధుఁడయిన వాని కుల మందు నొకటియు మొలవదు. వారు వేరుతోడఁ గాల్చివైతురు. దుర్బలులదగ్గఱకుఁ బోకుమా. బలమునకంటె బలములేమి మిక్కిలియుఁ బెద్దది. అది యధికబలముగల బలము. దుర్బలు లచేఁ గాల్పఁబడిన బలమునం దించుకయు మిగులదు. అవమా నింపఁబడిన వాఁడును, కొట్టఁబడినవాఁడును,క స్తిపెట్టఁబడిన వాఁ డును, గాచువానిని బొందక పోయినయెడ నాదేశమందలిరాజును దైవకృత మయినదండము చంపును. నాయనా! బలమందున్న నీవు బలము లేని జనులవలనఁ గప్పము దీయఁ గోరకుము. అగ్ని దాపటివానిని గాల్చునట్లు, దుర్బలులకన్నులు నిన్నుఁ గాల్ప కుండుఁగాక. లేని యపరాధము మోపఁబడినవా రేడువఁగాఁ గ్రిందఁబడు వారి కన్నీటిబొట్లు, లేని యపరాధమునువారియందు మోపినట్టివారిపుత్రులను బశువులను జంపును. తనయం దది ఫ లింపక పోయినచోఁ దనపుత్రులయందును, లేనిచో, పౌత్రుల యందును, వారల పుత్రులయందును నది ఫలించును. చేసిన పాపకర్మము పశువుంబోలెఁ దోడనే ఫలముచూపదు. ఒక దేశ మందు దుర్బలుఁ డయినవాఁడు కొట్టుపడి కాచు దిక్కునొందక

పోవునేని, యాదేశమందు దైవకృతమును క్రూరమునయిన పెనుదండము సంభవించును. దేశమందుఁ గలవారు యుక్తిగల వారై బ్రాహ్మణులవలె సన్న్యాసివేషములతో మాటిమాటికి భిక్ష యెత్తునపుడు వారు రాజును జంపువారగుదురు. రాజు దేశమందు రాజును సంబంధించిన పెక్కండ్రు పురుషు లెప్పుడు నీతిమాలి నడచుకొందురో యప్పుడది రాజునకుఁ గొప్పపాపమగును. రాజు నధికారులు జనులు దీనులయి బతిమాలుకొనుచున్నను వాటింపక కామమువలనఁగాని, ధనమునకు లోనయి కాని, యుక్తితోడ ధనములను దీయుదు రేని యది రాజునకుఁ బెద్దకీడగును. గొప్పమ్రాను, మొదటఁబుట్టి యంతటఁ బెద్దదిగాఁ బెరుఁగుచున్నది. దానిని బెక్కులు ప్రాణులువచ్చి యాశ్రయించుచున్నవి. అయినను దానిని నఱికి కాల్చివైచినపుడు దాని నాశ్రయించియున్నవానికి నునికిపట్టు లేక పోవుచున్నవి. ఒక రాజ్యమందలి ప్రజలు ముఖ్యము లయినధర్మముల నాచరించుచు దేశ సంస్కారములనో రాజు గుణములనో గొనియాడుచు నుందురేని యారాజు వృద్ధినొందును. పాపమును దొలఁగును. అట్లు గాక యందలి ప్రజలు ధర్మమును దెలియక యధర్మము నాచరింతురేని పుణ్యము వేగ తొలఁగిపోవును; పాపమును వచ్చును. పాపులెందు బాహాటముగాఁ (దప్పులకును దగిన దండనములేక) గ్రుమ్మఱుదురో యాదేశములందలి రాజులనును బరిపాలకులనును గలి పొందును. ఏదేశమందు రాజు తనశక్తిచే జనులనడఁచి పాలింపఁడో యాదేశము వృద్ధినొందదు. ఏరాజు తగురీతిని నమాత్యులను సమ్మానించి మంత్రాలోచనమందును యుద్ధమందును నుపయోగించునో యతనిరాజ్యము వృద్ధినొందును. అతఁడును,

భూమి నంతయును జిరకాల మనుభవించును. మంచికార్యములను, మంచివచనములను గనుఁగొని యెంతయు గారవించు నట్టిరా జుత్తమమయిన ధర్మమునొందును. పంచికుడుచుటయు, పరుల నవమానింప కుండుటయు, గర్వించియున్న బలవంతునిఁ గొట్టుటయు, రాజునకు ధర్మ మని చెప్పఁబడుచున్నవి. వాక్కుచేతను శరీరముచేతను మనస్సుచేతను నన్నిఁటిని రక్షించుటయు, నిందులకు విరోధియగునేని పుత్రునయినను సహింపకుండుటయు, రాజునకు ధర్మమని చెప్పఁబడును. రా జెప్పుడు బలము లేని మనుష్యులకు దానమొసంగి భుజించునో యపుడు వారు బలవంతులగుదురు. అదిరాజునకు ధర్మమనిచెప్పఁబడును. రాజ్యములను రక్షించుటయు, దొంగలఁ దఱుమఁ గొట్టుటయు, యుద్ధమందు జయించుటయు, రాజధర్మ మని చెప్పఁబడును. కార్యములచేతను మాటలచేతను బ్రియుఁడుగా నుండినను బాప మాచరించు నట్టివానిని నోర్వకుండుట రాజునకు ధర్మమని చెప్పఁబడును. కన్న పుత్రులవలె వర్తకులను రక్షించుటయు, మర్యాదను భేదింపకుండుటయు రాజునకు ధర్మమని చెప్పఁబడును. కామద్వేషములను గయికొనక, శ్రద్ధగలిగి, యాప్తదక్షిణలతోడ యాగములు చేయుట రాజునకు ధర్మమని చెప్పఁబడును. పేదవారలయు దిక్కుమాలినవారలయు వృద్ధులయుఁ గన్నీటిని దుడుచుటయు, మనుష్యులకు సంతసముగలిగించుటయు రాజునకు ధర్మమని చెప్పఁబడును. మిత్రులను వృద్ధినొందించుటయు, నల్లె శత్రువులను డిందుపడ నీడ్చుటయు, సాధువులను బెన్నఁగాఁ బూజించుటయును రాజధర్మమని చెప్పఁబడును. సత్యమును రక్షించుటయుఁ, బ్రేమతోడ భూమి

దానములు సేయుటయు, నతిథులను బూజించుటయు, భృత్యుల నాదరించుటయు రాజుధర్మమని చెప్పఁబడును. నిగ్రహానుగ్రహములు రెండును నెవనియందు నెలకొని యుండునో యూరాజిహామందును బరమందును ఫలమునొందును. మాంధాతా! రాజు యముఁడే యగును. అతఁడు ధార్మికులకెల్లఁ బరమేశ్వరుఁడు.*ప్రాణులనడంచువాఁడు యమునివలె నగును; అడంపనివాఁడగ్నికి సాటియగును. ఋత్విజునిని, పురోహితునిని, ఆచార్యునిని, నవమానింపక, సత్కరించి రాఁబట్టుకొనుట రాజునకు ధర్మమగును. యముఁడు సకలములయిన ప్రాణులను, భేదము లేక యడంచుచున్నాఁడు. అట్లె రాజును నడంపవలయును. రాజు సర్వవిధముల నింద్రునితోడఁ బోల్పఁబడుచున్నాఁడు. ఎవఁడు దేనిని ధర్మముగాఁ దలఁచుచుఁ గనుఁగొనుచున్నాఁడో యది ధర్మము. నీవు పరాకువడక యోర్పును, బుద్ధియును, ధైర్యమును † దెలివియుఁ గలుచుకొనుము. సమస్తజనుల బలమును దుర్బలమును గలరూపునఁ దెలియఁగోరుము. మంచిసెబ్బరలను వివేచింప నేర్చుకొనుము. సమస్తప్రాణులయెడఁ గలుపుఁగోలుతనముగలిగి, దానములుచేయుచుఁ దియ్యనిపలుకు లాడవలయును. పురజనులను దేశజనులను కన్నబిడ్డలవలెఁ రక్షింపవలయును. సమర్థుఁడుగాని రాజు ప్రజలను నొకప్పుడును రక్షింప

---

* 'సంయచ్ఛన్ యమవత్ప్రాణా నసంయచ్ఛంస్తు పావకః' అని మూలము. ఇంద్రియముల నడంచుటవలన గొప్ప పెంపునొందును. అడంపమివలనఁ బాపమునొందును. ఇందులకు 'సంయచ్ఛన్ భవతి (వృద్ధిం ప్రాప్నోతి) ప్రాణా న సంయచ్ఛంస్తు పాతికః' అని కో. మూలమును దదర్థమును దెలియునది.

† 'మతిమ్' అని దా. మూ. 'రతిమ్' అని కో. మూలము.

శక్తుఁడు గానేరఁడు. రాజ్యమనెడి భారము మోయుట మిక్కిలియు నెక్కువయైనది. ప్రాజ్ఞుఁడును శూరుఁడును దండశాస్త్రవిదుండు నగు రాజొక్కఁడే దానిని రక్షింపఁజాలును. చులుకఁదనమును బుద్ధియును లేక దండశాస్త్రము నెఱుంగకయు నుండునట్టిరాజు రాజ్యభారమును వహింప నెంతమాత్రము దగఁడు. మంచి చక్కఁదనము గలిగి, గొప్పకులమునఁ బుట్టినవారును, సమర్థులును, దనయందు భక్తిగలవారును, మిక్కిలి చదువరులును నగు మంత్రులతోఁగూడి, మనుష్యుల మనసులను, నాశ్రమములం దున్న తాపసులగు వారి తలంపులను గార్యములను సయితము స్వబుద్ధిచేఁ బరిశీలించు చుండవలయును. ఇట్లు నడచుకొనుటవలన సమస్తవర్ణములవారి ధర్మములను దెలియఁ శక్తుఁడ వగుదువు. నీవు స్వదేశమందుండినను బరదేశమందుండినను, నీధర్మములను నాచరించుట కిది తోడ్పడును. ధర్మార్థకామములు మూఁటియందును ధర్మమే యుత్కృష్టమైనది. ఈ లోకమందును బరలోకమందును ధర్మాత్ముఁడే సుఖంబున వర్ధిలుచున్నాఁడు మనుష్యులను నీవు చక్కఁగాఁ బూజించితివేని వారా పూజనమునుబట్టి నీకొఱకై తమభార్యలను బుత్రులనును దిగవిడుతురు. సజ్జనులను జేరఁబెట్టుకొనుట, జనుల మంచిగా నాదరించుట, దానము, తియ్యనిపలుకులు, ప్రమాదము లేకుండుట, శౌచము, ననెడి యివి రాజున కెంతయు సంపద గలిగించును. మాంధాతా! ఈగుణములవలన నెప్పుడును బరాకుపడకుము. రాజేమఱుపాటు లేక తనఛిద్రములను బరుల ఛిద్రములను బాటించుచుండవలయును. తనఛిద్రమును బరులకుఁ దెలియనీయరాదు. పరులయందు ఛిద్రమునుజూచి పైఁబడవలయును. ఈవిధమున నే

యింద్రుఁడును, యముఁడును, వరుణుఁడును వర్తించిరి. రాజర్షులెల్ల వారును నడచుకొన్న విధము ననుష్ఠింపుము. పురుషసత్తమా! దివ్యంబగు మార్గమును శీఘ్రముగఁ గయికొనుము. ధర్మమందు వర్తించినరాజును నిహమందును బరమందును దేవతలును ఋషులును గంధర్వులును నెంతయుఁ దేజంబు దొలంకునట్లు కీర్తింతురు' అనెను.

ఉచథ్యుఁ డిట్లు చెప్పఁగా మాంధాత శంక లేక యట్లు చేయుచు నచ్చెను. తానొక్కండును భూమిని బడసెను రాజా! మాంధాతవలె నీవు నట్లే చక్కఁగా ధర్మము నాచరించి భూమిని బరిపాలింపుము. స్వర్గమునందు స్థానము నొందుదువు' అనెను.
ఇది తొంబదియొకఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వామదేవ సుమనస్సంవాదము.

ధర్మరాజు 'పితామహా! రాజధర్మమునందే ప్రవర్తింపఁగోరు వాఁ డెట్లు నడచుకొనవలయును? ని న్నడిగెదను. నాకది చెప్పుము' అనెను.

భీష్ముఁడు 'ఈ విషయమందును సమస్తార్థముల స్వరూపమును గనుఁగొన్న బుద్ధిమంతుఁ డగు వామదేవుఁడు పాడిన పురాతనమయినయీ యితిహాసము నుదాహరించెదరు. వసుమనుండను రాజుండెను. అతఁడు కోసలదేశమునకు రాజు; బలవంతుఁడును బరిశుద్ధుఁడును, అతఁడు తపస్సంపన్నుం డగు వామదేవమహర్షి ని జూచి 'మహాత్మా! నేనెట్టి నడవడిగలిగియుండినచో

స్వధర్మమునుండి జాఱకుందునో ధర్మార్థయుక్తంబులగు వచనంబుల నాకు నుపదేశింపుము ' అని యడిగెను. అందుల కాతపస్వి వామదేవుఁడు బంగరుఛాయఁ దుఱంగలించుచు నహుషకుమారుండయిన యయాతివలె సుఖాసీనుం డయి యున్న యారాజుతో నిట్లనియె.

వామదేవుఁడు:— 'ధర్మమునే యనువర్తించు చుండుము. ధర్మమునకంటె నెక్కుడయినది మఱొక్కటిలేదు. రాజులు, ధర్మమునందుఁ దప్పక నెలకొన్నట్టివారే యీభూమిని జయించుచున్నారు. ఏరాజు ధనసిద్ధికంటెను ధర్మమునే యెక్కుడుగాఁదలఁచి దానిని వృద్ధినొందించుటయందు బుద్ధినుంచునో యతఁడు ధర్మముచేఁ బ్రకాశించుచున్నాఁడు. ఏరాజు ధర్మమును బాటింపక బలాత్కారముతో మాత్రము ప్రవర్తించునో వానివలననుండి ధర్మమును నర్థమును రెండును వేగ తొలఁగిపోవును.దుష్టుఁడును బాపాత్ముఁడు నగుమంత్రి చెప్పినచొప్పున వర్తించురాజు ధర్మమును నాశముసేయును గాన, యట్టివాఁడు లోకులకు సపరివారముగా వధ్యుఁడగును ; వాఁడు శీఘ్రముగానే నాశము నొందును.రాజకార్యములను జక్కఁగా ననుష్ఠింపలేనివాఁడును, విచ్చలవిడి వర్తించువాఁడును, దన్నుఁ దాను బొగడికొను వాఁడును నగు రాజు సమస్తభూమిని బడసినను శీఘ్రముగానే నశించును. శుభమును బడయఁగోరువాఁడై, యసూయలేక, జితేంద్రియుఁడై మతిమంతుఁడగురాజు నదీ ప్రవాహములవలన సముద్రముం బోలె వృద్ధినొందును. రాజా ! ధర్మమునందుఁ గాని, కామమందుఁగాని, అర్థమందుఁగాని, బుద్ధియందుఁగాని,

* మిత్రులందుఁగాని పూర్తినొందినట్లు తలంపరాదు. లనగాఁ వీని యన్నిటియందే లోకయాత్ర నెలకొనియున్నది. ఈ యుపదేశములను వినుటవలన రాజు, యశమును గీర్తిని సంపదను బ్రజలను బడయుచున్నాఁడు.ధర్మమునందుఁ బూనికగలిగి, ధర్మమును నర్థమునుబడయుటకై జింతించుచు, నొక్కొక కార్యమును జక్కఁగా వానిఫలాదుల నాలోచించిన పిదపఁ జేయ నారంభించునట్టిరాజు మిక్కిలియు సంపదను బొందును. ఈవి లేనివాఁడును, జెలిమిలేనివాఁడును, బ్రజలను దండనీతిచొప్పున మెలపనివాఁడును, సాహసప్రకృతియు నగు రాజు శీఘ్రముగా నశించును. బుద్ధిలేనివాఁడు తాను జేసినపాపమును బుద్ధిచేతఁ గనుఁగొనఁజాలఁడు.అట్టివాఁ డపకీర్తినొంది మరలనరకముఁ బొందును. † రాజయ్యోవారిని దగురీతిని సమ్మానించుచు, దానము లొసంగుచుఁ, డయ్యనిమాటలపస నెఱింగి పలుకుచు నుండునేని యతనికిఁ గలుగువ్యసనములను బ్రజలు తమకుఁ గలిగినవానింబోలె బోకార్ప నుంకించుచుందురు.ఎవనికి ధర్మములను దెలుపునట్టి గురుండు గలుగఁడో,యెవఁడు తక్కినవారినడుగఁడో, యెవఁడుధనములను గనుగొందకయె హాయిగాసంపాదింప నెంచునో, వాఁడు చిరకాలము సుఖమునొందఁడు.ధర్మములందు గురువును ముఖ్యునిఁగాఁగొని నడచువాఁడును, తనంతటఁ జక్కఁ గార్యములు

---

* 'మిత్రతః' అని. జొ. మూలము. 'మంత్రతః' అని దాక్షిణాత్య మూలము తెలియునది.

† 'అథ మానయితుర్దాతుః (దాతుః) శ్లక్ష్ణస్య రసవేదినః। వ్యసనం స్వామివోత్పన్నం విజిఘాంసంతి మానవాః' అని. జొ. మూలము. 'తతోనయాదితు ర్దాతుః శుక్లస్యరసవేదినః—విశవ ర్తినః' అని. దా. మూలములందలి పాఠము

చూచుకొనువాఁడును, లాభములను ధర్మమే ప్రధానముగా నుంచుకొని (అనఁగా నెంతమాత్రము ధర్మమును దప్పక) పొందువాఁడును, చిరకాలము సుఖ మనుభవించుచుండును.' ఇది తొంబదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము

వామదేవ సుమనస్సంవాదము.

వామదేవుఁడు 'బలవంతుఁడగురాజు దుర్బలుఁ డగు వానియం దధర్మముగా నడచుకొనునపుడు, వానివంశపువారును, నట్టి నడవడినే యనుసరింతురు. తక్కినవారును నట్టి పాపమును బ్రవర్తింపఁజేయుచున్న యారాజు ననువర్తింతురు. అవినీతుఁ డయిన యట్టిమనుష్యుని ననువర్తించుట రాజ్యమునకు శీఘ్రముగా నాశముగలిగించును. రాజు తనయుచితధర్మముల ననుష్ఠించుచుండునేని యతనినడవడిని సామాన్యముగా మనుష్యులందఱు నిదర్శకముగాఁగొని యనువర్తింతురు. రాజు ధర్మములనుండి జాఱి వర్తించినచో నతని సొంతజనులుగూడ దానిని సైఁపరు. శాస్త్రవిధులను బాటింపక సాహసప్రవృత్తిగలిగి మిట్టిపడి యుంచుక బాధకలిగించినను శీఘ్రముగనే నాశము నొందును. ఏక్షత్రియుఁడు జయించినట్టియు నపజితులయినట్టియు సద్వర్తనము గలట్టియు క్షత్రియు లాచరించుచు వచ్చిననడవడి ననువర్తింపఁడో వాఁడు క్షత్రధర్మమునుండి తొలఁగినవాఁ డగును. ముందుఁ దనకు మంచి చేసియున్నయొకశత్రురాజును యుద్ధమునఁబట్టుకొని, రాజట్టివానిని ద్వేషముచే యాని సమ్మానింపని

మొదల నతఁడు క్షత్రధర్మమునుండి తొలఁగును. రాజు తనశక్తి నెఱపవలయును; మిక్కిలి సుఖముగా నుబుసుపుచ్చ వలయును; ఆపదలనుండుద్ధరింపవలయును. అట్టివాఁడు సమస్త జనులకును బ్రియుండగును. ఐశ్వర్యమునుండియు భ్రంశమునొందఁడు. నీవొక నికి నప్రియ మాచరించితివేని మరల సమయము వచ్చినపుడు వానికిఁ బ్రియమాచరింపవలయును. ఎవఁడు ప్రీతిలేని వానికిఁ బ్రియముగావించునో వాఁడు వానికిఁ ద్వరితముగాఁ బ్రియుఁడగును. అబద్ధ మాడరాదు. వేఁడకయే ప్రియము గావింపవలయును. కామమువలనను గ్రోధమువలనను ద్వేషమువలనను ధర్మమును దిగవిడువరాదు. తెలివిగలవాఁడు వంచనలేక వర్తింపవలయును. సత్యము, దమము, ధర్మము, శీలమును, బ్రజలకు హితమయిన క్షత్రధర్మములు. కాన వీనిని విడువరాదు. ప్రశ్నము లడుగునపుడు బదులు చెప్పుటకు లజ్జపడరాదు. అవమానకరములయిన మాటలాడఁగూడదు. తొందరపాటును నసూయయు లేకుండవలయును. అట్లుండినచోఁ బరుఁడు తనకు వశగతుఁడగును. ప్రియునియందతిమాత్రము హర్షము నొందరాదు. అప్రియునియందుఁ దుందుడుకు పడరాదు. ప్రజలహితమును దలపోసి వారలకై ధనములు వెచ్చింపవలసిన సంకటములు కలిగినపుడు తపింపరాదు. ఏరాజు మంచిగుణములచేత నెప్పుడును బ్రియము గావించుచుండునో, యతఁడు చేయుకార్యములన్నియు సిద్ధి నొందును. అతనిని సంపదయు వీడదు. అధిపతికిఁ బ్రతికూలములయిన వాని నెంతయువదలి యతనికిఁ బ్రియములయిన వానినే కావించుచు నతనిభక్తి గలిగియుండునట్టి పురుషుని రాజెంతయు నాదరింపవలయును. ఇది సజ్జనులనడవడి. ఇంద్రియములను విచ్చల

విడిని విడువక గెలిచి, తన్నెంతయు ననుసరించుచు శుచియై శక్తుఁడై యనురక్తుఁడునై యుండుమనుజుని రాజు గొప్పకార్యములందు నియోగింపవలయును. శ్రేయస్సునకు లక్షణమయిన పరాక్రమ మెవనియందుఁ గనుపట్టునో ఎవఁడు కీర్తిముఖ్యముగాఁ గలవాఁడో, ప్రతిజ్ఞ నెవఁడు తప్పఁడో, సమర్థుల నెవఁడు పూజించుచు వారిని మచ్చరికింపకుండునో యట్టివానిని, ఇట్టిగుణములు గలిగి రాజును రంజించుచు భర్తకార్యములందుఁ బరాకుపడక వర్తించుచుండు నట్టిపురుషుని, ధనకార్యములందు నియోగింపవలయును. మూర్ఖుఁడును, నింద్రియలోలుఁడును, లుబ్ధుఁడును, అఘాజ్యం బగు నడవడిగలవాఁడును, గూఢవిప్రియుఁడును. బరీక్షయందుఁ దేలనివాఁడును, హింసాశీలుఁడును, దుర్బుద్ధియుఁ, జదువురానివాఁడును, బెద్దఱికము లేనివాఁడును, ద్రాగుబోతును, జూదమునందును స్త్రీలయందును వేఁటయందును నాసక్తుఁడయిన వాఁడును నగు మనుష్యుని గొప్పకార్యమందు నియోగించినచో రాజుసంపదలు బాయును. తన్ను మొదల రక్షించుకొనుచుఁ, బిదప రక్షింపఁదగినవారిని రక్షించునట్టిరాజునకుఁ గలప్రజ లందఱును వృద్ధినొందుదురు. దానిచే నతనికి సుఖము మిక్కిలియుఁ గలుగును. రాజు తనకు సుహృదు లయినవారికిని బరులకును దెలియనివా రగు చారులచేత నితరులగు రాజుల పోకలనెల్లను బరికించుచుండవలయును. దానివలన రాజునకుఁ జెఱుపేదియుఁ గలుగకుండును. బలవంతుఁడగువానికి నపకారముచేసి వైచి దవ్వుల నున్నానని యూరడిలి యుండరాదు. వార లేమఱిపాటున నున్నపుడు డేగలు పైపడునట్లు పడుదురు. రాజు మిక్కిలి గట్టిగా వేరూని, తనబలముకొలఁది తెలిసి, బుద్ధి పొరఁబడక

తనకంటె బలహీనులగువారిని దలపడవలయును; కాని, బలీయుని(దలపడరాదు. ధర్మపరాయణుం డగు రాజు పరాక్రమమున భూమినిబడసి ప్రజలను ధర్మంబున(బాలించి యుద్ధంబున మరణము గావించుకొనవలయును. ఈ జగమందలి యొక్కొక్కటియు(దుదిని మరణమునకు(బాలయినది. ఇందేదియు(గీడునొందనిది లేదు; సతిముగాదు. కా(బట్టి ధర్మమందు(దప్పక వర్తించునట్టి రాజు ప్రజలను ధర్మంబున(బాలింపవలయును. రక్షించుటకు(బట్టులయిన కోటలును, యుద్ధమును, ధర్మమును బాలించుటయు, రాజకార్య విచారమును, సమయంబున(బ్రజలకు సుఖముగూర్చుటయు ననెడి యీయైదింటిచేతను భూమి వృద్ధినొందును.ఎవ(డీ యైదింటిని రక్షించునో వా(డే రాజు. రా జీయైదింటియందు నెప్పుడు నెడ తెగక వర్తించి చూచుకొనుచుండు నేని యీభూమిని నెప్పుడు ననుభవించును. వీని నెప్పుడును నొక్క(డే చూచుకొనుట యశక్యముగాదు. వీనియందాప్తులగువారిని బ్రతిష్ఠించి, రాజు చిరకాలము భూమిని బాలింపవచ్చును. దాతయు(, బంచికుడుచు నట్టివా(డును,మృదుస్వభావముగలవా(డును, బరిశుద్ధుండును, దనమనుష్యులను దిగవిడువని వా(డును నగుపురుషుని(బ్రజలు రాజుగా(జేసికొందురు. తన యభిప్రాయములను విడిచి మేలునకై యితరు లుపదేశించు తెలివి విషయములనువిని దాని నట్లె కైకొనునట్టిరాజునకు లోకమంతయు నడ(గి వర్తించును. ఎవ(డు తనకుహితమును గోరునట్టి పురుషు(డు చెప్పుమాటలును, అవి తనకు(బ్రతికూలముగా నుండుటవలన నెంతమాత్రము సై(పడో,మఱి తనకు(బ్రతికూలములయినవాని నెప్పుడును మనసున(బాటింపకవినునో, గొప్పవార లాచరించు

నదియు, నాపన్నులును స్వస్థులును నవలంబించునట్టిదియు నగు వర్తనమును నెప్పుడును సేవింపఁడో, వాఁడు క్షత్రధర్మమునుండి తొలఁగినవాఁడగును. (నిగ్రహింపఁబడిన యమాత్యుని వలనను, విశేషించి స్త్రీలవలనను, పర్వతమువలనను, విషమంబయిన దుర్గమువలనను, ఏనుఁగువలనను, గుఱ్ఱమువలనను, సర్పమువలనను, నెప్పుడు నెచ్చరిక గలిగి తన్నురక్షించు కొనవలయును.) ఎవఁడు ముఖ్యులయిన మంత్రులను విడిచి, హీనులయిన వారిని బ్రియులను గావించుకొనునో, యతఁడు వ్యసనములను బొంది * మంచిమార్గమునకు రానేరఁడు. శుభగుణములుగల జ్ఞాతులందు ద్వేషముచేఁ జూపోపనివాఁడై, మనసుదిట లేక, కోపము దృఢముగాఁ గలిగియుండువాఁడు మృత్యువుసమీపమున వసించుచున్నాఁడు. ఎవఁడు మిక్కిలి గుణవంతు లగువారిని దనహృదయమునకు నెంతయుఁ బ్రియులయినవా రయినను, బ్రేమ గడలుకొనఁదనకు వశగతులను గావించుకొనునో యతఁడు చిరకాలముయశము గలిగియుండును. అకాలమం దేపన్నులనుదీయరాదు. అప్రియమేదేని కలిగినను మనస్సునఁ దుందుడుకు పడరాదు. ప్రియముగలిగినను మితిమీఱియుబ్బరాదు. మంచికర్మములందెప్పుడును బూనికి గలిగి యుండవలయును. రాజులలో నాకెవ రనురక్తులు? ఎవరు నన్ను భయమునుబట్టి యాశ్రయించినట్టివారు? ఎవరు మధ్యస్థుల దోషముగలవారు? అని నీవు నిత్యము నాలోచించుచుండవలయును. నీవు బలవంతుఁడవుగా నున్నామని తలఁచి బలహీనుని యందొకప్పుడును నమ్మిక యుంపరాదు. ఈబలహీను లేమఱి

* 'సాధుమార్గం నవిన్దతి' అని దా. మూ. 'సిద్ధిమార్గం'అని ఔ. మూలము. తనపూనిన కార్యముల సిద్ధినెన్నఁడును బడయ నేరఁడని యర్థము.

యుండునపుడు డేగలవలె పై పడుదురు. సమస్తగుణసంపన్నుఁడును ప్రియవాదియు నగు నధిపతికిని బాపాత్ముఁడు ద్రోహము సేయఁజూచును ; కాఁబట్టి యట్టిమనుష్యుల నెంతమాత్రము నమ్మరాదు.* నహుషునిపుత్త్రుఁడగు యయాతి రాజనీతి రహస్యములను జెప్పినపుడు 'మనుష్యుల విషయమై యెంతయు నెచ్చరికతోఁ బాటుపడువాఁడు, ఇంద్రసహితు లయినశత్త్రువుల నయినను జంపఁగలఁడు' అనెను. ఇదితొంబదిమూడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వామదేవ వసుమన స్సంవాదము.

వామదేవుఁడు 'రాజు యుద్ధములేకయె జయమును గలిగించుకొనవలయును. యుద్ధముచేతఁ గలిగిన జయమును దక్కువయినదిగాఁ జెప్పెదరు. రాజు వేరుగట్టిగా నూనకుండునపుడు, తాను బొందకున్నవానిని (అనఁగా గ్రొత్తవానిని) బొందుటకుఁ గోరరాదు. మూలము దుర్బలముగా నున్నరాజునకు నేదేని పొందినను నది పైపైని కొనసాఁగి యుండ నేరదుసుమీ. ఎవ్వని దేశము మంచి సమృద్ధిగలిగి,సంపత్తియుఁగలిగి, ప్రియులును సంతుష్టులు నయినజనులును గలిగి, పెక్కండ్రు పెంపుగల మంత్రులతోఁ గూడి యుండునో యట్టిరాజే దృఢమయిన మూలముగలవాఁడు (వేరుగట్టిగా నూనినవాఁడు) అగును. † ఎవనియోధులు మిక్కిలి

---

* 'ఏతద్రాజోపనిషదం యయాతిః స్మాహ నాహుషః,మనుష్యవిషయే యుక్తో హన్తి శత్రూ న్సవాసవాన్' అని దా.మూలము. 'మనుష్యవిషయే యుక్తాం రాజక్షేమకరీం సదా' అని కొన్నిప్రతులు.

† 'యస్యయోధా స్సుసంతుష్టాః స్వనురక్తా స్సుపూజితాః, అల్పేనాపి స

సంతుష్టులై యెంతయు ననురక్తిగలిగి మిక్కిలియుఁ బూజితులునై యుందురో యట్టి రాజల్పపుదండముచేత నయినను భూమిని జయించును. * [ఎచ్చట దండము బలీయముగా నుండునో యచట సామమే ప్రయోగింపవలయును. భేదముచేయుట ముఖ్యమయిన యుద్దేశముగాఁ గలచో సామము(మంచిమాట) లాడుచుఁ గోరినది యిచ్చుట యెంతయుఁ గొనియాడఁబడును. రా జెప్పుడు సామదాన భేదములు మూఁడును విఫలములగుట చూచునో యపుడు తెలిపి తెలిసికొని ముందు వెనుకఁ జూడక దండమును బ్రయోగింపవలయును. ఒకశత్రువు మిక్కిలి బలీయులయిన శత్రులచేతఁ గ్రిందపఱుపఁ బడినపుడు వాని నుపేక్షింపవలయును. బలవంతులగువారికిఁ జంపఁదగినట్టి స్థితి(యుం దెదిరియుండుట)యే బలము. రా జెప్పుడు దుర్బలుఁడుగా నుండునో యపుడు † నాలుగింటికిని విరుద్ధము గాకుండున ట్లుపేక్ష గావింపవలయును. ఉపేక్ష యైదవయుపాయము. అది యన్నింటను మిక్కిలి బలవంతమయినది. కోసలపతీ! నీవు తత్త్వజ్ఞుండవు కాన భార్గవుండు పాడిన శ్లోకముల తత్త్వము నెఱింగి కలరూపున వానిని జేయవలయును. అవి యేవనఁగా 'ఏదేని యొకచోట రాక్ష

దండేన మహీంజయతి పార్థివః' అని దా. మూ. 'యస్యయోధాః సుసంతుష్టాః సాంత్వితాః సూపధాస్థితాః' అని ఔ. మూలము. ఎవనియోధులు, మిక్కిలి సంతుష్టులై, బుజ్జగింపఁబడి శత్రువులను వంచింప నేర్తురో యట్టివారనియర్థము.

[*] కుండలీకరణములోని పాఠము. దాక్షిణాత్యకోశములందే చూపట్టుచున్నదిగాని తక్కిన ప్రతులయందుఁ గానిపింపదు.

† సామము, దానము, భేదము, దండము, అని నాలు గుపాయములు. ఇచట 'ఉపేక్ష' యైదవయుపాయముగాఁ జెప్పఁబడినది.

మండు పిశాచముచేతఁ గొట్టఁబడునేని యా జోలికిఁ బోకుండ వలయును. * బలహీనులకుఁ బలుకకుండుటయే (మిన్నకుండు టయే) బలము. (బలవంతులకు మాటపడకుండుట బలము.)' అనుటయే. రాజా ! బలములేనివాఁడు శత్రువును శత్రువులను గొనియే పెకల్పవలయును. కాలియందలి ముల్లును జేతియందలి ముల్లు చేతనే యెత్తవలయును, గూఢవిప్రియులగు మంత్రుల యందును, మ్లేచ్ఛులయందును నుపాయముల లోపల నీయుపా యమే తగునని చెప్పఁబడుచున్నది. జాతిచేత నినుమును నిను ముచేత జాతినిని నాశముచేయవలయును. బిల్వకాయలను వేఱు బిల్వకాయలచేతను, మ్లేచ్ఛులను నితర మ్లేచ్ఛులచేతను నాశము చేయింపవలయును. మిక్కిలియు గర్వించియున్న దాసులకును నిదియే చేయువలయును. చండాల జాతులవారిని మ్లేచ్ఛజాతుల వారిని దండనుచేతనే వారింపవలయును. మఱుఁగున వంచించు నట్టివారికి దుష్టులను గొని ముందు చెప్పినదానిని చేయవల యును. ధర్మార్థకామ మోక్షముల నెడు చతుర్వర్గమునకు విరోధు లగు కడపటిజాతివారిని, శఠు లగుమంత్రులను, దుష్టబ్రాహ్మణులు మొదలగువారిని నుపాయము లయిదింటిచేతను సాధింపవలయు ను. ఏపీడయునొందక తనయందనురక్తులై రాష్ట్రమునకువలయు పనులను జేయుచు వినయపరులై యుండు పురజనులనును దేశజను లనును, రాష్ట్రమునకు విరోధులై వినయములేకుండు పౌరదేశ జనులనును,జండాలురను మ్లేచ్ఛులను బొమండులను స్వధర్మము

---

* 'వాచ్యతాంబలినాంబలమ్' అని దా. కోశమునందున్నది. ఇది యసంగత మగను అప్రకృతమగను నున్నది గాన 'అవాచ్యతాఽబలినాంబలమ్' అని యో 'అవాచ్యతా బలినాంబలమ్' అనియో పాఠము గ్రాహ్యము.

లాచరింపనివారిని బలవంతులను నాశ్రమములను గాయకు లను నర్తకులను నర్లై ప్రయత్నమున సాధింపవలయును.] ఎవని పురజనులును దేశజనులును భూతదయాళువులై ధనధాన్య సంప న్నులై యుందురో యట్టిరాజు దృఢం బగుమూలము గలవాఁడు. రాజు తన ప్రతాపము శత్రువునకుఁగల ప్రతాపముకంటె నధిక మయినదని యెప్పుడుతలఁచునో యపుడు మంచిబుద్ధినెరపి పరుని భూమిని ధనములను గయికొన నుంకింపవలయును. భోగములు పయిపయిని వర్ధిల్లు చున్నవాఁడును, భూతములందు దయగల వాఁడును,సోమరితనము లేక పనులయురవడిగలవాఁడును, తన్నుఁ దాను బదిలముగారక్షించుకొని యుండువాఁడు నగురాజు దేశము వృద్ధి నొందుచుండును. తనయెడలఁ జక్కటితో నర్తించుచున్న తన జనులయెడఁ గపటముగా వర్తించునట్టి రాజు గొడ్డలిచేత నడవి నఱకునట్లు తన్ను నఱకికొనుచున్నాఁడు. రాజు తనశత్రు వులను గొట్టుటకు నుంకింపఁడేని పగవారతనికిఁ దఱుఁగరు. ఏరాజు తనక్రోధమును జంపనెఱుంగునో యతనిని ద్వేషించు వారు గలుగరు. రాజు ప్రాజ్ఞుఁడగునేని యార్యజనులు ద్వేషించు నట్టి కార్యమును జేయఁడు; మఱి తనకేది మంగళకరమైన కా ర్యముగాఁ దలంచుచున్నాఁడో యందుఁ దన్నుఁ బురికొలుపవల యును. ఏరాజు తనకార్యము లన్నియును ముగించి సుఖముల ననుభవింపఁగోరునో యట్టివానిని బరు లవమానింపరు; తానును బరితాపము నొందఁడు. ఏరాజు మనుష్యులయెడ నిట్టినడవడి గలిగియుండునో యతఁ డుభయలోకములను జయించి జయము నందు నెలకొనుచున్నాఁడు" అనెను.

వామదేవుఁ డిట్లుచెప్పఁగా వినుమనసుఁ డ
యుఁ జేయుచువచ్చెను. నీవు నట్లుచేయఁగా
లనును జయింతువు. ఇందులకు సందేహము లేదు' అని
ఇది తొంబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధధర్మమును జెప్పుట.

ధర్మరాజు 'ఒకక్షత్రియుఁడు మఱియొక క్షత్రియుని యుద్ధమునందు జయింపఁగోరునేని, యట్లు జయించువిషయమున నతఁడు చేయవలసిన ధర్మమేమి ? అడిగెదను. నాకుఁ జెప్పుము' అనెను.

భీష్ముఁడు 'రాజు సహాయము గలవాఁడైనను లేనివాఁడైనను దాను జయింపఁగోరినరాజు రాష్ట్రమునకు వచ్చి 'నేను మీకు రాజను. మిమ్మెప్పుడును రక్షించుచుందును. ధర్మంబున నాకుఁ గప్పము గట్టుఁడు ? లేదా యుద్ధమున నన్నుఁ దలపడుఁడు' అని చెప్పవలయును. వారతనిని దమకు రాజుగా నంగీకరించిరేని యుద్ధమక్కఱలేదు. వారు క్షత్రియులు కానివారై మఱి విరోధమును జూపుదురేని యపుడు వారు తమకు విహితము కాని (క్షత్ర)కర్మములందు వర్తించుచుండుటంబట్టి సమస్తములయిన యుపాయములచేతను వారి నడంచిపుచ్చవలయును. పయినెత్తి వచ్చిన యాక్షత్రియుఁడు యాయుధమెత్తికొని (యుద్ధసన్నద్ధుఁడయి) యుండఁడేనియు, తన్నుఁ దాను రక్షించుకొనఁజాలఁడేనియు, శత్రువును మిక్కిలిగాఁ దలంచునేనియు, దక్కువవంశముల వారతనిపయి నాయుధముల నెత్తికొందురు' అనెను.

తామహా! క్షత్రియుం డయిన రాజు మఱియొక
ుఁ దలపడిపోవు నేని తానెట్లు మించి పోరాడవల
దాని నాకుఁ జెప్పుము' అని యడిగెను. అందులకు భీష్ముఁడు
'సన్నాహము లేనివాఁడును గవచము లేనివాఁడును నగు నొక క్షత్రియుని యుద్ధమునఁ దలపడరాదు. తా నొక్కఁడును నొంటి వానిని దలపడి 'నీవు బాణము విడువుము. నేనును విడిచెదను' అని తెలుపవలయును. వాఁడు సన్నాహముతోఁ గూడవచ్చు నేని పిదపఁ దానును సన్నాహముతోడ నుండవలయును. వాఁడు సేనలతోఁ గూడ వచ్చు నేని తానును సేనలఁ గూడి వానిని బిలువవలయును. వాఁడు గపటముగా యుద్ధము సేయు నేని, దానును గపటముగా నెదిరించి పోరవలయును. అట్లుగాక ధర్మంబున యుద్ధము సేయు నేని, ధర్మంబుననే వారింపవలయును. రథికుని గుఱ్ఱము నెక్కి తలపడరాదు. రథికునితో రథ మెక్కియే యెదురవలయును. ఆపత్సమయమందుఁ గొట్టరాదు. భయపడినవానిని జయింపఁబడిన వానిని గొట్టరాదు. విషముపూసిన బాణములను, కర్ణిబాణములను వేయరాదు. ఇవియ సత్పురుషుల కాయుధములు. యథావిధిగానే యుద్ధము చేయవలయును. కొట్టఁ దివిరినవానిని గోపింపరాదు. యుద్ధముల నొక్కనికి నేనుఁగుండఁగా మఱియొక్కనికి నేనుఁగు లేకుండు నేని, కాల్బం టేనుఁగు నెక్కినవానితోడ యుద్ధము సేయరాదు. ఏనుఁగుచేత నేనుఁగుతోడఁ దలపడవలయును. ఒక సమయమునఁ జక్కఁగా నలవడిన గుఱ్ఱముతోను యుద్ధము చేయవచ్చును. దివ్యాస్త్ర బలము గలవాఁడు, తా నిష్టపడినట్లు, గజముమీఁదను, భూమియందును, సమస్థలమందును, దేరియందును, గుఱ్ఱము నెక్కియు, నెప్పుడును యుద్ధము చేయ

వచ్చును. రాజా ! రామునకును రావణునకును జరిగిన యుద్ధమందు, వానరులును మహాభాగుండగు లక్ష్మణుఁడును నట్లె విభీషణుఁడును బదాతులుగా నుండిరి. రావణుని యంతకాలమందు, దురాచారుఁడును బాపకారియు నగువానిని రాముఁ డింద్రునిరథము నారోహించి చంపెను. దివ్యాస్త్రబలసంపన్నులగు వారియందు నివియన్నియు విధింపఁబడుచున్నవి. ఇది దేవాసురు లందఱియందును బూర్వులు గాంచిరి. బలము లేనివానిని, బుత్రులు లేనివానిని, ఆయుధము విఱిగినవానిని. ఆపదనొందినవానిని, అల్లెత్రాడు తెగినవానిని, వాహనము పోయినవానిని, నెట్లును జంపరాదు. రా జాపదగలవానిని దనదేశమునకుఁ బంపి చికిత్సచేయవలయును. లేనిచో వాని నిల్లుచేరునట్లు చేయవలయును. గాయము లాఱినపిదప వానిని విడిపింపవలయును. ఇది సనాతనమయిన ధర్మము; కాఁబట్టి ధర్మముచొప్పున యుద్ధము చేయవలయునని స్వాయంభువమనువు చెప్పెను. సాధువుల ధర్మము సాధువులందు నెలకొనియుండును. దానిని బొంది నశింపకుండునట్లు చేయవలయును. ధర్మమునందు నిష్ఠగలక్షత్రియుఁ డెవఁ డధర్మంబున జయమునొందునో వాఁడు పాపాత్ముఁడు. వాని బ్రతు కవమానింపఁదగినది. అట్టివాఁడు తన్నుఁ దనచేతనే చంపుకొనుచున్నాఁడు. మంచివారిని జెడుమార్గముల గెలుచుట దుష్టులవృత్తి. ధర్మంబునఁ గలుగుమరణము మేలయినది. పాపకర్మమువలనఁ గలుగు జయము మేలయినది గానేరదు. రాజా! అధర్మమును జేసినయెడల నది పశువుంబోలెఁ దోడనే ఫలమొసంగదు. అది తన్నుఁజేసినవానిని వేళ్లతోను గొమ్మలతోను దహించి ముంచును. పాపి యగువాఁడు పాపకర్మములచేత ధన

మును బడసి యెంతయు సంతసించును. వాఁడాపాపముచేత నే పయిపయిని వృద్ధినొందుచు దానియందు మిక్కిలి తగులు గలిగియుండును. మఱియు ధర్మమనునదియే లేదని తలంచుచుఁ బరిశుద్ధు లగువారి నపహసించుచుండును. ధర్మమందు నమ్మిక యెంతమాత్రము లేక, తుదకు వినాశమునొందును.* వానిని దేవతలు వరుణపాశములఁ గట్టి యవమానింతురు. వాఁడు గాలి నింపిన వెనుతిత్తియుంబోలెఁ దన చేసినకార్యముచేత నే వృద్ధి నొందుచున్నాఁడు. అంత నదియొడ్డున నుండుమ్రాఁకుంబోలె వేరుతోఁగూడఁ బెకలి చెడుచున్నాఁడు. అంత ఱాతిమీఁదఁ గొట్టుపడి పగిలినకుండవలె వాఁడు చెడుటను జూచి జనులు వానిని నిందింతురు. కాఁబట్టి ధర్మంబున జయమును బొక్కసమును రాజు పొందఁ గోరవలయును. ఇది తొంబదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు జయలక్షణములను మఱియుఁ గొన్ని రాజధర్మములను జెప్పుట.)

భీష్ముఁడు 'రాజధర్మంబున భూమిని జయించుటకు, దానివలనఁ దాను భూమికంతయుఁ బతియగునేనియుఁ, గోరరాదు. అధర్మమున జయమును బొందిన యేరాజు ముదిమునఁ బొదలును? అధర్మంబునఁ గలిగినజయము సతముగా నుండదు;

---

* 'సబద్ధో వారుణైః పాశైరమర్త్యైరవమన్యతే' అని దా.మూ. అమర్త్యైః ఇవ మన్యతే. (జై. మూలము.) వరుణపాశములఁ గట్టుపడియుఁ దన్ను దేవతగాఁ దలఁచు ననుట.

మఱి స్వర్గమునకుఁ గారణమును గానేరదు. అది రాజునును భూమిని గీడ్పఱుచును. కవచము చినిఁగినవానిని, 'నీవాఁడ' నని పలుకుచున్న వానిని, అంజలిచేసినవానిని, ఆయుధము విడిచిన వానిని బట్టికొని హింసింపరాదు. రాజు, తన సైన్యముచేత నోడినవానితో మరలఁ దాను యుద్ధముసేయరాదు; కాని వాని నొకసంవత్సరము 'నీకు దాసుఁడ' నని చెప్పించుచు నడంపవలయును. అట్లు *పోఁడి వాఁడు మరలఁ బుట్టుక నొందినవాఁడగును. † పగవానియింట నొకకన్యను బరాక్రమంబున రాజు దెచ్చెనేని యాపడఁతిని సంవత్సరమునకు లోనుగా నెవరిని బెండ్లాడెద వని యడుగరాదు. సంవత్సరమునకుఁ బిదప నీ వెవరిని బెండ్లాడెదవు? 'నన్నా? మఱొక్కనినా?' యని యడిగి దాని యిష్టముచొప్పునఁ జేయవలయును. ఇట్లు బలవంతముగాఁ దెచ్చిన తక్కినధనముల (దాసులు మొదలగువారి) పట్లను నడచుకొనవలయును. (అనఁగా వారొల్లనియెడ మరల శత్రువునకే యొప్పింపవలయును.) ‡దొంగలు మొదలగు వధ్యులగువారిధనమును దీసి యుంచుకొనరాదు. దానిని వ్యయముచేసి పుచ్చవలయును. బ్రాహ్మణులు సాపరాధులగుదురేని వారిని క్షమింప

---

* వాఁడట్లు చెప్పినను జెప్పకపోయినను దాసత్వము నొందినవాఁడే యగును. కాన మఱియొక పుట్టుక పుట్టినట్లేయగును. ఒక సంవత్సరమునకుఁ బిదప వానిని విడిచిపుచ్చవలయునని నీలకంఠులు.

† 'నాసంవత్సరాత్కన్యా ప్రష్టవ్యా విక్రమాహృతా' అని మూలము. 'నచసంవత్సరంకన్యాః స్ప్రష్టవ్యాః సహసాహృతాః' అని పాఠాంతరము. బలిమిని దెచ్చినకన్యలను సంవత్సరము వఱకు ముట్టరాదని యర్థము.

‡ 'నతు వధ్యే ధనం తిష్ఠేత్పిబేయు ర్బ్రాహ్మణాః పయః, యుఞ్జీరన్నప్య

వలయును. వారు తమపశువులపాలను ద్రాగనీయవచ్చును. ఎద్దులను నుపయోగించుకొన నీయవచ్చును. క్షత్రియునితోడ క్షత్రియుడే యుద్ధముచేయందగునని ధర్మము విధింపఁబడియున్నది. క్షత్రియుఁడు గానివాఁడు క్షత్రియుని గుఱించి యేవిధమున నాయుధమును వైవరాదు. రెండుసేనలును యుద్ధము సేయుటకుఁ దారసించి నిలిచియున్నపు డుభయపక్షములకును క్షేమమును గోరి బ్రాహ్మణుఁడు నడుమఁజొచ్చునేని యపుడు యుద్ధముచేయరాదు. అట్లు బ్రాహ్మణుని నతిక్రమించినవాఁడు (అనఁగా నతనిని జంపినవాఁడును గాయపఱిచినవాఁడును) శాశ్వతం బగుమర్యాదను భేదించినవాఁ డగును. క్షత్రియుఁడు మర్యాదనుమీఱి నడచునేని వాఁ డధముఁడగును. ఇంతేకాక ధర్మమునకు లోపముగలిగించి మర్యాదను బోకార్చునట్టి క్షత్రియుఁడు క్షత్రియజాతిలో గణింపఁ దగినవాఁడుగాఁడు. మఱి సంఘమునందును గయికొనఁదగినవాఁడు గాఁడు. జయింపఁగోరునట్టిరా జట్టినడవడి ననువర్తింపరాదు. ధర్మముచేతఁ బడయు జయమునకంటె మఱి పెద్దలాభము వేఱేమి గలదు? లోఁబఱుచుకొన్నయొక రాజ్యమందుఁ గోపమునఁ జెంగలించునట్టివారలను జాగుసేయక మంచిమాటలచేతను వలయుభోగముల నొసంగుటచేతను గలంక దేర్చి శీఘ్రముగా వశపఱచుకొనవలయును. ఇది రాజులకుఁ

వధుహాః క్షన్తవ్యంవా పునర్భవేత్' అని మూలము. 'శత్రువుఁనుండి తెచ్చిన గోవులను బ్రాహ్మణులకిచ్చి వారు దానిపాలను ద్రాగునట్లు చేయవలయును. అట్లు తెచ్చినయెడ్లను దున్నుట మొదలగుపనుల కుపయోగించుకొనవచ్చును. లేదా శత్రువునకే మరల నిచ్చిపుచ్చవచ్చును' అని ప్రతాపచంద్రరాయలు. ఈ శ్లోకపాదముల యర్థము మిక్కిలి క్లిష్టముగానున్నది.

పరమమయిన నీతి. ఇట్లు గాక వారలకు వలయుభోగముల నొసంగక యడఁచి యేలినచో వారు రాజ్యమును దిగవిడిచి, తమ్ము గెలిచినవాని శత్రువులను గొలుచుచు, వానికి వ్యసనములు గుంపులుగా వచ్చుట యెదురుచూచుచుందురు. అట్టి రాజువలనఁ దుష్టినొందనివా రతని వ్యసనముల కువ్విళ్లూరుచు నతని కాపద వచ్చినపుడు సర్వవిధముల నతని శత్రువుల పక్షము చేపట్టుదురు. *శత్రువును మోసముపన్ని వంచింపరాదు; ఏవిధమునను (కూలు నట్లు) మిక్కుటముగాఁ గొట్టరాదు. ఏలనఁగా నట్లుబిట్టుగాఁగొట్టిన మొదల నతఁడొకవేళఁ బ్రాణములను దిగవిడిచినను విడుచును. †అల్పాపరాధము సేయఁబడినవానికిఁ గొంతధనమిచ్చినను సంతుష్టి నొందకపోవును. అట్టివాఁడు కందు లేని బ్రతుకే గొప్పగా భావించును; కాని నిందితమయిన (అనఁగా రాజుచే నవమానమొందిన) బ్రతుకును నట్లు భావింపఁడు. ఏరాజుదేశము పెంపుసొంపారుచు, ధనవంతమై, రాజునందుఁ బ్రీతిగల జనులుగలిగి, భృత్యులును మంత్రులు సంతుష్టులై యుండ వెలయునో, యట్టి రాజు గట్టిగా వేరూనినవాఁడగును. ఏరాజు ఋత్విజులును బురోహితులును నాచార్యులును మఱియుఁ బూజ్యులును

---

* ఇచ్చట—'మోసముపన్ని యుద్ధము చేయరాదు. ఒకవేళ చేసినను శత్రువును జచ్చునట్లు గొట్టరాదు. ధర్మయుద్ధమునఁ జంపవచ్చును గాని యధర్మమునఁ జంపుట పాప'మని భావము.

† 'అల్పేనాపిచ సంయుక్త స్తుష్యతే నాపరాధితః, శుద్ధం జీవితమే వాపి తాదృశో బహుమన్యతే' అని దా. మూల. 'అల్పేనా...తుష్యత్యేవ నరాధిపః...' అని శౌ. మూలము. ఇందర్థము క్లిష్టము. మఱి పూర్వోత్తరసంబద్ధమును గాకున్నది గాన యీపాఠము త్యాజ్యము.

మిక్కిలి చదువరులునయినతక్కినవారును బూజితులై యుం
దురో యట్టిరాజు లోకజ్ఞుం డనఁబడును. ఇట్టినడవడిచేతనే
యింద్రుఁడు లోకాధిపత్యమును బడసెను. * ఇట్టి నడవడి
చేతనే భూమియందలివారును నింద్రపదవి నొందఁగోరుదురు.
ప్రతర్దనుఁ డనురాజు తనశత్రులను మహాయుద్ధమున జయించి,
వారిధనమును ధాన్యములతోడను, ఔషధులతోడను గయి
కొనెనుగాని నాభూమినిమాత్రము గయికొనఁడయ్యెను. † రాజ
గుదివోదాసుఁడు నష్టశత్రువులను గెలిచినపిదప వారి యగ్ని
హోత్రశేషములను, అందులకయిన హవిస్సులను, వారియాహా
రములను దీసికొనెను; కావుననే యతఁడు తనజయమువలన ఫల
ము నొందక వంచితుఁడయ్యెను. రాజగు నాభాగుఁడు (శత్రువు
లను గెలిచినపిదప) తాను గొన్నరాజ్యములందలి శ్రోత్రియుల
సొమ్ములను దాపసులధనములను దప్పఁ దక్కిన రాజ్యము
లను, వానిరాజులతోఁగూడ దక్షిణలుగా నొసంగిపుచ్చెను.
ధర్మరాజా! ధర్మజ్ఞులయిన తొల్లింటిరాజుల ‡ నడవడి యెంతయు
గొప్పదిగానున్నది. అదియెల్ల నాకు మిక్కిలి యిష్టముగానున్నది.

---

* 'అనేన చేంద్రవిషయం విజిగీషన్తి పార్థివాః' అని ఔ. మూలము. 'అన్యేపి చైవం విజయం విజిగీషన్తి పార్థివాః' అని దా. మూ. తక్కినరాజులును జయముఁ బడయఁగోరెదరని యర్థము

† ప్రతర్దనుఁడును గొననర్హమయినదానిని గొనుటచేఁ బాపమొందఁడయ్యె ననియు, దివోదాసుఁడు గొనరానివానినిగూడఁ గొనుటచే విజయమువలని ఫలము నొందక పోయెననియు భావము.

‡ 'వృత్తాని' అని ఔ. మూలము. 'విత్తాని' అని పెక్కుప్రతులపాఠము. ఇదియంత యుపపన్నముగాదు.

తనకై శ్వర్యమును గోరునట్టిరాజు జయమును సమస్తము లయిన విద్యలపెంపుచేతఁ బడయఁగోరవలయునుగాని మాయ పన్నికాని డంభమునెరపికాని పడయఁగోరరాదు'' అనెను.
ఇది తొంబదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు క్షత్రియులు యుద్ధనుసేయుట ధర్మమగునని నిరూపించుట.}

ధర్మరాజు 'భరతసత్తమా! క్షత్రియధర్మముకంటె మిక్కిలి పాపమయిన ధర్మము మఱియొక్కటి లేదు. రాజు దండెత్తిపోయి నపుడును యుద్ధము సేయునపుడును, బెక్కండ్రజనులను జంపుచున్నాఁడు. రాజేకర్మముచేసినచో నట్టిదోషమువీడి మంచిలోకములను జయించును? నే నిది తెలియ నువ్విళ్లూరుచున్నాఁడను గాన నాకుఁ జెప్పుము' అనెను.

భీష్ముఁడు—'పాపులను నిగ్రహించుటచేతను, సాధువుల నాదరించుటచేతను, యజ్ఞములచేతను, దానములచేతను, రాజులుదోషములు వీడి నిర్మలులగుదురు. రాజులు జయమునుగోరునపుడందుల కై పెక్కులు ప్రాణులను బీడించుచున్నారనుట నిజమే; కాని వారే జయమును బడిసినపిదప మరలఁ బ్రజలను వృద్ధిఁబొందించుచున్నారు. దానము, యాగము, తపము ననెడి వీనిఫలముల చేతఁ బాపములను దొలఁగఁ ద్రోసికొందురు. * ప్రాణులను రక్షించుట

---

* 'అనుగ్రహేణభూతానామ్' అని దా. మూలము. 'అనుగ్రహాయభూతానామ్' అని కుం. మూ. 'ప్రాణులను రక్షించుకొఱకై వీరలకుఁ బుణ్యము పెరుఁగుచున్నది' అని యర్థము.

చేత వీరలకుఁ బుణ్యమెంతయు వర్ధిలుచున్నది. పొలమును జక్కఁబెట్టువాఁడు పయిరుతోఁ జేరిన పులుగడ్డిని నాశము సేయుచున్నాఁడుగాని దానివలన ధాన్యపుఁబయిరు నశింపదు. అట్లె యాయుధములను వైచువారు వధింపఁదగువారిని బెక్కండ్రను జంపెదరు. కాని మరలఁ దక్కినవారిని వృద్ధినొందించుటయె దానికిఁ బరిహారమగుచున్నది. ఎవఁడు ప్రాణుల ననర్థమునుండియు, వధమునుండియుఁ, గష్టముల నుండియు రక్షించునో, వాఁడట్లు దొంగలవలన నుండి కాచి ప్రాణముల నొసఁగుటవలన ధనమును సుఖమును నొసంగు *బ్రహ్మ యగుచున్నాఁడు. ఆరాజు, అభయదానమే దక్షిణలుగా యాగములనెల్ల యజించి యిహమునందు శుభములనెల్ల ననుభవించి పిదప నింద్రునితోడి సాలోక్యము నొందుచున్నాఁడు. †బ్రాహ్మణుల ప్రయోజనముకొఱకై యుద్ధము చేయవలసిరాఁగా నందులకై రాజు తాను వెలువడి తన దేహమునే యూపముగా (యజ్ఞస్తంభముగా) నాఁటి భయము లేక బాణములుగొని శత్రువుల పయిఁ గురియించునేని, యట్లుచేయుయుద్ధ మపారమయిన దక్షిణలతోఁ గూడినయజ్ఞమగుచున్నది. దేవతలు నంతకన్న నెక్కుడయినట్టి వస్తువును భూమియం దొక్కటినేని చూడఁజాలరు. యుద్ధమందు, వానితోలి నెన్ని యాయుధములు భేదించునో యన్ని యక్షయలోకములను, సకలకామములను బిదుకు

---

* 'విరాట్' అనిమూలము. ఆహారమునొసంగువాఁడని ప్రతాపచంద్ర రాయలు.

† 'బ్రాహ్మణార్థే సముత్పన్నే యోఽభినిష్పత్య యుధ్యతి' అని దా. మూ. యోఽరిభిః స్పృశ్యయుధ్యతి' అని (ఔ.మూ.)

నట్టివానిని, వాఁడు పొందును. యుద్ధమునందు వాని దేహమునుండి తొరఁగురక్తముతోఁగూడనే వాని పాపములన్నియుఁ దొలఁగు చున్నవి. ప్రాణములు పోవుకాలమున దుఃఖములను సహించుట కంటెఁ బెద్దతపము లేదని ధర్మవిదులు తెలుపుచున్నారు. ధర్మబుద్ధి గల పురుషులు, యుద్ధమందు భయపడినవారు, పర్జన్యునివలననుండి జలమును గోరునట్లు, శూరునివలననుండి రక్షణమునుగోరి పిఱుంద నుందురు. * శూరులగువారలెల్ల భయము లేకుండునట్లు క్షేమముగా రక్షించి యాపురుషులను యుద్ధమందు ముందు నిలువనీయక తామే నిలుతురేని వారికెంతయుఁ బుణ్యమగును. ఆపిఱికివాండ్రు శూరుఁడు చేసిన కార్యమును గౌరవించి వాని నెప్పుడును బూజింతురేని యుక్తమును న్యాయమును గావించిన

---

* 'యదిశూరం స్తథా క్షేమే ప్రతిరక్షేద్యథాభయే। ప్రతిరూపం జనం కుర్యాన్న చతద్వర్తతే తథా॥ యదితే కృత మాజ్ఞాయ సమస్కుర్యుస్స దైవతిమ్। యుక్తం న్యాయ్యంచ కుర్యుస్తే, నను తద్వర్తతే తథా' అనిమూలము. ఈపాఠము నీలకంఠాది వ్యాఖ్యాతలు గ్రహించినది. ఇందు రెండవశ్లోకమున 'నచతద్వర్తతేతథా' అనుటకు 'అట్లు చేయరేని వారాభయమునుండి విడిపడఁజాలరు.' అని ప్రతాపచంద్రరాయలు. రెండవశ్లోకమునకు 'యుక్తం న్యాయ్యంచ కుర్యుః' అనుచో 'యుద్ధంన్యాయ్యంచ కుర్యుః' అని పాఠముగొని 'ఆపిఱికివారాశూరుఁడు చేసినది యెంతయు గౌరవించి యతని నెప్పుడును బూజించుచు న్యాయమునుచొప్పున యుద్ధము చేసిరేనియుం నది వాని కట్లు పుణ్యము గాదు' అని యర్థము మఱియొకరు వ్రాసియున్నారు. ఈ యర్థములు 'నచతద్వర్తతేతథా' అను రెండుపట్టులయందును క్లిష్టముగానే యున్నది. దాక్షిణాత్యకోశములందు 'యదిశూరం తథా క్షేమే ప్రతిక్షేరన్యథాభయే। ప్రతిరూపంజనాః కుర్యుర్నచ తద్వర్తతేతథా...' అని యున్నది. ఆపిఱికిజనులు శూరుని భయకాలమందుంబోలె క్షేమకాలమందును నెదురుచూచి గారవింతురేని

వారగుదురు. అట్లుచేయనిచో వారి కట్లు పుణ్యముగలుగదు. మనుష్యులందఱును బయికి సమానులుగాఁ జూపట్టుదురుగాని లోపల మిక్కిలియుఁ దారతమ్యముగలదు. యుద్ధమునందు సేనలొండొంటిని దలపడి బిట్టుచప్పుడు చెలరేఁగునప్పుడు కొందఱు వీరులు సేనల మార్కొనిపోదురు. శూరుఁడు, సేనలు దార్కొని పోరాడుచుండఁగా స్వర్గమార్గమును బాటించి తానను మార్కొనును. పిఱికిపంద, విషమమైన సమయమునఁ దనతోడి వారిని దిగవిడిచి పరుగువాఱును, అట్టి యధర్మపురుషులు నీవంశమునఁ బుట్టకుందురుగాక. సహాయులను యుద్ధమున దిగవిడిచి యంగములు గాయపడక కుశలముగా నింటికిఁ బరుగిడిపోవునట్టివారికి నింద్రుఁడు మొదలగు దేవతలశుభములు గావింతురు. ఎవ్వఁడు తనసహాయులను దిగవిడిచి తనప్రాణములను రక్షించుకొనుటకుఁ జూచునో యట్టివానిని గఱ్ఱలతోఁగాని ఱాలతోఁగాని కొట్టిచంపవలయును; లేక గడ్డిచాపలను జుట్టి కాల్చివేయవలయును. క్షత్రియులందిట్టివారెవరేనియుండినచో వారిని బశువులవలెఁ బట్టి చంపవలయును (అనఁగా నాయుధము మొదలచేతఁ జిత్రవధముగాఁ జంపవలయును) క్షత్రియుఁ డగువానికిఁ బడుకమీఁదఁ

వారు తగిన ప్రతిచేసినవారగుదురు. కాని యట్లుజరుగుటలేదు. వారిగోశూరులు చేసిన దానిని గనుఁగొని యుంచులకెప్పుడును నతనినిబూజింతురే, దాము నట్లు భయమువిడి న్యాయముచొప్పున యుద్ధము చేయుదురేని, అది న్యాయ్యమగును. కాని యట్లుజరుగుటలేదు' అని యుద్ధముచేసినచో మఱింత యుపపన్నముగాఁ దోఁచెడిని. ఇది పూర్వమందు భీతులు శూరుని శరణుఁజొచ్చుటకును వెనుక పురుషుల తారతమ్యమును జెప్పుటకును నడుమనుండుట సంబద్ధముగా నున్నది.

బరుండి, కఫము గ్రక్కుచు, మూత్రము విడుచుచు, దీనముగాఁ బలవించుచును, మరణమునొందుట యెంతయు నధర్మము. క్షత్రియుఁడు గాయములు పడని దేహముతో మరణమునొందు నేని యాకర్మమును బురాణవిదు లగువారు గొనియాడరు. నాయనా! క్షత్రియులకు నింటియందు మరణమెంతమాత్రము తగినదిగాదు. వారు శూరులు. శూరత్వములేని కార్యము వారి కెంతయు నీచమును నధర్మము నగును. రోగమునందు నొకఁడు 'అయ్యో! ఇదేమి సంకటమువచ్చినది! ఏమిదుఃఖమిది! నేనెంతోపాపిని' యని యంగలార్చుట వినఁబడుచున్నది రోగి, ముఖమంతయు కలఁగినలఁగి, చెడ్డకంపు గొట్టుచు. పుత్త్రులు దన్నుఁజూచి శోకించునట్లు చేయుచున్నాఁడు. అట్టివాఁ డారోగ్యముగలవారి స్థితికి నువ్విళ్లూరుచు బాధపడఁజాలక నూటికి మరణము గోరుచున్నాఁడు. వీరుఁడును గర్వితుఁడును గొప్పమనస్సుగలవాఁడును నగుపురుషుఁ డిట్టిమరణమున కెంతమాత్ర మర్హుఁడు గాఁడు. క్షత్రియుఁ డగువాఁడు తన సుహృదులచేఁ బరివేష్టితుండై యుద్ధములందుఁ బగఱ నఱుమాడి సుహృదు లెంతయుఁ బూజించుచుండ, మిక్కిలి వాఁడియగు శస్త్రములచేత గంట్లుపడి మృత్యువు నొందుట యెంతయుఁదగును. శూరుండు మనస్సు తెంపును రోషమును బయికొనఁగా మైమఱచి బెట్టిదముగా యుద్ధము చేయునుగాన యపుడు శత్రువులు తనయవయవములను గంట్లు పఱచుచున్నను దెలియఁడు. అతఁడు యుద్ధమందు మరణముఁ బొంది మిక్కిలి ప్రశస్తమైనదియు లోకులచేతఁ బూజితమైనదియు నగు స్వధర్మమును నవ్వారిగాఁబడసి యింద్రునితోడి సాలోక్యమునొందును. శూరుఁడెంతమాత్రమును బగవానికి వెన్నుఁ

జూపక సమస్తములయినయుపాయములచేతను యుద్ధాగ్రమందు నిలిచి ప్రాణములువిడిచి యింద్రునితోడి సాలోక్యమునొందును. శత్రువులు చుట్టుముట్టికొనియుండఁగా శూరుఁ డెచ్చటెచ్చటనేని గొట్టువడి దైన్యము చూపక మరణము నొందునేని యక్షయములగు లోకములను బొందును' అనెను. ఇది తొంబదియేడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

(ఇంద్రుఁడు సుదేవచరిత్రమును యుద్ధయజ్ఞమందలి ఋత్విగాదియంగములను యుద్ధమృతులకుఁ గలుగులోకములను నంబరీషునకుఁ జెప్పుట.)

ధర్మరాజు 'పితామహా! వెనుదీయక యుద్ధముచేయుచు శూరులు మరణము నొందిరేని వారికేలోకములు గలుగును? నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'ఈవిషయమందు నంబరీషునకును నింద్రునికిని సంవాదమనెడి పురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదను. నాభాగునిపుత్త్రుఁ డయినయంబరీషుఁడు మిక్కిలి దుర్లభంబయిన స్వర్గమునకుఁ బోయి యాదేవలోకమందుఁ దన సేనాపతి యింద్రునితోను మంత్రులతోనుగూడి దేజము లెల్లను మిక్కిలియు రాజిల్లుచుండఁగాఁ జూచెను. ఆసేనాపతి దివ్యంబగు రూపంబున మేటివిమానమందు వసించి మఱియుఁ బయిపయి స్థానములకుఁ బోవుచుండెను. ఇట్లు పయిపయి స్థానములకుఁ బోవుచున్న సుదేవుం డనెడిసేనాపతి పెంపుసొంపును జూచి గొప్పమతి యగునంబరీషుఁ డాశ్చర్యపడి యింద్రునిఁ జూచి

'వాసవా! సముద్రము పొలిమేరగాఁ గలభూతలమునంతయు యథావిధిని బరిపాలించితిని. ధర్మమునుగోరి చతుర్వర్ణములయం దును శాస్త్రోక్తప్రకారమునఁ బ్రవర్తించితిని, కడిఁది బ్రహ్మ చర్యమునను గొప్పయాచారమునను గురుశుశ్రూషను ధర్మం బునను వేదముల నధిగమించి రాజశాస్త్రమును బూర్ణముగఁ గఱ చితిని. అతిథుల నన్నపానములచేతను, పితరులను శ్రాద్ధముల చేతను, ఋషులను వేదాధ్యయనదీక్షలచేతను, దేవతలను నుత్త మంబయిన యజ్ఞములచేతను. దృప్తినొందించితిని. క్షత్రధర్మము ను యథాశాస్త్రముగను విధ్యుక్తముగను నాచరించితిని. సేన నా కంటఁబడెనా వెనుదీయక నూర్కొని యుద్ధమున దానినిజయిం తును. నే నిట్టివాఁడను. దేవేంద్రా! ఈనుదేవుఁడు తొల్లి నాకుసేనా పతిగా నుండెను. మఱియు మేటియోధ; మిక్కిలిశాంతాత్ముఁడు గను నుండెను ఆయినను నితఁడు నన్నే కారణమున నతిశయిం చెను? ఇతఁడు సూర్యబింబో లె వెలుఁగుచున్న విమానమెక్కి దేవలోకమున ముదంబునఁ బొదలుచున్నాఁడు. ఇతఁడు మేటి యజ్ఞములను యజించినవాఁడునుగాఁడు. బ్రాహ్మణులను విధ్యు క్తముగాఁ దృప్తినొందించినవాఁడును గాఁడు. ఇట్టి పీఁడు సకల దేవతలకును నెంతయు దుర్లభమయిన యిటువంటి యైశ్వర్య మునుబడసి యిట్టి నన్నెట్లతిశయింపఁ గలిగెను?' అనియడిగెను.

ఇంద్రుఁడు *('రాజా! వీఁడుచేసిన కార్యము నీకుఁ బ్రత్యక్ష మయినదే! మున్ను నీవు ధర్మంబున భూమిని జక్కఁగాఁ బాలిం చుచుండుటవలన, నీ కహితముగావించు శత్రువులందఱును జయిం

---

* ఈకుండలీకరణములోని పాఠము దాక్షిణాత్యప్రతులందే కానిపించు చున్నది.

పఁబడిరి. నీవొకప్పుడు యజ్ఞముసేయుచుంటివి. అట్టిశుభకాలమున శతశృంగుఁడను రాక్షసుని పుత్రులు సంయముఁడు, వియముఁడు సుయముఁడనుముగ్వురురాక్షసులను, యుద్ధమందెంతయుఁ బోతరించి జయింప నలవిగాక యుండినట్టివారిని, జయించితివి. నీవు దేవతలకు హితముసేయఁగోరి యశ్వమేధమనెడిమహాయాగమును జేయుచుండఁగా నీకు విఘ్నము సేయఁగోరి యాముగ్వురు రాక్షసులును నూఱుకోట్ల పరివారముగల మహారాక్షససైన్యమును గొని వచ్చిరి. అంత నీప్రజలందఱును జెఱఁబెట్టంబడిరి. నీప్రజలందఱును సైనికులందఱును విహ్వలు లయిరి. రాజా! అక్కాలమందు సుదేవుఁడు నీకు సేనాపతిగా నుండెను. వానిని నీవు మంత్రుల మాటవిని సమస్తకార్యములనుండియుఁ దొలంగించి యుంటివి. అప్పుడు నీ వామంత్రుల కపటవచనములు విని జయింపనలవిగాని రాక్షసులను జంపుటకై యాసుదేవునితో 'రాక్షససైన్యమును గెలువక నీవు మరలిరాఁగూడదు; చెఱఁబెట్టఁబడిన వారిని విడిపింపకయు మరలఁగూడదు' అని చెప్పి సకలసైన్యములం గూర్చి పంపితివి. రాజా! సుదేవుఁ డామాటవిని పయనమై ప్రజలు చెఱఁబెట్టఁబడిన చోటికిఁబోయెను. ఆసేనాపతి ఘోరమయిన రాక్షసమహాసైన్యమునుజూచి 'ఈసైన్యమును దేవాసురు లింద్రునితోఁ గూడివచ్చినను గెలువఁజాలరు. దివ్యాస్త్రబలమెంతయుఁగల యంబరీషునివంటివాఁడు నీసేనయందలి పదునాఱవపాలినిఁగూడఁ గూల్పఁజాలఁడు. ఇఁక నాఁబోఁటివాఁడు గూల్చుట చెప్పనేల?' అని మిక్కిలియుఁ జింత నొందెను. అంత వాఁడు నీవు కపటులగు మంత్రు లందఱితోడను సమాత్యుల

తోడను గూడియున్న యెడకు సైన్యమునంతయు మరల్చి పంపెను. అంత వాఁడు జగత్పతియు వృషభధ్వజుండును శ్మశాన నిలయుండు నగుమహాదేవుని శివుని శరణుఁజొచ్చి స్తోత్రముచేసెను. అట్లు స్తుతించి యంత నాయుధముగొని తన తల నఱుకనుంకించెను. ఆదేవదేవుండు కరుణించి యాయుధముతోఁ గూడినవాని కుడిచేతిని బట్టుకొని వానినిజూచి 'పుత్రా! నీవేల యీ సాహసము చేయఁదలఁచితివి? నాకుఁ జెప్పు' మని యడుగఁగా నాసుదేవుఁడు తలనేల సోఁక మ్రొక్కి యమ్మహాదేవునితో 'దేవేశా! నా కిరాతుసస్సైన్యమును యుద్ధమున జయింప శక్యముగాకున్నది. కాఁబట్టి ప్రాణముల విడువనున్నాను. జగత్పతీ! మహాదేవా! ఆర్తుం డగునాకు దిక్కగుము. మహాదేవా! అంబరీష మహారాజు మంత్రిసహితుఁడై యాక్రోశంబున నాతో గెలువక కాని రాఁగూడదు' అని చెప్పెననెను. అట్లు మొగమువాంచి నేల పయింబడి యున్న మహాత్ముని సుదేవునిఁజూచి యాదేవుఁడు, ప్రాణిహితముగోరి గణములతోను విగ్రహాము(యుద్ధము)తోను గూడినదియు, రథగజ తురగములచేతఁ బరివృత మయినదియు దివ్యాస్త్రములచే నలంకృతమైనదియు నగుధను ర్వేదమును బిలిచి, మఱియుఁ ద్రిపురములను గెలుచుటకు సాధనమును మహాభాగ్యవంతము నయినరథమును, పినాకమనెడి వింటినిని, గ త్తిని, నసురులనెల్ల వారిని జంపినదియు భయంకరము నయిన యాంపాశుపతమహాస్త్రమును నొసంగి, 'సుదేవా! నీ వీరథంబు నం దుండఁగా దేవతలకును నసురులకును నిన్ను గెలువఁ దరముగాదు. నీవు మాయచేత మోహితుఁడవై భూమియం దడుగిడుట తగదు. నీవు రథమునందుండి దేవాసురుల నందఱను

గెలువఁగలవు. వేయిసూర్యుల కాంతిచేఁ దుఱఁగలించుచున్నది యీరథము. ఇట్టిరథమును రాక్షసులకును బిశాచులకును దేఱి చూచుటకే శక్యముగాదు; ఇఁక నీతోడ యుద్ధముసేయ నెట్లు శక్యమగును ?' అనెను. ఆసుదేవుఁడు రాక్షసుల నెల్లవారిని జయించి చెఱయం దున్నవారినెల్ల విడిపించి యారాక్షసులనం దఱ నుఱుమాడినపిదప విమనునితోడఁ దలపడి బాహుయుద్ధమున హతుఁడయ్యెను. విమనుఁడును గూల్పఁబడెను. నాయనా! ఆసుదేవునకు బరాక్రమించుటవలన యుద్ధమనెడి మిక్కిలి గొప్పయజ్ఞము గలిగెను. మఱి యుద్ధముసేయు నొక్కొక్కనికి నిట్లె గలుగుచున్నది. కవచముదొడిగి సేనాముఖమునకుఁ బోయి యుద్ధముసేయునట్టి యొక్కొకయోధుఁడును నాయజ్ఞమందు దీక్షితుఁ డగుచున్నాఁడు. అట్టివాఁడు యుద్ధయజ్ఞమున కధికారము గలవాఁడగుననుట నిశ్చయము' అనెను.

అంబరీషుఁడు 'ఆయజ్ఞమందు హవిస్సులెవ్వి ? ఆజ్యమెద్ది ? దక్షిణయేది ? ఎవ్వరు ఋత్విజులుగాఁ జెప్పఁబడుదురు ? శతక్రతూ ! ఇవి నాకుఁజెప్పుము' అని యడిగెను. అందులకింద్రుఁడు 'ఆయజ్ఞమందు నేనుఁగులు ఋత్విజులు; గుఱ్ఱము లధ్వర్యువులు; పగవారి మాంసములు హవిస్సులు; నెత్తు రాజ్యమని చెప్పఁబడును. నక్కలు, గ్రద్దలును, గాకులు ననుపక్షు లా యాగమందు సదస్యులు. ఇవి శేషించిన యాజ్యమును గుడుతురు; యాగమందలి హవిస్సును భుజింతురు. ఆయాగము చేయువానికిఁ దళతళమెఱయుచు వాఁడులై పదనుగావింపఁబడిన ప్రాసములు, తోమరములు, ఖడ్గములు శక్తులు, గొడ్డండ్రును స్రుక్కులగును. వింటినుండి వేగముగా నిగిడినదై వాఁడిగ్నై పరులదేహ

ములను భేదించునదై చక్కనై, చక్కఁగా దీటఁబడియుఁ దోడ యంబడియు, నున్న బాణము పెద్దస్రువ మగును. పులితోలి గవిసెన గలదియు, ఏనుఁగు దంతపుఁ బరుఁజు గలదియు నై, యేనుఁగు తొండములను నఱకునట్టి కత్తి యాయుద్ధమందు * స్ఫయ మగును. మొనలంట నుక్కుచేతఁ జేయంబడి నవియు వాఁడులునై తళతళ మెఱయుచుఁ, గీడంబడిన ప్రాసము, శక్తి, ఋష్టి, గొడ్డలి యనువీనివలని దెబ్బ యిచ్బధన మగును. యుద్ధమునందలి కోట్లవలన భూమియందు దొరుఁగు రక్తము, సర్వకామముల నొసంగునట్టిదియు సమృద్ధ మయినదియుఁగా హోతలు గావించుపూర్ణాహుతి యగును. యుద్ధపుమొన యందు 'నఱకు' 'చీల్చు' అని వినఁబడుశబ్దము యమునిరాకకుఁ గారణముగా సామగులుచేయు సామగానమగును. పగుల సేనాముఖ మాయాగమునకు † హవిర్ధానమగును. ఏనుఁగుల సమూహమును గుఱ్ఱముల సమూహమును, గవచధారుల సమూహమును నాయాగమందు ‡ శ్యేనచిత మనడియగ్ని యగును. ఇందు వేయిమంది పడినతోడనే రేఁగునట్టి మొండెము, ఎనిమిది యంచులుగలిగినచంద్రయూపస్తంభముగా నాశూరునకగును. అంకుసములోఁ బురికొల్పఁబడిన యేనుఁగుల ఘీంకారములు, § ఇడాహ్వానము లగును. రాజా ! నారిచప్పుడుతోఁగూడిన చేతి చప్పట్లు, వషట్కారమగును. ఆయుద్ధమందలి దుందుభివాద్యము

---

* స్ఫయమనఁగా యాగవేదికపయిని గీఁతలుగీచునట్టి మ్రానికఱ్ఱ.

† హవిర్ధానమనఁగా హవిస్సు పెట్టుచోటు.

‡ యాగమందు నగ్నినుంచుటకు డేగయాకారముగాఁ గట్టఁబడు మేడ.

§ ఒకవిధమయిన హవిస్సును వేల్చునపుడు దేవతలను బిలుచుట.

మూఁడుసామములయుద్గాత యగును. బ్రాహ్మణుల ధనమును
బగవా రపహరించునపుడు యుద్ధమందుఁ బ్రియమయిన దేహ
మును విడిచి దానిని యూపముగానాఁటి చేయునట్టి యాయాగ
మక్షయం బగుదక్షిణ గలదియగును, ఏశూరుఁడు భయంబునఁ
దిరుగుపడక యొడయనికొఱకు **సేనాముఖమున** నిలిచి వెలు
వడునో వానికి నాకలోకములవంటి లోకములు సిద్ధించుచున్నవి.
ఎవని యుద్ధవేదిక పులితోలి యొఱలుగల కత్తులచేతను బరిఘ
ములకుఁ బోటియైన చేతులచేతను బఱవంబడియున్నదో వానికి
నాకలోకమువంటి లోకము సిద్ధించును. రాజా! సేనామధ్యమం
దుఁ జొచ్చి సంకటమునం దుండునపు డెవఁడు వేఱొకసహాయము
నపేక్షింపకుండునో వానికి నాకలోకమువంటి లోకములు సిద్ధిం
చును. యుద్ధముసేయునపుడు రక్తమహానదిని బుట్టింపవలయును.
అది నెత్తుటి వెల్లువలును భేరు లనెడుకప్పలును దాఁబేళ్లును గలది;
వీరులయెముక లనెడు మొరపఱాలచేఁ బోవరానిది. మాంస
రక్తములనెడి రొంపితోఁగూడి వాలుపలక లనెడుతెప్పలును,
వెండ్రుక లనెడుప్రాఁచితీఁగలును బచ్చికయుఁ గలది. ఘోరమై
తునిసిపడిన గుఱ్ఱములయు నేనుఁగులయు రథములయుఁ బ్రోవు
లనెడువంతెనలు గలిగి పతాకలును ధ్వజములు ననెడుప్రేఁపబొద
రులను, జచ్చిన యేనుఁగులశరీరము లనెడు పెనుమొసళ్లను
యష్టులును ఖడ్గములు ననెడు పెనుచేఁపలును, గ్రద్దలును గంక
పక్షులగుంపు లనెడి తేలుచున్నతెప్పలును గలిగియుండును.
అది నెత్తు రనెడునీళ్లతో నిండి పరలోకమునకుఁ గొంపోవున
దగును. దానిని రాక్షసు లనుసరింతురు. అది పిఱికివారలకు
జంకు గలిగించునట్టిది. అది గడిదేఱిన వారలకును దాఁటుట

కెంతయుం గష్టము, ఇట్టినది యేయోధుని యుద్ధమునందుఁ గలుగుచున్నదో యది వాని * కవభృథమగును. అనఁగా నట్టినదిని గలిగించునేని యుద్ధయజ్ఞమును బూర్తి గావించుటకుఁ జేయు నవభృథ మది వానికగును. ఎవని యుద్ధయజ్ఞపు వేదిశత్రువుల శిరసులచేతను గజతురగముల కుత్తుకలచేతను బలవం బడుచున్నదో వానికి నాలోకమువంటి లోకములు సిద్ధించును. ఎవనికి శత్రువుల సేనాముఖము † పత్నీశాలగాను, తనసేన హావిర్ధానముగాను, తనకు దక్షిణమందుండు యోధులు సదస్యులుగాను, నుత్తరమందుండుయోధుల ‡ నాగ్నీధ్రులుగాను గావించునో, మఱి శత్రుసేనలను దనయిల్లాలివలెఁ జూచునో, వాఁడుత్తమలోకములను బొందునని ప్రాజ్ఞులు చెప్పుదురు. § రెండుప్రక్కల యుద్ధమునకై పన్నియున్న రెండు సైన్యములకును నడుమనున్నబయలట్టి యాజకునకు వేదియగును. పన్నిన వ్యూహములు మూఁడగ్నులగును. ఆవ్యూహములచే నతఁడెప్పుడు నావేదియందు యజ్ఞము చేయును. ఏయోధుఁడు భయపడి మరలఁబడి పరులచేత హతుఁ

---

* యాగపూర్తికై చేయు కడపటి స్నానజలమగును.

† యాగము చేయువాని పత్నియుండుచోటు.

‡ అగ్నీధ్రు లనఁగా నొకఋత్విజుఁ డుండునట్టిస్థలము.

§ యస్యతూభయతో వ్యూహో భవత్యాకాశ మగ్రతః, సాస్య వేది స్తదా యాజ్ఞైర్నిత్యం వ్యూహా స్త్రియోగ్నయః' అని. దా. మూలము. నిత్యం వేదా స్త్రయోగ్నయః' అని నీలకంఠాదులపాఠము. వేదను లనుటకంటె వ్యూహములనుట ప్రాకరణికము. ఇట ఎవ్వని రెండు ప్రక్కలను (అనఁగాఁ దనప్రక్కనున్నదియు తనయెదుటనున్న పగవారిదియునగు) పన్నియున్న సేనలలో నెదుటఁ బన్నియుండునది (అనఁగా శత్రుసేన) వట్టిబయలగునో (అనఁగా నిర్మూలము గావింపఁబడునో)

డగునో వాఁడు నిలుకడదప్పి నరకము నొందుననుటకు సందియము లేదు. ఎవని (యుద్ధ)వేది రక్తప్రవాహముచేతఁ జక్కఁగాఁ దడుపఁబడినదై వెండ్రుకలచేతను మాంసముచేతను నెమ్ములచేతను నెరసినదగునో వాఁ డుత్తమగతి నొందును. ఎవఁడు సేనాధిపతిని జంపి వానివాహనముపయి నెక్కునో వాఁడు విష్ణుపరాక్రమమునకు సాటియైనపరాక్రమముగలవాఁడును, బృహస్పతిం బోలినవాఁడును బ్రభువునగును. ఎవఁడు రాజునో, యతనిపుత్రునో, యతనిచేతఁ బూజితుఁడగు మనుజునో, ప్రాణములతోడఁ బట్టునో, వానికి నాలోకములవంటి లోకములుసిద్ధించును. యుద్ధమందు హతుఁడయిన శూరునిగుఱించి యెంతమాత్రమును శోకింపరాదు. హతుఁడయినశూరుఁడు శోకించుట కర్హుఁడుగాక స్వర్గలోకమునందుఁ బూజితుఁడగును. యుద్ధమందు హతుఁ డయినవానికి, నన్నదానము నుదకదానమును, స్నానమును, ఆశౌచమును పెద్దలుగావింపఁగోరరు. వానికగులోకములను జెప్పెదనువినుము. యుద్ధమందు హతుఁడయినశూరుని గుఱించి 'నాకు భర్తగావలయు' నని పెక్కువేల యచ్చరమిన్నలు వేగంబునఁ బాఱుతెంతురు. యుద్ధమందు వెన్నిచ్చి పాఱనివానికిఁ దపస్సును బుణ్యమును సనాతనమయినధర్మమును నాలుగాశ్రమములును సిద్ధించుచున్నవి. ముసలివానిని, బాలునిని, స్త్రీనిని, బూరి

యుపుడాతని (యుద్ధయజ్ఞపు)వేది యజ్ఞములచే నిండినదగును.(అనఁగా నెదుట సేనను నిర్మూలముసేసి స్తంభములు గావించునేని యతఁడు యుద్ధయజ్ఞముచేసి తీర్చినవాఁడగుననుట). ఈపాఠమున 'తదాయజ్ఞే' అనుటకు 'తతోయజ్ఞై' రని గ్రహించునది. ఈపాఠమేసమంజసము. అట్టివాని కన్నిలోకములును సమీపమందున్నవి యగును. అందలి వ్యూహములే యతనికి మూఁడగ్నులని యర్థము.

గఱచినవానిని, 'నీవాఁడ' నన్నవానిని గొట్టరాదు. పిఱిఁదిప్రక్క నుండి కొట్టనుఁదగదు. నేను వృత్రాసురునిని, బలునిని, పాకాసురునిని, మహాకాయునిని, విరోచనుని, వారింపరాని నముచిని, పెక్కుమాయలుగల శంబరునిని, విప్రచిత్తిని, ప్రహ్లాదుని, దనుపుత్రుల నందఱను యుద్ధంబునఁ జంపి పిదప దేవతలకు రాజ నయితిని' అనెను.

ఇట్లింద్రుఁడు చెప్పినదివిని యతనిని బూజించి యంబరీషుఁడు తనయోధులు పొందునట్టిసిద్ధిని దెలిసికొనెను. ఇది తొంబది యెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు, జనకుఁడు తన సేనల నుత్సాహపఱిచి యుద్ధమునకుఁ బంపుటను, వ్యూహములుపన్నుట మొదలగువానిని జెప్పుట. }

భీష్ముఁడు-'ఈవిషయమై ప్రతర్దనుఁడును జనకుఁడును జేసిన యుద్ధమును గుఱించి పురాతనమయిన యీ యితిహాసము నుదాహరించుచున్నారు. ధర్మరాజా! మిథిలాపతి యగుజనకుఁడు యుద్ధ (మనెడి యజ్ఞ) మునకు యజ్ఞోపవీతమును దాల్చినవాఁడై తనభటులను నుత్సహింపఁజేసెను అది చెప్పెదను వినుము. ఆజనకుఁడు మహాత్ముఁడు, సకలతత్త్వములను దెలిసినవాఁడు; కాన, యతఁడు తనయోధులకు యోగబలమున స్వర్గమును నరకమును జూపి 'ఇవిగోఁజూడుఁడు: భయములేని వారికి మిక్కిలియుఁ బ్రకాశించుచున్న యీలోకములు గలుగును. ఇందు గంధర్వసుందరీమణులు గ్రందుకొని యున్నారు. ఇవి

యక్షయములు; సమస్తకామితములను బిదుకునవి. ఇవిగోఁ జూడుఁడు. భయపడి పరుగిడువారికి, నరకము లని చూపట్టు చున్నవి. అందు,వారు శాశ్వతమయిన యపకీర్తితోడఁ గల కాలముఁ * గస్తి గుడుచుచుండవలయును. ప్రాణములు దిగ విడుచుటకు నిశ్చయించి పగవారిని గెలువుఁడు. అపకీర్తికర మయిన నరకమునకుఁ బాలుగాకుఁడు. యుద్ధమునందు దేహ మును ద్యజించుటయే శూరులకు నుత్తమమయిన స్వర్గద్వా రము' అనెను. ఆరాజిట్లు చెప్పఁగా మిథిలాపురపు యోధులు రాజున కుబ్బుగలుగునట్లుగా యుద్ధమునఁ బగవారిని జయించిరి. కాఁబట్టి ప్రాణములు విడువఁ దెగించియే యుద్ధాగ్రమం దెప్పు డును నిలువవలయు. ఏనుఁగులనడుమ రథికులను నిలుప వలయును. రథికులపిఱుఁద గుఱ్ఱపురౌతుల నిలుపవలయును. వీరికిఁ బిఱుఁదఁ గవచధారు లగుకాలుబంట్ల నిలుపవలయును. ఈరీతిని వ్యూహమును బన్నురా జెప్పుడును బగవారిని జయిం చును. కాఁబట్టి, యుధిష్ఠిరా ! ఈవిధముననే యొడ్డు పన్న వలయును. స్వర్గమందు సుఖమును గోరువారు, మిక్కిలి రోషము గడలుకొనఁగా లెస్సగా యుద్ధము సేయుదురు. అట్లు యుద్ధము సేసి మకరములు సముద్రమునుం బోలెఁ బరసైన్యములను గలగుండుపఱుతురు. వా రొండొరులకు దిట గలిగించుకొని తెంపుదూలియున్నట్టివారికి నుబ్బుకలిగింపవల యును. అట్లు గెలిచినవాఁడు గెలిచినభూమిని బాధలు పొరయ కుండ రక్షింపవలయును. తనభటులు, భంగమునొంది పాఱినశత్రు

---

* 'పతితవ్య మనన్తరమ్' అని. గౌ. మూలము. 'యతితవ్య మనన్తరమ్' అని దాక్షిణాత్యకోశములందు పాఠము చూపట్టుచున్నది.

వులను మిక్కిలి వెంటనంటి వారింపకుండునట్లు చేయవలయును. శత్రువులు పాఱిపోయియు బ్రదుకుఁదెరువు గానమిచే నాశలుడిగి మరలఁ బయిని బడుదురేని వారలయురవడిని సహించుట యెంతయుఁ గడిఁది. కాఁబట్టి వారలను మీఁదుమిక్కిలి తన సైనికులు వెంటాడకుండునట్లు చేయవలయును. కనుక శూరులయినవారు భయమునఁ బరుగిడువారి నెంతమాత్రమును గొట్టరుచుమీ. కాఁబట్టి పాఱిపోవువారిని మిక్కిలి వెంటనంటి పోనీయరాదు. చరములగు వానికి నచరములును, కోఱలుగల వానికిఁ గోఱలు లేనివియుఁ, * చేతులు గలవానికిఁ చేతులు లేనివియు, శూరులకుఁ బిఱికివారును, నాహారమగుదురు. పిఱికివారు తమ్ము గెలిచినవారివలెనే వీఁపును, కడుపును, చేతులును, గాళ్లునుగలిగియుండియు, † ప్రాణములను బిఱేఁడికినుంచి పోవుదురు. కాబట్టి భయార్తులగువారు మరలి దండముపెట్టి యంజలిసేసి శూరుల మ్రోల నిలుచుందురు. ఈలోకము, తండ్రి చేతులయందు బిడ్డఁడుంబోలె శూరులచేతులయందు వ్రేలుచున్నది. కాఁబట్టి సమస్త లోకములందును శూరుఁడు సమ్మానమునొంద నర్హుఁడు. శౌర్యమునకంటె నెక్కుడయిన దేదియు మూఁడులోకములందును గలుగదు. శూరుఁడు సమస్తమును బాలించుచున్నాఁడు. సర్వమును శూరునియందు నెలకొనియున్నది” అనెను. ఇది తొంబదితొమ్మిదవయధ్యాయము.

---

* 'అపాణయః పాణిమతామ్' అని మూలము. 'అపఃపిపాసతామన్నం' అని జౌ. మూలము. దప్పిగొన్నవానికి నీళ్లు నన్నమని తాత్పర్యము.

† 'పశ్చాచ్ఛూరం భీరవోఽనువ్రజన్తి' అని దా. మూలము. 'పరాభవం భీరవోవైవ్రజన్తి' అని జౌ. మూలము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధము చేయు విధము మొదలగు వానిని జెప్పుట.

ధర్మరాజు 'భరతసత్తమా! జయమును గోరువారు ధర్మమును గొంచెము పీడించియేనియు నెట్లు (రాజువలని భయము చూపి) యుద్ధమునకు సేనను నడపించుకొని పోదురు? ఇదినాకుఁ జెప్పుము.' అని యడిగెను.

భీష్ముఁడు-'కొందఱు ధర్మము సత్యముచేతఁ గుదురుగలిగియున్నది చెప్పెదరు. కొంద ఱుపపత్తిచేత ననియుఁ జెప్పెదరు. కొందఱు మంచినడవడిచేత నందురు. కొంద ఱుపాయములచేత నని చెప్పెదరు. నేను దోడనే యర్థసిద్ధిని గలిగింపఁ జాలినయుపాయములను ధర్మములను జెప్పెదను వినుము. దొంగలు మర్యాదలనెల్ల నుల్లంఘించి ధర్మాదులకు నాశకు లగుచున్నారు. వారలను వారించుటకును వేదోక్తము లయినయుపాయములను జెప్పెదను. కార్యములు లెస్సగా సిద్ధించుకొఱకు వానిని దెలిసికొనుము. ప్రజ్ఞ ఋజు వగునది, వంకరయైనది యని రెండు విధములు. ఆ రెంటిని రాజు తెలిసికొనవలయును. రాజు వక్రమును దెలిసికొనియున్నను దాని (నితరులను బాధించుటకై) ప్రయోగింప

---

* 'సత్యే ఏహిస్థితా ధర్మ ఉపపత్త్యా తథాపరే' అని జో. మూలము. 'సత్యే ఏహిస్థితా ధర్మ ఉపపత్త్యా తథాపరే' అని దా. మూలము. 'యథార్థంబగు క్షత్రధర్మము చొప్పునఁ గొందఱు ధర్మంబునందున్నారు. మఱికొందఱు మరణము గలదని నిశ్చయమున, ధర్మమం దున్నారు, అని యర్థము.

రాదు. అతనిని నపాయములు పైకొనెనేని వానిని బాధించుట కై దానిని గయికొనవచ్చును. శత్రువులు రాజునకు (వారివారిదగు మంత్రులు సైనికులు మొదలగువారియందు) భేదము గలిగించి * యపచారము చేయుదురు. రాజు వంచనను జక్కఁగా నేర్చి యుండి దానితోడ్పాటున నాశత్రువులకుఁ బ్రతికారము చేయ వచ్చును. భారతా! ఏనుఁగుల కవచములును, నావులయు నెద్దు లయుఁ గొండచిలువలయు తోళ్లును, అలుఁగులును, ముండ్లును, నినుపమేకులును, మేలయినకవచములును, పదును జేసినయాయు ధములును,జక్కఁగాఁదొడయంబడిన యినుపకవచములును నుం డవలయును. పతాకలును ధ్వజములును పలురంగులు వేయంబడి యుండవలయును.ఋష్టులును దోమరములును గత్తులును గొడ్డం డ్రను, వాఁడులుగా నుండవలయును. పలకలచేతను దోళ్లచే తను గావింపఁబడిన పలువగల కేడెములును మిక్కుటముగా నేర్పఱుచుకొనవలయును. ఆయుధములను జక్కఁగా నాయిత పఱిచినవిగాను బంట్లు తెగింపుగలవారుగాను నుండవలయును. చైత్రమాసమందుఁగాని మార్గశీర్ష మాసమందుఁగాని, దండు వెడ లుట యుత్తమము; అప్పుడు భూమియందుఁ బయిరులు లెస్సఁ గాఁబండియుండును. జలమును సమృద్ధముగాఁ గలిగియుండును. కాలమును మిక్కిలి చలువయు వేఁడియుఁగాకయుండును. కాఁ బట్టి యీకాలమందుఁగాని లేక పరులకు సంకటమయిన కాలమం దుఁగాని ప్రయత్నము చేయవలయును పరులను బీడించువిషయ మున సేనల కీయుపాయము లుత్తమములగును. జలమును

---

* 'భేదేవాపచరన్తి' అని ఔ. మూలము. 'భేదేనోపచరన్తి' అని దా.మూ

బుల్లును గలదై, సమమై, అడవియందున్న సమర్థులగు వేగుల వాండ్రు చక్కఁగాఁ బనుపడి తెలిసియుండునట్టిదారి పోఁవుటకుఁ దగినదిగా వన్నెకెక్కి యున్నది. మృగసమూహములవలె నడవులంబోవుట శక్యముగాదు. కాఁబట్టి జయమునుగోరునట్టి వారు, సేనలకడ నాయుడవినుష్యులనే చేర్చియుంతురు. శక్తి మంతులును సత్కుల ప్రసూతులు నగుజనులు ముందుపోవల యును, జలముగలదియు దాపునఁ బచ్చికబయలు గలదియు నగుదారి విడిపట్టుగానుండుటకు నుత్తమమయినది. అట్లుండిన చోఁబరుల దూతలను వారింపనలవియగును. యుద్ధమందు సమర్థు లయిన జనులు, పలువిధములయిన గుణములు మిక్కిలిగా నుం డుటచే నడవిదాపున నున్నబయలును నుత్తమమయినదని తెలఁ చుచున్నారు. సేనలకు మిక్కిలి దూరముగానిచోట బొక్కస ముండవలయును. బొక్కసముదాపునఁ గాలుబంట్లు దిగు నట్లును మఱేఁగియుండునట్లును జేయవలయును. ఇది యూపత్కా లమందుఁ బగవారిని జంపుటకు ముఖ్యకారణమగును. సప్తర్షి నక్షత్రములను మున్నిడికొని కొండలంబోలినవారై యుద్ధముచే యవలయును. ఈవిధిఁచొప్పున, జయింప నసాధ్యులయిన పగవా రినిని జయింపఁగోరవచ్చును. వాయువును సూర్యుండును జంద్రుం డునుగల పక్షమందు జయముగలుగును. యుధిష్ఠిరా! ఈ రెండు పక్షములును గూడికగలదేని, వీరియందు మునుము న్నుండు వారు మిక్కిలి శ్రేష్ఠులు. యుద్ధమందు సమర్థులయిన జనులు, రొంపిలేనిదియు జనులులేనిదియుఁ బ్రాకారము మొదలయిన గఱునులేనిదియు మట్టిగడ్డలులేనిదియు నగుభూమిని, గుఱ్ఱము లకుఁ దగినదని కొనియాడుదురు. మిట్ట పల్లములు లేనిదియును

రొంపిలేనిదియును, బొఱియలులేనిదియు నగుభూమి తేరులకునుత్తమమగును. చిన్నచెట్లు గలదియు మిక్కిలియుఁ బులుగలదియు జలముతోఁగూడినదియు నగుభూమి యేనుఁగులనెక్కి యుద్ధముసేయువారికి నెంతయు మేలయినది. పెక్కుదుర్గములుగలదియుఁ బెనుపొదరులుగలదియు వెదుళ్లచేతను బ్రేఁపపొదరులచేతను మఱుఁగుపడినదియు నగుభూమియుఁ బర్వతములును నడవిపట్టులును గాలుబంట్లకుఁ దగినవగును. కాలుబంట్లు బహుళముగాఁ గలిగినసేన మిక్కిలిదృఢముగానుండును. వానలేని మంచిదినములందు రథములును నశ్వములును గలసేన మిక్కిలి యొప్పును. వానకాలమందు కాలుబంట్లును నేనుఁగులును మిక్కిలి గలసేన యెంతయునొప్పును. ఈగుణములనును దేశకాలములను జక్కఁగాఁ దెలిసికొని, సేనను యుద్ధమునకుఁ బంపవలయును. ఇట్లు చక్కఁగా నెఱిఁగి మంచి తిథినక్షత్రములందు, నాశీర్వాదములును బడసి, సేనను జక్కఁగా నడపించుకొని పోవువాఁడే యెప్పుడును జయమునొందును. నిదురపోవువారిని దప్పిగలవారినిని శ్రమపడినవారినిని తటస్థుఁడుగా నుండువానిని * యుద్ధము నిలిచియున్నపుడును, పరుగెత్తి పోవుచున్నపుడును, దారిని సన్నాహము లేక పోవుచున్నపుడును, త్రాగునపుడును, గుడుచుచున్నపుడును, గొట్టరాదు. పిచ్చివానిని, బుద్ధికలఁగి యున్నవానిని, మిక్కుటముగా గాయపడియున్నవానిని, గాయములచే సత్తువ మిక్కిలియు సురిఁగినవానిని, నమ్మికతో నిలుచున్నవానిని, ఒక కార్యము నారంభించి ముగింపలేకున్నవానిని, సురంగములు

---

* 'మోక్షేప్రయాణే చలనే పానభోజనకాలయోః' అని మూలము. 'మోక్షమార్గముననున్నపుడు' అని ప్రతాపచంద్రరాయలు.

మొదలైనవి శేషశిల్పములందు నిపుణుఁడయినవానిని, దుఃఖమొం దినవానిని, బండములు పచ్చిక మొదలగువానిని దెచ్చుటకై శిబిర మునుండి వెలుపలఁబోవువానిని, శిబిరములునిర్మించువానిని, దాని వెంటఁబోవువానిని, పరంపరగారాజుద్వారమునుహత్తుకొనియుం డువానిని, మంత్రి ద్వారమందుండువానిని, సేనయందలి ముఖ్యు లకుఁ బరిచర్య సేయువానిని అట్టివారికి నధిపతు లయినవారి నిని గొట్టరాదు. నీసేనయం దెవరు పరులసేనను భేదింతురో, తమసేనను భేదించినయెడల మరల నొకటిగాఁ గుదురుపఱు తురో, యట్టివారికి నీతోఁబాటిగా భోజనమును బానమును జరుపుటయేకాక వారి వేతనములను రెండింతలు గావింపవల యును. మఱియు నట్టివారిజాతియును గోత్రమును దెలిసికొని వారుచేసిన యుత్తమం బయినకార్యమును గనుఁగొని, తనకు సమానముగా శరీరమును రక్షించుటకై వారికి వేతనము రెం డింతలు మూఁడింతలు నాలుగింతలును గావింపవలయును. అట్టి వారియందుఁ బదిమందికి నధిపతియైనవారిని నూఱుగురకు నధి పతులుగా నియమింపవలయును. పిదప వారియందు సోమరితన ములేనివాఁడును శూరుండు నగువానిని వేయిమందికి నధిపతిగా నియమింపవలయును. ముఖ్యులుగానుండువారి నొక్కటిగాఁ గూర్చి 'మనము జయమునొందుటకై యొకరినొకరు విడువరా దని * శపథముచేయుదము. ఎవ్వరు పిఱికివారో వారిచ్చటనే నివర్తింపవచ్చును. దొమ్మిగా యుద్ధముజరుగుచుండఁగా శూర

---

* 'సంశపామహే' యని మూలము. 'సంశయామహే' అని పాఠాంతర మెంతయు అసంగతమును అప్రాకరణికమునుగాన పరిత్యజింపఁబడినదని తెలి యునది.

ముగా నడచుకొనుటకు నుపేక్షించి తమముఖ్యులను నితరులచేఁ జచ్చునట్లు చేయువారును నిచ్చటనే నిలిచిపోవచ్చును. తానును యుద్ధమునుండి విడిపోక తనపక్షమువారిని నెదిరికిఁ జంప వీ లియ్యక యుండునట్టివారు వత్తురుగాక. తమ్మును దమపక్షపువారిని ని రక్షించుకొందు రేని యట్టివారు యుద్ధమునఁ దప్పక శత్రువును జంపుదురు. యుద్ధమునఁ బలాయనమగుటవలన ధననాశమును, వధమును, నిందయు, నపకీర్తియుఁగలుగును. ప్రాణసంశయము కలిగినపుడు పరుగెత్తువాఁడును, పెదవులును పండ్లును మూలిన వాఁడును (సిగ్గుపీడినవాఁడును), ఆయుధము దిగవిడిచినవాఁడును, సహాయులను విడిచి పరుగెత్తినవాఁడును, శత్రువులచేఁ జెఱఁ బడినవాఁడును, మనసునకుఁ గట్టువై వినుటకు దుఃఖకరమయిన మాటలను వినవలసివచ్చును. ఇట్టివెప్పుడును మనశత్రుపక్షమువారికిఁ గలుగుఁగాక. ఎవరు యుద్ధమునకుఁ బెడమొగము పెట్టుదురో వారు మనుష్యులందు నధములగుదురు. వారుమనుష్యుల మొత్తమును బెంచుటకుమాత్రమే యైనవారుగాని యిహమునందును బరమునందును వారుండియు ఫలము లేదు. పరుగెత్తుచున్నవారిని జయశీలురయిన శత్రుపక్షపువారు మనంబుల సంతోషము గడలుకొన * వందిజనుల స్తోత్రములు చెలంగ వెంబడించి పోదురు. †శత్రువులొకనిని యుద్ధమందుఁ దారసిల్లి వానియశమును బోకా

* 'వందినాం మండలేనచ' అనిమూలము. 'వందసైన్యండలేనచ' అనియు 'మంగళైర్వంగ నేనచ' అనియు 'మంగళైశ్చంద నేనచ' అనియుఁ బాఠాంతరములు.

† 'యస్య స్మసంగ్రామగతా యశోహైఘ్నన్తిశత్రవః। తదసహ్యాతరం దుఃఖమహంమన్యే వధాదపి' అని ఔ. మూలము. యస్యస్మవ్యసనేరాజన్ను సమోద న్తి

ర్తురేని యది వధమునకంటె మిక్కిలియసహింపరాని దుఃఖ మని నేను దలఁచుచున్నాను. * జయమే ధర్మమునకును, సమస్త సుఖములకును మూలమని తెలియుఁడు. † పిఱికివాండ్రు దేనిని మిక్కుటమయిన (నలఁకువ)గా నెంతురో దానిని శూరుఁడు సొంపునఁ బొందును. మనము స్వర్గమును బడయఁగోరి ప్రాణములను సరకుసేయక యుద్ధముసేయుదము; జయించినను వధింపఁబడినను మనము సద్గతిఁబొందుదము' అందురు. ఇట్లు వీరులగువారు శపథముచేసికొని ప్రాణములనెంతమాత్రము లక్ష్యపెట్టక భయమించుకయులేక శత్రుసేనాసమూహమును జొత్తురు. ముందట వాలును బలకయుం గలమనుష్యులదళము నుంపవలయును. పిఱుందఁదేరులును బండ్లును నుండవలయును. ఈరెంటికినడుమఁ దక్కిన రక్ష్యంబగుసేనయుఁ, బరులను మార్కొని వారించుకొఱకు పదాతులను, నిట్లు నడుమనుంచి మఱుఁగుపఱుపవలయును. ఆసైన్యమందు మిక్కిలి యాఁటితేఱిన దిట్టలగువారు

శత్రవః। తదసహ్యతరం దుఃఖం మన్యే స్తేమరణాదపి' అని దా.మూలము. శత్రువు లొకనిదుఃఖమునకు సంతోషింతురేని యది మరణమునకంటె వానికి దుస్సహమని తలంతురని యర్థము. ఇది సంగతముగాదు.

* 'జయం' అని ఔ. మూలము. 'శ్రియమ్' అని దా.మూలము. ఇది యుపపన్నముగాదు గాన పరిత్యాజ్యము. ప్రతాపచంద్రరాయలును జయమనియె గ్రహించియున్నారు.

† 'యాభీరూణాం పరాగ్లానిశ్శూరస్తా మధిగచ్ఛతి' యుద్ధపుఁగష్టమును పిఱికివారు గొప్పదిగాఁ దలఁతురుగాని శూరులు దానిని సొంపుగాఁగొని తృణీకరింతురని భావము.'పరాఖ్యాతిః'అని దా. మూలము. పిఱికివాండ్ర పెనుకీర్తిని శూరులు గొందురని యర్థము. పిఱికివాండ్రకు ఖ్యాతిగాని పెనుఖ్యాతిగాని యెక్కడిది ?

ముందునిలిచి పోరాడవలయును. వారు తమపిఱుంద నున్నసైని కులను గాపాడుదురు. మంచిబలిమియు ధైర్యమును గలవారుగా నభిమతు లగునట్టివారిని సేనముందఱ నుంపవలయును. తక్కిన జనులు వారిని మున్నిడికొని పిఱుందనుండవలయును. భయపడు వారికిఁ బ్రయత్నపడి యుత్సాహము కలిగింపవలయును. వారిని, సైన్యపుమొత్తమెక్కుడుగా శత్రువులకుఁ జూపుకొఱకుమాత్ర మేని సేనకు సమీపమం దుండునట్లు చేయవలయును. సైని కులు కొందఱే యుండిరేని వారిని దగ్గఱగాఁగూర్చి యుద్ధము చేయింపవలయును. ఒకవేళ సేనాపతి యిష్టపడెనేని, దగ్గఱగాఁ గూర్చినకూర్పును విరివిగానుండునట్లు విస్తరింపఁజేయవచ్చును. ఒక కొందఱుసైనికులు పెక్కండ్రతోఁ బోరాడవలసి వచ్చి నప్పుడు సూచీముఖ మనెడియొడ్డు పన్నవలయును.స్వల్పసైన్యము పెద్దసేనతోఁ బోరాడునపుడు, మొదటిదానిసేనాపతి తమవారు సమానముగాఁ బోరుచున్నను, తక్కువపడుచున్నను, నిజమయి నను, అబద్ధమయినను, చేతులనుబట్టుకొని 'శత్రువులు విఱిగిరి, విఱిగిరి' యని బిగ్గఱఁగూపెట్టవలయును. వారియందు మి క్కిలి బలవంతులగువారు 'మనమిత్రబలము వచ్చివేసినది. కొ ట్టుఁడు భయమువల' దని భయంకరములగు చప్పుళ్లుసేయుచు నెదుర్కొని పైపడవలయును. తక్కినవారికి ముందుండువారు సింహనాదములను గిలకిలమను ధ్వనులనుగావించుచు, క్రకచము లను, కొమ్ములను, భేరులను, మృదంగములను, బణవములను, మునుపడఁ జెలంగునట్లు చేయవలయును' అనెను. ఇది నూఱవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యోధులలక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'భారతా! యోధులు యుద్ధమునకుఁ జాలియుండుటకు నెట్టిశీలముగలవారుగా నుండవలయును? వారిపూన్కి యెట్టిది గావలయును? వారి రూపములును, సన్నాహములును, శస్త్రములు నెట్లుండవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'ఈవిషయమున యోధులకు వారివారి యాచారములచొప్పున శస్త్రములును వాహనములును విధింపఁబడుచున్నవి. *ఆచారమునుబట్టియే కదా యీలోకమందుఁ బురుషుఁడా యాకర్మములందుఁ బ్రవర్తించుచున్నాఁడు. గాంధారదేశపువారును, సింధుదేశీయులును సౌవీరదేశపువారును భయములేక మిక్కిలియు బలవంతులై తమ నఖములచేతను, ప్రాసములచేతను యుద్ధముచేయుదురు. వారిబల మంతటను దుదముట్టియుండును. ఉశీనరదేశపువారు బలవంతులై సమస్తాయుధములందును నిపుణులై యుందురు. తూర్పుదేశపువారు గజయుద్ధములందుఁ గుశలులై కపటయుద్ధముచేయువారగుదురు. అట్లె యవనులును గాంభోజులును మథురచుట్టునుండువారును గుజ్జుపుయుద్ధమందు సమర్థులుగానుందురు. దక్షిణదేశపువారు వాలును బలకయునుగొని యుద్ధముచేయుదురు. మిక్కిలి సత్త్వమును, మిక్కిలి బలమును గలశూరు లన్నియెడలను బుట్టుదురనుట

---

*'ఆచారాద్ధిహాపురుషస్తథాకర్మసువర్తతే' అని (దా. మూలము). 'ఆచరణ్ వీరపురుషస్తథా కర్మసువర్తతే' అని ఔ. పాఠము. నీలకంఠపాఠము నిదియే. వీరపురుషు లిట్టిసాధనములుగొని యుద్ధకర్మములందువర్తింతురని యర్థము.

ప్రసిద్ధము. అవంతిదేశపువారు మహాశూరులుగా నుందురు. మాళవదేశపువారు చతురంగములందును మహాశూరులు. వీరలయం దొక్కఁడొంటిమెయినుండినను,యుద్ధమందు వేయిమందిని మార్కొనఁగలఁడు. దేశములను బహుతరముగా గుర్తించితిని. ఇఁక శూరులలక్షణములను జెప్పెదవినుము. సింహమును బులియుంబోని కంఠధ్వనియుఁ గన్నుఁగవయుఁగలవారును,సింహమువలెను బులివలెను నడచువారును, పావురాలవలెను బాములవలెను గన్నులుగలవారందఱును, శూరులును పగవారినిగలంచి నలంపఁజాలునట్టివారునై యుందురు. జింకల మెలుంగువంటి మెలుంగుగలవారును, పులివలెను *ఆఁబోతువలెను గన్నుఁగలవారును, శత్రువులను గలంచి నలంచునట్టివారై మిక్కిలి చుఱుకుఁదనము గలిగియుందురు. చిఱుగంటలవంటి మెలుంగుగలవారు † పరాకుగలవారును మందులును గోపస్వభావులు నగుదురు. మేఘధ్వనివంటి మెలుఁగుగలవారును గ్రూరములయినముఖములుగలవారును ‡ లొట్టియవంటి మొగముగలవారును వంకరయగు కొనముక్కును నాలుకయుఁగలవారును, మిక్కిలియు దూరము చనఁజాలువారును,దూరమునుండియే గుఱిపెట్టియేయ నేర్చినవారునగుదురు. పిల్లివలె గూనుగలవారును కదలిక

---

* 'ఋషభాక్షా స్తరస్వినః'అని మూలము.ఋషభాక్షా స్తథాపరే' అని దా. మూలము.

† '(ప్రమాదినశ్చ మందాశ్చ' అని ఔ. మూ. '(ప్రమాథినశ్చ మందాశ్చ' అని దా. మూలము.

‡ 'కేచిత్కరభసన్నిభాః' అని ఔ. మూ. 'కేచిచ్చ కలనిస్వనాః' అని దా. మూలము.

లేని కన్నులుగలవారును, కొంచెపాటి వెండ్రుకలును మిక్కిలి పలుచని తోలుగలవారును, వేగముగలవారుగను జంచలచిత్తులుగను దగ్గఱవసింపరాని వారుగను నుందురు. *ఉడుమువలెఁ గన్నులు మొగిడియుండ,మెత్తనిస్వభావమును,గుఱ్ఱమువంటివేగమునుగంఠధ్వనియును గలవారు సకలశత్రువులను గడతేర్ప శక్తులగుదురు. చక్కని మేనికట్టును, జక్కనియవయవములును, నిక్కగల ఱొమ్మును గలవారును, పగవారి వాద్యధ్వనులు విన్నంతనే సైఁపక కుపితు లగువారును, కలహములం దుబ్బి చెలరేఁగువారును, గంభీరములగు కన్నుఁగవ గలవారును, వెలికుఱికిన మిడిగ్రుడ్లుగలవారును, పింగళవర్ణములగు కన్నులుగలవారును, బొమముడిపడి యుండు ముఖములుగలవారును, ముంగిసవంటి కన్నులుగలవారును, వీరందఱును శూరులై యుద్ధమందు దేహములను విడుచుటకు వెనుదీయకుందురు. వంకరలగు కన్నులుగలవారును వెడలుపయిన నుదురుగలవారును, కండలేని చెక్కిలిపట్లు (హనువులు) గలవారును, †వంకరలగు చేతులును వ్రేళ్లును దొడలునుగలవారును, బక్కపలుచని దేహముగలవారును, నరములం దటఁ దెలియుచున్నవారును, యుద్ధము తటస్థించినపుడు భయము మాలి వేగచొచ్చువత్తురు. వా రేనుంగులవలె మత్తిల్లి, దార

* 'గోధానిమీలితాః' అని మూలము. 'గౌరానిమీలితా' అని దా.మూలము. బంగరువాయయు మొగిచినకన్నులును గలవారు మృదుస్వభావముగలిగి యుందురని యర్థము.

† 'వక్రబాహ్వంగుళీ సక్థాః' అని దా.మూ. 'వజ్రబాహ్వంగుళీ చక్రాః' అని ఔ. మూలము. వజ్రములవంటి బాహువులును వ్రేళ్లయందుఁ జక్రములవంటి గీఁతలును గలవారని యర్థము.

సింపరాకుందురు. ఎఱ్ఱవాఁటి ప్రిదిలిన వెండ్రుకలచివరలు గలవారును, బలిసిన ప్రక్కలును నుబ్బు లయినచెక్కిలి పట్టులును ముఖములును గలవారును, నిక్కుఁగల మూఁపులుగలవారును, బలితంపుఁగుత్తుక గలవారును, భయంకరులును, బలుపుగల పిక్కమాంసముగలవారును, కృష్ణుని వాసుదేవ మనుగుఱ్ఱమువలెను వినతిగన్నపక్షియగు గరుడునివలెను బయికిఁ జెంగలించువారును, గుండ్రనితలలును వెడలుపయిన మొగములును గలవారును, పిల్లివంటి ముఖముగలవారును, ఘోరమగు ధ్వనిగలవారును, గోపముగలవారును, యుద్ధమందు బిట్టుగానార్చుచు నుంకించువారును, ధర్మముల నెఱుంగనివారును, గర్వితులగు వారును, బెట్టిదముగాఁ గనుపట్టువారును, వీరందఱు *నుదగ్రులై తమదేహములను నెంతమాత్రము లక్ష్యపెట్టకయు యుద్ధమునుండి వెనుదీయకయు నుందురు. అట్టిసైనికులను యుద్ధమునెుునయం దుంపవలయును. వారెప్పుడును దమశత్రువుల నుఱుమాడుటయేకాక తాము శత్రువులచేఁ జంపఁబడుటకు వెనుదీయకుందురు. వారు ధార్మికులై వేఱువిధము లయిననడవళ్లు గలిగి తిన్నని మెత్తనిమాటలపజయమునకు లక్షణములని తలంతురు. వారిని మృదువుగా మెలపనిచో రాజువలనను మిక్కిలి కుపితులగుదురు' అనెను. ఇది నూటయొకండవయధ్యాయము

---

* 'ఉదగ్రాః' మూలము 'అంత్యజాః' అనిపా.మా. చివరపట్టులందు వసించువారని యర్థము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు సేనకుఁగల జయచిహ్నములను రాజనీతిని జెప్పుట.

ధర్మరాజు 'భరతసత్తమా ! ఒక సేన జయమునొందఁ బోవుటకుఁ బ్రశస్తములగు లక్షణములేవి ? వానినిగూడ నెఱుంగఁ గోరెదను' అని యడిగెను. భీష్ముఁడు 'జయింపఁబోవు సైన్యమునకు నేప్రసిద్ధలక్షణములు గలుగునో వాని నన్నింటిని జెప్పెదను. దేవతలు కోపమునొందినపుడు, మనుష్యులు కాలముచేతఁ బ్రేరితులగునపుడును, విద్వాంసులు జ్ఞానచక్షువులచేతఁ నన్నియుఁ గనుఁగొని ప్రాయశ్చిత్త విధులును,జపహోమములను, మంత్ర జపములను గావించి యహితములకు శాంతిగావింతురు. ఏసేనయందు యోధులును వాహనములును మనస్సు తెంపుసొంపు గలిగి యుండునో,దానికిఁదప్పక జయముకలుగును. అట్టిదానికి ననుకూలముగానే వాయువులు వచ్చును. ఇంద్రధనువు లాకాశమునం దోఁచును. మేఘములు తమనీడల వారిపయిఁ బొలయించును. సూర్యకిరణములు వారిపయిఁ బ్రసరించును. నక్కలును, గ్రద్దలును వారికి ననుకూలములగు బలములుగలిగి యుండును. ఇవియన్నియు నాసేనకుఁ బొసఁగినపుడు దానికి నుత్తమమయిన సిద్ధి (జయము)గలుగును. అగ్ని ప్రసన్నమయిన కాంతితోడ, కిరణములు పొడవుగాఁ బర్వుచుఁ, బ్రదక్షిణముగాఁ జుట్టివచ్చు జ్వాలలుగలిగి, పొగలేనిదై వెలుంగుచుండును. ఆహుతుల వాసనయెంతయు మంచిదిగాను నింపుగాను నుండును. ఇది జయముగలుగుటకు లక్షణముగాఁ జెప్పెదరు.

అట్టియెడ శంఖములును భేరులును గంభీరముగాను బిట్టుగాను శబ్దించును. యుద్ధముసేయ నున్నవారును నడ్డుచెప్పక తమకముగలవారై యుందురు. ఇదియు జయము కలుగుటకు సూచనముగాఁ జెప్పుదురు. యుద్ధమునకు బయలుదేఱిన వారికిని బోవనున్న వారికిని బిఱుఁదను నెడమప్రక్కను జింకలు మొదలగు మృగములు పోయినచో నది శుభంబగును. యుద్ధమునఁ జంప నుంకించు చున్నవారికుడి ప్రక్కఁ బోయినను సిద్ధిగలుగు నందురు. కాని యట్టివారిముందఱఁ బోయెనేని విఘ్నకారులగును. హంసలును, గ్రౌంచపిట్టలును, బెగ్గురులును, పాలపిట్టలును, మంగళకరములగు శబ్దములను గూసినను, యోధులు మనస్సు తెంపును నుబ్బును గలిగి యుండినను, నిది రాఁగలజయమునకు సూచకమందురు. ఎవరి సైన్యము, శస్త్రములచేతను, యంత్రములచేతను, గవచములయు ధ్వజములయు గాంతులచేతను, అందున్న పడుచువీరుల ముఖకాంతులచేతను, దళతళమని మెఱయుచున్నదై దేఱిచూడరాను దరముగాకుండునో యట్టివారు శత్రువులను గ్రిందుపఱుతురు. ఒకరియోధులు పోరాటముచేసి యుపకరింపఁ దలంపుగలిగియు గర్వములేక యుఁ బరస్పరము చెలికారము పాటించియు, శౌర్యము నవలంబించియు నుందు రేని యది వారికిఁ గలుగనున్న జయమునకు లక్షణమని చెప్పుదురు. మనస్సున కింపయినశబ్దములును సుఖములయిన స్పర్శములును గంధములును గలుగు నేని, యోధులను ధైర్యమావేశించెనేనియు, నదిరాఁగలజయమునకు ముందుగుఱుతగును. కాకి యుద్ధమునకుఁ బయలుదేఱినవానికి నెడమప్రక్కను యుద్ధమునకుఁబోవనున్న వానికిఁ గుడిప్రక్కను నున్నచో శుభంబగును. వెనుక

ప్రక్కనుండినచో కార్యమును * జెఱుపుచున్నది. ముందఱి ప్రక్కనున్నచో విఘ్నము గావించుచున్నది. యుధిష్ఠిరా! చతురంగములతోఁగూడిన పెనుసైన్యమును గూర్చికొన్న పిదపఁగూడ, నీవు తొలుత సామముతోనే ప్రవర్తింపుము. అది పస లేకపోయెనా పిదప యుద్ధమునకుఁ బ్రయత్నింపుము. యుద్ధము వలనఁ గలుగునట్టి జయ మధమమేయగును. యుద్ధమునందలి జయము యాదృచ్ఛికముగనో దైవముచేతనో గలుగునని విచారింపవలయును. ఒక పెద్దసైన్యము విఱిగి సైనికులు పరువెత్తునపుడు దానిని వారించుట యెంతయును గష్టము. అది మహావేగము గలనదీప్రవాహమువలెను, బెదరిపాఱు పెనుమృగ సమూహమువలెను నుండును. కొందఱు పాఱుదురు. వారు పాఱిరని యే, మఱివేఱు కారణములేకయే తక్కినవారును నెంత తెలిసినవారుగా నుండినను విఱిగిపాఱుదురు. ఒక పెద్దసైన్యము మిక్కిలి యుదారు లయినయోధులు గలిగి యుండినను, † రురువు లనెడిజింకకదుపునకు సాటియే యగును. ఒండొరుల నెంతయు నూఁది, యుబ్బుగలిగి, ప్రాణములను సరకు గొనక, దృఢనిశ్చయు లైనట్టిశూరు లొకప్పుడేఁబదిమందిమాత్రమే యుండినను, తమకంటె మిక్కిలియెక్కుడు మొత్తము గల పర

---

* 'సంఘాతయత్యర్థమ్' అని మూలము. 'సంసాధయత్యర్థమ్' అని దా. మూలము. వెనుకప్రక్క కాకిరూఁతి కార్యమునుసాధింపఁ జేయుచున్నదని యర్థము. ముందఱిప్రక్క నున్నది చెఱుపుటచే వెనుకప్రక్క సాధింపఁజేయుట యే సమంజసము.

† ఒకజింక పరువెత్తినచో నది పరుగెత్తినదెసనే తక్కినవియు మఱేకారణమును లేక పరువెత్తును. కాన యది యిటఁ బెద్ద సేనలకును నను సంధించునది.

సైన్యమును నుఱుమాడి వైచెదరు. ఏఁబదిమందియే కాదు; ఒకప్పుడు, దృఢనిశ్చయులై కులీనులును బూజితులును నగు శూరులు, ఐదుగురో యార్గురో యేడుగురో యైనను నొండొరులను గుత్తముగాఁ గూడికొని తమకంటె నెక్కువ మొత్తముగల శత్రువులను జయింతురు. ఏవిధమున నయినను వారింప శక్యమైనంతవఱకును యుద్ధమున మార్కొనుట తలపెట్టరాదు. మొట్టమొదట సామమును దానమును భేదమును బ్రయోగింప వలయును. వీనికిఁ బిదపనే యుద్ధమునకుఁ బూనవలయునందురు. ఒకసేన వచ్చుటఁజూచినంతమాత్రనే, పిఱికివాండ్రను, మండుచున్న పిడుగునుజూచి 'అయ్యో! ఇది యెవరిని బడఁగూల్చునో' యని కూపెట్టునట్లు, భయముపట్టి బాధించుచున్నది. యుద్ధమొకటి రేఁగుచున్నదని తెలియఁగానే యందులకుఁ జేరఁబోవు యోధుల యవయవములును,* జయించుచున్నవాని యవయవములును మిక్కుటముగాఁ జెమర్చుచున్నవి. (యుద్ధముజరుగుచున్న) దేశమంతయు నందలిస్థావరజంగమములతోఁగూడ, మిక్కిలి వ్యథనొందుచున్నది. దేహులమజ్జలాయుధముల వేఁడిమిచేఁ గ్రాఁగి నొప్పునఁ గుందుచున్నది. కాఁబట్టి, రాజు, మాటిమాటికి వారలకు సాంత్వవచనములను గటువయినచేఁతలతోఁగలిపి చెప్పుచుండవలయును. (సాంత్వము లోఁదార్చుటకును గటుత్వము వెన్నిచ్చి పాఱకుండుటకును జెప్పఁదగును.) జనులు శత్రువులచేతఁ బీడింపఁబడుచున్నపుడు వారెల్లప్పుడును సంధికి రాఁజూచుచుందురు. శత్రువులకు నంతరంగు లయిన(మిత్రులగు) వారి

---

* 'విజయస్య' అనిమూలము. 'విషయస్య' అని దా.మూలము. దేశమందలి వారియవయవములని యర్థము.

యందు భేదముపుట్టించుటకుఁ జారులను బుచ్చవలయును. అట్లు భేదము పుట్టించి యాశత్రురాజునకు నవ్వలఁ బలీయుఁ డయి యుండు రాజుతో సంధిచేసికొనుట యెంతయు మంచిది. దండెత్తురా జీవిధమునఁ దనశత్రువునకు శత్రువయిన వానితోడఁ గూడికొనుటచే నాశత్రువు నిరుప్రక్కల ముట్టడించి బాధించు నట్లు మఱియొకవిధమున వానిని బాధించుట శక్యముగాదు. ఓరుపు సాధుజనులను బొందును; కాని యెప్పుడు నసాధు జనులను బొందదు. ధర్మరాజా! క్షమకును క్షమలేమికిని (క్రూ రత్వమునకును) గల ప్రయోజనములను వినుము. రాజు జయము నొందినపిదప క్షమచూపునేని యతనికీర్తి మిక్కిలియు వర్ధిల్లును; అట్లు క్షమించు గుణముగలవాఁడు మహాపరాధము చేసినప్పటి కిని, వానిశత్రువులు నతనియందు నమ్మక ముంతురు. ఒకశత్రు వును బీడించి యోర్చి పిదప వానియెడ క్షమఁజూపవలయును. ఏలన వంకరచుగు నొక మ్రానికి నగ్ని వేఁడిమిని మొదటఁజూపి దాని వంకను నిడివిగాఁ జాఁగించినచో నది మరలఁ దన యెప్పటి వంక కేవచ్చునని*శంబరుఁడు చెప్పుచున్నాఁడు. అయినను దీని నా చార్యులుకొనియాడరు;ఇదిమంచిదర్శనముగాదు.ఎవనినిగానికన్న బిడ్డలవలె నడంపవలయును. కానవారు 'తండ్రి తనపుత్రునింబోలె రాజు, శత్రువును గోపములేకయు నాశముసేయకయు నడంపవల యు'నందురు.యుధిష్ఠిరా! రాజు గ్రుండగునేని ప్రాణులెల్ల నతనిని ద్వేషించును. మఱియుతఁడు మృదువయ్యెనేని యందఱునతని నవమానింతురు. కాఁబట్టి యుగ్రత్వమును మెత్తనయు రెండును

* 'శంబరః' అని మూలము 'శాంబరాః' అని దాం.మూలము. మాయావిదులు చెప్పుచున్నారని యర్థము.

గలిగియుండవలయును. ప్రహరించుటకు మునుపును, బ్రహరిం చుచు చున్నపుడును, బ్రియముగాఁ బలుకవలయును. ప్రహరిం చిన పిదప నందులకు దుఃఖించుచును నేడ్చుచు నున్నట్లు తోఁపించి వారియెడఁ గనికరము చూపవలయును. రా జొక సైన్యమును గూల్చి హతశేషులయిన వారితో 'నా సైనికు లిందఱను జంపి రని నాకు సంతోషము లేదు ! అయ్యో ! వీరిని నేను మాటిమా టికి వలదని యెంత చెప్పినను నాయాజ్ఞలను వినరయిరే ! అక్క టా ! వీరందఱు బ్రతుకుదురా యని యువ్విళ్లూరుచున్నాను ! వారి కిట్టివిధ మెంతమాత్రము తగదు. వారందఱును సత్పు రుషులు. యుద్ధములం దెంతమాత్రము పలాయితులుగారు. ఇట్టివా రెంతయు నరుదు. ఈ వీరునియుద్ధమునఁ జంపినవాఁ డు, నా కెంతయు నప్రియముచేసినాఁడు' యని యిట్టిమా టలు నోటఁ బలుకుచు రాజు దన శత్రువులను జంపినవీరు లను రహస్యమున వారికిఁ దగునట్లు పూజ గావింపవలయును. శత్రువులవలన గాయములు పడిన తనవారి నొప్పులను మానింపఁ జేయుటకై రాజు వారలను మఱింతఁ గూర్చుకొనుటకును, వారి చేతులను బట్టుకొని ప్రేమమీఱ నేడువను వలయును. రా జిట్లు సకల సందర్భములందు సామమును మున్నిడుకొనియే ప్రవర్తిం పవలయును. భయరహితుఁడును ధర్మజ్ఞుండు నగురాజు సమస్త ప్రాణులకును బ్రియుండగును. సకలప్రాణులు నతనియం దెంతయు నమ్మిక గలిగియుందురు. అట్లు వారినమ్మికను బడసి యన్య కా లములందుఁ దగిన పూన్కితోఁగూడి భూమి ననుభవించుటకు సమర్థుఁ డగుచున్నాఁడు. కాఁబట్టి మాయనువిడిచి సమస్త భూత ములకును దనయందు నమ్మికను గలిగించికొనవలయును. అతఁడు

భూమిని ననుభవింపఁ గోరునేని తన ప్రజలనందఱను రక్షింపవల యును' అనెను. ఇది నూట రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు శత్రుజయమునుబట్టి యింద్రునకును బృహస్పతికిని జరిగినసంవాదము యుధిష్ఠిరునకుఁ జెప్పుట. }

ధర్మరాజు 'పితామహా! మృదు వయినపగవానియెడను, ఉగ్రుఁ డయినపగవానియందును, మిక్కిలియు సహాయసంపత్తి గల పగవానియందును, రాజెట్లు వర్తింపవలయునో నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'ధర్మరాజా! ఈవిషయమందును బృహస్పతికిని నింద్రునకును జరిగిన సంవాదమనెడి పురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదరు. దేవేంద్రుఁడు బృహస్పతి చెంతకుఁ బోయి మ్రొక్కి యంజలిఘటించి యతనితో 'బ్రహ్మణోత్తమా! నేను బగవారియెడ నెట్లు ప్రాలుమాలక నడచుకొనవలయును? వారిని నాశము సేయక యేయుపాయములచేత నెట్లడంపవల యును? రెండుసేనలును దలపడినపుడు, జయము సాధారణము గాన రెండుపక్షములయం దెవరికేని గలుగవచ్చును; కనుక నం దొకపక్షమే గెలుచునని నిశ్చయింపరాదు. నేనేమి చేసినయెడల, నెట్లు ప్రవర్తించినయెడలఁ, బ్రకాశించుచున్న నాయీలక్ష్మి, పగ వారిని గ్రాఁచునట్టిది, నన్నుదిగనాడకుండును?' అని యడిగెను. అంత ధర్మార్థకామములందు నిపుణుఁడును రాజధర్మ విధానముల దెలిసినవాఁడును మహాబుద్ధిమంతుఁడు నగు బృహస్పతి యింద్రు

నితోఁ ఎప్పుడుగాని విరోధులను గలహముచేత నడంపఁగోరరాదు. కోపమును నోర్పు లేమియు బాలురు (అవివేకులు) సేవించునట్టివి. శత్రునివధమును గోరువాఁడు శత్రువును నెచ్చరికగలిగి యుండునట్లు చేయరాదు. కోపమును,భయమును, సంతోషమును,తన లోపలనే యడంచుకొని పైకి విశ్వాసముగలవానివలె నుండియు లోపల విశ్వాసము లేకయే శత్రువు ననువర్తించుచు నుండవలయును. ఎప్పుడును బ్రియమునే పలుకవలయును. అప్రియము నించుకంతయుఁ జేయరాదు. పసలేని వైరములనుండి విరమింపవలయును. కొండెములను వర్జింపవలయును. ఇంద్రా! పక్షులను జేత్రాదువైచి పట్టువాఁడు దాను బట్టఁగోరిన పక్షుల యెలుంగుల వంటి యెలుంగులను గూయుచు నాపిట్టలను వశపఱుచుకొనునట్లు, రాజును జతనంబున శత్రువులను దనవశము చేసికొనవలయును; తనకిష్టముండెనా చంపవలయును. పురందరా! రాజు శత్రువులను గ్రిందుపఱిచిన పిదప నెచ్చరికమాని సుఖముగ నిదురింపరాదు.దుష్టాత్ముఁడగు శత్రువు, కుప్పయందలి యగ్గి యారకయేయుండి మరలఁ దలయెత్తునట్లు, తాను మేలుకొనియే యుండి తలసూపును. జయమెవ్వరికిఁ గలుగునో తెలియరాకుండునపుడు, యుద్ధముచేయుట దగదు. మహాత్ములును మంత్రాలోచనము తెలిసినవారు నగు మంత్రులతోడంగూడి చక్కఁగా నాలోచించికొని శత్రువును నమ్మించి తనవశము గావించుకొని పిదప * వాని నడంచి పుచ్చవలయును. † ఒకశత్రువు నుపేక్షిం

* విశ్వాసైర్వోపసన్నమ్యః' అని దా.మూ. 'ఉపసన్నార్థా' అని ఔ. మూ. శత్రువును వశము చేసికొని కోరినప్రయోజనము పొందవలయుననియర్థము.

† ఉపేక్ష్యమాణో విజ్ఞాతో హృదయేనాపరాజితః । అథాస్య ప్రహరేత్కా—

చి యలక్ష్యపెట్టినచో వాఁడు మనసునం దెంతమాత్రములోను గాక యుపాయముల నెఱిఁగి, యట్లు తన్ను పేక్షించిన వాఁడు తనకృత్యమునుండి తప్పిదాఁటిన సమయముచూచి పైకొనికొట్టును. * తన కాప్తు లయినపురుషులనుగొని వాఁడా జయించినరాజు సేనను భేదమూలమునఁ జెఱిపివైచును. † రాజు తనశత్రువు మొదటిని నడుమును దుదిని (అనఁగా నతనినిగుఱించిన సకల విషయములను) దెలిసినవారిని రహస్యముగాఁ బిలిచి విచారింపవలయును. ఆశత్రువుబలములను యథార్థముగాఁగలరూపుదెలిసికొనుచు వానిని, భేదము చేతనునించుక దానములచేతను జెఱిపివుచ్చవలయును. అట్లె విషము మొదలయిన యౌషధములను వారికిఁ జేర్పవలయును. రాజెన్నఁడుగాని పగవారితోడికూడిక నొల్లరాదు. రాజు

లే విధేర్విచలితోయథా అని దా. మూ. 'అవజ్ఞాతః' అనియు, 'కించిద్విచలితే పదే' అనియు జో. పాఠములు. పైని జయింపఁబడినరాజు కర్తగాఁ జెప్పంబడెను. జయించినరాజును కర్తగాఁ గొన్నచో 'అట్లడంచిన శత్రువు హృదయములోన లోఁగక యుండుటను దెలిసికొని యూరకయుండి వాఁడు క్రమమునుండి పొరఁబడిన సమయముచూచి కొట్టవలయును' అని యర్థము చేయవచ్చును. శత్రుజయోపాయఘట్టము గాన యిదియే సమంజసముగా నున్నది.

* 'దండంచ దూషయేదస్య పురుషై రాప్తకారిభిః, అని. మూలము. దీనికి జయింపఁగోరురాజు పరముగా 'ఆశత్రువుయొక్క సేనను ఆప్తులగు పురుషులచే భేదముగల్పించి చెఱుపవలయును' ఇదియే ప్రాకరణికమైన యర్థము.

† 'ఆదిమధ్యావసానజ్ఞాన్ ప్రచ్ఛన్నంచ విచారయేత్' అని దా. మూలము ఆదిమధ్యావసానజ్ఞః ప్రచ్ఛన్నంచ విదారయేత్' అని జో మూలము. రాజా! శత్రువు మొదలు నడుమ తుదలనుదెలిసి రహస్యముగా వానియందు విరోధముఁ గలిగి యుండవలయునని ప్రతాపచంద్రరాయలు.

చాలఁగాల మెదురుచూచుచుండి తుదకు వారి నడంచియే తీఱ వలయును. శచీపతీ!* కాలము నెదురుచూచుచు నెచ్చరికతోడ వారిని నారాధించు చుండవలయును. వారికి నమ్మికగలుగునట్లు ప్రియములు పలుకుచుండవలయును. తోడనే పగవారిని జంప రాదు. †జయము నిశ్చయముగాఁ గలుగుటను గనుఁగొని పిదప వారిపైఁ బడవలయు. అట్లుసేయనిచో మరల నదిహృదయమునకు శల్యము గలిగించును; మరలఁ గ్రొత్తగంట్లు గావించును. సమయమురాఁగాఁ దోడనే కొట్టవలయును. దేవేంద్రా! అట్టికాలము మరలఁ బగవారిని జంపఁదలఁచినపుడు రాదు. పగవారిని జంపఁ దివురు పురుషుఁ డిట్లు వారియెడల నడచుకొనవలయును. కాలము తన్నెదురుచూచుచున్న పురుషుని నొకసారి కడచిపోయె నేని, వాఁడు కార్యము చేయఁగోరినపు డది మరలి వచ్చుట యరుదు. రాజు సాధువుల సమ్మతిని గయికొని, శత్రువుబలిమి పర్వకుండు

---

* 'కాలకాంక్షీచ యుక్తస్సన్నుపాసీతశచీపతే। తథాప్రియంచ వక్తవ్యం యథావిస్రంభమాప్నుయాత్' అని దా. మూలము. 'కాలకాంక్షీహి క్షపయేద్యథా విస్రంభ మాప్నుయుః' అని పైరెంటికి నొకపాదమే జౌ. మూలమునఁ గానఁబడుచున్నది.

† 'న స ద్యోరీ న్వివహాన్యాచ్చ ద్రష్టవ్యో విజయోధ్రువః। యశ్శల్యం ఘటయతి నవం చకురుతే వ్రణమ్' అని దా. మూలము. 'నసంఘూర్ణ వినిహాన్యాచ్చ...। నశల్యం వా ఘటయతి నవాచాకురుతే వ్రణమ్' అని జౌ. మూలము. రాజు శత్రుసేనలందు పెనుమొత్తములను జంపరాదు. అయినను తనకు యుద్ధము దిర మగునంతవఱకును జూచుకొనవచ్చును. శత్రువునకు మనస్సున శల్యముగా నుండునట్టి చెడుగు సేయరాదు. మఱిమాటల చేతను మనకు పుండు చేయరాదు. (అని ప్రతాపచంద్రరాయలు).

నట్లుమాత్ర మడంపవలయును. * అకాలమందు తనకృత్యములను సాధించుకొనఁ జూడరాదు. కాలము సమీపించి యున్నపుడు శత్రువును బీడింపరాదు. కామమును గోపమును నహంకారమును దిగవిడిచి రాజెచ్చరికగలిగి యెపుడును మాటికి శత్రువునందలి ఛిద్రములను వెదకుచుండవలయును. మృదువుగానుండుటయు, బెట్టిదముగా దండించుటయు, అలసత్వమును, ఏమఱిపాటును, శత్రువులు లెస్సగాఁ బన్నువంచనలును, మూఢుఁడగు రాజును నాశముసేయును. ఏరాజీనాలుగును దొలఁగఁబుచ్చి శత్రువుల వంచకపుఁబన్నుగడలకుఁ బ్రతిచేసివారించునో యతడేసందేహమును లేక శత్రువులను గొట్ట శక్తుఁడగును. ఒకరహస్యకార్యమునకు నొక్కమంత్రియె చేయ శక్తుఁడగునేని దానినిఁ గుఱించి యాయొక్కనితోనే యాలోచింపవలయును. పెక్కండ్రు మంత్రులతో నాలోచించినయెడల వారు దాని నొండొరులపయి మోపఁ జూచుటయేకాక రహస్యమగు దానిని వెలువడునట్లును గావింతురు. ఒకరితోడ నాలోచించుట యుక్తముగా నుండిననే రాజు తక్కినవారితోడను గూడి యాలోచింపవలయును శత్రువులు గానరాకుండినపుడు బ్రహ్మదండమును (పురోహితాదుల మూలమున నభిచారాదులను లేక దేవకృత దండ

* 'ఓజశ్చ వినయే దేవ సంగృహ్ణాన్సాధు సమ్మతమ్। అకాలేసాధయేత్కృత్యం నచప్రాప్తే ప్రపీడయేత్' అని ఔ. మూలము. 'ఔజస్యం జనయే దేవ... కాలేన సాధయేత్కృత్య మప్రాప్తే నహిపీడయేత్' అని (దా. మూ.) సాధువులకు సమ్మతమగుకీర్తిని బలమును గలిగించుకొనవలయును. కాలమందుఁ గార్యమును సాధించుకొనవలయును. కాలమును బొందక శత్రువును బీడింపరాదు. అని యర్థము. ఇది క్రిందటి యర్థమంత ప్రాకరణికముగాదు.

మును) వారు కనఁబడినపుడు చతురంగములతోఁ గూడిన సేనను ప్రయోగింపవలయును. అట్లే మొదట భేదమును సామమును ప్రయోగింపవలయును. ఆయాయుపాయమునకుఁ దగిన యాయాకాలము వచ్చినపుడు రా జాయాయుపాయమును ప్రయోగింపవలయును. శత్రువు బలవంతుఁడుగా నుండెనేని సమయము వచ్చినపుడు రాజు వారికినమస్కరింపను వలయును. మఱియుఁ దానెంతయు దేమఱకుండి పగవాఁ డేమఱియుండునపుడు వాని వధింపఁ జూడవలయును. మ్రొక్కుటచేతను, దానముచేతను, దియ్యని పలుకులతోడను మాటలాడుచుఁ బగవానిని ననుసరించి యుండవలయును. ఒకప్పుడును వానికి సందేహము గలుగునట్లు చేయరాదు. శంకకుఁ బట్టయినవాని నెల్లను, శంకాస్పదులయినవారి నందఱను నెప్పుడును వర్జింపవలయును. రాజు తాను గ్రిందుపఱిచిన శత్రువులను నమ్మియుండరాదు. క్రిందు పఱుపఁబడినవారు కీడుసేయుటకు జాగరూకులై యే యుందురు. (శత్రువులకుఁ దనయెడలసందేహము గలుగకుండునట్లు వారినాశ్రయింపవలను గాదు. దీనికంటెదుష్కరమయిన కార్యము వేఱొక్కటియు లేదుసుమీ. *నడవడియొక రీతిగాక నానావిధములనుండు వారి యైశ్వర్యమువలెనే స్వభావమొక రీతిగాక నానావిధములనుండు వారి నడవడియుఁ దిరముగానుండదని చెప్పఁబడుచున్నది.† రాజు మిత్రుఁ డమిత్రుఁడని విచారింపక యుపాయము నూఁది ప్రయత్నింపవలయును. రాజు మృదువుగా నుండినచోఁ బ్రజలవమానింతురు.

---

* తథా వివిధశీలానా మపి సంభవ ఉచ్యతే' అని దా. మూలము. 'వివిధ నాశానామపి' అని పాఠాంతరము.

† ప్రయతేద్యోగమాస్థాయ మిత్రామిత్రా నథారయః' అని దా. మూ

వేంద్రముగా నుండినచోఁ బ్రజలు వడంకుదురు. నీవు కేవలము క్రూరుఁడవుగాఁగాని కేవలము మృదువుగాఁగాని యుండకుము. వేంద్రముగను మృదువుగను నుండుము.అంతటను జలములునిండినదై యురవడిగాఁ బాఱుచున్న ప్రవాహముచే గట్టు తెగిపోవున నుభయమెప్పుడు నుండునట్లే,పరాకుగలిగిపొరఁబడుచుండుటచేత రాజ్యమునకు నాశముగలుగునని భయనుండును.ఒక్కసమయమందే పెక్కండ్రు శత్రువులను ముట్టడింపకుము. పురందరా! వీరలం దొక్కొక్కని, సామముచేతను దానముచేతను భేదముచేతను దండముచేతను జక్కఁగా నలంచి కలంపవలయును. మిగిలినవారియెడ (కొందఱగుటంజేసి) తనసామర్థ్యము చొప్పున నడచుకొనవచ్చును. బుద్ధిమంతుఁడగు రాజు తాను శక్తుఁడై యుండినను శత్రువుల నందఱను నొక్కపెట్ట నడంపఁ జూడరాదు. రాజు రథగజతురగపదాతులు గలదియు, యంత్రములతోఁ గూడినదియు, నిట్లాఱంగములు గలదియుఁ, దనయందు రక్తిగలదియు నగుపెద్దసేన గలిగియుండునపుడును, దన్ను శత్రువుతోఁ జక్కఁగాఁ బోల్చిచూడఁగా ననేకవిధములఁ దానెక్కుడుగా నుండునట్లు తలఁచునపుడును, దానుముందు వెనుక విచారించి బాహిరముగాఁ బైపడి కొట్టవలయును. శత్రుఁడు బలవంతుఁడుగా నుండెనేని సామము దగదు. రహస్యమగు దండోపాయమే యొప్పును. శత్రువులయెడ మృదువుగా నుండుటయుఁ బలుమాఱు దండెత్తిపోవుటయుఁ దగదు. పలనఁగా దాని వలనఁ గలుగు పంటలనాశమును, విషము మొదలగువానిని

లము. 'ఋతతేయోగ మాస్థాయ మిత్రామిత్రం విచారయేత్' (శా. మూ. రాజు లుపాయమునూఁది మిత్రుని నమిత్రుని విచారించి తెలిసికొనవలయు.

బావులు మున్నగు వానియందుఁ గలుపుటయు, మాటిమాటికి సమాత్యుఁడు మొదలయిన ప్రకృతులను గుఱించిన విచారణయు, లేకుండుటను; రా జట్టి సమయములందుఁ బలువిధములయిన మాయలను, శత్రువులకు భేదము పుట్టించుటకై పలుతంత్రములను, పెక్కువిధములయిన కపటవధములను, జేయింపవలయును. తన చేతలవలనఁ గీర్తి గొఱవడకుండునట్లు చేయవలయును. ఆప్తులగుమనుష్యులను గొని పట్టనములందును దేశములందును శత్రువులపోకలు తెలియు చుండవలయును. బలవృత్ర సంహారకా! రాజు శత్రువుల వెంటనంటి, వారిపురములందుఁ జొచ్చి యందలి భోగ్యవస్తువుల నన్నింటిని గయికొనుచుఁ బట్టనములందును విధ్యుక్తముగా నీతివిధుల నేర్పఱచుచున్నారు. మఱియు వారికి గూఢముగా దానములుచేసి, వారి భోగములనెల్ల బాహిరముగాఁ బెఱికికొని వారిని బిట్టుగాఁ గారింపక, వారందఱును దుష్టులనియు వారిదోషములచేత నే యిట్లనుభవించెద రనియుఁ బ్రకటించి వారివలనఁ గొన్నపట్టనములందును రాజ్యములందును దమయధికారుల నియమింతురు. అట్టిసమయముననే వారు తమపట్టనములందు, శాస్త్రవిదులును జక్కఁగా నలంకృతులును శాస్త్రవిధానమందుఁ బ్రసిద్ధులును విద్యలయందు లెస్సఁగా గడిదేఱినవారును, భాష్యములును జెప్పుటయందు బండితులు నగు నితరపురుషులచేత, శత్రువులను జంపునట్టి కృత్యనారాధింపవలయును' అనెను.

ఇంద్రుఁడు, 'బ్రాహ్మణోత్తమా! దుష్టుని లక్షణము లేవియగును? దుష్టుని నెట్లు తెలియనగునో యడిగెదను జెప్పుము' అనెను. అందులకు బృహస్పతి 'దుష్టుఁడు, మఱుఁగున నొకరిపయిని దోష

ములను జెప్పును. మంచిగుణములకు నసూయపడును. తనముం గలఁ బరులగుణములు పొగడఁబడినపుడు పెడమొగము పెట్టికొని మిన్నకుండును. * కారణములేకయే మాటలాడక యుండుటంబట్టి యుఁ దెలిసికొనవచ్చును. నిట్టూర్పు విడుచుటయు, పెదవికొఱు కుటయు,తల పంకించుటయు నుండును. అట్టివాఁడు మాటిమా టికిఁగలసి(తప్పులువెట్టుటకై లేనిపోని విషయములెత్తి)యసంబద్ధ ముగాఁ బలుకుచుండును. అట్టివాఁడు తా నొకరికిఁ బ్రతినచేసిన దాని నతనిదృష్టి తనపయిఁ బొలయకుండునపుడు, చేసితీర్పఁడు. ఆ మనుష్యునిచూపు పయిఁబడెనా, యాదుష్టుఁడు ప్రతిజ్ఞచేసినవిష యమున బ్రస్తావమునకును దేకుండును; వాఁడు తానొంటిగనే కుడుచునుగాని యితరులపొత్తునఁ దినఁడు; ఆయన్నమునుజూచి 'నేఁటి కిది తగినరీతిగా లే'దని తప్పులు వెదకును. కూర్చుండు నపుడును, బరుండునపుడును, బోవునపుడును, వాని భావములు విశేషించి చూపట్టుచుండును. ఆర్తి కలిగినపు డార్తిపడుటయు, సంతోషముగలిగినపుడు సంతోషించుటయు, మిత్రునిలక్షణము. దీనికి విరుద్ధమయిన దేదయో యదియే శత్రులక్షణమని తెలియ వలయును. దేవాధిప ! వీనిని నేఁ జెప్పినట్లు మనస్సునఁ దెలియుము. దుష్టులను దెలుపునట్టి లక్షణముల నిట్లు నీకుఁ జెప్పితిని. శాస్త్రములందలి తత్త్వములను విని యట్లే నడచుకొనుము' అనెను.

భీష్ముఁడు 'బృహస్పతిచెప్పినదివిని,శత్రువులనుఱుమాడుటయం దాసక్తుఁడయిన యింద్రుఁడు తప్పక యట్లే యాచరించెను. జయ

---

* 'ఊరక మాటాడకున్న మాత్రమున దుష్టత్వమునకు లక్షణముగాదు' అని ప్రతాపచంద్రరాయలు; కాని, దీనికుపపత్తి మూలమందుఁ గానరాదు.

మునకై పూని, యాపగవారిని జంపు బలియుఁడు, అందులకుఁ గాలముఱాఁగా, ఉపదిష్టను లయినవాని చొప్పుననే నడచుకొని తన శత్రువులను వశగతులుఁ గావించుకొనెను' అని చెప్పెను. ఇది నూటమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ రాజ్యాదులను బోఁగొట్టుకొన్నవాఁడును ధర్మాత్ముఁడునగు రాజు వృత్తి మొదలగు వానిని గుఱించి కౌసల్యకాలకవృక్షీయ సంవాదమును జెప్పుట. }

ధర్మరాజు 'ధార్మికుఁడయినరాజు, అమాత్యులచేత మిక్కిలియు బాధితుఁడై బొక్కసమును సైన్యమును దనకు లోనుగాకయు, ధనమును లేకయు నుండునేని, సుఖమును బడయుటకు తఁ డెట్లు నడచుకొనవలయును' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు—'ఈవిషయమై క్షేమదర్శినిగుఱించి యీ యితిహాసము చెప్పఁబడుచున్నది. అది నీకుఁ జెప్పెదను. తెలిసికొనుము. మున్నొకకాలమున క్షేమదర్శి యనునొక రాజకుమారుఁడు బలముగుందినవాఁడై కాలకవృక్షీయుఁ డను ముని యొద్దకు వచ్చెనని మాకు వినికి గలదు. అతఁ డామునికి నమస్కరించి 'మహాత్మా! మిక్కిలియు బెట్టిదమయిన యాపదయందుఁ దగులుపడితిని. నేను ధనమున కెంతయుఁ దగుదును. మాటిమాటికి నెన్నిపాట్లుపడినను రాజ్యము నాకు లభించినదిగాదు. ఇట్టి నను బోఁటివానికి మరణమును, దొంగతనమును, పరులనాశ్రయించుటయు, మఱియుఁ దక్కినక్షుద్రము లయినయాచారములును

దక్క వేఱేమిచేయవచ్చును? దానిని నాకుఁ జెప్పుము. మనను తెవులుచేతను దేహవ్యాధులచేతను బాధపడుచున్న మనుష్యు నకుఁ, బెక్కు చదువులుచదివి ప్రజ్ఞయం దాఱితేఱియున్న నిను బోఁటివాఁడే శరణమగును. మనుష్యుఁడు విషయభోగములందు విరక్తినొంది ప్రీతిని శోకమును దిగవిడిచి జ్ఞానమనెడి ధనమును బొంది సుఖముగా వర్ధిలుచున్నాఁడు. ఎవరికి సుఖము ధనము నాశ్రయించియుండునో (అనఁగా ఎవరు ధనమువలననే సుఖమును బడయువారగుదురో) వారినిగుఱించి దుఃఖించుచున్నాను. నాకో వెక్కులు ధనములు స్వప్నములందుఁ బొందినవియుంబోలె నాశమునొందినవి. గొప్పధనరాసుల నొకరు దిగవిడిచిరేని, ఔరా ! వారెంతో దుష్కర మయినకార్యమును జేసినట్లే సుమీ ! మేమో లేకదూలునట్టి యీధనములనుగూడ దిగవిడు చుటకుఁ జాలకున్నారము. బ్రాహ్మణోత్తమా ! ఇట్టియవస్థను బొంది దీనుండై సంపదను దిగనాడి దుఃఖించుచున్న నాకు నిందు వేఱేమిసుఖముగలదు? దాని నుపదేశింపవలయును' అని యడి గెను.

బుద్ధిమంతుఁడగు నారాజకుమారుఁ డట్లడుగఁగా మహాతే జుం డాకాలకవృక్షీయుఁ డతనితో 'నీకు మునుపే యిది తెలిసి యున్నది. కాఁబట్టి 'నేను' 'నాది' యనెడి యిదియంతయును నిత్యనుగా దనెడియీబుద్ధి యుండవలయును. ఎద్దానిని గల దని తలంతువో యదియంతయు నిజమునకు లేదని యెఱుంగు ము. ఇట్టి యెఱుకగలవాఁ డెట్టికష్ట మయినయాపదఁ బొందినను దుఃఖమునొందఁడు. జరిగినదియు జరుగనున్నదియు నెద్దియులేద నుట నిజము. నీ విట్లు తెలియవలసినదానిని దెలియుదువేని వ్యస

నములనుండి విడివడుదువు. * మునుపటివారు గడించినవియు, వారికిఁ బిమ్మటివారు గడించినవియు నన్నియు నశించినవి గాని యిపుడు న్నవిగావు. ఇది తెలిసినచో నెవఁడు దుఃఖపడును. ఈలోక, ముండియు లేనట్టిదగును. లేకుండియు నున్నది యగును. శోకించుటవలన సాధించునదేదియు లేదు. † కాఁబట్టి యేవిధమునను శోకింపరాదు. రాజా! ఇపుడు నీతండ్రియెక్కడ? నీతాత యేఁడీ! నీవు వారి నిపుడు చూడవు. వారును నిన్నిపుడు చూడరు. శరీరమిట్లు సతముగాదని దీనిచే నీకుఁ దెలియుచుండఁగా నీవు వారినిగుఱించి యేలదుఃఖపడెదవు? బుద్ధిచేత నాలోచింపుము. నిలుకడగా నుండున దొకటియు లేదు రాజా! నేనును నీవును నీసుహృదులును శత్రువులును నవశ్యము లేకుండనే పోవుదుము. అన్నియు లేకపోవును. ఇప్పుడిరువదియేండ్లును ముప్పదియేండ్లును గల మనుష్యులందఱును నూఱేండ్లకులోపలనే చావఁగలరు. పురుషుఁడు తన పెనుధనములను విడువ నిచ్ఛగింపకపోయినను బోవుగాక. 'ఇదినాది కాదు' అని ‡ తలఁచి యందువలనఁ దనకు

---

* 'యచ్చపూర్వం సమాహారే యచ్చపూర్వంపరేపరే। సర్వం తిన్నాస్తితే చైవ' అని కుం. మూలము. 'యేచపూర్వసమారమ్భా యేచ పూర్వతరేపరే। సర్వం నాస్తీతితే చైవ' అని దాక్షిణాత్యమూలము. మునుపటివారి పూనికలును వారికంటె మునుపటివారివియు, బిమ్మటివారివియు, మఱి నీయవియు లేవనియే తెలియవలయును. ఇది తెలిసినపిదప నెవఁడు దుఃఖపడును' అని యర్థము. ఇదియే సమంజసముగానున్నది.

† శోకం కుర్యాత్కథంచన' అని మూలము. 'శోచేత సకథంనరః' అని దా. మూలము. అది తెలిసినమనుష్యుఁడు శోకించుటయెట్లు? అనియర్థము.

‡ అనఁగా ఆవిత్తము తనకొఱకుఁగాక తనసుహృదులు మొదలగువారి

మంచి గావించుకొనవలయును. తనకు రాఁగల వస్తువును 'నాది కా'దని తెలియవలయును. కడచిపోయినదానిని 'నాదికా' దని తెలియవలయును. దైవము బలీయమని తలంపవలయును. ఇట్లు తలంచువారే పండితులు. ఇట్లు తలంచుటయే సత్పురుషుల ప్రవృత్తియందురు. పెక్కండ్రు బుద్ధియందును పౌరుషమందును సంపన్నులగువారు గలరు. అందుఁగొందఱు నీకు సమానులు గను, గొందఱు నీకంటె నధికులుగను నున్నారు. వారు ధనహీనులై యుండినను రాజ్యమేలక పోయినను బ్రతికియేయున్నారు. వారు నీవలె శోకించుచుండ లేదు. కాఁబట్టి నీవును శోకింపకుము. నీవుబుద్ధియందును పౌరుషమందును వారికంటె నెక్కుడఁగానా? లేదా సమానుఁడేని కావా?' యనెను.

రాజు 'బ్రాహ్మణోత్తమా! ఆరాజ్యమంతయు నేప్రయత్నమును లేక యలవ్రోకగా లభించినదని తలంచుచున్నాను. బలీయమయిన కాలము దానినంతయు నపహరించికొని పోయినది. తపోధనా! ఆరాజ్యమంతయుఁ బ్రవాహముచేతంబోలెఁ గాలముచేతఁ గొట్టుకపోవుటకు, నే నిపుడు దొరకినదానితోఁ గడుపు పోషించుకొనుచుండుట ఫలముగాఁ జూపట్టుచున్నది' అనెను.

అందులకు ముని 'కోసలాధిపతీ! (జీవయాత్రయందు) యథార్థమైన దిది యని నిశ్చయించుకొని రానున్నదానిని గుఱించియుఁ గడచిపోయినదానిని గుఱించియు శోకింపకుండవలయును. సమస్త విషయములందును నట్లె యుండుము. పడయఁగూడినవాని నే కోరుచుఁ, బడయరానివాని నొకప్పుడునుగోరక, యిప్పటికిఁ గలిగి

కొఱకి ప్యాఁబడినదని తలంపనలయును. దానిచే నతనికి దానమునం దభిరుచి కలిగి శ్రేయస్సు సిద్ధించునని యాశయము.

యుండువాని ననుభవించుచుఁ, గలుగకున్నవానికి శోకింపకుండుము. కౌసల్యా! అట్లుండువేసి, తనుదాన దొరకిన మంచివస్తువులతోనే సంతోషపడుచుండఁగలవు. నీకు సంపదపోయినను, దానికి శోకింపక శుద్ధమయినస్వభావము గలిగియుండుము. చెడ్డబుద్ధిగలవాఁడు తాను మొదట ననుభవించినభోగ్యములు నశింపఁగా భోగములు పోయినందులకుఁగాను ధాత నెప్పుడును నిందించుచుండును. దొరికినవానితోఁ దుష్టినొందఁడు. అట్టివాఁడు తక్కినవారెంత యనర్హులుగా నుండినను, వారిని శ్రీమంతులని తలఁచుచున్నాఁడు. ఈకారణమునుబట్టి యీర్ష్యయు, నహంకారమును గలిగి తమ్ముఁ దామే పురుషశ్రేష్ఠులుగాఁ దలఁచుకొనునట్టివారు మతింతదుఃఖము ననుభవించుచున్నారు. రాజా! ప్రాజ్ఞుండవు. నీ కట్టిమచ్చరము లేదుగదే! నీకు సంపద లేకపోయినను నితరులసంపదకు సైఁచియుండుము. మచ్చరము మాన నేర్చిన నిపుణులగువారు పరులయందున్న సంపదనుగూడ ననుభవింపఁజాలుచున్నారు. ఇతరులను ద్వేషించువానియందు సంపదయుండియునుదొలఁగిపోవును. ధర్మచారులును*త్యాగధర్మములనుదెలిసినవారునగు ప్రాజ్ఞులు సంపదను బుత్రులను బౌత్రులను దమంతటఁద్యజింతురు.(స్వాయంభువకులమునం దుదయించినపుణ్యుఁడు భరతుఁడు, నానారత్నములు నిండిన వెనురాజ్యమును విడిచెనని వినికి. అట్లే తక్కినరాజులును, మహాభ్యుదయసంపన్నమయిన రాజ్యమును విడిచియున్నారు. అట్టిరాజులందఱును రాజ్యము

---

* 'త్యాగధర్మవిదః' అని దా. మూలము. 'యోగధర్మవిదః' అని జో. మూలము. యోగము పుత్రపౌత్రాదివిరక్తికి సాధకమయినను నిచట త్యాగము ప్రస్తుతముగాన 'త్యాగధర్మవిదః' అనుపాఠమే సరసము.

లను విడిచి యరణ్యములకుంబోయి యందలి ఫలములును భుజించుచుఁ దపంబుపారంబునొంది దుఃఖమునంతముం బొందిరి.) అట్లె మఱియుఁ గొందఱు అంకలివస్తువులు పెక్కులు, ఉడుగక పనిచేయుచు సాధింపవలసినదిగా నుండుటంబట్టియు నెంతయు నస్థిరములుగా నుండుటనుజూచియు, నవి మిక్కిలియు దుర్లభములని తలఁచి వానిని ద్యజించుచున్నారు. నీవు మిక్కిలి ప్రాజ్ఞుఁడవు. ఇట్లుండియుఁ గోరఁదగినవియుఁ బరాధీనములయినవియు నస్థిరములునగు ధనములను గోరుచు నేలదీనముగాఁ బరితపించుచున్నావు ? * నేనుజెప్పినబుద్ధిని జక్కఁగానెఱిఁగి నీయంతటనే వీనిని బరిత్యజింపుము. అనర్థము లర్థరూపములుగను, అర్థములనర్థరూపములుగను దోఁచుచున్నవి. కొందఱు ధనమును గడింపఁబోగా ధననాశము గలుగుచున్నవి.† మఱికొందఱాసుఖము ననిత్యముగాఁదలఁచి సంపదను బడయఁగోరుదురు. వేఱుకొందఱు సంపదయందుఁ గ్రీడించుచు నంతకంటె నెక్కుడు లేదని తలఁతురు. ‡ అందులకై వాఁడు పాటుపడుచుండఁగా దానివలన వాని

---

* 'తాం బుద్ధి మనువిజ్ఞాయ త్వమేవైతాంపరిత్యజ' అని దా. మూలము. 'తాం బుద్ధి ముపజిజ్ఞాసుస్త్వమేనైతాం పరిత్యజ' అని ఔ. మూలము. 'నీవు(ధనములన్నియుఁ బోయినను సుఖమును బడయునట్టి) బుద్ధిని తెలియఁగోరెదవు. వీనినెల్ల (కామవిషయములనెల్ల) దిగవిడువుము. అదియే యాబుద్ధి'యని (ప్రతాపచంద్రరాయలు)

† 'అనిత్యం తత్సుఖం మత్వా శ్రియమన్యేన లిప్సతే' అని మూలము. 'ఆనంత్యం తత్సుఖం మత్వా శ్రియమన్యః పరీప్సతి' అని ఔ. మూలము. మఱికొంద ఱాసంపద యనంతసుఖమునకు మూలమని తలఁచి దానిని బడయఁగోరుదురని యర్థము.

‡ 'తథా తస్యేహమానస్య సమారంభో వినశ్యతి' అని ఔ. మూలము. 'సంరంభోఽపివినశ్యతి' అని దా. మూలము.

తక్కిన పూనికలంతయు నశించుచున్నవి. కౌసల్యా! ఒకఁడు తానెంతో కష్టపడి కోరినచొప్పునఁ బడసినధనమును బోఁగొట్టు కొనునేని యపుడు వాఁడు తనపాటంతయు భంగము నొందినందు లకు ధనమువలనియాస లన్నియు దిగవిడుచును. ధర్మాత్ములును గులీనులునగు కొందఱు ధర్మమును బడయుటకే ప్రయత్నింతురు. వీరు పరలోకసుఖమునే కోరుచు నిహలోకపు సుఖములన్నిటను విరక్తులగుదురు. మఱికొందఱు మనుష్యులు, ధనమువలని పేరాసఁ బట్టి ప్రాణములను దిగవిడుతురు. వీరు ధనములేనిచో జీవితము వలన నెంతమాత్రమును బనలేదని తలంతురు. అక్కటా! వీరి దీనతచూడుము! వీరిబుద్ధి లేమిని జూడుము! జీవితము నిలుకడ లేనిదిగానుండఁగా, నిది తెలియక ధనమువలని తృష్ణకుఁ బాలగు చున్నారు. కూర్పుటకు నాశము కడపలగా నుండఁగా, జీవితము నకు మరణము తుదిగానుండఁగా, కూడికకు నెడఁబాటు ముగింపుగా నుండఁగా, వీనియందు మన సెవఁడుంచును? రాజా! పురుషుఁడు ధనమునో, లేక ధనము పురుషునో, తప్పక విడుచుట నిజము. అది తెలిసినవాఁ డెవఁడు కొందలపడును?. ఇంకను గొందఱకు ధనములును సుహృదులును నశింతురు. రాజా! బుద్ధిం గొని చూడుము; మనుష్యులకు గలుగునాపదలు వారినడవడికిఁ దగున ట్లుండుటను జూడుము. కాఁబట్టి (యాపదలకు బరిహారముగా) నింద్రియములను మనస్సును వాక్కునునడంచిపుచ్చుము. ఇవి బలహీనములై యహితములగునేని వీని దొసఁగులునుండి యెవ్వఁడును దన్ను వారించుకొనలేఁడు. *కడచిపోయినవానిని దెలి

* 'ప్రాప్తిస్సృష్టేషు భావేషు వ్యపకృష్టేష్వసంభవే। ప్రజ్ఞానతృప్తో విక్రాన్తస్త్వద్విధో నానుశోచతి' అని మూలము. ఇంవర్థము క్లిష్టముగా నున్నది.

యుటకును,రాఁగలవానిని గనుఁగొనుటకును శక్యముగానందునఁ బ్రజ్ఞానముచేతనే తృప్తినొందియుండు నినుబోఁటిపరాక్రమశాలి కూడికకును నెడఁబాటునకును దుఃఖమునొందఁడు.అట్లుమృదుప్రకృతిగలిగి దాంతుఁడై మంచినిలుకడగలిగి, బ్రహ్మచర్యమాచరించుచుండునినుబోఁటివాఁడుచాపలము లేక దొరకినమట్టునకుస్వల్పమునే కోరుచుండునుగాన ముదమునొందఁడు.దుష్టపురుషులకుచితమైనదియు,దుఃఖయుక్తమయినదియు,మిక్కిలిపాపాత్మకమును,క్రూరవృత్తిగలదియు వంచకులసంబంధించినదియు నగు కాపాలికవృత్తి (పునుకలో బిచ్చమెత్తుబ్రతుకు) నీకెంతమాత్రముతగదు. వాక్కును మనస్సును నడంచి సమస్తభూతములందును దయగలిగి మహారణ్యమందు నొంటిమెయి ఫలమూలములను దినుచునేని సుఖంబుండును.బండికాఁడులంబోని దంతములుగల యేనుఁగులతోఁగూడ నడవియందు సుఖంబుండుటయు, స్వల్పముచేతను సంతోషించుటయుఁ, బండితులకు సహ్యమయినది. ఒక పెద్ద మడుఁగు మిక్కిలియుఁ గలఁగుండునొందెనేని, తానే తనంతటఁ దేటపడును; అట్లె మంచిప్రజ్ఞ నొందినవాఁడు కలఁతనొందెనేని తనంతటనే ప్రసన్నతనొందుచున్నాఁడు. రాజా! నినుబోఁటి స్థితిని బొందినవాఁడీవిధమునను సుఖముగానుండవచ్చునని నాకుఁ

'ప్రతికృష్టేషు భాగ్యేషు హ్యపకృష్టేషు సంభవే। ప్రజ్ఞా ..' అనియుఁ బాఠము గలదు. భాగ్యములు వచ్చినపుడును దొలఁగిపోయినపుడును బ్రజ్ఞానతృప్తుఁడును బరాక్రమశాలియునగు నినుబోఁటివాఁడు దుఃఖమునొందఁడని యర్థము. మఱియొక్కరు పూర్వపాఠమునకు 'తొలఁగియున్న వస్తువులను జూచుట యెవ్వరికిని శక్యముగాదని తెలిసియుండఁ బ్రజ్ఞానతృప్తుఁడు ..' అని యర్థము చేసియున్నారు.

దోఁచుచున్నది. నీకు సంపద మరల దొరకరాకుండఁగా, మంత్రులు మొదలయినవారును లేకుండఁగా, నిట్టిదారియే యర్థ్యము. కాని దైవమునే నమ్మి మేలు పడయఁ గోరెదవా? ఇది నూట నాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(క్షేమదర్శికిని గాలకవృక్షీయుఁనకును శత్రువులను గెలుచు కపటోపాయములను గుఱించిన సంవాదము.)

ముని—'క్షత్రియా! లేక నీయందుఁ బౌరుషమే దేని గలదని నీకుఁ దోఁచెనేని నీరాజ్యమును మరలఁబడయుటకుఁ దగునీతిని జెప్పెదను. నీ వానీతి ననుష్ఠించుటకు శక్తిగలిగి యందులకు వలయు కార్యములను జేయుదువేని నీసంపదను నింకను బడయ వచ్చును. నీకు నేనును గలరూపునఁ జెప్పునదంతయు వినుము. నీవు నేను జెప్పినకార్యమును జేయుదువేని మిక్కిలి గొప్ప యర్థములనో, రాజ్యమునో, లేక రాజ్యమంత్రమునో మిక్కిలి సంపత్తినో పడయఁగలవు' అనెను.

రాజు 'మహాత్మా! నీతి నుపదేశింపుము. పౌరుషము గలిగి యున్నాను. ఉపదేశింపుము. ఇప్పుడు నీతోడిసమాగమము నాకు ఫలకారిగా నుండుఁగాక' యనెను.

ముని—'నీవు మానమును, డంభమును, కోపమును, హర్షమును, భయమును విడిచి, నీశత్రువులకు మొక్కి చేతులు మోడ్చి కొలువుము. ఉత్తమమును బరిశుద్ధము నగుకార్యముల నెప్పుడును గావించుమిథిలాపతి యగుజనకునిఁ గొలువుము.

అతఁడు*సత్యమెంతయును దప్పక నీకు ధనము నొసంగ నర్హుఁడు. అప్పుడు నీవు విదేహరాజునకుఁ గుడిభుజమవై యందఱకు విశ్వాస పాత్రమగుదువు. అందువలన నీకు నుత్సాహవంతులును వ్యసన దూరులును బరిశుద్ధులునగు సహాయులు పెక్కండ్రుగలుగుదురు. ఒకఁడాత్మనిగ్రహముగలిగి యింద్రియములను గెలిచి తనకు శాస్త్రవిహితములయిన వానియందు వర్తించుచుండునేని,వాఁడు తన్నుఁ బయికినుద్ధరించుకొనుటయే కాక తక్కినవారినిఁ దనకుఁ బ్రసన్నులను గావించుకొనును. అంత ధృతిమంతుఁడును శ్రీమంతుఁడు నగు నాజనకునిచేత సత్కృతుండవై యతనికిఁ గుడిభుజమవై సమస్తజనులనమ్మికను బడయుదువు. అంత నీవు పెక్కండ్ర సుహృదులబలిమిని బడసి మంచిమంత్రులతో లెస్సగా నాలోచించి, యాప్తులనుగొని శత్రువులందు భేదముపుట్టించి బిల్వముచేత బిల్వమునుగొట్టునట్లు వారినందఱను గూల్పుము. లేదా, నీశత్రువునకు శత్రువగువానితోడ సంధిచేసి నీశత్రువు బలమును నాశనము సేయుము. శత్రువునకు మిక్కిలి లభింపరాని సొగసయిన వస్తువులయందును,సుందరులయిన స్త్రీలయందును, వెలపొడుగయిన వస్త్రములు శయనములు ఆసనములు వాహనములు మొదలగువానియందును, గృహములయందును, నానావిధములయిన పక్షులయందును, మృగజాతులయందును, రసములందును,గంధములందును,ఫలములందును,†మిక్కిలి తగులుగలి

* 'సత్యసంగరః' అని ఔ. మూలము. 'సత్యవిక్రమః' అని దాక్షిణాత్య మూలము.

† ఈవస్తువులందెల్లఁ దగులు గలుగుటవలన శత్రువు బొక్కసమంతయు నిందులకై వ్యయముకాఁగా వాఁడు తనంతటఁ దానే నశించునని యాశయము. ప్రతాపచంద్రరాయలు.

గించి, దానివలనఁ దనంతటఁ దానే నశించునట్లు చేయుము. ఇట్లా శత్రువును వారింపవలసినను, లేక యుపేక్షింపఁదగియుండినను, మంచినీతి చొప్పున నడవఁగోరువాఁడు దేనినిగాని యాశత్రు వొకప్పుడును దెలిసికొనునట్లు చేయరాదు.* నీమిత్రులకు సమ్మతమగు మార్గమున శత్రువుపట్టణమందును, దేశమందును, మిత్రునివలె వసించియుండుము. మఱియుఁ బసమాలినగుక్కలయు, జింకలయుఁ, గాకులయు నడవళ్ల ననుకరించుచుఁ బయికి మిత్రధర్మమును నటించుచు నుండుము. మఱియు వారిని మిక్కిలియు గొప్పవియుఁ జేయుటకసాధ్యము లయినవియు, మహానదివలెఁ గడవ నలవిగానివియు నగు ప్రారంభములందుఁ జొనుపుము. బలవంతులతోడ విరోధము వెట్టించుము. మిక్కిలి రమణీయములయిన యుద్యానములు శయనములు, ఆసనములు మొదలగువానింబోని † యింపారు భోగముల మూలమున వారిబొక్కసమును రిత్తగావింపుము. వీనికొఱకు ‡ యజ్ఞములను దానములను బొగడుము. దానివలన

---

* 'ఏసస్య పురమామిత్రం విషయే మిత్రసమ్మతః। భజస్వ శ్వేతకాకీయైర్మిత్రధర్మమనర్థకైః' అని దా. మూలము. 'రమస్వపరమామిత్రే విషయే ప్రాజ్ఞసమ్మతః।...' అని జౌ. మూలము. ప్రాజ్ఞులకు సమ్మతిమగు చొప్పున వర్తించుచు శత్రువు దేశమందు మిక్కిలియు రమించుచుండుము.' అని యర్థము. శ్వేతకాకీయమనఁగా శ్వా (కుక్క) + ఏత (జింక) కాక (కాకి)ములను సంబంధించిన ధర్మములు- కుక్కవలె జాగరూకతయు, జింకవలె బెదరును, కాకివలె పరేంగితములను దెలియుటయుఁ గలిగియుండుటయని తెలియునది.

† ప్రీతిభోగసుఖేనైవ (దా. మూ.) ప్రతిభోగసుఖేనైవ (జౌ. మూ.)

‡ యజ్ఞదానే ప్రశంసాస్మై బ్రాహ్మణా ననువర్తయ (దా. మూలము.) ప్రశాధ్యస్మై బ్రాహ్మణా ననువర్ణ్యతాః (జౌ. మూ.)

బ్రాహ్మణులను సంతోష పెట్టుము. వారు (దక్షిణాదులను నీచేతు లారఁదీసికొని) నీకుఁ (దపములచేతను లేక క్రియలచేతను) మంచి గావించుచు నీశత్రువును దోఁడేళ్లుంబోలె మ్రింగుదురు. పుణ్యశీలుండగువాఁడు తప్పక పరమగతిని బొందును. పుణ్యకార్యములవలన దేవలోకమందు మిక్కిలి పుణ్యము లగుశాశ్వత పదములను బొందును. ఒకఁడు ధర్మకార్యములయందును నధర్మ కార్యములందును బ్రేరితుఁడగుటం జేసి వానిబొక్కసము క్షీణింపఁగా వాఁడు శత్రువులకు వశగతుఁ డగుచున్నాఁడు. కోశము స్వర్గమందలి సుఖఫలమునకును భూమియందలి జయమునకును మూలము. కోశములవలననే శత్రువు లట్టిసుఖమనుభవింతురు. కాఁబట్టి దానిని సర్వవిధముల రిత్తగావింపుము. నీశత్రువు బ్రోలఁ బౌరుషమును గొనియాడకుము. దైవమునే యెక్కుడుగా వర్ణింపుము. దైవమునే మిక్కిలి యూఁదియుండు వాఁడు తప్పక శీఘ్రముగానే నశించును. నీశత్రువుచేత * విశ్వజిత్తనెడి యాగమును జేయించి వానిని సర్వస్వమునకుఁ బాయు నట్లు చేయుము. పిదప † వాఁడు మహాజనులను బీడించుచు ధనమొడఁగూడనివాఁడై పోవును. ‡ త్యాగధర్మము నెఱింగిన

---

* విశ్వజిత్తనెడి యాగమున సర్వస్వదానము విహితముగాన యట్లు చేయింపుమనుట తెలియునది.

† 'తతోగచ్ఛత్యసిద్ధార్థః పీడయానో మహాజనమ్. (దా. మూలము.) తతో గచ్ఛతి సిద్ధార్థః పీడ్యమానం మహాజనమ్' అని. జొ. మూలము. అంత నీకోర్కె యీడేఱును. పిదప బొక్కసము నించుటకై మహాజనులుపీడితులగుటను శత్రువునకుఁ దెలుపవచ్చును- అని ప్రతాపచంద్రరాయులు.

‡ 'త్యాగధర్మవిదం' అని. దా. మూలము. 'యోగధర్మవిదం' అని జొ. మూలము. మహాజనులు పీడితులయిరని ప్రజలందు నిస్పృహకలిగించి పిదప

పుణ్యాత్ముని నొకనిని వీనికి వర్ణించి చెప్పుము. ఒకవేళ నీశత్రువు త్యాగమేని చేయఁగోరును; క్షేమముగా నుండుటకై యడవులకేని పోవును. నీవు పిదప సమస్తశత్రువులను నాశము సేయునట్టిదియు పెక్కుమూలికలచేత సిద్ధము గావింపఁబడినదియునగు నౌషధములను, కృత్రిమములగు నుప్పులను, బ్రయోగించి శత్రువునకుఁ గలగజములను నశ్వములను మనుష్యులను నాశము సేయింపుము. రాజపుత్రా! ఇట్లు చక్కఁగా నాలోచించి యిట్టివియు మఱియు నితరము లయినవియునగు కపటోపాయములఁ బెక్కింటిని బ్రయోగించుట దిట్టయగువానికి శక్యముకాని దిట్టగానివానికి శక్యముగాదు' అని చెప్పెను. ఇది నూటయేనవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ కాలకవృక్షీయునియానతిని క్షేమదర్శి మరల రాజ్యప్రాప్తి మొదలగువానిని బడయుట. }

రాజు 'బ్రాహ్మణోత్తమా! కపటముచేతను డంభముచేతను జీవించుటకు నేనొల్లను. ధనములు మిక్కిలియు నధికములయినను గూడ నధర్మముతోఁ గూడియుండెనేని నా కిష్టముగావు. మహాత్మా! మొదటనే నేను వీనిని వలదంటిని. దేనియందుఁ బాపము

త్యాగవిదునితోడి కూటమి గలిగించుటవలన రాజ్యమును ద్యజించునట్లు చేయఁ గలుగుననియుఁ బిదప రాజ్యము నీకు సిద్ధించుననియు భావము. యోగధర్మమను నాతఁడును రాజ్యవిరక్తికి సాధకమే. పెక్కుచోట్ల 'త్యాగ'మనుటకు యోగకుసని పాఠముండుట చూపట్టుచున్నది.

నెడి శంకకలుగదో, యేది యన్నివిధముల హితమగునో, దేనిచేత
నెంతమాత్ర మితరులకు బాధగలుగదో, యట్టి ధర్మముచే నే నీ
లోకమున బ్రతుకఁ గోరుచున్నాను. నీవుచెప్పినరీతిని జేయుటకు
నేను శక్తుఁడను గాను. ఇది నాకు యుక్తముగాదు' అనెను.

ముని 'క్షత్రియా! ఇట్లు మాటాడుటంబట్టి నీవు నీతిగలవాఁడవని
తెలియుచున్నది. నీవు స్వభావముచేతను బుద్ధిచేతను నీతిమంతుఁ
డుగ నున్నావు. నీయెఱుక యద్భుతముగానున్నది. నీకును నా
విదేహరాజునకు నుభయులకును సహాయముచేయుటకుఁ బ్రయ
త్నించెదను. లేదా మీ యిరువురకును శాశ్వతమయి యెడఁ
బాయకుండునట్టి కూడికనయినను గలిగించెదను. సత్కులప్ర
సూతుఁడును నక్రూరుండును మిక్కిలి చదువరియు రాజ్య
ము నడపుటయందు సమర్థుండు నగునినుబోఁటివాని నెవఁడమా
త్యునిఁగాఁ జేసికోనఁడు? క్షత్రియా! నీవు రాజ్యమునుండి వెడ
లఁగొట్టంబడియు, మిక్కుటమయినవ్యసనముపాలయ్యు, నక్రూరం
బగు నడవడిని బ్రతుకఁగోరెదవు; కాన యిట్లు చెప్పుచున్నాను.
సత్యసంధుఁడగు విదేహరాజు నాగృహమునకు శీఘ్రమున వచ్చు
ను. అతఁడు నే నేమి యానతిత్తునో దానిని దప్పక చేయును'
అనెను.

భీష్ముఁడు.—అంత ముని వైదేహునిఁ బిలిచి 'రాజా! ఇతఁడు
రాజకులమునఁబుట్టినవాఁడు. ఇతని యంతరంగము నాకుఁ దెలియు
ను. ఇతనియాత్మ యద్దమువలెను, శరత్కాలపుఁజందమామవలెను
శుద్ధముగా నుండును. ఇతనియందు దోషము గానరాదు. నే నన్ని
విధములచేతను నితనిని బరీక్షించితిని. నీ కితనితోడఁ జెలిమియే
యుండుఁగాక, నాయందుంబోలె నితనియందును నమ్మిక గలిగి

యుండుము. అమాత్యుఁడు లేక రాజ్యము నేల శక్యముగాదు. అమాత్యుఁడు శుద్ధుఁడుగను బుద్ధిసంపన్నుఁడుగను నుండవలయును. ఆ రెండుగుణములచేతనే రెండులోకములును సిద్ధించును. రాజా! రాజ్యము నేలుటకు నీ రెండుగుణములు గావలసియుండుటను జూడుము. ధర్మాత్ములగు వారికి లోకమునం దెచ్చటఁగాని యిటువంటిమార్గము వేఱొకటిలేదు. ఈరాజపుత్త్రుఁడు మహాత్ముఁడుగను సాధువులమార్గము నొందినవాఁడుగను నున్నాఁడు. *ఇతఁడు ధర్మమును మున్నిడికొన్నవాఁడుగాన యిట్టివానిని గయికొనుటయెంతయు లెస్సపని. ఇతనిని, లెస్సగా గారవించుచు వత్తువేని, నీశత్రువుల పెనుసమూహములను గలఁచివుచ్చును. ఇతఁడు నీతో యుద్ధమునకుఁ దలపడెనా యది క్షత్త్రియుఁ డగువానికి స్వధర్మమేయగును. ఇతఁడు తనతండ్రితాతల చొప్పున నిన్ను యుద్ధమున జయింపఁగోరునేని నీవును బగవారిని గెలుచుటయనెడి క్షత్త్రియవ్రతము ననుష్ఠించువాఁడవు గనుక, నీకును నితనితోడ యుద్ధము సేయఁదగును. అయినను నీవు యుద్ధము చేయకయే సామయోగమున, నీహితమును గోరి యితనిని నీవశమునం దుంచుకొనుము. అయుక్తమగు లోభమును దిగవిడిచి ధర్మమునందుఁ గన్నుంపుము. కామమువలనఁగాని ద్రోహమువలనఁగాని నీవు స్వధర్మమును విడుచుటతగదు. ఎప్పుడును జయమేకలుగదు.

* సుసంగృహీత స్త్వేవ వై మ త్వయా ధర్మపురోగమః । సంసేవ్యమానా శ్శత్రూం స్తే గృహ్ణీయాన్మహాలోకణాన్. అని. మూలము. అసంగృహీత ... గృహ్ణీయాన్మహాలోకణాన్. అని. (ద్రా. మూలము.) ఇతని నీవు గయికొనకపోయితివేని నీశత్రుసమూహములను! జేపట్టునని యర్థము తెలియునది. (ప్రతాపచంద్రరాయలు.)

ఎప్పుడు నపజయమే కలుగుటయులేదు. కాఁబట్టి శత్రువును దన్నేలుకొనునట్లును జేయవలయును.శత్రువును దా నేలుకొనను వలయును. జయపరాజయములు రెండును దనయందుఁ గలుగు టను జూడవచ్చును. పగవానిని నిశ్శేషముగాఁ జంపఁజూచు వారికి నట్లు దామే నిశ్శేషముగాఁ జేయఁబడునట్టి భయము కలుగవచ్చును' అనెను. ముని యిట్లుచెప్పఁగా జనకుఁడు పూజార్హుఁ డయినయాబ్రాహ్మణోత్తమునిఁ బూజించి సత్కరించి యతనితో 'నీవు మహాప్రాజ్ఞుఁడవు. మిక్కిలి చదువరివి. నీవు శ్రేయస్సునుగోరి యేమిచెప్పెదవో యది మాయుభయులకును హితమగును. నీవేమిమియెట్లు చేయఁజెప్పితివో దానినంతయు నట్లు చేసెదను. ఇదియేనాకు శ్రేయము. ఈవిషయమై నాకు విచారింపవలసినది లేదు' అనెను. పిదప విదేహరాజు కోసలరాజును బిలిచి 'రాజసత్తమా ! నేను రాజధర్మముచేతను బుద్ధిచేతను బలిమిచేతను భూమిని జయించితిని. నీవు నీగుణములచేత నన్ను జయించితివి. నీవు నిన్నుఁ గ్రిందుపఱచుకొనక (అనఁగా నాచేత జయింపఁబడునట్లు తలంచుకొనక) (నాయొద్దనుందువేని) జయమొందినవానివలె నుండుము. నేను నీబుద్ధిని గౌరవించుచున్నాను. నీపౌరుషమును గౌరవించుచున్నాను. నిన్ను నేను గెలిచితినని చెప్పుచు నిన్నవమానింపను. నీవు జయించినవానివలె నుండుము.రాజా ! నీవు విధ్యుక్తముగా నాచేతఁ బూజితుండవై నాగృహమునుండి నీయింటికిఁబొమ్ము' అనెను. పిదప వారిరువురును

---

* 'తస్మాద్భోజయితవ్యశ్చ భోక్తవ్యశ్చ పరోజనః' అని కౌ. మూలము. 'తస్మాజ్జయశ్చభోక్తవ్యో భోక్తవ్యశ్చపరాజయః' అని. దా. మూ. జయమును ననుభవింపవలయును. అపజయమును ననుభవింప వలయును.

గాలక వృత్తీయమునిని బూజించియొండొరులయందు నమ్మికయుంచి తమతమ గృహములకుం బోయిరి. అంత విదేహరాజు కౌసల్యుని వేగ తనగృహమునకుఁ దోడ్కొనిపోయి పూజార్హుండగు నతనిని నర్ఘ్యపాద్యము లొసంగి మధుపర్కమునిచ్చి పూజించెను; మఱియు నతనికిఁ దనకుమారిక నిచ్చి నానావిధముల రత్నముల నొసఁగెను. ఇట్లు సంధియే రాజులకుఁ బరమధర్మము. ఏలన జయాపజయములు రెండును గలుగుట సమములే కాన నతములు గావు' అనెను. ఇది నూటయాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు గణవృద్ధి మొదలగువానిని జెప్పుట.

ధర్మరాజు 'పరంతపా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల ధర్మవృత్తులును వారలవిత్తములను, జీవనోపాయములను వాని ఫలములను జెప్పితివి; మఱియు రాజులనడవళ్లను, బొక్కసమును బెంచువిధములను వారిజయములను జెప్పితివి. అమాత్యుల గుణములను వృత్తులను బ్రజలను వృద్ధినొందించు విధములను, సంధివిగ్రహాదు లయిన యాఱుగుణముల లక్షణములను, సేనల నీతియు, దుష్టులను దెలిసికొను విధమును, దుష్టులు కానివారల లక్షణములును, సమానులయుఁ, దక్కువ వారలయు, నధికులగువారలయు యథార్థలక్షణములను, మధ్యస్థులను సంతోషపెట్టుకొఱకు వృద్ధినొందఁ గోరువాఁడు వారియెడల నుండవలసిన యునికియు, క్షీణులగువారిని నాదరించువిధమును, వారి జీవనోపాయమును జెప్పితివి. నీవు పీనినంతయు, శ్రుత్యాదిగ్రంథములం

దున్న చొప్పున సులభమయిన విధుల రూపమున వివరించి తివి. అట్లె జయింపఁగోరువానికిఁ దగునడవళ్లును జెప్పితివి. నీవు మతిమంతులందు మేలుబంతివిగదే. కాన, రాజును బరివేష్టించి యుండుశూరగణములయెడనడచుకొనవలసిన విధమును వినఁగోరు చున్నాను. ఆగణము లెట్లు వర్ధిలుదురో, యెట్లురాజువలన భేదిల్లక సమున్నతులై యుందురో, వా రెట్లు శత్రులను జయింపనేర్తురో, మఱి యెట్లు మిత్రులను బడయుదురో, తెలియఁగోరెదను. గణము లనాశమునకు భేదమే మూలమని నాకుఁ గనుపట్టుచున్నది. మఱియుఁ బెక్కండ్రుగూడి యాలోచించిన రహస్యమును గప్పి పుచ్చుట యెంతయుఁ గష్టమని నాకుఁ దోఁచుచున్నది. ఇది నేను బూర్ణముగా వినఁగోరుచున్నాను. ఆశూరగణము లెట్లు రాజుతో భేదము నొందకుండునో చెప్పుమా' అనెను. భీష్ముఁడు 'గణములకును రాజులకును సదుమ లోభమును జూపోపమియునుఁ గోపమును వైరమును బెంచుచున్నవి. ఈ యిరుతెగలయం దొకరు (అనఁగా రాజు) * లోభమును జెందుచున్నాఁడు. పిదప మఱొకరు (గణమును) దోడనే సైరపమిఁ (గోపమును) బొందుచున్నది. † ఇట్లా యిరుతెగలు నొకరినొకరు సైరింపక యొండొరులయెడఁ బ్రతి కూలమయిన యభిప్రాయములు గలిగి, చారుల నియోగించియు,

* రాజు లోభమువలన జనులపై పెక్కుడుపన్నులను వేయఁగాఁ బ్రజలు రాజును నాశము సేయఁ జూతురని తాత్పర్యము.

† తతో ద్వ్యామర్ష సంయుక్తా వన్యోన్యజనితాశయా । చారమంత్ర బలాదానైః సామదాన విభేదనైః ॥ క్షయవ్యయభయోపాయైః ప్రకర్ష న్తీతరేతరమ్ ।' అని. దా. మూలము. 'తౌ క్షయవ్యయసంయుక్తా వన్యోన్యంచ వినాశినౌ । చార...... భేదనైః ॥ క్షయవ్యయభయోపాయైః కర్షయన్తీతరేతరమ్' అని జా. మూలము. ఒకరినొకరు క్షీణింపఁజేయుటకును నాశము సేయుటకును

శత్రులాలోచించియు, బలిమిమెఱసియు,నెక్కువ కప్పము మొదలయినవి పుచ్చుకొనియు,సామదానభేదములను బ్రయోగించియు, క్షీణతనునాశమును భయమునుగలిగించు పెక్కుపాయములచేత నొకరినొక రతిశయింపఁ గడఁగుదురు. అందు గణములు మొత్తముగాఁగూడి మాడియుండువారుగాన రాజు తమవలన నెక్కువగాఁ బుచ్చుకొనునేని యతనినుండి మొత్తముగా వేఱుపడసాగుదురు. ఇట్లు రాజునుండి వేఱుపడి యందఱును మనసులు చెడి, భయమువలన,రాజు శత్రువునకు వశగతులగుదురు.గణములవారు నొకరినుండి నొకరు వేఱుపడిరేని నశింతురు; అట్లు వేఱుపడుటవలన (మొత్తముగా నుండుటవలని బలిమి తఱఁగి) శత్రువులకు సులభముగా లోఁబడుదురు. కాఁబట్టి గణములవారు మొత్తముగానుండియె యెంధులకును బ్రయత్నము చేయవలయును. వారు మొత్తముగఁ గూడి మాడియుండురేని (యొరిమగలరేని) యందువలని బలిమిచేతను బౌరుషములచేతను వారు వలసిన యర్థములను బడయుదురు. వారట్లు(ఐకమత్యమున) మొత్తముగాఁ గలసిమెలసి వర్తింతురేని బయటివారును వారితోడఁ జెలిమి చేసికొందురు. ఇట్లు వీరొకరికొకరు ప్రేమతోడఁ గూడి తోడుపడుచుందురేని మిక్కిలి జ్ఞానవంతులగు వారు వీరి నెంతయుఁ గొనియాడుదురు. అందఱు సుఖముగా వేఱువేఱు తలంపులను వీడి యేకార్యమందు నైకమత్యముగలిగి యుందురేని యన్నివిధముల సుఖముగా వర్ధిల్లుదురు. ఉత్తము లయినగణములవారు శాస్త్రముచొప్పున మిక్కిలి ధర్మయుక్తము లయిన

బూని యొండొరులను దుదముట్టింతురు. చారులు మొదలయిన యుపాయములచే నొకరినొకరు కాపాడుదురని యర్థము.

వ్యవహారములను గలరూపునఁ గనుఁగొని నెలకొలుపుచు నందు వలన నెంతయు వృద్ధినొందుదురు. పుత్రులను దోఁబుట్టువులను నడఁకువ గలిగించి వారికిఁ జదువు మొదలయినవానిని గఱపి వినయ వంతు లగు పెద్దలను నెప్పుడును నాదరించుచును వృద్ధినొందు దురు. మఱియు వారు చారులను నియమించుట యందును, మంత్రములను విధించుటయందును, కోశసములను నించుట యందును నెప్పుడు నెచ్చరికగలిగి యన్నివిధములను వర్ధిల్లు దురు. మఱియు గణములవారు, ప్రాజ్ఞులను, మిక్కిలి యుత్సాహ వంతులను, నిలుకడయైన పౌరుషముగలవారును శూరులు నగు వారి, నెంతయు జాగ్రత్తతోడ నెప్పుడును గౌరవించుచు వృద్ధి నొందుదురు. ధనవంతులును శూరులునై, శస్త్రవిదులును శాస్త్రపారీణులునై యుండు గణములవారు, మూఢులగు జనులను మిక్కిలి కష్టములయిన యాపదలనుండి దాఁటింతురు. ధర్మరాజా! క్రోధమును, భేదమును, భయమును, దండమును, బాధించుటయు, నిగ్రహించుటయు, వధించుటయు (రాజు చేసిన యెడల) నవి గణ ములవారిని శత్రువునకు వశగతులంగావించును. కాఁబట్టి యాగణ ముల ముఖ్యులగువారిని ముఖ్యముగా సమ్మానింపవలయును. రాజా! లోకయాత్ర లెఱచుగా వారి యధీనమందున్నది. మంత్రాలోచనమును గణముఖ్యులతోడనే కావింపవలయును. చారులను వారి వశమందే యుంపవలయును. రాజు గణముల వారియందొకొక్కరితోను మంత్రాలోచనములు చేయరాదు. రాజు, గణముఖ్యులతోఁగూడి యాలోచించి గణమునకుహితమైన నదిగావింపవలయును. గణములవారు పరస్పరము వేఱుపడి యైక మత్యము లేకయు నాయకుఁడు లేకయు నుండిరేని వేఱువిధము

లయిన యుపాయములను జేయవలయును. గణములవా రొకరి కొకరు భిన్నులై తమతమ చెల్లుబడి కొలఁదిని వర్తింపఁజూతు రేని వారికిఁగల యర్థము లడుగంటుటయేకాక యనర్థములును బుట్టుచున్నవి. వారియందుఁ బండితులగువా రొకరియం దొక కలహము పుట్టినా తోడనేదానిని నడఁచిపుచ్చవలయును. కుల మందుఁ బెద్దలగువా రపేక్షగలిగి యున్నయెడలఁ గులమునందుఁ గలహములుపుట్టి కులమునంతయు నాశముసేయును. మఱిగణ ములకుఁ బరస్పరభేదము పుట్టించును. లోపలఁ గలుగు భయ ములనుండి నిన్నుఁగాచుకొనుము. వెలుపలనుండి గలుగుభయము లంతగా సారమైనవిగావు. లోపలనే కలుగుభయము, రాజా! యపుడే మూలములను ద్రుంచివైచును. జాతియందును గులము నందును సమానులయినవారు సహజములయిన క్రోధమోహ ములచేతను లోభముచేతను నున్నట్టుండి యొకరితో నొకరు మాటాడకుందురు. ఇది పరాభవమునకు లక్షణము. శత్రువులు గణముల నడఁగఁద్రొక్కుట తమపూన్కిచేతను, బుద్ధిచేతను, రూపముచేతను, ధనముచేతను గాదు; మఱి వారియందలి భేదముచేత నల్లుసేయుదురు. కాబట్టి గణములవారికి మొత్త ముగాఁగూడి మాడుటయే గొప్ప రక్షకమని చెప్పుదురు'. ఇది నూటయేడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు మాతృపితృగురువుల మహిమలను వర్ణించుట

ధర్మరాజు 'ధర్మమార్గము మిక్కిలియుఁ బెద్దది, అందలి శాఖలును బెక్కులు. ధర్మములలోపల మిక్కిలియు ననుష్ఠింపఁ

దగినది లోకమందేదియని నీవు నిశ్చయించి యున్నావు. సమస్త
ప్రాణులకును నేకార్యము చేయుట మిక్కిలి గొప్పదని నీ
మతమో, మఱినాకు నిందును నందును మిక్కిలియు ధర్మము
నొడఁగూర్చునో చెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'తల్లిని దండ్రిని గురువును బూజించుట మిక్కిలియు
ముఖ్యమని నామతము. ఇందు దీనిని జేయువాఁడు మంచిలోక
ములను మహనీయమైన యశస్సును బొందుచున్నాఁడు. నాయ
నా! యుధిష్ఠిరా! వారిని జక్కఁగాఁ బూజించి వారేమిచేయు
నానతియిత్తురో యది ధర్మముగాన ధర్మవిరుద్ధముగానే చేయ
వలయును. వారానతియ్యని ధర్మమును మఱెద్దానిని జేయరాదు.
వారేదిచేయుమని యానతిత్తురో యదియే ధర్మమనుట నిశ్చ
యము. వారే మూఁడులోకములు; వారే మూఁడాశ్రమ
ములు; వారే మూఁడువేదములు; వారే మూఁడగ్నులు. తండ్రి
గార్హపత్యాగ్నియుఁ దల్లి దక్షిణాగ్నియు, గురు వాహవనీ
యాగ్నియుఁగాఁ జెప్పఁబడుచున్నారు. ఈమూఁడగ్నులును
మిక్కిలి గొప్పవి. ఈమూఁడగ్నులయందును బ్రాలుమాలిక
లేక యుందువేని మూఁడులోకములను సయితము జయిం
తువు. తండ్రిని బూజించుటవలన నీలోకమును, దల్లిని బూ
జించుటవలనఁ బరలోకమును, గురువును బూజించుటవలన బ్రహ్మ
లోకమును గట్టిగ జయింతువు. ఈమువ్వురయెడఁ జక్కఁగా
నడపుము. ముల్లోకములందును గీర్తినొందుదువు. నీకు శుభం
బుగలుగును. మహాఫలంబగు ధర్మంబును జేకుఱును. నీవు వారిని
మీఱియుండకుము. వారు కుడువక నీవు భుజింపకుము; వారలు
భుజించుదానికంటె మేలయిన దానిని భుజింపకుము; వార

లను దూషింపకుము. ఎప్పుడును వారికిఁ బరిచర్య చేయుచుండుము. అదియే యుత్తమమయిన పుణ్యము. నీవు కీర్తిని బుణ్యమును యశమును మంచిలోకములను బడయుదువు. ఎవఁడా మువ్వురను నాదరించునో వాఁడన్నిలోకములను నాదరించినవాఁడగును. వారి నాదరింపనివాఁడు చేయు క్రియ లన్నియు నిష్ఫలములే యగును. ఆమువ్వురు గురువులను నెవ్వఁడెప్పుడును బూజింపకయే యుండునో వానికీలోకమును బరలోకమును గీర్తియుఁ గలుగవు. వానికీర్తి యీలోకమందును బరలోకమందును వెలుంగదు. మఱియుఁ బరలోకమందుఁ గలుగునవిగాఁ జెప్పంబడు తక్కినశుభమే దిగాని వానికిఁగలుగదు. యుధిష్ఠిరా! వారికొఱకై యొసంగినదంతయు నూఱుమడుంగులును వేయిమడుంగులును నెక్కుడయినవి. కాఁబట్టియే నాకు మూఁడులోకము లిప్పుడును జక్కఁగాఁ బ్రకాశించుచున్నవి. మంచియాచార్యుఁడు పదుగురు * శ్రోత్రియులకంటె నెక్కుడు. ఉపాధ్యాయుఁడు పదుగు రాచార్యులకంటె నధికుఁడు. తండ్రి పదుగురుపాధ్యాయులకంటె నధికుఁడు. తల్లియొక్కతియుఁ దండ్రికంటెఁ బదిమడుంగు లెక్కుడు; భూమి యంతకంటెను గొప్పది. తల్లికి సాటియైనగురువు లేదు. భారతా! గురువు తలిదండ్రులకంటె మిక్కిలి యధికుఁడని నామతము. ఏలనఁగా, తల్లియుఁ దండ్రియు నిరువురును బుట్టుకకుమాత్రమే యుపయోగించెదరు. ఈ తల్లియుఁ దండ్రియు శరీరమును సృజించుచున్నారు. ఆచార్యునివలనఁ గలుగు పుట్టుకయో యజ

* శ్రోత్రియుఁడు = వేదాధ్యయనము చేసినవాఁడు. ఆచార్యుఁడు = వేదార్థము నుపదేశించువాఁడు. ఉపాధ్యాయుఁడు = వేదము నధ్యయనము చేయించువాఁడు.

రామరమైనది. (ముదిమియు మరణమును లేనిది) తల్లియుఁ దండ్రియు నపకారముచేసినను వారిని వధింపరాదు. వారిని దండింపకున్నందులకు వానికి దోషముగలుగదు. వారినిదండము పొందకుండుట వానిని దోషిఁగావింపదు. తప్పుచేసినదండ్రులను సయితము గౌరవముతో నాదరించుధర్మమునకై పాటుపడువారిని దేవతలును ఋషులును ననుగ్రహింపఁదగినవారినిగాఁ దెలియుదురు. ఎవఁ డధ్యయనము చేయించుటయనెడి సత్యంబగు కర్మముచేత వేదమునుపదేశించి యక్షయంబగు పదమునొసంగి యనుగ్రహించునో యట్టివానిని దండ్రియనియుఁ దల్లియనియుఁ దెలియుము. అతఁడుచేసినదానియెడ నెనరుగలిగి యతనికి ద్రోహము చేయకుండవలయును. ఎవ రాచార్యునియొద్ద విద్యనుగఱచినపిదప నతనియెడ మనస్సుచేతను క్రియచేతను నడఁకువగలిగి యాదరము చూపకుందురో, యట్టివారు భ్రూణహత్య చేసినపాపము నొందుదురు. లోకమం దట్టివానికంటెఁ బాపముచేసినవారు గలుగరు. గురువులు వారినెంతయు ననుగ్రహించుచుందురు. వారును గురువు లనుగ్రహించువిధముననే తాము గురువుల నర్చింపవలయును. కాఁబట్టి, తొల్లింటి నుండివచ్చుచున్న ధర్మమును బడయఁగోరువాఁడు, తనగురువుల నెంతయు జతనంబునఁ బూజించియు నర్చించియు వారితోఁ బాటిగా నేదియుఁబంచి కుడువవలయును. ఎవనియెడఁ దండ్రి ప్రీతుఁడగునో వానియెడనే ప్రజాపతియుఁ బ్రీతినొందును. ఎవనియెడఁ దల్లి ప్రీతినొందునో వాఁడు భూమిని సయితము పూజించినవాఁడగును. ఎవఁ డుపాధ్యాయుని సంతోషపెట్టునో వాఁడు బ్రహ్మను సయితము పూజించిన వాఁడగును. ఈ కారణమునుబట్టి గురువు తల్లికంటెను దండ్రి

కంటెను నెక్కుడు పూజ్యుఁడగును. గురువులను బూజించుచుండినయెడల ఋషులును, దేవతలును, బితరులును సంతోషింతురు. కాఁబట్టి గురువే యందఱికంటెఁ బూజ్యుఁడు. గురువు నేవిధమయిన నడతచేతఁగాని యవమానింపరాదు. తల్లిగాని తండ్రిగాని గురువునంతటి పూజ్యులు గారు. తల్లిని దండ్రిని గురువును నెంతమాత్ర మవమానింపరాదు. వారుచేయు కార్యమునందుఁ దప్పులుపట్టరాదు. దేవతలును ఋషులును గురువులను బూజింపవలయు ననియే తెలిపెదరు. ఎవ రుపాధ్యాయునికిని దండ్రికిని దల్లికిని మనస్సుచేతఁగాని, క్రియచేతనుగాని ద్రోహముచేయుదురో వారు భ్రూణహత్యచేసిన పాపమునొందుదురు. లోకమునందు వారికంటెఁ బాపులు గలుగరు. తల్లిదండ్రుల కడుపుననే పుట్టి వారిచేతనే పెంపఁబడిన పుత్త్రుఁడు పెద్దవాఁడయినపిదప వానిపెంచినవారిని బదులునకుఁ బోషింపఁడేని భ్రూణహత్య చేసినపాపము నొందును. వాని కంటెఁ బాపాత్ముఁడు లోకమునందు వేఱొకఁడు గలుగఁడు. మిత్త్రులకు ద్రోహము చేయువాఁడును, నెనరులేనివాఁడును, స్త్రీని జంపినవాఁడును, కొండెగాఁడు ననెడి యీనలువుర పాపములకును బ్రాయశ్చిత్తములేదని వినుచున్నారము. ఈలోకమందు మనుష్యునకుఁ జేయవలసినదిగా నున్నదంతయు మనువు నుపదేశమందుఁ జూపట్టుచున్నది. ఇది శ్రేయమయినది. ఇంతకంటె నెక్కుడయినది లేదు. సమస్తము లయిన ధర్మముల సారము నొక్కటిగాఁ జేర్చి యిది చెప్పఁబడినది' అనెను. ఇది నూటయెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు సత్యాసత్యముల స్వరూపములను జెప్పుట.

ధర్మరాజు 'ధర్మమునందే నెలకొనియుండఁ గోరువాఁ డెట్లు నడచుకొనవలెను? నేను గలరూపు దెలియఁగోరుచున్నానుగాన నాకుఁ జెప్పుము. సత్యము, అసత్య మనెడియీ రెండును లోకముల నావరించియున్నవి. ధర్మమునే తిరముగా నూఁదియున్న వాఁ డీరెంటిలో దేని నాచరింపవలయును? సత్యమనఁగా నేమి? అసత్యమేమి? సనాతనధర్మము నెద్ది? ఎట్టికాలమున సత్యము పలుకవలయును? ఎప్పు డసత్యమును బలుకవలయును'? అని యడిగెను. భీష్ముఁడు 'సత్యమును జెప్పుటయె మంచిది. సత్యమునకంటె నెక్కుడయినది లేదు. భారతా! లోకమునం దేది సాధారణముగా నందఱకును దెలియుట మిక్కిలి కష్టమో దానిని నీకుఁ జెప్పెదను. ఎచ్చట నసత్యము సత్యమువంటిదగునో యచ్చట నసత్యమునైనను బలుకవలయును. * సత్యాసత్యముల స్వరూపము లిట్టివై యుండఁగా వానియందుఁ గల రూపున సత్యమేది యగునని యెవఁడు నిశ్చయింపఁ జాలఁడో యటువంటి మూఢుఁడు చిక్కుపడును. సత్యమిది యసత్య మిదియని చక్కఁగా నిశ్చయించినపిదప ధర్మవిదుఁడగుచున్నాఁడు. అప్రాజ్ఞుఁడును, ప్రజ్ఞాహీనుఁడును, అతిక్రూరుఁడు నగు పురుషుఁడు

---

* 'తాదృశే బధ్యతే బాలో యత్ర సత్యమనిశ్చితమ్ అని' మూలము. కొన్నిట 'తాదృశః' అనియుఁ గొన్నిట 'ఏధ్యతే పాపః' అనియుఁ గొన్నిట 'సత్యమనుష్ఠితమ్' అనియుఁ బాఠాంతరములు.

నయితము గ్రుడ్డిమృగమును వధించుటవలన బలాకుఁడను బోయవానివలె మిక్కిలియు గొప్పపుణ్యమును బొందును. మూఢుఁడయినవాఁడు ధర్మమునందెంత కోరిక గలిగియుండినను ధర్మమిదియని తెలియక యధర్మము నాచరించుట † యే మాశ్చర్యము? గంగాతీరమందలి ‡గుడ్లగూబవలె (హత్యచేసిన వాఁడును) మిక్కిలి గొప్పపుణ్యమును బడయుచున్నాఁడు. నీవడిగిన యీప్రశ్నము నట్టిదే(యనఁగా మిక్కిలియు గష్టమయినది.) ఏలనఁ ధర్మమనఁగా నిట్టిదని చెప్పుట యెంతయుఁ గష్టముగా నున్నది. ఈవిషయమునం దూహచేత నిర్ణయము చేయుటయు దుష్కరము. ఇందెట్లు నిశ్చయముచేసి యొకఁడు చెప్పఁగలఁడు? ప్రాణులవృద్ధికొఱకై ధర్మమును (బ్రహ్మ) యుపదేశించెను. కాఁబట్టి యేది యభివృద్ధి గలిగించుచున్నదో యది ధర్మమనుట నిశ్చయము. అహింస, సత్యము, క్రోధములేమి, తపము, దానము, దమము, మతి, అనసూయ, (పరులను నలవఱుచుట యందు) సామర్థ్యములేమి, ఈర్ష్యలేమి, శీలముననెడి యివి ధర్మమని దేవదేవుండగు బ్రహ్మచెప్పెను. ఇదియు సనాతమయిన

---

* కర్ణపర్వము (అధ్యా. 72) మూఢుఁడగు నొకసత్యవాది దొంగకుభయపడి దాఁగియుండిన కొందఱుమనుష్యులను వాడొంగలెక్కడనని తన్నడుగఁగా సత్యవచనమే చెప్పుదునన్న యభిమానముచేత వారుపోయియున్నమార్గమును జెప్పి దొంగలచే వారినిజంపించెను. ఆకథ యిట యనుసంధింపఁబడినది.

† కర్ణపర్వము 72. అధ్యాయము. ఒకగుడ్లగూబ తనముక్కుతో నొక యాఁడుసర్పము పెట్టిన వేయిగుడ్లను దిని గొప్పపుణ్యమును బొందినకథ యిట యనుసంధింపఁబడినది.

ధర్మమే ! రాజా ! ఈధర్మమందు వర్తించువాఁడు భద్రములనుగాంచును. వేదవిహితమయిన వధయును నిజమునకు హింసాత్మకముగాని ధర్మమేయగును. * లోకమును ధరించుట (పోషించుట) వలన ధర్మమని చెప్పుదురు. ప్రజలు ధర్మముచేత ధరింపఁబడుచున్నారు. ఏది ధరించుశక్తితోఁగూడినదో యది ధర్మమనుట నిశ్చయము. ప్రాణులకు హింసలేకుండుకొఱకు ధర్మోపదేశము చేయఁబడినది. వేదమందుఁ జెప్పఁబడినదే ధర్మమని మఱికొందఱు చెప్పెదరు. † అవికాదని తక్కినకొందఱు చెప్పెదరు.అందులకుమేము వారిని నిందింపము. అన్నియు వేదమందు విధింపఁబడలేదు. కొన్నియెడల దొంగలు మఱొకనిసొమ్మునపహరింపఁగోరి యాకందువ నడిగిరేని వారల కాపట్టును జెప్పరాదు. అది ధర్మమనుట నిశ్చయము. చెప్పకుండుటవలనఁ దప్పించుకొనఁగూడునేని యేవిధముననైన జెప్పకయే యుండవలయును. చెప్పియే తీఱవలసివచ్చినను జెప్పకుండినచో వారు సందేహింతురేనియు నట్టియెడల సత్యమును జెప్పుటకంటె శపథముచేసియైనను నసత్యమును జెప్పి పాపుల సంబంధము నుండి విడివడుట మిక్కిలి యొప్పిదమందురు. శక్యమైనచోఁ బాపుల కేవిధముననైన ధనము నీయరాదు. ఏలనఁగా పాపులకిచ్చిన ధన మట్లిచ్చిన వానికిని బీడ కలి

---

* 'ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మేణవిధృతాః ప్రజాః' అని ధర్మశబ్ద నిర్వచనము.

† నేత్యాహురపరేజనాః' అని జా. మూలము. 'మానాన్యాహుఃపరే జనాః' అని దా. మూలము. తక్కినజనులు వేఱు ప్రమాణములనుగూడఁ జెప్పుచున్నారని యర్థము.

గించును. * రొక్కమిచ్చినవాఁ డప్పులకాఁపును శరీరకష్టము పడి తనకుఁబనిచేయించికొని యాయప్పును దీర్చుకొనఁదలఁచిన వాఁడై యొడంబడిక నిజమును రూఢిపఱుచుటకు సాక్షులను బిలిచి యడుగునేని, వారు చెప్పవలసినది చెప్పకపోయిరేని యనృతము చెప్పినవారగుదురు. ప్రాణమున కపాయము గలుగునపుడును, వివాహమందు ననృతమును జెప్పవచ్చును. పరుల ధనమును రక్షించుకొఱకును ధర్మకార్యములు చేయుకొఱకును ననృతమాడవచ్చును. ధర్మమును గోరువాఁడు, పరుల కార్యము సిద్ధించుకొఱకుఁ దక్కువయగు వేషమును దాల్పవచ్చును. † ఒకఁడిచ్చెదనని ప్రతిజ్ఞ చేసినపిదప నిచ్చియే తీఱవలయును. అట్లియ్యక తన పని చూచుకొనువాని నిచ్చునట్లు బలాత్కరింపవచ్చును. ఒకఁడు తాను ధర్మముచొప్పునఁ జేసిన యొడంబడికవలనఁ దప్పి యధర్మమున వర్తించునేని, యట్టిమార్గము నూఁదినవానిని దండముచేతనే కొట్టవలయును. వంచనయే బ్రతుకుగాఁగల యొకఁడు,

* ఇచట నర్థము క్లిష్టముగానున్నది. ఇరువురునుజేరి లాభమును బొందున ట్లొడంబడిక చేసికొనిరి. అందొకరివలన రొక్కముపుచ్చుకొని మఱొక్కఁడు పనిచేయుచుండఁగా దొంగలు వానియొద్ద ధనము నపహరించుకొని పోయిరేని రొక్క మిచ్చినవాఁడు పుచ్చుకొన్నవానిని బాధించియైనను ఆధనమును దీసికొనఁగోరునేని యందులకై పిలిపించిన సాక్షులు పుచ్చుకొన్న వానియొద్ద ధనమున్నదని చెప్పుట యనృతముగాఁ బర్యవసించునని భావము.

† ప్రతిశ్రుత్య ప్రదాతవ్యః స్వకార్యస్తు బలాత్కృతః అని. ఔ. మూలము. 'ప్రతిశ్రుత్య నదాతవ్యం శ్వః కార్యస్తు బలాత్కృతః' అని. దా.మూలము. ధనము నార్జించువాఁడు దొంగలచేత బలవంతముగా ధనము గోలుపోయెనేని ధనమిచ్చినవానికిఁ బ్రతిజ్ఞ నేసిన ధనము నీయనక్కఱలేదు అని యర్థము.

ధర్మములన్నిటిని వీడి స్వధర్మములును దిగనాడి తనకడుపుఁ బ్రోచుట కెప్పుడును ననురుల కపటోపాయములనే యూఁదుచు నుండును. అట్లు కపటముచే బ్రతుకుచుండు నాపాపాత్ముని సర్వ విధములను జంపవలయును. అట్టి పాపులందఱును లోకమున ధనమునకంటె మించిన దొక్కటియు లేదని తలఁతురు. కపట మార్గములచే నరకమును బడయునట్టి పాపాత్ములతోడ వివాహ సంబంధములు గూడదు. పొత్తునఁ గుడుచుటయుఁ దగదు. వారు దేవతలను మనుష్యులను వీడి తొలఁగినవారును, యాగము లేని వారును, జపము లేనివారును. ప్రేతముల వంటివారు నగుదురు. వారితోడఁ జేరరాదు. ధనమునకు నాశముగలిగినచో వారు ప్రాణములు విడుచునట్టి మహాదుఃఖమును జేసికొందురు. పాపుల యందు 'ఈధర్మమును నీవు ప్రియముగాఁ జేయు' మని నీవు చెప్పుటకుఁ దగినవాఁడొక్కఁడును గలుగఁడు. పాపికి లోకము నందు ధనమునకు మించిన దొక్కటియు లేదనియే నిశ్చయము; అట్టివాని నెవఁడు చంపునో వానికిఁ బాపముగలుగదు. ఒకఁడు వానిని జంపునేని తనకర్మములచేత మునుపె చచ్చినవానిని జంపినవాఁడగును. వాఁడు చంపఁబడినయెడలఁ జచ్చినవానిని జంపుటయే యగును. దుష్టబుద్ధులను జంపునట్లు ప్రతినపట్టినవాఁ డా ప్రతినను దప్పరాదు. అట్టిపాపులు కాకులవలెను గుక్కలవలెను వంచనచేతనే కడుపు పోషించికొనుచుందురు. వారు దేహమును వీడినపిదపఁ గాకి కుక్కలజన్మములే యెత్తుదురు. ఎవఁ డెవని యెడల నెట్లు వర్తించునో వాఁడు వానియెడల నట్లె వర్తింపవలయును. అదియే ధర్మము. కపటముగా నడచువానిని గపటముచేతనే బాధింపవలయును. మంచి నడకగలవానిని మంచిని

గొనియోఁ రాఁబట్టుకొనవలయును' అనెను. ఇది నూటతొమ్మిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు దుర్గతిని దాఁటు నుపాయమును జెప్పుట.}

ధర్మరాజు 'పితామహా! ప్రాణు లాయావిషయములచేత వేఱువేఱ యెడతెగక కాఱియపడుచున్నవి. ఏయుపాయముచేత నట్టికడింది దుఃఖములను గడవవచ్చునో చెప్పుము' అని యడిగెను. భీష్ముఁడు 'ద్విజాతులెవరు తమయాత్మలనడంచి విధ్యుక్తములయిన యాశ్రమములందు శాస్త్రములఁ జెప్పఁబడినరీతిని వర్తింతురో వారు కడిఁది కష్టములను గడతురు. ఎవరు ధర్మమును దంభమునకై చేయరో, ఎవరు కట్టుపాటుల కడఁగి జీవనముచేయుదురో, ఎవరు విషయముల నిగ్రహింతురో, వారును గడపరాని కష్టములను గడతురు. ఎవరు నిందింపఁబడినను మాఱు పలుకరో, హింసింపఁబడినను హింసింపరో, యిత్తురుగాని పుచ్చుకొనరో, వారుకడింది యిడుమలను గడతురు. అతిథుల కెప్పుడును వసతి గలిగించువారును, ఎప్పుడు నసూయ లేకుండువారును, ఎప్పుడును వేదాధ్యయన శీలురును నగువారు కడిఁది కష్టములను గడతురు. ఎవరు ధర్మములందుఁ బ్రవీణులై, తలిదండ్రులయెడ నడచుకొనవలసిన విధమున నడచుకొనుచును, బగటియందు నిదురపోవకయు నుందురో వారును గడిందికష్టములను గడతురు. ఎవరు మనస్సుచేతను, వాక్కుచేతను, గ్రియచేతను, బాపమును జేయకయుఁ బ్రాణులను దండింపకయు నుందురో వారునుగడింది

కష్టములను గడచనుదురు. ఏరాజులు రజోగుణముగలిగి లోభముపలన బరువయిన పన్నులు దీయకయు, తమదేశములను జక్కఁగా రక్షించుచును నుందురో వారును గడింది కష్టములను గడతురు. ఎవరు న్యాయంబుగ లభించిన తమభార్యలను ఋతుకాలములగ వెల్లను బొందుచుఁ దక్కిన కాంతల పొత్తుసేయక యగ్నిహోత్రములం దాసక్తిగలిగియుందురో యట్టి సాధువులు కడింది కష్టములను గడతురు. ఏశూరులు మరణమువలని భయమును దిగవిడిచి యుద్ధములందు ధర్మముచొప్పున జయమును గోరుదురోవారు కడింది కష్టములను గడతురు. ఈలోకమం దెవరు ప్రాణములు విడువవలసి వచ్చినను సత్యమే చెప్పుచుఁ బ్రాహ్మణులకు విశ్వాసపాత్రులై యుందురోవారు కడింది కష్టములను దాఁటుదురు. ఎవరిక్రియలు నిందింపఁదగనివిగాను, మాటలు సాధువుల కుపయోగపడునవిగను నున్నవో వారు కడింది కష్టములను గడతురు. ఏబ్రాహ్మణులు, అధ్యయనము చేయరాని దినములందు నధ్యయనము చేయకయు తపమునందు నిష్ఠగలిగి మిక్కిలి తపస్సంపన్నులయ్యు, నుందురో వారు కడిందికష్టములను గడతురు ఎవరు కౌమారమందు బ్రహ్మచారులై యుండి తపముసలిపి, విద్యలందును వేదములందును వ్రతములాచరించి నెఱవేర్చిన వారగుదురో (స్నాతకులగుదురో) వారు కఠినములయిన యిడుమలనుం గడతురు. ఎవరు రజోగుణమునడఁచి తమోగుణమును నిగ్రహించి సత్త్వగుణమందు నెలకొని యుందురో యట్టిమహాభాగులును గడింది కష్టములను గడతురు. ఎవరివలన నొకరికిని భయముగలుగదో, ఎవరికి, నొకరివలనను భయము గలుగదో, ఎవరు లోకులనందఱను దమువలెఁ

జూతురో వారును గడిందికష్టములను గడతురు. పురుషవర్యులగు నేసాధువులు పరులసంపదను జూచి పరితాపపడకయు నీచ మయినయాచారములనుండి తొలఁగియు నుందురో వారును గడిందికష్టములను సైతము గడతురు. ఎవ రెల్ల దేవతలకు నమస్కరించువారును, ఎల్లధర్మములను వినువారును, శ్రద్ధ గలవారును, అడఁకువ గలవారునుగా నుందురో, వారుకడిఁది కష్టములను గడతురు. ఎవరు తమకు గౌరవమును గోరక యితరులను గారవించుచు గౌరవింపఁబడుచున్నవానిఁ బూజించుచు నుందురో వారు కడిఁది కష్టములనేని గడతురు. ఎవరు బిడ్డలను బడయఁగోరి మిక్కిలి పరిశుద్ధములగు మనంబుల నొక్కొకతిథియందును జేయఁదగు శ్రాద్ధాదులను జేయుదురో వారు కడిఁదికష్టములనుగడతురు. ఎవరు తమకోపమును మిక్కిలియు నడంచి కోపవంతులను మిక్కిలి శాంతులుగాఁ జేయుచును, * భృత్యులయందును గోపము లేకయు నుందురో వారుకడిఁది కష్టములనయినను గడతురు. ఏ మనుష్యులు పుట్టినది మొదలుగా మధువును మాంసమును బడఁతులను, గల్లును నెప్పుడును వర్జించియుందురో వారు కఠినములయిన యిడుమలనుగూడఁ గడతురు. ఎవరు బ్రతికియుండుటకై భోజనమును, సంతతిగలుగుటకు స్త్రీసంగమమును,సత్యము చెప్పుటకు మాటాడుటయుఁ, గలిగియుందురో వారు కడిఁది కష్టముల నేనియుఁ గడతురు.ఎవరు సర్వభూతములకు నీశ్వరుండును జగమునకు నుత్పత్తి స్థితులుగలుగుపట్టును నగు దేవుని నారాయణుని భజింతురో వారు కడిఁది

* ఏ ప్రాణులయందును గోపములేకయుందురో యని పాఠాంతరము (ప్రతాప చంద్రరాయలు.)

కష్టములనేనియుఁ గడతురు. రాజా ! ఇదిగో నున్న యితఁడు తామర రేకులవంటి కన్నుఁగవగలిగి పచ్చనివలువ గట్టినమహాభుజుండును, నీకు సుహృదుండును, భ్రాతయు,మిత్రుండును సంబంధియు నగు శ్రీకృష్ణుఁ,డచ్యుతుం డగునారాయణుండు సుమీ ! ఇతఁడు సకలము లయినలోకములను దనయిచ్ఛ గలిగినా తోలు వలెఁ జుట్టివైచుటకు సమర్థుఁడు. ఇతని యాత్మస్వరూప మచింత్యము. ఇతఁడు గోవిందుఁడు, పురుషోత్తముఁడు. అర్జునునకును నీకును బ్రియంబును హితంబు నగువానిని జేయుటయం దాసక్తుఁడై యున్న యీపురుషతిలకుఁడు, ఈయదు శ్రేష్ఠుఁ డానైకుంఠుఁడే సుమీ. ఈహరిని నారాయణుని భక్తితో నెవరాశ్రయింతురో వా రిందుఁ గలుగుకడింది కష్టములనేనియుఁ దరింతురు. ఈవిషయమై విచారింప నక్కఱలేదు. *(ఎవరు తామర రేకులంబోని కన్నుఁగవ గలయీ కృష్ణునియందు సమస్తభావముతోఁ దమకర్మఫలముల నర్పింతురో వారు కడిఁది కిష్టములనేని తరింతురు. ఎవరు లోకములను రక్షింపఁగోరి యదితియందుఁ గశ్యపునకు బుత్రుండై యుదయించిన దేవు నింద్రుని నమస్కరింతురో వారు కడిఁది కష్టములనుఁదరింతురు. ఎవరు లోకములను సృజించినవాఁడును, సజ్జనులకుఁ బతియును, యాగముల చేతఁ బూజింపఁదగినవాఁడును నగు బ్రహ్మదేవునిఁ బూజింతురో వారు కడఁది కష్టములనుండియుఁ దరింతురు. ఇంద్రుఁడును విష్ణుఁడును శంభుఁడును లోకపితామహుం డగు బ్రహ్మయుఁ బలువిధములయిన స్తోత్రములచేత స్తుతించుచుండు దేవదేవుఁ డగు మహే

---

* ఈకుండలీ కరణములోని పాఠ మొకానొక ప్రతియందుఁ దప్పఁ బెక్కింటఁగానరాదు గాన, యిది ప్రక్షిప్తముగా నోపునని తెలియునది.

శ్వరుని నెప్పుడును నెవరుపూజింతురో వారు కడిఁది కష్టములను గూడఁ గడతురు.) కడిఁది కష్టములను దాఁటుటకైన యీశ్లోకములను జదువువారును నితరులకు వినిపించువారును, బ్రాహ్మణులతో ముచ్చటించువారును, గడిఁది కష్టములను సైతము తరింతురు. అనఘా! మనుష్యుఁ డీలోకమునను బరలోకమునను గడిఁది యిడుమలను దరించుటకై చేయవలసిన కార్యములను గొన్నింటిని నీకిదె యుపదేశించితిని' అనెను. ఇది నూటపదియవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు 'తండ్రీ! వేండ్రమయినవారు పైకిఁ జల్లని వారుగను, జల్లనివారు పైకి వేండ్రముగలవారుగను జూపట్టెదరు. ఇట్టివారిని మనమెట్లు తెలిసికొనవచ్చును?' అని యడిగెను.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా! ఈ విషయమై యొకపులికిని నక్కకును జరిగినసంవాదమై పురాతనమగు నీ యితిహాసము నుదాహరించెదరు. దానిని వినుము. తొల్లి పురికయను శ్రీమంతమగు నొక పురమందు పౌరికుఁ డను నొక రాజుండెను. ఆపురుషాధముఁడు మిక్కిలి క్రూరుఁడై పరులను హింసించుటయందే యాసక్తి గలిగియుండెను. వాని కాయువు ముగియఁగా, గోరఁదగని గతిని బొందెను. వాఁడు పూర్వకర్మములచేత దూషితుఁడై నక్కగాఁబుట్టెను. ఆనక్క తన మునుపటిజన్మము తలఁచి మిక్కిలియు నిర్వేదమునొంది, పరులొసంగిన మాంసములను

సయితము దినకుండెను. అది, యే ప్రాణికిని హింసగావింపక, సత్యముపలుకుచు, వ్రతమును మిక్కిలి దృఢముగా నూఁది, యుక్తకాలమందు పండిరాలిన పండ్లను నాహారము గావించుకొనుచునుండెను. (అది యొకసమయమందు నాకులే యాహారముగాఁ గొనుచు, నొకసమయమందు నీరేయాహారముగాఁ గలిగియు, నిట్లు వ్రతము నియమమునఁ జలుపుచు నొకరికిని లోనుగాక తనంతట నుండెను). ఆనక్కకు శ్మశానమందు వసించుట మిక్కిలి సమ్మతముగా నుండెను. అది దానికి జన్మభూమియగుటచేత మఱియొకచోటు నది యొల్లకుండెను. దాని జాతియందుఁగల తక్కిన నక్కలన్నియును దాని శౌచమును సైఁపక మిక్కిలి వినయముతోడి మాటలచేత దాని బుద్ధిని వేఱుపఱుపఁ దొడంగి దానితో 'నీవు భయంకరమైన యీవల్లెకాటియందు వసించియుండియుఁ బరిశుద్ధిని బడయఁ గోరెదవు. నీ యీబుద్ధి విపరీతముగా నున్నది!. ఏలన నీవు స్వభావముచే మాంసము తినుదానవేకదా ? కాఁబట్టి మాతోఁబాటిగ నుండుము. నీకుఁ దినవలసినదానిని మేమిచ్చెదము. శుద్ధియనుదానిని దొలఁగఁబుచ్చి యెవి నీకునాహారముకాఁదగునో వానినిదినుము' అని చెప్పినవి. ఆమాటలనువిని యానక్క మధురములై వినయసంపన్నములై సహేతుకములై మృదువు లగు వాక్యముల వానితో 'పుట్టుక నాకుఁ బ్రమాణముకాదు. కులము, శీలమును బట్టియే కలుగును. ఏకర్మముచేతఁ గీర్తి విస్తరిల్లునో యదియే నేను వేఁడుచున్నాను. వల్లెకాటియందు నేను వాసముచేసినను నాసమాధిని (బుద్ధిస్థితిని) జూడవలయును. (వసించుచోటు ధర్మమునకుఁ గారణముగాదు.) ఒకనియాత్మయే వానికర్మములకుఁ

గారణము గాని వాఁడు వసించుచోటుగాదు. ఆచోటు వానిధర్మమునకును గారణముగాదు. లేక (వాఁడాచరించుచున్న యాశ్రమముగాదు; *ఒకని యాశ్రమమును వానిధర్మమునకుఁ గారణముగాదు) ఆశ్రమమం దొకఁడు బ్రాహ్మణునిఁ జంపుచున్నాఁడు. ఆశ్రమము లేనియెడ నొకఁడు దానముచేయుచున్నాఁడు. ఆచంపుట పాతకము గాకుండునా ? ఆదానము వృథయగునా ? మీకుఁ బ్రియమైనదానియందుఁ బేరాసగలిగి పొట్టఁ బోషించికొను విషయమొక్కటియందె యాసక్తులై యున్నారు. తెలివిచెడినవారు కడపల వచ్చుదోషములను జూడరు. మీరు జరపుచున్న బ్రతుకు సంతోషముగఁ గావింపఁబడునదిగాదు. అది ధర్మహానివలన నెంతయు దూషితమైనది గాన నింద్యముగానున్నది; ఇహమందును బరమందును గీడుగావించునది. కాఁబట్టి, యట్టి వృత్తి నే నెంతమాత్రమొల్లను' అనెను. అంతఁ బరాక్రమమందు వన్నెగన్న యొకపులి యానక్క శుచియుఁ బండితుఁడు నగునని తలఁచి తనకుం దగినపూజ దానికిఁ గావించి తానే దానిని మంత్రిగా వరించుకొనఁదలఁచి దానితో 'సౌమ్యా ! నీ స్వరూపము నాకుఁ దెలిసినది. నాతోడఁగూడి రాచఱికపుఁ గార్యములను జూచుకొనుము. నీ కిష్టమయినభోగములను బరిపూర్ణముగాఁ గయికొనుము. అక్కఱలేనివానిని వదలుము. మాజాతివారు వేండ్రము ఖనవా రని ప్రసిద్ధిగాంచినవారు. ఇది నీకుఁ దెలుపుచున్నారము. నీవు మెత్తఁబాటు మున్నిడికొని యేలవలయును.

---

* 'నాశ్రమో ధర్మలక్షణమ్' అని మూలము. 'ఒకని యాశ్రమము వాని ధర్మమునకుఁ గారణముగాదు' అని ప్రతాపచంద్రరాయలు.

అప్పటికి శ్రేయమును బొందుదువు' అనెను. అంత నక్క మృగపతియైన యాపులి చెప్పిన మాటలనెంతయు గారవించి తలయించుకవాంచి వినయంబుతోడి పలుకుల 'మృగరాజా ! నాపట్ల మీరు చెప్పిన యీమాట మీకెంతయుఁదగియున్నది. మఱియు నీకు మంత్రులుగానుండుటకు ధర్మార్థములందు నిపుణులును, పరిశుద్ధులు నగువారిని వెదకుటయు నీకుఁ దగియున్నది. తగిన మంత్రిలేక గాని, నీప్రాణమునకే విరోధియగు దుష్టమంత్రి కలిగి కాని, నీమహత్త్వమును బాలించుకొనుట శక్యముగాదు. మహాభాగా ! నీవు నీమంత్రులయందు, నీయెడ ననురక్తులును, నీతి విదులును, ఒకరినొకరు రూపనివారును, ఆలోచనముగలవారును, జయమును గోరువారును, పేరాసలేనివారును, మోసములేనివారును, ప్రాజ్ఞులును, నీమేలునందె కన్నుగలవారును, మంచి మనస్సు దిటగలవారును నగువారిని,నీతోఁబుట్టువులను నీతండ్రులనుంబోలెఁ బూజింపుము. మృగాధిపా ! అయినను నాయిప్పటి స్థితితోనే సంతుష్టుఁడనై యుండుటకంటె మఱియొకటి నా కిష్టము గాకున్నది. సుఖములందును, భోగములందును, నీయొద్దఁగల యైశ్వర్యములందును నాకుఁ గోరికలేదు. నాస్వభావము నీప్రాఁతపనివాండ్రతోడఁ బొసఁగియుండదు. వారు నాయెడల దుశ్శీలురై యుందురేని నీకును నాకును భేదము పుట్టింతురు.*నీవు మిక్కిలి తేజంబు గలుగుకున్నట్టి వారలకితరులకును నాశ్రయింపఁ

*'సంశ్రయః శ్లాఘనీయ స్త్వమన్యేషా మపి భాస్వతామ్' అని దా. మూలము. 'న సంశ్రయః శ్లాఘనీయ స్త్వన్యేషా మపి భాస్వతామ్' అని ఔ. మూలము. 'ఎంత తేజంబు వెలుఁగుచున్నవారికైనను నొకరి నాశ్రయించుట యొప్పిదముగా' దని యర్థము.

దగినవాఁడవు. మఱి యెంతయు శ్లాఘనీయుఁడవు. ఇఁక నాఁబోఁటికి నిన్నాశ్రయింపఁదగియుండుట చెప్పనేల?*మఱియు నీవు కృతాత్ముఁడవు, మహాభాగుఁడవు, పాపులయెడను గ్రూరత చూపనివాఁడవు, దీర్ఘదర్శివి, మిక్కిలి యుత్సాహము గలవాఁడవు, దాతవు, మహాబలుఁడవు. నీవుచేసిన పనులేవియు వ్యర్థములుగావు. భాగ్యములచేత నలంకృతుఁడవు. అయినను నాకుఁ గల యంతపట్టునకు సంతుష్టి నొందియున్నవాఁడను. కష్టమగు సేవకవృత్తిని జేసినవాఁడనుగాను. కాఁబట్టి సేవసేయుటకును నేరను. విచ్చలవిడిని వనమునఁ దిరుగుచుండువాఁడను. నా కివి యెట్లు తెలియును. రాజు నాశ్రయించి మనుచుండువారికి నిందలవలని దోషము లన్నియుఁ గలుగును.వనమునందున్నచో, యేపాత్తునుగలుగదు; ఏభయమును లేదు; ఏవిఘ్నమును జూపట్టదు. రాజు పిలువఁగా మనసునందేమి భయముపుట్టునో యది యడవియందలి ఫలమూలములను దిని తనివినొందియున్నవారికిఁ గలుగదు. కస్తిలేక కలుగునట్టి వట్టి నీరు భయముతోఁగూడిన మేలియన్నముకంటె నెంతెయు లెస్స. ఈరెంటి నాలోచించి చూడఁగా నెచట నెమ్మదిగలదో యచటనే సుఖమని నాకుఁ దోఁచుచున్నది. రాజభృత్యులయందొక కొందఱే, చేసిన యపరాధములకుఁ దగిన దండమునొందుదురు.వారియందుఁ బెక్కండ్రు లేనిపోని యపరాధములచేత దూషితులై రాజువలన మృతినొందుదురు. నేరముచేయక దండమునొందువా రెందఱో నేరముచేసి


---

* ఇవన్నియు నక్కకు విశేషణములుగా నుత్తరదేశపాఠములందుఁ జూపట్టుచున్నవి. అయిన నివి పులికి విశేషణములుగానుండుటయె మఱింత యుపపన్నముగాన దాక్షిణాత్యపాఠమె కయికొనఁబడినది.

దండమునొందువా రంద ఱుండరు. మృగేంద్రా ! ఇవియన్నియు నట్లుండ నన్ను మంత్రినిగాఁ జేయఁదలఁతువేని నీవు నాయందు నడచుకొనవలసినరీతినిగుఱించి న్యాయముచొప్పున నొకసమయము చేయఁగోరెదను. నన్నుఁ జేరినవారిని నీవు గౌరవింపవలయును. నేను జెప్పుహితమును వినవలయును. నాకై నీ వేర్పఱచువృత్తిని నీవుమార్పక మిక్కిలి తిరముగానే యుంపవలయును. నే నొకప్పుడును నీదు తక్కినమంత్రులతోడ మంత్రాలోచనముచేయను. అట్లు చేసితినేని వా రతిశయము గోరుదురు గాన, లేనిపోనితప్పులు నాయెడఁ జెప్పుదురు. నీ వొక్కనితోడ నేనే నొక్కండును గలసి హితమును మంతనమునఁ జెప్పుదును. నీజ్ఞాతులను సంబంధించినకార్యములందు నన్ను 'హితమేది యహిత మేది' యని యడుగరాదు. నాతో నాలోచించిన పిదప నీవు నీమంత్రులను హింసింపరాదు. నీవు కోపము నొంది సంబంధించినవారిని దండింపరాదు' అనెను. అందులకుఁ మృగనాథుఁ డా పులి వల్లె యని సమ్మతించి దాని నెంతయుఁ బూజించెను. నక్కయుఁ బులికి మంత్రిగానుండుట నంగీకరించెను. అట్లు పులి యానక్కను సత్కరించి యాయా కార్యములందు నియమించుచుండుటనుజూచి మునుపటి భృత్యులందఱు నొక్కటిగాఁ గూడి యెడతెగక దానిని ద్వేషింపనారంభించినవి. ఆదుష్టబుద్ధులు మొదట మిత్రభావముతోడ మంచి మాటలఁ గయివసముచేసికొని రాజ్యమునం దున్నదోషములందుఁ జొప్పించి దాని నామోదించునట్లు చేయఁజూచెను. ఏల నఁగా వారు పరద్రవ్యములను నపహరించుచు జాలఁగాలము సుఖముగా వసించుచుండిరి. ఇప్పుడు నక్క కట్టుదిట్టములకులోనై

యుండుటచేత నితరులధనముల నించుకయైన నపహరించుట వారికి శక్యము గాకపోయెను. అవి తమయభివృద్ధిని గోరుచు దానిని నధికారమునుండి లేవనెత్తుటకుఁ దివురుచు దాని నింప యిన ముచ్చటలచేత నాసగొలుపఁజూచినవి. మఱియు గొప్ప లంచము లిచ్చి దానిబుద్ధిని వశీకరింపఁ బ్రయత్నించినవి. అయినను నానక్క మిక్కిలియుఁ బ్రజ్ఞగలదిగావున నవిచేయువానికిఁ దన మనస్సు దిట తప్పినదిగాదు. పిదపఁ దక్కినవి దానికి నాశము గలిగింపవలయు నని సంకేతించుకొని మృగరాజునకు మిక్కిలి యీప్సితమై యతనికేఁగాను జక్కఁగాఁ బక్వము సేయఁబడినట్టి మాంసము నె త్తికొనిపోయి యానక్కయింట రహస్యముగాఁ బె ట్టినవి. అమాంసము నెవరు దొంగిలి తెచ్చిరో, యది యెవరెందు లకుఁగా నట్లు చేసిరో యానక్కకుఁ దెలియును; అది యన్నియు దెలిసియుండియును (దీనిమూలమున నీబంధము మనకుఁ దెగి పోవుగాక యని యీ) యొకకారణమునుబట్టి సహించియుండె ను. మంత్రిపదవిని బొందుకాలమునం దానక్క 'ఓరాజా! నీవు నాయందుఁ జెలిమిగోరుదువేని నన్నుఁ దగినకారణము లేక నమ్మక పోవరాదు. (నాకుఁ జెడుగుసేయరాదు)'అని ప్రతిజ్ఞ చేసికొన్నది. ఆయాలోచన మున్న తెఱఁగును దెలియఁగోరియు నావిషయ మందపేక్ష గలిగియుండెను. పిదప మృగరాజాఁకలిగొని లేఁచి రాఁగా నతనికి భోజనము తేవలసిన సమయమందు నామాం సము కనఁబడదయ్యె. మృగరాజు దొంగను వెదకిపట్టవలయునని యానతిచ్చెను. కపటములగు నానక్కలును 'ఆమాంసము విద్వాంసుఁడును మహాప్రాజ్ఞుండు నని తన్ను నెన్నుకొనుచుండుమీా మంత్రి యపహరించినాఁడు' అని తెలిపెను. తోడనే నక్కచాప

లమును విని పులి కోపముగొని చూపోపనిదయ్యె. రాజగు పులి యానక్కను జంపవలయుననియుఁ దలంపుగొనెను. ఆతెఱపిని జూచి దాని పూర్వమంత్రులు దానితో 'ఆనక్క మాయందఱ జీవనములను జెఱుపఁజూచుచున్నది' యనెను. ఇట్లుచెప్పి మరల నవి యామంత్రినక్కరాజు మాంసమును దొంగలించిన కార్యమును విస్తరించి తెలుపఁబూని యా పులితో 'అదిచేసిన యీ పనియే యిట్లున్నది. ఇఁక మఱేద్ది యదిచేయదు ? అది దేవర యెట్టిదిగా ముందు వింటిరో యట్టిది గానేకాదు.మాటలయందే ధర్మముట్టిపడుచున్నది ; స్వభావమందో బెట్టిదముగా నున్నది. అది నిజమునకుఁ బాపి; పైకి ధర్మవేషము వేసికొనియున్నది. దాని యాచారమంతయు వట్టిబూటకము. తనకార్యముకొఱకు భోజనము మొదలగువానియందు నియమములుపెట్టికొని వ్రతములనుబూని శ్రమపడిన దంతేకాని.ఇది దేవరకు నమ్మికగాదేని దీనిని గన్నులయెదుటఁ జూపెదము' అనెను. ఇట్లుచెప్పి యవి తోడనే వేగముగా నానక్కయింటనుండి యామాంసమును దెచ్చినవి. అట్లు మాంసమును గొంపోవుటయు నవిచెప్పినతక్కిన మాటలును విని పులి నక్కను జంపున ట్లాజ్ఞ చేసెను. అంత నక్కకుఁ గలిగినవ్యసనమును జూచి పులితల్లి హితవచనములచేత బోధించుటకై యామృగరాజుకడకువచ్చి 'పుత్రా ! ఈపన్నుగడ యంతయుఁ గపటంపుఁగుట్రతోఁగూడినది. దీనిని నీవు గయికొనరాదు. అశుద్ధులగువా రసూయవలని దోషములకులోనై శుద్ధుఁడగు వానియందుఁ దప్పులుపెట్టుదురు. ఒకరియున్నతిని మఱియెవ్వఁడునుజూచి సైఁపఁడు. గొప్పయధికారకృత్యము వైరమును గలిగించునది. తపస్సుమొదలయిన వానియందుఁ బరిశుద్ధునియందు



572. పులి నక్కను జంప ప్రయత్నించుట; పులితల్లి నివారించుట.

దోషములు వైతురుగదా. వనమందుండి తనకర్మములను గా వించుకొనుచుండు మునికినిగూడఁ మిత్రుఁడు, మధ్యస్థుఁడు, శత్రుఁడని మూఁడుపక్షములు నుప్పతిల్లుచున్నవి. లోభులకుఁ బరిశుద్ధులయందును, బిఱికివారలకు బలశాలులయందును, మూర్ఖులకుఁ బండితులయందును, దరిద్రులకు ధనాఢ్యులయందును, అధర్మాత్ములకు ధార్మికులయందును, విరూపులకు చక్కనివారి యందును, ద్వేషముగలుగుట సహజము. పండితులందుఁ బెక్కండ్రును, మూర్ఖులును, లుబ్ధులును, కపటమున బ్రతుకువారును, నొకదోషరహితునియందు వాఁడు బృహస్పతివంటి బుద్ధిగల వాఁడయ్యును దోషములు చెప్పుదురు. నీవు లేనపుడు నీయింట నుండి యామాంస మపహరింపఁబడినదే కానిమ్ము. అయిన నా నక్క యొకరిచ్చినదానినిగూడ నొల్లదు. మొదట దీనిని జక్కఁగా నాలోచింపుము. పొల్లయినవి నిజముగాఁ జూపట్టుచున్నవి. నిజములయినవి పైకిఁ బొల్లుగాఁ గనుపట్టుచున్నవి. లోకమునఁ బ్రాణులందు నానావిధములు చూపట్టుచున్నవి. కాఁబట్టి వాని యందెది యెట్టిదో పరీక్షింపవలయును. ఆకాశము నల్లనిపాత్ర యడుగువలెను మిడుంగురుబురు వగ్గిమిడుఁగుఱువలెనుగానఁబడుచున్నవి. నిజమునకు నాకాశమున కడుగు లేదు. మిడుగురు బురువునం డగ్గియు లేదు. కాఁబట్టి కన్నారఁ గనఁబడునట్టివస్తువును గూడఁ బరీక్షింపవలసినదియుక్తముగానున్నది. ఒకఁడేవస్తువునైనఁ బరీక్షించి తెలిసికొనునేని, పిదప దానివిషయమునఁ బరితాప పడకుండును. పుత్రా! ప్రభువగువానికిఁ దనభృత్యునిఁ జంపించుట యొకకష్టముగాదు. కాని లోకమునఁ బ్రభువు లగువారికి మన్నించుటయే యెంతయుఁ గొనియాడఁదగినది. అదియెంతయుఁ గీర్తి

కరము. పుత్రా ! నీ వీనక్కను మంత్రిగాఁ జేసితివి ఇది సామంతుల కెల్లను దెలిసినదే. పాత్రము దొరకుట యరిది. ఇది నీకుఁ దెలి కాఁడు; కాఁబట్టి దీని నుంచుకొనుము. పరిశుద్ధుఁడగు నొకనిని, రాజు, వానిపగవారు మోపిన లేని దోషములను బట్టి, దోషియ నియేవేలుగఁదలఁచునేని, యారాజు తనమంత్రులును జెడితాను నువేగనశించుచున్నాఁడు.' అనెను ఆపులి యిట్లుచెప్పి ముగించిన పిదప నానక్క క్రిందియధికారియొకటి మిక్కిలి ధర్మాత్మకమైనది, దానిశత్రువుల నడుమనుండి ముందటికివచ్చి యాకపటపుఁబన్ను గడ పన్నిన విధమంతయు వెలిపుచ్చెను. అంత నామృగనాథుఁ డా నక్క మంచినడవడిగలదిగాఁ దెలిసి దానిని సత్కరించి విడిచి పుచ్చెను; మఱి చెలిమి గడలుకొనం బలుమాఱు బిగియఁ గౌఁ గిలించుకొనెను. నీతిశాస్త్ర విదం బయినయానక్క యాయవ మానమునకు మిక్కిలి పరితపించి యామృగపతిని బ్రాయోప వేశమునకు ననుజ్ఞయిచ్చునట్లు వేఁడెను. ఆపులి గన్నులు విచ్చి చెలిమివలనఁ దేఱకొనఁజూచి మిక్కిలి ధర్మాత్మకంబయిన యానక్కను నెంతయుఁ బూజించి యట్లు చేయవలదని వారిం చెను. ఆనక్కయు నట్లు తనయేలిక నెయ్యమునఁ దొట్రుపడు చుండుటనుజూచి ప్రణతుఁడై పలుకు కన్నీటిచే డగ్గుత్తికవడ దా నితో 'మొదట నీవు నన్నుఁబూజించితివి; పిదప నవమానించితివి; నీనడత నన్ను నీకు శత్రువై యుండు స్థితికిఁ దెచ్చినది. ఇఁక నీయొద్దనుండుట నాకుఁదగదు. సంతుష్టి లేనివారును, తమ యధి కారపదమునుండి త్రోయఁబడినవారును, గౌరవము క్రిందు పఱుపఁబడినవారును, తమ్ముఁదామే చెఱుపుకొన్నవారును, తమ (యేలికకోపమువలన) శత్రువులచేత వంచితు లయినవారును,

మిక్కిలి క్షీణించినవారును, పేరాసగలవారును, క్రుద్ధులును, భీతులును, పైయధికారులచే వంచితులును, రాజుచేత సొమ్మపహరింపఁబడినవారును,గరువమగు గొప్పకృత్యములు చేయుటకుఁ దమకము గలిగియుండియు విత్తమార్జించు నుపాయములు లేకుండునట్టివారును, తమకుఁగలిగించిన బాధకు దుఃఖముననో కోపముననో పొక్కుచుండువారును, తమయేలికకు వ్యసనసమూహములు వచ్చుటకై యెదురు చూచుచుందురు. ఒడయఁడు వంచింపఁగా వారతనిని దిగవిడిచి శత్రువులచేతికి మంచిసాధనము లగుదురు. నీవు నన్నవమానించితివి. మరల నన్నధికారమునందు నిలిపితివేని నన్నెట్లు నమ్మఁగలవు? నిన్నుఁగాని నేనెట్లు నమ్మఁగలను? నన్ను నీవు సమర్థుఁడని చేరఁబట్టి పరీక్షించి యధికారమందు నిలిపితివి. అప్పుడు చేసినయొడంబడికను నుల్లంఘించి, నన్నవమానించితివి. ఒకనిని బదుగురి నడుమ మొదట శీలవంతుఁడని ప్రకటముగాఁ జెప్పినచో, అట్లు చెప్పినవాఁడు తా నాడి తప్పకుండు నేని మరల వానిని గుణహీనుఁడని చెప్పరాదు. ఇట్లు నన్నవమానించితివి గావున నాయందిఁక నమ్మికయుండఁజాలదు. నీకు నమ్మకము తీసిపోయినపిదప నీయందు నాకుభయము కలుగును.నీకు నమ్మకము లేకుండఁగా,నాకు భయమగుచుండఁగా, మనశత్రువులు మనల బాధించుటకు సందులు వెదకుచుందురు. నీప్రజలు తుదకు నెయ్యములేక, తనివియుఁ గానకపోదురు. ఇట్టిస్థితికిఁ బెక్కుదోషములు గలవు. మొదట గౌరమును బిదప నవమానమును గలిగినట్టి స్థితి సుఖమైనదిగాఁ బ్రాజ్ఞులెన్నరు. వేఱుపడినది గూడికొనుట కష్టము. వేఱుపడి మరలఁ గూడినచోటఁ గలుగు ప్రీతి మరల స్నేహముచేతఁ బెరుఁగదు.

భర్తవగు నీహితము గోరువాఁడొక్కఁడును గనుపట్టకున్నాఁడు. కొలువు, తనకును దనభర్తకును మంచిసేయు నభిప్రాయము నుండియే కలుగుచున్నది. అన్ని క్రియలును స్వార్థమును బట్టియే కయికొనఁబడుచున్నవి. స్వార్థమునుబట్టి కాక వట్టి నెయ్యమును బట్టి కలుగు నభిప్రాయములు మిక్కిలియు దుర్లభములు. రాజుల కెవరికి మనసు చలించుచును నిమ్మళము లేకయు నుండునో వారి పురుషుల కలరూపు నెఱుంగుట యెంతయుఁ గష్టము. నూర్వురయం దొక్కఁడే సమర్థుఁడుగను జంకులేని వాఁడుగను దిరుగుచున్నాఁడు. మనుష్యుల కభివృద్ధియు, నాశమును దనంతటనే కలుగుచున్నవి. శుభమును నశుభమును, మహత్త్వమును రానీక నిలుపఁజూచుట బుద్ధితక్కువయే యగును.' అనెను.

భీష్ముఁడు. 'నక్క యిట్లు ధర్మార్థకామయుక్తము లగు తిన్నని మాటలాడి రాజును బ్రసన్నునిఁ గావించి వనమునకు మరలి పోయెను. బుద్ధిమంత మయినయా నక్క మృగరాజు వేఁడుకొన్నను బాటింపక ప్రాయోపవేశముచేసి శరీరమును విడిచి స్వర్గమును బొందెను' అనెను. ఇది నూటపదునొకండవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁ డలసత్త్వ మనర్థహేతువని నిరూపించుటకై లొట్టియ కథను జెప్పుట.}

ధర్మరాజు 'ధార్మికోత్తమా! రాజు చేయవలసిన దేది? ఏమి చేసి సుఖమునొందును? దానిని గలరూపున నాకుఁ జెప్పుము' అని యడిగెను. భీష్ముఁడు 'ఈలోకమందు రాజేమి చేయవలయు



577. లొట్టియ తనగొంతుకు గాలివలన నపాయము లేకుండుటకై
కొండగుహలో నుంచుట; నక్కలు చలిచే వచ్చి
దానిగొంతును గొఱికి తినుట.

నో, దేనిని జేసెనేని సుఖమునొందునో యట్టి కార్యమును ముఖ్య
ముగా నిశ్చయించి యిప్పుడు నీకుపదేశించెదను వినుము. ధర్మ
రాజా! ఒక లొట్టిపిట్టను గుఱించి యీ పెద్దకథను మేము వినియు
న్నాము. దానియట్లుండరాదు; అది తెలియుము. కృతయుగమం
దొక పెద్ద లొట్టియయుండెను. దానికి పూర్వజన్మస్మరణము గలదు.
అది వాఁడి యగునియమముతో నరణ్యమందుఁ దప మనుష్ఠించు
చుండెను. దానితపము ముగియఁగా బ్రహ్మ దానియెడఁ బ్రీతుండై
కోరినవర మడుగు మనెను. అందుల కాలొట్టిపిట్ట 'మహాత్మా!
నీ యనుగ్రహమువలన నాయీకుత్తుక నూఱుయోజనముల తుద
నున్న యాహారము నేనియుఁ దీసికొన శక్య మగునంత నిడివిగా
నుండవలయును' అనెను. అందులకు బ్రహ్మ 'వల్లె'యని చెప్పఁగా
నది గొప్పవరమును బడసి తనయడవిని బోయిచేరెను. అపు డా
యొంటె మిక్కిలి చెడుబుద్ధిగలది గాన, బ్రహ్మదేవుఁడు వర మొ
సంగిన కారణమున సోమరితనము గలిగియుండెను. ఆదురా
త్మకమయినది చెడుకాలము చేతఁ దెలివి యుడిగి, యాదినము
మొదలుగాఁ బచ్చిక మేయుటకు బయలు వెడలినదిగాదు. ఒక
నాఁ డది నూఱుయోజనములు నిడుపయిన తనకుత్తుకను జాఁచి
యేశ్రమము లేక యాహారము నరయుచుండఁగా నొక గొప్ప
గాలిపుట్టెను. అవివేకి యగునాలొట్టియ తనతలను గుత్తుక
నును నొక కొండగుహయందుఁ బెట్టి యాగాలివాన యుడుగుటఁ
నెదురుచూచుచుండెను. తోడనే లోకమునంతయు వెల్లినిముం
చునట్టు బెట్టిదమయిన వర్షము గురిసెను. అపు డొకనక్క
లిచేత నవయవములు వడఁకుచుండ నాఁకటిచే స్రుక్కుచు
వాన వెల్లికిఁ గలంగి భార్యయుఁ దానును వేగ యా గుహకువచ్చి

చొచ్చెను. మాంసమువలన బ్రతుకునట్టి యామృగము మిక్కి-
లియు నాఁకలిచేఁ గటకటంబడుచు నాలొట్టియకుత్తుకను దినఁ
గడంగెను. తెలివిమాలిన యాలొట్టియ, తాను భక్షింపఁబడు
చుండుటను దెలియఁగానే మిక్కిలియు దుఃఖమునొంది కుత్తు
కను ముడుఁచుకొనఁ బ్రయత్నించినది. లొట్టియ కుత్తుకను గ్రిం
దుగను మీఁదుగను ముడుఁచుకొనుటకై కదల్పఁగానే నక్కయు
దానిభార్యయుఁ బట్టువిడువక దానిని దినుచునే యుండెను. ఆ
లొట్టియ యొకింతసేపటికిఁ బ్రాణమువిడిచెను ఆనక్కయంత
లొట్టియను జంపి తిని తుపాను దీసినపిదప నాగుహనుండి వెడలి
వచ్చెను. ఇట్లాలొట్టియ దుర్బుద్ధిచేత మరణము నొందెను.
సోమరితనము వెంట గొప్పదోషము క్రమముగా వచ్చుటను
జూడుము! నీవట్లు సోమరితనము లేక యింద్రియముల నియ
మించి తగినయుపాయముతో నేదియుఁ గావింపుము. జయము
నకు బుద్ధియే మూలమని మనువు చెప్పెను. కర్మములు బుద్ధి
చేతఁ జేయఁబడునవి శ్రేష్ఠములు; భుజబలముచేతఁ జేయఁబడు
నవి మధ్యములు; పిక్కలచేత (త్రిమ్మరి) చేయఁబడునది యధమ
ములు; బరువుమోసి చేయఁబడునది యన్నిటికంటెఁ దక్కువ
యైనవి. రాజు రాజ్యము నడుప సమర్థుఁడై యింద్రియముల
నిగ్రహించినవాఁడేని యతనిరాజ్యము చెడక నిలిచియుండును.
ఆర్తిగలవాఁడు బుద్ధిమూలముననే తాను గోరినది సాధింపవల
యునని మనువు చెప్పెను. ధర్మరాజా! రహస్యముగా నున్న మం
త్రాలోచనములను వినువారును, సహాయులు మిక్కిలి గలవారు
ను, చక్కఁగాఁ బరీక్షించి నడచుకొనువారును, సమస్తకార్యముల
యందు సిద్ధినొందుదురు. అట్టి సహాయము గలరాజు భూమినంత

యుఁ బాలింపశక్తుఁడగును. మహేంద్రసమాన ప్రభావా! తొల్లి శాస్త్రవిదులగు పురుషులచే నిది చెప్పఁబడినది. నేను శాస్త్రమందుఁ గన్నిడియే దీనిని నీకుఁజెప్పితిని. నీవు పరాకువడక నడచుకొనుము' అని చెప్పెను. ఇది నూటపండ్రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు బలవంతుఁడగు శత్రువును వశముచేసి కొనుటకు వినయ ముపాయమగు నని నదీసాగర సంవాదమును జెప్పుట.)

ధర్మరాజు 'భరతసింహమా! రాజు, తగినసాధనములు లేకయే *దుర్లభం బగు రాజ్యమును బడసి మిక్కిలియు వృద్ధినొంది యున్న శత్రువునెడల నెట్లు నడచుకొనవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు—'భారతా! ఈ విషయమందు నదులకును సముద్రమునకును జరిగిన సంవాద మయి పురాతనమయిన యీ యితిహాసమును నుదాహరించుచున్నారు. తొల్లి, యసురులకు మనికిపట్టును నదులకుఁ బతియునగు సముద్రుఁడు సమస్తనదులను జూచి తనకుఁగలిగిన సంశయముల నడుగఁదొడఁగి 'నదులారా! మీరు ప్రవాహములు వెల్లిగొని పెద్దపెద్ద మ్రాఁకులను వేళ్లతోడను గొమ్మలతోడను బెకల్చి యిచ్చటికిఁ దేఁగాఁ జూచుచున్నాను. కాని నీరుప్రబ్బలిని మాత్రము పెకల్చి తేఁగాఁ జూడను. మీగట్టులయందు మొలచు నీరుప్రబ్బలి చిన్న కొలఁది

* 'రాజా రాజ్యమను ప్రాప్యదుర్లభమ్' అని గౌ. మూలము. 'దుర్బలః' అని దాక్షిణాత్య పాఠము.

గలది; దాని సత్త్వయు నల్పము. దానిని నలక్ష్యభావముచేతఁ బెకల్చి తేరా? లేక దానివలన మీ కేమయినను బ్రయోజనము గలదా? మీ కందఱ కిట్లు నీరుప్రబ్బలిని గట్టులను ద్రెంచి తేకుండుటకుఁ గలయభిప్రాయ మేమో వినఁగోరుచున్నాను అని యడిగెను. ఆవిషయమున గంగానది సముద్రునిఁ జూచి యర్థవంతమును హేతుయుక్తమును బోధకరము నగుమాటల తో 'ఈ పెద్దమ్రాఁకు లున్నచోటనే యుండి యాచోటునుండి కదలక మెదలక దృఢముగా నెలకొనియుండును. ఇట్లవి మా వెల్లువల నెదుర్చునదిగా నుండుటవలన నవి పెరిఁగినచోటును విడుచునట్లు గావింపఁబడుచున్నవి. నీరుప్రబ్బలి, యున్నచోట నుండి తొలఁగదు. అది వెల్లువయురవడిని జూచి వంగిపోవు చున్నది. తక్కిన మ్రాఁకు లట్లు వంగవు. ప్రవాహవేగము తీసినదే యానీరుప్రబ్బలి మరలఁ దనయెప్పటిచోటు నొందును. అది కాలమును సమయమును దెలిసినది; మాకు వశ్యమైయుండునది. మాకనుకూలముగా నడచుకొనునది. స్తంభమువలె దిటగా నిలఁబడక యుండును. కాఁబట్టి యది నిన్నుఁ జేరుటలేదు. నీటి యురవడికిని గాలివేగమునకు నడఁగియుండి పిదపఁ బయికి లేచు నట్టి యోషధులును, మ్రాఁకులును, జెట్లును, నవమానము నొందవు' అనెను. యుధిష్ఠిరా! కాఁబట్టి మిక్కిలి వృద్ధినొంది యున్న శత్రురాజువలని బంధమును బోఁగొట్టుకొనుటకు వాని మొదటియురవడి కెవఁడు సైఁపఁడో వాఁడు శీఘ్రముగానే నశిం చును. మంచి తెలివిగలరా జెవఁడు తనకును శత్రువునకును గల బలాబలములను సేనను బరాక్రమమును దెలిసి నడచుకొను చున్నాఁడో వాఁ డవమానము నొందఁడు. ఇట్లె తెలివిగలవాఁడు,

శత్రువు తనకంటె నెక్కుడుబలముగల వాఁడని తెలిసినప్పుడు నీరు బ్రబ్బలిరీతి నాశ్రయింప వలయును. ఇదియే తెలివికి లక్షణము' అనెను. ఇది నూటపదుమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు సభయందు దుష్టుఁడు చెడ్డమాట చెప్పి నను దానిని సైర్చుట మంచిదనుట.)

ధర్మరాజు 'మూఢుండును గూఢుండు నగునొక దిట్టమాటల వాఁడు మెత్తనివాఁడగు విద్వాంసుని సభయందు నిందించు చుండఁగా నావిద్వాంసుఁ డేమిచేయవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజా! ఈవిషయము చక్కఁగాఁ దెలియునట్లు వినుము. ఎప్పుడు నెఱుకగలవాఁ డల్పబుద్ధి యగు మనుష్యుని మాటలకు సైఁపవలయును. దూషింపఁబడువాఁడు కోపమునొందక యుండెనేని దూషించువాని సుకృతము నెల్లఁ బొందుచున్నాఁడు. అట్లు సైఁచినవాఁడు తనదుష్కృతములను, గోపంబున నట్లు దూషించినవానికె పుచ్చుచున్నాఁడు. * కూఁతపెట్టుచున్న రోగియెడలంబోలె,నిందించుచున్న యామనుష్యునియెడల నుదాసీనుఁడై యుండవలయును. లోకులపగకుఁ బాలయినవాఁడు బ్రతికియు వ్యర్థమే. మూఢుఁడు 'నే నట్టిగొప్పవానిని నట్టి సభయం దిట్టి మాటలడిగితిని' అని పలుమాఱు చెప్పుకొనుచుండుటను, నట్లు

---

* 'గర్హితం త ముపేక్షేత వాశ్యమాన మివాతురమ్' అని మూలము 'టిట్టిభం త ముపేక్షేత వాశ్యమాన మివాతురమ్' అని పా. మూలము. రొదసేయు చున్న టిట్టిభ పక్షినింబోలెనని యర్థము.

చేసిన చెడుగునకుఁ దన్నుఁ బొగడుకొనుచుండుటను మాటికిఁ జూడ వచ్చును. మఱియువాఁడు 'వాఁడు నేను దూషింపఁగా సిగ్గు పడి సత్తువచెడి చచ్చినవానివలె నుండెను' అని చెప్పికొనును. పురుషాధముఁ డితరులు డంబముగాఁ జెప్పికొనరాని యట్టిపని చేసియు సిగ్గుమాలి డంబముగాఁ జెప్పికొనును. అట్టి పురుషాధ ముని జతనంబున దాంతుఁడగువాఁ డుపేక్షింపవలయును. అల్ప బుద్ధిగలవాఁడు చెప్పెడిమాటలనెల్ల నప్పటికి సైఁపవలయును. వాఁ డడవియందు వ్యర్థముగాఁ గూయుచుండు బుద్ధిమాలిన కాకి వంటివాఁడు. అట్టివాఁడు కొనియాడియు దూషించియు నేమిచేయఁగలఁడు; ఒకరిని వట్టిమాటలచేతనే దూషించువా రట్లు దూషణములను నిరూపింపఁగలుగుదురేని వారిమాటలకుఁ గొంతపస గలుగును. నిజమునకు వారిమాటలు, మూఢులు తాముకలహరించువారిని జచ్చునట్లు పెట్టుశాపము లంతపస యే కలవిగాని వేఱుకాదు. నిందించువాఁడు తనచేష్టల చేతను మాటలచేతను దనతల్లియందు మాఱుమగనికిఁ బుట్టు టను బ్రకటించికొన్నవాఁ డగుచున్నాఁడు. నెమలి నృత్య ము సేయునపుడు గుహ్యప్రదేశమును వెలిపుచ్చును. అది తన నృత్యమునకే విఱ్ఱవీఁగునుగాని తనగోప్యాంగమును జూపుటకు సిగ్గుపడనట్లు నిందించువాఁడును తాను బరుని నిందించినందులకే సంతోషించునుగాని దానివలనఁ దనతల్లిదోషము వెలిపుచ్చినం దులకు సిగ్గుపడఁడు. ఎవనికి లోకమందుఁ జెప్పరానిమాటయుఁ జే యరానిపనియు నొకటియుఁ గలుగదో* యట్టివానిపుట్టుకకు మఱి

---

* 'సంశ్లిష్టజన్మనా' అని మూలము. 'సంశ్లిష్టకర్మణా' అని పాఠాంతరము. ఈపాఠమునం దర్థము క్లిష్టముగా నున్నది.

యొకఁడును (మాఱుమగఁడును) హేతువుగాఁగలసి యున్నాఁడు. అట్టివానితో శుచియగువాఁడు మాటాడరాదు. ఎవఁడొకని యెదుటవానిగుణములను, మఱుఁగున వానిదోషములను, నెత్తి చెప్పునో వాఁడులోకమునఁ గుక్కవంటివాఁడు. వానికి మంచిలోకములును జ్ఞానమును ధర్మమును నశించినవగును. అట్టిమనుష్యుఁడు పెక్కుదినములు దాను చేసిన దానములును వేల్చిన హోమములును, మఱుఁగునఁ జేసిన నిందనములచేతఁ దోడనే నాశము చేసికొనుచున్నాఁడు. కాఁబట్టి ప్రాజ్ఞుండును మతిమంతుఁడు నగువాఁడట్టి పాపచిత్తుండును వర్జనీయుండు నగుమనుష్యునిఁ గుక్కమాంసముంబోలెఁ దోడనే వర్జింపవలయును. పెక్కుజనుల నడుమఁ బరులపయిఁ గొండెములు చెప్పు దురాత్ముఁడు సర్పము తనపడగనెత్తి చూపునట్లు తనదోషములను వెలిపుచ్చుకొనుచున్నాఁడు. ఆవెనుఁ గొఱుకుఁ దనకుం బోలినపనిని (పరనిందను) గావించుచుండఁగా వానికి మాఱుసేయ నుంకించువాఁడు, బూడిద కుప్పలోమునిఁగిన బుద్ధిమాలిన గాడిదయుంబోలె దుఃఖమున మునుఁగుచున్నాఁడు. జనుల నెప్పుడును నిందించుచుండుట యందే యాసక్తుఁడై యుండు వానిని, జిమ్మ రేఁగిన తోఁడేలుం బోలెను మత్తిలి యెసరేఁగి గర్జించుచున్న యేనుంగుం బోలెను మిక్కిలి బెడిదమయిన కుక్కనుం బోలెను త్యజింపవలయును. అయోగ్యులు పోవుమార్గమున వర్తించువాఁడును, ఇంద్రియ నిగ్రహమును వినయమును లేనివాఁడును, పాపుండును, శత్రుత్వమే వ్రతముగాఁగలవాఁడును, ఎప్పుడును నితరుల సంపద నశింపవలయునని యే కోరుచుండువాఁడును, పాపబుద్ధియునగు నట్టిమనుష్యుఁ డీస్సీ ! పాడై పోవుఁగాక. మఱియు

వారు నిన్ను మిక్కిలియు నిందించుచుండినను నీ వది విని యార్తుఁడ వెంతమాత్రము గాకుము. గొప్పవానికిఁ దక్కువవానితో వాదము స్థిరబుద్ధు లగువారెంతయు నిందింతురు. వాఁడు గోపముగొనెనా కొఱికినను గొఱుకును. కొట్టినను గొట్టును. దుమ్మును నుముకను బయిని జల్లినను జల్లును. పండ్లు తెఱచి చూపి భయ పెట్టును. ఇదంతయుఁ గుపితుండును గ్రూరుండు నగు మూర్ఖుని యందు సిద్ధము. దురాత్ముఁడు సభయందుఁ గావించు నిందను దుర్జనులను సహించువాఁడును మాటికిని నీ నిదర్శనములను జదువువాఁడును. మాటలచేత నేవిధమయిన బాధయును బొంద(ఁ)డు' అనెను. ఇది నూటపదునాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు రాజులకు సాహాయ్యము జేర్చుకొనుట యావశ్యకమని చెప్పుట

ధర్మరాజు 'పితామహా! నీవు మిక్కిలియుఁ బ్రాజ్ఞుండవు. నాకుఁ బెద్దసందేహ మొకటిగలదు. ఇది నీవే తొలఁగింపఁ జాలుదువు. నీవు మాకులమును వృద్ధి నొందించినవాఁడవు గదా! తండ్రీ! చెడునడవడియుఁ జెడుమనస్సును గలమనుష్యులు నిందించి మాటలాడుటను గుఱించి యిపు డుపన్యసించితివి; మఱియు నీ కొకటి విన్నవించు కొనుచున్నాను. రాజ్య తంత్రమునకు హితమైనదియు, కులమునకు సుఖము కలిగించునదియు, మీఁదటికిని నిప్పటికిని క్షేమమును వర్ధిల్లఁ జేయునదియు, పుత్రులకును బౌ

త్రులకును సంతోషమును బుట్టించునదియు, రాష్ట్రమును వృద్ధిఁబొందించునదియు, అన్న పానములకును దేహమునకును హితమైనదియు నగు దానిని నాకుఁ జెప్పవలయును. రా జభిషిక్తుఁడై రాజ్యము నేలుచు * మిత్రులచేతఁ బరివేష్టితుఁడయ్యు సుహృదులంగూడియుఁ బ్రజల నెట్లు రంజింపవలయును? ఏ రాజు తన నెయ్యములయు ననురాగములయు బారింబడి దుష్ట విషయములందు మిక్కిలియుఁ దగులుగలిగి, యింద్రియముల నడంపఁ జాలమి వలనఁ జెడుమనుష్యులను బరిపాలించుచు నుండునో యతని భృత్యులు కులీనులగు వారందఱును నతని యెడ విముఖులగుదురు. అతఁడు మంచి భృత్యుల బలమువలనఁ బడయఁదగు నర్థములను బడయ నేరఁడు. నీవు బుద్ధియందు బృహస్పతికి సముండవు. రేయుం బగలు రాజ ధర్మములనే చింతించుచున్న వాఁడనుగాన నాకు నీ విషయమును నీవు చెప్ప నర్హుఁడవు. పురుషసింహమా ! నీవు మాకులహితమందే యాసక్తి గలిగి యుండువుగాన మాకు రాజకీయ విషయములను నుపదేశించు చుందువు. మహాప్రాజ్ఞుండగు విదురుం డొక్కఁడును నెప్పుడును మా కుపదేశము సేయుచుండువాఁడు. నేను నీవలనఁ గులహితమును రాజ్యమునకు హితకరంబు నగునుపదేశమును విని యవ్యయంబగు నమృతంబును ద్రావినట్లు తృప్తినొంది సుఖముగా నిదురించెదను. ఎట్టి భృత్యులు నికృష్టులు? ఎట్టివారు సర్వగుణ సంపన్నులు ? ఎటువంటి భృత్యులతోఁ గూడి లేక యెట్టి కులమునఁ బుట్టిన భృత్యులతోఁగూడి, రాజ్యయాత్ర జరుపఁ దగును?

* మిత్రులనఁగా ప్రత్యుపకారమును గోరి యుపకరించువారు; సుహృదులది గోరకయే యుపకరించు వారని భేదము తెలియునది.

భృత్యులులేకయె రాజు తా నొక్కండును బ్రజలను రక్షింపc జాలcడు గదా. గొప్పకులమునc బుట్టిన వారందఱును రాజ్యము నేలుట కుర్విళ్లూరుదురు' అనెను.

భీష్ముcడు—'భారతా ! రాజు, తా నొక్కండే రాజ్యము నేలcజాలcడు. భృత్యుల సహాయము లేనిచో నతనికే యర్థము లును బడయ శక్యములుగావు;పడసినవాని నెప్పుడును రక్షించుట కును శక్యముగాదు.ఏరాజునకుcగల భృత్య జనులందఱును జ్ఞాన విజ్ఞానములందుc బండితులును రాజహితమును గోరువారును సత్కుల ప్రసూతులును బరస్పరము నెయ్యము తియ్యము గల వారునై యుందురో యట్టిరాజు రాజ్యమువలని ఫలమును బొందును. ఏరాజు మంత్రులు,కులీనులును,పరులచే వేఱుపఱు పరానివారును, రాజు ప్రక్కc బాయకుండువారును, రాజు నకు మతి నుపదేశించు చుండువారును, అర్థ్యో వస్తువుల సం బంధములను లెస్సగా గుఱుతెఱింగిన వారును, మీcదటి కాల మునకు వలయునవి యెల్ల ముందుగా సమకట్టువారును, కాల గుణములను జక్కcగా నెఱింగినవారును, గడచిపోయిన వానికి దుఃఖింపకుండువారును, నగుమంత్రు లుందురో యట్టి రాజు రాజ్యమువలని ఫలమును బడయును. ఏరాజునకు సహాయులగు వా రతనితోడ సుఖదుఃఖములు గలవారును, బ్రియముచేయు చుండువారును, రాజు కార్యముల నొడcగూర్చుటయే యెప్పు డును జింతించు చుండువారును, సభ్యులునై యుందురో యట్టి రాజు రాజ్యమువలని ఫలమును బొందును. ఏరాజుదేశము నందలి వారు కాఱియలేక యెప్పుడు నున్నతి గలిగి నీచులుగా కయు.మంచిమార్గము నూcదియువర్తింతురో యతcడు రాజ్యము

వలని ఫలమును బొందును. ఏరాజు బొక్కసము,నతని యాదా యమును వృద్ధిచేయు మార్గములఁ జక్కగాఁ దెలిసినవారును నాప్తులును రాజువలన సంతుష్టులును ధనధాన్యసంపత్తిచేఁ బుష్టిగలవారును, నగు మనుష్యులు పరిపాలించు చుందురో యట్టి రాజు రాజ్యమువలని ఫలమును బడయును. ధాన్యాదుల కొట్లు, పరులచే వేలుపెట్టుపరాని వారును, ఆప్తులును, పైప యిని సేకరించుటయందాసక్తులును, బాత్రులును, బేరాసలేని వారును నగు పురుషులచేఁ బాలింపఁబడుచుండునేని రాజొప్పిద మును బొందును. ఏరాజు నగరమందలి వ్యవహారము *శంఖలిఖి తుల వ్యవహారముంబోలెఁ గచ్చితమై ధర్మఫలమును గలిగించు నదై చూపట్టునో యారాజు ధర్మమువలని ఫలమును బడ యును. ఏ రాజు రాజధర్మములను దెలిసికొని ప్రజలను జేరఁ బట్టుకొనుచు నాఱింట నొకపాలు కప్పముఁ బుచ్చుకొనునో యతఁడు ధర్మమువలని ఫలమును బొందును'అనెను. ఇది నూట పదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁ డొకముని చెంతఁ మొదలగు వాని వలన భయపడిన కుక్కను నాయా మృగ ముగాఁ జేయుటను జెప్పుట. }

(ధర్మరాజు 'భరతసత్తమా ! ఏ సమయమందు రాజునకుఁ గులీనులగు సహాయులు లేరో యట్టియెడఁ గులీనులుగాని వారిని సహాయులుగా నేర్పఱచు కొనవచ్చునా ?'అని యడిగెను.)

* శంఖలిఖిత చరిత్రమును ఆపదిర్వమునఁ జూచునది.

భీష్ముఁడు 'ఈ విషయమై పురాతనమయిన యొక యితిహాస
ముగలదు. అది లోకులకు దృష్టాంతప్రాయమై సజ్జనులచేత
నాచరింపఁబడినదయ్యు నెప్పుడు నొప్పుచున్నది. అది ప్రకృత
విషయముంబోలినది. దానిని నేను బరశురాముని తపోవన
మందు ఋషిసత్తములు చెప్పఁగా వింటిని. మనుష్యులు లేని
యొక మహారణ్యమందు, నొకముని ఫలమూలములఁ దినుచు
నియతుఁడై యింద్రియముల నడఁచి వసించియుండెను. అతఁడు
వ్రతదీక్షలచేత నెంతయు బడలియు, దమముగలిగియు, నెప్పు
డును వేదాధ్యయనము చేయుచును శుచియై, యుపవాసముల
చేత నాత్మశుద్ధియునొంది యెల్లప్పుడు సన్మార్గమునందే వర్తిం
చుచుండెను. ధీమంతుఁ డతఁడు కూర్చుండియుండఁగా నతని
మంచిభావమును గాంచి యడివియందుఁ గ్రుమ్మరుచుండు జం
తువులన్నియును నతనిని బ్రేమంబున దగ్గఱి వచ్చి యుండును.
సింహములును, పులులును, శరభములును మదించిన పెద్ద
యేనుఁగులును, జిఱుతపులులును, ఖడ్గమృగములును, ఎలుఁగు
గొడ్లును, మఱియు బెట్టిదముగాఁ జూపట్టునవియు, నెత్తురా
హారముగాఁ గలవియు నగు తక్కిన మృగములును నన్నియు
నాముని కడకు వచ్చి కుశలప్రశ్నములు సేయుచుండును. అవి
యన్నియు నతనియెడ శిష్యులవలెను, దాసులవలెను నడచు
కొనుచు నతని మనసెఱింగి ప్రియము నే యెప్పుడును గావించు
చుండును. అవి యతని యొద్దకువచ్చి 'సుఖమా' యని యడిగి
యతని బదులును గయికొని తమతమ నెలవులకుఁ బోవుచుం
డును. అందొకజంతువు మాత్రము గ్రామ్యమగు కుక్క,
యమ్మహాముని నెప్పుడును విడువకయే యుండెను. అది యెప్పు

మును భక్తియు ననురక్తియుఁ గలిగి యుండెను. అది యుపవాసములచేఁ గృశించి బలహీనమై పండ్లను వేళ్లను నీరును నాహారముగా శాంతమై శిష్యునివలెఁ జూపట్టుచుండును. అమ్మహర్షి యాసనమందుఁ గూర్చుండఁగా నది యతని యడుగుల క్రింద మనుష్యునివలె మనసునుంచి నెయ్యమునచే మిక్కిలియు నతనికి బద్ధమైయుండెను. ఒకనాఁడు రక్తము నాహారించునట్టి యొక బెట్టిదపుఁ జిఱుతపులి యచ్చటికి వచ్చెను. ఆ క్రూర జంతువు కుక్కను జూడఁగానే యెంతయు నుప్పొంగి రెండవ యమునివలెఁ జూపట్టెను. అది యాఁకలియు దప్పియుఁగొని పెదవులు నాఁకికొనుచుఁ, దోఁక నెడతెగక జాడించుచు, నోరు తెఱచుకొని యాకుక్క మాంసమును గోరివచ్చెను. ఆక్రూర మృగమట్లు వచ్చుచుండుటను జూచి కుక్క బ్రతుకుగోరి యామునిని జూచి యిట్లు చెప్పెను. అది చెప్పెద వినుము— 'మహాత్మా! కుక్కలకు శత్రువయిన యీ చిఱుత నన్నుఁ జంపఁ దివురుచున్నది. మహామునీ! నీ యనుగ్రహముం జేసి యీ పులివలననుండి నాకు భయములేకుండ వలయును. మహాబాహూ! అట్లు దయసేయవలయును, నీకన్నియుఁ దెలియుననుటకు సందియము లేదు' అనెను. అమ్ముని సకలప్రాణుల కూఁతలును నెఱింగినవాఁడు ; మఱి యణిమాదిసిద్ధులు గలవాఁడు. అతఁ డాకుక్కకుఁ గలిగిన భయమునకు హేతువును నా కుక్క భావమును దెలిసి దానితో 'బిడ్డా! చిఱుతపులి వలన నీ కేవిధమునను మరణభయముకలుగదు. ఇదిగో నీవు నీకుక్క రూపమునుమాని చిఱుతపులి వగుదువు' అనెను. తోడనే కుక్క చిఱుత రూపము

నొందెను. అప్పు డది బంగారుంబోని మేనును వింతలయినచాఱలు గల యంగములును మిక్కిలియుఁ బ్రకాశించుచున్న కోఱ పండ్లనుగలిగి భయంబుమాని వనంబున నుండెను. చిఱుత యా కుక్క తనకు సాటియైన మృగమై యెదుర నుండంగని తత్క్షణమే దానియెడఁ గల విరోధమంతయు నుడిగిన దయ్యెను. అంత నొక పెద్దపులి మిక్కిలియు భయంకరమైనది యాఁకటిచేత నోరు తెఱచుకొని సెలవులు నాకికొనుచు నెత్తురున కువ్విళ్లూరుచు నాచిఱుతకై వచ్చెను. ఆచిఱుతయు వాఁడి కోఱలుగలిగి యాఁకటఁ గటకటంబడుచు వచ్చు పెద్దపులినిజూచి ప్రాణరక్షణము కొఱకు ఋషిని శరణుఁజొచ్చెను. పిదప నమ్ముని కూడి మాడు చుండుటవలని నెయ్యము నపుడు నెఱపుచు నా విరోధియగు పెద్దపులికంటె బలవంతమయిన పెద్దపులిగా నాచిఱుతను గావించెను. అపు డాపెద్దపులి దానిని జూచి పయింబడదయ్యె. ఆకుక్కయో బెబ్బులితనమునొంది బలముగలదై మాంసము నాహారింపఁ దొడఁగినది కాని ఫలమూలముల నెంతమాత్ర మొల్లదయ్యెను. అది మొదలుగా బెబ్బులియైన యాకుక్క మృగరాజువలెనే వనమందలి తక్కిన మృగములను నాహారించుచుండెను. ఇది నూటపదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడాముని తనకుక్కను పలువగలమృగములను గావించుటయుఁ బిదప నది తన్నుఁ జంపఁగోరఁగా మరల మునుపటివలెఁ గుక్కను గావించుట యును జెప్పుట. }

పెద్దపులియును మృగములను జంపి తినుచుఁ బర్ణశాల మూల యందు హాయిగా నిదురించుచుండెను. ఒకనాఁడది యాశ్రమమున నుండఁగా మదించిన యొక యేనుఁగు పయికిలేచిన మేఘమువలె నచటికి వచ్చెను. దానిచెక్కులందు మదజలము దొరుఁగుచుండెను. అది మిక్కిలి పొడవై పద్మములు గలిగి, వెడఁదయైన కుంభస్థలమును, నిడుదలయిన కొమ్ములును, పెనుకాయమును గలిగి మేఘమువలె గంభీరధ్వనితోఁ గూడియుండెను. అట్లాయేనుఁగు బలమున విఱ్ఱవీఁగుచు మత్తిలి పయికి వచ్చుచుండఁగా నాబెబ్బులి దానికి భయపడి వడఁకుచు నమ్మునిని శరణొందెను. అంత నాఋషిసత్తముఁడు దాని నేనుంగు గావించెను, అప్పుడు వచ్చినయేనుఁగు పెద్దమేఘమువలె నున్నదానిని జూచి భయమునొందెను. అంత నాక్రొత్తయేనుఁగది మొదలుగాఁ దామరతంపరలం గొనును,అందుగు తోఁపులందును,మదంబు మిగులఁ దామరల పుప్పొడి మేనియం దొప్పులు గులుకుచుండ, విహరించుచుండెను. ఇట్లాయేనుఁగా పర్ణశాలయందు ముని యెదుటఁ జెరలాడుచుండఁగాఁ జాలఁగాలము గడచిపోయెను. అంత నొక నాఁడు పర్వతగుహాయందుఁ బుట్టినదియు నేనుఁగుల కులమునకు మృత్యువయినదియు భయంకరమైనదియు నగు సింహ మొకటి యెఱ్ఱని జూలు దయివాఱనచ్చటికివచ్చెను.అట్లు వచ్చుచున్న సింహ

మునుజూచి యాయేనుఁగు భయమునఁగలంగి వడవడ వడంకుచు ఋషిని శరణుఁజొచ్చెను. అప్పుడు ముని దానిని సింహముగావించెను. అప్పు డీక్రొత్తసింహ మెదుటిసింహముజాతిలోనే తాను జేరినదిగాన దానిని సరకుసేయదయ్యెను. వచ్చిన సింహము దీనిని జూచి బాధసేయక చలముడించిన దయ్యెను. ఆక్రొత్తసింహ మా యరణ్యమం దొకయాశ్రమముననే సుఖముగా వసించియుండెను. అప్పుడు తక్కిన యల్పమృగములు దానికెంతయు భయపడిప్రాణములవలని యాసం జేసి తపోవనమును సమీపింపకయుఁ గనఁబడకయుఁ బోయెను. అట్లుండఁగా, నొకప్పుడు బలవంతమును రక్తము నాహారించునదియు నానాజంతువులకు భయంకరమయినదియు నగునొకశరభమృగము వనమునందిమ్మరునది యామునిపర్ణశాలయం దున్నయాసింహమును జంపుటకువచ్చెను. అట్లువచ్చు శరభమునుజూచి సింహము శత్రువను భయమున వడంకుచు మునిని శరణొందెను ముని దానిని మిక్కిలి బలముగల శరభము గావించెను. శోడనే వనముందుండి వచ్చిన శరభము, తనయెదుట మిక్కిలి యుగ్రమును బలవంతమునయిన మునిశరభమును జూచి వేగమున వనమునకుఁ బాఱిపోయెను. ఇట్లు మునిచేత, శరభ పదవియం దుంపఁబడిన యామృగ మెప్పుడు మునిప్రక్కఁ బాయక సుఖంబుండెను. రాజా! అంత శరభమునకు భయపడిన మృగసమూహము లన్నియును, ఆ భయమునఁ బ్రాణముల రక్షించుకొనఁగోరి వనమునుండి నలుదిక్కులకుఁ బాఱిపోయినవి. మాంసాశనమగు నాశరభము మిక్కిలి సంతోషమునొంది యెప్పుడును బ్రాణులను జంపుటయందే యాసక్తిగలిగి ఫలమూలముల నాహారింప నొల్లదయ్యె.



593. ఒకముని తన కుక్కను బలువిధములైన మృగములుగాఁ
గావించుట; పిదప నది శరభము కాఁగానే
మునిని మ్రింగ వచ్చుట.

అంత నాశరభము బలవంతమై గొప్పకులమునందుఁ జేర్పఁబడినదయ్యు నడవడి నీచమైనదిగాన నెనరుదప్పి యామునినే చంపఁగోరెను. అపుడు మునుపు కుక్కగానుండిన యామీఁగండ్లమెకము 'నే నిమ్మునిమహిమచేత నావాక్కొకటి చేతనే సకల ప్రాణులకును భయంకరమైనదియు నెంతయుఁ బడయరానిదియు నగు శరభత్వమును బొందితిని. ఈ ముని నాశ్రయించి బ్రతుకు మృగములును నశ్లె పక్షిసమూహములును, నిందుఁ గలతక్కిన ప్రాణులును భయమున వడఁకుచుఁ గుందుచున్నవి. లోకమునందు సకలములయిన ప్రాణులకంటె నుత్తమమయిన బలము నెలకొని యున్నట్టి యిట్టి శరభత్వమును నొకవేళఁ దక్కినవానికిఁ గూడ నితఁడిచ్చిన నీవచ్చును. ఇతఁడొకవేళఁ బక్షులకును గరుడుని బలమునొసంగవచ్చును. ఈబ్రాహ్మణుఁడు కరుణగడలుకొన, నెంతయుఁ బ్రీతితళుకొత్త, నుల్లసిల్లుచుమఱియొక్క ప్రాణికిబలము నొసంగకమునుపే నేను శీఘ్రముగా నీతనిఁ జంపవలయును. మునీంద్రునిఁ జంపినపిదప నే నిచట నే జంకును లేక యుండవచ్చును' అని యాలోచించెను. అంత నాముని తన తపోమహిమచేతఁ దోడనే దానిని గనుఁగొనెను. అట్లు తెలియఁగానే యాప్రాజ్ఞుండు దానికి శాపమొసంగువాఁడై 'నేను భృగుకులమునంబుట్టినయగ్నిప్రభుండను మునిని; నేను మనస్సుచేత జగత్తును గాల్పను ధరింపను జాలుదును. దేవతలును జరాచరము లగు సకలజంతువులును నాకు లోనై యున్నవి. దేవతలు నావలన భయపడి తమ ధర్మమును విడువకుందురు. నేను స్వధర్మమును దిగవిడిచినవాని నెవని నేనియు నావాక్కుచేత నే కాల్చిపుత్తును. ఓరీ! ఏనొవ్వను లేని శరభజన్మమును బొందించిన నాకు నీవెంతమాత్రము?

నీవు తొలుత సకలప్రాణులయందును గ్రూరమై హీనమై యశుచి యైన కుక్కగానుండి నాచేతఁ జిఱుత గావింపఁబడితివి. చిఱుతగా నుండి బెబ్బులితనమును బొందితివి. దానినుండి మదపు టేనుంగు గాను, ఏనుఁగుగానుండి సింహముగాను నయితివి. సింహమవై యుండి బలముమించి నీవు మరల మీఁగండ్ల మెక మయితివి. ఇప్పుడు నీ ప్రాణములకు సందేహించి నేను బలుదెఱంగులుగాఁ గావించినవాఁడవే కాని యాయాకులములందు నిజముగాఁ జేరిన వాఁడవుగావు. పాపా ! ఇట్లే పాపము సేయని నన్ను నీవు చంపఁ దలఁచినకారణమున మరల నీతొలి పుట్టుకనొంది కుక్కగా నుందువుగాక' యని శపించెను. అంత దుష్టస్వభావమునను నవివేకమునను దెలివిదూలి యాశరభము ఋషిని ద్వేషించి యాతని శాపమునకుఁబాలై మరలఁ దొంటి కుక్కరూపము నొందినదాయెను. ఇది నూటపదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు మంత్రి మొదలయిన వారిగుణములను జెప్పుట.

ఋషి యట్లు హుంకారముచేసి తపోవనమునుండి వెలికిఁ దఱుమఁగొట్టఁగా నాజంతువు తన యెప్పటిరూపునొంది మిక్కుట మయిన దీనత్వము పాలయ్యెను. విషయ మిట్లున్నది. కాన మతిమంతుఁ డగు రాజు, శీలము, శౌచము, ఆర్జవము, స్వభావము, బుద్ధి, చదువు, నడత, కులము, అడఁకువ, జాలి, బలము, వీర్యము, ప్రభావము, మనశ్శాంతి, క్షమ యనువీనిని గనుఁగొని, యోగ్యులగువారిని మంత్రులుగాను భృత్యులుగాను నాయా

యధికారములందు నెలకొలిపి చక్కఁగా రక్షింపవలయును. రాజు పరీక్షింపక పనివాండ్రను నియమింపరాదు చెడుకులమునఁ బుట్టిన మనుష్యులు రాజుచుట్టు నుందురేని యతఁడు వృద్ధి నొందఁజాలఁడు. రాజా! మంచికులమునఁ బుట్టినవాఁడవివేకిగా నుండినను, దప్పులేక నిందింపఁబడినను, ఆకులమునందుఁ బుట్టిన కారణమున నెప్పుడుగాని పాపమందు బుద్ధిని జెల్లింపఁడు. చెడుకులమునందుఁ బుట్టిన యవివేకి యగువాఁడో సాధువుల నాశ్రయించి పడయరాని యైశ్వర్యమును బడసినను, వానిని నిందించినచో వైరము చూపఁదొడఁగును. (కాకియు, కుక్కయు, బిల్లియు, బాముయు, చెడుకులమునందుఁ బుట్టిన మనుజుఁడును, అట్టి స్త్రీయును, సమానులని చెప్పఁబడెదరు. స్త్రీనేనియు,లేక పురుషునేనియుఁ జెడుకులమునందుఁ బుట్టినవారిని లోకపాలురు నయితె మెప్పుడును భయంబునఁ జూతురు. అందులకును గారణము శీలమే. శీలము లేమినిబట్టి వారట్లు చూతురు. పురుషుఁడును స్త్రీయును జెడుకులంబునఁ బుట్టినవారయ్యును, నహింసయు శీలమును గలిగియుండిరేని * ధార్మికులును గొప్పకులమునఁ బుట్టినవారు నగుదురు. రాజా! బృహస్పతి ధర్మమును గుఱించి కొన్నిశ్లోకములు చెప్పెడిని. వాని నంతయువిని మనంబున నుంచుకొనుము. అవియేవనఁగా—'దమముగల తపస్వివలెఁ బరిశుద్ధకర్ముండగువాఁడు నల్లనిచండాలుఁడుగా నుండినను మంచినడవడి గలిగి యుండుటవలన వానిని దేవతలు బ్రాహ్మణునిఁగాఁ దెలియు

* 'ధర్మశ్చాకులతాం వ్రజేత్' ధర్మము కలఁతనొందునని యర్థము. ఇది పూర్వోత్తర విరుద్ధముగాన 'ధర్మ్యస్సుకులతాం వ్రజేత్' అని పాఠము దిద్దంబడెనని తెలియునది.

దురు. ఒకఁడు ప్రజలహితముఁగోరియుఁ దక్కిన సమస్తజంతువుల హితముఁగోరకున్న, బాపం బగు నొకజంతువును జంపునేని దానిచేత వాఁడు హింసచేసినవాఁడు గాఁడు. పశువులయు బ్రాహ్మణులయు హితముఁగోరకున్న, బిడ్డలను స్త్రీలను వృద్ధులను రోగులను రక్షించుకోరకున్న, నెవఁడు చిఱుతపులిని, శరభమును, సింహమును, పెద్దపులిని, ఏనుఁగును, ఎనుమును, అడవి పందిని, ఊరఁబందిని, కుక్కను, సర్పమును జంపునో వాఁడు ధర్మమును బొందును. బ్రాహ్మణుఁడుగా నుండియుఁ బాపము చేయువాఁడుగను, మ్లేచ్ఛుఁడుగా నుండియుఁ బరిశుద్ధుఁడుగను ధార్మికుఁడుగను నుండెనేని వారియందు మ్లేచ్ఛుఁ డధికుఁడును బ్రాహ్మణుఁడు మిక్కిలి పాపాత్ముండును నగును. చెడుకులమునఁ బుట్టినవాఁడైనను మంచికులమునఁ బుట్టినవాఁడయినను నొకఁడు మంచిశీలము గలిగియుండెనేని వాని స్వభావము తెలిసికొని స్థిరముగానో లేక పరీక్షించుటకై కొంతకాలమువఱకో సమాహితుఁడై యొక మంచియధికారమునఁగాని లేక మంచి కార్యమునఁగాని నియోగింపవచ్చును. రాజు చెడ్డనడవడిగలవానిని బాపకార్యములందు నియోగింప వలయును' అనియే. మంత్రియగువాఁడు కులీనుఁడును, జదువునందు శిక్షితుఁడయినవాఁడును, బండితుండును, జ్ఞానవిజ్ఞానములందు నిపుణుండును, సమస్తశాస్త్రార్థముల కలరూపు నెఱింగినవాడునై యుండవలయును. మఱియు నోర్పుగలవాఁడుగను, స్వదేశమందుఁ బుట్టినవాఁడుగను, నెనరుగలవాఁడుగను, బలవంతుఁడుగను, శాంతియు దాంతియుఁ గలవాఁడుగను, జితేంద్రియుఁడుగను నుండవలయును. మఱియు లోభములేనివాఁడుగను, దొరకినదానితో

సంతోషించువాఁడుగను, తన యధిపతిని మిత్రులను వర్ధిలఁ జేయఁ దివురుచుండువాఁడుగను, కార్యాలోచనమందు సహాయుఁడుగను, దేశకాలములను దెలిసినవాఁడుగను, సమస్తప్రాణులను నాదరమునఁ గయికొనుటయం దాసక్తుఁడుగను, బరిశుద్ధుఁడుగను, కొలఁదిమాట లాడువాఁడుగను, హితమునుగోరు స్వభావము గలవాఁడుగను, ప్రాలుమాలిక లేనివాఁడుగను, యుక్తమయిన యాచారముగలవాఁడుగను నుండవలయును. తన దేశమునందువలయు సంధి విగ్రహములందు నిపుణుఁడుగను, బ్రసిద్ధుఁడుగను, ధర్మార్థకామములు మూటిని దెలిసినవాఁడుగను, బురజనులకును దేశజనులకును బ్రియుఁడుగను, సైన్యములనొడ్డు పన్నుటను జక్కఁగాఁ దెలిసినవాఁడుగను, సైనికులను నుబ్బునఁ జెలరేఁగునట్లు చేయుటకు దిట్టయైనవాఁడుగను, ఇంగితమును నాకారమును స్వరూపముల నెఱిఁగినవాఁడుగను, దండయాత్రలందు సమర్థుఁడుగను, గజములను నశ్వములను బనుపఱచు తత్త్వములందు సమర్థుఁడుగను, అహంకారము లేనివాఁడుగను, చుఱుకుఁదనముగలవాఁడుగను, ధైర్యవంతుఁడుగను, అడఁకువ గలవాఁడుగను, యుక్తముగ నాలోచనను సేయువాఁడుగను, బరిశుద్ధుఁడుగను, బరిశుద్ధులగువారు బలసియున్నవాఁడుగను, మంచివేషము గలవాఁడుగను, జూచుట కింపయినవాఁడుగను నుండఁదగును. కార్యములనడుపఁజాలువాఁడుగను, నీతియందుఁ గుశలుఁడుగను, ఆఱుగుణములతోఁ గూడినవాఁడుగను, మోటుఁదనము లేనివాఁడుగను, వినయముగలవాఁడుగను, మృదువయినవాఁడుగను, మెత్తఁగఁ బలుకువాఁడుగను, ధీరుఁడుగను, శూరుఁడుగను, గొప్పపెంపుగలవాఁడుగను, దేశకాలములకుఁబొసఁగునట్లుచేయువాఁడు

గను నుండవలయును. అట్టివానిని మంత్రిగాఁ గావించికొని యతనిని గ్రిందుపఱుపక యేరాజుండునో యతనిరాజ్యము చంద్రుని వెన్నెలవలె విస్తరించును. శాస్త్రములందుఁ బండితుఁడై ధర్మమే ప్రధానమైనదిగాఁ గలిగి ప్రజాపాలనముం దాసక్తుఁడై ఖాఁది గుణములెల్లఁ గలిగియుండురాజు జనులకును గోరందగిన వాఁడగును. అట్టిరాజు ధీరుఁడును, సైఁచువాఁడును, శుచియు, కాలమునకుఁ దగినట్లు చుఱుకుగలవాఁడును, ప్రయత్నమువలని పసనెఱింగినవాఁడును, పెద్దలయెడ శుశ్రూష గలవాఁడును, చదువరియు, అర్హులగువారి యుపదేశముల వినువాఁడును, ఊహామందును నపోహామందును బండితుఁడును, మేధావియు, ధారణాశక్తి గలవాఁడును, న్యాయము చొప్పున జరుపువాఁడునుగా నుండవలయును. మఱియు నతఁ డెప్పుడును దమముగలిగి, ప్రియభాష లాడువాఁడై, అపకారియందును క్షమనెరపుచు, *తనచేతులార దానము సేయువాఁడును, శ్రద్ధగలవాఁడును, చూచుట కింపయినవాఁడును, ఆర్తులగువారికి నెప్పుడును జేయిచ్చి కాచువాఁడును, ఆప్తులయిన మంత్రులుగలవాఁడును, నీతియందాసక్తుఁడునై యుండవలయును. మఱియు నేననెడి యహంకారము లేకయు, భార్యలేకుండకయు, తనయిచ్చకుఁ దోఁచినట్లెల్ల విచారింపక యేదేనియొకటిచేయకయు నుండవలయును. మంత్రులేదేని మంచికార్యము చేసిరేని వారి కతఁ డుపకారము చేయవలయును. భృత్యజనులయందుఁ బ్రీతిగలిగి యుండవలయును.

* 'దానాచ్ఛేదే స్వయంకారీ' అని మూలము. 'నాతిచ్ఛేత్తా స్వయంకారి' అని దా. మూలము. మితిమీఱి త్రుంపనివాఁడును, తానేకార్యమును జేయువాఁడునని యర్థము.

సమస్తజనులను బాగ్రులునూాలక రాఁబట్టు కొనుచుండవలయును. ప్రసన్నమగు మొగముగలిగి యుండవలయును. మఱియు నెల్ల వారిని రక్షించుచును భృత్యజనుల నేకొఱంత లేకుండ నాదరించుచును, గోపము నెరపకయు గొప్ప మనస్సుగలిగియు నుండవలయును. మఱియు దండమును దిగవిడువక దానిని యుక్తముగాఁ బ్రయోగించుచు ధర్మకార్యములం దండఱను నియమించు చుండవలయును. అతఁడు చారులనెడి కన్నులచేతఁ బ్రజలస్థితిగతులను గనుఁగొనుచు ధర్మార్థములం దెప్పుడును గుశలుఁడై యుండవలయును. ఈ నూఱుగుణములును గలిగియున్నట్టి రాజెల్లవారికి గోరఁదగినవాఁడగును. రాజేంద్రా! రాజు తనరాజ్యమును రక్షించుటకు సహాయులుగా సకలగుణగణములతోఁ గూడినవారగు మంచి పురుషులను సైనికులుగా నరసి కూర్చుకొనవలయును. రాజు తనవృద్ధిని గోరునేని వారి నెంతమాత్ర మవమానింపరాదు. ఏరాజు యోధులు, యుద్ధమందుఁ బరాక్రమశాలులును, కృతజ్ఞులును, శాస్త్రకోవిదులును, ధర్మశాస్త్రము చక్కఁగాఁ దెలిసినవారును, పదాతిసమూహములు బలసియున్నవారును, * నిర్భయు లగు గజసైనికులుగలవారును, రథయుద్ధమందు విశారదులును, ఇష్వస్త్రములందును నిపుణులును నగుదురో యట్టిరాజు పాలిసామ్మై యీభూమి. జ్ఞాతుల నవమానింప కుండుటయు, భృత్యులందుఁ గపటము లేకుండుటయు, ధనముల నార్జించు వ్యాపారములందు నేర్పు మెలపుగలిగియుండుటయును గలరాజు పాలిది యీభూమి. ఆలస్యము, నిద్ర, వ్యసనములు, మిక్కిలి

---

* అభయా గజపృష్ఠస్థాః ' అని మూలము.

పరియాచకముననెడి యివి యెవరికిఁ గలుగవో యారాజునకే మిక్కిలియుఁ జిరకాల మీభూమి దక్కియుండును. పెద్దలను గొలుచువాఁడును, మిక్కిలి యుత్సాహము గలవాఁడును, నాలుగువర్ణములవారిని గ్రమముదప్పనీయక రక్షించువాఁడును, ఎప్పుడును ధర్మకార్యములు చేయుచుండువాఁడు నగు రాజునకే యెంతయుఁగాలము నీభూమి దక్కియుండును. నీతిమార్గమునే యనుసరించుటయు, నెప్పుడును బ్రయత్నశీలుఁడై యుండు టయు, పగవారి నవమానింపకుండుటయుఁ గలవాని కీభూమి చిరకాలము దక్కియుండును. మనువు తొల్లి పురుషకారమును దైవము ననెడియీ రెంటియందుఁగల పెక్కుదెఱంగులును వర్ణిం చి యున్నాఁడు. వానిని జెప్పెదను వినుము. రాజులకుఁ బౌరుష మునే బృహస్పతి చెప్పుచున్నాఁడు. నీవెప్పుడును నయమును ననయమును గుఱించినవిధులను దెలిసియుండుము. విరోధుల ఛిద్రములను గనుఁగొనుచును, సుహృదుల కుపకారముచేయు చును, భృత్యుల తారతమ్యములను దెలియుచును నుండురాజు రాజ్యమువలని ఫలమును బొందును. ఏరాజు సమస్తప్రజలను దనపక్షమునఁ గూర్చుకొనుటయందే యెపుడును గనుగలిగి పురుషప్రయత్నము చేయు స్వభావముగలిగి మిత్రుల బలిమి నిండారియుండునో యతఁడే రాజసత్తముఁడు. ఏరాజు మను ష్యులందఱను దనపక్షమున రాఁబట్టుకొని యుండునో యతఁడు వీరులగు వేయిమంది గుఱ్ఱపురౌతులతో భూమినంతయు గెలువ శక్తుం డగును. ఇది నూటపదునెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు భృత్యులను దగినయధికారములందు నియమింపవలయుననుట ; భృత్యుల లక్షణములనును జెప్పుట.

భీష్ముఁడు—'ఏరాజు, (కుక్క కథవలనఁ దేలిన సిద్ధాంతము చొప్పున) నాయాభృత్యులను వారివారికిఁదగిన స్థానములందు నియమించునో యతఁడే రాజ్యమువలని ఫలమును బొందును. కుక్కను దానికిఁ దగినపదవికిఁ బోలఁదిని మీఱి పూజించి యెక్కుడుపదమం దుంపరాదు. దానికిఁ దగినపదముకంటె నెక్కుడు దానియందుఁ బెట్టినచోఁ గావరమున విఱ్ఱవీఁగును. మంత్రులను వారికిఁ దగినస్థానములం దేర్పఱుపవలయును. వారును దమపదవులకుఁదగిన గుణములను గలిగియుండవలయును. తగనిస్థానమునం దధికార మేర్పఱచుట తగదు. ఏరాజు భృత్యులకు వారివారికిఁ దగినపను లొసంగునో యతఁడు వారి గుణములవలనఁ గలుగుఫలమును బడయును. శరభమును శరభస్థానమందును, సింహమును సింహస్థానమందును, బెబ్బులిని బెబ్బులిస్థానమందును, జిఱుతపులిని జిఱుతపులిస్థానమందును నుంపఁదగునట్లె, భృత్యులను విధ్యుక్తముగా వారివారికిఁ దగినపనులయందు నుంపవలయును. కార్యములవలని ఫలమును బడయఁగోరురాజు, ఆయా భృత్యులను వారికి నెక్కుడయిన యధికారములందు విపరీతముగా నేర్పఱుపరాదు. ఏరాజు బుద్ధిమాలి ప్రమాణము నతిక్రమించి భృత్యులను వారికిఁ దగనిపదవులందు నియమించునో, యతఁడు ప్రజలను రంజింపఁజాలఁడు. రాజు గుణములను గోఁగువాఁడేని, జిన్నవాండ్రను, అల్పులను, ప్రజ్ఞలేనివారలను, ఇంద్రి

యములను జయింపనివారిని, జెడుకులమునఁ బుట్టినవారిని దన కెలన నుంచుకొనఁడు. సాధులును, గులీనులును, శూరులును, ప్రాజ్ఞులును, అసూయలేనివారును, పెద్దతికము గలవారును, బరిశుద్ధులును, సమర్థులునగు మనుష్యులు రాజుపొంత నుండఁ దగినవారగుదురు. రాజునకుఁ గ్రిందుపడి యతనిమేలిమిని గొండాడువారును, అడఁకువగలవారును, బరిశుద్ధులును, శుభగుణములు సహజముగా నలవడినవారును, తమతమ స్థానములను దప్పకుండువారు నగు మనుష్యులు రాజునకు వెలుపలఁ దిరుగు ప్రాణము లగుదురు.

సింహము ప్రక్క నెప్పుడును సింహమే పరివారముగా నుండవలయును. సింహముగానిది సింహముతోఁ గూడినచో నది సింహమువలె ఫలమునొందును. ఏసింహము సింహము చేయవలసిన కార్యమును బూనునదై, కుక్కలను ప్రక్కందోడుగాఁ బెట్టుకొనునో, యది యాకుక్కల కొలువునలన సింహము పొందఁదగుఫలమును బొందుట కెంతమాత్రము నేరదు. రాజా! ఈవిధముననే శూరులును బ్రాజ్ఞులును మిక్కిలి చదువరులును గులీనులు నగువారిఁ దోడుచేసికొన్నచో భూమినంతయు జయించుటయు శక్యమగును. రాజు తనపొంత విద్యావిహీనుఁడగు వానినిఁ, గపటవర్తనుని, ప్రజ్ఞలేనివానిని, పెనువాసి కెక్కని వానిని జేరఁబట్టరాదు. స్వామి కార్యమం దెంతయు నాసక్తిగల మనుష్యులు తమనేలిక యానతీయఁగానే బాణమువలె దానిని జేయఁ బోవుదురు. అట్టిరాజునకు హితము లాచరించుచుండునట్టి భృత్యులయెడ రా జెప్పుడును మంచిమాటలే యాడుచుండవలయును. రాజులు మిక్కిలి ప్రయత్నపడి యెప్పుడును బొక్కస

మును రక్షించుచుండవలయును. రాజులకు బొక్కసమే యా ధారము. కావున బొక్కసము నెప్పుడును వృద్ధిచేయుచుండ వలయును. నీధాన్యపుకొట్టునం దెప్పుడు ధాన్యములను సమృద్ధముగాను జక్కఁగాను సేకరించియుంచుచుండ వలయును. నీ ధనములను ధాన్యముల నెప్పుడును సత్పురుషు లగు భృత్యుల కప్పగించి చూచుకొనునట్లు చేయవలయును. నీభృత్యు లెప్పుడును నెచ్చరికగలిగి యుద్ధములం దాఱితేఱినవారై యుండ వల యును. గుఱ్ఱములను గుఱించిన సకలప్రయోగములందును సామర్థ్య ముండవలయును. పాండుపుత్రా! జ్ఞాతులను, బంధువులను నాదరించుచుండుము. మిత్రులును సంబంధులును బలసియుండ నుండుము. పురజనుల కార్యముల హితమును నరయుచుండుము. నీకెప్పుడును దృఢముగా నుండవలసిన బుద్ధియుఁ బ్రజ్ఞ యును నిదె చెప్పితిని. ఇందు నీకుఁ గుక్కయె నిదర్శనము. మఱి యునేమి వినఁగోరెదవు' అని యడిగెను. ఇది నూటపందొమ్మి దవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ప్రజాపాలనవిధము మొదలయిన వానిని ధర్మరాజునకుఁ జెప్పుట.}

ధర్మరాజు 'భారతా! రాజధర్మములును వాని ప్రయోజనము లను జక్కఁగాఁ దెలిసి పూర్వులు తొల్లి నియమించినట్టి రాజ వృత్తములను బెక్కింటిని నాకుఁ జెప్పితివి. సజ్జనులకు నభిమత మయిన యాపూర్వవృత్తమునే నాకు విస్తరించి చెప్పితివి? దానిని సంక్షిప్తముగా నుపదేశింపవలయును' అని యడిగెను.

భీష్ముఁడు 'సమస్తప్రాణులను రక్షించుట క్షత్రియుల కుత్తమమయిన ధర్మముగా నెన్నఁబడుచున్నది. అట్టి రక్షణమెట్లు చేయవలయునో చెప్పెదను' వినుము. నెమిలి పలువన్నెలుగల పించెములను ధరించినట్లు ధర్మవిదుండగు రాజును బలువిధములయిన రూపులను బూనవలయును. వాఁడిమియుఁ గపటమును సత్యమును నార్జవమును ననుగుణము లతని కుండవలయును. అతఁడు సుఖమును బడయువాఁడేని, పక్షపాతములేక మంచితనము నూఁదియుండవలయును. ఏకార్యమునం దేరూప ముండవలయునో యందు దారూపునే సూపవలయును. పెక్కురూపు లొందఁజాలిన రాజునకు మిక్కిలి చిన్నకార్యము సయితము చెడిపోవకుండును. రాజు, శరత్కాలమందుఁ గూఁ పెట్టక మూఁగయై యుండు నెమిలివలె నెప్పుడును మంత్రాలోచనమును బయలు గ్రక్కక కాచుచుండవలయును. * అతఁడు క్రొంచెముగనే

* శ్లక్ష్ణాక్షరతనుః శ్రీమాన్ భవేచ్ఛాస్త్రవిశారదః । ఆపద్ద్వారేషు యుక్తస్స్యాత్ జలప్రస్రవణేష్వివ । శైలవర్షోదకానీవ ద్విజాన్ సిద్ధాన్ సమాశ్రయేత్ । అర్థకామశ్శిఖాం రాజా కుర్యాద్ధర్మధ్వజోపమామ్ ॥ నిత్యముద్యతదండస్స్యాదాచారే చాప్రమాదవాన్ । లోకే చాయవ్యయౌ దృష్ట్వా బృహద్వృక్షమివాస్రవత్' ఈప్రకరణమందు రాజువృత్తములు మయూరవృత్తములతోఁ బెక్కులుపోల్చి చెప్పునట్లు చూపట్టుచున్నది. కాన యిట యాయావ్యాఖ్యాతలు వేఱువేఱువిధముల నర్థములువ్రాసియున్నను నన్నియు మయూరసాదృశ్యయుక్తముగా నుండునట్లర్థమె వ్యాసహృదయముగాఁదోఁచుచున్నది. ఎట్లనఁగా - నెమలి క్రొంచముగను మధురముగను గూయునట్లు రాజు గొంచెముగను దయగను మాటలాడుచు సిరిగులుకుచు నుండవలయును. నెమలి సెలయేళ్లయెడ నెచ్చరికగలిగి యుండునట్లు రాజు నాపద్ద్వారములందు జాగ్రత్తగలిగియుండవలయును. అదికొండయందలి వర్షజలముల నాశ్రయించినట్లు రాజు

మాటాడవలయును. ఆ కొంచెమును దీయగా నుండవలయును. అతఁడు సిరిగులుకు రేకలుగలిగి శాస్త్రములం దాఱితేఱియు నుండవలయును. మనుష్యులు చెఱువునుండి నీరువచ్చు తూము కాలువలయందు (నవి మితి మీఱి తమపొలములను నిండ్లను ముంచకుండునట్లుగా) నెచ్చరిక గలిగియుండునట్లు, రాజు తనకాపదలు వచ్చుద్వారములందుఁ గనుగలిగి యుండవలయును. జనులు కొండలనుండి వర్షజలములు క్రొత్తగా వెల్లి గొన్న నదులను నాశ్రయించునట్లు రాజు సిద్ధినిబొందిన బ్రాహ్మణుల నాశ్రయింపవలయును. ధనమును సేకరింపఁగోరు రాజు, పయికి ధర్మచిహ్నములను ధరించు కపటులు తలయందు శిఖ పెంచుకొనునట్లు తాను గపటవేషము నూఁదవలయును. రాజెప్పుడును దండమును జేతనెత్తికొని యుండవలయును. ఆచారములందుఁ బ్రమాదము నొందరాదు. రాజు ప్రజలకుఁ గలయాదాయమును వ్యయమును ముందుఁ బరిశీలించి కనుఁగొని పెద్దపెరిఁగిన తాటిమ్రాన నుండి రసమును దీయునట్లు వారివలనఁ దగ వెఱింగి

సిద్ధులగు బ్రాహ్మణుల నాశ్రయింపవలయును. అది తలయందు వేసమునకై జుట్టుం దాల్చి యుండునట్లు ధర్మవేషమునకైన చిహ్నమును దాల్పవలయును. ఎప్పుడును నది కొఱ్ఱును (దండయష్టి)నెక్కియుండునట్లు రాజు దండము నెప్పుడును దాల్చి పరాకుపడకుండ వలయును. 'లోకేచాయవ్యయౌ దృష్ట్వా వృక్షాద్వృక్షమి వాప్రజేత్' అని పాఠాంతరము. ఇది నెమిలి కనుగుణముగా అర్థమును గలిగియున్నది. నెమలి యొకచెట్టునుండి మేలయిన మఱియొకచెట్టునకు బోవునట్లు రాజాయవ్యయములను జూచి తక్కువ వ్యయముగల కార్యమునకుఁ బూనవలయు నని యర్థము.

పన్ను దీసికొనవలయును. * రాజు తనకూటువవారిని దనయాజ్ఞయందు మెలఁగించుచును, శత్రువు పంటలను దనసేన గుఱ్ఱముల త్రొక్కుడులచేఁ జెల్లాచెదరు గావించుచుఁ, దనకు బక్షము (సహాయము) బలమయినపుడు శత్రువులపయికిఁ బోవుచునుండవలయును. తనయందుఁగల వికలత్వములనెల్లఁ గనుఁగొనుచుండవలయును. అతఁడు శత్రువుల దోషములను వెలిపుచ్చవలయును. వారిపక్షము వారినెల్లఁ గ్రిందుపఱుప వలయును. అడవినుండి పువ్వులనుంబోలె బయటనుండి ధనములను సంతరించు చుండవలయును. † కొండలవలెమిక్కిలి యున్నతినొంది పెంపుసొంపారు

---

* 'ఆజ్ఞావాన్ స్యాత్ స్వయూథ్యేషు భౌమాని చరణైః కిరన్ జాతపక్షః పరిస్పన్దేత్ ప్రేక్షేద్వైకల్యమాత్మనః' నెమిలి తనకదుపులయందుఁ జెల్లుబడిగలిగి భూమియందుఁ గాలితోఁ గ్రుమ్మరుచు (పక్షములు) రెక్కలు మొలవఁగానే పయికెగురుచు తనవైకల్యమును (గోప్యస్థానమును) జూపునట్లును, రాజు తనవర్గములందాజ్ఞగలిగి శత్రువులపంటలను గుఱ్ఱముల కాలం జమరుచు పక్షము (సహాయము) రాఁగానే పయినెత్తుచు దనవికలతను గనుఁగొనుచు నుండవలయును.

† ఉచ్ఛ్రితాన్నాశ్రయేత్ స్ఫీతాన్ నరేంద్రాః సచలోపమాన్ । శ్రయేచ్ఛాయామవిజ్ఞాతం గుప్తంశరణ మాశ్రయేత్' అని మూలము. ఉచ్ఛ్రితాన్నాశ్రయేత్ ... శ్రయేచ్ఛాయామివ జ్ఞాతిం గుప్తంశరిణ మాశ్రయేత్' అని దా. మూలము. నెమిలి తనతోఁకచేతనే కాకి మొదలయినవాని కొఱఁత తోఁపించునట్లు రాజు తనస్ఫూర్తిచేతనే శత్రువుల కొఱఁతలు వెలియగునట్లు చేయవలయును. దా. మూలపాఠమున నెమిలి పొడవయిన పర్వతముల నాశ్రయించినట్లు ఉన్నతులై వర్ధిల్లియుండు శత్రువుల నాశ్రయింపవలయును. నెమిలి బడలినపుడు నీడ నాశ్రయించినట్లు పెంపుగుండెన కాలమందు జ్ఞాతిని నాశ్రయింపవలయును. నెమిలి వేసవికాలమందు చెట్టునందుఁ బదిలముగా మఱఁగి కాచుకొనునట్లు రాజు రహస్యముగా గుప్తినిగావించుకొనవలయునని యర్థము

చుండు మేటి శత్రురాజులను, దెలియరాని కందువపట్టుల నాశ్రయించియు, పదిలమయిన పట్టులందుఁ బొంచియుండియు, నాశము సేయవలయును.* నెమిలి వర్షాకాలమందుంబోలె రాజు రాత్రియందుఁ దన విడిదిపట్టును, వేఱొక్కరును లేకయు నెవ్వరికిని దెలియకయు నుండునట్లు ప్రవేశింపవలయును. నెమిలివలె నేయతఁడు తన మందిరములో నిశలందుఁ జెలువల పొత్తుగూడి విహరింపవలయును కవచమును విడిచియుండరాదు. తన్నుఁ దానే రక్షించుకొనుచుఁ (నెమిలి తానుతిరుగు చోటులందు వైచినవలలను దొలఁగఁ బుచ్చుకొనునట్లు) చారులు చూపెడి చోట్లఁ గపటముగా వైచియున్న పాశములను వర్జింపవలయును. తన శత్రువులచారులను వశము గావించు కొనవలయును. వారలు పట్టువడినచో నాశము సేయవలయును. ఇట్లు నెమిలి ధర్మముచొప్పున నెప్పుడును వర్తించునది. విషమును గోపమును వంకరగతియుఁ గలపాములను జంపునట్లు మిక్కిలి విషము గలవారును గోపముగలవారును వక్రమగు నడవడిగలవారునగు శత్రువులను జంపవలయును. నెమిలి, పురుపు మొదలయిన వానికి రోయకుండునట్లు, మచ్చింపఁదగినవానియెడ నసూయపడరాదు. నెమిలి బలువయిన పక్షములను బడసియుండునట్లు దిటమయిన మూలము గలమంత్రులు మొదలయిన పక్షము వారిని బట్టు కొలిపికొనవలయును. నెమిలి యెప్పుడుగాని తనపక్షములను నిచ్చచొప్పున విరివిగాఁ జేసికొనునట్లు తనపక్షపువారిని బర్వఁ జేయుమేలికార్యము నాచరింపవలయును. అన్నిచోటులనుండి

* 'ప్రావృషీ వాసితగ్రీవో మాద్యేత నిశి నిర్జనే' అని మూలము. అసితగ్రీవ మనఁగా నెమిలి-నీలకంఠమునకుఁ బర్యాయము.

యుఁ బ్రజ్ఞను బడయవలయును. మిడుతలగుంపు లడవులందుఁ బడి యాఁకులేకుండఁ జేయునట్లు, ఒక్కటిగాఁగూడి శత్రురాజ్యములపయి దండు వెడలవలయును. రా జిట్లు నెమిలివలెఁ దన రాజ్యమును బరిపాలింపవలయును. సమర్థుం డగు రాజు తనకు నెంతయు బుద్ధిని గలిగించునట్టి నీతిని జెల్లింపవలయును. తన బుద్ధిచేతఁ దన్నడంచుకొని పరబుద్ధిచేత విచారముచేసి నిర్ణయించుకొనవలయును. శాస్త్రములచేత సంస్కరింపఁబడిన యాబుద్ధినిగొని యొకఁడు తన కార్యగుణమును నేర్పఱచుకొనవలయును. దీనియందే శాస్త్రములపస యున్నది. శత్రువును సామముచేత నమ్మింపవలయును. తనశక్తిని సయితము చూపవలయును. తన యాలోచనముచేతఁ గార్యనిశ్చయమును దనబుద్ధిచేత నందులకుఁదగిన యాలోచనమును జేయవలయును. సామోపాయమందు మతిగలప్రాజ్ఞుఁడు కార్యాకార్యములను వివేచించి నడప నేర్చును. లోఁతయినబుద్ధిగలధీరునకు నుపదేశింపవలసినది లేదు. ప్రాజ్ఞుం డగు నతఁడు బుద్ధియందు బృహస్పతిని బోలినవాఁడయినను గొఱమాలిన ముచ్చట యగు బుద్ధిమాలిన వాదమును మాటాడునేని పరుని యుక్తివాదముచేత, కాఁచఁబడిన యినుము నీరు దగిలి చల్లఁబడునట్లు, తన యెప్పటి ప్రతిభదూలినవాఁ డగును. రాజు తన కార్యములనుగాని పరుల కార్యములనుగాని యాగమములం దుపదేశింపఁబడిన రీతుల చొప్పునఁ జేసికొనవలయును. ధనము నార్జించు విధులను దెలిసినరాజు మృదువుగను గ్రూరుఁడుగను బ్రాజ్ఞుఁడుగను శూరుఁడుగను నుండువానిని జక్కఁగా మాటాడునట్టితక్కుఁగలవారిని దన కార్యములందు నియోగింపవలయును.

రాజు తాను జక్కఁ జూచుచుండక పోయినను దమతమ కను
రూపములయిన కార్యములందు నియుక్తులయి యుండువారిని
నిడుద లయిన వీణతంతి స్వరములనుంబోలె ననువర్తింపవల
యును. ధర్మములకు విరోధము లేకుండునట్లుగా వారికిఁ బ్రియ
మాచరింపవలయును. 'ఈలోకము నాది'యని తలఁచు రాజు
వ్యవహారమును గలరూపునఁ దెలిసికొని, సూర్యుఁడు నిడుద
లయిన తనకిరణములంబోలె, ప్రియాప్రియములను సమముగాఁ
జేసికొని కొండవలె దిటగానిలిచి ధర్మమునే రక్షింపవలయు.
లేక యేరాజును నందఱును 'నితఁడు నావాఁడు' అని భావిం
తురో యట్టిరాజు పర్వతమువలెఁ జలింపకుండును. వాది ప్రతివాదు
లకువ్యవహారమును జక్కఁబెట్టుటకుఁ బూనినపుడు రాజు ప్రియు
లనియు నప్రియులనియు భేదముచేయక యిరుతెగలను సూ
ర్యుఁడు తనకిరణములంబోలె సమముగాఁ జూచుచు ధర్మమునే
నిలఁబెట్టవలయును. రాజు తన కార్యము లన్నింటియందును
నాయా దేశములను వారివారి ప్రకృతులను నాయా కులము
లను దెలిసినవారును, మృదువుగాఁ బలుకువారును, నడివయసు
వారును,దోషము లేనివారును,హితము సేయుటయందే యాసక్తి
గలవారును, అన్నిటియందు బనుపడి యాఱితేఱినవారును,
పేరాస లేనివారును, జదువరులును, అడఁకువ గలవారును, ధర్మ
మునందు నిలుకడగలవారును, సమస్తకార్యములను రక్షించు
నట్టివారు నగుపురుషులను నియమింపవలయును. ఈ ప్రకారమున
రాజు చారులను మున్నిడికొని వారు చెప్పినచొప్పున నాయాకా
ర్యములు జరుగురీతులును వానికిఁ దుదగలుగు ఫలములును దెలిసి
కొని మిక్కిలి జాగరూకతతో వాని ననుష్ఠించి సంతుష్టి నొంద

వలయును. రాజు వ్యర్థకోపమును సంతోషమును బొందక యు తానే యొక్కొక్క కార్యమును జక్కఁజూచుకొనుచును, బొక్కసములు (అనఁగా నాదాయవ్యయములను) తనకన్నారఁ బరికించుచును నుండునో యతనికి భూమి సకలధనములను నిచ్చుచుండును. ఏరాజు తనయధికారులకును బ్రజలకును, వారేదేని మంచి చేసినచోఁ బ్రకటముగా వారిని సమ్మానించునో, దండింపఁదగిన వారిని శాస్త్రోక్త ప్రకారమున దండించునో, తన్నుఁదాను రక్షించుకొనుచును రాజ్యములను గీళ్లనుండి గాచుచుండునో, యతఁడే రాజధర్మములను దెలిసినవాఁడగును. సూర్యుఁడు తనకిరణములను గ్రిందనున్న యన్నింటియందును బ్రసరింపఁ జేయునట్లు రాజు తనరాజ్యమును దానే యెప్పుడును జూచుకొనుచు బుద్ధిచేతఁ దన చారులను ననుచరులను బరామర్శించు చుండవలయును, రాజు కాలమెఱిఁగి ప్రజలవలనఁ బన్ను పుచ్చుకొనవలయును. తాను జేయునదొక్కటి సూచింపరాదు. బుద్ధిమంతుఁ డగువాఁడావును నొక్కపెట్టునఁగాక నాఁడునాఁటికిఁ బిదుకుకొనునట్లు రాజును భూమిని నాఁడునాఁటికిఁ బిదుకుకొనవలయును. తుమ్మెద పువ్వుల నుండి తేనియను గూర్చుకొను క్రమముననే రాజును, ధనమును కొంచెముకొంచెముగాఁ దీసికొనుచు గూర్చి పెట్టవలయును. కొంతధనమును బదిలముగా నెత్తిపెట్టి మిగిలినదానిని రాజు ధర్మములుచేయుటకును గామము లనుభవించుటకును వెచ్చింప వలయును. శాస్త్రవిధులను దెలిసిన బుద్ధిమంతుఁ డగు రాజు కూర్చిపెట్టిన మొదలు ధనమునుండి వెచ్చము సేయరాదు. ధనమును దేనినిగాని కొంచె మని నిరాకరింపరాదు. పగవాఁడు దుర్బలుఁడని యవమానింపరాదు. అతఁడు తనబుద్ధిచేతఁ దన్నుఁ

బరిశీలించుకొను చుండవలయును. బుద్ధిలేని వారియందు నమ్మక మuంపరాదు. నిలుకడయు, సమర్థతయు, తన్నుఁ దానడంచుకొనుటయు, బుద్ధియు, ఆరోగ్యమును, వికార పడకుండుటయు, శూరత్వమును, దేశకాలములందుఁ గనుగలిగియుండుటయు ననెడి యీయెనిమిదియు ధనము స్వల్పమయినను నధికమయినను పెచ్చుపెరుఁగునట్లు చేయును. రవ్వంతయగ్ని, నేయిపోసినచో పెద్దమంటగా మండును. ఒక చిన్నవిత్తు వేలకొలఁది వృక్షము లగును. రాజు తనయాదాయమును వెచ్చమును మిక్కిలి విపులములని విన్నను వానినిబట్టి యల్పములగు ధనములను నలక్ష్యము సేయరాదు. శత్రువు, బాలుఁడయినను, వయసుకాఁడయినను, ముదుకఁడయినను, బరాకుపడియున్న వానిని జంపనేర్చును. కొఱమాలిన శత్రువయినను గాలమును దోడ్పాటుచేసికొని రాజును వేరుతోఁగూడఁ బెకల్పనేర్చును. కాఁబట్టి కాలమును గనుఁగొనురాజే రాజులందు మిక్కిలియు శ్రేష్ఠుఁడు. శత్రువు బలవంతుఁడయినను, దుర్బలుఁడయినను, దుష్టుఁడగునేని యొకరాజుకీర్తిని శీఘ్రముగా నాశనముసేయఁగూడును; అతనిధర్మమును నడ్డగింపఁగూడును; అతని ధనమునకు విఘ్నము సేయఁగూడును; అతనిబలిమిని నాశము సేయఁగూడును. కాఁబట్టి రాజు తనకు శత్రువుగలఁడేని మనసు కుదురుగానుంచుకొని వానివలనఁ బరాకు పడకుండవలయును. బుద్ధిమంతుఁడగు రాజు సంపదనుగాని జయమునుగాని కోరినచో, యతఁడు తన వ్యయమును వచ్చుబడిని గూడఁబెట్టిన ధనమును బరిపాలనమును జూచుకొని శత్రువుతో సంధిగాని యుద్ధముగాని చేయవలయును. ఈ కారణమునుబట్టి రాజు బుద్ధిమంతుఁడగు మంత్రి

తోడు నాశ్రయింపవలయును. చక్కఁగాఁ బ్రకాశించుచున్న బుద్ధి యెట్టి బలవంతుఁడగు శత్రువునైనను జంపును. బుద్ధిచేతఁ బెరుఁగుచున్న బలమును బాలింపవచ్చును. వర్ధిలుచున్న శత్రువును బుద్ధితోడ్పాటుచేత దుర్బలునిఁ గావింపవచ్చును. కాఁబట్టి యొక్కొక కార్యమును బుద్ధిని మున్నిడికొని గావించినచో మిక్కిలి కొనియాడఁదగినదగును. రాజు ధీరుఁడును దోషహీనుఁడునగునేని, యతఁడు గోరినచో, మిక్కిలి యల్పమయిన సేనచేతనే తనకామములన్నియు నొడఁగూర్చుకొనవచ్చును. అయిన నతఁడు స్వార్థపరు లయినయిచ్చకపువాండ్రను జుట్టును జేర్చుకొని యుండునేని యల్పమయిన శ్రేయమునుగూడఁ బూరించుకొనఁ జాలఁడు. ఈ కారణములనుబట్టి రాజు ప్రజలనుండి మిక్కిలి మెలపువఁ బన్నుఁ బుచ్చుకొనుచుండవలయును. అతఁడు దీర్ఘకాలము ప్రజలను బీడించుచుండెనేని, * క్షణముసేపు మెఱసి మాయమగు మెఱపుఁదీఁగవలెనే యతనిసంపద సమూలముగా నశించును. విద్యను, తపమును, విపులమయిన ధనమునంతయుఁ బూనికచేతఁ బడయు శక్యమగును. అది దేహధారులయందు బుద్ధిననుసరించి యుండును. కాఁబట్టి పూనిక గొప్పదియని తెలిసికొనవలయును. ఈదేహమందు బుద్ధిగలవారును గొప్పమనస్సు గల

---

* ఇట 'రాజు ప్రాణులయందు నెయ్యముగలవాఁడై సమస్తప్రజలవలనను సంపదకు మూలమయినధనమును బుచ్చుకొనవలయును. చాలఁగాలము బీడింపఁబడుచున్నను శక్తికిఁదగునట్లు ధనమునుగడించు ప్రయత్నముతోఁ గూడియుండవలయును' అని దాక్షిణాత్యపాఠము. 'తస్మాద్రాజా ప్రగృహీతః ప్రజాసు । మూలం లక్ష్మ్యాః సర్వశో హ్యాదదీత । దీర్ఘంకాలంవ్యాపి సంపీడ్యమానో । వ్యహ్యాత్సంపద్వ్యవసాయేన శక్త్యా' అని దాక్షిణాత్యమూలము.

వారును నగు నింద్రుఁడు, విష్ణువు, సరస్వతియు, భూతములు నెప్పుడును వాసముచేయుచున్నవి. కాఁబట్టి తెలివిగలవాఁడు (ప్రాణికనూలి) దేహము నవమానింపరాదు. పేరాసగలవానిని నెడతెగక దానములిచ్చి లోపఱుచుకొనవలయును. పేరాసగల వాఁడు పరుని ధనమును బొందినను దనివి నొందఁడు. పుణ్యఫల మయిన భోగమందు నెల్లవారికి నాసయుండును. ఎవనికి ధన ము లేదో వాఁడు (ధనమువలనఁ బడయఁదగిన) ధర్మమును గామ మును బడయఁజాలఁడు. పేరాసగలవాఁడు, ఐశ్వర్యమును బడసి యుండినను బరులధనమును భోగమును బుత్రులను భార్యలను నన్నిటిని గోరును. ఆశగలవానియం దన్నిదోషములునుండును. కాఁబట్టి రాజు పేరాసగలవానిని జేర్చుకొనరాదు. తక్కువ వానినిగూడఁ దాను దనంతటఁ బరిశీలించి పనియందు నేర్పఱుప వలయును. ప్రాజ్ఞుఁ డగువాఁడు పగవాని ప్రాణికలను, సమస్తము లయిన ప్రయోజనములను నాశము సేయవలయును. పాండు కుమారా! కులీనుండును నాప్తుండు నగునేగాఁ ధర్మయుక్తు లును జ్ఞానవంతులు నగు బ్రాహ్మణులవలన నుపదేశమునొందఁ గోరునో, మఱి మంత్రులచేత రక్షితుండగునో యట్టిరాజు, తన రాష్ట్రమందలి ముఖ్యులనెల్లఁ దనపక్షమున నిలఁబెట్టుటకుఁ జాలి నవాఁడగును. రాజా! నీకు శాస్త్రప్రోక్తములయిన ధర్మముల నెల్ల సంగ్రహముగాఁ జెప్పితిని. వానిని బుద్ధిచేతఁ దెలిసి కొనుము. ఏరాజు ధర్మముల ననుసరించి కార్యములను గావిం చునో, యతఁడు భూమిని బరిపాలింప శక్తుఁడగును. ఏరాజు నీతిపద్ధతివలనఁ గలుగు సుఖమును బాటింపక యలవ్రాకగాఁ గలుగుసుఖమును వెదకుచున్నాఁడో యతఁడు రాజ్యమువలని

యు త్తమసుఖమును బడయకుండుటయే కాక పరలోకసుఖమును బడయఁజాలఁడు. ధనవంతులును, మతిచేతను శీలముచేతను బూజితులును, గుణసంపన్నులును, యుద్ధమందుఁ బరాక్రమము జూపినవారును, సంధివిగ్రహాదులయిన యాఱుగుణములందు నెచ్చరికగలవారును, బ్రయత్నశీలురునయిన శత్రువులను బరాకులేకుండునట్టివాఁడు కనుగలిగియుండి శీఘ్రముననే చంపును. * పలువిధములయిన కార్యములందును నుపాయములను జూడవలయును. ఉపాయములేకయె బుద్ధిని జెల్లింపరాదు. దోషములు లేనివారియందును దోషములు చూచునట్టిమనుష్యుఁడు త్తమమయిన సంపదను, వెనుకీర్తిని, ధనమును బడయ నేరఁడు. స్నేహితు లిరువురయందుఁగల ప్రేమమును, నొక్క కార్యమందు వా రెంతెంత చేసినదియుఁ దెలిసి విచారించి వారియం దేమిత్రుఁడు వెనుభారము దాల్పఁదగునో వానినే యుత్తమస్నేహితునిఁగాఁ బ్రాజ్ఞుఁడు చెప్పవలయును. నేనుజెప్పిన యీరాజధర్మముల ననుష్ఠింపుము. మనుష్యులను రక్షించుటయందు మతి నుంపుము. సుఖముగా నాపుణ్యములవలని ఫలమును బడయుదువు. రాజా ! జగమునకంతటికిని ధర్మమే మూలముసుమీ' యనెను. ఇది నూటయిరువదియవయధ్యాయము.

---

* పలువిధములయిన కార్యములను బరికించి యుండుటవలన నుపాయములను దెలిసికొనవలయును. ఉపాయము లేక పట్టుదైవమునందే బుద్ధి నూనరాదు' అని యాశయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు యుధిష్ఠిరునకు దండస్వరూపము మొదలగువానిని జెప్పుట.

ధర్మరాజు 'పితామహా ! సనాతన మయినరాజధర్మము నీ విపుడు చెప్పి ముగించితివి. నీవు చెప్పినదానినిబట్టి దండమె యన్నిటికంటె గొప్పదనియు నన్నింటికి నీశ్వరుఁడనియుఁ దోఁచుచున్నది. ఏలన దండమందే సర్వము నెలకొనియున్నది. ప్రభూ! దేవతలు, ఋషులు, మహాత్ములయిన పితరులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, విశేషించి మనుష్యులు, మఱియు లోకమందుఁ బక్షులు మొదలుగాఁ దక్కువ యోనులందుఁ గలసకల ప్రాణులనీనెడివాని కన్నిటికిని, మఱియుఁ దక్కినవాని కన్నిటికిని మహాతేజం బగు దండమే యెక్కుడయని నీవు చెప్పితివి. చరాచరములతోడను సురాసురమనుష్యులతోడను గూడిన లోకమంతయు దండమునకు లోనై యుండుట చూచువారికెల్లఁ దెలియుచున్నది. భరతసింహమా ! కాఁబట్టి నేను దీనినిగలరూపునఁ దెలియఁగోరుచున్నాను. దండమనఁగా నెద్ది ? దాని రూపమేమి? దాని ముఖ్యగతియేమి ? దేనితోఁ జేయఁబడినది? ఎక్కడనుండి పుట్టినది ? దాని లక్షణము లెవ్వి ? అదియెట్లు ప్రభువగును ? ప్రజలయందు విహితరూపమై యది యెట్లు మేలుకొని (పాలించుచు) నున్నది ? ఏది మునుపును వెనుకను (అనఁగా నెప్పుడును) లోకమును బాలించుచు మేలుకొనియున్నది. ఏది యన్నిటికి మునుపటిదిగాఁ దెలియుచున్నది. దండ మనఁబడు మేటి యెవరు ? దండము దేనియందుఁ దూఁదియున్నది. దానిగతియేమి?' అని యడిగెను.

భీష్ముఁడు 'కురునందనా ! దండ మనఁగా నేమియో యది వ్యవహారమనియు నెట్లు చెప్పఁబడునో చెప్పెదను; వినుము. ఈలోకమందన్నియు దేనికి లోనై యున్నదో యదియే దండమనఁబడును. మహారాజా ! ధర్మమును జక్కఁగా నిలఁబెట్టునదే దండము. అది వ్యవహారమనియుఁ గొన్నియెడలఁ జెప్పఁబడును. లోకములందు నజాగ్రత్త లేకుండ బుద్ధిగలవారు, ధర్మమునకు లోపము రాకుండునట్లు చేయుపద్ధతి యేదియో యదియే * 'వ్యవహారము' అనుపదమునకు ముఖ్యమయిన యర్థముగా గ్రహింపఁబడుచున్నది. రాజా ! మనువు మొట్టమొద టీతత్త్వమును జెప్పెను. అది యేమనఁగా—'ఎవఁడు ప్రియులందు నప్రియులందును సమమయిన బుద్ధిగలిగి పక్షపాతము లేక దండమును జక్కఁగా జరుపుచుఁ బ్రజలను జక్కఁగా రక్షించునో యతఁడు కేవలధర్మమే కాని వేఱుగాదు'—అనియే. నేను జెప్పినట్లి యీ వచనమును మనువు పూర్వమే చెప్పియున్నాఁడు. ఇది వసిష్ఠుఁడు చెప్పిన బ్రహ్మదేవుని మహావచనము నగును. మునుపు యిట్టివచనము చెప్పఁబడియుండుటవలన దీనిని 'ప్రాగ్వచనము' (మొట్టమొదటి మాట) యని తెలియుదురు. మఱియు దండమువలననే పరులధనమును నపహరించుట లేకుండఁ జేయుటచే నాదండము వ్యవహార మనుపేరను బిలువఁబడున దయ్యెను. ధర్మార్థకామములను త్రివర్గమును, ఆదండమును జక్కఁగా జరుపుటవలననే యెపుడును బ్రవర్తించుచుండును. దండమును జక్కఁగాఁ జెల్లింపనిచో నామూఁడును గొనసాగవు. దండము పరమదైవము.

* 'వ్యవహారః' 'వి+అవహారః-అపహారః' = దుర్మార్గమున నితరులధనము నపహరించుట, వి=లేదని వ్యుత్పత్తి.

అది రూపమున జ్వలించుచున్న యగ్నివలెఁ జూపట్టును. అది నల్లగలువ రేకులవలె నల్లగానుండును. దానికి *నాలుగు కోఱలును † నాలుగు భుజములు ‡ నెనిమిదిపాదములును బెక్కు§ కన్నులును

---

* మానభంగము, ధనాపహరణము, శరీరదండము, వధము అను నాలుగు ప్రాణిహింసాసాధనములే నాలుగు కోఱలు.

† బాహువులనఁగా ధనమును దీసికొను సాధనములు—1. ప్రజలవలనను సామంతరాజులవలనను పన్నుదీయుట. 2. అబద్ధమాడినవానికి వాఁడు చెప్పిన ధనమునకు రెండింతలపరాధము విధించుట. 3. అసత్యమాడు ప్రతివాదికి సమమయిన ధనమును దండుగ విధించుట. 4. ధనవంతుఁడును లోభియునగు బ్రాహ్మణునియొద్దనుండి ధనమునంతయు నాక్రమించుట యనెడి నాలుగు.

‡ ఇట పాదములనఁగా సంచరించుటకు సాధనములయినవి— అవి 1. ఆవేదనము (సంతకము చేసి వాదాడుట) 2. భాష (ప్రతివాదినిబిలిచి వానిముంగలనట్లై వ్రాయించుట) 3. సంప్రతిపత్తి (వాదవ్యవహారమును బ్రతివాది యొప్పుకొన్నయెడల నొక్కరికిని దండుగ విధింపక సమాధానము చేయుట.) 4. మిథ్యోత్తరము (వాదియభియోగము మిథ్యయని చెప్పుట.) 5. కారణోత్తరము (వాది చెప్పినట్లు జరిగినది వాస్తవమే కాని యాదిమరల నిచ్చియున్నవని ప్రతివాది చెప్పుట) 6. ప్రాఙ్న్యాయము (ఈవిషయమునే యింకొకప్పుడు వీఁడు నన్నడిగి యపజయమునొందినవాఁడని ప్రతివాది చెప్పుట) 7. ప్రతిభువు (ఈ మూఁడుత్తరములకును వాదిప్రతివాదులు చేసి యుంచవలసిన పూఁటచీటి) 8. క్రియ (వారివారిపక్షములకుఁగలయు సాక్షి, పత్రము, అనుభోగము, ప్రమాణము మొదలగువానిని జూపుట) 9. ఫలసిద్ధి (దానినుండి తప్పకుండువానికి జయము) వీనియందు సంప్రతిపత్తి యనుమూఁడవవానియందు దండము విధించుటకుఁ గారణములేనందునఁ దక్కిన యెనిమిదియు దండమునకుఁ బాదములని చెప్పఁబడుచున్నవి

§ 'రాజు, అమాత్యుఁడు, పురోహితుఁడు, పరిషత్తు' అనెడి నాలుగు దండమునకుఁ గన్నులగును.

గలిగియుండును. దాని చెవులు శంకువులవలె నుండును. దాని వెండ్రుకలు నిట్టనిలిచియుండును. అది * జటలుగలిగి రెండునాలు కలతోఁ గూడియుండును. దాని మొగము రాగివలె నెఱ్ఱనై యుండును. అది సింహపుఁజర్మమును దొడిగియుండును. దండ మిట్లు గ్రరూపమును దాల్చి యెప్పుడును దారసింప రాకుండును. అది మరల కత్తి, విల్లు, గద, శక్తి, త్రిశూలము, ముద్గరము, బాణము, ముసలము, పరశువు, చక్రము, ప్రాసము, దండము, ఋష్టి, తోమరము, మఱియుఁ గలయాయా యాయుధము లన్నింటిమూర్తులను దాల్చి యాయన్నియుఁ దానై లోకమున సంచరించుచుండును. దండము భేదించుచును, ఛేదించుచును, నొప్పించుచును, ద్రుంచుచును, చీల్చుచును, బద్దలువాపుచును, కొట్టుచును, పయిఁబడుచును నిట్లు చరించుచుండును. యుధిష్ఠిరా! దండమున కివి పేళ్లు. అసి, విశసనము, ధర్మము, తీక్ష్ణవర్మము దురాసదము, శ్రీగర్భము, విజయము, శాస్త, వ్యవహారము, ప్రజాగరము, శాస్త్రము, బ్రాహ్మణమంత్రము, ప్రవచనము, పరము, ధర్మపాలము, అక్షరము, కోపము, సత్యకము, నిత్యకము, గృహము, అసంగము, రుద్రతనయము, మనువు, జ్యేష్ఠము, శివంకరము, అనునవి. ఇవి దండమునకుఁ జెప్పఁబడుచున్నవి. దండము వ్యాపకుఁడును, యజ్ఞరూపియు, మాటిమాటికిఁ బెనురూపముదాల్చువాఁడును, మహాపురుషుండునయిన భగవంతుఁడు నారాయణుఁ

---

* పెక్కుసందేహములు గలుగుటచే జటగలది యనఁబడెను. ఒకటికొకటి సంబంధపడకుండు వాది ప్రతివాదుల రెండువిధములయిన వచనముల వలన రెండువిధములయిన నాలుకలుగలదానివలె నున్నదని యాశయము.

డనువానిని ప్రభువుగాఁ జెప్పఁబడుచున్నది. అట్లె లోకమును బరిపాలించు దండనీతి బ్రహ్మదేవుని పుత్త్రియనియు, లక్ష్మియనియు, నీతియనియు, సరస్వతియనియు జెప్పఁబడుచున్నది. దండము పెక్కుశరీరములు గలది. కురుకులతిలకా! అర్థము అనర్థము, సుఖము దుఃఖము, ధర్మము అధర్మము, బలము అబలము, దౌర్భాగ్యము భాగధేయము, పుణ్యము పాపము, గుణము దోషము, కామము అకామము, క్షణము పగలు, రాత్రి, మాసము ఋతువు, ప్రమాదము అప్రమాదము, సంతోషము, శోకము, శమము, దమము, దైవము పురుషకారము, మోక్షము, బంధము, భయము, అభయము, హింస అహింస, తపము, యజ్ఞము, సమాధి, విషము అమృతము, ఆది, మధ్యము, అంతము, కృతములగువాని విస్తరము, మదము, ప్రమోదము, దర్పము, డంభము, ధైర్యము, నయము అనయము, అశక్తి శక్తి, మానము, స్తంభము, వ్యయము, ఆయము, వినయము, విసర్గము, కాలము అకాలము, అనృతము, అజ్ఞత్వము, సత్యము, శ్రద్ధ అశ్రద్ధ, క్లీబత్వము, వ్యవసాయము, లాభము అలాభము, జయము అపజయము, తీక్ష్ణత్వము మృదుత్వము, అత్యుగ్రము, ఆగమము అనాగమము, విరోధము అవిరోధము, కార్యము అకార్యము, బలము అబలము అసూయ, అనసూయ, ధర్మము అధర్మము, సిగ్గు సిగ్గులేమి, హ్రీ, సంపత్తి, విపత్తి, తేజస్సు, కర్మములు, పాండిత్యము, వాక్శక్తి, బుద్ధితత్త్వత (వీనిని గలరూపునఁ దెలిసికొనుట) అనియిట్లు దండమునకు పెక్కులురూపు లీలోకమందు వెలయుచున్నవి. ఈలోకమందు దండములేనిచో నొకరినొకరు గొట్టుకొనుచుందురు.

ధర్మరాజా! దండమువలని భయముననే యొకరినొకరు కొట్టు కొనకున్నారు. రాజా! ఈలోకమందుఁ బ్రజలు ప్రతిదినమును దండముచేత రక్షితులై యేచుమీ రాజును వర్ధిల్లఁజేసెదరు. కాఁబట్టి దండమే ముఖ్యగతి. రాజా! దండ మీలోకము నెప్పుడును ధర్మమార్గమున నెలకొలుపుచున్నది. సత్యమునం దూనిన దైనధర్మము బ్రాహ్మణులయం దున్నది. ద్విజశ్రేష్ఠులు ధర్మయుక్తులై * దేవతలతోఁ బాటిగాఁ జేర్చి లెక్కింపఁదగినవారగుదురు. దేవతలవలననుండి యాగముగలిగినది. యాగము దేవతలను సంతోషపెట్టుచున్నది. దేవతలును సంతుష్టులై లోకులను నింద్రునకు నొప్పగింతురు. ఇంద్రుఁడు నీ ప్రజల ననుగ్రహించు (ధాన్యాదులను బండించు వర్షమురూపమున) నన్నము నిచ్చుచున్నాఁడు. సమస్తభూతములప్రాణములును, అన్నమందే యెప్పుడు నెలకొనియున్నవి. దానివలనఁ బ్రజలు గుదురుకొనుచున్నారు. దండము (క్షత్రియరాజరూపమున) నా ప్రజయందు మేలుకొనియున్నది. ఇట్టి ప్రయోజనముగల దండము క్షత్రియరూపమునొంది ప్రజలను రక్షించుచు, నెప్పుడును మిక్కిలి యెచ్చరికగలదై నాశము లేనిదై మేలుకొనియున్నది. అది యీశ్వరుఁడు, పురుషుఁడు, ప్రాణము, సత్త్వము, వృత్తము, ప్రజాపతి, భూతాత్ముఁడు, జీవుఁడు ననెడి యీయెనిమిది నామములచేఁ జెప్పఁబడుచున్నది. ఈశ్వరుఁడు (సేనారూపమగు) బలముతోఁగూడిన వాఁడును, (ధర్మము, వ్యవహారము, దండము, ఈశ్వరుఁడు, జీవుడనెడి) యైదింటిచేత నయినవాఁడు నగు రాజునకు నైశ్వర్యమును దండమును రెంటిని నొసంగెను. యుధిష్ఠిరా! అతనికిఁ

---

* 'దేవయుక్తాః' అని పాఠము. 'వేదయుక్తాః' అని కొ. మూలము తెలియునది.

గులమును, మిక్కిలి ధనవంతులగు నమాత్యులును, ప్రజ్ఞయు, (శరీరము, బుద్ధి యింద్రియములనెడి వీని) బలములును, పూర్వోక్తములయిన యెనిమిది వస్తువులచేఁ గలిగింపఁబడు బలమును, మఱియు (కోశాదులవలనఁ గలుగు) నితరబలమును నావశ్యకములుగాఁ జెప్పఁబడియున్నవి. ఆబలము-గజములు, అశ్వములు, రథములు, పదాతులు, ఓడలు, బరువుమోయువారు, దేశమందలివారు, (అడవియందుఁగల) గొల్లలు ననెడి యెనిమిది యంగములు గలదిగాఁ జెప్పఁబడుచున్నది. మఱియు సన్నాహముతోఁ గూడిన సేనకు, రథికులును, నేనుఁగు రౌతులును, గుఱ్ఱపు రౌతులును, గాలుబంట్లును,మంత్రులును,వైద్యులును నంగములగును. భిక్షుకులును, ప్రాడ్వివాకులును (ముఖ్య న్యాయాధికారులును) జ్యోతిషికులును, శాంతికమారక కర్మములను జేయువారును, బొక్కసమును మిత్రులును ధాన్యమును మఱియుఁ దక్కిన సకలమైన యుపకరణములును రాజ్యమునకు దేహమగును. ఆదేహమునకు, అమాత్యుఁడు మొదలయిన యేడు ప్రకృతులును పూర్వోక్తములయిన యెనిమిదంగములు నుండును. దండమును రాజ్యమునకు బలీయమయిన యంగమగును. (సేనారూపమయిన) దండము రాజ్యమునకుఁ బుట్టుచోటు. అదికారణముగా నీశ్వరుఁడను గ్రహించి యెప్పుడును లోకమును రక్షించునట్టి దండమును రాజునకొసంగెను. సనాతన మయినయీ ప్రపంచమంతయు దండస్వరూపమే. రాజునకు దండమునకంటె మిక్కిలి పూజ్యమయినది లేదు. దండమువలననే ధర్మము రీతులు ప్రదర్శింపఁబడుచున్నవి. లోకమును రక్షించుకొఱకును వారివారి ధర్మములను నెలకొలుపుటకొఱకును బ్రహ్మదేవుఁడే దండము నేర్పఱి

చెను. బ్రహ్మావలననుండి పుట్టినవ్యవహారము మఱియొకటి గలదు. అందులకు వాది ప్రతివాదు లిరువురు కారణము. ఆవ్యవహారమునకు నాయిరువురలో నొకనియందు నమ్మిక యుంచి (తీర్పు చేయుట) లక్షణముగా నుండుటంబట్టి యది హింసముతోఁ గూడినదై చూపట్టుచున్నది. మఱియొక విధమయిన వ్యవహారమును గలదు. అది వేదాత్మకమయినది. దానికి వేదము కారణమనియుఁ జెప్పఁబడుచున్నది. వ్యవహారము మూఁడవదియు మఱొకటి గలదు. అది కులాచారమును సంబంధించినది. మఱియు నది శాస్త్రముల ననుసరించినది. * వాదిప్రతివాదు లిరువురయం

---

* వ్యవహారమనఁగా నిప్పటి చట్టమని చెప్పవచ్చును. ఇచట మూఁడు విధములయిన వ్యవహారములు చెప్పఁబడినవి. మొదటిది సాధారణమయిన వ్యవహారము—అనఁగా చట్టము. దీనినిబట్టి వాదిప్రతివాదుల తగవులు తీర్పఁబడును. ఇందు సివిల్ క్రిమినల్ చట్టములు రెండు నడంగియున్నవి. దీనిని భర్తృప్రత్యయ లక్షణమని చెప్పఁబడును. ఇరుదెగలయం దొకరియందని నమ్మిక లక్షణము గాఁగలదియని యర్థము ఒక వ్యాజ్యెము వచ్చినపుడు రాజుగాని మఱే న్యాయాధికారిగాని సాక్ష్యమును విచారించి యిరుదెగ వారిలో నొకరియందు నమ్మకముంచి తీర్పుచెప్పును. దీనివలన పిడుపలయో దండనమో కలుగును. ఈరెండుపక్షములకు నది దండరూపమే యగును రెండవ విధమగు వ్యవహారము వేదమునందలి విధియగును. శ్రుతిస్మృతులందు మనుష్యుని యాచారధర్మ మొక్కొక్కటిని గుఱించి విధింపఁబడియుండు విధానములే యివి యగును. మూఁడవదియగు వ్యవహారము కులములను లేక కుటుంబములను సంబంధించినది. ఇది కులాచారమనియుఁ జెప్పఁబడును. కులాచారము స్థాపితమైయున్న చట్టమునకు విరుద్ధముగాని, వేదవిధికిఁ బ్రతికూలముగాని, కాకున్నచో నదియు నంగీకారపాత్రమగును. భీష్ముఁడిచటఁ గులాచారము శ్రుతిస్మృతులకును బ్రతికూలమయినదిగాఁ దలఁపరాదని యభిప్రాయపడుట తెలియునది.(ప్రతాప చంద్రరాయులు)

దోకనియెడ నమ్మికయుంచి తీర్పుచేయుట లక్షణముగాఁ గలదని పూర్వము చెప్పఁబడినట్టి వ్యవహారము, రాజునందు నెలకొని యుండునదిగా మన మెఱుఁగవలయు. దానిని దండమనియుఁ బ్రత్యయమనియు (సాక్ష్యమందలి నమ్మకమనియు) రెండు పేళ్ల మనము తెలియవలయును. దండము ప్రత్యయము చేత నిర్వర్తింపఁబడుట చూపట్టుచున్నను దాని స్వరూపము వ్యవహారమనియె చెప్పఁబడుచున్నది. వ్యవహారమని చెప్పఁబడునది వేదవిషయాత్మకముగా నుండును. (అనఁగా వేద విధుల రూపముగా నుండును.) వ్యవహార మేది వేదము నుండి పుట్టినస్వరూపము గలదియో యది ధర్మమగును. అది ధర్మమునందు శ్రద్ధగలవారికి గుణమును (హితమును) గలిగించునది. కృతాత్ముఁ డగువాఁ డావ్యవహారమును * ధర్మమునుంబోలె వ్యవహరించి యున్నాఁడు. మూఁడవదియగు వ్యవహారము సయితము ప్రజలను రక్షించునది. అందులకును మూలము వేదమే. అది మూఁడులోకముల నుద్ధరించుచున్నది. అది సత్యస్వరూప మయినది; ఐశ్వర్యమును బెంచునది. దండ మను నదియే సనాతనమయిన వ్యవహారమని మనము చూచితిమి. వ్యవహారమని చెప్పఁబడునదియే వేదము. వేదమనునదియే ధర్మము. ధర్మమనునదియే సత్పథము. ఈకడపటిదియే తొల్లి పితామహుండును బ్రజాపతియు నగు భగవంతుఁడు బ్రహ్మదేవుఁడుగా నుండెను. బ్రహ్మ సురాసురులతోడను మనుష్యులతోడను

* మనువు మొదలయినవారు ధర్మమునకుఁగూడ రాజులు జరుపునట్టి వ్యవహారము (చట్టము) వలెనే లోపడఁదగునని చెప్పియున్నారని యిచట భావము.

నురగులతోడను మఱియుఁ దక్కినవారితోడను గూడిన సకల లోకములకును గర్తసుమీ. కాఁబట్టి యతనివలననుండి భర్తృ ప్రత్యయలక్షణమగు (వాది ప్రతివాదులం దొకరివలన నమ్మిక చే దీర్పు చెప్పుట లక్షణముగాఁ గలదగు) వ్యవహారము మనకు నుప్ప తిల్లినది. కాఁబట్టి యతఁడు వ్యవహారము నుద్దేశించి 'తనధర్మము చొప్పునఁ బాలించునట్టి రాజునకుఁ, దల్లిగాని తండ్రిగాని, తోఁబుట్టువుగాని, భార్యగాని, పురోహితుఁడుగాని, దండింపఁ దగని వారొక్కరును లేరు' అని కీనిని జెప్పెను' అనెను. ఇది నూటయిరువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు ధర్మరాజునకు వసుహోమ మాంధాతల సంవాదమును జెప్పి దండోత్పత్తి మొదలగు వానిని దెలుపుట.)

భీష్ముఁడు 'ఈవిషయమందుఁ బురాతనమగు నీయితిహాసము నుదాహరించెదరు. అంగదేశమందు వసుహోముఁ డని ప్రసిద్ధుండయిన యొకరాజుండెను. అతఁడు మిక్కిలి కాంతిమంతుఁడు. అతఁ డెప్పుడును ధర్మకార్యములు చేయుచుండువాఁడు. అతఁ డెప్పుడును సత్యము పలుకుచుండును. అతఁడు పత్నిం గూడి దేవర్షు లెప్పుడును సేవించుచుండు ముంజపృష్ఠమునకుఁ బోయెను. అచ్చట నతఁడా హిమవంతపు శిఖరమునందు వసతి గావించుకొనెను. రాముఁడు ముంజ మని యచటఁగల వృక్షము క్రింద జటలు దీయుటకు నాజ్ఞయిచ్చెను. అది మొదలుగా నా ప్రదేశమును సంశితవ్రతులయిన ఋషులు ముంజపృష్ఠమని పేరి

డిరి. అందు రుద్రుఁ డుండును. శ్రుతి ప్రోక్తములయిన గుణములు పెక్కులుగల యారాజపు డాముంజపృష్ఠమున బ్రాహ్మణులయను మతిఁబడసి దేవర్షికి సాటిగా నుండెను. ఒకప్పు డచ్చటికి నుదార చిత్తుఁడును నింద్రునకు సఖుఁడు నగు మాంధాతయనురాజు వచ్చెను. అతఁడు వసుహోముని యొద్దకుఁబోయి యామహాతపస్విని జూచి వినయమున నిలుచుండెను. వసుహోముండును మాంధాతకు నర్ఘ్యమును మధుపర్కమునకుఁగాను బశువును నొసంగి యతనిరాజ్యము సప్తాంగములు కుశలమా, కుశలముగావా, యని యడిగెను. పిదప వసుహోముఁడు సజ్జనులు తొంటినుండి యాచరించు విధులను గలరూపున ననుసరించువాఁ డగుమాంధాతనుజూచి 'రాజా! నీకు నేనేమి చేయవలయును?' అని యడిగెను. మాంధాత యందులకు బరమప్రీతుండయి కూర్చుండి యున్న మహాప్రాజ్ఞుని వసుహోమునిఁ జూచి 'రాజా ! నీవు బృహస్పతిమతము నంతయుఁ జదివియున్నావు రాజోత్తమా ! అట్లె శుక్రుఁడు రచించినశాస్త్రమును నీకుఁ జక్కఁగాఁ దెలిసియున్నది. కాఁబట్టి దండమెట్లు పుట్టినదో వినఁగోరుచున్నాను. దండమునకు మును పేది మేలుకొనియుండును? దానికిఁ దుది యేమందురు ? దండమెట్లు క్షత్రియుల నిపు డాశ్రయించినదయ్యె? నీవు దీనిని నాకుఁగలరూపునఁ జెప్పవలయును; నీకు గురుదక్షిణ యొసఁగెదను' అనెను.

వసుహోముఁడు 'రాజా ! లోకము నుద్ధరించునట్టి దండమెట్లు పుట్టినదో వినుము. అది ధర్మమున కాత్మయైనది; సనాతనమైనది. అది ప్రజలను బాలించుటకును రక్షించుటకునై యేర్పడినది. సర్వలోకపితామహుం డగు భగవంతుఁడు బ్రహ్మదేవుఁడు

యాగముచేయఁగోరి తనకు సరియైనఋత్విజునిఁ గానఁడయ్యెనని మాకు వినికి.ఆదేవుఁడు పెక్కువర్షములు మనసునందు గర్భము దాల్చియుండెను.పిదప నాగర్భము వేయేండ్లు నిండఁగా నేయతఁడు తుమ్మునపుడు క్రిందఁబడెను. అది యరిందముఁ డగు క్షువుఁడను ప్రజాపతి యయ్యెను. ఆప్రజాపతి మహాత్ముఁ డయినయా బ్రహ్మదేవుని యాగమందు ఋత్విక్కుగా నుండెను. రాజసత్తమా! బ్రహ్మదేవుని యాసత్రయాగము జరుగుచుండునపుడు, బ్రహ్మ, యాగమందు దీక్షితుఁడై యుండుటవలన నతఁ డపుడు శాంతుఁ డగు యజమానుని రూపమున మెలఁగుచుండుటఁబట్టి (యతని యుగ్రరూపమందు వసతిగలిగియుండిన) దండము (పట్టులేక) మఱుఁగయ్యెను. అది మఱుఁగుపడఁగానే ప్రాణులకు సంకరము (గజిబిజి) గలిగెను. అప్పు డేది చేయఁదగును; మఱేదిచేయరాదు; భుజింపఁదగిన దేది భుజింపరాని దెద్ది; త్రాగఁదగున దేది యేది త్రాగరా దనెడిభేదము లేకపోయెను. సిద్ధి యెక్కడిది? జను లొకరినొకరు హింసించిరి. స్త్రీపురుషులం దెవరి నెవరు పొందవచ్చును బొందరా దను కట్టుపాటు లడుగంటెను. ఒకటి యొకరి సొమ్మనునియతి పోయెను. కుక్కలు మాంసముల నాక్రమించుకొనునట్లు, జను లొకరి ధనముల నొకర పహరింపసాగిరి. బలవంతులు బలహీనులను జంపిరి. లోకమునందు మర్యాద కలుగదయ్యె. అంత బ్రహ్మ సనాతనుం డగు విష్ణునిఁబూజించి యతనితోడ * కేశవా! ఈ సమయమందు

---

*ఇచట నీలకంఠాదిపాఠములందు, కేశవా! యనియున్నది. అయిననతనికి విశేషణములు 'శూలవరాయుధ' అనియున్నది. దాక్షిణాత్య కోశములందు 'శంకర' అని పాఠమును దాని కనుగుణముగా రెండుమూఁడుశ్లోకము లధిక

మాయెడ ననుగ్రహింపఁదగును. ఇపుడు కలిగియున్న సంక
రము మాయునట్లు గావింపుమీ' యని వేఁడెను. అంత మేటి
శూలమును దాల్చిన యాభగవంతుఁడు విష్ణు వాలోచించి తన్నుఁ
దానే దండముగా సృజించెను. ధర్మము పాదములుగాఁ గల
యారూపముననుండి సరస్వతీదేవి దండనీతిని సృజించెను. అది
వేగ త్రిలోకములందును బ్రసిద్ధికెక్కెను. ఈదండము పాప
కారులందుఁ జెల్లింపఁబడుచున్నది. దండమును నయించుకారణ
మునఁబట్టి యది దండనీతి యని యీలోకమునఁ జెప్పఁబడుచు
న్నది. (శూలధరుం డయినయాప్రభుఁడు మఱియుఁ జాలసేపు
చింతించి దండనీతిని బ్రయోగించుకొఱకు సర్వవిధములఁ బ్రమా
ణములును శాశ్వతములు నయిననాలుగువిద్యలను బలువిధము
లయిన వాని యంతర్భేదములను సమస్త శాస్త్రములనును,
గలిగించెను. నాలుగువేదములును, ఆ అంగములును, మీమాం
సయు, విరివియైన న్యాయశాస్త్రమును, పురాణమును ధర్మశాస్త్ర
మనెడి యీపదునాలుగు విద్యలును, ఆయుర్వేదము, ధనుర్వే

ముగాను నున్నదికాన యిదియే 'శూలవరాయుధ' అను విశేషణమునకుఁ బొసఁగినదిగాఁ జూపట్టుచున్నది. అయినను వెనుకప్రతులందును లేమిఁ బట్టియు బ్రసిద్ధవ్యాఖ్యాత యుదాహరింపమిం బట్టియు పైపాఠము గయికొనఁబడెను. దాక్షిణాత్యపాఠమున 'అత్రత్వమనుకంపాం వై కర్తు మర్హసి శంకర । అయం విష్ణుస్సఖా తుభ్యం ధర్మస్య పరిరక్షణే । త్వం హి సర్వవిధానజ్ఞః సత్త్వానాం త్వంగతిః పరా) సంకరో ౽భవదేతచ్చ యథా తద్వై విధీయతామ్ ॥ తతః స భగవాన్ ధ్యాత్వా తదా శూలవరాయుధః । (దేవదేవో మహాదేవః కారణం జగతః పరమ్ । బ్రహ్మవిష్ణ్వింద్రసహితైః సర్వైశ్చ ససురాసురైః । లోకసంధారణార్థంచ లోకసంకరనాశనమ్) ఆత్మనాత్మానం దండం ససృజే దేవసత్తమః' అని యున్నది. కుండలీకరణములోనిది ఔత్తరాహ పాఠములందుఁ గలుగవు.

దము, గాంధర్వమననెడి మూఁడును, నాలుగవదియైన యర్థ శాస్త్రమునుగా విద్యలు పదునెనిమిదియే యగును. ప్రసిద్ధను లగు నీపదునెనిమిది విద్యలును ధర్మమును సంబంధించినసంహిత లగును. మహేశ్వరుఁ డీ పదునెనిమిదివిద్యల యంతర్భాగ ములను జెప్పెను. మున్నాఱు శాస్త్రములును డెబ్బది మహా తంత్రములును, మహాదేవునిచేతఁ జెప్పంబడిన యీవిద్యల యంతర్భేదములే. ప్రసిద్ధమగు పాశుపతతంత్రమును, బ్రసిద్ధమగు పాంచరాత్రమును, యోగశాస్త్రమును, సాంఖ్యమును, లోకా యతనతంత్రమును, బ్రహ్మాసుల యనెడు ప్రసిద్ధతంత్రమును, దేవ తల దయినతర్కవిద్యయు, సుఖదుఃఖములను దెలిసికొను టకుఁ గారణమైనదిగా వన్నెగాంచిన శాస్త్రమును, ఎనిమిది విధ ములయిన తర్కవిద్యలును, విస్తరమయిన న్యాయశాస్త్రమును నతఁడు చెప్పెను. పురాణములంచెలివియు, యాగమును సంబం ధించినవియు నగుసంహితలు పదునెనిమిది యని తెలియవల యును. ఈ లోకములందుఁ గల పురాణములన్నియు సంహిత లన్నియును నతనిచేత రచితములయినవి. ధర్మశాస్త్రములును నల్లె పురాణములును వేదములును నేకార్థములే కాని వేఱు కావు. కాఁబట్టి చేప్పుడు శంకరుండు నానార్థము లయినసమస్త శాస్త్రములను, గాలమును దెలుపునట్టి శాస్త్రములను నఱువది నాలుగుకళలను, సుత్రభాగముతోఁ గూడిన యాయుర్వేద మును,పదునెనిమిది విభాగములుగలదియు స్థిరమయినదియు నగు దండనీతిని, గాంధర్వ శాస్త్రమును, పలువిధము లయిన విస్తర ములుగల యితిహాసమును జెప్పెను. ఇట్లు శబ్దార్థము లడఁగి యున్న యీవిద్యలును మఱల వాని విస్తరములయిన వేయి

విభాగములును శంకరునిచేతఁ జెప్పఁబడినవి. ఋషులచేతను దేవతలచేతను గంధర్వులచేతను నంతర్భేదములు గలదై విస్తరమయిన వేదమొకటియే మాటిమాటికి లోకమున నభ్యసింపఁబడుచున్నది. సంగ్రహమయిన నాలుగువేదములును పెద్దలచేత రచితమయిన ప్రసిద్ధములగు వేదవాదములు ననెడి వీనిపారము నొందినవాఁడే వేదపారంగతుఁ డనఁబడుచున్నాఁడు. రుద్రుఁడును విష్ణువును నింద్రుఁడును బృహస్పతియు శుక్రుఁడును నుత్తమధర్మవిదుండగు స్వాయంభువమనువును, నెప్పుడు సమస్తసురాసుర సహితుండగు బ్రహ్మదేవుండును వేదపారగు లగుదురు. వీరలందఱి యనుగ్రహమువలనను వ్యాసుఁడును వేదపారగుఁడగుచున్నాఁడు. శంతనుని పుత్త్రుం డగు భీష్ముఁడగు నేను విష్ణు శంకర బ్రహ్మల యనుగ్రహమునఁ జేసి వేదపారగుఁ డని చెప్పఁబడుచున్నాను. యాజ్ఞవల్క్యుఁడును సర్వవిధముల వేదపారగుం డగును. ఆదికల్పమందు బ్రహ్మచేతను విష్ణుచేతను శివునిచేతను సృజింపఁబడిన విద్యలును నొక్కొక్క కల్పమందును మహాభాగ్యవంతులును దత్త్వవిదులు నగు ఋషులచేతను ఋషికుమారులచేతను పెక్కండ్రు గూడిన ఋషిసమూహములచేతను మఱల విభజింపఁబడుచున్నది. మరల సాధువులచేత విభజింపఁబడుచున్నవి. ఇప్పుడును విభజించు శక్తిగల విద్వాంసులచేత విభజింపఁ బడుచున్నది. ఈ సంస్కృతి పూర్వజన్మము ననుసరించి పెక్కువిధములుగా నున్నది. శూలవరాయుధుఁ డగు నాభగవంతుఁడు మరల చాలసేపాలోచించి యాయావర్గమునకు నొక్కొక్కని యధిపతినిగాఁ జేసెను. సహస్రాక్షుఁడగు నింద్రుని దేవతలీశునిఁగాఁ జేసికొనిరి. సూర్యుని పుత్త్రుఁ డయిన

యమునిని బితరులకుఁ బతిగావించిరి. దేవతలరాజ్యమందు వరుణుని జలములకుఁ బ్రభువుగావించిరి. కుబేరుని ధనములకును రాక్షసులకును బతిఁగాను, మేరువును బర్వతములకుఁ బతిగాను, సముద్రమును నదులకుఁబతిగాను, మృత్యువును బ్రాణములకుఁ బతిగాను, నగ్నిని దేజస్సులకుఁ బతిగాను గావించిరి. మహాత్ముఁడును దేవతలయందుఁ బెద్దయుసనాతనుండు నగు విశాలాక్షుని రుద్రుల కీశ్వరుఁడుగాను, రక్షకుఁడుగాను బ్రభువుగావించెను. (ఈపదునొకండు రుద్రులును నితనిశరీరము వలననుండి కలిగినవారు. నానారూపధరుం డగు భగవంతుఁడు శివుఁడు వసిష్ఠుని బ్రాహ్మణులకు నీశ్వరునిఁగాను, అగ్నిని పసువులకుఁ బతిగాను, సూర్యునిఁ దేజస్సులకుఁ బతిగాను, జంద్రుని నక్షత్రములకుఁ బతిగాను గావించెను. సూర్యునిఁదిఁగలకుఁ బతిగాను, పంద్రెండు బాహువులుగల కుమారస్వామిని బ్రాణులకు రాజుగాను నాజ్ఞాపించెను. వృద్ధిసంహారములకుఁ గారణమును, సమస్తమునకుఁ బ్రభువునయిన కాలమును (ఆయుధము, శత్రువు, యముఁడు, కర్మమని కాని రోగము, బాధకరమగు నాహారమును దినఁజేయు నాశ, యముఁడు, కర్మము కాని)నాలుగువిభాగములుగల మృత్యువునకును,దుఃఖమునకును, సుఖమునకును బ్రభువుగాఁజేసెను. దేవదేవుఁడును, రాజరాజును, బురుషశ్రేష్ఠుఁడును నగు శూలపాణి శివుఁడు సకల రుద్రులకు నీశ్వరుం డని వేదము చెప్పుచున్నది. పిదప మహాదేవుఁడు శివుఁడు బ్రహ్మదేవుని పుత్త్రుఁడును దనకుఁ బిదపఁ బుట్టినవాఁడును సకల ధర్మములను బరిపాలించువారియందు మేటియు నయిన యాక్షువునిఁ బ్రజలకు నధిపతిగా నొసంగెను. పిదప నాయాగము

ముగియఁగానే మహాదేవుఁడు సమాహితుఁడై ధర్మమునకు రక్షకమయిన దండమును సత్కరించి * విష్ణువున కొసంగెను. విష్ణువు దాని నంగీరసున కిచ్చెను. అమ్మునిసత్తముఁడు దాని నింద్రుఁడు మరీచియను నిరువుర కొసంగెను. మరీచి భృగువున కిచ్చెను. భృగువు ధర్మసహితమయిన దండమును ఋషుల కొసంగెను. ఋషులు లోకపాలకులకును, లోకపాలకులు క్షుపునకును, క్షుపుఁడు సూర్యపుత్రుం డయిన మనువునకును నిచ్చెను. శ్రాద్ధదేవుఁడు (మనువు) సూక్ష్మము లగు ధర్మార్థకామములను బడయుటకై తన పుత్రుల కొసంగెను. దండమునందు నయము నెఱుంగఁగోరువాఁడు నయానయములను వేఱువేఱ తెలిసికొని, దండమును జెల్లింపవలయును. దుష్టులను శిక్షించుటకే దండము. రొక్కమును దండుగలు విధించుట భయమును బయటికిఁ గలిగించు పనికే కాని బొక్కసము నిండించుటకుఁ గాదు. శరీరము నంగహీనముగాఁ జేయుటగాని వధించుటగాని స్వల్పకారణములనుబట్టి విధింపరాదు. శరీరమును దండించుటయు కొండపయినుండి దొరలించుటయు స్వదేశమునుండి వెడలఁగొట్టుటయు గొప్పకారణములనుబట్టి విధింపవలయును. సూర్యపుత్రుఁ డగు మనువు జగమును రక్షించుటకై దీనిని పుత్రులకొసంగెను. ఈదండము వరుసగానొక్కరిచేతను బ్రయుక్తమై ప్రజలను బరిపాలించుచు మెలంగుచున్నది. ఈదండమువలన భగవంతుఁ డింద్రుఁడును నింద్రునినుండి కాంతిధనుఁ డగు నగ్నియు, నగ్నివలననుండి వరుణుఁడును, వరుణునివలన

* ఇందుఁ జాల నసంబద్ధములు పూర్వోత్తర వ్యాఘాతములును గలవు. కాఁబట్టి దీనియందుఁ బ్రక్షిప్తములు చాలఁగలవని తోఁచుచున్నది. వ్యాఖ్యాతలు నేమియుఁ జెప్పకున్నారు. (ప్ర. రా.)

నుండి వినయస్వరూపమయిన ధర్మము వెలయుచున్నది. * లేక దండమువలనఁ దొలుత నింద్రుఁడు మొలఁగుచున్నాఁడు. దానివలనఁ బిదప నగ్ని; పిదప వరుణుఁడును బ్రజాపతియు; ప్రజాపతికిఁ బిదప వినయస్వరూపమయిన ధర్మమును మేలుకొని మెలంగుచున్నది.) ధర్మమునకుఁ బిదప బ్రహ్మపుత్త్రుఁడును. (అనఁగా సనాతనమగు నీతియు) నీతివలన వ్యవసాయమును (బూనికయు) మెలంగుచున్నది. ఆవ్యవసాయమువలననుండి లోకమును రక్షించు తేజస్సు వెలుంగుచున్నది. ఆతేజస్సువలన నుండి యోషధులును,నోషధులనుండి పర్వతములును,బర్వతములనుండి రసమును వెలయుచున్నవి. రసగుణమునుండి నిరృతిదేవియు, నిరృతిదేవినుండి జ్యోతిషులును వెలుంగుచున్నవి. జ్యోతిస్సులనుండి నిలుకడయగు వేదములును, వేదములనుండి ప్రభుండయిన హయగ్రీవుఁడును, హయగ్రీవునినుండి పితామహుండును నవ్యయుండు నగు బ్రహ్మయు వెలుంగుచున్నారు. బ్రహ్మదేవునినుండి మహాదేవుఁడు శివుఁడు విలసిల్లుచున్నాఁడు. శివునినుండి విశ్వదేవతలును విశ్వదేవతలనుండి ఋషులును, ఋషులనుండి భగవంతుఁ డగు సోముండును, సోమునినుండి సనాతనులయిన దేవతలును, దేవతలనుండి బ్రాహ్మణులును లోకమున వెలయుచున్నారని తెలియుము. బ్రాహ్మణులనుండి క్షత్త్రియులు ధర్మంబుచొప్పున లోకములను రక్షించుచున్నారు. క్షత్త్రియులనుండి సనాతనములయిన స్థావరములును జంగమములును బ్రజలును నీలోకమున విలసిల్లుచున్నారు. ఆప్రజలయందు దండము వెలుంగుచున్నది.

---

* ఈ శ్లోకములకు నభిప్రాయ మేమియో తెలియరాకున్నది. నీలకంఠాచార్యులు నేమియుఁ జెప్పలేదు. (ప్రతాపరాయలు).

అన్నింటి నడంచునట్టి దండము పితామహుని పుత్త్రుండగు ప్రభు వగును. 'భారతా! మొదటను నడుమను గడపటను గాలము వెలుంగుచున్నది. సకల లోకములకును నీశుఁడును, బ్రజాపతియు మహాదేవుడును దేవదేవుఁడు నగు శివుఁడెప్పుడును మేలుకొని వెలుంగుచున్నాఁడు అతఁడు, కపర్ది, శంకరుఁడు, రుద్రుఁడు, భవుఁడు, స్థాణుఁ, ఉమాపతి యను పేళ్లను బేర్కొనఁబడుచున్నాఁడు. ఇట్లు దండము, మొదటను నడుమను గడపటను మేలుకొని వెలుంగుచున్నది. ధర్మవిదుండగు రాజు దండము చెప్పిన న్యాయంబుగఁ బ్రవర్తింపవలయును' అనెను.

భీష్ముఁడు—ఇట్లు వసుహోముండు చెప్పిన యీమతము నెవఁడు మనసార విని వినిన యట్లే లెస్స నడచుకొనునో, యా రాజు మంచిలోకములను బొందును. మనుజసింహమా! ధర్మముచే నాక్రమింపఁబడిన లోకమునంతయు నియమించునట్టి దండమును గుఱించిన సమస్తమును నీకు వివరించితిని. రాజా! మాంధాత తొల్లి వసుహోమునివలన విన్నదియు, లోకమునఁ బ్రసిద్ధమైనదియు నగు నీయాఖ్యానమును నీకుఁజెప్పితిని' అనెను. ఇది నూటయిరువది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

(భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మాదుల ప్రయోజనము మొదలయినవానిని జెప్పి ధర్మమును విడిచినవాఁడు చేయవలయు ప్రాయశ్చిత్తవిధిని నరిష్ఠుఁడను రాజునకుఁ గామందకుఁడను ముని యుపదేశించిన దానిని జెప్పుట.)

ధర్మరాజు 'ధర్మార్థకామములను గుఱించిన నిశ్చయమును

వినఁగోరుచున్నాను. లోకయాత్ర పూర్ణముగా నీమూఁటిలో దేనియందు నెలకొనియున్నది? ధర్మార్థ కామములు చేయుటకు మూలము లేమి? ఈమూఁడును గలుగుటకుఁ గారణ మేమి? అవి కొన్ని యెడల నొండొంటిని గలసియుఁ గొన్ని యెడల వేఱు వేఱుగను జూపట్టుచున్న వే! ఇది యెట్లు?' అని యడిగెను.

భీష్ముఁడు'—* లోకమునందు మనుష్యులు మంచిమనస్సులతో ధర్మమును మున్నిడికొని యర్థమును బడయఁగోరునపుడందులకుఁ దగిన కాలమును, దేశమును, గార్యమును జతగూడఁగా ధర్మము నర్థము కామము మూఁడును నొక్కటిగాఁ జేరియుండుట చూపట్టుచున్నది. అర్థమునకు మూలము ధర్మము. అర్థమునకు ఫలము కామమని చెప్పఁబడుచున్నది. ఈమూఁటికిని మూలము సంకల్పము. సంకల్పము విషయములను సంబంధించినది. విషయములన్నియుఁ బరిపూర్ణముగా భోగము సిద్ధించుకొఱకు. కాఁబట్టి యీవిషయములే త్రివర్గమునకు† మూలము. విషయములనుండి బొత్తిగా నివర్తించుటయే మోక్షము. ధర్మము

---

* ఇందులకు దృష్టాంత మెట్లనఁగా, ఒకధార్మికుఁడు తనపత్నిని దగినకాలమునఁ బొందుచున్నాఁడు. ఇట్లు చేయుటచే గర్భాధాన మనువిధి నాచరించి ధర్మమును బడయుటే కాక సుఖరూపమైన కామమును పుత్రరూపమైన ధనమును బడయుచున్నాఁడు. ఇట్లు ధర్మమునను మంచిమనస్సునను నర్థమును బడయఁగోరినపుడు, అందులకుఁ దగినట్లుగా దగినకాలము దగినవిషయమయిన పత్ని తగినయర్థమైన పుత్త్రుఁడు నని పొందుపడఁగా నందు ధర్మార్థకామములు మూఁడును గూడియుండుట తెలియుచున్నదని త్రివర్గములు పరస్పరము కూడియుండుటను గుఱించిన ప్రశ్నకు మొదట నిందుసమాధానము చెప్పఁబడినది.

† ఇది ధర్మార్థ కామముల మూలమేమి యనుటకు నుత్తరము.

శరీరరక్షణమునకును, అర్థము ధర్మమును బడయుటకును, గోరఁబడుచున్నది. కామమనఁగా నింద్రియములఁ దనివినొందించుటయె. కాఁబట్టి ధర్మాదుల మూఁటికిని గామమే (అనఁగా నింద్రియములఁ దనివినొందించుటయె) ఫలముగా నున్నది. ధర్మార్థకామ మోక్షములను మోక్షము మొదలయిన ఫలములకుఁగాను బూనినచో వానిఫలములును బ్రకృష్టము (దూరము) లగుటచే నవియును బ్రకృష్టములుగాఁ జెప్పఁబడుచున్నవి. ఆత్మజ్ఞానమునకై వానిని గోరినపుడు సన్నికృష్టములు (దగ్గఱివి) అనఁబడుచున్నవి. అవి *సన్నికృష్టము లయినవాని నొకఁ డాచరింపవలయును. వానిని మనస్సుచేతఁగూడ దిగవిడువరాదు. ధర్మార్థకామములను దిగవిడువఁ గోరినవాఁ డపస్సుచేత విముక్తినొందినపిదపనే దానిని ద్యజింపవలయును. ఆ మూఁటి కయిన యుద్దేశము మోక్షమే! మనుష్యుఁడు దానిని బడయుఁగాక. ఒకఁడు బుద్ధిని మున్నిడికొని చేసినకార్యము సయితము దాని కుద్దేశించిన ఫలమును బొందినను బొందవచ్చును; పొందక పోయినను బోవచ్చును. ధర్మమే యర్థమున కెప్పటికిని మూలము గాదు. ధర్మముతప్పఁ దక్కినవిగూడ (అనఁగా కొలువు సేద్యము మొదలయినవియు) నర్థమును గలిగింపవచ్చును. అయినను దీనికి విపరీతమయిన యభిప్రాయమునుగలదు. (ఏలనఁగాఁగొందఱర్థము, అదృష్టముజన్మము మొదలయిన కారణములచేతఁగలుగునందురు) కొన్నియెడల నర్థమును బడయఁగా నది యనర్థమును గలిగించు

---

* ఒకఁడు ధర్మము నాత్మశుద్ధికొఱకును ; అర్థము, ఫలాపేక్షా రహితము లగు సత్కార్యములకొఱకును ; కామమును దేహధారణ మాత్రమునకు నాచరింపవలయునని భావము.

చున్నది. అర్థమునకంటె నితరము లయినవియు (అనఁగా వ్రతో పవాసాదులును)ధర్మమునుబడయుట కుపకరించుచున్నవి. ఈవిషయమై, తెలివిలేమిచే నికృష్టమయిన బుద్ధిగలవాఁడు ధర్మార్థములకుఁ బరమమయిన ఫలమును (అనఁగా మోక్షమును) బడయఁజాలఁడు. ధర్మమునకు ఫలమును గోరుట యేమలము. అర్థమునకు దాఁచిపెట్టుట మలము. కామమునకు నింద్రియములందలి యతిమాత్రతుష్టి మలము. ఇట్టిమలములు దొలఁగి మంచి గుణములు నెరసియుండునేని యీమూఁడును జిత్తశుద్ధిని గలిగించి మోక్షమను మహాఫలము నొసంగును. భారతా! ఈవిషయమై యరిష్టుఁ డనురాజునకును గామందుఁడను మునికిని జరిగిన సంవాద మయిన యీపురాతన మగు నితిహాసము నుదాహరించెదరు. కామందుఁ డాసనమునఁ గూర్చుండియుండఁగా నరిష్టుఁ డతనికి నమస్కరించి 'ఋషీ! రాజు కామమోహములు బలవంతపెట్టఁగా నొకపాపముచేసి యందులకుఁబదప ననుతాపపడునేని యతఁ డేకర్మములు చేసినచో నాపాపము నశించును. మఱియు నొకఁడు, జ్ఞానముచేత నధర్మమయిన దానిని ధర్మమను బుద్ధిచేత నాచరించునేని రాజిట్టిపాపము లోకులనడుమ ననుష్ఠానమునకు రాకుండునట్లు లెట్లాఁపనచ్చును?' అని యడిగెను.

అందులకుఁ గామందుఁడు 'ఈలోకమం దెవఁడు ధర్మమును నర్థమును బరిత్యజించి కామమునే యనువర్తించు చుండునో వాఁడు ధర్మార్థములును విడుచుటంబట్టి ప్రజ్ఞ నశించినవాఁడగును. ప్రజ్ఞ నశించుట యనెడిమోహము ధర్మార్థముల నశింపఁజేయును. దానినుండి నాస్తికత్వమును దురాచారమును బుట్టుచున్నవి. మిక్కిలి దుష్టములయిన దురాచారములను రాజెప్పు

డడంపకుండునో యప్పుడు లోక మింట నున్న పామునకు వడంకు నట్లా రాజునకు వడంకుచుండును. ప్రజలును బ్రాహ్మణులును సాధువులు నట్టిరాజుయెడ రక్తి గలిగియుండరు. దానివలన నతఁడు మిక్కిలి డిందుపడినవాఁడై వధ్యుఁడు నగుచున్నాఁడు. మఱి బాధయుఁ బడి యవమానమును బొంది యతఁడు దుఃఖంపు బ్రతుకు బ్రతుకును. అట్లు బాధితుఁడై బ్రతుకుట యనఁగా శుద్ధ మరణమే కాని యది మఱొకటిగాదు. అట్టివాని విషయమునం దాచార్యులు, పాపమును దొలంచునట్టి యీయుపాయము నుప దేశించుచున్నారు. అట్టిమనుష్యుఁడు వేదవిద్యల నధిగమింపవల యును; బ్రాహ్మణులను బూజింపవలయును. ధర్మమందు మిక్కి లియు మన ముంపవలయును. గొప్పకులమందుఁ బెండ్లాడవల యును. క్షమయు గొప్పమనస్సునుగల బ్రాహ్మణులను సేవింపవల యును. అతఁడు స్నానాదులాచరించుచు, పవిత్రమంత్రములు జపించుచుండవలయును. సంతోషముతోఁ గూడిన ముఖము గలిగి నాస్తికుఁడు గాకుండవలయును. దుష్కార్యములు చేయు వారిని వెలుపలఁ దొలఁగఁబెట్టి ధర్మాత్ము లగువారిని లోనికిఁ జొప్పింపవలయును. మధురమయిన మాటలచేతను జేఁతలచేతను వారిని బ్రసన్నులను గావించుకొనవలయును. ఎప్పుడును శత్రు లయినను బరులగుణములనే చెప్పికొనుచు 'నేను నీవాఁడను' అనవలయును. ఇట్టి నడకగలవాఁడు పాపము దూలి శీఘ్రమున బహుమానమును బడయును. మిక్కిలి కడింది పాపముల నయి నను వాఁ డడంచుకొనవచ్చును. ఇందులకు సందేహము లేదు. గురువులు చెప్పినట్టి పరమధర్మ మెద్దియో దాని నట్లే చేయుము.

గురువుల యనుగ్రహముచేతనే పరమం బయినశ్రేయమును బడయఁగలవు' అనెను. ఇది నూటయిరువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మమునకుఁ బ్రథమ కారణమయిన శీలమును దుర్యోధనునకు ధృతరాష్ట్రుఁడు చెప్పిన యింద్ర ప్రహ్లాద సంవాదమును ధర్మరాజునకుఁ జెప్పుట. }

ధర్మరాజు 'ధార్మికోత్తమా! ఈలోకమందలి జనులందఱును నెప్పుడును ధర్మంపు శీలమునే మిక్కిలియుఁ గొనియాడుచుందురు. వా రట్లు కొనియాడు టెందుల కని నాకుఁ బెద్దసందేహముగా నున్నది. అది మాకుఁ దెలిసికొన శక్యమగునేని, యాధర్మశీలమును నెట్లు బడయవచ్చునో దానినంతయు వినఁగోరెదను. ఆశీలమెట్లు పొందఁగూడును? దానిలక్షణము లేవియని చెప్పెదరు? నీవు మాటకారులందు మేటివిగదే; వినఁగోరెదఁ జెప్పు'మని యడిగెను.

భీష్ముఁడు. 'మానదా! మునుపు దుర్యోధనుఁడు నీకుఁగలిగిన సంపత్తినిఁజూచి యింద్రప్రస్థమున నీవునునీతమ్ములను గూడియున్న సభయందుఁ జరిగినపరిహాసమునకును దపించుచుఁదనతండ్రియగు ధృతరాష్ట్రుని నీప్రశ్నమే యడిగెను. అప్పుడు జరిగినది చెప్పెద వినుము. నీదు మహాసభను, నీవు పొందియున్న యుత్తమమయిన సంపత్తినిని,జూచి దుర్యోధనుఁ డపుడు దీనుఁడై యదియంతయుఁ దనతండ్రికిఁ దెలిపెను. అదివిని ధృతరాష్ట్రుఁడు కర్ణసహితుఁడైన యాదుర్యోధనునకు నిట్లనియె.

ధృతరాష్ట్రుఁడు—'పుత్త్రా! నీ వెందులకుఁ దపించుచున్నావో యున్నదియున్నట్టు చెప్పఁగా వినఁగోరుచున్నాను. విన్న పిదప నందులకుఁ దగిన కారణము లున్నవని తెలిసెనేని, నేను నిన్ననునయించెదను. నీ కెప్పుడును మహదైశ్వర్యమును గలిగియున్నది. నీతమ్ములందఱును మిత్త్రులును సంబంధులును బాంధవులును నీవు చెప్పినపని చేయుచుందురు. మేలయిన వస్త్రములను దొడిగెదవు. మంచి నంజుళ్లయన్నమును గుడిచెదవు. ఆజానేయపు గుఱ్ఱముల స్వారిచేసెదవు. ఇట్లన్నిసొంపులు నిండియుండఁగా నెందులకు శోకించుచున్నావు?' అనియడిగెను. అందులకు దుర్యోధనుఁడు 'తండ్రీ! ధర్మరాజు గృహమందు మహాత్ములయిన స్నాతకులు పదివేలమంది పసిండిపాత్త్రములందు భుజించెదరు. దివ్యములయిన పుష్పములచేతను ఫలములచేతను నలంకృతమయిన యాతని దివ్యసభను, తిత్తిరిపిట్టలవలె నానావర్ణములుగల యతని యశ్వములను, నానావిధములయిన యతని రత్నములను జూచియు, మఱియు నింద్రుని పెంపుంబోలె నతిమనోహరమై మిక్కిలియు గొప్పదై యున్న మనపగవారల పాండవుల యాపెంపుసొంపును జూచియు దుఃఖించుచున్నాను' అనెను.

అందులకు ధృతరాష్ట్రుఁడు—'నాయనా! పుత్త్రా! యుధిష్ఠిరునికిఁగల యట్టిసంపత్తినిగాని లేక యంతటికంటె నెక్కుడయిన సంపదనుగాని గోరితివేని శీలవంతుఁడవు గమ్ము. శీలముచేత మూఁడులోకములను జయింప శక్యమగును. ఇందులకు సందేహము లేదు. శీలవంతు లగువారికి లోకమం దసాధ్యమేదియుఁ గలుగదు. మాంధాత యొకరాత్త్రిని, జనమేజయుఁడు మూఁడు రాత్త్రులను, నాభాగుఁ డేడురాత్త్రులను భూమినంతయుఁ బడ

సిరి. ఈరాజులందఱును శీలవంతులును, యశస్సంపన్నులును కావుననే భూమి వారి గుణములకు సమ్ముదువ్రాయి తనంతటనే వారిని బొందినది' యనెను. అందులకు దుర్యోధనుఁడు 'భూమి నంతయు నతిశీఘ్రమున నారాజులు పొందిన యాశీలమును బొందు విధమెట్లు ? వినఁగోరెద' నని యడిగెను. ధృతరాష్ట్రుఁడు 'ఈవిషయమై పురాతన మయినయీ యితిహాసము నుదాహరించుచున్నారు. నారదుఁడు మున్ను శీలమునుగుఱించి యిది చెప్పెను. తొల్లి, దైత్యుం డగు ప్రహ్లాదుఁడు శీలమునాశ్రయించి మహాత్ముఁడగు మహేంద్రుని రాజ్యమునుహరించి మూఁడులోకములను దనవశము గావించుకొనెను. పిదప నింద్రుఁడు మహాప్రాజ్ఞుండుగాన బృహస్పతినిబొంది యంజలి గీలించి యతనితో 'శ్రేయమెద్దియో తెలిసికొనఁ గోరెదను' అని యడిగెను బృహస్పతి యతనితో '(ముక్తికారణమగు) జ్ఞానమే పరమమయిన శ్రేయ'మని చెప్పెను. ఇంద్రుఁడతనితో మరల 'దానికంటె విశేషించినది గలదా?'యని యడిగెను. బృహస్పతి 'నాయనా! దీనికంటె విశేషించినదియుఁ గలదు. మహాత్ముఁడగు శుక్రుఁడు నీకు దానిని మఱింత లెస్సగా నుపదేశింపఁగలఁడు. అచటికింబొమ్ము. నీకుశుభం బగుఁగాక;పోయి యతనినడుగు'మనెను. మహాతపస్వియు నతిమాత్రకీర్తియు నగు నింద్రుఁడు భార్గవునికడకుఁ బోయి ప్రీతి గడలుకొన మోక్షసాధన మగు జ్ఞానము నుపదేశము నొందెను.పిదప మహాత్ముండగు శుక్రునివలన ననుజ్ఞవడసి యింద్రుఁడతనితో 'దీనికంటె నెక్కుడయిన శ్రేయస్సుగలదా ?' అని యడిగెను. అందుల కాసర్వజ్ఞుండు శుక్రుఁడు 'మహాత్ముం డగు ప్రహ్లాదునకు నింతకంటె నధికమయిన జ్ఞానముగలదు' అని

చెప్పెను. అది విని యింద్రుఁడు హర్షము నొందెను. అంత నింద్రుఁడు బ్రాహ్మణవేషము వేసికొని ప్రహ్లాదుని యొద్దకుఁ బోయి యతనితో 'శ్రేయమెద్దియో తెలియఁగోరుచున్నాను' అని యడిగెను. ప్రహ్లాదుఁ డాబ్రాహ్మణునిఁ జూచి 'బ్రాహ్మణోత్తమా ! మూఁడులోకములను బరిపాలించుటయందుఁ దగులువడి యున్నానుగాన నాకవకాశము లేదు. కాఁబట్టి నీ కుపదేశము సేయనేరను' అనెను. బ్రాహ్మణుఁడు 'రాజా ! నీ కవకాశముగల యప్పుడేని మిక్కిలి యుత్తమమయిన కర్తవ్య మెద్దియో యుపదేశింపవలయును' నని వేఁడెను. అందులకుఁ బ్రహ్లాదుండు ప్రీతుఁడై బ్రహ్మవాది యగునాబ్రాహ్మణునికి వల్లెయని చెప్పి యప్పుడు తగినకాలమున నతనికి జ్ఞానతత్త్వము నుపదేశించెను. ఆబ్రాహ్మణుఁడు బ్రహ్లాదునియెడ గురువుదెస నుండవలసినవృత్తిని గయికొని మనఃపూర్వకముగా నతఁడు గోరినది చేయసాఁగెను. ఆబ్రాహ్మణుఁడు పలుమా ఱతనినిఁజూచి 'అరిందమా! మూఁడులోకముల రాజ్యమును నీ వే విధమున జయింపనేర్చితివి. ఆయుపాయము లెవ్వియో ధర్మజ్ఞా ! నాకుఁ జెప్పు' మని యడిగెను.

ప్రహ్లాదుఁడు—'బ్రాహ్మణా! నేను రాజ నని విఱ్ఱవీఁగను. మఱి బ్రాహ్మణులయెడ నసూయపడను. వారు శుక్రునిమతము ననుసరించిచెప్పెడి నీత్యుపదేశములను గయికొని యట్లె యనుష్ఠింతును. వారు చెప్పఁగోరినదానిని మిక్కిలి నమ్మికతో నాకుఁజెప్పి యక్రమ మయిన దారినుండి నన్ను వారింతురు. నే నెప్పుడును శుక్రునిమార్గము నే యనుసరింతును. నేను బ్రాహ్మణులకును నా పెద్దలకును నెప్పుడును శుశ్రూష సేయుచుందును. నా కహం

కారము కలుగదు. మఱియు ధర్మాత్ముఁడనై క్రోధమునుజయించి యింద్రియములనడంచి యడఁకువ గలిగియుందును. శాస్త్రజ్ఞులగు బ్రాహ్మణులు తేనెటీఁగలు వెఱలోఁ దేనియనుబోయున ట్లింపయిన యుపదేశములతో నామదిని దడుపుచుందురు. ఆ విద్వాంసులారగించునట్టియమృతరసమును గ్రోలుచు నక్షత్రములందుఁ జంద్రుఁడునుంబోలె నాజాతివారియందు వెలుగుచుందును. బ్రాహ్మణులముఖమున శుక్రునీతుల వినుటయు నట్లె యనుష్ఠించుటయు ననెడి యిదియె భూలోకమందలి యమృతము. ఇదియే యుత్తమమయిన చక్షువు. ఇదియే శ్రేయము' అనెను. ఆ బ్రాహ్మణునిచేత శుశ్రూష నంది మరలఁ బ్రహ్లాదుఁడతనితో 'బ్రాహ్మణోత్తమా! నీవు గురువునెడనుంబోలెనే నాయెడ నడచుకొన్నందులకుఁ బ్రీతుండనయితిని. వరమడుగుము. నీకు శుభంబగుఁగాక. వరమునిచ్చెదను. సందేహము వలదు' అనెను. అందుల కాబ్రాహ్మణోత్తముఁడు 'మంచిది: అట్లె చేసెద' ననెను. ప్రహ్లాదుఁడు 'వరము గయికొను' మని ప్రీతి మీఱ మరలఁజెప్పెను. బ్రాహ్మణుఁడు 'రాజా! నీవు నాయెడఁ బ్రసన్నుఁడవయితివేని నాకుఁ బ్రియము చేయఁగోరెదవేని నీశీలమును బడయఁగోరుచున్నాను. ఇదియె నాకు వరము' అనెను. ఇందులకుఁ బ్రీతుఁడయినను బ్రహ్లాదుఁడు మిక్కిలియు భయము నొందెను. ఆబ్రాహ్మణుఁ డావరము నడిగినప్పుడు ప్రహ్లాదుఁ డతఁ డల్పచిత్తుఁడు గాఁడని తెలఁచెను. అతఁడు మిక్కిలి యాశ్చర్యపడుచుఁ గడపట 'వల్లె' యనెను. ఆ దైత్యనాథుఁడు వరము నొసఁగియు నపుడు మిక్కిలియు దుఃఖమునొందెను. వర మీయఁగానే బ్రాహ్మణుఁడు పుచ్చుకొని వెడలిపోయెను; కాని ప్రహ్లా

దుఁడు మాత్రము మిక్కిలియుఁ జింతకుఁ బాలై యేమిచేయుట కును రూఢిగాఁ దోఁపకుండెను. ఆదైత్యనాథుఁ డావిషయ మును జింతించుచుండఁగా నతని యొడలినుండి యొకఛాయ యపుడు బయలువెడలెను. అది తేజోరూపముగలిగి మిక్కిలియుఁ బెద్దదిగా నుండెను. ప్రహ్లాదుఁడు దానినిజూచి 'నీవెవరి?'ని యడి గెను. అందులకది 'నేను శీలము. నీవు త్యజింపఁగా విడిచిపోవు చున్నాను. నీకు శిష్యుఁడై యుండి నిత్యమును సమాహితుఁడు గా నుండిన యాబ్రాహ్మణోత్తమునియందు వసింపఁగలను' అనెను. ఇట్లది చెప్పి మఱుఁగుపడి యంత నింద్రునిఁ బ్రవేశిం చెను. ఆతేజస్సు పోఁగానే యంత నటువంటిరూపము గలమఱి యొకఁ డాప్రహ్లాదుని దేహమునుండి వెడలివచ్చెను. ఆప్రహ్లా దుఁడు 'నీవెవరి?'రని యడిగెను. అది 'అసురేంద్రా! నన్ను ధర్మ మని తెలియుము. ఆబ్రాహ్మణుఁ డెచ్చటనున్నాఁడో యచ్చటికిఁ బోయెదను. ఎచ్చట శీలముండునో యచ్చటనే కదా నే నుండు వాఁడను' అనెను. పిదప మహాత్ముండయిన యాప్రహ్లాదుని దేహ మునుండి కాంతిచే మిక్కిలి జ్వలించుచున్నట్లున్న మఱియొకఁడు వెలికివచ్చెను. ప్రహ్లాదుఁడు'నీవెవరి?'రని యడుగఁగా మహాద్యుతి యగు నాపురుషుఁడు 'అసురేంద్రా! నన్ను సత్యమని యెఱుం గుము. ఇపుడు వెలుపలికిఁ బోవుచున్నాను; నేను ధర్మము నను సరించి యుండువాఁడను' అనెను. ఆపురుషుఁడు ధర్మము వెంటఁ బోవఁగానే యాప్రహ్లాదునినుండి మఱియొక పురుషుఁడు వెలికి వచ్చెను.'నీవెవరి?'రని ప్రహ్లాదుఁడడుగఁగానే'ప్రహ్లాదా!నన్నువృత్త మని తెలియుము.సత్యముండుచోటనే కదా నేనుండువాఁడను' అనెను. ఆపురుషుఁడు పోఁగానే యాప్రహ్లాదుని దేహమునుండి

వెనుశబ్దము వెలువడెను. ప్రహ్లాదుఁడు 'నీవెవ'రని యడుగఁగా నది 'నన్ను బల మని తెలియుము.వృత్తమున్నచోటనే యుండు వాఁడను' అనిచెప్పి యది వృత్తమున్నయెడకుఁ బోయెను.పిదప నా ప్రహ్లాదుని దేహమునుండి ప్రభామయియగు నొక దేవిబయలు వెడలెను. ప్రహ్లాదుఁ డా దేవిని 'నీవెవ'రని యడిగెను. ఆయమ, నేను 'లక్ష్మిని ; సత్యపరాక్రమా ! నేను నీయందెప్పుడును సుఖముగా వసించుచుంటిని. నీవు విడువఁగాఁ బోవుచున్నాను. నేను బలము ననుసరించి యుండుదానను గదా' యనెను. అంతఁ బ్రహ్లాదునకు భయమువుట్టెను. అతఁడు 'తామరయందుండు ముద్దురాలా ! నీవు లోకమునకుఁ బరమేశ్వరివి. సత్యవ్రతవునుగదే ! ఎచ్చటికిఁ బోయెదవు? ఈబ్రాహ్మణ శ్రేష్ఠుఁడెవఁడు? యథార్థమును దెలియ గోరుచున్నాను' అని యడిగెను. అందుల కాలక్ష్మీ దేవి 'ప్రభూ ! నీయొద్ద బ్రహ్మచారిగానుండి విద్యగఱచినవాఁడింద్రుఁడు. ముల్లోకములందును నీకుఁ గలిగియున్న యైశ్వర్యమును నతఁడపహరించెను. ధర్మజ్ఞా! శీలముచేతఁగదా మూఁడు లోకములను నీవుగెలిచితివి. ప్రభూ ! దానిని దెలిసి దేవేంద్రుఁడు నీశీలము నపహరించినాఁడు; మహాప్రాజ్ఞుండవు గదే ! ధర్మమునకును,సత్యమునకును,నట్లే వృత్తమునకును, బలమునకును, అట్లే నాకును, నెప్పుడును శీలమే కారణముగాఁ గలిగియుండును. ఇందులకు సందేహము లేదు' అనిచెప్పి యాదేవి పోయెను.వారలందఱునుం బోయిరి' అనెను.

భీష్ముఁడు—'ధర్మరాజా ! దుర్యోధనుఁ డప్పుడు మరలఁ దండ్రినిజూచి 'కురునందనా ! శీలమునకుఁగల తత్త్వమును దెలియఁ గోరెదను. శీలమునెట్లు పడయవచ్చునో యా యుపాయమును

నా కుపదేశింపవలయును' అనియడిగెను. ధృతరాష్ట్రుఁడు 'రాజా! మహాత్ముండయిన ప్రహ్లాదుఁడు తొల్లి యింద్రున కుపదేశించునపు డాయుపాయములను దెలిపియున్నాఁడు. సంగ్రహముగా శీల మును బడయుమార్గమును జెప్పెదవినుము. సమస్త భూతము లందును మనస్సుచేతను వాక్కుచేతను గ్రియచేతను ద్రోహము లేకుండుట, అనుగ్రహము, దానము ననెడియీమూఁడును శీల మని ప్రశంసింపఁబడుచున్నవి. ఏది యితరులకు హితముగా నేరదో, ఏది సిగ్గుపడుటకుఁ గారణమగునో, యట్టికర్మమునుగాని పౌరుష మునుగాని యేవిధముననుజేయరాదు. దేనిని జేసినయెడలసదస్సు నందుగొనియాడుట గలుగునో యట్టికార్యమును జేయవలయును. నీ కీశీలమును సంక్షేపముగా నుపదేశించితిని. రాజా! శీలము లేనివారును గొన్నియెడల సంపదను బొందుచున్నారు. అయి నను, నాయనా! చాలఁగాల మనుభవింపఁజాలరు; వారు వేరు తోఁగూడఁ ద్రెళ్లుదురు. పుత్రకా! దీనిని గలరూపునఁ దెలిసికొని శీలము గలిగియుండుము. నాయనా! నీవు యుధిష్ఠిరునకంటె నెక్కుడు సంపదనో యంతకంటె నధికమయిన దానినో కోరుదు వేని శీలవంతుఁడవు కమ్ము' అనెను. కుంతిపుత్రా! నీవు దీనిని గావింపుము; ఈఫలమును బడయుదువు' అనెను. ఇది నూట యిరువదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడాశను నిరూపించుటకై ఋషభసుమిత్ర చరిత్రము ను జెప్పఁదొడఁగుట.}

ధర్మరాజు 'పితామహా! నీవు శీలము మనుష్యునకుఁ బ్రధాన

మయినదని చెప్పితివి. ఆశ యెట్లు గలుగుచున్నది? అది యేమి? దానిని నాకుఁజెప్పుము. పితామహా! నాకిది పెద్దసందేహముగాఁ గలిగియున్నది. ఈసందేహమును ద్రెంచువాఁడు నీవుదప్ప వేఱొకఁడు లేఁడు. (సుయోధనుని మోటుఁదనమును బట్టి) గొప్ప యుద్ధము జరుగనున్నపుడు వాఁడు యుక్తమయిన దానిని జేయునని నేను వానియెడల గొప్పయాశ గలిగియుంటిని. ఒక్కొక్కని యందు నాశ గొప్పదిగానున్నది. ఆయాశను జెఱిపినపుడు, మిక్కిలియు దుఃఖము గలుగుచున్నది. ఆదుఃఖము మరణమే యనుటకు సందేహము లేదు నేను బుద్ధిమాలిన వాఁడనుగాన దురాత్ముఁడు ధృతరాష్ట్రుని కొడుకు నాయాశను దూలఁ బుచ్చెను. నామందమతిని జూడుము! ఆశ,వృక్షములతోఁగూడిన కొండకంటెఁ బెద్దదియని తలఁచుచున్నాను. లేక యాకాశమున కంటెను విరివియైనద గావచ్చును. లేక యది యింతింతనికొలఁది యిడరాని దగును కురుశ్రేష్ఠా! ఆశ యిట్టిదని తెలపోయుటయు దాని నడంచిపుచ్చుటయు నెంతయుఁ గష్టముగానున్నది. అది యిట్లు దుర్లభముగా నుండుటంబట్టి దానికంటె దుర్లభమయిన దేది'యని యడిగెను.

భీష్ముఁడు-'యుధిష్ఠిరా! ఈవిషయమునందు సుమిత్రుఁడను రాజునకును ఋషభుఁడను మునికిని జరిగినకథను నీకుదాహరించెదను. నావలనఁ దెలిసికొనుము. హైహయ దేశమునకు రాజు సుమిత్రుఁ డను రాజర్షి యొకఁడుండెను. అతఁ డొకనాఁడు వేటకుఁబోయి వంగిన కణుపులుగల (సున్నని) బాణముచేత నొకమృగము నేసి తఱిమెను. ఆజింక మిక్కిలి బలిమిగలదిగాన యమ్మునెత్తికొని పఱచెను. బలవంతుఁ డారాజును మిక్కిలి వేగముగా

మృగమును వెంటనంటి పోయెను. ఆమృగము వేగముగొని పల్లమునందును మెఱకయందును బరుగిడెను. రాజేంద్రా! ముహూర్తమువలె నది సకలమయినదారిని బోయినది. పిదప నారాజు యౌవనము చేతను, మేనియందలి బలిమిచేతను విలుగొని వాలుఁబట్టి కవచము దాల్చి దానిని మఱియు వేఁటాడెను. ఆరాజు తానొక్కఁడు నాయడవియం దామృగమును దఱుముచుఁ బెక్కునదులను, నదములను, కొలఁకులను, నడవులను దాఁటిపోయెను. ఆమృగము మిక్కిలియు వేగముగలది గాన యారాజునకుఁ దనయిచ్ఛచొప్పున నప్పుడప్పుడు కనుపట్టుచును మహావేగమునఁ బరుగిడుచునుండెను. ఆరా జేసిన పెక్కమ్ములు గాఁడిపాఱఁగా నాయడవిమెకము వేడుకకుంబోలె నతనిని దఱిసి వచ్చును. అది వేగవంతముగాన మరల పశిగొని దాఁట్లు వైచుచుఁబోయి మరల నగ్గఱికివచ్చును. సుమిత్రుఁ డామృగము మర్మమును భేదించునట్టి క్రూరంపు బలుబాణమొత్తి వింటినుండి యేసెను. పిదపఁ గదుపునందు గమికాఁడయిన యామెకము రాజు నమ్మునేటుబారికిఁ దొలఁగి రెండుక్రోసుల దూరమునఁ బరిహసించు నదియుంబోలె నిలుచుండెను. కాంతి దళుకొత్తుచున్న యాబాణము భూమియందుఁ బడఁగానే మృగ మరణ్యమందుఁ బ్రవేశించెను. రాజును మృగమును దఱుముకొని పోయెను. ఇది నూటయిరువదియేనవయధ్యాయము.

రాజధర్మ పర్వము.

(భీష్ముఁడు, సుమిత్రుఁడు ఋష్యాశ్రమమునకుఁ బోవుటయు వారిని జూచి యాశ పెద్దదియా యాకాశము పెద్దదియా యని యడుగుటయుఁ జెప్పుట.)

అంత సుమిత్రుఁడు మహారణ్యమునఁ బ్రవేశించి ఋషుల యాశ్రమమును జేరి యపుడు బడలికతో నందుఁ గూర్చుండెను. అప్పు డారాజు విలుదాల్చి శ్రమంబునఁ బీడితుఁడై యాఁకట నలంగుచుండుటను జూచి ఋషులువచ్చి యాతనికి విధ్యుక్తముగా నుపచారముచేసిరి. రాజు నా ఋషులొసంగిన పూజను గయికొని వారి నందఱను జూచి 'మీ తపము లత్యుత్తముగా వర్ధిలుచున్నవా?' యని యడిగెను. ఆతపోధనుఁ డారాజు మాటను గయికొని యతని నందులకు వచ్చిన దానికిఁ గారణమేమి యనియడుగువారై 'శుభవదనా ! నీ వెందులకుఁగాను నడుమునఁ గత్తి గట్టి విలునమ్ములు దాల్చి కాలినడకను దపోవనమునకు వచ్చితివి? ఏకులమునఁ బుట్టినవాఁడవు? నీపేరేమి? మాకుఁ జెప్పుము' అని యడిగిరి. అంత నారాజా బ్రాహ్మణు లందఱకును దనవృత్తాంతమును గలరూపునఁ దనరాకను జెప్పఁదొడఁగి 'బ్రాహ్మణులారా ! నేను హైహయ దేశరాజుల కులమునఁ బుట్టినవాఁడను. నాపేరు సుమిత్రుఁడు. పెద్ద సైన్యముతోడను నమాత్యులతోడను నంతఃపురకాంతలతోడను గూడి బాణములచే మృగసమూహములను వేలకొలఁదిని గొట్టుచు గ్రుమ్మరితిని. ఒకజింక నాయమ్ము దగిలి యాగ్రుచ్చుకొన్న యమ్ముతోడనే పరుగిడినది. అల్లది పరుగెత్తుచుండఁగా దాని వెంటఁ దఱుము కొనుచు య

దృచ్ఛచే నీవనమును జేరితిని. నేను లక్ష్మిని దిగనాడి యాశ చెడి శ్రమంబున సోలి మీాపొంతకు వచ్చితిని. ఇంతకంటె దుఃఖమే మున్నది? శ్రమార్తుండనై, యాశ వమ్మయి, రాజులక్షణములు వీడి నేను మీాయాశ్రమమును జేరితిని. తపోధనులారా! నాయాశచెడుట నాకుఁ దీవ్రమయిన దుఃఖమును గలిగించు నట్లు రాజ లక్షణములు విడుచుటయు దుఃఖమును గలిగింపదు. తపస్వులారా! హిమవత్పర్వతము తనపాదవృచేతను,మహోదధి యగు సముద్రము తనవిశాలచేతను, భూమ్యాకాశములనడిమికి నెట్లావరింప కున్నవొ యట్లే నే నాశకుం గలతుదిని బొంద కున్నాను. అన్నియు మీాకుఁ దెలిసియుండును. తపోధనులగు ఋషులు సకలమును దెలిసినవారే కదా? మీారు మహాభాగ్య వంతులు. కాఁబట్టి యొక సందేహము నడుగుచున్నాను. ఒక మనుష్యుని కాశయున్నది. ఆకాశము నున్నది.దీనియందు లోక మున నేది పెద్దది యని మీాకుఁ దోఁచుచున్నది. దీనిని గలరూ పున వినఁగోరుచున్నాను. ఈ లోకమందేది దుర్లభము? ఇది యెప్పుడును మీాకు గోప్యముగా కుండునేని జాగులేక చెప్పుఁ డు. బ్రాహ్మణోత్తములారా! మిక్కిలియు రహస్యమయిన దా నిని నేనడుగఁ దలంపను. మీాతపములకు విఘ్నములయిన కార్య మునుండి నేను దొలంగెదను. ముచ్చటించుట కవకాశము గల దేని నే నడిగినప్రశ్నమునకుఁ గారణమును సమగ్రతయు యథార్థ ముగా వినఁగోరుచున్నాను. ఎప్పుడును దపములు సలుపుచు సమాధి యం దుండుమీారలే దీనిని జెప్పఁదగుదురు' అనెను.

ఇది నూటయిరువదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ఋషభుం డనుఋషి సుమిత్ర రాజునకు దన తీర్థయాత్రాదులను జెప్పుట.

అంత నచటఁ గూడియున్న యా ఋషులలోపల శ్రేష్ఠుం డగు ఋషభుం డను బ్రహ్మర్షి నవ్వుచు రాజుం జూచి రాజసింహమా! మున్నొకప్పుడు నేను దీర్ఘయాత్రకుఁ బోఁగా దివ్యమయిన నరనారాయణాశ్రమమును జేరితిని. అచ్చట సొగసయిన యా బదరీ వృక్షమును నల్లె గంగానదిసంబంధి యగుతటాకమును నున్నవి. రాజా! అచ్చట హయగ్రీవుఁడు శాశ్వతము లయిన వేదములను జదువుచున్నాఁడు. నేను మును పాతటాకమందు దేవతలకును బితరులకును విధ్యుక్తముగాఁ దర్పణముగావించి పిదప నరనారాయణు లనెడి యాఋషు లెప్పుడును గ్రీడించుచుండిన యాశ్రమమునకుఁ గొంచెము సమీపమున వసింపఁగోరి పోయితిని. అప్పు డచ్చట వల్కలము నజినమును దాల్చినవాఁడును, కృశుండును, మిక్కిలియుఁ బొడవయిన వాఁడును, నగు తను వనెడు ఋషి వచ్చుచుండఁ గాంచితిని. అతని దేహ మితరమనుష్యుల దేహములతో నెంతమాత్రమును బోల్పఁదగదు. అట్టి కృశత్వమును నేను జూచినది లేదు. చిక్కియున్న యతని శరీరము చిన్నవ్రేలికి సాటిగా నుండును. కుత్తుకయును జేతులును గాళ్లును వెండ్రుకలును మిక్కిలి వింతగాఁ జూపట్టినవి. తలయును జెవులును గన్నులును నతని మేనికిఁ దగు మాత్రముగా నుండెను. అతని వాక్కును గర్మమును నొక్కరూపై యుండెను. నేను కృశుండయిన యా బ్రాహ్మణునిఁ జూచి మిక్కిలియు భయపడి యెంతయు మనం

బునఁ దూలుచు నతని యడుగులకు మ్రొక్కి పిదప నా గోత్ర మును నామమును గార్యమును దెలిపి యంజలిఁగీలించి యెదుట నిలిచియుంటిని. అతఁ డొసంగిన యాసనమందు మెల్లగాఁ గూర్చుంటిని. మహారాజా ! అంత ధార్మికోత్తముఁ డయిన యాఋషియు నట్టి ఋషులనడుమ ధర్మార్థ యుక్తములయిన ముచ్చటలను జెప్పెను. అతఁడు చెప్పుచుండఁగానే తామర రేకుల వంటి కన్నులుగల వీరద్యుమ్నుఁ డనురాజు మహాసైన్యముతోడను నంతఃపుర స్త్రీలతోడను గూడి యక్కడకు వచ్చెను. అమ్మహాకీర్తి, కాననయందుఁ గానకపోయిన తనపుత్త్రుని భూరిద్యుమ్నునిఁ దలంచుకొని మిక్కిలిశోకించుచు 'వాని నిచటఁజూతును. ఇయ్యెడఁజూతు' నని యాశతో వేగము లగు గుఱ్ఱములతోడ వచ్చెను. ఇట్లాశచేతఁ గృశించిన యారాజు వనమందు సంచరించుచు 'ఆపుత్త్రుని మరల నేను జూడఁగందునా? లేదు. ఒకఁడే పుత్త్రుఁడు మహారణ్యమందు ముందుఁ గనఁబడక పోయెను. వానిని నాకుఁజూడ శక్యముగాకున్నదే. నాకాశయుఁ బెద్దదిగానున్నది. ఆశ నా దేహమునంతయు నావరించియున్నదిగాన నేను మరణమునొందనర్హుఁడనుటకు సందేహములేదు' అని యపుడు మాటిమాటికిఁ జెప్పెను. పూజ్యుం డయినయా ఋషితిలకుండు విని తలవంచి యొక ముహూర్తము ధ్యానాసక్తుఁడై యుండెను. మిక్కిలి శోకము గల యారాజామునిధ్యానము సేయుటను జూచి బుద్ధి విన్నయై 'దేవర్షీ ! ఏది దొరకుట యరిది? ఆశకంటెఁ బెద్దది యేది? ఇది గోప్యముగాదేని పూజ్యుం డగు నీ వుపదేశింప వలయు'నని మాటికి మిక్కిలి యల్లల్లఁ జెప్పెను. తనువు 'రాజా ! నీకొడుకు మహాత్ముం డయిన యొక ఋషి నవమానించినాఁడు. వాఁడు

మందభాగ్యముచేత బుద్ధిమాలి యట్లుచేసినాఁడు. ఆఋషి నీకొడుకును నొకబంగారు కలశమును వల్కలములను నడిగెను. వాఁ డవజ్ఞచేసియు నతని కవి యొసంగఁడయ్యె, ఆఋషి నీకొడుకుచేత నట్లు భంగపడి యాశ దూలినవాఁడయ్యె' ననెను. ఇది విని లోకపూజితుండగు ఋషికి నభివాదనముచేసి ధర్మాత్ముఁ డా రాజు నీవలెనే బడలికచే సోలియుఁ గూర్చుండెను. ఆఋషి యరణ్యవాసుల విధిచొప్పున నర్ఘ్యపాద్యములను రప్పించి రాజున కర్పించెను. పిదప సప్తఋషులు ధ్రువునింబోలె ఋషులందఱును నారాజును బరివేష్టించి కూర్చుండిరి. అపుడు వా రారాజును జూచి 'యాశ్రమమునకు వచ్చిన కారణమే' మని యడిగిరి. ఇది నూటయిరువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

తను మహర్షి వీరద్యుమ్నునకు దుర్లభ వస్తువును గృశతరమైన యాశయును బ్రతి పాదించుట.

రాజు—'నేను వీరద్యుమ్నుం డను రాజను. దిక్కులయందు, బ్రసిద్ధిగన్నవాఁడను. నాకొడుకు భూరిద్యుమ్నుండు గానకపోఁగా వానిని వెదకుటకై యడవికి వచ్చితిని. బ్రాహ్మణోత్తమా! వాఁడొక్కఁడే పుత్త్రుఁడు; మఱియు బాలుఁడు; ఏ తప్పును లేనివాఁడు. అట్టివాఁ డీవనమునఁ గనఁబడకపోయెను. వానిని వెదకుటకై క్రుమ్మఱుచున్నాను' అనెను. అందులకు ముని ముఖము వాంచి మాటాడకయే యుండెను గాని యాసనుయమున రాజును జూచి బదులు చెప్పఁడయ్యె. ఏలనఁగా మును పారాజు

తానా బ్రాహ్మణుని నంతగాఁ బూజించినవాఁడు గాఁడు. దానిచే నతఁ డాశ చెడి దీర్ఘమయిన తపము నాశ్రయించెను. అతఁ డప్పుడు 'నేనేవిధమునను రాజులవలనఁగాని తక్కిన జాతులవారివలనఁగాని ప్రతిగ్రహము చేయుటలేదు' అనుబుద్ధిని గలిగించుకొనెను. అతఁడు తనలో 'ఆశయేకదా పట్టుకొని యవివేకి యగు పురుషుని మాఁటాడించుచున్నది. నేను నామనస్సుననుండి యాయాశను దఱిమివైచెద' నని తలఁచి యట్లు గట్టిగానుండెను. వీరద్యుమ్నుఁ డా మునివరునిఁ జూచి 'ఆశపలుచఁదన మెంత? భూమియందు దుర్లభమెద్ది? మహాత్మా! నీవు ధర్మార్థములను గనుఁగొన్నవాఁడవు గాన దీనిని నాకుఁ జెప్పుము' అని యడిగెను. అంతఁ గృశతనుండయిన యమ్ముని యప్పుడంతయును దలంచుకొని రాజును గూడఁ దలఁపించుచు నతనితో 'రాజా! పలుచఁదనమునందు (కృశత్వమునందు) ఆశకు సాటియైన దొక్కటియు లేదు. నేను బెక్కురాజులను బ్రార్థించి * యది తోఁపించు వస్తువు కంటె దుర్లభమయినది లేదని కనుఁగొంటిని' అనెను. రాజు 'బ్రాహ్మణోత్తమా, నీమాటలవలన నేది కృశమో యేది కృశముగాదో తెలిసికొంటిని. ద్విజుఁడు గాని వానియందు వేదవాక్యమువలెనే, ఆయాశయందుఁ దోఁచువస్తువే దుర్లభమని తెలియనయ్యెను. మహాప్రాజ్ఞా! అయినను నామనసునం దొక సందేహమున్నది. నే నడుగఁగా దానిని గలరూపునఁ జెప్ప

* 'తస్యా హైదుర్లభత్వాచ్చ ప్రార్థితః పార్థివోమయా' అని పాఠాంతరము. దాని నడంప శక్యము గానందుననే రాజును బ్రార్థించితినని యర్థము. ఇది మఱింత సమంజసము.

వలయును. నీకంటె మిక్కిలి కృశముగా నుండున దేది? (ఈభూమి యందు దుర్లభమెద్ది ?) బ్రాహ్మణవర్యా ! పూజ్యుండ వగు నీవు గోప్యముగాదేని దీనిని జెప్పవలయు' ననెను. ఋషియు 'తృప్తి గల యాచకుఁడు దొరకుట మిక్కిలియు నరిది. లేక యట్టివాఁడీ లోకమునందు లేదనవచ్చును. నాయనా! అంతకంటెను యాచకు నవమానింపకుండువాఁడు దొరకుట మిక్కిలియు నరిది. ఒకటి చేసెదమని ప్రతిజ్ఞ చేసి తమచేతనైన కొలఁదిని యాచకుని కర్త మగురీతిని దానిని జేయకుండువారి నాశ్రయించిన * యాశయో నా దేహమునకంటెఁ బలుచనైనది. కృతఘ్నులయందును క్రూరులయందును, సోమరులయందును, అపకారులయందును, నుంచినయాశ నాకంటెను బలుచనైనది. ఒక్కఁడే పుత్రుఁడుగల తండ్రి, యాపుత్రుఁడు గానకపోయినను లేక దేశాంతరగతుఁడైనను వాని వృత్తాంతము దెలియకుండునేని యట్టితండ్రి యాశ నాకంటెను బలుచనైనది. రాజా ! ముదుసలి పడఁతులకుఁ బుత్రుఁడు కావలయునని ప్రసవమందుఁ గలుగునట్టి యాశయు, అల్పె ధనవంతులకుఁ గలుగునాశయు, నాకంటెఁ బలుచనైనవి. వయసు పెడిఁగినకన్యలకుఁ దమమ్రోలఁ బెండ్లిముచ్చట లెవరేని యాడునపుడు వినఁగా వారిమనసునందుఁ బెండ్లి చేసికొనఁ బొడమునట్టియాశయు నాకంటెఁ బలుచనయినది' అనెను. అది విని యారాజు తన యంతఃపురస్త్రీతోడ, శిరసు మునియడుగులు సోఁక నతనికిఁ గ్రిందఁబడి మ్రొక్కి 'మహాత్మా ! నీయనుగ్రహమును వేఁడెదను. పుత్రునిఁ జేరుటకు నువ్విళ్లూరెదను.

* అట్టిప్రతిజ్ఞా ఘాతకులను నమ్మరాదనియు. అట్టివారియందు ఆశయుంచువారి యాశ తనదేహమునకంటె పల్చనయనియు ఆశయము.

నీ విప్పుడు చెప్పినదంతయు యుక్తమే; నీవు కోరినవరము లడుగు
ము. నీవాక్యములు సత్యములనుటకు సందేహము లేదు' అనెను.
ఋషభుఁడు—అంత ధార్మికోత్తముఁ డా పూజ్యుఁడు తనువు
నవ్వి, తపస్సుచేతను శ్రుతముచేతను నతనిపుత్త్రుని వేగ రప్పించి
యారాజును (తన్ను మున్నవమానించి నందులకు) దూఱెను.
అంత నాధార్మికోత్తముఁడు తన్ను ధర్మదేవతగాఁ జూపెను.
అతఁ డద్భుతముగాఁ బొడకట్టుచున్న తనదివ్య స్వరూపమును
జూపి యంత నేకోపమును వైరమును లేక దాపుననున్న వన
మందుఁ బ్రవేశించెను. రాజా! నేను దీనినంతయుఁ గన్నా
రఁ జూచితిని, ఈ మాటలును వింటిని. కాఁబట్టి, మిక్కిలి
పలుచ నయిన యీయాశను వేగ దిగవిడువుము' అనెను.
భీష్ముఁడు—'రాజా! అప్పుడు మహాత్ముం డగు ఋషభుఁ డట్లు
చెప్పఁగా నాసుమిత్త్రుఁడు తోడనే మిక్కిలిపలుచనయిన యాశను
వీడెను. కౌంతేయా! నీవు నిట్లె నేను జెప్పిన యీమాటను విని
హిమవంతముంబోలె నిశ్చలుండవై స్థిరుఁడవై యుండుము.
రాజా! ఈలోకమందు నీవే, కష్టములయిన యిట్టివిషయములను
గుఱించి యడుగువాఁడవుగను వినువాఁడవుగను నున్నావు. నా
వలన నిది విని నీ విఁక నిహవిషయములందు సంతాపము నొందఁ
దగదు' అనెను. ఇది నూటయిరువదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{యముఁడు తలిదండ్రులకుఁ బరిచర్య సేయుట వారి ఋణమును దీర్చుకొనుట కుపాయమగునని గౌత మునకుఁ జెప్పుట.}

ధర్మరాజు—'భారతా! అమృతమునందుఁ దృప్తిగలుగ నేరని యట్లు, నీవు చెప్పుదానియందుఁ జాలుననెడితలంపు నాకుఁగలుగ కున్నది. [ఆత్మజ్ఞాన సమాధియందుండు వాఁ డెట్టి తృప్తినొంది యుండునో యట్టి తనివిగలిగి యున్నాఁడను.] పితామహా! కాఁబట్టి మరల నీ వీధర్మవిషయమును నా కుపదేశింపవలయును. నేను నీ ధర్మోపదేశ మనెడి యమృతపానము చేసి తృప్తినొందనేరకున్నాను' అనెను. భీష్ముఁడు—'ఈవిషయమున గౌతమునకును మహాత్ముఁడ యిన యమునకును జరిగిన సంవాదమును పురాతనమయిన యీ యితిహాసము నుదాహరించెదరు. పారియాత్ర మనెడు పర్వత మందు గౌతమున కొక పెద్దయాశ్రమ ముండెను. తపసుచేఁ బాపములనెల్ల దహించినట్టి యాగౌతముఁ డందు వసించుచుం డెను. అమ్ముని యఱువది వేలసంవత్సరములు తపము చేసెను. అప్పుడట్లుగ్రముగాఁ దపము సలుపుచున్న యమ్మహాముని కడకు లోకపాలకుండయిన యముఁడు వచ్చి వినయంబు మీఱఁ గాంచెను. ఆ బ్రహ్మర్షి యు నట్లు వచ్చినవానిని, దేజస్సును బట్టి యముండని తెలిసి చేతులు మోడ్చి ప్రణతుండై పొంతకుఁ బోయెను. యముఁడును నా బ్రాహ్మణోత్తమునిఁ జూడఁగానే నమస్కరించి 'నేను ధర్ముఁడను. మీ కేమి చేయవలయును?' అని చెప్పి రాఁబట్టుకొనెను. గౌతముఁడు 'పురుషుఁ డేమి కావించి తలిదండ్రులయెడ ఋణములేని వాఁ డగును? పడయఁ దరము

గాని పుణ్యలోకములను నెట్లు పడయును ?' అని యడిగెను. అందులకు యముఁడు 'ఎప్పుడును దపమును శౌచమును గలిగి సత్యధర్మపరాయణుఁడై యహరహమును దలిదండ్రులకుఁ బూజను దానే చేయుచుండవలయును. ఆప్తదక్షిణలతోఁ గూడిన యశ్వమేధయాగములు పెక్కులు చేయవలయును. దానిచేతఁ బురుషుఁ డద్భుతముగాఁ గనుపట్టు పుణ్యలోకములను బడయును' అనెను. ఇది నూటయిరువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజాపత్కాలమందు ప్రజలను బీడించియైనను బొక్కసము నవశ్యము వృద్ధిచేయవలయునని చెప్పుట.

ధర్మరాజు—'భాగతా! మిత్రులు దిగవిడిచిన వాఁడును బెక్కుశత్రువులు గలవాఁడును బొక్కసము క్షీణించినవాఁడును సైన్యములేనివాఁడును నగు రాజు నడచుకొనవలసిన దెట్లు ? మఱియు వానిచుట్టును దుష్టులగు మంత్రులున్నను, వాని మంత్రము లన్నియును బర్వినను, వాని కేదారియుఁ దోఁపకున్నను, పరరాష్ట్రముపై దండెత్తినపుడును, పరరాజ్యమునుబట్టి నలంచుచున్నపుడును, దాను దుర్బలుఁడై యున్నను బలవంతునితో విగ్రహించుచుండునపుడును, ఎట్లు నడచుకొనవలయును? మఱియు వాని రాష్ట్రము చక్కఁగా రక్షింపఁబడకున్నను, వాఁడు కాలదేశములను దెలియకున్నను, తాను మిక్కిలియుఁ బీడించుట వలనఁ బ్రజలయందు నిమ్మళపాటుగాని శత్రువులయందు భేదముగాని పుట్టింప శక్యముగాకున్నను, వానినడక యేమి? వాఁడు చెడ్డ యుపాయములచేత ధనమును బడయఁ జూడ

వలయునా ? లేక ధనమును గోరకయే ప్రాణమును దిగవిడువ వలయునా ? ఏదిచేసిన లెస్స ?' యని యడిగెను.

భీష్ముఁడు—'ధర్మజ్ఞా ! నీవు మిక్కిలి రహస్యమైన ధర్మమును గుఱించి న న్నడుగుచున్నావు ? ఈ ధర్మము నడుగకయే చెప్పుటకు నే నుత్సహింపను. భరతసత్తమా! ధర్మము మిక్కిలియు సూక్ష్మమైనది చుమీ ! అది శాస్త్రములు చెప్పుటవలన నొకఁడు తెలిసికొనుచున్నాఁడు. విన్నదానిని మనస్సునకుఁ దెచ్చుకొని యనుష్ఠించియు మంచి యాచారము లాచరించియు నొకఁడొ క్కయెడ సాధువుగావచ్చును. రాజు బుద్ధి మున్నిడికొని కార్యము చేసియు ధనవంతుఁడయినను గావచ్చును ; కాకయుఁ బోవచ్చును. నీవు నీ సొంతబుద్ధినిగొని నీప్రశ్నమున కీవిషయమున నేమి బదులు చెప్పవలయునో యాలోచించి చూడుము. భారతా ! రాజు లాపదలందుఁ దాము వ్యవహారము నడపుకొనుటకై మిక్కిలియు ధర్మయుక్తమగు నుపాయ మేదియో వినుము. కేవలము ధర్మమును బట్టిచూడఁగా, నే నిట్టియుపాయములను ధర్మములని చెప్పను. దుఃఖపెట్టి బొక్కసమును నించుకొన్నయెడ నిట్టి నడక రాజును బిదప మృత్యువు దరికిఁదెచ్చును. ఈ విషయమై యాలోచింపఁగా,బుద్ధిమంతుల నిశ్చయమే యిది యగును. మనుష్యుఁడు నిత్యమును నెట్టియెట్టి శాస్త్రమును జదువుచున్నాఁడో యట్టి జ్ఞానమే వానికిఁ గలుగును. అట్టి విజ్ఞానము వాని కిష్టముగానే యుండును. విజ్ఞానము లేమివలనఁ బురుషున కుపాయ నాశమును విజ్ఞానమువలన నుపాయమును గలుగుచున్నది. ఉపాయమనఁగా సంపత్తిని గలిగించెడి పరమ సాధనము. నీవు శంకయు నసూయయు లేక నేనిదె చెప్పునది వినుము.

బొక్కసము తగ్గుటవలననే రాజునకు మిక్కిలి బలమును దగ్గును. రా జెప్పుడును జలములేని యడవిపట్టున జలమును బుట్టించువిధమున, నే యుపాయమైనఁ బన్ని బొక్కసమునునిండింపవలయును. రాజు పూర్వు లాచరించిన యీ యుపధర్మము నూఁది కాలము వచ్చినపుడు ముందు పీడించిన ప్రజలయెడ ననుగ్రహము చూపవలయును; సంతోష పఱుపవలయును. ఈ ధర్మ మిట్టి యాపత్కాలమందు యుక్తమగును. సమర్థులగువారికి (సామాన్యసందర్భములందు) ధర్మము వేఱు. ఆపత్సమయములందు ధర్మము వేఱు. బొక్కసము లేకయు రాజు (తపోవ్రతాదులవలన) ధర్మమును బడయవచ్చును. ధర్మమునకంటె జీవనము మఱియుగొప్పది. (జీవనము ధనము లేక జరుగదుగాని ధనమును బడయుటకు విఘ్నముగావించు ధర్మమును బూనరాదు). బలహీనుఁ డయిన రాజు వట్టిధర్మమునుమాత్రము పడయునేని జీవనమునకు న్యాయమయిన మార్గములను బొందఁజాలఁడు. మఱియు నతఁడు తా నెంతపాటు పడినను ధర్మముచేతనే బలిమి నొందఁజాలఁడు. కాన యాపదలందుఁ గావించు నధర్మములును ధర్మలక్షణము గలవిగా వినఁబడుచున్నవి. అయినను విద్వాంసు లట్టికర్మము లధర్మము కలిగించుననియె తెలియుదురు. ఆపద తొలఁగిన పిదప క్షత్రియునకు దోషమును బోకార్చునట్టి ప్రాయశ్చిత్త మేమి విధింపఁబడి యున్నది? అతఁ డట్టిసమయమునఁ దనకు ధర్మము కుందకుండునట్లుగా నడచుకొనవలయును. మఱియుఁ దన శత్రువు వారికిఁ * జిక్కకుండునట్లుగాను బ్రవర్తింపవలయును. ఇవియు

* అనఁగాఁ దాను శాంతికవిధులు చేసికొని తాను బీడించినవారికి ద్వేషము గలుగకుండునట్లు హితము లాచరింపవలయునని భావము.

వానికిఁ గర్తవ్యములుగాఁ జెప్పెదరు. అవి యేవనఁగా నతఁడు దైన్యము నొందరాదు. ఆపత్కాలమందుఁ దనధర్మమునుగాని, బరులధర్మమునుగాని బాటింపవలసినది లేదు. సర్వవిధములయిన యుపాయములచేతఁ దన్నుఁ దాను విడిపించుకొనవలయును. ఇదియే నిశ్చయము. ధర్మవిదులగు బ్రాహ్మణులు ధర్మమునందు నిపుణులుగా నుండవలయు ననుట నిశ్చయింపఁబడినదని శ్రుతిగలదు. అట్లె క్షత్రియుఁడు బాహువీర్యము గలవాఁడుగానయుద్ధమందు నిపుణుఁడై యుండవలయునని యది చెప్పెడిని క్షత్రియునకుజీవనమార్గమునకడ్డిగలిగినపుడుతాపసులయుక్షత్రియులయుసొమ్ముతప్పఁదక్కిన దేదియువాఁడెత్తికొనవచ్చును. బ్రాహ్మణునకు,గుందునొందినపుడు,యాగముచేయింపరానివానికి యాగముచేయించుటయు భుజింపరానిదానిని భుజించుటయు నెట్లుగూడునోయట్లె,క్షత్రియునకుఁ దక్కిన యెవరిసొమ్ము నేనియుఁగయికొనఁజెల్లును ఇందులకు సందేహము లేదు. ఆపదగలవానికిఁబోరాని దారియేది? (చెఱ మొదలగునవానిచే) అడ్డగింపఁబడిన వానికి (తప్పించుకొను విషయమునఁ) జెడ్డదారి యేదియుఁగాదు. ఒకఁడు పీడింపఁబడినపుడు వాఁడు తప్పుదారిని దప్పించుకొని పరుగిడును. అట్లె యిదియు. క్షత్రియుఁడు బొక్కసముతఱిఁగి సేనయుఁగుంది మిక్కిలియుఁ గీడ్పడియున్నపుడు వానికి భైక్షచర్యగాని వైశ్యశూద్రుల జీవనవృత్తిగాని విహితముగాదు. వానికి యుద్ధమునను జయమునను ధనమును బడయుటయే స్వధర్మము. వాఁడు తనజాతివాని మఱొకని నెప్పుడును యాచింపరాదు. వాఁడు తన స్వధర్మమును దిగవిడువవలసి నట్టియాపద గలిగినపుడు తన మొదటికల్పమునకు (స్వధర్మమునకు) రెండవకల్పము

(అనఁగాఁ బ్రజలను బీడించి యేని ధనమును బడయుట) చొప్పున జీవనము చేయుట న్యాయమగును. ఆపద నొందినవాఁడు ధర్మమును సంబంధించిన న్యాయమును విడిచియు బ్రదుకవచ్చును. ఇది జీవనమునకు లోపము కలిగినపుడు బ్రాహ్మణులయందుఁ గానఁబడినది. క్షత్రియునివిషయమై యిది నిస్సందేహముగా నిష్కర్షింపఁబడి యున్నది. క్షత్రియుఁడు ధనముఁగోరినపుడు ప్రజలవలననుండి ధనమును దీసికొనవచ్చును. తా నెట్లును గీడ్పడకుండునట్లు చూచుకొనవలసినది ముఖ్యము. క్షత్రియుఁ డార్తులయిన ప్రజలను రక్షించువాఁడని చెప్పుదురు. కాఁబట్టి రక్షను గావించువాఁడగు రాజు ప్రజలధనము నెత్తికొనవలయును. ఈలోకమందు క్షత్రియులు గానివారియందు సయితము నెటువంటి మనుష్యునకును హింసలేని జీవనము గలుగదు. అడవియందొంటరిగాఁ దిరుగుచుండు మునులకును, తెలవ్రాలు చొప్పున జరుగునని నమ్మి బ్రదుకుట శక్యముగాదు. ప్రజారక్షణము సేయఁగోరు క్షత్రియునకు నిది మిక్కిలియు నశక్యము ఆపత్కాలమం దెల్లప్పుడు రాజును రాజ్యమును నొండొరుల రక్షింపవలయును. ఇది సనాతనమయిన ధర్మము. రాజాపత్కాలములందు నరాదులను గొని రాజ్యమును రక్షించునట్లు, రాజ్యము నైతమాపత్కాలమందు రాజును రక్షింపఁ దగియుండవలయును. రాజు తన కెంత యాపద కలిగినను, రాజ్యమును సంబంధించిన బొక్కసమును, దండమును, సైన్యమును, మిత్రులను, సుహృదులను, మఱియుఁ దక్కిన ముఖ్యులను దిగవిడువరాదు. ధర్మవిదులగువా రన్నమును దగ్గించియైన విత్తనమును* సంపాదింపవలయు నందురు. ఈ యాపద్ధ

* విత్తనములను మిగత పడకుండునట్లు భుజించినచో పిదప భోజనను

ర్మము మహామాయుఁడయినశంబరాసురుని మతమని చెప్పుదురు. ఎవనిరాజ్యము జీవనము లేక కష్టపడుచున్నదో, ఎవఁడు వేఱు గతిలేక జీవనమునకై దేశాంతరమునకుఁ బోవుచున్నాఁడో, యట్టిరాజు బ్రతుకు, ఇస్సీ! నింద్యము. రాజునకు మూలము బొక్కసమును సైన్యమును. అతని సైన్యమునకు మూలము బొక్కసము. ఆసేన సమస్త ధర్మములకును మూలము. ప్రజలకు మూలము ధర్మము. ఈలోకమందు నితరులను బాధింపకయే బొక్కసమును సంతరించుటకు వలనుగాదు. మఱి సేనగాని యెక్కడిది? అట్టి బొక్కసమునకై పీడించుటవలన రాజు దోషమును బొరయఁడు. చేయఁదగనివికూడఁ గార్యముకొఱకు యాగములందుం జేయఁబడుచున్నవి. ఆపత్కాలమందు బొక్కసము కూర్చుటకై చేయఁదగనివి చేసినను, ఈ కారణమునుబట్టి దోషమును బొందఁడు. ఆపదయందుఁ బ్రజలను గట్టిపెట్టుట వారి క్షేమమునకుఁ గారణమగును. గజము లశ్వములు మొదలయిన వానిని రక్షించుట నిష్ఫలమైనను నది యంతయు ధనమును జేర్చుటకుఁ గారణమగును. బుద్ధిమంతుఁడగు రాజిట్టి బుద్ధిగలిగి తన కార్యములను నిష్కర్షించుకొనవలయును. యాగములకు మఱొకటి (అనఁగాఁ బశువులు) సాధనము; యాగము మఱొకటికి (అనఁగాఁ జిత్తశుద్ధికి) సాధనము. పశువులు, యాగములు, చిత్తశుద్ధి యన్నియును మోక్షమునకు సాధనము లగుచున్నవి.

అరుదగును. అన్నమును దగ్గించియైన విత్తనములను నిలువఁబెట్టినచోఁ బిదప చక్కఁగా దొరకును. అట్లె ప్రజలు ధనముతగ్గినరాజును వృద్ధికిఁ దెచ్చినచో పిదప రాజుచేతఁ బ్రజలు రక్షితులగుదురు. రాజునకు విపత్తుగలిగినచోఁ బ్రజలు నశింతురు - అని యొక వ్యాఖ్యయందుఁ జూపట్టుచున్నది.

ఇట్లే నీతియు దండమును బొక్కసమునకును, బొక్కసము సేనకును, నీతి బొక్కసమును సేనయు మూఁడును బగవారి నుఱుమాడి రాజ్యమును గాచి వృద్ధినొందించుటకును సాధనములగును. ఈవిషయమై ధర్మతత్త్వమును నిరూపించునట్టి యొక దృష్టాంతము చూపెదను. యాగమునకై యూపమునకుఁ దగిన మ్రానును గొట్టుచున్నారు. దానిని గొట్టునపుడు దానికడ్డుగానున్న తక్కిన చెట్లనుగూడ నఱకుదురు. ఈచెట్లు గూలునపుడు దాపున నున్నయితరవృక్షములను విఱుచుచున్నవి. ఈవిధముననే బొక్కసమును బెద్దదిగావించుటకు నడ్డుగానుండు వారినందఱను జంపకతీఱదు. మఱియొక విధమున నీసిద్ధిని బడయుట నాకుఁ దోఁపకున్నది. ధనమువలన నిహమును బరమును సత్యమును ధర్మమును జయింపవచ్చును. ధనములేనివాఁడు శవమే యగును. సర్వవిధములయిన యుపాయములచేతను యాగమునకు నుపయుక్తమగు ధనమును సంపాదింపవలయును. భారతా! ఆపత్కాలమందుఁ జేసిన కార్యమునకుఁ గలుగు దోషమును, ఆకార్యముననే యితర సమయములందుఁ జేయఁగాఁ గలుగు దోషమును, సమములు గానేరవు. ధనమును బడయుటయు విడుచుటయు రెండును నొక్క పురుషునియందే కలుగుట యరిది. రాజా! అడవియందు ధనవంతుఁడగువానిని నేను జూడలేదు. లోకమున ధనమని కనుపట్టు నొక్కొక్కవస్తువును గుఱించియుఁ బ్రతిమనుజుఁడును మఱియొక్కనితో 'ఇది నాకువలయును. ఇది నాకువలయు' నని మచ్చరికించుచుండును. ఏవిధమునను రాజునకు రాజ్యలాభముతో సమమయిన దొక్కటియు లేదు. బ్రజలకు సాధారణకాలములందు బరువయిన పన్నులు

విధించి పీడించుట రాజున కెంతయు నధర్మము. అది మఱియొక (గూపద) కాలమందు వేఱగును (ధర్మమగును). కొందఱు దాన ములచేతను యజ్ఞములచేతను, మఱికొందఱు బుద్ధిచేతను సామర్థ్యముచేతను ధనమును సంతరింతురు. ధనము లేనివానిని దుర్బలుఁ డందురు. ధనముగలవాఁడు బలవంతుఁడగును ధనముగల వాని కన్నియుఁ బడయఁగూడును. బొక్కసము చక్కఁగా నిండి యున్న రాజు, సమస్తమును జయించును. బొక్కసమువలన ధర్మమును, గామమును, బరలోకమును, నిహలోకమును నన్నిటిని ధర్మంబునఁ బడయవచ్చును. అయినను బొక్కసమును, ధర్మమును మున్నిడికొనియే నింపవలయునుగాని, యాపత్కాలములందు ధర్మములగు నధర్మములు దప్పఁ దక్కిన యధర్మములచే నింపరాదు' అనెను. ఇది నూటముప్పదియవయధ్యాయము.

* రాజధర్మపర్వము సమాప్తము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు రాజాపదయందు సర్వస్వమును బరిత్యజించి యైనఁ దన్ను రక్షించుకొనవలయునని చెప్పుట.

ధర్మరాజు—'భారతా! క్షీణించినవాఁడును, సోమరియును, బంధువులు నశింతురనుభయమున యుద్ధమునకు రానివాఁడును,

---

* ఉదీచ్యకోశములందు రాజధర్మపర్వమునకు రాజధర్మానుశాసన పర్వమని నామాంతరము.

ఎప్పుడును ముఖ్యులయందు సందేహపడుచునే యుండువాఁడును, మంత్రముల గావనేరనివాఁడును నగురాజునకు, నింతవఱకుఁ జెప్పినదికాక మఱియుఁ జేయవలసిన దేమియున్నది? మఱియుఁ దనరాజ్యమును బురజనులను శత్రువులు పంచుకొన్నట్టి వాఁడును, ధనసమూహము గోలుపోయినవాఁడును, దారిద్ర్యము వలన మిత్రులను గారవింప లేనివాఁడును, సర్వవిధముల భిన్నులయినమంత్రులు గలవాఁడును, శత్రుసేనలచే నెదిరింపఁబడినవాఁడును, దుర్బలుఁడును, బలవంతుఁ డగు శత్రువులచే మనస్సు గలంపఁబడినవాఁడును నగు రాజునకు మఱియు నేమి చేయఁదగియున్నది? దానిని జెప్పవలయు'నని యడిగెను. భీష్ముఁడు 'దండెత్తివచ్చిన శత్రువు పరిశుద్ధమయిన మనస్సు గలిగి ధనమందేకాక ధర్మమందును గుశలుఁడుగా నుండునేని నీవు చెప్పినట్టిరాజు మునుముట్ట జాగుసేయక యతనితో సంధి చేసికొని ముందు వానిచే నాక్రమింపఁబడిన రాజ్యభాగములను విడిపించుకొనవలయును. అట్లు దండెత్తివచ్చినవాఁడు ధర్మంబున జయింపఁగోరినవాఁడును బలవంతుఁడును బాపమునందె పట్టుగలవాఁడునుగా నుండునేని యట్టివానితోను, దనరాజ్యమందలి కొన్నిగ్రామము లిచ్చియైనను సంధిచేసికొనవలయును. పయినెత్తి వచ్చినవాఁడు సంధికెంతమాత్రము సమ్మతింపఁడేని, రాజు, తనరాజధానినైనను విడిచియో లేక మఱియే యుపాయమును జేసియో యాపదను దాఁటుకొనవలయును. రాచఱికమునకుఁ దగినవాఁ డుసురుతోడ నుండినయెడల మరల నట్టి ధనములను సంపాదించుకొనవచ్చును. సంభవించిన యాపదలను బొక్కసమును బలమును దిగవిడిచినచోఁ దప్పించుకొనఁ గూడు

నేని, యప్పుడ సర్వధర్మములు దెలిసినవాఁడెవఁడా రెంటిని ద్యజింపక వానికంటె నెక్కుడయిన తన్నుఁ ద్యజించుకొనఁజూచును? * రాజు తన యంతఃపురపు వారిని బదిలముగాఁ గావఁజూడవలయును. వారు శత్రువు బారిం జిక్కరేని వారికొఱకై (తన్నుఁ జిక్కించుకొనియైన విడిపింపవలయునని) దయచూపరాదు. రాజు తనకు శక్యమయినంతవఱకుఁ దన్ను శత్రువునకుఁ బట్టియిచ్చుకొనరాదు' అనెను.

ధర్మరాజు 'తనమంత్రులు మొదలయినవారు తనయెడఁ గోపముగొనియుండఁగా బయటనుండియెత్తివచ్చినవారుతన్నుఁ బీడింపఁగా, తనబొక్కసము క్షీణింపఁగా, తనమంత్ర రహస్యములు బయలుపడఁగా, నపు డట్టిరా జేమి చేయవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'రా జట్టి సందర్భములందు (శత్రువు ధర్మబుద్ధి గలవాఁడేని) వేగిరముగా సంధిచేసికొనవలయును; (అధర్మబుద్ధిగలవాఁడేని) వేగముగాఁ దీవ్రమయిన పరాక్రమము నెఱపవలయును. పరాక్రమము నెఱపినచో వేగముగాఁ బగవాఁడు పరువిడును. లేక వానిచేత యుద్ధమున మరణము గలుగునేని దానిచేతఁ బరలోకముగలదు. రాజు తనసేన యల్పమయినను నది తనయెడ భక్తియు సంతుష్టియు బుష్టియుఁ గలిగినదై యుండునేని, దానిచేతనే భూమిని జయించును; చంపఁబడియైనను స్వర్గమును జయించును; పగవారిని జంపియైనను సుఖమును బడయును. యుద్ధమునందుఁ బ్రాణములను విడుచువాఁ డింద్రుని

* 'అవరోధాఞ్జుగుప్సేత' యనిమూలము. 'అపరాధాఞ్జుగుప్సేత' యని దాక్షిణాత్యకోశము. ఇదియొంతియు నప్రాకరణికముగా నుండుట తెలియునది.

తోడి సాలోక్యమును బడయునుగదా. *[యుద్ధమూని శాంతతను బొందుటకై సకలజనులు తెలియునట్టి మార్గము గావించి నమ్మికగలిగించి యడఁకువగలిగి యుండవలయును. (అడఁకువ తెలుపుటకు) పాదరక్షలనేని విడిచి పుచ్చవలయును. వేగముగా బయటవెడలిపోవఁ గోరువాఁడుతన సైన్యమును మంచిమాటలచే సమాధానపఱిచి దేశాంతరమునకుఁ బోయినపిదప నాలోచించి పిదపఁ దాను వలయుదాని నుపక్రమింపవలయును]' అనెను.
ఇది నూటముప్పదియొకఁడవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

{ భీష్ముఁడు రాజు దుష్టులనుండి ధనము నాక్రమించి యైన నాపదనొందిన బ్రాహ్మణులను రక్షింపవలయు ననుట. }

ధర్మరాజు- 'పితామహా! సమస్తప్రజలకును గోరందగినదియు రాచఱికమునకు మిక్కిలి ముఖ్యమయినదియు నగు ధర్మము కొఱవడఁగా, భూమియందు జీవనమంతయు దొంగల పాలు కాఁగా, నిట్టి చెడుకాలము వచ్చినపుడు బ్రాహ్మణుఁడు, నెయ్యమునను గనికరమునను దనపుత్రపౌత్రులను విడువఁజాలక దేనిని గొని జీవింపఁగలఁడు?' అని యడిగెను.

భీష్ముఁడు—'అటువంటి సమయము వచ్చునపుడు తెలివి బలిమి నూఁది బ్రతుకవలయును. లోకమునందుఁ గనుపట్టు సమస్త వస్తువులును సాధుజనులకే యగును. అసాధువుల కొక్కటియు

* ఈకుండలీకరణములోనిది ప్రతాపచంద్రరాయలపాఠమున లేదు.

నిందుఁ గలుగదు. ఎవఁడు ప్రాప్తికిఁ దన్ను సాధనముగాఁ జేసి కొని యసాధులకడ నున్నధనమును దీసి సాధువుల కిచ్చునో వాఁ * డాపద్ధర్మములను దెలిసినవాఁడగును. రాజా ! రాజు తన రాచటికమును జరుపఁగోరినవాఁడై తన ప్రజలకుఁ గోపముకలిగింపకయుఁ, గలహింపఁజేయకయు, సొంత కాఁపు ధనమును దానై యియ్యకపోయినను దానిని 'తమ్ముని ధనమునాఁది' యని మెలపునఁ దీసికొనవచ్చును. ఒకఁడు జ్ఞానముచేతను,బలిమిచేతను బరిశుద్ధుఁడై తక్కిన సమయములందుఁ జక్కని నడవడి నడవఁ దెలిసినవాఁడగు ప్రాజ్ఞుండగునేని యట్టివాఁ డాపత్కాలమందు నిందితములయిన కార్యములందుఁ బ్రవర్తించుచున్నను నతని నిందు నిందించుట కెవఁడు తగును ? ఎవఁడును దగఁడు. యుధిష్ఠిరా ! ఎవరు తమబలిమి నెఱపియె బ్రతుకు గావించు కొను చుందురో యట్టివారికి వేఱువిధమున జీవించుట రుచింపదు. బలవంతులగువారు తేజముతోనే ప్రవర్తింతురు. ఆపత్తున కగుశాస్త్రమిట్లు సామాన్యముగా రా జనుష్ఠింపవలయును. మఱియు నతఁడు మేధావియు నగునేని యాపదలయందీశాస్త్రము చెప్పి ననే కాక యింతకంటె † నెక్కువగాను నడచుకొనవచ్చును.

---

* 'ఆపద్ధర్మవిత్' అనిమూలము. 'ఆపద్ధర్మకృత్' అని దా. మూలము. ఆపద్ధర్మముల ననుష్ఠించువాఁ డనుట.

† సామాన్యముగా రా జాపత్సమయములందు జనులపయిని బరువయిన పన్నులు విధించి బొక్కసము నాపద్ధర్మశాస్త్రము చెప్పిన నించుకొనును. అతఁడు బుద్ధిమంతుఁడు నగునేని యాశాస్త్రము చెప్పిననే యందఱకును బన్నులు విధించుటను విడిచి యపరాధులు నితర దేశజనులు దుష్టులు మొదలగు వారికి దండుగలు విధించి తక్కిన ప్రజల నొప్పింపకయే బొక్కసము నించునని భావము.

సత్కృతులును బూజితులునగు ఋత్విజులును బురోహితులును నాచార్యులునగు బ్రాహ్మణులును (మిక్కిలిగా ధనముగలవారలై యున్నను) వారిని ధనమునకుఁ గాను బీడింపరాదు. పీడించినచో దోషములొందును. ఈ శాస్త్రము లోకమునకుఁ బ్రమాణము. ఇది సనాతనమయిన చూపు. దీనిని బ్రమాణముగాఁ గొని మంచిదో చెడ్డదియో దీని చొప్పున నడచుకొనవలయును. గ్రామమందుండు మనుష్యులు పెక్కుండ్రొకరిపై నొకరు దోషములు చెప్పుదురు. రాజు వారలవచనములను విని సత్కారము చేయుటగాని పీడించుటగాని తగదు. అపవాదపు మాట లేవిధమునను బలుకఁదగదు; విననుఁ దగదు. అపవాదము లాడుచోటఁ జెవులను మూసి కొనవలయును. లేక యచ్చటనుండి మఱియొకచోటికేనియుఁ బోవలయును. అపవాదములాడుటయుఁ గొండెము చెప్పుటయు సాధువుల స్వభావముగాదు. యుధిష్ఠిరా! సాధువు లెప్పుడును గుణములనే మెత్తి చెప్పుదురు. మంచి స్వభావము గలిగి చెప్పినట్లు లోపడునవియును జక్కఁగా బనుపడినవియు బరువు లెస్సగా మోయునవియు నగు కవయెద్దులు, కాఁడికి మెడనిచ్చి బరువును మనఃపూర్వకముగా నీడ్చునట్లు, రాజును నాపదలందుఁ గష్టభరములను సైఁపవలయును. రాజు తానట్టి సమయములం దెట్లుండినఁ బెక్కుండ్రు సహాయులు చేరుదురో యట్లు నడచుకొన వలయును. ఆచారమునే ధర్మమునకు గొప్పలక్షణమనికొందఱు చెప్పెదరు.*శంఖలిఖితునిధర్మమందుఁ

---

* ఇక్కడ భావమేమనఁగాఁ గొందఱు ఋత్విజులను బ్రాహ్మణులను దండించుటయుఁ బన్ను విధించుటయుఁ దగదందురు. ఇది సనాతనమైన యాచారముగాన నీతియేయగును. వేఱుకొందఱు శంఖుఁడు లిఖితునియెడ నడ

బ్రీతిగలమఱికొందఱు ఋత్విజులు మొదలయినవారు తప్పుచేసినను ధనము నపహరించుకొనుదండము తగ దనెడియా ధర్మమును నెంత మాత్రమునొల్లరు. వారట్టు లాధర్మము నొల్లమనుట మచ్చరముచేతను గాదు, లోభముచేతను గాదు. గొప్ప ఋషులును. ధర్మవిరుద్ధముగా నడచినచో గురువయినను దండింపవలయునని విధించుట కనఁబడుచున్నది. అయిన నీఋషుల వచనమునకు ననుగుణమయిన ప్రమాణ మొక్కటియు నొక్కచోటను గానఁబడకున్నది. అట్టి మనుష్యులు బ్రాహ్మణాదులు, నీచులై దుష్కర్మము లాచరింతురేని దేవతలే వారిని దండింప విడువవలయును. నెపము పన్ని ధనము సంపాదించువాఁడు ధర్మమును బోఁగొట్టుకొనును. సత్పురుషులచేతను సంపన్నులచేతను బూజింపఁదగినదియు, దనమనసునకుఁ దృప్తికరమగునదియు నగు ధర్మమేదియో దానినే పూనవలయును. ఎవఁడు * నాలుగు గుణములతోను గూడినట్టి ధర్మమును దెలియుఁడో వాఁడు ధర్మవిదుఁడు. సర్పమునడుగువలెనే ధర్మము కారణములును దెలియుటకష్టము. వేఁటకాఁడు తన బాణము గాఁడినమృగము పోయినదారిని నేలమీఁద దానియడుగు నెత్తురుపడిన పట్టులను

చుకొన్న ధర్మమునే యభినందించువారై యీ మతమునొల్లక యెట్టివానినైనను దండింపవలయునందురు. ఇట్లనుటకు వీరియందు మచ్చరముగాని లోభముగాని కారణముగాదు. మొదటివారివలెనే వీరును ధార్మికబుద్ధులే యగుదురని భీష్ముని యభిప్రాయము దెలియునది. ఈరెండవతెగవారు ఋత్విజులను బ్రాహ్మణులను సైతము దండింపవలయు నందురు. (ప్రతాపచంద్రరాయలు.)

* నాలుగు గుణములనఁగా శ్రుతి, స్మృతి, ఆచారము, తనమనస్సు లేక. వేదము, తర్కశాస్త్రము, కృషిశాస్త్రము, దండనీతియనెడి యీ నాలుగు.

బట్టి తెలిసికొనునట్లు ధర్మముచొప్పులను దెలిసికొనవలయును. యుధిష్ఠిరా ! ఇట్లే మనుజుఁడు సత్పురుషులు తొక్కినమార్గమును వినయమునఁ ద్రొక్కవలయును. ఇదియె తొంటిరాజర్షుల వృత్తి. నీవు నిట్లె నడువుము" అనెను. ఇది నూటముప్పదిరెండవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

(భీష్ముఁడు రాజేవిధమునను బొక్కసమును బెంపవలయు ననియు, దొంగలు నాపదలయందు ధనమునంతయుఁదోఁచుకొనక కొంతమిగిల్చి తక్కినవాని నపహరింపవలయుననియుఁ జెప్పుట.)

భీష్ముఁడు—'రాజు తనరాజ్యమువలననుండియుఁ బరరాష్ట్రమువలననుండియు ధనముగడించి బొక్కసము గలిగించు కొనవలయును. బొక్కసమువలననే ధర్మము పెరుఁగుచున్నది. బొక్కసమువలననే రాజ్యమునకు మూలములు పెరుగుచున్నవి. కాఁబట్టి బొక్కసమును గలిగించుకొనవలయును. దాని నట్లు కలిగించుకొన్నపిదప (రిత్తవెచ్చములపాలుపుచ్చక) యెచ్చరికతో గారామునఁ బాలింపవలయును. అట్లురక్షించి జగమునకు నుపకారము చేయవలయును. ఇది సనాతనమైన ధర్మము. అట్టి బొక్కసము పరిశుద్ధ మయినభావముచేతఁగాని లేక క్రూరత్వముచేతఁగాని నింపఁదరముగాదు. ఈ రెంటికి నడిమిపదము నూఁది కోశమును జేర్పవలయును. బలహీనుఁ డగువానికి బొక్కసమెక్కడిది ? ధనములేనివానికి బలమెక్కడిది ? బలములేనివానికి రాజ్య

మెక్కడిది ? రాజ్యములేనివానికి సిరియెట్లుకలుగును ? గొప్ప పదవి నొందినవానికి సంపద చెడుట మరణమునకు సాటియగును. కాఁబట్టి రాజు బొక్కసమును బలమును మిత్రులను బెంపవలయును. బొక్కసములేని రాజును మనుజు లవమానింతురు. వాఁడిచ్చుకొంచెమునకు దనివినొందక వానిపనులయం దుత్సాహమెంతమాత్రమును గలిగియుండరు. రాజు తనసంపదనుబట్టి యెంతయు గొప్పగౌరవమును బొందును. పడఁతి గుహ్యభాగములను బుట్టము గప్పిపుచ్చునట్లు రాజుపాపములను సంపద గప్పిపుచ్చును. రాజు ముందెవ్వరితోఁ గలహించెనో వారందఱు నతని క్రొత్తసంపదకు ననుతాపపడుదురు. వారు కుక్కలవలె మరల నతనిక్రిందఁ గొలువుగయికొందురు.అయినను వా రతనిని జంపుటకు సమయమునే యెదురుచూచుచున్నను, రాజేమియుఁ గలుగనట్టు లట్టివారిని గయికొని యుండును. భారతా ! అట్టి రాజునకు సుఖమెక్కడిది ? రాజు పయిపయిని బోవుటకే పాటు పడవలయును; గాని యెప్పుడును గీడ్పడరాదు. ఉద్యమమే పౌరుషము. * కణుపులేనిచోట విఱుగనైనవచ్చును గాని యొక్కరికిని వంగరాదు. అతఁ డడవులకేనియుఁ బోయియుండి మృగసమూహములతోఁగూడఁ జరింపవచ్చును. కాని మేరలనుగడచి దొంగలవంటివారయిన మంత్రులు మొదలయినవారితోఁ గూడి మాడి యుండరాదు. భారతా. అడవియందలి దొంగలకుసయితము

* 'అప్యపర్వణి భజ్యేత న సమేతేహ కస్యచిత్' అని మూలము. ఇది వెదురు మొదలయినవి, కణుపులందు విఱుగునవి గాక తక్కినపట్టుల విఱుగుటను ననుసంధించి చెప్పినది. ,అనఁగా ప్రతికూలమయిన తటిని నశింపనయిన వచ్చునుగాని యొక్కరికిని లొంగిపోవరాదని భావము.

బెట్టిదము లయినకార్యములుచేయుటకు సేనల సమకూర్చి యిచ్చుట సులభము. రాజొక్కఁడె పెట్టు మర్యాదలనెల్ల నతిక్రమించునేని జనులందఱును నతనియెడల భయమునొందుదురు. దయయనునది యిట్టిదని తెలియకుండుదొంగలునయిత మిట్టిరాజునకు నెంతయు జంకుదురు. ఈకారణమునుబట్టి రాజెప్పుడును జనులమనసులను నుల్లసిలంజేయుటకు మర్యాదలను గట్టుపాటులను స్థాపింపవలయును. మిక్కిలి యల్పములయిన వ్యవహారములందును మర్యాదయొకటి యుండినయెడ,నది యించుకయినను, జనులు దానినెంతయు గారవింతురు. ఈలోకమే లేదనియుఁ బరలోకమును గల్లయనియు నిశ్చయముగలవారును గలరు. ఇట్టి నాస్తికుఁ డగువానిని, వానిమనను రహస్యముగా జంకుగొంకులచేతఁ గలఁగినట్టిదయినను, దా నెంతమాత్రమునమ్మరాదు. అడవియందలి దొంగలు తక్కిన యొప్పిదములు గలిగియుండి పరులధనముల నపహరించుటమాత్రము గావింతురేనియు నట్టి యపహారములను సహింపఁగాఁ దలంపవలయును. దొంగలట్టి కట్టుపాట్లనుసరించుటవలన వేలకొలఁది ప్రాణులు రక్షితములగుచున్నవి. యుద్ధము సేయక పాఱిపోవుచున్న శత్రువును జంపుటయు, పరభార్యలను జెఱుపుటయు, చేసినమేలు మఱచుటయు, బ్రాహ్మణధనమును బుచ్చుకొనుటయు, ఒకని ధనమంతయు మిగతలేకుండు నట్లుగా దోఁచుకొనుటయు,కన్యల నపహరించుటయు,గ్రామములకును బట్టనములకును బోయి వాని యెడయండ్లవలె నెడతెగక నాక్రమించుకొని యుండుటయు ననునివి దొంగలకు నయితము దోషములేయగును; కాఁబట్టి దొంగలును వాని నెప్పుడు మానియుండవలయును. రాజులు దొంగలతో

సంధిచేసికొని వారికిఁ దమయందు నమ్మికగలిగించు కొనుచు లేని యట్టిరా జాదొంగలలోపలి వెలుపలివెల్లఁ గనుఁగొని వాని నిర్మూలము సేయుదురనుట నిశ్చయము. ఈ కారణమును బట్టి రాజు దొంగలతో వ్యవహరించునపుడు వారిని నిశ్శేషముగా నాశముసేయరాదు. వారిని దనయేలుబడికి లోఁకువ గావించు కొనఁ జూడవలయును. రాజు తాను వారికంటె బలవంతుఁడనని తలఁచి వారియెడఁ గ్రూరకార్యములు గావింపరాదు. ఏ రాజులు వారిని నిశ్శేషులఁ గావింపరో యారాజులకుఁ దాము నిశ్శేషుల మగుదుమని భయముగలుగదు. అయినను వారిని నిశ్శేషులఁ జేయువార లట్లు చేసినందుల కెప్పుడును భయము గలిగి యుండవలసి వచ్చును. ఇది నూటముప్పదిమూఁడవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

{ భీష్ముఁడు బలమును బొగడుట. పాపమునకుఁ బరిహారోపాయములను జెప్పుట. }

భీష్ముఁడు—‘ఈవిషయమై పురాతనమైన యీయితిహాసము నుదాహరించుచున్నారు. ఈవిషయమునఁ బురావిదులగువారు కామందకముని చెప్పిన వచనమును జెప్పెదరు. అదియే దనఁగా- ఎఱుకగల క్షత్రియునకు ధర్మార్థములు రెండును బ్రత్యక్షములే (అనఁగా బ్రత్యక్షధర్మములే) యనుటయే. వాని కతఁడు * ధర్మమునుగుఱించిన సూక్ష్మవాదములచేతను, బరలోకము పరోక్ష

---

* ‘పరోక్ష ధర్మబోధనా’ అని దా. మూలము. ధర్మోపదేశము పరోక్షమయినదని యర్థము.

మయి యుండుటంబట్టియు విఘాతము చేయరాదు. భూమి యందు నడుగు *ముద్రలను జూచినంత నే యవి యో(డేలియడుగు లో కావో యని విచారించుట యెట్లో యట్లె యొకటి ధర్మమా యధర్మమాయని విచారము సేయుట యెల్ల నిష్ఫలమే. ఈలోక మున నెవ(డుగాని యెప్పుడేనియు ధర్మఫలమునుగాని యధర్మఫ లమునుగాని చూచినవా(డు లే(డు. కా(బట్టి క్షత్రియు(డు బల మునే పడయ(జూడవలయును. బలముగలవానికే యన్నియు వశ మందుండును. సంపదవలన బలము (సైన్యము) గలుగును. బల మువలన నమాత్యులు గలుగుదురు. ధనములేనివా(డు పతి తు(డు. అల్పనుంతయు నెంగిలి వంటిది. బలవంతు(డు పెక్కులు కార్యములు చేసినను వానివలని భయమున వానిని నెవ్వ(డే మియు(జేయ(డు. ధర్మమును బలమును సత్యముతో(గూడి యుండునేని యవి పెనుభయమునుండి రక్షించును. అయిన నా రెంటిని బోల్చిచూడ(గా ధర్మమునకంటె బలమే యెక్కుడని తో(చుచున్నది. బలమువలననుండియే ధర్మము ప్రవర్తించు చున్నది. జంగమములెల్ల భూమియందు నెలకొనియున్నట్లు ధర్మము బలమునందు నెలకొనియుండును. పొగ గాడ్పునకు వశమై యుండునట్లు బలమును ధర్మ మనువర్తించుచుండును. ధర్మము తనంతట నియంత గానందున(దీగ మ్రా(కునుంబోలె బలము నాశ్రయించియుండును. భోగవంతులకు సుఖము వశమై యుండునట్లు బలవంతులకు ధర్మము లోనై యుండును. బలవం తుల కసాధ్య మెద్దియు లేదు. అన్నిటిని బలవంతు(డు జయిం

---

* 'యథావృకపదం తథా' అని మూలము. 'యథావృత్తేఫలంతథా' అని దాక్షిణాత్యమూలము. ఇది యంతగా(బొస(గినది గాదు.

చును. బలములేనివాఁడు, దురాచారములను గావించుట వలనఁ దప్పించుకొనలేఁడు. జనులందఱును నట్టివానియెడలఁ దోఁడేలు పట్టింబోలె భయపడుదురు. ధనముదూలినవాఁ డవమానము నొంది దుఃఖంపుబ్రతుకు బ్రతుకును. అవమానముతోఁ గూడిన బ్రతుకు మరణమువంటిదే యగును. ఒకఁడు తనపాపంపునడవడి చేతఁదనకువలయువారందఱును దిగవిడుతురేని, వాఁడితరులమాట లనెడిశల్యములు గ్రుచ్చుకొనఁగా మిక్కిలియు దుఃఖమునఁ బొక్కుచుండునని ప్రాజ్ఞులు చెప్పెదరు. ఆచార్యులగు 'వారొక పాపముచేసినయెడల నందులకు విముక్తిగలుగుకొఱకు మూఁడువేదముల నధిగమింపవలయును. ద్విజుల నుపాసింపవలయును. మనుష్యులను దియ్యని పలుకులచేతను, గార్యములచేతను సంతోషపఱుపవలయును. మఱియు గొప్ప మనస్సు గలవాఁడయ్యు గొప్పకులమునఁ బెండ్లాడవలయును. తనదోషములను జెప్పికొనుచుఁ బరుల గుణములనే కీర్తించుచుండవలయును. స్నానాచమనాదులయిన యుదకకార్యములం దాసక్తుఁడై మంత్రముల జపింపవలయును. మృదువయిన స్వభావముగలిగి మిక్కిలియు మాటాడరాదు. మిక్కిలి దుష్కరములయిన (తపములు)సలుపవలయును. బ్రాహ్మణులను క్షత్రియులను నండ గొనవలయును'- అని చెప్పెదరు. పెక్కులు పాపము లాచరించినవాఁడు జనులు తన్నెంత దూషణము లాడుచుండినను వానినెల్ల సరకుసేయక యిప్పుడు చెప్పిన యాచారము లెల్లఁ గయికొనవలయును. ఇట్లు చేయుటవలన నొకఁడు శీఘ్రముగాఁ బాపములను వీడి లోకము వారి యెన్నికకెక్కును.సుఖముగా ధనము ననుభవింపనేర్చును. మంచినడవడి నెప్పుడును రక్షించుకొనవలయును.లోకమునందుఁ

బూజ్యతయును నిహమందును బరమందును మహాఫలమును బొందును. ఇది నూటముప్పదినాలుగవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁడు దొంగగానుండినను శాస్త్రమర్యాద ననుసరించియుండువాఁడు పరలోకమును బొందునని నిరూపించుటకు కాపవ్యచరిత్రమును జెప్పుట.

భీష్ముఁడు—దొంగ మర్యాదతోఁ గూడినవాఁడై యుండి నచో దొంగతనముచేత సిద్ధి నొందునను విషయమునఁ బురాతనమయిన యీ యితిహాసము నుదాహరించెదరు. *'కాపచ్యుఁడని యొక దొంగయుండెను. వాఁడు క్షత్రియునకు నొకనిషాదియందు (బోయెతయందుఁ) బుట్టినవాఁడు. వాఁడు క్షత్రియధర్మములనే యాచరించుచుండెను వాఁడు గొట్టుటందు సమర్థుఁడును, మతిమంతుఁడును, శూరుఁడును, జదువరియు నై క్రూరత్వము లేకుండెను. వాఁడు బ్రాహ్మణులకుఁ దత్పరుఁడై, పెద్దలను బూజించుచు నుండెను. వాఁ డాశ్రమములందలి ఋషులధర్మమును రక్షించుచుండెను. వాఁడు దొంగగానుండినను సిద్ధిని బొందిన వాఁ డయ్యెను. వాఁ డడవియందు రేపును మాపును జింకకదుపులను వేఁటాడి కోపము రేపుచుండును. వాఁడు బోయవాండ్రు మృగసమూహములను వేఁటాడుటకై పచరించు విధులన్నియుఁ దెలియును. బోయలందు వాఁడు సమర్థుఁడు. వానికి నడవియందుఁగల ప్రదేశములన్నియుఁ జక్కఁగాఁ దెలియును.

* కాయవ్యుఁడని యుత్తరకోశములం దెల్లఁ జూపట్టుచున్నది.

వాఁ డెప్పుడును బారియాత్రమను పర్వతమున సంచరించుచుం డును. వానికి సమస్తజాతుల ధర్మములును దెలియును. వాని బాణములు వాడులై యాయుధము లుఱిదియై యొప్పుచుం డును. వాఁడు తానొక్కఁడె పెక్కువందలసేనలను జయించెను. వాఁడు పేరడవియందు ముదుసండ్లయినకన్నతలిదండ్రులను బూజించియు మధుమాంసములచేతను ఫలములచేతను బలువి ధములయిన యన్నములచేతను మరియాదతోడఁ గుడువఁబెట్టు చుఁ జక్కఁగా వారికి శుశ్రూష సేయుచువచ్చెను. అరణ్య మునందు సన్న్యాసు లగుబ్రాహ్మణులను రక్షించుకొనుచు నెప్పు డును వనములందలి మృగములను గొట్టుచు వారలకుఁ బంపుచు వచ్చెను. దొంగపెట్టుభోజనమని శంకించి వానివలన నది పుచ్చు కొనని వారి యిండ్లయందు వాఁడు వెండలకడనే మాంసములను బెట్టిపోవును. నిర్దయులై వర్తించు దొంగలయందు మేర మీఱిన వారు పెక్కువేలమంది వానిని గ్రామాధిపతిగా వరించుకొనిరి. దొంగలు వానితో 'నీవు దేశకాలములు చక్కఁగా నెఱుంగు దువు, ముహూర్తములను దెలియుదువు, మంచి తెలివిగలవాఁ డవు, శూరుండవు, స్థిరమయిన వ్రతముగలవాఁడవు. కాఁబట్టి నీవు మాయందఱకు సమ్మతుండును ముఖ్యుండు నగు గ్రామాధి పతిగా నుండుము. నీవు చెప్పినట్లెల్ల మేము చేసెదము.తల్లియుఁ దండ్రియుంబోలె నీవు మమ్ము న్యాయంబున రక్షింపుము' అని చెప్పిరి.

కాపచ్యుఁడు వారితో— 'మీరు స్త్రీలను భయపడినవా రిని, బిడ్డలను, దపస్వులను, జంపరాదు. యుద్ధమునకు రానివా నిని వధింపరాదు. స్త్రీలను బలవంతముగా నపహరింపరాదు.

సమస్తప్రాణులందును స్త్రీని నెవ్విధమునను జంపరాదని తెలియుఁడు. గోవులకును బ్రాహ్మణులకును నెప్పుడును క్షేమమునే చింతించుచుండవలయును. అందులకొఱకు యుద్ధమును జేయను జేయవలయును. వైరులను నాశము సేయరాదు. దేవతలును పితరులును నతిథులును బూజితులగు వివాహాది శుభకార్యములకు విఘ్నములు సేయరాదు. సమస్తప్రాణులందు బ్రాహ్మణుఁడధికుఁడుగాన యతనిని మీకొల్లలనుండి విడిచిపుచ్చవలయును. ఆబ్రాహ్మణులకుఁ బూజసేయవలయును. వారలకు మీకుఁగలయంతయు నిచ్చియును సత్కరింపవలయును. ఈ బ్రాహ్మణులెవనియెడఁ మిక్కిలి కుపితులగుదురో, యెవని కవమానము గలుగఁగోరుదురో, వానికి మూఁడులోకములందును వారినుండి రక్షించువాఁడు గలుగఁడు. ఎవఁడు బ్రాహ్మణులను నవమానించుచున్నాఁడో, మఱి వారలకు నాశమును గోరుచున్నాఁడో వానికి,సూర్యోదయమునఁ జీకటికింబోలె నాశము సిద్ధము. మీరందఱు నిచ్చటనే వసించియుండి మీశౌర్యములకు ఫలములందవచ్చును. ఎవరు మనకు నీయవలసినదాని నియ్యరో వారి కడకు సేనల నంపవలయునను. *దండము దుష్టులకొఱకే విధింపఁబడి యున్నది కాని, సొంతవృద్ధికొఱకుఁ గాదు. ఎవరు సాధువులను బాధింతురో వారిని వధించుట ధర్మమని చెప్పఁబడుచున్నది. ఎవరు కొందఱురాజ్యమును బీడించి తమకు వృద్ధిని గలిగించుకొందురో వారు పీనుఁగునుబట్టిన పురువులుంబోలె నారా

---

* 'శిష్ట్యర్థం విహితో దండో న వృద్ధ్యర్థం విధీయతే' అని మూలము. శిష్ట్యర్థం విహితో దండో నవధార్థం విధీయతే' అని దా. మూలము. వధముకొఱకుఁ గాదని యర్థము.

జ్యమందుఁ బాము హింసించినవారితోఁ గూడనే మరణింతురు. దొంగ లెవ రీలోకమందు ధర్మశాస్త్రముచొప్పున వర్తింతురో వారు దొంగలుగా నుండినను శీఘ్రముగా సిద్ధి నొందుదురు' అనెను. ఆదొంగలును గాపచ్యుని యాజ్ఞచొప్పుననే నడచుచు వచ్చిరి. అందఱును పాపములనుండి విరమించుటవలన వృద్ధి నొందిరి.దొంగలను పాపములనుండి యుడిపి సాధువులకు క్షేమముగావించినందునఁ గాపచ్యుఁడు గొప్పసిద్ధిని బొందెను.ఎవఁడు కాపచ్యుని యీకథను నెప్పుడును జింతించునో వాని కరణ్యము లందలి ప్రాణులవలన నుండియు నేవిధమునను భయముగలుగదు. వానికి మనుష్యులవలననుండియు భయము గలుగదు. మఱి యేవిధమునను దేవతలవలననుండియు భయముగలుగదు. సాధువుల వలననుండియు భయముగలుగదు. అట్టివాఁ డరణ్యమునకుఁ బోయినను రాజే. (అనఁగా రాజువలెనే సుఖంబుండును) ఇది నూటముప్పదియేనవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బొక్కసము వృద్ధి నేయుకొఱకు నేధన మపహరింపవచ్చునో యేదిగూడదో వివేచించుట.

భీష్ముఁడు:—పురాణవిదులు బొక్కసమును బుట్టించు విధమునుగుఱించి బ్రహ్మదేవుఁడు పాడినగీతములను జెప్పెదరు:— అవి యేవన—యజ్ఞశీలుఁడగువాని ధనమును దేవాలయపు ధనములను నపహరింపరాదు. క్షత్రియుఁడు యాగాదిక్రియలను జేయక దొంగలవలె నెన్నంబడు వారిధనములను నపహరింపఁ

దగును. క్షత్రియులకు నీలోకమందుఁగల ప్రజలు రక్షింపఁదగిన వారును జంపఁదగినవారు నగుదురు. ఈ లోకమందలి ధనము క్షత్రియునిదే; మఱొక్కనిది గాదు. ఆధన మాక్షత్రియునకు బలముకొఱకుఁగాని యజ్ఞముకొఱకుఁగాని కావలయును. భుజించుటకు నర్హ్యములుగాని చెట్లను జేమలను నఱికి కట్టియలుగాఁజేసికొని భుజింపఁదగినయన్నమును జనులు వండుకొందురు. (అట్లె రాజును దుష్టులను దండించి శిష్టులను బోషింపవలయును) ఎవఁడు దేవతలను బితరులను మనుష్యులను హవిస్సుచేత నారాధింపఁడో వానియొద్దఁ గలధనము నిరర్థకమని ధర్మవిదు లగువారు చెప్పెదరు. రాజా! ధార్మికుఁ డగురాజట్టివానిధనము నపహరించుకొనవచ్చును. అందువలన రాజు జనులకు సంతోషము గలిగింపఁ డనుట గలుగదు. జనులు నందులకై రాజును నిందింపరు. ఏరాజు తన్ను సాధువులు ధనమును బడయుటకు సాధనము గావించికొని యసాధువులనుండి సాధువులకు ధనమును దీసియిచ్చునో యతఁడే ధర్మమును దెలిసినవాఁడు. భూమిని భేదించుకొనివచ్చు శాకవస్తువులను నజ్రియను క్రిములును నెట్లు పయింబయిఁ దమంతట మిక్కిలియుఁ బెరుఁగునో యట్లె రాజును దనశక్తికొలఁదిని గర్మములాచరించి పయింపయిఁ బుణ్యలోకములను దనంతట జయించుకొనుచుండును. చెదపురుగు లేనిమిత్తములేకయే కలుగునట్లు * యజ్ఞములు

* అనఁగా యజ్ఞములకు మిక్కిలి ధనముండుటంబట్టి కాకయుద్దేశమును బట్టియె కలుగును. ఉద్దేశముండినచో ధనము గూడునని యుఁ బిదప యజ్ఞములు జరుగుననియు భావము. ఇందులకుఁ జెదపురుగు లేకారణము లేక పుట్టి పెరుఁగుట దృష్టాంతము (ప్రతాప).

నేనిమి త్తము నంతగా లేకయె కలుగును. అడవి యీఁగలును, దోమలును, జీమలును, బురుగులును, నెట్లు పశువులనుండి వానినిపాలుపిదుకునపుడు తొలఁగఁబుత్తురో యట్లె యజ్ఞములకుఁ గూర్పని వారినందఱను రాజ్యమునుండి తొలఁగింపవలయును. ఇట్లే ధర్మము విధింపఁబడియున్నది. భూమియందలి దుమ్మును రెండుఱాలనడుమ నిడి మఱియుఁ బొడి గావింపఁగాఁ బయింబయి మఱింత సన్నని నగునట్లు ధర్మవిషయములను బయింబయి విచారించుకొలఁదిని మఱిమఱి సూక్ష్మము లగుచున్నవి. ఇది నూటముప్పదియాఱవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు రానున్నయాపదను బోఁగొట్టునుపాయము మును మునుపే చేసికొనవలయునని రూపించుటకై మత్స్యోపాఖ్యానమును జెప్పుట.

భీష్ముఁడు:— మీఁదటిదానికి మునుపే సమకట్టువాఁడును, (అనాగతవిధాతయు) అప్పటికిఁ దగుబుద్ధి స్ఫురించువాఁడు (ప్రత్యుత్పన్నమతియు) ననెడి యీయిరువురును సుఖముగా వర్ధిలుదురు. దీర్ఘసూత్రుఁడు (జాగుసేయువాఁడు) నశించును. ఈ విషయమై చేయఁదగినదియు చేయరానిదియునను వీని నిర్ణయించుటకై దీర్ఘసూత్రునిగుఱించి యుత్తమమయిన యీయాఖ్యానమును దొట్రుపడక వినుము. కౌంతేయా 'మిక్కిలి లోఁతుగాని యొక కొలనియందుఁ జేఁపలు పెక్కులుండెను. అందు మూఁడు బేడిసలును జేఁపలు నుబరస్పరము చెలిమి గలిగి యొండొంటినిగూడి చరించుచుండెను. ఈ మూఁటి యందొకటి

యప్పటికిఁ దగినవెరవు తోడనే తెలిసికొని చేయునట్టిది ; మఱి యొకటి దవ్వులంజూచి రాఁగలదానికి ముందుగా సమకట్టుకొనునది; మూఁడవది దీర్ఘసూత్రమయినది. పిదప నొకప్పుడు చేఁపలను బట్టువారు (జాలరులు) నలుప్రక్కలను బలుదారుల మూలమునఁ గొలకులోని నీరు క్రిందుగానున్న పల్లములకు వడియ విడిచిరి. అప్పుడా కొలనియందు నీరు రాను రాను దగ్గుచుండుటను జూచి భయముకలుగఁగా దీర్ఘదర్శియగుటచేతఁ దక్కినయిద్దఱు సుహృదు లగు చేఁపలనుజూచి 'నీటియందు వసించువానికెల్ల నీయాపద దాపరించినది. దారి యరికట్టుటకుమును పే వేగముగా మఱొకచోటికిఁ బోవుదము. ఎవఁడు రానున్న యనర్థమును మంచినీతులవలన వారించుకొనునో వాఁడెప్పుడును సంశయము నొందఁడు. కాఁబట్టి మఱొకచోటికిఁబోవుదము' అనెను. అందు దీర్ఘసూత్రుఁడు 'ఇక్కడఁ జక్కఁగా వసించి యుండవచ్చును. అంతలోపలఁ దొందరపడ నక్కఱలేదని నాకు నిశ్చయముగాఁ దోఁచుచున్నది' అనెను. అంతఁ బ్రత్యుత్పన్నమతి యగు చేఁప దీర్ఘదర్శినిజూచి 'కాలమేదేని వచ్చినపుడు నాకేమియు నీతివెరవు కొఱవడదు' అనెను. ఇట్లు తక్కినవి రెండును జెప్పఁగా మహా* మతి యగుదీర్ఘదర్శి తోడనే బయలుదేఱి యొకకాలువ వెల్లి

---

* 'యథావ్యాకస్త్వాద్భవతి భూమౌపాంసుర్వి లోలితః' తథైవేహ భవేద్ధర్మః సూక్ష్మః సూక్ష్మతరః స్మృతః' అని ఔత్తరాహమూలము. భూమౌ పాంసు తృణోపలక్ష' అని దాక్షిణాత్యపాఠము. ఇందులకు భూమియందు దుమ్మును బుల్లును గల్లును నేకారణమునులేక సూక్ష్మముగను నంతకంటెను సూక్ష్మముగను నుండునట్లె ఈలోకమందు ధర్మమును సూక్ష్మముగను సూక్ష్మతరముగను దనంతటనే యుండును' అని యర్థము.

మూలమున మిక్కిలియు లోఁతయిన యొకమడుఁగును బోయి చేరెను. పిదప జాలరు లాకొలని నీరువడసియుండుటను లెస్సఁగాఁ జూచి పెక్కులుపాయములచేతఁ జేఁపలనుబట్టఁదొడఁగిరి. జలము వడిసి యున్నయాకొలను గలఁపఁబడినపు డందున్న దీర్ఘసూత్రము తక్కినచేఁపలతోఁ గూడఁ బట్టువడినది. జాలరులు పెద్దత్రాటికిఁ దామపట్టు చేఁపలను గ్రుచ్చుచుండఁగాఁ బ్రత్యుత్పన్నమతి యగుచేఁపఁ యట్లు గ్రువ్వఁబడిన చేఁపలనడుమఁ జొచ్చి త్రాటిని బెనఁచుకొని తానును గ్రువ్వంబడినదియుంబోలె వారికిఁదోఁచునట్లు కదలక మెదలకుండెను. జాలరు లాచేఁపలన్నియును నాదారమునఁ గ్రువ్వఁబడియున్నవనియె తలఁచిరి. పిదప వారు మిక్కిలి జలములందు చేఁపలను గడుగునపుడు ప్రత్యుత్పన్నమతి యనుమీను దారమునువదలి విడివడి శీఘ్రమానీటిలోనికిఁ బోయెను. మందస్వభావమును గలిగియున్న దీర్ఘసూత్రము తెలివిమాలినమూఢము గనుక నింద్రియములు లేనివానివలె విడివడ నేరక నాశమొందెను. ఇట్లెవఁడు తెలివిమాలుటవలన ముఖ్యముగా దొరకొన్నసమయమును దెలియఁడో వాఁడు దీర్ఘసూత్ర మనుచేఁపవలె శీఘ్రముగా నాశమొందును. ఏమనుష్యుఁడు తాను సమర్థుఁ డను తలఁపున మొదటనే తనక్షేమమును జేసికొనకుండునో వాఁడు ప్రత్యుత్పన్నమతివలె సంశయస్థితి నొందును. కాఁబట్టి యనాగతవిధాతయుఁ బ్రత్యుత్పన్నమతియు నగు నిరువురును సుఖముగా వర్ధిలుదురు. దీర్ఘసూత్రుఁ డగువాడు నశించును. కాలమైనది లవము క్షణము కాష్ఠ కల ముహూర్తము పగలు రాత్రి పక్షము మాసము ఋతువులు సంవత్సరములు ననియును, దేశము, భూమి

యనియుఁ జెప్పఁబడుచున్నవి. ఆకాలమో కనఁబడుటలేదు. 'ఇష్ట మయినకార్యములు సిద్ధించువిషయమై యొకఁడు దేని నేరీతిని మనంబునఁ దలపోయునో యారీతినే యది యొనగూడుటయుఁ జెడుటయుఁ గలుగును. ధర్మశాస్త్రములందును మోక్షశాస్త్ర ములందును దేశమును గాలమును (లేక దీర్ఘదర్శిత్వమును బ్రత్యుత్పన్నమతిత్వమును) ముఖ్యములయినవిగా ఋషులుచెప్పి యున్నారు. మఱియుఁ గామశాస్త్రమందును మనుష్యు లీరెంటి నంగీకరించియున్నారు. ముందు పరీక్షించి యొకటి చేయువాఁ డును, ఒకటిసాధించుటకు వలయుయుక్తులు సేయువాఁడును, దలఁచినకార్యమును జక్కఁగా నొడఁగూర్చుకొందురు. దేశకాల ములను దెలిసిచేయువారును మునుపుచెప్పిన యిరువురకంటెను నెక్కుడుఫలమును బొందఁగలుగుదురు' అనెను. ఇది నూట ముప్పదియేడవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁ డాపదయందు శత్రువులోడ నైతము సంధి చేసికొనఁ దగునని రూపించుటకై పిల్లికిని నెలుకకును జరిగిన కథను జెప్పుట

ధర్మరాజు-'భరతసత్తమా! అనాగతములకు ముందుగా సమ కట్టుకొన్నబుద్ధియు, అప్పటికిఁదగిన వెరవుగాఁ బ్రత్యుత్పన్నమగు బుద్ధియు శ్రేష్ఠములయినవనియు,దీర్ఘసూత్రమగు బుద్ధి నాశము గలిగించునదనియుఁ జెప్పితివి. పితామహా! రాజు శత్రువులచేత నలుగడలఁ మిక్కిలియుఁ బీడితుండైనపు డేబుద్ధిని గయికొ న్నచోఁ దెలివి దప్పకుండునో యుత్తమమయిన యాబుద్ధిని వినఁ

గోరుచున్నాను. నీవు ధర్మార్థములందు నిపుణుఁడవు, ప్రాజ్ఞుండవు, సర్వశాస్త్రములందును బండితుఁడవు. కాఁబట్టి నిన్నడుగుచున్నాను. దీనిని నాకు వివరించి చెప్పుటకుఁ దగుదువు. పెక్కండ్రు శత్రువులు చుట్టుముట్టికొనఁగా రాజు తన్నెట్లు విడిచిపుచ్చుకొనఁగూడునో యావిధమునంతయు శాస్త్రోక్తప్రకారమున వినఁగోరుచున్నాను. ఒకరాజు సంకటమునఁ జిక్కియున్నపుడు, వాని చేత మునుపు తప్తులయినశత్రువులు పెక్కండ్రుగాఁ జేరి యా యొక్కని కెదురై వానిని వేరుతోడఁ బెకల్పఁ దివురుదురు. రాజు తాను దుర్బలుండును నొక్కరుండునై యుండఁగాఁ బెక్కండ్రు మహాబలు లగు శత్రువు లొక్కటిగాఁ గూడి తన్ను నలుగడల మార్కొని నలంచుచుండునపుడు, తానసహాయుండై వారినిమార్కొని యెట్లు నిలుఁవశక్యమగును ? అట్టి సమయములందు రాజు మిత్రులను శత్రువులను బడయు విధమెట్లు ? అప్పు డతఁడు మిత్రులయెడను శత్రులయెడను నెట్లు నడచుకొనవలయును ? మిత్రలక్షణములే యన్నియు గలిగియుండినవారు వాస్తవమున శత్రువులయి రేని యపుడు రాజు సుఖముఁ బడయఁ గోరునేని యేమిచేయవలయును? అతఁడెవరితో యుద్ధము పెట్టుకొనవలయును ? ఎవరితో సంధిచేసికొనవలయును ? తాను బలవంతుఁడయి యున్నను శత్రువులనడుమ నున్నపు డెట్లు నడచుకొనవలయును ? ఇది రాజునకుఁ గలసమస్త కృత్యములోపల మిక్కిలి యెక్కుడయిన కృత్యమని తలఁచుచున్నాను. సత్యసంధుఁడును జితేంద్రియుఁడు నగు భీష్ముం డొకఁడు తప్ప దీనిని జెప్పఁజాలిన వాఁడొక్కఁడును లేఁడు. చెప్పినను వినువాఁడు

దొరకుటయు నెంతయు నరుదు. కాఁబట్టి, మహాభాగా! దీనిని విమర్శించి యంతయు నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు — 'యుధిష్ఠిరా! ఇట్టిప్రశ్నము నీకెంతయుఁ దగినది. దీని కుత్తర మెంతయు గుణసంపన్నమైనది. పుత్రా! అపదలయం దనుష్ఠింపవలసిన ధర్మములను గుహ్యము లయినవానిని నంత యును జెప్పెదను వినుము. శత్రువు మిత్రుఁడగును; మిత్రుఁడుగూడ శత్రుఁడగును. కార్యములగతి యాయాసందర్భముల కూడికచేత నెవ్వడును నొక్కతీరుగా నుండదు. కాఁబట్టి యొకటిచేయ వచ్చునా? చేయఁగూడదా? యని నిశ్చయింపవలసినపుడు, దేశ మును గాలమును దెలిసి పరులను విశ్వసించుటయో లేక వారితో విరోధించుటయో చేయవలయును. మఱియుఁ దనచేత నైనంత వఱకుఁ దనంతటఁ బ్రయత్నపడుచును హితమును గోరునట్టి బుధులతో సంధిగలిగి యుండవలయును. భారతా! ప్రాణము ములను వేఱువిధమున రక్షించుకొన నలవిగాకుండునేని శత్రు వులతోడ సంధి యేనియుఁ జేసికొనవలయును. తెలివిమాలిన వాఁడెవఁడు తనపగవారితో నెప్పుడును సంధిచేయకయే యుండు నో వాఁ డొకకార్యమునుగాని ఫలములను బడయ నేరఁడు. ఎవఁడు కార్యమునకుఁదగిన వెరవును జక్కఁగాఁ గనుఁగొనియు మిత్రునితోడ సంధియు మిత్రునితోడ విరోధమును జేసికొనునో వాఁడు మహాఫలమును బొందును. ఈవిషయమై యొకమఱ్ఱి చెట్టునం దుండినపిల్లికిని నెలుకకును జరిగిన సంవాదమై పురా తనమగు నీయితిహాసము నుదాహరించెదరు.

ఒకపెద్దయడవియందు, మిక్కిలిపెద్దది యగు నొకమఱ్ఱి చెట్టుండెను. దానిని బెక్కులు తీఁగజొంపములు గ్రమ్ముకొని

యుండెను. అందు నానావిధములయిన పక్షుల సమూహములు వసించుచుండెను. అది మిక్కిలియుఁ బొడవయిన బలితంపు బోదెగలిగి మేఘమువలెఁ బొడకట్టుచుఁ జల్లని నీడలనొసంగుచు మనోహరముగా నుండెను. మఱియు నది యాయడవి నలుప్రక్కలను బర్వి పెక్కుసర్పములతోను మృగములతోను గూడి యుండెను. దాని యడుగున మిక్కిలియుఁ బ్రజ్ఞగల పలితుఁ డనెడియొక యెలుక నూరుద్వారములుగల యొకలాఁగుగావించు కొని సుఖముగా వసించియుండెను. అప్పుడు లోమశుఁ డను నొక పిల్లి యాచెట్టుకొమ్మయందు సుఖముగా వసించి ప్రతిదినమును పెక్కుపిట్టలను బిలుకుమార్చి తినుచుండెను. కొంతకాలము నకుఁ బిదపఁ జండాలుఁ డొకఁడా యడవికివచ్చి యం దొక గుడిసె మనికిపట్టు గట్టుకొనెను. వాఁడు ప్రతిదినమును బ్రొద్దు గ్రుంకినపిదప మృగాదులనుబట్టి మాయంపు టురులొడ్డుచు వచ్చెను. వాఁడు సన్నపునరములతోఁ జేయబడిన వలత్రాళ్లను బెట్ట వలసిన విధిచొప్పునఁ బన్ని యింటికిఁబోయి రేయెల్ల సుఖముగా జరిపి తెల్లవాఱఁగానే యక్కడకు మరలివచ్చును. ఆ యురి యందుఁ బ్రతిదినమును రాత్రియందుఁ బలువిధములయిన మృగములు పట్టువడియుండును. ఒకానొకప్పు డాపిల్లియు నేమఱి యాయురియందు గట్టిగాఁ జిక్కుకొనెను. పలితుఁ డను నెలుక, మిక్కిలిబలవంతుఁడును దనకుఁ బగవాడునై తన్నెప్పుడును జంప వచ్చుచుండునట్టి యాపిల్లియు నురియందుఁ జిక్కువడఁగా నా సమయముదెలిసి యించుకయు భయములేక గ్రుమ్మరసాఁగెను. అది యడవియందు జంకులేక యొరకై తిరుగులాడుచుండఁగాఁ గొంత సేపటికి నాబోనునందుఁ (జండాలుఁ) డుంచియున్న

మాంసమును జూచెను. అది యాయురిపయి నెక్కి కొని యందలి నంజుడును దినఁదొడఁగెను. అది తనలో నవ్వుకొనుచు నావల నుండుఁ గట్టువడియున్న తనపగవాఁ డగు నాపిల్లిపయినిగూడ నెక్కి దానిని దినసాగెను. అది మాంసము దినుటయందే మనస్సు మరిగి తనకుఁ గలభయము గనుఁగొన్నదిగాదు. ఏలనఁగా నది యున్నట్టుండి కన్నెత్తిచూడఁగాఁ దనకు భయంకర మయినశత్రు వొకటి యక్కడికివచ్చి యుండుటను జూచెను. అది రాగివలె నెఱ్ఱనికన్నులుగల హారికమనెడు యొకముంగిస. అది మిక్కిలి చుఱుకైనది. అది నేలబొఱియలలో వసించుచుండినది. దాని మేను తెల్లుపూవులవలె నుండెను. అది యెలుకవాసననుబట్టి వేగిరముగా నచ్చుటికి దానిని మ్రింగుటకై వచ్చెను. అది తన పెలవుల నాకికొనుచుఁ దలపయికెత్తికొని వెనుకటికాళ్లు భూమి పయి నానించుకొని నిలుచుండెను. మఱియు నాయెలుక యా సమయమునందే చెట్టుతొఱ్ఱలలో వసించు మఱియొక్క శత్రువు డాచెట్టుకొమ్మపయిఁ గూర్చుండియుండఁగాఁ జూచెను. అది వాఁడి ముక్కుగల చంద్రకమనెడి యొకగుడ్లగూబ. ఆయెలుక ముంగిసయు గూబయు బారింబడి మిక్కిలియు భయంబునకుఁ బాలై తనలోనిట్లని చింతింప సాగెను — 'మిక్కిలియుఁ గష్ట మయిన యాపద యిదే దాపరించినది. మృత్యువు నన్నుఁ దేఱి చూచుచున్నది. ఎటుప్రక్కను భయము పుట్టిల్లి యున్నది. ఇట్టి సమయమున నొకఁడు తనమేలుగోరి యేమిచేయఁదగును ?' అని తలపోసెను. అది యట్లు చుట్టును సరికట్టంబడి యంతటను భయముగలందులకు స్రుక్కి మిక్కిలియు భయమున వడఁకుచు నొక గొప్పయాలోచనము చేసెను. అది తనలో 'పెక్కులాప

దలు వచ్చినపుడు పలువగల యుపాయములచేత వారించికొనుచు జీవితమును గాచుకొనవలసినది ముఖ్యము. ఇప్పుడు నలుప్రక్కల నిదె బ్రాణసందేహము దాపరించియున్నది. కాఁబట్టి యాపద కలిగియున్నది. ఈయురినుండి తొందరపడి దిగి నేలకుఁబోయితి నా ముంగిస నన్నుఁదప్పక పట్టి మ్రింగివైచును; ఈయురియందే యుంటినా గుడ్లగూబ పట్టుకొనును; మఱిపిల్లి, త్రాళ్లు వీడనేని తప్పక నన్నుఁబట్టి చంపును; ననుబోఁటి ప్రాజ్ఞునకు నిట్టియెడఁ దెలివితప్పుట తగవుగాదు. ముక్కున నూపిరి యడఁగువఱకును నాయుసుఱును గాచుటకు వలయుపాటు పడెదను. బుద్ధిగలవాఁడును నీతిశాస్త్రమందుఁ గుశలుఁడు నగు ప్రాజ్ఞుఁడు క్రూరమగున గొప్పవిపత్తినొందినను నందు మునుంగఁడుగదా! ఇప్పు డీయాపదయందుఁ బిల్లికంటె నాకు వేఱుగతి దోఁపకున్నది. నాపగవాఁడయిన యీపిల్లియు సంకటమునఁ జిక్కియున్నది. దీనికిని నా చేతఁ గాఁదగిన సాయము పెద్దదిగానే యున్నది. మూఁడు పగవాండ్రు నన్నుఁ జంప నుంకించుచున్నారు గాన, యిపు డెట్లు నా యుసుఱు గాచుకొనఁజూతును? నా యుసుఱునుబట్టి యీపిల్లినే మిత్రముగా నాశ్రయించెదను. ఈశత్రుసమూహమును బుద్ధిని మున్నిడికొని వంచింపవలసిన విధముగ నీతిశాస్త్రము నూఁది యీపిల్లికి హితము చెప్పెదను. నాకు నీపిల్లి యత్యంతశత్రువుగాని యిది చిక్కియున్న సంకటమును నత్యంతముగానే యున్నది. ఈమూఢునకు వానికయిన యర్థమును నేనుజేరి తెలిపితినేని తెలిసికొనునేమో చూచెదను. వీఁ డిట్టి వ్యసనమందుఁ బడియుండుటంబట్టి నాతోడ సంధిచేసికొన వచ్చును. బలవంతుఁడు దఱిసి బాధించుచున్నపుడు పగవానితోనయినను సంధి

చేసికొనవలయును. ఒకఁడు విషమమునఁ జిక్కి తనప్రాణములు గాచుకొనఁగోరునేని యిట్లే నడచుకొనవలయునని యాచార్యులగువారు చెప్పెదరు. అపండితుఁడగు మిత్రునికంటెను బండితుఁడగు శత్రువే మేలు. ఇప్పుడు నాగతియో, నాబ్రతుకు నాశత్రువగు పిల్లిచేతియందున్నది. కాఁబట్టి పీనికిఁ దన్నురక్షించుకొనుటకు నుపాయము నుపన్యసించెదను. ఇట్టిసమయమున నీపిల్లిని పండితుఁడయినశత్రువుఁగాఁ గొనుట తప్పుగాదు' అని యిట్లు శత్రువులెల్లఁ జుట్టు నరికట్టుయుండఁగాఁ దనలో నాలోచించెను. ఇట్లు తలపోసి యామెలుక యర్థము గతులను గలరూపున నెఱుంగునదియు సంధివిగ్రహములకుఁ దగు కాలములను దెలిసినదియు నగుటం జేసి మెల్లన యాపిల్లితో 'పిల్లీ ! నీతోడఁ జెలికారమున మాటాడుచున్నానుగాని మఱేమిగాదు. బ్రతికియున్నావే కదా ? నీవు బ్రతుకుదువనియె యువ్విళ్లూరుచున్నాను. మన యిరువురకును మేలు సమముగాఁ గోరెదనుజుమీ. సౌమ్యా ! నీవు భయపడవలదు. మునుపటివలె హాయిగా బ్రతికి యుందువు పో ! నీవు నన్ను నిజముగాఁ జంపకుందువేని నిన్ను నే నుద్ధరించెదను. ఇట్టియెడరున నాకొక మంచియుపాయముతోఁచి యున్నది. అది మిక్కిలి చాలునని నాకుఁ దోఁచుచున్నది. దానిచేత నీవును దప్పించుకొనవచ్చును. నేనును మిక్కిలియు మేలుపడయవచ్చును. నేను సూటిగా నాలోచనముచేసి నీకొఱకును నాకొఱకును నాయుపాయమును గనుఁగొంటిని. దానివలన మనకిరువురకును మేలుగలదు చుమీ ? * ఇవిగో ముంగిసయు గూబయుఁ బాప

---

* ఇదిగో ముంగిసయును గూబయును బాపబుద్ధితోఁగూడి యున్నవి గాన యింకను నన్ను బెదరింపఁ దొడంగును. కాబట్టి యిప్పుడు (నిన్నువిడిచి పుచ్చు

బుద్ధితో వేచియున్నవి. పిల్లీ! అవి నన్నుఁదలపడకుండు నంత వఱకే నా బ్రతుకు క్షేమముగానుండును. ఇదిగో మ్రానికొమ్మ కొనయందుండి గుడ్లగూబ కన్నులిటునటు మాటికిఁ ద్రిప్పుచుఁ గూయుచును నన్నుఁ దేఱిచూచుచున్నది. దానిని జూడఁగా నాకెంతయు వడంకుగలుగుచున్నది. స్నేహము సాధువులకు * నేడడుగులచే గలుగును. నీవు నట్టిపండితుఁడవు గావున నాకు మిత్రమవు. నేనునీయెడ మిత్రునివలెఁ దోడుపడెదను; కాఁబట్టి నీ ప్రాణములకు భయపడవలసినది లేదు. పిల్లీ! నాసాయములేక నీవుత్రాళ్లను ద్రెంచుకొన శక్తుఁడవుగావు. నీవు నన్ను హింసింపకుందువేని నీయురి త్రాళ్లను నేను గొఱికివై చెదను. నీవు మ్రానికొనయం దుండువాఁడవు. నేనో మ్రానియడుగున నుండువాఁడను. మనమిరువుర మీమ్రానియందుఁ జాలఁగాలముగా వసించి యున్నా మనుట నీకును దెలిసినవిషయమే. ఎవని నొక్కరును నమ్మరో, యెవఁ డొక్కరినిని నమ్మకుండునో, యాయిరువురను బ్రాజ్ఞులు గొనియాడరు. వా రెప్పుడును మనస్సున నెమ్మదిలేకుందురు. ఈకారణమునుబట్టి మనయిరువురకును బరస్పరము ప్రీతి పెరుఁగునుగాన మనయిరువురును గలసిమెలసి యుందము. ఈలోకమందుఁ గాలముతప్పి చేయుకార్యమును బండితులు కొనియాడరు. కాఁబట్టి మనయిరువురకు నిట్టిప్రయోజనముతోఁగూడిన కాల మిదియే యని తెలియుము. 'నీవు

నట్టి నేను క్షేమముగానుండుటంబట్టి) నీఁబ్రతుకునకును క్షేమము' అని దాక్షిణాత్యకోశములందలి పాఠమునకు నర్థము.

* 'సతాం సాప్తపదమ్ మైత్రమ్' అని మూలము. సాధువు లొకరితో నొకరుగూడి యేడడుగులు పెట్టినచో వారలకు చెలిమిగలుగునని యిందలి యాశయము.

బ్రతుకవలయునని నాకుఁగోరిక ; నీవును నేను బ్రతుకవలయునని గోరెదవు. మనుష్యుఁడు మిక్కిలి లోఁతయిన పెద్దయేటిని నొక కట్టెయనుగొని దాఁటుచున్నాఁడు. వాఁడాకట్టెయను నవ్వలి దరికిఁ గొంపోవుచున్నాఁడు; ఆకట్టెయయు వాని నవ్వలిదరికిఁ జేర్చుచున్నది. ఇట్లే మనయిరువుర కార్యమును గూడికొనుటయు మిక్కిలియు గొప్పదిగానున్నది. నేను నిన్నువిడిపించెదను. నీవును నన్ను విడిచిపుత్తువు' అనెను. ఇట్లు పలితుఁ డనెడి యెలుక, యుభయులకును హితంబును యుక్తియుక్తంబును గయికొనందగినదియు నయిన యీవిషయమును జెప్పి దాని యుత్తరమున కెదురు చూచుచుండెను.

అంత నట్లాయెలుక లెస్సగాను సహేతుకముగాను నొప్పుకొనఁదగునట్లుగాను జెప్పినమాటవిని బుద్ధిమంతుఁడును మాటకారియు నగుపిల్లి తానున్నకష్టదశను జింతించి యాయెలుక మాటను గయికొని దానిని మంచిమాటలఁ బూజించెను. వాఁడియైన మునిపండ్లును వైడూర్యమణుల వన్నె కన్నులునుగల యాలోమశుఁ డను పిల్లి యెలుకను మెల్లఁగన్నెత్తిచూచి దానితో 'సౌమ్యా ! నాకు నీయందు సంతోషము గలుగుచున్నది. నీవు నన్ను బ్రతికింపఁ గోరుచున్నావుగాన నీకుశుభం బగుఁగాక. నీ వేది శ్రేయమని తలఁచెదవో దానిని ద్వరతోఁ జేయుము. ముందు వెనుక విచారింపకుము. నేనో మిక్కిలియు విపత్తియందున్నాను. నీవు నాకంటె నెక్కువ విపత్తియందున్నావు. ఆపన్నుల మగు మనయిరువురకును సంధిగావలయును,జాగువలదు, సమయమునకుఁ దగినదేదియో దానిని జేయుము. మనయిరువుర కార్యమును సిద్ధింపనీ. నేను గష్టమునుండి విడివడితినేని నీ

చేసినయుపకారము నిష్ఫలముగాదు. నీయెడ గౌరవము నుంచిన వాఁడనగుదును, నీకు భక్తుఁడనగుదును, శిష్యుఁడనగుదును, నీకు హితకరుండ నగుదును, నీపంపు దప్పక సేయువాఁడ నగుదును, నిన్ను శరణుఁజొచ్చితిని' అనెను. ఇట్లది చెప్పఁగా నర్థవిదుండగు పలితుఁడు తనకు వశగతమయిన యాపిల్లితో నర్థయుక్తంబును హితంబునయిన వచనముల నిట్లనియె.

'నీవు చెప్పినది యుత్తమమైనది. ఇది నినుబోఁటివానియం దొకవింతకాదు. మనయిరువురకును హితముగలుగుటకై నేనుబన్నినయుపాయమును జెప్పెదనువినుము. నేను నీమేనిక్రిందఁ జొచ్చియుండెదను. నాకు ముంగిసను జూడఁగా మిక్కిలి భయముగా నున్నది. నీవు నన్ను రక్షింపవలయును; కాని చంపరాదు. నిన్నురక్షించుటకు నేను శక్తుఁడనై యున్నాను. గూబవలన నుండియు నీవు నన్నురక్షింపవలయును. అల్పమయిన యది నన్నుఁ దినఁగోరుచున్నది. మిత్రమా! నీత్రాళ్లను నేను ద్రెంచివైచెదను. ఇట్లని నీకు గట్టిగాఁ బ్రతిజ్ఞసేయుచున్నాను' అనెను. ఆయెలుక యుక్తియుక్తముగాను బొసఁగునట్లును మంచివిషయముగలయట్లును జెప్పినయప్పలుకువిని లోమశుఁడు సంతుష్టుఁడై తేఱిచూచి పలితుని స్వాగతమునఁ బూజించెను. అట్లాపిల్లి పలితునినెయ్యము పచరించినందులకుఁ బూజించి కొంతసేపు చింతించి యంతసంతోషము గడలుకొన వేగదానితో 'వేగరమ్ము! నీకు శుభం బగుఁగాక. నీవు నాకుఁ బ్రాణసముఁ డగుచెలికాఁడవు. ప్రాజ్ఞా! నీయనుగ్రహమువలననేకదా ప్రియ మయినబ్రతుకును మరలఁ బొందుచున్నాను. ఇప్పు డిట్టిస్థితి నొందిన నేను నీకేమేమి చేయవలయునో యానతిమ్ము. నేనుజేసెదను. మన యిరువురకును

సిద్ధికలుగుఁగాత. నే నీప్రాణసంశయమునుండి విడివడి నామిత్ర సమూహములను బంధుజనులనుగూడి నీకుఁ బ్రియమును హిత మునగు కార్యములనెల్లఁ జేయుదును. సౌమ్యా! నే నీవ్యసన మునుండి విముక్తుఁడనై నీకుఁ బ్రీతిని గలిగింతును. ప్రత్యుపకా రము చేయుటకును శక్తుండ నగుదును. మొదట నుపకారము చేసినవానికిఁ బిదపఁ బలువిధములఁ బ్రత్యుపకార లెన్ని చేసినను సాటియగు నని నాకుఁదోఁపలేదు. ఈ యిరువురలో మొదట నుపకరించినవాఁడు కారణములేకయే యట్లు చేయుచున్నాఁడు. రెండవవాఁ డుపకారమును బొందియేకదా చేయుచున్నాఁడు' అనెను.

ఇట్లు పిల్లి సమాధానపఱుపఁగా నెలుక గలయామెలుక మిక్కిలియు నమ్మకమునొంది దానిమేనిక్రిందఁజొచ్చి దానినెం తయు నంగీకరించెను. అట్లది యాపిల్లికిఁ దనకార్యమును దెలిపి నెయ్యము తియ్యముగలదై తలిదండ్రులయెడంబోలె నాపిల్లి కడుపునందు నిదురింపఁదొడంగెను. అట్లామూషిక మాపిల్లి యవయవములందు మఱఁగికొని యుండుటనుజూచి ముంగిసయు గూబయు నిరాశులయి మరలిపోయినవి. ఆపిల్లికిని నెలుకకును గలిగిన యత్యంత ప్రీతిని జూడఁగా నాముంగిసకును గుడ్లగూబ కును మిక్కిలిభయముగలిగి యుత్సాహము తగ్గుటయే కాక యెంతయు నాశ్చర్యమును జనించెను. హరితుఁడును జంద్ర కుఁడు నిరువురును, బలమును బుద్ధియుఁ గలవారు. ఇరువురును దమయెరను బట్టుసమర్థులే. ఆయిరువురును దాపుననే యుండియు నాపిల్లిని నెలుకను వానికిఁ బరస్పరముగలిగిన నెయ్యంపుటొడం బడికనుండి బలవంతముగా విడఁదీయఁ జాలకుండినవి. ఆపిల్లియు

నెలుకయుఁ దమతమకార్యములకొఱకు సంధియిట్లు గావించుకొనుటఁజూచి నకులమును నులూకమును నచ్చోటువాసి తమతమ నెలవులకుఁ బోయినవి. పిదప నెలుకయగు పలితుఁడు కాలదేశముల నెఱింగినదిగాన యాపిల్లిమేనిక్రిందనుండి యాయురిత్రాళ్లను మెల్లగాఁ గొఱుకుచు దానిని ముగించుటకుఁ దగుకాలము నెదురుచూచుచుండెను. పిల్లి త్రాళ్ల కట్టులకు మిక్కిలియుఁ గస్తి నొంది యా మూషికమును త్వరలేక మెల్లగాఁద్రాళ్లను గొఱుకుచుండుటఁ జూచి దానినిసైఁపకుండెను. అదిదానినివేగిరింపఁదలఁచి దానితో 'సౌమ్యా! ఏల నీవు వేగిరపడకున్నావే! నీవునావలనఁ నక్కఱఁ దీర్చుకొని యిపుడు నన్నుఁ బాటింపకున్నావా? ఆచండాలుఁడు రాకమునుపు త్రాళ్లను ద్రెంపుము' అనెను. ఇట్లు పిల్లి తొట్రుపడుచుఁ జెప్పఁగా బుద్ధిమంతుఁ డగు పలితుఁ డంతఁగాఁ బ్రజ్ఞయందుఁ దేఱుగడగాని పిల్లినిజూచి తథ్యమును నాత్మహితంబునగు వచనముల నిట్లనియె.

'సౌమ్యా ! నీ వూరకుండుము. తొందఱపడకు. తొట్రుపాటునువలదు. ఈవిషయమునఁ గాలము దెలిసినవారము మేమే. సమయముతప్పదు; అకాలమందుఁ జేసినకార్యము చేసినవానికి ఫలమునొసంగునది గానేరదు. అదియే సమయమందుఁ జేయఁబడినచో మిక్కిలియు ఫలమునొసంగ నేర్చునదగును. అకాలమున నిన్నువిడిచిపుత్తునేని నీవలననే నాకు భయముగలుగును. కాఁబట్టి సమయము నెదురుచూచుచుండుము. చెలికాఁడా ! ఎందులకుఁ దొందర పడెదవు ? చండాలుఁ డాయుధపాణియై రాఁగాఁ జూచినప్పు డది యుభయులకును భయావహమయినది గాన యప్పుడుతప్పక నీత్రాళ్లను ద్రెంచివైతును. నీ వాసమయ

మందు విడివడి మ్రానిపై నెక్కికొంచువు. నీ కప్పు డుసుఱును దాఁచుకొనుటకంటె మఱియొకటిచేయుటకు వీలుండదు. అప్పుడు వేఁటకానికి భయపడి నీవు పాఱిపోఁగా నేను బొఱియలోఁజొచ్చి కొందును; నీవు కొమ్మనెక్కికొందువు' అనెను. ఇట్లది యాత్మ హితంబగు మాటచెప్పఁగా మహామతియు మాట పొందెఱింగి నదియునగు పిల్లి తనయుసుఱు గాచుకొనఁ దహతహపడు చుండెను. అది తాను జెప్పినపనిని ద్వరితముగా నెఱవేర్చియు నట్లు తనపనియందు వేగిరము లేకున్నయామెలుకను జూచి 'సాధువులు మిత్రులకార్యములను నీచందమునఁ గావింపరు ; ప్రేమతోడఁ గావింతురు. నేనెంత వేగిరపడి నిన్ను సంకటము నుండి విడిపించితినో యంత వేగిరముగాఁగదా నీ విదినాకుఁ జేయ వలయును; నీవు మిక్కిలియుఁ బ్రాజ్ఞుండవుగదే ! మనయిరువుర కును క్షేమముగలుగునట్లు ప్రయత్నపడుము. అట్లుగాక నీవు మునుపటి వైరమును దలఁచికొని ప్రొద్దుపుచ్చఁ గోరుదువేని తప్పక నాయుసుఱు నశించును. నీవు దుష్టకర్ముఁడవు గదే ! చూడుము. నేను దెలియమిచేత ముందు నీ కేదేని కొంచెము కీడుచేసియుండినను నీవు దానిని మనస్సున నుంచుకొనరాదు. నిన్ను మన్నింప వేఁడుకొనుచున్నాను. నాయం దనుగ్రహింపు' మనెను. ఇట్లు ప్రాజ్ఞుండయిన యాపిల్లి చెప్పఁగా శాస్త్రవేత్తయు నుత్తమబుద్ధియు నగు నాయెలుక యపుడు మేలిమాటల నిట్లనియె.

'పిల్లీ ! నీవు స్వకార్యమును బెద్దదిగాఁ జేసికొని చెప్పిన మాటనువింటిని. నేను నాకార్యమును బెద్దదిగాఁ జేసికొని చెప్పు దానిని సయితము వినుము. ఏమిత్రమును భయముతోడ

సాధింపవలయునో యేమిత్రమునందు భయముగలిగియుండునో వానివలననుండి పాముకోఱలనుండి పాములవాఁడు చేతిని రక్షించుకొనునట్లు తనరక్షను గావించుకొనవలయును. బలవంతునితోడ సంధిచేసికొని యెవఁడు తన్ను రక్షించుకొనక పోవునో వానికాసంధి పూజితం బయినయపథ్యమువలె మేలునకు మాఱుగాఁ గీడునకు మూలమగును. ఒకఁడు మఱియొక్కనికి మిత్రుఁడే కాఁడు. ఒకఁడు మఱియొక్కనికి శత్రువే కాఁడు. కార్యమునుబట్టియే చుమీ యొకరికొకరు మిత్రులును శత్రులు నయ్యెదరు. ఏనుఁగులచేతఁ బెద్దయేనుఁగులు గట్టుపడునట్లు, కార్యములచేతఁ గార్యములు గట్టుపడుచున్నవి. కార్యముచేసినపిదప నట్లు చేసినవానిని బాటించువాఁ డొక్కఁడును లేఁడు. కాఁబట్టి సమస్తములయిన కార్యములను గొంత మిగతపడునట్లుగాఁ జేసియుంపవలయును. ఆసమయమందును నాచండాలునివలన భయపడి కష్టపడుచుఁ బరుగెత్తుటయె నీకు ముఖ్యముగానుండును గాన, నీవు నన్నుఁబట్టుకొనుటకు శక్తుఁడవుగా నుండనేరవు. త్రాళ్లు పెక్కులు ద్రెంచివైచితిని. ఒక త్రాడే మిగతపడియున్నది. దానిని వేగముగా నేను ద్రెంచి వైచెదను. లోమశా! సుఖమున్నుండుము' అనెను.

ఇట్లాపన్నులై యున్న యాపిల్లియు నెలుకయు రెండునిట్లు మాటాడికొనుచుండఁగా నారాత్రి గడచినది. లోమశునకు భయ మతిశయించెను. పిదప, వేకువను పరిఘుఁడను చండాలుడాయుధపాణియై కనుపట్టెను. వానినిజూచుటకు భయంకరముగానుండెను. వాఁడునలుపును బింగళవర్ణమునుగల చాయయు బలితములయిన చిఱుదొడలును గలిగియుండెను. వాని నోరు

విఱివిమై యీచెవినుండి యాచెవివఱకుఁ జాఁగి మిక్కిలి మలిన
మైయుండెను. వాఁడుశంకులవంటి చెవులుగలిగి కుక్కతండములు
బలసి రా గుద్దలి యొకటినెత్తికొని బెట్టిదముగాఁ గనుపట్టుచు
వచ్చెను. యమునింబోలి వచ్చుచున్న యాబోయవానిని జూచి
లోమశుఁడు భయముచే వడవడవడంకుచు నెలుకనుజూచి 'ఇప్పు
డేమిచేయుదువు'అనియడిగెను. ఆయెలుక పిల్లి చిక్కువడియున్న
మిగతత్రాఁడొక్కటిని సయితము ద్రెంచివైచెను. పిదపఁ బిల్లి
విడివడి యామ్రానిపయి నెక్కికొనెను. పలితుఁడును నాతోట్రు
పాటునుండియు భయంకరుఁ డగు శత్రువునుండియు విడివడి
బొఱియలోఁ దూఱెను. ఆలోమశుఁడు కొమ్మపయి నెక్కెను. చం
డాలుఁ డన్నివిధముల నరసి నిరాశుఁడై యురినెత్తికొని క్షణ
మున నచటనుండి కదలిపోయెను. భరతసత్తమా ! ఆచండా
లుఁడు తనయిలుచేరెను. పిదప లోమశుఁ డాభయమునుండి
విముక్తుఁడై దుర్లభమయిన ప్రాణములనుబడసి మ్రానికొన
యందుండులాఁగు నందున్న యెలుకనుజూచి 'ఒక్కమాటయు
నాతో మాటాడకయె నీవు తటాలునఁ బొఱిపోయితివే. నేనే
దేని చెడ్డతలంపు గలిగియున్నానని నీకు సందేహము లేదే కద ?
నేను మిక్కిలియు నెనరు గలిగియున్నాను. నీవు నాకు గొప్ప
కార్యముచేసితివి. నీవు నాకు విశ్వాసముగలిగించి నాప్రాణ
ముల నిచ్చితివే. ఇట్టి నీవు చెలికాండ్రురువురనుగూడి నెయ్యము
తియ్యంపు సొంపు ననుభవింపవలసిన కాలమున నాయొద్ద కేల
రాకున్నావు? మొదట స్నేహితులనుగాఁ జేసికొని పిదప వారిని
మఱచిపోవు దుర్బుద్ధి యగువాఁడు కడిఁదిసంకటములు వచ్చి
నపుడు మరల మిత్రులను బడయఁజాలఁడు. అనుంగుఁజెలికాఁడా!

నీసామర్థ్యమంతయు నెఱిఁగి నన్నెంతయుఁ బూజించితివి. ఇట్టి నీవు మిత్రత్వమును బొందిననను బోఁటి పేదవానిపొత్తు ననుభవింపఁ దగుదువు. నాకుఁగల మిత్రులును నాకుఁగల బంధువులును నందఱును బ్రియుం డయినయాచార్యుని శిష్యులుంబోలె నిన్నుఁ బూజింతురు. నేనును నిన్ను నీమిత్రగణములతోడను బంధువులతోడనుగూడి పూజింతును. ప్రాణము నొసంగినవానిని నెనరుగలవాఁ డెవఁడు పూజింపకుండును? నీవు నాదేహము ఇల్లు ధనములు మొదలగునన్నిటికిని నేలికగా నుండవలయును. నీవు నాకాజ్ఞ సేయువాఁడవుగా నుండుము. మహాప్రాజ్ఞా ! నీవు నా కమాత్యుఁడవుగా నుండుము. పుత్రునిఁ దండ్రియుంబోలె నీవు నన్నుఁ బనిపంపుము. నీకు నావలన భయమువలదు. ఇట్లని నా ప్రాణులమీఁద నొట్టుపెట్టుచున్నాను. నీవు బుద్ధినిబట్టి శుక్రుఁడవే. మేము బలిమిచేత నధికారముగలవారము. మంత్రబలముగల నీవు మాకు జయమును గూర్తువు' అనెను.

ఇట్లు పిల్లి మంచిమాటలు చెప్పఁగా నామెలుక నిజమును దెలిసికొని యింపయి యాత్మహితకరములయిన వచనముల వానితో 'లోమశా ! నీవు చెప్పినదంతయు వింటిని. నాకుఁ దోఁచునదియుఁ జెప్పెదను వినుము. మిత్రులను జక్కఁగాఁ బరీక్షించి దెలియవలయును. శత్రువులను జక్కఁగాఁ బరికించి తెలియవలయును. ఈ లోకమం దిటువంటిపనిని జేయుట మిక్కిలియు సూక్ష్మమయినదని ప్రాజ్ఞులు నొప్పుకొనుచున్నారు. మిత్రులు శత్రువులవలెను, శత్రువులుమిత్రులవలెను నుందురు. ఒక తెగవారితో సంధిగావించుకొన్నను వారాసంధి కియ్యకొనుట రాగమునకును లోభమునకు లోనైయో కాదో వారికలరూపు దెలియుట

యెంతయుఁ గష్టముగానుండును. *(ఎవరికిఁ జల్లఁదనముగలవారే మిత్రులును గ్రోధశీలురే శత్రువులు నగుదురో వారలకు మంచి మాటలచే మిత్రశత్రుల కలరూపెంత చెప్పినను వారురాగలోభములకులోనై తమకుఁదోఁచినదే తప్పఁ దక్కినవి తెలియరు). పుట్టుకచేత శత్రువగుటలేదు;మిత్రుఁడగుటయు లేదు.ఆయాకార్యములనుబట్టి మిత్రులును శత్రులుఁ నగుచున్నారు. ఎవఁడు తనకొకఁడు బ్రతికియుండు నంతవఱకే తనకార్యములకు సిద్ధిగలుగు ననియు, వాఁడు మృతుఁడయినచోఁ దనకుఁ బీడ గలుగుననియుఁ జూచునో వాఁడు దానిని దనకు మిత్రముగాఁగొని యా సందర్భముల మాఱకుండు నంతవఱకు నట్లు మిత్రముగాఁ దలంచుచుండును. మిత్రత్వమును స్థిరమై యుండునదిలేదు. శత్రుత్వమును సతతమైనది లేదు. కార్యముల కూడికనుబట్టి మిత్రులుగాను శత్రువులుగాను నేర్పడుచున్నారు. కాలము తిరిగినపుడు మిత్రుఁడును శత్రుత్వమందుచున్నాఁడు; శత్రువును మిత్రత్వము నందుచున్నాఁడు. స్వప్రయోజనమే మిక్కిలి బలీయమైనది సుమీ. కార్యముల పొసఁగుపాటును దలంపక యెవఁడు గ్రుడ్డితనముగా మిత్రులను నమ్ముచును శత్రువులను నమ్మకయు నుండునో వాని బ్రతుకు చంచలమే. ఎవఁడు శత్రువునందుఁగాని మిత్రునందుఁగాని నీతియుక్తిని విచారింపక మక్కువ నుంచునో వాని బుద్ధియుఁ జంచలమే. నమ్మికలేని వానియందు నమ్మికగూడదు. నమ్మికగలవానియందును మితిమీఱిన నమ్మిక గూడదు. గ్రుడ్డి

---

* ఈశ్లోకము 'యేషాం సౌమ్యాని మిత్రాణి క్రోధనాశ్చైవ శత్రవః। సాన్త్వితాస్తే న బుధ్యన్తే రాగలోభవశంగతాః' ఇది ఉత్తరప్రతులందులేదు. లేకుండుటయే సమంజసముగానున్నది.

నమ్మికవలనఁ గలుగుభయము వేళ్లనుగూడఁ ద్రెంచును. తల్లియుఁ దండ్రియు కొడుకును మామయు నల్లుఁడును సంబంధులును జుట్టములును గార్యములను బట్టి కలుగుదురు. తల్లియుఁ దండ్రియుఁ బతితులయినచో గారాబు పుత్రునయినను ద్రోసి పుత్తురు. జనులు తమ్మె ముఖ్యముగా రక్షించుకొందురు. స్వప్రయోజనమునకుఁగల పసనుజూడుము! (స్వకార్యమునకుఁ గలసారమును జూడుము!) ప్రాజ్ఞా ఒకఁడు తన యనాయమునుండి విడివడినతోడనే, తనశత్రుపుసుఖమునకుఁ గారణ మగు దానిని వెదకునేని వాఁడు మరలఁ దప్పించుకొనుట సామాన్యముగాదు. నీవు మ్రానికొననుండి యీచోటికి(నేనున్న యెడకునన్నుఁదినుటకై) మునుపు వచ్చితివికాని బుద్ధిచాపలముచేత నిచ్చట వైచియుండినగురిని దెలియవయితివి. (బుద్ధి) చాపలముగలవాఁడు తన్నుఁదాను రక్షించుకొనఁజాలఁడు. మఱి తక్కినవారి నెట్లు రక్షింపఁగలఁడు? అట్టివాఁడు తనకార్యముల నన్నింటిని నాశము చేసికొనును. నేను నీకుఁ బ్రియుఁడనని నీవు తీయనిపలుకులు చెప్పుచున్నావు. అదికల్ల. అందులకుఁ గల కారణమంతయు సవిస్తరముగాఁ జెప్పెదను వినుము. ఒకఁడొక కారణమునుబట్టి ప్రియుఁడగుచున్నాఁడు; ఒక కారణమును బట్టియే ద్వేష్యుఁడగుచున్నాఁడు. ఈ ప్రాణిలోకమంతయుఁ దనప్రయోజనమునే కోరుచుండును.ఒక్కఁడు నొక్కనికినిఁ బ్రియుఁడుగాఁడు.ఒకకడుపునఁ బుట్టిన తోఁబుట్టువులకుఁ లోకమందుఁగల చెలిమిగాని, ఒకరినొకరు వరించిన యాలుమగలకుఁ గల వలపుగాని, స్వకార్యమునే యూఁదియుండును. ఈలోకమం దెవ్వరికిగాని పరస్పరముగల యెట్టిప్రేమయు నొక స్వప్రయోజనము నాశ్రయింప

నిది నేను జూడలేదు. అయినను దోఁబుట్టువులును దంపతులును గొన్నియెడల నొక కారణమును బట్టి కలహించినను మరల సంబంధించియున్న స్వభావమును బట్టి ప్రేమతోఁ గలసికొందురు. ఇది పరస్పర మట్టి సంబంధము లేకుండువారియందుఁ జూపట్టదు. దాతృత్వముచేత నొకఁడు ప్రియుఁ డగుచున్నాడు. ఇంపయిన మాటలచే నొకఁడు ప్రియుఁడగుచున్నాఁడు. మంత్రముచేతను హోమముచేతను జపముచేతను మఱియొకఁడు ప్రియుఁడగుచున్నాఁడు. ఒకఁడు తానొదవుకార్యమునుబట్టి ప్రియుఁడగుచున్నాఁడు. మనయిరువురకును బ్రీతి యొక కారణమునుబట్టి పుట్టినది. ఆకారణ మింక లేదు. అది ముగియఁగానే యాప్రీతియు ముగిసిపోయినది. నీకు నాయందుఁ బ్రీతిగలుగుటకు నన్ను భుజింపవలయు ననుకారణముతప్ప వేఱుకారణ మేమికలదు? చెప్పుము. ఈవిషయము మనయిరువురకును దెలిసినదే. నే నిది మఱచిపోలేదని నీవు తెలియవలయును. కాలము హేతువును మార్చుచున్నది. * ఆహేతువునే స్వార్థము వెంబడించుచున్నది. స్వార్థమును బ్రాజ్ఞుఁడును కనుఁగొనుచున్నాఁడు. ప్రాజ్ఞుని లోకమనువర్తించుచున్నది. నీవు విద్వాంసుఁడును స్వార్థమును జక్కఁగాఁ దెలిసినవాఁడు నగు వానినిగూర్చి యిట్టిమాటలు పలుకఁదగదు. నీవు సమర్థుండవే కాని నీస్నేహము గల హేతువున కిది కాలముగాదు. నేను సంధి విగ్రహములందు గడితేఱిన వాఁడను; కనుక, స్వార్థమునుండి చలింపను. మేఘముల రూపములుంబోలె సంధికిని విగ్రహమునకుఁ గల సందర్భములు

* 'స్వార్థ స్తమను వర్తతే' అని దా. మూలము. 'స్వార్థ స్త్వమనువర్తసే' అని జో. మూలము. స్వార్థమును నీవు వెంబడించెదవు.' అని యర్థము.

మాటిమాటికిని మాఱుచుండును. నేఁడు నాకు శత్రువుగానుం టివి. నేఁటికే నాకు మరల మిత్రుఁడ వయితివి. నేఁటికే మరల నాకు శత్రుఁడవయితివి. సందర్భములు, మాఱుపడుచుండుట చూడు. మునుపు మనకిరువురకును మైత్రి, యందులకు హేతు వుండి నంతవఱకును నుండియుండెను. హేతువు కాలముతోఁ గూడినదిగాన కాలముపోఁగా దానితోఁగూడనే యదియుం బోయినది. ఆహేతువు పోఁగా నామైత్రియుఁ బోయినది. నీవు నాకు స్వభావముచేత శత్రుఁడవుగదా ! మనయిరువురకు సమ మైన యొక ప్రయోజనము కలుగుటంబట్టి నాకు మిత్రుఁడవయి తివి. ఆప్రయోజనము తీఱినది. కాన యెప్పటి స్వభావ మగు శత్రు త్వము మరల వచ్చినది. ఇట్లు రచింపఁబడియున్న శాస్త్రములను గలరూపున నేను దెలిసియుండఁగా నీకొఱకని మరల నాకట్టు త్రాటియందు నే నేలచొత్తును ? అది నాకుఁ జెప్పుము. నీబలిమి చేత నేను విడివడితిని. నాబలిమిచేత నీవు విముక్తుఁడవయితివి. ఒకరి కొక రుపకారముచేసి యైనపిదప మరలఁ గూడికొనుట కలుగదు. సౌమ్యా ! నీకార్యమో యొడఁగూడినది. నాకార్య మును సమకూడినది. ఇంక నాచేత నీకుఁ గావలసినపని నేను భక్ష ణమగుటకంటె మఱియొకటి లేదు. నేను అన్నము ; నీవు తిను వాఁడవు. నేను బలహీనుఁడను, నీవు బలవంతుఁడవు. మనయిరు వుర బలములు, సమానము గాకయుండఁగా (మనయిరువుర స్థితు లిట్లు విషమముగా నుండఁగా) పాసినపిదప మరల మనకుఁ గూడికగలుగదు. నాకు నీప్రజ్ఞ తెలియును. అది మఱేమిగాదు. వలనుండి విడివిడిన వెంబడిని, సులువయిన యుపాయమున భోజన మును వెదకుచున్నావు. ఇందులకు సందేహము లేదు. నీ వాహా

ముకొఱకే వలలోఁ జిక్కుపడితివి. దానినుండి విముక్తుఁడవయి
తివి. ఇప్పుడు నిన్నాఁకలి వేఁచుచున్నది. శాస్త్రములను జదు
ప్రటవలన నుప్పతిల్లెడు బుద్ధినూఁది నన్నుఁ బెందలకడ భోజన
ముగాఁ జేసికొనఁ జూచుచున్నావు. నీ వాఁకలిగొని యుండుట
నెఱుంగుదును. నీ కిది యాహారము గొనుతఱి యనియు నెఱుఁ
గుదును. నీవు నావలనఁ జూపు నిగిడ్చి యెర నెమకుచున్నావు.
ఇంతేకాక చెలికాఁడా! *నీ వాలు బిడ్డలకొఱకు నాయెడ మాట
ాడుమాటలును, చేయఁబూనిన పనిపాటులును, నాకు నెంత
మాత్రము గొలుపవు. నేను నీతోఁగూడ నుండుటను జూడఁగా
ఁగాదిలి పడఁతియు గారాబుబిడ్డలును, నీవు నెయ్యము గలిగి
యుండఁగనే నన్నుఁబట్టికొని యేలతినకుందురు? కాఁబట్టి నేను
ీతోడఁ గలసియుండను. అట్టి కలయికకు హేతువు గడచిపోయి
ది. నీవు నేనుజేసిన మంచికార్యమును మఱవకుందువేని, నీవు
ాకు శుభము దలపోయుచు నెయ్యమున సుఖం బుండుము.
శత్రువయినవాఁడు ధార్మికుఁడని ప్రసిద్ధుఁడుగాకయు, పేరాఁకలి
గొనియు, నాహారమును వెదకుచును నుండఁగాఁ బ్రాజ్ఞుఁ
డెవఁ డట్టివానిబారిం బడును? ఎవ్వఁడును బడఁడు. నీకు శుభం
బగుఁ గాత. నేను బనివినియెదను. దవ్వులనుండియు నిన్నుఁ

---

* కించాత్రపుత్రదారార్థం యద్వాణీం సృజసేమయి, శూశ్రూషాం యత సే
[illegible]ర్తుం సఖే మమ న తత్ క్షమమ్' అని. దా. మూలము. 'త్వంచాపి పుత్రదారస్థో
యుత్సంధిం సృజసేమయి' అని మూలము. నీవాలు బిడ్డలుగలవాఁడవు. నీవింకను
నాతోడ సంధిగోరుచు నాకు మక్కువతోఁ బనిపాటులు సేయఁజూచెదవు.
కాని చెలికాఁడా! యివన్నియు నాకుఁ గొలుపవు' అని యర్థము. ఇది యేసఁసం
[illegible]సముగాఁ దోఁచుచున్నది. (పతాపచంద్రరాయులు.)

జూడఁగా నాకు భయమెత్తుచున్నది. నేను నీతోడిపొత్తు నొల్లను. లోమశా! నీ ప్రయత్న ముడుగుము. నేను నీకుఁ జేసినమంచిని మఱవవేని, నేను నమ్మికగలిగి గాని పరాకుపడి గాని క్రమ్మఱఁ గలిగినపుడు చెలిమి ననువర్తింపుము. ఇంతేచాలు; నాకుఁ బ్రతి చేసిన ట్లగును. బలవంతుఁ డగు వానిదాపున నుండుటయు నెప్పుడును మెచ్చుగాదు. బలవంతుఁడు మిక్కిలి శాంతుఁడుగను బ్రాజ్ఞుఁడుగను నుండినప్పటికిని నతని దెస నెప్పుడును భయపడుచుండ వలయును. నీ వింతవఱకుఁ జెప్పినట్టి ప్రయోజనము గోరితివేని చెప్పుము. నీకేమిచేయుదును? నేను నీకన్నియు నిత్తునుగాని నన్ను మాత్ర మేవిధమున నియ్యను. తన్ను రక్షించుకొనుకొఱకు సంతతిని రాజ్యమును రత్నములను ధనములను దిగవిడువవచ్చును. తనకుఁగల యంతయు నయినను దిగవిడిచి బుద్ధిమంతుఁడు తన్నుఁ దప్పక రక్షించుకొనవలయును. అందులకై యైశ్వర్యములను ధనములను రత్నములను బగవారికైన నియ్యవచ్చును. ఏలనఁగా నును ఉండినయెడల వానినెల్ల మరలఁ బడయవచ్చును గాన వచ్చుననిమాకువినికి. ధనములంబోలె, రత్నములనుంబోలెఁ దన్ను నిచ్చుకొనుట యొప్పదు. ధనములను దారములను విడిచియైనను దన్ను నెపుడును రక్షించుకొనవలయును జుమీ. తమ్మును రక్షించు కొనుటయందుఁ గన్నుగలిగి, యేకార్యమును ముందుఁ జక్కఁగాఁబరీక్షించి చేయునట్టి పురుషులకు దోషములు కలుగవు; కాన, దోషములవలనఁ గలుగునాపదలును బుట్టవు. బలహీనులగు వారు దమకంటె బలవంతుఁ డగు వాని నెప్పుడును శత్రువుగానే తెలియుదురు. వారలబుద్ధి శాస్త్రార్థములందుఁ దిరముగా నిశ్చితమైయుండును; కనుక, నది యెన్నఁడును జలింపకుండును' అనెను.

ఇట్లు పలితుఁడు తేటతెల్లముగనే చక్కఁగాఁ బరిహాసము చేయఁగాఁ బిల్లి సిగ్గునొంది దానితో 'నీమీఁద సత్యముగా నొట్టుపెట్టెదను. మిత్రద్రోహ మనుమాట నాకెంతమాత్రము నింద్యము. నాకు నీప్రజ్ఞ తెలియును. నీవు నాహితమం దాసక్తుఁడనియు నెఱుఁగుదును. నీ వర్థతత్త్వము నూఁది మనయిరువురకును భేదమునకుఁ గారణమున్నదని చెప్పితివి. సాధూ! నన్ను వేఱువిధముగా గ్రహించుట నినుఁబోఁటికి నెంతమాత్రము దగదు. నీవు నాకుఁ బ్రాణప్రదానము చేయుటంబట్టి నీయందు నాకు మిక్కిలియుఁ జెలిమిగలిగినది. నేను ధర్మములను దెలిసినవాఁడను; పరులగుణములను దెలిసికొనఁ నేర్చువాఁడను; విశేషించి పరులుచేసిన మేలును మఱవకుండువాఁడను; మిత్రులయందు నాకు మక్కువ; అందును నీయందు విశేషించి నాకు భక్తిగలదు. సాధూ! నే నిట్టివాఁడనయి యుండఁగా నీవు నన్నిట్లు పలుకఁదగదు. నీవు నన్నిట్లు మఱియుఁ బలుకుచుందువేని నేను బంధుసహితముగాఁ బ్రాణములు విడువఁగలను. పండితు లగువారు మనస్వులగు మనబోఁటివారియందు నెయ్యమునే కనుఁగొందురు. నీవు ధర్మతత్త్వములను దెలిసినవాఁడవు. నేను ధర్మము తప్పుదునని సందేహించుట నీకుఁ దగదు' అనెను.

ఇట్లు పిల్లి చెప్పుచున్నను నాయెలుక కొంచె మాలోచించి భావగంభీరముగా దానితో 'నీవు మిక్కిలియు మంచివాఁడవు. నీవు చెప్పినదంతయు వింటిని. అందుల కెంతయు సంతోషించుచున్నాను; గాని యెంతమాత్రము నమ్మఁజాలను. స్తోత్రములు చేసిననుగాని ధనరాసులు గుప్పించినను మరల నీవు నన్నుఁబడయఁ దరముగాదు. చెలికాఁడా! ప్రాజ్ఞు లగువారు కార

ణము లేక శత్రువులవశమునకుఁ బోవరు * (ఈ విషయమై
శుక్రుఁడుచెప్పిన గాథలు రెంటిని వినుము. అవి యేవనఁగా)
దుర్బలునిని బలవంతునిని నిరువురను సమానముగా శత్రువులు
బాధింపఁగా దుర్బలుఁడు బలవంతునితో సంధిచేసికొని బుద్ధి
నూఁది మిక్కిలి యెచ్చరికతోడ మెలఁగవలయును. తన కార్య
ము దీఱినపిదప బలవంతునియందు నమ్మకముంపరాదు. నమ్మఁ
దగనివానియందు నమ్మికయుంపరాదు; నమ్మినవానియందు సైత
మధికముగా నమ్మికయుంపరాదు. ఎప్పుడును నితరులను నమ్మింప
వలయునే కాని తాను వారల నమ్మరాదు. కాఁబట్టి సమస్తము
లయిన యవస్థలయందును దన జీవితమును రక్షించుకొనవల
యును. జీవించియుండినచో ధనములును సంతానములును
నన్నియుఁ బనికివచ్చును. సంక్షేపముగాఁ జెప్పనెడ, నమ్మకుండు
టయె ధర్మశాస్త్రముల యుత్కృష్టమయిన మతము. ఈ కారణ
మునుబట్టి మనుష్యులందఱియెడ నమ్మకము లేకుండుట పుష్కల
మయిన హితమును గలిగించును. జనులు తామెంత దుర్బలు
లుగా నుండినను శత్రువులను నమ్మకుండిరేని, వారెంత బలవంతు
లయినను వారికిఁ బట్టువడరు. తాము బలవంతులయినను శత్రువు
లను నమ్మిరేని వారికిఁ బట్టువడుదురు. మార్జాలమా ! నన్ను
నీబోఁటివారివలననుండి యెప్పుడును రక్షించుకొనవలసియు
న్నది. నీవును గుపితుఁడయి కలఁకఁజెందియున్న చండాలుని
వలననుండి నిన్ను రక్షించుకొనుము ' అనెను. ఎలుక యిట్లు
చెప్పగాఁ బిల్లి వేఁటకానిపేరు విన్నంతనే దిగులుగొని † యా

* ఇది యుత్తరదేశ ప్రతులందుఁ గానరాకున్నదని తెలియునది.

† 'కథాంహిత్వా' అని మూ. 'శంఖాంహిత్వా' అని ఉత్తరదేశపాఠము.

ముచ్చటను విడిచి యచటనుండి వేగముగాఁ బాఱిపోయెను. అంత శాస్త్రార్థతత్త్వములనెల్లఁ దెలిసిన యాపలితుఁడు తనబుద్ధి సామర్థ్యము నట్లు నెఱపి మఱియొక బొఱియలోనికిఁ దూఱెను.

భీష్ముఁడు:—ఇట్లు ప్రజ్ఞ గలపలితుఁడు దుర్బలుఁడయ్యు నొక్కండును మహాబలులగు శత్రువులను బెక్కండ్రను వంచించెను. పండితుఁడగువాఁడు సమర్థుఁ డగు శత్రువుతో సంధిచేసికొనవలయును. ఎలుకయును బిల్లియు నొండొరుల నాశ్రయించుటవలన నాపదనుండి విముక్తులయిరి. మహారాజా! నీ కిట్లు క్షత్రియధర్మమునకుఁగల మార్గము విస్తరించి నిరూపించితిని; సంక్షేపముగను జెప్పెదనువినుము. పరస్పరము వైరము గలిగియుండిన యిరువురు సంధి లెస్సగాఁ జేసికొనియున్నను వా రొకరి నొకరు మించవలయునని మనస్సులోపలఁ దలంపు గలిగియుండుట నిజము. అట్టియెడఁ బ్రాజ్ఞుఁ డగువాఁడు తనబుద్ధి బలమునూఁది తక్కినవానిని మించిపోవనేర్చును. ప్రాజ్ఞుఁడు గాని వాఁడన్ననో తన యేమఱుపాటువలనఁ బుద్ధిమంతుఁడగు వాఁడు తన్ను మించిపోవునట్లు చేసికొనును. కాఁబట్టి భయపడినను భయము లేనివానివలె నుండవలెను. నమ్మకుండినను నమ్మికగలవానివలెఁ గనుపట్టవలయును. ఇట్లెచ్చరికగలిగి నడచుకొను వాఁడెన్నఁటికిని బొరఁబడఁడు. పొరఁబడినను నాశమునొందఁడు. కాలమువచ్చినపుడు పగవానితో సంధిచేసికొనవలయును. కాలము పోనఁగినపుడు మిత్రునితోడనైనను యుద్ధము చేయవలయును. ఇట్లు చేయవలయుననియె సంధివిగ్రహతత్త్వముల నెఱింగినవా రెప్పుడును జెప్పుదురు. మహారాజా! ఇది తెలిసి శాస్త్రార్థములను మనసునం దిడి మనుజుఁడు మిక్కిలి పూనికతో నెంతయుఁ

బరాకువడక భయమునకు హేతువు కలుగకమును పే భయపడు వానివలె మెలంగవలయును. మఱియుఁ బురుషుఁడు, భయ హేతువు నిజముగాఁ గలుగకమును పే భయపడినవానివలె శత్రువులతో సంధినిగాని యుద్ధమునుగాని చేయవలయును. భయమువలన నెచ్చరికయుఁ బూనికయుఁ గలబుద్ధి యుప్ప తిల్లును. భయహేతువు రాకమును పే భయమునొందినవానివలె నొకఁడాయితపాటు చేసికొనునేని భయము నిజముగా వచ్చి యున్నపుడు వానికి భయముగలుగదు. ఎప్పుడును భయపడ కుండువానికి భయముకలిగినపు డా భయమునుండి (యా యితపాటులేమిచేఁ గలిగినయశ క్తియనెడి) మఱియొక పెను భయము గలుగుచున్నది. 'ఎప్పుడును భయపడకుము' అని యీ మంత్ర మెవ్వనికి నేవిధమునను జెప్పరాదు. ఎవఁడు తనదుర్బ లత్వము తెలియుటవలన భీతినొందునో వాఁడు సదా బుద్ధి మంతుల యాలోచనము నడుగుచుండును. ఈ కారణములంబట్టి పురుషుఁడు భయముగలిగియు భయము లేనివానివలెను నమ్మ కుండియు నమ్మికగలవానివలెను జూపట్టవలయును. * ఒకఁ డెట్టి గొప్పకార్యములను బట్టియుఁ గూడ నసృతమించుకయుఁ బలుక రాదు. యుధిష్ఠిరా! నీ కిట్లు మూషికమార్జాలములను గుఱించిన యితిహాసమును జెప్పితిని. ఇది విని నీసుహృదులనడుమఁ దగురీతి ననుష్ఠింపుము. ఈకథవలన నుత్తమమయినబుద్ధిని బడసి శత్రు

* 'కార్యాణాం గురుతాంజ్ఞాత్వానానృతం కించిదాచరేత్' అని. కుం. మూలము. 'నాదృతం కించి దాచరేత్' అని. దా. మూలము. కార్యముల గొప్పతనమునుజూచి అనఁగా గొప్పయగు కార్యములందే కన్నిడి యాదరింపఁ దగని వానిని (అల్పమును) కొంచెమైనను జేయరాదు.' అని యర్థము.

మిత్రులభేదములు దెలిసి సంధి విగ్రహములకుఁ దగుకాలములను నెఱిఁగి యాపదలయందు విడివడు నుపాయములను గనుఁగొందువు. తన్నును దనకంటె బలీయుఁ డగువానిని శత్రువు పీడించునపుడు బలీయునితో సంధిచేసికొని కలసియుండి బుద్ధితో మెలఁగుటయుఁ,గార్య మొడఁగూడినపిదప వానిని మరలనమ్మకుండుటయువలయును. రాజా! ఈరీతి ధర్మార్థకామములకు మూఁటికిని విరుద్ధముగానిది. నీవీశ్రుతము ననుసరించి మఱలఁ బ్రజలను రంజించుచు నెంతయు నైశ్వర్యమును బడయుము. పాండవా! నీవెప్పుడును బ్రాహ్మణులతోడఁగూడి మాడి కాలము పుచ్చుచుండుము. బ్రాహ్మణులవలననే నిహమందును బరమందును మిక్కిలియు శ్రేయముగలుగును. వీరెప్పుడు ధర్మమును దెలిసియుందురు. కర్తవ్యము లివి యని యెఱుఁగుదురు. వారిని బూజించినచో శుభములను గావింతురు. కనుక జననాథా! వారిని బూజింపుము. రాజా! నీ వట్లు చేయుటవలన యథాన్యాయంబుగ రాజ్యంబును బరమం బయిన శ్రేయమును గొప్ప యశస్సును గులమునకుఁ గ్రమముగా సంతతియును బడయుదువు. భారతా! మార్జాల మూషికములకు జరిగిన యీసంధి విగ్రహకథ బుద్ధి విశేషము నెంతయుఁ గలిగించునది. దీనిని లెస్సగావింటివి. రాజగువాఁడు దీనిని లెస్సగాఁ గనుఁగొని శత్రుసమూహమందుఁ బ్రవర్తింప వలయును' అనెను. ఇది నూటముప్పదియెనిమిదవయధ్యాయము.

---

*

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు యుధిష్ఠిరునకుఁ బూజనీ బ్రహ్మదత్త సంవాదమును జెప్పుట.

ధర్మరాజు 'మహాబాహూ ! నీవు శత్రువులం దెంతమాత్రము నమ్మికయుంపరాదని యాలోచనము చెప్పితివి. రాజెవ్వరియందును నమ్మిక లేకుండినయెడలఁ దానెట్లు మనఁగలఁడు ? నమ్మకమువలన రాజులకు మిక్కిలియు భయము గలుగునంటివి. రాజితరులను నమ్మకయెట్లు శత్రువులను జయింపనేర్చును ? నాయీసందేహము నుడుపుము. నమ్మకుండుటను గుఱించి నీవు ముచ్చటించినదానిని వినఁగా నామనసేమియుఁ దోఁచక తడఁబడుచున్నది' అనెను.

భీష్ముఁడు 'రాజా ! బ్రహ్మదత్తుం డనురాజునకును నతనియింటియం దుండినపూజని యను పక్షికిని, జరిగిన సంవాదమును వినుము. కాంపిల్యదేశమందు బ్రహ్మదత్తుం డను రాజుగలఁడు. అతని యంతఃపురమునందుఁ బూజని యనునొకపక్షి చాలఁగాలముగా నతనితోఁగూడ వసించియుండెను. అది * జీవజీవక మను పక్షివలెనె యన్నిమృగముల యెలుంగులును దెలిసియుండెను. అది పుట్టుకయందుఁ బక్షియైనను దాని కన్నియును నన్నితత్త్వములును దెలియును. అది యక్కడ వసించియుండునపుడు మంచివర్చస్సుగల యొక పిల్లనుగనెను. అక్కాలముననే రాజునకును నతనిదేవియందు నొకపుత్త్రుఁడు పుట్టెను. పూజని రాజింటనుండినందులకు నతనియెడ నెనరుగలదై ప్రతిదినమును సముద్రతీరములకుఁబోయి తనకూనకును రాజపుత్త్రునకును బోషణము

---

* జీవజీవకమనునది యొకపక్షి. వేఁటకాఁడనియుఁ గొందఱర్థము చేసెదరు.

నకై రెండుపండ్లను దెచ్చి యిచ్చుచుండెను. అందలియొక పండును దనకొడుకునకును మఱియొక పండును రాజకుమారునకును నిచ్చును. అది తెచ్చుపండ్లు, అమృతము నాస్వాదించినట్లు మిక్కిలి రుచ్యములై బలమును దేజమును బెంచునట్టివిగా నుండెను. అది ప్రతిదినము నట్లె యాపండ్లను దెచ్చుచును నట్లె యిచ్చుచు నుండెను. పూజని యిచ్చు పండ్లను దినుటవలన రాచబిడ్డఁడు మిక్కిలియు బలమునొందెను. ఒకనాఁ డా రాజకుమారుఁడు దాది చంకయందుఁ దన్నుఁ గొనిపోవుచుండునపుడు పూజని కొడుకును జూచెను. అబిడ్డఁడు దాదిచంకనుండి దిగి యాపిట్టయొద్దకుఁ బరుగెత్తివచ్చి బాల్యమువలన దానితో మిక్కిలి యక్కఱగా నాటలాడుకొనసాగెను. వాఁడు కడపటఁ దన యీడుగల యాపిట్టను నెవరు లేనప్పుడు చేతనెత్తికొని నలిపి చంపి యంత దాదిచేతికి నెత్తుకొనుటకు వచ్చెను. ఆపూజని పండ్లను దీసికొనివచ్చి యా బాలుఁడు నేలఁ దనపుత్రునిఁ జంపివైచియుండుటను జూచెను. అది మొగమునిండఁ గన్నీరు వెల్లిగొనఁ గూలినకొడుకునుజూచి దీనయై మిక్కిలి దుఃఖమునఁ దపించి యేడ్చుచు 'క్షత్రియునితోడి పొత్తు తగదు. వానితోడి చెలిమియుఁదగదు. వానియెడఁ బ్రీతియుఁ దగదు. వారి కేదేని కార్యము కావలసియుండునేని మంచిమాటలతో లాలించి పనితీఱినదే దిగవిడుతురు. క్షత్రియులెల్ల వారికి నపకారము చేయువారుగాన వారినెప్పుడు నమ్మరాదు. అపకారము చేసినపిదప నయితము వారెప్పుడును వట్టి పనికిమాలిన తియ్యనిమాటలమాత్రము బుజ్జగించుచుందురుగాని బదులునకుపకరింపరు. ఈకృతఘ్నుఁ డీ క్రూరుఁ డీవిశ్వాసఘాతుకుఁడు చేసిన యీపనికి వైరము తప్పక దీర్చుకొనెదను. వీఁడు తనపుట్టిన

వాఁడే పుట్టి తనవెరిఁగినచోటనే వెరిఁగి తన పొత్తున భుజించి తన్ను శరణుఁగాఁ గొనియున్న నాయీబిడ్డనిఁ జంపినాఁడుగాన మూఁడువిధములయిన పాపములు చేసియున్నాఁడు' అని యిట్లు చెప్పి యంతఁ దనకాళ్లతో రాచకుమారుని కన్నులను బొడిచి దానివలనఁ గొంతయూఱటనొంది మరల నిట్లనియె—'ఒకఁడు పాపమును వలయునని కోరిచేయునేని వానిని దోడనే యది పయికొనుచున్నది. చేసినదానికి బదులుచేసి తీర్చుకొన్నవారికి దానివలన శుభాశుభములు నశింపవు. ఒకఁడుచేసిన పాపమునకు ఫలము వానియందుఁ గనుపట్టకపోయినచోనదివానిపుత్త్రులందును మనుమలయందును మునిమనుమలయందును వచ్చిపడుచున్నది' అనెను. బ్రహ్మదత్తుఁడు తనకొడుకును బూజని కన్నులుపొడుచుటను జూచి యది తన కొడుకుచేసినందులకుఁ దగిన ప్రతియని తలఁచి యాపక్షితో 'మేము నీకొక యపకారముచేసితిమి. నీవు బదులునకు నపకారముచేసితివి. రెండును సమముగానే యున్నవి. నీ విచటనుండి పోవలదు. ఇచటనే యుండుము' అనెను.

పూజని—'ఒకఁ డొకప్పుడు మఱియొకని కపరాధముచేసి వానియింటనే పోవక నిలిచియుండునేని పండితు లట్టినడకను గొనియాడరు. అటిసితియందు నపరాధికి తొలఁగి చనుటయె మేలు. వైరము బాహాటముగానున్నచోట వారెంత మంచిమాటలుచెప్పి బుజ్జగించినను నమ్మియుండరాదు. అట్లు నమ్మునట్టి మూఢుఁడు శీఘ్రముననే చంపఁబడును. వైరము త్వరలో నుపశమింపదుగదా. పరస్పరము వైరముగలవారి పుత్త్రులును బౌత్త్రులునుగూడ నావైరము కొనసాగుటవలన నాశమునొందుదురు. అట్లు పుత్త్రులును బౌత్త్రులును నశించుటవలన వారికిఁ బరలోక

మును నశించుచున్నది. ఒండొరులయందు వైరముగలవారికిఁ బరస్పరము నమ్మికలేకుండుటయే సుఖావహము. విశ్వాసఘాతుకుఁ డగువానియం దెడతెగక విశ్వాస ముంపరాదు. విశ్వసింపని వానియందు విశ్వాసముతగదు. విశ్వసించినవానియందు సయితము మిక్కిలి విశ్వాసముతగదు. విశ్వసించుటవలనఁ బుట్టెడి భయము వేళ్లనుగూడఁ ద్రెంచివైచును. పరులను వలయునంత నమ్మింపనైనవచ్చును గాని తానుమాత్రము నమ్మరాదు. బంధువులయందుఁ దలిదండ్రులె శ్రేష్ఠులు. * భార్య క్షేత్రము (పొలము) వంటిది. పుత్త్రుఁడు బీజమాత్రము. తోఁబుట్టువగు వాఁడు (ధనమును బంచుకొనుటచే) శత్రువు. మనుష్యుఁడు (చేతఁ దడియుండునంతవఱకు) మిత్త్రము. ఆత్మయొక్కటియె సుఖదుఃఖముల ననుభవించునది. పరస్పరము వైరముగలవారికి సంధిపొసఁగదు. † నే నిక్కడ వసించుచుండినందులకుఁ గలహేతువు గడచి పోయినది. ఇపుడు లేదు. పూర్వమపకారము చేసినవానిని నపకృతుఁడయినవాఁడు, ధనములిచ్చియు సత్కృతులుచేసియుఁ బూజించుచుండుఁ గొలఁదిని నపకారిహృదయ మపనమ్మకమునొందుచుండును. అట్టి పూజాదులు బలవంతుఁడుగా నుండువాఁడు చేయునేని దుర్బలులకు దిగులు పుట్టించుచున్నవి. బుద్ధిమంతుఁడగు వాఁడు తా నెచ్చటఁ బిదప నవమానమునొందుటకే మొదట సమ్మానమునొందునో యచ్చోటును విడిచిపెట్టవలయును. తన శత్రువువలనఁ బిదపఁగూడ సమ్మానము గలిగినను వాఁడల్లె

---

* 'భార్యాజరా' యను పాఠమున వీర్యహారమైన జర (ముదిమి) వంటిదని యర్థము. 'భార్యాపాత్రం' అని (ప్రతాపచంద్ర)

† ఇట హేతువు పుత్రరక్షగాని స్నేహముగాని గావచ్చును.

నడచుకొనవలయును. నేను నీ గృహమందు దీర్ఘకాల మేహింస యు లేక సుఖముగా వసించియుంటిని. ఇప్పుడు వైరము పుట్టి నది. సుఖం బుండుము. పని వినియెదను' అనెను. బ్రహ్మ దత్తుఁడు 'పూజనీ ! ఎవఁడు చేసినదానికి బదులుచేయు నో వాఁడట్లు చేసినందులకు నపరాధిగాఁడు. దానివలన వాఁడు ఋణ మీఁగినవాఁడగుచున్నాఁడు. కాఁబట్టి యిచటనే యుం డుము. పోవలదు' అనెను. అందులకుఁ బూజని 'మొదట నప రాధము చేసినవానికిని పిదపబదులు చేసినవానికిని మరల సఖ్య మొనఁగూడదు. ఆవిషయమును జేసినవానిమనసునకును బ్రతిచేసిన వానిమనసునకును రెంటికిని దెలియు'ననెను. బ్రహ్మదత్తుఁడు 'చేసిన వానికిని బ్రతిచేసినవానికిని మరల సఖ్యముపొసఁగును. అట్టికూడి కయందు వైర ముపశమించినట్లు కనుపట్టుచున్నది. మరల నట్టి యెడఁ గ్రొత్తగా నొకపాపమును గలుగకున్నది' యనెను.

పూజని-'వైరమెన్నటికిని గడచిపోయినదిలేదు. నన్ను మంచి మాటలాడినాఁడని తలఁచి యపకారము నొందినవాఁడు శత్రు వును నమ్మియుండరాదు. ఈలోకమున మనుష్యులు గ్రుడ్డితన ముగా నమ్ముటచేఁ జిక్కులుపడెదరు. కాఁబట్టి యొండొరుల కగ పడకుండుటయే మేలు. మిక్కిలి వాఁడియైన యాయుధముల చేతను బలిమిచేతను లోఁపఱుచుకొనరానట్టివారిని, వెంటి యేనుఁగులచేత మగయేనుఁగులంబోలె, (కపటంబగు) సామ ముచేత నడంచి లోఁపఱుచుకొనవచ్చును' అనెను. అందులకు బ్రహ్మదత్తుఁడు 'ఒకరికొకరు ప్రాణాంతకు లైన వారికిఁగూడ నొక చోటనే కూడిమాడి వసించియుండుటవలనఁ గుక్కను జంపి తిను చండాలునికిని గుక్కకునుంబోలె బరస్పరము స్నేహ

మును విశ్వాసమును గలుగుట గలదు. ఒకరియెడ నొకరు వైరముగలవారికిని నొక్కటఁగూడి వసించుటవలనవారివైరము మెత్తఁబడుచున్నది. మఱి యది తామరాకునందలి నీరువలె నిలిచియుండదు' అనెను. అందులకుఁ బూజని 'వైర మైదు కారణములవలనఁ బుట్టుచున్నది. వానిని బండితులు తెలియుదురు. ఆయైదుకారణములును * స్త్రీ, వాస్తువు, (పరుసని) మాటలు, స్వభావ (విరోధ)ము, అపరాధము అనునవి. అందు వైరమెవరితోఁగలదో వాఁడు దాతయగునేని చంపరాదు. విశేషించి క్షత్రియునకు, నట్టివానిని బ్రకాశముగాఁగాని రహస్యముగాఁగాని చంపుటతగదు. అట్టివిషయమందా పురుషుని దోషమునకుఁగల బలాబలము తెలిసికొనవలయును. సుహృదుఁడయినను వైరము కలిగినపిదప వాని యందు నమ్మిక యుంపరాదు. కట్టెలందగ్గి గూఢముగా నుండునట్లు వైరము వారియందుఁ బ్రచ్ఛన్నముగా నుండును. వైరమనెడునగ్గి ధనము లిచ్చినను బరుసములాడినను మంచి మాటల బుజ్జగించినను చదువులు చదివియున్నను సముద్రమునందు బడబాగ్నియుంబోలెఁ జల్లాఱదు. ఒకతూరి యపరాధమువలనఁ బుట్టిన వైరాగ్ని యొకమాటు దరికొనెనా, రాజా! యిరు దెసలలో నొకనిని గాల్చిపుచ్చక పోనుఁగువడదు. ఒకఁడు మఱియొకనికపకారముచేసియున్నచో పిదప దానెంతధనములిచ్చియు

* ఇందు మొదటికారణమువలన వైరము కృష్ణశిశుపాలురకును, రెండవదానిచే కౌరవపాండవులకును, మూఁడవదానిచే ద్రోణద్రుపదులకును, నాలుగవదానిచే పిల్లియెలుకలకును, ఐదవదానిచేఁ బూజునికిని బ్రహ్మదత్తునకును గలిగినవని తెలియునది.

సమ్మానములు చేసియుఁ బూజించినను నామఱియొకనియందుఁ జెలిమిగాని నమ్మికగాని గలిగియుండరాదు. అపరాధకర్మమే యుపకారము చేసినవానికి జంకు గలిగించుచున్నది. నీకు నే నెప్పుడు నపకారము చేయలేదు. నీవును నాకెప్పుడు నపకారము చేయవు. ఈ కారణమును బట్టి నేను నీయింటి వసించియుంటిని. అదంతయు నిపుడు మాఱిపోయినది. ఇప్పటికి నిన్ను నమ్మఁజాల నయ్యెదను' అనెను.

బ్రహ్మదత్తుఁడు 'కాలమే యొక్కొక్క కార్యమును జేయుచున్నది. కార్యములు పెక్కువిధములు. అవియన్నియు కాలము చేతనే నడచుచున్నవి. కాఁబట్టి యెవఁడెవనికి నపరాధము చేయుచున్నాఁడు? జన్మమును మరణమును నొక్కవిధముననే కలుగుచున్నవి. ప్రాణులు కాలము చేత (కార్యములు) చేయింపఁబడుచున్నవి. (పుట్టుచుఁ గిట్టుచున్నవి) అవి జీవము దూలుటకును గాలమే నిమిత్తము. కొన్ని యొక్కుమ్మడినే గిట్టుచున్నవి. కొన్ని యొక్కొక్కటిగా గిట్టుచున్నవి. కొన్ని చాలఁగాలము బ్రతుకుచున్నవి. నిప్పు కట్టియలను గాల్చునట్లు కాల మన్నిటిని గబళించుచున్నది. శుభాత్మురాలా! నేను నీదుఃఖమునకు నిమిత్తము గాను; నీవు నాదుఃఖమునకుఁ గావు. కాలమే దేహధారులకెల్ల నిత్యమును సుఖమును దుఃఖమును నేర్పఱచుచున్నది. కనుక నీ విచట నీయిచ్చచొప్పున నాయందు నెయ్యము తియ్యము గలిగి యేబాధయునొందక వసించియుండుము. నీవు చేసినది క్షమించితిని. పూజనీ! నీవును నన్ను మన్నింపుము' అనెను.

పూజని 'కాలము నీవు చెప్పిన ట్లన్నిటికిని గారణమగునేని, యొకనికి మఱొక్కనియందు ద్వేషముగలుగదు. బంధువులు తమబంధులు చంపఁబడినయెడల నేల యట్లు చంపినవారిపైఁ బగతీర్చుకొనఁ జూచెదరు? దేవతలును నసురులును నందఱును నొకరి నొకరేల తొల్లి కొట్టుకొనిరి? కాలముచేతనే సుఖదుఃఖములును జనన మరణములును గలుగునేని, వైద్యులెందులకు రోగులకు మందులు సేయఁగోరెదరు? కాలమే దేనిని బరిపక్వము చేయునదేని మందులేల? జనులు శోకమున మూర్ఛితులై (మైమఱచి) యేల మిక్కిలియు బిట్టుగాఁ బలవించెదరు. కాలము నీవుచెప్పిన ట్లన్నికార్యములకుఁ గారణమగునేని, ధర్మకర్మములు చేయువానికే ధర్మముకలుగుట యెట్లు? నీకొడుకు నాకూనను జంపినాఁడు. నే నందులకు వానిని హింసించితిని. రాజా! ఇఁక నేను నీవు బాధించుటకుఁ బాత్రమనయితిని. నేను బుత్రశోకముచేత నీకొడుకునం దిట్టి పాపము చేసితిని గదా; కావున నీకు నట్లె నన్నుఁ గొట్టవలసిన దయ్యెను. అందులకుఁగల కారణమును గలరూపున వినుము. మనుష్యులు భక్షించుటకో లేక వేడుకగాఁ బంజరములఁ బెట్టుకొనుటకో పిట్టలను గోరుదురు. వధించుటయు బంధించుటయుఁ దప్ప మూఁడవకారణము మఱియొక్కటి తగినదిలేదు. పక్షులు కొన్ని వధమునకును బంధమునకును వెఱచి తప్పించుకొని పాఱిపోవు నుపాయము నాశ్రయించుచున్నవి. వేదవిదులగువారు దుఃఖము పుట్టుకవలనను జావువలనను గలుగునందురు. అందఱకును ప్రాణములుతీపు. అందఱకును గన్నబిడ్డలయందు గారాము. అందఱును దుఃఖమునకు వెఱతురు. అందఱును సుఖమునకే యువ్విళ్లూరుదురు. బ్రహ్మదత్తా! దుఃఖ

మునకుఁ గారణములు వెక్కు-గలవు. ముదిమి దుఃఖము. ధననాశము దుఃఖము. అనిష్టమగువానితోఁ గూడియుండుట దుఃఖము. ఇష్టములగువాని నెడఁబాయుట దుఃఖము. వధమువలనను బంధమువలనను దుఃఖముగలుగుచున్నది; స్త్రీవలనను దుఃఖముగలుగుచున్నది; సహజములయిన కారణములవలనను నదిగలుగుచున్నది. పుత్రమరణమువలనఁ గలుగుదుఃఖ మెప్పుడునుజనులను జుట్టుకొనియుండును. పరులకు దుఃఖము కలుగుటవలనఁ దమకు దుఃఖము లేదని బుద్ధిలేనివారు కొందఱు పలుకుదురు. ఎవఁడు దుఃఖమును బొంది యెఱుఁగఁడో వాఁడే మహాజనుల నడుమ నిట్లు వదరును గాని, యెవ్వఁడు దుఃఖమునఁ బీడితుఁడయి శోకము నెఱుంగునో వాఁడిట్లేల పలుకఁదలంచును? సమస్త విధములయిన దుఃఖములను జక్కఁగాఁ జవిచూచినవాఁడు తనదుఃఖమునం దెట్లో యట్లే పరులదుఃఖమునందును శోకించును. రాజా! నీవు నాకేమి చేసితివో, మఱి నేను నీకేమిచేసితినో, వీనిని మాయఁజేయుటకు నూఱేండ్లయినను జాలవు. మనము పరస్పరమిట్లు చేసినపిదప సంధి పొసఁగదు. నీవు పుత్త్రునిఁ దలఁచుకొనుకొలఁదిని నాయందు వైరము క్రొత్తఁగాఁ గలుగుచుండును. ఒకఁడొకనిపయి వైరమును దీర్చుకొన్నపిదప వానితోఁ బ్రియముగావించుకొనఁ గోరెనేని యాయిరువురకు, మట్టికుండ పఱియలొకటిగాఁ గూడికొననేరనియట్లు, సంధి కలుగఁజాలదు. నమ్మిక సుఖము గలిగింపదమట సర్వశాస్త్రములయందలి సిద్ధాంతము. తొల్లి శుక్రుఁడును రెండుగాథలనుఁ బ్రహ్లాదునికిఁ జెప్పెను. అవి యేవనఁగా—

శత్రువు చెప్పుమాటలు సత్యమయినను, నసత్యమయినను

నెవఁడు నమ్మునో వాఁ * డెండుగడ్డి గప్పియున్న గోతిలో నున్న తేనెను నమ్మి దినునట్టివారుంబోలె నాశమునొందును. వైరములు,కులమందుఁ బదియుగము లయినను జల్లాఱవు. ఆకులమందుఁ బుట్టియున్న పుత్త్రులకుఁ దమపూర్వుల వైరమును దండ్రులు చెప్పుచునుందురు; (కానయది తరములబడి సాఁగుచునే యుండును) అనుటయే. రాజులు వైరముల నడఁచుకొని మొదట మంచి మాటలు పలుకుచుందురు; పిదప సమయమురాఁగా నిండినకుండను ఱాతిమీఁదవైచి పఱియలు గావించునట్లు వాని నుఱుముదురు. రాజా! 'ఈలోకమందు రాజొకనికిఁ గీడుచేయునేని, పిదప వానిని నెప్పుడును నమ్మరాదు; ఒకని కపకారము చేసినపిదప వాని నమ్మినచో దుఃఖము పాలగును' అనెను. అందులకు బ్రహ్మదత్తుఁడు 'ఒకరియందును విశ్వాసము లేకుండిన యెడల నర్థమును సేకరింపఁదరముగాదు; ఒకటియుఁ జేయ శక్యముగాదు. ఎప్పుడు నొక్కరూపున భయమే పడుచుండువాఁడు చచ్చినవానికి సాటియగునే' యనెను. పూజని 'ఎవనికి నడుగులు పుండ్లుగలవియో వాఁడు పరుగిడునేని యెంతమెలఁకువతో నట్లు చేసినను వానికాళ్లు పడి నొవ్వకమానవు. ఎవ్వనికిఁ గన్నులు తెవులుగలిగియుండునో వాఁ డాకన్నులను గాలికెదురుగాఁ బట్టి చూచునేని, యాకన్నులకు గాలిచేత మిక్కిలియుఁ దెవులు తప్పకకలుగును. ఎవఁడు తనబలము దెలియక చెడ్డమార్గమునఁ బోవ సమకట్టి యట్లు యెడతెగక పోవునో,వానిబ్రతుకును దుద

* కొండలయందుఁ దేనెను వెదకుచుఁబోవువాఁడు తేనెటీఁగలు పోవుదారియందే కన్నుగలిగి యుండుటచే నందలిగోతులు మొదలగు వానియందుఁబడి కెడయుట గలదు. (ప్రతాపచంద్ర.)

ముట్టించుకొనును. సేద్యగాఁడెవఁడు వర్షమును దెలిసికొనక పొలము దున్నునో వాఁడు తనప్రయత్నమంతయుఁ జెడఁగా నందులకు ఫలమును బొందకపోవును. ఏమనుష్యుఁడు ప్రతిదినమును దనకు హితమయిన (పోషకమైన) యాహారమును, (అది చేఁదుగనో, యొగరుగనో, కమ్మగనో, తీయగనో, యెట్లుండినను లోఁగొనునో వాఁడు చిరాయువు గలిగియుండును. ఎవఁడు తనకుఁ బథ్యమయిన యాహారమును దెలివిలేమివలన విడిచి దుష్టమయిన భోజనమును, దానివలని ఫలమును దెలిసికొనక కుడుచునోవాని జీవిత మంతటితోఁ దుదముట్టును. దైవమును బురుషకారమును నొకటి నొకటి యాశ్రయించుటచే నెలకొనియుండును; అట్లాశ్రయింపనిచో నెలకొనఁజాలవు. గొప్పరకమువారు పురుషకారమునే యనువర్తింతురు. మగతనము లేని పందలే (పాటుపడక) దైవము నొక్కటినే నమ్మియుందురు. తీక్ష్ణమో, మృదువైనదో, తనకు హితమయిన కార్యమును దప్పక చేయవలయును. స్వభావముచేఁ బాటుపడకుండు నట్టివాఁడు తుదకుఁ గానునులేక యెప్పుడును నరములబారిఁ జిక్కియుండును. * కాఁబట్టి సంశయింపఁదగినట్టి కార్యమందును బౌరుషమునే కావింపవలయును. మనుష్యులు తమకుఁ గలయంతయు నయినను దిగవిడిచి యాత్మహితమును గావించుకొనవలయును. విద్య, శౌచము, సామర్థ్యము, బలము, శౌర్యము ననెడి యీయైదును దోడఁబుట్టిన మిత్రములందురు. బుధు లగువారు వీరి సహాయము

---

* తస్మాత్సంశయితేఽప్యర్థే కార్య ఏవ పరాక్రమః' అని(దా. మూ.) తస్మాత్సర్వం వ్యపోహ్యార్థం' అని ఉత్తరశ్లోకములు. సమస్తములయిన విషయముల విడిచి పౌరుషమే కావింపవలయునని యర్థము.

ననే యీలోకమందుఁ గాలమువుత్తురు. గృహములు, రాగి మొదలగు లోహములు, పొలము, భార్య, సుహృత్సమూహము ననెడి యివి శ్రేయమునకు నుపసాధనములుగా బుధులు చెప్పె దరు. మనుష్యుఁడు వీని నెల్లయెడలను బడయవచ్చును. ప్రాజ్ఞుం డన్నియెడలను రమించుచుండును : అతఁ డన్నియెడల వెలుంగు చుండును. అతఁడు దేనికి బెదరుపుట్టింపఁడు. బెదరుపుట్టించినను భయమొందఁడు. బుద్ధిమంతుఁ డగువానికిఁ గలధనమెంత యల్ప ముగానుండినను నిత్యమును పెరుఁగుటతప్పదు.అట్టివాఁ డొక్కొ క్క కార్యమును నేర్పుతోఁ జేయును. సంయమమువలన (ఆత్మ నిగ్రహమువలన) నతఁడు మంచిప్రతిష్ఠ నొందును. గృహస్థ వృత్తియందలి నెయ్యమునకులోనై యల్పబుద్ధు లగు మనుష్యుల మేనిమాంసములను గుత్సితస్త్రీ, యాఁడు ఱెండ్రిని దానిపిల్లలుం బోలెఁ, దినివైచును. కొందఱు మనుష్యులు బుద్ధితడఁబడుట వలనఁ దమయిండ్లను విడువఁగలిగినచో మిక్కిలియు సొంపు గుంది 'నాయిల్లిది, నాభూములు, నామిత్రములు, నాదేశము, వీనినెట్లు దిగవిడుతు' నని డిందుపడుచున్నాఁరు. * ఒకఁడు తన స్వదేశము వ్యాధిచేతను దుర్భిక్షముచేతను బీడితమై యున్నచో దానిని దప్పక విడువవలయును. ఒకఁడు తనదేశ మందు నెప్పుడును సందఱచేతఁ బూజితుఁడై వసించియుండవల యును. అట్లుగానిచో మఱియొక దేశమునకుఁబోయి వసింప

* 'ఉత్పతేత్సహజాద్దేశా ద్వ్యాధిదుర్భిక్ష పీడితాత్' అని గౌ.మూలము. "ఉత్పథాచ్చ విమానాచ్చ దేశాద్దుర్భిక్షపీడితాత్' అని (దా.మూలము.) తప్పు దారినుండియు నవమానముగల పట్టునుండియు కఱవుగల దేశమునుండియు నని యర్థము తెలియునది.

వలయును. ఈకారణమునుబట్టి నేను మఱియొకచోటికిఁబోయె దను. నే నిక్కడ నుండుటకెంతమాత్రమొల్లను. ఏలన నేను నీ పుత్త్రునకు గొప్ప నేరముగావించి యున్నాను. చెడ్డయిల్లాలిని, చెడ్డపుత్త్రుని, చెడ్డరాజును, చెడ్డసుహృదుని, చెడ్డచుట్టమును, చెడ్డ దేశమును దూరముననే విడువవలయును. చెడ్డమిత్త్రునియందు విశ్వాసముండదు. చెడ్డభార్యయందు రతియెక్కడిది. చెడ్డ రాజ్యమం దూఱటగలుగదు. చెడ్డదేశమందు బ్రతుకుఁదెరు వుం డదు. చెడ్డపుత్త్రునియందు మంచిమనస్సుగలుగదు. చెడ్డసంబంధ మందు ధనమునకు నాశముకలిగినచో నవమానము కలుగును. ఎవ్వతి ప్రియముగఁ బలుకునో యదిభార్య. ఎవనివలన సుఖముగలు గునో వాఁడు పుత్త్రుఁడు. ఎవనియందు విశ్వాసముదగునో వాఁడు మిత్త్రుఁడు. ఎచ్చట బ్రతుకుగలుగునో యది దేశము. ఎవఁడు నిర్బంధింపఁడో, బీదలను బోషించునో, ఎవనిరాజ్యమందు భయ ముగలుగదో, వాఁడు దిట్టమయినశాసనము గలరాజు. రాజు గుణవంతుఁడును ధర్మమును జరుపువాఁడునై యుండునేని భా ర్య, దేశము, మిత్త్రులు, పుత్త్రులు, సంబంధులు, బంధులు నందఱు నొకనికి సుఖముగాఁ బడయనగును. రాజు ధర్మమును బాటింప లేని యతని దేశమందలి ప్రజలు, నిగ్రహామువలన (పీడనము వలన) నశింతురు. పరాకులేక పరిపాలించునట్టి రాజే ధర్మార్థకా మములకుమూలము. రాజు ప్రజలవలననుండి ఫలమునం దాఱవ పాలు పన్నుపుచ్చుకొని యుపయోగించుకొనవలయును. ప్రజ లను జక్కఁగాఁ బరిపాలింపని రాజు నిజమునకు దొంగయె. ఏ రాజు, అభయమొసంగి, పిదప ధనమందలి పేరాసవలన దాని నెఱవేర్పఁడో యా యధర్మబుద్ధి ప్రజలందలిపాపములను దాను

గయికొని తుదకు నరకమునుబొందును. ఏరాజు,అభయమొసంగి యట్లు దానిని నెఱవేర్చునో యతఁ డట్లు ప్రజలను ధర్మంబునఁ బరిపాలించుచుండుటవలన సర్వసుఖావహుఁడని యెన్నఁబడును. రాజు తండ్రియు, దల్లియు, గురువును, రక్షకుఁడును, అగ్నియుఁ, గుబేరుఁడును, యముండు నగునని యతనికి నీయేడుగుణము లను బ్రజాపతియగు మనువుచెప్పెను. రాజు ప్రజలయెడఁ గనికరముతోఁ బ్రవర్తించునేని యతఁడు వారికెల్లఁ దండ్రియగును జుమీ. అతనియొద్దఁ గపటముగా వర్తించునట్టి మనుజుఁడు మఱుసటిజన్మమునఁ దిర్యక్కుగాఁ బుట్టును. ప్రజలకు మేలు సేయుచు, బీదలను బోషించుచుండుటవలన రాజు వారలకుఁ దల్లియగుచున్నాఁడు. దుష్టులను గాల్చుటచే నగ్నియునియు, అహితుల నడంచుటచే యముఁడనియు నెన్నఁబడుచున్నాఁడు. ఇష్టులయినవారికి ధనములొసంగుటవలన రాజు కామముల నిచ్చు కుబేరుఁ డగుచున్నాఁడు. ధర్మముల నుపదేశించుటవలన గురుండును బరిపాలించుటవలన రక్షకుండు నగుచున్నాఁడు. పురజనులను దేశజనులను దనగుణములచే నెవఁడు రంజించునో యతఁడు రాజనుటకుఁ దగియుండుటకాక యట్టిగుణములను ధర్మములను బాలించుటవలన నతనినుండి రాజ్యమును వీడదు. ఎవఁడు పౌరజనులను దేశజనులను బూజించుట లెస్సగాఁ దెలియునో యతఁ డిహమందును బరమందును నేకీడునొందక సుఖముగా నుండును. ఎవ్వని ప్రజలు బరువయిన పన్నులచేఁ బీడితులయ్యు నతనికి నెల్లపుడును భయపడుచును, అనర్థములచేతఁ గ్రుంగుచును నుందురో,యారాజు ప్రజలచేత నోటువడును.ఎవ్వని ప్రజలు సరస్సునందుఁ దామరలుంబోలె వర్ధిల్లుచుందురో యా

రాజు సర్వసుఖావహుఁడని వాసికెక్కుటయె కాక స్వర్గలోకమం దెంతయుఁ బూజితుఁడగును, రాజా! బలవంతునితోడ విగ్రహ మొకప్పుడును గొనియాడఁదగదు. బలవంతునితోడ విరోధము గలరాజునకు రాజ్యమెక్కడిది? సుఖముగాని యెక్కడిది?' అనెను.

భీష్ముఁడు 'ఆపక్షి బ్రహ్మదత్తున కిట్లుచెప్పి యతనిచేత నీడ్కోలు వడసి తనయిష్టమయినదిక్కునకుఁ బోయెను. బ్రహ్మదత్తునకును బూజనికిని జరిగిన యీ సంభాషణమును నీకుఁ జెప్పితిని. ఇంకను మఱేద్ది వినఁగోరెదవు?' అని యడిగెను. ఇది నూట ముప్పదితొమ్మిదవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

{భీష్ముఁడు శత్రుంతపునకు భరద్వాజుఁడు చెప్పిన యాపద్ధర్మమును ధర్మరాజునకుఁ జెప్పుట.}

ధర్మరాజు 'యుగము క్రమముగాఁ గడచిపోవుటవలన ధర్మమును జనులును నలుగడల క్షీణింపఁగా లోకము దొంగలచేఁ బీడింపఁబడుచుండఁగా నపుడు రాజెట్లుండవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'భారతా! అట్టి యాపదలందు రాజెట్టినీతిని బూనవలయునో, దయ సయితము దిగవిడిచి యెట్లు నడచుకొనవలయునో, నీకుఁ జెప్పెదను. ఈ విషయములందు శత్రుంతపుఁడనురాజునకును భరద్వాజమునికిని జరిగిన సంవాదమయిన యీయితిహాసమును నుదాహరించుచున్నారు. సౌవీరదేశమునకు

శత్రుంతపుఁ డనురాజుండెను. అతఁడు మహారథుఁడు. అతఁడొకప్పుడు భరద్వాజునికడకుఁ బోయి యర్థ (ధన) శాస్త్రముల సిద్ధాంతముల నడుగువాఁడై 'లభింపకున్న వస్తువు లభించుట యెట్లు? లభించినదానిని బెంచుటయెట్లు? పెంచినపిదప దానిని రక్షించుటయెట్లు? రక్షించినపిదప దాని నుపయోగించుట యెట్లు?' అని యడిగెను. అర్థవిషయమయిన నిర్ణయముల నిట్లడుగఁగా మతిమంతుఁ డాఋషి సహేతుకములైన యుత్తమ వాక్యముల 'రాజెప్పుడును దండమును జేతఁగొని యుండవలయును. ఎప్పుడును బౌరుషమును మెఱయుచుండ వలయును. తనయందు ఛిద్రములు గలిగించుకొనక పరులయందలి ఛిద్రములను గనుఁగొనుచుండవలయును. పరులయందలి సందులను వెంబడించి పయినెత్తవలయును. దండమెప్పుడును బూనియుండు రాజునకు జను లెంతయు వెఱతురు. కాఁబట్టి సమస్తములయిన ప్రాణులను దండముచేతనే యడంచి యేలవలయును. తత్త్వదర్శులగు పండితు లీదండమునే కొనియాడెదరు. కాఁబట్టి యీనాలుగింటియందును (అనఁగా సామదానభేదదండములయందు) దండమే ప్రధానమయినదని చెప్పఁబడుచున్నది. ఒక పట్టునకు (రాజ్యమునకు) నాధారములయినవి నశించినచో దానిని నాశ్రయించి బ్రతుకు నవియెల్ల హతము లగుచున్నవి. ఒక పెద్దమ్రానివేళ్లను నఱికినయెడల దానికొమ్మ లెట్లు నిలిచియుండును? పండితుఁ డగురాజు పగవానిమూలమునే మొదటఁ ద్రెంపవలయును. పిదప వానిసహాయులను దక్కినవాని పక్షమువారిని నందఱను గూల్పవలయును. ఆపద వచ్చినకాలమందు రాజు ముందువెనుక విచారింపక, చక్కఁగ నాలోచించుటయు,

చక్కఁగాఁ బరాక్రమించుటయు,చక్కఁగయుద్ధము సేయుటయు, వలయునేని లెస్సఁబాఱిపోవుటయుఁ గావింపవలయును. రాజు వాక్కునందుమాత్రము వినయముగలిగి యుండవలయునుగాని హృదయమందు మంగలికత్తివలె వాఁడిగలిగి యుండవలయును. మఱియుఁ గామక్రోధములనువర్జించి మెత్తఁదనముతో మాటలాడవలయును. శత్రువుతోఁ గూటువగలిగి యుండవలసివచ్చినపుడు మంచిబుద్ధిగల రాజు వానితోసంధిచేసికొని వానియందు గుడ్డినమ్మిక యుంపకుండవలయును. వానితోడి పని తీఱఁగానే శీఘ్రముగా వానినుండి మరలవలయును. శత్రువును ముందుమిత్రునింబోలె మంచితిన్ననిమాటలచే బుజ్జగింపవలయును.మఱి వానివలన నింటియందున్నసర్పమువలనంబోలె భయముగలిగియుండవలయును. ఎవనిబుద్ధి నీబుద్ధికిఁ గీడ్పడినదో వానిని జరిగిన సందర్భములను జూపియు, బుద్ధిపసలేనివానిని రాఁగల సందర్భములను నమ్మఁజెప్పియు, మేలయిన బుద్ధిగలవానిని నప్పటికిఁదగిన సమాధానములఁ బన్నియు సమాధానపఱుపవలయును. ఐశ్వర్యమును గోరునట్టివాఁడు, వలయునట్లు చేమోడ్పును,ప్రతిజ్ఞను, మంచి చల్లనిమాటలను, తలవంచి యభివాదనము సేయుటను, కన్నీ రొలికించుటను గావింపవలయును. కార్యము సమకూడువఱకును నొకఁడు తనశత్రువును మూఁపుమీఁద మోచియుండవలయును. కాలమువచ్చినపు డాశత్రువును రాతిమీఁదఁ గుండను వైచి పగుల్చునట్లు దుత్తుమురు గావింపవలయును. రాజేంద్రా! రాజు ముహూర్తముసేపయినను దుమ్మికి కొఱివివలె ధగధగజ్వలించుట లెస్స;కాని,చిరకాలము నుముక నిప్పువలె జ్వలింపక పొగయుచు మాత్రముండుట తగదు.తాను గృతఘ్నుఁడగు

వానికిఁ బెక్కులు ప్రయోజనములు గావింపవలసియున్నను, అట్టి వానితో నట్టిప్రయోజనమొడఁగూర్చునట్టిసంబంధమును గూడఁ బెట్టుకొనరాదు. ఏలనఁగా (అట్టివాని) ప్రయోజన మీడేర్చినచో, సుఖ మనుభవింప శక్యమగును. అది యొనఁగూర్పనిచో నవమానమే కలుగును. కాఁబట్టి యట్టివాని కార్యములు చేయవలసినప్పుడా కార్యములనెల్లఁ గొంచెము గడమగలిగి యుండునట్లు గానే చేయింపవలయును గాని బూర్ణముగాఁ జేసి తీర్పరాదు. రాజు * కోకిల, పంది, మేరుపర్వతము, పాడిల్లు, † పాము, భక్తుఁడగు నెయ్యుఁడు ననువీరలవలెఁదన కేదిశ్రేయమో చేసికొనవలయును. మఱియు నిత్యమును బెందలకడ లేచి యెచ్చరికతప్పక శత్రువు నింటికిఁబోయి యతనిని కుశలముగా నుండినను కుశలమాయని యడుగుచుండ వలయును. సోమరిపోతులు ధనమును బడయఁ

---

* కోకిల తాను బోషింపవలసిన వానిని మఱియొకదాని చేతఁ బోషింపించునట్లు రాజు తనకృషి, వర్తకము, మార్గము, అడవులు మొదలయినచోట్లను గల తనధనములను నితరులచే గాని పోషింపఁ వలయును. (లేక మిత్రులను గాని ప్రజలనుగాని యితరులనుగాని పోషింపవలయును.) పంది భోజ్య వస్తువులను మూలముతో పెల్లగించునట్లు రాజును శత్రువులను మూలముతోఁ బెకల్పవలయును. మేరువువలె రాజు చలింపకయు నుల్లంఘింప రాకయు నుండవలెను. శూన్యగృహమునకు సంపదలు రావలయునని కోరునట్లు రాజును ధనములను గోరుచుండవలయును. సర్పమువలె రాజు వైరమునశింపక యుంచుకొని యుండవలెను. భక్తిగల మిత్రునింబోలెఁ దన్ను సంబంధించిన వారల క్షేమములకై పాటుపడుచుండ వలయును.

† 'పాము' మాఱు 'నటుఁ'డని ఉత్తరప్రతులు. (నటుఁడనుపాఠమున నటునివలె నానారూపములు సందర్భానుగుణముగఁ బూనుచుండవలయును)

జాలరు ; మగతనము లేని పందలును, మిక్కిలి విడంబముగల వారును బడయఁజాలరు. లోకుల యాడికకు భయపడువారును విడిచి విడిచిపనిఁబూనువారును(దీర్ఘసూత్రులును)ధనమును బడయ నేరరు. రాజు తన ఛిద్రములను బరులు తెలిసికొనకుండఁ జేయవలయును గాని, పరుల ఛిద్రములను దాను గనుఁగొనుచుండవలయును. మఱియుఁ దాఁబేలివలెఁ దన మంత్రాంగములను బదిలముగాఁ దాఁచుకొనవలయును. తనయందలి రంధ్రముల నెప్పుడునుగాచికొనవలయును.*కొంగవలె(నొకచేధ్యానముగాఁ) గార్యములను జరిపింపవలయును. సింహమువలె (భయములేక) పరాక్రమము ప్రకటింపవలయును. దోఁడేలివలెఁ బొంచు వేసియుండి బాణమువలెఁ జక్కఁబోయిపడి తునియలు గావింపవలయును. పానము, జూదము, స్త్రీలు, వేఁట, సంగీతము ననువీనిని దగుకొలఁది ననుభవింపవలయును. వీనియందు మిక్కిలియుఁ దగులువలన దోషముగలుగును. పుల్లును విల్లు జేసికొనవలయును; జింకవలెఁ బరుండి యుండవలయును. గ్రుడ్డివలె నుండవలసినపుడు గ్రుడ్డిగా నుండవలయును, చెవిటివానివలె నుండవలసినపుడు చెవిటిగా నుండవలయును.సమర్థుఁడగువాఁడు దేశకాలములను బాటించి పరాక్రమము మెఱయవలయును. దేశకాలములను మీఱి మెఱయించినట్టి పరాక్రమము నిష్ఫలమగునే కదా ? కాలాకాలములను, బిదపఁ దనబలాబలములను జక్కఁగా నిశ్చయించుకొనియు శత్రువు బలమును దెలిసికొనియు నందులకుఁ దగునట్లు తన్ను పయోగించుకొనవలయును. ఏరాజు దండము

---

* కొంగ కొలను జలములందుఁ బెద్దయుఁ బ్రొద్దు చేఁపలకై మిన్నక వేచియుండుట దెలియునది.

చేత లోపఱచుకొనంబడిన శత్రువును బూర్ణముగా నడఁగఁ ద్రొక్కఁడో యతఁ డశ్వతరిగర్భముంబోలె మృత్యువును దన యందు దాఁచిపెట్టుకొన్న వాఁడగును. రాజు పూవులు లెస్సగా పూయవలయునుగాని పండ్లుపండరాదు; పండ్లు పండిననుఁ బయికి నెక్కుట కలవి గాకుండవలయును; పక్వము గాకుండినను బక్వ మయిన ట్లుండవలయును. రా జిట్లు నడచుకొను నేని యేశత్రువు నకుఁ జిక్కి కీడ్పడఁడు. రాజు తన్నుఁగోరువారి కాశలు * బల పఱుపవలయును గాని, వాని నొడఁగూర్చుటకు నడుమ విఘ్న ములు పెట్టవలయును.అతఁ డావిఘ్నముల కేవ్రొ నిమిత్తములను జెప్పవలయును. ఆనిమిత్తములకును దగిన హేతువుల నిరూపింప వలయును. భయమునకుఁ గారణము రాకుండు నంతవఱకును రాజు భయపడినవానివలె వలయు నేర్పాటులన్నియుఁ జేసికొన వలయును. భయకారణము నిక్కముగా వచ్చునపు డతఁడు నిర్భ యముగా పైఁబడి కొట్టవలయును. సాహసము నూఁదక శుభ ములు మనుష్యునకుఁ గలుగవు. మఱియు సంశయముల నడుమఁ జొచ్చియుఁ దనప్రాణముల నిలఁబెట్టుకొను నేని శుభములను బొందును. రాజు రానున్న భయములను ముందుగాఁ దెలిసికొన వలయును. అవి వచ్చియున్నపుడు వానిని దొలఁగఁ బుచ్చవల యును. అవి మరలఁ బెరుఁగునోయని శంకించి వానిని నడంచిన పిదప నయితము వాని నడంపకుండునట్లు భావింపవలయును. అప్పటికి సమకూడియున్న సుఖమును దిగవిడుచుటయు, నిఁక

---

* 'ఆశాంబలవతీం కుర్యాత్' అని ఉత్తరకోశములపాఠము. 'ఆశాం కాల వతీం కుర్యాత్' అని దా. మూలము. కాలమునకుఁ దగిన ట్లాశ గొలుపవలయు నని యర్థము.

రాఁగల సుఖమున కువ్విళ్లూరుటయు బుద్ధిమంతులగువారికి నీతి గాదు. ఏ రాజు శత్రువుతో సంధిచేసికొన్న పిదప వాఁడేమియుఁ జేయఁడని నెఱనమ్మకముతో హాయిగా నిదురించునో వాఁడు చెట్టుకొనపై నిదురించి క్రిందఁబడిన వెనుక లేచునట్టివానికి సాటి యగును. తాను దీనత్వము నొందినపుడు మృదువైనదో, క్రూరమో, యే దేనిరొకకర్మముచేతఁ ద న్నుద్ధరించుకొనవలయును. అట్లు ద్ధరించుకొని, సమర్థుఁడయినపుడు, ధర్మమును జేయవలయును. రాజు తనశత్రువులకు శత్రువులగువారి నందఱను గౌరవించి యనువర్తింపవలయును. అతఁడు (తనచారులనే శత్రువు లేర్పఱచుకొన్న మనుష్యులుగాఁ దెలియవలయును) తనచారునిని బరులకుఁ దెలియకుండునట్లు చేయుటయే కాక తనచారులను బరులచారులను జక్కఁగా గుఱుతెఱింగికొనవలయును. పాషండులు తాపసులు మొదలగువారిని జారులను గావించుకొని పర రాష్ట్రములకుఁ బంపవలయును. ధర్మమును జెఱుపువారును బాపులును లోక కంటకులును నగు దొంగలు తోఁటలయందును, విహారస్థలములందును, జలి పందిళ్లయందును, చావడుల యందును, పానశాలలందును, జనులు గూడుచోటులందును, దీర్థములందును, సభలందును వత్తురు. వారలనుగని పెట్టి యుడఁచి పుచ్చవలయును; దొంగతనము లేకుండునట్లును గావింపవల యును. విశ్వసింపఁ దగనివానిని విశ్వసింపరాదు. విశ్వసించిన వానిని మిక్కిలిగా విశ్వసింపరాదు. విశ్వాసమువలన భయము గలుగుచున్నది. పరీక్షింపకయు విశ్వసింపరాదు. శత్రువునకు నిజముగాఁ జూపట్టి హేతువులచేత నమ్మించి వాఁడు తనపట్టు నుండి యించుక చలించిన తెఱపిని పైఁబడి కొట్టవలయును.

శంకింపఁ దగనివానియందును శంక గలిగి యుండవలయును. శంకిం పఁదగువారినో యెప్పుడును శంకించు చుండవలయును. ఎవని యందు శంక లేకుండునో యట్టివాని వలననుండి కలుగుభయము వేరుతోడఁ ద్రెంచివైచును. ఎచ్చరిక చేతను, మౌనము చేతను, కాషాయములచేతను, జటా వల్కలములు ధరించుటచేతను, శత్రువును నమ్మించి సమయము వచ్చినపుడు తోఁడేలివలెఁ బైపడవలయును. పుత్త్రుఁడో, తోఁబుట్టువో, తండ్రియో, స్నేహితుఁడో, యెవరుగానుండినను నర్థమునకు విఘ్నము చేయు చున్నట్టివారిని సంపద గోరునట్టివాఁడు చంపి తీఱవలయును. మిక్కిలియు గర్వమునఁ గన్నుఁగానకయు, కార్యాకార్యములను దెలియకయు దుర్మార్గమున వర్తించుచుండు వాఁడు గురువయి నను వానిని దండించుట యావశ్యకము. వాఁడి ముక్కుగల పిట్టలు తాము వ్రాలెడి చెట్లయందలి పూవులను బండ్లనును గొఱికివైచునట్లు రాజు లేచి యెదుర్కొని యభివాదనములు చేసియు నేదేని కొంచెమిచ్చియు మిక్కిలియుఁ బూజించి తుదకు శత్రువు సర్వస్వమును బుచ్చుకొనవలయును. పరుల మర్మావయవ ములను భేదింపకయు, దారుణమయిన కార్యములు చేయకయు, జాలరివానివలెఁ బట్టిచంపకయు, గొప్పయైశ్వర్యమును బొందుట శక్యముగాదు. పుట్టుకచేతనే శత్రువైనదియు లేదు; మిత్త్రమైనది యు లేదు. ఉభయులకు సమమయినయొక ప్రయోజనము పొసఁ గుటంబట్టి మిత్త్రులును శత్రులును గలిగెదరు. శత్రు వగువాఁడు దీనముగా నెంతపలవించినను వానిని విడిచిపెట్టరాదు. వానియెడల జాలిపడరాదు. పూర్వమపకారము చేసినవానిని జంపవలయును. సంపదనుగోరునట్టిరాజు తనకు వలయునన్నిమనుష్యులను జేరఁ

దీసికొనుటయేకాక వారికి మంచి సేయుచుండవలయును. మఱి ప్రజలయెడ నడచుకొనునపు డసూయపడకుండవలయును. దుష్టులను బ్రయత్నపడి యడంచుచుండవలయును. కొట్టఁబోవునపుడు నింపుగనే పలుకవలయును. కొట్టిన పిదపను మిక్కిలి యింపే పలుకవలయును. కత్తిచేతఁ దలనఱికినపిదప నందులకై దుఃఖంపను నేడువను వలయును. సంపదను గోరునట్టి రా జితరులను మంచి మాటలచేతను, సమ్మానములచేతను, దానములచేతను రాఁబట్టుకొనవలయును. ఇట్లతఁడు మనుష్యులను దనసేవకుఁ దెచ్చుకొనవలయును. రాజు వ్యర్థములయిన వైరములు పెట్టుకొనరాదు. ఏటిని దన రెండుచేతులనే కొనియీఁదరాదు. పశువుల కొమ్ములను దినుట పనికిమాలినది. మఱి దానివలనఁ బుష్టియుఁగలుగదు. పండ్లువిఱిగిపోవుటయేకాక దానివలన రసమును బుట్టదు. ధర్మార్థకామములకు మూఁడువిధములయిన పీడలును మూఁడనుబంధములును గలవు. అనుబంధములను జక్కఁగాఁ దెలిసికొన్నచోఁ బీడలను బరిహరించు కొనవచ్చును. ఋణశేషమును, అగ్నిశేషమును, శత్రుశేషమును నట్లె నిలిపియుంచిన యెడల మాటిమాటికిఁ బెరుఁగుచుండును. కాఁబట్టి వీనినెల్ల నిశ్శేషము గావింపవలయును.ఋణ మెప్పుడును బెరుఁగుచుండును గాన,దానిని నిశ్శేషముగావించిన నేతప్ప నది నశింపకయె యుండును.ఇట్లే యవమానింపఁబడిన శత్రువులును, నుపేక్షింపఁ బడిన వ్యాధులును గడిందికీడును గలిగించును. ఒక్కొక్క కార్యమును జక్కఁగాఁ జేసి తీర్పవలయును. ఎప్పుడును బరాకుపడకుండవలయును. ముల్లంతటిదికూడఁ జక్కఁగాఁ బెఱికి వైవని యెడలఁ జిరకాలము బుడిపి గట్టియుండును. మనుష్యులను

జంపుటవలనను మార్గములను జెఱుపుటవలనను గృహములను నాశముసేయుటవలనను బరరాష్ట్రమును బాధచేయవలయును. రాజు గ్రద్దవలె (దూర) దృష్టియుఁ, గొంగవలె నిశ్చలత్వమును, గుక్కవలె జాగరూకతయు, సింహమువలెఁ బరాక్రమమును, గాకివలెఁ జంకుఁగొంకును గలిగి శత్రురాష్ట్రములను బామువలె నులువుగఁ జొరవలయును. రాజు శూరుని నంజలిచేసియు, బిఱికివానిని భయపెట్టియు, లోభిని ధనమిచ్చియు, సమానుని యుద్ధముచేసియు వశపఱుచుకొన వలయును. శ్రేణీముఖ్యులయందు భేదమును, ననుంగులయినవారిని లాలనమును గావించుటయందుఁ గన్నుగలిగి యుండవలయును. అమాత్యులను భేదపడకుండునట్లును, ఒక్కటిగాఁ గూడికొనకుండునట్లును గాచుచురావలయును. రాజు మెత్తనివాఁడయినచో జనులవమానింతురు; వేండ్రమయినచో భయపడుదురు. రాజు వేండ్రముగ నుండఁదగినకాలమున వేండ్రముగను, మృదువై యుండవలసిన కాలమున మృదువుగను నుండవలయును. మృదువైనదానిచేతనే మృదువగువానిని జంపుదురు. మృదువుచేతనే దారుణమయిన దానిని జంపుదురు. మృదువున కసాధ్యమయినదిలేదు. కాఁబట్టి మృదువు వేండ్రమునకంటె వాఁడియందురు. ఏరాజు మృదువుగానుండవలసినపుడు మృదువుగను, దారుణముగా నుండవలయునపుడు దారుణముగను నుండునో యతఁడు కార్యములను సాధించుటయేకాక శత్రువునుగూడ నడంచివుచ్చును. పండితుఁడగువాని విరోధము పెట్టుకొన్నపిదప వానికి దూరముగా నున్నారమని నమ్మియుండరాదు. బుద్ధిమంతుని బాహువులు చేతులు మిక్కిలియు నిడుదలయినవి. కాన దన్ను హింసించినవారిని వానిని

గాని హింసించును. దేనిదరిని దాఁటఁ దరముగాదో దానిని దాఁటరాదు. దేనిని శత్రువు మరల నపహరింపఁజాలునో దానిని హరింపరాదు. దేనివేరును బెల్లగింపఁ దరముగాదో యట్టిదానిని ద్రవ్వరాదు. ఎవనితల గూల్ప నలవిగాదో వానిని గొట్టరాదు. అయినను రాజెప్పుడును నిట్లు నడచుకొనరాదు. నే నిప్పుడు విధించిన ప్రకారమును నాపదలయందు మాత్రమే యనువర్తింపవలయును. నీహితమును గోరుటంబట్టి నీవు శత్రువులు దలపడినప్పు డెట్లు నడచుకొనవలయునో నీకుఁజెప్పితిని' అనెను.

భీష్ముఁడు - హితార్థియై యాబ్రాహ్మణుఁడు చెప్పినదెల్ల విని సౌవీరదేశపు రాజు మిక్కిలియు సొంపుగల మనసుతో నతఁడు చెప్పినట్లెల్లఁగావించి తాను బంధుసహితముగాఁ బ్రకాశించుచున్నయైశ్వర్యము ననుభవించినవాఁ డయ్యెను. ఇది నూటనలువదియవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

(భీష్ముఁ డాపత్కాలమందు నభక్ష్యమును భక్షించియైనను నాత్మరక్షణముచేసికొనవలయునని నిరూపించుటకై విశ్వామిత్రసంవాదమును జెప్పుట.)

ధర్మరాజు - 'పరమం బయినధర్మము లోకు లందఱచేతను నుల్లంఘింపఁబడి కొఱవడినపుడును, అధర్మము ధర్మమయినపుడును, ధర్మ మధర్మ మయినపుడును, మర్యాదలు మిక్కిలియు భిన్నములయినపుడును, లోకమందు ధర్మసిద్ధాంతములు గజిబిజినొందినను, బ్రజలు రాజులచేతను దొంగలచేతను బీడితులయినపుడును,

అన్నియాశ్రమములవారును స్వకర్మముల తెలివి మాలినపుడును, అధర్మ కర్మములు చేడినపుడును, మనుష్యులు నలుగడలఁ గామమువలనను లోభమువలనను మోహమువలనను భయమును గాంతురేనియు, సమస్తజనులు నొండొరుల నెప్పుడును నమ్మక యొకరినొకరు కపటోపాయములచేతఁ జంపుకొనినపుడును, ఒకరినొకరు మోసపుచ్చుకొనినపుడును, దేశమునందెల్ల నిండ్లు తగులఁబెట్టఁబడినపుడును, బ్రాహ్మణులు మిక్కిలియుఁ బీడితులయినపుడును, మేఘములు వానకురియకుండునపుడును, జనులకుఁ బరస్పరము భేదముకలిగినపుడును, భూమియందుఁగల బ్రతుకుఁదెరువులన్నియును దొంగలపాలయినపుడును, నిట్లు మిక్కిలియు నీచమయిన కాలము దాపరించినపుడు పుత్రపౌత్రులను జాలిచేత దిగవిడువ నేరకున్న బ్రాహ్మణుఁడు దేనిచేత బ్రతుకవలయును? భారతా! బ్రాహ్మణుఁడట్టి యాపదయందు నెట్లు నడచుకొనవలయును? అట్లు లోకమంతయుఁ గలుషముకాఁగా రాజు సైతమెట్లు నడచుకొన్న నతఁడర్థమునుండియు ధర్మమునుండియుఁ గొఱవడక యుండును?' అని యడిగెను.

భీష్ముఁడు- 'మహాబాహూ! ప్రజల యోగక్షేమములకును, మంచివరములకును, వ్యాధి రోగము మొదలయిన భయములకును మూలము రాజు సుమీ. భరతసత్తమా! కృతము త్రేత ద్వాపరము కలి యనువీనికిని మూలము రాజే యని నామతము. ఇందులకు సందియము లేదు. ప్రజలకుఁ గీడును గలిగించునట్టి యాకాలము వచ్చునేని యపుడు తెలివి బలిమి నూఁది బ్రతుకవలయును. ఈవిషయమందొక మాలపల్లెయందు విశ్వామిత్రునకును మాలవానికిని జరిగిన సంవాద మయినయీపురాతనేతి

హాసము నుదాహరించెదరు. తొల్లి త్రేతాద్వాపరయుగముల సంధియందు దైవవ్యత్యాసమువలన లోకమందుఁ బండ్రెండు సంవత్సరములు భయంకరమయిన యనావృష్టి కలిగెను. త్రేతాయుగము ముగిసి ద్వాపరయుగ మారంభించిన సమయమందు, త్రేతాయుగమందు మిక్కిలియు వృద్ధిఁజెంది యుండిన ప్రజలకు నింద్రుఁడు వానకురియఁడయ్యె. బృహస్పతి వక్రగతిఁ బోయెను. చంద్రుఁడు వేఱువిధముగాఁ దిరిగిన మండలముతో దక్షిణమార్గముగఁ జనెను. రాత్రిముగియఁగా నాకాశమందు నొక్కసలుపును లేదయ్యె. మేఘసమూహము లెక్కడనుండును? ఏరులయందు నీరు మిక్కిలియుఁ దగ్గి యడుగునఁ గొంచెము పాఱుచుండెను. కొలఁకులును నదులును బావులును సెలయేళ్లును, దైవవ్యతిక్రమమువలన శోభ నశించి కంటికిఁ జూపట్టుటయు లేకపోయెను. భూమియందుఁ గొలంకు లెండిపోయెను. సభలును జలిపందిరులును దూలినవి. యాగములును వేదాధ్యయనములును నశించినవి. వషట్కారము గలుగదయ్యె. కృషియు, గోరక్షణమును నశించెను. అంగడులను గ్రయవిక్రయములు నడుగంటెను. పూర్వాచారములెల్ల మానెను. పెద్దయుత్సవములు నశించెను. అంతటఁ బెద్దయెమ్ములును జిన్నయెమ్ములు నెరసియుండెను, మఱియు జనుల హాహాకారములు భయము గొలుపుచుండెను. పట్టనములు విశేషముగాఁ బాడుపడియు గ్రామములును గృహములును గాలియు నుండెను. అప్పుడు భూమియందు జనులుఁ గొన్నియెడల దొంగలకుభయపడి విడిచిపోయిరి. కొన్నియెడల నొకరికొకరు భయపడి పలాయితులయిరి. కాన భూమి బహుళతరముగా శూన్యమై యుండెను. దేవాలయములు

నశించెను. ముదుసళ్లును బాలురును గానంబడరైరి. గోవులును మేకలును గొఱియలును నెనుములును లేకుండెను. ప్రాణు లొకటినొకటి గొట్టుకొనుచుండెను. బ్రాహ్మణులు చంపఁబడుచుండిరి. రక్షకులయిన జనులును హతులయిరి. ఉత్సవములును జన సంఘములును నశించియుండెను. మనుష్యసమూహము చాల వఱకు శవప్రాయములయ్యెను. యుధిష్ఠిరా! ధర్మము నశించి భయంకరమై యున్నయక్కాలమందు మనుష్యలోకటికి రేఁగి యొకరినొకరు పట్టి తినఁ దొడంగిరి. ఋషులు నియమములను నగ్నిహోత్రములనును దేవతలనును ఆశ్రమములనును దిగ విడిచి యిటునటు పలువగలఁ బాఱిపోయిరి. అంతఁ బూజ్యుండును బుద్ధిమంతుఁడునయిన విశ్వామిత్రమహర్షి యాఁకలి పయికొనఁగా నెచ్చోటును గానక నలుదిక్కులఁ బరుగిడఁ దొడంగెను. ఆవిశ్వామిత్రుఁ డగ్నిహోత్రమునువిడిచి యింటిని మాని పుత్త్రులను భార్యను నొకజనసమూహమందు విడిచి భక్ష్యాభక్ష్యములను సమముగాఁగొని సంచరించుచుండెను. అపు డొకసమయమున నొకయరణ్యమందుఁ గ్రూరులును బ్రాణఘాతుకులు నగు మాలవారుండుపట్టును గాంచెను. అందుఁ గుండలు చెల్లా చెదరై కుక్కమాంసముల నలంకృతమయి యుండెను. మఱియుఁ బందులయు గాడిదలయు విఱిగినయెముకలును దలవెంకలును గుండలును నిండియుండెను. మఱియు నాపల్లెయందుఁ బీనుఁగుల వస్త్రములు వైవంబడియుండెను. పీనుఁగులపయి వైచిన పూదండ లాభరణములుగా నుండెను. అందు గుడిసెల మోసల లందుఁ బాఁపకుబుసముల మాలికలు గుఱుతులుగా నుంపఁబడియుండెను. అందుఁ గోళ్లచప్పుళ్లును గాడిదల యోండ్రలును

భోరుకొను చుండెను. జను లొకరితో నొకరు పరుసనిమాటల తో రచ్చలాడుచు నుండిరి. అందు గూబలయెలుంగులును క్షుద్ర దేవతల స్థానములును జుట్టును గలిగియుండెను. ఇనుపగంట లలంకారముగాఁ గట్టంబడియుండెను. కుక్కతండములు చుట్టును బలసియుండెను. విశ్వామిత్రుఁ డట్టిమాలపల్లెయందుఁ జొచ్చి యాఁకటి యురవడిచేత నాహారమును వెదుకఁ దలంపుగొని మిక్కిలియుఁ బ్రయత్నమును గావించెను. ఆతఁ డాపల్లెయందు బిచ్చమెత్తుటకుఁ బోయినను నందు మాంసముగాని యన్నము గాని ఫలమూలములుగాని మఱియెద్దిగాని యొక్కచోటను బడయఁజాలకపోయెను. విశ్వామిత్రుఁడు 'కట్టా! నాకేమికష్టము దాపరించినది' యని నిశ్చయించుకొని సత్తువతగ్గుటచేత నా మాలపల్లెయందుఁ గ్రిందఁబడెను. రాజసత్తమా! ఆముని 'మన కేదిమంచిది? ఎట్లు వ్యర్థముగాఁ జావకుండవచ్చును?' అని చింతించెను. రాజా! ఆముని యంత మాలవానియింట వాఁ డాయుధముచేతఁ జంపిన కుక్కమాంసము గ్రుచ్చియున్న యొక్కకఱ్ఱ పడియుండఁగాఁ జూచెను. అతఁడు 'ఇప్పు డుసుఱుగాచుకొనుటకు వే ఉపాయములేదు. ఇపుడు నేను దొంగిలింపవలయును. ఆపత్కాలమం దుత్తములయందును మధ్యములయందును నధములయందును దొంగతనము చేయఁదగినదిగా విధింపఁబడి యున్నది; అట్టి దానిని బ్రాహ్మణుఁ డుసుఱుగాచుకొనుటకుఁ జేయవచ్చుననుట నిశ్చయము. మొదట నధమునివలననుండి మ్రుచ్చిలింపవలయును. పిదప మధ్యములవలననుండి నాక్రమింపవచ్చును. ఈరెండును గలుగకయుండినచో ధర్మాత్ముఁ డగు మేటిపురుషునివలన నుండియు మ్రుచ్చిలింపవచ్చును. ప్రాణులను జంపఁ దెగించినట్టి చండాలురు



741. విశ్వామిత్రుఁడు చండాలుని గృహమునందు
కుక్కమాంసము నపహరించుట.

వీరు; కాన యిట్టివారి మాంసము నపహరించెదను. ప్రతిగ్రహదోషము తప్ప దొంగతనమం దెక్కుడను దోషము నాకుఁ గానరాకున్నది. కాఁబట్టి యీనంజుఁడును ముచ్చిలించెదను' అని యపుడాలోచించెను. భారతా! ఆవిశ్వామిత్రమహర్షి యిట్టిబుద్ధిని గొని మెచ్చటఁబడెనో యచ్చట లెస్సగా నిదురించెను. ఆపూజ్యుఁ డర్ధరాత్రమగుటను జూచి మాలపల్లెయంతయు నిదురింపఁగా మెల్లగా లేచివచ్చి గుడిసెవాకిటిని దూఱెను. ఆమాలవాఁడు నిదురించుచుండి, కంటియందుఁ బుసిగ్రమ్మియుండ, వికారంబగు నెలుంగుగలిగి, క్రూరుఁడై చూడ నసహ్యపడఁదగువాఁడై చూపట్టుచు, 'మాలపల్లె నిదురించుచుండు నపుడు వాఁ డెవఁడు నాకట్ట నాడించువాఁడు? మేలుకొని యున్నాను, నేను నిదురింపలేదు. క్రూరుని నిన్నిదో చంపెదను' అనెను. అప్పుడు విశ్వామిత్త్రుఁ డాదొంగతనముచేత లజ్జగ్రమ్మిన మొగముతో వేగ భయపడి వడఁకుచు, నాచండాలునిఁ జూచి 'దీర్ఘాయుష్మంతుఁడా! నేను విశ్వామిత్త్రుఁడను; ఆఁకలిగొనివచ్చితిని. బుద్ధిమంతుఁడవుగదే. నీవు చక్కఁగాఁ దెలిసికొంటివేని నన్నుఁ జంపకుము' అనెను. విదితాత్ముం డయినయమ్మహర్షి చెప్పినది వినఁగానే మాలవాఁడు పడుకనుండి సంభ్రమమున నతనిఁ గూర్చిపోయెను. వాఁడు కన్నులనుండి నీరుదొరుఁగ గౌరవముచేత నంజలిగీలించి విశ్వామిత్త్రునితో 'బ్రాహ్మణోత్తమా! రాత్రియందు మీ రేమిచేయఁ దలఁచుచున్నారు'? అని యడిగెను. విశ్వామిత్త్రుఁడు మంచిమాటలాడుచుఁ జండాలునిఁ జూచి 'నన్నాఁకలి పీడించుచున్నది. నాయుసు తెక్కుడనో లోన యడంగి మడంగి యున్నది. నేను గుక్కతోడను నపహరించెదను. ఆఁకలి గల

వాఁడు దుష్కార్యమందుఁ జొచ్చును. ఆహారమున కువ్విళ్లూరు వానికి సిగ్గుగలుగదు. ఈవిషయమై కటికియాఁకలి నన్ను దోష వంతునిఁగాఁ జేయుచున్నది. కాఁబట్టి కుక్కతొడను దొంగలించె దను. నాయుసుఱు నశించుచున్నది. ఆఁకలిచేత నామేలుకతప్పు చున్నది. బలముడిందువడి, తెలివియుంబోయి, భక్ష్యము అభక్ష్య మని భేదముఁగూడక, నే నధర్మమును దెలిసినవాఁడనయ్యుఁ, గు క్కతొడ నపహరించుచున్నాను. మీయింట నేను బిచ్చముఁ బడయనప్పుడు నాకుఁ బాపమందు బుద్ధిగలిగెను. కాఁబట్టి కుక్కతొడను నపహరించెదను. దేవతల ముఖమును, వారికి ముందుఁబోవువాఁడును, బరిశుద్ధముగా నుండుటనుమాత్రము సహించువాఁడును, బ్రభుండు నగు నగ్నిదేవునివలె బ్రాహ్మణుండ నగునేను సర్వమును భక్షింప నర్హుఁడ నగుచున్నాను. నేను ధర్మ ముచొప్పున నుండువాఁడనని తెలియుము' అనెను. ఆచండా లుఁ డావిశ్వామిత్రునిఁజూచి 'మహర్షి ! నామాట వినుము. విన్న పిదప ధర్మమెట్లు కొఱవడకుండునో యట్లుచేయుము. బ్రహ్మర్షి ! నీకుఁగల ధర్మమును వినుము. నే నది మీకుఁ జెప్పుచున్నాను. మృగములయందుఁ గుక్కయధమమని తెలిసినవారు చెప్పె దరు. అందును దానిశరీరమందలి తొడయన్నచో మిక్కిలి నీచ మయిన చోటుగానున్నది. మహర్షీ ! ఇది మంచి పూనికగాదు. ఇది విశేషించి యభక్ష్యమైనది. మఱి చండాలుని సొమ్ము; కనుక దీని నపహరించుట నింద్యమగు కార్యమగును. నీవు ప్రాణము రక్షించుకొనుకొఱకు వేఱు మంచియుపాయమును జూడుము. మహామునీ ! కుక్కమాంసమును గోరుటవలన నీతపమునకు నాశముగలుగును. తెలివిగలవాఁడు మంచిదారిని బోవలయును.

ధర్మమునకు సంకరము చేయరాదు. ధర్మమును నీవు దిగవిడువ రాదు. ఏలనఁగా, నీవు ధర్మవిదులం దుత్తముఁడవై యున్నాఁడవు' అనెను. విశ్వామిత్రుఁ డది విని యాఁకటిచేతఁ బీడితుఁడై మరల వానితో 'నేను చాలఁగాలముగా నాహారము లేకయిటు నటుఁ బరుగులిడుచున్నాను. ప్రాణమును గాచుకొనుటకు నాకు వేఱొకయుపాయము తోఁపకున్నది. మనుజుఁడు తాను జచ్చు నంతటి కాఱియపడుచున్నపుడు ముందువెనుక నాలోచింపక యేకార్యముఁ జేసియైనను దనప్రాణముల నుద్ధరించుకొనవలయును. పిదపఁ దనకు శక్తివచ్చినపుడు ధర్మము నాచరించు కొనవచ్చును. క్షత్రియుఁ డింద్రునిధర్మము లాచరింపవలయును. అగ్నిధర్మము బ్రాహ్మణునికిఁదగును. వేదములగ్ని; అవి నాకు బలము. కాఁబట్టి నాయాఁకటి నుడుపుటకై యీయభక్ష్యమును సయితము భక్షించెదను. ఏయేవిధమునఁ జేసియే జీవింపవలయునో దానినెల్ల నలక్ష్యముసేయక కావింపవలయును. జీవించియుండుట మరణమునకంటె మిక్కిలిమంచిది. జీవించియున్నవాఁడు ధర్మమును బడయును. అట్టి నేను బ్రాణమును గోరి దీని నభక్ష్యమని కూడఁ దెలిసియే భక్షింపఁగోరుచున్నాను. అందులకు నీవు సమ్మతింపవలయును. బ్రతికియుండి ధర్మమును జేసెదను. సూర్యుఁడు మొదలయిన జ్యోతిస్సులు పెనుచీఁకటిని బోఁగొట్టునట్లు, తపముచేతను విద్యచేతను నశుభములను దొలఁగించుకొనెదను' అనెను. చండాలుఁడు 'ఈమాంసమును దిని నీవిపుడు ప్రాణమును బడయుటలేదు. లేక యమృతమును భుజించునట్లు తృప్తిని బడయుటయు లేదు. వేఱు భిక్షగొనుము. కుక్కమాంసమును దినుటయందు మనసు నుంప

కును. కుక్క బ్రాహ్మణుల కెంతమాత్రమును దిన నర్హముగా నిది చుమీ' యనెను. విశ్వామిత్రుఁడు 'చండాలా! ఇది దుర్భిక్ష కాలము. కనుక వేఱుమాంసము దొరకునని నాకుఁ దోఁప కున్నది; నాకు ధనమును లేదు. ఆఁకట నకనకలాడుచు గతి మాలి యాశదూలి నవయుచున్న నాకుఁ గుక్కతొడ యాఱు రసములకంటె మేలయినదిగాఁ దలఁచుచున్నాను' అనెను. చండాలుఁడు 'బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు గోళ్లుగలజంతువులలో నైదుమాత్రమే (అనఁగా ఆళువ, ముండ్లపంది, ఉడుము, కుందేలు, తాఁబేలు ననెడియీయైదుమాత్రమే) భక్ష్యములగును. నీకు శాస్త్రము ప్రమాణమగునేని, యభక్ష్యమందు మనస్సు నుంపకుము' అనెను. విశ్వామిత్రుఁడు 'అగస్త్యుఁ డాఁకలిగొని వాతాపియను నసురను భక్షించెను. నేను నాఁకలిగొని యాపదయందుఁ జిక్కియున్నానుగాన గుక్కతొడను గుడిచెదను' అనెను. చండాలుఁడు 'మఱియొక భిక్ష నడుగుము. నినుఁబోటి కిది సేయుట యెంతమాత్రము దగదు. వాస్తవమున నీ కిట్టిది యెంతమాత్రము చేయఁదగదు. నీ కిష్టముండెనా కుక్కతొడను దీసికొనవచ్చును' అనెను. విశ్వామిత్రుఁడు '(అగస్త్యుఁడు మొదలయిన) శిష్టులే ధర్మమునకుఁ బ్రమాణము. వారి నడక ననువర్తించుచున్నాను. నే నీ కుక్కమాంసమును మేధ్యమైన (పరిశుద్ధమైన) యాహారమునకంటె నిపుడు మేలయిన భక్ష్యముగాఁ దలఁచుచున్నాను' అనెను. చండాలుఁడు 'అసజ్జనులచే నాచరింపఁబడినది సనాతనధర్మము గానేరదు. అకార్య మెన్నఁటికిని గార్యము గానేరదు. నెపమిడి (బేలుపోయి) యకార్యమును జేయకుము' అనెను. విశ్వామిత్రుఁడు 'ఒకఁడు ఋషిగానుండి

(అనఁగా నగస్త్యునివంటివాఁడు) పాతకమును జేయఁజాలఁడు. ఇట్టియెడఁ గుక్కయు జింకయు రెండును (మృగములగుటం బట్టి) సమములనియే తలఁచుచున్నాను. కాఁబట్టి కుక్కతొడను భక్షించెదను' అనెను. చండాలుఁడు, 'ఆయగస్త్యఋషి బ్రాహ్మణులను రక్షింపఁగోరి ప్రార్థితుఁడై యభక్ష్యమగు నాయసుర మాంసమును భుజించెను; కాని యాశపక్షి భుజింపలేదు. అది ధర్మమే. అందుఁబాపములేదు. సమస్తములయిన యుపాయములచేతను మూఁడువర్ణములకును బెద్ద (బ్రాహ్మణు) లగువారు రక్షింపఁబడఁదగినవారుగదా' యనెను. విశ్వామిత్రుఁడు 'నేను బ్రాహ్మణుఁడను. నాయీశరీరము నాకు మిత్రము. ఇది నాకు మిక్కిలి ప్రియమయినది. లోకమందు నాకుఁ బూజ్యతమము నది. ఈదేహమును బోషింపవలయునను కోరికనుబట్టియె కుక్కతొడను దినవలయునను కోరికగలిగినది. నాకున్న తమకమునకు నినుబోఁటి నృశంసులకు నే నెంతమాత్రమును వెఱవను' అనెను. చండాలుఁడు 'మనుష్యులు జీవితమును విడుచుటయుఁ గలదు కాని యభక్ష్యమందు బుద్ధి యెవ్వఁడును జొనుపుట గాఁసరాదు. (ప్రాణములనైన విడువవచ్చునుగాని యభక్ష్యమును దినరాదని తోఁచుచున్నది).ఆఁకటిని నోర్చుటవలన నిహమందుఁ గల కామములనెల్లఁ బొందుదురని తెలియుము. నీవు నాఁకటిని గెలిచి యాకామములను బడయుము'అనెను. విశ్వామిత్రుఁడు 'ఆ కామము(అనశనముచేతమరణము) పిదపటిజన్మమందుఁబొగడ్త గలిగింపఁ జాలినదనుట యుక్తమే.(జీవించియున్నవానికి)నాహారము లేనిచోఁ గర్మములకు నాశముగలుగు ననుటకు సందేహము లేదు. నేనో యెప్పుడును వ్రతముగలిగియు బుద్ధియందడఁకువ

గలిగియు నుండువాఁడను. ధర్మమునకు మూలమగు శరీరమును రక్షింపవలయును. కాఁబట్టి యభక్ష్యమును భక్షించెదను. పరిశుద్ధాత్ముఁడగు వానియందు నిట్టికార్యము ధర్మముగాఁ దలఁపఁబడుననుట స్పష్టము. అశుద్ధాత్ముం డగు వానియందే కుక్కమాంసమునుదినుట పాపముగాఁ గనుపట్టును. నేనిపుడు చేసినది నిశ్చయముగాఁ దప్పిదముగానుండినను (అనఁగా నేను గుక్కమాంసమును దిన్నను) దానినిబట్టి నినువంటివాఁడను నేనుగాను' అనెను. చండాలుఁడు 'ని న్నీపాపమునుండి మరల్పవలయునని నేను మనస్సునందు నిశ్చయించుకొంటిని. బ్రాహ్మణుఁడుగానుండి దుష్కార్యము చేయునేని వాఁడు తనపదవినుండి కీడ్పడును. ఇందులకే ని న్నిట్లు దూఱుచున్నాను?' అనెను. విశ్వామిత్రుఁడు 'కప్పలు బెకబెక లాడుచుండినను నావులు నీరు త్రాగకమానవు. ధర్మమందు నీ కధికారము లేదు. కాఁబట్టి నిన్ను నీవు పొగడికొనవలదు' అనెను. చండాలుఁడు 'నీకు మిత్రమనైతిని; కావుననే నిన్నుగుఱించి శోకించుచున్నాను. బ్రాహ్మణా! నీయందు నాకు జాలిచుమీ. కాన యేది మేలో యది చేయుము. లోభమందు మనస్సునుంపకుము' అనెను. విశ్వామిత్రుఁడు 'నీవు నాకు సుహృదుఁడవై నాసుఖమును గోరుదువేని, న న్నీయాపదనుండి యుద్ధరింపుము. అప్పటికి నే నీకుక్కతొడను దిగవిడుతును గనుక, (నధర్మముచేతఁ గాక) ధర్మముచేత నన్ను రక్షించుకొంటినని తెలియుదును' అనెను. చండాలుఁడు 'నీకు నే నీమాంసము నిచ్చుటకు నెంతమాత్రమొల్లను. మఱి నాయన్నమును నీవు దొంగిలించుకొని పోవుచుండఁగా నూరకుండుటకు నొల్లను. నేను నీ కీమాంసము

నిత్తునేని, బ్రాహ్మణుఁడవు నీవు దీనిని గొందువేని, మనమిరువుర
మును గుక్కమలమున మ్రుంగి నరకమునఁ గూలుదుమే'
యనెను. విశ్వామిత్రుఁడు 'నే నిప్పు డీ పాపకర్మమును జేసితినేని
మిక్కిలియుఁ బవిత్రమయిన నా ప్రాణమును దప్పక గాచుకొం
దును. ఇట్లు ప్రాణమును నిలఁబెట్టుకొని పిదప ధర్మమునే యాచ
రించి నాయాత్మను బరిశుద్ధము చేసికొనెదను. (అన్నము లేక
చత్తునా? అశుద్ధమైన యన్నమును దిని ప్రాణమును రక్షించుకొం
దునా?) ఈ రెంటిలో నేది యెక్కుడో చెప్పుము' అనెను. చండా
లుఁడు 'వానివానికిఁ దగిన ధర్మముల నాచరించు విషయమున
(తగును దగదని తెలియుటకు) వాని యాత్మయే సాక్షియగును.
ఈ రెంటిలో నేది చెడ్డకృత్యమో నీయంత నీవే యెఱుఁగుదువు.
ఎవఁడు కుక్కనంజుడును భక్ష్యముగా నాదరించునో వానికి
నాహారములందు వర్జింపఁదగిన దేదియు నుండదు. వాఁడన్నిటిని
దిను నని నాకుఁ దోఁచుచున్నది' అనెను. విశ్వామిత్రుఁడు
'అభక్ష్యమును బుచ్చుకొనుటయందును భక్షించుటయందును
దోషమున్నది. అయినను బ్రాణమున కపాయము గలుగునపుడు
విధికి నెప్పుడు నపవాదము గలదు. (ఇట్టిదానిని బుచ్చుకొనుట
యందును భుజించుటయందును దోషముగలుగదు.) మఱియు
నభక్ష్యమును భక్షించుటయందు హింసయు వంచనయు లేకయు
నించుక నిందమాత్రము కలిగియు నుండునేని యది యంతగాఁ
బెద్దదిగాదు' అనెను. చండాలుఁడు 'అభక్ష్యమును దినుట కిది
నీకు హేతువగునేని, నీకు వేదమును నార్యధర్మమును బ్రమా
ణము గానేరవు. బ్రాహ్మణోత్తమా! కాఁబట్టి నీవిపుడు చేయు
దానినిబట్టి భక్ష్యమునకును నభక్ష్యమునకును భేదము చూడ

కుండుటయందు దోషములేదని నాకుఁ దోఁచుచున్నది' అనెను. విశ్వామిత్రుఁడు 'ఒకఁడు భక్ష్యమును భక్షించిన మాత్రమున వానికిఁ బాతకము గలుగుట గానరాకున్నది. కలు త్రాగిన యెడఁ గూలుచున్నాఁడనుట (మనుష్యులకుఁ ద్రాగుబోతుతనము లేకుండుటకై చెప్పిన) వట్టిమాటమాత్రమే కాని మఱేమి కాదు. మఱియు నిట్టివగు తక్కువపాపకర్మములను, అవియెవ్విగా నుండి నను వానిసంబంధము గలిగినంతమాత్రమున నొకఁడుచేసిన పుణ్యమును నాశము సేయఁజాలదు' అనెను. చండాలుఁడు 'ఎవఁడు విద్వాంసుఁడై యుండి మాలపల్లియయును చెడ్డచోట నుండి, దొంగతనమనెడి హీనకర్మముచేత, నియ్యనొల్లకున్న తక్కువవానివలననుండి, పేరాసతోడఁ గుక్కను బొందునో, వాఁడు సాధువుల నడవడికి విరుద్ధమయిన దానిని గావించినవాఁ డగును. వాఁడట్టిపని చేయుటచేత మఱియు దండనమును బొంద వలసియు వచ్చును' అనెను.

భీష్ముఁడు 'అప్పు డాచండాలుఁడు విశ్వామిత్రున కిట్లు చెప్పి యంత నూరకుండెను. విశ్వామిత్రుఁడు బుద్ధియందు నిశ్చయించుకొని యే యాఁకుక్కతొడను గయికొనెను. అమ్మహాముని బ్రతుకఁగోరి యాకుక్కమాంసము తునుకను బుచ్చుకొని వనమునకుఁగొనిపోయి భార్యయుం దానును దానిని దినఁగోరెను. అంత నతనికి 'నేను మొదటఁ దగుకాలమున దేవతలకుఁ దృప్తిగావించినపిదప విధిచొప్పునఁ గుక్కతొడను భక్షించెదను' అని తలంపు గలిగెను. అంత నతఁడు వేదోక్తవిధిప్రకార మగ్నినిదెచ్చి యైంద్రాగ్నేయమగు విధిచొప్పునఁ దానే చరువును బచనముచేసెను. పిదప విధ్యుక్తముగా వేలువేల యింద్రాది దేవతలను బిలిచి దైవ

మును బిత్ర్యమునగు కర్మములను గావింపఁదొడంగెను. ఆసమయమందే యింద్రుఁడును విశేషించి వాన గురియించెను; సమస్తప్రాణులను బ్రదికించువాఁడై సమస్తములయిన యోషధులను బుట్టించెను. బ్రాహ్మణశ్రేష్ఠుఁ డతఁ డాకర్మమును ముగించి దేవతలను బితరులను దృప్తిపఱిచి యామాంసమును దాను భుజించెను. ఆ బ్రాహ్మణోత్తముఁడు తపముచేఁ బాపములనెల్ల దగ్ధముగావించి దీర్ఘకాలమునకుఁ బిదప మిక్కిలి యద్భుతమయిన సిద్ధినిబొందెను. ఇట్లు తెలిసినవాఁడు వ్యసనమునం జిక్కినపుడు ప్రాణమును రక్షించుకొనఁ గోరునేని బుద్ధియందు విన్నఁదనము లేక యుపాయములనెఱింగి సమస్తములయిన యుపాయములచేతను దన్నాపదనుండి యుద్ధరించుకొనవలయును. ఇట్టి బుద్ధిగలిగి యెప్పుడును జీవింపవలయును. పురుషుఁడు ప్రాణము నిలఁబెట్టుకొని యున్నయెడలఁ బుణ్యమును శుభమును బడయవచ్చును. కౌంతేయా! కాఁబట్టి బుద్ధిసంపన్నుఁడగు విద్వాంసుఁడు ధర్మాధర్మములను నిశ్చయించు విషయమునఁ దనబుద్ధినే యూఁది యీలోకమందుఁ బ్రవర్తింపవలయును' అనెను. ఇది నూటనలువదియొకండవయధ్యాయము.

www.mohanpublications.com

మోహన్ పబ్లికేషన్స్‌లో లభించు

పుస్తకముల పట్టిక

(Book List)

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్రాది
అనేక విషయాలు తెలుసుకోండి...

ఫేస్‌బుక్ **మోహన్ పబ్లికేషన్స్** పేజ్ లైక్ చేయండి.

Like us to follow :

MOHAN PUBLICATIONS

Rajamahendravaram



0883 - 246 2565
903 246 2565

మోహన్ పబ్లికేషన్స్,

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

1.	శ్రీ వినాయక వ్రతం	వెల రూ.10-00
2.	శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	30-00
3.	శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	10-00
4.	సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	30-00
5.	వరలక్ష్మీ వ్రతం	10-00
6.	కేదారేశ్వర వ్రతం	10-00
7.	త్రినాధ వ్రతం(కలర్)	10-00
8.	త్రినాధవ్రతం(సాదా)	5-00
9.	క్షీరాబ్ధి వ్రతం	12-00
10.	మంగళ గౌరీవ్రతం	10-00
11.	వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	25-00
12.	శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	25-00
13.	కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	25-00
14.	సంతోషీమాతా వ్రతం	25-00
15.	ఏడు శనివారాల వ్రతం	25-00
16.	సత్యనారాయణవ్రతం	25-00
17.	శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	30-00
18.	శివదీక్ష	10-00
19.	కాత్యాయనీ వ్రతం	20-00
20.	సౌభాగ్య గౌరీవ్రతం	20-00
21.	తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	36-00
22.	స్త్రీల వ్రతకథలు	36-00
23.	స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి)	54-00
24.	పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో)	36-00
25.	సర్వదేవతా పూజావిధానం	25-00
26.	ఆరువ్రతాలు	30-00
27.	రాహుకాలంలోదుర్గాదేవీపూజా	10-00

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00
31.	లక్ష్మి - గౌరీ నిత్యపూజ	10-00
32.	శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33.	శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34.	కాలభైరవ నిత్యపూజ	10-00
35.	శివపూజ	10-00
36.	వీరభద్ర పూజ	10-00
37.	ఆంజనేయ నిత్యపూజ	10-00
38.	నాగేంద్ర స్వామి పూజ	10-00
39.	సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40.	రామదేవుని కథ	10-00
41.	శివదేవుని కథ	10-00
42.	లక్ష్మీనరసింహపూజ	10-00
43.	వేంకటేశ్వరపూజ	10-00
44.	బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45.	సూర్య నిత్యపూజ	10-00
46.	నవగ్రహ నిత్యపూజ	10-00
47.	రుక్మిణీ కల్యాణం	25-00
48.	ఉమామహేశ్వర వ్రతం	36-00
49.	శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50.	16 సోమవారముల వ్రతము	25-00
51.	పార్వతీకల్యాణం	25-00
52.	సహస్రకమలవర్తి వ్రతము	25-00
53.	పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54.	అష్టనాగపూజ	36-00
55.	పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56.	ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57.	ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58.	ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59.	ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60.	హనుమద్ వ్రతం	36-00
61.	పంచాయతన పూజ	63-00
62.	28 వ్రతములు	120-00

63.	కలశపూజలు (9ఒకేసారి)	150-00
64.	కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65.	హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66.	గోమాత	40-00

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00

30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00
36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00

65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాధ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00

24.	శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25.	ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26.	షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27.	సాయిసత్యవ్రతం	30-00
28.	సాయి అనుగ్రహమ్	120-00
29.	నవగురువారాల వ్రతకల్పము	15-00
30.	శ్రీదత్తలీలామృతము	99-00
31.	హృదయంలో సాయి	15-00
32.	శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర)	120-00
33.	గజాననమహరాజ్ చరిత్ర	99-00

4. జ్యోతిషాలు

1.	'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72-00
2.	గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	108.00
3.	ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి)	63.00
4.	ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి)	50.00
5.	ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	12.00
6.	కాలచక్రంజ్యోతిషక్యాలండర్	25.00
7.	గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	25.00
8.	శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	25.00
9.	సాదా క్యాలండర్	5.00
10.	పాకెట్ క్యాలండర్	15.00
11.	తాజకనీలకంఠీయమ్	100-00
12.	కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13.	జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14.	మానసాగరి జాతకపద్ధతి	180-00
15.	వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16.	వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17.	సింపుల్ రెమిడీస్	180-00
18.	శంభు హోరప్రకాశిక	250-00
19.	పూర్వ పరాశరి	100-00
20.	పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21.	ప్రశ్న సింధు	99-00
22.	నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23.	సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24.	దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00

25.	ఆయుర్దాయ నిర్ణయం	63-00
26.	జాతక గణిత ప్రవేశిక	63-00
27.	జ్యోతిషమర్మబోధిని	63-00
28.	జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29.	ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30.	జాతక మకరందం	63-00
31.	జ్యోతిష సరస్వతి	63-00
32.	మీజననకాల విశేషాలు	63-00
33.	ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34.	జ్యోతిష స్వయంబోధిని	63-00
35.	శుభముహూర్త శిరోమణి	63-00
36.	నక్షత్ర ఫలమంజరి	36-00
37.	పంచాంగం చూసే విధానం	36-00
38.	సర్వార్థ జ్యోతిషం	36-00
39.	ప్రాథమిక జ్యోతిషం	36-00
40.	నవరత్నములు శుభయోగములు	36-00
41.	శుభశకునాలు	30-00
42.	హస్తరేఖాఫలితాలు	36-00
43.	సంఖ్యల్లో భవిష్యత్	36-00
44.	ముహూర్త దీపిక	99-00
45.	పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46.	కలలు ఫలితాలు	30-00
47.	జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48.	మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49.	జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50.	గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51.	ప్రశ్నచండేశ్వరమ్	63-00
52.	ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53.	జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54.	అంగసాముద్రికం	36-00
55.	హస్త సాముద్రికం	63-00
56.	లాల్ కితాబ్	99-00
57.	శకునశాస్త్రం	63-00
58.	ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59.	పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00

60. అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61. బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62. లగ్నరత్నాకరం	63-00
63. షట్పంచాశిక	120-00
64. 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65. 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66. 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67. 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68. 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69. మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70. కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71. ముహూర్తచింతామణి	99-00
72. సూర్యచంద్ర గ్రహణములు	63-00
73. ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74. అదృష్టరెమెడీస్	144-00
75. గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76. జ్యోతిష రెమిడీస్	300-00
77. జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78. జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79. నాడీజ్యోతిషం	63-00
80. నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
81. లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82. గౌతమసంహిత	63-00
83. హోరరత్నమాల	63-00
84. జాతకఫల మణిమంజరి	200-00
85. పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86. దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87. వింత జోష్యములు	63-00
88. షోడశవర్గులు	200-00
89. రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90. చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91. కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92. బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93. గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94. శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00

95.	శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96.	రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97.	ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98.	ముహూర్తమార్తాండం	63-00
99.	లఘుజాతకం	63-00
100.	జాతకాలంకారము	63-00
101.	మేషలగ్న ఫలితములు	99-00
102.	వృషభ లగ్న ఫలితములు	99-00
103.	మిధున లగ్న ఫలితములు	99-00
104.	కర్కాటక లగ్న ఫలితములు	99-00
105.	సింహలగ్న ఫలితములు	99-00
106.	కన్యలగ్న ఫలితములు	99-00
107.	తుల లగ్న ఫలితములు	99-00
108.	వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109.	ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110.	మకర లగ్న ఫలితములు	99-00
111.	కుంభ లగ్న ఫలితములు	99-00
112.	మీన లగ్న ఫలితములు	99-00
113.	నారద సంహిత	200-00
114.	పంచాంగపీఠికలేఖికాగణితం	250-00
115.	తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116.	సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117.	రాహు కేతువుల యోగము	99-00
118.	ఛాయాగ్రహములు	99-00
119.	జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120.	జ్యోతిష విద్యారంభం	50-00
121	గ్రహభావ బలములు	50-00
122.	కాలచక్రదశ	50-00
123.	అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124.	జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125.	పురోగామి జాతకం	50-00
126.	భావార్థరత్నాకరం	75-00
127.	భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128.	అష్టకవర్గ పద్ధతిః	75-00

129.	జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130.	ప్రశ్నతంత్ర	75-00
131.	ముహూర్తం	75-00
132.	విశిష్ట జాతకములు	125-00
133.	భారతీయఫలితజ్యోతిషం	125-00
134.	300 ముఖ్యమైన యోగములు	125-00
135.	జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి
శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136.	బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137.	బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138.	బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139.	బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140.	భావార్థరత్నాకరము	100-00
141.	ముహూర్త చింతామణి	100-00
142.	ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143.	స్వప్న శాస్త్రము	36-00
144.	శతయోగమంజరి	50-00
145.	వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146.	దైవజ్ఞవల్లభం	75-00
147.	వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం)	250-00
148.	వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149.	వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150.	వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151.	వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152.	అనుభవసులభవాస్తు - 1	50-00
153.	అనుభవసులభవాస్తు - 2	100-00
154.	పంచాంగ వివేకము	99-00
155.	వశిష్ఠ సంహిత	360-00
156.	పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్)	200-00

5. వాస్తులు

1.	40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకోనండి	180-00
2.	వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3.	వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4.	మీరూ మీ వాస్తు	63-00

5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00

6. మంత్రశాస్త్రాలు

1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00

4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00
36.	రుద్రయామళతంత్రం	250-00
37.	లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38.	హిరణ్యశూలినీ తంత్రమ్	250-00

39.	మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40.	శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41.	స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42.	కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43.	శాంతితంత్రమ్	250-00
44.	యంత్రసిద్ధి	360-00
45.	శ్రీ లక్ష్మీతంత్రమ్	360-00
46.	మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360-00
47.	మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360-00
48.	మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49.	ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50.	కామధేనువు తంత్రం	360-00
51.	శూలినీదుర్గాతంత్రం	360-00
52.	శ్రీవిద్య రహస్యం	290-00
53.	కులార్ణవ తంత్రమ్	150-00
54.	ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55.	సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00

7. గ్రంథాలు - ఆరాధనలు

1.	భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2.	భగవద్గీత (వచనం)	99-00
3.	భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2.	గణేశ ఆరాధన 1	99-00
3.	గణేశోపాసన 2	99-00
4.	నవగ్రహవైభవం	99-00
5.	నవగ్రహ రెమెడీస్	99-00
6.	నవగ్రహ వేదం	99-00
7.	శనిగ్రహారాధన	99-00
8.	ఆదిత్యారాధన	99-00
9.	సుబ్రహ్మణ్యారాధన	99-00
10.	శ్రీ శివ ఆరాధన	99-00
11.	లక్ష్మీ ఆరాధన	99-00
12.	హనుమదారాధన	99-00
13.	లలితారాధన	99-00
14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00

16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00

51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00
54.	దేవుళ్ళు డాట్ కామ్	99-00
55.	గణపతిభాష్యం	99-00
56.	యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	99-00
57.	నవయోగులు	99-00
58.	ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	99-00
59.	సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)	99-00
60.	సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)	216-00
61.	సకలదేవతా సహస్రనామములు	99-00
62.	ఆధ్యాత్మిక సూక్తి నిధి	99-00
63.	బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు	99-00
64.	సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు	99-00
65.	శ్రీ లక్ష్మీసన్నిధి	99-00
66.	శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం	99-00
67.	మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	99-00
68.	మ్యాజిక్‌గైడ్	99-00
69.	చదరంగం	99-00
70.	పంచముఖ హనుమత్ వైభవం	63-00
71.	గరుడపురాణం	40-00
72.	మాఘపురాణం	36-00
73.	శివపురాణం	36-00
74.	వైశాఖపురాణం	36-00
75.	కార్తీక పురాణం	36-00
76.	కార్తీక పురాణం (చిన్నది)	25-00
77.	సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	63-00
78.	పెద్దబాలశిక్ష	50-00
79.	గాయత్రీ మహిమ	36-00
80.	వృక్షదేవతలు	63-00
81.	యాజుష స్మార్త సంస్కార చంద్రిక	200-00
82.	సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150-00
83.	చతుర్వేదములు	120-00
84.	నవగ్రహారాధన	120-00
85.	తాళపత్ర సమాహార గోపురం	120-00
86.	మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)	250-00

87. మానవధర్మములు		120-00
88. వేదమంత్ర సంహిత		120-00
89. సహస్రలింగార్చన		120-00
90. శ్రీ శివగీత		120-00
91. ద్వాదశఉపనిషత్తులు		120-00
92. పురాణపండవారి సౌందర్యలహరి	(కేస్‌బైండ్)	250-00
(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93. బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94. బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95. బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00
96. కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు		63-00
97. దక్షిణావృత శంఖములు		63-00
98. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని		36-00
99. ధర్మసింధువు(కేస్‌బైండింగ్)		270-00
100. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని		99-00
101. చిలుకూరి బాలాజీచరిత్ర		36-00
102. భగవత్‌స్తుతి		63-00
103. సూర్యోపాసన		36-00
104. కాశీఖండం		250-00
105. దేవీభాగవతం		360-00
106. శ్రీ ఆంజనేయం		216-00
107. ధర్మసందేహాలు		216-00
108. ఆధ్యాత్మిక దైవిక వస్తువులు		250-00
109. రామాయణం		600-00
110. పోతన భాగవతం		900-00
111. శివమంత్రములు		63-00

8. వైద్య గ్రంథాలు

1. ఆహారం ఆరోగ్యం	36-00
2. మూలికావైద్య చిట్కాలు	36-00
3. ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4. గృహవైద్య రహస్యాలు	36-00
5. గృహవైద్యసారం	36-00
6. హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7. ప్రకృతివైద్యం	36-00
8. ఆహారం-వైద్యం	99-00

9.	సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10.	ఆయుర్వేదమ్	36-00
11.	ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12.	దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13.	ఏకమూలికావైద్యం	99-00
14.	అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15.	రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16.	ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17.	ఒబెసిటి	99-00
18.	హెల్త్‌గైడ్	99-00
19.	ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20.	ఫుడ్‌థెరపి	63-00
21.	న్యాచురల్‌థెరపి	99-00
22.	సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23.	కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24.	యోగామంత్ర	63-00
25.	యోగా మండే టు సండే	63-00
26.	హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27.	హెల్త్‌ఫైల్	108-00
28.	వస్తుగుణపాఠం	250-00
29.	రసాయన వాజీకరణ తంత్రం	150-00
30.	వస్తుగుణ మకరందం	400-00
31.	నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32.	నాటువైద్యం (చిన్నది)	99-00
33.	ప్రాణాయామము-యోగ	63-00

9. అయ్యప్ప - భవానీ రకాలు

1.	శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2.	శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3.	శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4.	శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5.	హారతిగైకొనుమా	40-00
6.	శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7.	శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8.	శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00

9.	శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10.	భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11.	దేవీలీలామృతం	99-00
12.	శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13.	దేవీ భక్తిగీతాలు	20-00
14.	భవానీదీక్ష P	10-00
15.	దేవీ భక్తిమాల F	10-00
16.	శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17.	అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00

10. భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00

11. హిట్స్ సాంగ్స్

1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00

5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శాలీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవేవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00

కాశీరామేశ్వర మజిలీ కథలు		63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)		600-00
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు		595-00
ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు		
విశ్వకర్మ ప్రకాశము		80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	,,	250-00
నారద సంహిత	,,	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము	,,	60-00
మయమతము - వచనము	,,	80-00
బృహత్సంహిత - వచనము	,,	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి		......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)		....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు	,,	....
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,	....
మహాదశా పారిజాతం	,,	....
వాస్తు నారాయణీయం	,,	120-00
యోగావళీఖండం	,,	120-00
ముహూర్తసింధువు		150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)		1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)		370-00
నిర్ణయసింధు (2భాగాలు)		590-00
సాయి...	,,	45-00
శ్రీ దుర్గానందలహరి	,,	200-00
ఆరతిసాయిబాబా	,,	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)		500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర		100-00

సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి
ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00

హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్థంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00
గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00

వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00
శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్థంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహుర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00

అరుదైన పాత పంచాంగములు, వ్రతకథలు,
పురాణములు,ఆరాధన గ్రంథములు,
సుప్రభాతములు,మహాత్మ్యములు, సహస్రనామములు,
పూజావిధానములు, స్తోత్రాలు, ప్రామాణిక గ్రంథములు,
కథలు, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక
గ్రంథములకు

మోహన్ పబ్లికేషన్స్

ఆధ్యాత్మిక గ్రంథనిలయం

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం.

www.mohanpublications.com

From : ☎ : 0883-246 25 65

MOHAN PUBLICATIONS

Fort Gate, Opp : Ajanta Hotel
Rajahmundry-533 101 (a.p.)

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

ఉచిత Pdf బుక్స్ కై : - www.granthanidhi.blogspot.in

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్రాది అనేక విషయాలు
తెలుసుకోండి... ఫేస్‌బుక్
MOHAN PUBLICATIONS
పేజ్ లైక్ చేయండి.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com

Kinige.com
మా ఇ-బుక్స్ కినిగె ద్వారా కొనుగోలు
చేసుకొన వచ్చును.

dailyhunt
మా ఇ-బుక్స్ డైలీహంట్ ద్వారా
అత్యధిక డిస్కౌంట్ ఆఫర్‌లో లభించును.